ॐ

भगवद्गीता

ఇంటింటా గీతాధ్యయనం



VOL - II

ఇంటింటా గీతాధ్యయనం

ద్వితీయ భాగము

ఆంగ్లమూలము

పరమపూజ్య స్వామి దయానంద సరస్వతి

తెలుగు అనువాదము

స్వామి తత్త్వవిదానంద సరస్వతి

Publishers :

AARSHA VIDYA SAGAR

"TRIPTI" Plot No. 1165, Road No. 56,
Jubilee Hills, Hyderabad - 500 033.
ANDHRA PRADESH, INDIA
Tel : 354 8425

ప్రతులు లభించు స్థానము :
ఆర్ష విద్యా సాగర్,
టి.కె.ఎమ్. ఏజన్సీ,
సూర్య థియేటరు ఎదురుగా,
తిలక్ రోడ్డు, హైదరాబాదు.
ఫోను : 4754529, 4758060, 4758096.

ముద్రణ :
కె.యస్. లత
ఫోటో ఆఫ్ సెట్ ప్రింటింగ్ వర్క్స్,
4 - 3 - 51/ 21 - 22,
హనుమాన్ వ్యాయామశాల కాంప్లెక్స్,
సుల్తాన్ బజారు, హైదరాబాదు – 500 195.

ముందు మాట

శ్రీ శంకర భగవత్పాదాచార్యులు శ్రీ మద్భగవద్గీతకు భాష్యమును వ్రాస్తూ, ఉపోద్ఘాతంలో ఇల్లా అంటారు :

అనేకైః వివృతపదపదార్థవాక్యార్థ న్యాయమపి అత్యంత విరుద్ధానేకార్థత్వేన లౌకికైః గృహ్యమాణముపలభ్యాహం వివేకతః అర్థనిర్ధారణార్థం...

"శ్రీమద్భగవద్గీతకు ఎందరో వ్యాఖ్యానాలను వ్రాసినారు. ప్రతిపదాన్ని, వ్యాఖ్యాన్ని వివరించేరు. ఫలితమేమి? ఒకే శ్లోకానికి అనేకములగు అర్థాల్ని చెప్తున్నారు. కొన్ని చోట్ల ఈ అర్థాలు పరస్పర విరుద్ధంగా కూడా ఉన్నాయి. నేనీ పరిస్థితిని చక్కదిద్దే యత్నం చేస్తాను. విషయవస్తువు కలగాపులగం కాకుండా దేనికి దానిని విడదీసి అర్థం చెప్తాను".

విషయవస్తువును, అరటి పండును ఒలిచి చేతిలోకి అందించిన విధంగా, సందేహాలకు తావు లేకుండా, పరస్పర విరుద్ధములగు వాటిని కలిపివేసి సాధకులకు వ్యామోహం కలిగించకుండా, బోధించిన ఆచార్యులు శ్రీ శంకరులు. సంస్కృతభాషలో ఉన్న ఆ ప్రౌఢమైన భాష్యాన్ని ఆంగ్లభాషలో ఆధునిక కాలంలోని జిజ్ఞాసువులకు అర్థమయ్యే విధంగా బోధించి, గీతను ప్రపంచమంతటా ప్రచారం చేసిన అభినవ శంకర భగవత్పాదులు పరమ పూజనీయ బ్రహ్మ విద్యాచార్య జగద్గురు స్వామి దయానంద సరస్వతి.

అందమైన ఆంగ్ల భాషలో ప్రవహించిన ఆ జ్ఞాన గంగను స్వామి దయానంద సరస్వతి గారి శిష్యులు శ్రీ స్వామి తత్త్వ విదానంద సరస్వతి గారు తెలుగు భాషలోనికి తీసుకు వచ్చే భగీరథయత్నాన్ని ఆరంభించి కృతకృత్యులైనారు. ఆ ప్రయత్న ఫలితంగా 'ఇంటింటా గీతాధ్యయనం' అవతరించి, జిజ్ఞాసువులకు చక్కని ప్రయోజనాన్ని చేకూరుస్తున్నది.

1-5-2001

ఆర్ష విద్యాసాగర్

భాగ్యనగర్

మొదటి మూడు అధ్యాయముల సారాంశము

గీతలోని మొదటి అధ్యాయం గురువగు శ్రీకృష్ణుని, శిష్యుడగు అర్జునుని పరిచయం చేస్తుంది. మరియు, అర్జునుడు శ్రీకృష్ణుని ఆత్మజ్ఞానము నుపదేశింపుమని కోరుటకు దారి తీసిన పరిస్థితులను వర్ణిస్తుంది. తత్పూర్వంలో, అర్జునునకు రాజ్యమును తిరిగి స్వాధీనము చేసుకొనుటయందు, దుర్యోధనునకు వ్యతిరేకంగా చేసిన ప్రతిజ్ఞలను చెల్లించుకొనుట యందు మాత్రమే అభిరుచి యుండెను. అర్జునునకు శ్రీకృష్ణుడు చిరకాల పరిచితుడు. కాని, అతడు ఏనాడూ ఆయనను గురువుగా భావించలేదు. ఆతనికి ఈ జ్ఞానమునందు ఇచ్ఛ లేకుండెను.

అర్జునుడు ధర్మబద్ధమైన జీవనమును గడిపెను. ధార్మిక జీవనమును గడిపే వ్యక్తి తప్పనిసరిగా జీవితమును గురించిన మౌలికమైన ప్రశ్నలను అడుగులాడు. అట్టి జీవనమే అర్జునునకు, శ్రీకృష్ణునితో 'ఓ భగవాన్, నాకు హితతమమైన శ్రేయస్సును ఉపదేశింపుము; నేను నీ శిష్యుడను' అని కోరుటకు కావలసిన వివేకమును ప్రసాదించినది.

మొదటి అధ్యాయములో యుద్ధరంగము, అర్జునుని నిరాశా నిస్పృహలు, ఆతడు యుద్ధమును మానుటకు చెప్పిన హేతువులు వర్ణింపబడినవి. ద్వితీయాధ్యాయ ప్రారంభములో, శ్రీకృష్ణుడు అర్జునుని కర్తవ్యమును నిర్వర్తించుమని ప్రోత్సహించెను.

कुतस्त्वा कश्मलमिदं विषमे समुपस्थितम् ।
अनार्य जुष्ट मस्वर्ग्य मकीर्ति करमर्जुन ॥ २ ॥

क्लैब्यं मा स्म गमः पार्थ नैतत्व य्युपपद्यते ।
क्षुद्रं हृदयदौर्बल्यं त्यत्क्वोत्तिष्ठ परंतप ॥ ३ ॥

కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితమ్
అనార్య జుష్ట మస్వర్గ్య మకీర్తికరమర్జున
క్లైబ్యం మా స్మ గమః పార్థ నైతత్త్వయ్యు పపద్యతే
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప

ఓ అర్జునా! ఈ సంకటస్థితిలో, ఋజుస్వభావము గలవారికి తగనట్టియు, స్వర్గమునకు మార్గము కానట్టియు, ప్రతిష్ఠను పెంచని ఈ నిరాశ నీకు ఎక్కడ నుండి సంప్రాప్తమైనది?

ఓ పార్థా! నపుంసకత్వమును పొందకుము. నీకిది తగదు. ఓ అర్జునా! నీచమైన హృదయ బలహీనతను విడిచిపెట్టి, లెమ్ము.

తాను యుద్ధమును మానగోరుటలో గల కారణములను అర్జునుడు విస్తరముగా వివరించి, భిక్షాటనం చేస్తూ జీవించుటయే తనకు అభీష్టమని కూడ చెప్పెను. అనగా, సర్వమును త్యజించి, మోక్షకామియై, సన్యాసి గావాలని అతడు కోరినట్లు స్పష్టమగుచున్నది. మోక్షమును పొందాలంటే, ఒకానొక విశిష్ట జ్ఞానం కావాలని, అట్టి జ్ఞానం కలగాలంటే, తగిన గురువు ఉండాలని అతనికి తెలుసు. శ్రీకృష్ణుని మించిన గురువు ఉండజాలడని యెరింగిన అర్జునుడు తనను శ్రీకృష్ణునికి శిష్యునిగా ప్రకటించుకొని, జ్ఞానమును ఉపదేశింపుమని గోరెను.

అర్జునుని ప్రార్థనకు, శ్రీకృష్ణుడు, 'మాటలను కట్టిపెట్టి, యుద్ధమును చేయుము!' అనే ప్రత్యుత్తరమును ఈయలేదు. ఆయన అట్లు చెప్పి, అర్జునుడు అట్లే చేసినచో, మహాభారతములో గీత ఉండెడిది కాదు. అట్లు కాలేదు. శ్రీకృష్ణుడు అర్జునునకు ఉపదేశించే ఇట్టి అవకాశము కొరకు ఎదురుచూస్తున్నాడా అనిపిస్తుంది. అట్లు గానిచో, 'నీవు శోకింపదగని వారిని గూర్చి శోకిస్తున్నావు; కాని, వివేకవంతులు పలుకవలసిన మాటలను పలుకుచున్నావు (అశోచ్యాన్ అన్వశోచః, ప్రజ్ఞావాదాన్ చ భాషసే, 2.11)' అని శ్రీకృష్ణుడు ప్రారంభించి యుండెడి వాడు గాదు. 'అసత్తునకు భావము లేదు; సత్తునకు అభావము లేదు (నా సతో విద్యతే భావః, నా భావో విద్యతే సతః, 2.16)' అని కొనసాగించియుండెడి వాడు గాదు.

శ్రీకృష్ణుడు ద్వితీయాధ్యాయములో జ్ఞానమును, కర్మయోగమును ఉపదేశించెను. రాగద్వేషముల పట్టు సడలే విధంగా మానవుడు తన జీవితమును గడుపదగిన విధానమును శ్రీకృష్ణుడు ఈ అధ్యాయములో బోధించెను. ఈ తీరున, శ్రీకృష్ణుడు తాను ఉపదేశింపదగిన శాస్త్రము నంతనూ ద్వితీయాధ్యాయములోనే ఉపదేశించెను. అధ్యాయము యొక్క అంతిమ భాగమునందు అర్జునుడు జ్ఞాననిష్ఠుడగు వ్యక్తిని వర్ణింపుమని శ్రీకృష్ణుని గోరెను.

स्थितप्रज्ञस्य का भाषा समाधिस्थस्य केशव।
स्थितधीःकिं प्रभाषेत किमासीत व्रजेत किम्॥

స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ
స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత ప్రజేత కిమ్ (2.54)

ఓ శ్రీకృష్ణా! స్థిరమైన మనస్సు గల జ్ఞాని యొక్క స్వరూప మెట్లుండును? అవి చాల్యమగు మనస్సు గల యిట్టి జ్ఞాని ఎట్లు పలుకును? ఎట్లు కూర్చుండును? ఎట్లు నడుమను?

స్థితప్రజ్ఞుడు ఎట్లు నడుమను? మాటలాడును? కూర్చుండును? అని అర్జునుడు ప్రశ్నించగా, శ్రీకృష్ణ భగవానుడు అర్జునుని ప్రశ్న యొక్క తాత్పర్యమును స్వీకరించి, స్థిత ప్రజ్ఞాని ఈ విధముగా వర్ణించెను.

प्रजाहाति यदा कामान् सर्वान् पार्थ मनोगतान्।
आत्मन्येवात्मना तुष्टः स्थितप्रज्ञस्तदोच्यते॥

दुःखेष्वनु द्विग्नमनाः सुखेषु विगतस्पृहः।
वीतरागभय क्रोधः स्थितधीर्मुनिरुच्यते॥

यः सर्वत्रानभिस्नेहस्तत्तत्प्राप्य शुभाशुभम्।
नाभिनन्दति न द्वेष्टि तस्य प्रज्ञा प्रतिष्ठिता॥

यदा संहरते चायं कूर्मो ऽ ङ्गानीव सर्वशः।
इन्द्रियाणीन्द्रियार्थेभ्यस्तस्य प्रज्ञा प्रतिष्ठिता॥

ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్
ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థిత ప్రజ్ఞ స్త దోచ్యతే

దుఃఖేష్వను ద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః
వీత రాగ భయ క్రోధః స్థిత ధీర్మని రుచ్యతే

యస్సర్వత్రా నభిస్నేహస్తత్తత్ప్రాప్య శుభాశుభమ్
నాభినందతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా

యదా సంహరతే చాయం కూర్మోంగానీవ సర్వశః
ఇంద్రియాణీంద్రియార్థే భ్యస్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా
(2-55, 56, 57, 58,)

ఒక వ్యక్తి ఎప్పుడైతే తన మనస్సులో ఉద్భవించే కామనలనన్నిటినీ త్యజించి, తనయందు మాత్రమే తనతో ఆనందించునో, అప్పుడా వ్యక్తి స్థిత ప్రజ్ఞుడు (స్థిరమైన జ్ఞానము గలవాడు) అని చెప్పబడును.

దుఃఖముల యందు ఉద్వేగమును పొందని మనస్సు కల్గినట్టియు, సుఖములయందు తొలగిన కామనలు కల్గినట్టియు, ఆసక్తి, భయము, క్రోధముల నుండి విముక్తుడైనట్టియు, మననశీలుడగు జ్ఞాని స్థిరమైన జ్ఞానము గలవాడని చెప్పబడును.

ఎవడైతే అన్ని పరిస్థితులలో ఆసక్తి లేనివాడై ఉండునో, శుభము కలిగినపుడు హర్షాతిరేకమును పొందడో, అశుభ పరిస్థితులను ద్వేషించడో, అట్టివాని జ్ఞానము సుస్థిరమైనది.

ఇతడు విషయంవముల నుండి ఇంద్రియంవములను, తాబేలు అవయవములను వలె, పూర్తిగా ఎప్పుడు ఉపసంహరించునో, అపుడాతని జ్ఞానము స్థిరమగును.

మనకు ఇచట ఒక విషయము స్పష్టమగుచున్నది. శ్రీకృష్ణుడు అర్జునుని ప్రశ్న యొక్క తాత్పర్యమును స్వీకరించి, ఆ ప్రశ్నను 'జ్ఞాని ప్రపంచములో నెట్లు వ్యవహరించును?' అను విధముగా మార్చుకొనెను. ఎవని జ్ఞానములో ఎట్టి కొరతయూ లేదో, ఎవని జ్ఞానము స్థిరముగ నుండునో, వాడు స్థితప్రజ్ఞుడని శ్రీకృష్ణుడు వివరించెను. ఇట్టి జ్ఞాని తనలో తాను ఆనందించును. ఆతనికి ఆనందము కొరకై బాహ్య వస్తువుల అపేక్ష లేదు. ఆతడు భయము నెరుగడు. ఆతడు ప్రతికూల పరిస్థితులెదురైనవుడు, వాటిచే ప్రభావితుడు కాకుండా,

ధైర్యముగా నెదుర్కొనును. అహ్లాదకరమగు పరిస్థితులు వచ్చినపుడు, అతడు ప్రహర్షమును, గర్వమును పొందడు.

జ్ఞాని యొక్క జ్ఞానము అతని ప్రవృత్తిలో సహజముగా ప్రకటమగుచుండును. అతని అట్టి ప్రవృత్తి సాధకునకు ఒక సాధనము, అను శాసనము, జీవనమూల్యముగా మార్గదర్శకమగును. జ్ఞాని యొక్క లక్షణముల యందు అర్జునునకు గల అభిరుచికి కారణమిదియే. శ్రీకృష్ణుడీ లక్షణముల నన్నిటినీ అర్జునునకు వివరించి చెప్పెను. ఈ జ్ఞానమును పొందుటలో గల కొన్ని అవరోధములను కూడ శ్రీకృష్ణుడు అర్జునునకు బోధించెను. ఉదాహరణకు, మనమొక వస్తువును ధ్యానించి (విషయ ధ్యానము), దానికి సహజముగా నున్న వస్తు నిష్ఠ లక్షణములకు తోడు, మనము కొన్ని విషయి నిష్ఠ లక్షణములను కూడా జోడిస్తాము.

ఉదాహరణకు, మనము ధనమును కొనుగోలు సామర్థ్యముగా దర్శించినంత కాలం సమస్య లేదు. కాని, ధనము రక్షణ నిచ్చు ఆశ్రయము అని నీవు భావిస్తే, నీకు నీవే సమస్యలను సృష్టించుకుంటావు. ఏలయన, ఈ భావన పూర్తి సత్యం కాదు. ధనము తనంత తాను మనలను సురక్షితులను చేయజాలదు. నీ కంటె భిన్నమగు పదార్థమును నీవు పట్టుకున్నంతవరకు, అది నీకు 'రక్షణ లేదు' అనే విషయమునే నిరూపించును. చేతికర్రల సాయంతో నడిచే కుంటివాడు తన కాళ్లపై తాను నిలబడలేడని స్పష్టమవుతూనే ఉంటుంది. ఏ వ్యక్తికి, తాను సురక్షితుడను అనే భావన కలుగుటకై తన కంటె బాహ్యమగు వస్తువుల ప్రమేయము ఉండదో, అట్టి వ్యక్తియే పూర్ణముగా సురక్షితుడు.

వస్తువులలో లేని లక్షణములను వాటియందు దర్శించి, వాటిని ధ్యానించుట వలన వాటిపై సంగమేర్పడును. ఈ సంగమును, దాని వలన ఉత్పన్న మయ్యే నష్టపరంపరను శ్రీకృష్ణుడు విస్తారముగా వర్ణించెను:

ध्यायतो विषयान् पुंसः सङ्गस्तेषूपजायते ।
सङ्गात्सञ्जायते कामः कामात्क्रोधो ऽभिजायते ॥

क्रोधाद्भवति सम्मोहः सम्मोहात्स्मृति विभ्रमः ।
स्मृतिभ्रंशाद्बुद्धिनाशो बुद्धिनाशा त्प्रणश्यति ॥

ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తే షూపజాయతే
సంగాత్సంజాయతే కామః కామా క్ర్కోధో భిజాయతే

క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్స్మృతి విభ్రమః
స్మృతి భ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి
(2-62, 63)

భోగ్యవస్తువులను ధ్యానము చేయు వ్యక్తికి వాటియందు ఆసక్తి పుట్టును. ఆసక్తినుండి కామన పుట్టును. కామన నుండి క్రోధము పుట్టును.

క్రోధము వలన భ్రాంతి కలుగును. భ్రాంతి వలన స్మృతి నాశము కలుగును. స్మృతి నాశము వలన, బుద్ధి యొక్క వినాశము కలుగును. బుద్ధియొక్క వినాశము వలన ఆ వ్యక్తి నశించును.

అపుడు శ్రీకృష్ణుడు, 'ఓ అర్జునా! నీకు జ్ఞాని స్వరూపము యథార్థంగా తెలియాలంటే, నీవు కూడా జ్ఞానివై ఉండాలి ' అని చెప్పెను. జ్ఞాని గురించి తెలియుటకు మరో మార్గం లేదు. ఒక వ్యక్తి యొక్క బాహ్య ప్రవృత్తిని బట్టి ఆతని జ్ఞానమును అంచనా వేయుట సంభవము కాదు :

या निशा सर्वभूतानां तस्यां जागर्ति संयमी।
यस्यां जाग्रति भूतानि सा निशा पश्यतो मुनेः ॥

యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః (2.69)

ఏది సమస్త ప్రాణులకు రాత్రియో, దానియందు ఆత్మ నియంత్రణ గల యోగి తెలివిగా నుండును. దేనియందు ప్రాణులు తెలివిగా నుండునో, అది వివేకియగు జ్ఞానికి రాత్రి

జ్ఞానులకు, అజ్ఞానులకు మధ్యగల భేదము పగటికి, రాత్రికి మధ్యగల భేదము వంటిది. జ్ఞాని జాగరూకుడై ఉండే విషయములలో అజ్ఞాని ఏమీ తెలియని వాడై

యుండును. అంతేగాక, అజ్ఞానులు జాగరూకులుగ నుండు విషయములలో జ్ఞాని ఏమీ తెలియని వాడుగ నుండును. అనగా, ఏది యథార్థమని అజ్ఞానులు భావింతురో, అది జ్ఞాని దృష్టిలో యథార్థము కానే కాదు. ఇచట రాత్రి యనగా అజ్ఞానము. పగలు అనగా జ్ఞానము. వాస్తవంలో, జ్ఞానమునకు, అజ్ఞానమునకు మధ్య మరియొక భేదము లేదు. 'సర్వము నేనే' అని జ్ఞాని గ్రహిస్తాడు. 'సర్వము నన్ను పీడించుచున్నది' అని ఇతరులందరూ భావిస్తారు. జగత్తు తానే యని ఒకడు భావిస్తే, జగత్తు తనపై పగ తీర్చుకొనుచున్నదని మరియొకడు భావిస్తాడు.

ఈ తీరున శ్రీకృష్ణుడు వీలైనంత వరకు స్థితప్రజ్ఞుని వర్ణించి, అర్జునునితో నిట్లనెను: 'ఓ అర్జునా! నీవు జ్ఞానివి కానిదే, జ్ఞానిని ఎట్లు తెలియగలవు? వర్ణించుట వలన ప్రయోజనము లేదు. నీకు జ్ఞాని యొక్క స్వరూపము యథార్థంగా తెలియాలంటే, నీవు జ్ఞానివి కావాలి'.

ఈ విషయము నింకనూ వివరించుటకై, శ్రీకృష్ణుడు మరింత స్పష్టమైన దృష్టాంతము నిచ్చెను:

आपूर्यमाणमचलप्रतिष्ठं
समुद्रमापः प्रविशन्ति यद्वत् ।
तद्वत्कामा यं प्रविशन्ति सर्वे
स शान्तिमाप्नोति न कामकामी ।। ७० ।।

ఆ పూర్య మాణ మచల ప్రతిష్ఠం
సముద్ర మాపః ప్రవిశంతి యద్వత్
తద్వత్కామా యం ప్రవిశంతి సర్వే
స శాంతి మాప్నోతి న కామ కామీ (2.70)

పూర్ణముగా నిండి, చలనము లేకుండా, ప్రతిష్ఠితమై యున్న సముద్రమును జలములు యే తీరున ప్రవేశించునో అదే విధముగా ఎవనియందు అన్ని కోర్కెలు ప్రవేశించునో, ఆతడు శాంతిని పొందును; విషయ వస్తువులను కామించువాడు శాంతిని పొందజాలడు.

వర్షం పడినా, పడకపోయినా, నదులు ప్రవేశించినా, ప్రవేశించకపోయినా, సముద్రం ఏమాత్రం ప్రభావితం గాదు. సముద్రములో వృద్ధిగాని, హ్రాసముగాని, లాభముగాని, నష్టముగాని ఉండదు. సముద్రము తనకంటె భిన్నమైన జలాశయములపై ఆధారపడదు. కావున, ఈ మార్పులు దాని సముద్రత్వమును, పూర్ణత్వమును ప్రభావితం చేయజాలవు. బాహ్యమగు ఆశ్రయము లేకుండగా, సముద్రము స్వీయమహిమయందు ప్రతిష్ఠితమై, పూర్ణమై యుండును.

అటులనే, జ్ఞానియొక్క పూర్ణత్వము ఆత్మయందు కేంద్రితమై యుండును. జ్ఞాని 'నేనే సర్వము' అను సత్యము నందు జాగరూకుడై యుండును. కాన, జ్ఞాని పూర్ణుడు అగుటకు బాహ్యాలంబనముల ఆవశ్యకత లేదు. బాహ్య వస్తువుల చేరిక జ్ఞానిలో వృద్ధిని కలిగించదు. మరియు, జ్ఞాని నుండి కొన్ని వస్తువులను తీసివేసిననూ, ఆతని పూర్ణత్వమునకు హ్రాసము లేదు. ఈ విషయము కూడ వివరింపబడినది.

చిన్న సరస్సు సముద్రము కంటె పూర్తి భిన్నమైనది. వర్షం లేకపోతే, అది ఎండిపోతుంది. మరియు, వర్షం అధికమైతే, సరస్సు కానరాకుండా పోతుంది! కొన్ని కోరికలు తీరినచో ఆనందము. తీరనిచో దుఃఖము. ఇట్టి వ్యక్తి కామ కామి యనబడును. ఇతడు ఆ సరస్సు వంటివాడు. ప్రీతిదాయకమగు సంఘటన జరిగినపుడు, ఆతని ఆనందానికి అవధులుండవు. విపత్తు సంభవిస్తే, ఆతడు ఘోరమగు నిరాశా నిస్పృహలకు గురియై, ఆత్మహత్యకు కూడ సిద్ధపడును.

శ్రీకృష్ణుడు ద్వితీయాధ్యాయమును ఈ క్రింది వాక్యములతో ఉపసంహరించెను:

विहाय कामान् यः सर्वान् पुमांश्चरति निःस्पृहः ।
निर्ममो निरहंकारः स शांति मधिगच्छति ॥
एषा ब्राह्मी स्थितिः पार्थ नैनां प्राप्य विमुह्यति ।
स्थित्वास्यामन्तकाले ऽपि ब्रह्मनिर्वाणमृच्छति ॥

విహాయ కామాన్ యః సర్వాన్ పుమాంశ్చరతి నిస్పృహః
నిర్మమో నిరహంకారః స శాంతి మధిగచ్ఛతి

ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి
స్థిత్వా స్యామంత కాలేపి బ్రహ్మ నిర్వాణ మృచ్ఛతి

ఏ పురుషుడు బంధహేతువులగు కోర్కెలన్నిటినీ త్యజించి, ఆసక్తి, 'నాది' యను ధారణ, పరిచ్ఛిన్నమగు 'నేను' అను ధారణ లేనివాడై సంచరించునో, ఆతడు శాంతిని పొందును.

ఓ అర్జునా! బ్రహ్మము నందు నిష్ఠమైన స్థితి ఇది. దీనిని పొందినవాడు మోహమును పొందడు. మరణకాలమందైననూ దీనియందున్న వ్యక్తి మోక్షమును పొందును (2-71, 72).

స్థిత ప్రజ్ఞుడు బ్రహ్మసంస్థుడై యుండునని శ్రీకృష్ణుడు వివరించెను. జ్ఞానరూపమగు ఈ బ్రాహ్మీస్థితి జాగ్రదవస్థ వలె, మత్తుమందును సేవించుట వలన కలిగే ఉన్మాదావస్థ వలె, తొలగిపోయేది కాదు. అది ఆత్మవలె శాశ్వత సత్యము. అందువలన, ఈ జ్ఞానము యొక్క లబ్ధి జ్ఞానాత్మకమే గాని, అనుభవాత్మకము గాదు. కాన, ఈ జ్ఞానము లభించిన తరువాత, దానిని పోగొట్టుకునే ప్రశ్న ఉదయించదు. ఆత్మ బ్రహ్మ భిన్నమనే జ్ఞానము కల్గుతుంది. అది జ్ఞానము యొక్క చరమసీమ. కనుక, ఈ జ్ఞానము జీవితము యొక్క అంతకాలము నందు కలిగినా (న విముహ్యతి అంతకాలే అపి, 2.72), అట్టి జ్ఞాని తిరిగి సంసారములోనికి జారిపోయే ప్రసక్తి లేనేలేదు.

జీవితము యొక్క అవసానదశలో మరణించుటకు సిద్ధముగానున్న వ్యక్తియైననూ, ఆత్మయే సర్వమని తెలుసుకున్నచో, ఆతడు ముక్తుడగును. మరణించుటకు సిద్ధముగా నున్న వృద్ధుడు కూడా ఈ జ్ఞానమును పొందగలడన్నచో, కన్నులు చూడగలిగి, చెవులు వినగలిగి, నిశ్చలముగ కూర్చుని ధ్యానము చేయగలిగే యువకులు, మధ్యవయస్కులు ఈ జ్ఞానమును పొందగలరనుటలో సందియము లేదు.

అర్జునుని తరువాతి ప్రశ్నతో మూడవ అధ్యాయము ఆరంభమగును:

ज्यायसी चेत्कर्मणस्ते मता बुद्धिर्जनार्दन।
तत्किं कर्मणि घोरे मां नियोजयसि केशव॥

व्यामिश्रेणेव वाक्येन बुद्धिं मोहयसीव मे।
तदेकं वद निश्चित्य येन श्रेयोऽहमाप्नुयाम्॥

జ్యాయసీ చేత్కర్మణస్తే మతా బుద్ధిర్జనార్దన
తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ
వ్యామి శ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే
తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోహమాప్నుయామ్ (3-1, 2).

ఓ కృష్ణా! కర్మ కంటె జ్ఞానము గొప్పదియని నీ అభిప్రాయమైనచో, భయంకరమగు కర్మయందు నన్నేల నియోగించుచున్నావు?

విరుద్ధముగా కన్పట్టుచున్న వాక్యములతో నీవు నా బుద్ధిని తికమక పెట్టుచున్నట్లు అనిపించుచున్నది. దేనిచేత నేను శ్రేయస్సును పొందెదనో, అట్టి ఒక్కదానిని నిశ్చయించి, నాకు బోధింపుము.

ఇచట అర్జునుడు ఒక సమస్యను లేవనెత్తెను. 'ఓ శ్రీకృష్ణా! నీవు చెప్పినది నాకు తెలిసినదని భావిస్తాను. నీ హృదయము జ్ఞానము వైపునకు మొగ్గినట్లు నాకు తోచినది. నేను నీ నుండి శ్రేయస్సును, మోక్షమును కోరితిని. కోరికలను అనుభవించుట చేత మోక్షము లభించదనియు, జ్ఞానము చేతనే మోక్షము లభించుననియు, నీవు స్పష్టము చేసినావు. మరియు, కామనలనన్నిటినీ త్యజించవలెననియూ నీవు చెప్పితివి. ఇంతవరకు చెప్పిన నీవు, మరల నన్ను కర్మలను జేయుమనుచుంటివి. కావున, ఇదంతా నాకు తికమకగా నున్నది.'

శ్రీకృష్ణుని ఉపదేశమును అర్జునుడు గ్రహించిన విధమిట్టిది. వాస్తవంలో, కామనలనన్నిటినీ విడువవలెనని శ్రీకృష్ణుడు చెప్పియుండలేదు. జ్ఞాని కామనలను త్యజించును. అనగా, తాను సురక్షితుడు, సుఖి కావాలనే కోరిక జ్ఞానికి లేదని శ్రీకృష్ణుడు చెప్పెను. జ్ఞానికి ఏదో ఒక పనిని చేయాలనే కోరిక కలుగవచ్చును. కాని, ఆ కోరిక తీరుట వలన తాను మరింత సురక్షితుడనగుదుననే భ్రాంతి జ్ఞానియందు ఉండదు. శ్రీకృష్ణుని తాత్పర్యమిది. కర్మలన్నియు కామనా మూలకములని అర్జునుడు యెరుంగును. అందువలననే, అతడు శ్రీకృష్ణుని తాత్పర్యమును సరిగా గ్రహించలేదు. కామన లేనిదే, కర్మ లేనే లేదు. కావన, కామనలను త్యజించాలి; అట్టిచో నేను కర్మల నేల చేయవలెను? మరియు, నాకు జ్ఞానము

కలిగే విధమెట్టిది? సర్వకర్మలను, వాటికి మూలమగు కామనలతో సహా, త్యజించి, జ్ఞానసాధన చేయుటయే జ్ఞానప్రాప్తికి ఏకైక మార్గము' అని అతడు భావించెను.

కర్మయోగమును అనుసరించుమనియు, లేచి నిలబడి యుద్ధమును చేయుమనియు శ్రీకృష్ణుడు అర్జునుని ఆదేశించెను. కావున, అర్జునుడు తికమకపడుట సహజమే. 'నాకు శ్రేయస్సునిచ్చునది జ్ఞానము. కావున, నేను జ్ఞానము కొరకు మాత్రమే యత్నించాలి. జ్ఞానము కొరకై నేనీ కర్మలనన్నిటినీ చేయబని లేదు. సర్వమును త్యజించి, గురువు వద్దకు వెళ్ళి, జ్ఞానమును పొందాలి. నేను చేయవలసిన దింతే. కావున, నా సమస్యకు సన్న్యాసమే పరిష్కారము అని తోచుచున్నది.'

అర్జునుడీ విరోధాభాసమునకు సమాధానమును పొందగోరి, తనకు నిశ్చయముగా శ్రేయస్సునిచ్చే ఏకైక సాధనమును ఉపదేశింపుమని శ్రీకృష్ణభగవానుని కోరెను. దానికి, ఆయన యిట్లు ప్రత్యుత్తరమిచ్చెను:

लोकेऽस्मिन् द्विविधा निष्ठा पुरा प्रोक्ता मयानघ ।
ज्ञानयोगेन साङ्ख्यानां कर्मयोगेन योगिनाम् ॥ ३ ॥

లోకేస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ
జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ (3)

పాపరహితుడవగు ఓ అర్జునా! సన్న్యాసులకు జ్ఞానమార్గము, కర్మ మార్గానుయాయులకు కర్మయోగము అనే రెండు విధముల జీవన వ్రతములు నాచే సృష్ట్యాది యందు ఉపదేశింపబడినవి (33).

అర్జునుని ప్రశ్నను బట్టి, తన ఉపదేశము అతనికి అర్థము కాలేదని శ్రీకృష్ణ భగవానునకు స్పష్టమయ్యెను. సన్న్యాసము ఒక విశిష్టజీవనశైలి యను మాట నిజమే. కాని, జ్ఞానము చేత మాత్రమే కర్మలను త్యజించుట (జ్ఞానేన కర్మ సన్న్యాసః) యథార్థమైన కర్మ సన్న్యాసము. కర్మయోగము ఈ జ్ఞానమును పొందుటలో ఉపాయము. విశిష్ట జీవనశైలి రూపములో నుండే సన్న్యాసమునకు, జ్ఞానముచే కర్మలను త్యజించుటకు మధ్యగల విభేదమును స్పష్టము చేయుట కొరకై, శ్రీకృష్ణుడిట్లు చెప్పెను: 'ఒక వ్యక్తి సన్న్యాసియైనా, కాకపోయినా, ఏ కర్మనూ చేయకుండగా నుండుట అసంభవము'.

न हि कश्चित् क्षणमपि जातु तिष्ठत्यकर्मकृत् ।
कार्यते ह्यवशः कर्म सर्वः प्रकृतिजैर्गुणैः ॥ ५ ॥

న హి కశ్చిత్ క్షణ మపి జాతు తిష్ఠత్యకర్మకృత్
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః (5)

ఒకప్పుడైననూ ఎవడైననూ క్షణకాలమైననూ కర్మను చేయకుండగా ఉండజాలడు. ఏలయనగా, ప్రతి వ్యక్తి అస్వతంత్రుడై ప్రకృతి జన్యములగు గుణముల చేత కర్మల యందు ప్రేరేపింపబడుచున్నాడు. (3-5)

కొన్ని వ్రతములను స్వీకరించి, వేద విహితములగు విధులను త్యజించినవాడు సన్న్యాసి యనబడును. సన్న్యాసి స్పర్ధాయుక్తమగు సామాజిక జీవితమును, సర్వకర్మలను త్యజించి, జ్ఞానసాధనయందు మాత్రమే నిమగ్నుడగును. ఇట్టి జీవనశైలి మనకు లభ్యమయ్యే వికల్పములలో ఒకటి యని శ్రీకృష్ణుడంగీకరించెను. సన్న్యాసమనగా జ్ఞాన సాధనకు అంకితమైన జీవనశైలి. కాని, ఈ జీవనము సరళమైనది కాదని శ్రీకృష్ణుడు హెచ్చరించెను. శ్రీకృష్ణుడింకనూ యిట్లు వివరించెను: కర్మయోగము మరియొక జీవనశైలి. యథార్థమగు సన్న్యాసమునకు, అనగా సర్వకర్మ సన్న్యాసమునకు అది ఒక సాధనము. సన్న్యాసి, కర్మయోగి వీరిద్దరూ ఇట్టి సన్న్యాసమును సాధింపగల్గుదురు.

సన్న్యాస జీవనమునకు ఒక విశిష్ట మానసిక భావన, విశిష్ట అంతర్ముఖత్వము ఆవశ్యకమగును. ఇట్టి అంతర్ముఖత్వము కర్మయోగము వలన లభించును. ఉదాహరణకు, నీవు గృహస్థువై, కర్మయోగిగా జీవించినచో, నీకు నష్టమేమీ ఉండదు. వాస్తవంలో, నీకు లాభము కల్గును. సన్న్యాసాశ్రమము తప్ప ఇతర ఆశ్రమములలోని ముముక్షువులందరికీ ఇది వర్తించును. పొందవలసిన జ్ఞానము అందరికీ సమానమే. కావున, అన్ని ఆశ్రమముల వారి లక్ష్యము ఒక్కటే. కావున, అర్జునుడు కర్మయోగియై జ్ఞానమును సంపాదించవచ్చును. ఈ సత్యమును అర్జునుడు గ్రహించాలని శ్రీకృష్ణుని ఆకాంక్ష.

'కర్మఫలదాతయగు ఈశ్వరుడు ఫలముల నిచ్చును. కర్మలనాచరించుటయే నా వంతు' అనే యోగ్యమగు మానసిక భావనలేనిదే, వ్యక్తి కర్మయోగి కాజాలడని మనము

రెండవ అధ్యాయములో చూచియున్నాము. నాకు ఇట్టి మానసిక భావన ఉన్నచో, నేను కర్మఫలములనన్నిటినీ ప్రసాదబుద్ధితో స్వీకరించగల్గుతాను. మరియు, నేను చేయు ప్రతి కర్మయూ ఈశ్వరునకు అర్పింపబడే యజ్ఞము. ఈ మానసిక భావన యొక్క విశిష్టత మూడవ అధ్యాయములో మరల వివరింపబడినది.

देवान् भावयतानेन ते देवा भावयन्तु वः ।
परस्परं भावयंतः श्रेयः परमवाप्स्यथ ॥

इष्टान् भोगान् हि वो देवा दास्यन्ते यज्ञभाविताः ।
तैर्दत्तानप्रदायैभ्यो यो भुङ्क्ते स्तेन एव सः ॥

यज्ञशिष्टाशिनः सन्तो मुच्यन्ते सर्व किल्बिषैः ।
भुञ्जते ते त्वघं पापा ये पचन्त्यात्मकारणात् ॥

దేవాన్ భావయ తానేన తే దేవా భావయంతు వః
పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ
ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యంతే యజ్ఞ భావితాః
తైర్దత్తా న ప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః
యజ్ఞశిష్టాశినః సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః
భుంజతే తే త్వఘం పాపా యే పచంత్యాత్మ కారణాత్ (3-11, 12, 13)

ఈ యజ్ఞముతో దేవతలను ప్రార్థించుడు. ఆ దేవతలు మిమ్ములను తృప్తినొందించెదరు గాత! ఈ తీరున, పరస్పరము సంభావించు కొనువారై, పరమహితమగు మోక్షమును పొందుడు.

యజ్ఞములచే ఆరాధింపబడిన దేవతలు వాంఛితములగు భోగ్య వస్తువులను మీకీయగలరు. వారిచే ఈయబడిన వాటిని, వారికి సమర్పించకుండగా భుజించు వ్యక్తి నిశ్చితముగా చోరుడే.

పరమేశ్వరునకు ముందుగా నివేదించి, తరువాత భుజించువారు సమస్తదోషముల నుండి విముక్తులగుదురు. ఎవరైతే, తమ కొరకై

మాత్రమే అన్నమును వండుకొందురో, అట్టి పాపులు పాపమును భుజింతురు.

నీవు కర్మలను ఈశ్వరార్పణ బుద్ధితో ఆచరిస్తే అట్టి కర్మయోగ ప్రవృత్తి నిన్ను రాగద్వేషముల బంధము నుండి విముక్తుని చేయును. ఈ విధానమును శ్రీకృష్ణుడు విస్తారముగా వివరించినాడు.

తదుపరి శ్రీకృష్ణుడిట్లు చెప్పెను:

सदृशं चेष्टते स्वस्याः प्रकृतेर्ज्ञानवानपि।
प्रकृतिं यान्ति भूतानि निग्रहः किं करिष्यति ॥ ३३ ॥

సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేర్ జ్ఞానవానపి
ప్రకృతిం యాంతి భూతాని నిగ్రహః కిం కరిష్యతి (2-33)

జ్ఞానియైననూ తన స్వభావమున కనురూపముగా ప్రవర్తిల్లును. ప్రాణులు స్వభావమును అనుసరించును. నియంత్రణ ఏమి చేయగలదు?

ప్రతి వ్యక్తి తన ప్రకృతికి అనురూపముగా ఆలోచించును. నీవు రాగ ద్వేషములను ఆపజాలవు. అవి తమంత తాము ఉత్పన్నమగుచుండును. ఆలోచనలపై నీకు నియంత్రణ ఏమీ లేదు. కాన, అన్నిరకముల ఆలోచనలు నీ మనస్సులో ఉత్పన్నమగుచుండును. అవి అన్నీ కలిసి నీ ప్రకృతికి, నీ స్వభావమునకు సమానమగును.

నీవు పూర్వజన్మలలో చేసిన కర్మలు (ప్రారబ్దకర్మ), ఈ జన్మలో చేసిన కర్మలు, నీ యొక్క ధర్మాధర్మ, పుణ్య పాప సంస్కారములు అన్నీ కలిసి నీ మనస్సులో కొన్ని ఆలోచనలను లేవదీయును. అట్లు జరుగకుండా నిరోధించుట సంభవము కాదు. ఈశ్వరుడైనను ఆపలేడు. ఈశ్వరుడే అట్లు సృష్టించెను. ఈశ్వరుడు తాను నిర్మించిన విధిని తానే ఉల్లంఘించలేడు. ఇతరులు కూడా ఉల్లంఘించలేరు. ఒక వ్యక్తి యొక్క ప్రకృతిని ఈశ్వరుని నియంత్రణ, లేక ఇతరుల నియంత్రణ మార్చజాలదు. ఆ వ్యక్తి అటులనే యుండును. ఒక వ్యక్తి తన

ఆలోచనలను నిషేధించుట ద్వారా నియంత్రించగల్గినా, ఇట్టి నిషేధపూర్వక నియంత్రణను జీవించి ఉన్నంత కాలము కొనసాగించాలి.

మనము మన ఆలోచనలను నియంత్రించజాలము అనేది సత్యము. ఇట్టి తరి, ఆలోచనలను అసలు ఒక సమస్యగా పరిగణించవలసిన అగత్యమేమున్నది? అని ప్రశ్నించుట సమీచీనము. ఆలోచనలు అన్ని వేళలా ఉంటాయి గనుక, ఆలోచనలు సమస్యయని తలపోయు వ్యక్తికి వాటి భయానుభూతి శాశ్వతముగ నుండును. ఈ సమస్యకు దీర్ఘనిద్రయే పరిష్కారము! వాస్తవంలో, ఆలోచనలు వాటంతట అవి సమస్య కాదు.

ఇచట మరియొక ప్రశ్న ఉదయించును. నేను నా ఆలోచనలను నియంత్రించలేని పక్షంలో శాస్త్రము యొక్క ప్రయోజనమేమి? ప్రతి వ్యక్తియు తన ప్రకృతికి అనురూపంగానే ప్రవర్తిస్తాడు అనే పక్షంలో, ఒకడు హత్యచేసి, 'ఇది నా స్వభావము; ఇట్టి పనులను చేయుట నా ప్రకృతి. నేను దీనికి భిన్నముగా నాచరించలేను' అని చెప్పవచ్చును. ఈ శంకకు శ్రీకృష్ణభగవాను డిట్లు ఉత్తరమిచ్చెను. 'హత్య చేయాలనే ఆలోచన కలిగినది. దానిని స్వీకరించుటకు లేక నిరాకరించుటకు నీకు ఇచ్ఛాస్వాతంత్ర్యము గలదు. కాన, బాధ్యత నీదే అవుతుంది.'

నీవు నీ ఆలోచనలను నియంత్రించజాలవు. కాని, ఏ ఆలోచనలతో తాదాత్మ్యం చెందాలి, వేటితో తాదాత్మ్యం చెందరాదు అను విషయంలో నిర్ణయం నీదే. నీకున్న స్వాతంత్ర్యమిదియే. ఈ స్వాతంత్ర్యము నీకు చాలును. కాన, శ్రీకృష్ణు డిట్లు ఉపదేశించెను:

इन्द्रियस्येन्द्रियस्यार्थे रागद्वेषौ व्यवस्थितौ ।
तयोर्न वशमागच्छे त्तौ ह्यस्य परिपन्थिनौ ॥
श्रेयान् स्वधर्मो विगुणः परधर्मात् स्वनुष्ठितात् ।
स्वधर्मे निधनं श्रेयः परधर्मो भयावहः ॥

ఇంద్రి యస్యేంద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ
తయోర్న వశమాగచ్ఛేత్తౌ హ్యస్య పరిపంథినౌ
శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః (3-34, 35)

ప్రతి ఇంద్రియమునకు తనకు గోచరమయ్యే వస్తువునందు తప్పక రాగ ద్వేషములుండును. మానవుడు వాటికి వశము కారాదు. ఏలయనగా, అవి మానవునకు శత్రువులు. బాగుగా ఆచరింబడిన పరధర్మము కంటె గుణహీనమగు స్వధర్మము శ్రేష్ఠము. స్వధర్మము నందు మరణము శ్రేష్ఠము. పరధర్మము భయమును గొల్పును.

శ్రీకృష్ణుడిచట యిట్లు బోధించెను: నీ కర్తవ్యము, నీ ధర్మము అప్రియముగ నుండవచ్చును. కాని, నీకు సంబంధము లేని పరధర్మము నాచరించుట కంటె స్వధర్మమునకు అంటిపెట్టుకొని ఉండుటయే శ్రేష్ఠము. నీకు కర్తవ్యము కాని ఒక కర్మ, జీవితములోని మరియొక అవస్థలో గల మరియొక వ్యక్తికి కర్తవ్యము కావచ్చును. దానిని ఆచరించుట నీకు ధర్మము గాదు.

ఉదాహరణకు, సన్న్యాసి వేదవిహితములగు నిత్యకర్మల నాచరించడు. కాని, సన్న్యాసిని చూచి, గృహస్థు వాటిని త్యజింపరాదు. ప్రతి వ్యక్తి తన పరిస్థితికి తగు విధములో కర్మలనాచరించాలి. వ్యక్తి తన కర్తవ్యముల నాచరిస్తూనే మరణించుట శ్రేష్ఠము. కర్తవ్యత్యాగములో భయము నిహితమై యున్నది. వ్యక్తికి గాని, ఆతడు నివసించే సమాజానికి గాని, అది శ్రేయస్సుకాదు. కావున, ప్రతి వ్యక్తి తనకు కర్తవ్యములగు కర్మల నాచరించాలి; అనగా, స్వధర్మమును పాటించాలి అని శ్రీకృష్ణుడు ఉపదేశించెను.

అవుడు అర్జునుడు ఒక సందేహమును వెలిబుచ్చెను:

अथ केन प्रयुक्तोऽयं पापं चरति पूरुषः ।
अनिच्छन्नपि वार्ष्णेय बलादिव नियो जितः ॥ ३६ ॥

అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః
అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః (3-36)

ఓ శ్రీకృష్ణా! అట్లైనచో, ఈ మానవుడు దేనిచేత ప్రేరితుడై, ఇష్టము లేకపోయిననూ, బలాత్కారముగా నియోగింపబడినవాడు వలె, పాపము నాచరించుచున్నాడు?

మనిషి తెలిసి కూడా యేల పాపము నాచరించునో అర్జునుడు తెలియగోరెను. కొన్ని పనులు అధర్మములని తెలిసియూ, మానవుడు వాటిని ఆచరిస్తూ ఉంటాడు. ఎందువలన? వ్యక్తిలో అతని కంటె వేరుగా ఏదేని ఒక శక్తి, ఒక దెయ్యము, ఒక భూతము నివసించియుండునా? కొందరు మతాధికారులు చెప్పుతీరున, దైవీశక్తి కంటె విలక్షణమైన మరియొక శక్తి ఉండునా? ఈ ప్రపంచంలో దైవీశక్తికి దీటుగా స్వతంత్రమైన ఉనికి గల రాక్షసశక్తి ఒకటి గలదా? దైవీశక్తి వ్యక్తిని ధర్మమార్గంలో ప్రేరేపిస్తూ ఉంటే, హఠాత్తుగా దుష్టరాక్షస శక్తి ప్రవేశించి వ్యక్తిని అధర్మాచరణమునందు ప్రోత్సహించునా? అట్లైనచో, దైవీశక్తి కంటె రాక్షసశక్తియే నిశ్చయముగా బలీయమైనది యని తోచును.

వాస్తవంలో అట్టి శక్తి యేదీ లేదని శ్రీకృష్ణుడు చెప్పెను. నీ లోపల ఒకే ఒక దెయ్యము గలదు. అది నీవే! ఈ విషయమును శ్రీకృష్ణుడీ క్రింది విధముగా వివరించెను:

काम एष क्रोध एष रजोगुणसमुद्भवः ।
महाशनो महा पाप्मा विद्ध्येनमिह वैरिणम् ॥ ३७ ॥

కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః
మహాశనో మహా పాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్(3-37)

ఈ కామము, ఈ క్రోధము రజోగుణము నుండి పుట్టినది; పెద్ద ఆకలి గలది; మహా పాపములను చేయునది. ఈ ప్రపంచములో దీనిని శత్రువుగా తెలుసుకొనుము.

''అర్జునా! ఆ దెయ్యము నీ కామమే సుమా! మరి వేరుగాదు'' అని శ్రీకృష్ణుడు బోధించెను. కామ క్రోధములే నీ చేత పాపమును చేయించును. కోరిక తీవ్ర వాంఛగా మారగనే, ప్రాథమికతలు(Priorities) అస్తవ్యస్తమవుతాయి. కామన ఎంత తీవ్రమవుతుందంటే, నీవు ఆ కామనను తీర్చుకొనే ఉపాయము యొక్క యోగ్యతను పట్టించుకోవడం మానివేస్తావు. ఉపాయముల విషయంలో రాజీపడి, అడ్డదారులు తొక్కటానికి వెనుకాడవు. ఏది ఏమైనా సరే, లక్ష్యమును చేరుకోవాలి అనే పద్ధతి నిర్మాణమగును ''అర్జునా! అసలైన సమస్య ఇదియే. అగ్నిని పొగవలె, అద్దమును ధూళివలె, పిండమును గర్భాశయము వలె, ఈ కామరూపములో నున్న శత్రువు నిన్ను కప్పివేయును'' అని శ్రీకృష్ణుడు వివరించెను.

ఈ కామము వివేకికి శాశ్వత శత్రువు. కామము ఇంద్రియముల అన్వేషణలలో నిహితమై ప్రవర్తిల్లును. అది మనస్సునందు, బుద్ధియందు నివసించును (ఇంద్రియాణి మనో బుద్ధిః అస్యాధిష్ఠాన ముచ్యతే, 3-40). వివేకి ఈ విషయము నెరింగి, ప్రథమతః కామమును జయించాలి. ఈ సత్యము నెరింగిన వివేకి తాను కామము నుండి వేరుపడి, దానిని జయించాలి. ఈ విషయమును శ్రీకృష్ణు డిట్లు వివరించెను:

इन्द्रियाणि पराण्याहुरिन्द्रियेभ्यः परं मनः ।
मनसस्तु परा बुद्धिर्यो बुद्धेः परतस्तु सः ॥ ४२ ॥

ఇంద్రియాణి పరాణ్యాహురింద్రియే భ్యః పరం మనః
మనసస్తు పరా బుద్ధిర్యో బుద్ధేః పరతస్తు సః (3-42)

దేహము కంటె ఇంద్రియములు ఉత్కృష్టమైనవని చెప్పెదరు. ఇంద్రియముల కంటె మనస్సు శ్రేష్ఠమైనది. మనస్సు కంటె బుద్ధి శ్రేష్ఠమైనది. బుద్ధి కంటె ఉత్కృష్టమైనది ఏది గలదో, అదియే ఆత్మ.

ఇంద్రియములు స్థూల దేహము కంటె సూక్ష్మతరములు. మరియు అధిక వ్యాపకములు. కాన, అవి స్థూలదేహము కంటె ఉత్కృష్టములని శ్రీకృష్ణుడీ శ్లోకములో వివరించెను. ఇంద్రియములు వాటంతట అవి హానికరములు గాదు. ఏలయన, మనస్సు, సందేహములతో కూడినదే అయిననూ, వాటికంటె శ్రేష్ఠతరమైనది. సమాచారమును సేకరించి, అందించుట మాత్రమే ఇంద్రియముల పని. అవి ఎవ్వరికీ హానిని కలుగజేయవు. ఇంద్రియములు ఒక విశిష్ట ప్రయోజనమును సాధించుట కొరకై మనకు ఈయబడిన ఉపకరణములు మాత్రమే. అవి మానవులను మోసగించలేవు. అవి మనస్సునకు వశవర్తులై పనిచేయును.

మనస్సు యొక్క కల్పనా విలాసములు బుద్ధిని కప్పివేసి పని చేయకుండా చేస్తాయి. ఈ కారణంగా మనస్సు ఒక సమస్యయే. మనస్సుపై బుద్ధికి అధికారము గలదు. ఒక అంతఃకరణమునందు అనేకానేక ఆలోచనాతరంగములు ఉద్భవించుచుండును. వాటిలో ఒకరకం ఆలోచనలకు మనస్సు అని, మరి యొకరకం ఆలోచనలకు బుద్ధి అనిపేరు. ఒక

విశిష్టపరిస్థితిలో మనోవృత్తి బలీయము గావచ్చును; లేదా, బుద్ధి వృత్తి బలీయము గావచ్చును. బలీయమైన వృత్తి రెండవదానిని నిరాకరించి, సర్వమును నియంత్రించును.

మనస్సు బలీయమైనచో, అది నిస్సందేహముగా నీ బుద్ధిని అపహరించి, నీ చేత చేయకూడని పనులను చేయించును; చేయవలసిన వాటిని త్యజింపజేయును. ఇట్టి ఆలోచనలను నియంత్రించాలంటే, నీవు మనో తాదాత్మ్యము నుండి, బుద్ధి తాదాత్మ్యము నుండి బయటకు రావాలి. అపుడు మాత్రమే, నీవు ఆలోచనను ఆలోచనగా తెలుసుకొనగల్గుతావు.

వ్యక్తికి కొన్ని ఆలోచనలు ఉంటాయి. అతడు తన గురించి కొన్ని నిష్కర్షలను చేసుకుంటాడు. అతని వ్యక్తిత్వం వీటిపై ఆధారపడి ఉంటుంది. ''నేను అపూర్ణుడను; నేను అసమగ్రుడను; నేను వ్యర్థుడను; నేను విలువ లేనివాడను'' ఇత్యాదులు కొన్ని నిష్కర్షలకు దృష్టాంతములు. వ్యక్తులు ఇట్టి నిష్కర్షలను ఆధారముగా చేసుకొని, తమ దృష్టిలో తాము అంగీకారయోగ్యులగుట కొరకై, తమను తాము సమర్థులుగా నిరూపించుకొనుట కొరకై యత్నిస్తారు. ఈ ప్రయత్నంలో జీవితం ఒక నిరంతర సంఘర్షణ అవుతుంది. ఈ సమస్యను మౌలికముగా పరిష్కరించే ఉపాయమొక్కటియే గలదని అర్జునునకు చెప్పి, శ్రీకృష్ణ భగవానుడు ఈ మూడవ అధ్యాయమును ఉపసంహరించెను.

एवं बुद्धेः परं बुद्ध्वा संस्तभ्यात्मानमात्मना।
जहि शत्रुं महाबाहो कामरूपं दुरासदम्॥ ४३॥

ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్త భ్యాత్మాన మాత్మనా
జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్ (3-43)

గొప్ప బాహువులు గల ఓ అర్జునా! ఈ తీరున బుద్ధి కంటె ఉత్కృష్టమగు ఆత్మను తెలుసుకొని, బుద్ధి చేత మనస్సును వశము చేసుకొని, కామము యొక్క రూపమునందున్న, తెలియ శక్యము గాని ఈ శత్రువును సంహరింపుము.

ఆత్మ బుద్ధికి అతీతము, శుద్ధము, పూర్ణము, ఆనందము, ఒకే ఒక సత్యము, అపరిచ్ఛిన్నము. అట్టి ఆత్మను యెరింగి, వ్యక్తి బుద్ధి తాదాత్మ్యము నుండి బయటపడాలి. ఈ సత్యం – జ్ఞానం – అనంతం అని వర్ణింపబడిన బ్రహ్మాత్మను యెరింగిన వాడు ముక్తుడగును.

ఈ జ్ఞానము కలిగిన వ్యక్తికి సర్వకామనలు, సర్వమనోవృత్తులు హీనాధికారములగును. అట్టి జ్ఞానికి మనస్సు, ఆలోచనలు, బుద్ధి కేవలము అప్రధానములగు ఉపాధులుగ మాత్రమే నుండును. ఈ ఉపాధులు తాము పరిచ్ఛిన్నములే అయినా, ఉపహితుడగు పురుషుడు సర్వపరిచ్ఛేద విముక్తుడు. ఇట్టి జ్ఞానికి కామనలు హీనాధికారములగును.

కామము విభిన్న పరిస్థితులలో, మనము కలలోనైనా ఊహించని రీతిలో విభిన్న రూపములలో ప్రకటమగుచుండును. కావున, కామము యొక్క స్వరూపమును అర్థము చేసుకొనుట చాల కష్టము. కాని, కామము నుండి ఆత్మను వివేచించుట ద్వారా, దాని నుండి శాశ్వతమగు విముక్తి లభించును. అట్టి స్థితిలో, జ్ఞానికి కామనలు కేవలం తెలుస్తూ ఉంటాయి; కాని, హానిని కలిగింపజాలవు. మనస్సులో కామనలు అనంతముగ చెలరేగుచుండును. కావున, కామమును జయించు ఉపాయము ఇది ఒక్కటియే. కామము నుండి సర్వకాలముల యందు విముక్తమైన స్వరూపము నీది. నీ వీ సత్యమును తెలుసుకుంటే చాలును. నీవు సర్వదా ముక్తుడవు.

నాల్గవ అధ్యాయము
జ్ఞానము, మరియు కర్మ సన్న్యాసము

శ్రీకృష్ణుడు నాల్గవ అధ్యాయములోని మొదటి మూడు శ్లోకములలో కర్మ యోగమును ఉపసంహారము చేసెను. ఈ కర్మయోగము క్రొంగ్రొత్తది కాదని భగవానుడు చెప్పెను. శ్రీకృష్ణభగవానుడే సృష్ట్యాదియందు ఈ కర్మయోగమును లోకములో ప్రవర్తిల్లజేసెను. ఆనాటి నుండి ఈ కర్మయోగము ఒక తరము తరువాత మరియొక తరమునకు సంక్రమించుచున్నది. మధ్యకాలములో దీనిని ఉపేక్ష చేసిన సందర్భములు కొన్ని లేకపోలేదు.

సన్న్యాసి కావటానికి పరిణతము, మననశీలము, అంతర్ముఖమునగు స్వభావము ఉండాలి. 'నేను పరిణతునిగా అంతర్ముఖునిగా అగుదును' అని ఎవరికి వారు నిర్ణయించుకుంటే చాలదు. అట్టి స్వభావము వ్యక్తికి ఉంటే ఉన్నట్లు; లేకపోతే లేనట్లే. కాని, అట్టి అంతర్ముఖ స్వభావమును పెంపొందించగల రీతిలో జీవనమును గడపాలనే నిర్ణయం మాత్రం వ్యక్తి అధీనములోనిదే. ఇట్టి జీవనమే కర్మయోగము.

ఆత్మజ్ఞానమే మోక్షము. నీ స్వరూపము కర్మ విముక్తము. సర్వసృష్టికి మూలమగు తత్త్వమే నీ స్వరూపము. అదియే సర్వము యొక్క సత్యతత్త్వము. దానిని సాక్షాత్కరించుకుంటే మోక్షము లభించును. ఇట్టి సాక్షాత్కారమును పొందుటకై, మానవుడు సన్న్యాస జీవనమును గాని, కర్మయోగ జీవనమును గాని స్వీకరించవచ్చును. యోగ్యమగు మానసిక భావనతో కర్మలయందు నిమగ్నమైన జీవనము కర్మయోగము (ప్రవృత్తి లక్షణః యోగః). కర్మలనన్నిటినీ వీడుటయే సన్న్యాసము, లేక జ్ఞానయోగము (నివృత్తిలక్షణః సన్న్యాసః). ఈ తీరున, సన్న్యాసికి నివృత్తి లక్షణ జ్ఞానయోగము, ఇతరులందరికీ ప్రవృత్తి లక్షణ సన్న్యాసము విధింపబడినవి.

ఈ ద్వివిధ యోగమే గీతలో సర్వత్రా ప్రదర్శింపబడినది. వాస్తవంలో, శ్రీకృష్ణుడు ఈ ద్వివిధ యోగమును ఇప్పటికే ద్వితీయ, తృతీయాధ్యాయములలో పూర్తి చేసియున్నాడు. తాను ఉపదేశించదలచుకున్నది పూర్తి అయినదని ఎరింగిన శ్రీకృష్ణుడు ఈ యోగమును స్తుతింపనారంభించెను. తాను ఉపదేశించిన యోగము అతి ప్రాచీనమైనదనియు, భగవానుడగు తానే దానిని ప్రప్రథమముగా, అనగా వేదములో ఉపదేశించినాననియు శ్రీకృష్ణుడు అర్జునునకు చెప్పెను.

గురువు నుండి శిష్యునకు : సంప్రదాయము

ఈ జ్ఞానము గురువు నుండి శిష్యునకు లభించును. మరల ఆ శిష్యుడు దానిని తన శిష్యునకొసంగును. ఈ తీరున జ్ఞానము పరంపరా ప్రాప్తము అనే విషయమును వివరిస్తూ శ్రీకృష్ణుడు ఒక గాథను చెప్పెను. వాస్తవంలో, సత్యమును తెలియుటకై ఎవరు ఎవరికి బోధించినారో యను విషయము తెలియబని లేదు. కాని, గురు శిష్య పరంపరలోని కొన్ని నామధేయము లిచట ప్రస్తావింపబడినవి. ఒక తరము నుండి మరియొక తరమునకు వచ్చే ఈ పరంపరకు సంప్రదాయమని పేరు. ఈ జ్ఞానమును యథాతథముగ నెరింగిన వ్యక్తియే బోధించుటకు అర్హుడగును. కాన, ఈ సంప్రదాయమునకు ఎంతేని ప్రాముఖ్యము గలదు. కావున, గ్రంథములో ఆదియందు గాని, అంతమునందు గాని సంప్రదాయము తప్పక ప్రస్తావింపబడును.

ఈ సంవాదము ఇంచుమించు పూర్తి అయినది. కావుననే, శ్రీకృష్ణుడిచట సంప్రదాయమును ప్రస్తావించి, ఈ జ్ఞానమును స్తుతించెను:

అధ్యాయము 4, శ్లోకములు 1, 2

श्री भगवानुवाच
इमं विवस्वते योगं प्रोक्तवानहमव्ययम् ।
विवस्वान्मनवे प्राह मनुरिक्ष्वाकवेऽब्रवीत् ॥ १ ॥

एवं परम्पराप्राप्तमिमं राजर्षयो विदुः ।
स काले नेह महता योगो नष्टः परन्तप ॥ २ ॥

శ్రీ భగవానువాచ

ఇమం వివస్వతే యోగం ప్రోక్త వానహమవ్యయమ్
వివస్వాన్మనవే ప్రాహ మను రిక్ష్వాకవే బ్రవీత్ (1)
ఏవం పరంపరా ప్రాప్త మిమం రాజర్షయో విదుః
సకాలే నేహ మహతా యోగో నష్టః పరంతప (2)

శ్రీ భగవాన్ = శ్రీ భగవానుడు; **ఉవాచ** = పలికెను; **అహం** = నేను; **వివస్వతే** = వివస్వానునకు; **ఇమం** = ఈ; **అవ్యయం** = వినాశము లేని; **యోగం** = యోగమును; **ప్రోక్తవాన్** = చెప్పియుంటిని; **వివస్వాన్** = వివస్వానుడు; **మనవే** = మనువు కొరకు; **ప్రాహ** = చెప్పెను; **మనుః** = మనువు; **ఇక్ష్వాకవే** = ఇక్ష్వాకుని కొరకు; **అబ్రవీత్** = చెప్పెను.

ఏవం = ఈ విధముగా; **పరంపరా ప్రాప్తం** = ఒక తరము నుండి మరియొక తరమునకు సంక్రమించిన; **ఇమం** = దీనిని; **రాజర్షయః** = రాజర్షులు; **విదుః** = తెలుసుకొనిరి; **పరంతప** = ఓ అర్జునా; **ఇహ** = ఈ లోకమునందు; **సః** = ఆ; **యోగః** = యోగము; **మహతా కాలేన** = దీర్ఘకాలము గడుచుట చేత; **నష్టః** = క్షీణించినది.

శ్రీ భగవానుడు పలికెను:

> నేను వివస్వానునకు ఈ వినాశము లేని యోగమును చెప్పియుంటిని. వివస్వానుడు మనువునకు చెప్పెను. మనువు ఇక్ష్వాకునికి చెప్పెను. (1)
>
> ఈ విధముగా ఒక తరము నుండి మరియొక తరమునకు సంక్రమించిన దీనిని రాజర్షులు తెలుసుకొనిరి. ఓ అర్జునా! ఈ లోకములో ఆ యోగము దీర్ఘకాలము గడుచుట చేత క్షీణించినది. (2)

భగవానుడీ జ్ఞానమును ప్రారంభములోనే, అనగా సృష్ట్యాది యందు వేదరూపముగా సూర్యవంశ ప్రవర్తకుడగు వివస్వానునకు ప్రకటించెనని శ్రీకృష్ణుడీ శ్లోకములో అర్జునునకు చెప్పుచుండెను. చంద్రవంశము అను పేరిట మరియొక వంశము కూడ గలదు. చంద్రవంశమునకు చెందిన ఇతిహాసమే మహా భారతము. సూర్యవంశమునకు చెందిన ఇతిహాసము రామాయణము. వివస్వాన్ అనునది సూర్యభగవానునకు మరో పేరు.

ఈశ్వరుని నుండియే ఈ జ్ఞానము ఆరంభమైనదని శ్రీకృష్ణభగవానుడీ శ్లోకములో చెప్పుచుండెను. ఈ జ్ఞానము ఒకానొక పురుషుని బుద్ధిచే నిర్మితమైనది గాదు; ఊహా విలాసము కాదు. ఇది సృష్టితో బాటు ఈశ్వరుని నుండి వచ్చిన జ్ఞానము.

ఈ జ్ఞానమునకు, ఇతర ఈశ్వరీయ జ్ఞానములకు భేదము గలదు. ఈ జ్ఞానము మనము సాక్షాత్కరించుకొనవలసినది. ఇది 'నేనే సర్వము' అనే జ్ఞానము. ఇతర ఈశ్వరీయ జ్ఞానములు నీవు విశ్వసించవదగినవి. వాటిలో మరణానంతర జీవగతి ఇత్యాది అంశములలో ఏవో కొన్ని వాగ్దానములు ఉండి తీరును. కాని 'నేనే సర్వము' అనే జ్ఞానములో వాగ్దానమేమియూ లేదు.

'అది నీవే అయి ఉన్నావు (తత్ త్వం అసి)' అను వాక్యము ఒక సహజ సత్య కథనము మాత్రమే. ఈ వాక్యము, నీవే బ్రహ్మము అనే సత్యకథనము సాక్షాత్కరించుకొనదగినదే గాని, విశ్వసించవలసినది కాదు.

సత్యకథనము లోని జ్ఞానము నిజమో, కాదో నిగ్గు తేల్చుకునే అవకాశము మనకు ఉండును; విశ్వసించవలసిన పని లేదు. కాని, ఇతర ఈశ్వరీయ జ్ఞానము అట్లు గాదు. కాని, మనమొక సంగతిని మరువరాదు. ఈ ఇతరములగు ఈశ్వరీయ జ్ఞానము లన్నియు ఒకే ఒక సత్యమును బోధించుచున్నవి. కావున, సమస్య ఏమియూ లేదు. సర్వము ఈశ్వరుని జ్ఞానమే. జ్ఞానము ఏదో ఒక వ్యక్తికో, లేక సంస్కృతికో మాత్రమే సంబంధించినది కాదు. కావుననే, జ్ఞానము ఈశ్వరునిది అని మనం చెప్తాము.

శ్రీకృష్ణ భగవానుడు సన్న్యాస, కర్మయోగములనే యీ ద్వివిధ యోగమును సృష్ట్యాది యందు సూర్యవంశమునకు ఆది పురుషుడగు వివస్వానుని ద్వారా ప్రవర్తింపజేసెను (వివస్వతే అహం ప్రోక్తవాన్). ఈ జ్ఞానము సూర్యభగవానుని నుండి సంప్రాప్తమైనదనుట వలన, ఇది ఈశ్వరీయ జ్ఞానమని స్పష్టమగుచున్నది. తరువాత, సూర్యభగవానుడు కృపతో ఈ జ్ఞానమును తన కుమారుడగు మనువున కందించెను. ఈ మనువు మొట్టమొదటి చక్రవర్తి. అయనయే మానవాళికి ధర్మశాస్త్రము నందించెను. మనువు ఈ జ్ఞానమును తన కుమారుడగు ఇక్ష్వాకునకు నేర్పెను.

ఆత్మజ్ఞానము పోయేది కాదు

ఈ యోగ మెట్టిది? ఈ యోగము, ఈ జ్ఞానము మానవునకు అవినాశియగు పదము (అవ్యయ యోగ)ను, అనగా మోక్షమును ఇచ్చును. మోక్షము శాశ్వతమగు ఆత్మ

కంటే వేరు గాదు. కనుకనే, మోక్షమొక్కటియే అవినాశియగు తత్త్వము. ఆత్మజ్ఞాన మోక్షము. ఒకసారి లభించిన మోక్షము మరల పోయేది కాదు.

శ్రీ శంకరులు ఈ శ్లోక భాష్యములో ఇట్లు వివరించిరి. యోగ ఫలమగు మోక్షమ ఆత్మ యొక్క శుద్ధ సాక్షాత్కార రూపమున నుండును. అది ఎన్నటికీ నశించేది (వ్యయ) కాదు. ఒకసారి లభించిన జ్ఞానము మరల జారిపోదు. ఈ మోక్షము నిర్వికల్ప సమాధి యొక్క అనుభవము వంటిది కాదు. ఇట్టి అనుభవములో పునరావృత్తి యుండును. కాని, మోక్షము పరిచ్ఛిన్న జీవ భావన తొలగిపోవుటచే, పునరావృత్తి ఉండబోదు. మోక్షము ఒకసా లభించిన తరువాత పునరావృత్తి లేదు గనుకనే, ఈ జ్ఞానము అవ్యయమని చెప్పబడినది.

రెండవ శ్లోకములో శ్రీకృష్ణుడు అర్జునుని 'పరంతప' అనగా 'శత్రువులను సంహరించువాడా' అని సంబోధించి, యిట్లు చెప్పెను: ఈ విధముగా యీ జ్ఞానము రాజుల, మరియు ఋషుల వంశముల ద్వారా ఒక తరము నుండి మరియొక తరమునకు సంక్రమించునది. అనగా, ఈ జ్ఞానము ఒక తరము నుండి మరియొక తరమునకు రెండు పరంపరల ద్వారా సంక్రమించినదని స్పష్టమగుచున్నది.

ఈ జ్ఞానము యొక్క ప్రభావము వలననే జనకాది చక్రవర్తులు రాజ్యాధికారమును దుర్వినియోగము చేయకుండా తమ కర్తవ్యములను నిర్వర్తించగల్గినారని శ్రీ శంకరులు వ్రాక్రుచ్చిరి. అధికారము, జ్ఞానము, కొంత సంతృప్తి అనే మూడు లక్షణములు కలిసి ఉండాలి. ఒక వ్యక్తి యొక్క అధికారం పెరిగే కొలదీ, అతని జ్ఞానం కూడా పెరగాలి. అట్లుగానిచో, అతని అధికారపు పరిధిలోకి వచ్చే వారందరూ కష్టాల పాలవుతారు! కావుననే, ఈశ్వరుడు చక్రవర్తులకు రాజ్యమును ప్రజారంజకముగా పాలించగలిగే శక్తిని ఇచ్చుట కొరకై, ఈ జ్ఞానమును లోకములో ప్రవర్తిల్ల జేసెను. ఆత్మ జ్ఞానము వలన కలిగే బలము (ఆత్మ బలము) కంటె గొప్ప బలము లేనే లేదు.

రాజ వంశములోని చక్రవర్తుల వద్దనే గాక, ఈ జ్ఞానము అడవులలో నివసించే ఋషుల వద్ద కూడ ఉండెడిది. ఈ చక్రవర్తులు, ఆ జ్ఞానమును తమ సంతానమునకు అందజేసెడివారు. ఋషులు తమ శిష్యులకు ఇచ్చెడివారు. ఆ శిష్యులు మరల తమ శిష్యులకు బోధించెడివారు. ఈ విధముగా ఈ జ్ఞానము ఒక తరము నుండి మరియొక తరమునకు సంక్రమించెడిది.

జ్ఞానమును ఉపదేశించుచున్న సమయములో అర్జునుని నేత్రములలో ప్రకటమైన ఆశ్చర్యమును శ్రీకృష్ణుడు గమనించెను. నాకీ జ్ఞానము ఇతః పూర్వము ఏల కలుగలేదు? నేను పెరిగే వయస్సులో ఉన్ననాడే ఈ జ్ఞానమునేల పొందలేకపోతిని? నాకు ధనుర్విద్యను బోధించిరి. ధర్మాధర్మములను నేర్పిరి. కాని దీనిని బోధించలేదు ఎందువలన? ఇత్యాది భావనలాతని నేత్రములలో ప్రకటమైనట్లుండెను.

మొదటిసారిగా ఈ జ్ఞానమును విన్న వ్యక్తులందరూ ప్రాయశః ఇట్టి విస్మయమునే ప్రకటిస్తారు: ఇంతటి సుస్పష్టమైన జ్ఞానమును నేనెట్లు గ్రహించలేకపోతిని!. అర్జునుని కాలములో వ్యాస, శుకాది మహర్షులు జీవించియే ఉన్నా, శ్రీకృష్ణుడు అర్జునునకు ఉపదేశించిన యీ జ్ఞానము తేలికగా లభించెడిది కాదు. కొద్దిమంది వద్ద మాత్రమే ఈ జ్ఞానము ఉండెడిది; కావున నష్టమైనదా అన్నట్లుండెడిది. మిగిలిన వారందరూ తమ తమ పనులలో నిమగ్నమై ఉండెడివారు. మరో మాటలో చెప్పాలంటే, జగత్తులో దుర్యోధనుల సంఖ్య చాల ఎక్కువ. జనుల వద్ద ఈ జ్ఞానము కొరకు సమయముండదు.

ఈ జ్ఞానము కొంగ్రొత్తదిగా, అపరిచితముగా భాసించినా, అది అట్టిది కాదని శ్రీకృష్ణుడు అర్జునునకు చెప్పెను. జ్ఞానము సృష్ట్యాది నుండియు లభ్యముగనే ఉండెను. పురాతన జ్ఞానమునే నేనీనాడు నీకు అందజేసితిని. ఈ పరంపర సర్వదా ఇటులనే కొనసాగుచున్నది. నీకు ఇంతవరకు ఈ జ్ఞానమును వినే అవకాశము లభించలేదు గావుననే, నీకు అది అపరిచితముగా భాసించుచున్నది.

నీవీ జ్ఞానమును నాకు ఈనాడే యేల ఉపదేశించుచుంటివి? ఇతః పూర్వమే యేల ఉపదేశించలేదు? అనే అర్జునుని తరువాతి ప్రశ్నను శ్రీకృష్ణుడు ముందుగనే ఊహించి, ఇట్లు చెప్పెను:

అధ్యాయము 4, శ్లోకము 3

स एवायं मया तेऽद्य योगः प्रोक्तः पुरातनः ।
भक्तोऽसि मे सखा चेति रहस्यं ह्येतदुत्तमम् ॥ ३ ॥

స ఏవాయం మయా తేద్య యోగః ప్రోక్తః పురాతనః
భక్తోసి మే సఖా చేతి రహస్యం హ్యేత దుత్తమమ్ (3)

మే = నాకు; **భక్తః** = భక్తుడవు; **చ** = మరియు; **సఖా** = స్నేహితుడవు; **అసి** = అగుదువు; **ఇతి** = అను కారణముచే; **సః** = ఆ; **పురాతనః** = ప్రాచీనమైన; **అయం** = ఈ; **యోగః ఏవ** = యోగమే; **అద్య** = ఈనాడు; **మయా** = నా చేత; **తే** = నీ కొరకు; **ప్రోక్త** = చెప్పబడినది; **హి** = ఏలయనగా; **ఏతత్** = ఇది; **ఉత్తమం** = గొప్పదగు; **రహస్యం** = రహస్యము.

> నీవు నాకు భక్తుడవు, స్నేహితుడవు అను కారణముచే ఆ ప్రాచీనమగు యోగమునే నేనీనాడు నీకు ఉపదేశించితిని. ఏలయనగా, ఇది గొప్ప రహస్యము. (3)

సృష్టి కంతకు కారణమగు పరబ్రహ్మవు నీవే అనునది వేదదర్శనము. నీవు సృష్టించబడే ప్రాణివి కాదు. గీతలో ఈ జ్ఞానమంతయూ బోధింపబడినది. కావుననే, గీత వేదసారమని చెప్తారు. ఈ జ్ఞానమును పొందుటయే మానవ జీవిత పరమావధి. ఈ జ్ఞానము లభించనంత వరకు, మానవుడు సుఖ దుఃఖములు, హర్ష విషాదములు, జన్మ మరణములు ఇత్యాది సంసార జీవనమునకు బద్ధుడగును.

వేదము తాను ఉపదేశించే దర్శనమును, లక్ష్యమును చేరుకొనుటకు ఉపాయ భూతములగు ద్వివిధ మార్గములను కూడ మనకు అందించును. ఆత్మ బ్రహ్మ భిన్నమనే జ్ఞానమును పొందుట పరమ లక్ష్యము. ఈ జ్ఞానము ఇతర జ్ఞానముల వంటిది గాదు. జ్ఞానము యేదైనా ఉదయించాలంటే, కొంత సంసిద్ధత అవశ్యకమగును. ఆత్మజ్ఞానము కలగాలంటే, భావాత్మక పరిణతి అవసరము. ఒక వ్యక్తి గొప్ప విజ్ఞాన శాస్త్రవేత్త కావచ్చును. కాని, అతనికి భావాత్మక పరిణతి లేకపోవచ్చును. ఉదాహరణకు, తనను సమాజములోని లబ్ధ ప్రతిష్ఠులగు వ్యక్తులు, ఇతరులు కూడా గుర్తించి ఆదరించుట లేదని అతడు భావించవచ్చును. ఇట్టి వ్యక్తిలో హృదయములో అనేక ఖేదములు, పశ్చాత్తాపములు ఉండవచ్చును. వాటి వలన అతడు పూర్తిగా నిరాశాగ్రస్తుడు కావచ్చును. అనగా, బుద్ధి వలన లభించే ఉపలబ్ధి, గొప్పదనము వ్యక్తి పరిణతుడగుటకు సరిపడదని అభిప్రాయము.

ఒక వ్యక్తి యథార్థంగా పరిణతి కలవాడై ఉండవచ్చును. కాని, ఆతడు బౌద్ధికమైన ఉపలబ్ధి కలవాడు కాకపోవచ్చును. ఒక వ్యక్తి తనతో తాను ఆనందముగా జీవించగల్గి, స్వభావతః అంతర్ముఖుడైనచో, ఆతనికి పరిణతి ఇంచుమించుగా నున్నట్లే. వేదము ఇట్టి వ్యక్తి కొరకు సన్న్యాస జీవనమును ఉపదేశిస్తుంది. గృహస్థుకొరకు ఉపదేశింపబడిన నిత్యకర్మలన్నిటినుండి సన్న్యాసి విధి విధానముగా విముక్తిని పొందును. వివిధ కర్మలను విధించిన వేదమే వాటి నుండి విముక్తిని కల్పించును. ఆత్మజ్ఞానమును సంపాదించుట కనుకూలముగా నుండే సన్న్యాస జీవనమునకు వేదము అభ్యనుజ్ఞను ఇచ్చియున్నది.

ఇట్టి అంతఃకరణ పరిణతిని నీవు పొందగోరితే, నీవు కర్మయోగిగా జీవించవచ్చును. కర్మయోగి కూడ సన్న్యాసి వలెనే ఆత్మజ్ఞానమును పొందుటకు యత్నించును. ఇదియే వేదసారము. గీతలో యోగమనగా, సన్న్యాసికి జ్ఞానయోగము, సన్న్యాసి కానివానికి కర్మయోగము అని యర్థము. రెండింటియందు ఆత్మజ్ఞాన సాధన సమానమే.

ఈ జ్ఞానము ఋషుల వద్ద, రాజుల వద్ద ఉన్నమాట వాస్తవమే. కాని ప్రజలందరు దీనిని పొందుతారనే నియమం లేదు. ఈ విషయమును శ్రీ శంకరులు ఈ శ్లోక భాష్యంలో ప్రస్తావించినారు. ఈ జ్ఞానము దుర్బలమైన హృదయము గల వ్యక్తులను చేరినపుడు నష్టప్రాయమగు నని (దుర్బలాన్ అజితేంద్రియాన్ ప్రాప్య నష్టం యోగం) వారు చెప్పిరి. ఈ జ్ఞానము సర్వదా లభ్యముగనే యుండెను. కాని, ప్రజల అనాదరము వలన అదృశ్యమాయెను (నష్టం). అంతరశక్తి లేనివారు, ఐకమత్యము లేనివారు, జితేంద్రియులు కానివారు (అజితేంద్రియాః) నగు వ్యక్తుల వద్దకు ఈ జ్ఞానము చేరినది. ఇట్టి వారిని చేరిన ఈ యోగము కూడ చెల్లాచెదరగును. అనగా, ఆ జ్ఞానమునకు వారిపై ఎట్టి ప్రభావము ఉండదు కనుక, అది నష్టప్రాయమగును.

ఈ శ్లోకంలో శ్రీ కృష్ణుడు 'స ఏవ' అను పదములను వాడెను. అనగా 'ఆ యోగమే', 'ఆ జ్ఞానమే' అని యర్థము. అంటే, ఈ జ్ఞానము సర్వకాలముల యందు ఉండేది అని శ్రీకృష్ణుడు అంగీకరించెను. ఈ ద్వివిధయోగముల జ్ఞానము కొత్తదేమీ కాదు. వాస్తవంలో జ్ఞానము యేదైనా కొత్తది కాదు. జ్ఞానము యేదైనా సర్వదా పురాతనము, శాశ్వతము. కొత్తగా కనుగొన్న విషయాలు కొత్తవిగా భాసిస్తాయి. కాని ఆవిష్కారములన్నీ ఎల్లవేళలా ఉన్నవే. వాటిని కనుగొనే వరకు అవి ఎవ్వరికీ తెలియవు గాన, కొత్తవి అనిపిస్తాయి.

ఉదాహరణకు, సూర్యుడు భూమికి సాపేక్షంగా కదుల్తూ ఉంటాడని మనం ఒకప్పుడు అనుకున్నాము. కదిలేది భూమియేనని మనకు ఒకనాడు తెలియదు. కాని, అప్పుడు కూడా భూమి సూర్యుని చుట్టూ తిరిగేది. భూమికి సాపేక్షంగా సూర్యుడు స్థిరంగానే ఉండేవాడు. ఇది ఒక సత్యము. మనకు తెలిసినా, తెలియకపోయినా, సత్యము సత్యమే.

అదే విధంగా, ఈ జ్ఞానము కూడా కొంంగ్రొత్తది కాదు. పురాతనమే. వస్తువు ఎంత సత్యమో, దాని జ్ఞానము కూడ అంతే సత్యము. ఆత్మ అనాది, అనంతము; ఆత్మజ్ఞానము కూడా అనాది, అనంతమే. ఇచట క్రొత్తగా సృష్టింపబడేది ఏదీ లేదు. శ్రీ కృష్ణ భగవానుడు సృష్ట్యాది యందు ప్రవర్తింపజేసిన యోగము, జ్ఞానము అనాది, అనంతము, శాశ్వతము, పురాతనము.

ద్వివిధ నిత్యత్వము

నిత్యత్వము ద్వివిధము ----- ప్రవాహ నిత్యత్వము, పారమార్థిక నిత్యత్వము. కాలమున కతీతమైనది పారమార్థిక నిత్యత్వము. ప్రతికల్పములో సృష్ట్యాదియందు ప్రారంభమయ్యేది ప్రవాహ నిత్యత్వము. వేదము కాలాతీతము కాదు. కాన, వేదము యొక్క నిత్యత్వము ప్రవాహ నిత్యత్వము.వేదములోని జ్ఞానము ప్రతి సృష్ట్యాది యందు ప్రారంభమగును. ఈ జ్ఞానము కాలమునకు బద్ధమై యుండును. ఈ తీరున, వేదముల నిత్యత్వము ప్రవాహ నిత్యత్వమే.

ఈ ప్రవాహ నిత్యమగు జ్ఞానము ఇతఃపూర్వమే అర్జునునకు ఏల ఈయబడలేదు? శ్రీ కృష్ణునకు ఈనాటి వరకు అట్టి ఉత్సాహము లేకుండెను; ఈ రోజు మాత్రమే అర్జునునకు బోధించాలనే ఉత్సాహము ఆయనకు కలిగెను అని భావించుట సరిగాదు. ఈ నాటి వరకు అర్జునుడు ఈ జ్ఞానము నుపదేశింపుమని కోరలేదు. అందువలననే శ్రీ కృష్ణుడు మిన్నకుండెను. ఉపదేశింపక పోవుట కిదియే కారణము. అర్జునుడు కోరిన వెంటనే, ఆ సమయంలో యుద్ధరంగం మధ్యలో ఉన్నా, శ్రీ కృష్ణుడాతనికి ఉపదేశించెను.

శ్రీ కృష్ణుడు ఈ జ్ఞానమును ద్వితీయ, తృతీయ అధ్యాయములలో నిరూపించెను. దీనిని ఆయన అర్జునునకు ఒకే రోజులో బోధించినట్లు (తే అద్య ప్రోక్తః) వ్యాసుడు వర్ణించెను. కాని, గీతను అధ్యయనము చేయు విద్యార్థులకు ఈ భాగమును చదువుటకు

కొన్ని నెలలు పట్టును. వాస్తవంలో, గీతను పూర్తిగా పారాయణ చేయుటకు మూడు గంటలు మాత్రమే పట్టును. శ్రీ కృష్ణుడు ఈ శ్లోకముల రూపములో బోధించలేదనియు, శ్లోకములను కూర్చినవాడు వ్యాసుడనియు మనము మరువరాదు. శ్రీ కృష్ణునకు జ్ఞానమును శ్లోకరూపములో బోధింపదగిన ఆవశ్యకత లేదు. వ్యాసుడు శ్రీ కృష్ణుని ఉపదేశమును శ్లోకరూపముగా కూర్చి, మహా భారతాంతర్గతము చేసెను.

వ్యాసుడు వేద విజ్ఞానములో దిట్ట. కాన వేదసారమును గీతా రూపముగా ప్రదర్శించే అర్హత ఆయనకు గలదు. గీతను రచించుటకు ఆయనకు శ్రీకృష్ణుడు ఉపదేశించ వలసిన ఆవశ్యకత లేదు. శ్రీకృష్ణుడు ఉపదేశించి ఉండకపోయిననూ, మనము వ్యాసుని బ్రహ్మ సూత్రములను వలె, వ్యాసుని గీతను కూడ పఠించి యుండెడి వారము. మనము చదువుటకు వ్యాసుని గ్రంథము సరిపడియుండెడిది. వాస్తవంలో మనం చదివేది శ్రీకృష్ణునిచే రచింపబడిన తత్త్వ శాస్త్రము గాదు; లేదా, షోపెన్ హావర్, హెగెల్ ఇత్యాది పాశ్చాత్య తత్త్వవేత్తల రచనల వంటిది గాదు. మనము వేదమును అధ్యయనం చేస్తున్నాము. మనముందు ఉన్నది వేదము. ఈ జ్ఞానము మనకు ఋషి పరంపరలో సంప్రాప్తమైనది.

మంచి సలహాను ఇచ్చినపుడు, వ్యక్తులు తరుచుగా ఇల్లా అంటారు ----- ఈ సలహాను నీవు నాకు ఇంతకు ముందే యేల చెప్పలేదు? నేనీ విషయంలో ఎన్నో రాత్రులు నిద్ర లేకుండా గడిపేను!. వాస్తవంలో, జనులు నిద్ర లేని రాత్రులు గడిపిన తరువాతనే సలహాయొక్క విలువను గ్రహించగల్గుతారు! అర్జునుడు అడవిలో నుండగా, కూర్చుని చర్చించుటకు ఎంతో సమయముండెడిది. అప్పుడు ఈ జ్ఞానము నేల ఉపదేశించలేదని అర్జునుడు శ్రీ కృష్ణునితో నిష్ఠురముగా మాటలాడగోరి యుండవచ్చును. ప్రస్తుతం వారిద్దరు యుద్ధరంగంలో రెండు సేనల మధ్య చిక్కుకొని యున్నారు. వారి చుట్టూ రణ గొణధ్వని, ధూళి, యుద్ధాశ్వముల గడబిడ, రథములు, ఏనుగులు, పదాతి దళము, శంఖములు, దుందుభులు ఇత్యాదులు నిండియున్నవి. సర్వత్ర సేనాధిపతులు బిగ్గరగా ఆదేశముల నిచ్చుచుండిరి. వేదాంతమును, అనంత తత్త్వమును చర్చించుటకు ఇది అనుకూల వాతావరణము కాదని వేరే చెప్పనక్కరలేదు.

మన వద్ద అనంతకాలం ఉంటే, మనం అనంతుని గురించి చర్చించ గల్గుతాము. పనుల ఒత్తిడి లేకుండా నదీ తీరాన కూర్చుని చర్చించాలి. లేదా, సేవానివృత్తి తరువాత,

ఉద్యోగానికి వెళ్లనక్కరలేదు గనుక, అప్పుడు చర్చించాలి. పాండవులు పదమూడు సంవత్సరముల నిర్వాసము నుండి కొద్దిరోజుల క్రితమే తిరిగి వచ్చేరు. వారు పన్నెండేళ్లు అడవిలో గడిపేరు. శ్రీ కృష్ణుడు ఉపదేశించటానికి అది చాలా అనువైన కాలమని అర్జునుడు తలపోసి ఉండవచ్చును. పన్నెండేళ్ల కాలంలో అర్జునుడు ఆ జ్ఞానమును తేలికగా సంపాదించ గల్గి యుండెడివాడు.

ఎట్టి జ్ఞానమునైననూ సంపాదించుటకు పన్నెండేళ్లు సరిపడును. జ్ఞానోదయమగుటకు గురుగ్రహము యొక్క ప్రభావము ప్రముఖమైనదని చెప్తారు. రాశి చక్రములో గురువు ఒక రాశి నుండి మరియొక రాశిలోనికి వచ్చుటకు పన్నెండేళ్లు పట్టునని చెప్తారు. అర్జునునకు దీని కోసమేనా యన్నట్లు సరిగ్గా పన్నెండేళ్ల కాలము లభించెను. వాస్తవంలో, ఈ నిర్వాసము అతనికి దేముడిచ్చిన వరము వంటిది. ఆ సమయంలో శ్రీ కృష్ణుడాతనితో ----- కూర్చుని, నా మాటలను ఆలకింపుము. నేను నీ కొరక జ్ఞానమును ఉపదేశించెదను. నీవు శోకింపదగని వారిని గూర్చి శోకిస్తున్నావు (అ శోచ్యాన్ అన్వ శోచస్త్వమ్) ఇత్యాది ఉపదేశించి యుండవలసినది.

ఆత్మ జ్ఞానము సర్వోత్కృష్ట రహస్యము

పరిసరములు మరింత సానుకూలముగా నున్నపుడు శ్రీ కృష్ణుడు నాకు యేల బోధించలేదు? అను ఆ శంకను అర్జునుడు బహిర్గతము చేయకపోయినా, శ్రీ కృష్ణుడు దానికి బదులిడెను. ఇది ఒక విశిష్ట జ్ఞానము; రహస్యము. పైగా, మామూలు రహస్యం కాదు. ఉపనిషత్ అను పదమునకు కూడ రహస్యము అని యర్థము గలదు. ఆత్మజ్ఞానము రహస్యములలో కెల్లా ఉత్తమ రహస్యము. నీవు ఒక వ్యక్తికి ఆ రహస్యమును వందసార్లు బోధించిన తరువాత కూడ అతడు ఆత్మ యనగా నేమి? అని ప్రశ్నించే అవకాశము గలదు.

రహస్యము ద్వివిధము. ఒక విషయము గలదు. అది నీకు గోచరించేదే కాని, అది నీకు కనబడకుండా, వినపడకుండా చేస్తే చాలు. అది నీకు తెలియదు. ఇది ఒక రకం రహస్యము. అది నీకు తెలియకుండా చేసేరు. రెండవరకం రహస్యం నీకు కనబడుతూనే ఉంటుంది. నీవు దానిని తెలుసుకోవాలనుకుంటే, తెలుసుకోవచ్చును. అయినా, అది నీకు తెలియదు. కావ, అది రహస్యంగా మిగిలిపోతుంది. వేదాంతమనే రహస్యంలో ఈ రెండు

లక్షణాలు కూడా ఉన్నాయి. నీకు వేదాంతం గురించి తెలియదు. కాన, నీ ఆత్మ నీకు రహస్యంగా మిగిలిపోతుంది. అంతేగాక, నీవువేదాంతమును వినినప్పటికీ, నీలో యోగ్యమగు మానసిక సంసిద్ధత లేని కారణంగా, అది రహస్యంగానే ఉండిపోతుంది.

తాము అయోగ్యులమని, పరిచ్ఛిన్నులమని కొందరు భావిస్తారు. ఈ భావన వారిలో దృఢంగా ఉంటుంది. వారి చుట్టూ ఉండేవారు కూడా ఇదే భావనను బలపరుస్తూ ఉంటారు. ఇట్టి వ్యక్తులు వేదాంతముచే ప్రదర్శింపబడే సత్యమును తేలికగా తెలుసుకొనలేరు. ఈ విధంగా తలపోయు వ్యక్తిని ఉద్దేశించి, అతడు లేక ఆమె సత్య, జ్ఞాన, అనంత, సర్వకారణ పూర్ణ తత్త్వమని బోధించినచో, ఆ వ్యక్తి పూర్తి అయోమయంలో పడిపోతాడు. ఆ వ్యక్తికి ఇంకో కొత్త సమస్య ఉత్పన్నమవుతుంది: నేను సత్యమునే అయితే, అయోగ్యుడననే భావన యేల కలిగినది? నేను తలచిన దాని కంటె ఎక్కువ అయోగ్యుడనై ఉంటాను! అని అతడు భావించవచ్చును. ఆత్మను తెలియుట చాల కష్టము. అందువలననే, ఈ కొత్త సమస్య ఉదయించింది.

ఈ జ్ఞానమును తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదము కూడ గలదు. అందువలననే, ఇది జన బాహుళ్యమునకు దూరముగా నుంచబడినది. ఒకవేళ ఇది అందరికీ ఉపలభ్యమైనా, అర్థం చేసుకోరు. ఉదాహరణకు, వేదమును, దానిలోని ఉపనిషత్తులను అధ్యయనం చేసి, పారాయణ చేసేవారికి ప్రాయశః దాని అర్థం తెలియదు. ఇట్టివారికి, సత్యమును తెలిపే పదములు ఉపలభ్యములే. కాని వాటిలోని జ్ఞానము వారికి దూరమే. కావున, ఈ జ్ఞానము ఉత్తమ రహస్యము. ఈ విధంగా, ఒకచో లభ్యముగాక, మరియొకచో లభించినా అర్థం గాక, ఈ జ్ఞానము పరమ రహస్యముగా మిగిలిపోవుచున్నది.

జిజ్ఞాసువునకు మాత్రమే జ్ఞానము నీయవలెను

ఇతః పూర్వములో అర్జునునకి జ్ఞానమునందు అభిరుచి లేకుండెను. శ్రీ కృష్ణునకి సంగతి తెలియును. అందువలననే, ఆయన అర్జునునకు ఉపదేశించలేదు. ఒకచో ఆయన ఉపదేశించినా, అర్జునుని దృష్టిలో ఆ ఉపదేశానికి విలువ ఉండేది కాదు. ఇట్టి జ్ఞానమును జిజ్ఞాస గలవానికి మాత్రమే ఈయవలెను.

'సమస్య గలదు' అని యెరుంగని వానికి పరిష్కారమును చూపుట వ్యర్థము. అట్టి వ్యక్తికి అతడు గుర్తించని మౌలిక సమస్య ఒకటి గలదని మనము సూచనప్రాయముగా తెలుపవచ్చును. కాని 'సమస్య గలదు' అనే గుర్తింపు కలిగిన తరువాతనే, అతనికి పరిష్కారమునందు కొంతైనా అభిరుచి యేర్పడును.

సమస్య యొక్క ఉనికిని అర్జునుడు కూడా గుర్తించవలసి యుండెను. అనాటి సమాజములో ఏనోట విన్నా, వ్యాస శుకుల నామములు వినబడెడివి. అర్జునుడు ఒక విశిష్ట వాతావరణంలో పెరిగేడు. అర్జునుడు, అతని సోదరులు, దుర్యోధనాదులు పెరిగిన ప్రాసాదమునకు వ్యాసశుకాది మహాత్ములు తరుచు వస్తూ, పోతూ ఉండేవారు. కాబట్టి, ఈ జ్ఞానమును గురించి వినే అవకాశాలు అతనికి ఎన్నో లభించు ఉండుట సహజము. కాని, రాజకుమారుడగు అర్జునుని మనస్సు, రాజకుమారునకు ఉండదగిన కౌశలములు, ఉపలబ్ధులు, మాన మర్యాదలపై నుండెడిది. ఇవి అన్నీ కూడా అవశ్యకములే; యోగ్యమైనవే.

పన్నెండేళ్ల వనవాసంలో కూడా అర్జునుని దృష్టి ప్రముఖంగా అస్త్రములను సంపాదించి, భద్రపరుచుకొనుట, రాజ్యమును తిరిగి సంపాదించుటకు ఆవశ్యకమయ్యే వివిధ కౌశలములు ఇత్యాదులపై నుండెడిది. అర్జునునకు, రాజ్యమును సంపాదించుట అనే కార్యమునందు మాత్రమే ఏకాగ్రత, తీవ్రమగు ఇచ్ఛ ఉండెడివి. కాని, ఇప్పుడు యుద్ధరంగంలో అతని ఈ అభిరుచులన్నీ కరిగి మాయమయ్యెను. తాను సంపాదించిన శస్త్రాస్త్ర సంపద సర్వమూ వినాశము కొరకు మాత్రమే ఉద్దిష్టమైనది గనుక, అది అంతా వ్యర్థము అనే భావన అతనికి కలిగినది.

అర్జునుడు ధర్మమునకు కట్టుబడి జీవించెను. మంచిచెడుల తేడాను తెలుసుకొనగలిగే వివేకము అతనికి ఉండెడిది. అతనియందు దయాగుణము కలదు. అందువలననే, యుద్ధములో జరిగే వినాశము తలపుకు రాగానే, అతనికి యుద్ధమునందలి ఆసక్తి తొలగిపోయెను. మల్లయుద్ధంలో సర్వశ్రేష్ఠుడగు వ్యక్తిని నిర్ణయించే పోటీ కొరకు ఒక మల్లుడు ఆరుమాసాలు నిరంతరం అభ్యాసం చేసేడనుకో. ఆరుమాసాలు ప్రతిరోజు రోజంతా అతడు పరుగెత్తుట, పుష్టికరమగు ఆహారమును భుజించుట, వ్యాయామము, మల్లయుద్ధ సాధనములతో అభ్యాసము ఇత్యాదులను చేసేడు. ఇంతేగాక, అతడు మల్లయుద్ధమును అభ్యాసం చేసే ప్రక్రియలో భాగంగా, సహచరులందరితో యుద్ధమును

చేసి, వారిని ఓడించేడు. దీనికంతకు అతనికి పదిలక్షల రూపాయల ఖర్చు అయినది. నిర్ణాయకమగు పోటీ జరిగే సమయం రానే వచ్చింది. సహచరులు సమధికోత్సాహంతో సమర్థిస్తూ ఉండగా, అతడు యుద్ధరంగంలోకి దిగేడు. ఎదురుగా నున్న ప్రత్యర్థిని చూచి, హఠాత్తుగా దయ కలిగి, యుద్ధమును విడిచి వెళ్లిపోయేడు. అర్జునుని పరిస్థితి యిది.

ఆ మల్లుడు చేసినది మంచి పనియే కావచ్చును. కాని, అతని ప్రత్యర్థి అతని ప్రవర్తనను సరియగు దృష్టికోణంలో చూడడు. "ఈతడొక వెర్రివాడు. నాకేసి ఒక్కసారి చూచేడు. అంతే పారిపోయేడు" అని అతడు గొప్పలు చెప్తాడు. అతని శిక్షకునితో సహా అందరూ అదే మాట అంటారు. ఇతడు మల్ల యుద్ధము నుండి విరమించుకున్న కారణంగా, ప్రత్యర్థి సర్వోత్తమ స్థానమును పొందును.

అర్జునుని సమస్య సరిగా ఇదియే. అతడు దయవలన యుద్ధం మానుకోవాలనుకున్నాడు. కాని, భయం వలన కాదు. తాను యుద్ధం చేయాలా, మానాలా అను నిర్ణయమును తీసుకోవలసిన సమయమాతనికి ఆసన్నమైనది. అతడు సహజంగానే అయోమయంలో పడ్డాడు.

వస్తు నిష్ఠమగు నిర్ణయము సర్వదా హితకారి యగును.

నీకొక సమస్య వచ్చినదనుకో. ఆ సమస్యలో అనేక అంశములు గలవనుకో. నీవు వాటినన్నిటినీ పరిగణనలోనికి తీసుకోవాలి. అపుడే ఒక నిర్ణయానికి రావాలి. అట్టి స్థితిలో, ఆ సమస్యలో సమ్మిళితుడు కాని వ్యక్తి యొక్క అభిప్రాయము చాల సహాయకారి యగును. నీవు పరిష్కరించవలసిన సమస్యను పరిశీలించుటలో నీ బుద్ధి కంటె అతని బుద్ధి అధికముగా వస్తు నిష్ఠముగ నుండే అవకాశము గలదు.

అర్జునుడు మనసు విప్పి మాటలాడగలిగే వ్యక్తి శ్రీ కృష్ణుడు. అర్జునుడు తన జీవితములో ఎన్నో విజయాలను సాధింపబూనుకున్నవాడే. ఎన్నో విజయాలను పొందినవాడే. విజయమంటే ఏమిటో అతనికి తెలియనిది కాదు. కాని, అతడు జీవితము యొక్క అర్థమును తెలియగోరెను. ఈ విజయము వలన నాకు లభించేదేమిటి? అసలు ఒకదాని నుండి మరియొకదానిని నేను ఎందుకు పొందాలి? ఈ ప్రశ్న జీవితానికి సంబంధించినది.

అర్జునుని ప్రశ్నలోని సారమిదియే. అర్జునుడు ఈ ప్రశ్నను ఇప్పుడే అడిగేడు. కాన, శ్రీ కృష్ణుడు జ్ఞానమును ఉపదేశించే అవసరము సంప్రాప్తమైనది.

ఈ జ్ఞానం అడిగిన వారికి లభిస్తుంది. కాని, ముందుగా అడగాలి. ఈ జ్ఞానము ప్రజలకు దూరముగా ఉన్న విధము ఇంతే. కొద్దికాలం క్రితం వరకు వేదాంతం మాట ఇంచుమించు వినబడేది కాదు. గడచిన వంద సంవత్సరాల కాలంలో మాత్రమే వేదాంతం విస్తారంగా లభిస్తోంది. మరియు, ఇప్పుడు చలామణిలో ఉన్న అనువాదాలలో చాలా భాగం తప్పుడు ధారణలకు దారి తీసేవిగా ఉన్నాయి. వీటి వలన వేదాంతం గురించి లోకంలో ఉన్న భ్రాంతులు ఇంకా పెరిగేయి.

వేదాంతము సామాన్యమగు విషయ వస్తువు కాదు. దానిని అపార్థం చేసుకొనుట చాల తేలిక. సామాన్య ప్రజలకు దానియందు అభిరుచి తక్కువగా ఉంటుంది. ఈ కారణాల వలన అది ప్రజలకు దూరంగా ఉంచబడినది. వేదాంతంలోనికి తప్పుడు విధానంలో ప్రవేశించుట కంటె, దాని గురించి ఎట్టి అవగాహనయూ లేకుండగా శ్రవణం చేయుట శ్రేష్ఠము. అట్లు గానిచో, నీవు నీ అవగాహనను పూర్తిగా మార్చుకోవలసి రావచ్చును. అట్లు మార్చుకొనుటలో చాల క్లేశము, దుఃఖము కూడ ఇమిడియుండును.

వేదాంతమును అందరికీ బోధించాలా?

వేదాంతమును బుద్ధిపూర్వకంగా ప్రజలకు దూరంగా ఉంచుట కూడా సరిగాదు. ఏలయన, అది ఒకటి ఉందనే సంగతి కూడా ప్రజలకు తెలియకుండా పోతుంది. అయిననూ, వేదాంత జ్ఞానము గల వ్యక్తికి జనసభలో వేదాంతమును గురించి ఉపన్యసించుట ఇబ్బంది అనిపిస్తుంది. ఆ సభకు వచ్చిన వారందరికి వేదాంతము అవసరము కాకపోవచ్చును; దానియందు అభిరుచి లేకపోవచ్చును. కొందరు ఆ సభలో ఏదో పొందుదామని వస్తారు. ఆ సభలో బోధింపబడ బోయేది ఏమిటో వారికి తెలియదు. అచట బోధించే విషయము వారికి ముందే తెలిస్తే, వారికి అచటకు రావలసిన అవసరమే ఉండదు. వారికి తెలియని పక్షంలో, ఎంతవరకు తెలుస్తుంది అనేది ఊహించడం కష్టమే.

మానసిక సంసిద్ధత లేని వ్యక్తులు వేదాంత బోధను తేలికగా అపార్థం చేసుకుంటారు. బోధన అయిన తరువాత వారు వేసే ప్రశ్నలను, ప్రకటించే అభిప్రాయాలను

గమనిస్తే మనకి సంగతి స్పష్టమైపోతుంది. ఇట్టి సందర్భాలలో బోధన వృథా అవుతుంది. ఇట్టి శ్రోతలు తాము బోధనను అపార్థంచేసుకోవటమే కాకుండా, వారితో సంభాషించే ఇతరులకు తమ తప్పుడు ధారణలను అందజేస్తారు. ఈ కారణంగా, అనేక ఆచార్యులు జనసభలో వేదాంతమును బోధించరు. తమ వద్దకు వచ్చినవారికి మాత్రమే బోధిస్తారు.

ఇట్టి స్థితిలో, ఆచార్యులు ప్రజలకు బోధించటం మానివేస్తే, వారికి వేదాంతమును గురించి తెలియుట యెట్లు? ఈ సందర్భంలో తమిళ ప్రాంతపు నానుడి ఒకటి గమనించదగ్గది. భారతీయులు ఉత్తరాయణ సంక్రమణానికి ముందు వచ్చే నెలను, ప్రార్థన మొదలగు ధార్మిక కార్యాలకు చాల ప్రముఖమైన కాలంగా పరిగణిస్తారు. ఈ నెలలో ఒక కుటుంబానికి చెందిన వ్యక్తి ఒకరు ప్రతిదినము తెల్లవారు జామున నాలుగు, ఐదు గంటల మధ్య చుట్టుప్రక్కల గ్రామాలలోని ప్రతి యింటికి వెళ్లి శంఖమును ఊదుతాడు. తరువాతి మాసంలో పంటలను కోసే సమయంలో ఆతడు మరల ప్రతి గృహానికి వెళ్లి ధాన్యమును వసూలు చేసుకుంటాడు. ఆ ధాన్యం అతనికి ఆ సంవత్సరానికి సరిపడుతుంది.

ఇతడు ప్రతి గృహం వద్ద తెల్లవారు జామున మాత్రమే శంఖమును ఊదవలసి యున్నది. కాని, అతడు తిరగాల్సిన గ్రామాలు చాలా ఉంటాయి. అంటే, మొదటి గ్రామం వద్ద పదకొండు గంటలకే బయలుదేరాలి! అపుడాతడు అన్ని గ్రామాలకు తిరుగుతాడు. ఒక గ్రామానికి, మరియొక గ్రామానికి మధ్యలో సుమారు ఒక గంట నడక ఉంటుంది. అంటే, ఇతడు రాత్రి 12 గంటలకు ఒక గ్రామమును, ఒంటి గంటకు మరో గ్రామమును ఈ విధంగా సంచరిస్తాడు. ఈ విధంగా తిరుగుతూ ఆఖరి గ్రామానికి వచ్చుసరికి ఉదయం నాలుగన్నర, లేక అయిదు అవుతుంది. అర్ధరాత్రి సమయంలో శంఖమునేల ఊదితివని ఎవరైనా ప్రశ్నిస్తే, "శంఖము నూదుట నా పని. నేను నా కర్తవ్యాన్ని చేస్తాను. ఉషస్సు దాని సమయంలో అది వస్తుంది" అని అతడు బదులిస్తాడు.

ఈ సంప్రదాయాన్ని బట్టి దక్షిణాది జిల్లాలలో 'శంఖనాదము' అనే నానుడి తరచుగా వినబడుతుంది. ఈ శంఖనాదము ఒక రకమైన ప్రార్థన. కరువు కాటకాలు, రోగాలు రాకుండా ఉండాలంటే, గ్రామాల ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలంటే, ఈ శంఖనాదము అవశ్యకమని ప్రజలు భావిస్తారు.

ఇదే తీరున, వేదాంతాచార్యుడు కూడా శంఖమును ఊదును. జ్ఞానోదయం దాని సమయంలో అది కలుగుతుంది. కొందరు వ్యక్తులలో ఈ శంఖనాదం రావలసిన సమయం కంటె ముందుగానే వస్తుంది కాబోలు! కాని, ఆచార్యుని మదిలో సంఘర్షణ ఏర్పడితే, 'నేను నా పని చేసేను. శంఖాన్ని ఊదేను' అని సరిపెట్టుకుంటే చాలును. లేదా, ఈ జ్ఞానము గల వ్యక్తి ఒకచోట ప్రశాంతంగా కూర్చుని, తన వద్దకు ఉపదేశించమని కోరి వచ్చినవారికి బోధిస్తే సరిపడుతుంది. వాస్తవంలో ఇదియే సరియగు పద్ధతి. ఏలయన, ఈ జ్ఞానము మామూలు జ్ఞానము కాదు. ఇది ఉత్తమ రహస్యము. దీనిని కోరిన వారికి మాత్రమే ఇచ్చుట శ్రేష్ఠము.

కావున, అర్జునా! ఈ జ్ఞానమును నేను నీ నుండి దాచితిని. కాని, నీవు నన్ను నిందించవలదు. నీవు నన్ను కోరలేదు. అందువలననే, నేను దాచిపెట్టితిని అని శ్రీ కృష్ణుడు అర్జునునితో చెప్పియుండవచ్చును. అపుడు అర్జునుడు, 'అది సరే; ఈ రోజు నాకు ఉపదేశింప నిర్ణయించుటకు కారణమేమి?' అని ప్రశ్నించి యుండవచ్చును. నీవు నా వద్ద శిష్యరికమును స్వీకరించి, ఉపదేశింపుమని కోరితివి గాన అని శ్రీ కృష్ణుని సమాధానము.

శ్రీ కృష్ణుడు అర్జునుని తన శిష్యునిగా, భక్తునిగా స్వీకరించెను. తాను ఒక మిత్రుని పోగొట్టుకొని, గురువును పొందినానని అర్జునుడు భావించి యుండవచ్చును. తరుచు ఇట్లు జరుగుతూ ఉంటుంది. ఇద్దరు యువతీ యువకులు పరస్పరం మాటలాడుకుని, వివాహమాడాలని నిర్ణయించుకుంటారు. వారిలో ఒకరికి భార్య, మరియొకరికి భర్త లభిస్తారు. కాని ఇద్దరూ మిత్రుని కోల్పోతారు. వివాహమగునంతవరకు, ఒకరికి మరియొకరు మంచి మిత్రులు. వివాహం కాగానే, మైత్రి మాయమవుతుంది. ఇది చాల దురదృష్టకరమగు పరిణామము. ఏలయన, భార్యాభర్తల మధ్య మైత్రి దృఢముగా కొనసాగాలి.

కాని, తమ మధ్య గల మైత్రి తొలగిపోలేదని అర్జునుని ఆస్వాదించుట కొరకై శ్రీకృష్ణుడు, నీవు నా భక్తుడవు మాత్రమే గాదు; మిత్రుడవు (సఖా) కూడా అని చెప్పెను. ఈ తీరున, అర్జునునకు ద్విగుణిత లాభము కలిగెను. అతనికి ఆచార్యుడు లభించుటయే గాక, శ్రీకృష్ణునితో పూర్వమునందు వలె, మైత్రీ భావముతో మాటలాడుటను కొనసాగించవచ్చును. నీవు నా మిత్రుడవు (మే సఖా అసి) అని శ్రీకృష్ణుడు చెప్పినప్పుడు, ఆయన ఈశ్వరుని వలె గాక, శ్రీకృష్ణుని వలె మాటలాడినాడు. వారి మధ్య స్నేహము కొన్ని సంవత్సరములకు మాత్రమే పరిమితమైనది గదా! అది పురాతన స్నేహము కాదు. కాని,

'నీవు నా భక్తుడవు (భక్తోసి మే)' అని శ్రీకృష్ణుడు అన్నప్పుడు, ఆయన ఈశ్వరుని రూపములో గురుస్థానము నుండి పలికెను.

ఇదే విషయములో అర్జునునకు ఒక సందేహము కలిగెను. ఇదే సందేహము చాలమంది వ్యక్తుల మనస్సులలో కూడ ఉండును. దాని నివృత్తి కొరకై అర్జునుడు ప్రశ్నించెను. శ్రీకృష్ణుడు సాక్షాత్తు శ్రీమహా విష్ణువే యని అర్జునుడు వినియుండెను. శ్రీకృష్ణుడు భగవాన్ నారాయణుడేనని ఆతనికి నిశ్చయముగా తెలియును. శ్రీకృష్ణుడు ప్రదర్శించిన మహిమల నాతడు దర్శించెను. కాన, ఆతనికి శ్రీకృష్ణుని మాహాత్మ్యము తెలియనిది కానే కాదు. శ్రీకృష్ణుడు సాక్షాత్తూ శ్రీ మహా విష్ణువే యని ఇతరుల నుండి వినిన అర్జునుడు, ఆ సంగతిని శ్రీకృష్ణుని నోటినుండి వినగోరెను కాబోలు! శ్రీకృష్ణుడు సాక్షాత్తు భగవానుడే యను సత్యము నెరుంగని వారి మనస్సులలోని శంకలను తొలగించుట కొరకు మాత్రమే అర్జునుడీ ప్రశ్నను వేసెనని శ్రీశంకరులు తమ భాష్యములో అభిప్రాయపడిరి.

అర్జునుడీ విధముగా ప్రశ్నించెను:

అధ్యాయము 4, శ్లోకము 4

अर्जुन उवाच

अपरं भवतो जन्म परं जन्म विवस्वतः ।
कथ मेतद्विजानीयां त्वमादौ प्रोक्तवानिति ॥ ४॥

అర్జున ఉవాచ

అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః
కథ మేతద్విజానీయాం త్వమాదౌ ప్రోక్తవానితి (4)

అర్జునః = అర్జునుడు; ఉవాచ = పలికెను.

భవతః = నీ యొక్క; జన్మ = జన్మ; అపరం = కొద్దిరోజుల క్రితంలోనిది; వివస్వతః = వివస్వానుని; జన్మ = జన్మ; పరం = పురాతన కాలములోనిది; త్వం = నీవు;

ఆదౌ = సృష్ట్యాది యందు; ప్రోక్తవాన్ = చెప్పియుంటివి; ఇతి = అనే; ఏతత్ = ఈ విషయమును; కథం = ఎట్లు; విజానీయాం = నేను తెలియవలెను?

> నీవు కొద్దికాలం క్రితం జన్మించితివి. వివస్వానుని జన్మ పురాతన కాలములోనిది. సృష్ట్యాది యందు నీవు దీనిని (వివస్వానునకు) బోధించితివని నేను యెట్లు తెలియవలెను? (4)

తాని జ్ఞానమును వివస్వానునకు ఇచ్చితినని శ్రీకృష్ణుడు నాల్గవ అధ్యాయము మొదటి శ్లోకములో చెప్పెను. శ్రీకృష్ణుడు వివస్వానుని కంటె చాలాకాలం తరువాతి వాడు గనుక, ఈ మాట అసంగతముగా భాసించును. అర్జునునకు శ్రీకృష్ణుని పుట్టిన తేదీ ఖచ్చితముగా తెలియును. వారిద్దరూ సమకాలీనులు. శ్రీకృష్ణుని తల్లి యగు దేవకి, తండ్రి యగు వసుదేవుడు కారాగారమునందు బంధితులై యుండగా, శ్రీకృష్ణుడు అచటనే జన్మించెను. కాన, శ్రీకృష్ణుని పుట్టిన తేదీ, స్థలముల విషయంలో అర్జునునకు సందియమేమీ లేదు. ఈ గాథ అంతయూ అర్జునునకు విదితమే. కాగా, వివస్వానుడు చాల కాలం క్రితం సృష్టితో బాటు జన్మించెను (పరం జన్మ వివస్వతః). ఇట్టి స్థితిలో, ఓ శ్రీకృష్ణా! నీవు వివస్వానునకు బోధించితివన్న మాట యెట్లు పొసగును? అని అర్జునుని ప్రశ్న.

ఇది యేమి ప్రశ్న! ఓ శ్రీ కృష్ణా! నీవు వివస్వానునకు బోధించి యుండజాలవు! నీవా కాలములో అచట లేనే లేవు సుమా! అని అర్జునుడు చెప్పినట్లుండెను. శ్రీకృష్ణుడు భగవానుడే యన్న విషయము అర్జునునకు తెలియనట్లున్నది. శ్రీ శంకరులిట్లు వివరించిరి: నేను వివస్వానునకు బోధించితిని అని చెప్పిన శ్రీకృష్ణుడు అర్జునుని సమకాలీనుడగు శ్రీకృష్ణునిగా ఆ మాటను చెప్పలేదు. ఈ జ్ఞానమును లోకములో ప్రవర్తిల్లజేసిన భగవానునిగా మాత్రమే శ్రీకృష్ణుడు ఆ మాటను చెప్పెను.

శ్రీకృష్ణుడు వాస్తవముగా ఈశ్వరుడేనా? లేక, వ్యాసుడు ఆయనను ఈశ్వరునిగా చిత్రించినాడా? ఇది మనకు అనవసరము. గీతా రూపములో నున్న సంవాదమంతా శ్రీకృష్ణరూపములోనున్న ఈశ్వరునకు, అర్జునుడనే జీవునకు మధ్య జరిగినదని మనం తెలుసుకుంటే చాలును. గీత జీవునకు, ఈశ్వరునకు మధ్య జరిగిన సంభాషణ గనుకనే, దానికి జీవేశ్వర సంవాదము అని పేరు. శ్రీకృష్ణుడు ఈశ్వరుని అవతారము అనే పక్షంలో, ఈ సంవాదము శ్రీ కృష్ణ భగవానునకు, జీవుడగు అర్జునునకు మధ్య జరిగిన సంవాదము

అని స్వీకరించవచ్చును. అట్లు కాని పక్షములో గీతను ఒక ఆఖ్యాయికగా స్వీకరించవచ్చును. అనగా, వ్యాసుడు వేదములలోని జ్ఞానమును భగవానునకు, జీవునకు మధ్య జరిగిన సంవాద రూపముగా ప్రదర్శించెనని భావించవచ్చును.

ఒక నిర్దిష్ట దినమున జన్మించిన వ్యక్తిగా, శ్రీకృష్ణుడు తానే వివస్వానునకు బోధించితినని యెట్లు చెప్పగలడు? ఇదీ అర్జునుని సందేహము. శ్రీకృష్ణుడు ఈశ్వరుడేనని అర్జునునకు తెలియునని శ్రీశంకరులు విశ్వసించిరి. అట్లు గానిచో, యుద్ధమునకు ముందు, శ్రీకృష్ణుడు కావాలా? శ్రీకృష్ణుని సేన కావాలా? అనే వికల్పములు ఎదురైనపుడు అర్జునుడు శ్రీకృష్ణుని ఎన్నుకుని ఉండెడివాడు కాదు. నేను ఆయుధములను ధరించను. యుద్ధము చేయను. నేను కావాలా? నా సైన్యమంతా కావాలా? అని శ్రీకృష్ణుడు అర్జునుని అడిగెను. శ్రీకృష్ణుడు మామూలు కృష్ణుడే అని అర్జునుడు భావించి యున్నచో, యుద్ధ సమయంలో మరో వ్యక్తికి భోజనం ఏర్పాటు చేయుట తేలిక కాదు గనుక, శ్రీకృష్ణుని కోరియుండెడివాడు కాదు.

కాని, అర్జునుడు శ్రీకృష్ణుని కోరుకొనెను. దీనిని బట్టి శ్రీకృష్ణుని వాస్తవరూపము అర్జునునకు విదితమేనని శ్రీశంకరులు విశ్వసించిరి. అర్జునుడు తన సంతృప్తి కొరకు, శ్రీకృష్ణుని గురించి తెలియని వారి కొరకు ఈ ప్రశ్నను వేసెను. ఈ విధంగా, నాల్గవ అధ్యాయమును ప్రారంభించుటకు అవశ్యకమగు ప్రశ్నను అర్జునుడు వేసెను. ఈ ప్రశ్న లేనిచో, శ్రీకృష్ణుడు జ్ఞానమును ఉపదేశించి, దాని మహిమను కొనియాడుట పూర్తి అయినది గనుక, గీత పూర్తి అయి ఉండెడిది.

శ్రీకృష్ణుడీ ఉపదేశమును ఇంతకుముందు రెండవ అధ్యాయములో కూడా ముగించెను. కాని, అచట ఆయన అర్జునుని వద్ద నుండి ఒక ప్రశ్న వస్తుందని ఆశించినట్లు కనబడుతుంది. శ్రీకృష్ణుడు సర్వోత్తమ ఆచార్యుడు. కాని, అర్జునుడు ఆ సమయంలో ప్రశ్నించి ఉండకపోతే, ఆయన రెండవ అధ్యాయం ఆఖరి శ్లోకమును ఉపసంహారముగా గుర్తించి, విరమించి యుండెడివాడు.

కాని, అర్జునుడు ఒక ప్రశ్నను వేసినాడు; జ్ఞానము కర్మ కంటె శ్రేష్ఠమైనది అయినచో, నీవు నన్ను ఘోర కర్మ యందు ఏల నియోగించుచుంటివి? (3-1). దీనికి

సమాధానముగా, శ్రీకృష్ణుడు మరల బోధించుట మొదలిడెను. ఆయన పునః తన బోధనను మూడవ అధ్యాయములో పూర్తి చేసి, ఆ జ్ఞానమును స్తుతించెను. అపుడు అర్జునుడీ ప్రశ్నను అడిగెను.

అధ్యాయము 4, శ్లోకము 5

श्री भगवानुवाच

बहूनि मे व्यतीतानि जन्मानि तव चार्जुन ।
तान्यहं वेद सर्वाणि न त्वं वेत्थ परंतप ॥ ५ ॥

శ్రీ భగవానువాచ

బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున
తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరంతప (5)

శ్రీ భగవాన్ = శ్రీ భగవానుడు; **ఉవాచ** = పలికెను; **పరంతప** = శత్రువులను తపింపజేయు వాడా!; **అర్జున** = ఓ అర్జునా!; **మే** = నాకు; **చ** = మరియు; **తవ** = నీకు; **బహూని** = అనేకములగు; **జన్మాని** = జన్మలు; **వ్యతీతాని** = గడిచినవి; **అహం** = నేను; **తాని** = వాటిని; **సర్వాణి** = అన్నింటిని; **వేద** = యెరుంగుదును; **త్వం** = నీవు; **న వేత్థ** = యెరుంగవు;

శ్రీ భగవానుడు పలికెను:

> శత్రువులను తపింపజేయు ఓ అర్జునా! నాకు, నీకు కూడా అనేక జన్మలు గడిచినవి. నేను వాటి నన్నిటినీ యెరుంగుదును. కాని, నీవు యెరుంగజాలవు (5).

సృష్ట్యాది యందు శ్రీకృష్ణుడింకనూ జన్మించనే లేదు. ఆయన వివస్వానునకు బోధించెననుట యెట్లు పొసగును? అని అర్జునుడు పూర్వశ్లోకములో ప్రశ్నించెను. ఆ ప్రశ్నకు శ్రీకృష్ణుడు సమాధానమునీ శ్లోకములో చెప్పెను.

నీకు, నాకు కూడా ఈ జన్మకు ముందు అనేక జన్మలు గడిచినవనియు, కాని, నేను వాటినన్నిటినీ స్మరించగల్గుదుననియు, నీవు స్మరింపజాలవనియు, ఇదియే నీకు నాకు గల తేడా అనియు శ్రీకృష్ణుడు అర్జుననితో చెప్పెను. ఈ ప్రకరణంలో శ్రీకృష్ణ భగవానుడు ఈశ్వరుని స్థానంలో ఉండి మాటలాడుచుండెను: ఈశ్వరుడనగు నాకు అనేక జన్మలు గడిచినవి. నేను వాటినన్నిటినీ స్మరించగల్గుదును. ఓ అర్జునా! జీవుడవగు నీకు కూడా అనేక జన్మలు గడిచినవి. కాని, నీవు వాటిని స్మరింపజాలవు.

అర్జునుడు జీవుడు. కావున, అతడు సహజముగనే ధర్మాధర్మములు, పుణ్యపాపములు అనే పూర్వ జన్మకర్మల నుండి ఉద్భూతమయ్యే అంతఃకరణము చేత ప్రతిబంధితుడై యుండును. అతడు స్వీయకర్మఫలరూపంగా, పరిచ్ఛిన్నములగు మనస్సు, ఇంద్రియములతో కూడిన దేహమునందు ప్రవేశించినాడు. కావున, అతని జ్ఞానశక్తి పరిమితముగా నుండుట సహజమే. కావుననే, 'నేను వివస్వానునకు బోధించితిని' అనే శ్రీకృష్ణుని వచనము యొక్క తాత్పర్యము నాతడు తెలుసుకొనలేకపోయెను.

అర్జునుడు కర్మఫలమగు జన్మను పొందెను. కాని శ్రీకృష్ణుడట్లు గాదు. వారిద్దరికీ మధ్యగల తేడా యింతేనని శ్రీకృష్ణుడు వివరించెను. మరియు, ఈ సత్యము శ్రీకృష్ణునకు విదితము. కాని, అర్జునునకు కాదు.

శ్రీకృష్ణుడిట్లు చెప్పుచున్నాడని భావించవచ్చును: నేను నిత్య బుద్ధుడను. కాన, నేను దేహమును ధరించిన సమయమునందైననూ, ఏ కాలమునందైననూ, ఏ విధముగనూ బద్ధుడను గాను. ఓ అర్జునా! నీవు కూడ నిత్యబుద్ధుడవే. కాని, నీకు గల అజ్ఞానావరణముచే ఈ సత్యమును నీవు యెరుంగవు. కర్మ, దేహము, జన్మ ఇత్యాది బంధముల నుండి నేను సదా ముక్తుడను. కాని, నీవు ప్రస్తుతానికి జీవుడవు. నా జ్ఞానశక్తి అజ్ఞానముచే ఆవృతము కాలేదు. కాని, నీ జ్ఞాన శక్తి ఆవృతమైనది. ఇదంతా నీకు తెలియాలి. ఈ జ్ఞానమును పొందుట కొరకై నీకొక అంతఃకరణ మీయబడినది.

ఈ విధంగా, ఈ ప్రస్తుత జన్మను స్వీకరించుటకు పూర్వంలో తాను చేసిన కర్మల నన్నిటినీ తానెరుంగుదునని శ్రీకృష్ణుడు అర్జుననితో చెప్పెను. కాన, తాను ఈ జ్ఞానమును వివస్వానునకు ఉపదేశించితినని ఆయన చెప్పగల్గెను. ఈ ప్రసంగంలో శ్రీకృష్ణుని జన్మ ప్రస్తావనికి వచ్చింది. వాస్తవంలో జన్మ అనేది జీవునకు మాత్రమే వర్తిస్తుంది.

జీవుని జన్మకు హేతువు

పునః పునః జన్మించుట జీవుని స్వభావము. జీవుడు నిరంతరముగా జన్మించుచుండును. జీవుడు తనను కర్తగా స్వీకరించును గాన, కర్మకు అధీనుడై, తద్వారా పునర్జన్మకు పాత్రుడగును. జీవుడు తన స్వరూపమగు ఆత్మయాథార్థ్యమును గుర్తించలేనంత వరకు, జీవత్వ భావన నుండి బయటపడజాలడు. అతని అజ్ఞానమే అతని జీవత్వమునకు పునాది. ఈ తీరున, ఆత్మయందు జీవ స్థితి ఆరోపింపబడినది.

జీవుడనగా కర్మలను చేయువాడు (కర్తా), వాటి ఫలమును అనుభవించువాడు (భోక్తా). నీవు ఒక క్షణంలో కర్తవు; మరుక్షణం భోక్తవు. ఈ చక్రం తిరుగుతూనే ఉంటుంది. జీవత్వములో పరిచ్ఛేదము ఇమిడియున్నది. అందువలననే, జీవుని యందు ఈ పరిచ్ఛేదభావనను అధిగమించాలనే ఇచ్ఛ ఉండును. ఇచ్ఛ ఉన్నచోట కర్మ, కర్మఫలము ఉండును. దృష్ట ఫలము, అదృష్టఫలము అని కర్మఫలము ద్వివిధము.

అదృష్టఫలము ఈ జన్మయందుగాని, లేక మరుజన్మలోగాని పక్వమునకు రావచ్చును. ఒక వ్యక్తి ఖాతాలో జమ అయిన అదృష్టకర్మ ఫలమువలన, అతడు మరల జన్మిస్తాడు. మరల కర్మల నాచరిస్తాడు. వాటికి మరల అదృష్టఫలము ఉండును. మరల ఆ వ్యక్తి జన్మించును. సంసారమనగా నిదియే. ఇది జీవునికి మాత్రమే వర్తించును.

దీనికి భిన్నంగా, ఈశ్వరుని యందు కర్తృత్వము ఉండదు. ఈశ్వరుడు సృష్టి స్థితిలయ కర్తయే అయినా, ఆయనలో అజ్ఞానము ఉండదు గాన, కర్తృత్వము ఉండదు. సృష్టించే సామర్థ్యము ఈశ్వరునకు ఒక శక్తి మాత్రమే. ఆయన ఈ శక్తిని వినియోగించి సర్వమును సృష్టించును. ఈశ్వరునకు తాను కర్తను కాదనే జ్ఞానము గలదు. కావున, ఆయన కర్తృత్వము నుండి విముక్తుడు. కావున, ఆయనలో ఫలభోక్తృత్వము కూడ ఉండదు. అటులనే, పునర్జన్మకు కారణమగు కర్మఫలము ఆయనను అంటదు. ఈశ్వరునకు ధర్మాధర్మములు, పుణ్యపాపములు, కర్మఫలము ఉండవు గాన, ఆయనకు పునర్జన్మ సంభవమే గాదు.

అర్జునుని ప్రశ్నకు శ్రీకృష్ణుడిచ్చిన ఉత్తరము అతనిని మరింత అయోమయంలో పడవేయగల్గియున్నది. వారిద్దరికీ పూర్వజన్మలు గలవు. వాటి గురించి శ్రీకృష్ణునకు

తెలియును. అనగా, ఆయన ఈశ్వరుడై ఉండాలి. కాని, ఈశ్వరునకు యెన్నడూ జన్మ లేదు. కాన, ఆయన ఈశ్వరుడైతే, ఎట్లు జన్మించగల్గియుండును? రాబోవు కొన్ని శ్లోకములలో శ్రీకృష్ణుడీ విషయమును సమగ్రముగా అర్జునునకు వివరించెను:

అధ్యాయము 4, శ్లోకము 6

अजोऽपि सन्नव्ययात्मा भूताना मीश्वरोऽपि सन्।
प्रकृतिं स्वामधिष्ठाय सम्भवाम्यात्ममायया ॥ ६ ॥

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానా మీశ్వరోఽపి సన్
ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవా మ్యాత్మ మాయయా(6)

అజః = పుట్టుక లేనివాడు; **అపి సన్** = అయిననూ; **అవ్యయాత్మా** = క్షీణించని జ్ఞానము గలవాడను; **భూతానాం** = ప్రాణులకు; **ఈశ్వరః** = అధీశుడను; **అపి సన్** = అయిననూ; **స్వాం** = నాదైన; **ప్రకృతిం** = ప్రకృతి (సృష్టికి మూలమైనది) ని; **అధిష్ఠాయ** = స్వాధీనము చేసుకుని; **ఆత్మ మాయయా** = నా యొక్క మాయ చేత; **సంభవామి** = జన్మించుచున్నాను.

పుట్టుక లేని వాడనే అయిననూ, క్షీణించని జ్ఞానము గలవాడను,
ప్రాణులకు అధీశుడను అయిననూ, నా ప్రకృతిని వశము చేసుకుని
మాయచేత జన్మించుచున్నాను. (6)

ఈ శ్లోకమును బట్టి శ్రీకృష్ణుని జన్మ చాల చిత్రమైనది యని మనకు తెలియుచున్నది. ఎన్నడూ జన్మ లేని యీశ్వరుడు జన్మించినట్లు కాన్పించును! మరియు, తాను క్షీణించని జ్ఞాన శక్తి గలవాడనని (అవ్యయాత్మా) శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పెను. అనగా, ఆయన యందు భ్రాంతి గాని, అజ్ఞానము గాని లేనే లేవని యర్థము. ఎన్నడూ జన్మయే లేని యీశ్వరునకు మరణము కూడ లేదని మనము చెప్పవచ్చును.

మరియు, ఆయన సర్వ ప్రాణులకు అధీశ్వరుడు. ఆయన సర్వప్రాణుల భోగము కొరకై బ్రహ్మాండము నంతనూ సృజించెను.

ఈ సృష్టి నియమములనన్నిటినీ ఆయనయే నిర్మించి, ప్రవర్తిల్ల జేసెను. కాన; ఆయన ఆ నియమములకు బద్ధుడు కాడు. మరియు, ఆయనయే జీవులకు కర్మఫలముల నిచ్చును (కర్మఫల దాత).

సూక్ష్మ ప్రపంచము, స్థూల ప్రపంచములతో సహా సృష్టికి అంతకూ ఉపాదానము (ప్రకృతి) ఈశ్వరుడే. మాయయే ప్రకృతి అయినది. ఈ మాయ ఈశ్వరుని కంటె భిన్నము కాదు. ఈ మాయను వినియోగించి, ఈశ్వరుడు జన్మించును. ఈ మాయకు ఒక వైపున ఈశ్వరుడగు శ్రీకృష్ణుడు, మరియొకవైపున అర్జునుడు ఉండిరి. కావుననే, అర్జునుడు భగవానుని యథార్థస్వరూపమును దర్శించలేకపోయెను. ఇది ఇంద్రజాలికుని ఇంద్రజాలము వంటిది. ఇంద్రజాలికుడు ప్రేక్షకులను ఎల్లవేళలా తన యెదుటనే ఉండనిచ్చును. వారు ఆతని ఇంద్రజాలమును మాత్రమే చూడగల్గుతారు. ఆతని హస్తలాఘవమును చూడజాలరు. ఇంద్రజాలికుడు తన హస్తలాఘవము యొక్క మాయలో తాను పడడని వేరె చెప్పనక్కరలేదు. అట్లుగానిచో, ఆతడు ఇంద్రజాలికుడు కానే కాడు.

నీవు జీవుడవు. మాయాంతర్గతుడవు. కాన మాయను నీవు నియంత్రించజాలవు. కాని, ఈశ్వరుడు మాయను తన వశములో నుంచుకొనును. ఈ విధముగా, మాయకు ఒకవైపున జీవుడు ఉండగా, మరియొకవైపున ఈశ్వరుడు ఉండును. జీవేశ్వరుల మధ్య గల భేదము ఇంత మాత్రమే. సర్వజగత్తునకు, జీవులకు ఆశ్రయమగు మాయ శ్రీకృష్ణునకు వశవర్తియై ఉండును. మానవులు ఈ మాయ యొక్క సమ్మోహమునకు లోనై, అజ్ఞానవశులై ఆత్మాభిన్నమగు శ్రీకృష్ణభగవానుని చూడజాలరు. జీవుడు పరమాత్మను చూడలేకపోయినా, మాయను వశము చేసుకున్న ఈశ్వరునకు అట్టి సమస్య లేదు. ఈ తీరున, ఈ సృష్టి అంతా మాయ.

ఈ ప్రకరణములోని సారాంశమిది: జీవునకు తన స్వరూపము తెలియదు. ఈ స్వరూప అజ్ఞానమునకే అవిద్యయని పేరు. కాని శ్రీకృష్ణుని సంగతి వేరు. నేను నా మాయను వశము చేసుకొని, జన్మను స్వీకరించిన వానివలె ఉన్నాను అని శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పెను. ఇదియే అవతారము యొక్క నిర్వచనము.

'అవతారము' అనగా క్రిందకు దిగువాడు అని యర్థము. అనగా ఈశ్వరుడు దేహమును ధరించినాడని యర్థము. ఈశ్వరుడు దేహమును ధరించిన వానివలె నున్నాడు.

ఈశ్వరుడు దేహధారియైననూ తన స్వరూప జ్ఞానమును కోల్పోడు. అనగా, దేహమే ఆత్మయనే భ్రాంతికి గురికాడు. అందువలననే, 'దేహమును ధరించిన వాని వలె' అని చెప్పబడినది. జీవన్ముక్తుడు కూడా ఆత్మ యాథార్థ్యమును యెరింగినవాడు గనుక, నేను దేహమును కలిగి ఉన్నవాని వలె ఉన్నాను అని చెప్పగల్గుతాడు. ఇట్లు చెప్పగలగాలంటే, వ్యక్తి జ్ఞానియై ఉండాలి. జ్ఞానము లభించాలంటే, జీవించి ఉండాలి. ఇందువలననే, ఇట్టి జ్ఞానము గల వ్యక్తిని జీవన్ముక్తుడు (జీవించి యుండగనే ముక్తుడు) అని అంటారు. ఈ జ్ఞానము కలిగేటంతవరకు, జీవుడు పూర్వజన్మల కర్మల వలన మాత్రమే ఈ ప్రపంచములో జన్మించును.

జీవుడు తన పూర్వకర్మల ఫలరూపముగా మనస్సు, ఇంద్రియములతో కూడిన ఒక దేహములో, ఒక కాలములో, ఒక దేశములో, ఒక తల్లికి, ఒక తండ్రికి జన్మించును. ఇట్లు జన్మించువాడే జీవుడనబడును. 'నేను పరబ్రహ్మను' అనే సాక్షాత్కారమును పొందగనే, జీవుడు జనన మరణ చక్రము నుండి, సంసార దుఃఖము నుండి విముక్తుడగును. ఆ వ్యక్తి ముక్తుడైననూ, ఈశ్వరునిచే సృష్టింపబడిన (ఈశ్వరసృష్టి) దేహము ఇంకనూ కొంతకాలము కొనసాగును.

సర్వజ్ఞతకు మనస్సు అవశ్యకము కాదు

'ఈశ్వరుడనగు నేను మాయను నా వశములో ఉంచుకుంటాను' అని శ్రీకృష్ణుడు ఈ శ్లోకములో అర్జునునకు చెప్పెను. క్రియల నాచరించు సామర్థ్యము (క్రియాశక్తి), తెలుసుకునే సామర్థ్యము (జ్ఞానశక్తి), కోరుకునే సామర్థ్యము (ఇచ్ఛాశక్తి) ఇవి అన్నీ ఈశ్వరునకు వశములో నుండును. మరియు, ఈశ్వరుని విషయంలో ఈ శక్తులకు సీమ అనేది ఉండదు. ఈశ్వరుని జ్ఞానశక్తి నిస్సీమమైనది గనుక, ఆయనకు తెలియుటకై మనస్సుతో పని లేదు. మనస్సు లేకుండగనే, ఆయన సర్వజ్ఞుడు. మనస్సు ఎంత గొప్పది అయినా, దానికి సీమ ఉండును. కాన, సర్వజ్ఞత మనస్సుపై ఆధారపడి ఉండజాలదు. మరియు, మనస్సు కూడా సృష్టిలోని భాగమే. సృష్టికి పూర్వంలో ఈశ్వరునకు జ్ఞానం ఉండి తీరాలి. కాన, ఈశ్వరునకు మనస్సుతో పనిలేదు. మాయాశక్తి చేతనే ఆయన సర్వజ్ఞుడు. ఆయనకు 'పరమేశ్వరుడు' అని పేరు. ఈ పరమేశ్వరుడే జగద్రూపముగా అయినాడు. ఇదియే మాయ. ఇదియే ఇంద్రజాలము.

అవతారమును గురించి తెలుసుకోవాలి

వైదిక పౌరాణిక సాహిత్యములను అర్థం చేసుకోవాలంటే, అవతారమును గురించి కొంత తెలిసి ఉండాలి. 'అవతారము' అనగా దేహమును ధరించిన పరమాత్మ అని యర్థము. రామాయణము నందు శ్రీరాముడు, మహాభారత, భాగవతముల యందు శ్రీకృష్ణుడు అవతారములుగా ప్రస్తుతింపబడినారు. ఈ అవతార భావన ఇచట చాల ప్రముఖమైనది. కావున, సత్యత్వము యొక్క వివిధ శ్రేణుల దృష్ట్యా, ఈ భావన ఇచట సంక్షిప్తముగా విశ్లేషింపబడుచున్నది.

సత్యత్వములో మూడు శ్రేణులు గలవు. పారమార్థిక సత్యత మొదటిది. సత్యజ్ఞానానంతము, నిర్గుణము, సకల జగత్తునకు అధిష్ఠానమునగు బ్రహ్మము ఇట్టిది. వ్యావహారిక సత్యత రెండవది. జగత్తు, దానిలోని ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథివి, సూర్య చంద్రులు, నక్షత్రములు, ప్రకృతినియమములు ఇత్యాది సర్వము ఈ కోవకు చెందినవి. సుఖ దుఃఖములనిచ్చే వివిధ పరిస్థితులు, స్థూల దేహము, మనస్సు, ఇంద్రియములు ఈ శ్రేణికి చెందును. సకల సాధన సాధ్యములు కూడా వ్యావహారిక సత్యములే. వీటిలో కొన్ని మనకు బాగా తెలిసినవి కాగా, మరి కొన్నిటిని వేదము బోధిస్తుంది. ఉదాహరణకు సంతాన ప్రాప్తి, స్వర్గలోక ప్రాప్తి ఇత్యాది ఫలముల నుద్దేశించి, వేదము కొన్ని కర్మలను విధించును. ఈ లోకములోని పదార్థములకు, శాస్త్రముచే వర్ణింపబడే స్వర్గమునకు ఒకే శ్రేణికి చెందిన వ్యావహారిక సత్యత్వము గలదని అంగీకరింపబడును. మనము స్వప్నములో దర్శించే జగత్తు కేవల విషయి నిష్ఠము మాత్రమే. ఇది మూడవది యగు ప్రాతి భాసిక సత్యత్వము.

వ్యావహారిక సత్యత్వము

మనం ఘటమును దృష్టాంతముగా తీసుకుందాము. ఘటము ఊహా కల్పితము గాదు. దానితో నీటిని తెచ్చుకొనగల్గుతాము. కాని, ఘటము స్వతంత్ర నిరపేక్ష సత్యము అని చెప్పవీలు లేదు. ఏలయన, ఘటము యొక్క ఉనికి ఇతర సాపేక్షము. అది ఘట నిర్మాణమునకు ఉపయోగించిన వస్తువుపై ఆధారపడును. కావున, ఘటము పారమార్థిక సత్యమని చెప్పరాదు. ఘటము అసత్తు (ఉనికి లేనిది) అని తిరస్కరింపనూ రాదు. ఘటముతో నీటిని తేవచ్చును!

ఘటము పారమార్థిక సత్యము అన్నా, ఘటము సర్వాత్మనా అసత్తు అన్నా రెండూ సరిగాదు.' శూన్యాత్మకమగు ఘటము నీటిని తెచ్చుటకు పనికి రాదు గదా!

కావున ఘటము ఉన్నది. దానికి ఒక చరిత్ర గలదు. అది ఒకానొక ఘడియలో పుట్టి, అనేక గృహములలో నివసించినది. అది కూడా పెరుగుదల అనే ప్రక్రియ గుండా పయనించి, పెద్ద వయస్సునకు చేరినది. దానికి చిల్లులు పడ్డాయి. కొంత వరకు దానిని బాగు చేసినారు. అది ఎన్నో తరాలను చూచింది. ఎన్నో హస్తాలను అలంకరించింది. ఒక వెలుగు వెలిగిన ఆ ఘటము ఇపుడు ఒక మూల పడి ఉంది. పనికిరాని పాత కుండగా మారింది. ఈ విధంగా, ఘటమునకు ఒక నిశ్చితమగు ఉనికి గలదు. ఆ ఉనికిని బట్టి యే ఘటము నామరూపములు గల వస్తువనియూ, అది కొన్ని నియమములకు లోబడి ఉండుననియూ మనము అంగీకరిస్తాము. వ్యావహారిక సత్యమనగా నిదియే. ఇంద్రియ జ్ఞానము మాత్రమే గాక, అనుమానము, అర్థాపత్తి ఇత్యాది ప్రమాణములు కూడా మనకు వ్యావహారిక సత్యమును తెలుసుకొనుటలో సహకరించును.

స్వర్గము ఇత్యాది ఫలములను, వాటిని పొందే సాధనములను ఉపదేశించే సందర్భంలో వేదము ఈ వ్యావహారిక సత్యత్వమును గురించి మాత్రమే బోధించును. వేద విహితములగు వివిధ కర్మలు కర్తను అపేక్షించును. కర్త తాను కోరే ఫలములను పొందుట కొరకై కొన్ని కర్మల నాచరించవలెను. సాధ్య సాధనములు ఒకదానితో మరియొకటి ముడిపడియున్నవి. కాన ఈ సాధనములు కూడా – లౌకిక కర్మలైనా, వైదిక కర్మలైనా – వ్యావహారిక సత్యములే. సాధ్య సాధనములు మరియొక దానిపై ఆధారపడును గాన, అవి వ్యావహారిక సత్యములే గాని, పరమార్థ సత్యములు కాజాలవు.

'వ్యావహారికము' అను పదము, స్వప్నాది మానసిక సృష్టిని మినహాయించి, ఈ సృష్టిలోని సర్వమును, జ్ఞాతమును, అజ్ఞాతమును నిర్దేశించును. ఒక నిర్దిష్ట కాలములో, మనవే తెలియబడే వస్తువు, తెలియబడని వస్తువు కూడ వ్యావహారిక సత్యములో అంతర్భాగములగును. ఒక నిర్దిష్ట కాలములో తెలియబడని వస్తువు తదనంతర కాలమునందు తెలియబడవచ్చును. ఈ జగత్తు, మనస్సు – అనగా అంతఃకరణము, మెదడులోని కణములు ఇత్యాది – సర్వమూ వ్యావహారిక సత్యములో అంతర్భాగము అగును. స్థూల దేహము, దానిలోని అవయవములు, ఇంద్రియములు, వాటి విషయములు, స్మరించే, ప్రేమించే,

ఆలోచించే, తెలుసుకునే శక్తులు ఇవన్నీ వ్యావహారిక సత్యములే. వాటన్నిటికీ వ్యావహారిక శ్రేణికి చెందిన సత్యత్వము నిస్సందేహముగా గలదు.

ప్రాతిభాసిక సత్యత్వము

సత్యత్వము యొక్క తృతీయశ్రేణి కేవల విషయినిష్ఠమై యుండును. దీనినే సంస్కృతములో ప్రాతిభాసికము అంటారు. ఈ శ్రేణి సత్యతకు స్వప్నము ఒక దృష్టాంతము. ఒక వస్తువు నీకు కనబడినది గనుక ఉన్నది. వివిధ భ్రాంతులు, తెలియని భయములు, వివిధ కల్పనలు ఇత్యాదులు కూడా ప్రాతి భాసికములే. ఉదాహరణకు, నీవు ఒక విగ్రహమును చూచి వ్యక్తి అనుకోవచ్చును (స్థాణుః పురుషః). లేదా, ఒక వ్యక్తిని నీవు శత్రువు అని భావించవచ్చును. ఇవి కేవలము నీ మానసిక కల్పనలు మాత్రమే. ఇవి కేవల విషయి నిష్ఠములు గనుక, ప్రాతిభాసికములు. నీవు చూచేది నీ యెదుట లేదు. అయినా, నీకు కనబడుతుంది. నీ మనస్సులోని భావనలను నీ ఎదుట దర్శిస్తావు గనుక, ఆ భావనలకు ఒక విలక్షణమైన సత్యత్వము సిద్ధిస్తుంది.

మానసిక కల్పనలు అందరికీ ఉంటాయి. అందరూ భ్రాంతికి లోనవుతారు. మనస్సుకు సీమలు గలవు; మనస్సు సర్వజ్ఞము కాదు. కావన, ప్రాతి భాసికము సంభవమే. ఇంతేగాక, మనస్సులో పూర్వసంస్కారములుండుటచే, కొన్నిటియందు రాగము, మరి కొన్నిటి యందు ద్వేషము స్వతహాగా ఉంటాయి. ఈ పూర్వ సంస్కారముల వలన మనస్సు తనకు తానుగా కొన్ని ఆదుర్దాలను, భయములను, సుఖములను, నిరాశలను, ధారణలను కల్పించుకొనును. ఈ కారణముగనే ప్రతి వ్యక్తి ఏదో ఒక సమయంలో వాస్తవంగా లేనిదానిని చూస్తాడు; ఉన్నదానిని చూడలేకపోతాడు.

ఉదాహరణకు, ఒక వ్యక్తికి నీయందు ప్రేమ గలదు. కాని, అతడు నిన్ను చూచి ముఖమును ముడుచుకుంటాడనుకో. నీవు దానిని చూసేవు. నీకు కారణం తెలియదు. అతని ప్రేమను నీవు గుర్తించలేవు. నీకు అతనిలో వ్యతిరేక భావమే గోచరిస్తుంది. నీకు ఒక మనస్సు ఉన్నది. కనుక, అన్ని రకముల మానసిక కల్పనలు, భ్రాంతులు సంభవమగును. నీవు ఒక రకంగా భావించి, ఆ రకంగానే చూస్తావు. ఈ సత్యత్వము నీ దృష్టిలో మాత్రమే గలదు. ఇది వ్యావహారికము గాదు. కావన, దీనికి ప్రాతిభాసిక మని పేరు.

ప్రాతిభాసికము ఉన్నచోటల్లా భ్రాంతి ఉండును. భ్రాంతి ఉన్నచోట దానిని తొలగించుట, అనగా జ్ఞానము కలిగే అవకాశము ఉండితీరును. ఒక దృష్టాంతమును చూద్దాము. ఒక వ్యక్తి మిఠాయిని తయారుచేస్తూ, ఉప్పును చూసి పంచదార అనుకున్నాడు. అతడు మిఠాయి కావాలనుకున్నాడు. కాని, అతనికి మరేదో లభించింది. పంచదార, ఉప్పు ఈ రెండు వ్యావహారిక సత్యములే. ఈ రెండింటికీ గల తేడాను మన ఇంద్రియములు గుర్తించగల్గుతాయి. అయినా, వాటి విషయంలో భ్రాంతికి అవకాశం గలదు. పంచదార వాడితేనే మిఠాయి తయారవుతుంది. ఉప్పును వాడితే మరేదో లభిస్తుంది. ఉప్పును చూచి, దీనితో మిఠాయి చేయాలనుకున్న వ్యక్తి భ్రాంతికి లోనవుతాడు. ఇట్టి భ్రాంతి ఏ కాలమందైననూ సంభవమే.

ఏతత్సర్వము మన అనుభవములోనిదే. ఆత్మ స్వయం ప్రకాశమగు అనుభవము. జ్ఞానము కూడ ఒక అనుభవమే. మణులన్నీ సూత్రములో గుచ్చబడి ఉన్నతీరున, అనుభవములన్నీ ఆత్మానుభవములో గుచ్చబడి ఉంటాయి. జాగ్రత్స్వప్న సుషుప్తులు అనే మూడు అవస్థలయందు కూడ జ్ఞానానుభవము కలదు. ఈ మూడు అనుభవములు ఒక్కొక్కటిగా, మరియు అన్నీ కలిసి స్వయం ప్రకాశమగు ఆత్మచైతన్యమునందు అధిష్ఠితమై యున్నవి.

ప్రతి వ్యక్తి తనకు తానుగా కొన్ని విషయి నిష్ఠ ప్రాతిభాసిక సత్యములను కల్పించుకొనునని మనకు తెలియును. అంతే గాక, మనము ఒక క్రమబద్ధమైన ప్రపంచములో నివసిస్తున్నామని కూడ మనకు తెలియును. ఈ తీరున మనకు వ్యావహారికమగు విశ్వ వ్యవస్థయే గాక, విషయి నిష్ఠమగు అవ్యవస్థ కూడ గలదు. ఇవి గాక, అవికారి, కూటస్థమునగు సచ్చిదానంద ఆత్మ గలదు. ఈ మూడు త్రివిధ శ్రేణుల సత్యత్వమునకు చెందినవి. అవగాహనలో సౌలభ్యము కొరకై ఇట్టి విభాగము చేయబడిననూ, వాస్తవంగా ఉన్న సత్య వస్తువు ఒక్కటియే. అదియే సత్యజ్ఞాన అనంత బ్రహ్మ.

త్రివిధ సత్తల మధ్య గల పరస్పర సంబంధము

వ్యావహారిక సత్తకు, విషయి నిష్ఠమగు ప్రాతిభాసిక సత్తకు మధ్య భేదము గలదు. వ్యావహారిక సత్తారూపమగు ఈ బ్రహ్మాండమంతా ఈశ్వర సృష్టి. వ్యక్తి తన మానసిక కల్పనలను సాకార రూపంలో దర్శిస్తూ ఉంటాడు. ఈ రకమైన విషయి నిష్ఠ మానసిక

కల్పనలకు జీవసృష్టి యని పేరు. మనము సర్వకాలములయందు సత్యజ్ఞాన అనంత బ్రహ్మ అనే పరమార్థ సత్యము అధిష్ఠానముగా గలవారమై వ్యావహారిక, ప్రాతిభాసిక అనే యీ రెండు శ్రేణుల సత్తలను ఎదుర్కొంటూ ఉంటాము.

వివిధ శ్రేణుల సత్తలను గురించి మనము తెలుసుకున్నాము. మనమిపుడు మరల శ్లోకమును పరిశీలిద్దాము. నేను మాయ (ప్రకృతి)ని వశము చేసుకొని దేహమును ధరించితిని అని శ్రీకృష్ణుడు చెప్పెను. పరమేశ్వరుడు ఈ జగత్తునంతనూ సృష్టించి, తాను కూడ దేహమును ధరించగలడు. కాన, అవతార వాదమునకనుసరించి, ఈ శ్లోకములో శ్రీకృష్ణుని జన్మ ఈశ్వరావతారముగా వర్ణింపబడినదని తెలియుటలో ఇబ్బంది ఏమీ లేదు. కాని, ఆ తరువాత ఒక ప్రశ్న తల యెత్తుతుంది. భగవానుడు ధరించిన స్థూలదేహము ఏ శ్రేణి సత్తకు చెందినది?

'నేను అజుడను; అనగా నేను ఏనాడూ జన్మించలేదు' అని శ్రీకృష్ణుడు చెప్పెను. అంటే, ఆయన పారమార్థిక సత్యమునే సూచిస్తున్నట్లు స్పష్టమగుచున్నది. వాస్తవంలో, పారమార్థిక సత్యం దృష్ట్యా ఏ ఒక్కరూ జన్మించలేదు. కాన, అదే దృష్టి కోణంతో ఆలోచిస్తే, శ్రీకృష్ణుడు కూడా జన్మించలేదు. అట్టిచో, అర్జునుని యెదుట నున్న శ్రీకృష్ణుడనే వ్యక్తి ఆ పారమార్థిక సత్యము కాజాలడు. మనమిచట పరమాత్మ యగు శ్రీకృష్ణుని గురించి చర్చించుటలేదని మరువరాదు. దేహమును స్వీకరించి, ఒక వ్యక్తిగా జన్మించిన, పీతాంబరములను ధరించే, మురళిని వాయించే శ్రీకృష్ణుని గురించి, అర్జునుని రథముపై సారథియై చేత గుర్రాల కళ్లెమును పట్టియున్న శ్రీకృష్ణుని గురించి చర్చిస్తున్నాము. అర్జునునకు ఉపదేశిస్తున్న ఈ శ్రీకృష్ణుడు పారమార్థిక సత్యమా? కాదు. ఆయన దేహము పారమార్థికము కాదు గనుక, ఆయన పారమార్థిక సత్యము కాదు.

అయినచో, శ్రీకృష్ణుని దేహము వ్యావహారిక సత్యము అయి తీరాలి. వ్యావహారిక సత్యమే అయినచో, శ్రీకృష్ణుడు కూడా కర్మల వలన జన్మించిన, అర్జునుని వంటి సంసారి కాడా? ఆయన కూడా పుణ్యపాప కర్మల వలన జన్మిస్తే, ఆయనకు కూడా ధర్మాధర్మములతో బాటు కర్తృత్వ భోక్తృత్వములు కూడ ఉండునా? ఆయన కర్మబద్ధుడైనచో, మాయను వశము చేసుకొనే అవకాశమెక్కడిది? ఆయన జన్మ వ్యావహారిక సత్యమే అయినచో, ఆయన కూడ కర్మకు వశుడై, ఇచ్ఛాశక్తి రహితుడై, సృష్టి నియమములచే నిర్ణీతమైన జన్మను పొంది

ఉండాలి. అప్పుడు మాత్రమే ఆయన జన్మ కూడ అర్జునుని జన్మ వలె వ్యావహారిక సత్యమని చెప్పవలను పడును.

జీవుని జన్మ వ్యావహారిక సత్యము

అర్జునుడు జీవుడు. కాన, అతని జన్మ కర్మ ప్రాప్తము. అతడు రాజకుమారునిగా జన్మించిన వాడే అయినా, పన్నెండేళ్ల వనవాసము, ఒక యేడు అజ్ఞాతవాసము చేయవలసి వచ్చెను. ఇదంతా అతని పూర్వకర్మ ఫలమని చెప్పవచ్చును. అర్జునుని జ్యేష్ఠ సోదరుడగు ధర్మపుత్రుని భాగధేయము కూడ, ఆయన చేసిన పుణ్య పాపముల చేతనే నియంత్రించబడును. పాపము వలన ఆయన రాజ్యమును కోల్పోయెను. పాపము కారణము కానిచో, పాచికలు అన్యథా పడి ఉండెడివి. లేదా, ఆయన వాటిని అవల పారవేసి ఉండెడివాడు. ఆయనకు వనవాసము చేయదగిన ప్రారబ్ధ కర్మ ఉండెను. శాస్త్రము ఇట్టి కర్మను గూర్చి వివరించును.

అర్జునుడు కర్మ వలన జన్మించిన జీవుడు గాన, అతని జన్మ వ్యావహారిక సత్యము. అతనికి తల్లి తండ్రులు గలరు. స్థూల దేహము, మనస్సు, ఇంద్రియములు గలవు. మనమింతకు ముందు చూచిన విధముగా, ఇవి అన్నియూ వ్యావహారిక సత్యములే. దీనికి భిన్నముగా, శ్రీకృష్ణ భగవానుడు తాను మాయను వశము చేసుకుని, జన్మించినానని చెప్పెను. ఆయన యేల జన్మించెనో మనము తరువాత తెలుసుకుందాము.

శ్రీకృష్ణుని జన్మ యొక్క సత్యత్వము

జన్మించిన ప్రతి వ్యక్తి యొక్క దేహము మనకు ఇంద్రియగోచరమగును. కాని, మనము కంటితో చూచేది సర్వదా పారమార్థిక సత్యము కానక్కరలేదు. దీనికి నీలాకాశము, ఇంద్రజాలికుని మాయ దృష్టాంతములు. కాన, ఇంద్రియ గోచరము అను అంశము, శ్రీకృష్ణుని జన్మ వ్యావహారికము అని నిరూపించలేదు.

భగవానుడు మాయను తన వశములో నుంచుకొని జన్మించినచో, అట్టి జన్మ పుణ్యపాపములకు, ధర్మాధర్మములకు అధీనము కాదను మాట నిశ్చయము. కర్మ బద్ధము కాని అట్టి జన్మ వ్యావహారిక సత్యము కాజాలదు. అది పారమార్థికము కూడ కాదని మనము చూచియున్నాము. మరియు, శ్రీకృష్ణుని జన్మ లేనే లేదని (అత్యంతం అసత్) చెప్పలేము.

ఆయన వంధ్యా పుత్రుడు కాదు. ఆయన దేవకీ వసుదేవుల పుత్రుడు. కాన, అర్జునునకు ఉపదేశించిన శ్రీకృష్ణుడు అత్యంత అసత్ కాడు.

అట్లైనచో, శ్రీకృష్ణుని జన్మ ఎట్టి సత్యమని చెప్పవలెను? శ్రీకృష్ణుని జన్మ ప్రాతిభాసికము. ఆయన అందరికీ కనవడినాడు; కాన, ఆయన ఉండెను. ఆయనకు జన్మ కర్మ వలన సంప్రాప్తమైనది కాదు. ఆయన జన్మించినాడా యన్నట్లు భాసించుట మాత్రమే. ప్రాతిభాసిక మనగా అందరికీ కనబడే శ్రీకృష్ణుడు ఉండెను. కాని, ఆయన జన్మ, స్థూల దేహము కేవల మాయామాత్రములు. సృష్టిలోని సర్వము వలె, అవి కూడా మాయా జన్యములే. కాని, కర్మ నియతికి కట్టుబడినవి మాత్రం కాదు. ఈ జన్మలోని రహస్యమేమన ఈశ్వరుడు జీవత్వ స్థితికి దిగజారిపోడు.

ఈశ్వరుడు స్థూలదేహమువేల స్వీకరించును?

భగవానుడు స్థూలదేహమును స్వీకరింపవలసిన అవసరమేల కలిగెను? సత్పురుషులు అందరూ దేవతలతో గూడి, పరమేశ్వరుని స్తుతించి, 'ఓ పరమేశ్వరా! నీవు ఏదో ఒకటి చేయాలి! నీవు వచ్చి ఈ పరిస్థితిని చక్క దిద్దాలి. నీవు రాదగిన సమయమాసన్నమైనది. సమయము మించి పోవుచున్నది! ఇంతవరకు నీవేల రాలేదు? ఈ దుష్టుల బాధలను మేము తాళలేకున్నాము' అని వేడుకొంటారు. ఈ విధంగా అవతారములన్నింటికి ముందుగా దేవతలు స్తుతిస్తారని పురాణాలలో వర్ణించబడినది. ఈ ప్రార్థనలన్నీ కలిసి, భగవానుడు అవతరించుటకు కావలసిన ఉపాదాన కారణమవుతాయి. అనగా, భగవానుడు దేహమును స్వీకరిస్తాడు.

జీవుల ప్రార్థనలే పుణ్యముగా మారి, ఒక విశిష్ట ప్రయోజనము కొరకై ఒక విశిష్ట దేహము జన్మించుటకు హేతువు అవుతాయి. భగవానుని ఇట్టి జన్మయే అవతారమనబడును. నరసింహ, వామనాది అవతారములు ఒకే ఒక ప్రయోజనము కొరకు రాగా, శ్రీరామ, శ్రీకృష్ణాద్యవతారములు బహుళ ప్రయోజనములను సిద్ధింపజేసినవి. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు ఇట్టి బహుళ ప్రయోజనములను సిద్ధింపజేయుటయే గాక, మానవులు తమ జీవితమును ఎట్లు గడపాలి అను విషయములో ఆదర్శప్రాయులైరి. ఎన్ని కష్టాలు వచ్చినా, ధర్మబద్ధముగా ఎట్లు జీవించాలి అను విషయంలో శ్రీరాముడు ఆదర్శమైతే, శ్రీకృష్ణుడు ప్రేమ జ్ఞానములు మూర్తీభవించిన దైవము.

శ్రీకృష్ణుని భగవానునిగా పూజించుట కొరకై అవతారవాదము అవశ్యకము కాదనే విషయమును మనము స్పష్టముగా తెలుసుకోవాలి. భగవానుని పూజించుటకై శ్రీకృష్ణుని చిత్రపటమొకటి యెదురుగ నుండిన చాలును. మనము రాతితో సహా దేనిలోనైననూ భగవానుని పూజించవచ్చును. భగవానుని ఒక విశిష్టరూపములో పూజించుట, అవతార వాదము పూర్తిగా భిన్నములైన విషయములు. శ్రీకృష్ణుడు ఈ శ్లోకములో 'నేను నా మాయా శక్తిచేత దేహమును ధరించినట్లు ఉన్నాను' అని చెప్పినాడు. ఈ శ్లోకము ఈ విధముగా అవతార భావనను నిర్దేశించినది గనుకనే, మనమీ విషయము నిచట చర్చించినాము. శ్రీశంకరులు భాష్యములో 'ఇవ' పదమును ప్రయోగించి, శ్రీకృష్ణుని జన్మ పుణ్య పాప ఫలము కాదనియు, వ్యావహారిక సత్యము కాదనియు స్పష్టము చేసిరి.

ఈశ్వరునికి కూడా పుణ్యపాపాలు ఉంటే, ఈశ్వరుడే ఉండడు! కాన, యీశ్వరుడు అవతరించినపుడు, ఆయన పుట్టిన వానివలె భాసించును. ఆయన దేహము పుణ్యపాపముల ఫలముగా లభించినది కాదు గనుక, దానికి వ్యావహారిక సత్త ఉండదు. ఈశ్వరునకు కూడా పుణ్య పాపాలు ఉన్నాయి అంటే, అట్టి యీశ్వరుడు అంతఃకరణ పరిచ్ఛిన్నుడవుతాడు. కాని ఈశ్వరుడు సర్వజ్ఞుడు; జ్ఞానఘనుడు. కాన, ఇట్టి పరిచ్ఛేదము ఈశ్వరునకు పొసగదని మనము చూచియున్నాము. కావుననే, శ్రీకృష్ణుడు ఈ శ్లోకములో అర్జునునితో 'నేను పుణ్య పాపములు లేకుండగనే జన్మించితిని' అని చెప్పెను. అవతారము యొక్క సూత్రమిదియే.

తరువాతి శ్లోకములో శ్రీకృష్ణుడు తన అవతార ప్రయోజనమును వివరించెను:

అధ్యాయము 4, శ్లోకము 7

यदा यदा हि धर्मस्य ग्लानिर्भवति भारत।
अभ्युत्थानमधर्मस्य तदात्मानं सृजाम्यहम् ॥ ७ ॥

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ (7)

భారత = ఓ అర్జునా!; **యదా యదా** = యెప్పుడెప్పుడైతే; **హి** = నిశ్చయముగా; **ధర్మస్య** = ధర్మజీవనమునకు; **గ్లానిః** = క్షీణస్థితి; **అధర్మస్య** = అధర్మ జీవనమునకు;

అభ్యుత్థానం = సర్వత్రా పెరుగుదల; **భవతి** = కలుగునో; **తదా** = అప్పుడు; **అహం** నేను; **ఆత్మానం** = నన్ను; **సృజామి** = సృజించెదను (స్థూలరూపము కల్గునట్లు చేసెదను).

> ఓ అర్జునా! ఏయే కాలముల యందు ధర్మజీవనమునకు క్షీణ స్థితి, అధర్మ జీవనమునకు సర్వత్రా పెరుగుదల కలుగునో, ఆ కాలముల యందు నన్ను నేను సృజించెదను (స్థూల దేహమును ధరించెదను). (7)

శ్రీకృష్ణుని జన్మ అవతారవాదమును నిర్దేశించుచున్నదని మనము పూర్వశ్లోకములో చూచియున్నాము. భగవానుడు జన్మించలేదు; కాన, మరణించడు. ఆత్మకు జన్మ మరణములు లేవు. శ్రీకృష్ణుడు భగవానుడే; సర్వసృష్టికి ఆయన అధీశ్వరుడు. అయిననూ, మాయాశక్తి వలన ఆయన జన్మించిన వానివలె భాసించుచుండెను. ఆయన ధర్మాధర్మములకు, పుణ్యపాపములకు కట్టుబడిన వాడు కాకపోయిననూ, ఈ విశిష్టరూపముతో జన్మించినవాని వలె కన్పట్టుచుండెను.

సృష్టి ఈశ్వరుని రూపము. ఆ సృష్టిలో జీవులు పుట్టెదరు. శుద్ధచైతన్యం దృష్ట్యా పరిశీలిస్తే, ఒకే ఒక పరమాత్మ గలడు. చైతన్యము ఒక్కటియే గనుక, జీవులందరు పరబ్రహ్మ స్వరూపులే. కాని, ప్రాపంచిక దృష్టితో చూచువానికి ఒక్కటియే అనేకమగును. జీవునకు, ఈశ్వరునకు భేదము కన్పట్టును.

అవిద్యా ప్రభావముచే స్థూలదేహమునందు, మనస్సు నందు, ఇంద్రియముల యందు ఆత్మ భావము గల వ్యక్తియే జీవుడు. ఈ అజ్ఞానము వలన, జీవుడు పునః పునః జీవునిగా జన్మిస్తూ ఉంటాడు. ఇట్లు పుట్టిన జీవుడు అజ్ఞానము వలన కర్మల నాచరిస్తూ ఉంటాడు. వాటి వలన పుణ్యపాపములు, మరో జన్మ లభిస్తాయి. ఇది అంతా ఒక దృష్టికోణము మాత్రమే. జీవుడు జీవత్వ భావనతో తనను, జగత్తును చూస్తాడు. భేదము లేని చోట భేదమును చూస్తాడు. ఈ దృష్టి కోణములోనే ఈ వివిధ చర్చలు, వాదములు సంభవమవుతాయి. ఇదియే వ్యావహారిక సత్యము. ఇది పారమార్థిక సత్యము కాదు.

జీవుడు స్వీయకర్మల ఫలరూపంగా జన్మను పొందుతాడు. కాని, అవతారము కర్మల ఫలరూపమైన జన్మ కాదు. అట్లుగానిచో, అవతారమునకు కూడ కర్తృత్వము,

దానిని బట్టి అవిద్య ఉండవలసి వచ్చును. అదియే సత్యమైనచో, అవతారము ఈశ్వరుడు గాక, జీవుడగును. కావున, జీవుని జన్మకు, ఈశ్వరుని జన్మకు ప్రముఖమైన భేదము గలదు.

ఈ సృష్టి అంతా ఈశ్వరుడే. ఈశ్వరుడు ఒక విశిష్ట కాలములో ఒకానొక ప్రయోజనము కొరకై ఒక విశిష్టరూపమును ధరించును. ఆ రూపమును మనము అవతారమని పిలుస్తాము. వేదములో దేవతల ప్రసక్తి గలదు; కాని, అవతార ప్రసక్తి లేదు. పురాణములు శ్రీరాముని, శ్రీకృష్ణుని అవతారములుగా ప్రస్తుతించినవి. వ్యాసుడు మహాభారతములో శ్రీకృష్ణుని పాత్రచేత ఈ జ్ఞానమును పలికించినాడా? లేక, శ్రీకృష్ణుడనే చారిత్రక పురుషుడు స్వయముగా ఉపదేశించినాడా? ఈ రెండు పక్షములు మనకు సమానమే. ఏ పక్షమును స్వీకరించినా, ఇబ్బంది లేదు.

మహాభారత గాథ చారిత్రకమని ఇంచుమించు అందరూ అంగీకరిస్తారు. ఈ పక్షములో, శ్రీకృష్ణుడే స్వయముగా ఉపదేశించినాడు. మహాభారతము ఒక ఇతిహాసము. 'ఇతిహాసము' అనగా 'ఇట్లు జరిగినది' అని యర్థము. ఈ పద ప్రయోగము కూడ మహాభారతగాథ చారిత్రకమని సూచించును. కాని, మహా భారతములో వాస్తవ చారిత్రక ఘటనలు ఆధారంగా అనేక కథలు అల్లబడినట్లు గుర్తింపబడినది.

రామాయణ, మహాభారతములు చారిత్రక ఇతిహాసములు మాత్రమే గాక, కావ్యములు కూడా. అంటే, కవికి రసములను, కళా సౌందర్యము యొక్క విలువలను, వివిధ రకముల ఘటనలను యథేచ్ఛగా సృజించే కవితా స్వాతంత్ర్యము ఉండును. ఇందువలననే, రామాయణములో పది తలల రావణుడు, హనుమంతుడనే పేరుగల మాటలాడే కోతి ఇత్యాదిగా ఇంకా ఎన్నో అసాధారణమైన, ఊహకు అందని పాత్రలు, సన్నివేశములు గలవు. అయినప్పటికీ రామాయణము కూడా మహాభారతము వలెనే కొన్ని చారిత్రక సత్యములు ఆధారముగా గల గాథయని గుర్తింపబడినది.

అవతారము నటుని వంటిది

శ్రీకృష్ణుడు ఒక అవతారము. ఈ అవతారము రంగస్థలముపై కనబడే నటుని వంటిది. తాను పాత్ర కాదనే సత్యము నటునకు బాగుగా తెలియును. శ్రీకృష్ణునకు తాను

ఒక పాత్రలో నటిస్తున్నానని తెలియును. కావున, ఆయన యొక్క జన్మను పారమార్థికమని గాని, వ్యావహారిక సత్యమని గాని భావింపవలను పడదు. కావున, అవతారమునకు ఒకే ఒక సత్యత్వశ్రేణి మిగిలినది. అదియే ప్రాతిభాసికము. అయితే, మామూలు ప్రాతిభాసికానికి, దీనికి తేడా గలదు. అవతార పురుషునకు తన పాత్ర సత్యము కాదనియు, అంతా నటనే అనియు తెలుస్తూ ఉంటుంది.

ఇదే తీరున, జ్ఞాని కూడా కర్మను చేయునప్పుడు తన యందు కర్తృత్వమును ఆరోపించుకొనడు. అనగా జ్ఞానికి యథార్థ వ్యవహారము లేదు. ఆయన దృష్టిలో, అనగా ఆత్మ దృష్ట్యా, సర్వమూ ప్రాతిభాసికమే.

ఈశ్వరుడు ఒక స్థూల దేహము గల వ్యక్తిగా కన్పట్టును. కాని, ఆతడు చేయు పనులు వ్యావహారిక క్షేత్రములోనివే. కాని, ఆయన దృష్టి కోణములో, అనగా ఈశ్వరుని దృష్టి కోణములో, అవతారము ప్రాతిభాసికము, మాయ. ఇది ఇంద్రజాలికుడు తన శక్తిని ఉపయోగించి అనేక విషయములను ప్రదర్శించుట వంటిది. ఇంద్రజాలమును దర్శించువారి దృష్టిలో సర్వము సత్యమే. కాని ఇంద్రజాలికుని దృష్టిలో అదంతా మాయ.

మనము ఇట్టి జన్మను గురించి చర్చిస్తున్నాము గనుక, ఎప్పుడు? ఎందుకు? అనే ప్రశ్నలు తలెత్తటం సహజమే. నీవు ఎప్పుడు జన్మించితివి? నీవు ఎంత తరుచుగా జన్మిస్తూ ఉంటావు? నీవు ప్రతిరోజు జన్మిస్తావా ? నీవు ప్రతి శతాబ్దములో జన్మిస్తావా? లేక, నీవు ప్రతి రోజు వివిధ స్థలములలో జన్మిస్తావా? నీవెట్లు జన్మిస్తావు? నీవెందులకు జన్మిస్తావు? ఎప్పుడు, ఎందులకు ఇత్యాది ప్రశ్నలకు ఈ శ్లోకములో, తరువాతి శ్లోకములో సమాధానం లభిస్తుంది.

ఈశ్వరుడు దేహమును యెప్పుడు ధరించును?

మానవులకు ఇచ్ఛా స్వాతంత్ర్యము గలదు. కాన, మానవులు దానిని దుర్వినియోగము చేసే అవకాశము గలదు. తద్వారా సువ్యవస్థకు, ధర్మమునకు, న్యాయమునకు భంగము వాటిల్లును. ఇట్టిస్థితిలో, వ్యక్తి ధర్మబద్ధమగు లక్ష్యమును ఉద్దేశించి, ధర్మబద్ధమగు ఉపాయమును అనుసరించజాలడు. మరియు, సమాజములోని వాతావరణము ధర్మసాధనకు అనుకూలముగా నుండదు గాన, వ్యక్తి మోక్షోపాయములను కూడ పాటించజాలడు.

సమాజంలో అధికశాతం ప్రజలు న్యాయవ్యవస్థను, ధర్మ సంరచనను అనుసరించాలి. అట్టిస్థితిలో మాత్రమే వ్యక్తి నీతి మార్గములో సంపదను సంపాదించగల్గుతాడు.

ఈ విషయంలో ఫుట్‌బాల్ ఆటను దృష్టాంతముగా చెప్పవచ్చును. ఆటలో ఏ ఒక్కరూ నియమాలను పాటించకపోతే, ఆటయే ఉండదు. ఆటగాళ్లు అంపైరును తరిమివేసి, తమ పక్షానికి అనుకూలంగా లేని సమయంలో ఈల ఊదుతూ ఉంటే, ఆట యేమి కొనసాగును? ఫుట్‌బాల్ ఆట ఉండదు. ఎవరికి తోచినట్లు వారు బంతిని తన్నుకోవచ్చును. ఇదే విధంగా, జీవితమనే ఆటను కూడా నియమ రహితంగా ఆడుట కుదరదు; దానిలో ఆనందముండదు.

నిత్యజీవనము సాఫీగా కొనసాగాలంటే, ఇంటిలో కూడా కొన్ని నియమాలను పాటించాలి. ఈ నియమాలను పాటించకపోతే, గృహవ్యవస్థ ఛిన్నా భిన్నమవుతుంది. సమాజం కూడా ఇంతే. ఆటలో వలె, జీవితములో కూడా ఏవో కొన్నిమోసాలు జరుగుతూ ఉంటాయి. కాని, అధికశాతం ఆటగాళ్లు నియమాల్ని పాటించటం మానివేస్తే, అది పెద్ద సమస్యగా తయారవుతుంది. దానిని ఉపేక్ష చేయరాదు. ఇట్టి సమస్యకు ధర్మస్య గ్లానిః (ధర్మ జీవనము క్షీణించుట) అని పేరు.

మానవుని ప్రవృత్తికి అతని ఇచ్ఛా స్వాతంత్ర్యము మూలాధారము. ఇట్టి ఇచ్ఛా స్వాతంత్ర్యమును మానవుడు అవకాశము దొరికినప్పుడల్లా దుర్వినియోగం చేస్తూంటే, ఏదో ఒక కఠోరమైన చర్యను చేపట్టాలి. సమాజమును పునర్వ్యవస్థీకరించుటకు కావలసిన కఠిన చర్యలను ఈశ్వరుడు చేపట్టును. కాని, ఈశ్వరుడు తన ఇచ్ఛ చేత మాత్రమే ఏ కార్యమునూ చేపట్టడు. ఇతర కర్మలన్నింటితో బాటు ఈ కఠిన చర్య కూడా జీవుల సామూహిక ప్రార్థనా ఫలమే (కర్మఫలము). ధర్మ జీవనులగు వ్యక్తులు అధర్మాత్ముల చేతిలో హింసలకు గురి అవుతూ ఉంటే, వారికి ధర్మమును పాలించుట అసంభవమగును. తన్మూలకముగా మోక్షము అప్రాప్యమగును. ఇట్టి పరిస్థితి తల యెత్తినపుడు, ప్రతి వాడు ఏదో ఒకటి చేయబడాలనే తలంపుతో ప్రార్థిస్తాడు.

ధర్మ నాశమునకు అధర్మము యథార్థ కారణము

నిజంచెప్పాలంటే, ధర్మమును నశింపజేయుట సంభవము కాదు. దానిని నిప్పులలో కాల్చి చంపుట ఇత్యాదులు సంభవము కాదు గదా! ధర్మము ఒక పదార్థము కాదు. అది

మానవులు పాటించే జీవన మూల్యము. ప్రజలు ధర్మమును పాలించుట మానివేస్తే, ధర్మము నశించింది (ధర్మస్య గ్లానిర్భవతి) అని అంటారు. ధర్మమును నశింపజేయు మార్గము ఇది ఒక్కటియే.

మరియు, ధర్మము నశించుటకు ప్రజలు దానిని పాలించకపోవుట ఒక్కటియే కారణము కాదు. ప్రజలు ధర్మమును పాలించుట మానివేస్తే, జరిగేది ఒక్కటియే. వారికి కొన్ని ఫలములు దక్కవు.

అసలు సమస్య వేరే ఉన్నది. ధర్మము క్షీణిస్తూంటే, అదే సమయంలో అధర్మము పెరిగిపోతుంది. వ్యక్తి ధర్మమును పాలించుట మానివేసి, ఖాళీగా కూర్చోడు. మరేం చేస్తాడు? అతడు ఏదో ఒక పనిని చేయాలి. ధర్మమును పాలించుట మానివేసినాడు. కాన అధర్మము నాచరిస్తాడు. ధర్మనాశము వలన జరిగే యథార్థమైన హాని ఇదియే.

మానవులు నీతి నియమాలను విస్మరించి, జీవన మూల్యాలను అనాదరం చేస్తే, అధర్మం పెరిగిపోతుంది (అధర్మస్య అభ్యుత్థానమ్). ఇది సహజమే గదా! సర్వత్రా ఘోరమగు అధర్మము ఉచ్ఛృంఖలంగా విస్తరిస్తుంది.* అంటే, ప్రజలు ధర్మానికి బదులుగా అధర్మమును ఆచరిస్తారు. ఇట్టి దుస్స్థితిలో చేయగలిగేదేమున్నది?

కొందరు ధర్మమునందాసక్తి కలిగి ఉంటారు. కాని, అధార్మికుల పీడలను తాళజాలక, ధర్మమును పాటించలేకపోతారు. ఇట్టి వారి ప్రార్థనల ఫల రూపముగా ఈశ్వరుడు ఒక విశిష్ట రూపమును స్వీకరిస్తాడు. ఈశ్వరుడు స్వీకరించిన ఈ రూపమునకే అవతారమని పేరు. వేదాంతమును తెలియుటకు ఈ అవతార భావన అంత ముఖ్యం కాదు. కర్మలు అంటే యజ్ఞ యాగాదులు, ప్రార్థనలు, పూజలు మొదలైనవి అని తెలుసుకున్నట్లే, అవతారము అనేది ఒకటి కలదని, దాని స్వరూపమిది యని తెలుసుకొనుట అవసరం. ముఖ్యంగా ఈ శ్లోకం తెలియటానికి అవతారం గురించి తెలియుట అవసరం. అవతారముల, మరియు కర్మల స్వరూపస్వభావాలు తెలియుట అవసరమే. వేదాంతమంటే 'తత్ త్వం అసి' అనునది మాత్రమే. మిగిలిన దంతా మనము ఈ సత్యమును సాక్షాత్కరించుకొనుటకు ఉద్దేశించినదే.

★ అభి = అభితః = అంతటా; ఉత్థానమ్ = పెరుగుదల.

'అపుడు నేను ఒక విశిష్ట రూపమును ధరించి వస్తాను (తదా ఆత్మానం సృజామి)' అని చెప్పి శ్రీకృష్ణుడు తానే స్వయముగా ఈ శ్లోకములో అవతార సిద్ధాంతమును ప్రస్తావించెను. భగవానుని అవతారములో నిష్కలంక గర్భాధానము ప్రధానమైన అంశము. శ్రీకృష్ణుడు దేవకీ దేవి గర్భమున జన్మించిన మాట వాస్తవమే. కాని, స్వీయ సంకల్పము చేత ఈ దేహమును స్వీకరించినానని శ్రీకృష్ణుడీ శ్లోకములో స్పష్టము జేసెను. విష్ణువు మరియొక అవతారములో స్తంభము నుండి జన్మించెను. కావున, ఆయన జన్మలు ప్రకృతి సంభవములు కావని నిశ్చయమగుచున్నది. అవతారపురుషుని దేహము తల్లి దండ్రుల క్రోమోజోముల (chromozomes) కలయిక వలన ఏర్పడునది కాదు. శ్రీకృష్ణుడు ఈ శ్లోకములో తానే తన యీ స్థూల దేహమును సృజించినానని స్పష్టముగా చెప్పెను.

ధర్మము క్షీణించి, అధర్మము పెరిగినపుడు తాను అవతరిస్తానని చెప్పి శ్రీకృష్ణుడు అవతార ప్రయోజనమును యింకనూ యిట్లు వర్ణించెను.

అధ్యాయము 4, శ్లోకము 8

परित्राणाय साधूनां विनाशाय च दुष्कृताम् ।
धर्मसंस्थापनार्थाय संभवामि युगे युगे ॥ ८ ॥

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే (8)

సాధూనాం = ధర్మమునకు బద్ధులైన వారి ; పరిత్రాణాయ = రక్షణ కొరకు ; చ = మరియు; దుష్కృతాం = అధర్మవర్తనుల యొక్క; వినాశాయ = వినాశము (సన్మార్గములోనికి మళ్ళుట) కొరకు; ధర్మ–సంస్థాపన–అర్థాయ = ధర్మమును దృఢముగా స్థాపించుట కొరకు; యుగే యుగే= ప్రతియుగమునందు; సంభవామి = నేను జన్మించెదను.

> ధర్మమునకు బద్ధులైన వారి రక్షణ కొరకు, మరియు అధర్మవర్తనుల వినాశము (సన్మార్గము లోనికి మళ్ళుట) కొరకు, ధర్మమును దృఢముగా స్థాపించుట కొరకు, నేను ప్రతి యుగమునందు జన్మించెదను. (8)

భగవానుడు యేల అవతరించును? పుణ్య పాపములు అవతారమునకు అంటవు కాన, అవతార ప్రయోజనము పుణ్యపాపభోగము కాదు. భగవానుడు దుఃఖ భూయిష్ఠమగు సంసారి జీవితమును గడుపుటకు అవతరించడు. అవతారమునకు మూడు ప్రయోజనములు ఉండును. ధర్మ బద్ధమగు జీవనమును గడుపు వ్యక్తులను రక్షించుట (పరిత్రాణాయ సాధూనామ్) మొదటిది. వారిని రక్షించుట వలన ధర్మము రక్షింపబడును.

ధర్మమును రక్షించు విధము లనేకములు గలవు. భగవానుని అవతారము అధర్మమునకు ఒడగట్టు వారిని దండించును (వినాశాయ చ దుష్కృతామ్). 'వినాశాయ' అనగా 'నశింపజేయుట కొరకు' అని యర్థము. (కాని, అధర్మమును పాటించువారే వినాశమునధికముగా జేసెదరు). ఇది అవతారము యొక్క రెండవ ప్రయోజనము. ఈ రెండు విధముల యందు కూడ భగవానుడు చేయుపని ధర్మస్థాపనయే; ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే, ధర్మమును పునః స్థాపించుటయే (ధర్మ - సంస్థాపన - అర్థాయ). ఇది భగవానుని అవతారము యొక్క మూడవ ప్రయోజనము. ఇదియే యథార్థమైన ప్రయోజనము కూడా.

ధర్మమును పునః యెట్లు స్థాపించవలెను?

సువ్యవస్థను, ధర్మమును పునః స్థాపించే విధమెట్టిది? ప్రజలు ధర్మమును పాలించునట్లు చేయుట ద్వారా ఇది సాధ్యమగును. చేయగలిగినది ఇంతే. ధర్మమును స్థాపించు విధము మరియొకటి లేదు. ఈ విషయమును స్పష్టంగా తెలుసుకోవాలి. కొందరు పెద్ద ధర్మ సంస్థలను, భవంతులు మొదలగు వాటిని నిర్మిస్తూ ఉంటారు. కాని, మనము ధర్మ ప్రాసాదమును ప్రపంచములోని భవనములన్నింటి కంటె పెద్దదిగా నిర్మించినా, ధర్మ వ్యతిరేకులు దానిని కూల్చివేస్తారు. అంతే గాక, ఆ ప్రాసాదమును తిరిగి నిర్మించే ప్రయత్నమును కూడ వమ్ము చేస్తారు.

మత సంస్థలన్నీ ప్రారంభంలో ధర్మ స్థాపనోద్దేశ్యంతో ఆరంభమవుతాయి. కాని, కాలక్రమేణ వాటిలో చాలా భాగం అధార్మికములుగా తయారవుతాయి. ధర్మాన్ని సంస్థలు స్థాపించలేవు. ప్రజలే ధర్మాన్ని స్థాపించగలరు. ఎట్లు? ధర్మ జీవనమును చేపట్టుట ద్వారా మాత్రమే ధర్మమును స్థాపించి, రక్షించవచ్చును. మరియొక విధముగా ధర్మమెట్లు

రక్షింపబడగలదు? దీనిని తెలియుటకై మనము విద్వత్తును, దానిని రక్షించే విధమును పరిశీలించాలి.

గ్రంథాలయములను రక్షించుట ద్వారా విద్వత్తును రక్షించగలమా? గ్రంథాలయములను వినియోగించే విద్వాంసులున్నప్పుడే, అవి రక్షింపబడతాయి. అవి విద్వాంసుల కొరకు ఉద్దేశింపబడినవి. విద్వాంసులను ప్రోత్సహించుట ద్వారా మాత్రమే విద్వత్తు రక్షింపబడుతుంది. విద్వత్తునకు సానుకూలమగు వాతావరణమును కల్గించుట ద్వారా విద్వాంసులను ప్రోత్సహించవచ్చును. అట్టి పరిస్థితులలో మాత్రమే విద్వత్తునకు తగు వాతావరణము, విలువ ఉంటాయి.

ఉదాహరణకు మన సమాజంలో ఉపాధ్యాయులకు తక్కువ వేతనములు లభిస్తాయి. ఇందుమూలంగా, వారు ఇతర వృత్తుల వైపునకు ఆకర్షింపబడుట సహజమే. ఉపాధ్యాయునకు సంవత్సరానికి ముప్పైవేల రూపాయల ఆదాయం లభిస్తోందనుకోండి. అదే వ్యక్తికి ఇతర ఉద్యోగములలో దానికి రెట్టింపు, లేదా ఇంకా ఎక్కువ లభించే పక్షంలో, ఆతడు విద్యాలయమునే పట్టుకొని ఏల వ్రేలాడవలెను? ఈ విధంగా ఎందరో విద్వాంసులు విద్యాలయాలను వీడి పరిశ్రమలలోనికి వలస వెళ్లినారు.

విద్యాలయాలలోని జీతాలు ఇతర వృత్తుల జీతాలతో పోల్చదగ్గవిగా ఉంటే, అధ్యయన, అధ్యాపనములకు విలువ నిచ్చే వ్యక్తులు విద్యాలయాలలోనే ఉండిపోతారు. జీతాలలో భేదము అధికంగా ఉంటే, ఇది సంభవము కాదు. అధ్యయనము నందు, కంగారు లేని జీవితమునందు యథార్థమగు ప్రేమ గల వారు విద్యాలయాల్లోనే ఉంటారనే మాట వాస్తవమే. కాని, విద్యాలయాల్లో మిగిలే వారిలో చాలా శాతం, అచట లభించే ఎక్కువ సెలవుల కోసమే ఇతర వృత్తులకు వెళ్లుట లేదు.

వాతావరణము విద్వాంసులకు ప్రోత్సాహకరంగా ఉంటే, ప్రతివాడూ విద్వాంసుడవుతాడు; లేదా, అయ్యే ప్రయత్నం చేస్తాడు. విద్వత్తు రక్షింపబడుతుంది. ఇదే విధంగా, ధర్మమును పాలించే ధర్మాత్ములు రక్షింపబడితే, ధర్మమును పాలించుటకు సానుకూలమైన వాయుమండలము ఏర్పడి, ధర్మము రక్షింపబడును. ధర్మమును రక్షించుటకు మరో ఉపాయం లేదు.

సంగీతము, లలిత కళలు, నాట్యము, అభినయము ఇత్యాది మానవ స్వభావమును వ్యక్తీకరించే కళల ద్వారా ధర్మ రక్షణ సిద్ధించే అవకాశము గలదు. కావున, మనం ధర్మము నందు రూఢమైన సంస్థలను, ఆచారములను, సంస్కృతిని ఇత్యాదులను మాత్రమే ప్రోత్సహించాలి. సాంస్కృతిక సంస్థలకు ధర్మంతో ఎంతో కొంత అనుబంధం ఉంటుంది. కనుక, వాటిని కూడా ప్రోత్సహించాలి. ఇవన్నీ ధర్మమును పరిరక్షించే మార్గములే.

ధర్మమును పాలించే వ్యక్తులకు రక్షణ లేనప్పుడు, సర్వము పాప పంకిలమై వినాశోన్ముఖమై పోవును. మానవ జీవనములోని అంశములన్నీ పరస్పరం దృఢమైన సంబంధమును కలిగి ఉంటాయి. కావున, ధర్మమును పాలించేవారికి రక్షణ కరువైతే, ధర్మం అంతర్ధానమవుతుంది.

సంస్కృతి, మతము ప్రజలే

కాబట్టి, ధర్మ రక్షణలో సంస్కృతి రక్షణ, మతరక్షణ ఇత్యాదులు అంతర్గతములై ఉంటాయి. కాని, మతమైనా, సంస్కృతియైనా ప్రజలను వీడి మనజాలదు. సంస్థలు ఏవైనా ప్రజలతో సంబంధం లేకుండా మనలేవు. ఈ మాట ధర్మం విషయంలో మరింత ప్రముఖమైనది. ఒక సమాజంలో చేయకూడని పనులను చేస్తూ, చేయవలసిన వాటిని చేయనివారు ఉన్నచో, వారికి బోధించి, పరివర్తన తీసుకురావాలి.

ఒకప్పుడు హృషీకేశ్‌లో సాధువులు మాత్రమే నివసించేవారు. వారు తమ కాలాన్నంతా శాస్త్రాధ్యయనంలో గడిపేవారు. ప్రపంచంతో విరక్తిని పొందిన ఇతరులు కూడా రావటం ఆరంభమైనది. వాళ్లు కూడా అధ్యయనం చేసేవారు. ఒక వ్యక్తి భార్యా వియోగం చేతనో, వ్యాపారంలో నష్టం వచ్చుట చేతనో, లేక మరేదో కారణం వలన సాధుజీవనమును గడుపుటకు నిర్ణయించుకోవచ్చును. హిందూ సమాజంలో వ్యక్తులకు సన్న్యసించే అవకాశం సర్వదా ఉపలభ్యంగానే ఉంటుంది. సాధువైనంత మాత్రాన వ్యక్తికి అధ్యయనంలో అభిరుచి ఉండకపోవచ్చును. కాని, చుట్టూ ఉన్న అందరూ అధ్యయనం చేస్తూ ఉంటే, అతడు కూడ అధ్యయనమును ఆరంభిస్తాడు.

ఈనాడు తరుచుగా దీనికి విరుద్ధంగా జరుగుతోంది. ఒక సాధువు హృషీకేశ్‌కి వెళ్తే, అచట అతనికి తారసపడే వారు అధ్యయనము చేయువారు కాకపోవచ్చును. తన చుట్టూ

ఉన్నవారు అందరూ చేసే పనినే తాను కూడా చేయాలని భావించి, అతడు ఒక ఆశ్రమమును నడుపుట ఆరంభించును; లేదా, వీణను నేర్చుకొనుట ఆరంభించును. సంగీతమును నేర్చుకొనుట తప్పేమీ కాదు. ఒకచో సంగీతము ఒకరకమగు సాధనగా వినియోగిస్తుంది కూడా. సంగీతము భక్తిని కలిగిస్తుంది. కాని, దీనికోసం వ్యక్తి సన్న్యాసి కానక్కరలేదు. సన్న్యాసియై సంగీతము నభ్యసించుట సరిగాదు. కాని, జరుగుతున్నది ఇదియే.

మరికొందరు సన్న్యాసులు ఏవో కొన్ని యోగాసనాలను నేర్చి, అమెరికా వెళ్లి, అచట ఒక ఆశ్రమాన్ని ప్రారంభిస్తారు! తలక్రిందులుగా అయిదు నిముషాలు ఉండగల్గుటలో గొప్పదనము లేదు. రాతిపై తలక్రిందులుగా రెండు గంటలు ఉండగలిగే ఒక సాధువు హృషీకేశ్‌లో ఉన్నారు. ఇట్లు ఉండుట వలన ఆయనకు మంచి ఆకలి కల్గి, ఎక్కువ రొట్టెలను తినగల్గును. ఈ ఆసనము వలన ఇంతకు మించి యేమి ప్రయోజనము కల్గునో యన్నది సందేహమే. ఈ ఆసనములు నిరుపయోగములని నా అభిప్రాయము కాదు. వాటివలన నిస్సందేహముగా ప్రయోజనము కల్గును. కాని, నేను ఇచట చెప్పదలచిన దేమన, మనకు తలలు ఉన్నా, అవి ఏ ప్రయోజనం కొరకు ఉద్దేశింపబడినవో, మనం వాటిని ఆ ప్రయోజనం కొరకు వినియోగించుట లేదు.

ఈశ్వరుడు అవతరించే తరుణము ఆసన్నమైనదా?

ఈశ్వరుడు మరల అవతరించే తరుణము ఆసన్నమైనదా? అని కొందరు అడుగవచ్చును. ఇంకనూ అట్టి తరుణము రాలేదు. ఏలయనగా, మానవులింకనూ ఈ ఉపదేశము వైపునకు ఆకర్షితులవుతూనే ఉన్నారు. కాని, గీతను బోధించువానిపై ప్రజలు రాళ్లు కొట్టి, సత్సంగమునకు వెళ్లేవారిని అడ్డగించే కాలం వస్తే, అపుడు శ్రీకృష్ణుడు తప్పక అవతరిస్తాడు. కాని, ప్రజలకు గీతను వినే అవకాశం ఉన్నంతవరకు ఆయన రాదగిన అవశ్యకత లేదు. కాని, వందలో ఎనభైమంది అధర్మవర్తనులైతే, మిగిలిన ఇరవైమంది ధర్మమును అనుసరింపజాలరు. వారు ప్రార్థించుట తప్ప చేయగలిగేది ఏమీ ఉండదు. అపుడు మాత్రమే ఈశ్వరుడు వస్తాడు.

నీతి నియమాలు మాయమై, అధర్మం పెచ్చు పెరిగి, వ్యక్తులందరూ స్వార్థపరులుగా తయారైన పరిస్థితులలో ధర్మమును రక్షించవలసిన ఆవశ్యకత యేర్పడును. ఆ పరిస్థితులలో ప్రతి వ్యక్తి ధర్మ పాలనమును ఉపేక్షించి, తనకు అనుకూలమైన విధముగా ప్రవర్తించును.

వచ్చి స్వార్థం, అధర్మం పెరిగిపోయిన పరిస్థితులలో మాత్రమే ధర్మ రక్షణ ఆవశ్యకమగును. దుష్టులలో పరివర్తనం వచ్చి, ధార్మికుల సంఖ్య పెరిగితే, అధర్మం నశిస్తుంది. అవతారం వచ్చినప్పుడల్లా, వ్యక్తులలో మార్పు కలుగుతుంది. వారు తమ అధర్మ జీవనానికి స్వస్తి పలుకుతారు. అధర్మనాశము (వినాశాయ చ దుష్కృతామ్) అంటే ఇదియే. అధర్మ పాలకుల నందరినీ సంహరింప బనిలేదు. వారు అధర్మమును వీడగనే, ధర్మము పునఃస్థాపితమగును.

నేను ప్రతియుగమునందు జన్మిస్తాను (సంభవామి యుగే యుగే) అని శ్రీకృష్ణుడు చెప్పెను. ప్రతియుగము నందు నిశ్చితముగా ఒక అవతారము వచ్చుననే నియమము గలదని శ్రీకృష్ణుడు చెప్పుట లేదు. ఈ విషయములో గల నియమము ఒక్కటియే. ధర్మము క్షీణించి, సర్వత్రా అధర్మము పెచ్చు పెరిగి, ధర్మము నిలబడ వీలు లేని పరిస్థితిలో ఈశ్వరుడు ఒక విశిష్ట రూపమును ధరించి, జన్మించును. అవతారమనగా నిదియే.

అర్జునుని ప్రశ్నకు సమాధానమునిచ్చి, శ్రీకృష్ణుడు తన గురించి, తన జన్మ గురించి, పరమ సత్యమును గురించి వర్ణనను కొనసాగించెను:

అధ్యాయము 4, శ్లోకము 9

जन्म कर्म च मे दिव्यमेवं यो वेत्ति तत्त्वतः ।
त्यक्त्वा देहं पुनर्जन्म नैति मामेति सोऽर्जुन ॥ ९ ॥

జన్మ కర్మ చ మే దివ్య మేవం యో వేత్తి తత్త్వతః
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోర్జున (9)

అర్జున = ఓ అర్జునా; **యః** = ఎవడైతే; **మే** = నా యొక్క; **దివ్యం** = దివ్యమగు; **జన్మ** = జన్మను; **చ** = మరియు; **కర్మ** = కర్మను; **ఏవం** = ఈ విధముగా; **తత్త్వతః** = యథార్థముగా; **వేత్తి** = ఎరుంగునో; **సః** = అతడు; **దేహం** = దేహమును; **త్యక్త్వా** = విడిచిపెట్టి; **పునః** = తిరిగి; **జన్మ** = జన్మను; **న ఏతి** = పొందడు; **మాం** = నన్ను; **ఏతి** = పొందును.

ఓ అర్జునా! ఎవడైతే ఈ విధముగా నా యొక్క దివ్యమగు జన్మను, మరియు కర్మను యథార్థముగా నెరుంగునో, అతడు ఈ దేహమును విడిచిన తరువాత మరల జన్మించడు. అతడు నన్ను పొందును. (9)

'దివ్యం' అనగా దేవలోక సంబంధి; అనగా, ఇహలోక సంబంధి కాదు. శ్రీకృష్ణుని జన్మ దివ్య జన్మ. అనగా అది ఇతరమగు జన్మ వంటిది కాదు; అది అసాధారణమగు జన్మ. శ్రీ శంకరులు భాష్యములో 'ఐశ్వరం' అను పదమును జోడించి, శ్రీకృష్ణుని జన్మ జీవుని జన్మతో సమమైనది గాదనియు, అది ఈశ్వరీయ మనియు స్పష్టము చేసెను.

మరియు, శ్రీకృష్ణుని చేష్ట (కర్మ చ) కూడ ఇతర కర్మల వంటిది గాదని ఈ శ్లోకములో చెప్పబడెను. ఇతరుల కర్మలన్నీ వ్యక్తిగత కామనల నుండి ఉద్భవించి, పుణ్యపాపములకు హేతువులగును. కాని, శ్రీకృష్ణుని విషయంలో అట్లు గాదు. కాన, ఆయన చేష్టలకు దివ్యకర్మలనియు, ఐశ్వర కర్మలనియు పేరు.

శ్రీకృష్ణుని విలక్షణమగు జన్మను గూర్చి, కర్మను గూర్చి సత్యము నెరింగిన వ్యక్తిని (యః వేత్తి) ఈ శ్లోకము వర్ణించుచున్నది. ఈతడు వాటిని గూర్చి యథాతథముగా నెరుంగును (తత్త్వతః వేత్తి). ఈ సత్యమును సుస్పష్టముగా నెరింగిన వ్యక్తి శ్రీకృష్ణుని సామాన్య మానవునిగా, ఇతరుల వలె జన్మించి మరణించే వానిగా, జగత్తు కంటె భిన్నమైన వానినిగా దర్శించడు. ఇతడు శ్రీకృష్ణుని జన్మకర్మల యాథార్థ్యమును దర్శించును.

సత్ ఎన్నటికీ మారదనియు, అసత్ (మిథ్యా) నిత్యముగా ఉండేది కాదనియు, శ్రీకృష్ణుడు ద్వితీయాధ్యాయములో చెప్పియుండెను. కావున, శ్రీకృష్ణుని దేహము వ్యావహారికమైనా, ప్రాతిభాసికమైనా, రెండు పక్షములలో కూడా మిథ్యయే గాని పారమార్థికము గాదు. దేహము మిథ్యయనియు, ఆత్మయే సత్యమనియు యెరింగిన వాడే తత్త్వవేత్త (తత్త్వతః యః వేత్తి). ఇట్టి వ్యక్తికి యథార్థమగు జన్మ సంభవించుట లేదనియు, వాస్తవమగు కర్మ జరుగుట లేదనియు తెలియును.

ఈశ్వరుడగు శ్రీకృష్ణుడు తన ఆత్మ కంటె భిన్నము కాదనియు, 'నేను ఆ పరమేశ్వరుడను' అనియు యెరింగిన వ్యక్తి జ్ఞాని యనబడును. ఇట్టి జ్ఞాని స్థూలదేహమును విడిచిన తరువాత, అనగా మరణించిన తరువాత, మరల జన్మించడు. ఈశ్వరుని తెలుసుకొనుట

యనగా సర్వదా భావరూపమగు సత్యము నెరుంగుటయే. ఆత్మయే సత్తు. కాన, పరమేశ్వరుని యెరుంగుట అనగా ఆత్మను ఎరుంగుటయే. వాస్తవంలో, ఈశ్వరుని (పరబ్రహ్మను) తెలియదగిన మార్గము ఆత్మజ్ఞానమొక్కటియే.

వ్యక్తి ఈ తీరున మోక్షమును పొందును. వ్యక్తి జీవించియుండగనే, ఆత్మజ్ఞానమును పొంది ముక్తుడగును. తదనంతరము అట్టి వ్యక్తికి మరల జన్మ ఉండదు. ఆ వ్యక్తిలోని జీవత్వము తొలగిపోవును. అట్టివానిని జీవన్ముక్తుడు (జీవించి ఉండగనే ముక్తిని పొందినవాడు) అందురు. ఆత్మ కర్తకాదని యెరింగిన జీవన్ముక్తుడగు జ్ఞానికి కర్మలు ఉండవు. కావున, మరియొక జన్మకు ఆరంభకములగు పుణ్యపాపములాతనికి ఉండవు. ఆత్మను కర్తగా స్వీకరించే వానికి మాత్రమే కర్మలు, వాటివలన మరల మరల జన్మలు సంభవించుచుండును.

మరణానంతరము జ్ఞాని యేమగును?

జీవన్ముక్తునకు పునర్జన్మ లేదు గదా! అట్టిచో, ఆయన ఎచటకు పోవును? ఎక్కడో ఒకచోట స్థిరనివాస మేర్పరుచుకొనునా యేమి? జీవన్ముక్తునకు పునర్జన్మ లేదు గాన, ఆయన ఎక్కడో ఒక చోట ఉండాలి అనే ధారణపై ఈ ప్రశ్న ఆధారపడి యున్నదని స్పష్టమే. జ్ఞానికి మరణానంతరము శాశ్వత కారాగారవాసమా యేమి?

ఈ ప్రశ్నకు సమాధానముగా, శ్రీకృష్ణుడు 'ఆ వ్యక్తి నన్ను పొందును; అనగా, నాతో ఐక్యము చెందును (సః మాం ఏతి)' అని చెప్పెను. జీవుడు మాయమై, ఈశ్వరుడు మిగులును. ఉన్నది బ్రహ్మ మొక్కటియే. బ్రహ్మమే ఈశ్వరుడు. బ్రహ్మమే సర్వము. కావున, జీవుడు లేడు. ఉన్నది ఈశ్వరుడు మాత్రమే. జీవుడు తన యథార్థ స్వరూపమగు ఈశ్వరత్వమును తెలియనంతవరకు, ఈశ్వరుడు, జీవుడు అనే రెండు విభిన్న తత్త్వములు భాసించును.

ఈ శ్లోకములో 'ఏతి (పొందును)' అను పదమును స్పష్టముగా తెలుసుకొనవలెను. ఈ పదమును సామాన్యార్థంలో వాడిన పక్షంలో, ఈశ్వరునితో ఐక్యమును పొందుట యనగా, అమీబా సూక్ష్మ క్రిమి వలె జీవుడు ఈశ్వరునిచే కబళింపబడునని యర్థము వచ్చును. కాని, జీవత్వము వాస్తవంలో మిథ్యారూపమైన పక్షంలో, వ్యక్తి తన యథార్థ స్వరూపము నెరింగిన వెంటనే జీవత్వము తొలగిపోవును. ఈశ్వరుని కంటె భిన్నముగా జీవుడు లేడు. ఉన్నదంతయూ ఈశ్వరుడే.

ఇచట ఉన్న సమస్య విభేదము. కాని, విభేదము వాస్తవము కాదు! ఉన్నది సర్వమూ ఈశ్వరుడే. ఈశ్వరుడు ఒక స్థానములో నుండగా, జీవన్ముక్తుడు అచట ఆయనను కలుసుకొనును అనునది సిద్ధాంతము కాదు. బ్రహ్మ ప్రాప్తి కేవలము జ్ఞానరూపము మాత్రమే.

నీవీ జ్ఞానమును సృష్ట్యాదియందు వివస్వానునకు ఇచ్చితివనుట యెట్లు పొసగును? అనే అర్జునుని ప్రశ్నకు సమాధానమునిస్తూ శ్రీకృష్ణుడు ఆత్మ స్వరూపమును వివరించెను. దుఃఖమునకు కారణము, దుఃఖమును తరించు ఉపాయము అనునవి గీత యొక్క విషయ వస్తువులు. శ్రీకృష్ణుడు అనేక విషయములను చర్చించినా, విషయవస్తువును ఏక, అవిచ్ఛిన్న ప్రవాహముగా ప్రదర్శించెను. శ్రీకృష్ణుడు అర్జునుని ఇప్పటి ప్రశ్నకు సమాధానము నిచ్చి, తదుపరి నీవు శోకింపదగని వారిని గూర్చి శోకిస్తున్నావు (అశోచ్యానన్వ శోచస్త్వమ్, 2.11) అను ప్రధాన విషయమును మరల చేపట్టి, తరువాతి శ్లోకములో వివరించుచున్నాడు:

అధ్యాయము 4, శ్లోకము 10

वीतराग भयक्रोधा मन्मया मामुपाश्रिताः ।
बहवो ज्ञानतपसा पूता मद्भावमागताः ॥ १० ॥

వీత రాగ భయ క్రోధా మన్మయా మాముపాశ్రితాః
బహవో జ్ఞానతపసా పూతా మద్భావమాగతాః (10)

వీత – రాగ – భయ – క్రోధాః = తృష్ణ, కోపముల నుండి విముక్తులైనట్టియు; **మన్మయాః** = నా యందు ఐక్యమును పొందినట్టియు; **మాం** = నన్ను; **ఉపాశ్రితాః** = శరణు పొందినట్టియు; **జ్ఞాన తపసా** = జ్ఞానమనే తపస్సు చేత; **పూతాః** = పవిత్రులైన; **బహవః** = అనేకులు; **మద్భావం** = నా స్వరూపమును; **ఆగతాః** = పొందిరి.

తృష్ణ, భయము, కోపముల నుండి విముక్తులైనట్టియు, నా యందు ఐక్యమును పొందినట్టియు, నన్ను శరణు పొందినట్టియు, జ్ఞానమనే తపస్సు చేత పవిత్రులైన అనేకులు నా స్వరూపమును పొందిరి. (10)

శ్రీకృష్ణుని యాథార్థ్యము నెరింగిన వ్యక్తి, ఆయనకు వాస్తవమగు జన్మ కాని, కర్మ కాని లేదని యెరుంగును. ఈ విషయమును మన మింతకు ముందు చూచియున్నాము. వాస్తవమగు జన్మ, కర్మలు లేని వ్యక్తి యెవరు? ఇట్టి వ్యక్తి ఒక నిర్దిష్ట దేశములో, నిర్దిష్ట కాలములో జన్మించిన శ్రీకృష్ణనామధేయుడు కాజాలడు. ఇది ఇతరులందరి విషయములో కూడా సత్యమే. అనగా, జీవుడు యథార్థముగా పరమాత్మయే. అందువలననే, శ్రీకృష్ణుడు ఈ సత్యము నెరింగిన వాడు నన్ను పొందును అని చెప్పెను.

ఈ తీరున శ్రీకృష్ణుని యెరుంగుట యనగా తనను తాను ఎరుంగుటయే. జీవేశ్వరుల అభేదము నెరుంగని జీవుడు (వ్యక్తి) ఈశ్వరుని తెలియజాలడు. పరిచ్ఛిన్న వ్యక్తి సర్వజ్ఞ తత్త్వము నెరుంగజాలడు. 'సర్వజ్ఞ' అను పదమును గురించి చర్చించుటయూ కష్టమే! కావున, ఈశ్వరీయ జ్ఞానము నిస్సీమమైనదని మాత్రమే మనము చెప్పగలము.

అల్పజ్ఞానియగు జీవుడు సర్వజ్ఞతను ఎన్నటికీ తెలియజాలడు. కాని, అల్పజ్ఞత్వాపేక్షయా మాత్రమే సర్వజ్ఞత్వముండును. అల్పజ్ఞత్వ, సర్వజ్ఞత్వములు రెండు పరస్పర సంబద్ధములగు ఉపాధులు. వాటి మధ్యగల భేదము ఉపాధికృతము మాత్రమే. పరమాత్మను తెలిసిన వాడు నన్ను పొందును అను శ్రీకృష్ణుని వాక్యమునకు, పరమాత్మ జీవుని కంటె భిన్నము కాదని తాత్పర్యము. శ్రీకృష్ణుడీ విషయమును ఇతఃపూర్వము కూడ చెప్పియుండెను. ఆయన దానినే పునరుద్ఘాటించి, 'శోకము' అనే విషయవస్తువును వివరించ నారంభించెను.

ఈ జ్ఞానము సృష్ట్యాది నుండి జనులకు లభ్యముగనే యుండెననియు, జనులు అన్ని కాలములయందు ఈశ్వరుని సాక్షాత్కరించుకొని, ఐక్యమగుచుండురనియు శ్రీకృష్ణుడు అర్జునునకు చెప్పెను. ఈ జ్ఞానము క్రొంగ్రొత్తది కాదు. ఎంతోమంది పుణ్యాత్ములు తనలో ఐక్యమైనారని (బహవః మద్భావం ఆగతాః), శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పెను. అట్లైనచో, వ్యక్తులందరు ఈశ్వరుని యేల పొందుట లేదు? ఈశ్వరుని పొందుటలో క్లేశమేమీ లేదు. కాని, తాను పరమేశ్వరుని పొందాలి అనే గుర్తింపు వ్యక్తిలో ముందుగా కలగాలి. ఇట్టి గుర్తింపు కల్గిన తర్వాత కూడా, వ్యక్తి తృష్ణా భయ క్రోధములచే ప్రేరితుడైనచో, అట్టి వ్యక్తి ఈశ్వరుని యెట్లు పొందగలడు?

జీవుని యథార్థ స్వరూపము ఈశ్వరుడే గనుక, జీవుడు క్రొత్తగా పొందవలసినది ఏదీ లేదు. కావున, వ్యక్తి యొక్క వివేక శక్తి ఎంతవరకు వ్యాపించినది, వ్యక్తి కోరుకునేది యేది అను విషయములే ప్రముఖమైనవి. తృష్ణా భయ క్రోధములు తొలగిపోయిన వ్యక్తులను శ్రీకృష్ణుడీ శ్లోకములో వర్ణించెను.

భయస్వరూపము

వస్తువులపై మనకు గల తృష్ణకు రాగమని పేరు. రాగమున్నచోట ద్వేషము కూడా ఉండును. మానవుడు తనకు సానుకూలము కాని వాటిని ద్వేషించి, పరిహరించును. ఇట్లు రాగ ద్వేషములు కలిసి ఉండి, వ్యక్తిని దృఢముగా బంధించును. రాగద్వేషములు గల వ్యక్తిలో ఏవో కొన్ని ఆశంకలు బయల్దేరి భయమునకు దారితీయును. రాగమున్నచోట అట్టి రాగమునకు పాత్రమైన విషయమునకు ఎట్టి హాని సంక్రమించునో యను భయము తప్పదు. కోర్కెలు, రాగములు వ్యక్తిని బంధించు తీరు ఇదియే.

'అది నాకు తప్పక లభించాలి' ఇత్యాది రాగము, 'నాకీ విధమగు కష్టము కలుగరాదు' ఇత్యాది ద్వేషము వ్యక్తిని బంధించును. ఇట్టి రాగద్వేషములున్నచోట భయమేల ఉండదు? రాగమున్నచోట అపేక్ష ఉండితీరును. తాను అపేక్షించిన విధముగా ఘటనలు సంభవించవేమో యను భయము వ్యక్తిని సదా వెంటాడును. అపేక్ష ఉన్న సందర్భములు కొన్నింటిలోనైనా అపేక్ష నెరవేరకపోయే అవకాశముండును. అట్టి సందర్భములలో వ్యక్తికి తాను అకృతార్థుడనని ధారణ యేర్పడును. ఏ ఒక్కడూ సర్వజ్ఞుడు కాడు. పరిస్థితులు అన్నివేళలా అనుకూలంగా ఉండవనేది అందరికీ తెలిసిన సత్యము. కాన, యోజనలు విఫలమవుతాయేమో యను భయము ఉండును. కాన, మనమిచట తెలియదగినది యేమన, మానవులు రాగద్వేష ప్రేరితులై నంతవరకు, ఊహించని ప్రతి కూలములు, అడ్డంకులు యేర్పడునేమో యను భయము ఉండితీరును.

క్రోధ స్వరూపము

రాగ ద్వేషములున్న చోట భయముతో బాటు క్రోధము కూడ ఉండును. ఒక కామన నెరవేరనప్పుడు, అది నెరవేరుటలో అడ్డుపడే వాటిపై క్రోధము యేర్పడును. వ్యక్తికి, అతడు సాధింపబూనిన దానికి మధ్యలో మరొక వ్యక్తి అడ్డుగా నిలిచినచో, అతని కామన క్రోధముగా మారును. బంధహేతువు కాని కామన క్రోధమునకు దారితీయదు.

కాని, ఒక వస్తువు ఉండి తీరాలి అని, అది లేనిదే జీవితము అసమగ్రము అని భావించు వ్యక్తి యొక్క కామన బంధహేతువు గనుక, అతడు క్రోధమును వీడజాలడు.

ఈ తీరున, రాగద్వేష నియంత్రితమైన జీవనములో క్రోధము కూడ ఉండును. కాని, వ్యక్తి కర్మ యోగ జీవనమును గడువుచున్నచో, రాగద్వేషములు నిర్ప్రభావము లగును. తన రాగద్వేషములను యోగ్యమగు దృక్పథముతో పరిశీలించగలిగే వ్యక్తి వీతరాగ భయ క్రోధుడు అగును. అనగా, కోరిక, భయము, క్రోధముల నుండి విముక్తుడగును. శ్రీకృష్ణుడు ఇట్టి వ్యక్తులను గురించియే, వారు నాతో ఏకమగుదురు (మన్మయాః) అని యీ శ్లోకములో వివరించెను. ఈశ్వరుడు తత్త్వతః జీవుని కంటె భిన్నుడు కాదు అనే సాక్షాత్కారము వీరికి కలుగును.

జీవేశ్వరాభేద సాక్షాత్కారము

జీవేశ్వరుల మధ్య యథార్థమగు భేదమేమీ లేదు. కాని, ఉపాధి వలన భేదము భాసిస్తుంది. కాన, ఈ భేదము మిథ్య. భేదము మిథ్య గనుక, అభేదము సత్యము. అదియే ముఖ్యము. 'అది నీవే (తత్ త్వం అసి)' అనే మహా వాక్యము ఈ జీవేశ్వర అభేదమును ప్రతిపాదించి, అభేదబుద్ధిని కలిగించును. ఈ సత్యము మనన, నిది ధ్యాసనముల వలన స్పష్టముగా సాక్షాత్కరించును. ఈ సత్య సాక్షాత్కారము గల వారిని ఈ శ్లోకము మాముపాశ్రితాః అని వర్ణించినది. అనగా, పరమేశ్వరుని యందు పూర్తిగా ఐక్యము చెందిన వారని అర్థము. అట్టి వారిలో జీవుడు పరమేశ్వరుని కంటె భిన్నము అనే భ్రాంతి కొనసాగదు.

ఆత్మయే పరమాత్మ. ఈ జ్ఞానము విషయములో సంశయరహితమగు సాక్షాత్కారము గలవారు 'పూతాః' అనబడుదురు. అనగా, పవిత్రులు అని యర్థము. ఇట్టి వ్యక్తులలో దోషము లేశమైననూ ఉండదు. ఏలయనగా, పరమాత్మ కంటె భిన్నము కాని ఆత్మ నిత్యశుద్ధము. ఆత్మను శుద్ధి చేయుట అనుట సరిగాదు. ఆత్మ నిత్యశుద్ధము. ఆత్మ శుద్ధముగా చేయవలసిన తత్త్వము అయిన పక్షంలో, ఏదో కొంత దోషము సర్వదా మిగిలియే యుండును.

ఈ వ్యక్తులు ఏ తీరున పవిత్రులైనారు? జ్ఞాన తపస్సు యొక్క పావనశక్తి చేత. జ్ఞానమే సాధనము. జ్ఞానము యొక్క శక్తియే ఇచటి తపస్సు. జ్ఞానము వలన కలిగే

అనుశాసనము వ్యక్తులను పవిత్రులను చేయును. జ్ఞానము వలన పవిత్రత యెట్లు లభించును? ఆత్మకు ఏకాలమందైననూ, ఎట్టి కర్మతో నైననూ సంబంధము లేదు. ఆత్మ కర్త కాదు. కాన, ఆత్మ యందు ఎట్టి కర్మదోషములు ఉండవు. ఆత్మ తద్భిన్నమగు ఇతర తత్త్వముల కర్మకు విషయము కాదు గనుక, ఆత్మ యందు ఇతర కర్మ జన్యమగు లోపము ఏమియూ లేదు. ఆత్మ కర్త కాదు; కర్మకు విషయము కాదు. కాన, అది నిత్యశుద్ధము.

కర్మయోగము ద్వారా వీతరాగ భయక్రోధులై, జ్ఞానోదయము నకు ఆవశ్యకమగు మానసిక సంసిద్ధత, అంతఃకరణ శుద్ధి గల వ్యక్తులను ఈ శ్లోకము వర్ణించుచున్నది. ఇచట ఒక విషయమును గమనించాలి. ఈ అంతఃకరణ శుద్ధి అనేది పూర్ణము ఎన్నటికీ కాజాలదు. ఏదో కొంత అశుద్ధి రాగద్వేషరూపముగా సర్వదా మిగిలియుండును. అనగా, కర్మయోగము ద్వారా లభించే అంతఃకరణ శుద్ధి సాపేక్షికము మాత్రమే. ఆత్యంతిక శుద్ధి ఎన్నటికీ లభించేది కాదు. ఆత్మ నిత్యశుద్ధము, పూర్ణము. కనుక, పూర్ణ శుద్ధి ఆత్మజ్ఞాన రూపముగా మాత్రమే సంభవమగును. కాని, తద్భిన్నంగా సాపేక్షికమగు అంతఃకరణ శుద్ధి బుద్ధియందు సంపాదింపబడును.

సాపేక్షిక శుద్ధి, ఆత్యంతిక శుద్ధి

సాపేక్షిక శుద్ధి ఒక మానసిక పరిణతి చెందే ప్రక్రియ. దీని యందు జాగరూకత, అనుశాసనము, నియమబద్ధత, మరియు ప్రార్థనలతో కూడిన జీవితము ఇమిడియుండును. కాని, ఆత్యంతిక శుద్ధి శుద్ధీకరణ ప్రక్రియ కాదు. ఏలయన, శుద్ధి చేసే ప్రక్రియ యేదైనా, ఎంత బాగా శుద్ధి చేసినా, శుద్ధము కాని వస్తువు శుద్ధము కాజాలదు. నిత్య శుద్ధమగు ఆత్మను కొత్తగా శుద్ధిచేయ బని లేదు.

శుద్ధియనగా రాగద్వేషముల నుండి, పుణ్యపాపముల నుండి, వాస్తవంలో సర్వము నుండి విముక్తియే. ఈ శుద్ధి ఆత్మ యొక్క స్వరూపము. ఆత్మ సర్వగుణ విముక్తము (నిర్గుణత్వాత్); కర్తృత్వ విముక్తము (అకర్తృత్వాత్). ఈ సత్యము నెరింగిన జ్ఞానులు కూడ శుద్ధులు (పూతాః) అగుదురు. అనగా, వారు నిత్య శుద్ధులగు ఆత్మరూపులే యని అర్థము. వారు 'మద్భావమాగతాః' అనగా 'వారు నాతో ఐక్యమును చెందిరి' అని శ్రీకృష్ణుడు చెప్పెను.

ఎందరో (బహవః) జీవులు ఈశ్వరుని చేరిరి అను వాక్యమును జీవేశ్వరా భేద దృష్ట్యా తెలుసుకోవాలి. ఈ జీవులందరు ఈశ్వరుని వద్దకు జేరి, ఆయన తలపై కూర్చుంటారని అర్థము కాదు! లేదా, ఈశ్వరుడు ఈ జీవులనందరినీ ప్రోగుచేసుకుని తన హృదయములో, లేదా ఉనికిలో అవిభాజ్యమగు అంశముగా చేసుకున్నాడనియూ అభిప్రాయము కాదు. ఈ వాక్యములోని జ్ఞానము, 'జీవుడు ఈశ్వరుని కంటె వేరు గాదు' అను సత్యమును ప్రదర్శించును. ఈ విశిష్టజ్ఞానము జీవుడే ఈశ్వరుడు అనే సత్యమును ఉద్ఘాటించును. ఈ సత్యము నెరింగినవారు ఈ జ్ఞానమును పొందుట మాత్రమే గాక, దానియందు పరినిష్ఠితులగుదురు. కనుక, వారు జ్ఞాన నిష్ఠులనబడుదురు. ఈశ్వరుని పొందుటకై జ్ఞానమును మించిన తపస్సు వేరే ఏదీ ఆవశ్యకము కాదు. కావున, 'తపస్సుచే పవిత్రమైన వారు (తపసా పూతాః)' అనిచెప్పినచాలదు. తపస్సు వివిధ రకములుగ నున్నది. కాన, తపశ్శబ్దమునకు జ్ఞాన శబ్దమును జోడించాలి.

జ్ఞానసాధనయే ప్రధాన తపస్సు

ఆధ్యాత్మికమగు సాధనలన్నీ తపస్సులే. ఉదాహరణకు ప్రతిదినము ఒక వ్యక్తి ఆరుగంటలు గాయత్రీ జపము చేయుచుండును. అది మత పరమగు తపస్సు అనబడును. ఒక వ్యక్తి మానసికముగా ప్రార్థనలు చేయుట కొరకై ఆధ్యాత్మిక సాధనా రూపముగా అధికకాలము మౌనమును పాటించుచున్నచో, అది కూడ ఒకరకమగు తపస్సు అగును. అట్లు గాక, ఒక వ్యక్తి ఇతరుల సౌకర్యమును దృష్టిలో నిడుకొని, మౌనముగ నున్నచో, అది పూర్తిగా భిన్నమగు మౌనము. అది తపస్సు కాదు.

ఒక వ్యక్తి శాస్త్రాధ్యయనము, మననము ఇత్యాది ఆధ్యాత్మిక అను శాసనములను పాటించుచున్నచో, అది తపస్సు అగును. శాస్త్రము నధ్యయనము చేయుట (స్వాధ్యాయము) గొప్ప తపస్సు అని పరిగణిస్తారు. కావున, శాస్త్రమును వినుట (శ్రవణము) కు, ఆత్మ విచారమునకు కట్టుబడిన వ్యక్తులు గొప్ప తపస్సును చేయుచున్నారు.

తపస్సులు అనేక విధములుగా నున్ననూ, ఈ జ్ఞానము నందు స్థైర్యము కలుగుటకై జ్ఞాన తపస్సు మాత్రమే ఆవశ్యకమగును. ఈ జ్ఞానము వలననే మోక్షము కలుగును గాన, జ్ఞాన నిష్ఠ ఇతర తపస్సులపై ఆధారపడదు. ఇందువలననే, తపస్ పదమునకు ముందు జ్ఞాన

పదము జోడించబడినది. జ్ఞానలభ్యమగు మోక్షము కంటె భిన్నముగా వేరొక మోక్షము లేదు. మోక్షమునకు జ్ఞానము ఆవశ్యకమైతే, జ్ఞానమునకు విచారము తప్ప మరేదీ ఆవశ్యకము కాదు. కావున, జ్ఞానమును సంపాదించుటయే సాధనము.

అట్లైనచో, మిగిలిన అనుశాసనము లన్నిటి మాట యేమి? ఈ జ్ఞానము ఉదయించే విధంగా మనస్సును సంసిద్ధము చేయుటయే వాటి ప్రయోజనము. మనస్సును శుద్ధము చేయుట (అంతఃకరణశుద్ధి) అనగా నిదియే. కావున, జ్ఞానము మోక్షములో సాక్షాత్సాధనము కాగా, మిగిలిన అనుశాసనములన్నియూ పరంపరా సాధనములగును.

ఈ మిగిలిన అనుశాసనములన్నీ గౌణములు. అంటే, వాటికి స్థానము లేదని అర్థము కాదు. ఈ అనుశాసనములన్నీ అంతఃకరణ శుద్ధికి సహకరించి, తద్ద్వారా పరంపరయా మోక్షసాధనములగును. కాని జ్ఞానాన్వేషణము జ్ఞానరూప మోక్షములో సాక్షాత్సాధనము. ఈ తేడాను స్పష్టంగా తెలుసుకోవాలి.

మానవులందరూ ఈశ్వరునిలో ఐక్యమగుదురా?

శ్రీకృష్ణుడీ శ్లోకములో 'చాల మంది (బహవః)' అను పదమును వాడెను. కాన, కొందరు మాత్రమే ఈశ్వరుని యందు ఐక్యమగుదురనియు, మిగిలిన వారు అట్లు కారనియు అర్జునుడు భావించి యుండవచ్చును. 'బహవః' అనగా ముగ్గురు కావచ్చును. లేదా, ముప్పై లక్షలు కావచ్చును. అంతకంటె ఎక్కువ కూడా కావచ్చును. కాని, ప్రధాన విషయమేమనగ 'బహవః' అను పదము ఒకానొక పరిచ్ఛిన్న సంఖ్యను నిర్దేశించును. కాన, నీవు సర్వులను ఏల నీ దరి చేరనీయవు? అని అర్జునుడు శ్రీకృష్ణుని ప్రశ్నించి యుండవచ్చును. ఇట్టి ప్రశ్నకు శ్రీకృష్ణుడు ఇట్లు సమాధానమును చెప్పవచ్చును: వారు నా కంటె వేరుగా నున్నచో, వారిని నా దరికి చేర్చుకునే ప్రసక్తి ఉదయించును. కాని, వారు నా కంటె వేరుగాదు. వారు నా కంటె భిన్నముగా నున్నచో, నేనేదేని ఉపాయమును ఆలోచించియుండెడివాడను. కాని, వారు నా కంటె వేరు కాదు గనుక, నేనేమి చేయగలను? నేను జీవుల కంటె వేరు కాదు గనుక, వారిని నా దరికి చేర్చుకొనుట సంభవము కాదు. ఈ విషయములో నేను చేయగల్గినది ఏమీ లేదు. వారు ఈశ్వరుడనగు నన్ను ప్రార్థిస్తారు. వారు నన్నే రూపములో ప్రార్థించినా, నేను వారిని ఆశీర్వదిస్తాను. వారు కోరునది వారికి లభిస్తుంది. కావున, ఈ విశిష్ట పరిస్థితిలో, నాలో దోషమేమియూ లేదు. ఈ విషయములో నెరవేర్చుకోదగిన రాగద్వేషము లేమియూ నాకు

లేవు. ఎవరు దుఃఖాలను పొందాలి? ఇత్యాది విషయాలను నిర్ణయించేందుకు లాటరీ పద్ధతిలో టోపీలో నుండి చీటీలను తీసే అలవాటు నాకు లేదు. నేనిట్టి నియమమును దేనినీ పాటించుట లేదు.

ఈ విధంగా, శ్రీకృష్ణుడు తరువాతి ప్రకరణానికి కావలసిన పునాదిని ఇచటనే నిర్మించినాడు. వ్యక్తుల జీవితములో జరిగే వివిధ ఘటనలకు ఈశ్వరుని దోషమేమియూ లేదు. ఈ విషయమును భగవానుడు తరువాతి ప్రకరణములో వివరించినాడు. భగవానుడీ విషయమును వివరించనిచో, భగవానుడు ఒకనికి సుఖమును, మరియొకనికి దుఃఖమును ఏల ఇచ్చుననియు, భగవానునకు ఇట్టి వైషమ్యము తగునా యనియు, మనము ప్రశ్నిస్తూ ఉండెడివారము.

అధ్యాయము 4, శ్లోకము 11:

> ये यथा मां प्रपद्यन्ते तांस्तथैव भजाम्यहम् ।
> मम वर्त्मानुवर्तन्ते मनुष्याः पार्थ सर्वशः ॥ ११ ॥

> యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్
> మమ వర్త్మాను వర్తంతే మనుష్యాః పార్థ సర్వశః (11)

యే = ఎవ్వరైతే; **యథా** = ఏవిధముగా; **మాం** = నన్ను; **ప్రపద్యంతే** = కొలిచెదరో; **తాన్** = వారిని; **తథా ఏవ** = ఆ విధముగనే; **భజామి** = అనుగ్రహించెదను; **పార్థ** = ఓ అర్జునా!; **మనుష్యాః** = మానవులు; **సర్వశః** = అన్ని మార్గముల యందు; **మమ** = నా యొక్క; **వర్త్మ** = దారిని; **అనువర్తంతే** = అనుసరించుచున్నారు.

> ఎవ్వరైతే నన్ను ఏ విధముగా కొలిచెదరో, వారిని ఆ విధముగనే అనుగ్రహించెదను. ఓ అర్జునా! మానవులు మార్గములన్నిటి యందు నా దారినే అనుసరించుచున్నారు. (11)

ఇచట కూడా శ్రీకృష్ణుడు ఈశ్వరుని స్థానము నుండి పలుకుచున్నాడు. భగవానుని ఆరాధించుట యెట్లు? అను ప్రశ్నకు ఈ శ్లోకములో సమాధానము లభించును. కావున, యీ శ్లోకము చాల ప్రముఖమైనది. మానవులు భగవానుని ఏ శ్రేణికి చెందిన భక్తితో

ఆరాధించాలి? ఏ ప్రయోజనము కొరకు ఆరాధించాలి? ఈశ్వరుని ఆరాధించుటలో యెట్టి ఆంతరిక దృఢతను కలిగి ఉండాలి? మానవుడు ఈశ్వరుని ఏ రూపములో ఆరాధించాలి?

శ్రీకృష్ణుని అభిప్రాయములో ఇదంతా చాలా సరళమైన విషయము: మానవులు తమ తమ కర్మలను, ఉపాసనలను అనుసరించి నన్ను ఏ రూపములో కొలిచినా, నేను వారిని ఆశీర్వదిస్తాను. ఉదాహరణకు, ధనార్థులై చౌర్యమునకు పాల్పడువారిని కారాగారవాసము కలుగుగాక యని ఆశీర్వదిస్తాను. ఇది చాలా సరళమైన విషయము. నన్ను నిందింప బని లేదు.

భక్తుడు ఈశ్వరుని శ్రీకృష్ణ రూపములో ఆరాధించినచో, ఈశ్వరుడు ఆ రూపములోనే దర్శనమిచ్చును. మరో మాటలో చెప్పాలంటే, ఈశ్వరుని శ్రీకృష్ణ రూపములో దర్శించుట అనునది కేవలము విషయి నిష్ఠము మాత్రమే. ఈ దర్శనము భక్తునకు పరమ సత్యమే కావచ్చును. నేను నిన్ననే శ్రీకృష్ణ భగవానుని దర్శించితిని అని భక్తులు చెప్పే సందర్భములు గలవు. చిరకాలము నుండి భగవానుని శ్రీకృష్ణ రూపములో ఆరాధించుచున్న భక్తునకు ఈశ్వరుడా రూపములోనే దర్శనమిచ్చుట సుసంగతము. కాని, ఇట్టి ఈశ్వరుడు దర్శనమిచ్చి, అంతర్ధానమగును. అనగా, ఈ దర్శనము కాలబద్ధమై యుండును. కాని, శ్రీకృష్ణ భగవానుని దర్శించిన వ్యక్తి మిగులును. కనబడి అంతర్ధానమయ్యే ఈశ్వరుని కంటె భక్తుడే గొప్పవాడని దీని యర్థమా? అట్లైనచో, ఈయన యెట్టి ఈశ్వరుడో!

ఈశ్వరుడు వేరొక రూపములో కనబడినచో యేమగును? పాశ్చాత్య దైవము వలె కోటు, బూటు, సూటు ధరించి, కనబడినచో యేమగును? భక్తునకు మతిపోవును. కావుననే, నన్ను యే రూపములో ఆరాధిస్తే, ఆ రూపములో మాత్రమే దర్శనమిస్తాను అని శ్రీకృష్ణ భగవానుడు చెప్పెను.

వేసుకున్న వారికి వేసుకున్నంత

భగవానుని యీ వాక్యమును ఫలమునకు కూడ అన్వయించవచ్చును. నన్ను యే ఫలము నాశించి ఆరాధిస్తే, ఆ ఫలమును ఇచ్చెదను. సాధారణముగా మానవులు పరిచ్ఛిన్న ఫలములను మాత్రమే కోరెదరు. ఉదాహరణకు వారికి ఒక కష్టం వస్తే, ఆ కష్టం నుండి బయటపడాలని కోరుకుంటారు. ఈ శ్లోకము వేదోక్త కర్మలకు, ఉపాసనలకు సంబంధించినదే

అయినా, దీనిని సర్వమతముల వారికి అన్వయించవచ్చును. నేను నీకు జగత్తులోని వివిధ సంపదల రూపంగా, విభిన్న శాసనముల రూపంగా, శక్తుల రూపంగా ఉపలభ్యమగుచున్నాను. నీవు నన్ను ఏ రూపంలో ఆరాధిస్తే, అదే రూపములో నీకు దర్శనమిస్తాను.

ఒక వ్యక్తి ప్రతిదినము వ్యాయామ శాలకు వెళ్లి, కండలు పెరిగే కసరత్తులు చేస్తూ ఉంటాడు. అంటే, అతడు భగవానుని కండల రూపంలో ఆరాధిస్తున్నాడన్నమాట. భగవానుడు ఆతనికి కండల నిచ్చి ఆశీర్వదిస్తాడు. అంటే, భగవానుడు కండల రూపంలో మాత్రమే ప్రత్యక్షమగును! అతడు ఎడమచేతితో మాత్రమే కసరత్తు చేస్తే భగవానుడు ఆ చేతి యందు మాత్రమే కండల రూపములో ప్రత్యక్షమగును! భగవానుని స్వరూపమిట్టిది!

ఏ రూపంలో మానవు లారాధిస్తారో, ఫలము ఆ రూపముగనే లభించునని వేదము చెప్పుచున్నది. నీవు కండలను లక్ష్యముగా పెట్టుకొని, నీ జీవితమును ఆ లక్ష్యసాధనకు అంకితము చేసినచో, నీవు కండలను ఆరాధించినావు గనుక, నీకు కండలు లభించును. కండలు మాత్రమే లక్ష్యముగా గల వ్యక్తి కండల రూపములో నుండే భగవానుని గుర్తెరుంగజాలడు. కాని, అన్ని సందర్భములలో లక్ష్యము భగవానుడు మాత్రమే.

కావున, నీవు ఏ రూపమును ప్రార్థిస్తే, ఫలము అదే రూపములో లభిస్తుంది. అట్లే చేసుకున్న వారికి చేసుకున్నంత. మనము భగవానుని ఏ రూపంలో ఆరాధిస్తామో, అట్టి ఆరాధనా ఫలమగు భగవానుడు అదే రూపంలో వస్తాడు.

కాఫిర్ల ఆరాధన వేరుగాదు; ఆరాధనలన్నీ ఒక్కటే

విభిన్న మతాలకు వివిధ ఆరాధనా పద్ధతులు గలవు. కాని, ఒక పద్ధతి మరియొక దాని కంటె శ్రేష్ఠమని చెప్ప వీలు లేదు. పరమేశ్వరుని ప్రార్థించే భాష ఏదైనా, ప్రార్థించే పరమేశ్వరుడొక్కడే. ఉదాహరణకు, గిరిజనులు వర్షం కోసం నృత్యం చేస్తారు. వర్షం పడుతుంది. అటులనే, ఒక వ్యక్తి విస్తీర్ణమైన, బహు కష్ట సాధ్యమైన వైదిక క్రతువును ఆచరించినప్పుడు కూడా వర్షం పడుతుంది.

ఆరాధనా పద్ధతి వైదికము కావచ్చు; లేదా గిరిజనుల పద్ధతి కావచ్చు. పద్ధతి యేదైనా, శ్రద్ధాభక్తులతో ఆచరిస్తే, వర్షం పడుతుంది. శ్రద్ధ లేకపోతే, వర్షం రాదు. పద్ధతి

వేరు కావచ్చు; కాని, ఫలమొక్కటియే. కావున, ఆరాధనా పద్ధతులన్నిటికీ సమానమైన మహిమ గలదు. ఈ విషయమును స్పష్టంగా తెలుసుకోవాలి. తమ ఆరాధనా పద్ధతి కంటె భిన్నమగు ఇతర పద్ధతుల విషయంలో సర్దుబాటు ధోరణితో, సహనశీలతతో, దీనిని తెలుసుకొనుట కాదు. ఇది తెలియదగిన సత్యము గనుక తెలుసుకోవాలి. కాఫిర్ల ఆరాధన అనేది ఏమీ లేదు. ఉన్నది ఆరాధన మాత్రమే.

విశిష్ట సంరచన, లిపి, వ్యాకరణములు లేని వాడుక భాషలో వనవాసులు ప్రార్థిస్తారు. ఆ భాష మనకేమీ తెలియదు. కాని, భగవానునికి తెలుస్తుంది. వారు మాటలాడేది కూడా భాషయే. వారికి తాము మాటలాడే భాష తెలుస్తూనే ఉంటుంది. వారికి, భగవానునకు మధ్య ఉత్తర ప్రత్యుత్తరముల సంబంధము ఏర్పడినది. అదియే ప్రముఖమైన విషయము. మతానుయాయులకు, తాము ఉచ్చరించే పదములు, భాష తమకే తెలియకపోవచ్చును. కాని, భగవంతునకు ఆ భాష తెలుస్తుందనే భావంతో వారు మంత్రాలను ఉచ్చరిస్తారు. అంతకు మించి చేయవలసినది ఏమియూ లేదు. టెలిగ్రాం ఎవరికి పంపుతామో, వారు దానిని చదువగల్గి ఉండాలి. అటులనే, భగవానునితో మాటలాడునపుడు, ఆ భాష భగవానునకు తెలియాలి. ఒకానొక భాషలో ఒక విశిష్ట పద్ధతిలో ప్రకటీకృతమైన మానసిక భావనయే ప్రార్థన. దాని అర్థము ప్రార్థించే వానికి తెలియక పోవచ్చును. కాని, ప్రార్థనలో ఒక భావన, ఒకానొక మానసిక ధారణ ఉండి తీరును. మనము ప్రార్థనలో వాటినే భగవానునకు తెలియజేస్తాము.

ప్రార్థన ఏ భాషలో ఉన్నా పరవాలేదు. భాషలన్నీ భగవానునకు తెలుస్తాయి. నీవు మనసులోని భావాలను వ్యక్తం చేయి. నీవు చేయవలసినదంతే. ఇది మత సంబంధమగు విశ్వాసము కాదు. ఇది ఈశ్వరుని గురించిన, ప్రార్థన గురించిన సరళమైన అవగాహన మాత్రమే. దీని విషయంలో హృదయవైశాల్యము అవశ్యకము గాదు. లేదా, నీవు గొప్ప సాధువు గాని, ఋషి గాని కానక్కరలేదు.

వివిధ మతాలు ఈశ్వరుని వివిధ రకాలుగా నిర్వచిస్తాయి. ప్రార్థనా స్వరూపం తెలుసుకునే ప్రయత్నంలో ఈ నిర్వచనాలతో కలగాపులగం చేయరాదు. సమస్యలన్నీ ఇచటనే ఉదయిస్తాయి. ఆయా మతముల ధారణలు మొదలగు వాటిని పరిశీలించటం ప్రారంభిస్తే, సమస్యలు ఉంటాయి. కాని, వీటికి ప్రార్థనతో సంబంధమేమీ లేదు. ఇచట ప్రధానమైన అంశము లేమనగా – మోక్షమనగా నేమి? నేను వాస్తవంగా ఎవరిని లేక దేనిని ప్రార్థిస్తున్నాను? నేను పరిచ్ఛిన్నమగు ఫలమునాశించి ప్రార్థిస్తున్నానా? లేక, మరేదైన ప్రయోజనము కొరకా? లక్ష్యము మోక్షమైనచో, అది జ్ఞానైకగమ్యము. నీవు పూర్ణుడవు. ఇది సత్యము. విశ్వాసము కాదు. ప్రపంచములోని వివిధ మతాలు చెప్పేదానికి, ఈ సత్యానికి చాలా తేడా ఉంది. ఇది సత్యము. కాన దీనిని ప్రసన్నచిత్తంతో తెలుసుకోవాలి. ఈ సత్యమునకు, నీకు గల మతపరమగు గాఢ విశ్వాసములతో గాని, ఒకానొక మతంతో గాని సంబంధము లేదు.

మతముతో సంబంధము లేనివారు కూడా కృతార్థులగుదురు

భగవానుడు ఈ శ్లోకంలో వ్యక్తం చేసిన భావన ఆరాధనకు మాత్రమే సీమితమైనది కాదు. అది ఆరాధనలకు అతీతమైనది. అనగా మతముతో ఎట్టి సంబంధము లేని వ్యక్తికూడ కృతార్థుడు కావచ్చును. మతసంబంధము తమకు లేదని చెప్పుకునే వ్యక్తులు, మతమును నిరసించే వ్యక్తులు కూడ కృతార్థులు కావచ్చును. మతమంటే ధనము, అధికారము తప్ప మరేమీ లేదని కొందరి అభిప్రాయము. కమ్యూనిస్టుల దృష్టిలో మతము అభివృద్ధి నిరోధకము. మతమును గురించి వారి అభిప్రాయాలు ఏమైనా, ఆ రూపంలోనే వారికి ఈశ్వరుని అనుగ్రహం లభిస్తుంది. అంటే, వారు తిరస్కరణీయులు, శాశ్వత పతితులు కాదని యర్థము.

"మానవులందరూ నన్నే అనుసరిస్తారు (మమ వర్త్మ అనువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః)" అని శ్రీకృష్ణభగవానుడీ శ్లోకములో అర్జునునితో చెప్పెను. మరో మాటలో చెప్పాలంటే

– "తాము అన్వేషించేది నన్నే అని వారికి తెలిసినా, తెలియక పోయినా, వారు నా మార్గంలోనే ఉన్నారు. మార్గం చివర సర్వదా నేను ఉంటాను. ఒక విశిష్ట లక్ష్యమును ఉద్దేశించి వారు కొనసాగుతూ ఉండవచ్చును. కాని అది వారి యాత్రలో ఒక మజిలీ మాత్రమే. ధనము, అధికారము వారి లక్ష్యము అయిన సందర్భాలలో కూడా వారు నా మార్గంలోనే ఉన్నట్లు లెక్క. ఏలయన, ధనము నేనే, అధికారము నేనే. సంపదధిదేవతయగు లక్ష్మి నాయందున్నదని గుర్తుంచుకోవాలి. అధికారము కూడా నాతోనే ఉన్నది".

లక్ష్మి అనేక విధములుగా నుండును. ఉదాహరణకు కొందరు తమ జీవితమును పూర్తిగా ఆరోగ్యము కొరకు ధారపోస్తారు. వారు లక్ష్మిని ఆరోగ్యరూపంలో అనుభవిస్తారు. కొందరు తమ జీవితములను అధికార సంపాదన కోసం ధారపోస్తారు. అంతా సక్రమంగా జరిగితే, వారు కోరే అధికారము వారి చేతికి చిక్కుతుంది. వారి ప్రార్థనలు ఫలిస్తే వారి పూర్వజన్మల ప్రారబ్ధ కర్మ పూర్తిగా అడ్డురాకపోతే, వారికి అధికారం దక్కుతుంది. "కావున, మానవులు చిన్న లక్ష్యాలను కోరినా, పెద్ద లక్ష్యాలను కోరినా, వారికి తెలిసినా, తెలియకపోయినా, అందరూ నా మార్గంలోనే ఉన్నారు" అని శ్రీకృష్ణుడు చెప్పెను.

న్యూనతా భావన నుండి అందరు విముక్తిని కోరుకుంటారు

మానవులందరు యథార్థంగా తెలిసో, తెలియకో, ఈశ్వరునితో ఐక్యమును కోరుకుంటారు. మానవులు న్యూనతా భావము నుండి విముక్తిని కోరతారు. కావున, అందరూ విముక్తిని కోరు సాధకులే. న్యూనతా భావన నుండి విముక్తిని కోరుట, పూర్ణత్వమును కోరుట అనే రెండూ ఒక్కటియే. మరియు, పూర్ణత్వము నెరుంగని మనము పూర్ణత్వమును కోరుట పొసగదు. కాని, మనకు న్యూనత నిశ్చియముగా అనుభవములో గలదు. అట్టి న్యూనత నుండి విముక్తిని మనం కోరుకుంటాము.

పూర్ణత్వమనగా న్యూనతా భావన నుండి విముక్తి. మద్యపానము చేసే వారితో సహా అందరూ పూర్ణత్వమును, ఆనందమును కోరుకుంటారు. మద్యపానంలో ఏదో సుఖం లభించకపోతే, మానవులు దాని జోలికే పోరు.

పూర్ణత, ఆనందములు భగవానుని స్వరూపము. అనగా, భగవానుడు పూర్ణస్వరూపుడు; ఆనందస్వరూపుడు. మానవులందరు ఇదే పూర్ణత్వమును, ఆనందమును కోరెదరు గాన,

అందరూ ఈశ్వరుని మార్గములోనే ఉన్నారు. కాని, వారికి ఆ విషయము తెలియకపోవచ్చును. తాను వెతికేది ఏదో ఖచ్చితంగా తెలియని వ్యక్తి వెతుకుతూనే ఉంటాడు. కావున శ్రీకృష్ణ డిట్లు చెప్పవచ్చును: "తాము నన్నే వెతుకుతున్నారని వారికి తెలియదు. కాన, వారు తమ సమయము నంతనూ నాకు చెందిన చిన్న చిన్న వస్తువులను వెతుకుతూ గడిపేస్తారు".

ఇదెట్లా ఉందంటే, ఒకతను వివాహమాడగోరి, ప్రియురాలి చిటికెన వ్రేలి గోటినో, లేక తలపైని వెంట్రుకనో వివాహమాడినాడట! అది యెట్టి వివాహము? అధికారము, పేరు ప్రతిష్ఠలు, ప్రశాంతి ఇత్యాదులను సాధింపబూను వ్యక్తులు అట్టివారే. కాని, వారికి ఆ సంగతి తెలియదు. ఈ లక్ష్యము లన్నియూ అనంతుడగు శ్రీకృష్ణ భగవానుని నఖములు, కేశముల కంటె గొప్పవి కావని వారికి తెలియదు. తాము ఈశ్వరుని కంటె భిన్నులమని భావించు మానవులు ఒక అంశమును మాత్రమే సాధింపబూని, మిగిలిన సర్వమునూ విడిచిపెట్టెదరు.

సర్వము భగవానుడే. ఒకే అంశమును సాధింపబూనువారు విడిచిపెట్టే సర్వమూ భగవానుడే. సర్వమును విడిచి, అధికారమును మాత్రమే పొందగోరు వ్యక్తులు ఈశ్వరుని పొందగోరుట లేదు. " వారు నా మార్గమునందే ఉన్నారు. కాని, వారికి తాము ఈశ్వరుని మార్గమునందున్నామని తెలియదు. వారు నన్ను పొందగోరుట లేదు. వారికి ఈ సత్యము తెలిసినచో, మార్గములోని అల్పవిషయములు వారిని నిరోధింప జాలవు".

ఆధ్యాత్మిక మార్గము దుష్కరముగ నుండ బనిలేదు

మనం ఒక గమ్యమును చేరుటకై ప్రయాణించేస్తూ, మధ్యలో ఏవో కొన్ని భోగములనను భవించినా, మన గమ్యమును మాత్రం మరువము. ఆత్మజ్ఞానము కూడ ఇంతకంటె భిన్నముగ నుండ బనిలేదు. ఈ సాధన యొక్క సౌందర్యమేమన, లక్ష్యము మాత్రమే గాక, మార్గము కూడ సుందరమైనది. ఇది హిమాలయములలో తీర్థయాత్ర చేయుట వంటిది. హిమాలయాలలో బదరీనాథ్, కేదారనాథ్, గంగోత్రి, యమునోత్రి అనేనాలుగు పుణ్యక్షేత్రములు గలవు. భక్తులెందరో ఈ క్షేత్రములను దర్శిస్తారు. ప్రతి హిందువు జీవితములో ఒకసారి అయిననూ వీటిని దర్శించాలి. వీటిలో బదరీనాథ్ అతి సుందరమైన లోయలోనున్నది. బదరీనాథ్‌కు వెళ్లుదారి కూడ సుందరమైనది.

ఆధ్యాత్మిక మార్గము దుష్కరమైనది యని మనం తరుచుగా వింటూ ఉంటాము.

'ఆధ్యాత్మిక' అనే పదానికి అర్థం సరిగ్గా తెలిస్తే, దానిలో దుష్కరమైనది యేదీ లేదని స్పష్టమవుతుంది. నీవు పూర్ణుడవు, ఆనందఘనుడవు అని నిరంతరంగా వినుటలో దుష్కర మేమున్నది?

ఆధ్యాత్మిక మార్గము అశిధారతో పోల్చబడినది. ఆగవద్దు; చాల జాగ్రత్తగా ముందుకు సాగుము. ఒక్క అడుగు తప్పు వేస్తే, అగాధంలోకి పడిపోతావు.ఎత్తుకు వెళ్లేకొలదీ, పతనం మరింత భయావహమగును. నీవు సర్వోచ్చ స్థానానికి చేరుకుని, అక్కడ నుండి కాలు జారి పడ్డావంటే, ఎముకలు కూడా మిగలవు. అపుడు నీకు దహన సంస్కారములు చేయుట ఎట్లు? ఇట్టి సంభాషణలన్నీ "పొందదగిన స్థానమొకటి గలదు" అను ధారణపై ఆధారపడి సాగును. కాని, వాస్తవంలో ఉన్నది తెలియదగినది మాత్రమే.

ఆనందము, పూర్ణత్వము లక్ష్యమైనప్పుడు, ఆ లక్ష్యము వైపునకు వెళ్లేదారి దుఃఖ మయముగా నేల యుండును? నీకు అర్థమైనంత వరకు దారి ఆనందరూపముగనే యుండును. దారి ఆనందము. దారికి ఇరువైపులా ఆనందము. పర్వత యాత్రలో వలె ఈ యాత్రలో కూడా నిరుత్సాహమునకు ఒక క్షణం కూడా తావు లేదు. పర్వత యాత్రలో మనం ఎత్తైన మార్గం గుండా ముందుకు సాగుతూంటే, ప్రతి మలుపు నందు ఒక కొత్తలోయ, కొత్త దృశ్యము, కొత్త వృక్షపంక్తి దర్శనమిస్తాయి. ఒక క్షణం గంగ మన ప్రక్కనే ప్రవహిస్తూ ఉంటుంది. మరుక్షణం గంగ మనకు చాలా దూరంగా వెళ్లిపోతుంది. మరి కొంత దూరం వెళ్ళగానే, ఆమె మరల మనకు ప్రక్కనే దర్శనమిస్తుంది. ఒకప్పుడు ఆమె ఎక్కడో అగాధంలో కనబడుతుంది. ఒకప్పుడు ఆమె ఆడుతూ, పాడుతూ ప్రవహిస్తుంది. మరియొకప్పుడామె గర్జిస్తూ ప్రవహిస్తుంది. పర్వతాలు మనకు ఎన్నో సుందరదృశ్యాలను చూపిస్తాయి. ఒక చోట వృక్ష విహీనముగా, మరియొక చోట పచ్చటి వనములతో దర్శనమిస్తాయి. తెల్లని మంచుతో నిండిన శిఖరాలతో ప్రకాశిస్తాయి.

ఇదే విధంగా, ఆత్మ జ్ఞానమును పొందే దారి కూడా దుర్గమమైనది కాదు. ఈ మార్గము ఆహ్లాదకరంగా ఉంటుంది. లక్ష్యము ఆనందఘనమని వేరే చెప్పనక్కరలేదు. ఈ మార్గం ఆదిలో కఠినంగా, తరువాత ఆహ్లాదకరంగా, లేదా, ఆదిలో ఉత్సాహకరంగా, తరువాత దుఃఖదాయకంగా ఉంటుందని మనం తరచు వింటూ ఉంటాము. కాని, ఇది సరి కాదు. ఆధ్యాత్మిక మార్గము ఆదిలో దుఃఖకరముగను, తరువాత ఆహ్లాదకరముగను ఉండుననియు, సాంసారిక మార్గము ఆదిలో ఆహ్లాదకరముగను, తరువాత దుఃఖకరముగను ఉండునని చెప్తూ ఉంటారు. కాని, ఇది

యథార్థమా? సాంసారిక మార్గము ఆదిలో, అంతములో, మధ్యలో కూడా సర్వదా సమస్యలతో నిండియుండదా?

పదార్థము అంతా భగవానుడే

సాంసారిక మార్గంలో కూడా మనకు కాదాచిత్కంగా కొంత ఆనందం లభిస్తుంది. కాని, సర్వత్రా భగవానుడు ఉండుటయే దానికి కారణము. భగవానుడు ఎక్కడో ఒకచోట మాత్రమే లేడు. విశ్లేషణ చేస్తే, పదార్థము అంతా భగవానుడు తక్క మరేదీ కాదు. భగవానుని కంటె భిన్నమైనది ఏదీ లేదు. అట్టిచో, ఇది పదార్థము, ఇది భగవానుడు అని మనమెట్లు చెప్పగలము? ప్రతి ప్రాణియు భగవానుడే. అందువలననే, ఆయనకు భగవానుడని పేరు!

భేద దర్శి, ద్వైత దర్శియగు మన బుద్ధియే యీ విభేదము లన్నిటినీ నిర్మించినది. బుద్ధి తాను ప్రసరించే స్థానములన్నిటి యందు – ఆధ్యాత్మిక, మరియు ఐహిక విషయముల యందు, గంభీర, మరియు నిషిద్ధ విషయముల యందు కూడ – భేదమును సృష్టించును. బుద్ధి యొక్క పునాది ద్వైతభావన యందు కలదు గాన, అది నిరంతరము ద్వైతమును సృజింప యత్నించును. వాస్తవంలో, విభాజనాత్మక బుద్ధియే జీవుని స్వరూపము.

"మానవులు పొందే ఆనంద క్షణములన్నీ నా స్వరూపమే. ఈ సంగతి వారికి తెలియవచ్చును; తెలియక పోవచ్చును" అని శ్రీకృష్ణుడు చెప్పెను. "ఆనంద ఘనుడగు పరమాత్మయే జీవుల స్వరూపము. కాని, వారు ఆ పరమాత్మ యొక్క ఆనందములోని అల్పాంశములను పొంది, తృప్తి పడెదరు. ఇదియే వారికి ఏకైక సమస్య. ఆనంద స్వరూపుడగు భగవానుడే జీవుల స్వరూపమై యున్ననూ, వారికి ఆ సత్యము తెలియక, తమ స్వరూపము నుండి నిర్గతమైన ఆనందము యొక్క అల్పాంశమును పొంది రాజీ పడెదరు". ఇదీ మానవుల దుస్స్థితియని శ్రీకృష్ణుడు చెప్పెను. ఈశ్వరుడు నిర్దయుడై ఈయకపోవుట వలన మానవులు దుఃఖిస్తున్నారనుకొనుట సరిగాదు. మానవులు తాము ఈశ్వరభిన్నులమని తలపోయుటయే దౌర్భాగ్యము. "అయినా, వారు నా మార్గంలోనే ఉన్నారు. కాన, విచారింప బని లేదు. వారు తమ పూర్ణత్వమును ఎరుగునంత వరకు సాధనను కొనసాగించి, కాలక్రమములో నాతో ఐక్యమును చెందెదరు. మానవుడు తన పూర్ణ స్వరూపము కంటె కొద్ది తక్కువ స్థాయికైననూ అంగీకరించడు. నా కంటె వేరుగా ఎవ్వరూ లేరు" అని శ్రీకృష్ణుడు చెప్పెను.

మానవులకు శీఘ్రఫలము నందాసక్తి మెండు. అందువలననే, వారు భగవానుని జోలికి పోరు అని శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములో వివరించెను:

काङ्क्षन्तः कर्मणां सिद्धिं यजन्त इह देवताः ।
क्षिप्रं हि मानुषे लोके सिद्धिर्भवति कर्मजा ॥ १२॥

కాంక్షంతః కర్మణాం సిద్ధిం యజంత ఇహ దేవతాః
క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిర్భవతి కర్మజా (12)

కర్మణాం = కర్మల యొక్క; **సిద్ధిం** = ఫలమును; **కాంక్షంతః** = కోరువారై; **ఇహ** = ఈ లోకములో; **దేవతాః** = దేవతలను; **యజన్తే** = పూజించుచున్నారు; **హి** = ఏలయనగా; **మానుషే లోకే** = మనుష్య లోకమునందు; **కర్మజా** = కర్మ వలన కలిగే; **సిద్ధిః** = ఫలము; **క్షిప్రం** = శీఘ్రముగా; **భవతి** = కలుగును.

> మానవులు కర్మల ఫలమును కోరువారై ఈ లోకములో దేవతలను పూజించెదరు. ఏలయన, మనుష్యలోకములో కర్మ వలన కలిగే ఫలము శీఘ్రముగా కలుగును. (12)

మానవు లెందరో పూర్వము ఈశ్వరుని పొందిరి. అనగా, వారు ఈశ్వరునకు, తమకు గల అభేదమును సాక్షాత్కరించుకొనిరి అని శ్రీకృష్ణుడు ఇంతకు ముందు చెప్పి యున్నాడు. కాని, మానవులందరూ ఆయనను యేల పొందరు? ఆయన కొందరి యందు మాత్రమే దయ చూపి, మిగిలిన వారిని త్యజించునా? ఈశ్వరున కట్టి రాగద్వేషము లుండునా? ఉన్నచో, ఆయనకు, ఇతరులకు తేడా ఉండదు.

ఈశ్వరుని యెట్లు ప్రార్థింపవలెను? అనునది మీ ఇచ్ఛపై ఆధారపడును

'నేను ఎవరికీ దేనినీ తిరస్కరించను' అని శ్రీకృష్ణుడు ఈ ప్రశ్నలకు సమాధానము నిచ్చెను. ఈశ్వరుని సృష్టిలో జీవుడు దేనిని కోరుకుంటే, దానిని మాత్రమే పొందగల్గును. ఈశ్వరునకు లేశమైననూ పక్షపాతము లేదు. ఈశ్వర భక్తులలో శ్రేష్ఠులైన వారు కూడా ఏ రూపములో ఈశ్వరుని ప్రార్థిస్తారో, ఈశ్వరుడు వారిని అదే రూపములో అనుగ్రహిస్తాడు.

అనగా, మనము ఏ రూపములో భగవానుని ఆరాధిస్తే, ఆ రూపమే మనకు ఈశ్వరుడగును. మనము ఈశ్వరుని ఇంద్రదేవతా రూపంలో ఆరాధిస్తే, అపుడు ఇంద్రుడే ఈశ్వరుడు. ఒక విశిష్ట కర్మ ఫలమును ఇచ్చు దేవతగా ఈశ్వరుని ఆరాధిస్తే, అప్పుడు ఈశ్వరుడు ఆ దేవతయే యగును. వ్యక్తులు తమ జన్మ కుండలి ఆధారంగా ఈశ్వరుని గురు, శని, అంగారక ఇత్యాది గ్రహముల రూపములో ఆరాధించవచ్చును. వ్యక్తుల జాతకములలో కొన్ని గ్రహములు కొన్ని ప్రత్యేక స్థానములలో నున్నచో, అవి ఆ వ్యక్తుల జీవితములలో రాబోవు శుభాశుభములను సూచించును. ఇట్టి సందర్భములలో, ఈశ్వరుడు ప్రారబ్ధ కర్మాధిష్ఠాన దేవతయగు గ్రహము యొక్క రూపములో ఆరాధింపబడును. మనము కోరే ప్రయోజనమేదైనా, దాని కొరకు ఈశ్వరుని ఆరాధించవచ్చును. ప్రార్థన తనంత తానుగా ఫలమునిచ్చును.

వేదములతో ఎట్టి సంబంధము లేనివారు కూడ ఫలములను పొందెదరు. ఉదాహరణకు, ధనమునందు, అధికారమునందు మాత్రమే అభిరుచి గల తీవ్ర నాస్తికులు కూడా ఫలమును పొందెదరనుటలో సందియము లేదు. రష్యా, చైనాలు మతము లేకుండా మనగల్గుట మనకు తెలిసినదే. ఒకప్పుడు ఆ దేశాలు మతంతో మనగల్గినవి. ఇప్పుడు మతం లేకుండా, బహుశః పూర్వం కంటె బాగా మనగల్గుతున్నాయి. వాళ్ల దృష్టిలో మత సంబంధమైన కర్మలకు, ప్రార్థనలకు ఎట్టి విలువయూ లేదు. ఒక సిద్ధాంతమే వారికి మతమైనది. వారు ప్రభుత్వమునకు భక్తులు. రాజ్యమే వారికి దైవము.

కమ్యూనిజమనగా వ్యక్తి కంటె రాజ్యము ప్రముఖమైనది అనే రాజ్య నియంత్రణ వాదము. సర్వము రాజ్యము యొక్క అధీనములో నుండును. వ్యక్తికి చెందేది ఏదీ లేదు. ఉన్నదానిని అందరూ కలిసి పంచుకుంటారు. ఈ వాదము మంచి దనుటలో సందేహము లేదు. కాని, దానిని అమలు పరచాలంటే, వ్యక్తి స్వాతంత్ర్యానికి తిలోదకాలివ్వాలి. వ్యవస్థకు విరుద్ధముగా గళము విప్పి మాటలాడే వ్యక్తి యొక్క నోటిని మూసివేస్తారు. లేదా, అతని మాటలు ఎవ్వరికీ వినబడనంత దూరంగా అతనిని పంపివేస్తారు. ఈ వ్యవస్థలో వ్యక్తులకు పరిగణన యేమీ ఉండదు. ఈ సిద్ధాంతము ననుసరించు వారికి రాజ్యమే దైవము. వారు రాజ్యమును దైవము అని అనరు. కాని, వారి దైవము రాజ్యమే.

మానవులు భగవానుని ఈ తీరున తగని స్థానమునందు ఏల అధ్యారోపము చేయుచున్నారు? మానవులు ముముక్షువులై మోక్షమును ఏల సాధింపబూనరు? ఏలయనగా,

భగవానుడు యథార్థంగా పక్షపాత బుద్ధి లేనివాడేనా?

"నన్ను నిందించవద్దు. నేను పక్షపాత బుద్ధి గలవాడననియు, నా రాగ ద్వేషముల వలననే ప్రజలిట్టి దుఃఖములను పొందుచున్నారనియు అనవలదు" అని శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పుచున్నాడు. కాని, మనకు విభిన్న మానవుల మధ్య తేడాలు కనపడతాయి. ఆ తేడాలకు తగినంత కారణం కనబడదు. అవి న్యాయ సమ్మతములుగా భాసించవు. కాన, శ్రీకృష్ణుని ఈ కథనమును మనము శంకించుటకు అవకాశము గలదు. శ్రీకృష్ణుడు తానే సృష్టికర్తనని చెప్పెను. ఆయన నుండియే సర్వము ఉద్భవించినది. అనగా, అంతతో గత్వా, ఈ ప్రపంచంలోని మానవులనందరినీ ఆయనయే సృష్టించెను. అట్టిచో, ఆయన కొందరిని ఉన్నత స్థానములలోను, మరి కొందరిని అధః స్థానములలోను ఉంచుటకు కారణమేమి? వేద దృష్ట్యా ఒక వ్యక్తిని బ్రాహ్మణుడని, మరియొకనిని క్షత్రియుడని, మరియొకనిని వైశ్యుడని, ఇంకొకనిని శూద్రుడని పిలువ కారణమేమి? ప్రపంచములో ఈ తేడాలన్నీ ఉండుటకు కారణమేమి? బ్రాహ్మణ, క్షత్రియాదులందరికీ సమాజములో స్వీయస్థానము లున్నవి. ఒక విశిష్ట వ్యవస్థ, ఒక విశిష్ట పరంపర గలవు. వాటిలో ఒక వర్గం ప్రజలు మరియొక వర్గం వారి కంటె అధికస్థానములో నున్నారు. ఇంకో వర్గం వారికి ఈ వ్యవస్థలో స్థానమే లేకుండా పోయింది.

ఈ భేదములన్నింటికీ సృష్టికర్త యగు ఈశ్వరుడు బాధ్యుడు కాడా? ఆయనయే బాధ్యుడైనచో, ఆయనకు పక్షపాత దోషము తప్పక సంక్రమించును. అట్లు గానిచో, ఆయన కొందరిని కోటీశ్వరులుగను, కొందరిని లక్షాధికారులుగను, కొందరిని మధ్యతరగతి వారుగను, మరి కొందరిని అగర్భ దరిద్రులుగను యేల సృష్టించవలెను? ఈ సృష్టిలో అంగవైకల్యములు కలవారెందరో ఉన్నారు. ఈశ్వరుడిట్టి పనులను యేల చేయవలెను?

ఈ ప్రశ్నల నడుగరాదు; సమాధానమును చెప్పరాదు అన్నచో, ఇక భగవంతుని గురించి ఆలోచింప బని యేమి? 'భగవానుడు ఏది చేస్తే, అది చేస్తాడు. ఆయన భగవానుడు గనుక, ఆయనను ఎవ్వరూ ప్రశ్నించరాదు' అని చెప్పిన చాలదు. ఆయన భగవంతుడే కావచ్చును. కాని, కష్టమునను భవించేది నేను. భగవానుడు నన్ను సృష్టించెనని ముందుగా చెప్పి, నా కష్టములను నా కంటె బాగుగా ఆయనయే యెరుంగునని తరువాత చెప్పినచో, అది యెట్లు పొసగును? నేను అంగవైకల్యముతో జన్మించితిని. నేను చూడలేను (లేదా వినలేను). అంగవైకల్యములను కలిగియుండుట, గుడ్డితనము, చెముడు మొదలగునవి ఆనందము కాదని భగవానునకు

తెలియదేమో యనిపించును. కానిచో, ఆయన అట్టి వారిని సృష్టించి యుండరాదు. కాని, ఆయన సృష్టించినాడు. ఆయన కంటె నాకే ఈ విషయములో జ్ఞానమధికముగ నున్నది! నాకు తెలిసిన సత్యము ఈశ్వరునకు తెలిసినచో, నన్ను ఆయన తప్పక మరియొక తీరున సృష్టించి యుండెడి వాడు. కాని, ఆయన అట్లు చేయలేదు. కాన, ఆయన కూడ దోషయుక్తమగు వస్తువులను నిర్మించువారిలో ఒకడు కాడా?

మనము ఒక కారు కొన్నామనుకొనుడు. దానిలో ఒక స్వల్పమైన లోపము గలదు. బ్రేకులోని ఒక చిన్న కీలను మార్చాలి. దాని కోసం మనమెంతో హడావిడి చేస్తాము. కార్ల తయారీదారు ఆ నమూనా కార్లనన్నిటినీ వెనుకకు రప్పించి, వాటిని బాగుచేయిస్తాడు. ఈశ్వరుడు సృష్టి నిర్మాత. కాని, ఆయనను మనము ప్రశ్నించరాదట. ప్రశ్నించినా, ఆయన సమాధానము నీయడు. చాల పొరపాటు జరిగింది. నేను తొందరపడ్డాను. నీ దేహాన్ని నాకు వాపసు పంపిస్తే, దానిలోని లోపాలను సరిదిద్ది, (కొత్త కాళ్లను, లేదా ఇతర అవయవములను అమర్చి) పంపుతాను అని ఆయన చెప్పడు. కాళ్లు, కళ్లు, ఇతర అవయవములు లేని వ్యక్తులు జీవితమంతా పీడను అనుభవించాల్సినదే.

భగవానుడు ఎక్కడో పైన కూర్చుండి, దివ్య భోగాలననుభవిస్తూంటే, ఇక్కడ దురదృష్టవంతుడనగు వ్యక్తి యొకడు, కాళ్లు లేనివాడగుటచే, నేలపై మెల్లగా డేకుతూ, ఒక్కొక్క అంగుళం దూరం చొప్పున ముందుకు సాగుతున్నాడు. ఇతడెట్టి భగవానుడు? భగవానునకు కుంటివాళ్లను సృష్టించుట తప్పని సరి అయినచో, కనీసం వారిని మోటార్లు అమర్చిన చక్రాల కుర్చీలు సమృద్ధిగా లభించే అమెరికాలో సృష్టించవచ్చును. ఇన్ని తేడాలు మనకు కనబడుతూ ఉంటే, భగవానుడు న్యాయబుద్ధి గలవాడని మనమెట్లు చెప్పగలము? ఇది యెట్లు న్యాయసంగతమగును?

కొందరికి పుట్టిన నాటి నుండి తల్లి దండ్రుల ప్రేమ లభిస్తే, మరి కొందరికి తమ తల్లి తండ్రులెవరో, ఎక్కడున్నారో కూడ తెలియదు. ఒక శిశువు దక్షిణ కొరియాలో ఒక తల్లిదండ్రులకు పుట్టి, కెనడాలో మరియొక తల్లి దండ్రుల వద్ద పెరుగుతుంది. ఆ శిశువు అక్కడ బాగా పెరుగుతున్నాడని అందరు భావిస్తారు. కాని, అది వాస్తవం కాదు. తనకు తల్లిదండ్రులతో, సోదరులతో, అక్క చెల్లెళ్లతో పోలికలు లేవని ఆ బాలునకు తొందరలోనే తెలుస్తుంది. కొరియాలోని అసలు తల్లి దండ్రులు పెంచి ఉంటే, ఆ బాలుడు ఇతర బాలుర వలె పెరిగి

యుండెడి వాడు. కాని, కెనడాలో పెరుగుట వలన, అతనికి కొన్ని సమస్యలు ఉదయించి తీరును.

పిల్లలందరు ఒకటే కావచ్చు. కాని, దత్తతలు పూర్తిగా విజయవంతములు గావు. పశువులలో కూడా మనకు ఈ లక్షణం కనబడుతుంది. సహజస్థానంలో కాకుండా, క్రొత్త ఆవాసములో పెరిగే పశువులకు కొన్ని సమస్యలు ఎదురవుతాయి. ఒక శిశువును దత్తత స్వీకరించే పరిస్థితి ఏర్పడుటకు కారణమేమి? ఏ దేశంలోనైనా, శిశువులందరూ తమ తల్లి దండ్రుల వద్దనే పెరుగకపోవుటకు కారణమేమి? ఒక శిశువు యొక్క తల్లి దండ్రులెవరో మనకు తెలియకపోతే, మనమా శిశువును 'అనాథ' అని అంటాము. భగవానుడే సర్వ ప్రాణులను సృష్టించినాడు గదా! అయినచో, అనాథలను ప్రజలు సృష్టించేరా? కాదు. భగవానుడు ఒక రకమైన పరపీడనారతుడేమో అనిపిస్తుంది.

మనము తనను అనుసరించాలని భగవానుడు స్వయముగ చెప్పినాడా?

ఇంతే గాదు. భగవానుడు నన్ను సృష్టించుటయే గాక, నేను ఆయనను అనుసరించాలని చెప్పినాడట. నాకీ సంగతి తెలియు విధమెట్టిది? మరియొకడు నాకు చెప్పుట ద్వారా తెలిసినది. భగవానుడు తాను స్వయముగా వచ్చి, నాకు చెప్పుట ఆయన కనీస కర్తవ్యము. అపుడీ వివరణ అంతయూ నా దృష్టిలో విలువ కలది యగును. వాస్తవంలో భగవానుడు నాకు మాత్రమే గాక, అందరికీ చెప్పాలి. కాని, అట్లు జరుగకపోగా, మరియొకడు వచ్చి భగవానుడు తనకు చెప్పినాడనియు, అందరికీ చెప్పమన్నాడనియు చెప్పును. నాకీ విషయము తెలియుట భగవానుని అభీష్టమైనచో, ఆయనయే స్వయముగా నాకేల చెప్పడు? ఇంతేగాక, కొంతకాలానికి ఇంకొకడు ముందుకు వచ్చి, అంతకు ముందు వ్యక్తికి భగవానుడు చెప్పినది చెల్లుబాటు కాదనియు, ఆ సంగతిని భగవానుడే తనకు చెప్పినాడనియు చెప్పును. అంటే, మనము ఇతని నుండి భగవానుని తాజా సందేశమును వినబోవుచున్నాము!

వాస్తవంలో, ఇట్టి భగవానుడు లేకుంటేనే మనందరికీ మంచిది. భగవానుని ప్రతిపాదించవలసిన అవశ్యకతయే ఏర్పడినచో, ఆ ప్రతిపాదన యుక్తియుక్తముగా నుండునని మనం అపేక్షిస్తాము. యుక్తి సంగతముగ లేని దానిని అంగీకరింపలేము. కాబట్టి, ఇచట మనము ప్రామాణికమైన ప్రశ్నను విచారణకు స్వీకరించినాము. వైదిక సంప్రదాయములో స్వీకరింపబడే

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర భేదములనే గాక, అనేక ఇతర భేదములను భగవానుడు సృష్టించినాడు గనుక, బ్రాహ్మణాదులు ఇతరుల కంటె ఎక్కువ స్థాయిలో నున్నట్లు కన్పట్టుచున్నారు గనుక, ఆయన నిశ్చయముగా పక్షపాత బుద్ధి కలవాడై ఉండాలి.

శ్రీకృష్ణుడీ శంకకు సమాధానమును చెప్పుచున్నాడు. అందరినీ తానే సృష్టించినాననియు, కాని తనయందు దోషమేదీ లేదనియు, శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు.

అధ్యాయము 4, శ్లోకము 13

चातुर्वर्ण्यं मया सृष्टं गुणकर्म विभागशः ।
तस्य कर्तारमपि मां विद्ध्यकर्तारमव्ययम् ॥ १३ ॥

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణ కర్మ విభాగశః
తస్య కర్తారమపి మాం విద్ధ్య కర్తార మవ్యయమ్ (13)

మయా = నా చేత; **గుణ – కర్మ – విభాగశః** = గుణములు, విధులు మూలముగా గల విభాగము ననుసరించి; **చాతుర్వర్ణ్యం** = (ప్రజల యొక్క) నాల్గు వర్ణముల వ్యవస్థ; **సృష్టం** = సృజింపబడినది; **మాం** = నన్ను; **తస్య** = దాని యొక్క; **కర్తారం** = కర్తనుగా; **అవ్యయం** = మార్పు లేని; **అకర్తారమపి** = అకర్తనుగా కూడ; **విద్ధి** = తెలుసుకొనుము.

గుణములు, విధులు మూలముగా గల విభాగము ననుసరించి, నా చేత ప్రజల యొక్క నాల్గు వర్ణముల వ్యవస్థ సృజింపబడినది. నన్ను దానియొక్క కర్తనుగా, మరియు మార్పు లేని అకర్తనుగా కూడ తెలుసుకొనుము. (13).

వ్యక్తులను నాల్గు సమూహములుగా విభాగము చేసిన వైదిక వ్యవస్థను శ్రీకృష్ణుడీ శ్లోకములో నిర్దేశించి, మానవులను, ఈ విభాగములను కూడ తానే సృష్టించినానని చెప్పెను. సర్వసృష్టికి కర్తయగు భగవానుడు తన కర్తృత్వమును నిరాకరింపజాలడు. భగవానుడు అర్జునునితో చేసిన సంభాషణలో అట్లు నిరాకరించలేదు కూడా.

ఈ చాతుర్వర్ణ్య విభాగము భారతదేశములో మాత్రమే ఉన్ననూ, శ్రీకృష్ణుడు చెప్పిన విషయము మానవాళి కంతకూ వర్తించును. ఇతర దేశములలోని ప్రజలు రాచరికము,

అభిజాత్యము, సంపద, దారిద్ర్యము ఇత్యాదుల మూలంగా విడివడి యున్నట్లు మనకు స్పష్టమగుచున్నది. కొందరు ప్రజలను ఉన్నత తరగతి, ఉన్నత మధ్యతరగతి, మధ్యతరగతి, నిమ్న మధ్యతరగతి ఇత్యాదిగా విభజిస్తారు. మానవులుండే ప్రతిచోటా ఇట్టి విభాగములు సర్వకాలముల యందు కనబడతాయి.

వైదిక సంప్రదాయములో మానవులు వారి గుణములు (గుణ విభాగము), వారు చేయు పనులు (కర్మ విభాగము) ఆధారంగా నాల్గు సముదాయములుగా విభజింపబడినారు. ఈ విభాగము భగవానునిచే సృజింపబడినది. దీని గురించి వివరిస్తూ శ్రీకృష్ణుడు "నేను ఈ చాతుర్వర్ణ్య విభాగము యొక్క కర్తనని తెలుసుకో" అని చెప్పెను. అదే సమయంలో "నేను పరిణామ రహితుడను గాన, అనగా నాలో ఎట్టి మార్పులు ఉండవు గాన, నేను కర్తను గాను (అకర్త) అని తెలుసుకో" అని కూడ చెప్పెను.

ఈ జగత్తు సర్వము తన చేతనే సృజింపబడినదియని చెప్పిన శ్రీకృష్ణుడు తాను కర్తను కాదని చెప్పుట యెట్లు పొసగును? ఈ విరోధాభాసమును పరిష్కరించాలంటే, మనం ముందుగా గుణ, కర్మలపై ఆధారపడిన మానవ విభాగమును పరిశీలించాలి. తదుపరి, ఈశ్వరుడు ఏకకాలంలో ఈ విభాగము యొక్క కర్త, అకర్త కూడా యెట్లు కాగల్గును అను యంశమును పరిశీలిద్దాము.

గుణముల స్వభావము

గుణములు ఆధారంగా మానవుల విభాము (గుణ విభాగము) భారతదేశంలో మాత్రమే గాక, ప్రపంచమంతటా కనబడుతుంది. ఈ విభాగమునకు ఆధారమగు గుణములు మనో నిష్ఠములు; అనగా, అవి మనస్సు యొక్క రచన, స్వభావములకు సంబంధించినవి. మనో గుణములపై నాధారపడిన విభాగము చతుర్విధములుగా నున్నది. మనమీ విషయమును తరువాత మరల పరిశీలించెదము.

గుణములు సత్త్వ, రజస్, తమస్ అని మూడు రకములుగ నున్నవి. వీటి యర్థమును కూడ మనము తరువాత తెలునుకుంటాము. ప్రతి వ్యక్తిలో ఈ మూడు గుణములు గలవు. వీటి విశిష్ట కలయికల వలన నాల్గు వర్గములు వ్యుత్పన్నమగును.

ఈ సత్త్వ రజస్తమో గుణముల ఒక కలయికలో సత్త్వము అధికముగను, రజస్సు, తమస్సులు అప్రధానములుగను ఉండును. దీనిని సత్త్వ- రజస్- తమస్ అనవచ్చును. మరియొకటి రజస్ – సత్త్వ – తమస్. దీనిలో రజస్సు ప్రధానముగను, సత్త్వ తమస్సులు గౌణములుగను ఉండును. అటులనే, రజస్- తమస్- సత్త్వ అనునది మూడవ కలయిక. తమస్- రజస్- సత్త్వ నాల్గవది. ఈ నాల్గు కలయికలు మాత్రమే సంభవమగును. ఈ నాల్గింటిలో ప్రతి విభాగములో హెచ్చుతగ్గులు ఉంటాయి. కాని, అయిదవ విభాగము సంభవము కాదు.

ఎందువలన? తమస్- సత్త్వ- రజస్, సత్త్వ- తమస్- రజస్ అనే మరో రెండు విభాగములు సంభవమే గదా? అను శంక ఉదయించవచ్చును. ఈ గుణములను ప్రత్యేకముగా పరిశీలించినచో, గుణములు ఆధారంగా మానవులలో నాల్గు విభాగములు మాత్రమే యేల సంభవించునో మనకు స్పష్టమగును.

అన్ని రకముల ఆలోచనలను సత్త్వము నిర్దేశిస్తుంది. క్రియాశీలతకు రజస్సు ప్రతీక. తమస్సు జడత్వమును నిర్దేశించును. మననము, విచారము, శాంతి, శమము, దమము ఇత్యాదులు సత్త్వములో అంతర్గతములగును. శమ, దమ రూపమగు అనుశాసనము రజస్సులో కూడ నుండును. కాని రజస్సులో మహత్త్వాకాంక్ష, ఉత్సాహము, శక్తి ప్రముఖముగ నుండును. ఉదాహరణకు, తలపెట్టిన కార్యమును పట్టుదలతో సాధించు లక్షణము రజస్సు. మందబుద్ధి, నిష్క్రియత, నీరసత అనునవి తమోగుణ లక్షణములు.

ప్రతి వ్యక్తిలో ఈ మూడు గుణములు ఉండును. కాని, వాటి కలయికలలో భేదములుండును. ఉదాహరణకు, శిశువులు తమస్- రజస్- సత్త్వ కలయికకు చెందియుందురు. తమస్ ప్రధానముగ నుండును గనుక, శిశువులు అధిక సమయము నిద్రిస్తారు. వయస్సు పెరిగే కొలదీ రజస్సు ప్రధానమై, పిల్లలు ఎంతో ఉత్సాహమును కలిగియుందురు. అంతలో గల్యా, వారే పెరిగి పెద్దయ్యేక సాత్త్వికులవులారని మనము ఆశిస్తాము.

గుణములాధారంగా చాతుర్వర్ణ్య విభాగము

మానవుల అంతరంగసంరచనను ఈ సత్త్వ రజస్తమో గుణ విభాగము అతి సుందరముగా చిత్రించును. ఒక వ్యక్తి అంతర్ముఖుడుగ, ఆలోచనా ప్రధానుడుగ నుండును. దీనివలన అతనికి కొన్ని విషయములు సులభముగ సాక్షాత్కరించును. ఇతడు మానసికపరిణతి, విచారశీలముగల

వేదాంతియై యుండును. ఇతడు జీవితము యొక్క మౌలిక విలువలను గురించి, జీవిత లక్ష్యముల గురించి అధికముగా ఆలోచించును. ఇట్టి వ్యక్తి సత్త్వ–రజస్–తమస్ కలయికకు చెందును. అనగా, సత్త్వము ప్రధాన గుణమై యుండగా, రజస్సు ద్వితీయ స్థానములో నుండి పరిపుష్టి నిచ్చును. తమస్సు తృతీయ స్థానములో నుండును. ఇది ఒకరకం వ్యక్తిత్వము.

రెండవ రకంలో రజస్సు సహజంగా ప్రధానముగ నుండును. రజస్సు ప్రధానమైనపుడు ద్వితీయస్థానంలో సత్త్వముగాని, తమస్సు గాని ఉండవచ్చును. రజస్సు ప్రధానముగ నున్న వ్యక్తి చాల క్రియాశీలుడుగ నుండును. మహత్త్వాకాంక్ష అతనిని పరుగులెత్తించును. ఈ మహత్త్వాకాంక్షకు ఇతరుల క్షేమము, కొన్ని సిద్ధాంతములు లక్ష్యమైనచో, అట్టి వ్యక్తిలో గంభీరమైన ఆలోచనా స్రోతస్సు ఉండును. కనుక, సత్త్వము ఆలోచనా రూపంలో ద్వితీయ స్థానములో నుండి, అతని ఉత్సాహశక్తిని, క్రియాశీలతను ప్రభావితము చేయుచుండును. ఇట్టి వ్యక్తులు ప్రాయశః మంచినాయకు లగుదురు. ప్రపంచానికి ఇట్టి నాయకులు చాల అవసరము.

మూడవ రకం వ్యక్తులలో గూడ రజస్సు ప్రధానముగ నుండును. కావున, వారు కూడ అన్ని వేళలయందు క్రియాశీలురై యుందురు. కాని, వారిలో ద్వితీయస్థానములో సత్త్వమునకు బదులుగా తమస్సు ఉండును. అనగా, వారి కర్మల వెనుక మహత్త్వాకాంక్ష మాత్రమే ఉండును; ఆలోచన ఉండదు. కొందరు వ్యక్తులు ధనమును, అధికారమును సంపాదించే ప్రయత్నంలో నిమగ్నులై, ఇతరుల మంచి చెడ్డలను గురించి పట్టించుకోరు. ఆలోచన లేని మహత్త్వాకాంక్షకు ఇట్టి వ్యక్తులు దృష్టాంతము. వీరిలో కొంత ఆలోచనాశక్తి (సత్త్వము) కూడ ఉండును గనుక, వీరిలో కర్మణ్యతతో బాటు గొప్ప చతురత కూడ ఉండును. కాని, సత్త్వముపై తమస్సునకు పై చేయి గనుక, వీరు ఇతరులపై ఛలయుక్తులతో కుట్రలు పన్ని, వారిని స్వలాభమునకు వాడుకుంటారు.

దీనికి భిన్నముగా, రజస్సుకు ప్రోద్బలకముగా సత్త్వము ఉన్నచో, ఆ వ్యక్తులు ఇతరుల సుఖదుఃఖాలను కూడా పరిగణిస్తారు. ఇతరుల స్వాతంత్ర్యమును, సంపదను, జీవితమును ఆదరిస్తారు. కాని రజస్సుకు ప్రోద్బలకముగా తమస్సు ఉన్నచో, ధర్మమునందు ఆదరముండదు. అనగా, ఇతరుల సుఖదుఃఖములను లెక్క చేయరు. ఇట్టి వ్యక్తికి వ్యక్తిగత మహత్త్వాకాంక్ష అతి ముఖమైన విషయముగా మారి, ఆతడు ఆతతాయి, నిరంకుశ శాసకుడు అగును. రజస్సు ధానముగా నుండును గాన, ఇట్టి వ్యక్తులు ప్రపంచ నాయకులు అగుదురు. ఇట్టివారు

నాయకులు కానిచో, వారి కుటుంబ సభ్యులు, కొంతవరకు చుట్టు ప్రక్కల వారు మాత్రమే బాధలకు గురియగుదురు. కాని, వారే ప్రపంచ నాయకులైనచో, ఫలితములు ఘోర విధ్వంసకరముగ నుండును.

తమస్సు ప్రధానముగా నుండే నాల్గవ రకం వ్యక్తుల వలన ఇట్టి సమస్యలు ఉండవు. వీరిలో అధములు చిన్న చిన్న చోరీలు చేస్తూ ఉంటారు. వీరిలో ఉత్తములు చిన్న ఉద్యోగులుగా ఉంటారు. వారు చిన్న ఉద్యోగాలలో కాలక్షేపం చేయటానికి జడత్వమే కారణముగాని, సంతోషము ఇత్యాదులు కావు. ఇట్టివారిలో మహత్త్వాకాంక్షలేమీ ఉండవు. ధనం సంపాదించాలనే ఆకాంక్ష కూడా ఉండదు. వాస్తవంలో, వారు తాము ధనమును సంపాదించలే మనే నిర్ణయానికి వచ్చేసి ఉంటారు. "నేను ధనమును సంపాదించగల్గి ఉంటే, ఎప్పుడో సంపాదించి ఉండేవాడిని" అని వారు అంటారు. "అయినా ధనం ఎవరికి కావాలి?" అని చెప్పి, వారు తమ జడత్వమును సమర్థించుకుంటారు. ఒకవేళ ఇట్టి వ్యక్తికి ఏదేని మహత్త్వాకాంక్ష ఉన్నా, అతడు దాని కొరకై కష్టపడడు; పైగా, జీవితంలోని ప్రతి మలుపునందు రాజీకి సిద్ధపడతాడు. జడత్వము, తమస్సు అనగా నిట్లుండును.

తమస్- రజస్- సత్త్వ వ్యక్తి సత్త్వ- రజస్- తమస్ వ్యక్తిగా మారాలనుకుంటే, ముందుగా రజస్- తమస్- సత్త్వ స్థాయికి, తదుపరి రజస్- సత్త్వ- తమస్ స్థాయికి ఎదిగి, తరువాత మాత్రమే సత్త్వ- రజస్- తమస్ వ్యక్తి కాగల్గుతాడు. ఇచట కప్పగంతులు సంభవము కావు. ఇది మానసిక పరిణతికి, క్రమవికాసమునకు సంబంధించిన ప్రక్రియ. కర్మయోగము యొక్క తాత్పర్యము కూడ ఇదియే. వ్యక్తి కర్మయోగ భావనతో కర్మల నాచరించుట ద్వారా పరిణతిని పొందుతాడు.

ధర్మబద్ధముగా కర్మలను చేస్తూ ఉంటే, తేలికగా రజస్- తమస్- సత్త్వ స్థాయికి ఎదుగవచ్చును. కాని, కర్మలను కర్మయోగ భావనతో ఆచరించిన వ్యక్తి మాత్రమే సత్త్వ- రజస్- తమస్ స్థాయికి ఎదుగుతాడు. ఇట్టి వ్యక్తియే సన్న్యాసి యగుటకు అర్హుడు.

ఈ నాల్గు వర్గములలో ప్రతిదానిలోనూ చిన్న చిన్న తేడాలు ఉంటాయి. ఉదాహరణకు, రజస్- తమస్- సత్త్వ వ్యక్తి నేరగాడైనా కావచ్చు; లేదా మహత్త్వాకాంక్షతో కూడిన వస్తు విక్రేత కావచ్చును. ఇట్టి వస్తు విక్రేతలు మనలను చిరునవ్వుతో తమ షాపులలోనికి ఆహ్వానించినపుడు,

మనము ఆ చిరునవ్వుకు కూడ బిల్లు చెల్లిస్తాము. ఇట్టి వ్యక్తిలో ప్రతికర్మను రూపాయలలోకి మార్చే కరడు గట్టిన స్వార్థము ఉంటుంది. రజస్–తమస్–సత్త్వ వ్యక్తులలో ధర్మాత్ములు, అధర్మాత్ములు కూడ కొద్ది భేదాలతో కనిపిస్తారు. కాని రజస్–సత్త్వ–తమస్ వ్యక్తులు మాత్రం ధర్మమునే పాలిస్తారు.

చాతుర్వర్ణ్య విభాగము విశ్వజనీనము

ఈ మూడు గుణములు భారతదేశంలోనే గాక, ప్రపంచమంతటా మానవుల స్వభావాలలో ఇట్టి తేడాలను కలిగిస్తాయి. ఈ సత్త్వరజ స్తమోగుణములు ప్రకృతికి సంబంధించినవి. ప్రకృతి భగవానునకు మాత్రమే సంబంధించినది. కాన, ఈ గుణ విభాగమునకు ప్రకృతియే మూలము.

మానవులందరు తాము పరిణతి చెందే ప్రక్రియలో ఈ నాల్గు గుణ సముదాయముల గుండా పయనిస్తారు. ఏదో ఒక దానికి చెందుతారు. ఇట్టి సముదాయములు నాలుగు మాత్రమే సంభవము. వైదిక సంప్రదాయములో సత్త్వ–రజస్–తమస్ అనే మొదటి కలయికకు చెందిన వ్యక్తులను బ్రాహ్మణులనియు; రజస్–సత్త్వ–తమస్ అనే రెండవ కలయికకు చెందిన వారిని క్షత్రియులనియు, రజస్–తమస్–సత్త్వ అను మూడవ కలయికకు చెందిన వారిని వైశ్యులనియు, తమస్–రజస్–సత్త్వ అనే నాల్గవ కలయికకు చెందినవారిని శూద్రులనియు వ్యవహరిస్తారు. ఈ శ్లోకములో నిర్దేశింపబడిన గుణ విభాగము ఆధారముగా గల చాతుర్వర్ణ్య విభాగమిదియే.

కర్మ ఆధారముగా మానవుల విభాగము

ఈ వ్యవస్థలో మరియొక విభాగము కూడ గలదు. అది కూడ నాల్గు విధములుగ నున్నది. ఈ నాల్గు వర్గముల పేర్లు పై విభాగములోని పేర్లతో సమానమే. ఈ విభాగమునకు మూలము కర్మ (కర్మ విభాగము). ఉదాహరణకు, అధ్యాపన యాజనములు బ్రాహ్మణుని కర్తవ్యములు. అతడు సమాజ కళ్యాణము కొరకై ప్రార్థనామయమగు జీవితమును గడుపును. అతడు శరీర ధారణకు అత్యావశ్యకమగు కనీస వస్తువులతో జీవితమును వెళ్ళబుచ్చును. అతడు శమము నభ్యసించి, దమమును సాధించవలెను; వేదాధ్యయనమునుచేసి, పురోహితుడై సమగ్రముగు కర్మకాండకు సంబంధించిన కృత్యములను నిర్వర్తింపజేయును. సమాజములో మతపరమగు కర్మకాండ జరుగుతూ ఉండాలి. ఈ కర్మకాండకు బాధ్యత బ్రాహ్మణునిదే.

ఈ విధముగా గుణముల వలన బ్రాహ్మణుడు, మరియు కర్మల వలన బ్రాహ్మణు గలరు. అటులనే గుణ క్షత్రియుడు ఒకడు. మరియొకడు కర్మ క్షత్రియుడు. ధర్మ రక్షణ అత కర్తవ్యము. అర్జునుడు క్షత్రియుడు. కాన, రాజ్యమేలుట, ప్రజలను రక్షించుట, శాసనమ న్యాయ వ్యవస్థ, దండనీతి, రాజ్యపరిరక్షణ అనునవి అతని విధులు. ఈ కర్తవ్యములన్నీ క్షత్రియ ధర్మములోనివే. ఈ కర్తవ్య నిర్వహణ ప్రతి సమాజమునకు అవశ్యకమే.

వ్యాపారము, సంపద, వ్యవసాయము, పంట భూములు మొదలగు వాటి నిర్వహించువాడు వైశ్యుడు. వ్యాపారమనగా, ఒక వస్తువును అది తయారైన స్థానము నుండ సంగ్రహించి, అవశ్యకమైన స్థానములలో విక్రయించుట. ఈ తీరున వస్తువులు ప్రజలక అందుబాటులో నుండునట్లు చేయుట వైశ్యుని విధి.

శూద్రులు నాల్గవ వర్గము వారు. వీరు ఇతరులకు చేతులు, కాళ్లు, కళ్లు, చెవులు వంటివారు. సేవచేయుట వీరి విధి. వీరు లేనిదే ఇతరులు దేనినీ సాధించలేరు. వారు చేయు పనులు ప్రపంచములోని సమాజములన్నిటిలో దర్శనమిస్తాయి. సమాజంలోని సర్వ వ్యవహారములు వీరిపై ఆధారపడును.

వైదిక సంస్కృతిలో నాల్గు వర్గములకు చెందిన ప్రజల కర్మలు విధులుగా తీర్చిదిద్దబడినవి. మరియు, ఈ కర్మలు కుటుంబ పరముగా విధింపబడినవి. ఇదంతా ఎప్పుడు ప్రారంభమైనదో మనకు తెలియదు. కాని, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుల విధుల నాచరించు ఆయా వ్యక్తులు తమ విధులనే తమ సంతానమునకు అందజేసేవారు.

ఖచ్చితంగా చెప్పాలంటే, ఒక వ్యక్తి పుట్టిన వర్గం ఏదైనా, అతడు చేసే కర్మను బట్టి అతని వర్గం నిశ్చయింపబడాలి. బ్రాహ్మణ కుటుంబములో పుట్టిన వ్యక్తి వైశ్య కర్మను చేసినచో, వైశ్యుడగును. బ్రాహ్మణ కుటుంబములో పుట్టిన వ్యక్తి తన తండ్రి, తాత, ముత్తాతల వలె నిరాడంబరమగు జీవితమును గడుపుతూ, సమాజమును స్వార్థము కొరకు వినియోగించనివాడై, వేదమును అధ్యయనము చేసి, ఇతరులకు బోధిస్తూ ప్రజాక్షేమమును గోరి నిత్యకర్మల ననుష్ఠిస్తూ ఉంటే, అతడే అసలైన బ్రాహ్మణుడు.

ఈ నాల్గు రకముల వర్గములు విధులను బట్టియే ఏర్పడినవి. విధులను జవదాటుట కూడ సంభవమే. కాని, మనమిచట చర్చిస్తున్న సంగతి అది కాదు. విధులు (కర్మ) మాత్రమే

మానవుల చతుర్విధ విభాగమునకు మూలము. ప్రతి సముదాయమునకు స్వీయ విధులు గలవు. అనగా బ్రాహ్మణ విధులు, క్షత్రియ విధులు, వైశ్య విధులు, శూద్ర విధులు వేర్వేరుగా ఉన్నాయి.

ఒక వ్యక్తి కర్మ రీత్యా బ్రాహ్మణుడు. అతడు వేదమును వల్లిస్తాడు. వైదిక కర్మలను చేయిస్తాడు. కాని, గుణ రీత్యా అతనికి మహత్త్వాకాంక్ష ఉన్నది. అతనికి గుర్తింపు కావాలి. ఇట్టి వ్యక్తి సత్త్వ-రజస్-తమస్‌కు చెందడు. కాని, అదే వ్యక్తి అందుకు భిన్నంగా, తన విధులను కర్మయోగ భావనతో ఆచరిస్తే, అతడు సత్త్వ-రజస్-తమస్ కలయికకు చెందిన వాడగును. అపుడాతడు, ఇది నా విధి; నేను నా కర్తవ్యములను ఆచరించి తీరాలి; నేను వీటిని ఈశ్వరార్పణం చేయాలి అని భావించును.

కర్మయోగము; విధి పునాదులపై సమాజరచన

సమాజ రచనలో విధి భావన స్పష్టముగా నిర్వచింపబడియున్నచో, ఆ సమాజంలో జన్మించిన వ్యక్తికి కర్మయోగము సులభమగును. సమాజరచనకు ఆలంబనమగు స్ఫూర్తిని ఆతడు అర్థం చేసుకుంటాడు. అపుడాతడు తన విధులను నిర్వర్తించుకుంటూ ముందుకు సాగులాడు. అట్టి వ్యక్తికి జీవితంలో తాను చేయదగిన ఉద్యోగం గురించి, వృత్తి గురించి వెదుక బనిలేదు. అతనికి తాను పుట్టిన కుటుంబమును బట్టి, చేయదగిన వృత్తి ఖచ్చితంగా తెలుస్తూ ఉంటుంది. మరో మాటలో చెప్పాలంటే, పుడుతూనే అతని ముఖాన అతని విధులు లిఖింపబడి ఉంటాయి.

కర్మ సిద్ధాంతమును విశ్వసించే వ్యక్తికి, తాను ఒకానొక కుటుంబంలో జన్మించుటకు తన పూర్వ కర్మ తప్ప మరియొకటి కారణం కాదని తెలుస్తూనే ఉంటుంది. ఒకానొక కర్మ ఆతని జీవితమును నియంత్రించుచున్నది. కాన, ఆతనికి తన కర్తవ్యం స్పష్టంగా తెలుస్తూ టుంది. ఉదాహరణకు, బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన వ్యక్తికి తాను వేదమును అధ్యయనం ాలని, యజ్ఞములను చేయాలని, తెలుస్తుంది. అతడు వాటిని ఆనందంగా చేస్తాడు. ఆతడు లను నిర్వర్తిస్తూ, "నేను ప్రభుత్వ అధికారినై ఉంటే, ఎంతో ధనాన్ని సంపాదించి కాని, ఇప్పుడు నాకు ఏదీ లేదు!" అని సణుగుకొనడు.

యే ప్రధానమైనప్పుడు, విధులపై ఆధారపడే వ్యవస్థ పనిచేయజాలదు. ఏ

పనిచేస్తే మిక్కిలి ఎక్కువ ధనము లభించును? అను విషయమునే ప్రతివాడు పరిశీలించి, ఆ పనినే
చేస్తాడు. వైద్య విద్యలో డబ్బు ఎక్కువ గడించవచ్చును. కాన, నేను వైద్యుడను కావాలి. వైద్యుల
సంఖ్య బాగా పెరిగిపోతే, జనులు ఎక్కువ అవకాశములు, ధనము గల మరో క్షేత్రంలోకి
పరుగిడతారు. నిజం చెప్పాలంటే, ధనము, అధికారము మాత్రమే ప్రముఖమైనప్పుడు, వ్యవస్థ
ఏదీ మిగలదు. మానవుల విద్య, వృత్తి, వివాహము ఇత్యాది విషయము లన్నిటిలో ధనము,
అధికారము మాత్రమే వ్యవస్థను నిర్ణయించును.

కాని, వైదిక దర్శనములో ప్రధాన లక్ష్యము మోక్షము. నీవు పూర్ణుడవనియు,
శుద్ధుడవనియు, ఈ జ్ఞాన రూపమగు మోక్షమును నీవు పొందవలెననియు వేదము బోధించును.
ఈ జ్ఞానము లభించాలంటే, మనస్సు పరిణతిని చెందాలి. కర్మయోగ జీవనమును గడుపుట
ద్వారా మాత్రమే ఇట్టి చిత్త శుద్ధి లభించును. కర్మయోగము సిద్ధించాలంటే, ఒక విశిష్ట విధి
ఉండాలి. వ్యక్తికి, తన కర్తవ్యమేమో తెలిసి ఉండాలి. తన విధిని గురించి సుస్పష్టమైన అవగాహన
గల వ్యక్తి మాత్రమే కర్మలను యోగ భావనతో ఆచరించగల్గుతాడు.

బ్రాహ్మణునకు తన విధుల గురించి ఉండే అవగాహనను మనము చూచి యున్నాము.
అటులనే, క్షత్రియునకు తన విధి స్పష్టముగా తెలియుచుండును. అతడు తన కర్తవ్యమును
ఉత్సాహముతో నిర్వర్తించును. వైశ్యునకు కూడ తన కర్తవ్యములు స్పష్టముగ తెలియుచుండును.
అతని తండ్రి వ్యాపారమును గాని, వ్యవసాయమును గాని, పశుపోషణను గాని చేస్తూ
ఉండవచ్చును. కుమారుడు ఈ మూడింటిలో ఒక దానిని ఎన్నుకొనును; లేదా, అన్నింటినీ
నడుపును. అతడు దేనిని స్వీకరించినా, అది అతని విధి. అతడు సముచితమగు లాభమును
తీసుకొని, తన విధిని నెరవేర్చును. వైశ్యుడు కూడ సమాజమును స్వార్థము కొరకు వాడుకొనరాదు.
ఉదాహరణకు, వినియోగ వస్తువుల నన్నిటినీ ఖరీదు చేసి, గోదాములలో దాచి, తద్వారా
కృత్రిమమగు లోటును సృష్టించి, ప్రజలు వాటి కొరకు గోల చేసినపుడు, ఆ వస్తువులను
కొద్దికొద్దిగా అమ్ముతూ పెద్దలాభాలను ఆర్జించుట ఇత్యాది అధర్మములను వైశ్యుడు చేయరాదు.
ఇట్టి పనులు ధర్మ బద్ధములు కావు; వైశ్య ధర్మము కానే కాదు. కావున, వైశ్యుడు తన విధులను
ఆనందంతో స్వీయధర్మానుసారముగా ఆచరిస్తే, అది అతనికి యోగమగును. శూద్రకర్మల
విషయములో కూడ నింతే. అవి నీచమగు కర్మలు కాని అవమానకరమగు కర్మలు కాని కావు.
అవి కేవలము కర్తవ్య కర్మలు మాత్రమే.

పెద్దరికము విధిని బట్టి కాదు; పరిణతిని బట్టి

ఒక విధి మరియొక విధి కంటె గొప్పది కాదు. విధులన్నీ సమానమగు పవిత్రత, ఆవశ్యకత గలవియే. కనుక, ఒక వర్ణములోని వ్యక్తులు మరియొక వర్ణములోని వ్యక్తుల కంటె గొప్పగాని, తక్కువ గాని కారు. మానవులందరు, ఏ వర్గమునకు చెందినా, పరమేశ్వర స్వరూపులే: ప్రతి సమాజంలో చేయవలసిన పనులు కొన్ని ఉంటాయి. ఈ కర్తవ్యములన్నీ నాలుగు విధాలుగా ఉన్నాయి. కావున, మానవ సముదాయములు నాల్గింటిలో పరస్పర భేదము కేవలము వారు నిర్వర్తించే విధులకు సంబంధించినది మాత్రమే.

ఒక వ్యక్తి ఏ వర్గానికి చెందినవాడైనా, తన విధిని కర్మయోగ భావనతో అనుష్ఠిస్తే, అతడు గుణ రీత్యా సత్త్వ- రజస్- తమస్ సముదాయానికి చెందుతాడు. మహత్త్వాకాంక్షతో, వ్యక్తిగత ఖ్యాతి కొరకు వేద మంత్రములను వల్లించే బ్రాహ్మణుడు రజస్- సత్త్వ- తమస్ వర్గమునకు చెందును. అదే బ్రాహ్మణుడు ఇతర ఆకాంక్షలు లేనివాడై కేవలము ధనము కొరకు మాత్రమే వేదాధ్యయనమును చేసినచో, అతడు రజస్- తమస్- సత్త్వ వర్గమునకు చెందును. ఆయన దేవాలయంలో నీరసంగా, నిరుత్సాహంగా, కేవలం భోజనం కొరకు మాత్రమే పూజను చేసినచో, అతడు తమస్- రజస్- సత్త్వ సముదాయానికి చెందినవాడగును.

ఇంకో రకం బ్రాహ్మణుడు గలడు. ఆయన తన కర్తవ్యములయందు అభిరుచి కల్గి, బాగా నిర్వహిస్తాడు. కాని, అందరూ తన మాట వినాలని భావిస్తాడు. ఎవరు వస్తారా అని ఎల్లవేళలా ఎదురుచూస్తూ ఉంటాడు! మరి కొందరు పూజ చేస్తూ ఉండగా, ధనవంతుడగు వ్యక్తి వస్తూ కనబడగానే, పూజను మధ్యలో ఆపివేసి, అతనితో సరస సల్లాపాలు చేస్తారు. భగవంతుడు వారు చేసే పూజ కొరకు ప్రతీక్షించాలి కాబోలు! ఈ తీరున బ్రాహ్మణులలో అనేక రకాలు ఉన్నారు. కర్మరీత్యా గుణరీత్యా కూడా ఎవరు బ్రాహ్మణులో, వారు బ్రాహ్మణ బ్రాహ్మణులు. కర్మరీత్యా బ్రాహ్మణులై, గుణరీత్యా క్షత్రియులైన వారు క్షత్రియ బ్రాహ్మణులు. కర్మను బట్టి బ్రాహ్మణులై, గుణాలలో వైశ్యులైన వారు వైశ్య బ్రాహ్మణులు. కర్మను బట్టి బ్రాహ్మణులై, గుణరీత్యా శూద్రులైన వారు శూద్ర బ్రాహ్మణులు.

ఇదే తీరున, బ్రాహ్మణ క్షత్రియులు, క్షత్రియ క్షత్రియులు, వైశ్య క్షత్రియులు, శూద్ర క్షత్రియులు; బ్రాహ్మణ వైశ్యులు, క్షత్రియవైశ్యులు, వైశ్య వైశ్యులు, శూద్రవైశ్యులు; బ్రాహ్మణ శూద్రులు, క్షత్రియ శూద్రులు, వైశ్య శూద్రులు, మరియు శూద్ర శూద్రులు గలరు. వీరందరిలో

ఎవరు గొప్ప? బ్రాహ్మణ బ్రాహ్మణుడు, బ్రాహ్మణ క్షత్రియుడు, బ్రాహ్మణ వైశ్యుడు, బ్రాహ్మణ శూద్రుడు సమానము. కాన, బ్రాహ్మణుడు గొప్పవాడు. ఈ మాటను అపార్థము చేసుకొనరాదు. బ్రాహ్మణుడు శ్రేష్ఠుడు అన్నప్పుడు, మనము బ్రాహ్మణ విధులను నిర్వర్తించే వ్యక్తిని గురించి చెప్పుట లేదు. మనము ఆ వ్యక్తి యొక్క గుణమును గూర్చి, మానసిక పరిణతిని గూర్చి మాటలాడుచున్నాము. సమాజంలో ఈ విషయంపై చాల భ్రాంతులు గలవు. వాటి మూలంగా వివిధ వర్ణాల వ్యక్తుల మధ్య అనేక సమస్యలు తలయెత్తుచుండును.

బ్రాహ్మణ విధులను నిర్వర్తించే ఒక వ్యక్తి తాను గొప్పవాడినని చెప్పినచో, అతడు తనలో బ్రాహ్మణ గుణములు లేవని ప్రకటించుకొనుచున్నాడనుటలో సందియము లేదు. కావున, అతడు బ్రాహ్మణ బ్రాహ్మణుడు కాజాలడు. భారతదేశములోని దేవాలయములలో జన్మతః బ్రాహ్మణులు కాని గొప్ప చారిత్రక పురుషులైన సాధు సంతులు ఆరాధింపబడుచుండుట కానవస్తుంది. వీరిలో కొందరు శూద్రులు కాగా, మరికొందరు పై నాల్గు వర్ణములలో ఏ ఒక్కదానికీ చెందని హరిజనులు. ఈ సాధుసంతులలో చాలమంది కర్మరీత్యా శూద్రులైనను, బ్రాహ్మణ శూద్రులగుటచే దేవాలయములలో ఆరాధింపబడుచున్నారు. కావున, వ్యక్తి కర్మ రీత్యా నాల్గు వర్ణములలో ఏ ఒక్క దానికి చెందిన వాడైనా, గుణ రీత్యా బ్రాహ్మణుడు కావచ్చును.

విధులు మారవచ్చును; కాని, గుణములు మారవు

ఈ విధి విభాగము, వర్ణ విభాగము భారతదేశములోనే గాక, ప్రపంచమంతటా గలదు. అయితే, ఒక తేడా ఉన్నది. ఈ వర్ణ విభాగము భారతదేశములో కుటుంబ వ్యవస్థలో అంతర్భాగముగా నున్నది. అనగా, ప్రతి కుటుంబము నాల్గు వర్ణాలలో ఏదో ఒకదానికి చెంది ఉంటుంది. బహుశః నూటికి ఒక్కరు మాత్రమే ఇంకనూ ఈ వ్యవస్థను అనుసరిస్తున్నారని చెప్పవచ్చును. అట్లు అనుసరించే వారిలో, బ్రాహ్మణుని కుమారుడు వేదమును చదివి, చదివించును; వేద విహిత కర్మల ననుష్ఠిస్తూ, సమాజ కళ్యాణము కొరకు ప్రార్థనలు చేస్తూ, నిరాడంబర జీవితమును గడుపును. ఈ వ్యవస్థకు ఆవశ్యకమగు రక్షణ కరువగుటచే ఇంచుమించు మాయమైనది.

రక్షణ లేనిదే, ఏ వ్యవస్థయూ మనజాలదు. మొగలాయీ దురాక్రమణలకు పూర్వములో రాజవంశములు ఈ చాతుర్వర్ణ్య వ్యవస్థను రక్షించెడివి. కాని, ఎనిమిది వందల యేళ్ళు మొగలాయీ

ంనలో ఇది నశించిపోయినది. దీని ఫలమేమన, వ్యక్తులు బ్రతుకు తెరువుకోసం, కుటుంబ షణ కోసం ఆవశ్యకమగు పనులను చేపట్ట దొచ్చిరి. తన తండ్రి చేసిన కర్మ యేది? అనే యమును గురించి వ్యక్తి పట్టించుకొనుట మానివేసినాడు. ఈ కారణంగా, విధుల దృష్ట్యా వ్యవస్థ పూర్తిగా మారిపోయినది.

కాని, గుణముల దృష్ట్యా చేయబడే మనుష్య విభాగములో మార్పు ఉండదు. ఈ ంలోనే కర్మ యోగ భావన సుస్పష్టంగా మనకు అర్థమవుతుంది. తన కర్తవ్యమును ఏ భావనతో నిర్వర్తించు వ్యక్తి కర్మయోగి అనబడును. ఇట్టి వ్యక్తి మానసిక గుణముల ్య సత్త్వ-రజస్-తమస్ కోవకు చెందును గాన బ్రాహ్మణుడగును. ఇట్టి బ్రాహ్మణుడే న్న్యాసి యగుటకు అర్హుడు. 'బ్రాహ్మణుడు మాత్రమే సన్న్యాసమునకు అర్హుడు' అనే విధి ానసిక గుణములు మాత్రమే ఆధారముగా విధింపబడినది. ఈ విధికి ఒక వ్యక్తి జన్మించిన సముదాయముతో గాని, కర్మల దృష్ట్యా ఆ వ్యక్తికి చెందవలసిన సముదాయముతో గాని సంబంధము ఏ మాత్రము లేదు.

శ్రీకృష్ణుడు కర్త; అకర్త కూడా

ఈ తీరున, వైదిక సంస్కృతిలో మానవులు కర్మలు ఆధారంగా నాల్గు సముదాయములు చత్వారః వర్ణాః) గా విభజింపబడినారు. ప్రతి వ్యక్తిలో సత్త్వ రజస్తమో గుణములు కానవచ్చును. అందువలననే, ఈ విభాగము సాధ్యపడినది. ఈశ్వరుని స్థానములో నున్న శ్రీకృష్ణుడు, "నేను వారి నందరినీ సృష్టించితిని; కాని, నన్ను నిందించవలదు; నేను కర్తను గాను. వారి కర్మల వలననే వారు వివిధ రకములుగా జన్మించిరి " అని చెప్పగల్గును. వ్రేలిని నిప్పులో పెడితే, వ్రేలు కాలుతుంది. అపుడు నిప్పును " నా వ్రేలిని నీవు కాల్చితివా? " అని అడిగినచో, " అవును, నేను నీ వ్రేలిని కాల్చితిని'' అని సమాధానము వచ్చును. నీవు నా వ్రేలిని యేల కాల్చితి? అని అడిగినచో, ''నేను నీ వ్రేలిని కాల్చలేదు" అని సమాధానము వచ్చును. ఈశ్వరుని నిందించుట కూడ ఇట్టిదే.

అగ్నితో సంభాషణను కొనసాగిద్దాము: ''కాని, నీవు వ్రేలిని కాల్చినట్లు ఒప్పుకున్నావు. ఈ పనిని చేసినది (కర్త) నీవే" అని నీవు అంటావు. "అవును, నేను అటులనే చెప్పితిని" అని అగ్ని ఉత్తరమిచ్చును. అపుడు నీవు అగ్నితో, "నేను కర్తను కాదు అనియు, అకర్తను అనియు నీవు ఏల చెప్పుచుంటివి?" అంటావు. "నేను నీ వ్రేలిని కాల్చలేదు గనుక" అని సమాధానము. "నీవు

కాల్చితివి" అని నీవు అంటావు. "అవును; నేను కాల్చితిని" అని అగ్ని సమాధానమిచ్చును. అపుడు నీవు మరల, "నీవు కాల్చలేదని చెప్పితివి గదా!" అంటావు. "అవును; నేను నీ వ్రేలిని కాల్చలేదు గదా!" అని సమాధానము.

ఇదంతా యేమిటి? తాను కర్తననియు, తాను అకర్తననియు కూడ అగ్ని చెప్పుచున్నది. అపుడు అగ్ని ఇట్లు వివరించును – "నేను వ్రేలిని కాల్చితిని. కావున, నేను కర్తనని చెప్పితిని. వ్రేలిని మరొకరు కాల్చలేదు. నేనే కాల్చితిని. కాని, నా అంతట నేను నీ వ్రేలిని వెతికి పట్టుకొని కాల్చలేదు గదా! నీవు నీ వ్రేలిని నా యందు ఉంచితివి. నీకు కాల్చుకోవాలనిపించింది. కాల్చుకున్నావు. నేను అగ్నిదేవతను గదా! నీవు నన్ను ఏరూపంలో ప్రార్థిస్తే, ఆ రూపంలో నిన్ను ఆశీర్వదిస్తాను. నీవు మరల ప్రయత్నం చేయి. నేను నీకు నీళ్లు కాచి ఇస్తాను. నేను నీ గదిని, నీ చేతులను వెచ్చగా ఉంచుతాను. నేను నీ వ్రేళ్లను దహించగలను కూడా. నా నుండి నీకేది కావాలో చెప్పు. నేను నీకు దానిని ఇస్తాను. కాని, నన్ను నిందించవలదు. నీవు చేసే కర్మకు అర్హమైన ఫలం నీకు నా నుండి లభిస్తుంది గనుక, దాని దృష్ట్యా నేను కర్తనే అయినా, నా దృష్ట్యా నేను కర్తను గాను. ధర్మము నేనే. నా స్వరూపమే అయిన ధర్మమును నేను ఉల్లంఘించజాలను".

ఇదే విధముగా, ఈశ్వరుని స్థానములో నుండి శ్రీకృష్ణుడు తానే ఈ విశిష్ట వ్యవస్థను సృష్టించితిననియు, మానవులు నాల్గు సముదాయములుగా విభజింపబడియుండుట ఈ సృష్టిలో భాగమనియు చెప్పెను. కావున, ఈ చాతుర్వర్ణ్య వ్యవస్థను సృష్టించిన ఈశ్వరుడు కర్తయని మనం తెలుసుకోవాలి. అదే సమయంలో, నేను దీనిని చేయలేదు; నేను అకర్తను అని చెప్పుచున్నాడు గనుక, భగవానుడు అకర్తయని కూడా మనం తెలుసుకోవాలి. ఇది యెట్లు సంభవమగును?

ప్రపంచ దృష్ట్యా, దానిలో భాగమైన నాల్గు సముదాయముల ప్రజల దృష్ట్యా మాత్రమే శ్రీకృష్ణుడు కర్త యని మనము అంగీకరించవచ్చును. కాని, పరమేశ్వరుని దృష్టి కోణములో ఆయన యథార్థంగా కర్త కాడు. కావున, ఈశ్వరుడు నిందార్హుడు కాడు. ఒక వ్యక్తికి తనదైన విశిష్ట కర్మ గలదు. అదియే అతనిని బ్రాహ్మణునిగా, క్షత్రియునిగా, వైశ్యునిగా, లేక శూద్రునిగా నిర్ణయించును. జీవుడు జన్మించు సముదాయము జీవుని కర్మపైన ఆధారపడును. దానికి ఈశ్వరుడు బాధ్యుడు కాడు.

సృష్టియందు ఈ చాతుర్వర్ణ్య విభాగము గలదు. సత్త్వము ప్రధాన గుణముగా

వారు బ్రాహ్మణు లగుదురు. రజస్సు ప్రధానముగా గలవారు క్షత్రియులు గాని, వైశ్యులుగాని గుదురు.

ఈ విషయము వ్యక్తుల మనో నిర్మాణముపై పూర్తిగా ఆధారపడును. సర్వమానవులకు చ్ఛాస్వాతంత్ర్యము గలదు. కాన, మానవులకు తమ మనో నిర్మాణమును మార్చుకునే శక్తి లదు. వ్యక్తి యొక్క గుణ నిర్మాణమునకు ఈశ్వరునితో సంబంధము లేదు. ఈశ్వరుడు కర్మ లముల నిచ్చువాడు (కర్మఫలదాత) మాత్రమే. ఆ విషయములో ఈశ్వరునకు పక్షపాత మియూ ఉండదు.

ఈశ్వర సృష్టమైన జగత్తు దృష్ట్యా ఈశ్వరుడు కర్త. కాని, ఈశ్వరుని స్వీయ తత్త్వ క్షాత్కారము దృష్ట్యా ఈశ్వరుడు అకర్త. అనగా, ఈశ్వరుని యందు 'నేను కర్తను' అనే ర్తృత్వ బుద్ధి లేదు. ఈ సత్యము తన విషయములో మాత్రమే గాక, సర్వ ప్రాణుల విషయములో కూడా సత్యమేనని శ్రీకృష్ణుడిదివరలో చెప్పియుండెను. ఆత్మ ఈశ్వరా భిన్నమనియు, అకర్త యనియు దర్శించు వ్యక్తి అకర్త యగును.

శ్రీకృష్ణుడింకనూ ఇట్లు చెప్పెను:

అధ్యాయము 4, శ్లోకము 14:

न मां कर्माणि लिम्पन्ति न मे कर्मफले स्पृहा।
इति मां यो ऽभिजानाति कर्मभिर्न स बध्यते ॥(१४)

న మాం కర్మాణి లింపంతి న మే కర్మ ఫలే స్పృహా
ఇతి మాం యోభిజానాతి కర్మ భిర్న న బధ్యతే (14)

కర్మాణి = కర్మలు; **మాం** = నన్ను; **న లింపంతి** = ప్రభావితము చేయవు; **మే** = నాకు; **కర్మఫలే** = కర్మఫలమునందు; **స్పృహా** = తృష్ణ; **న** = లేదు; **ఇతి** = అని; **యః** = ఎవడైతే; **మాం** = నన్ను; **అభిజానాతి** = స్పష్టముగా తెలుసుకొనునో; **సః** = అతడు; **కర్మభిః** = కర్మల చేత; **న బధ్యతే** = బంధింపబడడు.

కర్మలు నన్ను ప్రభావితము చేయవు. నాకు కర్మ ఫలమునందు తృష్ణ లేదు. ఈ విధముగా ఎవడైతే నన్ను స్పష్టముగా తెలుసుకొనునో, ఆతడు కర్మల చేత బంధింపబడడు. (14)

ఈ శ్లోకములో శ్రీకృష్ణుడు భగవానుని గురించిన ఒక సత్యమును ఆవిష్కరించి, అది జీవునకు కూడ అన్వయించునని చెప్పెను. భగవానుడు జగత్తును, దానిలోని సర్వమును సృజించి, అది సరియగు రీతిలో కొనసాగుటకు కావలసిన పనులనన్నిటినీ చక్కబెట్టును. కాని, ఈ కర్మ లేమియూ, అవి ఎటువంటివి అయినా, భగవానుని ప్రభావితుని చేయవు (న మాం కర్మాణి లింపంతి). అనగా, ఆ కర్మలు జీవునకు కలిగించే తీరున, భగవానునకు పుణ్యపాపములను కలిగించవు. కావున, అవి భగవానునకు సుఖ దుఃఖముల నీయవు; బంధించవు. కర్మలు భగవానుని యేల బంధించవు? 'నేను కర్తను' అను ధారణ ఆయన యందు లేదు గనుక.

దీనికి భిన్నముగా, జీవుడు ఆత్మయందు కర్తృత్వము నారోపించి, తానే ఈ కర్మల నన్నిటినీ చేయుచున్నానని తలపోయును. కర్తృత్వమున్నది గనుక, భోక్తృత్వము కూడ ఉండును. తనను కర్తగా దర్శించే వ్యక్తి తాను చేయు కర్మలన్నిటికీ సమాధానము చెప్పవలసియుండును. కాని, వాస్తవంలో ఆత్మ కర్త కాదు. ఈ విశిష్ట సత్యము నెరింగిన వ్యక్తి తనను తాను కర్తగా భావించుట మానివేయును. అపుడాతడు కర్మలచే ప్రభావితుడు కాడు.

అట్లైనచో, తాను కర్త కాదని యెరింగిన శ్రీకృష్ణుడు కర్మలనేల ఆచరించెను? ఏదో సాధిద్దామనే కోరికతో ఆయన కర్మల నాచరించెనా? అట్లు కాదని శ్రీకృష్ణుడు చెప్పెను. కర్మ ఫలమునందు శ్రీకృష్ణునకు తృష్ణ ఏ మాత్రమూ లేనే లేదు (నమే కర్మఫలే స్పృహా). కావున, శ్రీకృష్ణుడు ఫలము నపేక్షించి ఏనాడూ కర్మను చేయలేదు. ఒక విశిష్ట కర్మను చేయుట ద్వారా నేను మరింత ఉన్నతుడనగుదుననే ధారణ ఆయన యందు లేకుండెను.

నీవు అకర్తవని తెలుసుకో

"ఈశ్వరుని విషయంలో ఇది సత్యమే అగుగాక! నా సంగతి యేమి?" అని నీవు అడుగవచ్చును. జీవుడు తాను ఆచరించు కర్మ లన్నిటిచేత ప్రభావితుడగుచుండును. మరియు, జీవుడు కొన్ని ఫలముల యందు తృష్ణ కలిగియుండును. అట్టి జీవుని సంగతి యేమి? ఈ పరిస్థితి అజ్ఞానుల యందు మాత్రమే ఉండునని ఈ శ్లోకము మనకు బోధించుచున్నది.

శ్రీకృష్ణుడిట్లు చెప్పుచున్నాడు: "నన్ను స్పష్టముగా యెరింగిన వ్యక్తి (యః మాం అభిజానాతి) తనను కర్మలు ప్రభావితము చేయవనియు (న మాం కర్మాణి లింపంతి), తాను కర్మఫలముల కొరకు లాలాయితుడను కాననియు (న మే కర్మఫలే స్పృహా) చెప్పగల్గును". ఇట్టి వ్యక్తులను కర్మలు బంధించవు. వారు తమ స్థితిని మెరుగుపరుచుకోవాలనీ, కర్మల ఫలములు లభించాలనీ కాంక్షించరు.

'జానాతి' అనగా తెలియుట. 'అభిజానాతి' అనగా స్పష్టముగా తెలియుట. 'ఈశ్వరుని ఆత్మాభిన్నముగా తెలియుట' అనునది ఇచటి తాత్పర్యము. అకర్తయగు పరమాత్మను తెలియు విధము మరియొకటి లేదు. ఈ ప్రకరణములోని ఆత్మ అకర్త, నిర్గుణము. ఇట్టి కర్తృత్వ, భోక్తృత్వ రహితమైన ఆత్మను గురించియే శ్రీకృష్ణుడిచట వివరించుచున్నాడు.

కర్తృత్వ భావన ఉన్నంత వరకు, ప్రత్యేక వ్యక్తిత్వము మిగిలియుండును. కాని, ఈ కర్తృత్వ భావన తొలగుట తోడనే, భోక్తృత్వభావన కూడ తొలగిపోయి, సర్వ విశేషణ రహితము, నిర్గుణము, అకర్త, అభోక్త యగు ఆత్మ మాత్రమే మిగులును.

ఆత్మయందు స్వీయ విశిష్ట లక్షణములే లేనిచో, ఆత్మలు ఎన్ని ఉండగలవు? విశిష్ట లక్షణములు లేవు గనుక, ఒకే ఒక ఆత్మ ఉండును. ఈశ్వర– ఆత్మ, జీవ – ఆత్మ అనే రెండు ఆత్మలు ఉండజాలవు. ఈ రెంటి యందు భేదము లేదు. ఉన్నది ఒకే ఆత్మ. అదియే ఈశ్వరుడు. అదియే జీవుడు. అట్లైనచో, భేదమేల భాసించుచున్నది? భేదము పూర్తిగా ఉపాధిమూలకమే. ఒకటి సమష్టి ఉపాధి. దానికే ఈశ్వరుడని పేరు. మరియొకటి వ్యష్టి ఉపాధి. దానికి జీవుడు అని పేరు.

ఆత్మ అకర్త, అభోక్త యని యెరింగిన వ్యక్తి ఆత్మ ఈశ్వరాభిన్నమని కూడ యెరుంగును. ఇట్టి వ్యక్తి కూడా, శ్రీకృష్ణుని వలెనే, తాను ఆచరించే వివిధ కర్మలచే బద్ధుడు కాడు (న కర్మభిః న బధ్యతే). ఈ కర్మలు వైదిక కర్మలు కావచ్చును; లేదా లౌకిక కర్మలు కావచ్చును.

ఈ శ్లోకములో జీవేశ్వరుల అభేదము ప్రతిపాదింపబడినది. కావున, ఈ శ్లోకమును మహా వాక్యముగా పరిగణిస్తారు. నేను బద్ధుడను కాను. నన్ను యెరింగిన వ్యక్తి కూడ బద్ధుడు కాడు అను శ్రీకృష్ణుని వచనము జీవేశ్వరాభేదమును ప్రదర్శించును. ఈ అభేదమును తెలుసుకోవాలి. అట్టి ఎరుకయే మోక్షము.

తరువాతి శ్లోకములో శ్రీకృష్ణుడు అర్జునునకు ఈ జ్ఞానమును పొందు ఉపాయమును మరల వివరించెను:

అధ్యాయము 4, శ్లోకము 15:

एवं ज्ञात्वा कृतं कर्म पूर्वैरपि मुमुक्षुभिः ।
कुरु कर्मैव तस्मात्त्वं पूर्वैः पूर्वतरं कृतम् ॥ १५ ॥

ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వై రపి ముముక్షుభిః
కురు కర్మైవ తస్మాత్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్ (15)

ఏవం = ఈ విధముగా; **జ్ఞాత్వా** = తెలుసుకుని; **పూర్వైః** = పూర్వమందలి; **ముముక్షుభిః అపి** = ముముక్షువుల చేత కూడా; **కర్మ** = కర్మ; **కృతం** = చేయబడినది; **తస్మాత్** = అందువలన; **త్వం** = నీవు; **పూర్వైః** = పూర్వీకులచే; **పూర్వతరం** = పూర్వకాలమందు; **కృతం** = చేయబడిన; **కర్మ** = కర్మను; **కురు ఏవ** = తప్పక చేయుము.

> పూర్వ కాలమందలి ముముక్షువులు కూడా (నన్ను) ఈ విధముగా తెలుసుకొని కర్మల నాచరించిరి. కావున, నీవు కూడ పూర్వీకులచే పూర్వకాలమందు ఆచరింపబడిన విధముగా, కర్మలను తప్పక ఆచరింపుము. (15)

శ్రీకృష్ణ భగవానుని "ఈ విధముగా (ఏవం)" తెలుసుకుని, అన్నచోట 'ఏవం' అను పదము పూర్వ శ్లోకములో చెప్పబడిన "నన్ను కర్మలు ప్రభావితము చేయవు (న మాం కర్మాణి లింపంతి)" అను విషయమును పరామర్శించును. ఆత్మ పూర్ణము, అసంగము. కావున, తనకు కర్మ ఫలముల యందు తృష్ణ లేదని శ్రీకృష్ణుడ చట చెప్పి యుండెను.

ఆత్మ సర్వ క్రియా విముక్తము. ఆత్మ యందు కర్తృత్వము లేశమైననూ లేదు. ఆత్మయందెట్టి కామనలు, సంకల్పములు లేవు. ఆత్మ శుద్ధ జ్ఞానరూపము. సంకల్పములన్నియూ ఆత్మను ఆశ్రయించి ఉండును. కాని, ఆత్మ సర్వ సంకల్ప వివర్జితము; అకర్తకనుక, ఆత్మయందు కర్మ ఫల విషయకమైన తృష్ణ ఉండదు. ఆత్మయందు కర్తృత్వము లేదు గనుక, కర్మలు శ్రీకృష్ణుని గాని, ప్రత్యగభిన్న బ్రహ్మము నెరింగిన జ్ఞానిని గాని బంధింపజాలవు.

ఈ జ్ఞానమును ఎవరు పొందెదరు? ఇతః పూర్వము ఈ అధ్యాయములోని పదవ శ్లోకములో శ్రీకృష్ణుడు ఎంతో మంది ఈ తీరున తనను పొందినారని చెప్పియుండెను. అందరూ అర్వులూ ఆయనను పొందినారని ఆయన తాత్పర్యము కాదు. మోక్షమును గోరు సాధకులు (ముముక్షువులు) మాత్రమే ఆయనను పొందెదరు. జ్ఞానమును పొందిన తరువాత వీరికి లభించిన దేమి? వారిని కర్మలు ప్రభావితము చేయవు (న మాం కర్మాణి లింపంతి). వారికి కర్మఫలముల యందు తృష్ణలేదు (నమే కర్మ ఫలేస్పృహా). మోక్షమనగా నిదియే. వాస్తవంలో, మరియొక మోక్షమేదియూ లేదు.

జ్ఞానమును కలిగియుండుట కర్మకు బాధకము గాదు

ఇతః పూర్వములో ముముక్షువులు జ్ఞానమును పొంది యేమి చేసిరి? వారు కర్మల నాచరించిరి (పూర్వైః కర్మ కృతమ్). కావున, అర్జునుడు కూడ అటులనే చేయాలని (తస్మాత్ కురు కర్మైవ త్వమ్), అనగా అర్జునుడు సన్న్యసించరాదని శ్రీకృష్ణుడు అర్జునునకు చెప్పెను. అతడు తన కర్తవ్యము నాచరించి తీరాలి. అర్జునుడు ఊరక కూర్చుండ రాదనియు (న తూష్ణీం ఆసనమ్), సన్న్యాస స్వీకారము కూడ అతనికి తగదనియు (నాపి సన్న్యాసః కర్తవ్యః) శ్రీ శంకరులు ఈ శ్లోకభాష్యములో స్పష్టము జేసిరి. అతడు తనకు కర్తవ్యమగు విధిని అనుష్ఠించాలి. పూర్వమందలి సాధకులటులనే చేసిరి. జ్ఞానులు కూడ అటులనే చేసిరి.

పూర్వ కాలమందు ముముక్షువులు కర్మల నాచరించి భగవానుని పొందిరి. కావున, అర్జునుడు కూడా ముముక్షువు అయినచో, కర్మల నాచరించాలి అని శ్రీకృష్ణుడాతనితో చెప్పుచుండెను. పూర్వకాలములో సాధకులు యేమి చేసిరో (పూర్వైః పూర్వతరం కృతమ్), అర్జునుడు కూడ అటులనే చేయవలెను. ప్రాకృత జనులు సాధారణంగా చేయునట్లు అతడు చేయరాదు.

ఈ ప్రకరణములో ముముక్షు పదప్రయోగము సుసంగతము. మోక్షమును కోరువాడు ముముక్షువు. అజ్ఞానులై యుండి మోక్షమును గోరువారు మోక్షము నొసంగు జ్ఞానమును పొందాలి. ఇతరులు కూడ జ్ఞానమును ఈ తీరుననే పొందిరి. కావున నీవు కూడ శ్రద్ధతో కర్మల నాచరింపుము. ఈ జ్ఞానమును పొంది, మోక్షమును పొందగలవు అని శ్రీకృష్ణుడు చెప్పెను. ఇంకనూ జ్ఞాని కాని ముముక్షువునకు తన జ్ఞానమును గురించి స్పష్టమైన అవగాహన ఉండదు.

అట్టి వ్యక్తి తన మనస్సులోని రాగద్వేషములనన్నిటినీ తొలగించి, శుద్ధి చేయుటకై కర్మల నాచరింపవలెనని శ్రీ శంకరులు వివరించిరి.

ఆత్మ జ్ఞానము గల వ్యక్తి కూడా అంతఃకరణ శుద్ధి కొరకు కాకపోయినా, ఇతరుల కొరకు (లోక సంగ్రహార్థమ్) కర్మల నాచరించాలి. జ్ఞానికి ప్రారబ్ధము వలన కొన్ని కర్తవ్యములు సంప్రాప్త మగుచుండును. ఇపగా, ప్రజాక్షేమము కొరకు అవసరమగు కొన్ని కర్మలను జ్ఞాని కూడా ఆచరించాలి. ఇట్టి కర్మలు జ్ఞానిని ఎట్టి విధముగనూ ప్రభావితము చేయవు (న మాం కర్మాణి లింపంతి న మే కర్మ ఫలే స్పృహా). ఏలయన, జ్ఞాని ఆత్మయందు కర్తృత్వము నారోపించుకొనడు.

ఇచట 'ముముక్షువు' అనగా సాధకుడు కావచ్చును; లేదా, జీవన్ముక్తుడైననూ కావచ్చును. ఈ రెండు పక్షముల యందు కర్మల నాచరించాలి అని శ్రీకృష్ణుడు చెప్పెను. అర్జునుడు తాను జ్ఞానియో, అజ్ఞానియో అను విషయమును తానే నిర్ణయించుకొని, రెండు పక్షముల యందు కర్మల నాచరించాలి. అతడు జ్ఞాని యైనా, అజ్ఞానియైనా, కర్తవ్యమగు విధిని ఆచరించుట వలన కలిగే నష్టమేమీ ఉండబోదు.

నిష్క్రియత వలన మోక్షము ఎన్నటికీ సిద్ధించదు

కర్మలను చేయకపోవుట వలన మోక్షము సిద్ధించుననే దురభిప్రాయమును అర్జునుడు పొందరాదని శ్రీకృష్ణుని ఆశయము. కాని, అదే సమయంలో, కర్మలను చేసినంత మాత్రాన మోక్షము లభించబోదని కూడా స్పష్టంగా తెలుసుకోవాలి. కర్మల వలన అంతఃకరణ శుద్ధి మాత్రమే లభించునని మనము ఇంతకు ముందే చూచియున్నాము. కర్మాచరణము మోక్షమునకు సాక్షాత్సాధనము కాదు. కర్మలు మనస్సును జ్ఞానోదయమునకు యోగ్యముగా సజ్జితము చేసి, మోక్షములో పరంపరయా సాధనములగును. ఇచటి తాత్పర్యమేమన, కర్మలను వీడుట వలన ప్రయోజనమేమియూ ఉండదు!

కర్మాభావము నుండి ఫలమేదీ పుట్టదు. కావున, కర్మాభావము ఏ విధంగా చూచినా హితకారి కాజాలదు. తద్భిన్నముగా, ఒక కర్మను చేస్తే (కృతం కర్మ), ఏదో ఒక ఫలం లభిస్తుంది. అది సామాన్యంగా లభించే కర్మఫలం కావచ్చు; లేక, అంతఃకరణశుద్ధి కావచ్చు; లేదా, ఈ రెండు కావచ్చు. కర్మా భావస్థితి (నైష్కర్మ్యము) యే మోక్షము. కాని, అది కర్మలను

విడుట వలన లభించదు. కర్మల నాచరించకపోవుట వలన నైష్కర్మ్యము సిద్ధించదు. ఏలయన, మానవుడు సర్వకాలముల యందు ఏదో ఒక పనిని చేస్తూనే ఉంటాడు. అకర్తృత్వము ఆత్మయొక్క స్వరూపమని గుర్తించాలి. కావుననే, శ్రీకృష్ణుడు అర్జునునితో "నేను చేయుచున్నట్లు నీకు కనబడే ఈ కర్మలు ఏవియూ నన్ను ఏ విధముగనూ ప్రభావితము చేయజాలవు" అని చెప్పెను.

కర్మల చేతగాని, వాటి ఫలముల చేత గాని ఏ మాత్రమూ ప్రభావితుడు కానందున, శ్రీకృష్ణ భగవానునకు పక్షపాత బుద్ధి ఉండు ప్రశ్నయే ఉదయించదు. శ్రీకృష్ణునకు కర్మ ఫలముల యందు ఆసక్తి(ఫలస్పృహ) ఉన్నదనుకొనుడు. అపుడాయన వివిధ వ్యక్తుల నుండి వివిధ ఫలముల నాశించి, ఒకరి విషయంలో ఒక విధముగను మరియొకరి విషయములో ఇంకొక విధముగను ప్రవర్తించి యుండును. తనకు ఏమాత్రమూ ప్రయోజనకారులు కాని వ్యక్తులకు ఆయన ఎట్టి ఉపకారమునైననూ చేసి యుండడు. " ఓ భగవాన్, నీ మహిమ అనంతము, అద్భుతము; సర్వము నీవే " అని ప్రతి దినము పొగిడే వారికి మాత్రమే ఆయన ఉపకారమును చేసియుండును. కొందరు వ్యక్తుల నుద్దేశించి, " వారు నన్ను లెక్కచేయరు గాన, నేను వారిని గురించి పట్టించుకోన్న" అని ఆయన చెప్పి యుండెడి వాడు. అంటే, భగవానునకు కూడ ఇతరుల ప్రేమ, ఆదరము కావలసియుండును. ఎవరో ఒకరి ప్రేమ కాదు. అందరి ప్రేమ, ఆదరములు ఆయనకు కావలసియుండును!

భగవానునకు కర్మ ఫలముల యందు తృష్ణ లేదు (న మే కర్మ ఫలే స్పృహా) గావున, ఆయనకు ఇట్టి సమస్యలు ఏమియూ లేవు. ఆయనను ప్రేమించే వ్యక్తుల నుండి ఆయన పొందేది ఏదీ లేదు. ఆయనకు వీటన్నిటియందు సంగము లేశమైననూ లేదు. ఈశ్వరుని తెలుసుకున్నచో, నీవు కూడ అట్లే అగుదువు. " నన్ను స్పష్టముగా యెరింగిన వాడు (యః మాం అభిజానాతి) కూడా ఈ కర్మ బంధముల నుండి పూర్తిగా విముక్తుడగును ".

ప్రాచీన కాలమునుండియూ ఎందరో వ్యక్తులు కర్మల నాచరించి, నన్ను పొందినారని శ్రీకృష్ణుడు చెప్పెను. అనగా, అర్జునుడు కూడ అదే తీరున కర్మల నాచరించాలని ఆయన ఆశయము. కర్మలను విడుట వలన నైష్కర్మ్యరూపమగు మోక్షము సిద్ధించుననే తప్పుడు ధారణ అర్జునునకు కలుగరాదని శ్రీకృష్ణుని ఆకాంక్ష. ఈ నైష్కర్మ్యము అను అంశముపై అనేకములగు తప్పు భావనలకు చాల అవకాశము గలదు. కావుననే, శ్రీకృష్ణుడిచట కర్మ, అకర్మలను వివరించే క్రొత్త ప్రకరణము నారంభించుచున్నాడు:

అధ్యాయము 4, శ్లోకము 16

किं कर्म किमकर्मेति कवयो ऽप्यत्र मोहिताः ।
तत्ते कर्म प्रवक्ष्यामि यज्ज्ञात्वा मोक्ष्यसे ऽशुभात् ॥ १६ ॥

కిం కర్మ కి మకర్మేతి కవయోప్యత్ర మోహితాః
తత్తే కర్మ ప్రవక్ష్యామి యత్ జ్ఞాత్వా మోక్షసే శుభాత్ (16)

కర్మ = కర్మయనగా; **కిం** = ఏమి?; **అకర్మ** = అకర్మయనగా; **కిం** = ఏమి; **ఇతి** = అనే; **అత్ర** = ఈ విషయములో; **కవయః అపి** = విద్వాంసులు కూడ; **మోహితాః** = భ్రాంతులగుచున్నారు; **యత్** = దేనిని; **జ్ఞాత్వా** = యెరింగి; **అ శుభాత్** = అ మంగళమగు సంసారము నుండి; **మోక్ష్యసే** = విముక్తిని పొందగలవో; **తత్** = అట్టి; **కర్మ** = కర్మను; **తే** = నీ కొరకు; **ప్రవక్ష్యామి** = వివరించగలను.

> కర్మ అనగా నేమి? అకర్మ అనగా నేమి? అను విషయములో విద్వాంసులు కూడ భ్రాంతులగుచున్నారు. నీవు కర్మను యెరింగి అమంగళమగు యీ సంసారము నుండి విముక్తిని పొందగలవు. అట్టి కర్మను నేను నీ కొరకు వివరించెదను. (16)

మన మిచట కర్మను గూర్చి చర్చిస్తున్నాము. 'కవయః' అను పదము 'కవి' శబ్దము యొక్క బహువచన రూపము. కవి శబ్దమునకు రచయిత, ద్రష్ట లేదా భగవానుడు అను యర్థములు గలవు. గొప్ప బుద్ధి శక్తి, విజ్ఞానము గల మేధావి కూడా కవి యనబడును. తన స్మృతిలో చాల సమాచారమును పదిలపరచి, కంప్యూటర్ వలె కోరిన వెంటనే దానిని వెళ్ల గ్రక్కువాడు మేధావి కాడు. ఒక శాస్త్రమును క్షుణ్ణముగా తెలుసుకొని, స్మృతిపథములో దానిని పూర్తి వివరములతో భద్రపరచుకొనగల వ్యక్తి మేధావి యనబడును.

మరి కొందరు విషయమును చక్కగా తెలుసుకొనగల్గుతారు. కాని, వారు వివరమును గుర్తులో ఉంచుకొనజాలరు. ఇట్టివారు కూడ కృతార్థులే. ఈ శ్లోకములో 'కవయః' అను పదము విషయ వస్తువును అర్థము చేసుకొని, వివరముల నన్నిటినీ కూడ గుర్తులో ఉంచుకొనగల వ్యక్తులను నిర్దేశించును. ఇట్టి వ్యక్తులు కూడ కర్మ, అకర్మల విషయములో భ్రాంతులగుదురు (మోహితాః).

కర్మ యనగా నేమి (కిం కర్మ)? కర్మాభావమనగా నేమి (కిం అకర్మ)? ఈ విషయవును గురించి విద్వాంసులకు స్పష్టమైన అవగాహన లేదు. అనగా, మనం చేసే పని మాత్రమే కాజాలదు. కర్మాభావమే అకర్మ కాదు. ఈ విషయవస్తువు ఇంతటి సరళమైనది కాదు. కనుకనే, శ్రీకృష్ణుడు అర్జునునితో " కర్మ యనగా నేమో నేను నీకు బోధించెదను (తే కర్మ ప్రవక్ష్యామి)" అని చెప్పెను. ఇచట కర్మయనగా కర్మ, అకర్మలను రెంటినీ గ్రహింపవలెను.

శ్రీశంకరులు ఈ శ్లోక భాష్యములో 'కర్మ' పదము కర్మ, అకర్మలను రెంటినీ (కర్మ అకర్మ చ) నిర్దేశించునని వ్యాఖ్యానించినారు. కర్మ తెలియాలంటే అకర్మ కూడా తెలియాలి. తెలుసుకున్నచో, అశుభము నుండి, అనగా సంసారము నుండి నీవు విముక్తిని పొందెదవు (యత్ జ్ఞాత్వా మోక్ష్యసే). 'శుభం' అనే సుందరమగు పదము సర్వము సుఖాంతము అని సూచిస్తుంది. తరుచుగా ఈ పదమును గ్రంథముల అంతములో మనము చూస్తూ ఉంటాము. 'సమాప్తము' అనే పదం కూడా గ్రంథముల అంతములో కనబడుతుంది. 'సమాప్తము' అనగా పూర్తి అయినదని అర్థము. కాగా 'శుభం' అనగా చక్కగా పూర్తి అయినదని అర్థము.

పవిత్రమైనది, మంచిది సర్వమూ శుభమే. అపవిత్రము, చెడ్డది అశుభములనబడును. శ్లోకంలో అశుభమనగా సంసారమని గ్రహించవచ్చును. శ్రీ శంకరులు అటులనే వ్రాసిరి. సంసారము అశుభము. అది మోక్షములో అంతమగును. కావున, మోక్షము మాత్రమే శుభము. సంసారము అంతమై మోక్షము లభించునంతవరకు, సర్వము అశుభమే. సంసారము యొక్క దివ్య భవ్య సమాపనమే మోక్షము. అదియే శుభము. నీవీ అశుభ సంసారము నుండి విముక్తుడవగుదువు. ఈ శ్లోకములోని అశుభ శబ్దమునకు ఇది యొక వ్యాఖ్యానము.

ఈ 'అశుభ' పదమును మరియొక విధముగా వ్యాఖ్యానించవచ్చును. నీ మెదడులో ఏవో కొన్ని శంకలు ఉన్నచో, అవి నిన్ను సతాయిస్తూ, సమస్యలను సృష్టిస్తూ ఉంటాయి. అవి చెవి చుట్టూ గింగురు మంటూ తిరుగుతూ క్షోభను కలిగించే తుమ్మెదల వంటివి. కావున, ఇట్టి శంకలకు అశుభమని పేరు. అవి అంతం కావాలి. సర్వము స్పష్టముగా తెలిసిన నాడు మాత్రమే అది సంభవమగును. కావున ఇచట కర్మ, అకర్మల స్వరూపమును తెలుసుకోవాలి.

సర్వ జ్ఞానము ఆత్మయందు పరిసమాప్తమగును

కర్మను తెలియుట అనగా ఆత్మానాత్మలను తెలియుటయే. మనమీ విషయమును

ముందు చూడబోతాము. వాస్తవంలో, విషయవస్తువు ఏదైనా, దాని సమగ్ర జ్ఞానము ఆత్మ యందు మాత్రమే సమాప్తమగును. శాంతి, సుఖము, దుఃఖము, నామము, రూపము, మనస్సు, దాని స్వరూపము ఇత్యాదిగా గల ఏ ఒక్క విషయమునైనా స్వీకరించి, విశ్లేషిస్తే అది ఆత్మలో పరిసమాప్తమగును. దానికి సమాధానము ఆత్మ యందు లభించును. కాన, మనము ఎప్పుటనైనను ఆరంభించవచ్చును. సర్వము పరస్పర సంబద్ధము. ఇట్లు సంబద్ధము కానిది ఏదీ లేదు.

కర్మ విషయంలో నీకు గల సందేహాలు తొలగిపోతే, నీకు సంసారము నుండి విముక్తి కలుగును. నీవు సర్వ సందేహముల నుండి వినిర్ముక్తుడవగుదువు. ఈ వినిర్ముక్తియే మోక్షలాభము. అజ్ఞానరువమగు హృదయ గ్రంథి విడిపోగానే, శంకలన్నీ మటుమాయమవుతాయి. బ్రహ్మము (పరమాత్మ, లేక ఈశ్వరుడు) జీవాభిన్నము అనే సాక్షాత్కారము కలుగగానే, అట్టి వ్యక్తియొక్క సంచిత (పూర్వజన్మల యందు, ఈ జన్మలో సంపాదింపబడిన) కర్మలన్నీ వినాశమును పొందును. ఇదంతా ' ఒక్క దెబ్బ'లో జరిగిపోవును! ' ఒక్క దెబ్బ' అనుటలో క్రియ ఇమిడి యున్నదని తలపోయరాదు. ఇదంతా జ్ఞానము వలన మాత్రమే సంభవమగును. అది జ్ఞానము యొక్క అఘాతము.

తరువాతి శ్లోకములో ఈ కర్మ, అకర్మలను తెలియవలసిన అవశ్యకతను శ్రీకృష్ణ భగవానుడు ఇంకనూ వివరించెను:

అధ్యాయము 4, శ్లోకము 17:

कर्मणो ह्यपि बोध्दव्यं बोध्दव्यं च विकर्मणः ।
अकर्मणश्च बोध्दव्यं गहना कर्मणो गतिः ॥ १७ ॥

కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః
అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః (17)

కర్మణః = కర్మను గురించి; **బోద్ధవ్యం అపి** = తప్పక తెలియవలెను; **చ** = మరియు; **వికర్మణః** = నిషిద్ధకర్మను గురించి; **బోద్ధవ్యం** = తెలియవలెను; **చ** = మరియు; **అకర్మణః** = అకర్మను గూర్చి; **బోద్ధవ్యం** = తెలియవలెను; **హి** = ఏలయనగా; **కర్మణః** = కర్మయొక్క; **గతిః** = స్వరూపము; **గహనా** = కష్టమైనది.

(వేద విహిత) కర్మల గురించి తెలియవలెను. మరియు, నిషిద్ధ కర్మలు, అకర్మ గురించి కూడ తప్పక తెలియవలెను. ఏలయనగా, కర్మ యొక్క స్వరూపము తెలియుటకు కష్టమైనది. (17)

ఈ శ్లోకములో శ్రీకృష్ణుడు ముందుగా కర్మను రెండు రకములుగా విభజించెను: వలసిన పని (కర్మ), చేయకూడని పని (వికర్మ). చేయవలసిన పని తప్పక తెలిసి ఉండాలి. కూడని పని కూడా తెలిసి ఉండాలి. కర్మాభావ స్థితియే అకర్మ అని నీవు భావిస్తే, నీకు కూడా తెలియవలసి యున్నది. కర్మ చేయకపోవుట అను దాని అర్థము నీకు తెలియాలి. అంటే కర్మలను విడనాడుటయా? లేక, కర్తృత్వాభావము అకర్మ అయినచో, అపుడు విశిష్ట కర్మను విడనాడుట అకర్మ కాజాలదు. ఈ విషయమును శ్రీకృష్ణుడు మరల తర్వాత రిస్తాడు.

ఈ విశ్లేషణ యొక్క ప్రయోజనమేమి? ప్రయోజనము కలదు. మనము కర్మను ాదరణ భావముతో చూడరాదు. కర్మను అర్థము చేసుకొనుట తేలిక కాదు. కొందరు నాతో స్వామీజీ, కర్మను గురించి చాలా తెలుసుకున్నాము; మాకు జ్ఞానం కావాలి" అంటూ టారు. వీరికి కర్మను గురించి తెలిసి ఉంటే, జ్ఞానము కూడా లభించి ఉండేది. కర్మను రించి తెలియాలి. అది క్లిష్టమైన విషయము (గహనా కర్మణో గతిః). తెలియవలసినది లమైన విధి నిషేధాలు కావు. కర్మయొక్క స్వరూపమును తెలుసుకోవాలి.

'గహనము' అనగా కర్మ, అకర్మ అనే విషయవస్తువు అనేక భ్రాంతులచే ఆవృతమై న్నదని అర్థము. ఈ విషయవస్తువు మనకు స్పష్టముగా భాసించుట లేదు. కావున, దానిని ఆవరించియున్న అజ్ఞానమనే పొగమంచును తొలగించాలి. అంటే, జ్ఞానదీపమును వెలిగించాలి. కర్మ మనము అనుకునేటంత తేలికయైనది కాదు. కర్మ యొక్క స్వరూపం తెలిస్తే, పరమార్థ తత్త్వమగు బ్రహ్మము తెలిసినట్లే. ఇవన్నీ పరస్పర సంబద్ధములైన తత్త్వములు. కర్మను గురించి తెలుసుకోవాలి అంటే కర్మతో సంబద్ధమైన సర్వమును గురించి కూడా తెలుసుకోవాలని చెప్పినట్లే.

ఈ విధంగా శ్రీకృష్ణుడు ఈ శ్లోకంలోను, పూర్వ శ్లోకంలోను కర్మ, అకర్మలనే విషయవస్తువును పరిచయం చేసినాడు. కర్మ యనగా నేమి? అకర్మ యనగా నేమి? అను

ప్రశ్నలకు సమాధానము తరువాతి శ్లోకములో ఈయబడినది. ఇంతే గాక, తరువాతి శ్లోకములో కర్మను, అకర్మను స్పష్టముగా నెరింగిన వ్యక్తిని స్తుతించే పదములు కూడ కొన్ని కలవు.

అధ్యాయము 4, శ్లోకము 18:

कर्मण्यकर्म यः पश्येदकर्मणि च कर्म यः ।
स बुध्दिमान् मनुष्येषु स युक्तः कृत्स्नकर्मकृत् ॥ १८ ॥

కర్మణ్యకర్మ యః పశ్యేద కర్మణి చ కర్మ యః
స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్న కర్మకృత్ (18)

యః = ఎవడైతే; **కర్మణి** = కర్మయందు; **అకర్మ** = అకర్మను; **పశ్యేత్** = చూచునో; **చ** = మరియు; **యః** = ఎవడైతే; **అకర్మణి** = అకర్మ యందు; **కర్మ** = కర్మను; **పశ్యేత్** = చూచునో; **సః** = వాడు; **మనుష్యేషు** = మనుష్యులలో; **బుద్ధిమాన్** = బుద్ధిమంతుడు; **సః** = వాడు; **యుక్తః** = యోగి; **కృత్స్న–కర్మ–కృత్** = చేయదగిన పనులనన్నిటినీ చేసినవాడు.

> ఎవడైతే కర్మయందు అకర్మను, అకర్మయందు కర్మను దర్శించునో,
> అట్టివ్యక్తి మనుష్యులలో బుద్ధిమంతుడు. అతడే యోగి. అతడే చేయదగిన
> పనులనన్నిటినీ చేసినవాడు. (18)

శ్రీ శంకరులు విస్తృతమగు ఈ శ్లోకభాష్యములో ఈ ప్రధాన విషయవస్తువునకు సంబంధించిన వివిధ వాదములను ప్రస్తావించిరి. కర్మ, అకర్మలను గురించి స్పష్టమగు అవగాహన కలుగుట కొరకై మనమీ భాష్యమును కొంత వివరంగా పరిశీలిద్దాము.

చదువుకున్నవారు కూడా కర్మ, అకర్మల విషయంలో భ్రాంతులవుతారు. ఈ శ్లోకంలో కర్మ శబ్దానికి సాధారణమైన వ్యాపారము అని అర్థము. గీతలోని ఇతర స్థలములలో కర్మ శబ్దానికి వేదోక్త కర్మలని యర్థము. కాని, ఇచట అట్లు గాదు. కర్మ యొక్క స్వరూపం విషయంలో పండితులు కూడా భ్రాంతికి లోనవుతారు. కావున దానిని, దానితో బాటు అకర్మను వివరిస్తానని

శ్రీకృష్ణుడు అర్జుననితో చెప్పెను. ఈ జ్ఞానమును పొందిన వ్యక్తి సందేహ విముక్తుడై, సంసార విముక్తుడగును.

చేయదగిన పని, చేయకూడని పని – ఈ రెండూ కర్మలే. ఉదాహరణకు, ఇతరులకు సహాయము చేయుట, సంహరించుట అనునవి రెండు వేర్వేరు కర్మలు. సంహరించుట చేయకూడని పని (నిషిద్ధకర్మ). ఇతరులకు సహాయపడుట చేయవలసిన పని (విహిత కర్మ).

విధి సర్వదా క్రియకు సంబద్ధమై యుండును. ఒక పనిని చేయాలి; లేదా, చేయరాదు. మానవులు పరస్పరము హింసించుకునే అవకాశము గలదు. కావున, శ్రుతి ఇతరులను హింసించరాదని నిషేధించుచున్నది. 'మద్యమును త్రాగరాదు', 'మాంసమును భుజించరాదు' అనునవి కూడ ఇట్టి నిషేధములే. ఇదే విధముగా, మనము చేయవలసిన పనులను ఉపదేశించే విధులు ఎన్నో గలవు. మానవులు పాటించవదగిన విధి నిషేధములు చాల గలవు. ఇవి అన్నియూ కర్మలే.

కర్మాపేక్షయా అకర్మను కూడ తెలుసుకోవాలి. అకర్మయనగా కేవల కర్మాభావమేనా? మరేదైన గలదా? ఇచట మనము కర్మ యొక్క యథార్థస్వరూపమును తెలుసుకునే ప్రయత్నమును చేయుచున్నాము. కర్మను గురించి సరిగ్గా తెలిస్తే, అకర్మ, లేక కర్మా భావమును గురించి కూడ సరిగ్గా తెలుస్తుంది.

'ఏపనినీ చేయకపోవుటయే అకర్మ' అని మనం సాధారణంగా తలపోస్తాము. మనం ఒక పనిని చేయుట మానివేసి, ఈ మానివేయుటయే అకర్మ అనుకుంటాము. ఒక మనిషి నడుస్తున్నాడు. నడవటం మానివేసేడు. స్థిరంగా ఉన్నాడు. కర్మ లేదు. ఇది మన భావన. కాని, స్థిరంగా నిలబడుట కూడా కర్మయే. నీవు స్థిరంగా నిలబడి చూడు. అది ఎంత కష్టమైన పనియో తెలుస్తుంది! అదే విధంగా, స్థిరంగా కూర్చుండుట కూడా ఒక కర్మయే. మనము చాలసేపు స్థిరంగా కూర్చుండజాలము. స్థిరంగా కూర్చుంటే, నైష్కర్మ్యం సిద్ధిస్తుంది అనుకోవటం భ్రాంతి. ఇట్టి నైష్కర్మ్యము యథార్థము కాదు.

రూపాయి నోట్లను అధికంగా ముద్రిస్తే, దేశం యొక్క క్లిష్ట ఆర్థిక పరిస్థితి మెరుగువడుతుంది అని అనుకోవటం ఎట్టిదియో, ఏ పనినీ చేయకపోవుటయే అకర్మ అనుకోవటం అట్టిది. ఈ సమస్య అంత సరళంగా పరిష్కారమయ్యేది కాదు. అది అంత తేలిక

కాదు. పైగా, ఇట్టి తప్పు ధారణ వలన క్రొత్త సమస్యలు కొన్ని బయలుదేరును. అదే విధంగా, అకర్మను తెలుసుకొనుట కనబడేటంత తేలిక కాదు. శ్రీకృష్ణుడు ఈ శ్లోకములో చెప్పిన విషయము ద్వితీయ, తృతీయ, చతుర్థ అధ్యాయములలో ఇతఃపూర్వము చెప్పిన విషయమునకు అనుగతముగా నున్నది. ఈ శ్లోకము గూఢార్థ యుక్తముగా నున్నది. అయిననూ, ఇంతకు ముందు చేయబడిన ఉపదేశమును దృష్టిలో నిడుకొని పరిశీలిస్తే, ఈ శ్లోకం అర్థమవుతుంది.

జ్ఞానిని గురించిన వేరొక వర్ణన

శ్రీకృష్ణుడీ శ్లోకంలో కర్మయందు అకర్మను, అకర్మ యందు కర్మను దర్శించే వ్యక్తిని వర్ణించెను. ఇతడెట్టి వ్యక్తి? ఇతడు నడిచే వ్యక్తిని స్థిరముగా నిలబడియున్న వానినిగా దర్శిస్తాడా యేమి? స్థిరముగా నున్న వానిని నడుచుచున్నవానినిగా దర్శించునాయేమి? ఒకాయన భోజనం చేస్తూ, తాను ఏమీ తినుట లేదని అన్నాడట. ఇది అట్లున్నది. మనమ్ము సాధారణంగా ఇట్టి వ్యక్తిని పిచ్చివాడని అనుకుంటాము. కాని, యీ శ్లోకములో శ్రీకృష్ణుడు కర్మయందు అకర్మను, అకర్మయందు కర్మను దర్శించు వ్యక్తిని బుద్ధిమంతుడని వర్ణించెను!.

పైగా, ఇట్టి వ్యక్తి చేయదగిన కర్తవ్యముల నన్నిటినీ చేసినవాడు (కృత్స్న కర్మ కృత్) అని వర్ణించి, శ్రీకృష్ణుడు మనలను మరింత అయోమయంలో పడవేసినాడు! అంటే, అట్టి వ్యక్తి చేయవలసినదేమీ మిగులలేదని యర్థము. అతడు ముక్తుడు. కాని, మిగిలినవారికి విధినిషేధముల పెద్ద జాబితా గలదు.

విధి నిషేధములను పూర్తిగా నెరవేర్చుట చాల కష్టము. కావున, ఈ జాబితా, ఉన్నంత వరకు అనంతంగా ఉంటుంది. నీవు చేయవలసిన పనిని అన్ని వేళలా నిర్వర్తించుట సంభవము కాదు. మరియు, ఎల్లవేళలా నిషిద్ధ కర్మలను పరిహరించుట, నిషిద్ధ వచనములను ఎల్లవేళలా పలుకకుండుట సంభవము కాదు. పైగా, మనం తినే ఆహారం విషయంలో కూడా పాటించవలసిన నియమాలు, పరిహరింపదగిన నిషేధాలు ఎన్నో ఉన్నాయి. ఈ విధంగా, ప్రతివ్యక్తికీ పెద్ద జాబితా ఉంటుంది. వాటిలో కొన్నింటిని నిర్వర్తిస్తే, వాటి స్థానంలో మరికొన్ని విధి నిషేధాలు వచ్చి చేరతాయి. ఈ జాబితాలోని కొన్ని అంశాలు స్పష్టంగా ఉన్నా, మరి కొన్ని అంశాలు అస్పష్టంగా ఉండవచ్చును. అవి పోలరాయిడ్ ఫోటో వలె కాలం గడిచే కొలదీ స్పష్టతరము అవుతాయి. ప్రతి వ్యక్తి విషయంలో పరిస్థితి ఇంతే.

కర్మ యందు అకర్మను, అకర్మ యందు కర్మను చూడగల వ్యక్తి ఈ జాబితాలోని ములనన్నిటిని నిర్వర్తించ గల్గినవాడని శ్రీకృష్ణుడీ శ్లోకములో వర్ణించెను. అట్టి వ్యక్తిని బుద్ధిమంతుడని (బుద్ధిమాన్) ప్రశంసించెను! దర్శనమాత్రము చేత జ్ఞాని అయ్యే లో, ఆ దర్శనము కఠినమైనది అయి ఉండాలి. పదాలను చూస్తే చాలు; విషయవస్తువు ైనదని తెలిసిపోతుంది. నేను కర్మలో అకర్మను, అకర్మలో కర్మను యెట్లు దర్శించవలెను?

యందు అకర్మ

'కర్మ యందు అకర్మ', 'అకర్మ యందు కర్మ' అను ప్రయోగములలో కనబడే 'అందు' సప్తమీ విభక్తి ప్రత్యయానికి అర్థం 'ఆధారము' కాదు. 'అతడు ఎక్కడ కూర్చున్నాడు?' ప్రశ్నకు మనం 'కుర్చీయందు కూర్చున్నాడు' అని సమాధానం చెప్తాము. ఈ ప్రయోగములో దు' ప్రత్యయము కూర్చుండుట అనే క్రియకు ఆధారమైన స్థానమును బోధించును. ము నా చేతియందు గలదు' అను వాక్యములో కూడ అంతే. కాని, ఈ శ్లోకములోని గములలో సప్తమీ విభక్తికి ఆధారము అర్థము కాజాలదని శ్రీ శంకరులు త్రోసిపుచ్చిరి. అకర్మకు ఆధారము కాజాలదు. కర్మాభావరూపమైన అకర్మ కర్మకు ఆధారము జాలదు.

'అకర్మ (కర్మాభావము)'నకు ఉనికి లేదు. అభావరూపమైన అకర్మ కర్మపై ర్చుండునని మనము చెప్పజాలము. 'నా తలపై కొమ్ములున్నవి' అని మనము చెప్పలేము దా! మనుష్య శృంగమునకు ఉనికి లేదు. కావున, ఉనికి లేని మనిషి కొమ్ములకు ఆధారము డజాలదు. అటులనే, గొడ్రాలు కుమారుడు నేలపై పరుండినాడు అని చెప్పలేము. ంధ్యాపుత్రునకు ఉనికి లేదు.

అదే విధముగా, అకర్మ కర్మా భావరూపము గనుక, దానికి ఉనికి గాని, అది ఉండే స్థానము గాని ఉండవు. కావున, అకర్మకు కర్మ ఆధారము కాజాలదు. మరియు, ఉనికియే లేని అకర్మ కర్మకు ఆధారము కాజాలదు. కావున, ఇచట సప్తమీ విభక్తికి సామాన్యార్థమగు ఆధారమును అర్థముగా తీసుకొనరాదు. ఇచట సప్తమికి 'విషయములో' లేదా 'దానికి సంబంధించి' అని యర్థము. జ్ఞాని కర్మ సందర్భములో అకర్మను, అకర్మ సందర్భములో కర్మను చూడగల్గును.

కర్మ లేని చోట (కర్మ- అభావము) జ్ఞాని కర్మను దర్శించును. కర్మయని భావింపబ దానిలో, జ్ఞానికి కర్మ ఏమియూ భాసించదు. మనం కర్మను చేయునప్పుడు, 'నేను కర్మను చేయుచున్నాను (అహం కరోమి)' అను ధారణను కల్గి ఉంటాము. 'నేను కర్మను చేయుచున్నాను' అనుటలోని 'నేను' యేది? నేను చేయు కర్మ యేది? 'నేను మాటలాడుచున్నాను', 'నేను నడచుచున్నాను' అని చెప్పే సందర్భములలో ఈ మాటలాడుట, నడుచుట అను క్రియలు యందు కేంద్రితమై యున్నవి? ఇది ప్రముఖమైన ప్రశ్న.

'నేను నడుచుచున్నాను' అని నీవు చెప్పే సందర్భంలో, నీ కాళ్లు, పాదములు ఆ కర్మను ఆచరించుచున్నవి. నడుచుట అనే కర్మకు మూలములో సంకల్పము గలదు. కావున, ఈ కర్మలో మనస్సునకు కూడ పాత్ర గలదు. మనము సంకల్పము లేకుండా, బుద్ధి పూర్వకమగు కర్మల నాచరించము. సర్వ కర్మల యందు సంకల్పము ఇమిడి యుండును. కావున, నడుచుట అనే కర్మలో మనస్సు, పాదములు ఇంతే గాక కన్నులు కూడా పాల్గొనుచున్నవి. మరియు, "నేను ఒక కర్మను చేయుచున్నాను (అహం కరోమి)" అని చెప్పే సందర్భములో 'అహం' కూడా ఇమిడి యున్నది.

ఈ క్రియలో మనస్సు, ఇంద్రియములు, మరియు స్థూలదేహము అన్నీ పాల్గొంటాయి. సంస్కృతములో స్థూల దేహమునకు 'కార్యము' అనియు, మనస్సునకు, ఇంద్రియములకు 'కరణము (సాధనము)' అనియు పేరు. ఈ కార్యకరణ సంఘాతము క్రియలలో పాల్గొనును. అది నాకు చెందినది. అందువలననే "నేను ఈ క్రియను ఆచరించుచున్నాను" అని నేను చెప్తాను. ఈ 'నేను' కూడా క్రియలో ఇమిడి యున్నది. 'నేను' అనగా ఆత్మ.

కర్మ ఫలములు కర్తకు చెందును

నేను కర్మలనేల చేయుదును? నేను ఒక ఫలము కొరకు ఒక కర్మను చేస్తాను. ఫలము లభించినపుడు, అది ఎవరికి చెందును? అది ఎవరిని ప్రభావితము చేయును? అది కర్తనగు నాకు చెందును. కావున, కర్తనగు నేనే భోక్తను. నాకు ఇష్టమైన ఫలమును పొందుట కొరకై, నేనీ కర్మను చేసెదను (కర్మ ఫల భోగాయ అహం ఇదం కరోమి). ఈ తీరున, కర్మలో కార్యకరణ సంఘాతము మాత్రమే గాక, 'నేను (ఆత్మ)' కూడా ఇమిడియుండును.

'నేను కర్తను; నేను భోక్తను' అని నేను అన్నప్పుడు, ఈ కర్తృత్వ భోక్తృత్వములు ఎచట

కేంద్రితమై యున్నవి? నా యందు ఇపుడు ఒక ప్రశ్న ఉదయించును. నేను (ఆత్మ) కర్తనా, అకర్తనా? ఆత్మ కర్తయైనచో, ఫలము నొసగే కర్మను ఆచరించేది నిశ్చయముగా నేనే యగుదును. అట్టి కర్మ సత్యము, బంధకము అగును.

కర్మను ఆచరించే కర్త లేనిదే కర్మ లేదు. ఉదాహరణకు, "రాముడు వెళ్లుచున్నాడు రామః గచ్ఛతి)" అని మనం అంటాము. అనగా వెళ్లుట అనే కర్మను ఆచరించే వాడు రాముడు. కర్మ కర్తపై ఆధారపడును. కాని, కర్త కర్మపై ఆధారపడడు. అనగా, కర్మ విషయంలో కర్తకు ఎన్నుకునే హక్కు గలదు. అతడు కర్మను చేయవచ్చును; చేయకపోవచ్చును; లేదా మరో విధంగా చేయవచ్చును. సంస్కృతభాషలో ప్రథమావిభక్తి (ప్రథమాకారకము) ఇట్టి స్వతంత్రుడైన, కర్మల విషయంలో ఎన్నుకునే హక్కు గల కర్తను బోధించును.

కర్తతో బాటు క్రియలో సంబద్ధమయ్యే అంశములు మరికొన్ని గలవు. క్రియలో సంబద్ధమై, క్రియ జరుగుటకు హేతువులయ్యే ఈ అంశములను కారకములు అంటారు. కారకములు ఆరు విధములుగ నున్నవి. క్రియను ఆచరించే కర్త ప్రథమా కారకమని మనము పైన చెప్పుకున్నాము. క్రియలో సంబద్ధమయ్యే మరో కారకము కర్మ. 'రాముడు వెళ్లుచున్నాడు (రామః గచ్ఛతి)'. రాముడు ఎచటకు వెళ్లుచున్నాడు? రాముడు వనమును గూర్చి వెళ్లుచున్నాడు. రాముడు ఆచరిస్తున్న యీ వెళ్లుట అను క్రియలో వనము కర్మ. కావున, క్రియను ఆచరించే కర్తను ప్రథమా కారకము బోధిస్తే, కర్మను ద్వితీయా విభక్తి బోధించును. రాముడు వనమునకు ఎట్లు వెళ్లుచున్నాడు? నడచి వెళ్లుచున్నాడా? లేక, రథముపై వెళ్లుచున్నాడా? ఆయన వెళ్లుటకు ఉపయోగించే సాధనమును తృతీయా (కరణ) కారకము బోధించును. ఆయన ఎందులకు వెళ్లుచున్నాడు? ఆయన వెళ్లుటకు ప్రయోజనమేమి? రాముడు తండ్రి మాటను నిలబెట్టుట కొరకై (పితృవాక్యపరిపాలనాయ) వనమునకు వెళ్లెను. ఈ ప్రయోజనమును చతుర్థీ (సంప్రదాన) కారకము బోధించును. ఆయన ఎచట నుండి వెళ్లుచున్నాడు? ఆయన అయోధ్యా నగరము నుండి (అయోధ్యా నగరాత్) అడవికి వెళ్లెను. ఇది కూడా వెళ్లుట అనే క్రియతో సంబద్ధమై యున్నది. దీనిని పంచమీ (అపాదాన) కారకము బోధించును. ఆఖరుది అధికరణ కారకము. రాముడు అడవియందు నివసించెను. (రామః వనే అవసత్). రాముడు నివసించిన స్థానమును సప్తమీ (అధికరణ) కారకము నిర్దేశించును.

కర్మను చేయకపోవుటకు కూడా కర్త కావాలి

మనము మరల ప్రథమా కారకమగు కర్తను పరిశీలిద్దాము. 'నేనీ పనిని చేసితిని' అన్నా, లేక 'నేనీ పనిని చేయలేదు' అన్నా, రెండు పరిస్థితుల యందు 'నేను' సంబద్ధమై యున్నది. చేయుట (ప్రవృత్తి), చేయకపోవుట (నివృత్తి) అను ఈ రెండు కర్తయగు అహంకారముపై కేంద్రితమై యున్నవి. కావున, నేను కర్తను అయినచో, ప్రవృత్తి నివృత్తులు రెండింటి యందు కర్తనే యగుదును అని శ్రీ శంకరులు వివరించిరి.

కాని, నేను కర్తను కానిచో, నా యందు క్రియ ఉండనే ఉండదు. ఏలయన, క్రియలన్నీ కర్తపై ఆధారపడును. నేను కర్త కంటె భిన్నమైన తత్త్వమును అయినచో, నేను క్రియలను వేటినీ ఆచరించను (న కించిత్ కర్మ కరోమి). ఈ 'నేను' సర్వ వేళలా క్రియా విముక్తమైనది. నేను కర్త గాదు. ఆత్మ తాను స్వయముగా క్రియలనాచరించదు; ఇతరులను కర్మాచరణము నందు ప్రోత్సహించదు (న కరోతి, న కారయతి).

అకర్మను కర్మగా, కర్మను అకర్మగా భ్రమపడుట

ఆత్మ కర్త కాదు. కర్మలను చేయించునది (కారయిత) కాదు. అట్టి తరి, కర్మ అనేది ఎట్లు ఉండును? కర్మయే లేనిచో, శ్రీకృష్ణుడా విషయమును తేలికగా యేల చెప్పడు? కర్మ యందు అకర్మ దర్శనమును గూర్చి (కర్మణి అకర్మ యః పశ్యేత్) ఆయన యేల ప్రస్తావించుచున్నాడు? ఈ సమస్యను శ్రీ శంకరులిట్లు వివరించిరి: మనం వ్యక్తులను కర్మల నాచరిస్తూండగా చూసి, వారే కర్తలని నిర్ణయిస్తాము. శ్రీ శంకరులు మనకు తేలికగా అర్థమయ్యే రెండు దృష్టాంతముల నిచ్చిరి.

మనం నదిలో పడవపై ఒక దిశలో వెళ్తూ ఉంటే, మనం స్థిరంగా ఉన్నట్లు, తీరమందలి వృక్షములు వ్యతిరేక దిశలో పయనిస్తున్నట్లు భాసిస్తుంది. దీని యర్థమేమి? వృక్షములు వాస్తవంగా కదులుట లేదు. వాటి యందు క్రియ ఏదియూ లేదు. కాని, స్థిరంగా నిలబడియున్న వృక్షముల యందు మనము గమనక్రియను దర్శిస్తాము (అకర్మణి కర్మ దర్శనమ్). ఇట్టి భ్రాంతి దర్శనమునకు విపరీత దర్శనమని పేరు.

ఇంతే గాక, మనం నదీతీరాన నిలబడి చూస్తూ ఉన్నప్పుడు, పడవ మన నుండి

రము వెళ్లిన తరువాత, కదులుట లేదా యన్నట్లు కనబడుతుంది. మన దృష్టిలో అది నున్నట్లే. మరియు, మహా వేగముతో తిరిగే వస్తువు మనకు స్థిరముగా ఉన్నట్లు తుంది. దీనికి మనం సినిమాను దృష్టాంతంగా చెప్పవచ్చును. తెరపై బొమ్మలు చాల మారిపోతూ ఉంటాయి. కాని, ఆ బొమ్మలలోని పర్వతములు, వృక్షములు మొదలగునవి గా ఉన్నట్లు భాసిస్తాయి. అంటే, మనకు కర్మలో అకర్మ భాసిస్తుంది. (కర్మణి అకర్మ మ్). ఈ దృష్టాంతము శ్రీశంకరుల కాలంలో ఉపలభ్యం కాదు.

ఈ విధంగా ఈ ప్రపంచంలో మనం కర్మలో అకర్మను, అకర్మలో కర్మను చూస్తా ము. అంటే, కర్మాకర్మల విషయంలో విపరీత దర్శనము ప్రసిద్ధముగా నున్నది. దర్శనము చూచుట. 'విపరీత' అంటే ఉన్నదానికి విరుద్ధమైనది అని యర్థము. ఆత్మ క్రియలను ఆచరించదు. కాన, ఆత్మయందు క్రియ లేదు. మనము ఆత్మయందు అకర్మలో కర్మను స్తాము. అంటే, ఆత్మ అకర్త గనుక, మనం చూసే కర్మలో కర్మ లేదు.

జ్ఞాని ఈ జ్ఞానము గలవాడై కర్మల నాచరించును. అయిననూ, జ్ఞాని ఆ కర్మలను చుటనే లేదు. అతడు చేస్తూనే చేయుట లేదు. (కుర్వన్ న కరోతి); చూస్తూనే, చూచుట (పశ్యన్ న పశ్యతి); వింటూనే వినుట లేదు (శృణ్వన్ న శృణోతి); ఆఘ్రాణిస్తూనే, ఘ్రాణించుట లేదు; రుచిని ఆస్వాదిస్తూనే ఆస్వాదించుట లేదు; నడుస్తూనే నడుచుట లేదు; టలాడుతూనే మాటలాడుట లేదు; ఆలోచిస్తూనే, ఆలోచించుట లేదు.

జ్ఞాని భ్రాంతి పడుతూనే, భ్రాంతిని పొందడు. ఒక ప్రత్యేక పరిస్థితిలో ఒక విశిష్ట వస్తువు యంలో జ్ఞాని కూడా భ్రాంతిని పొందే అవకాశము గలదు. ఉదాహరణకు, ఒక స్థానాన్ని కోవటానికి అనుసరించదగిన మార్గం విషయంలో భ్రాంతి కలుగవచ్చును. జ్ఞానికి భ్రాంతి గనే కలుగదని భావించరాదు. జ్ఞాని భ్రాంతుడైనా, భ్రాంతుడు కాడు. అంటే అర్థమేమి? ని విషయంలో "నేను భ్రాంతుడనైతిని" అనే వాక్యములోని 'నేను' కర్త కాదు గనుక, క్రియల చరించదు; క్రియలచే ప్రభావితము కాదు.

ఒక వ్యక్తి ఒక పనిని చేస్తున్నాడనుకొనుడు. అతడు పనిచేస్తున్నాడని మనము అంటాము. అతడు పనిని మానివేసినాడు. అతడు నిష్క్రియుడని మనం అంటాము. కాని, అతడు కర్మలను చేయకుండా ఉండే కాలమేదైన గలదా? ఒకడు నిశ్చలంగా కూర్చున్నాడు. అంటే, అతనికి

చేయదగిన పని యేదీ లేదు. అతడు నిశ్చలంగా కూర్చోడు! వాగుతాడు, తింటాడు. చుట్టూ తచ్చాడుతాడు. కాని, అదే సమయంలో తాను నిష్క్రియంగా ఉన్నానని చెప్తాడు!

కావున, ఏదో చేయకపోవుట కూడా నిశ్చితంగా ఒక కర్మయే. ఆ కర్మకు ఒక కర్త ఉండాలి. మానవులు తాము కర్తలమని భావిస్తారు గనుక, తాము అకర్తలమని కూడా తలపోస్తూ ఉంటారు. దీనికి కారణమేమనగా, వారు కర్తృత్వమును యథార్థకర్తకు కాకుండా, ఆత్మయందారోపించి, ఆత్మకు ప్రవృత్తి నివృత్తులను అంటగడతారు. ఈ విధంగా, ఆత్మను కర్తగా స్వీకరించి, ఇతర కర్తల యందు కేంద్రితమై ఉండే కర్మలను భ్రాంతి వలన ఆత్మకు అంటగడతారు.

క్రియ ఆత్మపై ఆధారపడియుండును

మరియు, ఆత్మతో ఏ మాత్రం సంబద్ధం కాని కర్మలు లేవు. ఆత్మ యందు కర్మ సంబంధము లేశమైననూ లేదు. ఈ సత్యము నెరుంగక, అజ్ఞానులగు మానవులు భ్రాంతి వలన కర్మ యందు అకర్మను, అకర్మయందు కర్మను దర్శిస్తారు.

ఆత్మ అకర్త; ఏకాలమందైననూ ఆత్మ కర్మలను వేటినీ ఆచరించదు. వ్యక్తి కర్మలను చేస్తూ ఉన్నప్పటికీ ఆత్మ కర్మ కాదు. ఈ సత్యమును యెరింగిన జ్ఞానికి ఆత్మ అకర్తయని తెలియును గావున, అతడు కర్మయందు అకర్మను దర్శిస్తాడు.

ఆత్మ స్వరూపము

ఆత్మ యొక్క స్వరూపము శుద్ధ జ్ఞానాకారముగ నుండును. 'ఆత్మ' అనే పదములోనే అది ఇతర ప్రమాణ గమ్యము కాదు; స్వయం ప్రకాశము అనే అర్థము ఇమిడి యున్నది. నీ ఉనికిని నిరూపించటానికి నీకు ఇతర ప్రమాణముల ఆవశ్యకత లేదు. స్వయంప్రకాశమగు ఆత్మ ఇతర ప్రమాణముల సాహాయ్యము నపేక్షించదు. ఆత్మ యొక్క స్వరూపమేమి? ఆత్మ జ్ఞాన ఘనము; శుద్ధ చేతన రూపము. ఆత్మ నిర్వి శేష జ్ఞాన రూపము గావున చేతనా రూపమగు శుద్ధ జ్ఞానముతో బాటు, వివిధ వస్తువుల విశేష జ్ఞానములు కూడ ఉండును.

ముందుగా శుద్ధజ్ఞానము ఉండాలి. ఆ పైన దానికి విశేషణము జతగూడును. ఉదాహరణకు ఘట జ్ఞానము, పట జ్ఞానము, స్త్రీ జ్ఞానము, పురుష జ్ఞానము మొదలగు

...ములు కలగాలంటే, ముందుగా నిర్విశేష రూపమగు కేవల జ్ఞానము ఉండితీరాలి. ఈ ...శేష జ్ఞానమే ఆత్మయొక్క స్వరూపము. జ్ఞానము వృత్త్యాకారమును పొంది విశిష్ట జ్ఞానము ...భాసించును. అంటే, వృత్త్యాకార జ్ఞానము సవిశేష జ్ఞానము. వృత్తి సంబంధము లేని జ్ఞానము ...్విశేష జ్ఞానము. ఇట్టి నిర్విశేష జ్ఞానమే చైతన్యము. అదియే అకర్తయగు ఆత్మ యొక్క ...రూపము.

ఆత్మ క్రియల నాచరించదని చెప్పుటకు కారణమేమి? క్రియలో ఏదో ఒక కదలిక, లేక ...ర్పు ఇమిడి యుండును. కదలిక గాని, మార్పు గాని లేని క్రియను ఊహించగలమా? ఒక ...నుండి మరియొక స్థితికి, ఒక రూపము నుండి మరియొక రూపమునకు కలిగే మార్పు, లేక ...దలికయే క్రియ అగును. రాసాయనిక చర్య కూడ క్రియయే. కాని, చైతన్య ఘనమగు ఆత్మ ...ు క్రియలో కర్తయని మనము చెప్పజాలము. ఆత్మ అకర్త యనుటలో ఇది ఒక కారణము.

చైతన్యము ఒక బిందువు వద్ద ఉంటే, మరియొక బిందువు వద్దకు కదిలే అవకాశము ...ండెడిది. కాని, అది సర్వ వ్యాపకము. కాన, చైతన్యము కదలే అవకాశము లేదు. మరియు, ...ము తనలో తాను కదలుట కూడా సంభవము కాదు. చైతన్యము వివిధ వస్తువుల ...కారము కాదు. కాన, దానిలోని ఏకదేశములో మార్పు వచ్చే ప్రసక్తి లేదు. వివిధ వస్తువుల ...లయికతో ఏర్పడిన దానియందు మాత్రమే మార్పు సంభవమగును. ఒక చోటకు చేర్చబడిన వివిధ వస్తువులు తమంతట తామే సహజముగా విడిపోతాయి. అట్లు విడిపోవుట వాటి స్వభావము. అట్లు విడిపోవుట కూడా క్రియయే. రోల్స్‌రాయిస్ వంటి కారు కూడా, వాడకుండా పాతిక ఏళ్లు ఉంచినా, ఏవో కొన్ని మార్పులకు లోనవుతుంది. కారును నడిపినా, నడపకపోయినా, అది వివిధ వస్తువుల కలయిక యగుట వలన (సంహతత్వాత్), ఏవో కొన్ని మార్పులకు లోనవుతుంది. వివిధ వస్తువులను వ్యవస్థితముగా కూర్చి తయారు చేసిన వస్తువుల యందు ఈ విడిపోయే స్వభావము (entropy) తప్పనిసరిగా ఉంటుంది.

ఈ అవ్యవస్థతా లక్షణము (entropy) గురించి సులభంగా తెలియటానికి ఒక ఉపాయం ఉంది. నీవు నివసించే గదిని కొంతకాలం శుభ్రం చేయుట మానివేయుము. దాంట్లోనే నివసిస్తూ ఉండు; కాని ఊడ్చవద్దు; శుభ్రపరచవద్దు; వస్తువులను యథాస్థానములో పెట్టవద్దు. అవుడు ఫలితమేమి? అవ్యవస్థ (ఎంట్రోపీ). కొన్నింటి కలయికతో ఏర్పడే వస్తువులన్నీ క్రమంగా విడిపోయి, అవ్యవస్థకు లోనవుతాయి. వ్యవస్థ నుండి అవ్యవస్థకు వచ్చే ఈ స్వభావమును

ఎంట్రోపీ (entropy) అంటారు. ఇది కూడా క్రియయే. కాని, ఆత్మ మాత్రం ఇట్టి అవ్యవస్థ
గురికాదు.

'నేను' యొక్క స్వరూపము చైతన్యము. అదియే ఆత్మ. ఈ ఆత్మ వివిధ అంశము
కలయిక కాదు. కాన ఆత్మయందు వ్యవస్థ లేదు. కావున, దానియందు అవ్యవస్థ వైపు మొ
చూపే లక్షణం (entropy) ఉండదు. ఒక వస్తువును మనం నిర్మించినపుడు, దాని యందు వ్యవ
ఉంటుంది. కావున, దానితో బాటు అవ్యవస్థ కూడా ఉంటుంది. ఆత్మ ఏకము, అద్వి
అనంతము. ఆత్మయందు పరిచ్ఛేదము లేమియూ లేవు. అది ఏమి చేయగలదు? ఆత్మ
పరిచ్ఛిన్నము గాదు గనుక, ఒక చోట నుండి మరియొక చోటికి పయనించజాలదు.
మరియొక వస్తువుగా పరిణమించజాలదు. అది పెరిగి పెద్దదగుట సంభవము కాదు. క
కనుమరుగగుట సంభవము కాదు. ఆత్మ యందు క్రియలు ఏవీ సంభవము కాదు.

ఆత్మ యందు సంకల్పము కూడ లేదు. ఆత్మ యందు ఆలోచనలు లేవు. ఆలోచన
కూడ క్రియయే. నేను ప్రశాంతముగా నున్నాను అని మనం అంటాము. అంటే, మన
ప్రశాంతముగా ఉండలేని సమయాలు కొన్ని ఉన్నాయని స్పష్టమవుతోంది. ఈ పరిస్థితి జ్ఞాన
విషయంలో వర్తించదు. జ్ఞానము సదా నిర్వికల్పముగ నుండును. జ్ఞాన స్వరూపము నందు
వికల్పము లేమియూ సంభవించవు. ఆత్మ మరియొక దాని యందు ప్రవేశించుట, లేక ప్రపంచము
నందు సక్తమగుట సంభవము గావు. ఆత్మ స్వరూపతః అనంతము; అద్వితీయము; సర్వపరిచ్ఛేద
విముక్తము. ఆత్మ శుద్ధము, జ్ఞాన ఘనము. ఆత్మ తాను క్రియల నాచరించదు; ఇతరములచే
క్రియల నాచరింపచేయదు. కాని, ఆత్మ యొక్క సన్నిధి యందు మాత్రమే సర్వక్రియలు
జరుగును.

కర్త నేనే; కాని నేను కర్తను గాదు

మనస్సులో గాని, ఇంద్రియముల యందు గాని, దేహము నందు గాని క్రియ
జరుగుచున్నప్పుడు, ఆత్మ యొక్క సన్నిధి యందు మాత్రమే జరుగును. కర్త ఆత్మ కంటె
భిన్నము గాదు. ఆత్మ కర్త కాదు. కాని, కర్త ఉన్నచోట, ఆత్మ ఉండును. 'నేను కర్తను గాదు'
అను సత్యము సర్వజన విదితము గాదు. నన్ను నేను కర్తగా మాత్రమే భావిస్తున్నాను. చూచేది
నేనే; వినేది, మననము చేసేది, శంకలు చేసేది, నడిచేది నేనే. ఈ క్రియలన్నింటికీ కర్తను నేనే అని
నేను భావిస్తాను. నేను అకర్తను అనే సత్యము నాకు తెలియదు. నేను అకర్తను అనే సత్యము

తెలియకపోవుట వలన, నా దృష్టిలో "నేను" కర్తను అవుతాను. కర్త నేను అవుతాను. కాని, వాస్తవంలో కర్త నేనే అయినా, నేను కర్తను గాను. కర్త నేనై, నేనే కర్తను కూడా అయినచో కష్టములు ఉదయించును. 'నేను' గురించిన జ్ఞానము లేనప్పుడు మాత్రమే ఇట్లు జరుగును.

ఆత్మజ్ఞానము గల వ్యక్తి కర్మ యందు అకర్మను, అకర్మ యందు కర్మను చూచును. మనకు కర్మ, అకర్మలపై గల సాధారణ దృష్టికోణము కంటె ఇది భిన్నమైనది. మనలో కర్తృత్వ భావన ఉండుట వలన, అకర్మకు కూడా కర్మ యేర్పడి, అకర్మ కర్మగా మారినది. "నేను ఏ పనినీ చేయుట లేదు" అని చెప్పే వ్యక్తి కర్మను ఆచరిస్తూనే ఉన్నాడు. అతడు తాను చేయుట లేదని భావిస్తున్నాడు గనుక, అతనిలో కర్తృత్వబుద్ధి గలదని స్పష్టమగుచున్నది. కర్తృత్వము ఉన్నంత వరకు వ్యక్తికి కర్మ-- ప్రవృత్తి గాని, నివృత్తి గాని -- తప్పదు. ప్రవృత్తి నివృత్తులు కర్త యందు మాత్రమే ఉండును.

వస్తువులను యథాతథముగా దర్శించువాడే జ్ఞాని

'నేను కర్తను గాను' అనే జ్ఞానము గల వ్యక్తి కర్మ యందు, అకర్మ అనబడే దాని యందు కూడ అకర్మను దర్శించును. కర్తృత్వ విరహితమగు ఆత్మను దర్శించు వ్యక్తి మాత్రమే యథార్థ దర్శనము గలవాడని శ్రీకృష్ణుడు చెప్పెను. ఇట్టి వ్యక్తి 'బుద్ధిమాన్' అనబడును.

'దేహవాన్' అంటే దేహము కలవాడు. అటులనే, 'బుద్ధిమాన్' అనగా బుద్ధి గలవాడు అని యర్థము. ప్రతి వ్యక్తికి బుద్ధి గలదు. అట్లైనచో, శ్రీకృష్ణుడు ఈ వ్యక్తిని మాత్రమే 'బుద్ధిమాన్' అని వర్ణించుటకు కారణమేమి? ఇచట బుద్ధి అనగా ఆత్మజ్ఞానము అని తెలుసుకోవాలి. కావున, బుద్ధిమాన్ అనగా ఆత్మసాక్షాత్కారము గలవాడని యర్థము.

జ్ఞానము అనగా వస్తువులను యథాతథముగా తెలుసుకొనుట. వస్తువులను యథా తథముగా దర్శించగలవాడే బుద్ధి గల వాడు. బుద్ధిమాన్ అంటే ఒక వినూత్న ఆలోచనా సరళిని ప్రవేశపెట్టిన వాడు అని అర్థం కాదు. కర్మాకర్మలను యథాతథంగా దర్శించగల వ్యక్తియే మానవులలో బుద్ధిమంతుడని (స బుద్ధిమాన్ మనుష్యేషు) శ్రీకృష్ణుడు నిర్దేశించెను.

శ్రీకృష్ణుడు ఇట్టి వ్యక్తిని యోగి (స యుక్తః) అని కూడ వర్ణించెను. అంటే, ఈ వ్యక్తి కర్మయోగ జీవనమును గడిపి, తత్ఫలరూపంగా జ్ఞానమును పొందినాడని అభిప్రాయము. ఇట్టి వ్యక్తియే యథార్థమైన కర్మయోగి. ఈ జ్ఞానమును పొందుటయే యోగము యొక్క ఫలము. అట్టి

ఫలమును ఈ వ్యక్తి సాధించినాడు. తెలియదగిన వస్తువును తెలుసుకున్న ఇట్టి వ్యక్తి యొక్క జీవనము పూర్ణ జీవనము (కృత్స్న-కర్మ-కృత్) అనవచ్చును.

సంసారము కర్తృత్వముపై కేంద్రితమై యుండును

ఆత్మ అకర్త అని తెలుసుకొనుట అంటే, ఆత్మ అభోక్త అని తెలుసుకొనుటయే. నీవు కర్మఫలభోక్తవు కానిచో, నీకు పుణ్యపాపములు ఉండవు. పుణ్యపాపములు లేనిచో సుఖదుఃఖములు లేవు. అనగా, నీవు సుఖదుఃఖములకు అతీతుడవు. వివిధ కర్మల సమాహార ఫలరూపముగా సుఖదుఃఖములు లభించును. నీవు ఒక విశిష్ట కర్మను ఆచరించి, కొంత ధనమును సంపాదించినావనుకో. ఆ ధనముతో నీవు ఒక గృహమును నిర్మించి, సుఖంగా జీవిస్తున్నావు. ఈ సుఖము, సౌకర్యము నీకు లభించిన కర్మ ఫలములు.

దుఃఖము కూడ కర్మఫలమే. నీవు కొన్న ఇంటి పరిసరములు మంచివి కాకపోవచ్చును. నీవు నీ ఇంట్లో సుఖంగా జీవిస్తూ ఉంటే, హఠాత్తుగా దొంగలు పడి నీ సంపదను అపహరించవచ్చును. నీవు దొంగల బారి నుండి రక్షణ కొరకై అత్యాధునిక విద్యుత్ పరికరములను (alaram system) అమర్చినను, దొంగల బెడద, గూండాల బెడద తప్పలేదు. అంటే, ఒకప్పుడు నీకు సుఖము నిచ్చిన గృహమే ఇపుడు నీకు దుఃఖము నిచ్చుచున్నది. ఈ రెండూ కర్మ ఫలములే. ఒకటి పుణ్యము, మరియొకటి పాపము. నీవు ఆ ఫలములను పొందుటకు తగిన కర్మల నాచరించినావు. కాన, ఆ ఫలములను పొందినావు!

పుణ్యపాపములు కంటికి గానరావు. అవి పక్వమై సుఖదుఃఖముల నిచ్చును. కర్మలన్నియూ కర్తకు సుఖదుఃఖముల నీయ సమర్థములై యున్నవి. నేను నన్ను కర్తగా స్వీకరించినంత కాలము, నేను సుఖ దుఃఖములకు పాత్రుడ నగుచుందును. మానవుడు ఇట్లు సుఖ దుఃఖ భాజనుడగుటయే సంసారమనబడును. సుఖదుఃఖములు వాటంతట అవి సంసారము కావు. నేను వాటికి పాత్రుడనగుట అను నదియే సంసారము. అదియే నన్ను సంసారిని చేయును.

సంసారము ఒక ధారణ మాత్రమే

స్థూల దేహమునకు నొప్పి కలుగును అనేది సత్యము. కాని, 'నాకు నొప్పి కలుగుచున్నది' అని నేను అంటే, అదే సంసారము. నాకు నొప్పి కలుగుచున్నది అను వాక్యమునకు స్థూలదేహమునకు

నొప్పి కలుగుచున్నది అను వాక్యమునకు మధ్య చాల తేడా గలదు. 'స్థూలదేహమునకు నొప్పి కలుగును' అను వాక్యము వ్యావహారిక జగత్తులోని ఒక సరళమైన సత్యమును బోధించును. సృష్టియే అట్లున్నది. దేహమునకు కలిగే నొప్పి దానికి రక్షణ యగును. నొప్పి లేనిచో, మనము దేహమును గురించి పట్టించుకోము. నొప్పి కలిగిందంటే, దేహములో ఏదో ఒక దోషము కలదని యర్థము. ఆ దోషమును తొలగించుట ఆవశ్యకము. కావున, స్థూల దేహమునకు కలిగే నొప్పి ఈ సృష్టిలోని ఒక ప్రముఖ భాగము.

స్థూలదేహమునకు నొప్పి కలుగునను మాట సత్యము. కాని 'నాకు నొప్పి కలుగును' అను మాట ఒక భావన, లేదా ధారణ మాత్రమే. దీనికే సంసారమని పేరు. ఈ ధారణ సత్యము కాదు. ఏలయన, కర్మ ఫలముల ననుభవించేది (కర్మ ఫల భోక్త) ఆత్మ కాదు. ఆత్మ కర్త కాదు; కావున, భోక్త కూడా కాదు. తాను భోక్త కాదు అని యెరింగిన వ్యక్తిని శ్రీకృష్ణుడిచట కృత్స్న-కర్మ-కృత్ అని వర్ణించెను. ఆత్మయందు కర్తృత్వము లేదు అని యెరింగిన వ్యక్తి ఆత్మ భోక్త కాదని కూడ యెరుంగును.

అకర్మ యనగా కర్మాభావము కాదు

కర్మ యందు కర్మ ఏమియూ లేదనియు (కర్మణి అకర్మ దర్శనమ్), అకర్మ యందు కర్మ గలదనియు (అకర్మణి కర్మ దర్శనమ్) సుస్పష్టముగా చూడగల వ్యక్తి కృత్స్న-కర్మ-కృత్ అనబడును. 'నేను కర్మను చేయుట లేదు' అని ఒక వ్యక్తి భావిస్తాడనుకొనుడు. ఆతనియందు కర్తృత్వమున్నది గాన, ఆతని ఈ కర్మాభావము కర్మగా మారిపోతుంది. "నేను ఈ పనిని చేయుచున్నాను" అని చెప్పే వ్యక్తియే "నేనీ పనిని చేయుట లేదు "అని చెప్పును. "నేనీ పనిని చేయుట లేదు" అనిచెప్పే సందర్భములో కర్మ లేదని భావించరాదు. ఏలయన, ఈ కర్మాభావము కర్తపై ఆధారపడి యున్నది; కర్తపై కేంద్రితమై యున్నది.

"నేను కర్తను (అహం కర్తా)" అను ధారణయే కర్త. ఈ ధారణ ఉన్నందు వలననే, వ్యక్తి "నేను ఇపుడు ఈ కర్మను చేయుట లేదు " అని చెప్పును. ఆ వ్యక్తి ఏ పనినీ చేయుట లేదు అని దాని యర్థము కాదు. అతడు కొన్ని పనులను చేయకపోవుట వాస్తవమే. కాని, అతడు ఏదో ఒక పనిని చేస్తూనే ఉంటాడు. ఏ పనినీ చేయకుండా ఏ వ్యక్తియూ క్షణకాలమైననూ ఉండజాలడని మనము మూడవ అధ్యాయములో చూచియున్నాము *. కావున, 'నేను క్రియను ఆచరించుట లేదు' అని చెప్పుట ఎవ్వరికైననూ సంభవము కాదు.

---

* న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మ కృత్. 3-5.

ఇట్టి మాటను చెప్పుటయూ ఒక క్రియయే. మాటలాడుట క్రియయే గదా! నేను పనినీ చేయకుండగా, తూష్ణీంగా ఉన్నాను అని చెప్పే వ్యక్తి మాటలాడుట అనే పనిని చేస్తూనే ఉన్నాడు. నూటికి నూరు శాతం కర్మ లేకుండుట అనే స్థితి ఉండనే ఉండదు. 'జ్ఞాని అకర్మ యందు కర్మను చూడగల్గును' అని చెప్పుటలో, శ్రీకృష్ణుని అభిప్రాయమేమనగా - జ్ఞాని అకర్మను కర్మ యొక్క అభావముగా దర్శించడు. అతడు కర్మ యందు కర్మ యొక్క అభావమును గాక, కర్మ నుండి విముక్తిని దర్శించగల్గును. కర్మ లేదనుకొనే చోట కర్మ గలదు. జ్ఞాని (బుద్ధిమాన్) ఆ కర్మ యందు కర్మ నుండి విముక్తిని దర్శించగల్గును.

బుద్ధిమాన్ అనగా బుద్ధి గలవాడు. జ్ఞాని బుద్ధి యొక్క ప్రభావము చేత ఆత్మను అకర్తగా దర్శించగల్గును గాన, కర్మ యందు అకర్మను చూడగల్గును. అనగా, ఆత్మ ఏవిధంగా చూచినా కర్త కాదు అనే సత్యమును అతడు గుర్తించినాడు. ఆత్మ కర్మలను వేటినీ ఆచరించదు. కర్మలన్నియూ ఆత్మ యొక్క సన్నిధిలో జరుగుచుండును.

అజ్ఞానమే మౌలికమైన పాపము

ఇచటి సమస్య యేమన, కర్మలన్నియూ కర్తపై కేంద్రితమై యుండును. కర్త ఉన్నప్పుడు మాత్రమే కర్మ సంభవమగును. కావున, కర్త నుండియే కర్మలన్నియూ ఉద్గమించును. అట్టి కర్త అహం (నేను, ఆత్మ) కంటె వేరుగాదు. వ్యక్తి (పురుషుడు గాని, స్త్రీ గాని) తాను కర్తనని తలపోయును. దీని నుండియే సమస్య ఏర్పడును. ఉన్న ఒకే ఒక పాపము ఈ ధారణ. మౌలిక పాపము (original sin) అనేది ఒకటి ఉంటే, అది ఆత్మను కర్తగా భావించుట యందు మాత్రమే గలదు. దీని నుండియే సమస్యలన్నీ ఉదయించును.

'నేను కర్తను' అనేది ఒక ధారణ. ఈ ధారణ వ్యక్తిని కర్మకు కట్టి వేయును. ఏల? ఏలయనగా, కర్మలను ఆచరించువాడే వాటి ఫలముల ననుభవించును (కర్తా ఏవ భోక్తా భవతి). నేను ఒక కర్మను ఆచరిస్తే, ఒక ఫలం నాకు లభిస్తుంది. ఈ ఫలము కర్తనగు నాకు మాత్రమే లభించును. ఈ తీరున, నేను నా కర్మల ఫలముచే కట్టివేయబడితిని. అనగా, కర్మల చేత కట్టి వేయబడితిని. ధనమును సంపాదించి, తనకు మిగుల్చుకోకుండా అందరికీ పంచిపెట్టే వ్యక్తి కూడా సత్కర్మ ఫలమును పొందును. ఇట్టి వ్యక్తిని జనులు స్తుతిస్తారు. ఈ స్తుతి కూడా కర్మ ఫలమే. ఇది ధనమును దానము చేసిన వానికి మాత్రమే చెందును. కాని, దాత యగు వ్యక్తి ఇంకనూ కర్మ ఫలమును పొందే కర్తగనే మిగిలియున్నాడు. ఇతడు కర్త గనుక, భోక్త కూడా అవుతాడు.

సంసారము: కర్మ, కర్మ ఫలముల చక్రము

కర్మలు, వాటి ఫలములు కలిసి సంసారమునకు హేతువులు. మానవుని సమస్యలన్నింటికీ అవియే మూలము. వైదిక సంప్రదాయములో, పుణ్యపాప కర్మల ఫలములే జీవుల జన్మలకు కూడ హేతువులగును. కర్మ కామము నుండి ఉద్భవించునని మనము చూచి యున్నాము. కర్మ, రాగ ద్వేషాత్మకముగా నుండు కామము యొక్క ప్రకటరూపము తప్ప వేరొండు గాదు. సంసారమునకు హేతువు కర్మఫలమను మాట సత్యమే. కాని, కర్మ ఫలము కర్మ నుండి పుట్టును. కామము ఉండుట వలననే కర్మ సంభవమగును. ఈ కామము ఎవ్వరి కొరకు? కర్త కొరకు. కావున, సర్వ కర్మలకూ, కర్మ ఫలములకూ మూలము కర్తయే. అజ్ఞానము వలన నన్ను నేను కర్తగా భావిస్తున్నాను.

ఇచటి సమస్య యేమన, నీవు వాస్తవముగా కర్తవే అయినచో, సంసారము నుండి బయటపడే ఉపాయము లేనే లేదు. నీవు కర్మలు, వాటి ఫలముల చక్రము (కర్మ చక్రము) లో తగుల్కొని ఉన్నావు. కర్మ ఫలముల వలన జన్మ కలుగును. మానవునిగా జన్మించినచో, కొన్ని కర్తవ్యములు ఏర్పడును. అపుడా మానవుడు కొత్త కర్మలను చేసి, కర్మఫలములను ప్రోగుచేసుకొనును. ఈ విధముగా ఈ చక్రము శాశ్వతకాలము తిరుగుచుండును. కర్మనుండి కర్మ ఫలము, కర్మఫలము వలన జన్మ, జన్మ వలన కర్మ, మరల కర్మ ఫలము – ఈ విధముగా నీవు నిన్ను కర్తగా స్వీకరించినంత కాలము ఈ చక్రములో తగుల్కొని తిరుగుతూనే ఉంటావు.

నీవు కర్మ– ఫల– జన్మ– కర్మల చక్రం నుండి బయట పడనంతవరకు, ఈ సంసార చక్రం నుండి బయటపడే ప్రసక్తియే లేదు. నీవు దీని నుండి బయట పడుట యెట్లు? కర్తృత్వమును నిషేధించుటయే ఏకైక మార్గము. యథార్థమైన దానిని నిషేధించుట సంభవము కాదు. కాన, కర్తృత్వము యథార్థమైనచో, నీవు దానిని నిషేధింపజాలవు. అదే యుక్తిని అనుసరిస్తే, కర్తృత్వ నిషేధము సంభవమైనచో, కర్తృత్వము యథార్థము కాదని తెలుసు.

సంసార చక్రము నుండి బయట పడుట యెట్లు?

మానవుడు పుణ్యకర్మలను మాత్రమే ఆచరించుట ద్వారా, సంసారము నుండి విముక్తుడగును అనే వాదము ఒకటి గలదు. ఇది సరిగాదు. వ్యక్తి కేవల పుణ్య కర్మలను మాత్రమే ఆచరించునుకొనుడు. అనగా, అతని జీవితములో పాప కర్మలు లేనే లేవు. కావున, అతడు

పుణ్యమును మాత్రమే పొందును. కాని, ఎంత పుణ్యము లభించినా, అది ఈ సంసారము నుండి విముక్తిని ఈయలేదు. పుణ్యము కూడ కర్మఫలమే గదా! అధిక పుణ్యము గల వ్యక్తి అనేక జన్మల నెత్తును. కాని, ధనము, అధికారము ఇత్యాది రూపములలో లభించే పుణ్యఫలములు కాలక్రమంలో వ్యక్తిని తప్పుదారి పట్టిస్తాయి.

వ్యక్తి వద్ద ధనం అధికమయ్యే కొలదీ, అధికారం పెరుగుతుంది. తనకు ఆశ్రయమైన వ్యక్తిని భ్రష్టుని చేసే లక్షణము అధికారమునకు గలదు. ఒక వ్యక్తి అత్యధిక పుణ్యమును సంపాదించినచో, అతడికి అప్రతిహతమగు అధికారము లభించునని భావించవచ్చును. అపుడా వ్యక్తి పూర్ణముగా భ్రష్టుడు అయ్యే అవకాశం గలదు. ఇట్లు పూర్తిగా భ్రష్టుడైన వ్యక్తి పాపమును మూట గట్టుకొనును. దాని వలన మరి కొన్ని జన్మల నెత్తును.

పైగా, కేవల పుణ్య కర్మలను మాత్రమే చేయుట ఎవ్వరికైననూ అసంభవము. ఏదో ఒక సమయంలో పాప కర్మను చేయకుండా ఎవ్వరూ ఉండలేరు. పాపం చుట్టుకోవటానికి అనుకోకుండా దోమను చేతితో కొడితే చాలు! మనం తెలియకుండా ప్రతి దినము కోట్లాది సూక్ష్మక్రిములను నశింపజేస్తూ ఉంటాము. ఇంతేగాక, పాప కర్మలలోని రకములన్నీ మనకు తెలియవు. మనకు తెలియని పాప కర్మలు కూడా కలవు. కావున, పాప కర్మలను పూర్తిగా పరిహరించుట అసంభవము.

ఒకవేళ ఎవరైనా పుణ్యకర్మలను మాత్రమే చేసినా, సంసారచక్రము నుండి బయటపడుట సంభవము కాదు. కర్మ తనంత తానుగా సంసారమును నడుపును. కావున, కర్త లేని స్థితిలో మాత్రమే కర్మ తొలగును. కర్త యథార్థమే అయినచో, కర్మ శాశ్వతముగా నుండుననుటలో సందియము లేదు.

కాని, కర్తృత్వము యథార్థము కాదు. కర్తృత్వము సత్యమగు ఆత్మ యందు అధ్యారోపము మాత్రమే! అనగా, కర్త అహం (నేను) అయినా, 'నేను' కర్త గాదు. అనగా, కర్తృత్వము మిథ్య యగును. దానికి స్వతంత్ర సత్త లేదు. అది 'నేను'పై ఆధారపడును. కాని, 'నేను' (ఆత్మ) కర్తృత్వముపై నాధారపడదు. ఆత్మ సత్యము.

మిథ్యా, సత్యముల నిర్వచనము

తనంత తాను ఉండలేనిది, తన ఉనికి కొరకు ఇతరముపై ఆధారపడునది మిథ్య యనబడును. తన ఉనికి కొరకై ఇతరముపై ఆధారపడే అవసరము లేనిది సత్యము.

ఈ నిర్వచనం ప్రకారం చొక్కా మిథ్య; చొక్కాగా తయారైన వస్త్రము సత్యము. వస్త్రము కూడ మిథ్యయే. వస్త్రముగా తయారైన దారపు కండె సత్యము. దారపు కండె కూడా మిథ్య. కండెగా తయారైన దారములు సత్యము. దారములు మిథ్య. వాటిని నిర్మించిన కణములు సత్యము. కణములు మిథ్య. వాటి జ్ఞానము సత్యము. వాటి జ్ఞానము కూడ మిథ్యయే. ఆత్మ సత్యము. ఆత్మ కూడా మిథ్యయే. అయినచో? ఈ విచారమంతా ఆత్మ ఉండబట్టియే సంభవమైనది. కాన, ఆత్మ సత్యము.

నేను కర్తను కాదు; భోక్తను కాదు

ఆత్మ స్వయంప్రకాశమగు చైతన్యము. దానిని మరియొకటి ప్రకాశింపచేయ బనిలేదు. ఆత్మ ఒక్కటియే స్వయం ప్రకాశము. ఇతరము సర్వము అకర్తయగు ఆత్మచే ప్రకాశింపచేయబడి, ఆత్మకొరకు ప్రకాశించును. కర్త అంటే వచ్చిపోయేది. ఉదాహరణకు, గాఢనిద్రలో కర్తృత్వము లేదు. నేను స్వయం ప్రకాశ స్వరూపుడనై, సర్వకాలముల యందు ఉన్నాను. నేను కర్తను అయినచో, కర్త వస్తూ, పోతూ ఉండరాదు. నేను సర్వదా కర్తనై ఉండాలి. మరియు, నేను భోక్తనైనచో, సర్వదా భోక్తనై ఉండాలి. కాని, అట్లు లేదు. నేను ఒకప్పుడు కర్తను; మరియొకప్పుడు భోక్తను. అంటే, నేను కర్తను గాదు; భోక్తను కూడ కాదు.

అంతఃకరణము ఉన్నప్పుడే కర్త ప్రత్యక్షమగును. క్రియలు రెండు విధములు. ఇంద్రియ జ్ఞానము, అనుమానము (inference), ఆలోచించుట అనునవి మానసిక క్రియలు. స్థూల దేహమునందు ఉండే క్రియ రెండవది. ఈ రెండు విధముల క్రియల యందు కర్త అపేక్షింపబడును. అట్టి కర్త యొక్క భావమే కర్తృత్వము. సర్వ క్రియల యందు కర్త సర్వదా అపేక్షింపబడును. ఈ కర్తయే అహంకారము. ఈ అహంకార శబ్దమును జనులు సాధారణంగా వివిధ అర్థములలో వాడుతారు. కాని ఈ శబ్దమును సరిగా తెలుసుకోవాలి.

అహంకార నిర్వచనము

క్రియ ఏదైనా, దానిని తనదిగా భావించేది అహంకారము. ఉదాహరణకు, నేను చూచినపుడు, 'ఇది నా చూపు' అంటాను. చూచుట అనే క్రియను తనదిగా భావించేది, చూచుట, వినుట, రుచిచూచుట, ఆఘ్రాణించుట, ఆలోచించుట ఇత్యాది సర్వ క్రియల వెనుక ఉండే కర్తయే అహంకారమనబడును.

మనం 'అహంకారమును ఈశ్వరునకు సమర్పించాలి' అనే మాటను తరచు వింటూ ఉంటాము. కాని, ఇది ఏదో అలవోకగా చెప్పిన మాటయే గాని, అహంకార సమర్పణ గురించి తెలిసి చెప్పిన మాటగా అనిపించదు. ముందుగా, ఈశ్వరుడెవరో నాకు తెలియదు. నాకున్న ఒకే ఒక అహంకారమును నేను ఈశ్వరునకు యేల సమర్పించాలి? నాకున్న వస్తువులు చాల తక్కువ. ఈ వస్తువుల యందు నా అహంకారమునకు 'నావి' అనే భావము కలదు. దానిని నేను ఈశ్వరునకు సమర్పించి వేసినచో, నాకు లాభమేమి? 'సర్వము లాభమే' అని వీరు నాకు బోధిస్తున్నారు.

ఇక్కడ మరొక ప్రశ్న ఉదయిస్తుంది. నేను నా అహంకారమును సమర్పించి వేస్తే, ఈ సర్వమును పొంది అనుభవించేది ఎవరు? ఒకసారి నేను నా అహంకారమును సమర్పించి వేస్తే, నేను పూర్తిగా హరించిపోతాను. మరియు, అహంకారమును సమర్పించేది ఎవరు? ఎవరో ఒకరు సమర్పించాలి. నేను కోటును ధరించి ఉంటే, దానిని నేను సమర్పించగల్గుతాను. దానిని మేకుకు తగిలించవచ్చును. లేదా, మరియొకని భుజములపై కప్పవచ్చును. నేను కోటునకు హక్కుదారుని గనుక, దానిని తేలికగా సమర్పించగల్గుతాను. కాని, కోటు నాది కానిచో, దానిని తీసుకోమని నీకు నేను చెప్పవచ్చును. అంతేగాని, నాది కాని కోటును నేను నీకు సమర్పించలేను.

సమర్పణ ఒక మానసిక భావన మాత్రమే

మరియు, 'అహంకారం భగవానునిది; ఆయనది ఆయనకే సమర్పించాలి' అని చెప్తారు. నాకు చెందని దానిని నేనెట్లు సమర్పించగలను? నాకు చెందిన దానిని మాత్రమే నేను సమర్పించగల్గుతాను. పైగా, అహంకారము భగవానునకు చెందినదైనచో, నాకా విషయము ఏల తెలియలేదు? వాస్తవంలో, భగవానునితో సహా సర్వము నాకు చెందును. అట్లు గానిచో, నేను ఈశ్వరుని, "ఓ నా ఈశ్వరా!" అని సంబోధించుట యెట్లు పొసగును? ఈశ్వరుని పిలవాలంటే,

ముందుగా నేను ఉండాలి. నేను ఉన్నాను గనుకనే, ఆయన ఈశ్వరుడైనాడు. నేనే లేనిచో, ఈశ్వరుడేడి? నేను ఆయనను 'భగవాన్' అని పిలువబట్టి ఆయన భగవానుడైనాడు.

భగవానుడు ఉండి, ఆయనయే సర్వము అయినచో, నేను సమర్పించుటకు ఏదీ మిగలదు. నేను తెలుసుకుంటే చాలు. మరియు, నేను నా కంటె భిన్నమైన ఈశ్వరునకు సమర్పించాలి అన్న పక్షంలో కూడా సమస్య గలదు. అహంకారము నేనే గదా! ఈ అహంకారమును సమర్పించేది ఎవరు? అహంకారమే సమర్పించాలి. కాని, అహంకారము ఎట్లు సమర్పించగలదు? సమర్పించేది అహంకారము అయినప్పుడు, అది తనకు చెందిన దానిని మాత్రమే సమర్పించగలదు. అది తనను తాను సమర్పించలేదు. సమర్పణ అనే క్రియలో కర్త అహంకారము. కావున, అహంకారమును భగవానునకు సమర్పించాలంటే, దానికి ఇంకో అహంకారం ఉండాలి! ఈ విధంగా వెనుకకు పోతూ ఉండాలి. ఈ వెనుకకు పోవుటకు అంతము ఉండదు. అపుడు అవ్యవస్థ యేర్పడును. ఇట్టి స్థితిలో, మనము ఈశ్వరునకు సమర్పించుట యెట్లు?

సమర్పణ ఒక మానసిక భావన. అది పరిణతమైన మనస్సులో నిర్మాణమగును. ఇంతకు మించి సమర్పణ వేరే ఏదీ లేదు. అహంకారము తనను తాను సమర్పించుట సంభవము కాదు. కాని, సమర్పణా భావముతో నేను అహంకారము యొక్క ప్రభావమును తగ్గించగల్గుతాను. ఈ జగత్తులో నేను సృష్టించినది ఏదీ లేదనియు, స్థూల దేహము, మనస్సు, ఇంద్రియములతో సహా సర్వము నాకు అనుగ్రహించ బడినదనియు నేను గుర్తించగల్గుతాను. నాకు ఈయబడినది ఏదైనా నాది కాదు. ఓ భగవాన్, నీవు దాతవు. నేను నీవిచ్చిన దానికి సంరక్షకుడను మాత్రమే. నా అహంకారము నాకీ విషయములనన్నిటినీ బోధించును. ఈ తీరున, యోగ్యమగు మానసిక భావనను కలిగి ఉండుట అనే సమర్పణ మాత్రమే సంభవమగును.

వ్యక్తి సంసారము నుండి యెట్లు విముక్తుడగును? కర్తయగు అహంకారమును వీడుట ద్వారా మాత్రమే సంసారము నుండి విముక్తుడగును. సమర్పణ సంభవము కాదని మనము అనుకున్నాము. అట్లైనచో, ఈ అహంకారమును వీడుట యెట్లు? మనము ఇతరమును సర్వమును విడిచిపెట్టవచ్చును. కాని, అహంకారము తనను తాను విడువజాలదు. కావున, ఏదో ఒక రూపములో అహంకారము మిగిలియుండును. నేను ఇచట ఉన్నవారందరిలో కెల్లా గొప్ప దాతను ఇత్యాది వచనములను పలుకుటకై అహంకారము మిగిలియుండును. తాను చేసిన మంచిపనులను గూర్చి మాటలాడని వ్యక్తియైనను తన గూర్చి 'నేను నిగర్విని' అని తలపోయును.

నేను చేసిన దానములన్నిటి గురించి మాటలాడను. నేను వాటి గురించి గొప్పలు చెప్పను. మీరు ఎవరినైనా అడగండి. నా మాటలు యథార్థమని తెలుస్తుంది అని అతడు చెప్పును. ఈ అహంకారమునకు తాను స్థిరముగా, శాశ్వతముగా ఉండే అనేక మార్గములు బాగుగా తెలియును.

కర్త సర్వకాలముల యందు ఏదో ఒక రూపములో ఉండనే ఉండును గావున, దానిని జయించుట అసంభవము. దీనికి అపవాదము ఒకటి గలదు. నేను ఎవరిని? అనే విచారమును మొదలిడిన వ్యక్తి మాత్రం దానిని జయించగల్గును. ప్రపంచములోని తత్త్వశాస్త్రములన్నిటినీ పఠించిన వ్యక్తికి కూడా, నేను తత్త్వశాస్త్ర పండితుడను అనే అహంకారము మిగిలియే యుండును. నేను ఎవరిని? అనే ప్రశ్న తలయెత్తినపుడు మాత్రం, అహంకారం కష్టాలలో పడుతుంది. ఎందువలన? ఏలయనగా, కర్తృరూపములో నున్న అహంకారము వాస్తవంలో అధ్యారోపము మాత్రమే. కర్తృత్వము యథార్థముగా లేదు. అది ఆత్మ అధిష్ఠానముగా గల మిథ్య.

జ్ఞానముచే బాధితమగుట

కచ్చితంగా చెప్పాలంటే, ఆత్మ జ్ఞానము కలిగిన తరువాత కూడా అహంకారము తొలగిపోదు. పైగా, ఈ జ్ఞానము కలిగిన వ్యక్తి అహంకారమును మిథ్యగా దర్శించును. కావున, అహంకారము తొలగిపోవుట యనగా, జ్ఞానము చేత అహంకారము బాధితమగును, అనగా నశించును అని అర్థము. 'నాశము' అనే పదమును స్థూల వస్తువు యొక్క రూపము మారిపోయి, మొదటి రూపము కనబడకపోవుట అనే అర్థములో సాధారణంగా వాడలారు. కాని, ఇచట అహంకారము బాధితమగుటయే అహంకార నాశము.

ఒక వస్తువు భాసించుచున్నది. కాని, అది సత్యము కాదని తెలిసిపోయినది. జ్ఞానముచే బాధితమగుట అనగా నిదియే. ఉదాహరణకు, నీవు నీలాకాశము యొక్క అందమును ఆస్వాదిస్తూనే, ఆకాశము వాస్తవంగా నీలము కాదనే జ్ఞానముచే దాని నైల్యమును నిషేధిస్తావు. లేదా, సినిమాను మెచ్చుకుంటూ, దాని సత్యత్వమును నిరాకరించవచ్చును. కాని, చిన్నపిల్లవాడు సినిమాలోని ఏనుగులు, పులులు ఇత్యాది సర్వము యథార్థ మనుకుంటాడు గనుక, దానిని మిథ్య యని త్రోసిపుచ్చలేడు. సినిమాలోని వస్తువులు, పరిస్థితులు కేవల ఆభాసములు మాత్రమే.

కావున, అవి మిథ్య. ఈ సత్యము నెరుంగని పిల్లవాడు వాటి కొరకు ఏడుస్తాడు కూడా. సినిమా మిథ్య యని తెలిసేవరకు, ఆ పిల్లవాని దృష్టిలో అది సత్యమే. ఒక వస్తువును, లేదా పరిస్థితిని యథాతథంగా తెలుసుకుని, దాని యందారోపింపబడిన సత్యత్వమును నిషేధించుటయే బాధ యనబడును. ఇది జ్ఞానము చేత మాత్రమే సంభవము.

ఇదే విధంగా, అహంకారమును తొలగింప బనిలేదు. దానికి స్వతంత్ర మగు సత్త లేదు అనే సత్యమును తెలుసుకోవాలి. ప్రతి వ్యక్తికి ఉండే అహంకారము దేనిపై ఆధారపడును? స్వతంత్రమగు సత్త కలది, అహంకారముపై ఆధారపడనిది, సర్వమునకు ఆధారమైనది అగు తత్త్వమెయ్యది? అహంకారము తన ఉనికి కొరకై ఆత్మపై ఆధారపడును. ఆత్మ అహంకారము కాదు. కనుక, అహంకారము లన్నిటి యొక్క సత్యము ఆత్మయే.

అహంకారమునకు, అహంకార కార్యములకు అధిష్ఠానముగా ఒక సత్యము గలదు. అదియే ఆత్మ. అహంకారము యొక్క సారమే ఆత్మ. ఆత్మ లేనిదే అహంకారము లేదు. ఈ ఏకైక సత్యమగు ఆత్మ అహంకార భిన్నము, అకర్త. అయినచో, కర్త యెవరు? అహంకారము మాత్రమే కర్త యని స్పష్టమే.

కర్త అవ్వాలంటే, సంకల్పము ఉండాలి. ఈ సంకల్పము యొక్క ఉనికి ఆత్మచైతన్యము నందు గలదు. కావున, 'నేను కర్తను' అని నీవు అంటే, ఆ కర్తృత్వము ఆత్మయందు కేంద్రితమైన మనోవృత్తియే గాని, మరియొకటి గాదు. సంకల్పము ఆత్మయందు కేంద్రితమైననూ, ఆత్మ సంకల్పము లేక మనోవృత్తిపై కేంద్రితమై లేదని మనము గ్రహించాలి. ఈ సత్యమును గ్రహించుట యనగా మనో వృత్తులను నిర్మూలించుట గాదు. ఇది జ్ఞానము మాత్రమే; ఆత్మ యాథార్థ్య జ్ఞానము.

ఆత్మను తెలియుట యెట్లు?

"అహంకారము ఆత్మను యెరుంగుట యెట్లు?" అనే ప్రశ్న ఉదయిస్తుంది. అహంకారము సాధారణంగా సర్వమును యెరుంగును. కాని, ఆత్మ అహంకారములో విషయము కాదు. కాన, అహంకారము ఆత్మను యెట్లు తెలియగలదు? ఈ ప్రశ్నకు సమాధానంగా కొందరు, "ఆత్మ అహంకారమును అతిక్రమించును; అపుడు నీకు తెలియును" అని చెప్తారు. కాని, అహంకారమునకు అతీతమగుట అనగా నేమి? అహంకారము తొలగిపోవునా? అయినచో, మరల తిరిగి వచ్చునా?

అహంకారము తొలగిపోయినచో, ఇక ఏమీ మిగలదు. ఆత్మ అహంకారము నతిక్రమించినపుడు, అహంకారము మరల తిరిగి ఉదయించకపోతే, ఆత్మను తెలియుటకు మిగిలేది యెవరు? ఇదియే వాస్తవమైనచో, ఈ జ్ఞానమును పొందిన వ్యక్తి ఉత్త జడునిగా తయారగును! ఆత్మను తెలియుటకై అహంకారమును అతిక్రమించాలి అన్నచో, అట్టి అహంకారము మరల తిరిగి ఉదయించదు అన్నది నిశ్చయము కాన, ఈ వివరణ అంగీకార యోగ్యము కాదు.

నీవు అహంకారము నతిక్రమించి, ఆత్మను తెలుసుకున్న తరువాత అహంకారము మరల వచ్చును అన్నచో, ఆత్మను తెలుసుకున్నది యెవరు? ఆత్మను తెలుసుకోవలసినది అహంకారము. అహంకారమును సమర్పించాలి; ఆత్మను తెలుసుకోవాలంటే అహంకారము నతిక్రమించాలి ఇత్యాది వాక్యములు ప్రజలను అయోమయంలో పడవేస్తాయి. దురదృష్టవశాత్తు ఇట్టి వాక్యములు ఆధునిక వేదాంత గ్రంథములలో తరచు దర్శనమిస్తాయి. అవి నిస్సారములని మనం తెలుసుకోవాలి.

జ్ఞానసాధనములు అహంకారము కొరకు మాత్రమే ఉద్దేశింపబడినవి

వాస్తవంలో ప్రత్యక్షము, అనుమానము ఇత్యాది జ్ఞానసాధనము (ప్రమాణము)లను వినియోగించుకునేది అహంకారము మాత్రమే. అహంకారము ప్రత్యక్ష ప్రమాణమును వినియోగించి, సమాచారమును సేకరించి, దానిని విశ్లేషించి, అనుమానిక జ్ఞానమును కూడ పొందును. ఈ విధముగా ప్రత్యక్షానుమానములు కర్తయగు అహంకారమునకు అధీనములై యుండును. అహంకారము ఈ రెండు జ్ఞాన సాధనములను వినియోగించుచూ, జ్ఞానమును పొందుచుండును.

ఎల్లవేళలా జ్ఞానసాధనములను వినియోగించుకునేది కర్త. కావున, జ్ఞాన సాధనమును వినియోగించే ప్రక్రియలో కర్త, కరణము, క్రియ మరియు కర్మ ఫలము ఉండును. ఒక చిన్న జ్ఞానము, లేదా క్రియ వెనుక – అది ఫలవంతము అయినా, కాకపోయినా – కర్త తప్పనిసరిగా ఉండును.

అహంకారము వినియోగించుకునే ప్రత్యక్ష, అనుమానములు ఆత్మను తెలియుటలో పనికిరావు. ఏలయన, అహంకారము యొక్క సారతత్త్వమే ఆత్మ-- ఆత్మ అహంకారము

వెనుక ఉన్నది. అనగా అహంకారము యొక్క సత్యము ఆత్మయే. అట్లైనచో, ఆత్మను తెలియుట యెట్లు?

ఈ పరిస్థితిలో, శబ్దరూపముగా ఋషులచే దర్శింపబడిన ఆగమ రూపమగు ప్రమాణము కార్యకారియగును. శబ్దము ప్రమాణమైన విషయములో అహంకారము చేయదగినది ఏదీ లేదు. నీవు అహంకారము కాదు; బ్రహ్మాభిన్నమగు ఆత్మవు నీవు అనే వృత్తిని శబ్దము కలిగించును. జరిగేది ఇంత మాత్రమే. అపరిచ్ఛిన్నము, జ్ఞానఘనము నగు ఆత్మ నీవే. ఇదియే బోధ. ఇదియే ఉపదేశము. ఈ ఉపదేశము నీ గురించి నీకు గల అజ్ఞానమును తొలగించివేయును.

ఆత్మ విషయకమగు అజ్ఞానమును తొలగించుట

తాను అహంకారమేనని భావించే వ్యక్తి తనను తాను పరిచ్ఛిన్నునిగా భావించును. అట్టి వ్యక్తికి ఇంతకు మించి తన గురించి ఏమియూ తెలియదు. ఉపదేశము వలన పుట్టే 'నేను బ్రహ్మను' అనే వృత్తి అహంకారమునకు మూలములో నున్న ఈ అజ్ఞానమును నశింపజేయును. ఈ అజ్ఞానము నశించుట తోడనే, నేను అహంకారమును, కర్తను అనే ధారణ తొలగిపోవును. ఇంతకు మించి కావలసినది ఏమీ లేదు.

ఆత్మ జ్ఞానము ఉదయించిన తరుణంలో అహంకారము యొక్క గతియేమి? అది వచ్చినపుడు వస్తుంది; పోయినపుడు పోతుంది. ఆత్మ విషయంలో నీకు గల అజ్ఞానము నశించినది గాన, నీవు అహంకారము కాదు. అహంకారము ఆత్మయే. కాని, ఆత్మ అహంకారము కాదని నీకు తెలియును. ఈ జ్ఞానము ఉదయించిన తరువాత నీవు దారి తప్పవు; అహంకారము, దాని చేష్టలు విసిరే వలలో చిక్కుకొనవు.

ఈ ఆత్మజ్ఞానము ఒకసారి లభిస్తే మరల పోయేది కాదు. ఏలయన, ఆత్మ విషయంలో ఉన్న అజ్ఞానము తొలగిపోవును గదా! అహంకారం ఉంటుంది. కాని, అహంకారమే ఆత్మ అనే భ్రాంతికి అవకాశం ఉండదు. అహంకారం వచ్చిపోయేది. కాని, అహంకారము ఆత్మయే అయినా, ఆత్మ అహంకారము కాదు. నీకు ప్రత్యక్ష ప్రమాణ జన్యమగు జ్ఞానము ఒకటి కలుగవచ్చును; లేదా, అనుమానిక జ్ఞానము కలుగవచ్చును; ఒక కర్మను వ్యక్తి నిర్వర్తించవచ్చును; లేదా, ఒక ఫలమును పొందవచ్చును. ఇటువంటిది ఏదో ఒకటి జరుగుతూనే ఉంటుంది. అంత

మాత్రాన ఆత్మ అహంకారమై పోదు. సర్వము ఆత్మయే (ఆత్మా ఏవ ఇదం సర్వమ్). కాని ఆత్మ ఏ ఒక్కటీ కాదు.

వ్యక్తి ఒక పనిని చేసినప్పుడు అహంకారము ఉపస్థితమై యుండును. కాని ఆత్మ అహంకారము కాదు గనుక, ఏ కర్మతోనూ సంబద్ధము కాకుండగనుండును. పైగా, క్రియనాచరించే సాధనములు, క్రియా ఫలితము కూడా ఆత్మయే అయినా, ఆత్మ కరణము కాదు; క్రియ కాదు; ఫలము కాదు. ఈ సత్యము నెరింగిన వ్యక్తి కర్మలో అకర్మను దర్శించును (కర్మణి అకర్మ దర్శనమ్).

ఆత్మ విషయంలో మనకు గల అజ్ఞానమును తొలగించే ఏకైక సాధనము జ్ఞానము. కాని, దీని విషయంలో మనం వినియోగించగలిగే ప్రమాణమేదీ పనికిరాదు. కాన, శబ్దరూపములో నున్న జ్ఞానము (ఆగమము) మాత్రమే అహంకారమును నశింపచేయును. నీవు నిన్ను శబ్ద ప్రమాణము యొక్క ప్రకాశములో దర్శిస్తావు. వాస్తవంలో ఈ ప్రకాశము ఎంతటి తీవ్రమైనది అంటే – నీవు బ్రహ్మాస్త్రముచే కొట్టబడతావు. రామాయణంలో, శ్రీరాముడు రావణుని సంహరించుటకు బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను. ప్రయోగించే వాని చేతిని విడిచి వెళ్లే ఆయుధము శస్త్రము అనబడును. ప్రార్థనలు, యజ్ఞములు మొదలగు ఆధ్యాత్మిక సాధనలన్నీ శస్త్రములైతే, 'తత్ త్వం అసి' (నీవు అదియే అయి ఉన్నావు)' అను మహా వాక్యము అస్త్రము. అది గురువు వద్ద నుండి వెలువడి నిన్ను కొడుతుంది. నిజానికి అది నిన్ను కొట్టుట కొరకు మాత్రమే ఉద్దేశింపబడినది. ఈ మహావాక్యము తుపాకీ గుండు వలె వచ్చి, అహంకారమును బయటకు లాగి, కొట్టి సంహరించును.

బ్రహ్మాస్త్రముచే కొట్టబడి దశకంఠ రావణాసురుడు మరణించిన తీరున, తత్త్వమసి మహా వాక్యోపదేశము యొక్క మహాప్రకాశములో అహంకారము సహజముగనే మరణించును. రావణుడనే అహంకారమును తత్త్వమసి అనే బ్రహ్మాస్త్రము శాశ్వతముగ నశింపచేయును. రాముడు తన శత్రువగు రావణుని సంహరించుటకు అనేక అస్త్రములను ప్రయోగించెను. ఆయన ఒక తలను నరికి, రెండవ తలను నరికే లోపులో మొదటి తల మరల మొలిచెడిది! ఇది మనము కోర్కెలను తీర్చుకునే ప్రక్రియను పోలియున్నది. ఒక కోరిక తీరినది అని భావిస్తూంటే, దాని స్థానంలో మరో కోరిక పుట్టుకొస్తుంది. అంతతో గత్యా, బ్రహ్మాస్త్రము నుపయోగింపుమని రామునకు సలహా ఈయబడినది. అప్పుడు మాత్రమే రావణుడు మరణించి, రామునకు ఆనందరూపిణి యగు సీత దక్కినది.

అహంకారమును బయటకు లాగి, దానిపై తత్త్వమసి ఆయుధమును ప్రయోగిస్తే, అది నశిస్తుంది. కావున, నీవు ఉపదేశమునకు అధీనుడవగుట తప్ప, చేయవలసినది మరేదీ లేదు. ప్రత్యక్షానుమాన ప్రమాణములను వినియోగించుకొనుట వేరు. ఉపదేశ ప్రకాశములో నిన్ను నీవు తెలుసుకొనుట వేరు. ఈ జ్ఞాన సాధనము ఇతర ప్రమాణములన్నిటి కంటె విలక్షణమైనది. ఈ జ్ఞానబోధ ఆధారముగా తనను తాను తెలుసుకొనుట సర్వథా వినూత్నమైన ప్రమాణ వ్యాపారము. ఇది బయట నుండి మనలోనికి ప్రవేశించి, 'నీవే బ్రహ్మవు' అని బోధించి, అహంకారమును తుడిచిపెట్టును. దీనికొరకై, క్రియలను ఆచరింపబని లేదు. ఈ శబ్ద ప్రమాణమునకు నీవు శ్రద్ధతో అంకితమైన చాలును. ఈ ప్రమాణము ఆత్మ జ్ఞానమును ఇచ్చుననే శ్రద్ధాభావము ఉండాలి.

జ్ఞానము, భ్రాంతి కలిసి ఉండజాలవు

శ్రద్ధలో క్రియ ఏదీ ఉండదు. కాని, మనకు మన గురించి, ప్రపంచము గురించి, ఈశ్వరుని గురించి గల పూర్వధారణల నన్నిటినీ పరిత్యజించి, పూర్ణమగు ఉత్సాహముతో అంకితమగుటయే శ్రద్ధయగును. వ్యక్తి ఈ జ్ఞాన ప్రకాశములో తనను తాను తెలుసుకునే అవకాశము శ్రద్ధ వలన లభించును. యోగ్యమగు మానసిక భావనతో ఈ ఉపదేశమునకు అంకితమైన వ్యక్తికి మాత్రమే జ్ఞానము లభించును. ఈ జ్ఞాన ప్రకాశములో అహంకారమునందు ఆత్మ భ్రాంతి తొలగిపోవుట వలన అహంకారము నిస్సహాయమైపోవును. జ్ఞానమునకు తోడుగా భ్రాంతి, జ్ఞానముతో కలిసి ఉండుట సంభవము కాదు. ఒకే వ్యక్తిలో ఏకకాలము నందు జ్ఞానము, భ్రాంతి ఉండజాలవు. మరియు, జ్ఞానోదయమైన తరువాత పునః భ్రాంతి కలిగే అవకాశము కూడ లేదు. జ్ఞానము ఉన్న చోటకు భ్రాంతి మరల ప్రవేశించుట అసంభవము.

త్రాడు–పాము దృష్టాంతముతో ఈ కథనమును ఆశంకించవచ్చును. ఒకడు త్రాడును చూచి పాము అనుకొనెను. కాని, వెలుతురులో పరిశీలించగా, అతని ఆ భ్రాంతి తొలగినది. కాని, మరునాడే అతడు మరల అదే భ్రాంతికి గురి కావచ్చును. ఇది ఎంతయూ సంభవము. ఏలయన, త్రాటి యొక్క ఉనికి, సర్పము యొక్క ఉనికి ప్రత్యక్ష ప్రమాణముపై ఆధారపడి యున్నవి. కాన, భ్రాంతి సంభవమే. కాని, ఆత్మ యొక్క ఉనికి ఏ ప్రమాణముపైననూ ఆధారపడి లేదు. మనం ముందుగా ఒక వస్తువును (త్రాడు గాని, మరియొకటి గాని) చూచి, దానిని గుర్తిస్తాము. కాని, ఆత్మ విషయములో అట్లు గాదు. ఆత్మ నిత్య సిద్ధము. కావున, ఒకసారి తొలగిపోయిన అజ్ఞానము మరల ప్రవేశించే ప్రసక్తియే లేదు.

ఒక వస్తువు మన కంటబడనంత వరకు దానికి మన మనస్సులో కూడ స్థానము లేకపోవుట సంభవమే. కాని, ఆత్మ విషయంలో కంటబడకపోవుట అనునది లేదు. మనస్సులో ఉండకపోవుట అనునది కూడ లేదు. మనోవైజ్ఞానిక ఆత్మ, జీవ సంబంధి ఆత్మ, శారీరిక ఆత్మ, పారివారిక ఆత్మ, అనువంశిక ఆత్మ ఇత్యాదిగా అనేక ఆత్మలను గురించి ప్రజలు వర్ణిస్తూ ఉంటారు. ఈ ఆత్మలన్నియూ రోగసంబంధి, శరీర క్రియా సంబంధి దోషములకు, అనువంశిక, మరియు మానసిక దోషములకు వశమై ఉంటాయి. ఇట్టి ఆత్మ మనకు స్వీకారయోగ్యము కాదు. సాధారణముగా మన శరీరమే మనకు స్వీకారయోగ్యముగ నుండదు. ఒకనికి తన ముక్కు సరిగా లేదనిపిస్తే, మరియొకనికి తన శిరోజముల రంగు నచ్చదు. ఈ విధముగా శరీరము స్వీకారయోగ్యము అగుట లేదు. కాని, మనము వర్ణించే ఆత్మ ఇవి ఏవీ కాదు. ఆత్మ వీటన్నిటి కంటె భిన్నమైనది.

సర్వము ఆత్మయే గాన, ఆత్మకు బహిః ఉండే ప్రసక్తియే లేదు. అజ్ఞానము తొలగుట తోడనే, నేను అహంకారము కాదు అనే జ్ఞానము కలిగి, అహంకారము తొలగిపోవును. ఈ జ్ఞానోదయము కలిగిన తర్వాత ఉండే అహంకారము వేరు. తత్పూర్వమందలి అహంకారము వేరు. ఆ అహంకారము జ్ఞానదీపితమైన అహంకారమైనది. సత్యము, స్వతంత్రసత్తాకమునగు అహంకారము లేదు అనే జ్ఞానము గల జ్ఞానోజ్జ్వలుడగు వ్యక్తిని 'జీవించి యుండగనే ముక్తుడు (జీవన్ముక్తుడు)' అని వ్యవహరిస్తారు. ఇట్టి వ్యక్తిని శ్రీకృష్ణుడీ శ్లోకములో 'బుద్ధిమాన్' అని వర్ణించెను.

నేను కర్తను కాదు అని తెలియుటకు కర్మాచరణముతో సంబంధము లేదు

అందరూ అకర్మ అని భావించేది కర్మయే (యః అకర్మణి కర్మ పశ్యేత్ సః బుద్ధిమాన్) అని దర్శించు వ్యక్తి 'బుద్ధిమాన్' అనబడును. ఆత్మ అకర్త గనుక, అతడు కర్మయందు అకర్మను దర్శించును (యః కర్మణి అకర్మ పశ్యేత్ సః బుద్ధిమాన్). ఆత్మ అకర్త అనే సత్యమును అతడు గుర్తించును. ఆ గుర్తింపులో - అది యథార్థమైన గుర్తింపు అయినచో - కర్మను చేసినా, చేయకపోయినా మార్పు ఉండదు. ఈ సాక్షాత్కారమునకు కర్మతో సంబంధము లేదు. ఇది ఆత్మయొక్క స్వరూపమును గుర్తించుట.

నీవు అకర్తగా మారేది కాదు; నీవు స్వతః అకర్తవు

ఆత్మ కర్తయనే భ్రాంతి ఉండుటచే, కర్తృత్వ దృష్ట్యా, ఆత్మ అకర్తయని నిర్దేశింపబడినది. 'నేను కర్తను (అహం కర్తా)' అను ఆలోచన భ్రాంతి జనితము. ఈ భ్రాంతి తొలగుట తోడనే వ్యక్తి తనను తాను అకర్తగా గుర్తించును. 'నేను అకర్తను' అనేది తెలుసుకోవలసిన సత్యము. కావున, నేను ఎప్పుడు అకర్తను కాగల్గుతాను? అను ప్రశ్న అసంగతము. 'నీవు అకర్తవు కావాలి' అని ఎప్పుటనూ చెప్పబడలేదు. నీవు చేయవలసినది కర్మలో అకర్మను దర్శించుట మాత్రమే.

నీవు అకర్తగా మారే ప్రసక్తి లేదు. నీవు అకర్తవు. ఆత్మ అకర్త. నీవు అకర్తవు కావటానికి ఈ సత్యమును దర్శిస్తే చాలును. అపుడు నీవు, బుద్ధి ఉండియూ ఉపయోగించని వారందరిలో, బుద్ధిమంతుడవు.

సత్యము నెరుంగుటకు విచారము అవశ్యకము

'బుద్ధిమాన్' అనగా బుద్ధిని వినియోగించువాడు. ఈ పదము 'ధనవాన్' అను పదము వంటిది యని మనము చూచియున్నాము. ధనము ఉన్నంత మాత్రాన వ్యక్తి 'ధనవాన్' కాడు. ధనమును ఇతరులకు ఇచ్చువాడు మాత్రమే 'ధనవాన్' అగును. తన కొరకు, అవసరమైనపుడు ఇతరుల కొరకు, ధనమును ఖర్చు చేయువాడు 'ధనవాన్' అనబడును. ఒక వ్యక్తి ధనము ఉండియూ, తన కొరకు గాని, లేదా ఒక మంచి పనికొరకు గాని ఖర్చుపెట్టనిచో, అతడు కేవలము 'ధని' మాత్రమే; 'ధనవాన్' కాడు. ధనికి, ధనవాన్‌కు మధ్యగల ఈ భేదమును తెలుసుకోవాలి. తనకున్న ధనము యొక్క విలువను యెరింగిన వ్యక్తి మాత్రమే 'ధనవాన్' అనబడును.

రెండు రోజుల నుండి తిండి లేని బీదవానికి తన వద్దనున్న ఒకే ఒక రూపాయను దానము చేసిన వ్యక్తి ధనవాన్. ఏలయన, అతని వద్ద నున్నది చాల తక్కువే అయినా, అతడు దానము చేయుటకు వెనుకాడ లేదు. అతడు నిర్ధనుడు; కాని ధనవాన్. ధనమును వినియోగించుట తెలిసిన వాడు. దీనికి భిన్నంగా, లక్షాధికారి అయినా, తన కొరకు గాని, ఇతరుల కొరకు గాని ఖర్చు చేయజాలని వ్యక్తి ధనియే గాని, ధనవాన్ కాడు. ఇట్టి వ్యక్తిని కృపణుడు (లోభి) అని అంటారు.

మరియు, బృహదారణ్య కోపనిషత్తులో యాజ్ఞవల్క్యుడు గార్గితో, బ్రహ్మము ఎరుంగకయే మరణించిన వ్యక్తి కృపణుడు అని చెప్పెను. ఇట్టి వ్యక్తిని కృపణుడు అనుట కారణమేమి? అతని వద్ద బుద్ధి యున్ననూ, దానిని అతడు ఎన్నడూ వినియోగించలేదు గన కృపణుడైనాడు.

ధనమును ఖర్చు చేయని వ్యక్తికి ఆ ధనముతో ఉపయోగము లేనట్లే, బుద్ధి ఉన్నన దానిని వినియోగించని వానికి దాని వలన ప్రయోజనమేమి?

బుద్ధి ఉండియూ, దానిని వినియోగించని వాడు కూడ లోభియే. ఇట్టి లోభి తన ఉన్న బుద్ధిని వీలైనంత తక్కువగా మాత్రమే వినియోగిస్తాడు. ఒకడు తన తల్లి తండ్రుల సంతోష పెట్టుటకై, తన బుద్ధిని కొద్దిగా వినియోగించి, కొంత చదువు చదివి, ఉద్యోగమ సంపాదించవచ్చును. అతడు తన బుద్ధిని వినియోగించే అత్యధిక పరిధి అంతటితో స తరువాత అతడు వార్తా పత్రికను కూడ చదవడు. టి.వి. ముందు కూర్చుని, దానిని చూస్ ఉంటాడు. అతని బుద్ధి పనిచేయుట మానివేస్తుంది. ఏల పనిచేయవలెను? ఇట్టి జీవనశైలికి పనిచేయవలసిన ఆవశ్యకతయే లేదు. ఇట్టి వ్యక్తులు యథార్థమగు విచారమునకు బహుదూరమ

సత్య వస్తువును గురించిన విచారమే యథార్థమైన విచారము. సత్యాన్వేషణలో ఆలో ఆవశ్యకమగును. లేనిచో, మనకు ఆ భాసలు మాత్రమే మిగులును. మనకు వస్తు స్థి తెలియనిచో, సంఘర్షణ ఆవశ్యకము కాని స్థలాలలో సంఘర్షణకు దిగుతాము. ఆత్మ, జగత్తు ఈశ్వరుడు అను వాటి మౌలిక సత్యమును గురించి విచారణ చేయు వ్యక్తి బుద్ధిమంతు డనబడును. అనగా, అతడు తన వద్దనున్న బుద్ధిని వినియోగించువాడని యర్థము. బుద్ధిమంతుడు తన బుద్ధిని తన కొరకు వినియోగించుకొనుట మాత్రమే గాక, తాను పొందిన జ్ఞానమును ఇతరులతో పంచుకొనును.

మానవులందరికీ బుద్ధి గలదు. వారందరిలో ఈతడు మాత్రమే బుద్ధిని వినియోగించువాడు (సః బుద్ధిమాన్ మనుష్యేషు) అని శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పుచుండెను. కొందరు ధనమున్ననూ ధనవంతులు కారు. అటులనే కొందరు బుద్ధి ఉన్ననూ బుద్ధిమంతులు కారు. కాని, బుద్ధిమంతుడు యోగియే గాక, కృత్స్నకర్మ కృత్ కూడా. అనగా, తన కర్తవ్యముల నన్నిటినీ నెరవేర్చినవాడని యర్థము.

ఆత్మ అకర్త యని సాక్షాత్కరించుకున్న జ్ఞాని విషయంలో సర్వ కర్మలు సమగ్రముగా నశించును. ఆత్మ పూర్ణము గనుక, ఇట్టి జ్ఞానికి మరల ఎన్నడూ చేయదగిన కర్మ మిగిలి యుండదు. ఆత్మ అకర్త యనునది కొద్ది రోజుల వ్యవహారము, మూడు నాళ్ల ముచ్చట కాదు. ఆత్మ కర్త కాదనే సత్యము ఒకసారి అవగతమైతే, ఆ తరువాత ఆత్మ మరల ఎన్నటికీ కర్త యనే భ్రాంతికి గురి కాదు.

మనము ఆత్మను గురించి విచారించేటప్పుడు, ఒక సమయంలో ఒకే లక్షణముపై దృష్టిని కేంద్రీకరిస్తాము. కాని, ఆత్మ సర్వదా పూర్ణము. ఆత్మ అసంగము అని మనము అంటాము. అంటే, ఆత్మ కర్తృత్వ భోక్తృత్వముల నుండి, అనగా సుఖ దుఃఖాత్మక మగు సంసారము నుండి విముక్తము అని అర్థము. ఆత్మ సదా ఆనందము అని మనమంటాము. అంటే, ఆత్మ పూర్ణము, అపరిచ్ఛిన్నము అని యర్థము. ఈ జ్ఞానము వ్యక్తిని కృత్స్న కర్మ కృత్‌గా మార్చివేయును. ఒకే ఒక ఆఘాతముతో చేయవలసిన పనులన్నీ పూర్తి అయిపోయినవి. అట్టి వ్యక్తి ఆనందముగా నుండుట కొరకై క్రొత్తగా చేయవలసినది ఏమియూ ఉండదు. అతడు వివిధ జన్మల నెత్తి చేయదగిన పనులన్నియూ కూడ నిర్వర్తింపబడినట్లే యగును. ఇక కర్తవ్యము లేమియూ మిగలవు. ఆపై అతడు చేపట్టు కర్మలన్నియూ ఆనందముతో చేసేవి మాత్రమే గాని, రక్షణను, సుఖమును పొందుటకు ఉద్దేశింపబడినవి కావు.

కర్త ఉన్నంత వరకు అకర్మ అనబడే దానిలో కూడ కర్మ ఉండును. ఈ సత్యమును బుద్ధిమంతుడు దర్శించ గల్గును. నేను ఏ పనినీ చేయుట లేదు అన్నప్పుడు కూడ కర్త గలడు. ఈ సత్యము నెరింగిన జ్ఞాని యొక్క దర్శనములో కర్మ, అకర్మలు రెండింటి యందు కర్మ ఉండును. కర్తృత్వము ఉన్నంత వరకు, ఏదో ఒక కర్మ ఉండనే ఉండును. కావున, కర్మయైనా, కర్మాభావమైనా కర్మయే యగును.

బుద్ధిమంతుని సాక్షాత్కారములో ఆత్మ యందు కర్తృత్వము లేదు (ఆత్మని కర్తృత్వాభావః) గనుక, అతడు కర్మ, అకర్మలు రెండింటి యందు అకర్మను చూడగల్గును. కర్త ఆత్మ కంటె భిన్నము కాదనియు, కాని ఆత్మ కర్మ కాదనియు అతడెరుంగును. అతనికి / ఆమెకు ఈ జ్ఞానము కలదు గనుకనే, అతడు/ఆమె మనుష్యులలో బుద్ధిమంతుడనియు (బుద్ధిమాన్ మనుష్యేషు), చేయవలసిన కర్తవ్యముల నన్నిటినీ ఒక్కటి కూడ విడువకుండగా నిర్వర్తించిన వాడనియు (సః కృత్స్న కర్మ కృత్) వర్ణింపబడెను.

కర్త లేనిచో, కర్మ లేదు

ఆత్మ యందు కర్తయే లేనప్పుడు, జ్ఞానికి చేయదగిన కర్తవ్యము లేమి యుండును? నేను కర్తను గానప్పుడు, నాల్గు వేదములు కలిసి విధించినను, కర్మను ఎట్లు చేయగల్గుదును? వేదములు 'ఓ కర్తా! ఈ యాగమును చేయుము' అని సంబోధించినపుడు, నేను కర్తనైతే, ఆ విధిచే ప్రేరితుడనై కర్మను ఆచరించాలి. ఓ రామా! ఇటు రమ్ము అని పిలిస్తే, రాముడు మాత్రమే వస్తాడు. ఇతరులు రారు. ఒక వ్యక్తిని పేరు పెట్టి పిలిచిన తీరుననే, వేదములు కూడ వ్యక్తుల నుద్దేశించి, ఓయీ వ్యక్తీ! ఈ కర్మ నాచరింపుము (కర్మ కురు) అని సంబోధించును.

వేదములు సంబోధించే యీ వ్యక్తి ఎవరు? సచ్చిదానంద ఆత్మయా? లేక, కర్తయా? వేదములు నిశ్చితముగా కర్తను సంబోధించుచున్నవి. కర్తయే లేనిచో యేమగును? వేదముల సంబోధనకు ప్రతి క్రియ, లేక ప్రత్యుత్తరము (response) ఉండదు. కర్తృత్వ భావనయే లేని జ్ఞాని వేద విధులచే ప్రేరితుడు గాడు. కర్త ఉన్నప్పుడు మాత్రమే, వేద విధులు సార్థకమగును; లేనిచో, అవి నిరర్థకము లగును. కృత్స్న-కర్మ-కృత్ యగు జ్ఞాని సర్వ కర్మలను చేసినట్లే. కావున, కర్తయే లేనిచో, వేద చోదన నిరర్థకమగును. కర్మ యోగము కూడ జ్ఞాని విషయములో వర్తించదు.

కర్మయోగము జ్ఞాని కొరకు గాదు

కర్మల విషయంలోనూ, వాటి ఫలాల విషయంలోనూ సముచితమగు మానసిక భావన (attitude) గలవాడై, తన కర్తవ్యాలను నిర్వర్తిస్తూ, తద్వారా స్వీయ రాగ ద్వేషములను నియంత్రించుకునే వ్యక్తి కర్మయోగి యనబడును. కర్మయోగి యందు కర్తృత్వ భావన ఉండును. వేదోక్త కర్మలను కొన్ని విశిష్ట ఫలముల కొరకై ఆచరించే కర్మిష్ఠి యందు కూడ కర్తృత్వ భావన ఉండును. వీరిద్దరిని ఉద్దేశించి మాత్రమే వేదచోదన ప్రవర్తిల్లును. ఆత్మను అకర్తగా దర్శించే జ్ఞాని మాత్రమే వేదములలోని విధి వాక్యములకు విధేయుడు గాడు. వేదములు కర్మలను విధించేది జ్ఞాని కొరకు గాదు.

నేను అకర్తనైనచో, వేదములలోని విధులు గాని, ఇతర విధులు గాని నన్ను స్పృశింపజాలవు. కనుక, జ్ఞానోదయమునకు పూర్వము చేయదగిన విధులనన్నింటినీ, జ్ఞానము కలిగిన వెంటనే

నిర్వర్తించినట్లే అగును (కృత్స్న-కర్మ-కృత్). నాకు కర్తవ్యములు అనేవి మిగిలి ఉండవు. జ్ఞానోదయము తరువాత చేయదగిన కర్మలను కూడ చేసినట్లే అగును.

జ్ఞానము కంటె పూర్వము నేను చేసే కర్మలన్నీ నా సుఖము కొరకు ఉద్దేశింపబడినవి. నాకు కొంత ఉత్సాహము, ప్రశాంతత, అంతఃకరణ శుద్ధి కావాలి. అట్టి శుద్ధమగు మనస్సుతో నేను కర్మ యందు అకర్మ దర్శనరూపమగు (కర్మణి అకర్మ దర్శనమ్) జ్ఞానమును సాధించగల్గుతాను. కర్మ యందు అకర్మను దర్శించుట యనగా ఆత్మరూపుడనగు నేను అకర్తనని యెరుంగుటయే. కావున, నేను విహితములగు కర్మల నన్నిటినీ ఆత్మ జ్ఞానము కొరకు మాత్రమే ఆచరిస్తాను.

కొన్ని కర్మలు విశిష్ట కామనలు గల కర్మి కొరకు మాత్రమే విధింపబడినవి. ఆత్మ జ్ఞానము నందు అభిరుచి లేని కర్మి కామనా పరిపూర్తి కొరకై ఈ కర్మల నాచరించాలి. ఇట్టి వ్యక్తికి తనలో తనకు ఏదో ఒక లోటు కన్పట్టును. దాని నుండి కొన్ని కామనలు బయల్దేరును. వాటి కొరకు కొన్ని కర్మలను చేయవలసి యుండును. కాని, ఆత్మ పూర్ణము, పరిచ్ఛేద రహితము, పర్యాప్తము అని నీవు యెరింగినచో, అపుడు కామన లేదు; కర్మ లేదు. వాస్తవంలో ఆత్మ పూర్ణము గనుక, పర్యాప్తము, అపర్యాప్తము ఇత్యాది పదముల ప్రసక్తియే ఉండదు. కావున, ఇట్టి జ్ఞానము గల వ్యక్తికి కర్తవ్యమేమియూ ఉండదు (కార్యం కర్మ న విద్యతే).

మనస్సు, అనగా అహంకారము ఆత్మలో లయమైనప్పుడు, అట్టి వ్యక్తికి కర్తవ్యమేమియూ ఉండదు. జ్ఞానోదయము కలుగుట తోడనే 'నేను' అనే ధారణ (అహంకారము; అదియే కర్త) ఆత్మయందు ఐక్యమగును. తదుపరి ఆత్మ కర్తయనే భ్రాంతికి చోటు ఉండదు. కర్త లేదు గనుక, కర్తవ్యములు ఉండవు. ఇందువలననే, జ్ఞాని కృత్స్న-కర్మ-కృత్ అనబడును. అనగా, జ్ఞాని గడచిన కాలములోనే గాక, రాబోవు కాలములో కూడ చేయవలసిన కర్మలనన్నిటినీ చేసినట్లే.

జ్ఞానికి ఇచ్ఛాశక్తితో ప్రయోజనము తీరిపోయినది

జ్ఞానికి కర్తవ్యమేమియూ మిగలదు. జ్ఞానికి ప్రత్యేకముగా చేయదగినది ఏదీ లేదు గనుక, అతనికి ఏదైనా చేయుటకు స్వాతంత్ర్యము గలదు. చేయవలసినది ఏదీ లేనప్పుడు, చేయకూడనిది ఏమి ఉండును? ఇక నిషేధ ప్రస్తావనికి వస్తే, జ్ఞాని విషయంలో 'ఇది

చేయకూడనిది' అనే నిషేధమేదీ లేదు. జ్ఞాని కృతకృత్యుడు. ఆయనకు ఇచ్ఛ, సంకల్పము, ఆకాంక్ష అనేది ఏదీ మిగలదు. జ్ఞానోదయాత్పూర్వము ఆయనకు ఉండే సంకల్పశక్తిని ఆయన సద్వినియోగం చేసేడు. అక్కడితో దాని ప్రయోజనము తీరినది.

ఇందువలననే సన్న్యాసులు మరణించేటప్పుడు వీలునామాలను వ్రాయరు. వీలునామా వ్రాయవలసిన ఆకాంక్షలు వారికి ఉండవు. ఇచ్ఛలు, ఆకాంక్షలు ఉంటేనే, వీలునామా అవసరమవుతుంది! శిష్యులధికంగా గల సన్న్యాసుల విషయంలో, వీలునామా లేకపోవుట వలన, ఒకప్పుడు సమస్యలు తలయెత్తవచ్చును. ఆయన తరువాత ఆయన పీఠంలో ఎవరు ఉండాలి ఇత్యాది విషయాలు వివాదాస్పదములు కావచ్చును. కాని, అట్టి సన్న్యాసి సాంప్రదాయిక సన్న్యాసి (పరంపరా సన్న్యాసి) అయి ఉండి, శిష్యులకు సరిగా బోధించినచో, ఇట్టి సమస్య ఉదయించదు. అట్టి సన్న్యాసికి పీఠము అనేది ఉండదు గనుక, పదవికోసం వివాదం కూడా ఉండదు. పదవి ఉండాలంటే సంస్థ ఉండాలి. కాని, సంస్థయే ఉండదు. వాస్తవంలో, ప్రతి శిష్యుడు ఒక పీఠం అవుతాడు.

హిందూ సంప్రదాయం (వైదిక ధర్మము)లో పోపు, డయోసిస్, పారిష్ ఇత్యాది ధర్మాధికారి వ్యవస్థ లేదు. ధర్మము సంస్థలకు అతీతమైనది. అట్టి ధర్మములోని వ్యక్తి గనుక, సన్న్యాసి కూడా సంస్థలకు అతీతుడు. ఆకాశమే పైకప్పు, భూమియే ఇల్లుగా జీవించు వ్యక్తి సన్న్యాసి యనబడును. ఉన్న సంస్థ అంతా అతడు మాత్రమే. అతనికి శిష్యులున్నచో, వారిలో ప్రతి ఒక్కడు ఒక సంస్థ. పరంపర, సంప్రదాయము ఇటులనే యుండును. ఇచటి సంస్థ సువ్యవస్థితమైన, స్పష్టమైన ఆలోచన మాత్రమే. సన్న్యాసికి ఉపనిషద్, గీత ఇత్యాది పుస్తకములతో కూడ పనిలేదు. సర్వము అతని బుద్ధిలో జ్ఞానరూపమున నుండును. పీఠము అతని కంటె వేరుగా లేదు. అతని బుద్ధి కంటె వేరుగా పీఠాధిపత్యము లేదు.

మోక్షము అనగా జీవత్వము తొలగిపోవుట

జ్ఞానియగు వ్యక్తికి ఆత్మ జ్ఞానము ఉదయించుట తోడనే కర్తవ్యము పూర్తి అయినది. అతనిలో ఇచ్ఛాసంకల్పములు మిగిలి యుండవు. అతని సంకల్పము పూర్తిగా వినియుక్తమైనది. బ్యాంకులో ఖాతాను ఉంచినంతవరకు మాత్రమే చెక్కు పుస్తకము ఉపకరించును. ఖాతాను మూసివేసిన తరువాత, చెక్కు పుస్తకములో మిగిలి యున్న చెక్కుల వలన ప్రయోజనమేమి గలదు?

వాటి వలన ఉపయోగము లేదు. వాటిని నీవు నింపి ప్రజలకు ఈయవచ్చును. కాని, అవి నిరర్థకములు. అటులనే, మోక్షము లభించుట తోడనే, సంకల్పము నిరర్థకమగును. ఖాతా మూసివేయబడినది. అకౌంటెంట్ ఖాతాదారు పేరుని ఎర్రసిరాతో కొట్టివేసి, ఆ ఫైలును మూసివేసినాడు. మరియొక జీవుడు అంతర్ధానమైనాడు. ఆ జీవునితో బాటు అతని కర్మల డిపాజిట్లులు మటుమాయమైనవి. ఆ డిపాజిట్లను 'ఇవి నావి' అని ప్రకటించే హక్కుదారు లేడు. ఒక వ్యక్తి మరణించగానే, అతని ఫైలు మూసివేయబడును. ఆ జీవుని విషయములో ఉత్తర ప్రత్యుత్తరములు పూర్తిగా ఆగిపోవును. ఆ జీవుని కర్మకు హక్కుదారులుగా ఎవ్వరూ ముందుకు రారు. అంతా సమాప్తమైనది. అతని ఫైలు చీలికలుగా చింపి తగులబెట్టబడినది. దాని శకలములు కూడా మిగలవు. కావున, అట్టి వ్యక్తి కృత్స్న- కర్మ- కృత్ అనబడును. మోక్షమును పొందిన జ్ఞానికి కర్తవ్యము లేమియూ మిగలవు.

వేదాంతములో పూర్వ పక్షములను ప్రతిపాదించే పద్ధతి

శ్రీ శంకరులీ సందర్భములో, చిన్నదే అయినా శాస్త్రములో ఉన్నతస్థాయికి చెందిన పూర్వ పక్షము నొకదానిని ప్రస్తావించిరి. ఈ శ్లోకమునకు కొన్ని సందర్భములలో ఈయబడే మరియొక తరహా వ్యాఖ్యానము ఈ పూర్వ పక్షమునకు ఆధారమైనది.

వేదాంతములో పూర్వ పక్షములను అనేక విధములుగా లేవనెత్తుతారు. కొన్ని దర్శనములు మాకు సానుకూలములుగా ఉంటూనే, కొన్ని అంశాలలో మాతో విభేదిస్తాయి. దీనికి సాంఖ్య, వైశేషిక దర్శనములు దృష్టాంతము. పూర్వ మీమాంసకుడు అను పేర మరియొకడు గలడు. వానితో మాకు మరికొంత దగ్గర సంబంధము గలదు. వేద వాక్యముల విశ్లేషణకు మీమాంస యని పేరు. వేదములోని పూర్వ భాగమైన కర్మ కాండను విశ్లేషణ చేసిన మీమాంస పూర్వ మీమాంస కాగా, ఉత్తర భాగ విశ్లేషణకు ఉత్తర మీమాంస లేక వేదాంతము అని పేరు.

వివాదములో కూడిన యీ సహభాగులే గాక, వేదాంతముతో పూర్ణముగా విరోధించే ప్రతిపక్షులు గలరు. వీరిలో బౌద్ధులు, జైనులు గలరు. వీరికి ప్రత్యేక దర్శనములు గలవు. వీరికి కూడ సమాధానమును చెప్పవలసి యున్నది. వేదాంతమును అర్థం చేసుకోవాలంటే, ఈ ప్రతిపక్షులందరి వాదములను విశ్లేషించాలి. వీరిలో కొందరు శాశ్వత వివాదము గల సహభాగులు కాగా, మరికొందరు నకిలీ యుద్ధమును చేస్తారు. మరికొందరు ఆహ్వానిస్తే మాత్రమే తమ వాదమును వినిపిస్తారు.

పూర్వ మీమాంసా దర్శనము మిక్కిలి సరళమైనది. వేదము నిత్యము; ప్రమాణ మూర్ధన్యము. వీరి దర్శనము ప్రకారం, వేదము మనలను కర్మలయందు మాత్రమే ప్రేరేపించును. వీరి దృష్టిలో జ్ఞానము మోక్షము కాదు. మోక్షమును పొందే ఏకైక సాధనము కర్మ. పూర్వమీమాంసకుడు ప్రమాణ విశ్లేషణములో దిట్ట. కాన, మనము వారి వాదమును వేదాంతములో వినియోగించుకుంటాము.

పూర్వ మీమాంసకుల వాదము

పూర్వ మీమాంసా దర్శనరీత్యా వాక్యములన్నింటికీ ముఖ్య తాత్పర్యము క్రియ. కావున, వాక్యములు సిద్ధ వస్తువులను తాత్పర్యముగా బోధించవు. వేదములోని వాక్యములన్నీ కర్తవ్యమును బోధించునవి (విధివాక్యములు), లేదా నిషిద్ధమును నిషేధించునవి (నిషేధవాక్యములు) అని గ్రహించాలి. వస్తువు యొక్క స్వరూపమును బోధించే వాక్యము లేమైనా ఉంటే, అవి విధి వాక్యమునందు గాని, నిషేధ వాక్యము నందుగాని, శేషము (అప్రధానము) గా అన్వయిస్తాయి.

ఈ కర్మ మీమాంస చాల ప్రముఖమైనది. ఏలయన, మానవ మస్తిష్కము కర్మలకు అభిముఖముగ నుండును. సోమరిపోతుల మనస్సు కూడా అటులనే యుండును. సోమరిపోతు తాను చేయవలసి యుండి, చేయలేకపోయిన కర్మల చేత క్లిన్నుడగును. ఈ విధంగా క్రియాశీలి, సోమరి వీరిద్దరు కూడ కర్మలకు అభిముఖముగ నుందురు. అంటే, 'కర్తవ్యము కలదు' అను మాట సర్వులకు సమానముగా అన్వయించును.

పూర్వ మీమాంసకుల దృష్టికోణము ననుసరించి, నిత్యనైమిత్తిక కర్మానుష్ఠానము మాత్రమే మోక్షము నీయగలదు. ప్రతిదినము చేయదగిన వైదిక కర్మలు, మరియు తప్పక నిర్వర్తించవలసిన విధులు నిత్యకర్మ లనబడును. గ్రహణము ఇత్యాది విశిష్ట సందర్భములలో చేయవలసిన కర్మలు నైమిత్తిక కర్మలనబడును. ఈ నిత్య నైమిత్తిక కర్మలను ప్రతి వ్యక్తి ఆచరించాలి.

కొన్ని ప్రత్యేక కామనల పరిపూర్తి కొరకై వేదము కొన్ని కర్మలను ఉపదేశించును. వీటికి కామ్యకర్మలని పేరు. ముముక్షువు ఈ కామ్యకర్మలను వీడవలెనని మీమాంసకుల అభిమతము. తప్పక చేయదగిన విధులను మాత్రమే నిర్వర్తించాలి. అట్లు చేయుట వలన పుణ్యపాపములు రెండు పరిహరింపబడతాయి. కామ్యకర్మలను వీడుట వలన పుణ్యము పరిహరింపబడును.

నిషిద్ధ కర్మలను త్యజించుట వలన పాపము దూరమగును. ఈ దేహము లభించుటకు హేతువైన ప్రారబ్ధకర్మ, మన ప్రమేయమేమియూ లేకుండగనే, తనంతటానుగా ఖర్చు అయిపోవును. కర్మ క్షయమైపోగానే, దేహము పతనమగును. పుణ్యపాపములను పరిహరించిన కారణంగా, నూతన దేహారంభకమగు కర్మ ఉండదు. ఈ విధంగా, మనము చేయవలసిన పని ఇంత మాత్రమే - ప్రతిదినము భోజనము చేయుచుండుట, నిత్య నైమిత్తిక కర్మల నాచరించుట. ఇదియే కర్మ ద్వారా మోక్షము లభించే సరళమైన ఉపాయము. ఇది పూర్వమీమాంసకుల వాదము.

నిత్య కర్మ, నైమిత్తిక కర్మ అనే రెండు రకముల కర్మలు కర్తవ్యకర్మలు. ఇవి కర్తవ్యకర్మలు గనుక, వీటిని ఆచరించుట వలన ఫలమేదియూ లభించదు; అనగా, పుణ్యము నీయవు. ఈ కర్మలను చేయకపోతే మాత్రం, పాపం చుట్టుకుంటుంది. పూర్వమీమాంసకుల వాదములోని మూల సూత్రమిదియే.

ఒక కర్మను చేయకపోవుట వలన పాపము లభించుట యెట్లు పొసగును? దీనికొక దృష్టాంతము గలదు. స్నానం చేసిన వ్యక్తిని మనము గమనించము. అది సర్వజన సాధారణమైన కర్మ. "ఓ, నీవీ రోజు స్నానము చేసినట్లున్నావు" అని మనము అనము. కాని, ఒకడు స్నానము చేయలేదనుకొనుడు. ఈ లోపాన్ని అందరూ కాకపోయినా, కొందరైనా తప్పక గమనిస్తారు. ఇదే విధంగా, తప్పక చేయదగిన కర్మలను చేయకపోతే, పాపం వస్తుంది. చేస్తే, ఫలముండదు అని పూర్వ మీమాంసకులు వాదిస్తారు. నిత్యనైమిత్తిక కర్మల అనుష్ఠానము వలన ఫలము ఉండదు. వాటిని చేయకపోతే మాత్రం దుష్ఫలితము తప్పదు.

ఈ శ్లోకమును పూర్వమీమాంసకుల దృష్టి కోణముతో పరిశీలించవచ్చును. వారి అభిప్రాయములో 'కర్మణి అకర్మ యః పశ్యేత్' అను వాక్యములోని 'కర్మణి' అను పదమునకు 'నిత్యనైమిత్తికకర్మణి' (ప్రతిదినముచేయదగిన కర్మయందు, ప్రత్యేక సందర్భములలో చేయదగిన కర్మయందు) అని యర్థము. 'అకర్మ' యనగా ఫలమేమియూ లేకుండుట (ఫల- అభావ). కావున, ఈ వాక్యమునకు "నిత్యనైమిత్తిక కర్మల యందు అకర్మను అనగా ఫలాభావమును ఎవడు దర్శించునో, వాడే జ్ఞాని" అని యర్థము.

కర్త లేడు. ఫలము కూడా లేకపోతే, నిత్యనైమిత్తిక కర్మ కర్మయే కాకుండా పోతుంది గదా! అది సరి కాదు. కర్త గలడు. ఆత్మయే కర్త. కర్తృత్వమును నిరాకరించుట సరిగాదు. లేనిది

ఫలముకే మాత్రమే. ఫలము లేదు గనుక, కర్మ అకర్మ వంటిది యగును. ఇది పూర్వమీమాంసకుల వాదము.

ఫలము లేని యెడల కర్మల నేల చేయవలెను?

ఈ వాదమును వ్యావహారిక వ్యక్తి ఎవరైనా వింటే, ఇట్లు ప్రశ్నిస్తాడు: "ఫలము లేనిచో, నేనట్టి కర్మను యేల చేయవలెను? ఏపనినీ చేయకుండుట ఆహ్లాదకరముగ నుండును గదా! ఈ నిత్యనైమిత్తిక కర్మల నన్నిటినీ చేయుటకు చాల సమయం పడుతుంది. వాటికి ఫలమే లేని యెడల, వాటిని చేసే అవసరం నాకు లేదు". ఈ ధోరణి సరిగాదనియు, ఈ కర్మల నాచరించకపోతే, ప్రత్యవాయము సంప్రాప్తమగుననియు మీమాంసకుల సమాధానము; చాలమందికి నరకమంటే విపరీతమైన భయము గలదు. వారికి స్వర్గము మీద కాంక్ష ఉన్నా, లేకపోయినా, నరకాన్ని తప్పించుకొనేందుకైనా స్వర్గాన్ని కోరుకుంటారు. నరకము యొక్క వర్ణనలు వారి మనస్సులపై దృఢముగా ముద్రింపబడి యుండుటచే, వారు నరకము యొక్క తలంపును కూడ తట్టుకొనలేరు. దాని మాట వింటూనే, వారికి జ్వరం వస్తుంది. కనుక, స్వర్గమునకు వెళ్లుట ద్వారా, వారు నరకమును తప్పించుకొనగోర్తారు. వాస్తవంలో ఇట్టి స్వర్గ నరక వర్ణనలే మానవులను మతము ఒడిలోనికి చేరుస్తాయి. స్వర్గనరక భావనలను తీసివేస్తే, ఈ మతములు కుప్పకూల్తాయి. వాటికేసి చూచేవారు కూడ ఉండరు.

ఈ శ్లోకములోని 'కర్మణి అకర్మ' అను భాగమునకు "నీకు విధింపబడిన కర్మను నీవు ఆచరించకపోతే, నీకు పాపం చుట్టుకుంటుంది గనుక, నీవు దానిని తప్పక ఆచరించాలి" అని కొందరి వ్యాఖ్యానము. ఇక 'అకర్మణి కర్మ' అనుదానికి 'కర్తవ్యకర్మను చేయకపోవుట ప్రత్యవాయ జనకము' అని వీరు అర్థం చెప్తారు. ఈ వాదంలో, కర్తవ్యకర్మను చేయకపోతే, ఫలం పుట్టి, అది కర్మయగును. ఈ విధంగా, కర్మ అకర్మగను, అకర్మ కర్మగను మారినవి. అకర్మ నుండి ఫలము పుట్టును. కర్మనుండి ఫలము పుట్టదు. ఇట్టి దర్శనము గల వ్యక్తి మానవులలో బుద్ధిమంతుడు; తన కర్తవ్యములనన్నిటినీ నిర్వర్తించిన వాడు (సః బుద్ధిమాన్ మనుష్యేషు సః యుక్తః కృత్స్న కర్మ కృత్). ఇది పూర్వ మీమాంసకుల వాదము. దీనికి శ్రీ శంకరులిట్లు సమాధానము నిచ్చిరి.

శ్రీ శంకరుల సమాధానము

చేసిన కర్మకు ఫలము లేక, చేయనిదానికి ఫలం వచ్చే పక్షంలో, కర్మలను చేయవలసిన ఆవశ్యకత యేమున్నది? చేయని కర్మ వలన ఏవేని దృష్టఫలములుండవచ్చును. కాని, అది పుణ్యపాపరూపమగు అదృష్టఫలము నీయజాలదని శ్రీశంకరులు ప్రత్యుత్తరము నొసంగిరి.

కర్తవ్య కర్మను వీడుట వలన మానసిక సంఘర్షణ, చింత అనే దృష్టఫలము కలుగవచ్చును. ఉదాహరణకు, నీవు ఒక ఉత్తరం వ్రాయాలి. కాని వ్రాయలేదు. నీ మనస్సులో అశాంతి బయల్దేరును. ఇట్టి దృష్టఫలము లుండవచ్చును. కాని, పుణ్యపాపరూపమగు అదృష్ట ఫలములు కర్మను ఆచరించే వ్యక్తికి మాత్రమే లభిస్తాయి. చేయని కర్మ వలన అవి పుట్టవు.

ఇచట మనము పుణ్యపాపములను గురించి మాత్రమే చర్చిస్తున్నాము. చేయని కర్మకు పాపము కాని, పుణ్యము కాని ఉండజాలదు. చేసిన కర్మకు ఫలము తప్పదు. కర్మ ఉన్నంతవరకు, కర్మఫలము ఉండితీరును. నిత్యనైమిత్తిక కర్మలు కూడ పుణ్యరూపఫలమును ఇస్తాయి. కర్తవ్య కర్మ యేదైనా, చేస్తే ఫలం పుడుతుంది; చేయకపోతే, పాపం రాదు; దృష్టఫలములు మాత్రమే పుడతాయి.

కర్తవ్య కర్మను విడనాడిన సందర్భాలలో మనస్సులో కొంత చికాకు, ఏదో కోల్పోయిన భావన తప్పక ఉంటాయి. ఉదాహరణకు, మనం ప్రతినిత్యము ధ్యానం చేస్తే పుణ్యము తప్పక లభించును.

కాని, అలసత్వం కారణంగానో, లేక మరో కారణం చేతనో, ఈ పనిని మానివేస్తే, ఈ మానివేయుట వలన కొంత చికాకు కలుగవచ్చును. కాని, పాపం పుట్టదు. ధ్యానము చేయనందువలన నీకు మనస్సులో దుఃఖము కలుగవచ్చును. ఇంకో రోజు కూడా మానివేస్తే, మరింత అధికముగా దుఃఖము కలుగవచ్చును. కాని, ఇది దృష్టఫలమే గాని, అదృష్టఫలము గాదు.

చేయని కర్మకు ఫలము పుట్టదు. చేసిన కర్మకు మాత్రమే పుణ్య పాపరూపమగు అదృష్ట ఫలము ఉండును. ఆ కర్మ విహితమయినచో పుణ్యము, కానిచో పాపము లభించును.

చేయని కర్మ నుండి ఫలము పుట్టుట యనగా, ఉనికి లేని (అసత్) దాని నుండి సత్ పుట్టగల్గుట. అసత్ నుండి సత్ పుట్టుట, ఉనికియే లేని తల్లికి కొడుకు పుట్టుట వంటిది. ఇది సర్వప్రమాణ విరోధమని శ్రీ శంకరులు వర్ణించిరి. చేసిన కర్మలు ఫలము నీయవని చెప్పుట కూడా ఇట్టి విరోధమే. రాతిని విసిరి, దానికి ఫలముండకూడదని భావించుట సరిగాదు. ఆ కర్మకు ఫలము తప్పదు. ఆ రాయి ఎవరికైనా తగిల్తే, తెలుస్తుంది. ఏదో ఒక ఫలము ఉండితీరును. కావున, ప్రతి క్రియ లేని క్రియ అర్థం లేని వాదము.

ఇచట శ్రీ శంకరులు మరియొక వాదమును లేవనెత్తిరి. తాను అకర్తయని తెలిసినంత మాత్రాన, కర్మ చేసినా చేయకపోయినా, వ్యక్తి కృత్స్నకర్మకృత్ ఎట్లు కాగల్గును?

ఇచట మనము కర్మ, అకర్మల జ్ఞానము గురించి మాటలాడుచున్నాము. కాని, కేవల జ్ఞానము నుండి ఫలములు పుట్టవు. కర్మలను చేస్తే ఫలములు పుడతాయి. అట్లైతరి, జ్ఞాని కృత్స్న కర్మ కృత్ అని యెట్లు చెప్పవచ్చును? జ్ఞాని కర్తవ్యకర్మలను, నిషిద్ధ కర్మలను అన్నింటినీ యెరింగినవాడు (కృత్స్న కర్మ విద్ భవతి) అని చెప్పగలమే గాని, వాటి నన్నింటినీ చేసినవాడు అని చెప్పజాలము (న తు కృత్స్న కర్మ కృద్ భవతి).

చేయవలసినది ఏదీ లేదు; దర్శించవలసినది మాత్రమే గలదు

కృత్స్నకర్మకృత్ అను పదము సర్వమును సాధించిన, విముక్తుడైన, పూర్ణపురుషుని నిర్దేశించును. శ్రీకృష్ణ భగవానుడీ విషయమును ఈ శ్లోకములోనే గాక, ఇతఃపూర్వము కూడ చెప్పియుండెను. 'నీకు కర్మ, అకర్మల గురించి చెప్తాను. ఈ జ్ఞానము వలన నీవు మోక్షమును పొందగలవు (తత్తే కర్మ ప్రవక్ష్యా మియద్ జ్ఞాత్వా మోక్ష్యసే శుభాత్, 4.16)' అని శ్రీకృష్ణుడు అర్జునునితో చెప్పియుండెను. చేయవలసినది మిగిలి ఉండే పక్షంలో శ్రీకృష్ణుడు 'యద్ జ్ఞాత్వా (దేనిని తెలిసి)' స్థానంలో 'యత్ కృత్వా (దేనిని చేసి)' అని ప్రయోగించి యుండెడివాడు.

విశ్లేషణ (మీమాంస) చేసేటప్పుడు తత్పూర్వమందు చెప్పిన మాటలను దృష్టిలో ఉంచుకోవాలి. అట్లు గానిచో, విశ్లేషణయే లేదు. శ్రీకృష్ణుడు 'యద్ జ్ఞాత్వా' అనెను. 'కర్మ అనగా నేమి? అకర్మ యనగా నేమి? అను విషయములను తెలిసినచో' అని ఆయన అభిప్రాయము. ఈ యెరుక అంత సరళమైనది కాదు. కర్మ అంటే కేవల క్రియాచరణము మాత్రమే కాదు. అకర్మ యనగా కర్మాభావమనుకోరాదు. కర్మ, అకర్మల యథార్థస్వరూపమును

మనం తెలుసుకోవాలి. అట్లు తెలుసుకున్నచో, సర్వ అశుభముల నుండి (పుణ్య పాపముల నుండి) విముక్తి లభించును.

మనం కర్మలను చేసి తీరాలని పూర్వ మీమాంసకులు చెప్తారు. కాని, కర్మ, అకర్మల స్వరూపమును తెలియుట ద్వారా పుణ్యపాపములన్నింటి నుండి విముక్తి లభించునని యీ శ్లోకము చెప్పుచున్నది. దీనికే వాక్యార్థ విచారము అని పేరు. వాక్యమునకు తాత్పర్యమేమి? వాక్యమునకు మరియొక అర్థము గలదా? ఇత్యాదులు విచారింపబడును. మరియొక అర్థము సంభవమైనచో, ఆ అర్థములో మరియొక తత్త్వశాస్త్రము, దృష్టికోణము ప్రకటితమగును. ఈ శ్లోకములో, శ్రీ శంకరులు పూర్వ మీమాంసకుల దృష్టికోణమును విచారించి, అది ఈ శ్లోకము యొక్క తాత్పర్యము కాజాలదనియు, శ్రీకృష్ణుని అభిమతము అది కాదనియు త్రోసివుచ్చిరి.

ఈ శ్లోకములో శ్రీకృష్ణుడు జ్ఞానమును గురించి మాత్రమే వర్ణించుచుండెను. ఇట్టి జ్ఞానము గల వ్యక్తిని గురించి శ్రీకృష్ణుడు చేసిన వర్ణన తరువాతి శ్లోకములో కూడ కొనసాగుచున్నది:

అధ్యాయము 4, శ్లోకము 19:

यस्य सर्वे समारम्भाः कामसङ्कल्प वर्जिताः ।
ज्ञानाग्नि दग्ध कर्माणं तमाहुः पण्डितं बुधाः ॥ १९ ॥

యస్య సర్వే సమారంభాః కామసంకల్ప వర్జితాః
జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం తమాహుః పండితం బుధాః (19)

యస్య = యెవనియొక్క; **సర్వే** = అన్ని; **సమారంభాః** = ఉపక్రమములు; **కామ-సంకల్ప-వర్జితాః** = (ఫలముల కొరకు) కామన, మరియు సంకల్పముల నుండి విముక్తములై యుండునో; **జ్ఞాన-అగ్ని-దగ్ధ-కర్మాణం** = జ్ఞానమనే అగ్నిచేత భస్మము చేయబడిన కర్మలు గల; **తం** = వానిని; **బుధాః** = బుధులు; **పండితం** = పండితుడని; **ఆహుః** = చెప్పుదురు.

ఎవనియొక్క ఉపక్రమములన్నియూ కామన నుండి, సంకల్పము నుండి
విముక్తములై యుండునో, జ్ఞానమనే అగ్నిచేత భస్మము చేయబడిన
కర్మలు గల అట్టి వ్యక్తిని ఋషులు పండితుడని చెప్పుదురు. (19)

అకర్మలో కర్మను, కర్మలో అకర్మను చూడ సమర్థుడు అని పూర్వ శ్లోకములో వర్ణింపబడిన జ్ఞానియే మరల యీ శ్లోకములో స్తుతింపబడుచున్నాడు. ఇట్టి జ్ఞాని కర్మ, అకర్మల యాథార్థ్యము నెరుంగును. అకర్మ యనగా కేవల కర్మా భావ మాత్రము కాదనియు, తాను క్రియనాచరించే స్థితిలో కూడ అకర్త యగు ఆత్మయే యని ఎరుంగుట అకర్మ యనియు ఈ జ్ఞానికి విదితమే. ఈ ఆత్మజ్ఞానము వ్యక్తిని విముక్తుని, సర్వకర్మకృత్ (చేయవలసిన కర్తవ్యములనన్నిటినీ నిర్వర్తించినవాడు) ని చేయును.

క్రియకు, కార్య ప్రణాళికి గల భేదమును మనమిచట గుర్తించాలి. కార్యప్రణాళికలో, వివిధ స్థాయిలలో చేపట్టే అనేక క్రియలు ఇమిడియుండును. ప్రతి కార్య ప్రణాళి వెనుక ఒక యోజన ఉండును. ఈ యోజన ఆధారముగా ఒక నిర్ణీత లక్ష్యమును చేరుట కొరకై వివిధ క్రియలు చేపట్టబడును. ఇది గృహనిర్మాణము, వంట చేయుట, వ్యాపారము చేయుట ఇత్యాదిగా ఏదైనా కావచ్చును. ఇట్లు ఒక నిర్ణీత లక్ష్యము కొరకు చేపట్టబడే కార్య ప్రణాళికి ఒక ప్రారంభము ఉండును. ఇట్టి ఉపక్రమములకు 'సమారంభములు' అని పేరు.

జ్ఞాని ఏ కార్య ప్రణాళిని ప్రారంభించినా, కామ సంకల్ప వర్జితుడై ప్రారంభించును. ఒక వస్తువును సంపాదించాలనే కోరికకు 'కామము' అని పేరు. ఈ కామము వెనుక నుండే మానసిక శక్తికి 'సంకల్పము' అని పేరు. దీనిని సంపాదించుట ద్వారా, నేను దానిని సాధించగల్గుతాను ఇత్యాది మనోవృత్తులకు 'సంకల్పము' అని పేరు. జ్ఞాని కామసంకల్ప వర్జితమైన కార్యములను చేపట్టినపుడు ఎవరికి ఏమి ఒనగూరును? జ్ఞాని విషయంలో క్రియాశీలత అనేది సంభవమేనా?

జ్ఞానికి క్రియాశీలత ఉండునా?

జ్ఞాని కృత్స్నకర్మకృత్ అని ఇతఃపూర్వమే చెప్పబడినది. 'కృత్స్న కర్మకృత్' అనగా చేయవలసిన కార్యములన్నిటినీ నిర్వర్తించినవాడు అని యర్థము. అనగా అతడు చేయవలసినది ఏదీ మిగిలియుండలేదు. అతనికి సచ్చిదానంద ఆత్మయొక్క సాక్షాత్కారము గలదు. ఆత్మ అకర్తయని అతడు యెరుంగును. ఈ సాక్షాత్కారము గల జ్ఞాని అపరిచ్ఛిన్నుడు, పూర్ణుడు. ఇట్టి వ్యక్తికి క్రియాశీలత ఎట్లు సంభవించును?

మాటలాడుట, నడుచుట, చూచుట, వినుట, ఆలోచించుట ఇత్యాది క్రియలు అతనికి యెట్లు సంభవమగును? అతని కార్యములన్నియు పూర్తి అయినవి. అతని సంకల్ప శక్తి పూర్తిగా వినియోగింపబడి, ఖర్చు అయిపోయినది. సంకల్పశక్తి సార్థకమైనది. సంకల్పము లేనిచో, కామము లేదు. ఇట్టి వ్యక్తికి క్రియాశీలత ఎట్లు సంభవమగును?

మరియు, జ్ఞానికి క్రియాశీలత సంభవము కాని పక్షంలో, మాటలాడే వ్యక్తి ఎవరైనా ఆత్మను తెలియని వాడే! నిజానికి ఇట్టి వాదము కూడా ఒకటి గలదు. ఒక వ్యక్తి ఆత్మను గురించి మాటలాడుచున్నంతవరకు, అతనికి ఆత్మ తెలియనట్లే అని కొందరు భావిస్తారు. ఆత్మను గురించి తెలిసిన తరువాత, జ్ఞాని దానిని గురించి మాటలాడడని వీరు చెప్తారు. అంటే, ఆత్మ తెలియక ముందు ఆత్మను గురించి మాటలాడవచ్చును. కాని, ఆత్మ తెలిసిన తరువాత ఆత్మను గురించి మాటలాడకూడదు! భారతీయులలో కొందరి మనస్సులలో ఒక ధారణ గలదు. చూచేవాడు మాటలాడడు. మాటలాడే వాడు చూడజాలడు. ఈ ధారణమూలంగానే, భారతదేశంలో మౌనిబాబాల సంఖ్య అధికంగా కనపడుతుంది.

ఈ వాదము ప్రకారం, జ్ఞాని యగు వ్యక్తి ఏ పనినీ చేయడు; గాలిని కూడా పీల్చడు. గాలి పీల్చకపోవుట అంటే మరణమే. ఇట్టి స్థితిలో జ్ఞానము నెవడు గోరును? '' నేను నీకు జ్ఞానము నిస్తాను. కాని, అది నీకు సాక్షాత్కరిస్తూనే నీవు మరణిస్తావు '' అని నేను చెప్పితిననుకొనుడు. ''ఈ జ్ఞానము నాకెప్పుడు సాక్షాత్కరించును? '' అని నీవు సహజంగానే అడుగుతావు. '' నీకీ జ్ఞానము రేపుగాని, ఈ రోజు గాని, ఈ క్షణమైనా గాని సాక్షాత్కరించవచ్చును '' అని మాత్రమే నేను చెప్పగల్గుతాను. అది జ్ఞానము గనుక, నీకు ఎప్పుడైననూ సాక్షాత్కరించవచ్చును. దీని యర్థమేమన, నీవు రేపు గాని, ఈ రోజు గాని, లేదా ఈ క్షణంలోనైనా మరణిస్తావు. నా యీ మాటను విన్న నీవు '' స్వామీజీ, పన్నెండేళ్ల తరువాత మీరు యెక్కడ ఉంటారు? '' అని అడుగుతావు. అంటే, నీవు ఇంకో పన్నెండేళ్లు బ్రతకాలని నిర్ణయించుకున్నట్లు నాకు అర్థమవుతుంది. ఈ కాలము నీ ఇప్పటి వయస్సు మీదా, నీ వింకా ఎంత సాధించాలనుకుంటున్నావు అనే దానిమీదా ఆధారపడి మారుతూ ఉంటుంది. కాని ఒకటి మాత్రం ఖాయం. ఈ జ్ఞానమును పొందే ప్రక్రియను నీవు వాయిదా వేస్తావు. మరణించాలని ఎవ్వరూ కోరుకోరు. కావున, మరణముతో సమానమైన ఇట్టి మోక్షము నందు ఎవ్వరికీ అభిరుచి ఉండదనేది సత్యము. మానవులందరూ అమృతత్వమునే ఆకాంక్షిస్తారు. ''నీవు మరణించి అమృతత్వమును పొందుతావు '' అని నేను చెప్పినా, ఎవ్వరూ ముందుకు రారు. ప్రతి వ్యక్తి జీవించాలని, అదే సమయంలో అమరుడు కావాలని కోరుకుంటాడు.

హరిః ఓం తత్సత్

ఈ వాదము సత్యమే అయినచో, ఆచార్యుడే లేకుండును. తెలియనివారు మాత్రమే ఆచార్యులుగ నుండెడివారు. తెలిసినవాడు కృత్స్నకర్మకృత్ గనుక బోధింపజాలడు. ఇట్టి పరిస్థితి ఉండెడిది. తెలియనివాడు బోధించలేడు. బోధించుట కూడ ఒక కర్మయే గనుక, కృత్స్న కర్మ కృత్ కూడ బోధించలేడు. అపుడు బోధించేది యెవరు? కనుక, ఈ వాదములో 'కృత్స్న కర్మ కృత్' అను పదమునకు ఇచ్చు అర్థము సరిగాదు.

కృత్స్న కర్మ కృత్ అనగా అర్థము, చేయదగిన కర్తవ్యము లేమియు లేనివాడు అని అయినప్పటికీ, అట్టి వ్యక్తి కర్మలను వేటినీ ఆచరించడని అర్థం కాదు. శ్రీకృష్ణుడు రథమును నడిపెను. గీతను బోధించెను. శ్రీ శంకరులు ఎన్నో భాష్యములను వ్రాసిరి. వ్యాసుడు అనేక గ్రంథములను రచించెను. వారు తమకు తెలిసిన దానినే బోధించి యుందురు గదా! అనగా, వారు కర్మల నాచరించిరి. కనీసం వాగ్రూపములోనైనా, వారి యందు క్రియాశీలత అధికముగా నుండెను. అట్టి స్థితిలో, బోధించే ఆచార్యుడు కృత్స్న కర్మ కృత్ అని యెట్లు చెప్పవచ్చును?

జ్ఞాని బోధించుటకు కారణమేమి?

ఆచార్యునకు కూడా చేయవలసిన కర్మ గలదు. ఆయన బోధించాలి. ఎందుకు బోధించాలి? బోధించుటలో ఏదో ఒక స్వప్రయోజనము ఉన్న కారణంగా బోధించునా? అట్లైనచో, ఆయనకు ఆత్మ తెలియలేదు. ఏలయన, '' ఆచార్యుడను నేనే; కాని, ఆత్మరూపుడనగు నేను ఆచార్యుడను కాను'' అనే జ్ఞానము కలిగి, బోధించే వ్యక్తి మాత్రమే యథార్థమగు ఆచార్యుడు. అట్టి జ్ఞాని మాత్రమే తాను బోధించే జ్ఞానము యొక్క అనుభవముతో బోధించును. ఈ జ్ఞానము సుస్పష్టముగా గల జ్ఞాని బోధించుటకు అభ్యంతరమేమున్నది?

జ్ఞాని ఏల బోధించవలెను? అని నీవు ప్రశ్నిస్తే, ఏల బోధించరాదు? అని నేను ప్రశ్నిస్తాను. బోధించుట వలన, ఆయన తన స్వస్థితి నుండి చ్యుతుడు కాడు. ఆయన కర్మలో అకర్మను దర్శించును. నీకు నీ ఆత్మ గురించి ఏమి తెలిసినా, ఎంత తెలిసినా, ఆత్మ సర్వదా ఉండును. వ్యక్తి తన ఆత్మ నుండి వేరుగా బయటకు రాలేడు. నీకు ఏమి తెలిసినా, ఎంత తెలిసినా, నీవు ఉన్నావు. కావున, ఒక వ్యక్తి, '' నేను సచ్చిదానందుడను; అకర్తను '' అని తెలుసుకున్నచో, ఆ యెరుకలో భ్రాంతికి చోటులేదు. అట్టి వ్యక్తి అన్నివేళలా, కర్మలన్నింటిలో అకర్మను దర్శించును. అట్టి వ్యక్తి ఏల బోధించరాదు? ఇతర కర్మలను ఏల ఆచరించరాదు? తాను బోధింపకుండుటకు తగిన కారణము లేకపోవుట చేతనే, జ్ఞాని బోధించును. వాస్తవంలో, ఆచార్యుడు బోధించుటకు ఇదియే ఏకైక కారణము. వినేవాడు,

నేర్చుకునేవాడు ఉంటే, ఆచార్యుడు ఏల బోధించరాదు? బోధించుటకు మరియొకటి కారణము కారాదు. నేర్చుకోవాలనే కోరిక గలవాడు ఉన్నాడు. కాన, జ్ఞాని యగు వ్యక్తి బోధించును. దీనిలో ఇంతకంటె పెద్ద కారణము లేమీ లేవు.

కర్మ బంధము అని ఎవరైనా భావిస్తే, వారి విషయంలో ఆ కర్మ సత్యమగును. కొన్ని కర్మలు బంధకములు, మరికొన్ని కావు అంటే, అదంతా అయోమయంగా, అస్తవ్యస్తంగా తయారవుతుంది. ఈ అయోమయం నుండి బయట పడాలంటే, కర్మను గురించి తెలుసుకోవాలి. కర్మ, అకర్మలు తెలియని వారు, ''వేదాంత శాస్త్రము ఒక సిద్ధాంతము మాత్రమే; కర్మ మాత్రమే మోక్షము నిచ్చును'' అని చెప్తారు. కర్మ, అకర్మల విషయములో మహాత్ములు కూడా భ్రాంతి పడతారని శ్రీకృష్ణుడు స్వయముగా చెప్పెను (4-16).

కర్మ అనేది సరళమైన విషయ వస్తువు కాదు. దానిని తెలియుట తేలిక కాదు. గంభీర చింతకులగు మహాత్ములు కూడ దానిని తెలియజాలక దారి తప్పిన సందర్భములు అనేకములు గలవు. ఈ విషయవస్తువు యొక్క అజ్ఞానము నుండి ఎన్నో సంస్థలు, సామాజిక సేవా కార్యక్రమములు బయల్దేరినవి. కావున, కర్మ తప్పక తెలియదగిన విషయము.

కర్మ, అకర్మలు తెలిసిన వ్యక్తికి ఆత్మ అకర్త యని తెలియును. అతడు కర్మలో అకర్మను దర్శించును. కాన, బోధన క్రియయే అయినా, అతని దృష్టిలో అట్లు గాదు.

ఇట్టి వ్యక్తికి కర్మ లేదు; అకర్మ లేదు; కామము, సంకల్పము ఇత్యాదులేమియూ లేవు. బోధించాలనే ఇచ్ఛ కూడా లేదు. ఈ ఉపదేశము యొక్క స్వరూపము నెరింగిన జ్ఞానికి బోధించే అవకాశము రాకపోయినా, అతడు నష్టపోయే దేమీ లేదు. ఒంటరితనము, ఏమి చేయాలో తెలియని స్థితి అనునవి అతని దరికి చేరవు.

'జగత్తును రక్షించుటకై బోధించుట' అనే భావన భ్రాంతి తప్ప వేరొకటి గాదు

'జగత్తును రక్షించుట కొరకై నేను బోధిస్తున్నాను' అని యెవరైనా భావిస్తే, అతడు గొప్ప భ్రాంతికి వశవర్తియై ఉన్నాడు. వాస్తవంలో, అతనికి మాత్రమే రక్షణ అవసరము. పైగా, అట్టి వ్యక్తుల బారిని పడకుండా జగత్తు రక్షింపబడాలి. ఇట్టి స్వయం నియుక్త జగద్రక్షకులు అనేక సమస్యలను సృష్టిస్తారు. '' భగవంతుడు జగద్రక్షణ కొరకై నన్ను నియోగించినాడు'' అని ఎవరైనా భావిస్తే, వారిని

ఒక ప్రశ్న అడగాలి. ''భగవంతుడు ఈ పని కొరకై నిన్ను నియోగింప బని యేమి? జగత్తును ఆయన స్వయముగనే రక్షించగలడు''. తాను సర్వశక్తిమంతుడై యుండి, జగద్రక్షణ కొరకు మరియొకనిని నియోగించే భగవంతుడు యెట్టి భగవంతుడు? సర్వశక్తిమంతుడగు భగవానునకు మధ్యవర్తులతో పని యేమి?

'నే నీ ప్రపంచమును రక్షిస్తాను' అనేది భ్రాంతులలో కెల్లా పెద్ద భ్రాంతి. నీ జీవితం సాఫీగా కొనసాగాలంటే, ఈ పూర్ణ సమాజము అవశ్యకమగును. అనేక జనులు శ్రమ చేసి, ఆహారమును ఉత్పత్తి చేస్తారు. బట్టలను నేస్తారు. ఇళ్లను నిర్మిస్తారు. వారి మూలంగానే నీకు భోజనము, వస్త్రము, ఇల్లు సమకూరినవి. ఇట్టి స్థితిలో, నీవు ప్రపంచమును రక్షిస్తావనే మాట యెట్లు పొసగును? ఇతరులను రక్షించుటకు నీవెవరివి? నీవు కూడ ఇతరులతో సమముగా నిస్సహాయుడవే. నీవు రక్షించగల్గిన వ్యక్తి యెవ్వరు? నీవు రక్షించగలిగేది యేది?

దీనికి భిన్నమైన ధారణ మరియొకటి గలదు. నీవద్ద కొంత సంపద ఉన్నది. నీవు దానిలో కొంత భాగమును ఇతరులకు ఇచ్చినా, నీకు లోటు లేదు. అది అవసరమైన వ్యక్తులు కూడ గలరు. నీవిచ్చిన దానితో అతని అవసరం తీరుతుంది. దీనిలో సమస్యలేదు. ఇది మానవత్వమునకు సంబంధించిన సరళమైన విషయము. అంతేగాని, ప్రపంచమును ఎవరో ఒకరు రక్షించుట అనే ప్రసక్తియే లేదు. ఇట్టి భావనకు మూలము భ్రాంతి, అహంకారము.

ఈ ప్రపంచము ఈ నాటి వరకు నీవు లేకుండగనే మనగల్గినది. ఇవుడు కూడా, ఈ ప్రపంచం నిన్ను సహిస్తూ ఉన్నా మనగల్గుతోంది. ఇంతకీ నీవు ఎంతమందిని రక్షిస్తావు? అట్లుగాక, 'నా వద్ద ఉన్నదానిని అవసరముగల మరియొకరితో పంచుకొనుటకు నేను సిద్ధమే' అని నీవన్నచో, నీవు పరిణతి చెందిన మానవుడవు. ప్రతి వ్యక్తి తన వద్ద నున్న సంపదను ఇతరులకు పంచి, తాను అనుభవించాలి. నీవు ఒకరికి మాత్రమే పంచి ఈయగలవా? లేక, వేయిమందికి పంచి ఈయగలవా? అన్నది ప్రముఖమైన విషయము కాదు. పంచి యిచ్చుటకు నీవద్ద ధనము లేనిచో, నీవద్ద సమయము ఉండి యుండవచ్చును. నీవు దానినే పంచియిమ్ము. లేదా, అవసరమైన వారికి పంచి యిచ్చుటకు నీవద్ద కొద్ది మంచి మాటలు మాత్రమే ఉన్నచో, నీవు వాటినే పంచిపెట్టుము.

మంచి మాటలు అనగా ఇతరులలో ఆశలను రేకెత్తించేవి గావు; సువార్తలు గావు. ఇతర వ్యక్తిని యథాతథముగా, గుణ పరిశీలన జరపకుండా, నీవు అంగీకరిస్తున్నట్లు తెలిపే మాటలు మాత్రమే మంచి మాటలు అవుతాయి. ఆ వ్యక్తిని ఉన్నవానిని ఉన్నట్లుగా పూర్తిగా నీవు అంగీకరిస్తావు.

అంటే, నీ మాటలు అతని భవిష్యత్తునకు, లేక మరణానంతర జీవనము నకు మాత్రమే సంబంధించిన వాగ్దానరూపములు గావు. ఇట్టి నీ మాటలు అతని మనోధైర్యమును పెంపొందిస్తాయి. " ఈ లోకములో బాగుపడే ఆశ లేదు. కావున, మీరు నరకమునకు గాక, స్వర్గమునకువెళ్లే యత్నములను తప్పక ఆచరించవలెను" అని కొందరు బోధిస్తారు. ఇది యెక్కడి వేదాంతము? ఇట్టి బోధనలు ఎవరికి కావాలి? ఇట్టి ఉపదేశములు సమస్యను వాయిదా వేయుటకు మాత్రమే పనికి వస్తాయి. వాస్తవిక జీవితములో నిమగ్నులైన వారెవ్వరూ ఈ మాటలను వినరు. వ్యక్తికి తాను స్వీకారయోగ్యుడు అని నచ్చచెప్పే చల్లని మాటలు కావాలి.

నిన్ను నీవు రక్షించుకుంటే చాలు

'నన్ను యథాతథముగా అర్థం చేసుకునేవాడు ఒకడు గలడు. నేను ఆ వ్యక్తికి అంగీకార యోగ్యుడను' అని ఎవరైనా నాకు చెప్తే, ఆ మాటలు నాకు చాలా నచ్చుతాయి. నన్ను అంగీకరించే వాతావరణమును ఈ మాటలు సృష్టిస్తాయి. ఎవరికైనా కావలసినదింతే. ఒకరు మరియొకనిని రక్షించే దేమీ లేదు. మనము కొంతమంది వ్యక్తులను గాని, లేక జగత్తును గాని రక్షించుటకై వేదాంతమును అధ్యయనము చేయుట లేదు. 'నేను పెద్ద సంఖ్యలో ప్రజలను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతాను. అపుడు సమాజములో పరివర్తనము కల్గును' అనునది పెద్ద భ్రాంతి. నీవు నీ దృష్టిలో దోషి, నిందితుడు కాని విధంగా రక్షించుకోగల్గితే, చాలును. దాని వలన, ఈ ప్రపంచములోని సమస్యలలో ఒకటి తగ్గును.

మరియు, మనము నవ్వుముఖంతో ఉంటే, మనలోని దుఃఖము ఇతరులకు ప్రసారితం కాకుండా ఉంటుంది. దుఃఖము తీవ్రమైన సంక్రామక రోగములలో నొకటి. తలుపులు, కిటికీలు దానిని ఆపలేవు. మనం ఇంటి తలుపులను, కిటికీలను బిగించి ఉంచినా, దుఃఖము ఏదో విధంగా లోపలికి ప్రవేశిస్తుంది. అది ప్రయాణించే విధానము విలక్షణమైనది. అది చీమ దూరేటంత సందు కూడా లేకపోయినా, ప్రవేశించగల్గుతుంది. కాబట్టి, ఆత్మతృప్తుడైన ఒక్క మనిషి ఉంటే, అతని వలన లోకానికి కలిగే ఉపకారము చాల గొప్పది. ఏలయన, అట్టి వ్యక్తి నుండి ఇతరులకు దుఃఖము ప్రసారితము కాదు.

'నా దుఃఖమును, ఇతరులకు ప్రసారితం కాని విధంగా, నాలోనే ఉంచుకుంటాను' అని నీవనవచ్చును. దీనివలన అదనపు సమస్యలు బయల్దేరుతాయి. క్రమంగా ఈ దుఃఖము పెరిగి క్రోధము, నిరాశా, నిస్పృహల రూపంలో బ్రద్దలయ్యే అవకాశమున్నది. కావున, నీవు నీ దుఃఖమును

నీలో దాచుకోకుండా ఉంటే మంచిది. దుఃఖమును త్రొక్కిపెట్టుకొనుట కంటె, ఎవరో ఒకరితో దానిని పంచుకొనుటయే మేలు.

కావున, నీవు నీ స్వీయబాధల నుండి నిన్ను రక్షించుకోగల్గితే చాలును. నీవు చేయగల్గినదింతే. నిన్ను పీడించేది ఈ ప్రపంచము కాదు. నిన్ను పీడించేది నీవు నిన్ను గురించి చేసుకునే ఆత్మదూషణము మాత్రమే. ఈ కారణముగనే, నీ ఉత్తమ మిత్రుడు నీవే; నీ బద్ధ శత్రువు కూడ నీవే అని చెప్తారు. నీవు నీ విషయంలో క్రూరంగా ఉండగలవు; దయతో కూడ ప్రవర్తించగలవు. నీవు నిన్ను నీ ఆత్మ కృతపీడనల నుండి రక్షించుకొనుటయే ముక్తి. ఆ ముక్తి నీలో ఉన్నచో, నిన్ను కొద్దిసేపు పరిశీలనగా చూడగల్గిన వ్యక్తి యెవరైనా, దానిని గుర్తించగల్గుతారు. ''నీలో ఇంతటి ప్రశాంతి యెచ్చటిది? నీ వద్ద ఏదో మహిమ గలదు. అది యేమిటో దయచేసి నాతో చెప్పుము'' అని ఇతరులు నీతో అంటారు.

జ్ఞానమునకు పేరు లేదు

వేదాంతము అనేది ఒక పేరు. కాని జ్ఞానమునకు పేరు లేదు. అది జ్ఞానము మాత్రమే. నీవు విముక్తునివలె భాసించుటను ఇతరులు గమనిస్తారు. దాని రహస్యమేమో తెలుసుకోవాలని వారు అనుకోవటం సహజమే. నీ మాటలో వారికి సత్యము ధ్వనిస్తుంది. వారిలోని గుణదోషాలను నీవు పరిశీలించవని, నీ మాట విశ్వసనీయమని వారికి అనిపిస్తే, వారు నీ నుండి చాలా తెలుసుకోవాలని ఆకాంక్షిస్తారు. ఈ ప్రపంచంలో ఇట్టి వ్యక్తి ఉన్నచో, అతని వద్దకు వెళ్ళి, అతి సహజముగా అతనికి శిష్యులు కాని వారెవ్వరు?

జ్ఞానులు ఆచార్యులు అయ్యే ప్రక్రియ ఈ విధంగా ఉంటుంది. బోధించాలనే ఆకాంక్ష వలన వారు ఆచార్యులు కారు. నేర్చుకోవాలనే కోరిక గలవారు ఉన్నారు గనుక, వారు ఆచార్యులు అవుతారు. జ్ఞాని ఏవో కొన్ని కార్యములను చేపట్టినా, వాటి వెనుక కామము కాని, సంకల్పము గాని ఉండవు.

జ్ఞానిని ఈ శ్లోకము 'జ్ఞాన–అగ్ని–దగ్ధ–కర్మా' (జ్ఞానమనే అగ్నిచేత దహింపబడిన కర్మలు గలవాడు) అనే మరో విశేషణంతో వర్ణించింది. ఈ జ్ఞానమును పొందిన వ్యక్తి యొక్క ఖాతాలో ఉన్న కర్మలన్నీ పూర్తిగా తుడిచివేయబడినవి. ఋషులు 'జ్ఞాని' అని వర్ణించే వ్యక్తి యొక్క స్వరూపమిట్టిది.

జ్ఞాని మాత్రమే మరియొక వ్యక్తిని గురించి జ్ఞాని అని చెప్పగలడు. జ్ఞాని కానివాడు మరియొకనిని జ్ఞాని యన్నచో, సమస్య యేర్పడును. జ్ఞాని కానివాడు జ్ఞానము గురించి తనకున్న కల్పనల ఆధారంగా జ్ఞానిని నిర్ణయిస్తాడు గనుక, సమస్యలు ఉదయించుట సహజమే. పూర్వ శ్లోకములో కృత్స్న-కర్మ-కృత్ అని వర్ణింపబడిన జ్ఞానియే ఈ శ్లోకములో పునఃప్రస్తావింపబడినాడు. అట్టి వ్యక్తిని బుధులు 'పండితుడు' అని అంటారు. ఇట్టి వ్యక్తి ఆత్మస్వరూపతః అకర్త యని దర్శించగల్గును. అకర్మను ఆత్మ స్వరూపముగా గుర్తించిన జ్ఞాని ఆత్మ యందు క్రియ సంభవము కాదనియు, ఆత్మ అకర్త యనియు గుర్తించగల్గును.

కర్త, క్రియ రెండూ ఆత్మయే

క్రియ జరిగే సమయంలో కూడా, కర్త ఆత్మయే. క్రియలు కూడా ఆత్మయే. కరణములు (క్రియకు ఉపకరించే సాధనములు) కూడా ఆత్మయే. సర్వము ఆత్మయే గనుక కర్త, కర్మ, కరణము అనే భేదము లేదు. ఆత్మ అకర్త. కావున, ఈ మూడింటికి మధ్య వాస్తవ భేదము లేదు. ఈ మూడు ఒక్కటియే. కాని, ఆత్మను కర్తగా పొరబడిన సమయంలో ఇతరము సర్వము కర్త కంటె భిన్నముగా భాసించును.

అట్లైనచో, కర్త యెవరు? స్థూలదేహము- ఇంద్రియములు-మనస్సు అనే సంఘాతమే కర్త. ఆత్మ కర్త యని భావించు వాని దృష్టిలో ఈ సంఘాతమే ఆత్మ. ఇదియే అంతిమ నిర్ణయమైన పక్షంలో, భేదములు తప్పవు. క్రియ కర్త నుండి ఉద్భవించును. క్రియలో విషయమయ్యేది కర్మ. కర్మ ఫలము కర్తకు ముట్టును. సంసార చక్రము, లేక కర్మ చక్రము అంటే అర్థము సరిగా ఇదియే.

తాను కర్త యని భావించే వ్యక్తి ' ఆత్మ యొక్క స్వరూపము అకర్మ; నేను నిష్క్రియమగు ఆత్మరూపుడను; నాకు క్రియా సంబంధము లేదు' అని గుర్తించగల్గితే, ఆ వ్యక్తికి కర్మ మిథ్యారూపమగును. కర్మ మిథ్య అయినచో, దాని కర్త, ఆ కర్మ యొక్క ఫలము, ఇతర కరణములు కూడ మిథ్యయగును. ఆత్మను ఈ రూపములో దర్శించే వ్యక్తికి ఆత్మ విషయంలో ఏకాలమందైనమా యథార్థమైన కర్తృత్వము ఉండదు. పూర్వ శ్లోకములోని ''కర్మణి అకర్మ యః పశ్యేత్ '' అను వాక్యమునకు తాత్పర్యమిదియే. కావున, కర్మలను ఆచరిస్తూనే, వాటి యందు అకర్మ ఆత్మ స్వరూపమును దర్శించగల్గిన వ్యక్తియే జ్ఞాని యనబడును.

ఈ దర్శనము ఒక విశిష్టస్థితి కాదు. ఇది ఒక గుర్తింపు. ఇది అకర్త్ర ఆత్మ యొక్క జ్ఞానము. ఇందువలననే, జ్ఞాని కృత్స్న కర్మ కృత్ అని వర్ణింపబడినాడు. తనను తాను కర్తృత్వ విముక్తునిగా దర్శింపగల్గిన వ్యక్తి తన కర్తవ్యముల నన్నింటినీ నిర్వర్తించిన వాడే యగును.

కృత్స్న–కర్మ–కృత్ అగు వ్యక్తి కామ, సంకల్పములు లేనివాడు (కామ సంకల్పవర్జితః) అని కూడ మనము చూచి యున్నాము. కామ సంకల్ప వర్జితుడు అనగా మనస్సులోని కామము చేత గాని, సంకల్పము చేత గాని ఏవిధముగానూ నియంత్రింపబడని వ్యక్తి అని యర్థము. అనగా, అతని కామము బంధహేతువగు కామము కాదు. అతనికి ఏదేని సంకల్పము ఉన్నా, అది బంధించేది కాదు.

జ్ఞానము జ్ఞానియొక్క కర్మను వశింపజేయును

నిప్పులలో వేయించిన గింజ అంకురించదు; ఫలము నీయదు. జ్ఞాని యొక్క కామ సంకల్పములు అట్టివి (దగ్ధ బీజవత్). గింజను నేలలో పాతితే, అది అంకురించి కొంతకాలం తర్వాత ఫలము నిచ్చును. అదే గింజను వేయిస్తే, తినటానికి మాత్రమే ఉపయోగిస్తుంది. దానిని నేలలో పాతితే, అంకురించదు. దీనినే దగ్ధబీజము అంటారు.

అదే తీరున, జ్ఞానియొక్క కర్మలన్నీ భోగము కొరకు (భోగార్థమ్) మాత్రమే పనికి వస్తాయి. జ్ఞానికి ప్రస్తుత దేహమును ఇచ్చిన ప్రారబ్ధకర్మ క్షయమయ్యే వరకు దేహము కొనసాగుతుంది. ఆత్మ అకర్తయని యెరింగిన జ్ఞాని చేసే కర్మలు ఏవైనా భోగమును, అనుభవమును మాత్రమే యిచ్చును. ఆ కర్మలు ప్రారబ్ధకర్మను క్షయింపజేయుటకు మాత్రమే పనికివస్తాయి. జ్ఞాని వాస్తవంలో అకర్త. కావున, అతని కర్మలకు ప్రత్యేక ఫలమేమీ ఉండదు. ఇట్టి వ్యక్తిని పండితుడనియు, జ్ఞానాగ్ని దగ్ధ కర్ముడనియు అందురు.

'జ్ఞానాగ్ని దగ్ధ కర్మా' అనునది జ్ఞానిని వర్ణించే మరియొక సమాస పదము. జ్ఞానము అగ్నితో పోల్చదగినది. జ్ఞానాగ్ని జ్ఞానియొక్క కర్మలనన్నింటినీ దహించివేయును. అందువలననే, జ్ఞాని 'జ్ఞానాగ్ని దగ్ధ కర్మా' అనబడును.

కర్మ జ్ఞానికి ఫలము నీయదు

జ్ఞాని చేసే కర్మల ఫలము ఆయనకు ప్రాప్తించదా? అని నీవు ప్రశ్నించవచ్చును. చెట్టును నరికితే, మరల చిగురు వస్తుంది. కాని, జ్ఞాని విషయంలో కర్మ నాశము అట్టిది కాదు. కర్మలు

పూర్ణముగా నశించును. వాటికి ఏమాత్రమూ ఉనికి ఉండదు. అంటే, అవి కాలి, భస్మమైపోయినట్లు భావించవచ్చును.

ఆత్మ అకర్త అనే జ్ఞానము కలుగనంతవరకు, కర్తయగు జీవుడు ఉండును. జీవత్వమునకు కారణము అజ్ఞానము గనుక, జీవుడు అనాది. అనగా, అజ్ఞానమునకు పుట్టుక లేదు గనుక, జీవునకు కూడ నిర్దిష్ట కాల జన్మ లేదు. జన్మ లేనిదానికి ఆది ఉండజాలదు. జీవుల కార్యకరణ సంఘాతములకు, జీవుడు బ్రతికే ప్రపంచమునకు మాత్రమే సృష్టి గలదు.

అనాది ఆత్మ – సృష్టి

చైతన్యము సృష్టింపబడేది కాదు. చైతన్యము ఆత్మయే. కావున, భగవానుడు ఆత్మను సృష్టించలేదు. మనము దేహములు అని వ్యవహరించే పదార్థములను మాత్రమే ఆయన సృష్టించెను. ఆయన వాటిని, అనేక ఇతర రూపములను కొన్ని నియమముల ననుసరించి, సృష్టించెను. ఈ సృష్టి జీవుని కొరకు ఉన్నది. కాని జీవుడు (వాస్తవంలో ఆత్మ కంటె వేరు గాదు) సృష్టింపబడలేదు. ఈ సృష్టిలో సృష్టింపబడని తత్త్వము ఒకటి గలదు. అదియే చైతన్యము, ఆత్మ. మిగిలిన సృష్టి అంతా జీవుని కర్మ మూలకంగా సృష్టింపబడినది.

ఈ కర్మ ఏల ఉన్నది? జీవుడు కర్త గనుక ఉన్నది. జీవుడు కర్త ఏల అయినాడు? అజ్ఞానము వలన. ఈ అజ్ఞానమునకు ఆది యేది? అజ్ఞానము అనాది. దానికి ఆరంభము లేదు. జీవునకు పుణ్యపాపముల (కర్మ ఫలము) ఖాతా ఒకటి గలదు.

జీవుడు ఈ కర్మ ఫలమును అసంఖ్యాకములగు జన్మలలో ప్రోగుచేసినాడు. ఈ జన్మల ఆదిని నిర్ణయించుట సాధ్యము కాదు. కావున, ఈ జన్మల సంఖ్య అనంతము అనుకోవచ్చును. విభిన్న కాలములలోని ఈ అనంత జన్మలలో జీవుడు అనంతకర్మల ఫలమును మూటగట్టినాడు. ఒక దేశములో, ఒక కాలములో, ఒక స్థూలదేహములో ఈ అనంత కర్మల ఫలమును అనుభవించుట అసంభవము. ఒక జన్మలో ఒక కర్మ సముదాయము మాత్రమే క్షయమై, మిగిలినవన్నీ భవిష్యత్తులో జన్మల నిచ్చుటకై నా ఖాతాలో మిగిలియుండును. ఈ కర్మలలో కొన్ని భారత్‌లో జన్మిస్తేనే క్షయమవుతాయి. మరికొన్ని అమెరికాకి వచ్చిన తరువాతనే క్షయమవుతాయి.

'ఫిక్సెడ్ డిపాజిట్' కర్మలు

ఈ జన్మలో కొన్ని కర్మలు క్షయమైనా, జీవుని ఖాతాలో ఇంకనూ క్షయము కావలసిన కర్మలు అనంతముగా ఉన్నాయి. ఈ 'ఫిక్సెడ్ డిపాజిట్' కర్మలకు 'సంచిత కర్మలు' అని పేరు. ఈ దేహము ఉన్నంత వరకు అవి క్షయము కావు. పైగా, జీవుడు ప్రకృతజన్మలో కొన్ని పూర్వ కర్మలను క్షయము చేసుకుంటూనే, కొత్త కర్మలను ప్రోగుచేస్తాడు. కర్తృత్వమున్నంతవరకు ఈ సంచయము తప్పదు. ఈ జన్మలో సంపాదింపబడే కర్మలకు క్రియమాణ కర్మ, లేక ఆగామి కర్మ అని పేరు. ఆగామి కర్మ యనగా భవిష్యత్తులోని కర్మ. నీకు ఇచ్ఛా స్వాతంత్ర్యము గలదు. కావున, నీవు పుణ్యపాపములను సంపాదిస్తావు. నీ ఖాతాలో ఇంతకు ముందే జమ అయి ఉన్న కర్మలకు ఇవి తోడవుతాయి.

జీవుడు చేసే పుణ్యపాపములన్నీ ఒకే సామాన్య ఖాతాలో జమ అవుతాయి. కనుక, నీ యీ జన్మ నీ అవ్యవహిత (immediate past) పూర్వ కర్మఫలమని చెప్పవీలు లేదు. అది పూర్వ కర్మ ఫలమని మాత్రమే చెప్పగలము. ఒకే సామాన్య ఖాతాకు జమ చేయబడిన పుణ్యపాపములలో కొన్ని పక్వానికి వచ్చి ఫలమిచ్చినవి. మరికొన్ని కాలాంతరమందు ఫలము నిస్తాయి. కావున, ఒక జన్మ అవ్యవహిత పూర్వమందలి సంచిత కర్మ ఫలమే కానక్కరలేదు. పూర్వమందలి వేయి జన్మలలో సంచితమైన కర్మల ఫలము కావచ్చును. అన్ని రకముల కర్మలు కలిసి ఒక నూతన దేహము నీయగలవు. అంటే, అనేక రకాల కలయికలు సంభవమవుతాయి. ఒక రకం కలయికలో ఒక జన్మ. మరో రకం కలయికలో ఇంకో జన్మ.

ఈ స్థూలదేహము మాతృగర్భములో ఆరంభమైన క్షణము నుండి, పక్వమై ఫలము నీయనారంభించిన కర్మల సముదాయమునకు ప్రారబ్ధ కర్మ అని పేరు. ప్రారబ్ధము అనగా ప్రారంభమైనది అని యర్థము. ఈ విధముగా కర్మలు సంచిత, ఆగామి, ప్రారబ్ధ అని మూడు విధములుగ నున్నవి.

కర్మల నన్నిటినీ జ్ఞానము దహించివేయును.

ఆత్మను అకర్తగా గుర్తించగల్గిన వ్యక్తి యందు కర్తృత్వము ఉండదు. కర్తృత్వము లేదు గనుక, అతని ఖాతాలో నున్న కర్మలన్నీ జ్ఞానాగ్నిచే దగ్ధమగును. కాని, యీ జ్ఞానము ఉదయించనంత వరకు జన్మలకు, జన్మలలో సంచితమయ్యే కర్మలకు అంతము లేదు. ఈ కారణంగానే, సంసారము అనంతము అని చెప్తారు.

దీని నుండి తప్పించుకునే ఉపాయము ఒక్కటియే గలదు. అది జ్ఞానాగ్నితో కర్మలనన్నిటినీ దహించుటయే. కర్తయే లేదు గనుక, కర్మలన్నీ దహింపబడతాయి. సామాన్యఖాతాలో ఉండే సర్వ సంచిత కర్మలు, ప్రకృతజన్మలో ప్రాప్తమయ్యే ఆగామికర్మలు సర్వమూ నశిస్తాయి. జ్ఞానికి పుణ్యపాపములుండవు. జ్ఞానము వలన అతనికి కర్తృత్వము తొలగిపోవును. ఇట్టి జ్ఞాని 'జ్ఞానాగ్ని దగ్ధకర్మా' అనబడును.

ఆత్మ దృష్ట్యా పరిశీలిస్తే, జ్ఞాని ప్రారబ్ధకర్మ నుండి కూడ విముక్తుడైన వాడే. స్థూలదేహము, మనస్సు మరియు ఇంద్రియముల దృష్ట్యా మాత్రమే ప్రారబ్ధకర్మ గలదు. జ్ఞాని మన మధ్యలో ఇంకా సంచరిస్తున్నాడు గాన, మనము ప్రారబ్ధకర్మ ఉంది అని అంటాము. కాని, ఆత్మ ప్రారబ్ధము ననుభవించుచున్నదని మనము చెప్పజాలము. జ్ఞాని కర్మలనన్నిటినీ జ్ఞానాగ్నిచే దహించివేసినాడు గాన, అతడు పండితుడనబడును. అట్టి పండితుడు జీవించి యుండగనే ముక్తుడు (జీవన్ముక్తుడు).

జ్ఞాని – కర్మ

మనమింతవరకు కర్మను గురించి, కర్తృత్వమును గురించి తెలుసుకున్నాము. ఈ పరిచయంతో మనము జ్ఞానిని కర్మలను చేయువాడు అని గాని, కర్మలను చేయనివాడు అని గాని నిర్వచించగలమా? అదంతా అతని ప్రారబ్ధముపై ఆధారపడును. జ్ఞాని ప్రారబ్ధమునకు అధీనుడై కొన్ని అనుభవములను పొందాలి. ఇందువలననే మనకు అనేక రకముల జ్ఞానులు కనబడతారు. జ్ఞాని ఇల్లు, వాకిలి, పిల్లలు గల గృహస్థు కావచ్చును; వ్యాపారి కావచ్చును; లేక, జనకమహారాజా వలె పాలకుడు కావచ్చును. జ్ఞాని ఏ వృత్తినైననూ అవలంబించవచ్చును. లేదా, సర్వమును విడిచి సన్న్యాసి కావచ్చును.

జ్ఞాని గృహస్థు అయినచో, ఆశ్రమకర్మలను చేసి తీరాలి. 'నేను జ్ఞానిని; కావున, నేను కర్మలను చేయను' అని చెప్పుటకు వీలు లేదు. గృహస్థునకు విధింపబడిన వైదికకర్మలను జ్ఞాని యైననూ చేస్తూ ఉండాలి. కాని, జ్ఞానియైన గృహస్థు ఈ వేదోక్తకర్మలను అనుష్ఠిస్తూ ఉన్నా, ఆత్మ అకర్తయనే జ్ఞానమును కలిగియున్నందువలన, అవి కర్మలు గావు. మరియు, జ్ఞాని సామాన్య ప్రజల యెదుట అనుచితమగు ఆదర్శమును ఉంచరాదు. ఈ కారణంచేత కూడా గృహస్థుగా ఉన్నంతవరకు జ్ఞాని కర్మల నాచరించును. కర్మలను చేయుట వలన జ్ఞాని నష్టపోయేదేమీ లేదు. కావున, జ్ఞాని కర్మల నాచరించుటలో సమస్య ఏమీ లేదు.

జ్ఞానికి తాను చేసే కర్మలో కామము గాని, సంకల్పము గాని ఉండదు. ''నేను దీనిని సాధించి, అది అవుతాను'' అనే ధారణ జ్ఞానికి ఉండదు. కావున, ఆయన ఏకర్మనైననూ చేయవచ్చును. ఆయన నాటకములోని పాత్రను చక్కగా పోషించవచ్చును. లేదా, ఈ నాటకము, దానిలోని పాత్రలు నిరర్థకములని భావించి - అవి నిరర్థకములని భావించుట సహజమే గదా! - వాటిని వీడి సన్న్యసించవచ్చును.

జ్ఞాని సన్న్యసించిన తరువాతనైననూ, కర్మను చేయవచ్చును; చేయకపోవచ్చును. ఆతడు మౌనిబాబా వంటి సన్న్యాసియై, బోధించకపోవచ్చును; లేదా, బోధించవచ్చును. సన్న్యాసియై బోధించినచో, ఆ బోధ చాల సరళమగు పద్ధతిలో నుండవచ్చును. లేదా, సువ్యవస్థితమైన పద్ధతిలో నుండవచ్చును. అదంతా ఆ సన్న్యాసి యొక్క ప్రారబ్ధముపై నాధారపడును.

జ్ఞానమును పొందుటకొరకై సన్న్యాసమనే జీవన శైలిని స్వీకరించిన సన్న్యాసులు పోషించవలసిన పాత్ర ఒక్కటియే గలదు. వారు పోషించేది విద్యార్థి పాత్ర. దానికి సంబంధించిన బాధ్యతలను మినహాయించి, ఆ సన్న్యాసులు ఇతర బాధ్యతల నుండి పూర్తిగా విముక్తులగుదురు. అట్టి ముముక్షువు జ్ఞానమును పొందిన తర్వాత కూడా సన్న్యాస జీవనమునే కొనసాగించును.

జ్ఞానములో భేదము లేదు. కాని, ప్రారబ్ధము వలన జ్ఞానులలో అనేకరకములు గలవు. ఈ భేదములను మనము రాబోవు కొన్ని శ్లోకములలో చూస్తాము.:

అధ్యాయము 4, శ్లోకము 20:

त्यक्त्वा कर्मफलासङ्गं नित्यतृप्तो निराश्रयः ।
कर्मण्यभिप्रवृत्तोऽपि नैव किंचित् करोति सः ॥२०॥

త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః
కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్ కరోతి సః (20)

సః = ఆతడు; కర్మ-ఫల-ఆసంగం = కర్మల ఫలము నందు ఉండే తీవ్రమగు ఆసక్తిని; త్యక్త్వా = విడిచిపెట్టి; నిత్యతృప్తః = సర్వదా సంతుష్టుడై; నిరాశ్రయః = ఇతరము నందు ఆధారపడని వాడై; కర్మణి = కర్మయందు; అభిప్రవృత్తః అపి = పూర్తిగా నిమగ్నుడై యున్నను; కించిత్ = ఏ కర్మనూ; న ఏవ కరోతి = చేయుటనే లేదు.

> అతడు కర్మ ఫలము నందు ఉండే తీవ్రమగు ఆసక్తిని విడనాడి, సర్వదా సంతుష్టుడై, ఇతరమునందు ఆధారపడనివాడై, కర్మల యందు పూర్తిగా నిమగ్నుడై యున్ననూ, ఏ కర్మనూ చేయుటనే లేదు. (20)

'సంగము' అంటే అనురక్తి. ' ఆ సంగము' అంటే అత్యధిక గాఢ అనురక్తి. అజ్ఞానికి కర్మఫలముల యందు ఇట్టి అనురక్తి ఉండును. కాని, జ్ఞానికి కర్మఫలముల యందు ఇట్టి అనురక్తి ఉండదు. ఈ శ్లోకములోని ' అసంగ' పదమును సరిగా తెలుసుకోవాలి. ఫలముల నపేక్షించకుండగా ఎవ్వరూ కర్మల నాచరించరు. కాని, జ్ఞాని కర్మఫలము నుండి ప్రయోజనమును దేనినీ పొందడు. అనగా, కర్మయేదైనా, దాని ఫలమేదైనా, జ్ఞానియొక్క రక్షణ దానియందు లేదు. అతని ఆనందము కర్మఫలము వలన ఇనుమడించేది కాదు. దీనికి కారణమేమనగా, జ్ఞాని కర్మఫలముల యందాసక్తిని, వాటి ఆసరాను పూర్తిగా త్యజించినాడు.

త్యజించేది అనురక్తిని మాత్రమే

జ్ఞాని త్యజించేది కర్మను కాదు; కర్మ ఫలమును కాదు. కర్మఫలముల యందలి గాఢానురక్తిని మాత్రమే జ్ఞాని త్యజించును. ఈ విషయము ఇచట సుస్పష్టము చేయబడినది. ఏలయన, కర్మఫలమును త్యజించుట అనేది వివాదముతో కూడిన అంశము. మానవుడు కర్మఫలము కొరకు మాత్రమే కర్మల నాచరిస్తాడు. మనం నడిచేటప్పుడు కూడా గమ్యమును దృష్టిలో నిడుకొని నడుస్తాము. గమ్యమును చేరుటకై అవసరాన్ని బట్టి మనము కుడివైపునకు తిరుగుతాము; ఎడమవైపునకు తిరుగుతాము; తిన్నగా నడుస్తాము.

లక్ష్యము దృష్టిలో లేకుండగా ఎట్టి కర్మనైననూ మనము చేపట్టజాలము. అట్టి స్థితిలో, యీ అనురక్తిని వీడుట యెట్లు సంభవము? గమ్యమును చేరలేకపోయినచో, నేను యేల చికాకు పడరాదు? వాస్తవంలో, జరిగేది ఇదియే. మానవులు గమ్యమును పొందలేకపోయినపుడు, అశాంతికి గురి అవుతారు. ఆసక్తి లేక అసంగము అనగా నిదియే. నీవు ఒక పనిని సాధించలేకపోయినావు. దానిచే నీవు ప్రభావితుడవైనావు. అనగా, నీకు కర్మ-ఫల-ఆసక్తి, లేక కర్మ-ఫల-ఆసంగము కలదని యర్థము.

సదా సంతుష్టుడై ఉండే వ్యక్తి (నిత్యతృప్తుడు) ఒకడు కలడనుకొనుడు. ఈతనికి ఆత్మస్వరూపము విదితము గనుక కొత్తగా సాధింపదగినది ఏదియూ లేదు. అతడు తన ఆనందము

కొరకై ఒక విశిష్ట కర్మ ఫలము నందు ఏమాత్రమూ ఆధారపడడు. జ్ఞాని యొక్క ఈ వర్ణనను బట్టి మనకి ఒక సంగతి తెలుస్తుంది. ఇతరులు కర్మలను వాటి వలన లభించే తృప్తి కొరకు, వాటి ఫలముల కొరకు చేస్తారు. తనలో తాను సంతృప్తుడు కాని వ్యక్తి ఏదో ఒకరకం తృప్తి కొరకు, తనను తాను షెభాష్ అనుకునేందుకు ఏదో ఒక కార్యాన్ని చేపడతాడు.

నిత్యతృప్తుడు, నిత్యసురక్షితుడు

నీవు నీ దృష్టిలోనే గాక, ఇతరుల దృష్టిలో కూడా సమర్థుడగు వ్యక్తిగా నిరూపింపబడాలి. దానిలో నీకొక సంతృప్తి లభిస్తుంది. దాని కొరకై నీవు కర్మలను చేపడతావు. ఇచటి సమస్య యేమంటే, నీవు నిన్ను యథాతథంగా అంగీకరించవు. ఈ కారణంగానే నీ గురించి ఇతరులకు గల అభిప్రాయము నీకు ప్రముఖమైన విషయమవుతుంది. వాస్తవంలో ఈ సమస్య సంసారులందరికీ గలదు. ఆత్మజ్ఞానము గల వ్యక్తి మాత్రమే తనలో తాను తృప్తుడుగ నుండును. మనమీ విషయమును మూడవ అధ్యాయములో చూచి యున్నాము. ఈ ఆనందము బాహ్యవస్తువులు వేటిపైనా ఆధారపడేది కాదు. ఇది కేవలము ఆత్మయందు మాత్రమే గలదు. ఇట్టి వ్యక్తికి కర్తవ్యములేమియూ ఉండవు. అతడు ఏదేని ఒక కర్మను చేపట్టినా, అది అతని ఆనందమును ఏ విధముగనూ ప్రభావితము చేయదు. ఇట్టి నిత్యతృప్తుడగు వ్యక్తి కర్మఫలములపై గల ఆసక్తిని పూర్ణముగా త్యజించును.

ఇట్టి వ్యక్తి 'నిరాశ్రయుడు' అని కూడ వర్ణింపబడినాడు. అనగా, సర్వ పర తంత్రతల నుండి విముక్తుడు అని యర్థము. ఇతడు రక్షణ కొరకు గాని, ఆనందము కొరకు గాని ఇతరముపై ఆధారపడడు. ఆత్మకంటె అధిక సురక్షితమగు వస్తువు మరియొకటి లేదని అతడు యెరుంగును. నిజం చెప్పాలంటే, సర్వము యొక్క ఉనికి ఆత్మ మూలకము మాత్రమే. సర్వము యొక్క ఉనికి ఆత్మయందు గలదు. మనస్సు యొక్క ఉనికి కూడ ఆత్మ యందు గలదు. ఇంద్రియములచే మనస్సునకు అందచేయబడే సర్వము ఆత్మయందు మాత్రమే గలదు.

సర్వము ఉనికికై ఆత్మపై ఆధారపడును

ఆత్మ యొక్క స్వరూపమే ఉనికి. కావున, కుండ యొక్క ఉనికికి మట్టి ఆధారమైనట్లు, సర్వమునకు ఆశ్రయము, ఆధారము ఆత్మయే. రజ్జు సర్పము ఇంకనూ మంచి దృష్టాంతము. రజ్జువును చూచి సర్పమని భ్రాంతిపడినప్పుడు, సర్పము యొక్క ఉనికి రజ్జువునందు గలదు. రజ్జు సర్పమునకు రజ్జుసత్త కంటె భిన్నమైన సత్త లేదు.

ఈ సత్యము నెరింగిన జ్ఞాని తన పూర్ణత్వము కొరకు, ఆనందము కొరకు ఇతరము నాశ్రయించడు. ఆత్మయే సర్వము; ఆత్మ నిత్య పూర్ణము గదా! ఇట్టి జ్ఞాని నిరాశ్రయుడనబడును. ''సర్వము నేనే; సర్వమునకు ఆశ్రయము నేనే'' అను యెరుక ఇతనికి గలదు. ఈతడు కర్మఫలముల యందాసక్తిని త్యజించును. ఈ త్యాగము ఒక మానసిక భావనా మాత్రము కాదు. దీనికి మూలము కర్మయోగము కూడ కాదు. ఆతడు జ్ఞానబలము చేతనే కర్మఫలాసక్తిని త్యజించును.

కర్మయోగి కూడ, ఈశ్వరుని కర్మఫలదాతగా అంగీకరించి, కర్మఫలాసక్తిని త్యజించును. ఈ త్యాగము అతనికి ఒక విశిష్టమానసిక భావన. ఈతడు సర్వమును ఈశ్వరప్రసాదముగా స్వీకరించును. కాని, ఇది యోగమే గాని, జ్ఞానము గాదు. యోగమునకు, జ్ఞానమునకు చాల తేడా గలదు. యోగము సాపేక్షము. దాని వలన వ్యక్తికి లభించే ప్రశాంతి కూడ సాపేక్షమే. ఇట్టి ప్రశాంతమైన మనస్సు జ్ఞానోదయమునకు ఆవశ్యకమనుటలో సందియము లేదు. వ్యక్తి ఈశ్వరుని కర్మఫలదాతగా స్వీకరించే మానసిక భావనయే యోగము. యోగమునకు, జ్ఞానమునకు గల భేదమును స్పష్టముగా తెలుసుకోవాలి.

ఈశ్వరుని కర్మఫలదాతగా స్వీకరించే కర్మయోగికి, వచ్చిన వాటిని వచ్చినట్లు అంగీకరించుటకు, పోయేవాటిని వాటి మానాన వదలివేయుటకు వలసిన మానసిక ప్రవృత్తి (attitude) ఉండును. అనగా, అతని మనస్సు రాగద్వేష వశవర్తియై ప్రతిక్రియను చూపేదిగా ఉండదు. ఈ శ్లోకములో వర్ణింపబడే కర్మయోగికి ఆత్మ అకర్త యనే జ్ఞానము కూడ గలదు. కావున, ఇట్టి జ్ఞాని అనేక కార్యములను చేపట్టినా, ఆత్మ కర్తయనే భ్రాంతికి గురి కాడు.

జనక మహారాజు ఇట్టి జ్ఞాని యని చెప్తారు. ఆయన జ్ఞానియై ఉండి కూడా, రాజ్యమును ప్రజారంజకముగా పాలించెను. సర్వవ్యవహారములు ఆయన నియంత్రణలో ఉండెడివి. రాజ్యములోని సంగతులను ఆయన ఎప్పటికప్పుడు తెలుసుకొనెడివాడు. ఆయన పాలనలో రాజ్యము సుఖశాంతులతో వర్ధిల్లెను. ప్రజలందరు ఆనందముగా జీవించిరి. ఈ తీరున, జ్ఞాని ఉత్సాహముతో ఎన్నో కార్యములను చేపట్టినా, ఆయనకు ఆత్మ అకర్తయనే జ్ఞానము కలదు గావ, ఆయన కర్మలను చేసినట్లే గాదు (నైవ కించిత్ కరోతి సః).

ఆత్మ జీవిత నాటకంలోని పాత్ర కాదు

హంతకుని పాత్రను పోషించే వ్యక్తి హంతక వేషమును తొలగించుటకు ముందు కూడా తనను హంతకునిగా భావించడు. తాను హత్య చేయలేదని అతనికి తెలియును. పాత్రను పోషించే

సమయంలో అతడు ఒక వ్యక్తిని తన్నినా, తాను యథార్థముగా తన్నుట లేదని అతనికి తెలియును. తెర వెనుకకు వెళ్లి, అతడు తాను తన్నిన వ్యక్తితో ''నిన్ను తన్నినందులకు నన్ను క్షమించుము'' అని చెప్పడు. క్షమాపణ చెప్పవలసిన ఆవశ్యకత అతనికి లేదు. కాని, అతడు తాను తన్నిన వ్యక్తిని ''నేను బాగా తన్నితినా?'' అని ప్రశ్నించవచ్చును. ఆ వ్యక్తి '' అవును, బాగా తన్నితివి. నాకు దెబ్బ తగలనే లేదు. నీవు మంచి నటుడవు'' అని సమాధానము నీయవచ్చును. తాము పాత్రలను పోషించినామనే జ్ఞానము వారికి గలదు. కావున, వారు ఆ నటన యొక్క స్వరూపమును గూర్చి చర్చించుకొనగల్గుతారు. వారిలో ఒకడు రెండవ వాని విషయంలో అపరాధము చేసినట్లు గాని, క్షమాపణ ఆవశ్యకమని గాని వారు భావించరు. తన్నినట్లు నటించిన వ్యక్తి నిందార్హుడు కాడు. వాస్తవంలో అతడు తన్ననే లేదు. ఏలయన, ఆ కర్మలో కర్తగాని, కర్తృత్వ భావన గాని లేవు.

జ్ఞానమునకు కర్మ విరోధి

కర్తృత్వమే ప్రధాన సమస్య. సంసారము వాస్తవంలో కర్తృత్వము మీద మాత్రమే కేంద్రితమై యున్నది. జ్ఞానము, కర్మ పరస్పర విలక్షణములు. వేదాంతమునకు ఆత్మజ్ఞానము విషయవస్తువు. అది కర్మ కంటె పూర్తిగా విలక్షణమైనది. వేదములో అధికభాగము కర్మకాండయే. జ్ఞానము వేదము యొక్క అంతములో (వేదాంతము) మాత్రమే వచ్చును. కర్మజ్ఞానములు రెండు విభిన్న విషయవస్తువులు గనుకనే, వేదములోని ఆఖరి అధ్యాయములో వచ్చే జ్ఞానము ప్రత్యేకముగా ఉల్లేఖించబడును.

కర్మ యనగా సంసారము. జ్ఞానమనగా మోక్షము. కర్మలో కర్త ఉండును. జ్ఞానము కర్తృత్వమును ఉచ్ఛేదము చేయును. కర్మ యందు అజ్ఞానము నిహితమై యుండును. జ్ఞానము అజ్ఞానమును నశింపజేయును. కావున, జ్ఞానమనగా అకర్త. కర్మ యనగా కర్త. పూర్వసిద్ధమగు కర్తను ఉద్దేశించి వేదము కర్మలను చేయుమని బోధించును. ఇదే అంశములో కర్మను యోగముగా తీర్చిదిద్దే అవకాశము గలదు. కర్త ఉన్నట్లే ఉంటాడు. కర్మ యోగముగా మారుతుంది. మనస్సు పరిణతమై జ్ఞానోదయమునకు యోగ్యముగా తయారగును. ఆత్మ అకర్త అనే సాక్షాత్కారము కలుగును.

మానసిక పరిణతికి అడ్డదారి లేదు. ఈ పరిణతి అత్యావశ్యకము. ఇది లభించుటకు సమయము పట్టును. కావున, దానిని అయిదు, పది, లేక ఇరవై సంవత్సరములలో సంపాదించాలి అనే లెక్కలు పనికిరాదు. అనేక జన్మల సంస్కారములు ఉన్నాయి. వాటి ముందు ఇరవై, ఇరవై అయిదు సంవత్సరము లెంత? వేదాంతమును ఎవరైన ఏళ్ళు అధ్యయనము చేసిన తరువాత, కొద్ది కొద్దిగా తెలిస్తే,

ఆశ్చర్యపడనక్కరలేదు. ఒక వ్యక్తి తొంభై తొమ్మిది ఏళ్ల వయస్సు వచ్చేక, " ఆహా! నాకు తెలిసింది " అని అంటాడనుకోండి. నష్టమేమున్నది? ఒక వ్యక్తి తన ఎనభై ఏళ్ల వయస్సులో వేదాంతమును అధ్యయనము చేయనారంభించి, తొంభై ఎనిమిది ఏళ్ల వయస్సులో వేదాంతమును తెలుసుకోగల్గితే, అంతకంటె కావలసిన దేమున్నది? జ్ఞానోదయము తరువాత ప్రారబ్ధము మాత్రమే మిగిలి ఉంటుంది. జ్ఞానము లభించిన తరువాత ఒక ఏడాది బ్రతికినా, రెండేళ్లు బ్రతికినా, మూడేళ్లు బ్రతికినా, అది అంత ముఖ్యము కాదు.

మానసిక పరిణతికి సమయము పట్టును

మనకు వేదాంతము తెలియుటకు అనేక సంవత్సరముల కాలము పట్టుటలో ఆశ్చర్యపడవలసినది ఏమీ లేదు. జ్ఞానోదయమునకు అంతఃకరణ శుద్ధి ఆవశ్యకము. దానికి సమయం పడుతుంది. కంగారుపడితే ప్రయోజనం లేదు. ఇది అరటికాయ పండుటకై వేచి చూచుట వంటిది. అరటి చెట్టు ప్రక్కన కూర్చుని, పచ్చికాయతో, " ఓ కాయా! తొందరగా పక్వానికి రా. నేను నిన్ను తినాలి!" అని కంగారు పెట్టుట వలన ఉపయోగము లేదు. దాని దారిన దానిని పండనీయాలి. అట్లు పక్వమైన పండులో మాత్రమే మార్దవము, రుచి ఉంటాయి. దానికి కొంత సమయం పడుతుంది. దాని విషయంలో మనం చేయగలిగిందేమీ లేదు.

పక్వమయ్యే ప్రక్రియ, పెరిగే ప్రక్రియ సర్వత్రా ఇల్లాగే ఉంటుంది. మనస్సు పరిణతమయ్యే ప్రక్రియ కూడా ఇట్టిదియే. యోగము అంతఃకరణ శుద్ధి కొరకు ఉద్దేశింపబడినది. ఈ దృష్టితో చూస్తే, కర్మకు మంచి ప్రయోజనము గలదు. మనస్సు సంసిద్ధము కాగానే, జ్ఞానము ఉదయిస్తుంది. కావున, జ్ఞానము కర్మ విరోధి అయిననూ, కర్మ జ్ఞాన సహకారి యగును. ఇందువలననే వేదములో ముందు కర్మ, తరువాత జ్ఞానము బోధింపబడినవి. అజ్ఞాన మూలకమగు కర్మ ముందు ఉండుటయే మంచిది. అజ్ఞాని యగు వ్యక్తి తనను తాను కర్తగా భావించును. ఇట్టి కర్తృత్వ భావన గల కర్త పరిణతి చెందవలసి యున్నది. తరువాత మాత్రమే జ్ఞానము ఉదయించును.

పరిణతిలో రెండు స్థాయిలు గలవు. ఒకటి వ్యక్తి పరకము కాగా, మరియొకటి అనుభవాత్మకమైనది. మనము వ్యక్తి విష్యములగు అనేక సమస్యలను నిర్మాణం చేసుకుంటాము. వీటిని ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ పోవాలి. జీవన విలువలు, బాంధవ్యములు ఇత్యాది విషయములలో మన అనుభవములు దోషయుక్తములై ఉంటాయి. ఈ దోషముల నన్నిటిని తొలగించుకోవాలి. కర్మయోగము ఈ ద్వివిధ పరిణతిని కలిగించి, నేను అకర్తను (అహం అకర్తా)

అనే వేదాంత జ్ఞానము ఉదయించుటలో సహకరించును. ఇట్టి జ్ఞానము గల వ్యక్తి కర్మలను చేసినా, చేసినట్లు గాదు.

ఈ తీరున, వేదములో కర్మ, జ్ఞానము అనే రెండు పరస్పర విలక్షణములగు విషయవస్తువులు ప్రతిపాదింపబడినవి. వేదములోని ప్రథమ భాగము కర్మను వివరిస్తుంది. దీనికి కర్మకాండ అని పేరు. వేదములోని ద్వితీయ భాగము జ్ఞానమును నిరూపిస్తుంది. దీనికి జ్ఞానకాండ (వేదాంతము) అని పేరు. ఏయే కర్మలను చేయాలి, ఎల్లా చేయాలి ఇత్యాదులను వివరిస్తూ, కర్మ కాండను విశ్లేషించే శాస్త్రమునకు కర్మ మీమాంస*, లేక పూర్వమీమాంస అని పేరు. ఈ శాస్త్రములోని సూత్రములను వ్యాసుని శిష్యుడగు జైమిని రచించెను. వీటికి కర్మ మీమాంసా సూత్రములని పేరు. ఇదే విధంగా, జ్ఞానకాండను విశ్లేషించే శాస్త్రము ఉత్తర మీమాంస యనబడును. వ్యాసుడు స్వయముగా రచించిన బ్రహ్మ సూత్రములు ఈ శాస్త్రమునకు మూలము. బ్రహ్మ సూత్రములలో ఉపనిషద్వాక్యములు సమగ్రముగా విశ్లేషింపబడినవి. వివిధ దార్శనికుల వాదములను ప్రతిపాదిస్తూ, విషయవస్తువు విశ్లేషింపబడినది. ఈ విశ్లేషణకు మననము అని పేరు. ఈ విశ్లేషణలో వేదాంత తాత్పర్యము నిష్కర్ష చేయబడినది.

కర్మ జ్ఞానములు పరస్పర విలక్షణములగు విషయవస్తువులు. వేదాంతము కర్మ మీమాంస కంటె భిన్నముగ నుండును. ఈ రెండు విషయవస్తువులు సామాన్యమైనవి గావు. గీతలోని శ్రీకృష్ణుని ఉపదేశము యొక్క విషయవస్తువు అంతా ఈ రెండే. కర్మ, జ్ఞానములను సరిగా తెలుసుకున్నవాడు ముక్తుడగును. ఇచట జ్ఞానమనగా ఆత్మ స్వరూపతః అకర్త యని ఎరుంగుటయే. ఈ విషయము చాల ప్రముఖమైనది గనుకనే, శ్రీకృష్ణుడింకనూ దానిని కొనసాగించుచున్నాడు:

అధ్యాయము 4, శ్లోకము 21:

निराशीर्यतचित्तात्मा त्यक्तसर्वपरिग्रहः ।
शारीरं केवलं कर्म कुर्वन्नाप्नोति किल्बिषम् ॥२१॥

నిరాశీర్యత చిత్తాత్మా త్యక్త సర్వపరిగ్రహః
శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ (21)

★ మీమాంస = విశ్లేషణము.

నిరాశీః = ఆపేక్షలు లేనివాడై; యతచిత్తాత్మా = నియంత్రింపబడిన దేహము, ఇంద్రియములు, మనస్సు గలవాడై; త్యక్త సర్వ పరిగ్రహః = స్వీయసంపదలను పూర్తిగా త్యజించినవాడై; కేవలం = కేవలము ; శారీరం = శరీరధారణ కావశ్యకమగు; కర్మ = కర్మను; కుర్వన్ = చేయు యోగి; కిల్బిషం = పాపమును; న ఆప్నోతి = పొందడు.

> ఆపేక్షలు లేనివాడై, దేహేంద్రియ మనస్సులను నియంత్రించి,
> స్వీయసంపదలను పూర్తిగా త్యజించి, శరీరధారణ కావశ్యకమగు కర్మలను
> మాత్రమే ఆచరించు యోగి పాపమును పొందడు. (21)

శ్రీకృష్ణుడు జ్ఞానిని వర్ణిస్తూ, కర్మాపేక్షయా జ్ఞానులలో కనబడే భేదాలను కూడా వర్ణించేడు. తాను వాస్తవంగా ఏ కర్మనూ చేయుట లేదనే యెరుక గలవాడై, వివిధ్న కార్యకలాపములలో మగ్నుడై ఉండే (కర్మణి అభిప్రవృత్తోఽపి నైవ కించిత్ కరోతి సః) జ్ఞానిని మనము చూచి యున్నాము. ఈ శ్లోకములో కూడ శ్రీకృష్ణుడు జ్ఞానినే వర్ణించుచున్నాడు. కాని, ఆత్మ అకర్తయనే యెరుక గల యీ వ్యక్తి ఇంకో రకం జ్ఞాని.

పూర్వ శ్లోకములో వలెనే, ఈ శ్లోకములో కూడా పూర్వార్ధము జ్ఞానిని వర్ణించును. ద్వితీయార్ధము జ్ఞాని యొక్క జీవనశైలిని వర్ణించును. ఈ శ్లోకము ఆత్మ సాక్షాత్కారము గల వ్యక్తిని 'నిరాశీః' అని వర్ణించినది. అనగా, అన్ని ఆశల నుండి విముక్తుడు అని యర్థము. 'నిర్' అను ఉపసర్గ నిషేధమును బోధించును. 'నిర్ + ఆశ' అనగా ఆశ లేనివాడు; అనగా హతాశుడు అనుకోరాదు. ఆశల నుండి విముక్తుడు అని యర్థము. అనగా అన్ని ఆశలు, ఆపేక్షలు తొలగిపోయిన వ్యక్తియే జ్ఞాని యనబడును. ఇది జరిగే విధమెట్టిది?

హతాశుడైన వ్యక్తికి ఆశలు ఉంటాయి. కాని, ఈ ఆశలు నెరవేరే మార్గము లేదనే నిష్కర్షలో అతడు ఉంటాడు. తన ఆశలు నెరవేరుతాయనే ఆశ లేని వ్యక్తి హతాశుడనబడును. అనగా, అతడు ఆశలకు అతీతుడు కాలేకపోయినాడని యర్థము. ఇట్టి హతాశుడు వేరు; జ్ఞాని వేరు. ఆత్మ సర్వపరిచ్ఛేదరహితము అనే సాక్షాత్కారము కలుగుట వలన, జ్ఞాని నుండి సర్వ ఆపేక్షలు, ఆశలు దూరముగా తొలగును.

ఆశలనుండి విముక్తుడగుట యెట్లు?

మానసిక పరిణతి కలిగి జీవించే వ్యక్తి జ్ఞానోదయానికి ముందే ఇంచుమించుగా ఆశాపాశ విముక్తుడై జీవిస్తాడు. ఇట్టి వ్యక్తి యోగ ప్రభావము వలన రాగద్వేషముల సమ్మోహము నుండి బయటపడి యుండును. కావున, అతడు ఇంచుమించు ముక్తుడైన వానిగనే లెక్కకు వచ్చును. అతడు ఆత్మసాక్షాత్కారమును పొంది పూర్ణముగా విముక్తుడగును. అపుడాతనికి పూర్ణుడై, ఆనందించుట కొరకు కోర్కెలను తీర్చుకోవలసిన అవసరముండదు. ఇట్టి అపేక్షలు లేని వ్యక్తి 'నిరాశీః' అని వర్ణింపబడును.

జ్ఞాని అనుభవించే స్వాతంత్ర్యములో, ఆతనికి దేహేంద్రియ సంఘాతముపై గల నియంత్రణ కొంతవరకు హేతువు అగును. కావుననే ఈ శ్లోకములో జ్ఞాని ''యతచిత్తాత్మా'' అని వర్ణింపబడినాడు. అనగా, స్థూలదేహము, మనస్సు, ఇంద్రియములపై నియంత్రణ గలవాడు అని యర్థము. స్మృతి, జ్ఞానము, వివిధ రకముల ఆలోచనలు వీటన్నింటితో గూడిన మనస్సును చిత్త శబ్దము బోధించును. యత చిత్తాత్మా అనే యీ సమాస పదములోని ' ఆత్మా' అను పదమునకు స్థూలదేహము అర్థము. 'యత' అనగా 'నియంత్రింపబడిన' అని యర్థము.

ఇచట నియంత్రణ యనగా దేహము, మనస్సు, ఇంద్రియములు వ్యక్తికి అనుకూలముగా నుండునని యర్థము. అవి ఉండవలసిన చోట ఉండవలసిన తీరున ఉండును. దేహమును, మనస్సును, ఇంద్రియములను తన అధీనములో, తన నియంత్రణలో ఉంచుకోగల వ్యక్తి 'యత చిత్తాత్మా' అనబడును. ఈ యోగ్యత అతని యందు జ్ఞానోదయమునకు పూర్వము కూడ ఉండును. కాని అపుడు సాపేక్షముగ నుండును. కాని, జ్ఞానోదయము తరువాత ఈ యోగ్యత అతని యందు పూర్ణముగ నుండును.

శ్రీకృష్ణుడు ఈ రకం జ్ఞానిని 'త్యక్త-సర్వ-పరిగ్రహః' అని వర్ణించెను. అనగా, స్వీయ వస్తువులను పూర్ణముగా త్యజించిన ముఖ్య సన్న్యాసి అని యర్థము. ఈతడు జ్ఞానోదయమునకు పూర్వమే సన్న్యసించి యుండవచ్చును. లేదా, గృహస్థుగా నుండి, జ్ఞానియై, సర్వమును త్యజించుటకు నిశ్చయించుకున్నవాడు కావచ్చును.

అధిక సంపదను, అధికమగు వస్తు సామగ్రిని కల్గియుండుట కూడా సమస్యగా పరిణమిస్తుంది. ఉదాహరణకు ఒక వ్యక్తికి చాల పెద్ద గృహము కలదనుకొనుడు. దాని నిర్వహణకు అతని ధనము,

సమయము చాల ఖర్చగును. అపుడాతడు దానిని అమ్మివేసి, ఆ ధనముతో సౌకర్యంగా ఉండే చిన్న గృహమును కొని దానిలో నివసించాలని తలపోయును. కాని, అనేక సంవత్సరముల నుండి ప్రోగుచేసిన సామాను అంతా ఏమగును? ఇదొక సమస్య. ఆ సామానుకు చిన్న ఇల్లు చాలదనేది ఖాయం. పరిశీలించండి. ముందు ఇల్లు కొని, తరువాత దానిని సామానుతో నింపివేసిన వ్యక్తి, సామాను అధికంగా ఉన్న కారణంగా మరొక ఇల్లును కోరుచున్నాడు. ఇదంతా పెద్ద అయోమయం. ఇదే సంసారం. ఇల్లును అమ్మే వ్యక్తి సామానును కూడ ఏల అమ్మరాదు? ''కాదు; కాదు; అవి చాల విలువైన వస్తువులు'' అని నీవు అనవచ్చును. అంటే, నీకు ఆ వస్తువుల యందు దృఢమైన అనుబంధము గలదు. వాటిని వీడుట నీకు సమ్మతము కాదు. వాటికోసం, నీకొక ఇల్లు కావాలి! ఇది సమస్య యొక్క ఒక నమూనా మాత్రమే.

ఈ శ్లోకంలో వర్ణింపబడిన జ్ఞానికి వస్తువుల యందలి మోహము యొక్క సమస్య లేదు. అతడు తనదైన సర్వమును వీడినాడు. త్యక్త సర్వ పరిగ్రహుడగు జ్ఞానికి ఇల్లు ఉండదు; సామాను ఉండదు; ఉద్యోగము ఉండదు; ఏదీ ఉండదు. ఇతడొక సన్న్యాసి. ఇతడు ఎప్పుడైనా ఎక్కడ నుండైనా నడిచి బయటకు వచ్చివేయగలడు. ఇతడు సామాన్యవ్యక్తి కానే కాదు. ఇతడొక పరమ పవిత్ర జీవనుడు; లోక సంచారి. అతనికి శరీరధారణను మించి చేయదగిన పని ఏదీ లేదు (శారీరం కేవలం కర్మ). ఇట్టి వ్యక్తి భుజించును; స్నానము చేయును; శరీరమును తగినంత ఆరోగ్యముగా నుంచుటకు కావలసిన కర్మలను మాత్రమే చేయును.

దేహముతో తాదాత్మ్యము

ఇచట జ్ఞానికి దేహమును గురించి ఉండే అభిముఖ్యము గమనించదగినది. జ్ఞాని దేహమును తగినంత ఆరోగ్యముతో నుంచుకొనుటకు ఆవశ్యకమగు కర్మల నాచరించును. దేహమునకు అధికప్రాధాన్యము నిచ్చి, దానిని ఒక విశిష్ట ఆకారముగా మలుచుటకు, లేదా అత్యధిక శక్తిమంతముగా తీర్చిదిద్దుటకు ఉద్యమించే యోగమునకు, జ్ఞాని యొక్క ఈ ప్రవృత్తికి, చాల తేడా గలదు. ఇట్టి యోగములో దేహము గురించి, దాని ఆరోగ్యము గురించి పూర్ణధ్యానము ఈయబడుటచే, అది ఒక ఆవేశముగా మారును. ఆరోగ్యవంతమగు దేహము కూడా ఒకనాడు మరణించునని మరువరాదు. పైగా, అనారోగ్యంగా కనబడే దేహంతో తొంభై రెండేళ్లు బ్రతికిన వారు గలరు! దేహములో ఆరోగ్యము ఉండనీ, లేకపోనీ. అది ఏదో ఒకనాడు రాలిపోయేదే. మనకు ఈ సత్యము ఈ ప్రపంచములో ప్రతి నిత్యము కనబడుతూనే ఉంటుంది.

కావున, ఆరోగ్యమును పరిరక్షించు కొనుటయే ప్రధాన ధ్యేయము కారాదు. శరీరము రోగగ్రస్తము కాకుండా చూచుకోగల్గితే చాలును. అట్లు గాక, శరీరము మీద, తినవలసిన వాటి మీద, తినకూడని వాటి మీద మాత్రమే ధ్యానం పెడితే, ఆత్మ ధ్యానము మరుగున పడుతుంది. ఇట్టి విషయములకు అధిక ప్రాధాన్యము నిచ్చుట వలన కాలము వ్యర్థమగుటయే తప్ప, వేరొక ప్రయోజనము లేదు.

జ్ఞానికి దేహతాదాత్మ్యము ఉండదు. దేహ విషయకమైన అభిముఖ్యము (orientation) జ్ఞానికి ఉండదని శ్రీ శంకరులు తమ భాష్యములో స్పష్టము జేసిరి. "నా దేహము ఇల్లా ఉండాలి; అల్లా ఉండాలి" అని జ్ఞాని కోరుకోడు. ఆహారము, వ్యాయామము, జీవనశైలి మొదలగు వాటిని అతడు ఉచితరీతిని నిర్వహించుకొనును. దేహము ముందు రాలినా, వెనుక రాలినా, తేడా ఏమీ లేదు. ఒక వ్యక్తికి నలభై సంవత్సరాలలో జ్ఞానము కలుగలేదనుకొనుడు. అపుడాతడు మరణించినా, మరియొక దేహములో - బహుశః ఇంతకంటె మంచిదేహముతో - తిరిగి వస్తాడు. నీకు జ్ఞానము ఉంటే ఉంది; లేకపోతే లేదు. మరణించే లోపులో ఫలానా పనిని పూర్తిచేయాలి అనుకోవటం అవివేకము. నీవు పూర్ణుడవు అగుట అనే ప్రసక్తియే లేదు. నీవు సదా పూర్ణుడవు. నీ వీ సత్యమును గ్రహిస్తే, చాలును. ఈ సత్యము సాక్షాత్కరించే లోపులోనే యీ దేహము రాలిపోతే, జీవుడు అవే సంస్కారములను మరుజన్మలో కొనసాగిస్తాడు గనుక, నష్టపోయేదేమీ లేదు. కావున, ఈదేహము కొరకై అవసరమును మించి శ్రద్ధను ఎందుకు కలిగి ఉండాలి? సరియగు దృష్టికోణము ఈ విధముగ నుండును.

ఆశలన్నిటినీ విడనాడి, సాంసారికసంపదలనన్నిటినీ పరిత్యజించి, దేహధారణకు అవశ్యకమగు కర్మలను మాత్రమే ఆచరించే జ్ఞానికి యేమగును? అతనికి పుణ్యపాప రూపమగు కర్మ ఫలము ప్రాప్తించదు.

మంచి పనులు కూడా బంధహేతువులే

మోక్షాపేక్షయా, పుణ్యము కూడ బంధహేతువగు సంసారమే. గొలుసు ఇనుపదైనా, బంగరుదైనా, బంధము సమానమే. దొంగతనము చేసినవాడు రాజకుమారుడైతే, బంగరు గొలుసుతో బంధించవచ్చును. అదే సామాన్యుడైతే, ఇనుప గొలుసుతో బంధిస్తారు. గొలుసు తయారీలో ఉపయోగించే లోహము వేరైనా, బంధములో భేదము ఉండదు. గొలుసు ఇనుపదైనా, బంగరుదైనా, చేతి నుండి ఊడిపోదు. హంతకునికి ఉరిశిక్ష విధిస్తారు. హంతకుడు రాజకుమారుడైతే, బంగరు

కత్తితో అతనికి శిరచ్ఛేదము చేయవచ్చును. హంతకుడు సాధారణ వ్యక్తి అయితే, శిరచ్ఛేదమునకు ఇనుప కత్తిని వాడవచ్చును. శిరచ్ఛేదమునకు బంగరు కత్తిని వాడుట రాజకుమారునకు తృప్తిని ఈయగలదా? ఇద్దరి విషయంలోనూ మరణము సమానమే.

ఇదే విధంగా, పుణ్యకర్మ బంగరు గొలుసు వంటిది. నాకు కావలసిన దానిని పుణ్యము ఈయగల్గినచో, నాకు పుణ్యము కావాలి. నాలో జ్ఞానము ఉదయించుటకు సానుకూలపడే మనస్స్థితిని పుణ్యము ఈయగల్గినచో, నాకు ఆ పుణ్యము జ్ఞానోదయ పర్యంతము సహాయకారిగా నుండును. తదనంతరము నాకు పుణ్యము యొక్క అపేక్ష లేదు. కావుననే, సర్వోత్తమమగు మోక్షము దృష్ట్యా, పుణ్యపాపములు రెండునూ బంధములుగనే పరిగణింపబడును.

ఒకసారి జ్ఞానోదయమైన తరువాత, అట్టి వ్యక్తి యందు కర్తృత్వముండదు గాన, పుణ్యపాపములు అతనిని అంటవు. కర్మల వలన ఏది పొందదగినదో, దానిని అతడు పొందివేసినాడు. 'తాను అకర్త యగు ఆత్మ' అను సాక్షాత్కారము జ్ఞానిని కృత్స్న-కర్మ-కృత్ (చేయవలసిన కర్మలనన్నిటినీ చేసినవాడు) గా తీర్చిదిద్దును.

కర్మవలన పుట్టేది కర్మఫలము మాత్రమే. కర్మఫలము కర్మ కొరకు గాని, ఫలము కొరకు గాని ఉద్దేశింపబడలేదు. అది కర్త కొరకు మాత్రమే ఉద్దేశింపబడినది. మరియు, కర్మఫలము కామన కొరకు కూడా కాదు. అది కర్మఫలము నందు కామన గల కర్త కొరకు మాత్రమే. కర్మ ఫలములన్నీ నా కొరకే అయినచో, అవి నాయందు కొంత వరకు మెరుగులు దిద్దకుండునా? నేను అపూర్ణుడనైతేనే మెరుగులు దిద్దుట సంభవమగును. కావున, ఈ నిష్కర్ష సముచితమగును. ఆత్మ అపూర్ణమైతే, అధిక ఆనందము లభించుట కొరకై ఆత్మ యందు కర్మ ఫలరూపమగు మెరుగులు దిద్దుట తప్పని సరియగును.

అధికమగు ఆనందము కొరకు కొత్తగా చేయువలసినది ఏదీ లేదు

దీనికి భిన్నముగా, ఆత్మ నిత్యపూర్ణము అయి, సర్వము ఆత్మయే అయినచో, ఆత్మ కంటె భిన్నముగ మరేదీ ఉండదు. అపుడు నా భద్రతను, ఆనందమును పెంచుట కొరకు ఏదో ఒక కర్మను ఆచరించుట అను ప్రసక్తి యెక్కడిది? ఆత్మ పూర్ణము అని యెరింగిన వ్యక్తి ఒకే ఒక క్షణములో సర్వ-కర్మ-కృత్, లేదా కృత్స్న-కర్మ-కృత్ అయిపోవునని మనము చూచియున్నాము. ఇట్టి వ్యక్తి కర్మలను చేయుచున్ననూ, అతడు కర్మలను చేసినట్లే కాదు (కర్మణి అభిప్రవృత్తోఽపి నైవ కించిత్ కరోతి సః)

ఇంకో విధమైన వ్యాఖ్యానము సంభవమా?

'శారీరం కేవలం కర్మ' అను పదములను మరొక రీతిలో వ్యాఖ్యానించవచ్చుననే ఆ శంకను శ్రీ శంకరులు ప్రస్తావించిరి. సర్వ సంగ పరిత్యాగి (త్యక్త సర్వ పరిగ్రహః) యగు సన్న్యాసిని గురించి మనమిచట చర్చిస్తున్నామని మనము గమనించవలెను.

స్థూలదేహముతో చేసే కర్మ ఏదైనా, 'శారీరం కర్మ' అనబడును. 'కేవలం' అనగా 'మాత్రమే'. కావున, 'శారీరం కేవలం కర్మ' అనగా 'దేహముతో చేసే కర్మ మాత్రమే' అనే అర్థము వచ్చును. అనగా, స్థూలదేహముతో చేసే కర్మ మాత్రమే పుణ్యమును గాని, పాపమును గాని ఈయదు (కిల్బిషం న ఆప్నోతి) అను అర్థము వచ్చును. ఇదియే సరియైనచో, వాక్కుతో గాని, మనస్సుతో గాని చేయబడే కర్మలకు ఈ పుణ్యపాపములు లభించునని తెలుసు. కాని, శాస్త్రము కాయిక, వాచిక, మానసిక కర్మలను వివరించుచున్నది. కాన, ఈ వ్యాఖ్యానము పొసగదని శ్రీ శంకరులు త్రోసిపుచ్చిరి.

ఈ శ్లోకము సరిగా తెలియాలంటే, సన్న్యాసము యొక్క అంతరార్థము, సన్న్యాసి తన జీవితము గడిపే విధము తెలియాలి. సన్న్యాస జీవనమును గడిపే వ్యక్తి స్థూలదేహమును ధరించియుండుటకు అవశ్యకమగు కర్మలను మాత్రమే ఆచరించును. వాటినైననూ దేహ తాదాత్మ్యము లేకుండగా ఆచరించును. సన్న్యాసి పంటలను పండించడు; ఉద్యోగము చేసి ధనమును సంపాదించడు. అతడు భిక్షాటనము చేసి జీవించును. భిక్ష యనగా యాచించుట గాదు. సన్న్యాసి 'ఆహారమును ఎట్లు సంపాదించవలెను?' అనే యోజన చేయడు. అప్రయత్నంగా లభించిన ఆహారముతో తృప్తిపడును. భిక్షతో జీవించుట అనగా నిదియే. దైవికముగా లభించిన ఆహారముతో సన్న్యాసి కడుపు నింపుకొనును. ఈ జీవనశైలిని శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములో ఇంకనూ వర్ణించెను.

అధ్యాయము 4, శ్లోకము 22

यदृच्छालाभसन्तुष्टो द्वन्द्वातीतो विमत्सरः ।
समः सिद्धावसिद्धौ च कृत्वाऽपि न निबध्यते ॥२२॥

యదృచ్ఛాలాభ సంతుష్టో ద్వంద్వాతీతో విమత్సరః
సమః సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే (22)

యదృచ్ఛా–లాభ–సంతుష్టః = యాదృచ్ఛికంగా లభించే దానితో సంతృప్తి చెందునట్టియు; **ద్వంద్వ – అతీతః** = శీతోష్ణాది ద్వంద్వములచే ప్రభావితుడు కానట్టియు; **విమత్సరః** = మాత్సర్యము లేనట్టియు; **సిద్ధౌ** = విజయము నందు; **అసిద్ధౌ** = వైఫల్యము నందు; **చ** = కూడా; **సమః** = సమానమైన మానసిక స్థితి గల వ్యక్తి; **కృత్వా అపి** = కర్మను ఆచరించినను; **న నిబధ్యతే** = బంధింపబడడు.

> యాదృచ్ఛికంగా లభించే దానితో సంతృప్తి చెందునట్టియు, శీతోష్ణాది ద్వంద్వములచే ప్రభావితుడు కానట్టియు, మాత్సర్యము లేనట్టియు, విజయము నందు, వైఫల్యము నందు కూడా సమానమైన మానసిక స్థితి గల వ్యక్తి కర్మల నాచరించినను, బంధింపబడడు. (22)

మనము పొందే దానికి 'లాభము' అని పేరు. యోజనలేమీ లేకుండగనే మనకి లభించేది 'యదృచ్ఛాలాభము' అనబడును. అంటే, దైవికంగా లభించేది యదృచ్ఛా లాభము. జ్ఞాని కనీస అవసరాల విషయంలో కూడా యదృచ్ఛాలాభముతో సంతసించును. కావున, అతడు 'యదృచ్ఛా లాభ సంతుష్టః' అనబడును.

జ్ఞానికి 'ద్వంద్వ – అతీతః' అని మరియొక పేరు గలదు. అనగా, పరస్పర విరుద్ధములగు ఈ జంటల మధ్యలో చిక్కుకోకుండా, వాటికి అతీతముగ నుండు వాడు అని యర్థము. ఒక కొన నుండి మరియొక కొన వరకు ఊగులాడుచుండుట మానవుల స్వభావముగా కన్పట్టును. వారు కొనలవద్ద గాని, మధ్యలో గాని చిక్కుకొందురు. పరస్పర విరుద్ధములగు ఈ ద్వంద్వము లేవి?

పరస్పర విరుద్ధములగు జంటలలో ఒకటి శీతోష్ణములు. అవి రెండు మనకు దుఃఖము నీయగలవు. శీతకాలంలో మనం చలి మూలంగా ఇబ్బంది పడతాము. కాని, వేసవిలో వేడి ఎక్కువై బాధపడతాము. వీటి మధ్యలో ఉండే రెండు మాసములలో – ఒకటి శరత్, రెండవది వసంతము – "ఓహో! తొందరలో వేసవి రానున్నది; వేడి భరింప శక్యము కాదు" అనియో, లేక, " ఓహో! తొందరలో చలికాలము రానున్నది; చలిని భరించుట కష్టము" అనియో, చికాకు పడుతూ గడుపుతాము. ఈ తీరున, మనము సంవత్సరం పొడుగునా, వేడి గురించియో, లేక చలి గురించియో ఫిర్యాదు చేస్తూ గడుపుతాము. ప్రతి సంవత్సరము ఇంతే!

ఈ విధంగా, ఈ ద్వంద్వములలో ఇటు గాని, అటుగాని, మధ్యలో గాని చిక్కుకొన్నవారికి, ప్రతి విషయంలో, ప్రతి పరిస్థితిలో ఇబ్బంది కనబడుతుంది. వాస్తవంలో సంసారులందరూ ఈ కోవకు చెందినవారే. కొంత సౌకర్యము, కొంత సుఖము కలుగగానే, వ్యక్తి ఉత్సాహంతో లేచి నిలబడతాడు. కొంత అసౌకర్యము, కొద్ది దుఃఖము కలుగగానే కూలబడతాడు. అన్ని పరిస్థితుల యందు సమత్వము, అంతరంగములో అనుద్విగ్నత గల వ్యక్తి ద్వంద్వాతీతుడనబడును. ఆత్మ అకర్తయనే జ్ఞానము గల వ్యక్తి కర్మ యందు అకర్మను దర్శించును గనుక, ఇట్టి ప్రశాంతి అతనికి సహజముగా అబ్బును. మరియు, ఈ అనుద్విగ్నత అతని స్వరూపము (ఆనంద-స్వరూప) గనుక, తొలగిపోయేది కాదు.

ద్వంద్వాతీతుడు తన భద్రత, ఆనందముల కొరకై లాభాలాభములు, జయాపజయములు ఇత్యాది వివిధ రకముల ద్వంద్వములపై ఆధారపడడు. దీనికి భిన్నంగా, ఇతరులు ఈ ద్వంద్వములలో తగుల్కొని ఉంటారు. ఒక పరిస్థితి నాకు ఆనందాన్ని ఇస్తే, దానికి విరుద్ధమగు పరిస్థితి దుఃఖము నిచ్చును. కాని, జ్ఞాని ఈ ద్వంద్వముల కతీతుడుగ నుండును. అనగా, అతడు వాటి విషయంలో వాస్తవిక దృష్టికోణము నవలంబించి, వాటి సమ్మోహమునకు వశము కాని వాడై , కర్తవ్యమును నిర్వర్తించును. ఇందువలననే జ్ఞాని 'ద్వంద్వాతీతుడు' అనబడును.

మధ్యమార్గము ఒక సాధనము

ద్వంద్వముల కతీతుడగుట వేరు; ద్వంద్వముల మధ్యమార్గము వేరు. మధ్యమార్గము ఒక సాధనము మాత్రమే. సాధకుడు ద్వంద్వముల తీవ్రత యందు గాక, వాటి మధ్యమార్గములో జీవించును. ఈ మార్గమునకే ' బంగరు మార్గము' అని కూడ పేరు. బంగరు దారి ద్వంద్వముల తీవ్రత యందు గాక, వాటి మధ్యలో నుండును. దేనియందైననూ ఉత్కటమగు రాగము మంచిది కాదు. అది దురాగ్రహముగా మారి సమస్యలను సృష్టించును. దురాగ్రహము అభిలషణీయము కాదు. కావుననే, సాధకులుగా దురాగ్రహమును, దురభిమానమును పరిహరించుట కొరకై, సర్వ విషయములలో మధ్యమార్గము నవలంబింతురు.

సాధనలో మధ్యమార్గము బంగరు మార్గముగా పరిగణించబడును. సాధకుడు కాలక్రమములో ద్వంద్వాతీతుడగును. అనగా ద్వంద్వములు అతని వశములో నుండును. అవి అతనిని ఏ మాత్రమూ క్షోభపెట్టలేవు. ఒకసారి ద్వంద్వాతీతుడైన వ్యక్తి సహజముగానే ద్వంద్వాతీత స్థితిలో నుండును గాన, అతనికి మధ్యమార్గమునందు శ్రద్ధ వహించవలసిన అవశ్యకత లేదు.

శ్రీకృష్ణుడీ శ్లోకములో ద్వంద్వాతీతుని 'సిద్ధౌ అసిద్ధౌ చ సమః' అని కూడ వర్ణించెను. అనగా, సఫలత (సిద్ధి) యందు, వైఫల్యము (అసిద్ధి) నందు సమానమైన మానసిక స్థితి గలవాడు అని యర్థము. సిద్ధి, అసిద్ధి అనునవి ఒక ద్వంద్వము. కావున, అవి ద్వంద్వాతీతుని ప్రభావితము చేయజాలవు. ఈ శ్లోకములో మనము సన్న్యాసిని గురించి చర్చించుచున్నామను మాటను మరువరాదు. సన్న్యాసి దృష్టిలో సఫలత యనగా కొద్ది ఆహారము లభించుట; లేదా, ప్రశాంతమగు స్థలమును చేరుకోగల్గుట. సఫలత యనగా ఇంత మాత్రమే. వైఫల్యమనగా ఆహారమేమియూ లభించకపోవుట; లేదా, ప్రశాంతమగు స్థానమును చేరలేకపోవుట మాత్రమే. ఈ విధంగా, సన్న్యాసికి కూడా ఏవో కొన్ని సఫలతలు, వైఫల్యములు ఉంటాయి. కాని, అవి రెండూ అతనికి సమానమే.

ఈ శ్లోకము జ్ఞానిని 'విమత్సరః' అని వర్ణించినది. మత్సరమనగా ఇతరుల ఉన్నతిని చూచి ఓర్వలేకపోవుట. అనుకోకుండా దైవికముగా లభించిన దానితో సంతసించువాడు, ద్వంద్వ విముక్తుడు అయిన జ్ఞానికి ఓర్వలేనిదనము లేదను మాట కొంత అసంగతముగ నున్నట్లు కన్పట్టును. శ్రీకృష్ణుడిట్లు చెప్పుటకు కారణమేమి?

ఇష్టానిష్టములు (కామము), క్రోధము, లోభము, భ్రాంతి లేక తప్పుడు విలువలు (మోహము), దర్పము (మదము), ఓర్వలేని దనము (మాత్సర్యము) అను ఆరు దుర్గుణములు గలవు. వాటిలో నొకటి మాత్సర్యము. ఈ శ్లోకములో శ్రీకృష్ణుడు మత్సర శబ్దమును ఈ ఆరుగుణములకు ఉపలక్షకముగా ప్రయోగించెను. ఒక సముదాయములోని వాటన్నింటిని ఒకే పదముతో సూచించే ఈ ప్రక్రియకు ఉపలక్షణమని పేరు. ఈ సంగతిని తెలుసుకోని పక్షములో, ఈ విమత్సర (ఓర్వలేని దనము లేనివాడు) శబ్దము, సమముగా సాగుచున్న ఆలోచనా ప్రవాహమునకు అడ్డుకట్ట వేయును.

మత్సర శబ్దము యొక్క అర్థమును మనమింతకు ముందు చూచియున్నాము. ఒకడు ఆనందముగ నున్నాడు; లేక, అట్లు కనబడినాడు. నీవది చూచి దుఃఖితుడవైతివి. నీవు కోరే వస్తువు అతని వద్ద ఉన్నది గనుక, అతడు ఆనందముగా నున్నాడని నీవు భావిస్తావు. వాస్తవంలో, అతనికి ఆనందము లేకపోవచ్చును. బహుశః ఆ వ్యక్తి నీవు కొనగోరిన గృహమును కొనియుండవచ్చును; లేదా, నీవు వెంటపడుతున్న పదోన్నతిని పొందియుండవచ్చును. నీవు విలువ నిచ్చే వస్తువు ఏదైనా, ఇతరుల వద్ద ఉన్నచో, నీలో ఓర్వలేనిదనము కలుగవచ్చును. ఇతరుల అభివృద్ధిని, విజయమును చూచిన నీకు దుఃఖము కలుగవచ్చును. ఈ విధముగా మనలను దుఃఖితులను చేసే మనస్స్థితికి మాత్సర్యమని పేరు.

ఆరు విధముల మనస్తాపములు

పైన పేర్కొనబడిన ఆరువిధముల మనస్తాపములలో ఓర్వలేనిదనము చాల పెద్దది గనుకనే, శ్రీకృష్ణుడు దానిని ప్రత్యేకముగా పేర్కొనినాడు. ఈ ఆరుగుణములు సాధారణంగా అందరిలో ఉంటాయి. వ్యక్తి తాను అపూర్ణుడనని భావిస్తాడు. కావుననే, వ్యక్తికి రాగద్వేషాలు ఉంటాయి. వీటి పరిపూర్తి వలననే తాను సుఖిగా, సురక్షితునిగా ఉండగల్గుతానని వ్యక్తి భావిస్తాడు. వీటికే కామము అని పేరు.

కామము ఉన్నచోట క్రోధము పుట్టే అవకాశముండును. నీవు కోరే వస్తువునకు, నీకు మధ్యలో ప్రతిబంధకముగా ఏదైనా నిలిస్తే, నీకు గల కామము అనే కిరణము దానినుండి నీవైపునకు పరావర్తితమగును. ఈ పరావర్తితమగు కామమే క్రోధము. కామమే క్రోధముగా మారును. నీవు ఒక వస్తువును కోరి, ఆ కోరిక నెరవేరకపోతే, దుఃఖము పుట్టి, క్రోధముగా మారును. నీ దారికి అడ్డు వచ్చిన వస్తువు, లేదా వ్యక్తి నీ క్రోధమునకు లక్ష్యమగును. ఒకప్పుడు అవరోధము స్వయముగా నీవే కావచ్చును. మరియొకప్పుడు నీ కామనా పరిపూర్తికి అవరోధముగా నిలిచిన వారెవరో నీకు తెలియక, నీవు కంటబడిన వస్తువుపై, లేదా వ్యక్తిపై నీ క్రోధాన్ని వెళ్లగ్రక్కుతావు. ఒకప్పుడు నీ క్రోధమునకు లక్ష్యము భగవానుడే కావచ్చును!

రెండవ అవగుణము లోభము. కొందరి వద్ద కావలసిన దాని కంటె అధికముగనే ధనముండును. కాని, తమకు భద్రతే లేదనే భావన వారిలో సుదృఢముగా నుండుటచే వారా ధనమును తమకొరకు గాని, ఇతరుల కొరకు గాని ఖర్చు చేయలేరు. పైగా, వారు ఇంకా ధనమును ప్రోగుచేయాలని భావిస్తారు. తనకు భద్రత లేదు అనే భావనలో ఉండే అపరిణత మనస్కులలో కామ క్రోధములతో బాటు లోభము కూడ ఉండును.

జీవనమూల్యముల విషయంలో తప్పుడు ధారణలు ఉండుట మరియొక అవగుణము. దీనికి మోహము అని పేరు. వ్యక్తి పెరిగిన సమాజంలో జీవన మూల్యములు తప్పుగా ఉన్న కారణంగా, వ్యక్తికి కూడా అవే అబ్బుతాయి. ఉదాహరణకు, బంగరు రంగు జుట్టు గల స్త్రీలు ఉల్లాసంగా ఉంటారు అనే ధారణ పాశ్చాత్య సమాజాలలో ఉంది. జుట్టు రంగు వ్యక్తి యొక్క ఉల్లాసపు స్థాయిని నిర్ణయిస్తుందనుకోవటం అవివేకము. అదే విధంగా, మహానగరంలో ఇల్లు, కారు గల వ్యక్తి జీవితంలో విజయి అనుకోవటం మన సమాజంలో ఉంది. దీనిని బట్టి వ్యక్తులు కూడా అటులనే భావించుట సహజము. ఈ ధారణలన్నియూ మోహము నుండి పుట్టినవే.

ఇట్టి తప్పుడు ధారణలు సమాజములన్నిటిలో ఉన్నాయి. వీటిని బోధించే సందర్భాలు కూడా లేకపోలేదు. ఈ కారణంగా, వ్యక్తులలో కూడా ఇట్టి ధారణలు దృఢమవుతాయి. ఉదాహరణకు, ఒంటరితనము అంటే ఒక్కడే ఉండుట అనే ధారణ సమాజంలో ఉండుటచే, అది ప్రతివ్యక్తి మనస్సులో ముద్రపడుతుంది. వాస్తవంలో ఒంటరితనమునకు, ఒక్కడే ఉండుటకు ఎట్టి సంబంధమూ లేదు. ఒక వ్యక్తిపై ఇతరులు సహానుభూతి చూపకపోతే, అతడు ఒంటరివాడు అవుతాడు. ఇతరుల సానుభూతిని కోరే పక్షంలో, నీవు ఒంటరివాడవు. నీవు లక్షమంది మధ్యలో ఉన్నా ఒంటరివాడవే. నీవు ఇరవై మందితో కలిసి ఒకే ఇంటిలో ఉన్నా, నీవు ఒంటరిగా ఒక మూల కూర్చుండి, నిన్ను ఇతరులు ప్రేమించరని, సానుభూతిని చూపించరని దుఃఖిస్తూ కూర్చుంటావు.

వ్యక్తి సమాజంలో ఉండే తప్పుడు ధారణలను స్వంతం చేసుకుంటాడు

ఇట్టి తప్పుడు ధారణలు గల సమాజంలో పెరిగే వ్యక్తి వాటిని స్వంతం చేసుకొనుట సహజమే. ఈ విధంగా స్వంతం చేసుకున్న జీవనమూల్యములు వ్యక్తిని జీవితమంతా వెంటాడుతాయి. దృఢంగా మనస్సులో పాతుకుపోయిన ఇట్టి తప్పుడుధారణలను విచారము ద్వారా తొలగించుట చాల కష్టము. ఎంతో అవగాహన ఉంటేనే గాని, అవి తొలగిపోవు. ధనము, అధికారము ఇత్యాదులు రక్షణ నిస్తాయని గాని, లేదా వ్యక్తిత్వమును పెంపొందిస్తాయని గాని భావించుట మోహము తప్ప వేరుగాదు. కాని, తప్పుడు ధారణలు గల సమాజంలో పెరిగిన వ్యక్తిలో ఇట్టి మోహము ఉండుటలో ఆశ్చర్యములేదు.

తన సామర్థ్యములో విశ్వాసములేని (inferiority complex) వ్యక్తిలో దంభము (మదము) ఉండును. మూడు సంవత్సరముల వయస్సు నుండియూ అనుభవించిన అవమానాల కారణంగా చాల మందిలో అంతర్లీనంగా తాము వ్యర్థులమనే భావన ఉంటుంది. రెండు సంవత్సరముల వయస్సు గల శిశువు దృష్టిలో, ఉన్న ఒకే ఒక అహంకారము తాను మాత్రమే. ఆ అహంకారము యథార్థంగా పరిపూర్ణమైన అహంకారము. కాని, ఆ శిశువు క్రమంగా తల్లి అహంకారమును, తండ్రి అహంకారమును, సోదరి అహంకారమును, సోదరుని అహంకారమును కూడ కనుగొంటాడు. మరియు, ఈ అహంకారములన్నీ తన అహంకారము కంటె భిన్నమనియు, అనేక అహంకారములలో తనది కూడా ఒకటి అనియు ఆ శిశువు దర్శిస్తాడు. ఈ దర్శనమే మొట్టమొదటి అవమానము. దీని తరువాత, తరగతిలో మొదటి స్థానము లభించకపోవుట, పరుగు పందెంలో ఓడిపోవుట ఇత్యాదిగా ఇంకా ఎన్నో అవమానాలు అనుసరిస్తాయి. ఇన్ని అవమానాలతో పీడించబడే బాలునకు/బాలికకు

ఆత్మవిశ్వాసము ఎట్లు కలుగును? ఈ అవమానాల బారిని పడని వారెవ్వరు గలరు? కావున, నీకు నీలో, అంతా కాకపోయినా, కొంతైనా న్యూనత, అసామర్థ్యము భాసించుటలో విడ్డూరమేమియూ లేదు.

''నేను అయోగ్యుడను'' అనేది మౌలికమైన సమస్య

'నేను అయోగ్యుడను' అనేది ప్రతి వ్యక్తికి గల మౌలికమైన సమస్య. ఈ సంగతిని ఇతరులు నీకు చెప్పవలసిన అవసరం కూడా లేదు. ఎవరైనా నిన్ను అభినందిస్తే, నీవు చాలా ఆనందిస్తావు. నిన్ను నీవు అయోగ్యునిగా భావిస్తూ ఉండుట వలన, ఇట్టి అభినందనలు ఈశ్వరుని కృపగా భాసిస్తాయి. నీవు కొన్ని రంగాలలో సమర్థుడవే అయినా, 'నేను అయోగ్యుడను' అనే ఈ నిర్ణయము నిన్ను విడనాడదు. ఇట్టి ధారణ గల వ్యక్తి విజయమును సాధించినపుడు, గర్వము (మదము) బయలుదేరును. 'నేను అయోగ్యుడను' అనే ధారణ యొక్క రూపాంతరమే గర్వము. వ్యక్తి తన అయోగ్యతను సహించజాలక, ''నేనింతటి అద్భుతమును సాధించితిని'' ఇత్యాదిగా గొప్పలు చెప్పుకొని, తన మహిమను చాటే యత్నమును చేయును. మానవులలో సాధారణంగా గర్వము (మదము)ను మనము సానుభూతితో అర్థము చేసుకొనవచ్చును.

అసూయ: ఆరింటిలో మిక్కిలి చెడ్డది

కామ, క్రోధ, లోభ, మోహ, మదములు కొంత ఔచిత్యము గల సమస్యలు గనుక, వాటిని సానుభూతితో అంగీకరించవచ్చును. కాని, ఇతరులు ఆనందంగా ఉన్నప్పుడు దుఃఖించుటకు కారణమేమి గలదు? ఒకడైనా సంతోషంగా ఉన్నాడు. ఈశ్వరుని కృప. ఈ భావనతో నేను సంతోషించలేకపోవుటకు కారణమేమి యుండును? ఈ రకమైన ఆనందము నిశ్చితముగా చాల సరళమైన విషయము. ఒకనికి ఏదో ఒక లబ్ధి కలిగినది. అతడు ఆనందంగా ఉన్నాడు. అతనిని చూచి ఆనందించటానికి నాకు ఖర్చు ఏమీ కాదు. అదే లాభం కావాలనుకుని కృషిచేస్తే, అది నాకు కూడ లభిస్తుంది. అట్లు గాక, నేను ఇతరుల లాభమును చూచి దుఃఖిస్తే, అది అసూయ అనబడుతుంది. ఈ అసూయ పైన పేర్కొనిన ఆరు అవగుణములలో కెల్లా మిక్కిలి చెడ్డది.

ఇందువలననే, శ్రీకృష్ణుడు అసూయను ప్రత్యేకంగా ప్రస్తావించి, జ్ఞాని ఈ అవగుణము నుండి విముక్తుడై ఉంటాడని (విమత్సరః) చెప్పెను. అసూయ (మాత్సర్యము) లేదంటే కామ క్రోధ, లోభ, మద, మోహములు లేనట్లే. ఈ ఆరు అవగుణములకు అరిషడ్వర్గము (ఆర్గురు శత్రువుల సముదాయము) అని పేరు.

శ్లోకం ఇంకా ఈ విధంగా కొనసాగుతుంది. జ్ఞాని కర్మల నాచరిస్తాడు. కాని, కర్మఫలములచే బంధింపబడడు (కృత్వాపి న నిబధ్యతే). ఎందువలన? ఇతఃపూర్వము చెప్పిన కారణమే. జ్ఞాన ప్రకాశములో కర్తృత్వ భావన తొలగిపోవుటయే (కర్తృత్వ-అభావాత్) కారణము. ఆత్మ కర్త కాదని జ్ఞాని యెరుంగును. కావున, అతడు కర్మలచే గాని, వాటి ఫలములచే గాని బంధింపబడడు.

ఆశ్రమ దృష్ట్యా సన్న్యాసి కాకపోయినా జ్ఞానియగు వ్యక్తిని గురించి శ్రీకృష్ణుడు మరల వర్ణించుచున్నాడు. ఈతడు సన్న్యాసాశ్రమములో లేడు గనుక, తన ఆశ్రమధర్మములను నిర్వర్తిస్తూ, తాను పోషించవలసిన పాత్రను పోషిస్తూ ఉంటాడు. ప్రతి పాత్రకి కొంత పాత్ర పోషణ, అభినయము ఉండును గదా! ఈ జ్ఞాని వాటిని చక్కగా నిర్వర్తించును. ఇట్టి జ్ఞాని ఆచరించే కర్మల పర్యవసానమేమి? అను విషయమును శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములో వివరించుచున్నాడు:

అధ్యాయము 4, శ్లోకము 23:

गतसङ्गस्य मुक्तस्य ज्ञानावस्थितचेतसः ।
यज्ञायाचरतः कर्म समग्रं प्रविलीयते ॥२३॥

గత సంగస్య ముక్తస్య జ్ఞానావస్థిత చేతసః
యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే (23)

గత-సంగస్య = తొలగిన ఆసంగము కల్గినట్టియు; **జ్ఞానావస్థిత-చేతసః** = జ్ఞానమునందు స్థిరముగా రూఢమైన మనస్సు కల్గినట్టియు; **యజ్ఞాయ** = నిత్య యజ్ఞము కొరకు; **ఆచరతః** = కర్మల నాచరించే; **ముక్తస్య** = ముక్తపురుషుని యొక్క; **కర్మ** = కర్మ; **సమగ్రం** = పూర్తిగా; **ప్రవిలీయతే** = లయమైపోవును.

> తొలగిన ఆసంగము కల్గినట్టియు, జ్ఞానము నందు స్థిరముగా రూఢమైన మనస్సు కల్గినట్టియు, నిత్య యజ్ఞము కొరకు కర్మల నాచరించే, ముక్తపురుషుని కర్మ పూర్తిగా లయమగును. (23)

జ్ఞాని అనేక కార్యకలాపములలో నిమగ్నుడై ఉండవచ్చును. కాని, దేని యందూ ఆసక్తిని కల్గియుండడు. ఆత్మజ్ఞాన ప్రభావముచే జ్ఞాని యందు సంగము పూర్తిగా తొలగిపోవును (గతః). అందువలనే, ఈ శ్లోకము జ్ఞానిని 'గత-సంగః' అని వర్ణించినది.

జ్ఞాని అజ్ఞానము నుండి, కర్తృత్వము నుండి, ధర్మా ధర్మముల నుండి, పుణ్యపాపముల నుండి ముక్తుడు. ధర్మాధర్మముల నుండి విముక్తుడగుట యనగా – జ్ఞాని యందు కర్తృత్వము లేదు గాన, మంచికర్మ, చెడు కర్మ అనే ప్రసక్తి ఉండదు. కర్తృత్వము అస్తమించినది. కావున, జ్ఞాని చేయు కర్మలన్నియూ సహజముగా మంచివి అయి ఉంటాయి. జ్ఞాని మంచి, చెడులు రెండింటి నుండి విముక్తుడు.

ఈతడు ఏల విముక్తుడైనాడు? ఈతని మనస్సు జ్ఞానమునందు బద్ధ మూలమై ఉండుట వలన. బద్ధమూలమగుట యనగా ఆతని జ్ఞానము సుస్పష్టముగ నున్నది; దానిలో సందియమునకు తావు లేదు అని అభిప్రాయము. జ్ఞాని యొక్క ఈ జ్ఞానము కేవల అంతర్దృష్టి (insight) మాత్రమే కాదు. దాని కంటె విశిష్టమైనది. ఆత్మ అకర్తయనే జ్ఞానము నందు జ్ఞాని యొక్క మనస్సు సుదృఢ బద్ధమూలముగ నుండును గనుకనే జ్ఞాని 'జ్ఞాన-అవస్థిత-చేతస్' అని వర్ణింపబడినాడు.

ఇట్టి జ్ఞాని అనుష్ఠించే యజ్ఞాది నిత్యకర్మలు, ఇతర కర్మలు ఆతనికి ఫలము నీయవు. ఆతడు చేసే కర్మ సరళమగు ప్రార్థన కావచ్చును; లేదా, విస్తారమగు యజ్ఞము కావచ్చును. లేదా, ఆతడు ఒక కుటుంబము యొక్క, లేక సమాజము యొక్క సభ్యుడిగా నుండి, ఆ పాత్రకు సంబంధించిన కర్తవ్యముల నాచరించు చుండవచ్చును. లేదా, ఆతడు ఒక ఉద్యోగి కావచ్చును; లేక, యజమాని కావచ్చును. ఈ విధముగా ఆతడు ఎన్నిరకముల పాత్రలను పోషించిననూ, వాటి ఫలము ఆతనికి జమ కాదు.

'సమగ్రం కర్మ' అనగా 'పూర్తి కర్మ' అనగా 'కర్మ, ఫలముతో సహా' అని యర్థము. 'సమగ్రం కర్మ' అనగా 'కర్మలు అన్నియూ' అని కూడ చెప్పదగును. జ్ఞానికి కర్తృత్వము లేదు గనుక, కర్మలు, వాటి ఫలములతో సహా పూర్తిగా విలీనమగును.

ఈ శ్లోకములో వర్ణింపబడేది జ్ఞానియే గాని, కర్మయోగి కాదని గ్రహించాలి. కర్మయోగికి ఇంకనూ కర్తృత్వము ఉండును. ఈ తీరున, ఇచట రెండు స్థాయిలు గలవు. ఒకటి మానసిక భావన యొక్క స్థాయి కాగా, మరియొకటి సునిశ్చితముగా తెలియబడిన జ్ఞానము. కర్మయోగి తన కర్తవ్యముల విషయములో సముచితమగు మానసిక భావన కలవాడై, ఉత్సాహముతో కర్మల నాచరించుచుండగా, ఆ ఉత్సాహము జ్ఞానప్రభావముచే పూర్ణత్వముగా పరిణతి చెంది, ఆతనిని సర్వపరిచ్ఛేదధారణల నుండి విముక్తుని జేయును. జ్ఞానముచే కర్తృత్వము తొలగినంతనే, ఆత్మయందు అధ్యస్తమైన యితర గుణములన్నియూ కూడ తొలగిపోయి, ఆతడు జీవన్ముక్తుడగును.

జ్ఞానయోగమునకు, కర్మకు మధ్యగల సంబంధమును స్పష్టంగా తెలుసుకోవాలి. గీత యోగశాస్త్రు, బ్రహ్మ విద్యలను రెండింటినీ ఉపదేశించును. కర్మల విషయములో ఉండదగిన యోగ్యమగు మానసిక భావనయే కర్మయోగము. జీవనమూల్యములు, అనుశాసనములు, న్యాయబద్ధ జీవనము, ప్రార్థన ఇత్యాదులు కర్మయోగములో అంతర్భాగములే. వీటన్నింటి వలన సాపేక్షికంగా ఏది లభిస్తుందో, అదియే జ్ఞానమునందు పూర్ణముగా లభించును. యోగము నందు శమము గలదు. జ్ఞానము నందు శమము గలదు. యోగములో ప్రసన్నత గలదు. జ్ఞానములో ప్రసన్నత గలదు. కర్మయోగములో శమము, ప్రసన్నత మెల్లమెల్లగా అంశములుగా లభించును. కాగా, జ్ఞానమునందు అవి నిసర్గతః స్థిరముగను, శాశ్వతముగను ఉండును.

కర్మయోగి కూడ కర్మలచే బంధితుడు కాడని మనం చదవబోతున్నాము. అనగా, అతడు వైఫల్యం కల్గినపుడు క్రుంగిపోడు. సఫలత లభిస్తే పొంగిపోడు. అంటే, ద్వంద్వముల విషయంలో అతనికి పరిణతమగు మానసిక స్థితి ఉండుటచే, కర్మఫలముచే ప్రభావితుడు కాడని యర్థము. ఇకపోతే, జ్ఞానిని కర్మఫలము స్పృశింపనే స్పృశింపదు. జ్ఞాని కర్మచే బద్ధుడు కాడు. అంటే, ఆత్మ కర్త కాదు గనుక, జ్ఞాని కర్మ ఫలముచే ఏ మాత్రమూ స్పృశింపబడడని యర్థము. జ్ఞాని దృష్టిలో సర్వము బ్రహ్మమే.

బ్రహ్మ, ఆత్మ ఒక్కటి

అకర్త యనగా 'నేను బ్రహ్మను' అని యర్థము. మనస్సు కూడ బ్రహ్మయే. మనస్సు నేనే. కాని, నేను మనస్సును కాదు. బుద్ధి నేనే; కాని, నేను బుద్ధిని కాదు. దేహము నేనే; కాని, నేను దేహము కాదు. జగత్తు నేనే. నేను జగత్తు కాదు. సర్వము బ్రహ్మమే. కాని, బ్రహ్మ ఏ ఒక్కటీ కాదు. కావున, ఆత్మ బ్రహ్మలు ఒక్కటియే. ఇది తెలుసుకొనుటయే ఆత్మ సాక్షాత్కారము.

మనము ఏ కర్మను చేసినా, చేయబడే కర్మ, ఆచరించే కర్త, ఆచరింపబడే స్థానము, కర్మను చేసే సాధనము, కర్మ సాధ్యమగు ఫలము అనే ఈ సర్వము బ్రహ్మయే. అనగా, సాధింపదగిన లక్ష్యము బ్రహ్మ కంటె భిన్నముగా లేదు.

ఒక క్రతువును చేసినప్పుడు, క్రతువును చేసే కర్త ఉంటాడు. ప్రత్యేకముగా నిర్మింపబడి, అగ్ని హోత్రము ప్రతిష్ఠింపబడిన వేది ఉంటుంది. అగ్నిహోత్రములో హోమము చేయబడే ద్రవ్యము ఉంటుంది. మరియు హోమము చేసే సాధనము (స్రుక్) ఉంటుంది. హోమం చేస్తూ పఠించే

మంత్రము ఉంటుంది. క్రతువు ఒక ఫలమును ఉద్దేశించి చేయబడుతుంది. క్రతువును ఆచరించే వ్యక్తి పుత్రసంతానము, స్వర్గము నిచ్చే పుణ్యము ఇత్యాదులను కోరిగాని, లేదా అంతఃకరణశుద్ధి కొరకు గాని ఆ క్రతువును ఆచరిస్తాడు.

జ్ఞాని ఆచరించే క్రతువు తరువాతి శ్లోకములో వర్ణింపబడినది:

అధ్యాయము 4, శ్లోకము 24:

> ब्रह्मार्पणं ब्रह्म हविर्ब्रह्माग्नौ ब्रह्मणा हुतम् ।
> ब्रह्मैव तेन गन्तव्यं ब्रह्मकर्मसमाधिना ॥२४॥

> బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్
> బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా (24)

అర్పణం = హోమము చేసే సాధనము; బ్రహ్మ = బ్రహ్మము; హవిః = హోమము చేసే ద్రవ్యము; బ్రహ్మ = బ్రహ్మము; బ్రహ్మ-అగ్నౌ = బ్రహ్మ అనే అగ్ని యందు; బ్రహ్మణా = బ్రహ్మచేత; హుతం = హోమము చేయబడుచున్నది; బ్రహ్మ-కర్మ-సమాధినా = సర్వమును బ్రహ్మగా దర్శించే; తేన = అతనిచేత; బ్రహ్మ ఏవ = బ్రహ్మము మాత్రమే; గంతవ్యం = పొందదగినది.

> హోమము చేసే సాధనము బ్రహ్మము. హోమము చేసే ద్రవ్యము బ్రహ్మము. బ్రహ్మ అనే అగ్నియందు బ్రహ్మ చేత హోమము చేయబడుచున్నది. సర్వమును బ్రహ్మగా దర్శించే అట్టి జ్ఞాని చేత బ్రహ్మము మాత్రమే పొందబడును. (24).

పూర్వ ప్రకరణంలో, ఆత్మ క్రియలను వేటినీ ఆచరించదనియు, ఆత్మ స్వరూపతః అకర్త అనియు చూచినాము. బుద్ధిలో కామము, సంకల్పము అను వృత్తులు బయల్దేరుతూ ఉంటాయి. వాటి ఆధారంగా మానవుడు కర్మలనాచరిస్తాడు. స్థూలదేహము (కాయము), వాగింద్రియము, మనస్సు అనే మూడు కర్మేంద్రియములు కర్మలలో సాధనము లవుతాయి (కరణములు). ఇచట స్థూలదేహము అంటే కర్మల నాచరించే అవయవములు, అనగా చేతులు, కాళ్లు అని యర్థము. మనము కర్మల నన్నిటినీ ఈ మూడు ఇంద్రియములలో ఏదో ఒకదానితో ఆచరిస్తాము. ఉదాహరణకు,

మనము చేసే ప్రార్థన మానసికము గాని, వాచికము గాని, లేక దేహావయవములతో ఆచరించే క్రతురూపము గాని కావచ్చును. ఈ మూడు రకముల ప్రార్థనలలో మనస్సు అంతర్గతంగా మిళితమై ఉంటుంది.

సర్వకర్మలకు ఆధారమైన కార్యకరణసంఘాతము (స్థూలదేహము, మనస్సు, ఇంద్రియముల సముదాయము) ఆత్మయైనచో, నేను కర్తను అవుతాను. కాని, ఈ సంఘాతము ఆత్మ కాని పక్షంలో, ఆత్మ దేహేంద్రియ మనస్సుల నుండి విముక్తము, విలక్షణము అగును. ఆత్మ శుద్ధచైతన్య స్వరూపము. ఆత్మయందు కర్మ, లేశమైననూ లేదు. ఇందువలలనే, కర్తృత్వధారణ లేని జ్ఞాని కర్మలను ఆచరిస్తూనే, అకర్త అవుతాడని ఇతః పూర్వము చెప్పబడినది (4–20).

జ్ఞాని ఎంతవరకు కర్మల నాచరిస్తున్నాడనేది ప్రధానం కాదు

జ్ఞాని శరీరధారణకు ఆవశ్యకమగు కర్మలను మాత్రమే ఆచరించే పక్షంలో కూడా, అతనియందు కర్తృత్వభావన లేదు గనుక, అతనికి కర్మఫలములు అంటవు (4–21). ఈ విధంగా జ్ఞానులలో రెండు రకములు వర్ణింపబడినవి. ఒకరకం జ్ఞాని విభిన్న కార్యకలాపాల మధ్యలో క్రియాశీలుడై పూర్తిగా నిమగ్నుడై యుండగా, రెండవరకం జ్ఞాని అట్లు ఉండడు. కాని, విభిన్న కార్యములను నిర్వహించే జ్ఞాని కూడా కర్మలను చేస్తున్నట్లు కాదని చెప్పబడినది. ఎందువలన? జ్ఞాని కర్మలన్నింటి యందు అకర్మను దర్శిస్తాడు. అనగా, కర్మ జరుగుతూ ఉండగా, జ్ఞాని విక్రియమగు ఆత్మను దర్శిస్తాడు. జ్ఞాని ఎంత ప్రమాణంలో (తక్కువ, లేక ఎక్కువ) కర్మలనాచరిస్తాడనేది ప్రధానం కాదు. జ్ఞాని ఆత్మ ను అకర్తగా దర్శిస్తాడు అనేది మాత్రమే ప్రధానమైన విషయము.

జ్ఞాని ఎట్లా ఉండాలి? అనే విషయంలో నియమాలేమీ లేవు. జ్ఞాని ఒకరు క్రియాశీలియై ఉండగా, మరియొక జ్ఞాని సన్న్యాసియై ఉండవచ్చును. సన్న్యాసి కూడా క్రియాశీలిగాగాని, క్రియా విముఖుడుగా గాని ఉండవచ్చును. సన్న్యాసి శరీరధారణకు మాత్రమే ఆవశ్యకమగు కర్మలను ఆచరిస్తూ ఉండవచ్చును. లేదా, ప్రారబ్ధానుసారంగా అతడు లౌకిక కార్యములలో నిమగ్నుడై ఉండవచ్చును. ఏ విధంగానైనా, జ్ఞానికి కర్మ లేదు. కర్తృత్వధారణ లేని జ్ఞానికి కర్మఫలములు అంటవు.

జ్ఞాని విషయంలో కర్మ, తత్సంబంధి సర్వము బ్రహ్మమే అని యీ శ్లోకము ప్రతిపాదించుచున్నది. వాస్తవంలో ఆత్మజ్ఞానమనగా నిదియే. ఆత్మ కంటె భిన్నముగా బ్రహ్మ లేదు.

జ్ఞానిని ముక్తునిగా చేసేది యీ జ్ఞానమే. బ్రహ్మ జ్ఞానఘనము; శుద్ధ చైతన్యము. అనగా, దేశ కాలాధీనము కాదు. బ్రహ్మ నిర్గుణము. ఆత్మకు బ్రహ్మతో ఐక్యము బోధింపబడినది. బ్రహ్మయే సత్యము; అపరిచ్ఛిన్నసత్త; అనంతము. సర్వమునకు బ్రహ్మమే అధిష్ఠానము. సర్వము యొక్క సత్యము బ్రహ్మమే. ఆత్మయందు కాలపరిచ్ఛేదము లేదు; దేశపరిచ్ఛేదము లేదు. ఈ సత్యమగు పరబ్రహ్మముపై సర్వము అధిష్ఠితమై ఉనికిని పొందుచున్నది గావున, సర్వము పరబ్రహ్మ కంటె వేరు గాదు. ఆత్మ బ్రహ్మము కంటె భిన్నము గాదు.

నిజం చెప్పాలంటే, ఆత్మ నిష్క్రియము అని దర్శించగలిగే వ్యక్తి ఆత్మను బ్రహ్మభిన్నముగా దర్శించును. ఇదియే జ్ఞానము. కావున, ఆత్మ అకర్త యనియు, పరంబ్రహ్మ కంటె వేరుగాదనియు మనం తెలుసుకోవాలి. ఈ జ్ఞానముచే సర్వకర్మలే గాక, కర్మ సంబద్ధమగు సర్వము, ఫలములతో సహా, బాధితమగును.

జ్ఞాని ఆచరించే కర్మలన్నియూ సమగ్రముగా విలీనమగును (సమగ్రం కర్మ ప్రవిలీయతే) అని పూర్వశ్లోకములో వివరింపబడినది. ఇతఃపూర్వము చెప్పబడిన 'కర్మణి అకర్మ యః పశ్యేత్' అను వాక్యము ఈ వివరణ వలన మరింత స్పష్టమైనది. జ్ఞాని కర్మ యందు అకర్మను దర్శిస్తాడని చెప్పుటను బట్టి, జ్ఞాని కర్మలనాచరిస్తాడని తేలింది. ఉదాహరణకు, మాటలాడుట ఒక కర్మ. మాటలాడే కర్త ఒకడు ఉంటాడు. విషయవస్తువు ఒకటి ఉంటుంది. మాటలాడే విధానం ఒకటి ఉంటుంది. మాటలాడుటకు కారణమొకటి ఉంటుంది. ఇవి అన్నీ పరం బ్రహ్మ కంటె భిన్నము కాదనే సత్యమును జ్ఞాని దర్శించగల్గుతాడు.

క్రియను ఆచరించే కర్త బ్రహ్మము. క్రియలో విషయమగు కర్మ కూడా బ్రహ్మమే. క్రియలో సాధనమగు కరణము బ్రహ్మ. క్రియ ఆచరింపబడే దేశము కూడా బ్రహ్మయే. ఈ విధముగా సర్వము బ్రహ్మమే అనే సాక్షాత్కారము ఈ శ్లోకములో వైదిక క్రతువు యొక్క దృష్టాంతం ద్వారా ప్రదర్శింపబడినది. ఇచట శ్రీకృష్ణుని తాత్పర్యము వైదిక క్రతు స్వరూపమును బోధించుట కాదు. వేదాంత దర్శనము నిరూపించే జ్ఞానమును శ్రీకృష్ణు డిచట నిర్దేశించుచుండెను.

శ్రీకృష్ణుడు జ్ఞానమును నిరూపించుటకై వైదిక క్రతువును దృష్టాంతముగా ఉపయోగించిన తీరు

వైదిక క్రతువు ఒక రకమైన ప్రార్థనయే. దానికి ఒక ప్రయోజనము గలదు. ఒక వ్యక్తికి ఒక విశిష్ట కామన గలదు. ఒక క్రతువును నిర్వహించే విశిష్ట విధానమొకటి గలదు. ఈ శ్లోకములో క్రియా

సంబద్ధములగు కారకములన్నియూ – క్రియను ఆచరించే కర్త, కర్మ, కరణము, ఫలము, క్రియ ఉద్భవించే స్థానము, క్రియ జరిగే దేశము – ప్రస్తావింపబడినవి.

కారకములన్నియూ బ్రహ్మమే యని శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పుచుండెను. అర్ప్యతే అనేనేతి అర్పణమ్ (అనేన = దీని చేత; అర్ప్యతే = అర్పింపబడుచున్నది). అర్పించే సాధనము అర్పణము అనబడును. అది బ్రహ్మ (బ్రహ్మ అర్పణమ్). అర్పించబడేది ఏది? అర్పించబడేది హవిస్సు. అది కూడా బ్రహ్మమే (బ్రహ్మ హవిః). ఎచట అర్పింపబడుచున్నది? బ్రహ్మాభిన్నమగు అగ్నియందు (బ్రహ్మ-అగ్నౌ) అర్పింపబడుచున్నది. అర్పించునదెవరు? బ్రహ్మచేత అర్పింపబడుచున్నది (బ్రహ్మణా హుతమ్). కర్మ బ్రహ్మమే. అర్పించుటలో ప్రయోజనమేమి? బ్రహ్మప్రాప్తి ప్రయోజనము (బ్రహ్మ గంతవ్యమ్). బ్రహ్మను పొందునది యెవ్వరు? సర్వమును బ్రహ్మముగా దర్శించగల జ్ఞాని (బ్రహ్మ-కర్మ-సమాధినా) బ్రహ్మను పొందును.

యజ్ఞంలో హవిస్సును చెక్కతో చేసిన స్రుక్కుతో సమర్పిస్తారు. దానికి అర్పణము అని పేరు. లేదా, హవిస్సును అర్పించే మంత్రమునకు అర్పణము అని పేరు. హవిస్సును అర్పించేటప్పుడు పఠించే మంత్రము ఆ హవిస్సు అర్పింపబడే దేవతను ఆహ్వానిస్తూ స్తుతిస్తుంది. ఉదాహరణకు, 'ఇంద్రాయ స్వాహా, ఇంద్రాయ ఇదం న మమ' అను మంత్రము ఇంద్రుడనే దేవతకు హవిస్సును అర్పిస్తుంది. 'ఇది ఇంద్రునకు సమర్పించబడుచున్నది; ఇది ఇకపై నాకు చెందదు' అని ఈ మంత్రమునకు అర్థము. ఇదే తీరున, 'అగ్నయే స్వాహా, అగ్నయ ఇదం న మమ' అను మంత్రమునకు 'ఇది అగ్నికి సమర్పింపబడుచున్నది; ఇకపై ఇది నాకు చెందదు' అని యర్థము. ఇట్లు అర్పించుట వలన ఆయా దేవతలు, యజమానికి ఋణపడతారని భావించరాదు. యజమాని తనకు ఇష్టమగు దేవతను ఎన్నుకొని, హవిస్సును అర్పిస్తూ, 'ఈ హవిస్సును నేను నీకు అర్పిస్తున్నాను. ఇది నీది. ఇకపై ఇది నాది కాదు' అని మంత్రపూర్వకంగా అంటాడు. అర్పణ అనగా ఇదియే.

అర్పణయనగా హోమము చేసే స్రుక్కు కావచ్చును; లేదా మంత్రము కావచ్చును. ఈ రెండు పక్షముల యందు అర్పణ బ్రహ్మము కంటె యెట్లు భిన్నము? బ్రహ్మము కంటె వేరుగా ఏదీ లేదు. శబ్దము బ్రహ్మమే. పదము బ్రహ్మమే. జ్ఞానము బ్రహ్మమే. ఇంద్రుడు బ్రహ్మమే. సర్వము బ్రహ్మాభిన్నము. జ్ఞాని యందు బ్రహ్మబుద్ధి ఉండును గావున, అతడు సర్వము నందు బ్రహ్మమును చూచుచూ, క్రతువు నాచరించును. మట్టికుండను చూసే సమయంలో మట్టిని కూడ తప్పక చూస్తాము. బంగరు ఆభరణమును చూసేటప్పుడు బంగారమును తప్పక చూస్తాము. అంగీని చూసేటప్పుడు, వస్త్రమును తప్పక చూస్తాము.

క్రతువులోని సత్యము, మిథ్య

ఇదే విధంగా, జ్ఞాని దేనిని చూచినా, బ్రహ్మమును తప్పక చూస్తాడు. సర్వమునకు బ్రహ్మమే కారణము గదా! సర్వము యొక్క సత్యము బ్రహ్మమే గనుక, సర్వము సత్య బ్రహ్మమే అధిష్ఠానముగా గలది. కావున, సర్వము మిథ్య. అంటే అర్పణము (స్రుక్కు, లేదా మంత్రము) ఇత్యాదులన్నీ మిథ్య. అనగా, అర్పణము బ్రహ్మయే (బ్రహ్మ అర్పణమ్).

అర్పింపబడే ద్రవ్యము హవిస్సు. ఇది నేయిగాని, లేక ఇతర ద్రవ్యము గాని కావచ్చును. ఇది కూడా బ్రహ్మమే. దానిని అర్పించువాడు బ్రహ్మము (బ్రహ్మణా హుతమ్). ఈ సత్యము జ్ఞానికి ఎరుకయే. 'హుతమ్' అనగా హోమము చేయబడిన ద్రవ్యము. ఈ అర్పించుట అనే క్రియకు అధికరణము అగ్ని. హవిస్సు అగ్ని యందు అర్పింపబడును. బ్రహ్మ నుండి ఉద్భవించిన అగ్ని కూడ బ్రహ్మ కంటె వేరు గాదు. అగ్ని బ్రహ్మయే.

ఈ శ్లోకంలో కారకములన్నీ విశ్లేషంగా వివరింపబడినవి. ప్రథమాకారకమగు కర్త బ్రహ్మమే. ద్వితీయాకారకమగు కర్మ బ్రహ్మమే. తృతీయా కారకమగు కరణము కూడ బ్రహ్మమే. చతుర్థీకారకమగు ప్రయోజనము కూడ బ్రహ్మమే. ఐదవ కారకమగు (క్రియ ఉత్పన్నమయ్యే) అపాదానము కూడ బ్రహ్మమే. స్వత్వమును, సంబంధమును బోధించే షష్ఠీ విభక్తి క్రియలో అన్వయించదు గాన, కారకములలో లెక్కకు రాదు. ఆరవది యగు అధికరణ కారకము కూడా ఈ శ్లోకములో చెప్పబడినది (బ్రహ్మాగ్నౌ). హోమమునకు అధికరణమగు అగ్ని కూడ బ్రహ్మమే.

కర్తయై క్రతువును ఆచరించుట

స్వర్గమును కోరి యజ్ఞము నాచరించే వ్యక్తి కర్తయగును. నేను కర్తను. నా కంటె భిన్నమగు స్వర్గమును నేను కోరుతున్నాను. కాన, నేనొక వేదవిహితమైన విశిష్టకర్మను ఆచరిస్తాను. ఆ కర్మయొక్క ఫలమగు పుణ్యము నాకు స్వర్గానికి వెళ్లే టికెట్టు వంటిది. నేను కర్తను అనే ధారణ గల సందర్భములో యజ్ఞము యొక్క అర్థము ఇట్లుండును. కాని, నేను బ్రహ్మను అనే జ్ఞానము గల చోట దాని అర్థము పూర్తిగా మారిపోవును.

స్వర్గముతో సహా సర్వము బ్రహ్మమే. ఈ జ్ఞానము గల వ్యక్తి పొందదగినది యేముండును? జ్ఞాని పొందదగినది బ్రహ్మమే (బ్రహ్మైవ తేన గంతవ్యమ్). అనగా, జ్ఞాని బ్రహ్మయే గనుక, పొందదగినది ఏదీ లేదని యర్థము.

'గంతవ్యమ్' అనగా పొందదగినది, లేక సాధించదగినది అని యర్థము. జ్ఞాని ఎల్లవేళలా బ్రహ్మమే గనుక, పొందదగినది వేరే ఏదీ లేదు. సర్వము బ్రహ్మమే గనుక, బ్రహ్మమునకు దూరముగా ఏదీ లేదు. కావున, బ్రహ్మము కానిది, పొందదగినది ఏదీ లేదు. ఇది యథార్థము. కాని, ఈ యథార్థమును సాక్షాత్కరించుకోవాలి. ఈ సాక్షాత్కారము లేని వ్యక్తి కర్త యగును. అట్టి వ్యక్తి విషయంలో, యజ్ఞములోని సర్వమును బ్రహ్మముగా దర్శించుట ఒక విశిష్ట ఉపాసన యగును. ఒక ఉదాత్తమగు తత్త్వమును సామాన్యమగు వస్తువుపై బుద్ధిపూర్వకముగా ఆరోపించుటయే ఉపాసన యనబడును. ఉదాహరణకు, మనము మూడు వన్నెల వస్త్రశకలముపై భారతదేశమును ఆరోపిస్తాము. ఇది ఒక ఉపాసన.

ఈ ఆరోపము కొన్ని సందర్భములలో బుద్ధిపూర్వకము కాకపోవచ్చును. మనం కొన్ని సందర్భములలో ఒక వస్తువును చూచి మరియొకటి అనుకుంటాము. ఉదాహరణకు, త్రాడును చూచి పాము అని భావించుట (త్రాటిపై పామును ఆరోపించుట) కలదు. ఇది ఒక భ్రాంతి. కాని, దారుప్రతిమ యందు, లేదా పాషాణ ప్రతిమయందు విష్ణుభావన చేయుటలో భ్రాంతి లేదు. కాని, అది మాత్రమే విష్ణువని భావిస్తే, అది కూడా భ్రాంతియే యగును.

ఈ శ్లోకములోని విషయవస్తువు జ్ఞానము మాత్రమే

'నేను బ్రహ్మను' అనే సాక్షాత్కారము గల వ్యక్తి విషయంలో ఈ బ్రహ్మభావన జ్ఞానరూపమే గాని, ఉపాసన కాదు. ఈ శ్లోకములో ప్రతిపాదింపబడే విషయవస్తువు జ్ఞానము మాత్రమే. క్రతువును ఆచరించే వ్యక్తి సర్వమునందు బ్రహ్మమును దర్శించే జ్ఞాని (బ్రహ్మ-కర్మ-సమాధి). సర్వము నందు బ్రహ్మను చూచుటకు బ్రహ్మ-కర్మ యని పేరు.

సర్వత్రా బ్రహ్మను దర్శించుట యెట్లు సంభవము? విప్పారిన నేత్రములతో చుట్టూ చూస్తే సర్వము నందు బ్రహ్మము కనపడునా యేమి? ఎదుట నున్న కుర్చీని చూస్తే ఆ కుర్చీకి ఆధారమైన వస్తువులో బ్రహ్మ భాసించునా యేమి? బ్రహ్మను దర్శించుట అంగీ యందు వస్త్రమును చూచుట వంటిది కాదు. అంగీని చూస్తే, కనబడేది అంగీ మాత్రమే. కావున, ఈ విధంగా బ్రహ్మను చూచుట సంభవము కాదని స్పష్టమే. మరియు, నీవే బ్రహ్మవు గనుక, నీవు బ్రహ్మను చూడజాలవు. కుర్చీ విషయముగా గల మనోవృత్తి బ్రహ్మమే. కుర్చీలోని ప్రతికణము బ్రహ్మము తక్క మరియొకటి కాదు.

మన ఆలోచనలలో విషయమగు వస్తువు యేదైనా, చైతన్యము కంటె వేరుగాలేదు. వస్తుజ్ఞానము, ఆలోచన కూడ ఈ చైతన్యము కంటె భిన్నము కావు. ఈ చైతన్యమే బ్రహ్మము. వస్తువును తెలుసుకునే జ్ఞాత కూడా చైతన్యము కంటె వేరు గాదు. కావున, జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము అనే మూడు బ్రహ్మమే. బ్రహ్మమే చైతన్యము, సత్యము.

'నేను బ్రహ్మము' అను వాక్యమునకు అర్థమేమనగా– జ్ఞాతృ–జ్ఞాన–జ్ఞేయ భేదము లేని నిర్వికల్ప బ్రహ్మము కంటె ఆత్మ వేరు గాదు. 'నిర్వికల్ప' అనగా ఆలోచనారహితము అని యర్థము. జ్ఞాతృ–జ్ఞాన–జ్ఞేయ భేదము లేనిది అని యర్థము. జ్ఞానము నేనే. జ్ఞాత నేనే. జ్ఞానములో విషయమగు వస్తువు కూడా నేనే. ఈ మూడింటి మధ్యగల భేదము ప్రాతిభాసికము మాత్రమే. కావున, 'నేను నిర్వికల్పుడను' అను వాక్యము జ్ఞాతృ–జ్ఞాన–జ్ఞేయముల మధ్య వాస్తవ భేదము లేదను సత్యమును నిర్దేశించును. ఈ జ్ఞానము నందు ద్వితీయ వస్తువు లేదు గనుక, సదా నిర్వికల్పము. నీకు తెలియవచ్చును; తెలియకపోవచ్చును. ఈ జ్ఞానము ఎల్లవేళలా ఉన్నది. ఇదే విధంగా, నీవు చూచునపుడు చూచువాడు, చూపు, చూడబడునది అను మూడు బ్రహ్మమే. నీవు వినేటప్పుడు, వినువాడు, వినికిడి, వినబడునది కూడ బ్రహ్మమే.

ఈ విధంగా, ఏ పరిస్థితిలో ఉన్నా సర్వత్రా బ్రహ్మను దర్శించాలి (సర్వత్ర బ్రహ్మ–దర్శనమ్). కన్నులు తెరిచి, తదుపరి బ్రహ్మను చూచే యత్నమును చేయాలి అనుకోరాదు. బ్రహ్మము కన్నులతో చూచే వస్తువు కాదు. జ్ఞాత బ్రహ్మమే; జ్ఞానము బ్రహ్మమే; జ్ఞేయము కూడ బ్రహ్మమే అనే సత్యమును ఎరుంగుటయే సర్వత్ర బ్రహ్మదర్శనము. ఈ మూడు బ్రహ్మమే అయినా, బ్రహ్మము ఈ మూడింటికి అతీతమైనది.

సర్వత్ర బ్రహ్మను దర్శించుటయే జ్ఞానము

వాస్తవంలో జ్ఞాతృ–జ్ఞాన–జ్ఞేయములను మూడింటిని నిరాకరించవచ్చును. అవి మరల ప్రవేశిస్తే, మరల త్రోసిపుచ్చవచ్చును. అవి నీలో ఉన్నాయి. నీవు వాటిని త్రోసిపుచ్చినావు. అవి మరల ఉన్నాయి. నీవు మరల త్రోసిపుచ్చినావు. కాని, బ్రహ్మము సర్వదా గలదు. ఈ సాక్షాత్కారమునకు బ్రహ్మకర్మ యని పేరు. ఈ సాక్షాత్కారమును కలిగి సర్వత్రా బ్రహ్మమును దర్శించే జ్ఞాని బ్రహ్మ కర్మ–సమాధి యనబడును.

'బ్రహ్మ-కర్మ-సమాధిః' అను పదము, సర్వము బ్రహ్మము అనే యెరుకతో కూడిన బుద్ధిగల వ్యక్తిని (బ్రహ్మకర్మణి సమాహితా బుద్ధిః యస్య) నిర్దేశించును. సర్వకర్మల యందు బ్రహ్మమును దర్శించే ఈ బ్రహ్మ-కర్మ-సమాధి యనబడే వ్యక్తి పొందు లాభమేమి? సర్వమూ బ్రహ్మమే అయినపుడు ఇక పొందుటకేమున్నది? బ్రహ్మము తక్క మరియొకటి లేదు. సర్వము బ్రహ్మమే అయినప్పుడు ఫలమేమి యుండును? కర్త బ్రహ్మమే; కర్మ బ్రహ్మమే అయినప్పుడు, ఫలము ఎక్కడ నున్నది? ఎవరికొరకు? దేని కొరకు?

సర్వము బ్రహ్మమే అనే సాక్షాత్కారము గల జ్ఞాని ప్రజల క్షేమము కొరకై (లోక-సంగ్రహార్థమ్) వివిధ కార్యముల యందు నిమగ్నుడగుచుండును. జ్ఞానికి తనకోసం సాధించుకోదగినది ఏమీ లేదు. అయినా, అతని సమయము ఇతరులకు సాహాయ్యము నందించుటకు ఉపలభ్యమగుచుండును. రక్షణ కొరకు, ఆనందము కొరకు ఏదో ఒక పనిని చేయవలసిన ఆవశ్యకత జ్ఞానికి లేదు. కనుక, అతనికి సమయమును తనకోసం వెచ్చింపదగిన ఆవశ్యకత లేదు. కావున, అతని జీవితములో మిగిలిన సమయమును పూర్తిగా ప్రజలకు అర్పించవచ్చును. వారా సమయమును ఉచితరీతిని వినియోగించుకుని ప్రయోజనమును పొందవచ్చును.

జ్ఞాని మాటలాడకపోయినా, మనము ఆయన వద్దకు వెళ్లి కూర్చుండవచ్చును. ఎంతో మంది రమణ మహర్షి వద్దకు వెళ్లి, కూర్చుంటూ ఉండేవారు. ఆయన ఎక్కువగా మాటలాడే వారు కాదు. అప్పుడప్పుడు ఏవో కొన్ని మాటలను పలికేవారు. ఇది కూడా ఒకరకమైన ఉపదేశమే– మౌన వ్యాఖ్య. మౌనముగా, ఆనందముగా నున్న వ్యక్తి వద్ద కూర్చుంటే, మనకు కూడా శాంతి లభిస్తుంది. మనస్సు ప్రసన్నమవుతుంది. మనం ఆత్మలోనికి చూడగల్గుతాము. మన యెదుట నున్న వ్యక్తి మాటలాడని వాడైనప్పుడు, మనం ఆత్మావలోకనం తక్క చేయగలిగినది యేమున్నది?

పరస్పర సంభాషణ, బాహ్య విషయస్పర్శ లేని సమయంలో మానవుడు ఆత్మావలోకన మగ్నుడవుతాడు. మనం అవలోకించే ఈ ఆత్మ యెట్టిది? చారిత్రక ఆత్మ* కాదు. మన యెదుట నున్న వ్యక్తి పూర్ణమౌనంలో నున్నాడు. ఆయన కనురెప్పలు కూడ వాల్చుట లేదు! ఈ పరిస్థితిలో నీవు ఆత్మావలోకనం చేయుట సహజమే. ఇది ఆత్మ సాక్షాత్కారము కాదు. ఇది ఒక అనుభవము మాత్రమే.

---

* చిన్నతనం నుండి అనేక అనుభవాలను తనలో నింపుకొని, తనదైన వ్యక్తిత్వం ఏర్పరుచుకున్న మనిషి చారిత్రక ఆత్మ (historical self) అని నిర్దేశింపబడినాడు.

ఆ సన్నివేశములో ఒక విలక్షణమైన శాంతి, తృప్తి గలవు. మానవులీ శాంతిని అభిలషిస్తారు. కనుకనే, దానికొరకు వెదుకుతారు. కాని, ఆ శాంతి వెనువెంటనే మాయమవుతుంది. సినిమాచూసి వచ్చిన తరువాత, ' ఆ సినిమా చాలా బాగుంది' అని చర్చించు కున్న విధంగానే, ఈ అనుభవమును స్మరించి, దాని గురించి తమలో తాము చర్చింకుంటారు. సాక్షాత్కారము కలుగలేదు గనుకనే, ఈ అనుభవము భూతకాలీనముగా మిగిలిపోతుంది. ఈ అనుభవమును నీవు స్మరించి, దానిని నీకు తోచిన రీతిని వ్యాఖ్యానించుకొనగలవు. అంత మాత్రమే. అయిననూ, ప్రజలకు ఈ మాత్రం శాంతిని యిచ్చే వ్యక్తి వారికి హితకారి యగుచున్నాడు. ప్రజలకు ఉద్రేకమును కలిగించుట కంటె, ఇట్టి శాంతిని ఇచ్చుట నిశ్చితముగా శ్రేయోదాయకము.

ఉద్రేకము కంటె ఆత్మావలోకనము శ్రేష్ఠము

రాక్ పాటలను పాడేవాడు శ్రోతలకు ఉద్రేకమును కలిగించును. వారు దానికొరకై రుసుమును చెల్లిస్తారు. కాని, ఇచట శాంతి ఉచితంగా లభిస్తుంది. నీవు జ్ఞాని యెదుట కూర్చుని, ఆనందిస్తావు. మనస్సులో అణిచిపెట్టిన భావావేగములను నిర్ముక్తము చేయుటలో ఉద్రేకము సహకరించవచ్చును. కాని, ఆత్మావలోకనము మరింత శ్రేష్ఠమైనది. ఆత్మావలోకనము మిక్కిలి సుందరమైన ప్రక్రియ. ఈ విధంగా, ప్రజలకు తన మౌనముతో శాంతిని యిచ్చే జ్ఞాని మాటలాడకపోవుట ద్వారా ప్రజాహిత కార్యమును నెరవేర్చుచున్నాడు.

శ్రీ రమణ మహర్షి చేసిన దిదియే. వందలాది భక్తులు ఆయన వద్దకు వెళ్లి, ఎదురుగా కూర్చునేవారు. ఆయన మాటలాడకపోవుటచే కొందరు నిరుత్సాహమును పొంది యుండవచ్చును. కాని, చాలమంది ఆ నిశ్శబ్దస్థితిని, ప్రశాంతిని గాంచి ఆనందించేవారు. కాబట్టి, జ్ఞాని ప్రజాహితమును గోరి, విభిన్న కార్యములను చేపట్టవచ్చును; లేదా మౌనముగా కూర్చుండవచ్చును. అట్లు కూర్చుండుటయూ ప్రజాహితకార్యమే. ఏది ఏమైనా, జ్ఞాని కర్మలను చేసినా, చేయకపోయినా, అకర్మయే వాస్తవము. జ్ఞాని చేసే కర్మ లన్నియూ బ్రహ్మజ్ఞానముచే బాధింపబడును. కావ, అవి కర్మలు కానే కావు. ఆత్మ రూపుడగు జ్ఞాని నిష్క్రియుడు.

నటుడు రంగస్థలముపై ఎన్నో అభినయాలను చేస్తాడు. పాత్ర తానే. కాని, తాను పాత్ర కాదు. ఈ సత్యము అతనికి తెలియును. తాను చేసే నటన మిథ్యారూపము అనే జ్ఞానము అతని యందుండుటచే, తాను పాత్ర కాదనే సత్యము అతనికి స్పష్టంగా గోచరిస్తుంది. ఇదే విధముగా, జ్ఞాని

యందు 'నేను పాత్రను గాను; పాత్ర మిథ్య; నేను సత్యము' అను యెరుక ఉండును. అతని నుండి ఎన్నో కర్మలు ఉద్గమించుచున్ననూ, వాటి మిథ్యా స్వరూపము అతనికి యెరుకయే. ఈ సత్యము నెరింగిన జ్ఞాని వాస్తవంలో కర్మలను చేయనివాడుగనే పరిగణింపబడును.

ఈ శ్లోకము ఈ సాక్షాత్కారమును క్రతురూపముగా ప్రదర్శించుచున్నది. దీనిలో కర్మ అకర్మగా పరివర్తన చెందినది. కారకములన్నియు బ్రహ్మాభిన్నములు. అనగా, కారకములు బ్రహ్మజ్ఞానముచే బాధింపబడి, తమ ఉనికిని గోల్పోయినవి.

సర్వము బ్రహ్మ యను జ్ఞానముచే కర్తృత్వము ఉపమర్దితమగును. కర్తృత్వము పోగా, వాస్తవమగు కర్మ కూడ లేదు. కావున, కర్మ యందు అకర్మను దర్శించుట యెట్లు పొసగును? అను ప్రశ్నకు సమాధానముగా, కర్మ పూర్ణముగా బాధితమై, బ్రహ్మము మాత్రమే మిగిలినదని ఈ శ్లోకములో చెప్పబడినది.

కర్మ ఉండాలంటే, ఒక ప్రయోజనము కొరకై కొన్ని క్రియా సాధనము (కరణము)లతో క్రియను ఆచరించే కర్త ఉండాలి. కర్మ నుండి ఫలము పుట్టి, తద్ద్వారా కర్మ వ్యక్తిని బద్ధుని చేస్తుంది. కాని, కర్మల నాచరించే అహంకారము బ్రహ్మలో లీనమై పోయినప్పుడు, అహంకారము బ్రహ్మ కంటె వేరుగా నుండదు. కాని, బ్రహ్మము మాత్రము అహంకారము నుండి విముక్తమై యుండును.

ఈ సందర్భములో ఒక భ్రాంతి కలిగే అవకాశము గలదు. అది యెట్లన – అహంకారము బ్రహ్మమే; కాని బ్రహ్మము అహంకారము కాదు అన్న పక్షంలో, అహంకారమునకు ఒక కొత్త పేరును ఇచ్చినట్లైనది. జరిగినదంతే. అహంకారము బ్రహ్మన్ పదముతో సమానార్థకమగును. 'నేను అహంకారము; నేను కర్తను' అని నేను భావించేను. కర్తకు బ్రహ్మన్ అనే పేరు కూడా గలదని నాకిప్పుడు కొత్తగా తెలిసినది. కర్త బ్రహ్మమే; బ్రహ్మ కర్త కాదు. అంటే, కర్తకు ఒక కొత్తపేరు ఇచ్చినట్లైనది. దీనిలో ఇంతకు మించి విశేషమేమున్నది? అను వాదము సరి కాదు.

ఇచటి సారమేమన, క్రియ బ్రహ్మము; కర్త బ్రహ్మము; సర్వము బ్రహ్మము. కాని, బ్రహ్మము వీటన్నిటి నుండి విముక్తము; అసంగము. అనగా, కర్మలోనే అకర్మ గలదు. కర్మ స్వరూపతః బాధితమైనది. ఈ విధంగా, ఈ శ్లోకంలో ఆత్మస్వరూపము ప్రకటితమైనది. కర్మను జ్ఞానముతో బాధించుటకు జ్ఞాన కర్మ సన్న్యాసము అని పేరు. ఈ అధ్యాయము యొక్క పేరు కూడ అదియే.

ఈ శ్లోకము ఉపాసన కొరకు ఉద్దేశింపబడినదా?

ఇచట శ్రీ శంకరులు భాష్యములో ఒక పూర్వపక్షమును ప్రస్తావించిరి. ప్రతిమ యందు భగవానుని భావనచేసి, ఆరాధిస్తారు. అదే విధంగా, అర్పణము నందు బ్రహ్మ భావనచేసి ఉపాసించాలి అని ఈ శ్లోకమునకు అర్థమును యేల చెప్పరాదు? కాని ఇచట తాత్పర్యము ఉపాసనయే అయినచో, ఉపాసకుడు బ్రహ్మను పొందును (బ్రహ్మైవ తేన గంతవ్యం) అని యేల చెప్పబడినది? శ్లోకమును ఉపాసనాపరముగా వ్యాఖ్యానించినచో, 'కర్మ యందు జ్ఞాని అకర్మను దర్శించును' అని పూర్వశ్లోకములో చెప్పబడిన జ్ఞానమును ఉపేక్షించినట్లగును.

ఆత్మ అకర్తయను సాక్షాత్కారమే జ్ఞానము. మానవులు తమను తాము కర్తగా స్వీకరిస్తారు గనుకనే వారికి సంసారము సంప్రాప్తమైనది. సంసారమనగా కర్తృత్వమే గాని, మరియొకటి కాదు. నీవు నిన్ను కర్తగా స్వీకరిస్తున్నావు అంటే నీవు కార్య–కరణ–సంఘాతముతో తాదాత్మ్యమును పొందియున్నావని యర్థము. నీ దృష్టిలో ఆత్మ యనగా దేహము, మనస్సు, ఇంద్రియములు. వాస్తవంలో నీవు కర్తవు అయ్యే ప్రక్రియ ఇది మాత్రమే. దేహేంద్రియ మనస్సులను ఆత్మగా స్వీకరించుట వలన నీవు సంసారివైనావు. ఇందువలననే, కర్తృత్వమనగా, సంసారిత్వము అని చెప్పబడినది. కర్తృత్వము ఉన్నచోట, సంసారిత్వము ఉండును. అంటే, కర్మఫలభోక్తృత్వము ఉండును. కర్తృత్వము ఉన్నచోట భోక్తృత్వము కూడ ఉండును. సంసారమనగా నిదియే.

ఈ శ్లోకములో ఆత్మ అకర్త యనే సాక్షాత్కారమును నిరూపించుట ద్వారా, సంసారము యొక్క ప్రముఖ సమస్య యగు కర్తృత్వము బాధింపబడినది. కావున, యీ శ్లోకమును పరిచ్ఛిన్న ఫలము నిచ్చే ఉపాసనా పరముగా వ్యాఖ్యానించుట సరిగాదు. పైగా ఈ శ్లోకములో, పొందదగినది బ్రహ్మము (బ్రహ్మైవ తేన గంతవ్యమ్) అని కూడ చెప్పబడినది. బ్రహ్మ అపరిచ్ఛిన్నము గావున, పరిచ్ఛిన్న ఫలము కాజాలదు. మరియు, జీవుడు బ్రహ్మభిన్నుడే గనుక, ఈ సాక్షాత్కారము గల వ్యక్తి సాధింవదగినది యేదీ లేదు. ఈ తీరున, ఈ సాక్షాత్కారమును నిరూపించే ఈ శ్లోకము ఉపాసనాపరము కాజాలదు.

శ్రీకృష్ణుడు కర్మను దృష్టాంతముగా చూపించి, కర్తృత్వ భోక్తృత్వ విరహితము, బ్రహ్మ భిన్నము నగు ఆత్మ యొక్క జ్ఞానమును నిరూపించెను. కర్మలో అకర్మను దర్శించు విధమిదియే. నీవు కర్మను చేయి. కర్మను చేస్తూనే అకర్మను దర్శించు. మనం సినిమాను చూస్తాము. తెల్లని తెరపై వెలుతురు, నీడల విన్యాసమే సినిమా అనే జ్ఞానముతో సినిమాలోని దృశ్యముల సత్యత్వమును

నిషేధిస్తాము. అదే తీరున, కర్మను చూచి, దానిని నిషేధించాలి. ఆత్మ సర్వదా అసంగము. సినిమా బొమ్మలు పడే తెరవలె, ఆత్మ శుద్ధముగ నుండును. ఆత్మ స్వరూపమట్టిది. ఆత్మ కర్మల నాచరించదు (నైవ కించిత్ కర్మ కరోతి); కర్మ ఫలము ననుభవించదు (న కర్మఫలం భుంక్తే).

'ఆత్మయే బ్రహ్మ; కర్మయే అకర్మ' అనే దర్శనమును స్పష్టముగా ప్రతిపాదించే యీ శ్లోకమునకు మరియొక వ్యాఖ్యానము సంభవము కాదు. కర్మను అకర్మగా ప్రదర్శించుట కొరకై, జ్ఞానమును కర్మ రూపముగా ప్రస్తావించవలసి యున్నది. కావున, యీ శ్లోకములో ఈ జ్ఞానము ఒక విశిష్ట యజ్ఞరూపముగా వర్ణింపబడినది. 'కర్మలన్నియూ బ్రహ్మమే' అనే యీ సాక్షాత్కారమును స్తుతించే నిమిత్తమై, శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములలో ఇతర యజ్ఞములను కూడ వర్ణించెను.

ఒక వస్తువును స్తుతించాలన్నా, దానిని తెలుసుకోవాలన్నా, దాని వెనుక నుండే భూమిక (background) నిశ్చితముగా అవసరమగును. ఉదాహరణకు, రత్నము యొక్క రూపము, లేక రంగు తెలియాలంటే, దాని వెనుక స్వచ్ఛమైన పృష్ఠభూమి (background) అత్యవసరము. చిత్రపటానికి కట్టే ఫ్రేము ఆ చిత్రములోని రంగులకు, ఆ చిత్రపటమును వ్రేలాడదీసే పరిసరములకు అనురూపంగా ఉండాలి. అదే విధంగా, ఈ ప్రకరణంలో కూడా వేదములు నిరూపించే బ్రహ్మజ్ఞానమును వివరించుట కొరకై, వివిధ క్రతువులకు, అనుశాసనములకు, వ్రతములకు సంబంధించిన వైదికమైన పృష్ఠభూమిక ఈయబడినది.

యజ్ఞము అనేక రకముల అనుశాసనములతో, నియమములతో కూడి యుండును

రాబోవు కొన్ని శ్లోకములలో అనుశాసనములు, వ్రతములు యజ్ఞశబ్దముచే నిర్దేశింపబడును. అనగా, అంతఃకరణ శుద్ధి కొరకు, మనోనిశ్చలత కొరకు మనము చేయు వ్రతములు, దానములు ఇచట యజ్ఞము లనబడును. భగవానుడు ముందుగా, మనస్సును జ్ఞానోదయము కొరకు సంసిద్ధము చేయుటలో సహకరించే వివిధ యజ్ఞములను బోధించి, తరువాత వాటి పృష్ఠభూమిక (background)లో జ్ఞానసాధనము ఒక యజ్ఞముగా (జ్ఞాన యజ్ఞము) ప్రస్తుతించెను.

అధ్యాయము 4, శ్లోకము 25:

दैवमेवापरे यज्ञं योगिनः पर्युपासते ।
ब्रह्माग्नावपरे यज्ञं यज्ञेनैवोपजुह्वति ॥२५॥

దైవమేవాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే
బ్రహ్మాగ్నావపరే యజ్ఞం యజ్ఞేనైవోప జుహ్వతి (25)

అపరే = ఇతర; **యోగినః** = యోగులు (కర్మయోగులు); **దైవం** = దేవతారాధన రూపమగు; **యజ్ఞం** = యజ్ఞమును; **ఏవ** = మాత్రమే; **పర్యుపాసతే** = అనుష్ఠించెదరు; **అపరే** = ఇతరులు (సన్న్యాసులు); **బ్రహ్మాగ్నౌ** = బ్రహ్మము అనే అగ్ని (జ్ఞానము) యందు; **యజ్ఞేన** = అహంకారము చేత; **యజ్ఞం ఏవ** = అహంకారమునే; **ఉప జుహ్వతి** = సమర్పించెదరు.

కర్మయోగులు దేవతారాధనా రూపమగు యజ్ఞమును మాత్రమే అనుష్ఠించెదరు; ఇతరులు(సన్న్యాసులు) తమను(అహంకారమును) తాము బ్రహ్మము అనే అగ్ని (జ్ఞానము)యందు సమర్పించుకొందురు. (25)

జగత్తునకు తాను రెండు జీవన నిష్ఠల నిచ్చి యున్నానని శ్రీకృష్ణభగవానుడు అర్జునునితో మూడవ అధ్యాయం ఆరంభంలో చెప్పియున్నాడు. మొదటిది సన్న్యాసము. దీనియందు జ్ఞానసాధనయే ఏకైక నిష్ఠగా నుండును. రెండవది కర్మయోగము. దీనియందు జ్ఞానాన్వేషణతో బాటు, క్రియాశీల జీవనము ప్రధానముగా నుండును. ఈ రెండు నిష్ఠల ప్రయోజనము మోక్షమేనని కూడ శ్రీకృష్ణుడు స్పష్టము చేసి యుండెను.

ప్రకృత శ్లోకములో సన్న్యాసి, కర్మయోగి ఇద్దరు కూడ చర్చింపబడినారు. కర్మయోగుల (అపరే యోగినః) కొరకు విధింపబడిన కర్మకు అంతఃకరణశుద్ధి తక్క మరియొక ప్రయోజనము లేదు. మోక్షరూపమగు జ్ఞానము కొరకు వారి మనస్సులను సంసిద్ధము చేయుటయే ఈ కర్మలకు ప్రయోజనము. మనమీ విషయమును గతించిన కర్మయోగ వివరణములలో పూర్ణముగా చూచియున్నాము.

కర్మయోగులు ఆచరించే క్రతువులలో (యజ్ఞం పర్యుపాసతే) సాక్షాత్తుగా భగవానుడు గాని, లేక భగవానుని ఇతర దేవతా రూపము గాని, ప్రధాన ఉపాస్యదేవతగా ఆరాధింపబడును. భగవానుని, లేక ఇతర దేవతను ఎదుట నుంచుకొని చేసే కర్మకు 'దైవం' అని పేరు. ఇంద్రుడు, అగ్ని, ఆదిత్యుడు మొదలగు వారు దేవతలు. వారి అనుగ్రహమును ప్రార్థించుట దైవకర్మ. కర్మయోగులు ఈ విధముగా ఆరాధిస్తారు. వీరు సన్న్యాసుల వలె సర్వమునందు బ్రహ్మను దర్శించరు. వీరు అంతఃకరణశుద్ధి కొరకై భగవానుని కృపను, దేవతల అనుగ్రహమును ప్రార్థిస్తూ, వైదిక కర్మల నాచరిస్తారు.

అంతఃకరణ శుద్ధికొరకు గాక, స్వర్గాదిలోక ప్రాప్తికై క్రతువుల నాచరించు వారిని గురించి ఈ శ్లోకము చెప్పుట లేదని మనకు తెలియును. ఏలయన, ఈ శ్లోకములో క్రతువుల నాచరించువారు 'యోగులు' అని నిర్దేశింపబడినారు. యోగులు కానివారు సంతానప్రాప్తి, సంపద, స్వర్గము ఇత్యాది ఫలముల కొరకు క్రతువుల నాచరింపవచ్చును. ఇట్టి ఫలముల నొసగే కర్మలు వేదములో అనేకములు గలవు. వీటిని అనుష్ఠించు వ్యక్తి 'కామ్యకర్మి' అనబడును. ఈ శ్లోకములో 'యోగినః' అను పదము ప్రయోగింపబడినది గాన, వీరి క్రతువులను అంతఃకరణశుద్ధి కొరకు మాత్రమే ఆచరిస్తున్నారని స్పష్టమైనది.

ఈ క్రతువులను అత్యంత శ్రద్ధాభక్తులతో, ఉత్సాహముతో, నియమముల నన్నిటినీ జాగరూకతతో పాటిస్తూ, అనుష్ఠిస్తారు. వారి యజ్ఞములను దేవతానుగ్రహమును గోరి అత్యంత జాగరూకతతో అనుష్ఠిస్తారనే విషయమును 'ఉపాసతే' అను క్రియాపదమునకు ముందున్న 'పరి' అను ఉపసర్గ సూచిస్తోంది.

'అపరే' అను పదమునకు 'ఇతరులు' అని యర్థము. ఈ శ్లోకములో వర్ణింపబడిన కర్మయోగులకు, సన్న్యాసులకు మధ్య గల వైలక్షణ్యమును సూచించుటకై ఈ పదమిచట ప్రయోగింపబడినది.

తనను తాను జ్ఞానాగ్నికి సమర్పించుకొనుట

'బ్రహ్మాగ్నౌ' అను సమాసములోని అగ్ని పదము జ్ఞానమును (బ్రహ్మజ్ఞానమును) బోధించును. యజ్ఞశబ్దమునకు క్రతువు, వ్రతము అనియే గాక ఆత్మ అని కూడ అర్థము గలదు. జ్ఞానసాధనకు ఉపక్రమించే సమయంలో చేసే హోమము ఒకటి గలదు. కావున, జ్ఞానమును కూడా యజ్ఞముగా భావింపవచ్చును. కావుననే, జ్ఞానయజ్ఞము అని ప్రయోగింపబడినది.

ప్రతి యజ్ఞంలో యజమాని (కర్త) ఉంటాడు. ప్రకృతంలో, జ్ఞానయజ్ఞం చేసే కర్త ముముక్షువు (మోక్షమును గోరువాడు); మరియు జిజ్ఞాసువు (తెలియగోరువాడు). ముముక్షువు తనను తాను అర్పించుకుంటాడని ఈ శ్లోకం నిర్దేశిస్తోంది. ముముక్షువు తానే అర్పింపబడితే, అర్పించేదెవరు? ముముక్షువును మరియొకరు అగ్నిలో సమర్పిస్తే, అది హత్యానేరం అవుతుంది. కాని, ఇచట ముముక్షువు తనను తాను అర్పించుకుంటున్నాడు గనుక, ఇది ఆత్మహత్య అవుతుంది! ముముక్షువు తనను తాను అర్పిస్తున్నాడు (యజ్ఞం యజ్ఞేన ఉపజుహ్వతి). ఇచట యజ్ఞమనగా ఆత్మ.

బ్రహ్మాగ్ని యందు అర్పింపబడేది అహంకారము. అజ్ఞాని దేహేంద్రియమనస్సులను ఆత్మగా భ్రమించి, తాను కర్తనని, భోక్తనని భావించును. ఈ పరిచ్ఛిన్నమగు అహంకారము బ్రహ్మజ్ఞానమనే అగ్ని యందు సమర్పింపబడును.

అహంకారమును బ్రహ్మజ్ఞానమనే అగ్నియందు సమర్పించుట ఆత్మహత్యా పద్ధతులలో కెల్లా శ్రేష్ఠమైనది. ముముక్షువులగు సన్న్యాసులు తమను తాము ఈ బ్రహ్మజ్ఞానమనే అగ్నిలో సమర్పించుకుంటారు. అనగా, సమర్పించే కర్తలు వారే; సమర్పింపబడే ద్రవ్యములు కూడా వారే. జ్ఞానయజ్ఞములో కర్తను నేను. తెలుసుకొనే వాడిని నేను. తెలియబడేది నేను. బ్రహ్మాగ్ని యందు అర్పింపబడేది నేను. అనగా నేనే బ్రహ్మము అని యర్థము.

'నేను బ్రహ్మను' అనే యీ జ్ఞానమునకు సమ్యగ్దర్శనము (స్పష్టమగు సాక్షాత్కారము) అని పేరు. ఇది కర్మయోగులు అనుష్ఠించే దేవయజ్ఞము కంటె విలక్షణమైనది. సన్న్యాసులు పూర్ణవ్రతముగా అనుసరించే జ్ఞాన నిష్ఠకు జ్ఞానయోగమని పేరు. ఈ విషయమును శ్రీకృష్ణుడు అర్జునునితో మూడవ అధ్యాయములో చెప్పియున్నాడు. ఈ జ్ఞానయోగమునే ఈ శ్లోకము జ్ఞానయజ్ఞముగా వర్ణించుచున్నది. ఈ శ్లోకము జ్ఞానయోగులకు, కర్మయోగులకు కల పోలికలను వర్ణించుటకు ఉద్దేశించినది కాదు. కాని, ఈ శ్లోకములో శ్రీకృష్ణుడు దేవయజ్ఞ జ్ఞానయజ్ఞములకు గల సామ్యమును వర్ణించినాడు. శ్రీ శంకరులు కూడా తమ భాష్యములో ఈ సామ్యమును వివరించినారు.

ఈ రెండు యజ్ఞములను వర్ణించిన తరువాత, శ్రీకృష్ణుడు మరి కొన్ని యజ్ఞములను కూడ వర్ణించనారంభించెను. తదుపరి అయన మరల జ్ఞాన యజ్ఞమును స్తుతించెను. రాబోవు కొన్ని శ్లోకాలలో వర్ణింపబడే యజ్ఞాలు వాస్తవంగా యజ్ఞాలు కావు. అవి అంతఃకరణ శుద్ధి ద్వారా మోక్షమును సాధించుట కొరకు ఉద్దేశించిన అనుశాసనములు గనుక, యజ్ఞములుగా ప్రతిపాదించబడినవి. ఈ అనుశాసనముల వలన రెండు ప్రయోజనములు సమకూరును. ఒక విశిష్టమైన ప్రసన్నత, ప్రశాంతి, మనోనిశ్చలత మొదటి ప్రయోజనము. వ్యక్తిని బందీగా, దాసునిగా చేసే రాగద్వేషముల పట్టు నుండి విడుదల, మానసిక పరిణతి అనునవి రెండవ ప్రయోజనము. వ్యక్తి కొన్ని వ్రతములను, క్రతువులను ఆచరించినప్పుడు, అవి అతని మానసిక ప్రవృత్తిలో చక్కటి మార్పులను తీసుకువచ్చి, రాగద్వేషముల బంది నుండి విడుదల చేస్తాయి. ఈ అనుశాసనములు వ్యక్తిలో జాగరూకతను పెంపొందిస్తాయి.

వీటిని సన్న్యాసులు, కర్మయోగులు కూడ సమానమగు ఆదరంతో అనుష్ఠిస్తారు. వాటిని మోక్షముకొరకుగాని, అంతకంటె తక్కువ ఫలము(మానసిక ప్రశాంతి, అనుద్వేగస్థితి, జీవితములో అనుశాసనము ఇత్యాది)ల కొరకు గాని అభ్యసించవచ్చును.

ఎవరెవరు ఏయే వ్రతములను అనుష్ఠించాలి అను విషయంలో నియమాలేమీ లేవు. వ్యక్తులు తమకు నచ్చిన వ్రతమును తమ అవసరాన్ని బట్టి ఎన్నుకోవచ్చును. శ్రీకృష్ణుడు యజ్ఞరూపములుగా అనుష్ఠింపబడే కొన్ని అనుశాసనములను ఇట్లు వర్ణించుచున్నాడు:

అధ్యాయము 4, శ్లోకము 26:

श्रोत्रादीनीन्द्रियाण्यन्ये संयमाग्निषु जुह्वति ।
शब्दादीन्विषयानन्य इन्द्रियाग्निषु जुह्वति ॥२६॥

శ్రోత్రాదీనీంద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి
శబ్దాదీన్ విషయా నన్య ఇంద్రియాగ్నిషు జుహ్వతి (26)

అన్యే = ఇతరులు; సంయమాగ్నిషు = ఆత్మ సంయమము అనే అగ్నుల యందు; శ్రోత్రాదీని = శ్రోత్రము మొదలగు; ఇంద్రియాణి = ఇంద్రియములను; జుహ్వతి = హోమము చేయుచున్నారు; అన్యే = ఇతరులు; శబ్దాదీన్ = శబ్దము మొదలగు; విషయాన్ = ఇంద్రియగోచరములగు వస్తువులను; ఇంద్రియాగ్నిషు = ఇంద్రియములనే అగ్నుల యందు; జుహ్వతి = హోమము చేయుచున్నారు.

> కొందరు ఆత్మ సంయమము అనే అగ్నుల యందు శ్రోత్రము మొదలగు ఇంద్రియములను హోమము చేయుచున్నారు. మరి కొందరు శబ్దాది విషయములను(ఇంద్రియగోచరములగు పదార్థములను) ఇంద్రియములనే అగ్నుల యందు హోమము చేయుచున్నారు. (26)

ఈ శ్లోకములో చెప్పబడిన యజ్ఞము శ్రోత్రాది ఇంద్రియములకు(శ్రోత్రాదీని ఇంద్రియాణి) సంబంధించినది. శ్రోత్రము అనగా చెవి. అది శబ్దముచే కన్ను, ముక్కు, జిహ్వ, త్వగింద్రియము అనునవి గ్రహింపబడును. మనమీ అయిదు ఇంద్రియములతో క్రమముగా వినుట, చూచుట,

ఆఘ్రాణించుట, రుచి చూచుట, స్పృశించుట ద్వారా ప్రత్యక్షజ్ఞానమును పొందుతాము. ఈ అయిదు జ్ఞానేంద్రియములు, మరియు కర్మేంద్రియములు అగ్నియందు సమర్పింపబడును.

అనగా సాక్షాత్తుగా ఇంద్రియములనే సమర్పిస్తారని యర్థమా? చెవులను పీకి, లేక ముక్కును కోసి, లేక కళ్లను పెకిలించి, లేక నాలుకను లాగి అగ్నిలో సమర్పిస్తారా? కానే కాదు. వాస్తవంలో, ఈ యజ్ఞంలో కర్త చేసేదేమీ లేదు. ఈ శ్లోకములో ఇంద్రియములను నియంత్రించుట (ఇంద్రియసంయమము) అనే అనుశాసనము వర్ణింపబడుచున్నది. ఈ అనుశాసనమునకు శమము అని పేరు. అనగా, శమమును పాటించేవారు తమ విషయాసంగములను నియంత్రణలో ఉంచుకుంటారు అని యర్థము. మరో మాటలో చెప్పాలంటే, వారు ఇంద్రియముల విషయంలో జాగరూకతను అభ్యాసం చేస్తారు.

అనుశాసనము పరమ లక్ష్యము కాదు

బౌద్ధులు చేసే ధ్యానములో ఈ జాగరూకత, సావధానత మనకు కనబడతాయి. ఈ అనుశాసనమును అభ్యాసం చేసేవారికి కనురెప్పలు మూయుట, తెరుచుటతో సహా తాము చేసే పనులన్నీ తెలుస్తూ ఉంటాయి. ఈ అభ్యాసము వలన కొన్ని ప్రయోజనములున్న వనుటలో సందియము లేదు. కాని, ఇది ఉద్వేగమును కూడ కలిగించును. దీనికి తోడుగా విచారము ఉండితీరాలి. విచారమునకు ప్రథమస్థానము నీయాలి. ఈ అభ్యాసము ఒక అనుశాసనము మాత్రమే. అనగా, అది తనంత తానుగా చరమలక్ష్యము కాదు. ఒక విశిష్టమగు మానసిక ప్రసన్నతను పొందుటలో ఈ అనుశాసనము ఒక సాధనము మాత్రమే.

విషయాసక్తులచే నియంత్రింపబడే ఇంద్రియ వ్యాపారములను ఇంద్రియ సంయమనము అనే అగ్నుల యందు సమర్పించుట అనే అనుశాసనము ఈ శ్లోకములోని మొదటి యజ్ఞము. జ్ఞానేంద్రియములు అనేకములగుటచే 'అగ్నిషు' అనే బహువచనము ప్రయోగింపబడినది. సమర్పించేది ఇంద్రియ వ్యాపారములను; ఇంద్రియములను కాదు అనే సంగతిని గ్రహించాలి. విషయాసక్తులను, యాంత్రికంగా చేసే కార్యకలాపములను సర్వమును విచారవిమర్శము అనే అగ్నిలో సమర్పిస్తారు. అనగా, సాధకుడు సర్వ వ్యాపారములను విచార విమర్శ చేసి, తెలివిడితో చేస్తాడని యర్థము. సంయమమనగా ఇదియే.

ఈ శ్లోకములో మరో యజ్ఞము వర్ణింపబడినది. దీనిలో శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము అనే విషయములు (శబ్దాది విషయాన్) సమర్పింపబడతాయి. ఇంద్రియగోచరములగు ఈ విషయములు ఇంద్రియములనే అగ్నుల యందు (ఇంద్రియ–అగ్నిషు) అర్పింపబడతాయి. ఈనాడు ప్రపంచంలో సర్వత్రా జరుగుతున్నది ఈ యజ్ఞమే అనిపిస్తుంది. ప్రజలు అన్నిరకాల సినిమాలను చూచుటకు, అన్నిరకాల సంగీతమును వినుటకు బారులు తీరి నిలబడుతున్నారు. వారు కోరే విషయవస్తువులతో ఇంద్రియాగ్నులను పోషిస్తున్నారు. కాని, ఇక్కడ చెప్పే విషయమది కాదు.

ఇంద్రియ–అగ్నిషు = ఇంద్రియాణి ఏవ అగ్నయః తేషు. ఇంద్రియములే అగ్నులు అని శ్రీ శంకరులు వివరించిరి. ఇంద్రియములనే అగ్నుల యందు విషయములు సమర్పింపబడును. పదాలకు ఉన్నది ఉన్నట్లుగా అర్థం చెపితే, శబ్దములు చెవులయందు, రూపములు కన్నుల యందు, గంధములు ముక్కు నందు, రసములు నాలుక యందు, స్పర్శలు త్వగింద్రియమునందు సమర్పింపబడుచున్నవి అనే అర్థము గోచరిస్తుంది. మనము సాధారణంగా జీవితమంతా చేసే పని ఇదియే. దీనిలో అనుశాసనమేమున్నది? మనము యజ్ఞమును గురించి మాటలాడుచున్నాము. యజ్ఞము అనగా అనుశాసనము.

కర్మ యందు అనుశాసనము

ఈ శంకకు శ్రీశంకరులు సమాధానము నిచ్చిరి. ఈ శ్లోకములో వర్ణింపబడే వ్యక్తుల విషయంలో ఇంద్రియ వ్యాపారము అన్నిటి యందు అనుశాసనము గలదు. శిశువు ఎప్పుడు ఎంత తినాలి అనే సంగతిని తల్లి నిర్ణయిస్తుంది. ఈ విషయములను తనంత తానుగా నిర్ణయించుకోగలిగేటంత వరకు, శిశువునకు తల్లి నిర్ణయములు అనుశాసనములౌతాయి. అదే తీరున, యోగులు కూడ కొన్ని అనుశాసనములను పాటిస్తూ ఉంటారు. కొందరు శమమును పాటిస్తే, మరికొందరు దమమును పాటిస్తారు. ఈ శ్లోకములోని ప్రథమార్ధములో శమము, ద్వితీయార్ధములో దమము ప్రస్తావించబడినవి.

ఎంత చూడాలి, ఎంత వినాలి, ఎంత మాటలాడాలి, ఎంత నడవాలి ఇత్యాది విషయాలలో ఇంద్రియములు అనుశాసనబద్ధములై ఉంటాయి. ఇదియే అర్పణము. ఉదాహరణకు, ఎంత తినాలో తెలిసిన వ్యక్తి మరికొంత తినాలనిపించినా, తినడు. ఇవి అన్నీ అనుశాసన బద్ధములై ఉంటాయి. దమమును అభ్యసించుట యనగా నిదియే. యోగులు ముందుగా దమము నభ్యసించి, తదుపరి శమమును స్వీకరిస్తారు. ఈ తీరున వారు అనుశాసన బద్ధమైన జీవనమును గడుపుతారు.

ప్రతి జ్ఞానేంద్రియమునకు ఒక విషయ వస్తువు ఉంటుంది. యోగి విషయవస్తువులను ఇంద్రియములకు అర్పిస్తాడు. కాని, పూర్ణ నియంత్రణ అతని చేతిలో ఉంటుంది. జ్ఞానేంద్రియములు అతనిని పరవశుని చేయజాలవు. అతడు జ్ఞానేంద్రియములను ప్రపంచములో తిరుగాడుటకు అనుమతించును. కాని, అతడు ధర్మమును పాలిస్తూ, అధర్మమును పరిహరిస్తూ, దమమును అభ్యసించును. యోగి జ్ఞానేంద్రియములకు యోగ్యములగు (అవిరుద్ధ) విషయములను మాత్రమే అర్పించును. వ్యక్తియొక్క సాధనకు అడ్డురానిది, క్షేమమునకు అనురూపమైనది అవిరుద్ధమనబడును. ఇచట యజ్ఞమును అర్థము చేసుకొనుటలో ఈ సంగతి ప్రముఖమైనది. యోగి తన సాధనలకు హాని కలుగని విధంగా, ధర్మానికి విరోధం లేకుండా, విషయవస్తువులను స్వీకరించి, భోగించును. యోగి తన జ్ఞానసాధనకు అనుకూలమయ్యే విధంగా జ్ఞానేంద్రియములకు విషయముల నర్పించును.

ఈ శ్లోకములోని 'జుహ్వతి' అను పదము కూడ ప్రముఖమైనది. ఈ పదమునకు అర్థము జ్ఞానేంద్రియములకు సమర్పించుట అని మాత్రమే కాదు. సమర్పించేది నీవు; నియంత్రించేది నీవు; జ్ఞానేంద్రియములు వాటంతట అవి భోగించలేవు అని యీ పదమునకు అర్థము. ఇంద్రియములు సర్వదా ' ఇంకా కావాలి' అంటూ ఉంటాయి. విషయాసక్తుల బలమట్టిది. కాని 'వద్దు' అని చెప్పేది నీవు. మార్కెట్‌లో కొన్న చాక్లెటు అంతా కావాలని శిశువు మారాంచేస్తే, తల్లి 'వద్దు' అని చెపుతుంది. ''ఎందుకు వద్దు? అవి నా చాక్లెట్లు. నేను వెళ్ళి, కొని తెచ్చేను. నేను వాటిని అన్నిటినీ యేల తినరాదు?'' అని శిశువు అంటే, ''అవును; నిజమే. అవి నీ చాక్లెట్లే. కాని, నేను వాటిని నీ కొరకై దాచిపెడతాను. నీవీరోజు ఒకటి తిను. రేపు మరొకటి తిందువుగాని'' అని తల్లి సముదాయిస్తుంది. శిశువు ఏడ్చినా, తల్లి లొంగదు. ఇంద్రియముల విషయంలో కూడా అంతే. యోగి ఆ తల్లివలె నియంత్రిస్తాడు. నిన్ను నీవే నియంత్రించుకుంటావు. విషయాసక్తములైన ఇంద్రియముల ఇచ్ఛలను అనుశాసిస్తావు. దమము యొక్క అభ్యాసమనగా నిదియే.

శ్రీకృష్ణుడింకా యిట్లు చెప్పెను:

అధ్యాయము 4, శ్లోకము 27:

सर्वाणीन्द्रियकर्माणि प्राणकर्माणि चापरे ।
आत्मसंयमयोगाग्नौ जुह्वति ज्ञानदीपिते ॥२७॥

సర్వాణీంద్రియ కర్మాణి ప్రాణకర్మాణి చాపరే
ఆత్మ సంయమ యోగాగ్నౌ జుహ్వతి జ్ఞానదీపితే (27)

అపరే = మరికొందరు; జ్ఞాన-దీపితే = జ్ఞానముచే ప్రకాశింపచేయబడిన; ఆత్మ-సంయమ-యోగ-అగ్నౌ = ఆత్మ నియంత్రణము అనే అగ్ని యందు; సర్వాణి = సమస్తములైన; ఇంద్రియ కర్మాణి = జ్ఞానేంద్రియ వ్యాపారములను; చ = మరియు; ప్రాణ కర్మాణి = కర్మేంద్రియ వ్యాపారములను; జుహ్వతి = సమర్పించెదరు.

> మరికొందరు జ్ఞానముచే ప్రకాశింపచేయబడిన ఆత్మ నియంత్రణము అనే అగ్ని యందు సమస్త జ్ఞానేంద్రియ వ్యాపారములను, కర్మేంద్రియ వ్యాపారములను కూడ సమర్పించెదరు. (27)

ఈ శ్లోకములో వర్ణింపబడే ముముక్షువులు సన్న్యాసులే గాని, జ్ఞానులు గారు. వీరు సన్న్యాసులు గాన, ఆచరించవలసిన విధులు ఉండవు. కావున, వారు శరీరధారణకు ఆవశ్యకమగు కర్మలను మినహాయించి, సర్వకర్మలను ఆత్మసంయమము అనే అగ్నిలో (ఆత్మ-సంయమ-యోగ-అగ్నౌ) అర్పిస్తారు. వారు ధ్యాన, మననములతో నిండిన జీవితాన్ని గడుపుతారు. దీనికే ఆత్మ-సంయమ-యోగము అని పేరు. ఆత్మజ్ఞానమునకు సహకారియగు ఈ ధ్యానము అనే అగ్నిలో, ధ్యానమును అభ్యసించే యోగులు ఇంద్రియ వ్యాపారములను, ఇతర వ్యాపారములను అర్పిస్తారు.

ఈ శ్లోకములో చెప్పబడిన యోగులకు సామాన్య జీవన వ్యాపారములు ధ్యానమయ జీవనములో లీనమవుతాయి. వారు జ్ఞానప్రాప్తి లక్ష్యముగా గలవారై, శరీరధారణకు ఆవశ్యకమగు కర్మలను మాత్రమే ఆచరిస్తారు. ధ్యానమును తప్ప మరియొక పనిని చేయరు. పూర్వ శ్లోకములో సంసార జీవనములో నున్న ముముక్షువులు వర్ణింపబడినారు. ఈ శ్లోకము సర్వసంగ పరిత్యాగులగు ముముక్షువులను వర్ణించినది. వీరు తాము ఉన్న చోటనే ఉండి, ధ్యానమయ జీవితమును గడుపుతూ, జ్ఞానసాధన చేస్తారు. అందువలననే, ఇచట ధ్యానమునకు ప్రాముఖ్యమీయబడినది. ఈ సాధకులు సన్న్యాసులు, యోగులు కూడా. వీరి యందు వివేకము, జ్ఞానముచే ప్రకాశింపచేయబడిన (జ్ఞాన-దీపితే) అనుశాసనము గలదు. అంటే, తమకు ఏమి కావాలో వారికి స్పష్టంగా తెలుసు. వారికి మోక్షరూపమగు జ్ఞానము కావాలి.

ఆత్మసంయమము జ్ఞానమునకు దారి తీయును

ఈ శ్లోకములో 'జ్ఞాన-దీపితే' యనగా జ్ఞానముచే - ఏది మంచి, ఏది చెడు, ఏది నిత్యము, ఏది అనిత్యము, ఏది సత్యము, ఏది అసత్యము అను జ్ఞానముచే - ప్రకాశింపచేయబడునది అని యర్థము. అనగా, వైరాగ్య వివేకములు రెండు కలవని యర్థము. కాని, శమ, దమములను సాధించవలసి యున్నది. సాధకులు ఆత్మ సంయమమును పొందుట కొరకై, సర్వకర్మలను పరిత్యజించి, ధ్యానమయ జీవితమును చేపట్టెదరు. ఇట్టి సన్న్యాసులు యెందరో గలరు. తరువాతి శ్లోకములో శ్రీకృష్ణుడు మరికొన్ని యజ్ఞములను వర్ణించెను:

అధ్యాయము 4, శ్లోకము 28:

द्रव्ययज्ञास्तपोयज्ञा योगयज्ञास्तथाऽपरे ।
स्वाध्यायज्ञानयज्ञाश्च यतयः संशितव्रताः ॥२८॥

ద్రవ్యయజ్ఞాస్తపో యజ్ఞా యోగయజ్ఞాస్తథాపరే
స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞాశ్చ యతయః సంశితవ్రతాః (28)

తథా = మరియు; అపరే = మరికొందరు; ద్రవ్యయజ్ఞాః = సంపదను దానము చేయువారు; తపోయజ్ఞాః = తపస్సు అనే యజ్ఞము గలవారు; యోగయజ్ఞాః = యోగాభ్యాస పరాయణులు; చ = మరియు; స్వాధ్యాయ-జ్ఞాన-యజ్ఞాః = స్వాధ్యాయము, జ్ఞానసాధనలే యజ్ఞముగా గలవారు; యతయః = ప్రయత్నశీలురు; సంశిత వ్రతాః = దృఢమగు వ్రతము గలవారు.

కొందరు సంపదను దానము చేస్తారు. మరికొందరు తపస్సును ఆచరిస్తారు. ఇంకొందరు యోగాభ్యాస పరాయణులై ఉంటారు. మరికొందరు స్వాధ్యాయము, జ్ఞానసాధనల యందు నిమగ్నులై ఉంటారు. వీరు అందరూ ప్రయత్నశీలురే; దృఢమగు వ్రతము గల వారే. ఇవి అన్నియూ యజ్ఞములే (28).

ఈ శ్లోకంలో శ్రీకృష్ణుడు వివిధ రకాల ముముక్షువులు అనుష్ఠించే విభిన్న అనుశాసనము (యజ్ఞము) లను ప్రస్తావించెను. ధనమును, ఇతర వస్తువులను దానముగా ఇచ్చువారు 'ద్రవ్యయజ్ఞాః' అనబడుదురు. ద్రవ్యమును ఇతరులకు దానము చేయుట మాత్రమే గాక, ఆ దానమును ఈశ్వరునకు

అర్పిస్తున్న భావనతో, దానరూపములో ఈశ్వరుని దర్శిస్తూ చేస్తే, అది యజ్ఞము అవుతుంది. ఇట్టి యజ్ఞమును చేయు వ్యక్తి 'ద్రవ్య యజ్ఞః'★ అనబడును.

ఉదాహరణకు, భారతదేశంలో ఒక వ్యక్తి మరణించినపుడు, అతని సంపదలోని కొంతభాగమును -- గోవులు, భూమి, బంగారము, వస్త్రములు, పాత్ర సామగ్రి, ధాన్యములు మొదలగు వాటిని -- ప్రజలకు దానం చేస్తారు. వాస్తవంలో, మరణానంతరం చేసే కర్మకాండలో ప్రముఖభాగమిదియే. శవదహనానికి పూర్వం దానాలను చేస్తారు. కాని, మనిషి జీవించి ఉండగనే, యజ్ఞరూపముగా దానము చేసినచో, అట్టి దానము అంతఃకరణ శుద్ధికి తోడ్పడును.

ఈ శ్లోకంలో తపోయజ్ఞాలనబడే మరోరకం సాధకులు వర్ణింపబడినారు. ప్రాయశ్చిత్తము కొరకు గాని, ఆత్మనిగ్రహము కొరకు గాని చేపట్టే ప్రార్థనాయుక్తమగు అనుశాసనమునకు తపస్సు అని పేరు. భక్తులు చేపట్టే వ్రతనియమములకు కూడ తపస్సు అని పేరు. ఉదాహరణకు, కొందరు ప్రతినెలా ఏకాదశినాడు ఉపవాసము చేసి, ప్రార్థనాదులతో దినమును గడిపే వ్రతమును పాటిస్తారు. ఇట్టి వ్యక్తులకు తపోయజ్ఞాలు అని పేరు. ఏదో ఒక అనుశాసనానికి పేరు తపస్సు గాదు. ప్రార్థనలతో కూడిన అనుశాసనమునకు మాత్రమే తపస్సు అని పేరు. అట్లు గానిచో, పరుగెత్తుట, వ్యాయామము ఇత్యాదులు కూడ యజ్ఞములు అయిపోవును! ఈ అనుశాసనములలో మతపరమైన మానసిక భావన (religious attitude) ఉండును. వీటివలన అంతఃకరణ శుద్ధి లభించును.

ఎనిమిది అంగములతో కూడిన (అష్టాంగ) యోగమునను‌ష్ఠించువారు యోగయజ్ఞాలు అనబడుదురు. అష్టాంగయోగము ఈశ్వరారాధనారూపమైన అనుశాసనము. దీనియందలి ఒక అంగము నియమము. ఈశ్వర శరణాగతి నియమములలో నొకటి. 'యతయః' అనగా ప్రయత్నశీలురు. 'సంశిత వ్రతాః' అనగా నియమములను దృఢముగా పాలించువారు అని యర్థము. వీరు స్వాధ్యాయ-జ్ఞాన-యజ్ఞమును పాలించెదరు.

స్వాధ్యాయ-యజ్ఞమనగా స్వీయవేదశాఖను పఠించుట, లేక పారాయణము చేయుట అని యర్థము. వేదమును ఈ తీరున పఠించి, ప్రతిదినము దానిలోని కొంత భాగమును పారాయణము చేయు పండితులు కొందరు గలరు. వీరు ఇతర కార్యములను వేటినీ చేయరు. ఇట్టివారు స్వాధ్యాయ యజ్ఞాలు అనబడుదురు. వేదాంతశాస్త్రమును అధ్యయనము చేసి, మననము చేయువారు జ్ఞానయజ్ఞాలు

★ ద్రవ్య యజ్ఞః = ద్రవ్య యజ్ఞమును చేయువాడు. యోగ యజ్ఞః ఇత్యాది పదములకు కూడ అర్థము ఇట్లే.

అనబడుదురు. వీరి జీవితము జ్ఞానమునకు అంకితమగును. వేదమునకు, జ్ఞానమునకు ఈ విధముగా కట్టుబడి, వాటిని దీక్షతో ఉపాసించువారిని (స్వాధ్యాయ-జ్ఞాన-యజ్ఞాః) ఈ శ్లోకము 'యతయః సంశితవ్రతాః' అని వర్ణించినది.

మరికొందరు ప్రాణాయామము అనే నియమమును అనుష్ఠిస్తారు. అష్టాంగయోగము యొక్క ఎనిమిది అంగములలో ఇది ఒకటి. తరువాతి శ్లోకము ఈ అంశమును యజ్ఞముగా వర్ణించినది:

అధ్యాయము 4, శ్లోకము 29:

अपाने जुह्वति प्राणं प्राणेऽपानं तथाऽपरे ।
प्राणापानगती रुद्ध्वा प्राणायामपरायणाः ॥२९॥

అపానే జుహ్వతి ప్రాణం ప్రాణేఽపానం తథాపరే
ప్రాణాపానగతీరుద్ధ్వా ప్రాణాయామ పరాయణాః (29)

తథా = మరియు; అపరే = ఇతరులు; ప్రాణాపానగతీ = ఉచ్ఛ్వాస నిశ్శ్వాసముల ప్రవాహమును; రుద్ధ్వా = బంధించి; ప్రాణాయామ పరాయణాః = ప్రాణాయామ అభ్యాసమునకు అంకితమైన వారై; ప్రాణం = ఉచ్ఛ్వాసమును; అపానే = నిశ్శ్వాసము నందు; ప్రాణే = ఉచ్ఛ్వాసము నందు; అపానం = నిశ్శ్వాసమును; జుహ్వతి = హోమము చేయుచున్నారు.

> మరియు, మరికొందరు ఉచ్ఛ్వాసనిశ్శ్వాసముల ప్రవాహమును బంధించి, ప్రాణాయామాభ్యాసమునకు అంకితమై, ఉచ్ఛ్వాసమును నిశ్శ్వాసమునందు, నిశ్శ్వాసమును ఉచ్ఛ్వాసమునందు హోమము చేయుచున్నారు. (29)

ఉచ్ఛ్వాస నిశ్శ్వాస నియంత్రణను ఒక యజ్ఞముగా అభ్యాసము చేయువారు 'ప్రాణాయామ పరాయణాః' అనబడుదురు. 'అయనము' అనగా లక్ష్యము. ప్రాణాయామాభ్యాసము వీరి ప్రధానలక్ష్యము. అనగా, ఆ సమయంలో వారు ఆ అభ్యాసమునకు అంకితమై ఉంటారు. 'ప్రాణాయామ' అను పదములో ప్రాణమనగా ఉచ్ఛ్వాసనిశ్శ్వాసములు. అయామమనగా నియంత్రణము. కాబట్టి, ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములను నియంత్రించే అనుశాసనము ప్రాణాయామ మనబడును.

ప్రాణశబ్దమునకు అనేకార్థములు గలవు. ఇవన్నీ గాలిపీల్చుటకు, లేక జీవించి యుండుటకు సంబంధించిన అర్థములే. జీవనమును ప్రాణమని కూడా అంటారు. మన శరీరంలో జరిగే వివిధ పచన క్రియలను(metabolic activities) నిర్దేశించుటకు కొన్నిసార్లు ప్రాణశబ్దమును వాడతారు. మరికొన్ని సందర్భాలలో ఈ శబ్దము శారీరిక క్రియలను (physiological activity) అన్నిటినీ బోధించుటకు వాడతారు. ఆహారము జీర్ణమగుట, రక్త ప్రసారము ఇత్యాది శారీరక క్రియలను ప్రాణము యొక్క వివిధ రూపాలుగా నిర్దేశిస్తారు.

ఈ సామాన్యార్థాలతో బాటు, ప్రాణశబ్దానికి ఒక విశేషార్థము కూడ గలదు. బయటకు వదిలే గాలిని ప్రాణమనియు, లోపలికి పీల్చుకునే గాలిని అపానమనియు అంటారు. అపాన శబ్దానికి సామాన్యార్థము మరియొకటి గలదు. దేహము నుండి మాలిన్యము అనేక విధములుగా విసర్జింపబడుటకు హేతువగు వాయువ్యవస్థకు అపానమని పేరు. ఈ శ్లోకములో ప్రాణాపాన శబ్దములను ఉచ్ఛ్వాసనిశ్వాసములనే విశేషార్థంలో స్వీకరించాలి. ఉచ్ఛ్వాసనిశ్వాసములను నియంత్రించి ఒక యజ్ఞముగా మలచే అనుశాసనము ఈ శ్లోకములో చెప్పబడినది.

అనుశాసనబద్ధములైన ఉచ్ఛ్వాస నిశ్వాసములు

గాలిని పీల్చి, ఊపిరితిత్తులను గాలితో నింపే ప్రక్రియను పూరకము అంటారు. గాలిని విడిచి, ఊపిరి తిత్తులను ఖాళీచేసే ప్రక్రియను రేచకము అంటారు. ఈ రెండింటిని అనుశాసన బద్ధముగా, మనోనేత్రముతో గమనిస్తూ చేయాలి. గాలి పీల్చే కాలము, విడిచే కాలము కూడ నిర్దిష్టములై ఉన్నాయి. ఈ పూరక రేచకముల మధ్యలో కొద్ది కాలము గాలిని బంధిస్తారు. ఈ విధంగా గాలిని బంధించుట కూడ అనుశాసనములో భాగమే.

గాలిని పీల్చుట, బంధించుట, విడుచుట, మరల గాలిని బయట బంధించుట -- వీటికి పట్టే సమయములు తగిన నిష్పత్తిలో ఉంటాయి. గాలిని పీల్చుటకు, విడుచుటకు, బంధించుటకు పట్టే కాలములను క్రమంగా పెంచవచ్చును. వీటిలో ఒక కాలమును పెంచితే, మిగిలిన కాలములు కూడ అదే నిష్పత్తిలో పెరుగుతాయి. ప్రాణాయామపరులు యజ్ఞరూపముగా ఈ అనుశాసనమును అభ్యసిస్తారు.

ప్రాణమును అపానమునందు హోమంచేస్తారు (ప్రాణం అపానే జుహ్వతి) అని శ్రీకృష్ణుడు చెప్పెను. ప్రాణాయామం చేసే వ్యక్తి ప్రయత్నపూర్వకంగా గాలిని కొంత నిర్దిష్టవ్యవధిలో లోపలికి

పీలుస్తాడు. కాబట్టి, గాలిని లోపలికి పీల్చే కాలము పూర్తి యగువరకు, అతడు గాలిని బయటకు విడువడు. 'గాలి విడుచుట (ప్రాణం)ను గాలిపీల్చుట యందు (అపానే) హోమము చేయుట' అనగా నిదియే. గాలిని విడుచుట యందు కూడా అదే నిష్పత్తిలో కాలవ్యవధిని పాటిస్తారు. ఆ కాలంలో గాలి విడిచే ప్రక్రియను అంతరాయం లేకుండా కొనసాగిస్తారు. అంటే, గాలి విడుచుట (ప్రాణము) యందు గాలిని పీల్చుట (అపానము) హోమము చేయబడినది (ప్రాణే అపానం జుహ్వతి). ఈ విధముగా ప్రాణమును అపానమునందు, అపానమును ప్రాణము నందు సమర్పించుట వలన, ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసములు యజ్ఞములైనవి. అట్లుగానిచో, అందరు గాలిని పీలుస్తారు గనుక, అందరు యజ్ఞమును చేస్తున్నారని చెప్పవలసి వచ్చెడిది.

ప్రాణాయామ పరులు గాలిని పీల్చుట, బంధించుట, విడుచుట అనే ప్రక్రియలను మూడింటిని నియంత్రించి, క్రమభంగం కలుగకుండునట్లు, నిర్దిష్ట కాలవ్యవధిని జాగరూకతతో పాటిస్తూ కొనసాగిస్తారు. క్రమానికి భంగం కలిగించే మానసిక ప్రేరణలను (impulses) వారు త్రోసిపుచ్చి, నిర్ణీత వ్యవధులను పాటిస్తారు. కావున, ఈ నియంత్రణలో యజ్ఞత్వము ఉన్నది. విడిచే గాలి (ప్రాణము) యందు పీల్చేగాలి (అపానము)ని, పీల్చేగాలి యందు విడిచే గాలిని సమర్పిస్తారు.

గాలిని బంధించుట (కుంభకము)

బయటకు విడిచే వాయు ప్రవాహమునకు ప్రాణగతి అని పేరు. లోపలికి పీల్చే వాయు ప్రవాహమును అపానగతి అంటారు. ప్రాణాయామమును అభ్యసించే వ్యక్తి ప్రాణాపానగతులను రెండింటినీ ఆపివేసి, నిర్దిష్ట కాలవ్యవధి వరకు వాయువును ఊపిరితిత్తులలో బంధిస్తాడు. ఈ విధముగా బంధించుటకు కుంభకము అని పేరు. కుంభమనగా కుండ. కుండలో నీటిని ధరించిన తీరున, ఊపిరితిత్తులలో గాలిని ధరించే ప్రక్రియ కుంభకమనబడును.

కుంభక సమయములో ప్రాణాపానవములు రెండు ఆగిపోతాయి. సాధకుడు ప్రాణాపానగతులను ఈ విధముగా ఆపివేసి (ప్రాణాపానగతీ రుద్ధ్వా), ఒకదానిని మరియొక దానిలోకి (అన్యోన్యము) సమర్పిస్తాడు. మరియు, ప్రాణపాన గతులను రెండింటినీ కుంభకములో సమర్పిస్తాడు. దీనిని కుంభక ప్రాణాయామము అంటారు.

కుంభకము రెండు విధములు. గాలిని పీల్చి లోపల బంధిస్తే, అది అంతఃకుంభకము. గాలిని విడిచి, బయట బంధిస్తే, దానిని బహిష్కుంభకము అంటారు. ఈ కుంభకముల కాలవ్యవధి ఉచ్ఛ్వాస

నిశ్వాసముల కాలవ్యవధికి సాపేక్షంగా అనురూపమగు నిష్పత్తిలో ఉంటుంది. ఈ ప్రాణాయామమును యజ్ఞభావనతో అభ్యసించే సాధకునకు ఒక విశిష్టమగు శాంతి, జాగరూకత, మనో నిశ్చలత లభిస్తాయి.

ప్రాణాయామము – నిశ్చలమగు మనస్సు

దీనికి కారణము చాల సరళమైనది. అసంకల్పిత చర్యలుగా ఉండే ఉచ్ఛ్వాస నిశ్వాసములను సంకల్పిత చర్యలుగా మార్చుట వలన, సాధకుడు అంతర్ముఖుడు కాగల్గుతాడు. చేసే పని గాలిని పీల్చుటయే. కాని, మనోనేత్రముతో పరిశీలిస్తూ, గాలి పీలిస్తే, అది ఒక అనుశాసనముగా మారి, మనో నిశ్చలతకు సహకరించును. ఈ సాధనయొక్క ప్రయోజనము అంతఃకరణశుద్ధి, ఈశ్వరోపాసన అయినప్పుడు, ఈ అనుశాసనము యజ్ఞము అవుతుంది.

మనస్సును శుద్ధము చేయుటలో ప్రార్థనను మించినది లేదు. కావున, సాధకులు ఈ అభ్యాసము వలన మనో నిశ్చలతను మాత్రమే గాక, అంతఃకరణ శుద్ధిని కూడా పొందెదరు. శ్రీకృష్ణుడీ విధముగా ప్రాణాయామము అనే అనుశాసనమును వర్ణించి, తరువాతి శ్లోకములో భోజనము చేయుటను యజ్ఞరూపముగా ప్రస్తావించుచున్నాడు.

అధ్యాయము 4, శ్లోకము 30

अपरे नियताहाराः प्राणान् प्राणेषु जुह्वति ।
सर्वेऽप्येते यज्ञविदो यज्ञक्षपितकल्मषाः ॥३०॥

అపరే నియతాహారాః ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి
సర్వేఽప్యేతే యజ్ఞ విదో యజ్ఞక్షపిత కల్మషాః (30)

అపరే = మరికొందరు; నియత-ఆహారాః = పరిమితమగు ఆహారమును స్వీకరించువారై; ప్రాణాన్ = ఇంకనూ తినాలనే కోరికలను; ప్రాణేషు = జఠరాగ్నులయందు; జుహ్వతి = హోమము చేయుచున్నారు; ఏతే = ఈ; సర్వే అపి = అందరు కూడా; యజ్ఞ-విదః = యజ్ఞములను (వ్రతములను) యెరింగినవారే (పాటించువారే); యజ్ఞ-క్షపిత-కల్మషాః = యజ్ఞముచే పవిత్రీకృతములైన మనస్సులు గలవారే.

> మరికొందరు పరిమితమగు ఆహారమును స్వీకరిస్తూ ఇంకా తినాలనే తమ కోరికలను జఠరాగ్నులయందు హోమము చేస్తారు. వీరందరు కూడా యజ్ఞములను (వ్రతములను) యెరింగిన వారే. వీరి మనస్సులు యజ్ఞముచే పవిత్రముగా చేయబడినవి (30).

ఆహారమును మితముగా భుజించువారు 'నియతాహారులు' అనబడుదురు. ''నేను ఇంతే తింటాను; ఇంతకు మించి తినను'' అని వారంటారు. ఇంద్రియముల ద్వారా జీవుడు తనలోనికి స్వీకరించే విషయవస్తువులు (ఆహ్రియతే ఇతి ఆహారః) అన్నీ ఆహార శబ్ద వాచ్యములే. కాని, మనం తినే అన్నము, త్రాగే రసము ఇత్యాది తినుబండారములు ఆహారశబ్దమునకు విశేషార్థములు. మనం తినవలసిన ఆహారము యొక్క పరిమితులను నిర్ణయించే నియమాలు ఉన్నాయి. ఉదరములో సగభాగమును ఘనపదార్థములతోను, పావుభాగమును ద్రవపదార్థములతోను నింపాలి. ఈ ఘన, ద్రవపదార్థములు ఇటునటు కదిలి, గాలితో కలియుటకు వీలుగా మిగిలిన పావు భాగమును ఖాళీగా వదలాలి* ఆ భాగమును తినుబండారములతో నింపరాదు. ఆహార నియమమును అభ్యసించేవారు తాము తినే ఆహారపరిమాణమును నిర్ణయించే విధమిట్టిది.

నియతముగా భుజించుట కూడా ఒక సమర్పణయే

రుచిగా ఉన్న ఆహారమును ఎక్కువగా తినాలనే కోరిక కలుగుతుంది. రుచిలేని ఆహారమును తినరాదనే కోరిక ఉంటుంది.

కావున, ఈ అనుశాసనములో కూడా యజ్ఞ భావన ఉన్నది. అనగా, తినాలనే కోరికను, తినకూడదనే కోరికను నియంత్రించి నియతముగా భుజించే అలవాటు యజ్ఞము అగును. ఇట్లు భుజించువారు 'నియతాహారులు' అనబడుదురు. వారు ఆహారంపై తమకు గల కోర్కెలను, ఆకలిదప్పికలకు హేతువైన జీర్ణకోశము నందు ఆహుతినిస్తారు (ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి). ఇట్టి సాధకుడు ఇంకనూ ఆకలివేస్తూ ఉన్నా, ఎంత తినాలో అంత మాత్రమే తిని భోజనమును ముగిస్తాడు.

---

* పూరయేత్ అశనేన అర్ధం
తృతీయం ఉదకేన తు
వాయోః సంచారణార్థాయ
చతుర్థం అవశేషయేత్

ఈ సాధకులు రెండు పూటలయందు భోజనం చేస్తారు. మధ్యలో ఆకలి ఉన్నా, లేకపోయినా, చిన్న బిస్కట్ ముక్కను కూడా నోట్లో వేసుకోరు. తినాలనే ఇట్టి చిన్న చిన్న కోరికలను వీరు, అన్నమును జీర్ణముచేసి ఆకలిని పుట్టించే జఠరాగ్ని (ప్రాణము)లో హోమం చేసేస్తారు.

ఈ ఆహార నియమమును యజ్ఞముగా అనుష్ఠించే సాధకులు కూడా ఈ శ్లోకాలలో వర్ణించిన ఇతర సాధకులందరి వలెనే, ఈశ్వరుని ఉపాసిస్తారు. ఈశ్వరోపాసనకు జీవితము సంకితము చేసిన సాధకులు చక్కని ఆత్మ నియంత్రణము పొందగల్గుతారు. ప్రస్తుతంలో, తినాలనే కోర్కెలను జఠరాగ్నిలో ఆహుతినిచ్చే సాధకులు కూడా ఈశ్వరుని ఉపాసిస్తారు గనుక, వారి అనుశాసనము మరియొక యజ్ఞముగా మారిపోతుంది.

ఆహారం విషయంలో పాటించే యజ్ఞాలు అనేకం ఉన్నాయి. వీటిలో ఒకటి ఎక్కువ, మరియొకటి తక్కువ అని చెప్ప వీలు లేదు. సాధకులు, తమ తమ వ్రతాలను పాటిస్తారు. వీరినందరినీ ఈ శ్లోకము 'యజ్ఞవిదః' అని వర్ణించినది; అంటే, ఏమి తినాలి, ఎప్పుడు తినాలి, ఎంత తినాలి మొదలగు విషయాలలో నియంత్రణ రూపమైన యజ్ఞములను అనుష్ఠించువారు అని యర్థము. ఈ ఆహారనియమములు ఒకప్పుడు మతపరంగాను, మరియొకప్పుడు సంస్కృతిపరంగాను, మరికొన్ని సందర్భాలలో కేవలవైయక్తికంగాను ఉంటాయి.

అనుశాసనమేదైనా, మతపరమైనది అయ్యే పక్షంలో, యజ్ఞముగా భావింపబడుతుంది. కాని, ఒక అనుశాసనమును ఆరోగ్యము మొదలగు కారణాల దృష్ట్యా పాటిస్తే, అది యజ్ఞముగా భావింపబడదు. కొందరు ఆరోగ్యదృష్ట్యా ఆహార నియమమును పాటిస్తారు. దానికి ఉపాసన కూడా తోడైన పక్షంలో మాత్రమే అది మతపరమైన అనుశాసనమై యజ్ఞము అవుతుంది.

యజ్ఞమును చేస్తే వచ్చు ఫలము

ఈ శ్లోకంలో 'కల్మష' అను పదమునకు 'మాలిన్యములు' అని యర్థము. మాలిన్యములు అనేక విధాలుగా ఉంటాయి. మనస్సులో కూడా మాలిన్యము (అంతఃకరణ-అశుద్ధి) ఉంటుంది. మనకు గల రాగద్వేషాలు, ఇష్టానిష్టాలు, రాగద్వేషముల ప్రాబల్యము వలన మనస్సులో కలిగే చాంచల్యము మొదలగునవి అన్నీ కల్మషములే. యజ్ఞమును చేసే సాధకులలో ఈ కల్మషములు నశిస్తాయి (క్షపిత).

ఈ సాధకులు అనుష్ఠించే సాధనము యజ్ఞము. యజ్ఞ ప్రభావము వలన వారి మనో మాలిన్యములు పూర్తిగా తొలగిపోవుట వారికి లభించే ఫలము (యజ్ఞక్షపిత కల్మషాః).

మతపరమైన అనుశాసనములన్నీ ఈ ప్రయోజనమునిచ్చుటలో సమర్థములే. మనము పాటించే అనుశాసనమేదైనా, అంతఃకరణము శుద్ధమగును. ఒక అనుశాసనము మరియొక దానికంటె గొప్పది అని చెప్పవీలు లేదు. ఎవరు దేనిని పాటించాలి అనేది వారి వారి అవసరాలను బట్టి ఉంటుంది. మతపరమైన వ్రతమును అనుష్ఠించేటప్పుడు తప్పక ఈ సత్యమును దృష్టిలో ఉంచుకోవాలి.

మతపరమగు వ్రతమునకు, ఇతర అనుశాసనములకు గల తేడాను స్పష్టంగా తెలుసుకోవాలి. మతపరమైన అనుశాసనములు కేవల అనుశాసనములు మాత్రమే కాదు. ఇందువలననే మనము చేసే శారీరక వ్యాయామము గాని, లేక ఆరోగ్యము కొరకై పాటించే ప్రత్యేకమగు ఆహారపు అలవాట్లుగాని యజ్ఞము కాజాలవు. అనుశాసనము ఈశ్వరోపాసనా యుక్తమైనప్పుడు మాత్రమే యజ్ఞము అగును.

శ్రీకృష్ణుడింకనూ యిట్లు చెప్పెను:

అధ్యాయము 4, శ్లోకము 31:

यज्ञशिष्टामृतभुजो यान्ति ब्रह्म सनातनम् ।
नायं लोकोऽस्त्ययज्ञस्य कुतोऽन्यः कुरुसत्तम ॥३१॥

యజ్ఞశిష్టామృత భుజోయాన్తి బ్రహ్మ సనాతనమ్
నాయం లోకోస్త్య యజ్ఞస్య కుతోన్యః కురుసత్తమ (31).

కురు–సత్తమ = ఓ కురుశ్రేష్ఠా! (అర్జునా!); యజ్ఞ–శిష్ట–అమృత–భుజః = యజ్ఞ ఫలరూపమగు అమృతమును భుజించువారు; సనాతనం = శాశ్వతమగు; బ్రహ్మ = బ్రహ్మమును; యాన్తి = పొందెదరు; అయజ్ఞస్య = యజ్ఞమును చేయని వానికి; అయం = ఈ; లోకః = లోకము; న అస్తి = లేదు; అన్యః = పరలోకము; కుతః = ఎక్కడిది?

ఓ కురుశ్రేష్ఠా, అర్జునా! యజ్ఞ ఫలరూపమగు అమృతమును భుజించువారు శాశ్వతమగు బ్రహ్మమును పొందెదరు. యజ్ఞమును చేయనివానికి ఈ

> లోకములో ఉపలబ్ధి ఏదియూ ఉండదు. ఇక, పరలోకములో ఉపలబ్ధి యెట్లు కలుగును? (31)

మనం చేసే యజ్ఞాలన్నింటికీ ఫలం ఉంటుంది. ఈ శ్లోకములోని 'అమృత' శబ్దమునకు ప్రసాదము, లేక ఫలము అని అర్థము. యజ్ఞములో ఆహుతి అయిన తరువాత మిగిలేది (శిష్ట) అమృతము. ఈ వివిధ యజ్ఞముల యొక్క ఫలముల ననుభవించే సాధకులను ఈ శ్లోకము 'యజ్ఞ శిష్టామృతభుజః' అన్నది.

ఈ మతపరమగు అనుశాసనముల ననుష్ఠించు సాధకులకు కలిగే ఫలమెయ్యది? వారికి మనశ్శుద్ధి, మనో నిశ్చలత కలుగుతుంది. దాని వలన వారు ఒక విశిష్టమగు ప్రశాంతిని, అనుద్వేగతను ఆస్వాదించగల్గుతారు. ముముక్షువుల విషయంలో ఈ స్థితి వారి ఆత్మజ్ఞాన సాధనకు ఎంతగానో సహకరిస్తుంది. యజ్ఞమును చేయువాడు ముముక్షువు అయినా, కాకపోయినా, యజ్ఞానికి పుణ్యరూపఫలము నియతంగా ఉంటుంది. ఈ పుణ్యము వలన వారికి ఈ జన్మలో గాని, తరువాతి జన్మలలోగాని తదనురూపమగు సుఖము లభించును. ముముక్షువుల విషయంలో చరమ లక్ష్యమగు మోక్షము సిద్ధించును.

మన మిచట కర్మయోగుల గురించి చర్చిస్తున్నాము. ఇంతకు ముందు 'యోగినః' అను పదము ప్రయోగింపబడినది గదా! కావున, ఈ శ్లోకము ముముక్షువుల గురించి వివరిస్తోంది అని స్పష్టమే. మోక్షకాములగు వీరి ఈ అభ్యాసము వలన ఫలవంతమగు విచారమును సలుపుటకు సమర్థమయ్యే మనస్సు లభిస్తుంది. మరో మాటలో చెప్పాలంటే, వారు చేసే విచారము సఫలమగును. వారు శాశ్వత బ్రహ్మమును పొందెదరు (యాంతి బ్రహ్మ సనాతనమ్).

విచారానికి సమయం పడుతుంది

ఇచటి 'యాంతి' అను పదమునకు (బ్రహ్మమును) పొందెదరు అని యర్థము. ఈ 'పొందుట' అను పదము కాలమును సూచిస్తుంది. బ్రహ్మము జీవుని స్వరూపమే అయినా, బ్రహ్మమును పొందాలంటే, విచారమును చేయాలి. దీనికి కొంత సమయం పడుతుంది. యజ్ఞమునకు ఫలమైన అంతఃకరణ శుద్ధిని పొంది, సాధకులు శాస్త్రవిచారమును చేసి, బ్రహ్మజ్ఞానమును పొందెదరు. జీవుడు బ్రహ్మమును పొందే ఉపాయము ఇది ఒక్కటి మాత్రమే. బ్రహ్మజ్ఞాని బ్రహ్మము కంటె వేరు

గాదు. సాధకులీ సత్యమును సాక్షాత్కరించుకొని, బ్రహ్మమును పొందెదరు. బ్రహ్మమును పొందు ఉపాయము ఇది ఒక్కటియే.

మనం ఒక వస్తువును తెలుసుకుంటే, ఆ వస్తువుగా అయిపోము. ఉదాహరణకు, సూక్ష్మక్రిమి విజ్ఞానము(microbiology)ను అధ్యయనముచేసిన వ్యక్తికి అనేక సూక్ష్మక్రిములు తెలుస్తాయి. అంత మాత్రాన, అతడు వాటిగా మారిపోడు. చరిత్రను అధ్యయనం చేసే వ్యక్తి చరిత్ర అయిపోడు. తెలుసుకునే వ్యక్తి తెలియబడే దాని కంటె ఎల్లవేళలా భిన్నంగా ఉంటాడు. కాని, దీనికి భిన్నంగా, ప్రసిద్ధమగు దశమపురుషాఖ్యానంలో దశమపురుష జ్ఞాత దశమపురుషుడవుతాడు. నేను పదవ వాడినై ఉండి, పదవ వానికోసం వెతుకుతూ ఉంటే, అపుడు నేను పదవ వానిని గురించి తెలుసుకొని పదవ వాడిని అవుతాను. పదవ వాడను నేనే. కాని, లెక్కించే సమయంలో నన్ను నేను లెక్కించుట మరిచినాను. పదవ వాడు కనబడలేదు. అప్పుడొక బుద్ధిమంతుడు వచ్చి, నాతో "ఓయీ, పదవవాడివి నీవే" అని చెప్పెను. పదవవాడను నేనే అనే జ్ఞానము నాకు కలిగెను. పదవవానిని తెలుసుకున్నవాడు పదవవాడే.

బ్రహ్మను ఎరింగినవాడు బ్రహ్మ యగును

ఈ విధంగా కొన్ని సందర్భాలలో తెలుసుకునే వాడు, తెలియబడేది ఒకటే అవుతాయి. అపుడు తెలుసుకునేవాడు తెలియబడేది అవుతాడు. మరికొన్ని సందర్భాలలో తెలియబడే వస్తువు, తెలుసుకునేవాడు వేర్వేరుగా ఉంటారు. కాని, ప్రస్తుతంలో బ్రహ్మము నా (ఆత్మ) కంటె వేరుగాదు. కాబట్టి, బ్రహ్మమును ఎరింగినవాడు బ్రహ్మము అగును. ఈ జ్ఞానములోని విశిష్టత, వైలక్షణ్యము ఇదియే.

ఈ జ్ఞానము ఉదయించవలసిన ఆవశ్యకత గలదు. ఇందువలననే, 'యాంతి' అను పదము ప్రయోగింపబడినది. సాధకులు బ్రహ్మను తెలుసుకోవాలి. యజ్ఞమును చేసినంత మాత్రాన మోక్షము లభించదు. బ్రహ్మజ్ఞానమును పొందాలి. బ్రహ్మ జ్ఞానప్రాప్తియే మోక్షము. ఈ శ్లోకములోని 'యాంతి' అను క్రియాపదము యొక్క స్వారస్యమును శ్రీ శంకరులు భాష్యములో వివరించిరి. ఆత్మవిచారమును చేయాలి. అంటే శ్రవణం, మననం చేయాలి. దీనికి సమయం పడుతుంది. ముముక్షువులు ఇట్టి విచారమును చేసి, తద్ద్వారా శాశ్వత బ్రహ్మను బడయుదురు (యాంతి బ్రహ్మ సనాతనమ్).

గీతలో స్తుతి, నిందల ప్రయోగము

గీతలో సర్వత్రా కనబడే ఉపదేశ ప్రక్రియ, బోధనారీతి ఈ శ్లోకంలో నిరూపింపబడినవి. ఈ రీతిలో ముందుగా స్తుతి, తరువాత నింద ఉంటాయి. శాస్త్రము, జ్ఞానము స్తుతింపబడతాయి. ఆచార్యుడు, శిష్యుడు కూడ స్తుతింపబడతారు. ఫలము కూడ స్తుతింపబడుతుంది.

విద్యార్థిలో ఆత్మసాక్షాత్కారమునకు విరోధియగు విషయముల యందు వైరాగ్యమును కలిగించుట, ఆత్మసాక్షాత్కారమునందు తగు అభిరుచిని కలిగించుట, దానియందు అంకిత భావమును నిర్మాణము చేయుట -- ఇవి నింద యొక్క ప్రయోజనములు. నిందకు మరియొక ప్రయోజనము లేదు. వ్యక్తులు అంతంత మాత్రం ఉత్సాహంతో వేదాంతాధ్యయనమును మొదలిడతారు. వారిలోని ఈ అల్పమగు ఉత్సాహమును వృద్ధిచేసి, తీవ్రమగు ఇచ్ఛగా నిర్మాణము చేయుటకై గీతలో నిందాస్తుతులు రెండూ వినియోగింపబడతాయి. కాని, ముందుగా స్తుతి వస్తుంది. అనగా, ఎక్కడైనా స్తుతి వచ్చిందంటే, దాని తరువాత నింద కూడా కనబడుతుంది.

ఈ శ్లోకములో ముందుగా ఫలము చెప్పబడినది -- వారు శాశ్వత బ్రహ్మమును పొందెదరు (బ్రహ్మ సనాతనం యాంతి). అనగా, ఈ అనుశాసనములను, హోమములను, ఉపాసనలను అనుష్ఠించుట వలన, అవి పరంపరయా బ్రహ్మ జ్ఞానమునకు సహకరించి ఫలవంతములగును. నీకు వాటి యందు ఏదో కొంత అభిరుచి, వాటి అనుష్ఠానములో కొద్దిపాటి అంకితభావము గలవు. వాటిని వదిలి పెట్టేస్తే, నీకు ఎంతో నష్టం వాటిల్లుతుంది అనే విషయాన్ని నీకు వివరిస్తే, నీకు వాటియందు గల అభిరుచి, అంకిత భావము ఇబ్బడిముబ్బడిగా పెరుగుతాయి. ఈ శ్లోకంలోని ద్వితీయార్ధము ఈ పనినే చేస్తుంది.

స్తుతిని అర్థం చేసుకున్న తరువాతనే, నింద సరిగా అర్థమవుతుంది. ఉదాహరణకు, బాలుడు/బాలిక మంచి పనిని చేసినపుడు అభినందించాలి; స్తుతించాలి. కాని, అవసరమైనప్పుడు సున్నితంగా మందలించాలి కూడా. మంచి పనిచేసినప్పుడు అభినందించి, తప్పు చేసినప్పుడు వేలెత్తి చూపితే, పిల్లవాడు తెలుసుకోగల్గుతాడు. ఈ మనోవిజ్ఞానము గీతలో సర్వత్రా సమపాళ్లలో దర్శనమిస్తుంది. ముందుగా స్తుతి కనబడుతుంది. వెనువెంటనే, స్తుతి యొక్క పృష్ఠభూమికలో నింద దర్శనమిస్తుంది:

ఈ స్తుతి-నింద ప్రక్రియ మూలంగా ఈ శ్లోకంలో మనకు యజ్ఞ ప్రాముఖ్యము తేలికగా అర్థమవుతుంది. ఇక్కడ గీతలో వర్ణించిన యజ్ఞములను, ఇవియే గాక వేదములలో, వేదాంగములైన

శాస్త్రములలో వర్ణించిన యజ్ఞములను అనుష్ఠించే సాధకులు బ్రహ్మను పొందెదరు. ఉపాసనా యుక్తములగు ఈ అనుశాసనములలో ఏ ఒక్కదానినీ అనుష్ఠించనివారికి లభించేది సున్న. యజ్ఞమును చేయని ఇట్టి వ్యక్తిని 'అయజ్ఞుడు' అంటారు.

యోగ్యమైన మానసిక భావన, అనుశాసనముల ప్రాముఖ్యము

సమస్త ప్రాణులకు భోగ్యమైన ఈ ప్రపంచంలో మనకు అల్పసుఖములతో బాటు, మానసిక పరిణతి యొక్క ఆనందం కూడా లభిస్తుంది. కాని, అనుశాసనమును పాటించని వ్యక్తికి ఈ ప్రపంచంలో లభించేది శూన్యము (అయం లోకః నాస్తి). ఈశ్వరుని ప్రార్థించాలనే మానసిక భావన, అనుశాసనములు లేనివానికి ఈ ప్రపంచంలో ఎదురుదెబ్బలు, గోతిలో పడుటలు తప్ప మరేదీ లభించదు. వెన్నుపోటు ఉన్నచో, చిన్నదెబ్బయైనను దుర్భరమగు నొప్పిని కలిగించును.

యోగ్యమగు మానసిక భావన లేని వ్యక్తికి జీవితంలో ఎన్నో ఎదురుదెబ్బలు ఎదురవుతాయి. మింగుడు పడని చికాకును కలిగించే పరిస్థితులు, ఘటనలు అనేకంగా తారసిల్లుతాయి. యోగ్యమగు మానసిక భావన లేకుండా, నీవు వాటిని ఏవిధంగా ఎదుర్కొనగలవు? అనుశాసనము లేనిచో నీవు దేనిని సాధించగలవు? ఐహికమైన అభివృద్ధి కూడ గగనకుసుమం అవుతుంది. ఇందువలననే, ఈ శ్లోకంలో, సర్వప్రాణులకు ఏవో కొన్ని సుఖములనీయగలిగే ఈ జగత్తు (అయం లోకః) కూడా అయజ్ఞునకు సుఖదాయకముగా నుండదని చెప్పబడినది. అయజ్ఞునకు చిన్న చిన్న సుఖములు కూడ దక్కవు. అట్టివానికి పరలోక సుఖములు గగనకుసుమములని వేరే చెప్పవలెనా? అట్టివాడు మరల మానవుడుగా జన్మిస్తాడనే హామీ యెక్కడిది? ఇంకొక కర్మ సముదాయము మానవజన్మను ఇస్తే, ఆ అవకాశాన్ని ఇంతకంటె బాగా సద్వినియోగం చేసుకోవాలి అని ఆశించుటలో తప్పు లేదు. అంతకు మించి చేయగలిగేది లేదు.

ఈ జగత్తులో లభించే వాటిని పొందలేని అయజ్ఞుడు పరలోకంలో ఏదో పొందుతాడని యెట్లు ఆశించగలము? స్వర్గాది లోకములలో దివ్యసుఖముల ననుభవించటానికి పుణ్యం కావాలి. అంటే, క్రతువులు, ప్రార్థనలు, ధ్యానములు, దానములు ఇత్యాది ధర్మకార్యాలను ఆచరించాలి. అనుశాసన మున్నప్పుడు మాత్రమే ఇవి సాధ్యపడతాయి. కావున, ఉపాసనా సహితమగు అనుశాసనము నేదో ఒక దానిని అనుష్ఠించని వ్యక్తికి పరలోకము లేదు.

మానవుడు తన జీవితంలో సనాతన బ్రహ్మను సాక్షాత్కరించుకోవాలి. అనుశాసనము లేని వ్యక్తికి ఇది బహుదూరము. కనుక, అయజ్ఞునకు ఈ లోకము కూడ నష్టప్రాయమగును.

సుఖానుభవానికైనా ఒక విశిష్ట మానసికస్థితి, అనుశాసనము అవశ్యకమే

డబ్బును సంపాదించవచ్చును. కాని, సంపాదించిన డబ్బుతో సుఖమును పొందుటకు ఒక విశిష్టమానసిక స్థితి అవసరం. దీనికి కొంత విద్య అవసరము. యోగ్యమగు మానసిక భావన లేని వ్యక్తి ఉన్నదానితో వచ్చే సుఖానుభవమును వాయిదా వేసుకుంటాడు. "నాకు ఇంకా ఇవి కావాలి; అవి లభిస్తే, చాలా అద్భుతంగా ఉంటుంది. అపుడు నేను భోగిస్తాను" అనుకుంటాడు. కోరుకున్న వస్తువులు లభించిన తరువాత కూడా, అతడు అద్భుతంగా ఉంది అనుకోడు. సుఖానుభవమును మరల వాయిదా వేస్తాడు. పొందవలసినది మరొకటి ఉంటుంది. ఈ చక్రం అనంతంగా సాగుతుంది!

అనుశాసనం లేకుండా, ప్రార్థించే స్వభావం లేకుండా, జీవనమూల్యాలను లెక్కచేయకుండా, వ్యక్తి దేనినీ సాధించలేడు. కాని, అనుశాసనము గల వ్యక్తి ధనవంతుడు కాకపోయినా, ఎంతో సాధించగల్గుతాడు. ఉదాహరణకు, నీలి ఆకాశంలో నక్షత్రాల సౌందర్యాన్ని ఆస్వాదించటానికి ఖర్చేమీ కాదు. ఈ విధంగా, ఖర్చు కాకుండా ఆస్వాదించదగ్గవి ఎన్నో ఉన్నాయి. సార్వజనిక గ్రంథాలయాలలో అనేక రకాల పుస్తకాలు దొరుకుతాయి. వాస్తవంలో, పుస్తకమును కొనవలసిన అవసరమే లేదు. డబ్బులేకపోయినా, మంచి పుస్తకమును ఇతరుల నుండి అడిగి తీసుకుని, ఏదో ఒక అధ్యాయమును చదివి, ఆనందించవచ్చును.

కాని, డబ్బు ఉండి, యోగ్యమగు మనస్సు లేనివాడు ఏమి ఆనందించగలడు? దేనిని ఆస్వాదించాలన్నా, మనస్సు ఉండాలి గదా! మనస్సు సర్వదా భవిష్యత్తు గురించి చింతామగ్నమై, వర్తమానాన్ని ఆనందంగా స్వీకరించలేని వ్యక్తికి ఆనందమనే ప్రసక్తి యెక్కడిది? జీవితంలో అనుకున్నదానిని సాధించే వ్యక్తులు కూడా భవిష్యత్తును గూర్చి కలలు గంటూ, వర్తమానాన్ని ఆస్వాదించటం విస్మరిస్తారు. భవిష్యత్తును గూర్చిన కల్పనలచే ప్రేరితులై, వీరు అనేక కార్యములను చేపడుతూ ఉంటారు. 'తాము జీవితంలో విజయమును సాధించువారము' అని వాదిస్తూ, వీరు తమ చర్యలను సమర్థించుకుంటారు. కాని, వారు ఉన్నదానిని అనుభవించలేనప్పుడు, ఇట్టి విజయములకు విలువ ఏమి యుండును?

'జీవితంలో విజయమును సాధించుట' అను దానిని మనం రెండు దృష్టికోణాలనుండి పరిశీలించాలి. 'వ్యక్తి ఈ జీవితం నుండి పొందినది యేమి?' అనేది ఒక రకం విజయమైతే, ''వ్యక్తి ఈ జీవితంలో సాధించినది ఏమి?'' అనేది రెండవరకము. వీటిలో మొదటిది ప్రముఖమైనది. అనుశాసనము లేని వ్యక్తికి ఈ జీవితం స్వల్పసుఖాలను కూడా ఈయదు. ఇక సనాతన బ్రహ్మ గురించి చెప్పునదేమున్నది? అది బహుదూరము. కావున, మనము యజ్ఞమును తప్పక చేయాలి అను విషయమును ఈ శ్లోకమునుండి నేర్చుకున్నాము.

శ్రీకృష్ణుడు ఇపుడీ ప్రకరణమును ఉపసంహరిస్తూ, ఇల్లా అంటాడు:

అధ్యాయము 4, శ్లోకము 32:

एवं बहुवधा यज्ञा वितता ब्रह्मणो मुखे।
कर्मजान् विद्धि तान् सर्वान् एवं ज्ञात्वा विमोक्ष्यसे ॥ ३२ ॥

ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణో ముఖే
కర్మజాన్ విద్ధితాన్ సర్వాన్ ఏవం జ్ఞాత్వా విమోక్ష్యసే (32)

ఏవం = ఈ విధముగా; **బ్రహ్మణః** = వేదముయొక్క; **ముఖే** = ముఖమునందు (శబ్దముల యందు); **బహువిధాః** = అనేకరకముల; **యజ్ఞాః** = మతపరమగు అనుశాసనములు (వ్రతములు); **వితతాః** = విస్తరముగా వర్ణింపబడియున్నవి; **తాన్** = వాటిని; **సర్వాన్** = అన్నింటినీ; **కర్మజాన్** = కర్మ (అనాత్మ) నుండి పుట్టిన వాటిగా; **విద్ధి** = తెలుసుకొనుము; **ఏవం** = ఈ విధముగా; **జ్ఞాత్వా** = ఎరింగినవాడవై; **విమోక్ష్యసే** = మోక్షమును పొందగలవు.

> ఈ విధముగా వేదము యొక్క ముఖమునందు (శబ్దముల యందు) అనేక రకముల యజ్ఞములు (వ్రతములు) విస్తరముగా వర్ణింపబడి యున్నవి. వాటినన్నింటినీ కర్మనుండి పుట్టినవిగా తెలుసుకొనుము. ఈ విధముగా ఎరింగిన వాడవై మోక్షమును పొందగలవు (32).

వివిధ రకముల ఆధ్యాత్మిక అనుశాసనములను వివరించే యీ ప్రకరణమును శ్రీకృష్ణుడీ శ్లోకములో ఉపసంహరించుచున్నాడు. ఈ అనుశాసనములన్నీ కర్మలో అంతర్భాగములే. జ్ఞాని కర్మలో అకర్మను మాత్రమే దర్శించునని శ్రీకృష్ణుడు చెప్పియుండెను. తరువాత, ఆయన వివిధ

రకముల యజ్ఞముల గురించి ప్రస్తావించెను. ఆత్మ అకర్తయనే జ్ఞానమును ప్రతిపాదించుటయే దీనిలోని తాత్పర్యము.

ఈ అనుశాసనములు మానవులకు అనేక ప్రయోజనములీయ సమర్థములు. కావుననే, శ్రీకృష్ణుడు వీటిని వివరించినాడు. అదే సమయంలో, బ్రహ్మభిన్నమగు ఆత్మ అకర్తయనే జ్ఞానము ఈ అనుశాసనములన్నింటి యొక్క చరమలక్ష్యము. ప్రస్తుత శ్లోకములోని 'బ్రహ్మ' అను పదమునకు వేదము అర్థము. ఇంతవరకు చెప్పబడిన ఆధ్యాత్మిక అనుశాసనములన్నియూ వేదములో అత్యంత విస్తారముగా వర్ణింపబడియున్నవి.

"ఈ ఆధ్యాత్మిక అనుశాసనము లన్నియూ కర్మ నుండి పుట్టినవని తెలుసుకొనుము (తాన్ సర్వాన్ కర్మజాన్ విద్ధి)" అని శ్రీకృష్ణుడు చెప్పెను. వాటిలో కొన్ని దేహావయవముల చేతను (కాయిక - కర్మ), మరికొన్ని వాక్కు చేతను (వాచిక - కర్మ), ఇంకొన్ని మనస్సుచేతను (మానస- కర్మ) నిర్వర్తింపబడతాయి. ఇవన్నీ కర్తయొక్క క్రియాశీలత నుండి జన్మించును. ఈ కారణంగానే, వీటిని కర్మజములు అంటారు. ఇవి అనాత్మరూపములగు త్రివిధ కర్మల నుండి పుట్టును.

ఆత్మ కర్త యగునా?

వీటిలో కర్త యెవరు? ఈ వ్రతములు కర్మ నుండి పుట్టినవే (కర్మజములు) గాని, ఆత్మ నుండి పుట్టినవి (ఆత్మజములు) గావు. అనగా, అంతఃకరణము, వాగింద్రియము, కర్మేంద్రియములు అనే కరణముల నుండి ఇవి పుట్టును. ఇవి కేవల మనస్సు నుండి గాని, లేదా జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ సహకృతమగు మనస్సు నుండి గాని పుట్టును. ఇందువలన, దేహము–మనస్సు–ఇంద్రియములు అనే సముదాయము (కార్య–కరణ–సంఘాతము) మాత్రమే కర్త కాగల్గును.

ఈ శ్లోకము చాల ఆసక్తికరమైనది. ఈ శ్లోకముపై వ్రాయబడిన వ్యాఖ్యానములను, భాష్యములను, అనువాదములను చూచినచో, చాలమంది ఈ శ్లోకార్థంలో భ్రాంతి పడినారని స్పష్టమగును. శ్రీకృష్ణుడు ముందుగా, ఆధ్యాత్మిక అనుశాసనములు వేదములో వివరింపబడినవనియు, అవి కర్మ నుండి పుట్టిన వనియు చెప్పి, తదుపరి ఈ సత్యము నెరింగిన వాడు మోక్షమును పొందునని చెప్పెను. ఇది యెట్లు పొసగును? ఈ వ్రతము లన్నియూ కాయిక, వాచిక, మానసిక కర్మలనుండి పుట్టినవని యెరుంగుట వలన మోక్షము యెట్లు సిద్ధించును?

ఈ వ్రతములు ఆత్మనుండి పుట్టలేదు అనే సంగతిని మనమిచట స్పష్టంగా తెలుసుకోవాలి. 18వ శ్లోకములోని ''కర్మణి అకర్మ యః పశ్యేత్'' అను వాక్యమును సింహావలోకనం చేసి, శ్రీకృష్ణుడిచట ఉపసంహారము చేయుచున్నాడని గుర్తుపెట్టుకోవాలి. ఈ విషయమును స్పష్టము చేయుటకై, శ్రీ శంకరులు భాష్యములో ''ఇవన్నీ అనాత్మ నుండి పుట్టినవని తెలుసుకో (తాన్ సర్వాన్ అనాత్మ జాన్ విద్ధి)'' అని చెప్పిరి. స్థూలదేహము అనాత్మ. మనస్సు, జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు కూడ అనాత్మలే. వాక్కు కర్మేంద్రియములలో నొకటి. శ్రీ శంకరులు 'అనాత్మజాన్' అను పదమును ప్రయోగించిరి. 'కర్మజాన్' అనగా 'అనాత్మజాన్'. అనాత్మ నుండి మాత్రమే పుట్టినవని యర్థము. అవి ఆత్మవగు నీకు విషయములు (కర్మలు). కావున, అవి అన్నీ అనాత్మలే.

స్థూలదేహము ఒక వస్తువు. కనుక, అది విషయము (కర్మ) మాత్రమే గాని విషయి (subject) కాదు. విషయికి గోచరించే విషయము కర్మ (object). ఆత్మ విషయి. విషయి యగు ఆత్మను విషయముగా చేయుట సంభవము కాదు. కర్మయగు స్థూలదేహము అనాత్మయే గాని, ఆత్మ కాజాలదు. అది విషయమే గాని, విషయి కాదు. వ్రతములన్నియూ స్థూలదేహము నుండి, వాక్కు నుండి, మనస్సు నుండి జన్మించును. ఈ మూడు అనాత్మలు; విషయివగు నీకు విషయములు. కావున, 'కర్మజాన్' అనగా 'అనాత్మజాన్' అను అర్థమును తెలుసుకోవాలని శ్రీ శంకరులు స్పష్టము జేసిరి.

ఈ వ్రతము లన్నియూ అనాత్మ నుండి పుట్టినవే గాని, ఆత్మ నుండి పుట్టలేదు అను సత్యము నెరింగిన వ్యక్తి, ఆత్మ అకర్తయనియు, సర్వక్రియా విరహితము (నిర్వ్యాపారము) అనియు యెరుంగును. ఈ వ్రతములు ఆత్మ నుండి పుట్టినవి కావని స్పష్టమగుటకు అనాత్మ నుండి పుట్టినవని తెలుసుకున్న చాలును.

వేదము యొక్క శబ్దములలో కర్మలన్నీ వివరంగా వర్ణింపబడినవి. వాటిలో కొన్ని ఇక్కడ ప్రస్తుతింపబడినవి. ఇవన్నీ అనాత్మ నుండి పుట్టినవే (అనాత్మజాః); కార్య-కరణ-సంఘాతము నుండి పుట్టినవి. ఇవి అనాత్మజవములు గనుక, ఆత్మ కర్త కాదు. ఈ దర్శనమునకే కర్మణి-అకర్మ-దర్శనము (కర్మను చేస్తూ ఉన్నా అకర్మను దర్శించుట) అని పేరు.

కర్త బాధింపబడగా, క్రియా, దాని ఫలములు కూడ బాధింపబడును.

'బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్' అనే 24వ శ్లోకమును మనము

చూచియున్నాము. సర్వము బ్రహ్మమే అను సాక్షాత్కారము గల వ్యక్తి కర్మను చేస్తూనే ఉన్నా, కర్తృత్వము నిషేధింపబడును. కర్తృత్వముతో బాటు ఇతర కారకములు-- క్రియలో విషయములయ్యే కర్మ, క్రియా సాధనములు, క్రియాప్రయోజనము, క్రియ ఉద్గమించే స్థానము, క్రియ ప్రవర్తిల్లే అధికరణము-- కూడా నిషేధింపబడును. కారకములు ఉన్నట్లుగా భాసిస్తాయి. కాని, అవి బ్రహ్మ కంటె భిన్నములు అనే ధారణను నిషేధించుట ద్వారా వాటి సత్యత్వము త్రోసిపుచ్చబడును. ఈ దర్శనములో ద్వైతము యొక్క సత్యత్వము నిరాకృతమై, సర్వభేదములు ఉపమర్దితమై, అద్వైత పరబ్రహ్మము సాక్షాత్కృతమగును.

ఆత్మ అకర్త. కార్యకరణ సంఘాతమే కర్త. కర్త ఆత్మయే అయినా, ఆత్మ కర్త కాదు. ఈ సత్యము నెరింగిన జ్ఞాని సర్వ కర్మల నుండి, కర్మఫలము (అశుభము)ల నుండి విముక్తుడగును. మంగళకారము కానిది, చెడ్డది 'అశుభము' అనబడును. జ్ఞాని అమంగళమగు కర్మఫలము నుండి విముక్తుడగును. శ్రీ శంకరులు పుణ్యపాపములు రెండు అశుభశబ్దముచే బోధింపబడునని (అశుభాఖ్యాత్ కర్మఫలాత్ విమోక్ష్యసే) చెప్పిరి.

జ్ఞానము వలన బంధవిముక్తి

సంసారము నుండి విముక్తియే మోక్షము. ఆత్మ అకర్తయని యెరుంగకపోవుట వలన సంసారబంధము నిర్మాణమైనది. ఇది జ్ఞానము వలన తొలగిపోవును.'నేను (ఆత్మ) కర్త' అని అనుకున్న క్షణంలో సంసారం పుట్టి, నీవు సంసారివైనావు. ఆత్మ అకర్త యని యెరుంగుటయే సమ్యక్-దర్శనము; అనగా, ఆత్మను యథాతథముగా నెరుంగుట. ఈ జ్ఞానము వలన సంసారము నుండి విముక్తి కలుగును. సంసారమనగా కర్మలు, వాటి ఫలములు మాత్రమే.

కర్మఫలరూపముగా జన్మ లభించును. దానిలో మరల కర్మలు చేయబడును. మరల కర్మఫలము సంప్రాప్తమగును. తన్మూలంగా మరల జన్మ లభించును. ఆత్మ అకర్త అనే జ్ఞానమును పొంది విముక్తిని పొందువరకు, జీవుడీ చక్రములో తిరుగాడుచుండును. నీవు చేసే పనులన్నీ నీవి కావు. వాస్తవంలో క్రియలనాచరించేది నీవు కావు. నీవు సర్వక్రియా విరహితమగు (నిర్వ్యాపార) ఆత్మవు. నీవు దీనిని తెలునుకోవాలి అని శ్రీ శంకరులు భాష్యములో వివరించిరి.

'నేను కర్త కాదు' అనే జ్ఞానములో పొరపాటునకు తావు లేదు

ఆత్మ నిర్వ్యాపారము అని మనము అనుకున్నాము. 'నిర్వ్యాపారము' అను పదమును

సోమరితనముగా అర్థం చేసుకునే ప్రమాదము గలదు. 'ఆత్మ యందు క్రియలేదు' అనే సత్యమును సాక్షాత్కరించుకున్న జ్ఞాని కృషి చేయడనియు, దేనినీ పట్టించుకోని సోమరిగా బ్రతుకుననియు అనుకోరాదు.

'నిర్వ్యాపారము' అనగా 'ఉదాసీనము' అనగా 'ఆత్మ ఏ క్రియతోనైననూ సంసర్గము లేనిదై, సర్వక్రియలకు సాక్షిగా నుండును' అని నిర్వచించిరి. కాన, నేను లేనిదే క్రియలు ఏవీ జరగవు. కాని, అదే సమయంలో, నాకు క్రియలతో సంబంధము లేశమైననూ లేదు. అనగా, నేను క్రియలపై ఆధారపడి లేను; క్రియల నుండి విముక్తుడను.

''నేను దేనినీ పట్టించుకోను'' అని నీవు అంటే, దానిలో కర్తృత్వము నిశ్చయముగా నున్నది. కాని, ఆత్మ శుద్ధము, సాక్షి. ఆత్మ క్రియల నాచరించదు. నీ గురించిన ఈ సత్యమును నీవు సాక్షాత్కరించుకున్న నాడు, సంసారబంధము నుండి ముక్తుడవగుదువు (సంసార బంధనాత్ విమోక్ష్యసే). బంధమునకు ఏకైక హేతువు ఆత్మయందు కర్తృత్వమును దర్శించుటయే (ఆత్మని కర్తృత్వదర్శనమ్). మరియొక హేతువు లేదు.

'నేను కర్తను' అని నీవు భావించి, ఆత్మయందు కర్తృత్వమును స్వీకరించినచో, నీకు సంసారము సంప్రాప్తగును. నిన్ను నీవు అకర్తగా దర్శించినచో, నీవు సంసారబంధము నుండి విముక్తుడవగుదువు. బంధమునకు, మోక్షమునకు మధ్యగల తేడా ఇది మాత్రమే నని మనకి శ్లోకములో స్పష్టమగుచున్నది.

తరువాతి శ్లోకములో శ్రీకృష్ణుడు మోక్షరూపమగు జ్ఞానము నింకనూ స్తుతించుచున్నాడు:

అధ్యాయము 4, శ్లోకము 33:

श्रेयान् द्रव्यमयाद्यज्ञात् ज्ञानयज्ञः परन्तप ।
सर्वं कर्माखिलं पार्थ ज्ञाने परिसमाप्यते ॥ ३३ ॥

శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప
సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే (33)

పరంతప = శత్రువులను తపింపజేయు ఓ అర్జునా!; ద్రవ్యమయాత్ = ద్రవ్యములతో చేసే; యజ్ఞాత్ = యజ్ఞము కంటె; జ్ఞానయజ్ఞః = జ్ఞానయజ్ఞము; శ్రేయాన్ = గొప్పది; పార్థ = ఓ అర్జునా!; సర్వం = సమస్తమైన; కర్మ = కర్మ; జ్ఞానే = జ్ఞానమునందు; అఖిలం = పూర్ణముగా; పరిసమాప్యతే = విలీనమగును.

> శత్రువులను తపింపజేయు ఓ అర్జునా! ద్రవ్యములతో చేసే యజ్ఞము కంటె జ్ఞానయజ్ఞము గొప్పది. ఓ పార్థా! సమస్తమైన కర్మ జ్ఞానము నందు పూర్ణముగా విలీనమగును. (33)

ఇరువది నాల్గవ శ్లోకములో సమ్యగ్దర్శనము(ఆత్మయొక్క యథార్థ స్వరూపమును స్పష్టముగా దర్శించుట) యజ్ఞరూపముగా ప్రస్తుతింపబడినది. కారకములన్నింటిని బ్రహ్మరూపముగా ప్రతిపాదించి, ఆత్మను అకర్తగా ఆ శ్లోకము ప్రస్తుతించినది.

ఈ జ్ఞానమును పొందుటకు అంతఃకరణశుద్ధి ఆవశ్యకము. సాధకులు దానిని పొందుటకు సహకరించే అనేకరకముల యజ్ఞములు కూడ చెప్పబడినవి. ఈ యజ్ఞములు అంతఃకరణ శుద్ధికి ఉపకరిస్తాయి గనుకనే, ఇచట ప్రస్తావింపబడినవి. కాని, ఈ అనుశాసనములు మనశ్శుద్ధిని కలిగించే సాధనములు మాత్రమే ననియు, వాటి ప్రయోజనము ఇంత మాత్రమే ననియు సాధకులు విస్మరింపరాదు. సాధకులు ఈ అనుశాసనముల ప్రభావము లో బడి లక్ష్యమును విస్మరించే పరిస్థితి రాకుండా చూచుకోవాలి. చరమ లక్ష్యమైన మోక్షము జ్ఞానము వలన లభించేదే గాని, ఆధ్యాత్మిక అనుశాసనముల వలన లభించేది గాదు.

అనుశాసనములు సాధనములు మాత్రమే; చరమలక్ష్యములు గావు

కావున, అనుశాసనము తనంత తానుగా లక్ష్యము కాజాలదు. ఈ వ్రతములన్నీ సాధనములే. అంతఃకరణశుద్ధి, అంతఃకరణ నైశ్చల్యము వాటివలన లభిస్తాయి. ఇట్టి శుద్ధమైన మనస్సులో, ఆత్మ సర్వక్రియా విరహితము అనే యథార్థజ్ఞానము (సమ్యగ్ దర్శనము) ఉదయిస్తుంది.

ఇంతకు ముందు చెప్పబడిన వివిధ కర్మలకు, సమ్యక్ దర్శనమునకు గల వైలక్షణ్యమును చూపించుట ద్వారా, ఈ శ్లోకములో సమ్యక్ దర్శనము స్తుతింపబడినది. సమ్యక్-దర్శనమనగా

ఆత్మ యొక్క యథార్థ స్వరూపము నెరుంగుట. ఈ సమ్యక్–దర్శనము లభించు విధమెట్టిది? ఈ అనుశాసనముల వలన కాదు అని శ్రీకృష్ణుడీ శ్లోకములో స్పష్టము చేసెను. సమ్యక్–దర్శనము అనేది తెలుసుకోదగిన జ్ఞానము. ఈ జ్ఞానమునకు కూడ ఒక యజ్ఞము చేయవలసి యున్నది. అదియే జ్ఞానయజ్ఞము. ఈ శ్లోకములో ఈ యజ్ఞము స్తుతింపబడుచున్నది.

శ్రీకృష్ణుడీ శ్లోకములో అర్జునుని 'పరంతప' అని సంబోధించెను. అనగా, శత్రువులను తపింపచేయువాడు అని యర్థము. శత్రువులు రెండు రకములు. కామక్రోధములు, రాగద్వేషములు ఇత్యాదులు అంతశ్శత్రువులు. బాహ్య శత్రువులు రెండవరకము. అర్జునుడు క్షత్రియుడు కనుక, శత్రుశబ్దమునకు బాహ్య శత్రువులు అనే సామాన్యార్థమును స్వీకరించవచ్చును. ఈ శ్లోకములో శ్రీకృష్ణుడు అర్జునుని 'పార్థ' (కుంతి యొక్క కుమారుడా!) అని కూడ సంబోధించెను.

జ్ఞానయజ్ఞము చాల గొప్పది (శ్రేయాన్) అని యీ శ్లోకము మనకు బోధించుచున్నది. కావున, దానిని తప్పక ఆచరించాలి. గొప్పది (శ్రేయాన్) అను పదము కనబడిన వెంటనే, దేనికంటె గొప్పది? అను ప్రశ్న ఉదయించును. కాని, ఇచట వాస్తవమైన పోలిక లేదు. శ్రీకృష్ణుడు జ్ఞానయజ్ఞమును గురించి మాత్రమే చెప్పుచుండెను. జ్ఞానయజ్ఞము మనకు మోక్షము నిచ్చును. కావున, అది చాల గొప్పది (శ్రేయాన్). కావున, మనము సామాన్యముగా భావించే తర, తమ భేదమునకు ఇచట తావు లేదు. ఇచట శ్రేయాన్ అనగా సర్వశ్రేష్ఠము అని యర్థము.

కొన్ని హోమ ద్రవ్యములను వినియోగించి, హవనము చేసే యజ్ఞమును ద్రవ్యయజ్ఞము అంటారు. వేదోక్త క్రతువులన్నీ ఈ రకానికి చెందినవే. ద్రవ్యయజ్ఞము వలన పుణ్యము, మరియు ఒక ప్రత్యేకమైన సంతృప్తి లభిస్తాయి. ద్రవ్యయజ్ఞము వలన లభించే ఈ ఫలములు సీమితమైనవి. కావుననే, ఈ శ్లోకములో జ్ఞానయజ్ఞము 'శ్రేయాన్' అని వర్ణింపబడినది. మనము ఈశ్వరుని ప్రార్థించినపుడు, వెనువెంటనే ఒక సంతృప్తి కలుగుతుంది. ఇది కనబడే ప్రయోజనము (దృష్టఫలము). ఈశ్వరుని ప్రార్థించగల్గుట ఒక భాగ్యమని చెప్పవచ్చును. ప్రార్థన వలన మనస్సు ప్రసన్నమవుతుంది. ప్రార్థనకు పుణ్యరూపమగు అదృష్టఫలము కూడ ఉండును.

జ్ఞానము కర్తను ఉపమర్దము చేయును

ఈ విధంగా, ప్రార్థనకు రెండు రకముల ఫలములు గలవు. ఒకటి ప్రత్యక్షఫలము. రెండవది పుణ్యరూపమగు అదృష్టఫలము. ఈ రెండు ఫలములు కర్తకు చెందును. ప్రతి క్రతువు నందు

కర్తతోబాటు వివిధ సాధనములు కూడ ఉండును. క్రతువు భవిష్యత్తులో ఫలముల నిచ్చుటకు ఉద్దేశించబడినది. కాని, జ్ఞానము ఫలముల నన్నిటినీ కబళించి వేయును. జ్ఞానము కొరకై చేసే సాధనయే ఒక యజ్ఞము (జ్ఞానం ఏవ యజ్ఞః). చేయవలసిన అభ్యాసము కూడ జ్ఞాన రూపమే.

జ్ఞానయజ్ఞము కర్తృత్వమును ఉపమర్దము చేసేది గావున, అది సంసారమును అమరము చేయదు. పైగా సంసారమును కబళించివేయును. జ్ఞానయజ్ఞము కర్తృత్వమును కబళిస్తుంది గనుక, కర్మఫలమును ఆరంభించదు (న ఫల-ఆరంభకః). జ్ఞాన మనగా నేమి, ఆత్మ యనగా నేమి ఇత్యాది విచారమును నీవు మొదలిడిన క్షణమునందు కర్తృత్వమునకు ఆయువు మూడినది. కాని, ప్రత్యక్ష, అనుమాన ప్రమాణముల సహకారముతో నీవు పరిశీలిస్తున్నంత కాలము ప్రత్యక్షమును వినియోగించే కర్త, అనుమానమును వినియోగించే కర్త, మరియును పరిశీలన చేసే కర్త మిగిలియే యుండును. కాని, కర్తను వేదాంతోపదేశముచే ఉద్వాసితము చేసినచో, అది కబళించి వేయబడును.

వేదాంతము కర్తను ఉద్దేశించి యిట్లు చెప్పును: "నీవు అకర్తవు. నీకు ఆత్మస్వరూపము తెలియదు. కావుననే, నిన్ను నీవు కర్తగా భావిస్తున్నావు. కర్తృత్వము ఒక భావన మాత్రమే. అది వస్తూ, పోతూ ఉంటుంది. ఆ భావన లేని సమయంలో, నిద్రలో, కర్త యెక్కడ ఉన్నాడు? లేదా, రెండు ఆలోచనల మధ్య కర్త ఎక్కడ ఉన్నాడు? కర్త లేడు. నీవు అకర్తవు. నీవు ఏ సమయంలోనూ ఏ కర్మనూ చేయుట లేదు. నీవు ఆలోచన (వృత్తి)వు కావు. ఆలోచన కలిగినప్పుడు నీవు ఉన్నావు. ఆలోచన తొలగిపోయినా, నీవు ఉన్నావు." ఈ తీరున, వేదాంతము కర్తను ఉద్దేశించి, 'నీవు కర్తవు కావు' అని బోధించి, కర్తృత్వమును ఉపమర్దము చేయును.

జ్ఞానము పోలికల పరిధికి అతీతమైనది

ఈ శ్లోకములో జ్ఞానయజ్ఞము మతపరమగు వ్రతములతో పోల్చబడినదని చెప్పుట సరిగాదు. ఏలయన, జ్ఞానయజ్ఞము కర్మను నాశనము చేయును. రెండు వస్తువులలో ఒకదానిని మరియొక దానితో పోల్చాలంటే, ఆ రెండు వస్తువులు లభ్యమై ఉండాలి. కాని, ఇచట కర్మ జ్ఞానయజ్ఞముచే నశింపచేయబడును. అట్టి స్థితిలో, జ్ఞానయజ్ఞమును కర్మతో పోల్చి, కర్మ కంటె గొప్పది అని చెప్పుట యెట్లు పొసగును?

"వివాహమాడుట కంటె ఒంటరిగా నుండుట మేలు" అని గాని, లేక "ఒంటరితనము కంటె వివాహము మేలు" అని ఎవ్వరైనా అంటే, అట్టి పోలికలలో అసంగతి లేదు. ఆ రెండు స్థితులు

మనకు కనబడుతూ ఉంటాయి. కాని, ఆత్మయొక్క యాథార్థ్యజ్ఞానములో పరిస్థితి అట్లుగాదు. ఈ జ్ఞానము కర్మ కంటె గొప్పది అని చెప్పుటలో తాత్పర్యము లేదు. ఈ జ్ఞానము పోలికలకు అతీతమైనది. పోలికల పరిధిలో గల వస్తువుల మధ్య పోలికలను చెప్పగలము. జ్ఞానము అట్టిది కాదు. కావున, జ్ఞానము వ్రతములన్నింటిలో గొప్పది అని చెప్పుట పొసగదు.

జ్ఞాన, కర్మల సత్యత్వము (reality) లు రెండు విభిన్న శ్రేణులకు చెందినవి. జ్ఞానము పూర్ణ బ్రహ్మకు చెందినది. అది కర్మను పూర్తిగా ఉపమర్దము చేయును. మరియు, ఈ రెండింటికి ఫలము విషయములో కూడా పోలికకు అవకాశము లేదు. కర్మ వలన పరిచ్ఛిన్న ఫలము లభించును. కాని, జ్ఞానమునకు సర్వపరిచ్ఛేదరాహిత్యము ఫలము.

నేను అపరిచ్ఛిన్నుడను. ఇక పోలికలకు అవకాశమేది? ఒకే సత్యత్వశ్రేణికి చెందిన వస్తువుల మధ్య పోలికలు సంభవమగును. ఒక సత్యత్వశ్రేణి (order of reality) కి చెందిన ఫలమును, విభిన్న సత్యత్వ శ్రేణికి చెందిన ఫలముతో పోల్చుట పొసగదు. కావున, కర్మ వేరు; జ్ఞానము వేరు. కాని, గత్యంతరము లేకపోవుటచే ఈ శ్లోకములో 'శ్రేయాన్' అను పదము వాడబడినది. ఈ పదము తారతమ్యమును నిర్దేశించేదే అయినా, మోక్షమును కూడా నిర్దేశిస్తుంది. ఈ పదములో సౌందర్యమిదియే. ఒకరకం యజ్ఞము (జ్ఞానయజ్ఞము) మోక్షాన్ని ఇచ్చేది; మరో రకం యజ్ఞము (ద్రవ్య యజ్ఞము) మోక్షమునీయదు.

ద్రవ్యయజ్ఞము వలన లభించే ఫలము కర్తకు బాహ్యమునందు, కర్తకు భిన్నముగా, పరిచ్ఛిన్నముగా నుండును. లేదా, దాని వలన అంతఃకరణశుద్ధి అనే అంతరంగిక ఫలము కూడ లభించును. కర్మ యోగి యగు ముముక్షువునకు ఈ అంతఃకరణశుద్ధి జ్ఞానసహకారి యగును. కర్మయోగి అనుష్ఠించే విభిన్న వ్రతములు (యజ్ఞములు) జ్ఞానయజ్ఞము (విచారము) ను సరియగు రీతిలో జరుపుటకు సహకరించును. సమ్యగ్దర్శనములో విచారము సాక్షాత్సాధనము. ఇతర యజ్ఞములు పరంపరయా సాధనములగును.

కర్మ పూర్తిగా నశించును

జ్ఞానము సర్వకర్మలను పూర్తిగా నశింపజేయును. అనగా, కర్మ పూర్తిగా జ్ఞానములో లయమగును (సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే). ఇందువలననే, జ్ఞానయజ్ఞము 'శ్రేయాన్'

అని వర్ణింపబడినది. ఇచట 'అఖిలం' అను విశేషణము (అఖిలం కర్మ) గలదు. అనగా, జ్ఞానము ఉదయించిన తరువాత కర్మశేషము ఏమియూ ఉండదు. కర్మ, తత్సంబద్ధమగు సర్వము, లేశమైననూ మిగలకుండా, పూర్తిగా తొలగిపోవునని భావము.

శ్రీకృష్ణార్పణమస్తు

జ్ఞాన ప్రకాశములో కర్మ పూర్తిగా విలీనమగునని సూచింమటకై ఈ శ్లోకములో సర్వశబ్దము ప్రయోగించబడినది. ఒకప్పుడు 'సర్వము' అని అన్నా, ఇంకా కొంత మిగిలి ఉంటుంది. 'బొంబాయిలోని జూహు బీచ్‌లో నివసించే వారందరూ ధనవంతులే; మార్కెట్‌కి వెళ్లే వారందరు వస్తువులను కొంటారు'. ఇత్యాది వాక్యములను మనం అంటాము. ఇవి పూర్తి యథార్థాలు కావు. జూహు బీచ్‌లో సేవకులు మొదలైన, ధనవంతులు కాని వారు కూడా ఉంటారు. పెద్ద ప్రాసాదములలో ఉంటూనే, ఆదాయం కన్న ఖర్చు ఎక్కువై, అప్పుల ఊబిలో కూరుకుపోయిన వారు కూడా ఉంటారు.

కావున, సర్వశబ్దమును ఉపయోగించే వాక్యాలన్నీ సత్యాలు కావు. శేషము ఏమీ లేకుండా అన్నింటికీ అన్వయించే అర్థంలో మాత్రమే సర్వశబ్దమును ఉపయోగిస్తారు అనుకోరాదు. బాహుల్యమును, ఆధిక్యమును సూచించే సందర్భాలలో కూడా సర్వశబ్దమును వాడలారు. కాబట్టి, సర్వశబ్దమును ఇట్టి సాపేక్షమైన అర్థంలో వాడతారని గుర్తించి, శ్రీకృష్ణుడీ శ్లోకంలో 'అఖిలం' అను పదమును కూడా వాడినాడు. 'సర్వం, అఖిలం' అనే యీ రెండు పదములను ఇచట కలిపి ప్రయోగించుట వలన, ఎట్టి సంశయము లేకుండా కర్మ పూర్ణముగా గ్రహింపబడును. ఈ కర్మ జ్ఞానములో లీనమగును (జ్ఞానే పరిసమాప్యతే).

ఇంతకు మించి పొందగినది మరియొకటి లేదు

ఈ జ్ఞానమును పొందిన వ్యక్తి సర్వమును పొందినట్లే యగును. దీనిని మించి పొందదగినది మరియొకటి ఉండదు. ఈ సర్వస్వప్రాప్తిని వర్ణించే మంత్రము ఒకటి ఛాందోగ్యోపనిషత్తు నందు గలదు. దీని యందు అక్షద్యూతము దృష్టాంతముగా నీయబడినది. పూర్వకాలంలో జూదంలో ఉపయోగించే పాచికకు నాలుగు ముఖాలు ఉండేవి. వాటికి కలి (1), ద్వాపర (2), త్రేత (3), కృత (4) అని పేర్లు. 'కృత' వచ్చినవాడు విజేత. ఈ 'కృత' లో మిగిలిన మూడు కూడా అంతర్భాగము లవుతాయి.*

---

* यथा कृतायविजितायाधरेयाः संयन्त्येवमेनं सर्वं तदभिसमैति
यत्किञ्च प्रजाः साधु कुर्वन्ति यस्तद्वेद यत्स वेद ॥ ४.१.४.

యథా కృతాయ విజితాయాధరేయాః సంయంత్యేవ మేనం సర్వం
తదభిసమైతి యత్కించ ప్రజాః సాధు కుర్వంతి యస్తద్వేద
యత్స వేద. 4.1.4.

ఇదే విధంగా, ఈ జ్ఞానమును పొందిన వ్యక్తి సర్వమును పొందును. సర్వము అతనికి చెందును. ఇచటి తాత్పర్యమేమన, మోక్షములో జూదమాడే సాధకుడు నెగ్గి తీరును. కాని, కర్మలో జూదమాడువాడు పరాజితుడగును. జ్ఞానికి లభించే మోక్షము కంటె గొప్పదియగు ప్రాప్తి మరియొకటి లేనే లేదు. జ్ఞాని ఆది నుండి అంతము వరకు విజేతయే.

కర్మ ఫలములు సీమితమైన ఆనందమును మాత్రమే ఈయగలవు. కాని, జ్ఞానము పరమానందమును ఇచ్చును. చిన్న చిన్న ఆనందములన్నీ పరమానందములో అంతర్భాగములగును. ఇందువలననే, కర్మ జ్ఞానములో లీనమగును (జ్ఞానే పరిసమాప్యతే) అని శ్రీకృష్ణుడు చెప్పెను.

ఈ 'లీనమగుట' అను విషయమును నిరూపించే మరియొక దృష్టికోణము గలదు. జ్ఞాని దృష్టిలో ఆత్మ కర్మలో విషయము కాదు. 'నేను అకర్తను. కావున, నా ఖాతాలో ఉండే సంచిత కర్మల నుండి, ఆగామి కర్మల నుండి కూడ నేను విముక్తుడను. కావున, నేను కర్మలో విషయము కాను' అను జ్ఞానము గల వ్యక్తి యొక్క సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలు ఇట్టి జ్ఞానములో లీనమైపోవును. ఆత్మ అభోక్త. ప్రారబ్ధము భోక్తకు మాత్రమే ఉండును. కావున, జ్ఞాని ప్రారబ్ధకర్మలో విషయము కాడు. స్థూలదేహము, మనస్సు, ఇంద్రియములు వీటి అపేక్షయా మాత్రమే ప్రారబ్ధము ప్రవర్తిల్లును. అన్ని వేళలా ఏదో ఒక క్రియ జరుగుచున్నట్లు భాసించును. కాని, దానికి ఆత్మపై ఎట్టి ప్రభావము లేదు.

ఈ జ్ఞానము లభించే విధమెట్టిది?

మతపరమగు అనుశాసనము లన్నియూ జ్ఞానములో లీనమగునని చెప్పి, శ్రీకృష్ణుడు మరల జ్ఞానమునే స్తుతించెను. అర్జునునకు తాను జ్ఞానమును పొందవలసిన ఆవశ్యకత తెలిసినది. అతడు ఇప్పటికే తనకు జ్ఞానము నుపదేశింపుమని శ్రీకృష్ణుని కోరియున్నాడు. అర్జునుని యీ చర్యను శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములో సమర్థించుచున్నాడు:

అధ్యాయము 4, శ్లోకము 34:

तद्विद्धि प्रणिपातेन परिप्रश्नेन सेवया ।
उपदेक्ष्यन्ति ते ज्ञानं ज्ञानिनस्तत्त्व दर्शिनः ॥ ३४ ॥

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వ దర్శినః (34)

ప్రణిపాతేన = నమస్కరించుట చేతను; పరిప్రశ్నేన = యోగ్యమగు ప్రశ్నల నడుగుట చేతను; సేవయా = సేవించుట చేతను; తత్ = దానిని; విద్ధి = తెలుసుకొనుము; తత్త్వదర్శినః = సత్య సాక్షాత్కారము గల; జ్ఞానినః = జ్ఞానులు; తే = నీ కొరకు; జ్ఞానం = జ్ఞానమును; ఉపదేక్ష్యంతి = ఉపదేశించగలరు.

> నమస్కరించుటచేతను, యోగ్యమగు ప్రశ్నల నడుగుటచేతను, సేవించుట చేతను దానిని తెలుసుకొనుము. సత్యసాక్షాత్కారము గల జ్ఞానులు నీ కొరకు జ్ఞానమును ఉపదేశించగలరు. (34)

జ్ఞానయజ్ఞమును చేయు విధమును, ఈ జ్ఞానమును పొందు విధమును శ్రీకృష్ణుడీ శ్లోకములో వివరించెను. వేదవిహిత యజ్ఞములన్నింటిలో కొన్ని నియమాలు ఉంటాయి. యజ్ఞమును ఎప్పుడు చేయాలి? ఏయే ఋత్విక్కులు ఎందరు కావాలి? ఏయే ద్రవ్యములు కావాలి? ఎవరికి ఎంత ఈయాలి? ఇత్యాదులు నిర్ణయింపబడి ఉంటాయి. వేదములో ఈ నియమములన్నీ సవిస్తరంగా వివరింపబడి యున్నవి.

కాని, జ్ఞాన యజ్ఞానికి ఋత్విక్కులు అవసరం లేదు. గురువు ఉన్న చాలును. విచార రూపమగు ఈ యజ్ఞమును ఆచరించుటకు నిర్దిష్టకాలముకూడ లేదు. సాధకుడు తాను సంసిద్ధుడుగా నుండి, గురువు లభించిన వెంటనే మొదలిడవచ్చును. ఇతర నియమము లేమీ లేవు. ఉదయమైనా, సాయంకాలమైనా, వేసవియైనా, శీతకాలమైనా, సర్వకాలములు విచారమునకు యోగ్యములే. వివాహానికి ముందుగాని, తరువాత గాని, సేవానివృత్తి (retirement) తరువాత గాని, ఎప్పుడైననూ విచారమును మొదలిడవచ్చును. దీనిలో ప్రధానమైనది జ్ఞానము; కర్మ కాదు. కావున, ఇట్టి నియమము లేవియూ వర్తించవు.

కర్మకు, మతపరమగు వ్రతములకు మాత్రమే ఇట్టి నియమములు వర్తించును. ఉదాహరణకు, కొన్ని యజ్ఞములను వివాహితులు మాత్రమే చేయాలి. భార్య లేని వ్యక్తి ఆ యజ్ఞములను చేయుటకు అర్హుడు కాడు. మరియు, బ్రహ్మచారి చేయవలసిన కొన్ని కొన్ని యజ్ఞములను వివాహితుడు చేయరాదు. ఈ విధంగా అనేక రకాల నియమాలు గలవు. కాని, జ్ఞాన యజ్ఞమునకు రెండు నియమములు మాత్రమే గలవు.

నీవు సరియగు గురువును పట్టుకోవాలి. ఇది మొదటి నియమము. నీవు సరియగు స్థితిలో ఉండాలి. ఇది రెండవ నియమము. ఇంతే. జ్ఞాన యజ్ఞములో గురుశిష్యుల యోగ్యతలు మాత్రమే పరిగణనకు వస్తాయి. 'దానిని తెలుసుకొనుము (తత్ విద్ధి)' అని శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పెను. అనగా, ''ఈ జ్ఞానమును తెలియు విధమెట్టిది? దీనిని పొందుటకు సాధనము లెయ్యవి? అను విషయమును తెలుసుకొనుము'' అని యర్థము. ఈ శ్లోకము మూడు సాధనములను బోధించినది: గురువునకు ప్రణమిల్లుట (ప్రణిపాత), ఉచితమగు ప్రశ్నలను వేయుట (పరిప్రశ్న), గురువును సేవించుట (సేవ).

ప్రణామము యొక్క ప్రాముఖ్యము

సాష్టాంగ ప్రణామము చేయుట యనగా వ్యాయామము చేయుట కాదు. ముందుగా, గురువును వెతికి పట్టుకోవాలి. తరువాత, గురువు వద్దకు వెళ్ళి, ఆయన/ఆమెకు ప్రణమిల్లాలి. 'ప్రణిపాతము' అను పదమునకు 'ఉచితరీతిలో క్రిందపడుట' అని యర్థము. అంటే, యోగ్యమగు మానసిక ప్రవృత్తి (attitude)తో ప్రణమిల్లాలి. దీనికి 'నమస్కారము' అని కూడా పేరు. ఆదరమును ప్రకటించుటయే దీని తాత్పర్యము.

ఈ ప్రణిపాతములో అనేకరకములు గలవు. వంగి గురువు పాదమును స్పృశించుట ఒక పద్ధతి. రెండు చేతులు జోడించి, తలను కొద్దిగా వంచుట రెండవ పద్ధతి. ఈ విధంగా, నమస్కారాలు అనేక రకాలుగా ఉన్నాయి. వాటిలో ఒకటి సాష్టాంగ నమస్కారము. దీనిలో తల, వక్షస్స్థలము, నడుము, మోకాళ్ళు, చేతులు, పాదములు, మనస్సు, వాక్కు అనే ఎనిమిది అంగములు నేలను స్పృశించును. మనస్సుతో నేలను స్పృశించుట యనగా నమస్కారము చేయుచున్న దేహమునకు వెనుక ఆదరముతో నిండిన మనస్సు కలదని యర్థము. ''ఓ భగవాన్, నేను నీకు నమస్కరించుచున్నాను'' ఇత్యాది వచనములతో కూడ ఆదరమును ప్రకటించవచ్చును. శరీరమంతా నేలను స్పృశించే ఈ నమస్కారమునకు దీర్ఘ నమస్కారము అని కూడ పేరు గలదు. దీర్ఘము అనగా పొడవైనది.

సాధకుడు చేసే శరణాగతి ఈ నమస్కారములో ఇమిడియున్నది. నేను జ్ఞానమును కాంక్షిస్తున్నాను. నాకు గురువు లభించినాడు. కావున, నేను గురువు వద్దకు శరణాగతి భావనతో వెళ్ళాను. నేను జిజ్ఞాసువును గనుక, నా అహంకారమును వీడుటకు సంసిద్ధుడను. ఈ జ్ఞానమునకు అత్యవసరమైన మానసిక ప్రవృత్తి అహంకారత్యాగము. దీర్ఘ నమస్కారము ఇట్టి మానసిక ప్రవృత్తికి చిహ్నము.

పరిప్రశ్న, మరియు గురుశుశ్రూష

జ్ఞానార్జనకు అవశ్యకమగు రెండవ సాధనము పరిప్రశ్న. గురువు బోధించే ప్రకరణమునకు అనురూపమైన యోగ్యమగు ప్రశ్నను సరియగు సమయములో అడగాలి. దీనినే పరిప్రశ్న యందురు. మనము చేసే గీతా విచారములో కూడా ఇట్టి ప్రశ్నలను చూచియున్నాము: ఈ బంధమేమి? ఇది ఎట్లు వచ్చినది (కథం బంధః)? బంధవిముక్తి యనగా నేమి? మోక్షము ఎట్లు లభించును (కథం మోక్షః)?

బంధము గురించి సరిగా తెలిసినప్పుడు మాత్రమే, మోక్షము స్పష్టముగా తెలియును. ఇట్టి ప్రశ్నలకు గురువు ''నీవు జ్ఞానమును పొందాలి'' అని సమాధానము నిచ్చును. అపుడు ''ఈ జ్ఞానము ఏది (కా విద్యా)?'' అని నీవు ప్రశ్నిస్తావు. 'జ్ఞానము (విద్యా) అజ్ఞాన (అవిద్యా) విరోధి' అని గురువు సమాధానము నిచ్చును. ఈ తీరున కొన్ని ప్రశ్నలు ఉదయిస్తూ ఉంటాయి. వాటిని తగు సమయం చూచి అడగాలి. ఏలయన, ఈ విషయవస్తువు అవగాహన చేసుకోదగినది. ప్రశ్నించే ఇట్టి పద్ధతికి పరిప్రశ్న యని పేరు.

జ్ఞానమును పొందుటకు మూడవ సాధనము గురు శుశ్రూష (సేవ) అని ఈ శ్లోకములో చెప్పబడినది. గురువునకు చేయగల్గిన సేవను చేయాలి. శిష్యుడు చదువుకునే సమయంలో ఉండే గురు శిష్య సంబంధంలో ఇది ప్రధానమైన అంశము. ఇంతకు మించి, భోజనానికి, మకామునకు, పాఠాలను చెప్పినందుకు శిష్యుడు చెల్లించే శుల్కము ఏదీ ఉండదు. జ్ఞానమును పొందుటకు 'గురువును సేవించాలి' అనే మానసిక ప్రవృత్తి అత్యవసరము.

ఈ మూడు విధముల జ్ఞానోపాయములను అనుష్ఠించినచో నేమగును? సాధకుని భక్తి, అంకిత భావము, తీవ్ర నిష్ఠలచే సంతుష్టులైన జ్ఞానులు అతనికి జ్ఞానమును ఉపదేశిస్తారు (ఉపదేక్ష్యంతి తే జ్ఞానమ్). ఆచార్యులందరినీ నిర్దేశించుటకై ఇచట జ్ఞానినః అను బహువచనము ప్రయోగింపబడినది. లేదా, ఆచార్యుని యందలి ఆదరముచే బహువచనము ప్రయోగింపబడినదని కూడ చెప్పవచ్చును.

ఆచార్యుడు సాక్షాత్కారము గలవాడై యుండవలెను

సాధకునకు జ్ఞానము నిచ్చి ఆశీర్వదించగలగాలంటే, ఆచార్యుడు జ్ఞానియై ఉండాలి. ఆయనకు శాస్త్రము తెలిసి ఉండాలి. వారు కూడ శాస్త్రమును అధ్యయనము చేసి ఉంటారు గనుక, బోధించే ప్రక్రియ వారికి తెలిసి ఉంటుంది. కావున, వారు సాధకులకు తప్పక ఉపదేశిస్తారు.

ఇట్టి ఆచార్యులు సత్య సాక్షాత్కారము గలవారై ఉండాలి (తత్త్వ దర్శినః). శ్రీకృష్ణుడిచట ఈ పదమును ప్రయోగించుటలో కారణము గలదు. తర్కము, వ్యాకరణము ఇత్యాది శాస్త్రములను చదివి, బోధించేవారు ఉన్నారు. వీరికి ఇంకనూ ప్రతిబంధకములుండుట వలన, తత్త్వ సాక్షాత్కారము అయి ఉండదు. తాము ఉపదేశించే తత్త్వము యొక్క స్పష్టమైన సాక్షాత్కారము గలవారు మాత్రమే తత్త్వదర్శులు అనబడుదురు. వీరికి ఆత్మ, జగత్తు, ఈశ్వరుడు అను వాటి గురించి శాస్త్రీయమైన జ్ఞానము అనుభవ రూపమున నుండును.

కొందరికి 'తత్ త్వం అసి (అది నీవే అయి ఉన్నావు)' మొదలగు శాస్త్రపదములు మాత్రమే తెలుస్తాయి. వారికి వాటి తాత్పర్యము అనుభవమునకు వచ్చియుండదు. పదములతో బాటు వాటి అర్థమును కూడా సాక్షాత్కరించుకున్న వారు తత్త్వదర్శులు అనబడుదురు. అట్టివారు చేసిన ఉపదేశము వలన ఉపదేశఫలమైన సాక్షాత్కారము శీఘ్రముగ లభించును.

ఉపదేశము యొక్క ప్రయోజనము సాక్షాత్కారము; సలహా కాదు. సలహా ఇచ్చే సందర్భాలలో, మనము సలహాను స్వీకరించి చేయవలసిన కర్మ ఒకటి ఉంటుంది. ఉదాహరణకు, అనారోగ్యంతో వైద్యుని వద్దకు వెళ్తే, అతడు మందు, ఆహారము మొదలగు విషయాలలో సలహాను ఇస్తాడు; రోగి ఆ సలహాను ఆచరణలో పెట్టాలి. కాని, వైద్యుడు వైద్యశాస్త్రమునను బోధిస్తున్నాడనుకొనుడు. రోగ నిదానమును కనుగొనుట యెట్లు? ఆ రోగము ఎట్లు వచ్చును? ఎప్పుడు వచ్చును? మందు యేది? అది ఎప్పుడు వాడాలి? ఎల్లా వాడాలి? రోగిపై దాని ప్రభావమెట్టిది? ఇత్యాది విషయాలను బోధిస్తున్నాడనుకొనుడు. అపుడది జ్ఞానము. అంటే, తెలుసుకోదగినది. దానియందు కర్మ లేదు.

ఆత్మ, జగత్తు, ఈశ్వరుడు అను మూడింటి యొక్క స్వరూపమును సాక్షాత్కరింప జేయుటయే ఉపదేశము యొక్క తాత్పర్యము. బోధన యొక్క ప్రయోజన మిదియే. తాను బోధించే దాని యొక్క అనుభవము ఉన్న ఆచార్యుని వచనములకు మాత్రమే ఈ ప్రయోజనమును సిద్ధింప జేసే శక్తి ఉంటుంది. ఇందువలనే, వ్యక్తులందరూ ఈ ఉపదేశమును ఫలవంతముగ చేయజాలరు. ఈ మాటలను విన్నంత మాత్రాన మానవుడు సన్మార్గములోనికి మళ్ళునన్నది వాస్తవమే. కాని, తత్త్వ సాక్షాత్కారము గల ఆచార్యుని వచనములకు మాత్రమే జ్ఞానోదయమును కలిగించే శక్తి ఉండును. ఈ పదములకు అర్థము పరబ్రహ్మ. అట్టి పరబ్రహ్మ యొక్క సాక్షాత్కారము గల ఆచార్యుడు చేయు ఉపదేశము మాత్రమే యథార్థమైన ఉపదేశము.

శ్రుతి కూడ యోగ్యుడగు ఆచార్యుని గురించి శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పిన విధముగనే వర్ణించినది. తత్త్వదర్శియగు ఆచార్యుని బోధ మాత్రమే ఫలమునందు పర్యవసానమును చెందును. అట్లు గానిచో, జ్ఞానసాధన పూర్తి కాదు. సాధకుడు ఇంకనూ దానిని కొనసాగించాలి.

ఆత్మసాక్షాత్కారము కలిగిన తరువాత యేమగును? అను విషయమును తరువాతి శ్లోకము వివరించును:

అధ్యాయము 4, శ్లోకము 35:

यज्ज्ञात्वा न पुनर्मोहमेवं यास्यसि पाण्डव ।
येन भूतान्यशेषेण द्रक्ष्यस्यात्मन्यथो मयि ॥ ३५ ॥

యద్ జ్ఞాత్వా న పున్నర్మోహమేవం యాస్యసి పాండవ
యేన భూతాన్యశేషేణ ద్రక్ష్యస్యాత్మన్యథో మయి (35)

పాండవ = ఓ పాండు పుత్రా (అర్జునా!); యత్ = దేనిని; జ్ఞాత్వా = తెలుసుకొని, పునః = మరల; ఏవం = ఈ విధముగా; మోహం = మోహమును; న యాస్యసి = పొందవో; యేన = దేనిచే; భూతాని = ప్రాణులను; అశేషేణ = నిశ్శేషముగా; ఆత్మని = నీ యందు; అథో = మరియు; మయి = నా యందు; ద్రక్ష్యసి = చూడగలవో.

> ఓ అర్జునా! ఈ జ్ఞానమును పొందినచో, నీవు మరల ఈ తీరున భ్రాంతిని పొందవు. మరియు, సర్వ ప్రాణులను నీ యందే గాక, నా యందు కూడ చూడగలవు. (35)

పూర్వ శ్లోకములో వర్ణింపబడిన, ఆచార్యుడు ఉపదేశించే జ్ఞానము మాత్రమే ఈ శ్లోకములో ప్రస్తావింపబడుచున్నది. ఆ జ్ఞానమును పొందిన (యత్ జ్ఞాత్వా) సాధకునకు తాను కర్తను, భోక్తను అనే మోహము మరల తలయెత్తదు. నేను కర్తను (అహం కర్తా); నేను భోక్తను (అహం భోక్తా); నేను పరిచ్ఛిన్నుడను; నేను సాధకుడను; నేను జ్ఞానమును అన్వేషించుచున్నాను; నేను మోక్షమును కోరుచున్నాను –- ఇత్యాది మోహములు, జ్ఞానోదయ పర్యంతము జీవుని పీడించే మోహములు, మరల నిన్ను పీడించవు. ''ఓ పాండవా (పాండు కుమారా)! ఈ మోహములు మరల ఏనాడూ నిన్ను తమ వశము చేసుకొనజాలవు'' అని శ్రీకృష్ణుడు అర్జునునితో చెప్పెను.

ఈ మోహము మరల కలుగకపోవుటకు కారణమేమి? ఒకసారి మోహము తొలగిపోతే, అది శాశ్వతముగా దూరమగును. ఆత్మను గురించిన అజ్ఞానము నుండి పుట్టే భ్రాంతికి మోహమని పేరు. భ్రాంతికి మూలమగు ఆత్మ విషయక అజ్ఞానమును తొలగించి వేసినచో, సాధకుడు మరల అదే భ్రాంతికి గురికాడు. ఇతః పూర్వములో భ్రాంతి ఉండెడిది. కాని, ఈ భ్రాంతికి మూలము నందున్న అజ్ఞానము అనే కారణమును తొలగించి వేసినచో, మరల అదే భ్రాంతికి గురి యగుట ఎట్లు సంభవము? మరల అజ్ఞానము పునరావృతమైతే, ఆ భ్రాంతి మరల కలగవచ్చును. కాని, అజ్ఞానము మరల తిరిగి రాదు. ఇది ఒక వైపు మార్గము (one way) వంటిది. కావున, ఒకసారి అజ్ఞానము తొలగినచో, అది శాశ్వతముగా దూరమగును గాన, మరల ఆవిర్భవించే అవకాశము లేదు.

జ్ఞానము ఏనాటికీ తొలగిపోయేది కాదు

జ్ఞానము దీనికి భిన్నమైనది. అది ఒకసారి వస్తే, మరల పోదు. ఇందువలననే, అజ్ఞానము తిరిగి వచ్చుట అసంభవమగుచున్నది. జ్ఞానోదయమువకు పూర్వము ఉండే అజ్ఞానము తొలగిపోయినది. ఉదాహరణకు, అరటిపండును గూర్చి నీకు తెలియని కాలము ఒక క్షణమైనను ఉండునా? నీకు అరటిపండుమ గూర్చిన జ్ఞానము గలదు. కావున, అది తెలియకుండే ప్రసక్తియే లేదు. ఇతరులు నిన్ను కోరినా, నీవు ఆ జ్ఞానమును త్రోసివుచ్చలేవు. అజ్ఞానము పునఃప్రవేశించుట అసంభవము.

''ఒకచో, నాకు ప్రమాదములో మెదడుకు దెబ్బ తగిలి, జ్ఞానమును స్మృతిని కోల్పోయినచో, అజ్ఞానము మరల వచ్చినట్లు కాదా?'' అని నీవు శంకించవచ్చును. అజ్ఞానము తిరిగి రాదు. స్మృతి, ఇతరమనోవ్యాపారము తొలగిపోయినా, ఒకప్పుడు జీవునకు గల ఆత్మ విషయక అజ్ఞానము మరలి రాదు. అది పోయినది. నిశ్చితముగా పోయినది. అనగా, జ్ఞానికి కర్మలు లేవు; భ్రాంతి లేదు. సంసారము లేదు. మెదడు పనిచేయుట మానివేస్తే, జ్ఞాని జీవన్ముక్తావస్థను అనుభవించలేకపోతాడు. అంత మాత్రమే. జీవన్ముక్తుడు అనగా జీవించి యుండగనే ముక్తుడు అని యర్థము. జీవన్ముక్తుడు సంసారములో జీవిస్తూనే, దేహేంద్రియ మనస్సుల ద్వారా జగత్తులోని విషయములతో సంపర్కము పొందుతూ ఉండగనే, ముక్తుడుగ నుండును. మూర్ఛ (coma) మొదలగు అవస్థలలో నున్న జీవన్ముక్తుడు ఇట్టి స్థితికి దూరమగును. అంతే. జ్ఞానికి వేరే సమస్యలు ఏమీ ఉండవు.

స్థూలదేహము పనిచేసినా, చేయకపోయినా, జ్ఞానికి ఒకసారి లభించిన జ్ఞానము శాశ్వత లాభముగా మిగిలిపోవును. ఇది కంప్యూటర్‌లోని సూక్ష్మ జ్ఞానము (software) వంటిది. కంప్యూటర్

యొక్క స్థూలభాగములు(hardware) దెబ్బతింటే, సూక్ష్మ భాగము పనిచేయజాలదు. కంప్యూటర్‌కి కొత్త స్థూలభాగములను అమర్చే అవకాశము గలదు. కాని ఆత్మజ్ఞానము లభించిన తరువాత, కొత్త స్థూలదేహమును నిర్మించగలిగే కర్మ మిగిలి ఉండదు. కనుక, సూక్ష్మశరీరము (software) కూడ అవశ్యకము కాదు. జ్ఞానోదయము తరువాత ఆత్మ పరమేశ్వరునిలో ఐక్యమైపోవును. జీవత్వము తొలగును. ఆ స్థితిలో, ఈ జగత్తు సర్వము ఈశ్వరుడే; ఆత్మరూపుడగు జ్ఞాని యీశ్వరుని కంటె వేరు గాదు. వ్యక్తిత్వము తొలగిపోయి, సర్వులచే ఆరాధింపబడే ఈశ్వరునిలో ఐక్యమగును.

ఈశ్వర ప్రాప్తి అనగా నిదియే. జీవత్వము తొలగిపోయి, బ్రహ్మము మాత్రమే మిగులును. సంసారుల దృష్టిలో బ్రహ్మమనగా నేమి? జగత్కారణమగు ఈశ్వరుడే. జ్ఞాని అట్టి ఈశ్వరునితో ఒకటి యగును. జీవత్వము తొలగగనే, ఈశ్వరత్వము మాత్రమే మిగులును. ఈ విషయమునే ఈ శ్లోకము ప్రతిపాదించుచున్నది.

సర్వమును ఆత్మయందు దర్శించుట

జీవుని యందు జ్ఞానోదయ క్షణము వరకు గల భ్రాంతులను తొలగించి, మరల భ్రాంతి కలుగకుండా నిరోధించే జ్ఞానము ఈ శ్లోకములోని అర్ధభాగములో వర్ణింపబడినది. ఈ జ్ఞానము వలన జ్ఞాని సర్వప్రాణులను తనయందు దర్శించును (యేన భూతాని అశేషణ ద్రక్ష్యసి ఆత్మని). భూతాని అనగా ప్రాణులు అని యర్థము. ప్రాణులన్నియూ, మినహాయింపులు లేకుండగా (అశేషేణ), ఆత్మయందు దర్శింపబడును. జ్ఞాని తనకు కనబడు ప్రాణులనన్నిటినీ ఆత్మ యందు ఆత్మాభిన్నముగా దర్శించును (ఆత్మని ఏవ పశ్యతి). ఎందువలన? ఏలయనగా, జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము కూడ ఆత్మ రూపములే యగుట వలన సర్వమును ఆత్మయందు దర్శించును.

జ్ఞానోదయానికి పూర్వము సాధకునకు కర్తృత్వము అనే సమస్య ఉంటుంది. అనగా, సాధకుడు ఆత్మను జ్ఞానము నందు జ్ఞాతగా, క్రియ యందు కర్తగా స్వీకరిస్తాడు. కర్త స్వసంబద్ధమగు కర్మ కంటె సదా భిన్నముగా నుండును గదా! కావున, తాను ఇంద్రియములతో సంస్పర్శను పొందే విషయముల యందు సాధకునకు 'ఇవి నా కంటె భిన్నములు' అనే భేదభావన ఉండును. దీని వలన, విషయి-విషయభేదము సత్యముగా భాసించును.

ఆత్మయందు ఆరోపింపబడిన కర్తృత్వమును నిరాకరించుట ద్వారా, జ్ఞానోదయానికి ముందు సత్యముగా భాసించే ఈ ద్వైతము తొలగిపోవును. అపుడు జ్ఞానికి, సర్వమునకు అధిష్ఠానముగా

మంటూ, సర్వముతో అసంగముగా నుండే శుద్ధ చైతన్యఘనమగు ఆత్మ సాక్షాత్కరించును. సర్వము ఆత్మయే. ఈ ఆత్మ బ్రహ్మ కంటె వేరు కాదు. ''నీవు సర్వప్రాణులను నీ యందే చూచెదవు (ఆత్మని సర్వాణి భూతాని పశ్యసి)'' అను వాక్యములో శ్రీకృష్ణుడీ విషయమును ప్రదర్శించెను.

జ్ఞాతృత్వావచ్ఛిన్న చైతన్యము, జ్ఞాన క్రియా వచ్ఛిన్న చైతన్యము, జ్ఞేయావచ్ఛిన్న చైతన్యము అనునవి ఒకే చైతన్యము. నామరూపములకు ఈ చైతన్యము కంటె వేరుగా స్వతంత్రమైన ఉనికి లేదు. సర్వము యొక్క ఉనికి (సత్) ఈ చైతన్యము యొక్క ఉనికి కంటె వేరుగాదు. కావున, జ్ఞాతృ, జ్ఞాన, జ్ఞేయ పరిచ్ఛేదములు ఈ చైతన్యము కంటె వేరుగా లేవు.

నీకు, ఈశ్వరునకు భేదము లేదు

శ్రీకృష్ణుడిచట ఇట్లు చెప్పుచున్నాడు: భేదము యథార్థముగా లేదు. జ్ఞానోదయానికి పూర్వము భిన్నముగా భాసించిన సర్వము, జ్ఞానము ఉదయించుట తోడనే నీ యందే భాసించును. అంటే, సర్వము నేనే. జ్ఞాని సర్వమును ఆత్మయందు మాత్రమే గాక, ఈశ్వరుని యందు కూడ దర్శించును. ''నీవు సర్వమును నీ ఆత్మ యందు దర్శిస్తావు; ఆ కారణంగా, నీవు సర్వమును నా యందు దర్శిస్తావు'' అని శ్రీకృష్ణుడు ఈశ్వరుని స్థానము నుండి చెప్పుచున్నాడు. అంటే, నీకు (ఆత్మకు), నాకు (ఈశ్వరునకు) భేదమేమీ లేదని స్పష్టమగుచున్నది.

ఈ సర్వజగత్తునకు ఈశ్వరుడే నిమిత్త కారణము; ఉపాదాన కారణము కూడా ఈశ్వరుడే. కావున, ఈశ్వరుని కంటె భిన్నముగా ఏది లేదు. కావున, ఈ సమస్త సృష్టి, ఈ సర్వము ఈశ్వర స్వరూపమే. అనగా, ఆకాశాది పంచభూతములు ఈశ్వరుడే. ఆకాశము నందుండే ఈ సర్వము ఈశ్వర స్వరూపమే. ఈ స్థూల ప్రపంచములో ఈ స్థూలదేహము కూడా అంతర్భాగమే గనుక, అది కూడా ఈశ్వరస్వరూపమే. దేహములో జరిగే క్రియలన్నీ ఈశ్వర స్వరూపమే. మనస్సు, ఇంద్రియములు కూడ ఈశ్వరుడే. ఈ విధంగా సర్వము ఈశ్వరుడే.

ఈశ్వరీయ చైతన్యము నీవే

ఈశ్వరునకు వలెనే, చైతన్యమునకు కూడా పుట్టుక లేదు. వాస్తవంలో, చైతన్యము, ఈశ్వరుడు ఒక్కటియే. మరో మాటలో చెప్పాలంటే, భగవానుడు తన కంటె అభిన్నమైన చైతన్యమును సృష్టించలేదు. మనస్సు రూపములో, ఇంద్రియముల రూపములో, మరియు సర్వ జగద్రూపములో

ప్రకటమయ్యే చైతన్యము ఈశ్వరుడే. ఈ సత్యము తెలిస్తే, మిగిలేది ఎవరు? ఈశ్వరుడే. జీవులు ఉండరు. స్థూలదేహము, స్థూలజగత్తు, మనస్సు, సూక్ష్మ జగత్తు ఇత్యాది సర్వము ఈశ్వరునిలో అంతర్భాగములగును. ఇక మిగిలింది చైతన్యరూపుడవగు నీవు మాత్రమే. నీ స్వరూప భూతమగు ఆ చైతన్యము, ఈశ్వరీయ చైతన్యము ఒక్కటియే.

అనాది చైతన్యమే భగవానుని యథార్థ స్వరూపము. కావున, ఉన్నది సర్వము ఈశ్వరుడే. ఈశ్వరునిచే సృష్టింపబడిన సర్వము ఈశ్వరుని కంటె భిన్నమైనది కాదు. మరియు, ఈశ్వరునిచే సృష్టింపబడని చైతన్యము ఈశ్వరుని స్వరూపసారమై, ఈశ్వరుని రూపముననే కొనసాగును. కావున, ఉన్నది అంతా ఒకే ఒక పరబ్రహ్మము. నీవు ఆ పరబ్రహ్మ కంటె వేరైన జీవుడవు కావు.

ఈ విషయమును మనము ఇంకో విధంగా పరిశీలించవచ్చును. నీవు ఈశ్వరుని కంటె వేరు కాదు గనుక, ఉంటే ఈశ్వరుడు ఒక్కడే ఉండాలి. లేదా, నీవు ఒక్కడివే ఉండాలి. ఈశ్వరుడు ఒక్కడే ఉన్నాడు అనే పక్షంలో నీవు ఉండవు. నీ పరిచ్ఛిన్నమైన 'నేను' ఉండదు. ఎటు నుండి చూచినా, నిర్ణయము ఒక్కటియే. కావుననే, నీవు సర్వప్రాణులను నీయందు మాత్రమే గాక, ఈశ్వరుడనగు నా యందు కూడ చూస్తావు. వాస్తవంలో, వ్యక్తిత్వభావనతో గూడిన జీవునికి, ఈశ్వరునకు భేదము లేశమైననూ లేదని శ్రీకృష్ణుడు చెప్పెను.

ఈ జ్ఞానము, ఈ సాక్షాత్కారము ఇట్టిది. దీనిని శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములో ఇంకనూ వర్ణించుచున్నాడు:

అధ్యాయము 4, శ్లోకము 36:

अपि चेदसि पापेभ्यः सर्वेभ्यः पापकृत्तमः ।
सर्वं ज्ञानप्लवेनैव वृजिनं सन्तरिष्यसि ॥ ३६ ॥

అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః
సర్వం జ్ఞాన ప్లవేనైవ వృజినం సంతరిష్యసి (36)

సర్వేభ్యః = అందరు; పాపేభ్యః = పాపుల కంటె; పాపకృత్తమః = అత్యధికముగా పాపములను చేసినవాడవు; అపి అపి చేత్ = నీవు అయిననూ; సర్వం = సమస్తమగు; వృజినం = పాపమును; జ్ఞానప్లవేన ఏవ = జ్ఞానము అనే పడవతో మాత్రమే; సంతరిష్యసి = తేలికగా దాటివేయగలవు.

నీవు పాపులందరి కంటె అత్యధికముగా పాపములను చేసిన వాడవే అయినప్పటికీ, సమస్తమగు పాపమును జ్ఞానము అనే పడవతో మాత్రమే తేలికగా దాటివేయగలవు. (36)

ఇచట ఒక ప్రశ్న ఉదయిస్తుంది. ఇన్ని విధములుగా పరిచ్ఛిన్నమైన వ్యక్తి ఈ జ్ఞానమును పొందగలడని ఆశించుట యెట్లు? మనము చర్చిస్తున్న ఈ జ్ఞానము సామాన్యమైన జ్ఞానము కాదు గదా! ఇది సర్వము యొక్క జ్ఞానము. నేను పూర్ణుడను; పరబ్రహ్మను; సర్వము నేనే; ఈశ్వరుడను నేనే; అనే యీ జ్ఞానమును పొందుట చాల కఠినము గదా! నా వంటి అల్పునకు ఇట్టి సర్వాత్మజ్ఞానము మ్రింగుడు పడునా? అను శంక సాధకునకు కలుగుట సహజమే.

సాధకుని శంక ఇదియే అయినచో, సమస్య లేదు. ఏలయన, సర్వాత్మ భావమును మ్రింగ బనిలేదు. తెలుసుకున్న చాలును. ఇది విశ్వాసయోగ్యమగు విషయమైనచో, తప్పక మ్రింగవలసి యుండెడిది. విశ్వాస్యమైన విషయములలో మ్రింగేదే గాని, విచారించేది ఏమీ ఉండదు. కాని, ఇచట మ్రింగవలసిన పని లేదు. సర్వము ఈశ్వరుడే అనే సత్యము దర్శనీయమే గాని, విశ్వసనీయము గాదు.

అయినను, కొందరు సాధకులు ఇట్లు అనవచ్చును: ''స్వామీజీ, ఇది నా శక్తికి మించిన పని. నేను నా జీవితములో చేసిన పనుల గురించి మీకు కల్పన లేదు. విధి నిషేధముల పరిధిలోనుండి, విధులన్నింటినీ శ్రద్ధగా నిర్వర్తించి నిషిద్ధములను దూరముగా నుంచి, నీతి నియమములను తప్పక, పవిత్రమైన జీవనమును గడిపిన వ్యక్తులకు మాత్రమే ఈ జ్ఞానము లభ్యమగును. ధర్మ సంరచనను ఉల్లంఘించని పుణ్యాత్ములు, భాగ్యవంతులు మాత్రమే మీ ఉపదేశమునకు అర్హులు. నా వంటి పాపి ఇంతటి పవిత్ర జ్ఞానము దరిదాపులకు కూడ రాజాలడు. కావున, ఈ జ్ఞానమును పొందే అర్హత నా యందు నాకేదియు అగుపించుట లేదు.

పాప సముద్రము

కొన్ని మత సిద్ధాంతముల ప్రభావములకు లోబడిన వ్యక్తులు తమ దోషమేమీ లేకపోయినా, తాము ఆ జన్మతః పాపులమని తలపోస్తారు. 'మీరు పాపము నుండి జన్మించిరి' అని వారికి కొందరు బోధిస్తారు. వారు తమ జన్మ నిష్కలంకము కాదని తలపోయుచూ, ఇట్టి బోధనలను అంగీకరిస్తారు. పైగా, జన్మ తరువాత కూడ వారు తమలను పాపులుగనే భావిస్తారు. 'నేను పుట్టుకతోనే పాపిని గదా!

మరికొన్ని పాపములను కూడా చేసినచో, మునిగేది ఏమున్నది? ఇందువలననే, నేను నాకు తోచినరీతిలో జీవించితిని. నా దారిలో అవరోధములు లేనిచో, నేను ఇంకనూ మరికొన్ని పాపములను చేసి యుండెడివాడను. నాకు పుట్టుకతోనే ప్రాప్తమైన కొన్ని బలహీనతలు ఉండుట చేతనూ, మరియు నాకు ధర్మము నందు ప్రేమ, అంకితభావము ఉండుటచేతను, మరికొన్ని పెద్దపాపములను విడిచిపెట్టితిని. ఏ మాత్రము అవకాశము ఉన్నా, నేను వాటిని కూడ చేసి ఉండెడివాడను. ఇట్టి స్థితిలో, నేనే ఈశ్వరుడనని మీరు చెప్పగలరా? నాకే జ్ఞానము లభించునని మీరు అనుకుంటున్నారా?''

'అవును.' ఈ శ్లోకములో శ్రీకృష్ణుడిచ్చిన సమాధానము ఇదియే. ఘోరపాపి కూడా ఈ ప్రత్యగభిన్న బ్రహ్మ జ్ఞానమును పొందగల్గుతాడు. అదియే ఈ జ్ఞానములోని మహిమ. అక్రమ మద్య విక్రేతలు, నిషా ద్రవ్య వ్యాపారులు, హంతకులు, చిన్న చిన్న పాపములను చేయువారు, మహాపాపములను చేయువారు మొదలగు ప్రపంచములోని పాపాత్ములందరికీ ఈ శ్లోకములోని 'పాప' శబ్దము అన్వయించును (సర్వేభ్యః పాపేభ్యః). ఈ సత్యమును దృఢముగా బోధించుటకై శ్రీకృష్ణుడీ శ్లోకములో, వారందరిలోనూ మహాపాపిని (పాపకృత్తమః) విషయవస్తువుగా స్వీకరించినాడు.

'వృజినం' అనగా పాపము. 'సర్వం వృజినమ్' అను పదములకు ఈ శ్లోకములో మహాపాప సముద్రము అని యర్థము. ఇట్టి సముద్రములో మధ్యలో చిక్కుకొనియున్న వ్యక్తి 'పాపకృత్తమః' అనబడును. ఇట్టి అతిమహాపాపి కూడా ఈ పాప సముద్రమును జ్ఞానము అనే ఒకే ఒక పడవతో (జ్ఞానప్లవేన) దాటివేయగల్గును. ఈ జ్ఞానప్లవము ''అది నీవే అయి ఉన్నావు (తత్ త్వం అసి)'' అనే ఒకే ఒక చిన్న వాక్యరూపములో నున్నది. ఈ మూడు పదముల వాక్యములో జ్ఞానమంతయూ ఇమిడి ఉన్నది. అతి మహాపాపియైన వ్యక్తి కూడా ఈ జ్ఞానమనే పడవతో పాప సముద్రమునంతనూ దాటివేయగలడు (వృజినం సర్వం సంతరిష్యసి).

ఈ తరణములో అనేక కష్టములు ఎదురు కావా? ఈ తరణమునకు అధిక సమయము పట్టదా? అను శంక కలుగవచ్చును. ఇట్టి శంకకు అవకాశము లేదు. ఆత్మయొక్క యథార్థ స్వరూపము తెలిసిన జాలును. ఈ పాప సముద్రమును సునాయాసముగా దాటివేయవచ్చును.

నీకు ఒక కల వచ్చినదనుకో. ఆ కలలో నీవు కొందరిని హత్యచేసి పట్టుబడితివి. నిన్ను కోర్టులో హాజరు పరచినారు. నీ నేరము నిరూపితమై, నీకు ఉరిశిక్ష పడినది. కొద్దిసేపట్లో నిన్ను ఉరితీయుటకు సర్వము సిద్ధమైనది. ఇంతలో నీకు మెలుకువ వచ్చినది! నీవు కలలో చేసిన పాపములు యేమగును? ''కలలో చేసిన పనులకు నేను కర్తను కాను'' అనే ప్రబోధము నీకు కలగగానే, ఆ

జ్ఞానము యొక్క ప్రభావము చేత నీవు పాపముల నుండి, శిక్ష నుండి రక్షింపబడితివి. ఆ పాపములకు నీపై ఎట్టి ప్రభావమూ ఉండబోదు.

కలలోని క్రియలను ఆచరించిన కర్త యెవరు? నీవు కర్త గాదు. కర్త మరియొకరు. ఆ కర్తృత్వమును నీవు నీపై ఆరోపించుకున్నావు. అందువలననే, కర్త యొక్క కష్టాలన్నీ నీ కష్టాలు అయినవి. తరువాత, నీవు కల మిథ్యయని తెలుసుకున్నావు. అపుడు, కలలోని సర్వ వ్యవహారములు, కలతో సహా, మిథ్య అయినవి. కాని, కలలోని కర్తృత్వము యథార్థమైనచో, దానిని మిథ్య యనుట ఎట్లు పొసగును? ప్రబోధ జ్ఞానములో స్వప్న ద్రష్ట లీనమైనాడు. అంటే, జాగ్రత్ ద్రష్ట స్వప్న ద్రష్టను, స్వప్న ప్రపంచమును, స్వప్న కాలీన క్రియలను, స్వప్న ఫలములను మ్రింగివేసినాడు.

ఆత్మ ఏనాడూ పాపి కాదు

స్వప్నంలో వలెనే, జాగ్రత్తులో కూడా ద్రష్ట తాను కర్తనని భావించును. ఈ కర్త కూడా మిథ్యయే. ఆత్మయందు కర్తృత్వము మిథ్యారోపితము అనే దర్శనము గల వ్యక్తి కర్తృత్వ విముక్తుడగును. మిథ్యయని ఎరుంగుటయే జ్ఞానము. ఈ జ్ఞానము జీవుని మిథ్యాకర్తచే చేయబడిన సర్వకర్మల నుండి పూర్ణముగా విముక్తుని చేయును. ఆత్మ కర్త కాదు. ఆత్మ నిత్య శుద్ధము. సర్వ వికార రహితము. కావున, ఆత్మ పాపి కాదు.

"నేను ఒకప్పుడు పాపిని. కాని, ఆ తరువాత సత్కార్యముల నాచరించి, పాపకార్యములను తుడిచివేసి, సాధువునైనాను" అని నీవు అనవచ్చును. కాని, పాపి యగుట, సాధువు అగుట అనునవి కర్తృత్వ భావనపై ఆధారపడి యుండును. పాపి యందు, సాధువు నందు కూడ కర్తృత్వము స్థిరముగా నుండును. 'నేను పాపిని', 'నేను సాధువును' అని యీ ధారణలు రెండింటి యందు కర్తృత్వము ఇమిడియున్నది. ఒకప్పుడు నీవు పాపివి. ఇప్పుడు సాధువు అయినావు. నీలో మార్పు వచ్చినది. నీవు పాపకృత్యముల నన్నిటినీ వీడినావు. నీవు జీవనశైలిని, ప్రవృత్తిని మార్చుకున్నావు. కాని, నీవు పాపిగా ఉన్నరోజులలో ఉన్నట్లే, ఈనాడు కూడ కర్తృత్వము నీ యందు దృఢముగా నున్నది. మన మిచట గమనింపదగిన విషయమేమన ఆత్మ ఏనాడూ పాపి కాదు. 'పాపిని' అని నీవు భావించినప్పుడు కూడా నీవు పాపివి కావు.

ఆత్మ సాధువు అను మాట అత్యల్పము. ఆత్మ నిత్యశుద్ధము. ఆత్మయందు కర్తృత్వ భోక్తృత్వములు, సుఖదుఃఖములు లేవు. కాన, ఆత్మయందు దోషము లేశమైననూ అంటుకొనదు.

ఆత్మ ప్రేమించదు; ద్వేషించదు. ఆత్మ నిత్యముక్తము, శుద్ధచైతన్యము(నిత్య శుద్ధ బుద్ధ ముక్తస్వభావః ఆత్మా). ఆత్మ యందు క్రియ లేదు. కావున, అతి మహాపాపి జ్ఞానమును పొందజాలడు అని చెప్పుటకు యెట్లు వీలుపడును?

కాని, పాపజీవనము ఒక సమస్యయే. నీవు పాపములను చేసిన సంగతి నీకు తెలిసి యుండి, నీవు వాటి నుండి విముక్తడవు కావాలని కోరుచున్న పక్షంలో, నీకు శ్రద్ధ అవశ్యకమగును. దీనిని గురించి శ్రీకృష్ణుడు తరువాత వివరిస్తాడు. వాస్తవంలో, నీవు దేనినీ పోగొట్టుకొనవలసిన అవసరం లేదు. ఆత్మ సదా పాప సంసర్గ రహితము అని నీవు తెలుసుకున్న చాలును.

ఇందువలననే శ్రీకృష్ణుడీ శ్లోకములో, ''నీవు జ్ఞానమనే పడవతో పాపముల నన్నిటినీ దాటివేయగలవు'' అని చెప్పెను. శ్రీకృష్ణుడీ మాటను చెప్పి, మనము తప్పించుకొనుటకు వీలు లేకుండా చేసినాడు. నీవు పాపివి అయినా సరే; నీవీ జ్ఞానము కొరకు యత్నించాలి. 'నేను పాపిని' అని చెప్పి, తప్పించుకొనుటకు వీలు లేదు. ఈ జ్ఞానముతో నీవు పాప సముద్రమును పూర్తిగా దాటివేయగలవు.

ప్రత్యేక ప్రయత్నమేమియూ అక్కరలేదు

ఈ శ్లోకము జ్ఞానమును స్తుతించుచున్నది. పాపులలో కెల్లా పాపి యగు వ్యక్తి కూడా కన్నిటిని కార్చకుండగనే, జ్ఞాన ప్రభావము వలన ముక్తుడు కాగలడు. దీనికి కారణమేమన, పాపము, తత్ఫలమగు దుఃఖము ఇత్యాదులన్నీ 'నేను కర్తను' అనే ధారణపై ఆధారపడి యున్నవి. ఆత్మ యందారోపితమైన ఈ కర్తృత్వభావనయే సర్వకర్మలకు, కర్మఫలములకు మూలమగుచున్నది. జ్ఞానము కలుగుట తోడనే కర్తృత్వము మిథ్యయని తేలును. కావున, కర్మఫలములు సముద్రముతోను, జ్ఞానము ఆ సముద్రమును దాటించే పడవతోను పోల్చబడినవి. ఆత్మ నిత్యముక్తము గనుక, ఈ సముద్రమును తేలికగా దాటివేయవచ్చును.

ఈ జ్ఞానము ఇతరులకు హాని కలిగించే పాపకర్మలను ఎట్లు నశింపజేయగల్గును? ఒక కర్మఫలమును మరియొక కర్మఫలము మాత్రమే నిష్ప్రభావితము చేయగల్గును గదా? ఒక వస్తువును అదే సత్యత్వ శ్రేణి (order of reality) కి చెందిన మరియొక వస్తువు మాత్రమే నాశనము చేయగల్గుతుంది అనుమాట సత్యమా, కాదా? ఉదాహరణకు, తుపాకీ గుండు, లేక కత్తి వంటి ఒక మూర్త పదార్థము స్థూలదేహము వంటి మరియొక మూర్త పదార్థమును నశింపజేయగలదు. జ్ఞానము దానిని నశింపచేయలేదు గదా! ఈ వాదము ప్రస్తుత సందర్భములో వర్తించదు. దీనికి గల కారణమును మనము పరిశీలిద్దాము.

విచారించినచో, మనకు ఒక సంగతి స్పష్టమగును. సత్యత్వము యొక్క ఉన్నత శ్రేణికి ఎదుగుట ద్వారా తక్కువ శ్రేణిలోని వస్తువును నశింపచేయవచ్చును. ఉదాహరణకు, స్వప్నద్రష్ట తెలివిని పొందగనే, స్వప్నములోని కర్మలన్నియూ నాశమును పొందును. కావున, మిథ్యాత్వమును నిశ్చయించుట ద్వారా నశింపజేయవచ్చును. మిథ్యను మిథ్యగా ఎరుంగుటయే జ్ఞానము. త్రాడును చూచి పాము అనుకున్నప్పుడు, పాము మిథ్య. రజ్జు జ్ఞానము కలుగగానే, అది నశిస్తుంది. ఈ విధంగా, పాము నశించగానే, పాము అనే భ్రాంతి నుండి పుట్టిన భయము మొదలగునవి కూడా నశించును.

అదే విధముగా, జ్ఞానము ఉదయించగనే, కర్తృత్వధారణ నశించును. ఈ విషయమును నిరూపించుటకై శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములో ఒక దృష్టాంతము నిచ్చుచున్నాడు:

అధ్యాయము 4, శ్లోకము 37:

यथैधांसि समिद्धोऽग्नि र्भस्मसात्कुरुतेऽर्जुन ।
ज्ञानाग्निः सर्वकर्माणि भस्मासात्कुरुते तथा ॥ ३७ ॥

యథైధాంసి సమిద్ధోఽగ్ని ర్భస్మసాత్కురు తేఽర్జున ।
జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మ సాత్కురుతే తథా (37)

అర్జున = ఓ అర్జునా!; యథా = ఏ విధముగా; సమిద్ధః = బాగుగా ప్రజ్వరిల్లిన; అగ్నిః = అగ్ని; ఏధాంసి = కట్టెలను; భస్మసాత్ = బూడిదగా; కురుతే = మార్చివేయునో; తథా = అదే విధముగా; జ్ఞానాగ్నిః = జ్ఞానమనే అగ్ని; సర్వ కర్మాణి = కర్మలనన్నిటినీ; భస్మసాత్ = బూడిదగా; కురుతే = మార్చివేయును.

అర్జునా! బాగుగా ప్రజ్వరిల్లిన అగ్ని కట్టెలను బూడిదగా మార్చివేయునటుల,
జ్ఞానమనే అగ్ని కర్మలనన్నిటినీ బూడిదగా మార్చివేయును. (37)

జ్ఞానాగ్ని

అగ్ని అనేక రకములుగ నున్నది. అగ్గిపుల్లను గీచినప్పుడు వచ్చే జ్వాల అగ్నియే. కాని, చిన్న జ్వాల సర్వమును నశింపజేయలేదు. అదే జ్వాల పెద్దదైతే, సర్వమును తగులబెట్టును. ఆ జ్వాల పెద్దదిగా అగునంత వరకు, పిల్ల గాలి కూడ దానికి శత్రువే. కాని, అది పెరిగి పెద్దది అయిన పిదప,

గాలి దానికి మిత్రము అగును. మనకు ఉండే శక్తి విషయంలో కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. నేను బలహీనుడుగా నున్నచో, అందరు నన్ను పీడిస్తారు. కాని, బలవంతుడగు వ్యక్తితో మైత్రిని అందరూ కాంక్షిస్తారు.

మంట భీకరాగ్నిగా పెంపొందినపుడు, ఎండుకట్టెలు మాత్రమే గాక, పచ్చి కట్టెలు కూడ కాలి బూడిద అవుతాయి (భస్మసాత్ భవతి). ఇదే తీరున, జ్ఞానాగ్నిలో జ్ఞానియొక్క కర్మలన్నియూ నశిస్తాయని శ్రీకృష్ణుడీ శ్లోకములో అర్జునునితో చెప్పుచున్నాడు.

'జ్ఞానాగ్ని' అనే సమాసపదమునకు 'జ్ఞానమనే అగ్ని' అని యర్థము. అనగా, జ్ఞానమే అగ్ని. ఈ అగ్నిలో కాలి, బూడిద అయ్యే వస్తువు ఏది? దీనిలో బూడిద అయ్యేది కట్టెలు మొదలగు ఇంధనములు (ఏధాంసి) కాదు. ఈ జ్ఞానాగ్నిలో జ్ఞానియొక్క కర్మలన్నియూ భస్మమగును (కర్మాణి భస్మసాత్ కురుతే). 'కర్మాణి' అనగా 'కర్మలు, వాటి ఫలములతో సహా' అని యర్థము.

'అగ్ని కట్టెలను కాల్చివేసినట్లు, జ్ఞానము కర్మలనన్నిటినీ కాల్చివేయును' అని చెప్పినమా, ఇచట వాస్తవమగు కాల్చివేయుట లేదు. నిప్పు కట్టెను కాల్చిన పద్ధతిలో, జ్ఞానము కర్మలను కాల్చుట సంభవము కాదు గదా! జ్ఞానము కర్తృత్వమును బాధించుట ద్వారా కర్మలనన్నిటినీ బాధించును (negates).

'సర్వ కర్మాణి' అనగా సంచిత కర్మలు, ఆగామి కర్మలు అని యర్థము. జీవునిచే ఇంతకు ముందు చేయబడి, ఇంకను ఫలము నీయకుండా, జీవుని ఖాతాలో ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపములో నున్న కర్మలు సంచిత కర్మలనబడును. జీవుడు ఇప్పటి నుండి జ్ఞానోదయము వరకు చేయబోవు కర్మలు ఆగామి కర్మలనబడును. జ్ఞానాగ్ని ఈ ద్వివిధ కర్మలను (సంచిత, ఆగామి) భస్మము చేయును. *

ప్రారబ్ధకర్మ స్వయముగనే క్షయమగును

ప్రారబ్ధకర్మ మాత్రము జ్ఞానముచే నశింపచేయబడదు. అనగా, స్థూలదేహము జ్ఞానానంతరము కొనసాగుచుండును. జ్ఞాని యనగా జీవించి యుండగనే మోక్షమును పొందినవాడు (జీవన్ముక్తుడు). ప్రారబ్ధకర్మ కూడ జ్ఞాన నాశ్యమయ్యే పక్షంలో, ప్రారబ్ధకర్మ వలన పుట్టిన దేహము

* త్రివిధ కర్మల వివరణ కొరకు 13వ సంచికను చూడుడు.

కూడా నశించిపోవుటచే, జ్ఞానియే లేకుండును! కాని, ఇట్లు జరుగుట లేదని మనకు తెలియును. దేహము పుట్టుటతో ప్రారబ్ధకర్మ ఫలము ఇచ్చుట ఆరంభమైనది. కావున, సర్వకర్మలలో (సర్వకర్మాణి) ప్రారబ్ధకర్మ చేరదు. ఈ దేహము ప్రారబ్ధకర్మను అనుభవించుట కొరకై ఆరంభింపబడినది. కావున, ఈ కర్మ అనుభవము చేతనే క్షయమగును. కావున, జ్ఞానితో సహా, సర్వ ప్రాణులకు ప్రతిదినము తమ తమ ప్రారబ్ధకర్మ క్షయమగుచుండును.

దేహము ఉన్నంత వరకు జ్ఞాని ఈ లోకములో జీవనమును కొనసాగించి, తరువాత బ్రహ్మములో ఐక్యమగును అని ఛాందోగ్యోపనిషత్తు* చెప్పుచున్నది. స్థూలదేహము, మనస్సు, ఇంద్రియములు ఉన్నంత కాలము జ్ఞాని ఈ ప్రపంచములో జీవన్ముక్తునిగా జీవించును. దేహము నశించగనే, జ్ఞాని విషయంలో జీవుడు గాని, పునర్జన్మ నిచ్చే కర్మ గాని ఉండవు. జ్ఞానికి, ఈశ్వరునకు, జగత్తునకు మధ్యలో ఏమియూ భేదము ఉండదు. ఈ విధంగా, మనకు భాసించు భేదములు, సంబంధములు కూడ మటుమాయమగును.

జ్ఞాని యొక్క ప్రారబ్ధకర్మ క్షయమగు వంత వరకు కొనసాగును. కాని, జ్ఞానము కలుగుటకు పూర్వము సంచిత కర్మలన్నియూ జ్ఞానోదయము కాగానే నాశనమగును. జ్ఞానోదయము కల్గిన తర్వాత, జ్ఞాని చేసే అనేక కర్మల మాట యేమి?

పూర్వ జన్మలలో ప్రోగుచేసిన అసంఖ్యాకములగు సంచిత కర్మలతో బాటు, ఈ ఆగామి కర్మలు కూడ నశించును (సర్వ కర్మాణి భస్మసాత్ కురుతే). మరో మాటలో చెప్పాలంటే, ఇంతవరకు ఫలము నిచ్చుట ఆరంభము కాని కర్మలన్నియూ జ్ఞానాగ్నిలో భస్మమగును. మరియు, జ్ఞానోదయము తరువాత గాని, లేదా జ్ఞాన కాలము ముందు గాని చేసిన కర్మలు, కర్తృత్వధారణ లేకుండగా చేసినవి గాన, జ్ఞానాగ్నిలో నశించును.

అందువలననే, శ్రీకృష్ణుడిట్లు చెప్పుచున్నాడు:

అధ్యాయము 4, శ్లోకము 38:

न हि ज्ञानेन सदृशं पवित्रमिह विद्यते ।
तत्स्वयं योगसंसिद्धः कालेनात्मनि विन्दति ॥ ३८ ॥

---

* తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యే అథ సంపత్స్యే (6, 14, 2)

న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే
తత్స్వయం యోగసంసిద్ధః కాలే నాత్మని విందతి (38)

హి = అందువలన; **ఇహ** = ఈ లోకములో; **జ్ఞానేన** = జ్ఞానముతో; **సదృశం** = సమానమైన; **పవిత్రం** = పావనము చేయునది; **న విద్యతే** = లేదు; **యోగసంసిద్ధః** = కర్మయోగము ద్వారా మానసిక సంసిద్ధతను పొందిన సాధకుడు; **ఆత్మని** = మనస్సు నందు; **స్వయం** = సహజముగా, **తత్** = ఆ జ్ఞానమును; **కాలేన** = కాలక్రమములో; **విందతి** = పొందును.

> కావున, ఈ లోకములో జ్ఞానముతో సమముగా పావనము చేయునది లేదు. కర్మయోగము ద్వారా మానసిక సంసిద్ధతను పొందిన సాధకుడు తన మనస్సు నందు ఆ జ్ఞానమును సహజముగా కాలక్రమములో పొందును (38).

'సదృశం' అను పదము తృతీయా విభక్తి పదముతో కూడి ప్రయోగింపబడును. 'సమమైనది' అని దీని యర్థము. కావున, 'జ్ఞానేన సదృశమ్' అనగా పవిత్రము చేసే సామర్థ్యములో జ్ఞానముతో సమమైనది అని యర్థము. అంతఃకరణశుద్ధికి క్రతువులు, దానములు మొదలగు అనేక సాధనములు గలవు. కాని, వాటిలో ఆత్మజ్ఞానమునకు సాటియైనది లేదు.

కర్తగా నుండి ప్రార్థనలు చేసే కర్తను జ్ఞానము మాత్రమే నశింపచేయగలదు. ప్రార్థన అనే క్రియలో కర్త మిళితమై యుండును గాన, ప్రార్థన కర్తను నశింపచేయలేదు. ప్రార్థన అభిలషణీయమగు ఫలము నిచ్చును. ప్రార్థన కూడా పవిత్రము చేయునది గనే పరిగణింపబడును. కాని, ఆత్మజ్ఞానముతో సమానముగా పవిత్రము చేయునది మరియొకటి లేదు. సత్స్వరూపము యొక్క జ్ఞానము లభించుటలో ప్రార్థన సహకారి యగును. కాని, ప్రార్థన యొక్క ఆవశ్యకత నుండి మాత్రమే గాక, సర్వము నుండి పూర్ణముగా విముక్తము చేసేది దాని జ్ఞానము మాత్రమే.

ఒక వ్యక్తి ప్రార్థన చేస్తున్నాడంటే, అతనిలో ఏదో ఒక మాలిన్యము, లేక దోషము (అశుద్ధి) ఉన్నదని యర్థము. పరిచ్ఛిన్న భావన, బంధము, నిస్సహాయత మొదలైనవి అశుద్ధిలో రకములు. వీటి నుండియే సాధకుని ప్రార్థన ఉద్భవించును. ప్రార్థనచేసే కర్త యందు నిస్సహాయ భావన కేంద్రితమై యుండును. ప్రార్థన యొక్క సర్వోత్కృష్ట ఫలము జ్ఞానము. 'జీవుడు వివిధ పరిచ్ఛేదములకు అధీనుడు; అపూర్ణుడు' ఇత్యాది ధారణలనుండి విముక్తిని జ్ఞానము కలిగించును. తద్ద్వారా జ్ఞానము

సాధకుని నిస్సహాయ భావనలను పూర్ణముగా తొలగించివేయును. ఆత్మజ్ఞానము సాధకుని కర్తృత్వమును నుండి, శోకము నుండి పూర్ణముగా విముక్తుని చేయును. ఇందువలననే, జ్ఞానము పరమ పావనమని చెప్పబడినది.

యోగము ద్వారా జ్ఞానోదయమునకు అవశ్యకమగు మానసిక క్షమత

గీతలో 'యోగ' శబ్దము ప్రకరణము ననుసరించి, తరుచుగా కర్మయోగము అనే అర్థములోను, అప్పుడప్పుడు జ్ఞానయోగము అనే అర్థములోను వాడబడును. ఇచట, యోగమనగా జ్ఞానాన్వేషణలో విజయము నిచ్చే సాధనము అని యర్థము. అనగా, కర్మయోగమన్నమాట. జ్ఞానోదయమున కావశ్యకమగు మానసిక సంసిద్ధతను, క్షమతను సంపాదించి, జ్ఞానార్హతను పొందిన వ్యక్తిని ఈ శ్లోకము 'యోగసంసిద్ధః' అని వర్ణించినది. ఇట్టి సాధకుని మనస్సు కొంత వరకు రాగద్వేషవిముక్తమై నిశ్చలముగా నుండును. అనగా, సాధకుడు అంతఃకరణ శుద్ధిని పొందినాడని స్పష్టమే.

ఈ విధముగా మనస్సు పరిశుద్ధమగుటకు సమయము పట్టును. ఒకప్పుడు అది వెనువెంటనే సిద్ధించుటయూ సంభవమే. ఈ శ్లోకములోని 'కాలేన' అను పదమునకు 'దీర్ఘకాలము' అనే అర్థము చెప్పి తీరాలనే నియమం లేదు. దాని అర్థము 'కొంత సమయము' అని మాత్రమే. ''స్వామీజీ, నేను ఈ కర్మయోగమును ఎంతకాలము అనుష్ఠించవలయును?'' అని నీవు నన్ను అడిగినచో, నేను అట్టి కాలమును ఖచ్చితముగా చెప్పజాలను. ఉదాహరణకు, ''కర్మయోగమును మూడు సంవత్సరములు, జ్ఞానయోగమును నాల్గు సంవత్సరములు అభ్యసించుము'' అని నేను చెప్పజాలను.

మనమిచట ఒక వస్తువును ఉత్పత్తి చేయుట లేదు. కావున, 'కాలేన' అను పదమునకు ఖచ్చితమైన కాలమును అర్థముగా చెప్పజాలము. ఒక వస్తువును తయారుచేసే ప్రక్రియలో ఖచ్చితముగా కాల నిర్దేశము ఉంటుంది. ఉదాహరణకు, ''పిండి మొదలగు ముడి సరుకులను కలిపి, 350 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద 20 నిముషములు వేడి చేసినచో రొట్టె తయారగును'' అని చెప్పగల్గుతాము. ఒక కొత్త వస్తువును తయారు చేసే సందర్భములలో గాని, ఒక ఘటన సంభవించే సందర్భములలో గాని ఖచ్చితముగా కాలమును నిర్దేశించుటకు వీలుపడును.

కాని, ఇచట మనము కొత్తగా దేనినీ నిర్మించుట లేదు. జీవుడు ఎల్లవేళలా బ్రహ్మస్వరూపుడే గనుక, కాలము యొక్క ప్రసక్తి ఎక్కడిది? నీవు బ్రహ్మ స్వరూపుడవై ఉండి, 'నేను బ్రహ్మను ఎప్పుడు అగుదును?' అని ప్రశ్నించుట యెట్లు పొసగును? నీవు బ్రహ్మ స్వరూపుడవు అను సంగతి నీకు

తెలియనివో, తెలుసుకొనుట మంచిది. నీకి సత్యము తెలిసేది యెప్పుడు? నీవు సంసిద్ధుడవైనప్పుడు. ''అది యెప్పుడు?'' అనేది తరువాతి ప్రశ్న.

యోగ్యమగు మానసిక ప్రవృత్తి (attitude)తో జీవిస్తూ, జ్ఞాన సాధనను కొనసాగించాలి. నీవు చేయవలసినది ఇంతే. జ్ఞానము దానంతట అదే ఉదయిస్తుంది. నీవు ఇంతకు ముందే సిద్ధమై ఉన్న వస్తువును పొందాలని కోరుతున్నావు. నీవు కొత్తగా నిర్మించవలసినది ఏదీ లేదు. కావున, జ్ఞానము సమయము వచ్చినపుడు దానంతట అది సహజముగా ఉదయిస్తుంది.

జ్ఞానము ఎచట ఉదయించును? ఎల్లవేళలా ఉదయించే చోటనే, అనగా బుద్ధి యందు (ఆత్మని) ఉదయించును. ఇచట 'ఆత్మని' యనగా 'ప్రత్యగాత్మ యందు' అని యర్థము గాదు. జ్ఞానము/ఉదయించేది ప్రత్యగాత్మ యందు కాదు. ఈ జ్ఞానము ప్రత్యగాత్మ యొక్క జ్ఞానము. అన్ని జ్ఞానముల వలెనే ఇది కూడా సుసజ్జితమైన బుద్ధిలో ఉదయించును.

ఈ జ్ఞానమును పొందుటకు ఆవశ్యకమగు లక్షణములను ఈ జ్ఞానము వలన లభించే ప్రయోజనములను శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములో వర్ణించుచున్నాడు.

అధ్యాయము 4, శ్లోకము 39:

श्रद्धावाँल्लभते ज्ञानं तत्परः संयतेन्द्रियः ।
ज्ञानं लब्ध्वा परां शान्ति मचिरेणाधिगच्छति ॥ ३९ ॥

శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేంద్రియః
జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతి మచిరేణాధిగచ్ఛతి (39)

శ్రద్ధావాన్ = (శాస్త్రమునందు, గురువచనము నందు) శ్రద్ధ గలవాడు; **తత్పరః** = జ్ఞానమునకు బద్ధుడైనవాడు; **సంయతేంద్రియః** = ఇంద్రియములపై నియంత్రణ గలవాడు; **జ్ఞానం** = జ్ఞానమును; **లభతే** = పొందును; **జ్ఞానం** = జ్ఞానమును; **లబ్ధ్వా** = పొంది; **అచిరేణ** = వెను వెంటనే; **పరాం** = పూర్ణమగు; **శాంతిం** = శాంతిని; **అధిగచ్ఛతి** = పొందును.

> శాస్త్రమునందు, గురువచనము నందు శ్రద్ధ గలవాడై, జ్ఞానమునకు అంకితమై, ఇంద్రియములపై నియంత్రణ గల వ్యక్తి జ్ఞానమును పొందును. జ్ఞానమును పొంది, వెనువెంటనే పూర్ణమగు శాంతిని పొందును (39).

ఇది మరియొక ప్రధానమైన గీతా శ్లోకము. దీనిని తరుచుగా ఉల్లేఖిస్తారు. 'శ్రద్ధ గలవానికి జ్ఞానము లభించును (శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్)' అను మాటను మనము తరచు వింటూ ఉంటాము. ''ఈ జ్ఞానము నిశ్చితముగా లభించు ఉపాయములను ఈ శ్లోకము నిర్దేశించుచున్నది'' అని శ్రీ శంకరులు ఈ శ్లోకము యొక్క అవతారికలో వ్రాసిరి. కొన్ని లక్షణములున్నచో జ్ఞానము తప్పక ఉదయించును. సాధకుడు నిశ్చితముగా జ్ఞానమును పొందే ఆ లక్షణములేవి?

ముందుగా, సాధకునకు శాస్త్రము నందు, గురువచనముల యందు శ్రద్ధ ఉండాలి. జ్ఞానోదయము శ్రద్ధపై ఆధారపడి యుండును. శ్రద్ధ వలనే శాస్త్రమునందు ప్రమాణ (జ్ఞానసాధనము అనే) బుద్ధి యేర్పడును.

శాస్త్రము నందు శ్రద్ధ లేని వాడు శాస్త్రమును ప్రమాణముగా స్వీకరించడు. జ్ఞానము (ప్రమా) ను ఇచ్చేది ప్రమాణము. శంకను కలిగించేది ప్రమాణము కాదు. శంక ఏదేని ఉన్నచో, దానిని ప్రమగా మార్చుకోవాలి. ఒక శంకను లేక విరోధమును, విరోధము లేని ప్రమగా మార్చుకోవటానికి విచారమును చేయాలి. దీనికి కావలసిన ప్రేరణ శ్రద్ధ నుండి లభించును. ఇట్టి విశిష్ట మానసిక ప్రవృత్తి (attitude)కి శ్రద్ధ యని పేరు. కావున, జ్ఞానము కలగాలంటే, శాస్త్రమునందు ప్రమాణబుద్ధి ఉండాలి. అది ఉన్నప్పుడే శాస్త్రము తాను చేయవలసిన పనిని చేయగల్గుతుంది.

మోక్షమునకు అంకితమగుట

శ్రద్ధ ఒక్కటే ఉంటే చాలదు. ఈ శ్లోకము ఇంకో రెండు అర్హతలను కూడా ప్రస్తావించింది. కొందరికి శాస్త్రము నందు ప్రమాణబుద్ధి ఉన్నా, అవసరమైనంత అంకితభావము ఉండదు. వారు సాధనలో ముందడుగు వేయజాలరు. వారికి బహుశః ఈ జ్ఞానము యొక్క సౌందర్యము, లేక ప్రయోజనము అవగాహనకు వచ్చి ఉండదు. లేదా, వారికి జీవితము యొక్క క్లేశము అనుభవమునకు వచ్చి ఉండదు. కారణమేదైనా, శాస్త్రము నందు శ్రద్ధ ఉండియూ, అవసరమైన అంకితభావము లేని వారు ఉంటారు. శాస్త్రమునందలి శ్రద్ధకు అంకితభావము తోడు కాకపోతే, అట్టి వ్యక్తిలో జ్ఞానాన్వేషణా ప్రవృత్తి అంతంత మాత్రంగా ఉంటుంది.

అంకిత భావమనగా నేమి? ఈ జ్ఞానము నాకు కావాలి. దీని విలువను నేను గుర్తించితిని. నాకు దీనికంటె ఎక్కువ ప్రముఖమైన వస్తువు మరియొకటి లేదు. నేని జ్ఞానము కొరకై ఎంతటి త్యాగము నైననూ చేయుటకు సిద్ధముగ నున్నాను. ఇట్టి మానసిక స్థితి అంకితభావ మనబడును.

జ్ఞానము కొరకై ఇట్టి అంకితభావము గల వ్యక్తిని యీ శ్లోకము 'తత్పరః' అని వర్ణించినది. 'పరుడు' అనగా అంకితమైనవాడు అని యర్థము.

మోక్షమును పొందుటకు జ్ఞానము తక్క వేరొండు ఉపాయము లేదు. జీవుడు మర్త్యత్వము నుండి ఇప్పుడు కొత్తగా విముక్తి పొందేది కాదు. జీవుడు ఎల్లవేళలా అమృత స్వరూపుడే. కావున, మోక్షమనగా తాను అమృత స్వరూపుడనని ఎరుంగుట మాత్రమే.

కొందరు మోక్షము నందు అంకితభావముతో తత్పరులై ఉండి కూడా, శాస్త్రము నందు శ్రద్ధ లేనివారై ఉండవచ్చును. మోక్షమునకు, శాస్త్రమునకు మధ్య ఒక విశిష్ట సంబంధము గలదు. మోక్షము సాధ్యము. శాస్త్రము సాధనము. మోక్షము కావాలంటే, శాస్త్రము నాశ్రయించాలి. దానికి శ్రద్ధ కావాలి. శాస్త్రము జ్ఞానసాధనము అనే ప్రమాణబుద్ధి ఉండాలి. దానివలననే జ్ఞానరూపమగు మోక్షము (మోక్షరూపమగు జ్ఞానము) లభించును.

శ్రద్ధ ఉండి తత్పరత్వము (అంకితభావము) లేకపోవచ్చును. లేదా, తత్పరత ఉండి శ్రద్ధ లేకపోవచ్చును. శ్రద్ధ, తత్పరత కూడా గల వ్యక్తి మాత్రమే శాస్త్రమును మోక్షసాధనముగా స్వీకరిస్తాడు. అతనికి మోక్షమునందు ప్రేమ కూడ ఉండును.

జ్ఞానేంద్రియములను వశములో ఉంచుకోవాలి

శ్రద్ధ, తత్పరత రెండూ ఉన్నా, కొందరికి మోక్షము సిద్ధించకపోవచ్చును. ఎందువలన? వారికి ఇంద్రియములపైన, వాటి అన్వేషణలపైన దృఢమగు మనో నియంత్రణ లేకపోవుటచే మోక్షము సుదూరమగును. ఇట్టి వారికి జ్ఞానప్రాప్తి యొక్క మార్గములో భోగవిలాసములు, చిత్త విక్షేపము అడ్డుగా నిలుచును. కనుక, సంయతేంద్రియుడు, అనగా జ్ఞానేంద్రియములను, వాటి పరుగులను అధీనములో నుంచుకున్నవాడు అనే మూడవ లక్షణము కూడ అవశ్యకమని ఇచట చెప్పబడినది. అనగా, సాధకుడు భోగాసక్తులను పెంచుకొనరాదు. భోగవిలాసములకు వశుడు కారాదు. సదా భోగవిలాసముల వెనుక పరుగెత్తే వానికి ఏ పనిని చేయుటకైననూ అవకాశము ఉండదు. అట్టివాడు తాను దృఢముగా ప్రేమించే వస్తువును కూడా కోల్పోతాడు.

ఇచట 'సంయతేంద్రియుడు' అనగా స్థిరమైన మనస్సు కలవాడు అని యర్థము. ఇట్టివాడు శాస్త్రము నందు శ్రద్ధ కలవాడై, మోక్షము నందు అంకితభావము గలవాడైనచో, అతనికి జ్ఞానము లభించుటలో సందియము లేదు.

ఆపేక్షిక శాంతి, పరమశాంతి

ఈ జ్ఞానము కలిగిన తరువాత యేమగును? ఈ జ్ఞానమును పొందిన వ్యక్తి వెనువెంటనే పరమశాంతిని పొందును (పరాం శాంతిం అచిరేణ అధిగచ్ఛతి). ఈ శాంతి రెండు యుద్ధముల నడుమన ఉండే యుద్ధవిరామ కాలపు శాంతి వంటిది కాదు. ఇది మానవుని మూల స్వరూపభూతమైన శాంతి.

ఆందోళన ఒక మానసిక అవస్థ అనియు, శాంతి దానికి విరుద్ధమగు మరియొక మానసిక అవస్థ అనియు సాధారణంగా తలపోస్తారు. మనస్సు నిశ్చలముగా నున్నప్పుడు తాను నిశ్చలముగా నున్నట్లు మానవుడు భావిస్తాడు. ఇందువలననే, మనస్సు ఆందోళనకు గురియైనపుడు తానే ఆందోళనకు గురియైనట్లు మానవుడు తలుస్తాడు. కాని, ఇచట చెప్పిన శాంతి మానసిక అవస్థ కాదు. అది ఆత్మ యొక్క మూలస్వరూపము. ఆత్మ సదా శాంతము. దీనికి మనస్సు యొక్క స్థితితో సంబంధము లేదు. మనస్సు యొక్క స్థితిపై ఆధారపడని ఇట్టి శాంతికి పరాశాంతి అని పేరు. పరాశాంతి ఆలోచనలకు వ్యతిరేకి కాదు. అంటే, పరాశాంతికై ఆలోచనారహితమగు మనస్సు ఆవశ్యకము కాదు.

ఈ విధంగా మనకు రెండు రకముల శాంతులు కనబడతాయి. ఒకటి నిశ్చలమగు మనస్సు యొక్క శాంతి; అనగా యోగము. కర్మయోగము మనకు ఒక విశిష్టమగు ప్రశాంతిని ఇచ్చును. ఇది ఒక విశిష్ట మానసిక అవస్థ. మానసిక అవస్థా రూపమగు ఈ శాంతి మార్పులకు లోనై ఉండును. ఇట్టి శాంతి, లేక యోగము కూడ ఆవశ్యకమే. ఇంద్రియ జయము (సంయతేంద్రియత్వము) లో ఇట్టి శాంతి అంతర్భాగమగును.

కర్మయోగ లభ్యమగు ఈ శాంతిని పొందిన వ్యక్తి జ్ఞానము ద్వారా మరియొక శాంతిని కూడ పొందును. అదియే పరాశాంతి యనబడును. మనస్సు యెట్లున్ననూ, ఇట్టి జ్ఞానికి 'నేను శాంతుడను' అనే అనుభవము ఉండును. అనగా, ఆత్మ సదా శాంతము అని గుర్తించిన యా జ్ఞానికి 'నేను' స్థాయిలో అశాంతి నుండి విముక్తి ఉండును.

ఈ శ్లోకములో వర్ణించిన శాంతి నీ మూల స్వరూపమై యున్నది (స్వరూప భూత శాంతి). ఇది నీకు జ్ఞానము కలిగిన వెంటనే లభించును (అచిరేణ). జ్ఞానము కలిగిన తరువాత విలంబము ఉండబోదు. ఆత్మ శాంతము అనే జ్ఞానము వలన వ్యక్తికి ఈ శాంతి లభించును. ఇదియే మోక్షము. జ్ఞానమునకు, మోక్షమునకు మధ్యలో కాల వ్యవధానము ఎంత ఉండును? ఆహారమును తినుటకు,

ఆకలి తగ్గుటకు మధ్యలో కాలవ్యవధానము లేదు. అటులనే, సాధ్యమగు మోక్షమునకు, సాధనమగు జ్ఞానమునకు మధ్యలో కాలవ్యవధానము ఉండదు. జ్ఞానము లభిస్తూనే, మోక్షము సిద్ధించును. 'న అచిరేణ' అను పదములకు అర్థమిదియే.

ఈ శ్లోక భాష్యములో శ్రీ శంకరులు జ్ఞానమును పొందే క్రమమును స్పష్టము జేసిరి. శాస్త్రము జ్ఞానసాధనము అనే శ్రద్ధ మొదటిది. ఈ శ్రద్ధ నుండి అంకిత భావము పుట్టును. దానివలన సాధకుడు సర్వమును వీడి, యోగ్యమగు మానసిక ప్రవృత్తితో ఆచార్యుని సమీపించి, జ్ఞానసాధనను చేయును. గురువును సమీపించిన వ్యక్తికి శాస్త్రము జ్ఞానసాధనము అనే శ్రద్ధతో బాటు, జ్ఞానము నందు అంకితభావము కూడ ఉండును. ఇవి మాత్రమే గాక, అతనికి ఇంద్రియములు వశములో నుండి తీరవలెను. ఈ మూడు లక్షణములు గల వ్యక్తికి జ్ఞానము తప్పక లభించి తీరును.

బాహ్యమగు ఆచారము చాలదు

గురువు వద్దకు వెళ్లి సాష్టాంగపడుట, ఉచితరీతిని ప్రశ్నించుట, సేవ చేయుట అనునవి బాహ్యమగు ఆచరణములోని మూడు అంశములని శ్రీ శంకరులు వాక్రుచ్చిరి. వీటిని మనము 34వ శ్లోకములో చూచి యున్నాము. ఇవి బాహ్యములు గనుకనే, మనస్సులో శ్రద్ధలేని వ్యక్తి గూడ వీటిని ఆచరించే అవకాశము గలదు. కొందరు నటించుటలో చతురులై యుందురు. ఒక వ్యక్తి ఏడుస్తున్నాడు. ఇంతలో ఎవరో దగ్గరకు వస్తూ కనపడ్డారు. వెంటనే, ఇతడు లేచి ముఖమును కడుక్కొని, నవ్వుతూ "నమస్కారం, బాగున్నారా?" అని పలకరించేడు. ఇతని ముఖంలో నవ్వు ఉన్నది. కాని, అతడు లోపల నవ్వుట లేదు; పైగా ఏడుస్తున్నాడు.

ఇదే విధంగా, గురువునకు సాష్టాంగపడుట, ప్రశ్నల నడుగుట మాత్రమే గాక, గురువునకు సేవ జేయుట కూడ నటనా మాత్రము అయి ఉండవచ్చును. ఈ విధంగా, బాహ్యమగు ఆచరణము నటన అయ్యే అవకాశము కలదు గాన, జ్ఞానప్రాప్తికి అది మాత్రమే చాలదని శ్రీ శంకరులు వివరించిరి.

ఈ విధంగా ఈ శ్లోకంలో శ్రీకృష్ణుడు అర్జునునకు శ్రద్ధను అన్వయముఖముగా బోధించెను (శ్రద్ధావంతుడు జ్ఞానమును పొందును అనుట). తరువాతి శ్లోకములో శ్రీకృష్ణుడు శ్రద్ధను నిషేధముఖముగా (శ్రద్ధలేని వాని స్థితిని చెప్పుట) వర్ణించుచున్నాడు:

అధ్యాయము 4, శ్లోకము 40:

अज्ञश्चा श्रद्दधानश्च संशयात्मा विनश्यति ।
नायं लोकोऽस्ति न परो न सुखं संशयात्मनः ॥ ४० ॥

అజ్ఞశ్చా శ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి
నాయం లోకోస్తి న పరో న సుఖం సంశయాత్మనః (40)

అజ్ఞః = వివేక జ్ఞానము లేనివాడు; **చ** = మరియు; **అశ్రద్ధ ధానః** = (శాస్త్రము నందు, గురువు నందు) శ్రద్ధ లేనివాడు; **చ** = మరియు; **సంశయాత్మా** = సంశయించే మనస్సు గలవాడు; **వినశ్యతి** = నశించును; **సంశయాత్మనః** = సందేహ శీలికి; **అయం** = ఈ; **లోకః** = లోకము; **న అస్తి** = లేదు; **పరః** = పరలోకము; **న** = లేదు; **సుఖం** = సుఖము; **న** = లేదు.

వివేక జ్ఞానము లేనివాడు, (శాస్త్రము నందు, గురువు నందు) శ్రద్ధ లేనివాడు, మరియు సంశయముతో నిండిన మనస్సు గలవాడు నశించును. సందేహ శీలికి ఈ లోకము లేదు; పరలోకము లేదు; సుఖము లేదు (40).

అజ్ఞుడు అనగా వివేకము లేనివాడు. ఆత్మను ఎరుంగనివాడు, ఆత్మా నాత్మలకు మధ్య గల తేడా (ఆత్మ – అనాత్మ – వివేకము) ను యెరుంగని వ్యక్తి అజ్ఞుడనబడునని శ్రీ శంకరులు వ్రాసిరి.

ఇంచుమించు అందరూ అనాత్మజ్ఞులే. అనాత్మజ్ఞునకు శాస్త్రవాక్యము నందు శ్రద్ధ యున్నచో ఆ పరిస్థితి ఆశాజనకము అగును. ఇట్టివాడు ధర్మాధర్మముల నెరింగి, శాస్త్ర విహితములగు నిత్య నైమిత్తిక కర్మల నాచరిస్తూ, స్వధర్మ పరాయణుడై ఉండును. ఈ విధముగా జీవించే వ్యక్తి కాలక్రమములో వివేకమును, జ్ఞానమును కూడ తప్పక పొందును.

అవివేకి యగు అజ్ఞాని శ్రద్ధ వలన వివేకి కాగలడు. వివేకము కలుగగనే, వైరాగ్యము ఉదయించును. దానివలన వ్యక్తికి మోక్షమునందు అభిలాష (ముముక్షుత్వము) కలుగును. ఈ అభిలాష విచారమునకు దారితీయును. దాని నుండి జ్ఞానము పుట్టును. దానివలన పరాశాంతి లభించును. ఈ విధముగా, శ్రద్ధ గల వానికి ఇహలోక, పరలోకములు సుఖప్రదము అగును.

అజ్ఞుడగు వ్యక్తి అశ్రద్ధధానుడు కూడ అయినచో, సమస్యలు ఉత్పన్నమగును. ఇట్టివానికి వివేకము లేకపోవుటయే గాక, శ్రద్ధ కూడ లేదు. ఇట్టివాడు శాస్త్రమునకు సందేహ లాభము

(benefit of doubt) నైననూ ఈయడు. అంటే, శాస్త్రము బహుశః సత్యము కావచ్చును అని యైననూ భావించడు. అవిశ్వాసమునకు ఆధారము యుక్తి కాదు. ఉదాహరణకు, స్వర్గము లేదని నీవు యెట్లు నిరూపించగలవు? నీవు స్వర్గము ఉన్నదని గాని, లేదని గాని నిరూపించజాలవు. విచారము చేయకుండగనే, ఒకటి సత్యమని గాని, అసత్యమని గాని నీవు యెట్లు నిర్ణయించగలవు? విచారమునకు శ్రద్ధ అవశ్యకము. శ్రద్ధ లేనిదే విచారము ఏ మాత్రమూ సంభవము కాదు.

కాని, శాస్త్రమునందు శ్రద్ధ లేని వారికి తమ యందు గాని, ఇతరుల యందు గాని శ్రద్ధ ఉండవచ్చును. వారికి ధనము నందు, లేక అధికారము నందు కూడ శ్రద్ధ ఉండవచ్చును. ఇట్టి శ్రద్ధ వలన వారికి ఎంతో కొంత లాభము కూడ ఉండును. ఈ ప్రపంచము నందు శ్రద్ధ గల వ్యక్తికి కొంత సుఖము, మరియు భద్రత లభించవచ్చును. సంసారములో ఎంతో కొంత సుఖము గలదనుటలో సందియము లేదు. తన సామర్థ్యముపై విశ్వాసము నుంచి, ప్రపంచములో ఉపలభ్యమయ్యే విభిన్న సాధన, సాధ్యముల సామర్థ్యమునందు విశ్వాసము గల వ్యక్తికి ఈ సంసారంలో ఎంతో కొంత సుఖమును పొందగలిగే అవకాశములు మెండుగా ఉన్నవనుటలో సందేహము లేదు. ఈతనికి పరలోకము నష్టమైననూ, ఇహలోకము లభ్యమగును.

ఈ శ్లోకము సంశయమును ప్రముఖ సమస్యగా వర్ణించును. నిత్య శంకితుడగు వ్యక్తి 'సంశయాత్మా' అనబడును. ఈ సందర్భంలో ఆత్మ యనగా అంతఃకరణము అని యర్థము. సంశయము ఉండేది మనస్సులోనే గదా!

సంశయాత్ముని గురించి శ్రీకృష్ణుడిట్లు చెప్పెను: ''సంశయాత్మునకు ఈ లోకము గాని, పరలోకముగాని లేవు; ఆనందము లేదు.'' శ్రీ శంకరులీ శ్లోకము నిట్లు వివరించిరి: అవివేకి, అశ్రద్ధధానుడు కూడా నశిస్తారు. అంటే, ఒక మృత్యువు నుండి మరియొక మృత్యువునకు పయనిస్తూ ఉంటారు. కాని, వీరి పరిస్థితి సంశయాత్మ కంటె మెరుగు. సంశయాత్మకు పాప పుణ్యములపై విశ్వాసముండదు. కావున, అతనికి ధర్మాచరణము నందు ఉత్సాహము ఉండదు. కావున, అతడు పరలోకము నుండి వంచితుడగును.

సంశయాత్మునకు ఈ లోకములో కూడ సుఖము లేదు. ఇట్టి వానికి వివాహమగుటయూ దుర్లభమే. ఇట్టి వారు ఎల్లవేళలా, ''నేను వైవాహిక జీవితములో సఫలుడను కాగలనా? నాకు నమ్మకము లేదు'' అని అంటారు. ఒకవేళ వివాహము జరిగినా, ఎల్లవేళలా ఇతరవ్యక్తిని అనుమానించే ఆ కాపురము ఎంతకాలము నిలుచును? ఫోను వచ్చినప్పుడల్లా సంశయమే! ఫోను చేసినది టెలిఫోను

ఉద్యోగి అయినా సంశయమే. ఈ విధంగా, సంశయాత్మునకు తన జీవితము దుఃఖభూయిష్ఠ మగుటయే గాక, అతని చుట్టు నున్న వారికి కూడ జీవితము దుర్భరమగును.

ఈ విధముగా, సంశయాత్మునకు ఈ లోకము నష్టమగును; పరలోకము కూడ నష్టమగును. అట్టివానికి సుఖము ఉండదు అని శ్రీకృష్ణుడు చెప్పుచుండెను.

శ్రద్ధ లేనిదే ఆత్మజ్ఞానము కలుగదను మాట సత్యమే. కాని, శాస్త్రము నందు కాకపోయినా, ఇతర విషయముల యందైననూ శ్రద్ధ గల వ్యక్తికి జీవితములో ఎంతో కొంత లాభము కలుగును. కాని, సంశయాత్మునకు తన యందు గాని, ఇతర వ్యక్తుల యందు గాని, శాస్త్రమునందు గాని, దేనియందైననూ విశ్వాసముండదు. కావున, ఇట్టివానికి ఈ లోకము, అనగా, ఈ లోకములో అతని జీవితము నష్టమగును (అయం లోకః నాస్తి). అంటే, ఈ సంసారములో లభించే కొద్దిపాటి సుఖమైననూ సంశయాత్మునకు లేదు.

కావుననే, శ్రీకృష్ణుడిట్లు చెప్పుచున్నాడు:

అధ్యాయము 4, శ్లోకము 41:

योगसन्न्यस्त कर्माणं ज्ञानसञ्छिन्न संशयम् ।
आत्मवन्तं न कर्माणि निबध्नन्ति धनञ्जय ॥ ४१ ॥

యోగ సన్న్యస్త కర్మాణం జ్ఞాన సంఛిన్న సంశయమ్ ।
ఆత్మవంతం న కర్మాణి నిబధ్నంతి ధనంజయ (41)

ధనంజయ = ఓ అర్జునా!; యోగ-సన్న్యస్త-కర్మాణం = యోగము ద్వారా కర్మలను త్యజించినవాడు; జ్ఞాన-సంఛిన్న-సంశయమ్ = జ్ఞానముచే పూర్తిగా తొలగింపబడిన సందేహములు గలవాడు; ఆత్మవంతం = తనపై తాను నియంత్రణ కల్గిన వ్యక్తిని; కర్మాణి = కర్మలు; న నిబధ్నంతి = బంధింపవు.

ఓ అర్జునా! యోగము ద్వారా కర్మలను త్యజించి, జ్ఞానముచే పూర్తిగా తొలగింపబడిన సందేహములు గలవాడై, తనపై తాను నియంత్రణ కల్గిన వ్యక్తిని కర్మలు బంధింపవు (41).

శ్రీకృష్ణుడీ శ్లోకములో అర్జునుని 'ధనంజయ' అని సంబోధించెను. అనగా, అనేక బిరుదములను, విభిన్న సంపదలను సంపాదించిన వాడు అని యర్థము. ఈ శ్లోకములో చెప్పిన కర్మలలో (కర్మాణి) అన్ని రకముల కర్మలు, అనగా, మంచి, చెడు కర్మలు, వేదోక్త క్రతువులు, మరియు ప్రాపంచిక కార్యములు అంతర్భాగములే. ఈ కర్మ లేవియు జ్ఞానిని బంధించవని (కర్మాణి న నిబధ్నంతి) శ్రీకృష్ణుడు అర్జునునకు చెప్పెను.

కర్మలచే బంధింపబడని ఈ వ్యక్తి యొక్క లక్షణములేవి? యోగసన్న్యస్త కర్మా, జ్ఞాన సంఛిన్న సంశయః, ఆత్మవాన్ అనే మూడు లక్షణములనీ శ్లోకము వర్ణించుచున్నది.

యోగ-సన్న్యస్త-కర్మా

ఆత్మ యొక్క యథార్థ జ్ఞానమే యోగము. అట్టి సమ్యగ్దర్శన ప్రభావముచే కర్మలను త్యజించినవాడు యోగ-సన్న్యస్త-కర్మా అనబడునని శ్రీ శంకరులు వివరించిరి.

ఇచట యోగమనగా జ్ఞానయోగము. కాని, జ్ఞానము లభించాలంటే, సాధకుడు కర్మయోగ జీవనమును గడిపి ఉండాలి. కావున, ఈ యోగములో కర్మయోగము కూడ మిళితమై యుండును. జ్ఞానప్రభావము వలన కర్మలనన్నిటినీ వీడిన వ్యక్తి యోగ-సన్న్యస్త-కర్మా అనబడును. ఈతడే జ్ఞాని. ఈతడు కర్మయందు అకర్మను దర్శించునని మనము 18వ శ్లోకములో చూచియున్నాము.

యోగ-సన్న్యస్త-కర్మా వేరు. సన్న్యస్త-కర్మా వేరు. జ్ఞానసాధనను కొనసాగించే సంకల్పంతో విధులనన్నిటినీ త్యజించిన సన్న్యాసి సన్న్యస్త-కర్మా యనబడును. కాని, దీనికి భిన్నంగా, ఆత్మ అకర్త యనియు, అందువలననే కర్మలచేత ఏ మాత్రమూ బంధింపబడదనియు యెరింగి, జ్ఞాని యోగ-సన్న్యస్త-కర్మా అనబడును. యోగ-సన్న్యస్త-కర్మునకు, కేవల సన్న్యస్త-కర్మునకు మధ్యగల భేదము 'ఆత్మ కర్త కాదు' అనే జ్ఞానము మాత్రమే.

జ్ఞాన-సంఛిన్న-సంశయః

సంశయములు లేకపోవుట రెండవ లక్షణము. జ్ఞానముచే సర్వ సంశయములు తొలగిన జ్ఞాని 'జ్ఞాన-సంఛిన్న-సంశయః' అనబడును. శ్రీ శంకరులు భాష్యములో ఈ విషయమును ప్రశ్నోత్తర రూపముగా వర్ణించిరి: ఈతడు యోగ-సన్న్యస్త-కర్ముడు ఎట్లు అయినాడు? అనునది ప్రశ్న. జ్ఞానము వలన అని సమాధానము. జీవబ్రహ్మల అభేద దర్శనమే యీ జ్ఞానము. ఈ

జ్ఞానము వలన సంశయములన్నీ నశించి పోవునని శ్రీ శంకరులు వివరించిరి. ఈ సంశయములు ఏవి? ఆత్మ యథార్థముగా స్వరూపతః పూర్ణమైనదేనా? ఆత్మ నిత్యము; అనాత్మ అనిత్యము అంటారు. ఇది వాస్తవమేనా? ఆత్మకు, అనాత్మకు మధ్య సంబంధమేదైన గలదా? ఉన్నచో, అది యెట్టి సంబంధము? జీవేశ్వరుల మధ్య భేదము సత్యమా? లేక, అభేదము సత్యమా?

సర్వ సంశయ విముక్తుడగు జ్ఞానికి ఆత్మ సత్యమనియు, అనాత్మ మిథ్య యనియు తెలియును. ఈ సత్యము విషయములో ఎట్టి సందేహము లేని వ్యక్తికి ఉండేది జ్ఞానము గాని, విశ్వాసము కాదు. శాస్త్రము ప్రమాణము అనే విశ్వాసము జ్ఞానోదయ పర్యంతము మాత్రమే ఆవశ్యకమగును.

శాస్త్రము స్వర్గాదులను గురించి చెప్పే వాక్యములను ఈ లోకములో నిరూపింప శక్యము కాదు. కావున, వ్యక్తి మరణించే వరకు అవి విశ్వాస యోగ్యములుగనే మిగిలిపోవును. శాస్త్ర ప్రకారము స్వర్గమును పొందుటకు ఆవశ్యకమగు కర్మలను చేసిన వ్యక్తి స్వర్గమును పొందును. కాని, మనమిచట గమనించదగిన విషయమేమనగా, స్వర్గప్రాప్తి కేవలము విశ్వాసార్హమైన విషయమే గాని, ఈ దేహమును ధరించియుండగా నిరూపించగలిగేది కాదు.

కాని, వేదాంతములో ఉండేది జ్ఞానము; విశ్వాసము కాదు. మనమిచట స్వయంసిద్ధమగు (self-evident) 'నేను' గురించి మాటలాడుచున్నాము. 'నేను ఉన్నాను' అనేది స్వయంసిద్ధ సత్యము. నేను ఉన్నానని శాస్త్రము నాకు చెప్ప పనిలేదు. నాకు నా గురించి గల భ్రాంతి పూర్వక నిర్ణయములను, ధారణలను సరిదిద్దుటకు శాస్త్రము ఆవశ్యకమగును.

'నేను ఉన్నాను' అనేది నిష్కర్ష గాదు. అది స్వయంసిద్ధ సత్యము. దీనికి భిన్నంగా 'నేను సంసారిని' అనేది ఒక నిష్కర్ష. ఈ నిష్కర్ష కేవల అభిప్రాయము మాత్రమే. ఇది సుషుప్తిలో లేదు; రెండు ఆలోచనల మధ్యలో లేదు; ఆనందము కలిగిన క్షణాలలో లేదు; జ్ఞానము ఉదయించగనే, ఈ నిర్ణయము మిథ్య యని తేలిపోవును. 'నేను ఉన్నాను' అను విషయమును నేను నిరూపించు కోనక్కరలేదు. నా గురించి నాకు గల సంశయములను, భ్రాంతులను తొలగించుకుంటే చాలును. ఈ పనిని నేను శాస్త్ర సహాయముతో చేయగల్గుతాను.

భ్రాంతులను తొలగించుకొని, ప్రత్యగాత్మ బ్రహ్మాభిన్నమని ఎరుంగుటయే ఆత్మ జ్ఞానము. ఈ జ్ఞానముచే సర్వసంశయములు తొలగిన వ్యక్తి జ్ఞాన–సంఛిన్న–సంశయుడు అనబడును.

ఆత్మవాన్

ఆత్మవాన్ అనునది మూడవ లక్షణము. భ్రాంతిని తొలగించే విధమును ఈ పదము వివరించును. ఆత్మవాన్ అనగా దేహేంద్రియ మనస్సుల సంఘాతమును తన నియంత్రణలో ఉంచుకున్న యోగి అని యర్థము. ఇచట ఆత్మ యనగా స్థూలదేహము, మనస్సు, మరియు ఇంద్రియములు. వాటిపై నియంత్రణ గల వ్యక్తి ఆత్మవాన్ అనబడును.

దేహము, ఇంద్రియములు, మనస్సు అందరికీ గలవు. కాని, వాటిపై నియంత్రణ అందరికీ లేదు. సాధారణంగా, వ్యక్తి వాటి వశములో నుండును. అనగా అనాత్మవాన్ అయి ఉండును. అనాత్మవంతుని సుఖదుఃఖములను అతని దేహాదులు నిర్ణయించును. దేహము కొద్దిగా బరువు పెరిగినా, రోగము బారిపడినా, వృద్ధాప్యమును పొందినా, అనాత్మవంతుడు తన పని అయిపోయినదని దుఃఖించును. ఇట్టి పరిణతి లేని వ్యక్తులను దేహము ఈ తీరున నియంత్రించును.

పరిణతి గల వ్యక్తికి దేహేంద్రియ సంఘాతము వశములో నుండును. అట్టివాడే యోగి. ఇట్టి వ్యక్తి జ్ఞానోదయమునకు పూర్వము కర్మయోగియై, జ్ఞానోదయము తరువాత కూడ యోగిగనే కొనసాగును. శ్రీకృష్ణుడు 39వ శ్లోకములోని విషయమును నొక్కి చెప్పుటకొరకై ఈ శ్లోకములో ఆత్మవాన్ అను పదమును ప్రయోగించెను. ఇంద్రియములపై నియంత్రణ గల వ్యక్తిని ఆ శ్లోకములో 'సంయతేంద్రియుడు' అని వర్ణించెను. అదే వ్యక్తిని ఈ శ్లోకములో 'ఆత్మవాన్' అని వర్ణించెను.

ఈ శ్లోక భాష్యములో శ్రీ శంకరులు 'ఆత్మవాన్' అనగా 'అప్రమత్తుడు' అని వ్యాఖ్యానించిరి. అనగా, ప్రమాదము లేనివాడు. అంటే, సోమరితనము, ఉదాసీనత, నిరుత్సాహము, అజాగ్రత్త లేనివాడు. అంటే, పొందికతనము గల వ్యక్తి.

యోగసన్న్యస్త కర్ముడు ముఖ్య సన్న్యాసి. ఈతడు కర్మలను వీడినాడు. ఈతని కర్మత్యాగము స్థూలదృష్ట్యా కర్మలను వీడుట కాదు. 'నేను అకర్తను' అనే జ్ఞానము వలన సిద్ధించిన కర్మత్యాగము. కావున, ఈతని కర్మలు పుణ్యపాపరూపములగు అదృష్టఫలమును ఈతనికి ఈయజాలవు. కావున, ఈతనికి కర్మబంధము ఉండదు. ఈతని యందు కర్తృత్వము లేదు గాన, ఈతని సంచితకర్మలు జ్ఞానము నందు లయమై పోవును.

'ఆత్మ కర్త కాదు' అని యెరింగిన జ్ఞాని ప్రారబ్ధాధీనుడై కర్మల నాచరిస్తున్నట్లు భాసించును. దేహేంద్రియ సంఘాతము ఉన్నంతవరకు కొన్ని పరిస్థితులు ఎదురవుతూ ఉంటాయి. వాటి మూలంగా

కొన్ని కర్మలు జరిగిపోతూ ఉంటాయి. కాని, ఆ కర్మలు జ్ఞానిని బంధించవు. 'నేను కర్తను' అనే ధారణ గల వ్యక్తిని మాత్రమే కర్మలు బంధిమనని శ్రీకృష్ణుడు గీతలో అనేక పర్యాయములు చెప్పినాడు. కర్తృత్వభావన లేని వ్యక్తిని కర్మలు బంధింపజాలవు. జ్ఞాని కర్మలలో నిమగ్నుడై ఉన్నట్లు కాన్పించును. కాని కర్మ యందు అకర్మను దర్శించే జ్ఞాని (కర్మణి అకర్మ దర్శనమ్) కర్మలను చేసినట్లు కాదని (నైవ కించిత్ కరోతి) మనము చూచియున్నాము.

అధ్యాయము 4, శ్లోకము 42:

तस्मादज्ञानसम्भूतं हृत्स्थं ज्ञानासिनात्मनः ।
छित्त्वैनं संशयं योगमातिष्ठोत्तिष्ठ भारत ॥ ४२ ॥

తస్మాదజ్ఞాన సంభూతం హృత్స్థం జ్ఞానాసినాత్మనః ।
ఛిత్త్వైనం సంశయం యోగమాతిష్ఠోత్తిష్ఠ భారత ॥ (42)

తస్మాత్ = అందువలన; **అజ్ఞాన–సంభూతం** = అజ్ఞానము (అవివేకము) నుండి పుట్టిన; **హృత్స్థం** = బుద్ధియందు ఉన్న; **ఏనం** = ఈ; **ఆత్మనః** = ఆత్మ విషయకమైన; **సంశయం** = సంశయమును; **జ్ఞాన–అసినా** = జ్ఞానమనే కత్తితో; **ఛిత్త్వా** = ఛేదించి; **యోగం** = (జ్ఞానసాధనమగు) కర్మయోగమును; **ఆతిష్ఠ** = అనుష్ఠింపుము; **భారత** = ఓ అర్జునా!; **ఉత్తిష్ఠ** = లెమ్ము.

అందువలన అజ్ఞానము నుండి పుట్టి బుద్ధి యందు ఉన్న ఈ ఆత్మ విషయకమైన సంశయమును జ్ఞానమనే కత్తితో ఛేదించి, (జ్ఞానసాధనమగు) కర్మయోగమును అనుష్ఠింపుము. ఓ అర్జునా! లెమ్ము (42).

ఈ శ్లోకములో శ్రీకృష్ణుడు అర్జునుని 'భారత' అని సంబోధించెను. అనగా, భరతవంశములో పుట్టినవాడు అని యర్థము. ''లేచి నిలబడుము (ఉత్తిష్ఠ). యోగజీవనమును స్వీకరింపుము'' అని భగవానుడు ఆదేశించెను. ఇచట యోగమనగా జ్ఞానయోగ్యతను కలిగించే కర్మయోగము అని యర్థము. కర్మయోగ జీవనము వలన జ్ఞానోదయమునకు గల ప్రతిబంధకములు తొలగిపోవును. ఇందువలననే, శ్రీకృష్ణుడు అర్జునునితో, ''నీవు ఇంతవరకు నా ఉపదేశమును వినియుంటివి. నీవు కర్మయోగము నమష్ఠింపుము. తద్వారా నీవు జ్ఞానమును, తద్రూపమైన మోక్షమును పొందగలవు'' అని చెప్పెను. మరో మాటలో చెప్పాలంటే, నీవు జ్ఞానసాధన చేస్తూనే, కొంత కాలము కర్మయోగ జీవనమును గడుపవలసి యున్నది. కావున, అట్లు చేయుము (యోగం ఆతిష్ఠ).

సన్న్యాసము అనే జీవనశైలి ఉన్నమాట వాస్తవమే. కాని, విధుల నన్నిటిని వీడినంత మాత్రాన వ్యక్తి సన్న్యాసి అయిపోడని మనము చూచియున్నాము. 'నేను కర్తను గాదు' అనే జ్ఞానము గలవాడై, తత్ప్రభావము వలన సర్వకర్మలను జ్ఞానపూర్వకంగా (స్థూలదృష్ట్యా కాదు) విడిచిపెట్టే వ్యక్తియే ముఖ్య సన్న్యాసి. శ్రీకృష్ణుడీ శ్లోకములో 'తస్మాత్ (అందువలన)' అను పదముతో నుపక్రమించి యిట్లు చెప్పెను: ''కర్మయోగము నాచరింపుము. దానివలన నీకు జ్ఞానము కలుగును. అపుడు నీవు జ్ఞానము అను కత్తితో నరకబడిన సంశయములు గలవాడవై (జ్ఞానసంఛిన్న సంశయః), జ్ఞాన యోగముచే కర్మలను వీడిన సన్న్యాసివి కాగలవు''. కర్తృత్వభావన లేని సన్న్యాసి కర్మలను చేస్తూ ఉన్నట్లు కన్పట్టినా, అతడు జ్ఞానఘనమగు ఆత్మ దృష్ట్యా కర్మలను చేస్తున్నట్లు కాదు.

శ్రీకృష్ణుడు 39వ శ్లోకములో అర్జునునకు సంశయములను తొలగించుకొనుట శ్రేయస్కరమని చెప్పి యుండెను. తనయందు, శాస్త్రము నందు మాత్రమే గాక, దేని యందైననూ విశ్వాసము లేని వ్యక్తి (సంశయాత్మా) ని శ్రీకృష్ణుడా శ్లోకములో ప్రస్తావించి, అట్టి వ్యక్తి నశించునని చెప్పియుండెను. కావుననే, ఈ శ్లోకములో భగవానుడు అర్జునునితో, అజ్ఞానము వలన హృదయములో పుట్టే సంశయములను జ్ఞాన ఖడ్గముతో ఛేదింపుమని చెప్పెను.

సంశయము మనస్సులో నివసించే శత్రువు

అజ్ఞానము నుండి అవివేకము పుట్టును. ఆత్మను గురించిన సంశయము అజ్ఞానము నుండి, అవివేకము నుండి పుట్టును. ''నిన్ను నాశనము చేయగలిగే ఈ నీ శత్రువు ఎక్కడ నుండును? అర్జునా! దుర్యోధనుడు నీకు బయట ఉండే శత్రువు. కాని, ఇది అట్లు కాదు. ఈ సంశయమనే శత్రువు నీ లోపల, నీ మనస్సులో, నీ హృదయములో నుండును. సంశయము నీ మనస్సులోనికి ప్రవేశించి, అచట స్థిరనివాస మేర్పరుచుకున్నది''.

వివేకము లేని స్థితి నుండి సంశయము పుట్టును. అవివేకము (lack of discrimination) వేరు; అవిమృశ్యకారిత్వము (indiscrimination) వేరు. జీవితము, జీవితప్రయోజనము మొదలగు వాటి గురించి విచారము చేయకపోవుటచే, అవివేకము (ఆత్మ-అనాత్మ-వివేకము లేకపోవుట) నిర్మాణమై, సర్వము సంశయస్థానముగా మారిపోవును.

అనేక విషయములలో సంశయములుండవచ్చును. కాని, మనమిచట ఆత్మ విషయకమగు సంశయమును గురించి చర్చిస్తున్నాము. ఈ సంశయమును నశింపజేయవలెను. ఒక వస్తువును

ఛేధించుటకు కత్తి ఉండాలి. ప్రస్తుతంలో కత్తి జ్ఞానరూపముగ నుండును. ఈ జ్ఞానఖడ్గముతో సాధకుడు తన మనస్సులో నుండే, అజ్ఞాన అవివేకముల నుండి పుట్టిన, ఆత్మ విషయక సంశయములను ఛేదించవలెను.

జ్ఞానఖడ్గము

శ్రీకృష్ణుని ఈ ఉపదేశభాగమును స్పష్టము చేయుట కొరకై, శ్రీ శంకరులు భాష్యములో జ్ఞాన శబ్దమును శోకమోహాది నాశకమగు సమ్యగ్దర్శనము అని నిర్వచించిరి. ఆత్మానాత్మలకు, సత్యాసత్యములకు మధ్యగల వివేకమునకు ఇచట సమ్యగ్దర్శనమని పేరు. మానవుని సర్వదోషములను, శోకమును, మోహమును, రాగద్వేషముల (కామము)ను, క్రోధమును ఛేదించగల ఒకే ఒక ఖడ్గము జ్ఞానము మాత్రమే.

సంశయము నీ హృదయములో నున్నది. నీకు నిత్యానిత్య వస్తు వివేకము లేకపోవుటచే సంశయము పుట్టినది. కావున, నీవు మాత్రమే దానిని నాశనము చేయగలవు. అదే సంశయము ఇతరులకు కూడ ఉండవచ్చును. కాని, నీ సంశయము నీ హృదయములో నున్నది; నీ మనస్సులో నున్నది. అది నీ అజ్ఞానము నుండి పుట్టినది. కాన, దానిని ఆత్మజ్ఞానమును పొంది నీవు మాత్రమే ఛేదించగలవు. ఈ జ్ఞానమును పొందాలంటే ముందుగా కర్మయోగ జీవనమును స్వీకరించాలి.

'ఆత్మనః' అనగా 'తనయొక్క (స్వస్య)' అని సామాన్యార్థము. కాని, 'ఆత్మనః సంశయమ్' అన్న చోట మనము షష్ఠీ విభక్తికి సంబంధార్థమును చెప్పరాదు. ఈ సంశయము వ్యక్తి యొక్క హృదయములోన ఉండునని (హృత్స్థమ్) శ్రీకృష్ణుడు చెప్పినాడు గదా! 'గీత యొక్క జ్ఞానము' అను ప్రయోగమును దృష్టాంతముగా తీసుకుందాము. ఇచట కూడ షష్ఠీ విభక్తి కలదు. కాని, ఇది 'రాముని యొక్క పుస్తకము' ఇత్యాది ప్రయోగములలో వలె సంబంధార్థమును బోధించే షష్ఠీ విభక్తి కాదు. 'గీత యొక్క జ్ఞానము' అనగా గీత విషయవస్తువుగా గల జ్ఞానము అని యర్థము. 'ఎలక్ట్రానిక్స్ యొక్క జ్ఞానము' అంటే, ఎలక్ట్రానిక్స్ విషయవస్తువుగా గల జ్ఞానము అనియే గదా! ఈ దృష్టాంతములలోను, ప్రకృతంలో 'ఆత్మనః' అనుచోట, కనబడే షష్ఠీ విభక్తి సంబంధమును గాక, కర్మను బోధించును. దీనినే 'కర్మణి షష్ఠీ' అంటారు. ఇట్టి ప్రయోగములు సంస్కృత, ఆంగ్లములలోనే గాక, ఇతర భాషలలో కూడ కన్పట్టును.

'ఆత్మనః జ్ఞానమ్' అనగా ఆత్మ విషయవస్తువుగా గల జ్ఞానము. 'ఆత్మనః సంశయః' అనగా ఆత్మ విషయవస్తువుగా గల సంశయము అని యర్థము.

ఆత్మ విషయకమగు ఈ సంశయము అనేక సమస్యలకు మూలము. కావున, దానిని అస్తమింపజేయాలి. సంశయమును తొలగించే ఉపాయమొక్కటియే గలదు. అదియే జ్ఞానఖడ్గముతో ఛేదించుట. జ్ఞానము కొరకై మనము కర్మయోగమును అనుష్ఠించాలి (యోగం ఆతిష్ఠ). కనుకనే, శ్రీకృష్ణుడు 'లేచి నిలబడు అర్జునా!' అని చెప్పెను.

శ్రీకృష్ణుడు 39వ శ్లోకములో చెప్పినదానిని శ్రీ శంకరులు ఈ శ్లోకభాష్యములో కొనసాగించిరి. మానవుని పతనమునకు సంశయము హేతువు అగును. సంశయాత్ముడు నశించును. సంశయాత్మునకు ఇహలోకము లేదు; పరలోకము లేదు. వానికి ఆనందము లేశమైననూ లేదు.

సంశయము వినాశహేతువు గనుక, మనము హృదయములో సంశయముల నుండనీయరాదు. దానిని నశింపజేసే ఉపాయము ఆత్మజ్ఞానమొక్కటియే. దానికొరకై మనము కర్మయోగము ననుష్ఠిస్తూ, జ్ఞానసాధన చేయాలి. కావున, దీని విషయమై శ్రద్ధను వహించాలి.

జ్ఞాన–కర్మ–సన్న్యాస–యోగము

గీతలోని ఈ నాల్గవ అధ్యాయములో, జ్ఞానము చేత కర్మను త్యజించుట అనునది విషయవస్తువు (యోగ). కావున, దీనికి జ్ఞాన–కర్మ–సన్న్యాస–యోగ మని పేరు. జ్ఞానసాధన కొరకై విధులనన్నిటినీ వీడి సాధకుడు స్వీకరించే ఆశ్రమ రూప సన్న్యాసము ఇచటి సన్న్యాసము కాదు. ఇచటి సన్న్యాస శబ్దమునకు 'ఆత్మ అకర్తయనే జ్ఞానప్రభావము వలన కర్మల నన్నిటినీ వీడుట' అని యర్థము. ఈ జ్ఞానము గల వ్యక్తి కర్మలను చేయుచున్నట్లు కన్పట్టిననూ, కర్మలను చేసినట్లు కాదు (కుర్వన్నపి న కరోతి). ఇట్టి జ్ఞాని యందు కర్తృత్వధారణ ఉండదు. కాన, ఆతడు కర్మయందు అకర్మను దర్శించి, కర్తృత్వ ధారణ లేకపోవుట అనే కర్మ త్యాగమును చేయును.

ఆత్మ అకర్త యనే జ్ఞానమే కర్మ త్యాగము. ఇట్టి జ్ఞానాత్మక కర్మ త్యాగమును మనమీ అధ్యాయములో చూచియున్నాము. జ్ఞానోదయము కాగానే, కర్తృత్వముతో బాటు సర్వకర్మలు, క్రియా సంబద్ధములగు సర్వకారకములు కూడ లయమగును. అనగా, సత్యజ్ఞానము చేత అవి బాధితమగును. షష్ఠీ విభక్తిని మినహాయించి, మిగిలిన విభక్తులు ఆయా కారకములను నిర్దేశించునని మనము చూచియున్నాము. కర్త, కర్మ, కరణము, ప్రయోజనము, కర్మ ఉత్పన్నమయ్యే మూలము, మరియు కర్మ జరిగే స్థానము అను ఆరు కారకము లనబడును.

జ్ఞానము ఉదయించగనే క్రియను ఆచరించే కర్త మిథ్య యని తెలియును. కర్త మిథ్య గనుక క్రియ, కర్మ, కరణము మిథ్యలే యగును. క్రియ యొక్క ప్రయోజనము, క్రియ ఉత్పన్నమయ్యే మూలము (అపాదానము) కూడ మిథ్యలే. క్రియ జరిగే అధారము కూడ మిథ్యయే. వాస్తవంలో, కర్మ యందు అకర్మను దర్శించే జ్ఞానికి సర్వము మిథ్యయే.

గీతలో అధ్యాయ నామములలోని యోగశబ్దమునకు 'విషయ వస్తువు' అర్థమని మనము చూచి యున్నాము. ప్రథమాధ్యాయములో అర్జునుని దుఃఖము విషయవస్తువు. కావుననే, దానికి అర్జున విషాదయోగము అని పేరు. ఈ పదములోని యోగ శబ్దమునకు యోగాభ్యాసమనే సామాన్యార్థమును చెప్పుట అసంగతముగ నుండును. మానవులెవ్వరూ దుఃఖమును అభ్యసించాలని కాంక్షించరు గదా!*

సంకల్ప వాక్యము

నాల్గవ అధ్యాయములో అంతము నందు ఉండే వాక్యము ఇతర అధ్యాయాంతములను పోలియుండును. ఈ వాక్యములోని పదములకు అర్థమును మనమిదివరలో చూచియున్నాము.

ॐ तत् सत् ।
इति श्रीमद्भगवद्गीता सूपनिषत्सु ब्रह्मविद्यायां योग -
शास्त्रे श्रीकृष्णार्जुनसंवादे ज्ञानकर्मसन्न्यासयोगो
नाम चतुर्थो ऽ ध्यायः ॥४॥

ఓం తత్ సత్
ఇతి శ్రీమద్భగవద్గీతా సూప నిషత్సు బ్రహ్మ
విద్యాయాం యోగ శాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే
జ్ఞానకర్మ సన్న్యాస యోగో నామ చతుర్థో ऽ ధ్యాయః (4)

---

* అర్జున విషాదయోగః = అర్జునస్య విషాదః ఏవ యోగః విషయః యస్య। అనగా, అర్జునస్య = అర్జునుని; విషాదః ఏవ = విషాదమే; యోగః (విషయః) = విషయవస్తువు; యస్య = ఏ అధ్యాయమునకో, అది.

ఈ విధముగా, బ్రహ్మ విద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాద రూపము, ఉపనిషత్తుల మహత్త్వము గలది యగు శ్రీమద్భగవద్గీతలో జ్ఞాన కర్మ సన్న్యాసయోగము అను పేరు గల నాల్గవ అధ్యాయము ముగిసినది.

హరిః ఓం, తత్సత్

ఐదవ అధ్యాయమునకు ఉపక్రమము

'లేచి నిలబడుము. కర్మయోగము ననుష్ఠింపుము' అని శ్రీకృష్ణుడు అర్జునునకు చేసిన ఉపదేశంతో నాల్గవ అధ్యాయము ముగిసినది. అంటే, అర్జునుడు సన్న్యాసాశ్రమ స్వీకారమునకై హిమాలయములకు పరుగెత్తనక్కరలేదు. అతడు కర్మయోగ జీవనమును గడుపుతూ, జ్ఞాన సాధన చేయాలని భగవానుడు ఉపదేశించెను.

నాల్గవ అధ్యాయములోని ఆఖరివాక్యముతో గీత ముగిసినట్లు కన్పట్టును. అర్జునునకు కర్మయోగము ఇంతకు ముందే బోధింపబడినది. కావున, అతడు జ్ఞానమనే ఖడ్గముతో సంశయముల నన్నిటినీ ఛేదించి, జ్ఞానసాధనమగు కర్మయోగమును చేపట్టవలెను. ఈ విధంగా, శ్రీకృష్ణుని దృష్టిలో ఉపదేశము ముగిసినది. కాని, అర్జునుని ఆలోచన ప్రకారము ఇంకా ముగియలేదు. పైగా, శ్రీకృష్ణుని ఈ ఉపదేశము అర్జునుని మరియొక ప్రశ్నను అడుగుటకై పురికొల్పెను.

అర్జునుని ప్రశ్నలలోని పదములు వేరైనా, వాటి తాత్పర్యము ఒక్కటియే. 'నేను సన్న్యసించాలా? లేక కర్మయోగము నాచరించాలా?' అనునదియే అర్జునుని ప్రశ్నలన్నిటి సారము. ఈ రెండు మార్గములలో ఏది శ్రేష్ఠమో తెలుసుకోవాలని అతడు కుతూహలపడుచుండెను. నాల్గవ అధ్యాయము ముగిసిన తరువాత కూడా అర్జునునకు ఇంకనూ ఒక సందేహముండెను. అతడు అడిగిన ప్రశ్నతో ఐదవ అధ్యాయము ఆరంభమగును. అతనికి సన్న్యాసమును గురించి, కర్మను గురించి గల ఒక సంశయమును అర్జునుడీ ప్రశ్నలో వ్యక్తము చేసెను.

శ్రీ శంకరులు ఐదవ అధ్యాయమునకు ఆరంభములో విస్తృతమగు భాష్యమును వ్రాసిరి. అర్జునుని ప్రశ్న బీజమును వారు వివరించిరి. శ్రీకృష్ణుడు నాల్గవ అధ్యాయములో అంతటా జ్ఞానమును గురించి వర్ణించిన తీరును చూస్తే, ఆయన అర్జునునికి కర్మయోగము ననుసరింపుమని యిచ్చిన సలహా విరుద్ధముగా కన్పట్టును. జ్ఞాని జ్ఞాన ప్రభావముచే కర్మలో అకర్మను దర్శించునని చెప్పి, అట్టి

వ్యక్తిని శ్రీకృష్ణుడు 'జ్ఞానముచే సర్వకర్మలను త్యజించినవాడు' అని వర్ణించెను. ఈ జ్ఞాన కర్మ సన్న్యసము (కేవలము కర్మ సన్న్యసము కాదు)ను అనేక శ్లోకములలో ప్రస్తుతించెను. ఇదంతా చెప్పిన తరువాత 'నీవు కర్మయోగము ననుష్ఠింపుము (యోగం అతిష్ఠ)' అని శ్రీకృష్ణుడు ఉపదేశించెను.

అర్జునుని మనస్సులో పరస్పర విరోధము తోచెను: 'జ్ఞానము పరమ లక్ష్యము. దానిని పొంది, కర్మ లనన్నింటినీ విడనాడెదరు. అట్లైనచో, కర్మను చేస్తూ జ్ఞానసాధన చేయుట కంటె, తిన్నగా జ్ఞానమును అన్వేషించుటయే అధికలాభము కదా?' సర్వ కర్మ పరిత్యాగమే ప్రధాన లక్ష్యము. ఈ త్యాగము జ్ఞానముచే సిద్ధిస్తుంది. కావున, అట్టి జ్ఞానమును పొందుటకై సన్న్యసాశ్రమమునేల స్వీకరించరాదు? ఈ ప్రశ్న యుక్తి సంగతముగా, స్పష్టముగా నున్నది. శ్రీకృష్ణుని ఉపదేశము తనకు అర్థమైనంత మేరకు, అర్జునుడీ విధముగా ప్రశ్నించెను.

శాస్త్రము రెండు రకముల సన్న్యసము నంగీకరించినదని మనము చూచియున్నాము. జ్ఞానముతో కర్మలను వీడుట మొదటిది. ఈ రకం సన్న్యసానికి విద్వత్-సన్న్యసము అని పేరు. విద్వత్-సన్న్యసము అనగా విద్వాంసుని సన్న్యసము. విద్వాంసు డనగా ఆత్మ అకర్త యను జ్ఞానము గలవాడు. ఇట్టి జ్ఞాని సన్న్యసాశ్రమమును స్వీకరించి, శాస్త్ర విహిత కర్మల నుండి విముక్తుడగును. జ్ఞానసాధనకొరకై విధులనన్నిటినీ వీడి సన్న్యసాశ్రమమును స్వీకరించుట రెండవరకం సన్న్యసము. దీనికి వివిదిషా-సన్న్యసమని పేరు.

జ్ఞాని సన్న్యసాశ్రమమును స్వీకరించని పక్షంలో, గృహస్థుగా కొనసాగుతూ, వేదవిహిత కర్మల ననుష్ఠిస్తూ, సమాజానికి ఆదర్శంగా నిలుస్తాడు. గృహస్థుడు తన ఆశ్రమధర్మములను విడనాడుట తప్పు. కాని, జ్ఞానికి అట్టి స్వేచ్ఛ గలదు. జ్ఞాని సర్వకర్మలను వీడి, సన్న్యసించవచ్చును.

ఈ విధంగా సర్వకర్మలను వీడుటకు గాని, కొనసాగించుటకు గాని జ్ఞానికి స్వేచ్ఛ గలదు. జ్ఞాని కర్మలలో నిమగ్నుడై ఉన్నా, యథార్థంగా ఆచరిస్తున్నట్లు గాదు (4.20). శ్రీకృష్ణుడీ రెండు రకముల జ్ఞానులను వర్ణించెను. ఒక రకం జ్ఞాని కర్మలనాచరిస్తూనే, కర్మల నుండి విముక్తుడుగ నుండును (4.20). మరియొక రకం జ్ఞాని శరీరధారణకు అత్యావశ్యకమగు కర్మలను మాత్రమే ఆచరించును (4.21).

విద్వత్ సన్న్యాసము

జ్ఞానప్రభావముచే సర్వకర్మలను త్యజించే విద్వత్సన్న్యాసమే ముఖ్య సన్న్యాసము. ఇట్టి సన్న్యాసి కుటుంబ బంధములను, సామాజిక సంబంధములను త్రెంచుకొని, ఉద్యోగమును వీడి, కాషాయమును ధరించును. ''నేను కర్మలను చేయు సమయంలోనైనను, నేను యథార్థముగా కర్మలను చేయుట లేదు'' అనే అంతర్దర్శనమును ఈతడు కలిగియుండును. ఈ తీరున, ఈతడు జ్ఞానరీత్యా మాత్రమే గాక, జీవనశైలి దృష్ట్యా కూడా కర్మ సన్న్యాసి యగును. లోపల, బయట కూడా ఇట్టి జ్ఞాని జ్ఞాన కర్మ సన్న్యాసియై యుండును.

వేదోక్త కర్మలను గాని, ఇతర లౌకిక కర్మలను గాని ఆచరించి సంపాదించవలసినది ఏదియూ విద్వత్సన్న్యాసికి లేదు. వరదలు వచ్చి వరదనీటిలో మునిగిపోయిన నూతిలోని నీరు ఎంత ఉపయోగమో, విద్వాంసునకు వేదవిహితకర్మల వలన అంతే ఉపయోగముండునని గీతలో ఇంతకుముందు (2.46) చెప్పబడినది. కావున, జ్ఞాని ఇట్టి కర్మలనన్నిటినీ వీడి గృహమును త్యజించి, సన్న్యసించును. దీనికే విద్వత్సన్న్యాసమని పేరు.

జ్ఞానము, కర్మయోగము అను రెండింటిలో ఒకదానిని ఎన్నుకొనుట సంభవమేనా?

మనము జ్ఞానపూర్వకమగు సన్న్యాసము (విద్వత్ – సన్న్యాసము) ను చూచియున్నాము. జ్ఞాన–కర్మ–సన్న్యాసము, కర్మయోగము అనే రెండు వికల్పములలో ఒకదానిని ఎన్నుకొనుట సంభవమేనా? సంభవము కాదు. ఏలయన, వాటిలో ఒకటి సాధనము కాగా, మరియొకటి సాధ్యము. ఇది యెట్లనన, విశ్వవిద్యాలయంలో డాక్టరేటు పట్టమునకు పేరును నమోదు చేయుట, డాక్టరేటు పట్టమును పొందుట అనే రెండింటిలో ఒకదానిని ఎన్నుకొనుట వీలుకాదు. పేరును నమోదు చేయనిదే, డాక్టరేటు పట్టము లభించదు. ఇచట నచ్చినదానిని ఎన్నుకొనుట అనే ప్రసక్తి యేమున్నది?

సాధనమగు కర్మయోగము, సాధ్యమగు జ్ఞాన–కర్మ– సన్న్యాసములలో నచ్చినదానిని ఎన్నుకునే ప్రసక్తి లేదు. కర్మయోగము, వివిదిషా సన్న్యాసము అనే రెండు జీవనశైలులలో ఒకదానిని ఎన్నుకునే అవకాశము గలదు. శాస్త్రములో నిరూపింపబడిన ఈ భేదము చాల ప్రముఖమైనది. దీనిని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ఏలయన, ఆధునిక కాలంలో వేదాంత సంప్రదాయములో అనేక భ్రాంతులు చోటుచేసుకున్నాయి. విద్వత్– సన్న్యాసము మనకు నచ్చి ఎన్నుకునేది కాదు. అది జ్ఞానఫలంగా లభించే ముఖ్య సన్న్యాసము.

వ్యక్తి ఆశ్రమరీత్యా సన్న్యాసి అయినా, కాకపోయినా జ్ఞాన కర్మ సన్న్యాసమే అందరికీ లక్ష్యము. జ్ఞాన-కర్మ- సన్న్యాసి జనక మహారాజా వలె రాజ్యాధినేత కావచ్చును. జనకుడు ఆశ్రమ రీత్యా సన్న్యాసి కాదు. అయినా, అయన జ్ఞాన-కర్మ- సన్న్యాసి. అయన చక్రవర్తిగా నిర్వర్తించవలసిన కార్యములు లెక్కలేనన్ని ఉంటాయి. అయన రాజ కార్యములనన్నిటినీ నిర్వర్తిస్తూనే ఉన్నా, తాను కర్త కాదనే జ్ఞానము కలవాడు. కావున, అయన కర్మలను చేసినట్లే కాదు. కావున, అయన సన్న్యాసియే; సన్న్యాసాశ్రమమునకు చెందని జ్ఞాన-కర్మ- సన్న్యాసి.

కర్మయోగము, వివిదిషా సన్న్యాసము అనే రెండు జీవనశైలులలో మనకు నచ్చిన దానిని ఎన్నుకునే వీలు గలదు. అర్జునుడు కర్మయోగమును మాత్రమే ఎన్నుకోవాలని శ్రీకృష్ణుడు సుస్పష్టముగా చెప్పియుండెను.

సన్న్యాసము విషయంలో అర్జునునకు గల భ్రాంతి

అర్జునుడు సన్న్యాసి కావాలనుకున్నాడు. కాని, అతను కోరుకున్నది జీవనశైలి మాత్రమే. కర్మలు అనేక సమస్యలతో నిండి ఉంటాయని భావించి, అతడు సన్న్యాస జీవనమును గడపాలనుకున్నాడు. తాను జ్ఞాని కాదని అతనికి తెలియును. తన వద్ద జ్ఞానము లేదు గనుక, జ్ఞాన సాధన అవశ్యకమని అతడు గుర్తించినాడు. జ్ఞానసాధనకు సన్న్యాసాశ్రమము కంటె మంచి ఆశ్రమము మరి యేది గలదు?

ఇటువంటి ఆలోచనలచేత ప్రేరితుడై అర్జునుడు ఇట్లు ప్రశ్నించెను: హే భగవన్, సన్న్యాసము, కర్మయోగము అనే రెండింటిలో ఏది శ్రేష్ఠము? నేను దేనిని ఎన్నుకోవాలి? కర్మ పరిచ్ఛిన్నము గనుక, నాకు ముక్తి నీయజాలదని నీవు ఉపదేశించినట్లు నాకు తోచుచున్నది. కర్మయోగము అంతఃకరణశుద్ధిని కలిగించునని నీవు చెప్పిన మాట వాస్తవమే. కాని, జ్ఞానముతో సమముగా పావనము చేయగలది మరియొకటి లేదని గూడ నీవు చెప్పియుంటివి. కావుననే, నేనీ జ్ఞానమును కాంక్షిస్తున్నాను. జ్ఞానప్రాప్తికి సన్న్యాసాశ్రమము శ్రేష్ఠమని నాకు తోచుచున్నది. పైగా, నీవు సర్వకర్మ సన్న్యాసమును స్తుతించుచుంటివి. సర్వకర్మలను ఏల విడరాదు? నాకు ఈ కర్మ సన్న్యాసమే నిశ్చితముగా జ్ఞానప్రాప్తికి సముచితమైన, తిన్నని మార్గముగా భాసించుచున్నది.

శ్రీకృష్ణుడు సలహా ఇచ్చిన మార్గములో అనావశ్యకమగు క్లేశము అధికమని అర్జునుడు భావించెను. ముందుగా కర్మలను చేసి, తరువాత కర్మఫలము నుండి విముక్తిని పొందాలి. దీనికంటె కర్మలను విడనాడి జ్ఞానసాధన చేయుటయే యుక్తియుక్తముగ భాసించుచున్నది.

సాధ్యమును బట్టి సాధనమును ఎంచుకోవాలి అన్నది అర్జునుని తలంపు. సాధ్యము సర్వకర్మ సన్న్యాసము గనుక, సాధనము కూడ సర్వకర్మ సన్న్యాసమే కావాలి. ఆత్మ సర్వక్రియా వినిర్ముక్తము అనే సత్యమును సాక్షాత్కరించుకొనుటకు కర్మలను చేయబని యేమి? శ్రీకృష్ణుని ఉపదేశము తనకు అర్థమైనంతలో, భగవానుడు జ్ఞానము యొక్క మహిమను, మరియు సన్న్యాసము యొక్క ఉత్కృష్టతను కొనియాడెనని అర్జునుడు తలపోసెను. ''సన్న్యాసమే మోక్షమని నీవు చెప్పుచున్నావు. ఇది యేల?''

తాను ఏమి చేయాలో నిర్ణయించుకునే ముందు విషయమును సమగ్రముగా తెలునుకొనుట మేలని అర్జునుడు తలపోసెను. అందువలననే, అతడు అదే ప్రశ్నను పునః పునః అడిగెను. అధ్యాయ ప్రారంభములో అర్జునుడిట్లనెను:

హే భగవన్! జ్ఞానము కర్మ కంటె గొప్పదని నీ అభిప్రాయమైనప్పుడు, నన్నీ ఘోరమగు కర్మను చేయుమని యేల ప్రేరేపించుచున్నావు?

అర్జునుడు ఇట్లు ప్రశ్నించుట వలననే, శ్రీకృష్ణ భగవానుడు ఉపదేశమును కొనసాగించెను. మరల ఇపుడు, రెండు అధ్యాయముల తరువాత, ఐదవ అధ్యాయ ప్రారంభములో అర్జునుడు మరల అదే ప్రశ్నను అడుగుతున్నాడు. ప్రశ్నల పదములు వేరైనా, తాత్పర్యమదియే. మనమీ విషయమును ఇపుడు పరిశీలిస్తాము. అర్జునుడు మరల ఇదే ప్రశ్నను 12వ అధ్యాయారంభములోను, 18వ అధ్యాయారంభములోను అడుగుతాడు. అడిగిన ప్రతిసారి పదములను మార్చి అడిగినాడు.

సన్న్యాస, కర్మయోగములను రెండింటినీ శ్రీకృష్ణుడు స్తుతించుటచే, అర్జునుడు అయోమయంలో పడినాడు. పైగా, శ్రీకృష్ణుడు సన్న్యాసమును స్తుతించి, వెనువెంటనే ''యోగము ననుష్ఠింపుము (యోగం ఆతిష్ఠ)'' అని అతనికి ఉపదేశించెను. అందువలననే, ఈ రెండింటిలో ఏది శ్రేష్ఠమో సూచింపుమని అతడు శ్రీకృష్ణుని కోరియుండెను. ''సన్న్యాసమునకు, కర్మయోగమునకు ఫలమొక్కటి కాదు గదా! కావున, నేను దేనిని ఆచరించాలి? సన్న్యాసమునా, కర్మయోగమునా? దయచేసి చెప్పుము'' అని అర్జునుడు శ్రీకృష్ణుని కోరెను.

ఐదవ అధ్యాయము

సన్న్యాసము

అధ్యాయము 5, శ్లోకము 1:

अर्जुन उवाच
सन्न्यासं कर्मणां कृष्ण पुनर्योगं च शंससि ।
यच्छ्रेय एतयोरेकं तन्मे ब्रूहि सुनिश्चितम् ॥ १ ॥

అర్జున ఉవాచ
సన్న్యాసం కర్మణాం కృష్ణ పునర్యోగం చ శంససి
యచ్ఛ్రేయ ఏతయోరేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్ (1)

అర్జునః = అర్జునుడు; ఉవాచ = పలికెను; కృష్ణ = ఓ శ్రీకృష్ణా!; కర్మణాం = కర్మల; సన్న్యాసం = విడుమటను; పునః = మరల (ఇంతేగాక); యోగం = కర్మయోగమును; చ = కూడా; శంససి = పొగడుచున్నావు; ఏతయోః = ఈ రెండింటిలో; యత్ = ఏది; శ్రేయః = శ్రేయస్కరమో; తత్ = అట్టి; ఏకం = ఒకదానిని; సునిశ్చితమ్ = నిశ్చయముగా; మే = నా కొరకు; బ్రూహి = చెప్పుము.

> ఓ శ్రీకృష్ణా! కర్మ త్యాగమును, మరల కర్మయోగమును కూడా ప్రశంసించుచుంటివి. ఈ రెండింటిలో ఏది శ్రేయస్కరమో, అట్టి ఒకదానిని నిశ్చయముగా నాకు చెప్పుము. (1)

అర్జునుడు మరల అదే సంశయమును వెలిబుచ్చుచున్నాడు. నాల్గవ అధ్యాయములో శ్రీకృష్ణుడు సర్వ కర్మ సన్న్యాసము యొక్క స్తుతిని కొనసాగించి, జ్ఞానము చేత సర్వకర్మలను త్యజించిన వ్యక్తిని స్తుతిస్తూ, ఉపదేశమును ఉపసంహరించెను (4.41). కావున, అర్జునుని దృష్టిలో శ్రీకృష్ణుడు సన్న్యాసమునే సమర్థించుచున్నట్లు భాసించెను. అట్టిస్థితిలో శ్రీకృష్ణుడు కర్మయోగము ననుష్ఠింపుమని అతనికి ఏల బోధించియుండును?

వాస్తవంలో, శ్రీకృష్ణుడు జ్ఞానము వలన ప్రాప్తించే సర్వ కర్మ సన్న్యాసము (జ్ఞాన – కర్మ– సన్న్యాసము) ను స్తుతించుచుండెను. కర్మలన్నియూ జ్ఞానము నందు లయమగునని ఆయన చెప్పెను (4.33). కాని, ఈ స్తుతి కర్మ సన్న్యాస స్తుతి యని అర్జునుడు పొరబడెను. కర్మ సన్న్యాసము ఒక జీవనశైలి మాత్రమే. ఈ జీవనశైలిలో వ్యక్తి వేదవిహిత కర్మలనుండి, ఇతర బాధ్యతల నుండి విముక్తుడగును.

కర్మలను విడుచుటయే శ్రేష్ఠమనియు, శ్రీకృష్ణుడు సన్న్యాసమును జ్ఞానసాధనముగా విధించుచున్నాడనియు అర్జునుడు భావించెను. శ్రీకృష్ణుడు కర్మయోగమును కూడ స్తుతించెను (యోగం చ శంససి). దీనితో అర్జునుడు తికమక పడెను. ఈ తీరున శ్రీకృష్ణుడు ఏకకాలము నందు కర్మ త్యాగమును, కర్మానుష్ఠానమును కూడ స్తుతించుచున్నట్లు కన్పట్టెను.

ఏది శ్రేష్ఠతరము?

కర్మ యందు అకర్మను, అనగా కర్త యందు అకర్తను దర్శించుటయే మోక్షము అని మనము చూచియున్నాము. ఈ కారణము చేతనే, అర్జునుడు జ్ఞానసాధనను చేయబూనెను. ఇట్టి మోక్షము మాత్రమే పరమలక్ష్యమని స్పష్టమగుచున్నది. కావున, కర్మత్యాగమును చేయుటయే ఉచితముగా తోచుచున్నది. పైగా, 'నేను అకర్తను' అనే జ్ఞానము సర్వకర్మ సన్న్యాసమే గదా! కావున, నేను ముందుగా కర్మల నాచరించి, ఆపైన వాటి యందు అకర్మను దర్శించే యత్నము నేల చేయవలెను? ఇంతకంటె, కర్మలను త్యజించుటయే యుక్తి యుక్తముగ నుండునని అర్జునుడు తలపోసెను.

సన్న్యాసాశ్రమములో పాత్రపోషణ అతి తక్కువగ నుండును. కావున, అతి తక్కువ కర్మల నాచరించిన చాలును. కర్మయోగములో పోషించదగిన పాత్రలు అధికము. కావున, కర్మలు కూడ అధికమే. కుమారుడు/ కుమార్తె, భర్త/ భార్య, తండ్రి/ తల్లి, పౌరుడు, పొరుగువాడు, మిత్రుడు ఇత్యాది పాత్రలను పోషించుటకై కర్మలను, విధులను, సకాలములో, సక్రమమైన రీతిలో ఆచరించుటయే కర్మయోగము. ఇట్టి ఉచితమగు మానసిక భావనయే యోగము అగును. కాని, సన్న్యసించిన వ్యక్తికి పోషించదగిన పాత్ర ఒక్కటి మాత్రమే ఉండును. అదియే శిష్యుని పాత్ర. బహుశః తరువాతి కాలములో గురువు పాత్రను కూడ పోషించవలసి యుండును. సన్న్యాసి ఇంతకు మించి పాత్రధారణ చేయబని లేదు. కావున, విధులు కూడ ఉండవు. కుటుంబమునకు, సమాజమునకు చెందిన విభిన్న విధుల నుండి సన్న్యాసి విముక్తుడగును. కావున, అతడు ధరించవలసిన పాత్రల సంఖ్య తగ్గిపోవును. ఈ

తీరున, పోషించవలసిన పాత్రల సంఖ్య తగ్గి, ఒక్కటిగా అగుట అనే ప్రయోజనము సన్న్యాసాశ్రమ స్వీకారము వలన సిద్ధించును. ఈ విధముగా పాత్రలను తగ్గించే సన్న్యాసాశ్రమ జీవనము మోక్షప్రాప్తికి అత్యుత్తమ సాధనముగా అర్జునునకు భాసించెను. జ్ఞానము చేత చేయబడే సర్వకర్మ సన్న్యాసమును స్తుతించిన శ్రీకృష్ణుడు ఇట్టి సన్న్యాసాశ్రమమునే స్తుతించినాడని అర్జునుడు తలపోసెను.

శ్రీకృష్ణుడు స్తుతించిన మార్గమునే తాను అనుసరించాలని అర్జునుడు భావించెను. కాని, శ్రీకృష్ణుడు కర్మ సన్న్యాస, కర్మానుష్ఠానములను రెండింటినీ స్తుతించుచుండెను. మరియు, మోక్షమునకు జ్ఞానము తక్క వేరొండు సాధనము లేదని శ్రీకృష్ణుడు చెప్పియుండెను (4.38). ఈ విధముగా జ్ఞానమును స్తుతించి, అర్జునునకు యోగము ననుష్ఠింపుమని ఉపదేశించెను (4.42).

కర్మ సన్న్యాసమును స్తుతిస్తూనే, శ్రీకృష్ణుడు తనను కర్మను అనుష్ఠింపుమని ఉపదేశించుట అసంగతము, స్వవచన వ్యాఘాతము అని అర్జునునకు తోచెను. శ్రీకృష్ణుని ఈ ఉపదేశము సముచితము కాదని అతనికి భాసించెను. కాని, శ్రీకృష్ణుడు జ్ఞాని యని అర్జునునకు తెలియును. కావుననే, అర్జునుడు తన సంశయము నిట్లు వ్యక్తము చేసెను: సర్వకర్మ సన్న్యాసము గొప్పదా? సన్న్యాసము గొప్పదా? కర్మానుష్ఠానము గొప్పదా? సన్న్యాసము, కర్మయోగము అనే రెండింటిలో నాకు శ్రేష్ఠమైనది ఏది?

అర్జునుని అభిప్రాయములో శ్రేష్ఠమైనది యనగా మోక్షము నిచ్చునది (శ్రేయస్) అని యర్థము. కర్మ సన్న్యాస, కర్మత్యాగములు సమానఫలము నీయజాలవని అతడు యెరుంగును. తనకు మోక్షము నిచ్చేది ఏది అను విషయమును అతడు తెలియగోరెను. తాను అనుసరించదగిన మార్గము విషయములో అతని సంశయము కేంద్రితమయ్యెను. రెండు మార్గములు మంచివియే కావచ్చును. కాని, మోక్షమును ఇచ్చు మార్గము ఇతర మార్గము కంటె శ్రేష్ఠతరము. కావున, అర్జునుడు మోక్షమునిచ్చు మార్గమును మాత్రమే అనుసరింపగోరెను.

ఏకకాలములో కర్మ సన్న్యాస, కర్మయోగములను రెండింటినీ ఆచరించుట అసంభవము. అవి పరస్పర విరుద్ధములు. క్రియలను చేస్తూనే, క్రియలను వీడుట కుదరదు. అవి పరస్పర విరుద్ధములు గాన, వాటిని పాక్షికముగా, అనగా కొంత సన్న్యాసము, కొద్ది కర్మయోగము, ఈ విధముగా అనుష్ఠించుటయూ సంభవము కాదు. ఒకే వ్యక్తి ఒకే సమయంలో ఉపవాసమును, భోజనమును చేయజాలడు. అటులనే, ఒకే వ్యక్తి ఒకే సమయంలో పరస్పర విరుద్ధములగు సన్న్యాస, కర్మయోగములను రెండింటినీ అనుష్ఠింపజాలడు.

శ్రీకృష్ణుడు మరల ఇట్లు ప్రతి సమాధానము నిచ్చెను:

అధ్యాయము 5, శ్లోకము 2:

श्री भगवानुवाच
सन्न्यासः कर्मयोगश्च निःश्रेयसकरावुभौ ।
तयोस्तु कर्मसन्न्यासात् कर्मयोगो विशिष्यते ॥ २ ॥

శ్రీ భగవానువాచ
సన్న్యాసః కర్మయోగశ్చ నిశ్శ్రేయసకరావుభౌ
తయోస్తు కర్మ సన్న్యాసాత్ కర్మయోగో విశిష్యతే (2)

శ్రీ భగవాన్ = శ్రీకృష్ణభగవానుడు; **ఉవాచ** = పలికెను ; **సన్న్యాసః** = సన్న్యాసము ; **చ** = మరియు; **కర్మయోగః** = కర్మలను యోగబుద్ధితో చేయుట; **ఉభౌ** = ఈ రెండు; **నిశ్శ్రేయసకరౌ** = మోక్షమును ఇచ్చునవియే; **తు** = కాని; **తయోః** = వాటిలో; **కర్మ సన్న్యాసాత్** = కర్మ త్యాగము కంటె; **కర్మయోగః** = కర్మయోగము; **విశిష్యతే** = శ్రేష్ఠమైనది.

శ్రీకృష్ణ భగవానుడు ఇట్లు పలికెను:

కర్మ సన్న్యాస, కర్మయోగములు రెండు మోక్షమును ఇచ్చునవియే. కాని,
వాటిలో కర్మ త్యాగము కంటె కర్మయోగము శ్రేష్ఠమైనది (2).

'శ్రేయస్' అను పదమునకు 'మంచిది' అను అర్థముతో బాటు 'మోక్షము' అను అర్థము కూడ గలదని మనము చూచియున్నాము. 'నిశ్శ్రేయసము' అను పదమునకు కూడ అర్థము మోక్షమే. మోక్షము నిచ్చు ఉపాయమేది? అనే అర్జునుని ప్రశ్నకు శ్రీకృష్ణుడు సన్న్యాస, కర్మయోగములు రెండునూ మోక్షమునిచ్చునని సమాధానము చెప్పెను.

ఇదిగాని, అది గాని మోక్షము నిచ్చును. సన్న్యాసముగాని, లేదా కర్మయోగము గాని ఏదో ఒకటి మాత్రమే మోక్షము నిచ్చునని అర్జునుని ఆశయము. కాని, సన్న్యాస, కర్మయోగములు రెండునూ మోక్షదములేనని శ్రీకృష్ణుని సమాధానము.

ఇచట పరిస్థితి 'ఇది గాని, అది గాని' వంటిది కాదు. ఈ సత్యము తెలియాలంటే ముందుగా సన్న్యాస కర్మయోగములను సరిగా అర్థం చేసుకోవాలి. ఈ రెండు మార్గములలోనూ సాధకుని అర్హతలపై ఆధారపడి, సానుకూల పరిస్థితులు, ప్రతికూల పరిస్థితులు కూడ గలవు. ఒకరకం వ్యక్తికి సన్న్యాసము సానుకూలముగ నుండును. మరియొక రకం వ్యక్తికి కర్మయోగము అనుకూలముగ నుండును.

ఈ రెండు జీవనరీతులు కూడ సాధనములే. కావున, వాటి శ్రేణి ఒక్కటియే. కాబట్టి, సన్న్యాస, కర్మయోగములనే ఈ రెండు జీవనరీతులలో నచ్చిన దానిని ఎన్నుకునే అవకాశము గలదు. కాని, శ్రీకృష్ణుడు సన్న్యాసాశ్రమమును కొనియాడుట లేదు. 'సన్న్యాసము అనే ఆశ్రమము ఒకటి గలదు' అని మాత్రమే ఆయనచెప్పినాడు. మరియు, ఆశ్రమరూప సన్న్యాసము కర్మయోగము కంటె గొప్పదని కూడ ఆయన చెప్పనే లేదు. పరమలక్ష్యమైన ముఖ్య సన్న్యాసమును మాత్రమే ఆయన కొనియాడినాడు.

తృతీయాధ్యాయారంభములో శ్రీకృష్ణుడు జ్ఞానయోగ, కర్మయోగములనే రెండు జీవనరీతులు గలవని చెప్పియున్నాడు (3.2). జ్ఞానసాధనయందు తత్పరత కల్గిన జీవనరీతి జ్ఞానయోగము. కర్మయోగమునందు జ్ఞానసాధనతో కూడిన కర్మ ఉండును. ప్రస్తుత శ్లోకములో శ్రీకృష్ణుడు ఈ రెండు జీవనరీతులు సమానమైనవని చెప్పుచున్నాడు. ఈ రెండూ సాధనములే. కాన, శ్రీకృష్ణుడు మరోవిధంగా యెట్లు చెప్పగలడు? అర్జునునకు అభీష్టమైనది ఒకటియే కావచ్చును. కాని, శ్రీకృష్ణుడు రెండింటినీ బోధించాలి. శ్రీకృష్ణుని మాటలను విని, అర్జునుడు మరల అయోమయంలో పడే అవకాశము గలదు.

'సన్న్యాస, కర్మయోగములు రెండు మోక్షదాయకములే' అనే శ్రీకృష్ణుని వాక్యము, అర్థమైతే అద్భుతము; అర్థం కాకపోతే, తలనొప్పి. సన్న్యాస, కర్మయోగములు రెండు మోక్షదాయకములే గనుక, సాధకులు అర్జునుని వలె సన్న్యాసమును ఇష్టపడవచ్చును. ఒక స్థానమును చేరుటకు రెండు దారులు గలవు. ఒకదారిలో అరమైలు నడవాలి. రెండవదారిలో ఐదు మైళ్ళు నడవాలి. వీటిలో ఏ దారియందు మక్కువను చూపుతారు? తేలికయైన దారినే ఎన్నుకుంటారు. తేలికయగు పనులవైపునకు ఆకర్షింపబడుట మానవనైజము.

ఇదే విధంగా, సన్న్యాస, కర్మయోగములు రెండు మోక్షము నిచ్చునవే గనుక, మనము తేలికయగు మార్గమును ఎన్నుకుంటాము. ఈ రెండింటిలో ఏది తేలిక? మొదటిచూపులో సన్న్యాసము

తేలిక అనిపిస్తుంది. సన్న్యాసికి చేయవలసిన పనులేమీ ఉండవు. కాని, వాస్తవంలో మానసిక సంసిద్ధత లేని వ్యక్తికి సన్న్యాసము కర్మయోగము కంటె కష్టతరమనుటలో సందేహము లేదు. కర్మలను వీడుట కంటె కర్మలను చేయుటయే శ్రేష్ఠమని శ్రీకృష్ణుడీ శ్లోకములో స్పష్టము జేసినాడు.

నీవు నీలోనే ఉంటూ, నీతోనే నీవు ఆనందించగల్గితే, కర్మలను వీడవచ్చును. నీవు అట్లు చేయగల్గుటకు విశిష్టమగు మానసిక తయారీ ఆవశ్యకము. ఇందువలననే, కర్మయోగము సన్న్యాసము కంటె మంచిదని శ్రీకృష్ణుడు నుడివెను.

సన్న్యాసము నెవ్వరూ స్వీకరించరాదు అని శ్రీకృష్ణుని అభిప్రాయము కానే కాదు. సన్న్యాసములో క్లేశము గలదు. సాధకుడు తగిన పరిణతి కలవాడై ఉండాలి. శ్రీకృష్ణుని అభిప్రాయము ఇంతే. ఈ విషయమును శ్రీకృష్ణుడు తరువాత స్పష్టము చేసినాడు. వాస్తవంలో కర్మయోగము సన్న్యాసమునకు దారిని సుగమము చేయును.

సరియగు సంసిద్ధత, పరిణతి లేని కేవల సన్న్యాసాశ్రమము కంటె కర్మయోగము శ్రేష్ఠమని మాత్రమే శ్రీకృష్ణుడిచట చెప్పుచుండెను. దీనికి కారణమును శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములో వివరించుచున్నాడు:

అధ్యాయము 5, శ్లోకము 3:

ज्ञेयः स नित्यसन्न्यासी यो न द्वेष्टि न कांक्षति ।
निर्द्वन्द्वो हि महाबाहो सुखं बन्धात्प्रमुच्यते ॥ ३ ॥

జ్ఞేయః స నిత్య సన్న్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి
నిర్ద్వంద్వో హి మహాబాహో సుఖం బంధాత్ప్రముచ్యతే (3)

యః = ఎవడైతే; **న ద్వేష్టి** = ద్వేషించడో; **న కాంక్షతి** = కాంక్షించడో; **సః** = అట్టివాడు; **నిత్య–సన్న్యాసీ** = ఎల్లవేళలా సన్న్యాసియేనని; **జ్ఞేయః** = తెలియవలెను; **మహాబాహో** = గొప్ప బాహువులు గల ఓ అర్జునా!; **హి** = ఏలయనగా, **నిర్ద్వంద్వః** = ఇష్టానిష్టములనే పరస్పర విరుద్ధ ద్వంద్వముల నుండి విముక్తుడైన వ్యక్తి; **బంధాత్** = బంధనము నుండి; **సుఖం** = తేలికగా; **ప్రముచ్యతే** = ముక్తిని పొందును.

ఎవడైతే ద్వేషించడో, కాంక్షించడో, అట్టివాడు ఎల్లవేళలా సన్న్యాసియేనని తెలియువలెను. గొప్ప బాహువులు గల ఓ అర్జునా! ఏలయనగా, ఇష్టానిష్టరూపములగు పరస్పర విరుద్ధ ద్వంద్వముల నుండి విముక్తుడైన వ్యక్తి తేలికగా బంధనము నుండి ముక్తిని పొందును (3).

'సన్న్యాసము మోక్షము నిచ్చునా? లేక కర్మయోగము మోక్షము నిచ్చునా?' అని అర్జునుడు ప్రశ్నించగా, ఈ రెండు మోక్ష మార్గములే యని శ్రీకృష్ణుడు పూర్వశ్లోకములో చెప్పినాడు. జ్ఞాని యగు వ్యక్తి ఎప్పటికీ సన్న్యాసియే. జ్ఞాని కాని వ్యక్తికి తనకు నచ్చిన మార్గమును ఎన్నుకునే స్వేచ్ఛ గలదు. జ్ఞానోపాయములగు మార్గములు రెండు గలవు. కాని, ఆవశ్యకమగు మానసిక సంసిద్ధత, పరిణతి లేకుండగా కర్మలను వీడుట (కర్మ-సన్న్యాసము) లో దుఃఖములు మెండనియు, కావుననే కర్మయోగము శ్రేష్ఠమనియు శ్రీకృష్ణుడు సూచించినాడు.

కర్మయోగ, కర్మ సన్న్యాసములు రెండు మోక్షసాధనములే. కావున కర్మయోగము కర్మ సన్న్యాసము కంటె మంచిది అనుమాట వ్యక్తి యొక్క అర్హతల దృష్ట్యా చెప్పిన మాట మాత్రమే. కర్మయోగికి, కర్మసన్న్యాసికి మోక్షము నందలి ఆకాంక్ష సమానమే. వీరిద్దరి మధ్య ఒకే భేదము గలదు. కర్మయోగికి అనుష్ఠించవలసిన విధులు గలవు. సన్న్యాసికి విధులు లేవు. కావున, సన్న్యాసి ఏకాంత జీవనమును గడుపుతూ, సర్వలౌకిక వ్యవహారములను వీడి, జ్ఞానసాధన చేస్తూ జీవిస్తాడు. ఇట్టి జీవనమును గడుపుటకు కొంత పరిణతి ఆవశ్యకము. ఇందువలననే, కేవల కర్మత్యాగము కంటె కర్మయోగమే శ్రేష్ఠమని శ్రీకృష్ణుడు వాక్రుచ్చెను.

'సన్న్యాసి' కి శ్రీకృష్ణుడిచ్చిన నిర్వచనము

సన్న్యాసమనగా నేమి అను విషయము అర్జునునకు తెలియాలని శ్రీకృష్ణుని ఆకాంక్ష. వ్యక్తి కర్మలను వీడి, వేషమును మార్చినంత మాత్రాన సన్న్యాసి కాడు. అతడు సన్న్యాసి యని ప్రజలు భావింవవచ్చును. మానసిక పరిణతి, సంసిద్ధత సన్న్యాసి యొక్క లక్షణములు. ఇవి లేని వ్యక్తి సన్న్యాసి కాడు.

జ్ఞాన సాధన కొరకై సన్న్యాసాశ్రమమును స్వీకరించిన వ్యక్తికి కాషాయధారణము ఇత్యాది బాహ్యచిహ్నములు కొంత వరకు స్ఫూర్తినిచ్చి సహకరించును. ఆశ్రమము యొక్క అనుశాసనమునకు ఈ బాహ్య చిహ్నములు కూడ తోడై, వ్యక్తి యొక్క అంతరంగములో ఆవశ్యకమగు మార్పులను

తెచ్చి, మనస్సును జ్ఞానోదయమునకు సంసిద్ధము చేయును. సన్న్యాసాశ్రమమునకు కావలసిన మానసిక తయారీ గల వ్యక్తికి ఈ బాహ్యచిహ్నములు ప్రయోజనకారులగును. కాని, అట్టి తయారీ లేని వ్యక్తిని సన్న్యాసాశ్రమము అనేక ఇబ్బందులకు గురిచేయగల్గును.

జ్ఞానము, లేదా కొంత మానసిక తయారీ లేని వ్యక్తికి సన్న్యాసము సమస్య యగుట నిశ్చయము. వ్యక్తికి పూర్ణజ్ఞానము లేకపోయినా, కొంత అంతర్ముఖత్వము, ఉత్సాహపూర్ణమైన స్వభావము అత్యావశ్యకము. ఇవి కూడా లేని వ్యక్తికి సన్న్యాసము సమస్యగా మారును. ఇట్టివానికి అటు సంసారిగా నుండి కర్మయోగమును అనుష్ఠించే అవకాశము లేదు; ఇటు సన్న్యాసుల ప్రపంచంలో ఇమడలేడు. ఇట్టివాడు ఉభయభ్రష్టుడై త్రిశంకుస్వర్గము వంటి స్థితిలో నుండి, చిత్త మాలిన్యములను క్షాళన చేసుకునే అవకాశమునకు దూరమగును.

ఇట్టివానికి సన్న్యాసము దుర్భరమగు బాధ్యతగా మారును. దానినాతడు నిర్వర్తింపజాలడు. ఇందువలననే, కేవల కర్మత్యాగము కంటె కర్మయోగము శ్రేష్ఠమని శ్రీకృష్ణుడు చెప్పెను. జీవన రీతిని మార్చినంత మాత్రాన వ్యక్తి సన్న్యాసి అయిపోడు. కామనలు లేనివాడు, ద్వేషించనివాడు సన్న్యాసి యని తెలుసుకోవాలి.

నిత్యసన్న్యాసి

'సన్న్యాసి' అను పదమునకు 'నిత్య' అను విశేషణము చేర్చబడెను. నిత్యసన్న్యాసి యనగా అనంతకాలము వరకు సన్న్యాసి అనుకోరాదు. నిత్యసన్న్యాసి యనగా – కొన్నికాలములలో సన్న్యాసియై, కొన్నికాలములలో సన్న్యాసి కాని వ్యక్తికి భిన్నంగా, సర్వకాలములయందు సన్న్యాసిగా నుండు వాడని యర్థము. అప్పుడప్పుడు సన్న్యాసిగా నుండు వ్యక్తిని కాదాచిత్క సన్న్యాసి అంటారు.

కొన్ని వస్తువుల విషయంలో ప్రతివ్యక్తి నిత్య సన్న్యాసియే. మనకు వస్తువులన్నింటి యందు కామన కొంతకాలము తరువాత ఉండదు. ఆ విధంగా ప్రతివ్యక్తి కాదాచిత్క సన్న్యాసి కూడా. ఉదాహరణకు, బుడగలు, బొంగరాలు, బొమ్మలు ఇత్యాదుల విషయంలో మనము నిత్యసన్న్యాసులము. మానవుడు ఒకప్పుడు కొన్ని వస్తువులను ప్రేమిస్తాడు. అవి అతనికి చాల ప్రముఖమైనవిగా ఉంటాయి. అవి లేకుండా అతడు జీవించలేడు. కాని, కాలక్రమంలో అతడు వాటికి అతీతంగా పరిణతుడవుతాడు. అంటే, అతడు వాటి విషయంలో నిత్యసన్న్యాసి అయినాడు. అయన వాటిని పరిత్యజించలేదు; అవియే అతనిని పరిత్యజించినవి. అతడు వాటికి అతీతంగా పరిణతిని చెందినాడు.

మనము కొన్ని వస్తువులను పరిత్యజిస్తాము. కాని, వాటిపై మనకు ఇంకనూ ఆసక్తి మిగిలియుండును. కాని, మనము వాటికి అతీతంగా పరిణతిని చెందినప్పుడు, వాటి గురించిన తలపు కూడా ఉండదు. ఇట్టి స్థితిలో 'నేను ఈ వస్తువును త్యజించినాను' అని ప్రకటించే ప్రసక్తియే ఉండదు. ఒక వ్యక్తి తాను బిరుదమును, ఉద్యోగమును త్యజించినానని చెప్పెననుకొనుడు. అంటే, అతడు వాటిని త్యజించెనే గాని, వాటికి అతీతంగా పెరగలేదు. మనము ఒక రుచిని, లేక ఒక విలువైన దానిని త్యజించిన సందర్భాలలో, అది యింకనూ మన మనస్సులో మిగిలియుండుటచే, మనము దానిని గురించి ఇతరులతో చర్చిస్తాము.

'నేను మొన్న చెత్తను త్యాగము చేసితిని' అని ఎవ్వరూ చెప్పరు. మనము చెత్తను దూరంగా పారవేసి, దాని గురించి విస్మరిస్తాము. కాని, ఎవరైనా చెత్తను గురించి మాట్లాడే పక్షంలో, వారి దృష్టిలో ఇంకనూ దానికి ఒక విలువ ఉన్నట్లు స్పష్టమగును. ఇదే విధంగా, మనము త్యజించిన వాటి గురించి మాటలాడే పక్షంలో, మన దృష్టిలో ఇంకనూ వాటికి విలువ ఉన్నది. ''నేను బొంగరములను, బుడగలను, బొమ్మలను త్యజించినాను'' అని మనము చెప్పము. మనము వాటి పరిధిని మించి పెరిగి పెద్దలమైనాము. కాని, మనము త్యజించిన వస్తువులు కంటబడకుండా జాగ్రత్తపడతాము. ఏలయన, అవి కంటబడితే, మరల మనలను ఆకర్షిస్తాయి.

ఆకర్షించే వస్తువులపై మనలో కోరిక దాగి ఉంటుంది. అందువలననే, మనము త్యజించిన వస్తువులను ఎదురుగా నుంచుకొనము. వాటి ఆకర్షణలో పడకుండుట కొరకై, వాటిని దూరంగా విడిచిపెడతాము. కాని, మనము వాటి పరిధిని దాటి పరిణతి చెందినచో, మనకు వాటిపై ప్రేమ గాని, ద్వేషము గాని ఉండవు.

ఈ విధంగా, అనేక వస్తువుల విషయంలో మనము నిత్యసన్న్యాసులమే అయినా, మరికొన్ని వస్తువుల విషయంలో మనము సన్న్యాసులము కానే కాదు. కొన్ని వస్తువులు లేకుండా నీవు జీవింపలేవనుకో. అంటే, నీవు సన్న్యాసివి కాదు. నిన్ను బంధించే వస్తువులు ఉన్నవి గదా! నీ భద్రతా భావన వాటిపై ఆధారపడియున్నది. కొన్ని వస్తువుల విషయంలో నీవు సన్న్యాసివే కావచ్చును. కాని, నీవు సర్వవస్తువుల విషయంలో సన్న్యాసివి కానిచో, నిన్ను 'నిత్యసన్న్యాసి' అనుట పొసగదు. సర్వ పరిస్థితులలో సన్న్యాసిగా ఉండువాడు మాత్రమే నిత్యసన్న్యాసి. నిత్య సన్న్యాసులు కానివారు కాదాచిత్క సన్న్యాసులు మాత్రమే. అనగా, కొన్ని వస్తువుల విషయంలో మాత్రమే వారు సన్న్యాసులుగా ఉంటారు. మిగిలిన వస్తువుల విషయంలో వారు సన్న్యాసులు కారు.

వ్యక్తి ఇతర వస్తువుల ఆవశ్యకత లేనివాడై, పూర్ణస్వతంత్రుడుగ నున్న క్షణాలలో నిత్య సన్న్యాసి (సర్వ వస్తువుల విషయంలో సన్న్యాసి) కాగల్గును. ఉదాహరణకు, ధ్యానావస్థలో సాధకుడు సర్వాత్మభావమును అనుభవించవచ్చును. ఇట్టి క్షణములలో, సాధకునకు తనకంటె భిన్నమగు ఇతరముల ఆవశ్యకత ఉండదు. ఆ క్షణములో వ్యక్తి పూర్ణుడై, తనలో తాను పూర్తి సంతుష్టిని అనుభవించగల్గును. ఇదియే సన్న్యాసము.

ఆనంద ఘడియలలో ప్రతివ్యక్తి సన్న్యాసియే అనుటలో సందియము లేదు. ఆ క్షణాలలో ఈ ప్రపంచములో నిన్ను ఆకర్షించగలిగే వస్తువు ఏదీ లేదనిపిస్తుంది. సన్న్యాసమనగా నిదియే. ఆ క్షణాలలో రాగము ఉండదు; ద్వేషము ఉండదు. ఆ సమయంలో వ్యక్తి పూర్ణ స్వతంత్రుడుగా, సన్న్యాసిగా నుండును. కాని, అప్పుడప్పుడు వచ్చే ఈ సన్న్యాసము నిత్య సన్న్యాసము కాదు.

నిత్య సన్న్యాసి యెవరు? సర్వవస్తువుల విషయంలో రాగము గాని, ద్వేషము గాని లేనివాడే. కొన్నింటిని పరిహరించాలనీ, మరికొన్నింటిని సంపాదించాలనీ మానవుడు కోరుకుంటాడు. ఈ రెండు కామనలే. కాని కొన్నింటిని పరిహరించాలని కోరుకునే సందర్భాలలో మనము దానిని కోరిక అనము; ద్వేషము అంటాము.

సన్న్యాసి రాగద్వేషములచే బంధింపబడడు. అనగా, రాగద్వేషములకు వశవర్తి కాడు. అట్టి 'వ్యక్తి మాత్రమే నిత్యసన్న్యాసి కాగలడు. సర్వ వస్తువుల యందు రాగము కాని, ద్వేషము కాని లేని వ్యక్తి ఒక విశిష్ట వస్తువు ఉన్నా, లేకపోయినా, దానిచేత ప్రభావితుడు గాడు; దాని సన్నిధిలో భయభీతుడు కాడు. అటులనే, ఒక వస్తువు లేనప్పుడు దాని అనుపస్థితికి దుఃఖించడు.

పలాయనము వలన పెరిగేది దౌర్బల్యము; శక్తి కాదు

సన్న్యాసమనగా కేవల విధిత్యాగము కాదు. విధులను విడిచిపెట్టుట చాల తేలిక. కఠినములు, వ్యయప్రయాస సాధ్యములగు విధులను వదలిపెట్టుట మరీ తేలిక. వాస్తవంలో, మానవుడు అట్టి విధులను వదిలించుకోవటానికి యత్నిస్తాడు. కష్టమును కలిగించే క్లిష్టపరిస్థితుల నుండి తప్పించుకోవటానికి మనమందరమూ ప్రయత్నిస్తాము. కావున, ఇట్టి పలాయనములో సన్న్యాసమును ఆశ్రయించే అవకాశము లేకపోలేదు. కాని, పరిస్థితుల నుండి పారిపోవుట వలన శక్తి చేకూరదు. వాటిని ఎదుర్కొనుట వలననే శక్తి వర్ధిల్లును. పలాయనము వలన మానవుడు దుర్బలుడగును. 'నేను తప్పించుకోగల్గినాను' అని నేను సంతోషించవచ్చును. కాని, వాస్తవంలో జరిగిన దేమన, నేను నా శక్తిని

కోల్పోయినాను. పారిపోవుట యనగా నేమి? సమస్యకు భయపడి తల ఒగ్గుటయే. సమస్య భయంకరమైనదే కావచ్చును. కాని, దాని నుండి పారిపోవుట వలన వ్యక్తి దుర్బలుడగును. పలాయనములో మరియొక దోషము గలదు. భవిష్యత్తులో వ్యక్తి చిన్న చిన్న సమస్యల నుండి కూడా పారిపోవుట అవశ్యకమని భావించును. పారిపోయిన ప్రతి పర్యాయము శక్తి క్షీణించును. సమస్యను ఎదుర్కొని, మనము విజయమును సాధించలేకపోవచ్చును. కాని, సమస్యను ఎదుర్కొనే ప్రతిపర్యాయము శక్తి ద్విగుణీకృతమగును.

విధులు క్లిష్టమైనవే కావచ్చును. కాని, వాటి నుండి దూరంగా పారిపోవుట వలన వ్యక్తిలో పెరుగుదల ఉండదని అర్జునుడు గ్రహించాలని శ్రీకృష్ణుని ఆకాంక్ష. ఇట్లు పారిపోయిన వ్యక్తి యథార్థమైన సన్న్యాసియూ కాలేడు. వాస్తవంలో, విధులను పరిత్యజించుట (కేవల కర్మ సన్న్యాసము) నిషిద్ధము! సర్వవస్తువుల యందు రాగము గాని, ద్వేషము గాని లేనివాడే సన్న్యాసి.

'నిత్య సన్న్యాసి' యను పదమునకు ముఖ్యార్థమునే గాక, సాపేక్షికార్థమును కూడ స్వీకరించాలని శ్రీ శంకరుల అభిప్రాయము. సాపేక్షికార్థములో, రాగద్వేషము లింకనూ ఉన్ననూ, వాటికి వశవర్తి గాని కర్మయోగి నిత్య సన్న్యాసి. ముఖ్యార్థములో, ఆత్మజ్ఞానము ఉదయించిన కారణంగా రాగద్వేషములు పూర్తిగా తొలగిపోయిన జ్ఞాని ముఖ్య సన్న్యాసి.

సన్న్యాసము పలాయనోపాయముగా ఉపకరించదు

కర్మకు భయపడి, దానిని వదలించుకొనుటకై సన్న్యాసమును చేపట్టే వ్యక్తి రాగద్వేషముల వశములో నున్నాడనుటలో సందియము లేదు. వాటికి వశము కాని వ్యక్తియే సన్న్యాసి. కర్మవలన భయము ద్వేషము. సన్న్యాస మందలి ప్రేమ రాగము. వ్యక్తి యొక్క రాగములో విషయముగా నుండు సన్న్యాసము ప్రయోజనకారి కాదు. కాని, కర్మయోగికి రాగద్వేషముల వశము నుండి తప్పించుకునే అవకాశము లభించును.

కర్మయోగ జీవనమును గడుపుచున్న వ్యక్తి రాగద్వేషములు ప్రకటమగుటకు అవకాశమునిస్తూ, అదే సమయంలో వాటిని సమర్థవంతముగా నియంత్రించగల్గును. రాగద్వేషములకు వశవర్తి కాకుండా, వాటిని ఈ విధముగా నియంత్రించువాడే కర్మయోగి యగును గదా!.

కర్మఫలముల విషయములో ప్రసాదబుద్ధి అనే ఒక మానసిక ప్రవృత్తి (attitude) గలదు. దీని ప్రకారము, మనకు లభించే ఫలముల నన్నిటిని ఈశ్వరుడిచ్చిన ప్రసాదముగా స్వీకరిస్తాము.

కర్మల ననుష్ఠించే సమయంలో, ఈశ్వరుని స్వరూప భూతమైన ధర్మమునకు అనురూపముగా ఆచరిస్తాము. ఆచరించే కర్మల నన్నిటినీ ఈశ్వరునకు సమర్పిస్తాము. దీనికే ఈశ్వరార్పణబుద్ధి యని పేరు. ప్రసాదబుద్ధి, ఈశ్వరార్పణ బుద్ధి అనే ఈ రెండు బుద్ధులు కలిసి కర్మయోగము అగును. కర్మలలో నిమగ్నుడై, ఇట్టి మానసిక ప్రవృత్తి గల వ్యక్తి కర్మయోగి అగును. దాని వలన అతడు రాగద్వేషముల బారిన పడకుండ నుండగల్గును.

వ్యక్తి సన్న్యాసి అయిన తరువాత సమస్యలు ఉండవు. ఆ సన్న్యాసము సాపేక్షిక (గౌణ) సన్న్యాసమైనా పరవాలేదు. కాని, అంతవరకు వ్యక్తి కర్మయోగియై జీవించాలి. ఇందువలననే, శ్రీకృష్ణుడీ శ్లోకములో నిత్యసన్న్యాసిని నిర్ద్వంద్యుడు (పరస్పర విరుద్ధములగు జంటల ప్రభావము నుండి విముక్తుడు) అని వర్ణించెను. రాగద్వేషములు, సుఖదుఃఖములు, జయాపజయములు మొదలగునవి ద్వంద్వములు. ఈ ద్వంద్వములు అన్ని కాలములలో ఉంటాయి. అవి రాగద్వేషరూపంగా వ్యక్తిని బంధిస్తాయి.

రాగద్వేషములను నియంత్రించుట

వ్యక్తిని బంధించేది ప్రపంచము కాదు; ప్రపంచములోని ఘటనలు కావు. వ్యక్తిని బంధించేది రాగద్వేషముల ద్వంద్వము మాత్రమే. ద్వంద్వములు అన్నియూ రాగద్వేషముల నుండి పుట్టును. కావున, రాగద్వేషముల పట్టునుండి విడిపించుకున్నవాడు నిర్ద్వంద్వుడగును.

వాస్తవంలో జీవుని బంధించేది రాగద్వేషముల ద్వంద్వము కూడ కాదు. రాగద్వేషములు జీవిత సత్యములు. జీవితములో మన ఇష్టమునకు విరుద్ధంగా అనేక ఘటనలు జరుగుతూ ఉంటాయి. మనము కోరేది ఒకటైతే, జరిగేది మరొకటి. ఈ ప్రపంచము యొక్క స్వరూపమే ఇట్లున్నది. ప్రపంచము చెడ్డది అని గాని, మన రాగద్వేషములు చెడ్డవి అని కాని, చెప్పుటకు వీలు లేదు. ప్రపంచపు తీరు అట్లున్నది. మనము సర్వజ్ఞులము కాము గనుక, మనకు రాగద్వేషములు తప్పవు. మనము సర్వశక్తిమంతులము కాము గనుక, మన రాగద్వేషములు నిష్ఫలములుగా మిగిలిపోతాయి. మనము సర్వ శక్తిమంతులమైనచో, మనకు ఉండే రాగద్వేషముల నన్నిటినీ సఫలం చేసుకోగల్గుతాము. కాని, మనము సర్వశక్తిమంతులము కాము గదా!

ఈ స్థితిలో ఒకే మార్గము గలదు. మనము రాగద్వేషములపై పూర్తి నియంత్రణను కలిగి ఉండాలి. మనకు రాగద్వేషములపై ఎంతవరకు నియంత్రణ ఉంటుందో, అంతవరకు మాత్రమే

మనకు జీవితముపైన, ప్రపంచము పైన నియంత్రణ ఉంటుంది. మన జీవితములో భావావేగములను నియంత్రించుకొనుట, ఆధ్యాత్మికతను పెంపొందించుకొనుట మొదలగున వన్నియూ రాగద్వేష నియంత్రణలో అంతర్భాగమవుతాయి. ఇందువలననే, గీతా శాస్త్రములోని మనో విజ్ఞానము అంతా రాగద్వేషములపై ఆధారపడి యున్నది.

కావున, జ్ఞానమును, తద్ద్వారా మోక్షమును పొంది, బంధవిముక్తుడు కావాలంటే, నీవు నిత్య సన్న్యాసివి కావాలి. నిత్యసన్న్యాసి జ్ఞాని కావచ్చును; లేక కుశలుడగు కర్మయోగి కావచ్చును. కుశలుడగు కర్మయోగి సన్న్యాసియేనని చెప్పవచ్చును. రాగద్వేషములకు వశుడు కాకుండా, మానసిక పరిణతి కలిగిన వ్యక్తి, బాహ్యచిహ్నములు ఉన్నా, లేకపోయినా, సన్న్యాసియే నని చెప్పవచ్చును. ఇట్టి వ్యక్తి మాత్రమే బంధవిముక్తికి అర్హుడు.

ఇట్టి వ్యక్తికి మోక్షము అనాయాససాధ్యము (సుఖమ్) అని కూడ శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పినాడు. వ్యక్తిలో తగిన పరిణతి ఏర్పడి, రాగద్వేషముల పట్టు తొలగినచో, అతడు మోక్షార్హుడు. అతడు మోక్షమును పొందకుండా అడ్డుపడే ప్రతిబంధకము లేమియూ లేవు. కావున, అతనికి బంధ విముక్తి అనాయాస సాధ్యము. 'సుఖం' అను పదమునకు 'ఆనందముగా' అని కూడ అర్థము చెప్పవచ్చును. ఈ తీరున సంసిద్ధుడైన వ్యక్తి ఆనందముగా బంధము నుండి విముక్తుడగును.

కర్మయోగికి ఏకైక లక్ష్యము మోక్షము

కర్మికి కర్మఫలముల యందు ఆసక్తి ఉండును. అతడు వివిధ ఫలములను గోరి, విభిన్న కర్మల నాచరించును. కాని, కర్మి కర్మయోగి అయినచో, అతనికి స్వర్గము, అధికారము, సంపద ఇత్యాదుల యందు అభిరుచి ఉండదు. కావున, అతడు కర్మలను వీటికొరకై చేయడు. కర్మయోగికి మోక్షము నందు మాత్రమే అభిరుచి ఉండును.

మోక్షము ఏకైక లక్ష్యము కాని వ్యక్తి కర్మయోగి కాలేడు. అట్టివాడు కర్మిగనే మిగిలిపోవును. కర్మలు ఈయగలిగే వివిధ ఫలముల యందాసక్తి గల ఇట్టి వ్యక్తికి కర్మఠుడనియూ పేరు గలదు. కొందరు స్వర్గమును కోరతారు. స్వర్గములో లభించే భద్రత యందు, సుఖమునందు వారికి ఆసక్తి ఉండును. స్వర్గమే మోక్షమని వారు భావించవచ్చును. కాని, వారు అర్థ కామాసక్తులే (భద్రతను, సుఖమును కోరువారు మాత్రమే) గాని, కర్మయోగులు కారు.

అట్లైనచో, కర్మయోగి ఎవరు? కేవల అంతఃకరణశుద్ధి కొరకు మాత్రమే వివిధ కర్తవ్య కర్మలను అనుష్ఠించే వ్యక్తి కర్మయోగి. రాగద్వేషముల నుండి విముక్తిని పొందుటకు ఈ అంతఃకరణశుద్ధి ఆవశ్యకము. కర్మయోగికి తన రాగద్వేషములను పరిపూర్తి చేసుకొనుటలో తాత్పర్యము ఉండదు. పైగా, రాగద్వేషములను నియంత్రించుట యందు కర్మయోగికి పట్టుదల ఉండును.

వాస్తవంలో, రాగద్వేషముల పట్టునుండి విడుదల, అంతఃకరణశుద్ధి అనునవి కూడ ఒకరకంగా మోక్షమే. ఇది ప్రథమ మోక్షము. దాని తరువాత, బంధభావన నుండి విముక్తి, అజ్ఞానము నుండి విముక్తి అనునవి చరమమోక్షము. మొదటిది పరిణతి లక్షణము. రెండవది జ్ఞానస్వరూపము. పరిణతి కూడ గొప్ప సిద్ధియే. మానవులు ఈ పరిణతి కొరకై కర్మయోగ జీవనము నవలంబిస్తారు. దీని తరువాత లభించే సిద్ధియే మోక్షము.

కర్మల నాచరించినా, కర్మలను సన్న్యసించినా, అంతిమ లక్ష్యము ఒక్కటియే. అదియే మోక్షము. ఒకడు కర్మలను సన్న్యసించి, మోక్షమును పొందును. కాని, ఇది యెట్లు సాధ్యము? సాధనములు భిన్నమైనప్పుడు వాటి ఫలములు కూడ వేరుగ నుండవలదా? కర్మలు చేసే దానికి, సన్న్యసించే దానికి ఫలము భిన్నముగా ఉండి తీరవలెను. అర్జునుని ఆలోచనా సరళి ఇట్లుండెను.

ఫల విషయములో అర్జునునకు గల యీ శంకను శ్రీకృష్ణుడు నివారించెను. కర్మ యోగమునకు, సన్న్యాసమునకు ఫలమొక్కటియే నని శ్రీకృష్ణుడు చెప్పెను.

అధ్యాయము 5, శ్లోకము 4:

साङ्ख्ययोगौ पृथग्बालाः प्रवदन्ति न पण्डिताः ।
एकमप्यास्थितः सम्यगुभयोर्विन्दते फलम् ॥ ४ ॥

సాంఖ్యయోగౌ పృథక్ బాలాః ప్రవదంతి న పండితాః
ఏకమప్యాస్థితః సమ్యగుభయోర్విందతే ఫలమ్ (4)

బాలాః = అజ్ఞానులు; **సాంఖ్యయోగౌ** = జ్ఞాన, కర్మయోగములు; **పృథక్** = వేరని; **ప్రవదన్తి** = వాదించెదరు; **పండితాః** = పండితులు; **న** = అట్లు చేయరు; **ఏకం** = ఒకదానిని; **అపి** = అయిననూ; **సమ్యక్** = బాగుగా; **ఆస్థితః** = అనుష్ఠించు వ్యక్తి; **ఉభయోః** = రెండింటియొక్క; **ఫలమ్** = ఫలమును; **విందతే** = పొందును.

జ్ఞాన, కర్మయోగములు వేరని అజ్ఞానులు వాదించెదరు. పండితులు అట్లు వాదించరు. వాటిలో ఒకదానినైననూ బాగుగా అనుష్ఠించు వ్యక్తి రెండింటి ఫలమును పొందును (4).

సన్న్యాసములో కర్మలు త్యజింపబడును. కర్మయోగములో కర్మలు అనుష్ఠింపబడును. అంటే, ఈ రెండు స్వరూపతః భిన్నములనుటలో సందియము లేదు. శ్రీకృష్ణుడీ శ్లోకములో 'సన్న్యాస' పదము యొక్క స్థానములో 'సాంఖ్య' అను పదమును ప్రయోగించెను. దీనికి గల కారణమును మనము తరువాత చూస్తాము. 'సాంఖ్యయోగౌ' అనునది సమాసపదము. సాంఖ్యమనగా జ్ఞానము. యోగమనగా కర్మయోగము. జ్ఞానము, యోగము వేర్వేరు అని కొందరు అంటారు. అవి స్వరూపతః మాత్రమే గాక, ఫలతః కూడా భిన్నములే యని వారి అభిప్రాయము.

ఇట్లు వాదించు వారెవ్వరు? ఇట్టి వారిని శ్రీకృష్ణుడీ శ్లోకములో 'బాలాః' అని నిర్దేశించెను. అనగా, ఏమీ తెలియని వారని యర్థము. వీరు శాస్త్రమును చదివిన వారే. శాస్త్రములోని పదములు వారికి సుపరిచితములే. కాని వాటి తాత్పర్యము వారికి తెలియదు. తండ్రి పిల్లవానితో 'ధనము ప్రమాదకరమైనది' అన్నచో, ఆ పిల్లవాడు కూడా 'ధనము ప్రమాదకరమైనది' అనుచుండును. వీరు కూడా ఆ పిల్లవాని వంటివారే. ధనము ఎందులకు ప్రమాదకారియో ఆ పిల్లవానికి తెలియదు. ధనమును సరిగా వినియోగించనిచో, ప్రమాదకారి యగునని తండ్రియొక్క తాత్పర్యము. ఇట్టి వాక్యములలో ఎంతో కొంత సత్యము ఉండును. పిల్లవాడు తండ్రియొక్క పలుకులను పునః పునః ఉచ్చరిస్తాడు. కాని, వాటి తాత్పర్యము వానికి తెలియదు. అటులనే, వీరు కూడ శాస్త్ర వచనములను వల్లెవేస్తారు. కాని, వాటి తాత్పర్యము వారికి తెలియదు.

జ్ఞానము ఏకైక సాధనము

సన్న్యాసము (కర్మలను త్యజించుట) గాని, కర్మయోగము గాని మోక్షములో సాక్షాత్సాధనములు గావు. జ్ఞానము మాత్రమే సాక్షాత్సాధనము. జ్ఞానము చేత మాత్రమే మోక్షము లభించును. బంధము అజ్ఞాన జనితము. మనము అట్టి బంధము నుండి మోక్షమును కోరుచున్నాము. కాన, జ్ఞానము తక్క మరియొక మార్గము లేదు. ఈ జ్ఞానమును పొందుటకు ఒక జ్ఞానసాధనము (ప్రమాణము) కావాలి. కనుక, ఉపాయము ఏదైనా, అంతము నందు జ్ఞానప్రాప్తి సమానమే.

శాస్త్రములో ఎక్కడైననూ రెండు వేర్వేరు మార్గములు ఉపదేశింపబడలేదు. శాస్త్రము రెండు జీవన విధానములను మాత్రమే బోధించినది. ఒకటి కర్మలననుష్ఠించుట (ప్రవృత్తి, లేక కర్మయోగము).

మరియొకటి కర్మలను త్యజించుట (నివృత్తి, లేక సన్న్యాసము, లేక జ్ఞానయోగము). శాస్త్రము బోధించేది ఇంత మాత్రమే. ఈ రెండు జీవననిష్ఠల లక్ష్యము మోక్షము మాత్రమే.

ఈ అధ్యాయ ప్రారంభములో శ్రీకృష్ణుడు సన్న్యాసము కంటె కర్మయోగము మేలని చెప్పియున్నాడు (5.2). సన్న్యాసమునకు యోగ్యత లేని వానికి ఇది వర్తించును. సాధకుడు సన్న్యాసమునకు తొందరపడరాదని శ్రీకృష్ణుని అభిప్రాయము.

పరమలక్ష్యము మోక్షమొక్కటియే

జీవననిష్ఠ సన్న్యాసము కావచ్చును; లేదా, కర్మయోగము కావచ్చును. సాధకుడు ఏదో ఒకదానిని చక్కగా అనుష్ఠించినచో, లభించే ఫలము సమానమేనని శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు. ఈ జీవననిష్ఠలు రెండింటికి ఫలములు వేరు గాదు. వాటి ఫలము ఒక్కటే. అదియే మోక్షము.

కర్తవ్య కర్మల ననుష్ఠిస్తూ, జ్ఞానసాధన చేసే జీవనశైలి కర్మయోగము. దానిని అనుష్ఠించే సాధకునకు ప్రప్రథమంగా అంతఃకరణశుద్ధి, తదనంతరము జ్ఞానము లభిస్తాయి. కేవల జ్ఞానసాధనతో కూడి యుండే సన్న్యాసమును ఆచరించినా, ఫలము సమానమే. మరోమాటలో చెప్పాలంటే, సన్న్యాసము వలన ఏది లభిస్తుందో, కర్మయోగము వలన కూడా అదే లభిస్తుంది. కర్మయోగి సంసారములోని సుఖదుఃఖములతో ఘర్షణ చేస్తూ ముందుకు సాగుతాడు. కనుక, మనస్సును పరిణతము, సుసంస్కృతము చేసే అవకాశము కర్మయోగికి అధికంగా ఉంటుంది. ఈ రకమగు సూక్ష్మ సంస్కారమునకు ఆవశ్యకమైన జీవనక్షేత్రము సన్న్యాసికి లభ్యము కాదు. ఈ రెండు నిష్ఠల మధ్య గల ప్రధానభేదము ఇదియే. ఇందువలననే, కేవల కర్మత్యాగము కంటె కర్మయోగమే మేలని శ్రీకృష్ణుడు చెప్పెను.

సాంఖ్యము, సన్న్యాసము సమానార్థకములు

ఈ శ్లోకములో శ్రీకృష్ణుడు 'సన్న్యాసము' అనుటకు బదులుగా, 'సాంఖ్యము' అను పదమును ఏల ఉపయోగించెను? 'నాకు మోక్షము నిచ్చునది ఏది? సన్న్యాసమా? కర్మయోగమా?' అని అర్జునుడు అధ్యాయారంభములో ప్రశ్నించియున్నాడు. సన్న్యాస, కర్మయోగములు రెండింటికీ మోక్షమే ఫలమని శ్రీకృష్ణుడు రెండవ శ్లోకములో ఉత్తరమునిచ్చెను. తరువాత, ఏ వస్తువు కొరకైననూ రాగము గాని, ద్వేషము గాని లేని వ్యక్తి మాత్రమే సన్న్యాసి యనబడునని మూడవ శ్లోకములో చెప్పెను.

కాని, ఇచట నాల్గవశ్లోకములో శ్రీకృష్ణుడు సన్న్యాస శబ్దమునకు బదులుగా సాంఖ్యశబ్దమును ప్రయోగించెను. అనగా, శ్రీకృష్ణుని దృష్టిలో సాంఖ్య సన్న్యాస శబ్దములు సమానార్థకములు. సాంఖ్యము అనగా వేదాంతముల చేత చక్కగా ప్రదర్శింపబడినది అనగా జ్ఞానము అని యర్థము. దీనికే బ్రహ్మ జ్ఞానము అనియూ పేరు. ఇది ఆత్మకు, బ్రహ్మమునకు గల అభేదము యొక్క జ్ఞానము. శాస్త్రము నిరూపించే జ్ఞానము ఇదియే. కావున, సాంఖ్యము అనగా బ్రహ్మజ్ఞానము. సన్న్యాస పదమునకు కూడ ముఖ్యార్థము బ్రహ్మజ్ఞానమే.

సన్న్యాస, కర్మయోగములలో మేలైనది ఏదియో తెలుసుకోవాలని అర్జునుని ఆకాంక్ష. శ్రీకృష్ణుడు సాంఖ్య, యోగముల గురించి వివరించ మొదలిడెను. శ్రీ శంకరులు ఈ శ్లోకభాష్యములో, శ్రీకృష్ణుడు క్రొత్త విషయములను ఉపదేశించుట లేదని వివరించిరి. పైగా, శ్రీకృష్ణుడు సాంఖ్యపదమును ఇంతకు ముందు మూడవ అధ్యాయములో వాడి యున్నాడు. అచట రెండు జీవననిష్ఠలను వర్ణిస్తూ, భగవానుడు సన్న్యాసి పాటించే జ్ఞానాన్వేషణా ప్రధానమగు నిష్ఠను సాంఖ్యశబ్దముచే నిర్దేశించెను. ప్రకృత శ్లోకములో భగవానుడు అదే పదమును మరల ప్రయోగించెను. దీనికి ముందున్న రెండు శ్లోకములలో సన్న్యాస శబ్దమును ప్రయోగించి, భగవానుడు ప్రకరణమును కూడ నిస్సంశయముగా మనముందు ఉంచెను. కావున, సాంఖ్య, సన్న్యాస శబ్దములు ఇచట సమానార్థకములు. పైగా, 'సాంఖ్య' అనుపదములో 'సన్న్యాస' అను పదము కంటె ఒక అక్షరము తక్కువగా నుండుటచే, ఈ శ్లోకములోని ఛందస్సునకు సరిపడినది.

శ్రీకృష్ణుడు సాంఖ్యపదమును ఉపయోగించి చెప్పిన ఈ వాక్యమునకు తాత్పర్యమేమనగా, సాధకుడు కర్మయోగి కావచ్చును; లేదా సన్న్యాసి కావచ్చును. కాని, మోక్షము జ్ఞానము వలన మాత్రమే లభించును. కావున, కర్మయోగి, సన్న్యాసి వీరిద్దరూ జ్ఞానసాధనను చేయవలసి యున్నది. కేవల సన్న్యాసము వలన గాని, లేక కర్మయోగిగా ఉన్న కారణంగా గాని బంధవిముక్తి కలుగదు. జ్ఞానము వలన మాత్రమే బంధ విముక్తి కలుగును.

జ్ఞానము విషయములో మన ఇష్టానిష్టముల ప్రసక్తి లేదు. జీవన నిష్ఠారూపములగు సన్న్యాస, కర్మయోగముల విషయంలో మనకు ఎన్నుకునే స్వేచ్ఛ గలదు. ఏ ఒక్కదానినైననూ సక్రమముగా ఆచరించవలెను. రెండింటికీ ఫలము ఒక్కటియే అని చెప్పుటలో శ్రీకృష్ణుని తాత్పర్యమిదియే.

తరువాతి శ్లోకములో శ్రీకృష్ణుడు, సన్న్యాసులు, కర్మయోగులు ఒకే ఫలమును సాధించే విధమును వివరించుచున్నాడు:

అధ్యాయము 5, శ్లోకము 5:

यत्सांख्यैः प्राप्यते स्थानं तद्योगैरपि गम्यते ।
एकं सांख्यं च योगं च यः पश्यति स पश्यति ॥ ५ ॥

యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే
ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి (5)

సాంఖ్యైః = సన్న్యాసులచే; **యత్** = ఏ; **స్థానం** = గమ్యము (మోక్షము); **ప్రాప్యతే** = పొందబడుచున్నదో; **తత్** = అది; **యోగైః** = కర్మయోగులచేత; **అపి** = కూడా; **గమ్యతే** = పొందబడుచున్నది; **యః** = ఎవరైతే; **సాంఖ్యం** = జ్ఞానమును; **చ** = మరియు; **యోగం చ** = కర్మయోగమును కూడ; **ఏకం** = ఒక్కటిగా; **పశ్యతి** = చూచునో; **సః** = అతడే; **పశ్యతి** = చూచుచున్నాడు.

> సన్న్యాసులచే ఏ గమ్యము (మోక్షము) పొందబడుచున్నదో, అది కర్మయోగుల చేత కూడా పొందబడును. ఎవరైతే జ్ఞానమును, కర్మయోగమును ఒక్కటిగా చూచునో, అట్టివాడే యథార్థమగు దర్శనము గలవాడగును (5).

సన్న్యాసులకు లభించే జ్ఞానరూపమగు మోక్షమునకు, కర్మయోగులు కాలక్రమములో పొందే మోక్షమునకు భేదము లేదు. కర్మయోగులు ముందుగా అంతఃకరణ శుద్ధిని, తదనంతరము జ్ఞానమును పొందెదరు. 'స్థానం' అనగా లక్ష్యము అని యర్థము. ప్రకృతంలో సన్న్యాసులకు, కర్మయోగులకు కూడ జ్ఞానరూపమగు మోక్షమే లక్ష్యముగా నుండును.

'పొందబడుచున్నది (ప్రాప్యతే)', 'చేరుకొనబడుచున్నది (గమ్యతే)' అను పదముల ప్రయోగము వలన, సన్న్యాసికి కర్మయోగికి మధ్య మానసిక సంసిద్ధత యొక్క శ్రేణిలో గల స్వల్పభేదము సూచితమగుచున్నది. సన్న్యాసిచే పొందబడే (ప్రాప్యతే) మోక్షమును, కర్మయోగి కాలక్రమములో కర్మయోగ నిష్ఠచే మనస్సు యోగ్యముగా తీర్చిదిద్దబడిన తరువాత పొందును. వీరిద్దరి మధ్య గల తేడా ఇంత మాత్రమే.

కర్మయోగి కర్మయోగ జీవనమును గడుపుతూ, తరువాత సన్న్యాసియై, లేదా కర్మయోగిగా ఉంటూనే జ్ఞానమును పొందుతాడు. అతడు ఈ రెండు పద్ధతుల ద్వారా జ్ఞానమును పొందుతాడు.

అతడు జ్ఞానము ఉదయించిన తరువాత సన్న్యాసి కావచ్చును. లేదా, జనక మహారాజా వలె కర్మయోగి గనే ఉండవచ్చును.

దీనిని స్పష్టముగా యెరింగినవాడు పండితుడు. శాస్త్రమును చదివినా, స్పష్టమైన అవగాహన లేనివారు బాలురు . ఒకడు కర్మయోగము కంటె కర్మత్యాగము మేలని తలచి, కర్మలను విడిచి పెడతాడు. మరొకడు సన్న్యాసము కంటె కర్మయోగమే మేలని తలచి, కర్మల నాచరిస్తాడు. ఈ రకంగా, రెండు వర్గాల ధోరణులు మనకు కనబడతాయి. కర్మలను విడుమట యందు ఒకరికి ఆగ్రహమైతే, మరియొకరు 'కర్మలను చేసి తీరాలి' అని నొక్కి చెప్తారు. వాస్తవంలో, వీరిద్దరూ తెలియని వారే.

కొందరు గీతను తమదైన బాణీలో విశ్లేషించి, గీతాశాస్త్రమునకు తాత్పర్యము కర్మయందు మాత్రమే అని నిరూపించుటకు యత్నించినారు. కర్మాచరణము వలన మాత్రమే మోక్షము లభించుననియు, గీతలో సన్న్యాసము యొక్క ప్రసక్తియే లేదనియు వీరు వాదిస్తారు. ఇది సరిగాదు. ఇట్టి అసంగత వాదములు ఇతరులకు కూడ సమస్యలను సృష్టిస్తాయి. ఈ జగత్తులో రెండు జీవన నిష్ఠలు గలవని శ్రీకృష్ణుడు సుస్పష్టముగా చెప్పియున్నాడు (3.3). ఇట్టి స్థితిలో, 'కర్మ మాత్రమే మోక్షము నిచ్చునని గీత బోధించుచున్నది' అను వ్యాఖ్యానము సంగతము కాదు. కాని, ఈ వ్యాఖ్యాతలు గీతను చదువుటకు ముందే కొన్ని దృఢమైన నిష్కర్షలను చేసుకొని, ఆపై గీతను తప్పుగా వ్యాఖ్యానిస్తారు. కావున, మనమీ వ్యాఖ్యానములను గుడ్డిగా నమ్మరాదు. వాటిని విశ్లేషించి, సత్యాసత్యములను నిర్ణయించాలి. అంటే, గీతను పరిశీలించి, భగవానుని వచనములను యథాతథముగా అర్థంచేసుకోవాలి.

ముందుగనే ఒక నిర్ణయానికి వచ్చి, ఆపై ఆ నిర్ణయమును సమర్థించుకొనుటకు గీతను ఆసరాగా తీసుకునే ప్రయత్నము ప్రమాణ విచారము అనిపించుకోదు. అట్టి ప్రయత్నములు ఆయా వ్యక్తుల స్వీయవాదములుగ మాత్రమే నుండును. గీతలోని వాక్యములను యథాతథముగా తెలునుకునే ప్రయత్నమే ప్రమాణ విచారము అగును. ఈ విచారములో వ్యక్తి యొక్క బుద్ధి వస్తునిష్ఠమై (objective) ఉండవలెను. 'నాకు గీత యందు శ్రద్ధ గలదు; దానిలోని ఉపదేశమును నేను తెలియగోరుచున్నాను'. ఈ దృష్టితో చేసే విచారమే ప్రమాణ విచారమనబడును.

సన్న్యాసము కనబడునంత సరళము కాదు

సన్న్యాస, కర్మయోగములు ఒక్కటియే నని దర్శించగలవాడే యథార్థమైన జ్ఞాని యని శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పినాడు. అనగా, ఈ రెండు నిష్ఠలు సమమైనవి. కావున, నేను సన్న్యాసమును

తీసుకుంటాను. సన్న్యాసము కర్మ కంటె తేలిక. కర్మయోగములో నేను అనుష్ఠించవలసిన విధులు అనేకము గలవు. కాని, సన్న్యాసములో ఈ సమస్య లేమీ లేవని తోచుచున్నది. కర్మయోగములో నేను పెందలకడనే నిద్రలేచి, స్నానమాడి, ప్రార్థనలను చేస్తూ వేదోక్త కర్మల ననుష్ఠించాలి. కర్మయోగ జీవనములో ఆచరించవలసిన విధులు అసంఖ్యాకముగా నున్నవి. అర్జునుని విషయంలో నైతే, శత్రువులను సంహరించుటయూ కర్మయోగములో భాగమయ్యెను! దీనికంటె సన్న్యాసము నిశ్చయముగా సరళముగ నుండగలదు. సన్న్యాసములో ఆచరించవలసిన విధులు ఉండవు గాన, సమస్యలు ఉండవు!.

అర్జునుడు పైన చెప్పిన విధముగా తలపోసి యుండవచ్చును. కావున, తగిన మానసిక సంసిద్ధత లేనిదే జ్ఞానము లభ్యము కాదనియు, ఇట్టి సంసిద్ధత కర్మయోగ జీవనములో లభించుననియు, శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములో చెప్పుచున్నాడు:

అధ్యాయము 5, శ్లోకము 6:

सन्न्यासस्तु महाबाहो दुःखमाप्तुमयोगतः ।
योगयुक्तो मुनिर्ब्रह्म न चिरेणाधिगच्छति ॥ ६ ॥

సన్న్యాసస్తు మహా బాహో దుఃఖమాప్తుమయోగతః
యోగయుక్తో మునిర్బ్రహ్మ న చిరేణాధిగచ్ఛతి (6)

మహాబాహో = గొప్ప బాహువులు గల ఓ అర్జునా!; అయోగతః = కర్మయోగము లేకుండగా; సన్న్యాసః = కర్మత్యాగము; ఆప్తుం = పొందుటకు; దుఃఖం = కష్టము; తు = దానికి భిన్నముగా; యోగయుక్తః = కర్మయోగ జీవనమునకు అంకితమైన; మునిః = మననశీలుడు; న చిరేణ = విలంబము లేకుండగనే (శీఘ్రముగా); బ్రహ్మ = బ్రహ్మమును; అధిగచ్ఛతి = పొందును.

> గొప్ప బాహువులు గల ఓ అర్జునా! కర్మయోగము లేకుండగా కర్మత్యాగమును పొందుట కష్టము. ఏ తద్భిన్నముగా, కర్మయోగ జీవితమునకు అంకితమై, మనన శీలుడగు వ్యక్తి శీఘ్రముగా పరబ్రహ్మను పొందును (6).

సన్న్యాస, కర్మయోగములు రెండూ జ్ఞానసాధనములే. కాని, యోగము లేకుండగా, జ్ఞానము లభించకపోవుట మాత్రమే గాక, సన్న్యాసజీవనము కూడ దుష్కరమగును. శ్రీకృష్ణుడు అర్జునునకు ఈ శ్లోకములో ఈ విషయమునే చెప్పుచుండెను.

'సన్న్యాసము' అనగా జ్ఞానము అని కూడ అర్థము గలదు. అంతఃకరణశుద్ధికి అత్యావశ్యకమగు కర్మయోగము లేనిదే, సన్న్యాసము (జ్ఞానము) లభించుట నిశ్చయముగా దుస్సాధ్యము. అంతఃకరణ శుద్ధి లేనిదే జ్ఞానము లేదు. అంతఃకరణశుద్ధి లేనిదే, సన్న్యాస జీవనము కూడ అసంభవమగును. కావున, విశిష్ట జీవన నిష్ఠారూపమగు సన్న్యాసము, జ్ఞానరూపమగు సన్న్యాసము కూడ కర్మయోగ సాధ్యములే.

కర్మయోగ జీవననిష్ఠ మిక్కిలి అవశ్యకము

సాధకుడు సన్న్యాసమును స్వీకరించినా, స్వీకరించకపోయినా, కర్మయోగిగా బ్రతికినచో, సన్న్యాసికి ఉండే కొన్ని విశిష్ట లక్షణములు అతనికి లభ్యును. కాని, రాగద్వేష వశవర్తి యగు వ్యక్తికి సన్న్యాస జీవనము దుర్భరమగును. కొందరు జీవితములో రాగద్వేషములు పరిపూర్తి కాకపోవుటచే, నిర్వేదమును పొంది, ఆ కారణంగా సన్న్యాసమును స్వీకరిస్తారు. ఇట్టివారు రాగద్వేష ప్రేరితులై ఉంటారు గాన, వారికి సన్న్యాసములో కూడ ఆశాభంగము కొనసాగును. రాగద్వేషములు నివృత్తి కానిచో, సన్న్యాసి తన మనస్సును నియంత్రించుటలో క్లేశమును పొందును. గురుశుశ్రూషకు తోడు ఈ మనో నియంత్రణ అట్టివానికి మహాక్లేశమును కలిగించును. కావున, ఈ రెండు జీవన విధానములు రాగద్వేషముల దృష్ట్యా మాత్రమే ఈశ్వరునిచే నిర్ణీతమై యున్నవి. వీటిలో ఒకదానిని ఎన్నుకునే స్వేచ్ఛ మనకు గలదు. కాని, జ్ఞానము విషయములో ఇట్టి వికల్పములకు తావు లేదు.

ఒక వ్యక్తి మనస్సులో తీవ్రమగు రాగద్వేషములు కలిగి, ఆచార్యుని వద్దకు వెళ్లెననుకొనుడు. అతడు భాగ్యవంతుడై, ఆచార్యుడు విద్యాంసుడైనచో, రాగద్వేషములను నిష్ప్రభావితము చేసుకొనుటలో ఆచార్యుడాతనికి సహకరించును. ఆచార్యుని సేవిస్తూ, ఆయన ఆదేశాలను పాటిస్తూ ఉంటే, అంతఃకరణశుద్ధి లభిస్తుంది. కావున, కర్మయోగము లేకుండా, సన్న్యాసము సిద్ధించుట కష్టముతో కూడిన పని యని శ్రీకృష్ణుడిచట స్పష్టము చేసెను. అట్టి సన్న్యాసము అసంభవమని శ్రీకృష్ణుడు చెప్పుట లేదు. కర్మయోగము వలన లభించే సంసిద్ధత లేకుండగా, దానిలో సిద్ధిని పొందుట (దుఃఖం ఆప్తుమ్) కష్టము అని మాత్రమే శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు.

'సన్న్యాసమును తీసుకోవాలి' అని నిర్ణయించుకొని, వ్యక్తి సన్న్యాసి కాలేడు. దానికి ముందు సాధకుడు కర్మయోగ జీవనమును గడిపి తీరాలి (యోగయుక్తః). ఇట్టి యోగముతో సంపన్నుడైన వ్యక్తి మాత్రమే వేదాంతోపదేశమును తెలుసుకొనగల్గుతాడు. ఇట్టి వ్యక్తిని 'మునిః (తెలుసుకొనగల్గినవాడు)' అంటారు. ఇట్టి ముని బ్రహ్మమును పొందును (మునిః బ్రహ్మ అధిగచ్ఛతి).

సన్న్యసము అనగా బ్రహ్మము

న్యాసము అనగా త్యాగము. సన్న్యసమనగా సమగ్రమైన త్యాగము; పరిణతి (maturity) తో కూడిన త్యాగము. 'సన్న్యసము', 'సాంఖ్యము', 'బ్రహ్మన్' శబ్దములు సమానార్థకములు. బ్రహ్మజ్ఞానమునకు కూడ 'సాంఖ్యము', 'సన్న్యసము' అనుపేర్లు గలవు. యోగసంపన్నుడు (యోగయుక్తః) అగు ముని బ్రహ్మజ్ఞానమును, సన్న్యస శబ్ద వాచ్యమగు బ్రహ్మను పొందును.

'అధిగచ్ఛతి' అనగా 'పొందును' లేక 'చేరును' అని యర్థము. ఇట్టి సాధకుడు బ్రహ్మను ఎప్పుడు పొందును? న చిరేణ, అనగా ఆలస్యము లేకుండగనే పొందును. కర్మయోగము వలన లభించిన పరిణతి గల సాధకుడు శీఘ్రముగా బ్రహ్మమును పొందును. ఈ విషయమును తరువాతి శ్లోకము వివరించుచున్నది:

అధ్యాయము 5, శ్లోకము 7:

योगयुक्तो विशुद्धात्मा विजितात्मा जितेन्द्रियः ।
सर्वभूतात्म भूतात्मा कुर्वन्नपि न लप्यिते ॥ ७ ॥

యోగ యుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియః
సర్వభూతాత్మ భూతాత్మా కుర్వన్నపి న లిప్యతే (7)

యోగ-యుక్తః = కర్మయోగ జీవనమునకు అంకితమైనవాడు; **విశుద్ధ-ఆత్మా** = పరిశుద్ధమైన అంతఃకరణము గలవాడు; **విజితాత్మా** = కర్మేంద్రియములను (స్థూలదేహమును) నియంత్రించువాడు; **జితేంద్రియః** = జ్ఞానేంద్రియములను జయించినవాడు; **సర్వభూతాత్మ భూతాత్మా** = సర్వభూతములలోని ఆత్మను తన ఆత్మగా దర్శించువాడు; **కుర్వన్ అపి** = కర్మలను చేసినను; **న లిప్యతే** = లేపమును పొందడు.

> కర్మయోగ జీవితమునకు అంకితమైనట్టియు, పరిశుద్ధమైన అంతఃకరణము కల్గినట్టియు, స్థూలదేహము (కర్మేంద్రియముల) ను నియంత్రించినట్టియు, జ్ఞానేంద్రియములను జయించినట్టియు, సర్వప్రాణులలోని ఆత్మను తన ఆత్మగా దర్శించు జ్ఞాని కర్మలను ఆచరించుచున్నను లేపమును పొందడు (7).

శ్రీకృష్ణుడీ శ్లోకములో అర్జునునకు ఈ జ్ఞానమును పొందు ఉపాయమును విస్తరముగా వివరించి, 'న చిరేణ' అను పదమును కూడ వ్యాఖ్యానించెను. తగినంత మానసిక సంసిద్ధత లభించుటకు కొంత సమయము పట్టును. ఇట్టి సంసిద్ధత కర్మయోగ జీవనము వలన లభించును. ఇట్టి పరిణతి లభించిన తరువాత, జ్ఞానము లభించుటలో ఎక్కువ సమయము పట్టదు (నచిరేణ అధిగచ్ఛతి).

ఈ శ్లోకములో ఒక సహజక్రమము ప్రస్తుతింపబడినది. కర్మయోగ అను శాసనము గల వ్యక్తిని వర్ణిస్తూ శ్రీకృష్ణుడు ఈ శ్లోకమును ఆరంభించెను. అట్టి వ్యక్తి కర్మయోగ ప్రభావము వలన విశుద్ధాత్ముడు (పరిశుద్ధమైన మనస్సు గలవాడు) అగును. ఇచట ఆత్మ యనగా మనస్సు. కావున, విశుద్ధాత్ముడనగా, రాగద్వేషముల వశవర్తి కాని మనస్సు గలవాడు అని యర్థము.

తరువాత, అట్టి వ్యక్తికి స్థూలదేహముపైన, అనగా, కర్మేంద్రియములపైన, మరియు జ్ఞానేంద్రియములపైన నియంత్రణ లభించును (విజితాత్మా). 'విజితాత్మా' అను సమాసపదములో 'ఆత్మా' అనగా కదిలే శక్తి గల దేహభాగము, అనగా కర్మేంద్రియములు అని యర్థము. స్థూలదేహములోని అవయవముల కదలికలు, వ్యాపారములు కూడా సమగ్రనిర్మాణమునకు అనురూపముగా ఉండాలి. కావున, కర్మయోగి తన జ్ఞానేంద్రియములను మాత్రమే గాక, కర్మేంద్రియములను కూడ నియంత్రణలో ఉంచుకొనును.

ఆత్మ ఒక్కటియే

మనస్సు రాగద్వేషములకు వశవర్తి కాకుండా శుద్ధముగా నున్నప్పుడు మాత్రమే కర్మేంద్రియములను నియంత్రించుట సంభవమగును. ఈ తీరున, ఈ శ్లోకములో ఒక సుందర సహజ క్రమము ప్రస్తుతింపబడినది. కర్మయోగ అను శాసనము వలన మనస్సు శుద్ధమగును. దానివలన దేహము, మనస్సు, ఇంద్రియములు నియంత్రణలోనికి వచ్చును. ఇట్టి వ్యక్తి సర్వప్రాణులలోని ఆత్మ తన ఆత్మయే అను సత్యమును దర్శించును. ఇట్టివాడు 'సర్వ-భూత-ఆత్మ-భూత-ఆత్మా' అనబడును. 'సర్వ' అనగా 'అన్ని'. 'భూత' అనగా ప్రాణులు. ఈ ప్రాణులు యేవి? బ్రహ్మగారి నుండి మొదలిడి, దోమ వరకు గల అన్ని ప్రాణులు. అనగా, అన్ని ప్రాణుల ఆత్మ ఒక్కటియే. ఆత్మలు అనేకములు, భిన్నములు కావు! ఆత్మ కంటె భిన్నముగా మరియొక వస్తువు ఏదియూ లేదు.

పూర్వము అతడు తన ఆత్మ ఇతర ఆత్మ లన్నిటికంటె భిన్నమని తలపోసెను. కాని, ఇపుడాతనికి తన ఆత్మయే సర్వప్రాణుల ఆత్మ యని తెలిసినది. అనగా, ఆత్మ ఏకము, అద్వయము. సర్వవస్తువులలోని సత్యమగు తత్త్వము ఆత్మయే. ఆత్మ కంటె భిన్నముగా భాసించే అనాత్మ మిథ్య.

ఆత్మ ఒక విశిష్ట ప్రక్రియ ద్వారా అద్వయముగా అగునని భావించరాదు. ఆత్మ అద్వయమనే సత్యము జ్ఞాన ప్రభావము వలన మాత్రమే ఆవిష్కృతమగును. మానవుడు జ్ఞానియై సర్వప్రాణులలో ఆత్మరూపముగా తానే ఉన్నాననే సత్యమును దర్శించును. ఇట్టి జ్ఞానము ఉదయించిన వ్యక్తి 'సర్వ-భూత-ఆత్మ-భూత-ఆత్మా' యనబడును. ఇట్టి జ్ఞాని కర్మల నాచరిస్తున్నట్లు కనబడినా, కర్తృత్వధారణా విముక్తుడు గనుక కర్మలను చేసినట్లు లెక్క కాదు. జ్ఞాని తన ప్రారబ్ధానుసారముగా లోకక్షేమము కొరకు గాని, లేక శరీరయాత్ర కొరకు గాని కర్మలను చేయును. కాని, ఆతడు కర్మఫలముచే లేశమైననూ సంపర్కమును పొందడు; ప్రభావితుడు గాడు (న లిప్యతే).

సర్వప్రాణుల ఆత్మయే తన ఆత్మయని ఎరింగిన వ్యక్తియందు కర్తృత్వభావన ఉండజాలదు. ఆత్మ సర్వవ్యాపకము గనుక, స్వయముగా క్రియలను ఆచరించదు. జ్ఞాని కర్మలను చేస్తున్నట్లు కనబడినా, ఆతనియందు కర్తృత్వధారణ లేదు గనుక, ఆ కర్మలచే ప్రభావితుడు గాడు. శ్రీకృష్ణుడీ విషయమును నాల్గవ అధ్యాయములో స్పష్టము చేసియుండెను. కర్మల యందు అకర్మను, అకర్మ యందు కర్మను దర్శించు వ్యక్తి మాత్రమే మానవులలో జ్ఞాని అనబడును. ఆతడు మాత్రమే సర్వకర్తవ్యములను నిర్వర్తించినవాడగును (4.18). సర్వభూతాత్మభూతుడగు జ్ఞానిచేత దర్శించబడు జ్ఞానము (సన్న్యాసము) ఇదియే.

సర్వప్రాణుల యందలి ఆత్మయే తన ఆత్మయని జ్ఞానోదయమునకు ముందు మానవునకు తెలియదు. ఈ జ్ఞానము కలుగుట తోడనే, అట్టి వ్యక్తి తాను ఆచరించే కర్మలచే ఎవ్విధంబుననైననూ కళంకితుడు గాడు; ప్రభావితుడు కాడు. అనగా, ఆతడు కర్మల నాచరిస్తూనే కర్మబంధము నుండి విముక్తుడై ఉండును.

ఇట్టి స్థితిలో, జ్ఞాని కర్మలను వీడుట అనే ప్రసక్తి యెక్కడిది? మనము కర్మలచే ప్రభావితమైనచో, వాటిని వీడుట అనే ప్రసక్తి కలుగును. ఆ పరిస్థితిలో మనము కర్మలను విడిచిపెట్టినా, కర్మలచే ప్రభావితులము అవుతూనే ఉంటాము. ఏలయన, కర్తవ్యకర్మను వీడిన వ్యక్తి చేయకూడని పనులను చేయనారంభించును. ఇందువలననే, యోగ్యమగు సంసిద్ధత గల వ్యక్తికి మాత్రమే సన్న్యాసజీవనము సముచితముగ నుండును; అట్లు గానిచో, అది దుష్కరమగును. కర్మలను ఆచరిస్తూ ఉన్న సమయంలో కూడా, ''నేను కర్తను గాను (కుర్వన్నపి న కరోతి)' అను దర్శనము గల వ్యక్తి, ఇట్టి జ్ఞానము ద్వారా కర్మలను వీడుటయే యథార్థమగు సన్న్యాసమగునని శ్రీకృష్ణుడు అర్జునునకు బోధించెను.

'కర్మలను చేస్తూనే, చేయకపోవుట' అనే ఈ దర్శనమును శ్రీకృష్ణుడు తరువాతి రెండు శ్లోకములలో వివరించుచున్నాడు:

అధ్యాయము 5, శ్లోకములు 8, 9:

नैव किञ्चित्करोमीति युक्तो मन्येत तत्त्ववित् ।
पश्यन् शृण्वन् स्पृशन् जिघ्रन्नश्नन् गच्छन् स्वपन् श्वसन् ॥ ८ ॥

प्रलपन् विसृजन् गृह्णन्नुन्मिषन्निमिषन्नपि ।
इन्द्रियाणीन्द्रियार्थेषु वर्तन्त इति धारयन् ॥ ९ ॥

నైవ కించిత్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్
పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ (8)

ప్రలపన్ విసృజన్ గృహ్ణన్నున్మిషన్ని మిషన్నపి
ఇంద్రియాణీంద్రి యార్థేషు వర్తంత ఇతి ధారయన్ (9)

యుక్తః = చిత్త సమాధానము గలవాడు; **తత్త్వవిత్** = సత్యసాక్షాత్కారము గలవాడు; **పశ్యన్** = చూచుచున్నవాడై; **శృణ్వన్** = వినుచున్నవాడై; **అశ్నన్** = తినుచున్నవాడై; **గచ్ఛన్** = నడచుచున్నవాడై; **స్వపన్** = నిద్రించుచున్నవాడై; **శ్వసన్** = గాలిని పీల్చుచున్నవాడై; **ప్రలపన్** = మాటలాడుచున్న వాడై; **ఉన్మిషన్** = కళ్లను తెరచుచున్నవాడై; **నిమిషన్** = కళ్లను మూయుచున్నవాడై; **అపి** = కూడా; **ఇంద్రియాణి** = ఇంద్రియములు; **ఇంద్రియార్థేషు** = విషయవస్తువుల యందు; **వర్తంతే** = ప్రవర్తిల్లుచున్నవి; **ఇతి** = అని; **ధారయన్** = తెలియుచున్నవాడై; **కించిత్** = ఏమియూ; **న ఏవ కరోమి** = నేను చేయుటయే లేదు; **ఇతి** = అని; **మన్యేత** = తలంచును.

చిత్త సమాధానము, సత్యసాక్షాత్కారము గల వ్యక్తి చూచుచున్ననూ, వినుచున్ననూ, స్పృశించుచున్ననూ, ఆఘ్రాణించుచున్ననూ, తినుచున్ననూ, నడచుచున్ననూ, నిద్రించుచున్ననూ, గాలిని పీల్చుచున్ననూ, మాటలాడుచున్ననూ, విసర్జించుచున్ననూ, పట్టుకొనుచున్ననూ, కళ్లను తెరచిననూ, మూసిననూ, ఇంద్రియములు తమ తమ విషయముల యందు ప్రవర్తిల్లుచున్నవి యని స్పష్టముగా తెలిసినవాడై, ''నేను ఏ పనినీ చేయుట లేదు'' అని తలంచును (8-9).

శ్రీకృష్ణుడీ రెండు శ్లోకములలో సర్వభూతాత్మ భూతాత్ముడగు వ్యక్తి యొక్క వర్ణనను కొనసాగించుచున్నాడు. ఇట్టి జ్ఞాని సర్వకర్మలను త్యజించి యుండునని భావించరాదు. అతడు కర్మలను చేస్తూనే ఉంటాడు. కాని, వాటిచే ఏ విధముగనూ ప్రభావితుడు కాడు. పూర్వశ్లోకములోని 'కుర్వన్' అను పదము వర్తమానకాలమును నిర్దేశించును. అనగా, సర్వభూతాత్మ భూతాత్ముడగు వ్యక్తి కర్మలను చేస్తూ ఉండే సమయంలో కూడా వాటిచే గాని, వాటి ఫలములచే గాని ప్రభావితుడు కాడని యర్థము.

కర్మలను చేసే వ్యక్తి వాటి ఫలముచే ప్రభావితుడు కాకపోవుట యెట్లు? మనకు ఇష్టము ఉన్నా, లేకపోయినా, కర్మసిద్ధాంత రీత్యా, మనము చేసిన కర్మయొక్క ఫలమును మనము అనుభవించక తప్పదు. శ్రీకృష్ణుని వచనముల తాత్పర్యము, ''ఈ జ్ఞానము గల వ్యక్తి కర్మఫలములచే ప్రభావితుడు కాడు'' అని యేనా? అవును. జ్ఞానికి ఆత్మయందు కర్తృత్వధారణ ఉండదు గాన, అతడు ఫలముచే ప్రభావితుడు కాడు. శ్రీకృష్ణుడీ విషయమును ఈ రెండు శ్లోకములలో అనేక దృష్టాంతముల ద్వారా వివరించుచున్నాడు: చూచుచున్నవాడై (పశ్యన్), వినుచున్నవాడై (శృణ్వన్), స్పృశించుచున్నవాడై (స్పృశన్), ఆఘ్రాణించుచున్నవాడై (జిఘ్రన్), తినుచున్నవాడై (అశ్నన్), నడుచుచున్నవాడై (గచ్ఛన్), నిద్రించుచున్నవాడై (స్వపన్), గాలిని పీల్చుచున్నవాడై (శ్వసన్), మాటలాడుచున్నవాడై (ప్రలపన్), విసర్జించుచున్నవాడై (విసృజన్), పట్టుకొనుచున్నవాడై (గృహ్ణన్), మరియు కళ్లుమూసుకున్నవాడై (నిమిషన్). ఈ విధంగా, పూర్వశ్లోకములోని 'కుర్వన్' అను పదము ఈ శ్లోకములో విస్తరింపబడినది.

మనము చేయు పనులలో కొన్ని సంకల్పితములు కాగా, మరికొన్ని అసంకల్పితములుగా ఉంటాయి. మరికొన్ని ఉభయాత్మకముగా ఉంటాయి. గాలిని పీల్చుట, కన్నులను తెరుచుట, మూయుట మొదలగునవి దీనికి దృష్టాంతము. ఈ శ్లోకములో సంకల్పిత చర్యలు, అసంకల్పిత చర్యలు కూడ నిర్దేశించబడినవి.

ప్రతి జ్ఞానేంద్రియమునకు, ప్రతి కర్మేంద్రియమునకు ఒక విశిష్ట కర్తవ్యము ఉండును. అవి అన్నీ మనకు ప్రత్యేక ప్రయోజనాలను సమకూరుస్తాయి. ఉదాహరణకు, కన్నులు చూస్తాయి; చెవులు వింటాయి; కాళ్లు నడుస్తాయి. ఇది తెలిసిన వ్యక్తిని ఈ శ్లోకము యుక్తుడు, తత్త్వవిత్ అని వర్ణించినది. తత్త్వవిత్ అనగా ఆత్మ యాథార్థ్యము నెరింగినవాడు. యుక్తుడు అనగా సమాహితుడు, అనగా జితేంద్రియుడు. ఈ తీరున, పూర్వశ్లోకములలో యోగయుక్తః, సర్వభూతాత్మ భూతాత్మా అని వర్ణింపబడిన జ్ఞాని యీ శ్లోకములో యుక్తః, తత్త్వ విత్ అని వర్ణింపబడినాడు.

సమాహిత చిత్తుడై, ఆత్మయాథార్థ్యము నెరింగిన జ్ఞాని 'ఆత్మరూపుడనగు నేను కర్మల నాచరించుట లేదు(నైవ కించిత్ కరోమి)' అని యెరుంగును. యుక్తుడు (ఇంద్రియములను వశము చేసుకున్నవాడు) కాని వాడు తత్త్వవిత్ కాజాలడు. కావున, ఈ శ్లోకములో జ్ఞాని యుక్తః, తత్త్వవిత్ అను రెండు విశేషణములచే వర్ణింపబడినాడు.

శ్రీకృష్ణ భగవానుడు ఈ శ్లోకములో ఆదేశమును విధించుట లేదు

'మన్యేత' (విధి లిఙ్) అను క్రియాపదమును బట్టి ఈ శ్లోకములో భగవానుడు అర్జునునకు ఆదేశమునిచ్చుచున్నాడని భావింపరాదు. 'నీవు నీ ఆత్మను కర్మల నాచరించని అకర్తగా దర్శించుము' అని శ్రీకృష్ణుడు ఆదేశించుట లేదు. యుక్తుడు, తత్త్వవిత్ అగు వ్యక్తి ఆత్మను కర్మల నాచరించే కర్త యని భ్రాంతి పడడు (న మన్యేత తత్త్వవిత్) అని మాత్రమే శ్రీకృష్ణుడు చెప్పుచుండెను. వాస్తవంలో, అట్టి వ్యక్తి, 'ఆత్మ రూపుడనగు నేను కర్తను కాను' అని యెరుంగును.

దీనికి కారణమేమి? అతడు కర్మలను వేటినీ చేయడా యేమి? కాదు. చూచుట, వినుట, స్పృశించుట మొదలగు కర్మలన్నిటినీ అతడు చేయుచున్నట్లు కనబడినా, జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు మాత్రమే తమ తమ వ్యాపారముల యందు నిమగ్నమగుచుండును (ఇంద్రియార్థేషు వర్తంతే) అని అతడెరుంగును. ఈ జ్ఞానము దృఢముగా గల వ్యక్తి ఈ కర్మలను చేస్తూ ఏమని భావిస్తాడు? ''నేను కర్మలను వేటినీ చేయుట లేదు (నైవ కించిత్ కరోమి)''.

అంటే, ఆత్మరూపుడనగు నేను అకర్తను. కర్మల నాచరించను. జ్ఞానికి తన యందు కర్తృత్వభావన ఉండదు. అనగా, ఆత్మ కర్తయని అతడు భావించడు. జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు మాత్రమే తమ తమ విధులను నిర్వర్తించుచున్నవనియూ, అంతకు మించి ఆత్మ యందు కర్తృత్వము లేదనియు తత్త్వవిత్ యెరుంగును.

హరిః ఓం తత్సత్.

శ్రీకృష్ణార్పణమస్తు.

తరువాతి శ్లోకములో కర్మయోగి యొక్క వర్ణన మరల కొనసాగుచున్నది:

అధ్యాయము 5, శ్లోకము 10:

ब्रह्मण्याधाय कर्माणि सङ्गं त्यक्त्वा करोति यः ।
लिप्यते न स पापेन पद्मपत्रमिवाम्भसा ॥ १० ॥

బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః
లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా (10)

యః = ఎవడైతే; **బ్రహ్మణి** = పరబ్రహ్మయందు; **ఆధాయ** = సమర్పించి, **సంగం** = ఆసక్తిని (మోహమును); **త్యక్త్వా** = విడిచి; **కర్మాణి** = కర్మలను; **కరోతి** = చేయునో; **సః** = ఆతడు; **పద్మపత్రం** = తామర ఆకు; **అంభసా ఇవ** = నీటితో వలె; **పాపేన** = పాపముచేత; **న లిప్యతే** = లేపమును పొందడు (ప్రభావితుడు గాడు).

ఎవడైతే కర్మలను పరమాత్మ యందు సమర్పించి, ఆసక్తిని వీడి చేయునో, ఆతడు నీటిచే తామరాకు వలె పాపముచే లేపమును పొందడు (ప్రభావితుడు గాడు) (10).

ఇచట 'కర్మాణి' అనగా వైదిక, లౌకిక కర్మలు అన్నియూ గ్రహింపబడును. ఈ కర్మల నాచరించదగిన విధమెట్టిది? కర్మఫలముల యందాసక్తిని వీడి (సంగం త్యక్త్వా), సర్వకర్మలను ఈశ్వరునకు సమర్పిస్తూ (బ్రహ్మణి ఆధాయ) ఆచరించాలి. ఈ వర్ణనను బట్టి ఇది కర్మయోగికి సంబంధించిన ప్రకరణమని స్పష్టమగుచున్నది.

కర్మయోగి తాను ఆచరించే కర్మలను భగవానునకు అర్పిస్తాడు అని చెప్పగానే, ఆసక్తిని వీడి ఆచరిస్తాడని (సంగం త్యక్త్వా) కూడా చెప్పినట్లే అవుతుంది. కర్మలను ఈశ్వరునకు అర్పించు విధమెట్టిది? నేను నడుస్తున్నాను; మాటలాడుతున్నాను; చూస్తున్నాను; వింటున్నాను; అనేక పనులను చేస్తున్నాను. ఈ పనులన్నిటిని నేను ఈశ్వరునకు అర్పించుట యెట్లు? 'ఈశ్వరుని చరణముల యందు పుష్పములను, లేక ఫలమును అర్పించాలి' అంటే నాకు వెంటనే అర్థమవుతుంది. కాని, ఈ కర్మలనన్నిటిని సమర్పించుట యెట్లు? నేను వంటను చేయునప్పుడు, నేలను ఊడిచే సమయంలో, లేదా గిన్నెలను తోమే సమయంలో, ఆయా కర్మలు ఈశ్వరునకు సమర్పణ ఎట్లు కాగలవు?

మనము చేయు కర్మలు సమర్పణ అగుట యెట్లు?

మనము చేయు కర్మలు సమర్పణ అగు విధమును మనము ఇంతకు ముందు చూచియున్నాము.* కర్మయోగము, ధర్మము తెలియుటకు ఇది చాల ప్రముఖమైన అంశము. ధర్మము సామాన్య ధర్మము, విశేషధర్మము అని రెండు విధములుగా నున్నది. ఇతరులను హింసించకుండుట, చోరీ చేయకుండుట, ఇతరులు నాకు చేయరాదని నేను కోరే కృత్యములను నేను ఇతరుల యెడ ఆచరించకుండుట ఇత్యాది విశ్వజనీన మూల్యములను సామాన్యధర్మము అనుపదము నిర్దేశిస్తుంది.

రెండవది యగు విశేషధర్మము సామాన్యధర్మము నుండి పుట్టినదియే. ఒక విశిష్ట పరిస్థితిలో ఒక విశిష్టమగు భూమికను నిర్వహించే వ్యక్తి చేయదగిన కర్మకు విశేష ధర్మము అని పేరు. జీవితములోని భూమిక లన్నింటికీ వాటి వాటి కర్తవ్యములు ఉంటాయి. ఈ కర్తవ్యములే విశేషధర్మములు. ఈ విశేష ధర్మములను సామాన్యధర్మము నియంత్రించును. ఈ సామాన్య విశేషధర్మమే ఈశ్వరుడు. ఈశ్వరుడు ధర్మరూపుడు అనే దర్శనము గల వ్యక్తి విషయంలో మాత్రమే స్వకర్మలను ఈశ్వరునికి అర్పించుట అనే మానసిక భావన (attitude) ఉంటుంది; అది సాధ్యపడుతుంది. అట్లు గాని యెడల, కర్తవ్య నిర్వహణమును ఈశ్వరుని ఆదేశముగా భావించి, ఆచరించాలి. కావున, వ్యక్తి స్వధర్మమును ఈశ్వరాజ్ఞగా భావించి పాటింపవచ్చును; లేదా, స్వధర్మమును ఈశ్వరరూపముగా దర్శించి, ఆచరించవచ్చును. గీతలో ధర్మము ఈశ్వరరూపముగా ప్రతిపాదింపబడినది.

ఈశ్వరుడు, ధర్మము వేర్వేరు కాదు. జగత్తు అంతా ఈశ్వరునిచే వ్యాప్తమై యున్నది (యేన సర్వమిదం తతమ్, 18.46). మనమీ విషయమును పదునెనిమిదవ అధ్యాయములో చూచెదము. ఈ జగత్తునకు నిమిత్త కారణము ఈశ్వరుడు; ఉపాదాన కారణము కూడ ఈశ్వరుడే. కావున, సృష్టికర్త కంటె వేరుగా సృష్టి లేదు. ప్రాకృతిక నియమములు (natural order) అన్నీ ఈ సృష్టిలోని భాగమే. ప్రాకృతిక నియమములు ఒక వ్యక్తి సృష్టించినవి కావు. అవి విశ్వజనీన ధర్మములో భాగము.

ఒక వ్యక్తి నియమిత దేశములో, నియమిత కాలములో తనకు కర్తవ్యముగా సంప్రాప్తమైన కర్మ (స్వకర్మ)ను ఆచరించినచో, ఆ కర్మ ఈశ్వరపూజ యగునని శ్రీకృష్ణ భగవానుడు 18వ అధ్యాయములో చెప్పబోతాడు. స్వకర్మానుష్ఠానరూపమగు కర్మయోగ జీవనము వలన అంతఃకరణ శుద్ధి యేర్పడి, తదనంతరము జ్ఞానము ఉదయించును.

---

* అధ్యాయము 2, శ్లోకము 47.

ధర్మమే ఈశ్వరుడు

మనము 'ధర్మము' అనుకునేది ఈశ్వరుడేనని తెలుసుకోవాలి. ఇట్టి దర్శనమున్నచో, కర్మలు ఈశ్వరార్చన యగుట సంభవమగును. ధర్మము ఈశ్వరుని ఆదేశము అనే దృష్టికోణములో కూడా ఇబ్బంది లేదు. కాని, ఆదేశము అనగానే స్వామి–సేవక సంబంధము ఉండును. విశ్వాసపాత్రుడు, విధేయుడు అగు సేవకుడు స్వామి యొక్క ఆదేశమును, 'ఎందుకు?' అని ప్రశ్నించకుండగా, అనుష్ఠిస్తూ ఉండాలి. సేవకుడు తన సంకల్పశక్తిని యజమాని సంకల్పశక్తి (will)కి సమర్పించి వేయాలి. ఇదే విధముగా, వ్యక్తి తన సంకల్పశక్తిని ఈశ్వరునకు సమర్పించాలి. ఇది కూడా ఈశ్వరార్పణ బుద్ధియే.

కావున, మనము ధర్మమును ఈశ్వర రూపముగా గాని, ఈశ్వరుని ఆదేశముగా గాని స్వీకరించవచ్చును. ఈ రెండు పక్షములలోనూ, అట్టి ధారణ గల వ్యక్తి భక్తుడగును. ఈశ్వరుని ఆదేశము ధర్మము అని గాని, లేక ధర్మము ఈశ్వరుని రూపమే యని గాని ఎరింగిన వ్యక్తి భక్తుడనబడును. వీరే యథార్థమైన భక్తులు. వీరే కర్మయోగులు కాగల్గుతారు.

కర్మయోగి భక్తుడే. భక్తియోగము అని మనము అనుకునేది కర్మయోగమే. ఏలయన, భక్తుడు మాత్రమే ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలను చేయగల్గుతాడు. 'నేను ఈ కర్మను ఈశ్వరుని కొరకు (అనగా ఈశ్వరుని ఆదేశము గాన) చేయుచున్నాను' అను ధారణతో కర్మయోగి కర్మలనాచరించును. 'నేను ఈ పరిస్థితిలో నున్నాను. ఇది నాకు కర్తవ్యము. ఇది ఈశ్వరార్పణమగు గాక' అని కర్మయోగి తలంచును. కర్మయోగి యొక్క ఈ మానసిక భావన, స్వామికార్యములను నిర్వర్తించే సేవకుని భావన వంటిదని శ్రీశంకరులు ఈ శ్లోకభాష్యములో పోలికను చూపిరి.

ఈశ్వరార్పణ బుద్ధితో చేసే కర్మలను సంగమును వీడి (సంగం త్యక్త్వా) చేయాలని కూడా ఈ శ్లోకము బోధించుచున్నది. సంగము అనగా ఆసక్తి. అనగా రాగద్వేషములచే ప్రేరేపింపబడుట. 'త్యక్త్వా' అనగా విడిచిపెట్టుట. మనము రాగద్వేష ప్రేరితులమై, మన కొరకు కర్మలను చేస్తూ ఉంటాము. దానికి భిన్నంగా, రాగద్వేషములను విడనాడి, ధర్మభావనతో కర్మలను చేసినట్లైతే, ఆ కర్మలు ఈశ్వరుని కొరకై చేసినవి అవుతాయి.

ఈశ్వరుని కొరకై మనము చేయవలసిన పని మన రాగమునకు అనుకూలముగా నున్నప్పుడు, మరియు మనము చేయకూడని నిషిద్ధ కర్మ మన ద్వేషమునకు అనురూపముగా నున్నప్పుడు,

సమస్య ఏమియూ లేదు. ఇట్టి రాగద్వేషములు గల వ్యక్తి భక్తుడనబడును. అతని కర్మలు సహజసిద్ధము (spontaneous) గా ఉండును. రాగద్వేషములు ధర్మవిరుద్ధముగా నున్న సందర్భములలో ఘర్షణ తప్పదు.

కావున, కర్మయోగి ఏమి చేయును? కర్మయోగి తన రాగమునకు అనుకూలముగా ఉన్నా, లేకపోయినా, ధర్మమునకు అనురూపంగా జీవిస్తాడు. ఇట్లు జీవించే కర్మయోగి యొక్క కర్మలన్నియూ ఈశ్వరార్పణ మగును.

తరువాతి శ్లోకములో శ్రీకృష్ణుడు, కర్మయోగి అనుష్ఠించే వివిధ కర్మలను, వాటి ప్రయోజనమును వివరించెను:

అధ్యాయము 5, శ్లోకము 11:

कायेन मनसा बुद्ध्या केवलैरिन्द्रियैरपि ।
योगिनः कर्म कुर्वन्ति सङ्गं त्यक्त्वात्म शुद्धये ॥ ११ ॥

కాయేన మనసా బుద్ధ్యా కేవలైరింద్రియై రపి
యోగినః కర్మ కుర్వన్తి సంగం త్యక్త్వాత్మ శుద్ధయే (11)

యోగినః = కర్మయోగులు; సంగం = ఆ సంగమును (మోహమును); త్యక్త్వా = విడిచిపెట్టి; ఆత్మ శుద్ధయే = అంతఃకరణ విశుద్ధి కొరకు; కాయేన = దేహముతో; మనసా = మనస్సుతో; బుద్ధ్యా = బుద్ధితో; అపి = మరియు; కేవలైః = కేవలములగు (రాగ ద్వేష ప్రేరితములు కాని); ఇంద్రియైః = ఇంద్రియములతో; కర్మ = కర్మను; కుర్వన్తి = చేసెదరు.

> కర్మయోగులు మోహమును వీడి అంతఃకరణ విశుద్ధి కొరకై, దేహముతో, మనస్సుతో, బుద్ధితో, మరియు కేవలములగు (రాగద్వేష ప్రేరితములు కాని) ఇంద్రియములతో కర్మను చేసెదరు (11).

కర్మయోగులు ఏమి చేస్తారు, ఎల్లా చేస్తారు, ఎందుకు చేస్తారు అనే విషయాలను మనమీ శ్లోకంలో చూస్తాము. కర్మయోగి తన కరణములను, అనగా స్థూలదేహమును, మనస్సును, ఇంద్రియములను, మరియు బుద్ధిని వినియోగించి కర్మను ఆచరించును.

మానవులందరూ దేహమును, మనస్సును, ఇంద్రియములను, మరియు బుద్ధిని ఉపయోగించియే కర్మలను చేస్తారు గదా! కర్మయోగి ఈ విధముగా కర్మలను చేయునని చెప్పుటలో శ్రీకృష్ణుని తాత్పర్యమేమి? కర్మయోగి కూడా ఖచ్చితంగా ఇతరులు చేసినట్లే చేస్తాడు. కాని, ఒకే ఒక తేడా గలదు. కర్మయోగి ఆసక్తిని వీడి (సంగం త్యక్త్వా) చేస్తాడు. వివేకహీనుడు (అవివేకి), మరియు కర్మయోగి (వివేకి) ఒకే తీరులో కర్మల నాచరిస్తున్నట్లు అనిపిస్తుంది. కాని, వివేకి కర్మఫలముల యందాసక్తిని వీడి కర్మల నాచరించును.

ఆసక్తిని వీడుట యనగా నేమి? అను విషయమును మనము ఇదివరలో చూచియున్నాము. రాగద్వేషములచే నియంత్రితము కాని మనస్సుతో కర్మల నన్నిటిని ఈశ్వరునకు అర్పించాలి. ఇందువలననే, ఈ శ్లోకములో 'కేవలైః' అను విశేషణము ఉపయోగింపబడినది. 'కేవలైః' అనగా శుద్ధమైనవి, అనగా రాగద్వేషములు లేనివి అని యర్థము. ఇట్టి మానసిక ప్రవృత్తికి ఈశ్వరార్పణ బుద్ధి యని పేరు. యోగి ఈశ్వరార్పణ బుద్ధితో కర్మల నాచరించును. ఆసక్తిని వీడుట యనగా కర్మఫలములను ఈశ్వరుని అనుగ్రహము (ప్రసాదము) గా స్వీకరించుట అని కూడ అర్థము గలదు. ఈశ్వరుని స్వరూపమైన ధర్మమునకు అనురూపమగు కర్మలను మాత్రమే ఆచరించాలి. కర్మయోగి కర్మల నాచరించు విధమిట్టిది.

ఈ తీరున కర్మల నాచరించుట వలన కర్మయోగులకు లభించు ఫలమేమి? వారు కర్మలను అంతఃకరణ శుద్ధి కొరకు (ఆత్మశుద్ధయే) మాత్రమే చేస్తారు. వేరొక ఫలమును వారు అపేక్షించరు. అవివేకుల వలె వారు తమ అర్థకామముల కొరకు కర్మల నాచరించరు. వారికి, వీరికి గల భేదము ఇంత మాత్రమే.

కర్మయోగికి, జ్ఞానికి ఒక భేదము గలదు. జ్ఞాని యందు కర్తృత్వభావన ఉండదు. "నేను కర్మల నాచరించుట లేదు; నేను అకర్తృ ఆత్మరూపుడను" అని జ్ఞానికి తెలియును. అయా ఇంద్రియములు తమ తమ కర్మక్షేత్రములలో ప్రవర్తిల్లుచుండును. కర్మాచరణ మనగా నింతియే. కావున, జ్ఞానికి కర్తృత్వ భావన ఉండదు. కాని, కర్మయోగి యందు ఇట్టి కర్తృత్వభావన ఉండును. జ్ఞానికి, కర్మయోగికి గల భేదమిదియే. కర్మయోగికి యోగ్యమగు మానసిక భావన, ఈశ్వరార్పణ బుద్ధి, మరియు ఈశ్వరచింతన ఉండును. తన్మూలకంగా, అతడు అంతఃకరణ శుద్ధిని పొందును.

కర్మయోగులు కూడ సన్న్యాసుల వలె ముముక్షువులే. కావున, వారు కర్మలను మోక్షసాధనముగా అనుష్ఠిస్తారు. కాని, ముముక్షువులు కాని వారు ఫలాసక్తితో కర్మల నాచరిస్తారు.

జ్ఞానోదయమునకు యోగ్యముగా మనస్సును శుద్ధము చేయుటయే కర్మయోగము యొక్క ప్రధానలక్ష్యము. కాని, కర్మయోగము మోక్షమునకు సాక్షాత్సాధనము కాదు. కావుననే, కర్మయోగులు జ్ఞానోదయమునకు ఆవశ్యకమగు అంతఃకరణ శుద్ధి కొరకై కర్మల ననుష్ఠిస్తారని చెప్పబడెను.

శ్రీకృష్ణ డింకనూ ఇట్లు కొనసాగించెను:

అధ్యాయము 5, శ్లోకము 12:

युक्तः कर्मफलं त्यक्त्वा शान्तिमाप्नोति नैष्ठिकीम् ।
अयुक्तः कामकारेण फले सक्तो निबध्यते ॥ १२ ॥

యుక్తః కర్మఫలం త్యక్త్వా శాంతి మాప్నోతి నైష్ఠికీమ్
అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే (12).

యుక్తః = కర్మయోగముతో అనుగ్రహింపబడిన వ్యక్తి; **కర్మఫలం** = కర్మఫలమును; **త్యక్త్వా** = వీడి; **నైష్ఠికీమ్** = కర్మయోగ జీవనమునకు అంకితమగుట వలన పుట్టిన; **శాంతిం** = ప్రసన్నతను; **ఆప్నోతి** = పొందును; **అయుక్తః** = కర్మయోగ జీవనమునకు అంకితము కానివాడు; **కామకారేణ** = కామనా ప్రేరితుడగుటచే; **ఫలే** = ఫలమునందు; **సక్తః** = ఆసక్తి గలవాడై; **నిబధ్యతే** = బంధింపబడును.

> కర్మయోగముతో అనుగ్రహింపబడిన వ్యక్తి కర్మఫలమును వీడి, కర్మయోగ జీవనమునకు అంకితమగుట వలన పుట్టిన ప్రసన్నతను పొందును. కర్మయోగ జీవనమునకు అంకితము కానివాడు కామనా ప్రేరితుడగుటచే, ఫలము నందాసక్తి కలవాడై బంధింపబడును (12).

'అంతఃకరణ శుద్ధి' యను మాటను శ్రీకృష్ణ భగవానుడీ శ్లోకములో వివరించెను. ఈ శ్లోకములోని 'శాంతి' అను పదము అట్టి శుద్ధమగు మనస్సును నిర్దేశించును. మానవుని మనస్సు ఏ స్థాయి వరకు శుద్ధముగ నుండునో, అదే స్థాయి వరకు మాత్రమే అతనికి శాంతి లభించును.

కర్మయోగ జీవనమును గడుపుతూ ఉంటే, రాగద్వేషముల నుండి కొంతవరకు విముక్తి లభించి, ఈ శాంతి సంప్రాప్తమగును. ఏది లభిస్తే దానిని సంతోషంగా స్వీకరించే మానసిక ప్రవృత్తికి

ప్రసాదబుద్ధి యని పేరు. ఇంతకు ముందు జరిగిన దానిని, ఇపుడు జరుగుతున్న దానిని ఆనందంతో, ఉత్సాహంతో స్వీకరించాలి. అంటే, ఏది జరిగినా, దానిని వ్యక్తిగతంగా – అంటే, నాకు జరుగకూడనది జరిగినదనియో, లేదా నేనే దీనిని సాధించినాననియో – భావించరాదు. ప్రసాదబుద్ధి ఉన్న వ్యక్తికి మాత్రమే ఇట్టి మనస్స్థితి ఉండును.

కర్మయోగి తన గతంలో జరిగిన మంచిచెడ్డలకు బాధ్యతను ఆత్మయందు ఆరోపించుకొనడు. ఇక వర్తమానం విషయానికి వస్తే, అతడు ఏది సంప్రాప్తమైతే, దానిని ప్రసాదముగా స్వీకరిస్తాడు. అతడు రాగద్వేషములకు వశవర్తి కాడు.

ఈశ్వరరూపముగు ధర్మముతో సమరసత (Harmony)

రాగద్వేషములు మన కార్యకలాపములను నియంత్రిస్తూ ఉన్నంత వరకు, మనకు నిరాశ, క్రోధము ఇత్యాది సమస్యలు తప్పవు. రాగద్వేషములు బలముగా ఉన్నప్పుడు, ఇట్టి సమస్యలను పరిహరించుట అసంభవము. తద్భిన్నంగా, మనలో ఈశ్వరార్పణ బుద్ధి, ఈశ్వరుని యందలి భక్తి, లేక ధర్మము ఈశ్వర స్వరూపమే నను యెరుక ఉన్నచో, మనకు ఈశ్వరునితో సామరస్యము (harmony) ఏర్పడును. ఇందువలననే, మనము మంచి పనిని చేసిన సందర్భాలలో ఒక విశిష్టమైన మనః ప్రసన్నత అనుభవమునకు వచ్చును. ధర్మముతో ఘర్షణ లేనప్పుడు ఒక విలక్షణమగు సంతృప్తి యేర్పడును. ఏది ధర్మమో మనకు తెలియును. దానిని ఆచరించి, మనము ఈశ్వరునితో సామరస్యమును పొందుతాము. ఘర్షణ ఉండదు. ఇట్లు ఘర్షణ లేకపోవుటయే శాంతి. ఏతద్భిన్నంగా, మనము స్వీయరాగద్వేష పరిపూర్తి కొరకై ధర్మ విరుద్ధముగ నాచరించినచో, అశాంతి తప్పదు.

ధర్మము ఈశ్వరుని ఆదేశము అని గాని, లేదా ఈశ్వరుని స్వరూపము అని గాని భావించి, తదనుగుణముగా కర్మల నాచరించే కర్మయోగిని ఈ శ్లోకము 'యుక్తః' అని నిర్దేశిస్తుంది. ధర్మము ఈశ్వరుని ఆదేశము అనే పక్షంలో ఈశ్వరుడు స్వామి అవుతాడు. సాధకుడు సేవకుడవుతాడు. సాధకుడు ఇట్టి స్వస్వామి సంబంధమును ఈశ్వరుని యందు కలిగి ఉంటాడు. అట్టి సాధకుడు తాను ఉన్న పరిస్థితిలో తనకు కర్తవ్యముగా ప్రాప్తమైన కర్మను ఆచరిస్తూ పోతాడు. ఈ విధముగా ఈశ్వరునిచే నిర్మించబడిన ప్రాకృతిక సువ్యవస్థ (natural order) కు అనురూపముగా జీవించి, శాంతిని పొందును.

గీతలో ధర్మము ఈశ్వర స్వరూపముగా ప్రతిపాదించబడును. ఇట్టి దర్శనము (vision) గల సాధకుడు తన వంతును సమర్పించే యోగదాత (contributor) అగును. ప్రతి వ్యక్తికి చేతులు,

కాళ్ళు మొదలగు కర్మసాధనములు అనుగ్రహింపబడినవి. సాధకుడు వాటితో తన వంతు కర్తవ్యమును నిర్వర్తించును. సాధకుడు కేవల సాక్షి వలె ఉదాసీనముగ నుండడు. ఈ జగత్తు ఈశ్వర నియతి కంటె వేరు గాదు. సాధకుడు జగత్కార్యములో ఉత్సాహముగా పాలు పంచుకొనును. ఈ జగత్తు ఒక మహా యజ్ఞము. సాధకుడు తన కర్మను ఆ యజ్ఞములో ఒక సమిధగా అర్పించును. వ్యక్తి తన కర్తవ్యమును సకాలములో, ఉత్సాహముతో ఆచరించుటయే యోగదానము (contribution) అగును.

నేను ఇప్పుడు ఉన్న పరిస్థితిలో నాకు ఒక కర్తవ్యము గలదు. నేను దానిని స్వీయరాగద్వేష పరిపూర్తి కొరకు గాక, ఈశ్వరుని కొరకు ఆచరిస్తాను. ఇట్టి విశిష్ట మానసిక ప్రవృత్తి వలన నాకు శాంతి లభించును. నేను కర్మఫలములను త్యజిస్తాను. అనగా, కర్మఫలము ఏదైనా, నేను దానిని ఈశ్వర ప్రసాదముగా స్వీకరిస్తాను.

ఏది జరిగినా నాకంగీకారమే

సాధకుడు కర్మలను రాగద్వేష పరిపూర్తి కొరకై ఆచరించడు. కాన, అతనికి కర్మల యందు గాని, వాటి ఫలముల యందు గాని ఆసంగము (attachment) ఉండదు. 'ఇది ఇట్లు జరిగి తీరాలి; ఇది ఇట్లు జరుగరాదు' ఇత్యాది ఆగ్రహము కర్మయోగికి ఉండదు. అతడు ఇటువంటి మానసిక ఒత్తిడికి తనను తాను గురిచేసుకోడు. ఇట్టి మానసిక ఒత్తిడికి గురికాకుండుటయే మంచిది. ఏలయన, మనము ఇష్టపడే విధంగా జరుగకపోవుటకు, మనకు ఇష్టము కాని విధంగా జరుగుటకు అవకాశాలు మెండు. ఇట్టి విపరీత పరిణామాలను ఎదుర్కొను విధము ఒక్కటియే. 'ఏది జరిగినా నాకు అంగీకారమే' అను మానసిక ప్రవృత్తిని కలిగి ఉండాలి. అట్లు గానిచో, 'నేను విఫలుడనైతిని' అను భావన మనలను క్రుంగదీస్తుంది. ఏలయన, పరిస్థితులు మన నియంత్రణలో ఉండవు గనుక, మనము వచ్చినదానిని వచ్చినట్లు స్వీకరించి, మన కర్తవ్యమును నిర్వహించుటయే శ్రేష్ఠము.

'నేను కర్మలను ఈశ్వరుని కొరకు ఆచరిస్తాను' అని పలికే కర్మయోగి యొక్క మానసిక ప్రవృత్తి ఇదియే. ఇట్టి బుద్ధితో (బుద్ధ్యా), కర్మఫలములను త్యజించిన సాధకుడు శాంతిని పొందును (శాంతిం ఆప్నోతి). అంతఃకరణ శుద్ధి యనగా నిదియే. ఉన్నదానిని ఆనందంగా అంగీకరించుట వలన లభించే శాంతి అంతఃకరణశుద్ధి కంటె వేరు గాదు.

నీ గతము నీకు అంగీకారము కాకపోతే, బాధపడేది ఎవరు? ఇతరులకు నీ గతము అంగీకారము కావచ్చును; కాకపోవచ్చును. కాని, నీకు నీ గతము అంగీకారము అయితీరాలి.

ఏలయన, అంగీకారము కానిచో, బాధపడేది నీవే. కొందరికి ఇతరుల పాపములను క్షమించే ఔదార్యము ఉండదు. అట్టివారు నీ గతమును అంగీకరించకపోవచ్చును. కాని కనీసం నీవైనా నీ గతమును అంగీకరించాలి. నీ గతము ఎట్టిది యైననూ అగుగాక! దానిని నీవు ఆనందంగా అంగీకరిస్తే, నీకు శాంతి లభిస్తుంది.

కర్మయోగము ఒక నైపుణ్యము కాదు

ఈ శాంతిని పొందుటకు ప్రత్యేకమగు నైపుణ్యము ఏదియూ ఆవశ్యకము కాదు. నైపుణ్యము (technique) ఏదైనా కొంత కాలానికి నష్టమగును. కాన, ఈ శాంతి నైపుణ్యము వలన పుట్టేది అయితే, చాలా కాలము ఉండదు. నైపుణ్యము కొంత కాలానికి నీరసము, ప్రభావహీనము అగును; లేదా, వ్యక్తిలో ఉల్లేఖనీయమైన మార్పును కలిగించే శక్తి దానికి లేకపోవచ్చును. నైపుణ్యము ఉంటే ఉపయోగము ఉండును. కాని, నైపుణ్యము వ్యక్తిని మార్చలేదు. అశాంతిగా ఉండే వ్యక్తికి అశాంతియే మిగిలి ఉంటుంది. క్రోధము గల వ్యక్తికి క్రోధము కొనసాగుతుంది.

ఈ శ్లోకములో మనము చర్చించే శాంతి యొక్క కోవకు చెందిన శాంతి నైపుణ్యముల వలన లభించేది కూడా కాదు. ఏలయన, ఒక పరిస్థితి స్థిరంగా ఉండదు; మారిపోతుంది. లేదా, అదే పరిస్థితి కొనసాగినా, కొంత కాలానికి పేలవమైపోతుంది. ఏమైనా, శాంతి లభించదు. ఉదాహరణకు, నీవు సముద్రతటము (beach) నకు వెళ్లితివనుకో. నీకు ఆనందము కలుగును. అది కూడా ఒక రకంగా శాంతియే కావచ్చును. కాని, ఈ ఆనందము పూర్తిగా ఒక పరిస్థితిపై ఆధారపడినది. నీవు సముద్రతటమునందు సంచరించే జాలాయివి అయితే తప్ప, సముద్ర తీర విహారములో ఎంతకాలము ఆనందించగలవు? సముద్రతీరము నందు విహరించే జాలాయి యైననూ, ఫేనిల తరంగములు (Surf) లేకపోతే, ఆనందించలేడు.

అర్థశాస్త్రములో 'క్రమముగా ఉపయోగిత తగ్గిపోవుట (diminishing utility)' అను సూత్రమును ఆడమ్ స్మిత్ ప్రతిపాదించెను. ఇక్కడ ఉన్న పరిస్థితి కూడ అట్టిదియే. ఆకలి వేస్తూంటే, అన్నము చాల విలువైనది. కాని, ఆకలి లేనప్పుడు, దానికి అంత విలువ ఉండదు. అన్నము యొక్క ఉపయోగిత తగ్గగానే, మన దృష్టిలో దానికి గల విలువ కూడ తగ్గును. పరిస్థితి లభ్యమగు శాంతి కూడా ఈ సూత్రమునకు అధీనమై యుండును.

కర్మయోగము ప్రాణాయామాదుల వలె ఒక నైపుణ్యము కాదు. ప్రాణాయామము వలన మనకు ఒక విశిష్టమగు శాంతి లభించును. తద్ద్వారా సాధకుడు తన మనస్సును, తనను అర్థము

చేసుకోగల్గుతాడు. అది చాలా ఉపయోగకరమైన అనుశాసనము. కాని, మనము అన్నివేళలా ప్రాణాయామమును చేయలేము గదా! కావున, దాని వలన మనమిచట చర్చించే శాంతి లభించదు.

నైపుణ్యము, లేక అనుశాసనము ఒక విశిష్ట క్రియారూపమున నుండును. కాని, కర్మయోగము అట్లు కాదు. కర్మయోగమును అనుష్ఠించవలసిన పరిస్థితులు ప్రత్యేకంగా ఉండవు. కర్మయోగమే నీ జీవనము. నీవు కర్మయోగివి. భక్తుడవు. నీ భక్తి అప్పుడప్పుడు మాత్రమే వచ్చేది కాదు. అప్పుడప్పుడు వస్తూ, పోతూ ఉండేది భక్తి కాదు. ఈశ్వరుని యందు అచంచలమగు భక్తి గలవాడై, తనకు ఏది లభిస్తే దానిని స్వీకరించు వ్యక్తి ఈశ్వరార్పణ బుద్ధి గలవాడు అగును. అట్టివాడు కర్మలను ధర్మమునకు అనురూపముగా మాత్రమే ఆచరించును. ఇట్టి ఈశ్వరీయ జ్ఞానము మాత్రమే వ్యక్తిలో మార్పును తేగల్గును.

సాపేక్ష (relative) శాంతి, స్వరూపభూతమగు శాంతి

'నైష్ఠికీం శాంతిమ్' అనగా నిష్ఠవలన లభించే శాంతి. 'నిష్ఠా' అను పదమునకు మనము ఇచ్చే అర్థమును బట్టి, ఇది సాపేక్ష శాంతి గాని, పూర్ణశాంతి గాని కావచ్చును. 'నిష్ఠ' యనగా కర్మయోగ జీవనమునకు అంకితమగుట (యోగనిష్ఠ) కావచ్చును; లేదా, జ్ఞానమునందు స్థిరముగా నుండుట (జ్ఞాననిష్ఠ) కావచ్చును. యోగనిష్ఠ వలన కలిగే శాంతి సాపేక్షము; అనగా, జ్ఞానోదయమునకు సహకరించే ఒక విశిష్టస్థాయికి చెందిన శాంతి. ఇట్టి సాపేక్షమగు శాంతి వలన అంతఃకరణము శుద్ధమై, సాధకుడు జ్ఞాననిష్ఠను పొంది, తత్ప్రభావము వలన పరమశాంతి (పరాం శాంతిం)ని పొందును. కావున, దీనిలో ఒక క్రమము గలదు. ముందు యోగనిష్ఠా శాంతి. దాని తరువాత జ్ఞాన నిష్ఠా శాంతి.

శ్రీ శంకరులు ఈ శ్లోకభాష్యములో ఈ క్రమమును వివరించిరి. అంతఃకరణ శుద్ధి, లేక సత్త్వశుద్ధి వలన లభించే శాంతి మొదటిది. సత్త్వము, అంతఃకరణము అను పదములు మనస్సునకు పర్యాయములు. సత్త్వశుద్ధి కలిగిన వ్యక్తికి ఆత్మ సాక్షాత్కారము కలుగును (ఆత్మజ్ఞాన ప్రాప్తి). ఆత్మజ్ఞాని సర్వకర్మ సన్న్యాసి యగును. జ్ఞానికి ఆత్మ యందు కర్తృత్వభావన ఉండదు. వాస్తవంలో, జ్ఞానము చేత చేయబడే ఈ కర్మత్యాగమే జ్ఞాననిష్ఠ యనబడును. ఇట్టి ఆత్మజ్ఞానము గల వ్యక్తి స్వరూపశాంతిని పొందును.

నిష్ఠ ద్వివిధము. ఈ రెండు నిష్ఠలు శాంతికి మూలములే. ఒకటి జ్ఞానము వలన లభించే శాంతి కాగా, మరియొకటి కర్మయోగము నుండి పుట్టే శాంతి. సాపేక్ష ఆనందము, స్వరూప (ఆత్మ

యొక్క స్వరూపభూతమైన) ఆనందము అని ఆనందము ద్వివిధము. స్వరూప ఆనందము నా స్వభావము. అనగా, నేను సర్వపరిచ్ఛేదముల నుండి విముక్తుడను. నేను పూర్ణుడను. సర్వము నేనే. సాపేక్ష ఆనందము దీనికి భిన్నమైనది. అది అనుభవాత్మకము; చిత్తవృత్తిపై ఆధారపడియుండును. సాపేక్షశాంతి అంతఃకరణ శుద్ధి నుండి పుట్టును. జ్ఞానము స్వరూపభూతమగు శాంతిని ఇచ్చును.

కర్మయోగ జీవనము వలన లభించే సాపేక్ష శాంతికి, స్వరూపభూతమగు శాంతికి మధ్యలో ఉండే విశుద్ధాత్మా, విజితాత్మా ఇత్యాది వివిధస్థాయిలు గడచిన ఏడవ శ్లోకములో వర్ణింపబడినవి. ఆ శ్లోకములో జ్ఞాని 'సర్వభూతాత్మ భూతాత్మా' అని కూడా వర్ణింపబడినాడు. అనగా, సర్వప్రాణుల ఆత్మ తన ఆత్మయేనని యెరింగినవాడు అని యర్థము. సాపేక్ష శాంతి స్వరూపశాంతిగా మారాలంటే, ఈ యెరుక ఉదయించాలి.

కర్మయోగము వసుష్ఠించనిచో ఏమి యగును?

గీతలో విషయవస్తువు ముందు అన్వయ ముఖముగా ప్రతిపాదింపబడును. తరువాత అదే విషయము, నొక్కి చెప్పుట కొరకై, నిషేధ ముఖముగా ప్రతిపాదింపబడును. ఇట్టి సందర్భములలో ప్రస్తుత శ్లోకము ఒకటి. కర్మయోగ జీవనమునకు అంకితమైన సాధకునకు లభించే ప్రయోజనము ప్రథమార్ధములో ప్రదర్శింపబడినది. కర్మయోగము యొక్క మహత్త్వమును నొక్కి చెప్పుట కొరకై, ద్వితీయార్ధములో కర్మయోగ జీవనశైలిని పాటించని వ్యక్తికి కలిగే నష్టము చెప్పబడినది. కర్మయోగమును పాటించని వ్యక్తి ఈ శ్లోకములో 'అయుక్తః' అని నిర్దేశింపబడినాడు.

అయుక్తుడు కర్మలను చేసేది ఈశ్వరుని కొరకు కాదు; రాగద్వేషములకు లోబడి అతడు కర్మలను చేయును. అతని దృష్టిలో ప్రాకృతిక వ్యవస్థ (natural order)కు మహత్త్వమేమియూ ఉండదు. అతడు కర్మలను తన ఇష్టానిష్టముల పరిపూర్తి కొరకు ఆచరించును. అయుక్తుడు కర్మను స్వార్థము కొరకు మాత్రమే చేయును. అతడు బ్రహ్మాండములో వ్యాప్తమై యున్న దైవీ సమతౌల్యము (divine ecology)ను, వ్యవస్థను గుర్తింపజాలడు. జగత్తులో ఒక వ్యవస్థ, ధర్మము గలవను స్మరణకు కూడ ఇతడు బహుదూరమున నుండును. కావున, ఇతడు చేయు కర్మలన్నియూ కామనా పూర్తి కొరకై ఉద్దేశింపబడినవే. ఇతడు కామమునకు, అనగా రాగద్వేషములకు అంకితమై జీవించును. కావున, ఇతడు ఈశ్వరరూపమగు ధర్మమును త్రోసిపుచ్చి, కర్మఫలములకు అంకితమగును.

ఈ విధముగా మనకిచట రెండు విభిన్న పరిస్థితులు గోచరించును. ఒకడు తన రాగద్వేషముల పరిపూర్తి కొరకు కర్మల నాచరించును. మరియొకడు సమాజము కొరకు (లోక సంగ్రహార్థమ్), లేదా ఈశ్వరుని కొరకు కర్మలనాచరించును.

రాగద్వేషములకు లోబడిన వ్యక్తి మంచి, చెడు అను వివక్షణను ప్రక్కన పెట్టును. అయుక్తుడు కర్మకు, కర్మఫలములకు, పుణ్యపాపములకు బద్ధుడై యుండును. కావున, అతడు జనన మరణముల చక్రములో తిరుగాడుచుండును. భవిష్యత్తులోని జన్మల మాట అటుంచి, ఈ జన్మలోనే అతడు సుఖదుఃఖములకు బద్ధుడై, సుఖము నుండి దుఃఖమునకు, దుఃఖము నుండి సుఖమునకు బంతివలె విసరబడుచుండును. అతని మానసిక స్థితి వాయుమాపకము(Barometer) లోని పాదరసమట్టము వలె క్రిందికి, పైకి ఊగుచుండును. ఎందువలన? ఏలయనగా, అతని అహంకారము చాల పెద్దది; ఉబ్బియున్నది. అది ఒకప్పుడు ఉబ్బియుండును. మరియొకప్పుడు చిక్కిపోవును. కావుననే, శ్రీకృష్ణుడు అర్జునునితో నిట్లనెను: ''నీవు కర్మయోగివి కమ్ము. నీవు కర్మయోగివి కాగానే, శాంతిని, తద్ద్వారా జ్ఞాననిష్ఠను పొందగలవు''.

శ్రీ కృష్ణ భగవానుడీ జ్ఞాననిష్ఠను తరువాతి శ్లోకములో వివరించుచున్నాడు:

అధ్యాయము 5, శ్లోకము 13:

सर्वकर्माणि मनसा सन्न्यस्यास्ते सुखं वशी ।
नवद्वारे पुरे देही नैव कुर्वन्न कारयन् ॥ १३ ॥

సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ
నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్న కారయన్ (13)

వశీ = ఆత్మ నియంత్రణ కలిగి; దేహీ = దేహమునందు నివసించే వ్యక్తి; సర్వ కర్మాణి = కర్మలనన్నింటిని; మనసా = జ్ఞానము చేత; సన్న్యస్య = త్యజించి; నవ-ద్వారే = తొమ్మిది ద్వారములు గల; పురే = నగరము (దేహము) నందు; సుఖం ఏవ = సుఖముగా; న కుర్వన్ = కర్మలను చేయకుండగా; న కారయన్ = చేయించకుండగా; ఆస్తే = ఉండును.

ఆత్మ నియంత్రణ కలిగి దేహమునందు నివసించే జ్ఞాని కర్మలనన్నింటిని జ్ఞానముచే త్యజించి, తొమ్మిది ద్వారములు గల నగరము (దేహము) నందు సుఖముగా, కర్మలను చేయకుండగా, చేయించకుండగా ఉండును (13).

సర్వకర్మలను జ్ఞానముచే విడిచిపెట్టిన సన్న్యాసిని ప్రస్తుతించుట ద్వారా, ఈ శ్లోకములో జ్ఞాననిష్ఠ వర్ణింపబడెను.

సన్న్యాసము ద్వివిధము. ఒక దానిలో వ్యక్తి సంకల్పముచేసి, కర్మలను త్యజించి, సన్న్యాస జీవనమును స్వీకరించును. మరియొక దానిలో జ్ఞాని జ్ఞానముచే కర్మలను త్యజించును. ఈ శ్లోకములో జ్ఞానముచే కర్మలను త్యజించుట అనే రెండవరకము సన్న్యాసము వర్ణించబడినది.

జ్ఞానము మనస్సులో ఉదయించును. కావున, ఇచట జ్ఞానము అనే అర్థములో 'మనస్సు' అను పదము ప్రయోగింపబడినది. జ్ఞాని మనస్సులో కర్మలనన్నిటినీ త్యజించును. ఎట్లు? జ్ఞానముతో త్యజించును. కావున, 'మనసా' అంటే 'జ్ఞానేన (జ్ఞానముతో)' అని యర్థము. అనగా 'ఆత్మరూపుడనగు నేను కర్మలను చేయుట లేదు' అని జ్ఞాని యెరుంగును. ఈ జ్ఞానము గల వ్యక్తిని యీ శ్లోకము 'వశీ' అని వర్ణించినది. అనగా, తన వశములో తాను ఉన్న వ్యక్తి. వశము అనగా నియంత్రణ. ధనము, రాజ్యము ఇత్యాది శక్తులను అధీనములోనికి తెచ్చుకొనుట వశీకరణము అనబడును.

మనము దేహమును, మనస్సును, ఇంద్రియములను వశములో ఉంచుకొనగల్గుతాము. వీటిని మించి, మరేదీ మన వశంలో లేదు. మన పిల్లలు కూడా మన వశంలో లేరు. మన పిల్లలు మన వశములో నున్నచో, అన్నివేళలా మనము చెప్పినట్లు చేసి యుండెడివారు. కాని, అట్లు జరుగుట లేదు. కావున, దేహము, మనస్సు, మరియు ఇంద్రియములు మాత్రమే మన వశములో నుండగల్గును. వీటిని తన నియంత్రణలో ఉంచుకున్న వ్యక్తి 'వశీ' అనబడును.

దేహములో నివసించువాడు

జ్ఞాని వశియై యుండుట సహజమే. ఈ శ్లోకము జ్ఞానిని 'దేహీ' అని కూడ నిర్దేశించినది. అనగా, స్థూలదేహము నందు నివసించువాడు. సర్వమును తన వశములో నుంచుకొని, దేహము నందు నివసించుచూ (దేహీ), కర్మలనన్నిటినీ జ్ఞానముచే త్యజించి, జ్ఞాని తొమ్మిది ద్వారములు గల నగరములో (నవ ద్వారే పురే) సుఖముగా నుండునని శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పుచున్నాడు. నవద్వారపురము స్థూలదేహమే. రెండు నేత్రగోళకములు, రెండు నాసికారంధ్రములు, రెండు చెవులు, నోరు, అధోభాగము నందలి రెండు విసర్జనేంద్రియములు వెరసి దేహములో తొమ్మిది రంధ్రములు లేక ద్వారములు గలవు. ఈ నవద్వారపురములో జ్ఞాని ఆనందముగా నివసించియుండును.

ఇచట ఒక శంకకు అవకాశము గలదు. ప్రతిప్రాణి స్థూలదేహమునందే నివసించును గదా! జ్ఞాని మాత్రమే దేహమునందు నివసించుచున్నాడని శ్రీకృష్ణుడు ప్రత్యేకముగా చెప్పుటకు గల కారణమేమి? దీనికి కారణమేమనగా, తాము దేహములో నివసిస్తున్నామని జనులకు తెలియదు. ''నీవు ఎక్కడ ఉన్నావు?'' అని మనము ఎవరినైనా ప్రశ్నిస్తే, ''నేను ఈ నగరంలో, ఈ బస్తీలో, ఈ వీధిలో, ఈ ప్రాసాదములో, ఈ ప్రకోష్ఠము (apartment) లో ఉన్నాను'' ఇత్యాది సమాధానము లభించును. ఏదో ఒక స్థానమునందు తాము నివసిస్తున్నామనియే జనులు తలపోస్తారు. కాని ''నేను నా దేహమునందు నివసిస్తున్నాను'' అని చెప్పువారు మనకు కానరారు. దేహమే ఆత్మ. దేహము ఒక స్థానమునందు ఉన్నది. కావున, ఆత్మ కూడ అదే స్థానము నందు ఉన్నట్లు అగును. ఇదీ జనుల భావన. దేహము ఆత్మ కాదనియు, ఆత్మ నివసించు స్థానము దేహము అనియు ప్రాకృతజనులు ఎరుంగరు.

దేహము ఆత్మ కాదని స్పష్టము చేయుట కొరకై, శ్రీకృష్ణుడీ శ్లోకములో దేహమును జీవుడు నివసించే నవద్వారపురమని వర్ణించెను. ''నేను దేహము కాదు; నేను దేహములో నివసించువాడను'' అని జ్ఞాని యెరుంగును. ''ఇంద్రియములు తమ తమ క్షేత్రములలో వ్యాపృతమై యుండుటయే కర్మలు అగును. ఆత్మ కర్త కాదు. నేను కర్మలను చేయుటలేదు'' అను జ్ఞానము గల జ్ఞాని జ్ఞానముచే కర్మల నన్నిటిని త్యజించి, ఆనందముగా దేహములో నివసించును.

తాను కర్మల నాచరించుట లేదని జ్ఞాని యెరుంగును. ఇట్టి యెరుక గల జ్ఞాని ఉద్వేగమును యెట్లు పొందగలడు? కావున, జ్ఞానికి సమస్య ఏదీ లేదు. అతడు సుఖముగా నుండును (సుఖం ఆస్తే). ఏ పనినీ చేయనక్కరలేనిచో, తాము సుఖముగా ఉండగల్గుదుమని జనులు తలపోస్తారు. కాని, వాస్తవంలో ఏ ఒక్కరూ కర్మల నాచరించుట లేదు. ఆత్మ నిష్క్రియము గదా! జ్ఞాని ఈ సత్యము నెరుంగును. కావున, అతనికి కర్మలు ఏ మాత్రమూ భారము కావు.

ఆత్మ కర్మలను చేయించదు కూడా

ఏ ఒక్కరూ కర్మలను పూర్తిగా విడువజాలరని మనము మూడవ అధ్యాయములో చూచియున్నాము (3.5). గాఢనిద్రలో కూడా కొన్ని అసంకల్పిత చర్యలు జరుగుతూనే ఉంటాయి. స్థూలదేహము నందు నివసించే జీవునకు కర్మలనన్నింటినీ పూర్తిగా విడిచిపెట్టుట అసంభవమని శ్రీకృష్ణుడు 18వ అధ్యాయములో చెప్పబోతాడు (18.10). మనిషి జీవించి యున్నంత వరకు, ఏదో ఒక కర్మ జరుగుతూనే ఉంటుంది.

అట్టి స్థితిలో, జ్ఞాని కర్మలనన్నిటినీ వీడువని యీ శ్లోకములో శ్రీకృష్ణుడు చెప్పుటకు కారణమేమి? కర్మలనన్నిటినీ వీడుట అసంభవమైనప్పుడు, జ్ఞాని కర్మలనన్నిటినీ యెట్లు త్యజించగల్గును? కర్మలు మనస్సుచే త్యజింపబడునని (మనసా సన్న్యస్య) ఈ శ్లోకము చెప్పుచున్నది. 'ఆత్మరూపుడనగు నేను కర్మలను వేటినీ ఆచరించను' అను జ్ఞానముచే కర్మలు త్యజింపబడునని 'మనసా' అను పదము స్పష్టము చేయుచున్నది. ఆత్మ స్వయముగా కర్మల నాచరించకపోయినా, మనస్సు చేత, బుద్ధి చేత, ఇతర ఇంద్రియముల చేత కర్మలను చేయించునేమో యని అనుకోరాదు. ఆత్మ కర్మలను చేయదు (న కరోతి); దేహేంద్రియ మనో బుద్ధులచే కర్మలను చేయించదు (న కారయతి). జ్ఞాని జ్ఞానముచే కర్మలనన్నిటినీ వీడును అనగా తాత్పర్యమిదియే. ఇట్టి జ్ఞానము గల జ్ఞాని ఆత్మ యొక్క స్వరూపమైన ఆనందము నందు, పూర్ణత్వము నందు స్థిరుడై ఉండును.

నవద్వారపురమునకు ప్రభువు

దుర్గ పరివేష్టితమగు నగరిలో మహారాజా (స్వామి) ఉంటాడు. ఆ నగరిలో జరిగే కార్యకలాపము లన్నిటికీ ఆయన ప్రభువు. జ్ఞానికి తన దేహముపై, మనస్సుపై మరియు ఇంద్రియములపై నియంత్రణ ఉండును గాన, జ్ఞాని కూడ ప్రభువు (స్వామి) అనబడును. ఈ స్వామి దేహము అనే నవద్వారపురము నందు నివసించును. ఈతనికి దేహముతో గాని, మనస్సుతో గాని, ఇంద్రియములతో గాని తాదాత్మ్యము లేదు. అందువలన, ఈతడు సుఖముగ నివసించును (సుఖం ఆస్తే).

ఈ దేహేంద్రియ సంఘాతము ఒక పురమనియు, తాను ఆ పురస్వామి ననియు, కర్మల నాచరించేది తాను కాననియు ఈ స్వామికి తెలియును. 'ఆత్మ స్వయముగా కర్మల నాచరించదు; ఇతరులచే ఆచరింపచేయదు' అను యెరుక గల యీ స్వామికి, రాజునకు ఉండే సమస్యలు ఉండవు. శ్రీకృష్ణుడు ఇదే విషయమును అర్జునునితో ద్వితీయాధ్యాయము నందు కూడ చెప్పి యుండెను. ఆత్మ జ్ఞాని ఇతరులను హింసించదు; ఇతరులచే హింసింపచేయదు (2.21). జ్ఞాని స్వయముగా గాని, లేక పరంపరయా గాని కర్మలను వేటినీ ఆచరించదు.

ఆత్మయొక్క స్వరూపము చైతన్యము. కావున, ఆత్మ క్రియల నాచరించదు. కాని, ఆత్మ లేనిదే క్రియలేమియూ సంభవము కావు. ఆత్మ లేనిదే చూచువాడు లేడు. కాని, ఆత్మ చూడదు. ఆత్మ లేనిదే వినేవాడు లేడు. కాని, ఆత్మ శ్రోత కాదు. జ్ఞాన ప్రభావము వలన మనస్సుతో కర్మలను వీడుట యనగా ఈ సత్యమును ఎరుంగుటయే. చూస్తూ ఉన్నా, నేను చూచుట అనే క్రియను

ఆచరించుట లేదు. వింటూ ఉన్నా, నేను వినుట అను క్రియను ఆచరించుట లేదు. ఆలోచిస్తూ ఉన్నా, నేను ఆలోచించుట అను క్రియను ఆచరించుట లేదు.

ఆత్మరూపుడనగు నేను ఏనాడూ ఏ కర్మలనూ చేయను. గతంలో ఆత్మ ఏనాడూ కర్మల నాచరించలేదు. ఆత్మ ఇపుడు కర్మల నాచరించుట లేదు. ఈ సత్యము జ్ఞానికి ఇంతకు ముందు తెలియలేదు. కాని, ఇపుడు తెలిసినది. ఈ సత్యమునెరింగిన జ్ఞాని సర్వకర్మల నుండి విముక్తుడగును.

తరువాతి శ్లోకములో శ్రీకృష్ణుడీ విముక్తిని వర్ణించుచున్నాడు:

అధ్యాయము 5, శ్లోకము 14:

न कर्तृत्वं न कर्माणि लोकस्य सृजति प्रभुः ।
न कर्मफलसंयोगं स्वभावस्तु प्रवर्तते ॥ १४ ॥

న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః
న కర్మఫల సంయోగం స్వభావస్తు ప్రవర్తతే (14)

ప్రభుః = స్వయంప్రకాశమగు ఆత్మ; లోకస్య = మానవునకు; కర్తృత్వం = కర్తృత్వమును; న సృజతి = సృష్టించదు; కర్మాణి = కర్మలను; న = సృష్టించదు; కర్మఫల సంయోగం = కర్మఫలములతో సంబంధమును; న = సృష్టించదు; తు = కాని; స్వభావః = మానవుని స్వభావము; ప్రవర్తతే = కర్మలను చేయించుచున్నది.

> స్వయం ప్రకాశమగు ఆత్మ మానవునకు కర్తృత్వమును గాని, కర్మలను గాని, కర్మఫలములతో సంబంధమును గాని సృష్టించదు. మానవుని స్వభావమే కర్మలను చేయుచున్నది (14).

జ్ఞాని స్థూలదేహములో ఆనందముగా ఎట్లు ఉండగల్గును? అను విషయమును ఈ శ్లోకము చెప్పును. స్వయంసిద్ధమగు ఉనికి గల ఆత్మ ప్రభువు అనబడును. చైతన్యము లేనిదే ఉనికి ప్రమాణితము కాదు. కావున, స్వయంసిద్ధమగు ఉనికి గల వస్తువు స్వయంప్రకాశము కూడా అయి ఉండాలి. అట్టి వస్తువు ఈ శ్లోకములో ప్రభువు అని నిర్దేశింపబడినది.

ప్రభువగు ఈ ఆత్మ వ్యక్తికి కర్తృత్వమును సృష్టించదు (న సృజతి). ఆత్మ ఎవ్వరికీ ఆదేశములను జారీ చేయదు. కావున, ఎవ్వనికీ కర్తృత్వమును సృష్టించదు.

ఎవరైనా నిన్ను "ఈ పనిని చేయుము" అని చెప్పిన పిదప, నీవా పనిని చేస్తే, నీలో కర్తృత్వమును సృష్టించినట్లవుతుంది. ఆత్మ ఎవ్వరొనైనమూ ఏ కర్మనైనమూ చేయమని చెప్పదు. ఆత్మ బుద్ధిని, మనస్సును, లేక స్మృతిని "ఆలోచింపుము; నిర్ణయింపుము" ఇత్యాదిగా ఆదేశించదు. "ఓ మనసా! గుర్తుకు తెచ్చుకో! నిరుత్సాహమును పొందుము! క్రోధమును పొందుము! వేదాంతమును నేర్చుకో!" ఇత్యాదిగా ఆత్మ ఆదేశించదు. ఆత్మ ఎవ్వరికీ ఆదేశముల నీయదు. వ్యక్తి యందు కర్తృత్వధారణ ఉండుటకు ఆత్మ కారణము కాదు. ఆత్మ వ్యక్తి కంటె భిన్నమైన వారి యందలి కర్తృత్వమునకు కూడ హేతువు కాదు.

ఈ సత్యము నెరింగిన వ్యక్తిని పూర్వశ్లోకము వశీ (నియంత్రణ గలవాడు) అని వర్ణించినది. ఇట్టి జ్ఞాని నవద్వారపురము (స్థూలదేహము) నందు, అనేక ద్వారములతో కూడిన దుర్గము లోపలి నగరములో నివసించు మహారాజా వలె, ఆనందముగా నివసించును. పోలికలన్నింటిలో ఏదో ఒక లోపము ఉంటుంది. వశియగు జ్ఞానికి మహారాజుతో చేసిన పోలికలో కూడ ఒక లోపము గలదు. నగరములో పనులన్నిటినీ జనులు చేస్తారు. కాని, రాజు కర్త. అతడు కిరీటమును ధరించి, సింహాసనముపై ఆసీనుడై, రాజదండమును, రాజ్యాధికారమును చెలాయించును.

ఆత్మ కూడ రాజువలెనే కర్తయా? అను ప్రశ్న తలయెత్తును. ఆత్మ అంతరంగ గుహలో ఆసీనమై, మనస్సును, బుద్ధిని, ఇంద్రియములను ఆయా కార్యములందు నియోగించునా? అట్లైనచో, ఆత్మ కూడ కర్తయగును. ఈ శంకకు సమాధానముగా, ఆత్మ కర్తృత్వమును కలిగించదు (కర్తృత్వం న సృజతి) అని శ్రీకృష్ణ భగవానుడు చెప్పెను. అనగా, ఆత్మ ప్రత్యక్షముగనే గాక, అప్రత్యక్షముగ నైననూ కర్మల నాచరింపజేయదు.

ఆత్మ కర్త కాదు అను మాట సుసంగతము. కాని, ఆత్మ మనస్సును, ఇంద్రియములను తమ కార్యముల యందు నియోగించుట లేదా? వేదము కూడా ఆత్మ శ్రోత్రమునకు శ్రోత్రము (శ్రోత్రస్య శ్రోత్రమ్), మనస్సునకు మనస్సు (మనసో మనః), కంటికి కన్ను (చక్షుష శ్చక్షుః) ఇత్యాదిగా వర్ణించుచున్నది గదా! సర్వకార్యముల వెనుక ఆత్మ గలదని చెప్పుదురు. అట్టి స్థితిలో, ఆత్మ వీటినన్నిటినీ ఆదేశించుట లేదా? లేదని శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పుచున్నాడు.

ఆత్మ కర్మను సృష్టించదు

ఆత్మ కర్మలను వేటినీ సృష్టించదు (కర్మాణి న సృజతి) అనగా కర్మలను చేయదు (కర్మాణి న కరోతి). 'న సృజతి' అనగా 'న కరోతి (చేయదు)' అని యర్థము. ఆత్మ ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని కర్మల నాచరించదు.

'కర్మాణి న సృజతి' అను వాక్యములోని 'కర్మాణి' అను పదమును వ్యాకరణ రీత్యా అన్వయిస్తే, 'ఆత్మ వస్తువులను సృష్టించదు' అని అర్థము వచ్చును. వ్యాకరణ రీత్యా క్రియలో విషయము (object) గా అన్వయించే రథ, ఘట, గృహాదులు కర్మలు అనబడును. ఉదాహరణకు, 'అతడు కుండను చేయుచున్నాడు', 'ఆమె అన్నమును వండుచున్నది', 'పిల్లలు ఆహారమును భుజించుచున్నారు' ఇత్యాది వాక్యములలో కుండ మొదలగునవి కర్మలు. ఆత్మ క్రియల నాచరించదు; కర్మలను సృజించదు (కర్మాణి న సృజతి). ఈ విధముగా ఇచట కర్మ శబ్దమునకు క్రియయే గాక, క్రియలో విషయముగా అన్వయించే వస్తువు అని కూడా అర్థమును చెప్పవచ్చును.

ఆత్మ కర్మఫల సంయోగమును సృజించదు

కర్మల ఫలములు కర్తకు చెందును. కాని, కర్తకు, కర్మఫలమునకు మధ్య గల యీ సంధిని ఆత్మ సృజించదు (న కర్మఫల సంయోగం సృజతి) అని కూడ శ్రీకృష్ణుడు చెప్పెను. కర్మఫలములు ఈశ్వరీయ విధుల కనుగుణముగా లభించుచుండును. కాని, ఇచట మనము ఈశ్వర స్వరూపమును గూర్చి, వర్ణించుచున్నాము. ఆత్మ కూడా అదియే. ఆత్మ కర్తృత్వమును గాని, కర్మలను గాని సృజించదు గాన, మనము చేయు కర్మలకు, వాటి ఫలములకు మధ్య సంధిని కూడ ఆత్మ సృజించదు.

ఆత్మ ఏ పనినీ చేయని పక్షంలో, ఇదంతా చేస్తున్నది ఎవ్వరు? ప్రాణుల స్వభావమే ప్రవర్తిల్లుచున్నది (స్వభావస్తు ప్రవర్తతే) అని శ్రీకృష్ణుడు చెప్పెను. ఇంద్రియములు విషయముల యందు లగ్నమగుచున్నవి. స్వభావమనగా జ్ఞానేంద్రియములు. కన్నులు చూచును; చెవులు వినును; మనస్సు ఆలోచించును; బుద్ధి నిర్ణయించును ఇత్యాది.

మానవుడు వివేకము లేని కారణంగా ఈ కార్యముల నన్నిటినీ ఆత్మయందారోపించును. ఇందువలనే, మానవుడు, 'నేను కర్తను; నేను ఆలోచించువాడను' ఇత్యాదిగా తలపోయును. ఈ అధ్యారోపణము (superimposition) జనులకు విదితము కాదు. దీనిని శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములో వివరించుచున్నాడు:

అధ్యాయము 5, శ్లోకము 15:

नादत्ते कस्यचित्पापं न चैव सुकृतं विभुः ।
अज्ञानेनावृतं ज्ञानं तेन मुह्यन्ति जन्तवः ॥ १५ ॥

నాదత్తే కస్యచిత్పాపం న చైవ సుకృతం విభుః
అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జంతవః (15)

విభుః = సర్వవ్యాపకము (అగు ఆత్మ); **కస్యచిత్** = ఎవనియొక్క; **పాపం** = పాపమునైననూ; **న ఆదత్తే** = స్వీకరించదు; **చ ఏవ** = మరియు; **సుకృతం** = పుణ్యమును; **న** = స్వీకరించదు; **జ్ఞానం** = జ్ఞానము; **అజ్ఞానేన** = అజ్ఞానము చేత; **ఆవృతం** = ఆవరింపబడియున్నది; **తేన** = అందువలన; **జంతవః** = మానవులు; **ముహ్యంతి** = మోహమును పొందుచున్నారు.

> సర్వవ్యాపకమగు ఆత్మ ఏ ఒక్కని యొక్క పాపమును గాని, పుణ్యమును గాని స్వీకరించదు. జ్ఞానము అజ్ఞానముచే ఆవరింపబడియున్నది. అజ్ఞానముచేత మానవులు మోహమును పొందుచున్నారు (15).

కర్మలకు, వాటి ఫలములకు మధ్య గల సంధిని ఆత్మ సృష్టించదు అని పూర్వశ్లోకములో చూచియున్నాము. అదియే ఇచట వివరింపబడుచున్నది. ఆత్మయందు భోక్తృత్వము లేదు గాన, పాప పుణ్యములను భోగించేది ఆత్మ కాదు. ఆత్మ ప్రకాశరూపమై అంతఃకరణమును ప్రభామయము చేయును. ఆత్మ లేనిదే చూచుట సంభవము కాదు గనుక, ఆత్మ ద్రష్ట యనబడును. కాని, వాస్తవంగా ఆత్మ ముఖ్యార్థంలో ద్రష్ట కాదు; ద్రష్ట యొక్క స్వరూపమే ఆత్మ. ద్రష్ట ఆత్మయే. కాని ఆత్మ ద్రష్ట కాదు. ఆత్మ యొక్క స్వరూపము శుద్ధ చైతన్యము. ఇందువలననే, ఆత్మ శ్రోత్రమునకు శ్రోత్రము, నేత్రమునకు నేత్రము ఇత్యాది వర్ణన చేయబడినది. కావున, ఆత్మకు, కర్మఫలములకు మధ్యలో సంధి లేదు. ఆత్మ వ్యక్తుల పాపపుణ్యములను స్వీకరించదు.

జ్ఞానము అజ్ఞానముచే ఆవృతమై యున్నది

అట్లైనచో, 'నేను కర్తను', 'నేను భోక్తను', 'నేనీ ఫలము కొరకై ఈ క్రతువును ఆచరించుచున్నాను' ఇత్యాదిగా జనులు తలపోయుటకు గల కారణమేమి? ఈశ్వరుని కృపను సంపాదించుట కొరకై కర్మను చేయుటలో దోషమేమియూ లేదు. ఆత్మజ్ఞానము కలుగనంతవరకు,

కర్మల నన్నిటినీ చేస్తూనే ఉండాలి. ఆత్మయొక్క యథార్థ స్వరూపము తెలిసిన తరువాత శాస్త్రీ ర్మలు ఆవశ్యకము కావు. ప్రస్తుతంలో, ఈ జ్ఞానము అజ్ఞానముచే కప్పివేయబడినది (అజ్ఞానేన వృతమ్). ఆత్మ కర్త కాదు అనే జ్ఞానము మనకు లేదు. అంటే, మనలో అజ్ఞానము గలదని స్పష్టమగుచున్నది. జ్ఞానము మనస్సులో మాత్రమే ఉదయించును. కాని, ఆత్మ మనకింకనూ తెలియలేదు. అంటే, మనస్సు అజ్ఞానముచే కప్పివేయబడినదని స్పష్టమే.

ఇచట జ్ఞానము అను పదమునకు ఆత్మానాత్మ వివేక జ్ఞానము అని గాని, మనస్సు అని గాని అర్థము చెప్పవచ్చును. కాన, మనస్సు అజ్ఞానముచే కప్పివేయబడినది అని గాని, వివేకజ్ఞానము అజ్ఞానముచే కప్పివేయబడినది అని గాని అర్థమును చెప్పవచ్చును. మనమిచట గ్రహించవలసినది యేమన, జ్ఞానము ఎన్నడూ సృష్టింపబడదు; అది కేవలము కప్పివేయబడి యుండును.

ఆత్మ వివేక జ్ఞానము అజ్ఞానముచే కప్పి వేయబడుటచే మానవులు భ్రాంతులగుదురు. ఈ మోహము, భ్రాంతి యెట్టిది? 'నేను కర్తను. నేనీ కర్మను చేసెదను. నేనీ ఫలమును పొందెదను. నేను స్వర్గమును పొందెదను. ఆ కర్మను చేసి నేనీ ఫలమును సాధించెదను' ఇత్యాదిగా మానవులు తలపోయుదురు. దీనికి కారణము జ్ఞానము అజ్ఞానముచే ఆవృతమై ఉండుటయే.

ఈ అజ్ఞానము తొలగిన తరువాత యేమగును? తరువాతి శ్లోకము వివరించును:

అధ్యాయము 5, శ్లోకము 16:

ज्ञानेन तु तदज्ञानं येषां नाशितमात्मनः ।
तेषामादित्यवद् ज्ञानं प्रकाशयति तत्परम् ॥ १६ ॥

జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశిత మాత్మనః
తేషా మాదిత్యవత్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్ (16)

తు = ఏ తద్భిన్నముగా; యేషాం = ఎవరియొక్క, తత్ = ఆ; అజ్ఞానం = అజ్ఞానము, ఆత్మనః = ఆత్మయొక్క, జ్ఞానేన = జ్ఞానము చేత; నాశితం = నశింపచేయబడినదో; తేషాం = వారికి; జ్ఞానం = జ్ఞానము; ఆదిత్యవత్ = సూర్యుని వలె; తత్ = ఆ; పరం = పరమాత్మను; ప్రకాశయతి = ప్రకాశింపచేయును.

ఏ తద్భిన్నముగా, ఎవరియొక్క ఆ అజ్ఞానము జ్ఞానము చేత నశింపచేయబడినదో, వారికి జ్ఞానము సూర్యుని వలె ఆ పరమాత్మను ప్రకాశింపజేయును (16).

అజ్ఞానమనగా జ్ఞానము యొక్క అభావము కాదు. అజ్ఞానము జ్ఞాన ప్రతియోగి. అజ్ఞానము జ్ఞానముచే తొలగింపబడు నంతవరకు ఉండును. ఉన్నదాని (భావ) వలన సమస్యలు కలుగునే గాని, లేనిదాని (అభావ) వలన సమస్యలు కలుగనేరవు. కాన, అజ్ఞానము జ్ఞాన-అభావము కాదు. అజ్ఞానము వలన అనేక సమస్యలు తలయెత్తును. అజ్ఞానము జ్ఞాన విరోధి గనుక, అది కొనసాగినంత కాలము దానికి ఒక విశిష్ట సత్యత్వస్థాయి గలదు. కాని, జ్ఞానోదయము తరువాత అది మనజాలదు. కావున, జ్ఞానము ఉదయించునంత వరకు అజ్ఞానము తన పెత్తనమును చెలాయించును.

అజ్ఞానము ఎప్పుడు తొలగిపోవును?

వెలుతురు వచ్చువరకు చీకటి ఉండును. అటులనే, జ్ఞానము ఉదయించు వరకు అజ్ఞానము ఉండును. 'ఆత్మ యొక్క అజ్ఞానము జ్ఞానముచే నశింపచేయబడును' అనుటలో శ్రీకృష్ణుని తాత్పర్యమిదియే.

ఈ అజ్ఞానమునకు ఒకానొక ఉనికి (భావ) గలదు. అందువలననే, అది భ్రాంతిని, సమస్యలను సృష్టించును. ఉదాహరణకు, రజ్జువు యొక్క అజ్ఞానము సర్పభ్రాంతిని కలిగిస్తుంది. దాని వలన భయము పుట్టును. స్వప్నము నందు, స్వప్నాభిమానికి జాగ్రత్పురుషుని గురించి అజ్ఞానముండును. దాని వలన సమస్యలు కలుగును. లక్షాధికారి తాను బిచ్చగాడు అయినట్లు, బిచ్చగాడు తాను ధని అయినట్లు కలగందురు.

ఈ అజ్ఞానమును నశింపజేయు జ్ఞానమెట్టిది? ఘట-అజ్ఞానమును ఘటజ్ఞానము మాత్రమే తొలగించగల్గును. పట జ్ఞానము తొలగించలేదు. అటులనే, ఆత్మ యొక్క అజ్ఞానమును ఆత్మజ్ఞానము మాత్రమే నశింపజేయగల్గును.

ఆత్మ-అజ్ఞానము నశించేది ఎవరికి? అజ్ఞానుల మనస్సులలో 'ఆత్మయే బ్రహ్మ' అను జ్ఞానము ఉదయించును. శ్రీకృష్ణుడీ జ్ఞానమును సూర్యునితో పోల్చెను. సూర్యోదయము కాగానే, చీకటి తొలగిపోవును. సూర్యుడు చీకటిని తొలగించుట మాత్రమే గాక, సర్వ పదార్థములను

ప్రకాశింపజేయును. సూర్యుడు తూర్పు ఆకాశంలో ఉదయించుచుండగనే, చీకట్లుపోయి, అంతవరకు కంటికి కనబడని పదార్థములన్నియూ ప్రకాశింపజొచ్చును. సూర్యుని వలె, ఆత్మజ్ఞానము ఆత్మ-అజ్ఞానమును నశింపజేసి, అంతవరకు తెలియని బ్రహ్మభిన్నమగు ఆత్మను ప్రకాశింపజేయును (తత్పరం ప్రకాశయతి).

జ్ఞానమునకు సూర్యునితో ఈయబడిన పోలికను మనము సరిగా తెలుసుకోవాలి. అట్లు గానిచో, ఈ శ్లోకము మనలను తికమకపెడుతుంది. 'జ్ఞానము ఆత్మను ప్రకాశింపచేస్తుంది; అప్పుడు నేను ఆత్మను చూస్తాను' అని భావించుట తప్పు. జరిగేది ఏమనగా, ఆత్మ గురించి నీకు గల అజ్ఞానమును జ్ఞానము నశింపజేసి, నీకు ఇంతవరకు తెలియని సత్యమును, నీవు బ్రహ్మవే యను సత్యమును నీకు ప్రదర్శించును. జ్ఞానము ఆత్మను ప్రకాశింపజేయునని భావించరాదు. ఆత్మయే ప్రకాశము. జ్ఞానము అజ్ఞానమును నశింపజేసి, ఆత్మ యాథార్థ్యమును ప్రదర్శించును.

ఈ జ్ఞానము వృత్తి జ్ఞానము. వృత్తి యనగా విచారధార. 'నేనే బ్రహ్మమును (అహం బ్రహ్మ అస్మి)' అనునదియే ఆ వృత్తి. ఈ వృత్తి మనస్సులో కలుగును. ఆత్మ – అజ్ఞానమును నశింపజేసే జ్ఞానమనగా ఈ వృత్తియే. ఆత్మ బ్రహ్మ భిన్నమను సత్యమును ఈ జ్ఞానము ప్రకాశింపజేయును. 'నేను బ్రహ్మను' అనునది సత్యములలో కెల్లా సత్యము; చరమ సత్యము; తత్త్వము. ఈ తత్త్వమును శాస్త్రోపదేశము వలన కలిగే జ్ఞానము గల వ్యక్తి గుర్తించగల్గును.

ఆత్మయే బ్రహ్మయను సత్యమును గుర్తించిన జ్ఞానులను శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములో వర్ణించుచున్నాడు:

అధ్యాయము 5, శ్లోకము 17:

तद्बुद्धयस्तदात्मान स्तन्निष्ठा स्तत्परायणाः ।
गच्छन्त्यपुनरावृत्तिं ज्ञान निर्धूतकल्मषाः ॥ १७ ॥

తద్బుద్ధయస్తదాత్మాన స్తన్నిష్ఠాస్తత్పరాయణాః
గచ్ఛంత్యపునరావృత్తిం జ్ఞాన నిర్ధూతకల్మషాః (17).

తద్బుద్ధయః = బ్రహ్మ విషయములో జాగరూకమైన బుద్ధి గల్గినట్టియు, తదాత్మానః = పరబ్రహ్మయే ఆత్మగా కల్గినట్టియు; తన్నిష్ఠాః = పరబ్రహ్మమునకు మాత్రమే అంకితమైనట్టియు;

తత్పరాయణాః = పరబ్రహ్మమే చరమ లక్ష్యముగా కల్గినట్టియు; జ్ఞాన నిర్ధూత కల్మషాః = జ్ఞానముచే తొలగించివేయబడిన మాలిన్యములు కలిగిన వ్యక్తులు; అపునరావృత్తిం = మరల వెనుకకు వచ్చుటలేని మోక్షమును; గచ్ఛంతి = పొందెదరు.

> బ్రహ్మ విషయములో జాగరూకమైన బుద్ధి కల్గినట్టియు, పరబ్రహ్మమే ఆత్మగా కల్గినట్టియు, పరబ్రహ్మమునకు మాత్రమే అంకితమైనట్టియు, పరబ్రహ్మమే పరమలక్ష్యముగా, కల్గినట్టియు, జ్ఞానముచే తొలగించివేయబడిన మాలిన్యములు కలిగిన వ్యక్తులు మరల వెనుకకు వచ్చుట లేని మోక్షమును పొందెదరు (17).

"ఆత్మయే బ్రహ్మము" అను సత్యమును జ్ఞానము ప్రదర్శించునని శ్రీకృష్ణుడు పూర్వశ్లోకములో చెప్పియున్నాడు. ప్రస్తుత శ్లోకములో తద్బుద్ధయః, తదాత్మానః, తన్నిష్ఠాః, తత్పరాయణాః అనే సమాసములలోని 'తత్ (అది)' అనే సర్వనామమునకు బ్రహ్మ అని యర్థము.

ఈ జ్ఞాన ప్రభావము వలన జ్ఞానులు తద్బుద్ధయః, తదాత్మానః, తన్నిష్ఠాః, మరియు తత్పరాయణాః అగుదురు. వారి మాలిన్యములన్నియూ ఈ జ్ఞానముచే నశింప చేయబడును. వారు వెళ్లిన తరువాత, అనగా, మరణించిన తరువాత, మరల తిరిగి రారు. ఈ సమాసములను మనము ఒక్కొక్కటిగా విశ్లేషిస్తే, వాటిలో గల ఒక విశిష్ట క్రమము మనకు బోధపడును.

బ్రహ్మసాక్షాత్కారము గల వ్యక్తులు

'తద్బుద్ధయః' అనగా బ్రహ్మ యందు బుద్ధి గలవారు; అనగా, వారి బుద్ధిలో ఆత్మయే బ్రహ్మము అనే జ్ఞానము ఉదయించినది. వారి బుద్ధి బ్రహ్మయందు ప్రతిష్ఠితమై యుండును. పూర్వము వారి బుద్ధిలో అనాత్మ యగు అహంకారము (నేను అనే ధారణ) మాత్రమే జాగ్రుతమై యుండెడిది. బుద్ధి యందు అనాత్మ మాత్రమే జాగ్రుతమై ఉండే వ్యక్తులలోని 'నేను' అన్నివేళలా అల్పముగా భాసించుటచే, దానిని వర్ధిల్ల చేయవలసిన అవసరమేర్పడును. ఇందువలననే, వారి బుద్ధి సర్వదా అర్థకామముల చింతను కలిగియుండును. ఇట్టి వారు అర్థకామముల యందు మాత్రమే సుఖమును దర్శించెదరు. మానసికోల్లాసమే వీరి ప్రధాన లక్ష్యము. ఉల్లాసముగా నుండుట కొరకై వీరికి అనేకములగు బాహ్యాంశములే గాక, మానసిక దశలు కూడ అవశ్యకమగును. కావున అహంకారము ఈ బాహ్య విషయముల యందు సదా లగ్నమై యుండును. బాహ్య విషయములన్నియూ అనాత్మయే.

కాని, బ్రహ్మము విషయములో జాగృతమై, బ్రహ్మయందు ప్రతిష్ఠితమైన బుద్ధి గలవారికి (తద్బుద్ధయః) సర్వము బ్రహ్మము మాత్రమే. బుద్ధి బ్రహ్మము; మనస్సు బ్రహ్మము; సర్వము బ్రహ్మమే. దేహము కూడ బ్రహ్మమే. కాన, బుద్ధి బ్రహ్మమునకు క్షణమైననూ దూరము కాదు. బుద్ధి ఎటకు వెళ్ళిననూ, బ్రహ్మమునందు మాత్రమే ప్రతిష్ఠితమగును.

ఆత్మయే బ్రహ్మయను యెరుకగలవారు

వీరు ఈ విధముగా 'తద్బుద్ధయః' అగుటకు కారణమేమి? ఏమనగా, వీరికి ఆత్మయే బ్రహ్మ (తదాత్మానః). ఇంతకు ముందు దేహము, మనస్సు, బుద్ధి, స్మృతి ఇత్యాదులు ఆత్మగా నుండెడివి. పూర్వార్జిత సంస్కార సముదాయము ఆత్మ; దేహవిజ్ఞానమే ఆత్మ. రోమములు, చర్మము కూడ ఆత్మయే. 'నా శిరోజములు అరుణవర్ణము గలవి; నేను నల్లనివాడను' ఇత్యాది ధారణలు గలవు. ధనము కూడ ఆత్మయే. 'నేను ధనవంతుడను', 'నేను బీదవాడను'. దేహములోని పచనక్రియా వ్యవస్థ కూడ ఆత్మయే. 'నేను క్షుబ్ధుడనై యున్నాను; నేను దుఃఖిని' ఇత్యాది ధారణలు గలవు. కాలము, రాష్ట్రీయత కూడ ఆత్మయే. 'నేను యువకుడను; నేను వృద్ధుడను; నేను అమెరికా దేశీయుడను' ఇత్యాది. జనులకు ఆత్మను గురించి గల అసంఖ్యాకములగు ధారణలలో ఇవి కొన్ని మాత్రమే.

ఈ అహం–ధారణలు అన్నీ కలిపి ఆత్మ నిర్మితమగునను భ్రాంతికి లోను కారాదు. ఏలయన, వీటిలో కొన్ని పరస్పర విరుద్ధములు. ఈ ధారణలన్నింటికీ ప్రత్యేకమగు సమస్యలు గలవు. ఉదాహరణకు, 'నేను భారతీయుడను' అని నీవు అంటే, ఒకరకం సమస్య. 'నేను అమెరికా దేశీయుడను' అంటే, మరో రకం సమస్య ఉండును. జ్ఞానేంద్రియములు ఆత్మ అనుకుంటే, కొన్ని సమస్యలు ఉంటాయి. కళ్లద్దములు లేనిదే సరిగా చూడలేని సమస్య కొందరికి గలదు. కొందరు సరిగా వినలేరు. వారికి ప్రతిమాటను మూడుసార్లు చెప్పాలి. స్మృతి ఆత్మ యనుకున్నచో, అదియూ సమస్యయే. స్మృతులన్నియూ ఆహ్లాదకరముగా నుండవు. ప్రతి దానియందు ఏదో ఒక లోపము ఉండనే ఉంటుంది. కావున, వీటిలో దేనినైననూ ఆత్మగా స్వీకరిస్తే, సమస్యలు తప్పవు.

ఈ అహం (నేను) – ధారణను ఏదో ఒక అనాత్మ యందు అధ్యారోపము చేసే సమస్య ప్రతి వ్యక్తికి గలదు. 'ఇది నేను, ఇది నాది'. జ్ఞాని విషయంలో 'ఇది నేను' అనే ధారణ పూర్తిగా నిషేధింపబడి, 'శుద్ధ చైతన్యమే నేను' అను సత్యము గుర్తింపబడునని ఈ శ్లోకము బోధించుచున్నది. ఈ చైతన్యము సర్వ పరిచ్ఛేద వివిరహితము. ఈ జగత్తున కంతకు ఆధారమగు సత్యము ఈ చైతన్యమే.

జగత్తు మిథ్య అని జ్ఞాని యెరుంగును. స్వతంత్రమైన ఉనికి గలది సత్యము. సత్యముపై ఆధారపడే ఉనికి గలది మిథ్య.

ఆత్మ ఒక్కటియే స్వతంత్రమైన ఉనికి గలది. ఆత్మ కంటె భిన్నమైనది ఏదియూ స్వతంత్ర సత్త కలది కాదు. 'స్వతంత్ర సత్తాకమగు బ్రహ్మము నేనే' అను జ్ఞానము గలవారు 'తదాత్మానః' అనబడుదురు.

బ్రహ్మకు అంకితమైన జీవన నిష్ఠ గలవారు

నిష్ఠ యనగా కట్టుబడి యుండుట. మనమీ విషయమును తృతీయాధ్యాయములో చూచియున్నాము. ఉదాహరణకు, జపమును దృఢముగా అభ్యసించు వ్యక్తి 'జపనిష్ఠః' అనబడును. తపస్సు అనబడే కొన్ని విశిష్టమైన ఆధ్యాత్మిక అనుశాసనముల అభ్యాసమునకు కట్టుబడి జీవించు వ్యక్తి 'తపోనిష్ఠః' అనబడును. 'అష్టాంగయోగము' అని పేరు గాంచిన ఎనిమిది అంగములతో కూడిన అనుశాసనమునకు కట్టుబడిన వ్యక్తి 'యోగనిష్ఠః' అనబడును. ఈ తీరున వివిధ రకముల నిష్ఠలు గలవు. బ్రహ్మ జ్ఞానమునకు మాత్రమే కట్టుబడిన వారిని ఈ శ్లోకము నిర్దేశించుచున్నది.

ఉన్నది అంతా బ్రహ్మమే. బ్రహ్మము కంటె భిన్నముగా పరిగణింపదగిన వస్తువు మరియొకటి లేదు. కాన, మహత్త్వము నీయదగినది బ్రహ్మమొక్కటియే అను ధారణ గలవారు 'తన్నిష్ఠాః' అగుదురు. ఈ జ్ఞానము గలవారికి జీవితములో ఇంతకంటె సాధించదగినది మరియొకటి ఉండదు. జీవితములో సాధించదగినది మరియొకటి ఉన్న పక్షంలో, నిష్ఠ దాని మీదకు మళ్ళును. అట్టివారు బహుశః కొంతసేపు జపమును చేయవచ్చును. కాని, వారి నిష్ఠ మరియొక దాని మీదకు మళ్ళును. బ్రహ్మమునందు మాత్రమే నిష్ఠగల తన్నిష్ఠులకు ఇట్లు నిష్ఠ మరియొక దానిమీదకు మళ్ళుట అనేది జరుగదు. అనగా, వారి ఆత్మజ్ఞానము దృఢమైనది. అవి చాల్యమైనది. వారి జ్ఞానములో అస్పష్టత లేదు. ఆత్మ విషయములో వారికి పరిష్కరించవలసిన సమస్యలేమీ లేవు. కావున, వారు ఇంకనూ సాధించదగినది ఏదియూ లేదు.

బ్రహ్మ సాక్షాత్కారమే పరమ లక్ష్యముగా గలవారు

తన్నిష్ఠులు, అనగా బ్రహ్మనిష్ఠులు అయిన వీరికి కర్తవ్యమేమి మిగిలియుండును? కర్మను చేసినా, చేయకపోయినా, వారికి సమానమే. ఏలయన, వారు పరమలక్ష్యమగు బ్రహ్మమును పొందియే

యున్నారు. పరాయణము అనగా పరమలక్ష్యము; యథార్థమగు గృహము. బ్రహ్మము (తత్) పరమ లక్ష్యముగా గలవారు తత్–పరాయణాః అనబడుదురు.

ఆత్మాభిన్నమగు బ్రహ్మమును ఎరుంగుటయే వారు సాధింపదగిన లక్ష్యముగ నుండెడిది. వారు ఇపుడు అట్టి ఎరుకను పొందినారు. కాన, వారికి మరియొక లక్ష్యము ఏదియూ లేదు. "సర్వము నందు బ్రహ్మమును దర్శించువాడు బ్రహ్మమును పొందును" అనుటలో శ్రీకృష్ణుని తాత్పర్యమిదియే.

మానవులకు అర్థకామములు మొదలగు అనేక లక్ష్యములు ఉండును. వీటిలో కొన్ని ఇహలోకానికి చెందినవి; మరికొన్ని పరలోకానికి చెందినవి. కాని జ్ఞానులకు ఆత్మరూపమగు బ్రహ్మము కంటె భిన్నముగా మరియొక లక్ష్యము లేదు. వారు తద్బుద్ధులు, తదాత్మలు మరియు తన్నిష్ఠలు గనుక తత్పరాయణులైనారు. అనగా వారి లక్ష్యము వారికి సిద్ధించినది. వారికి కర్తవ్యములేమియూ మిగిలియుండవు.

ఆత్మజ్ఞానము మాలిన్యములన్నిటిని తొలగించివేయును

తరువాత శ్రీకృష్ణుడు వీరిని 'జ్ఞాన నిర్ధూత కల్మషాః' (జ్ఞానేన = జ్ఞానముచేత; నిర్ధూత = తొలగింపబడిన; కల్మషాః = మాలిన్యములు గలవారు) అని వర్ణించెను. తొలగింపబడిన ఈ మాలిన్యములెట్టివి? రాగద్వేషములు, అజ్ఞానము, భ్రాంతి, పుణ్యపాపములు, సుఖదుఃఖములు ఇత్యాదులన్నీ ఇచట కల్మషశబ్దముచే నిర్దేశింపబడినవి. జ్ఞానముచే ఈ కల్మషములు తొలగింపబడినవి.

ఇట్టివారు మరణించిన తరువాత, మరల తిరిగి రారు (అపునరావృత్తిం గచ్ఛంతి). వారు జీవించియున్నప్పుడు కూడా తద్బుద్ధులు, తదాత్మలు, తన్నిష్ఠలు మరియు తత్పరాయణులు.

జ్ఞాన నిర్ధూత కల్మషులగు వీరు జీవన్ముక్తులు; అనగా, జీవించియుండగనే విముక్తులైనారు. వారు మరణించిన తరువాత మరల బద్ధులు కారు. ఏలయన, 'వారు' అను మాటయే లేదు. వారు బ్రహ్మమే. బ్రహ్మము వచ్చిపోయేది కాదు; మరలివచ్చు ప్రసక్తియే లేదు. ఇట్టివారికి ద్వైతము లేదు. ఉన్నది బ్రహ్మమే. బ్రహ్మమే ఈశ్వరుడు. జగత్తు కూడ బ్రహ్మమే. ఆత్మ బ్రహ్మాభిన్నమని యెరింగిన జ్ఞానులు పునరావృత్తి లేని పదమును పొందెదరు (అపునరావృత్తిం గచ్ఛన్తి). వారికి మరియొక స్థూలదేహముతో సంబంధము ఉండదు.

ఆత్మ- అజ్ఞానము నశించిన ఈ జ్ఞానులు సత్యమును దర్శించు విధమెట్టిది? వారు జగత్తును అజ్ఞానుల కంటె భిన్నముగా దర్శిస్తారా?

అధ్యాయము 5, శ్లోకము 18:

विद्याविनयसम्पन्ने ब्राह्मणे गवि हस्तिनि ।
शुनि चैव श्वपाके च पण्डितास्समदर्शिनः ॥ १८ ॥

విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని
శుని చైవ శ్వపాకే చ పండితాస్సమదర్శినః (18)

విద్యా–వినయ–సంపన్నే = జ్ఞానము, వినయములతో విరాజిల్లు; బ్రాహ్మణే = బ్రాహ్మణుని యందు; గవి = గోవు నందు; హస్తిని = ఏనుగు నందు; చ = మరియు; శుని = శునకము నందు; చ = మరియు; శ్వపాకే ఏవ = శునకమాంస భక్షకుని యందైననూ; పండితాః = జ్ఞానులు; సమదర్శినః = ఒకే తత్త్వము (బ్రహ్మ) ను దర్శించెదరు.

జ్ఞాన, వినయములతో విరాజిల్లే బ్రాహ్మణుని యందు, గోవునందు, ఏనుగు నందు, శునకము నందు, మరియు శునకమాంస భక్షకుని యందైననూ జ్ఞానులు ఒకే సత్యము (బ్రహ్మ) ను దర్శించెదరు (18).

జ్ఞానులు సమదర్శులుగా నుందురని శ్రీకృష్ణుడీ శ్లోకములో బోధించుచున్నాడు. వారు సర్వము నందు, మార్పునకు లోనుకాని సమమును దర్శించెదరు. అనగా, పుణ్యము చేత గాని, పాపము చేత గాని ఎట్టి సంపర్కమును పొందనట్టియు, సంకల్పిత, అసంకల్పితములగు వివిధ సంస్కారములచే ప్రభావితము కాని బ్రహ్మమును వారు సర్వత్రా గుర్తించగల్గుతారు. సర్వకర్మల చేతను, కర్మఫలముల చేతను స్పృశింపబడని, కూటస్థమైన, మార్పులకు లేశమైననూ లోను కాని బ్రహ్మమును వారు సర్వప్రాణుల రూపములో దర్శించగల్గుతారు.

బ్రహ్మము సర్వకాలముల యందు సమముగా నుండును. బ్రహ్మము నిత్య శుద్ధము. బ్రహ్మమునకు దేనితో నైననూ ఏ విధమైన సంపర్కము లేదు. బ్రహ్మము తాను స్వయముగా అసంగముగ నుండును. కాని, బ్రహ్మము లేనిదే ఏ కార్యమైననూ కొనసాగదు. బ్రహ్మములోని మహిమ ఇదియే. ఆత్మ బ్రహ్మమే. ఈ సమము (బ్రహ్మము) ను సర్వత్రా సర్వమునందు దర్శించువారు సమదర్శు లనబడుదురు.

తన అభిప్రాయమును స్పష్టము చేయుట కొరకై శ్రీకృష్ణుడు, జ్ఞానులు సమ-బ్రహ్మను దర్శించే కొన్ని సందర్భములను దృష్టాంతముగా చెప్పెను. విద్యా వినయములతో ప్రకాశించే (విద్యా వినయ సంపన్నః) బ్రాహ్మణుడు మొదటివాడు. జ్ఞాని గోవునందు (గవి), ఏనుగు నందు (హస్తిని), కుక్కయందు (శుని), మరియు శునకమాంస భక్షకుని యందు (శ్వపాకే) ఏ బ్రహ్మను దర్శించునో, అదే బ్రహ్మను ఇట్టి బ్రాహ్మణుని యందు దర్శించును.

బ్రాహ్మణుడు బాల్యము నుండియూ ఆధ్యాత్మిక జీవనశైలిలో పెంచబడును. అట్టివాడు వేదము నందు బ్రాహ్మణులకు విధింపబడిన నియమములను, విధులను పాటిస్తూ జీవించును. కావున, ఇట్టి వ్యక్తిలో శ్రద్ధ, ప్రార్థనతో నిండిన మనస్సు, జ్ఞానము, మరియు వినయము ఉండును. ఇట్టి వ్యక్తిలో సహజముగనే మంచి సంస్కారములు, మరియు భావావేగ సమస్యలు (emotional problems) లేని (సాపేక్షిక) ఉల్లాసవంతమగు మనస్సు ఉండును. ఇతని యందు జ్ఞాన వినయములు ఉన్నవి గనుక, ఇతని కర్మలు సదా మంచివిగా నుండి, అతనికి ఎంతో పుణ్యమును సంపాదించి పెట్టును. బ్రాహ్మణ-ఆత్మ ఈ మంచి సంస్కారములచే ప్రభావితమగునా? కాదని శ్రీకృష్ణుని సమాధానము.

దీనికి భిన్నముగా, ఆవునకు, ఏనుగునకు, కుక్కకు సంస్కారము లేమియూ లేవు. మంచి సంస్కారములు లేవు; చెడ్డవి లేవు. అవి తమ జాతికి సహజమైన ఈశ్వర నిర్ణీత ప్రణాళిక (program) ప్రకారంగా జీవిస్తాయి. కాని, సత్త్వ రజస్తమో గుణముల విషయంలోను, ఇతర విషయాలలోను ఆవునకు, ఏనుగునకు భేదము గలదు. ఆవు సోమరి జంతువు కాదు; దాని యందు తమోగుణ ప్రాధాన్యము లేదు. దాని యందు కొద్ది సత్త్వము, ఎక్కువ రజస్సు గలవు. కావుననే, ఆవు క్రియాశీలిగా నుండును. ఏనుగు చాల తెలివి గల జంతువు. కాని, దాని యందు తమస్సు ఎక్కువగా నుండును. అందువలననే, అది మెల్లగా నడచును. గేదెలో తమస్సు మరీ ఎక్కువ! మన చర్యలను అనుకరిస్తూ తిమింగలము, డాల్ఫిన్ చేసే ప్రతి చర్య (response) లను పరిశీలించండి. వాటిలో చాలా ఇతర జంతువుల కంటె సత్త్వగుణము అధికమని స్పష్టమగును. ఈ విధంగా, వివిధ జంతువులలో గుణములు భిన్నముగా నున్నవి. శునకమాంస భక్షకుడగు వ్యక్తి హీనుడుగా పరిగణింపబడును. అట్టి వ్యక్తిని ప్రస్తావించే ఉద్దేశ్యముతో శ్రీకృష్ణుడిచట ప్రసంగవశమున శునకమును ప్రస్తావించి యుండును.

బ్రాహ్మణుడు, గోవు, ఏనుగు, కుక్క, శునకమాంస భక్షకుడు అను వీరందరిలో జ్ఞాని ఒకే ఆత్మను దర్శించును. ఆ ఆత్మయేది? సమ-ఆత్మ. మార్పులకు ఏనాడు లోను కాని ఆత్మ. ఆత్మ మంచి, లేక చెడు సంస్కారములచే ప్రభావితము కాదు. సత్త్వరజస్తమో గుణములకు ఆత్మయే

అధిష్ఠానము. కాని, ఆత్మ ఈ గుణములచే ప్రభావితము కాదు. ఆత్మ లేనిదే, ఈ గుణము లేవియూ మనలేవు. వాటి అన్నిటి యొక్క సత్యము ఆత్మయే. కాని, ఆత్మ ఈ గుణములతో సంగము లేనిదై యుండును. సర్వ ప్రాణులలో నుండు ఈ ఆత్మ, బ్రహ్మ ఒక్కటియే. ఆత్మ ఏ విధముగ నైననూ ప్రభావితమయ్యే పక్షంలో ఏనుగు-ఆత్మ, శునక-ఆత్మ ఒకటి కాజాలవు. కుక్క తన తలను క్రిందకు వంచినపుడు, ఆత్మ కూడ వంగునా? ఇదియే సత్యమని భావించే పక్షంలో, నీవు జన్మించినపుడు నీ ఆత్మ అమాయికమనియు, ఇపుడు నీ ఆత్మ క్రూరము, దుఃఖి ఇత్యాదిగా అయినదనియు, కావున వాటిని తొలగించుట అసంభవమనియు కూడ నీవు భావించవచ్చును. ఇట్టి ధారణలను సరిదిద్దుట కొరకై, ఆత్మ సదా శుద్ధమని శ్రీకృష్ణుడు స్పష్టము చేయుచున్నాడు.

ఈ శ్లోకములో జ్ఞానులు పండిత శబ్దముచే నిర్దేశింపబడినారు. వారు వికారములకు లోను గాని బ్రహ్మమును మానవులందరిలోనే గాక, సర్వమునందు దర్శించెదరు. వారికి ఇట్టి దర్శనము కలదు గనుకనే, వారు కేవల శాస్త్ర పండితుల కంటె గొప్పవారు. అందువలననే, వారు సమదర్శులు అని వర్ణింపబడినారు.

ఈ సమదర్శనము గల జ్ఞానులు పొందు స్థితిని శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములో వర్ణించుచున్నాడు:

అధ్యాయము 5, శ్లోకము 19:

इहैव तैर्जितस्सर्गो येषां साम्ये स्थितं मनः ।
निर्दोषं हि समं ब्रह्म तस्माद्ब्रह्मणि ते स्थिताः ॥ १९ ॥

ఇహైవ తైర్జితస్సర్గో యేషాం సామ్యే స్థితం మనః
నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్బ్రహ్మణి తే స్థితాః (19)

యేషాం = ఎవరి యొక్క; మనః = మనస్సు; సామ్యే = సమదర్శనము నందు; స్థితం = స్థిరముగా నుండునో; తైః = వారిచేత; సర్గః = జనన మరణ చక్రము (సంసారము); ఇహ ఏవ = ఈ జన్మ యందే; జితః = జయింపబడినది; హి = ఏలయన; బ్రహ్మ = బ్రహ్మము; సమం = సమము; నిర్దోషం = దోషములు లేనిది; తస్మాత్ = అందువలన; తే = వారు; బ్రహ్మణి = బ్రహ్మము నందు; స్థితాః = స్థిరముగా నుండురు.

ఎవరి మనస్సు సమ (బ్రహ్మ) దర్శనము నందు స్థిరముగ నుండునో, వారిచే ఈ జనన మరణ ప్రవాహ రూపముగు సంసారము ఈ లోకములో జీవించియుండగనే జయింపబడినది. ఏలయన, బ్రహ్మము సమము, దోషరహితము. కాన, వారు అట్టి బ్రహ్మము నందు స్థిరముగ నుందురు (19).

బ్రహ్మ భిన్నమగు ఆత్మను సాక్షాత్కరించుకున్న జ్ఞానులు అజ్ఞానముచే, భ్రాంతిచే ఆరోపింపబడిన కర్తృత్వ భోక్తృత్వముల నుండి విముక్తులై యుందురని మనము చూచియున్నాము. వారి ఆత్మ విషయక-అజ్ఞానము జ్ఞానముచే తొలగింపబడగానే, అజ్ఞానము నుండి పుట్టిన భ్రాంతులన్నియూ కూడ తొలగినవి. ఆత్మ బ్రహ్మము కంటె వేరు గాదు; ఆత్మ సర్వపరిచ్ఛేద రహితము అను దర్శనములో 'నేను' అనగా బ్రహ్మము మాత్రమే. కాన, వారు జీవన్ముక్తులు. వారి దర్శనములో సంశయ (doubt), విపర్యాసము (error) లు లేవు. వారు సాధింపదగినది ఏదియూ మిగిలి లేదు.

ఇట్టి వారు సర్వుల యందు, మహోన్నతుని నుండి పరమహీనుని వరకు, మరియు సర్వము నందు బ్రహ్మమును దర్శించెదరు. ఎట్లు? వారందరిలో నున్న ఆత్మ ఒక్కటియే. సర్వులలోని ఆత్మ, తమ యందలి ఆత్మ ఒక్కటియే. ఈ సత్యము వారికి తెలియును. దేహమునకు, మనస్సునకు, ఇంద్రియములకు ఏమి జరిగినా, వాటిచే ఆత్మ ప్రభావితము కాదు. అది బ్రాహ్మణుని ఆత్మ కావచ్చును; లేదా శ్వపాకుని ఆత్మ కావచ్చును. ఆత్మ నిస్సంగము. ఈ సత్యమును వారెరుంగుదురు.

ఆత్మ అద్వితీయము, అఖండము, అపరిచ్ఛిన్నము. ప్రతి ఉదరము నందు ఒకే అఖండాకాశము ఉన్నతీరున, ప్రతి అంతఃకరణము నందు ఒకే ఆత్మ ప్రకటమగుచున్నది. మనము ఎచటకు వెళ్లినా, సర్వ వ్యాపకమగు ఆకాశమును దర్శిస్తాము. అటులనే, చైతన్యము సర్వవ్యాపకము. చైతన్యము దేశకాలముల పరిధికి లోబడదు. సర్వదేశములలో, సర్వకాలములలో చైతన్యము గలదు. చలనములన్నియూ చైతన్యము నందే సంభవించును. ఈ చైతన్యమే ఆత్మ. ఈ సత్యము నెరింగినవారు సర్వప్రాణుల యందు అట్టి ఆత్మను దర్శింపగల్గుతారు. కావున, వారు సమదర్శు లనబడుదురు.

మనస్సు ఆత్మ దర్శన క్షమము కావాలి

ఆత్మ నిర్వికారము, సర్వవ్యాపకము, అపరిచ్ఛిన్నము, అఖండము అను సత్యమును జ్ఞానులు యెరుంగుదురు. ఆత్మ దేహముచే ప్రభావితము గాదు. శ్వపాకుని స్వభావము కూడా ఆత్మను

ప్రభావితము చేయలేదు. వ్యక్తి చేసే కర్మల వలన ఆత్మ ప్రభావితము కాదు. కాని, ఈ సత్యమును అజ్ఞానులు యెరుంగరు. జ్ఞాని శ్వపాకునకు ఉపదేశించవలసి వచ్చినచో, ఏమి ఉపదేశించును? 'నీవు శునకమాంసమును భక్షిస్తావు గనుక, నీ ఆత్మ కలుషితము' అని ఉపదేశించునా? ఆత్మ నిత్య శుద్ధము. కావున, జ్ఞాని ఇట్టి వాక్యమును పలుకజాలడు. కావున, జ్ఞాని 'తత్త్వమసి' అని మాత్రమే బోధించగల్గును. శ్రోత గంధర్వుడు కావచ్చును, దేవత కావచ్చును, లేక శ్వపాకుడైననూ కావచ్చును. సర్వప్రాణుల యందలి ఆత్మ 'తత్' అభిన్నము కానిచో, జ్ఞాని 'తత్త్వమసి' అని యెట్లు అనగల్గును?

సర్వము యొక్క సత్యము ఆత్మయే. కాన, అది సదా సమానముగ నుండును. అది మార్పులకు లోను కాదు. కావుననే, జ్ఞాని తాను పొందిన దర్శనమును ఇతరులతో పంచుకొనగలడు, అయితే, శ్రోత ఉపదేశమును గ్రహించగల్గునా? అను సమస్య ఉండి తీరును. శ్రోతకు సంస్కారము కొద్దిగా ఆవశ్యకమగును. ఇట్టి సంస్కారము నీయగలిగే అనుశాసనములు మనకు అనేకములు గలవు. శ్వపాకుని విషయంలో నైతే, మున్ముందుగా అతని ఆహారము నుండి శునకమును తీసివేయాలి. అపుడాతనిలో సూక్ష్మగ్రాహిత్వము కొద్దిగా పెరుగుతుంది. తరువాత అతడు క్రమముగా ప్రార్థనను, ఇతర అనుశాసనములను అభ్యసించవచ్చును. శ్రోత యొక్క మనస్సునకు క్షమత కలిగిన తరువాతనే, జ్ఞానము ఉదయించగల్గును.

ఇచట మనము వర్ణించే అనుశాసనములు ఆత్మ శుద్ధి కొరకు గాదు. ఆత్మ నిత్యశుద్ధము అను సత్యమును గ్రహించగలిగే క్షమతను మనస్సునకు ఈయుటకై ఈ అనుశాసనములు ఉద్దేశింపబడినవి. ఈ అనుశాసనములకు వేరొక ప్రయోజనము లేదు. ఇది ఆత్మ శుద్ధి కాదు; అంతఃకరణ శుద్ధి మాత్రమే. మరియు, స్థూలదేహములోని కణములను మార్చుటకు ఈ అనుశాసనములు ఉద్దేశింపబడలేదు. ఇవి కేవలము మనశ్శుద్ధి కొరకై ఏర్పడినవి. మనశ్శుద్ధి చాల ముఖ్యము. మనము చేసేది అంతా దాని కొరకు మాత్రమే.

ఇచట తాత్పర్యము అందరితో సమముగా వ్యవహరించుట కాదు

జ్ఞాని అందరిలో ఒకే ఆత్మను దర్శిస్తాడు. అంటే, అందరితో సమానముగా వ్యవహరించునని అర్థము కాదని శ్రీశంకరులు ఈ శ్లోకమునకు ఉపోద్ఘాత భాష్యములో స్పష్టము చేసియున్నారు.

ఒక వ్యక్తి బ్రాహ్మణుని, శ్వపాకుని ఒకే స్థాయిలో నిలబెట్టి వ్యవహరించినాడనుకొనుడు. అతనికి అందరిలో బ్రహ్మమును దర్శించే జ్ఞానము గలదని చెప్పగలమా? అట్లు చెప్ప వీలు లేదు. అతడు జ్ఞాని కాకపోవచ్చును; మూర్ఖుడు కావచ్చును.

జ్ఞాని శ్వపాకుని శ్వపాకునిగా గుర్తింపడని ఈ శ్లోకము చెప్పుచున్నట్లు భావించరాదు. జ్ఞాని సరిగానే గుర్తింపగల్గును. కాని, శ్రీకృష్ణుడిచట చెప్పునదేమనగా, జ్ఞాని అందరిలో, అన్నింటిలో సర్వము యొక్క సత్య అధిష్ఠానమైన అద్వితీయ-ఆత్మను దర్శిస్తాడు. ఇట్టి దర్శనము గలవారిని గురించి ఈ శ్లోకము వివరించుచున్నది. పూర్వశ్లోకములో చెప్పబడిన సమదర్శులు వీరే.

సర్గము అనగా పుట్టుక. అజ్ఞానులు ఒకటి తరువాత మరియొకటిగా మారుతూ గడిపే జనన మరణ చక్రమునకు సంసారమని పేరు. సర్గము అనగా సంసారము అని కూడ అర్థము వచ్చును. జ్ఞానులు సంసారమును జయింతురు. అనగా, భవిష్యత్తులో మరల వారికి జన్మ ఉండదు. జ్ఞాని ఈ దేహములో, ఈ కాలములో, జీవించి యుండగనే, ఈ క్షణములో (ఇహ ఏవ) సంసారమును జయించును. ఈ సంతత పరివర్తన శీలము అగు జీవనము (life of becoming) పై జ్ఞానులు జ్ఞానప్రభావముచే విజయమును పొంది, ఇట్టి విజయము ఎవరికైనను సంభవమేనని నిరూపించిరి.

ఇట్టి విజయమును పొందిన వారి మనస్సు సామ్యము నందు, అనగా ఎట్టి మార్పులకు లోను కానిది, సమత్వము కలదియగు బ్రహ్మము నందు స్థిరముగా ప్రతిష్ఠితమై యుండునని శ్రీకృష్ణుడు వర్ణించెను.

ఆత్మ సర్వవిశేష నిర్ముక్తము

బ్రహ్మము కాలాధీనము కాదు. కావున, దాని యందు మార్పులు ఏమియూ రావు. బ్రహ్మయందు గుణము లేమియూ లేవు. కావ, బ్రహ్మ యందు మార్పు వచ్చే ప్రసక్తి లేదు. ప్రతి వస్తువు నందు కొన్ని విశిష్ట గుణములుండును. మరికొన్ని గుణములను జతచేయుట వలన, లేదా ఉన్న గుణములలో కొన్నింటిని తొలగించుట వలన ఆ వస్తువులో మార్పు వచ్చును. ఆ వస్తువును ముట్టుకోకుండా దానంతట దానిని వదలినా, కాలక్రమములో దాని గుణములలో మార్పులు వచ్చును. అంటే, దాని యందు అన్ని కాలములలో మార్పు కనబడుతూనే ఉంటుంది.

ఏ విధమైన మార్పును చెందనిది ఒకే ఒకటి గలదు. అదియే ఆత్మ. అదియే బ్రహ్మము. నిద్రలో ఆకాశము కూడ లుప్తమగును. కాని బ్రహ్మ లుప్తము కాదు. ఆత్మ మార్పులకు లోను కాదు గనుక, ఆత్మకు మృత్యువు లేదు. ఆత్మ తాను మరణించదు; మరియొకటి మరణించునట్లు చేయదు. కాలము యొక్క పరిధిలో నుండు వస్తువు మాత్రమే మరణించును.

ఆత్మను గురించి విశ్లేషిస్తే, చైతన్యము మాత్రమే ఆత్మయని తెలును. ఇట్టి విశ్లేషణ సంభవమే. నేను నా మనస్సును, ఇంద్రియములను, దేహమును, ఈ జగత్తును, ఇతర వ్యక్తులను తెలుసుకుంటాను. నేనీ విధముగా ఈ అనాత్మ వస్తువులను దర్శించే ద్రష్టను. కాని, ఆత్మ ఒక్కటియే స్వయంసిద్ధము. నేను దర్శించే ద్వైతము అనృతము.

కాలము కూడ స్వయంసిద్ధమగు ఆత్మకు దృశ్యమే. కాలము చైతన్యమును విషయముగా చేయు (objectify) జాలదు. వాస్తవంలో, కాలభావన నా యెరుక యందు గలదు. ఆత్మ కంటె భిన్నమైనది ఏదైనా, తన ఉనికి కొరకై పూర్తిగా ఆత్మపై ఆధారపడును గాన, మిథ్య యనబడును. స్వయం సిద్ధము, సర్వము యొక్క సత్యము అగు ఆత్మ సత్యము అనబడును. సత్య-ఆత్మ కాలమునకు బద్ధమై ఉండదు గాన, మార్పునకు, మరణమునకు లోనుకానిదై, సదా ఏకరూపమున నుండును. కావుననే, ఈ శ్లోకములో ఆత్మ 'సామ్య' శబ్దముచే నిర్దేశింపబడినది. అనగా, ఆత్మ అన్నిటియందు ఉన్ననూ, పుణ్యపాపములచేత గాని, సత్త్వరజస్తమోగుణములచేత గాని ప్రభావితము కాదు.

ఈ సామ్యము ఎవరికి వర్తించును? ప్రభావితుడగు వ్యక్తికి నిశ్చయముగా వర్తించదు. 'నేను సద్గుణములు గల బ్రాహ్మణుడను' అని నేను భావిస్తున్నాననుకొనుడు. పుష్పములతో అందముగా అలంకరింపబడిన బల్లపై శ్వపాకుడు భుజిస్తూ ఉంటే, నేను అక్కడ చూస్తూ కూర్చుండగలనా? నేను అచట నుండి పారిపోవాలనుకుంటాను. అక్కడ క్షణమైననూ కూర్చుండలేను.

ఒక ఆత్మ యందు పాండిత్యము మొదలగు గుణములు ఉండి, మరియొక ఆత్మ యందు అజ్ఞానము, భ్రాంతి మొదలగు గుణములు ఉండే పక్షంలో, ఈ ఆత్మలు భిన్నములే. కాని, అందరిలో సమముగా నుండి, జీవుల భోగములచే గాని, కర్మలచే గాని ప్రభావితముగాని ఆత్మను సమదర్శులగు పండితులు దర్శిస్తారు.

మోక్షము మరణానంతరము లభించేది అను భావన సరిగాదు

ఈ ఆత్మ తత్త్వము నందు జాగృతమైన మనస్సు గలవారికి ఈ సంతత పరివర్తన శీలమగు సంసారము, వారు ఇచట (ఇహ ఏవ) ఈ దేహములో జీవించి యుండగనే, రాలిపోవును. అనగా, మోక్షము మరణానంతరము లభించేది కాదని భావము. మరణించిన తరువాత, ఆత్మజ్ఞానము ఉదయించుట ఎట్లు? జీవుడు దేహమును వీడిన తరువాత చేసే సది ప్రయాణము మాత్రమే.

సర్వకారణమగు బ్రహ్మమును ప్రార్థిస్తూ, ధ్యానిస్తూ జీవితమును గడిపిన పుణ్యాత్ములగు జీవులైననూ, తామే బ్రహ్మము అను సత్యమును గుర్తించనిచో, మరణించిన తరువాత స్వర్గము కంటె గొప్పది, సర్వోత్కృష్టమైనది యగు బ్రహ్మలోకమును పొందెదరు.

బ్రహ్మలోకము ఉన్నదాయని మీరు దయచేసి నన్ను ప్రశ్నించవలదు. ఉన్నది యని నేను నిరూపించలేను. లేదని మీరు నిరూపించలేరు. కాన, మనము బ్రహ్మలోకము కలదని అంగీకరిద్దాము. ఈశ్వరుని యందు భక్తితో జీవించిన సాధకుడు అచటకు వెళ్లి, అచట బ్రహ్మగారితో కలిసి కొంత కాలము జీవిస్తాడు. అచట సాధకుడు శాంతిని పొందుటయే గాక, అచట లభించే సౌఖ్యములను కూడ అనుభవిస్తాడు. కాలక్రమంలో, బ్రహ్మగారు అతనికి జ్ఞానము నుపదేశించవచ్చును. ఆయన ఏ జ్ఞానమును ఉపదేశించును? ఆయన 'తత్త్వమసి' ని మాత్రమే బోధించును. ఆ సాధకుడు మనుష్య జీవనములో నుండగా విన్న ఉపదేశమునే మరల వినును. కాని, ఇపుడు బోధించేది బ్రహ్మగారు గనుక, అతనికి అర్థమగును. ఆ జ్ఞానముచే నాతడు ముక్తిని పొందును. ఈ ముక్తి లభించునదెప్పుడు? ఇప్పుడే. ముక్తిలో విలంబము లేదు.

మోక్షము మరణము తరువాత మాత్రమే లభించేది కాదు. మరణము తర్వాత ఉండేది ప్రయాణమే గాని, మోక్షము కాదు. మోక్షము కాలాధీనము కాదు. అది స్వతస్సిద్ధ సత్యము. ఆత్మ నిత్యముక్తము. బంధము సత్యమైనచో, భగవంతుడు కూడ దానిని తొలగించలేడు. ఏలయన, అది భగవానుని తనదైన సత్యము అగును. అసత్య బంధమును కూడ భగవానుడు తొలగించలేడు. ఏలయన, అది లేనే లేదు. లేనిదానిని ఎవ్వరూ తొలగించలేరు; భగవానుడైననూ తొలగించలేడు. భగవానుడు నీకు ఉపదేశించి, బంధము సత్యము కాదని నీవు తెలుసుకొనునట్లు చేయగలడు. అంతే.

ఆత్మ శుద్ధము, పాపరహితము

శ్రీకృష్ణుడీ శ్లోకంలో సమబ్రహ్మను 'నిర్దోషమ్' అని కూడా వర్ణించెను. అనగా దోషము లేనిది. విశేషణము లన్నియూ అంతతో గల్పా దోషములే యగును. ఏలయన, విశేషణము వస్తువునకు సంబంధించి యుండును. వస్తువు లన్నియూ అనిత్యములే. నిర్దోషము అనగా మృత్యువు, భేదము ఇత్యాది దోషములు ఏవీ లేనిది అని యర్థము.

ఆత్మ యాథార్థ్యము నెరుంగని వారికి, ఆత్మ యందు శ్వపాకత్వాది విశేషణములు, దోషములు ఉన్నట్లు అనిపించును. 'శ్వపాకుడు పాపి' అను మాటకు అర్థమేమి? పాపము చేసిన

వాడు పాపి. అంటే, పాపములన్నియూ పాపికి అతుకు కొని ఉంటాయి. ఈ పాపి యెవరు? స్థూలదేహము పాపియా? జ్ఞానేంద్రియములు పాపులా? లేక, మనస్సు పాపియా?

దేహము తనంత తానుగా కర్మలను చేయలేదు. కాన, దేహము పాపి కాజాలదు. ఇంద్రియములు సాధనములు (కరణములు) మాత్రమే. కాన, అవి కూడా పాపులు కాలేవు. అటులనే, మనస్సు కూడ కరణమే గనుక, పాపి కాదు. అట్లైనచో, పాపి యెవరు? ఆత్మయే పాపి. ఒక వ్యక్తిని మనము పాపి అని నిందించినపుడు, మనమాతని ఆత్మను పాపి అని నిందిస్తున్నాము. ఏలయన సర్వ విశేషణములు, దోషములు ఆత్మ యందుండునని మనము భావిస్తాము. అంటే, మనము చేసే పనులన్నీ ఆత్మకు అతుక్కుంటాయి. ఆత్మ దోషములు గలది (దోషవాన్) అవుతుంది. అంటే, ఆత్మ ఇప్పటికే దోషములను కలిగి యున్నది. ఇంకనూ దోషములను ప్రోగుచేసుకొనుచున్నది. ఆత్మ కూడ ఇతర పదార్థముల వంటిది. దానికి కూడ ఒక కేంద్రకము (nucleus) గలదు. అది పాప, పుణ్యముల రూపములో విభిన్న దృష్టాదృష్ట ఫలములను తనలోనికి ఆకర్షించును.

ఆత్మ విషయంలో ఈ ధారణ భ్రాంతి జనితము. అజ్ఞానులు ఆత్మ నిత్యశుద్ధమనియు, పాప పుణ్యములచే ప్రభావితము కాదనియు యెరుంగరు. మనము ఆత్మ యందు ఆరోపించే దోషములతో ఆత్మకు ఎట్టి సంసర్గమూ ఉండదు; వాటిచే ఆత్మ ప్రభావితము కాదు.

ఆత్మ పాపి అని మనము భావించిన సమయంలో కూడా, ఆత్మ సమము, నిర్దోషము, బ్రహ్మాభిన్నము. సమము అనగా ఒకటి (ఏక) అని యర్థము. బ్రహ్మ యందు మార్పులు ఎన్నడూ రావు. అది సర్వదా ఒక్కటి; సమము. జ్ఞానులు అట్టి బ్రహ్మము నందు మాత్రమే స్థిరముగా నుందురు (సామ్యే బ్రహ్మణి స్థితాః). వారు బ్రహ్మాభిన్నులు. ఆత్మ బ్రహ్మాభిన్నము. అందువలననే, వారు స్థిరముగా నుందురు. 'బ్రహ్మణి తే స్థితాః' అనగా జ్ఞానులు బ్రహ్మ కంటె వేరు కాదని యర్థము.

వారు పూర్వము వివేకము లేకపోవుటచే, ఆత్మయాథార్థ్యము నెరుంగక, ఆత్మ పుణ్యపాపములకు, అనగా దోషములకు అధీనమై యుండునని తలపోసిరి. అప్పుడు, సర్వులు భిన్నులుగా భాసించిరి. 'నా పుణ్యపాపములు నాకు గలవు; నీకు కూడ అటులనే'. ప్రతి వ్యక్తి ఏదో కొంత సామానుతో వస్తాడు. చాలా సామగ్రిని ప్రోగుచేస్తాడు. అంతములో సూక్ష్మమగు సామగ్రిని మాత్రమే తీసుకుని ఈ ప్రపంచమును విడిచిపెడతాడు. మనము అనవసరమగు సామగ్రిని పారవేసి, ముఖ్యమైన వాటిని మాత్రమే తీసుకుని వెళ్లు తీరున, జీవుడు కూడా పుణ్యపాపములనే సూక్ష్మమగు సామగ్రిని మాత్రమే మరు జన్మలోనికి తీసుకుని వెళ్లును.

నీకు ఇష్టము ఉన్నా, లేకపోయినా, నీవు నీతో బాటు పుణ్యపాపములనే సామగ్రిని తీసుకువెళ్లాలి. ఎందుకంటే అది కర్మ నియతి. నిన్ను నీవు పుణ్యపాపములకు ఆధానము (receptacle) గా స్వీకరించి, కర్తృత్వమును నెత్తిపై వేసుకుంటే, ఈ కర్మ సంబంధము తప్పదు. అవివేకము వలన 'నేను కర్తను' అను ధారణ ఉన్నంతవరకు, మానవుడు బద్ధుడై ఉండును. వివేకము వలన మానవుడు 'ఆత్మ సర్వకాలముల యందు బ్రహ్మాభిన్నము' అని గుర్తించును. అట్టివారు బ్రహ్మరూపులై యుందురు. వారికి పునర్జన్మ అను ప్రసక్తి లేదు. వారు మరలి రారు (గచ్ఛంతి అపునరావృత్తిమ్). బ్రహ్మ యందు స్థిరముగా నుండుట యనగా బ్రహ్మరూపుడై ఉండుటయే. కావున, వారు మరల జన్మించే ప్రసక్తి ఉదయించదు.

మరణానంతర స్థితి యందు అభిరుచి

ఇచట ఒక శంక ఉదయించును. 'నేను నిత్యుడను' అను భావన చాల ఆహ్లాదకరముగ నున్ననూ, పునరావృత్తి లేకపోవుట అను భావన మనకు నచ్చకపోవచ్చును. ఎందుకంటే, మర్త్యులందరికీ జీవించి ఉండాలనే కోరిక ఉంటుంది. బ్రతికి ఉండాలనేది సర్వప్రాణులలోని సహజ మనోవృత్తి. 'నేను బ్రతికి ఉండాలి' అనే కోరిక మానవుని మౌలిక సమస్యలో అంతర్భాగము.

నేను ఇచట బ్రతికి ఉండాలని కోరుకుంటాను. కనుక, మరణించిన తరువాత కూడ నేను జీవించి ఉండాలని కోరుకుంటాను. నేను బ్రతికియే ఉంటానని శాస్త్రము బోధిస్తోంది. ఇది నాకు చాల నచ్చిన మాట. నేను బ్రహ్మ సాక్షాత్కారమును పొంది, మరల ఈ ప్రపంచములో ఆత్మజ్ఞానముతో జన్మించి, ఇచటి సుఖాలను అనుభవించగలిగే పక్షంలో, అది చాలా ఆకర్షణీయముగా నుండును. లేదా, ఈ జ్ఞానమును పొందిన తరువాత నాకు ఆనందము యొక్క అనుభవము మరింత లోతుగా లభించే పక్షంలో, నాకు అది కూడా ఆహ్లాదకరంగా ఉంటుంది. బహుశః నాకు మరో విలక్షణమైన దేహము, ఎక్స్‌రే కన్నులు, అధిక తర శక్తి గల చెవులు మొదలగునవి ఉండవచ్చును. ఇటువంటి వికల్పములేవైనా, నాకు చాల ఆహ్లాదదాయకముగా ఉండగలవు.

ఇచటి సమస్య యేదన, నేను అపూర్ణుడనని నేను భావించుటయే. 'నేను పూర్ణుడను గాను' అని నేను నిష్కర్ష వేసుకున్నాను. దానివలన, ఏదో ఒకదానిని పొందాలనే కామన నాలో ఉంటుంది. సంసారులందరికీ ఉన్న సమస్య ఇదియే. అందుచేతనే, వారు నాతో ''స్వామీజీ! ఈ అపునరావృత్తి అనే భావము నాకు నచ్చదు; నాకు తిరిగి రావాలని ఉంది'' అంటారు. నేను అట్టి సంసారికి ఇచ్చే సమాధానము ఇట్లా ఉంటుంది: ''నీవు దుఃఖించకుము. నీవు తిరిగి వస్తావు. తిరిగి రావని నీకు ఎవరు

చెప్పిరి? ఏ రూపములో జన్మిస్తాను అని నీవు అడుగవద్దు. అనేక వికల్పములు ఉన్నాయి. నీవు దేవతగా జన్మించవచ్చును. లేదా, బొద్దింకవు కావచ్చును. కాని, నీవు తిరిగి జన్మించుట నిశ్చయము'.

కాని, జ్ఞానుల విషయంలో ఇటువంటిది ఏదీ జరుగదు. తాను బ్రహ్మరూపుడనని యెరింగిన జ్ఞాని బ్రహ్మ యందు స్థిరుడై యుండును (బ్రహ్మణి స్థితాః). అనగా, బ్రహ్మాభిన్నుడై యుండును. కాన, భయమునకు స్థానము లేదు.

మూలములో నున్న భయము మృత్యుభయము. కాని, ఆత్మ సద్రూపము. అది పుట్టలేదు; మరణించదు. 'నేను మృత్యువునకు, గుణదోషములకు, లోపములకు అధీనుడను' అను ధారణయే సమస్య. 'నేను దోషములకు అధీనుడను' అను ధారణయే మౌలిక సమస్య. 'ఆత్మరూపుడనగు నా యందు విశేషణములు, లోపములు గలవు' అని తలచినంత కాలము, మానవునకు సమస్యలు తప్పవు. ఆత్మ కాలమునకు అధీనమై-యుండుట ఒక దోషము. ఆత్మ అపూర్ణత్వమునకు వశమై యుండుట మరియొక దోషము. ఆత్మ దుఃఖమునకు అధీనమై యుండుట ఇంకొక దోషము. ఆత్మ పరిచ్ఛిన్నముగ నుండుట ఒక దోషము. ఆత్మ జన్మ మరణముల కధీనమై యుండుట దోషము. ఆత్మ పుణ్యపాపములకు, కర్తృత్వ భోక్తృత్వములకు అధీనమైయుండుట దోషము. 'ఆత్మ దోషములు గలది (దోషవాన్)' అను ధారణ ఉన్నంత వరకు, దోషములను తొలగించుకునే ఉపాయము లేనే లేదు. ఒక దోషమును తొలగించగనే, మరియొక దోషము తలయెత్తును.

భయపడవలసిన అవసరము లేదు

ఆత్మ నిర్దోషము, సమము, బ్రహ్మము అని శ్రీ కృష్ణుడీ శ్లోకములో సుస్పష్టము చేసినాడు. ఈ జ్ఞానము గలవారు బ్రహ్మరూపులే. వారిలో జీవుడు మిగిలియుండడు. కాన, వారికి పునర్జన్మ లేదు. బ్రహ్మము నందున్నవారై, వారు జన్మ మరణ చక్రముపై జయమును పొందిరి. అదియే మోక్షము. వారీ క్షణములో ముక్తులు. దేహము రాలిపోయిన తరువాత, వారు మరల జన్మించరు.

అంటే, వారు పూర్తిగా అదృశ్యమై పోతారని యర్థమా? ఉన్నది సత్య-ఆత్మ ఒక్కటియే గనుక, వారు అదృశ్యము కాజాలరు. అదృశ్యమయ్యేది మిథ్య. సత్యము మాత్రమే మిగిలియుండును. ఆత్మయే సత్య బ్రహ్మము. జగత్కారణమగు ఈశ్వరుడు కూడ సత్యబ్రహ్మమే. నీవు బ్రహ్మవు గనుక, జగత్కారణుడగు ఈశ్వరుడు నీవే. ఉన్నది ఈశ్వరుడొక్కటియే. తద్భిన్నమగు వస్తువు మరియొకటి లేదు. ఇదియే సత్యము.

నీవు ఈ క్షణములో కూడ ఈశ్వరుడవే. నీవు కాదని ఎవరంటారు? శుద్ధాత్మ దృష్టితో తత్త్వం అసి అనగా, నీవే ఈశ్వరుడవు. ఆత్మయే ఈశ్వరుడు. ఉన్నది సర్వము ఈశ్వరుడే గనుక, ఈశ్వరుడగుటవే నీకు కలిగే నష్టము ఏదీ లేదు. జన్మ లేదు. మరణము లేదు. ఇక భయపడవలసిన దేమున్నది?

అధ్యాయము 5, శ్లోకము 20:

न प्रहृष्येत् प्रियं प्राप्य नोद्विजेत्प्राप्य चाप्रियम्।
स्थिरबुद्धि रसम्मूढो ब्रह्मविद् ब्रह्मणि स्थितः ॥२०॥

న ప్రహృష్యేత్ ప్రియం ప్రాప్య నోద్విజేత్ ప్రాప్య చాప్రియమ్
స్థిరబుద్ధిరసం మూఢో బ్రహ్మ విద్ బ్రహ్మణి స్థితః (20)

బ్రహ్మణి = బ్రహ్మము నందు; స్థితః = స్థిరముగా నున్నట్టియు; స్థిరబుద్ధిః = దృఢమగు జ్ఞానము కలిగినట్టియు; అసం మూఢః = మోహము నుండి విముక్తి పొందిన; బ్రహ్మవిత్ = బ్రహ్మజ్ఞాని; ప్రియం = కోరదగిన వస్తువును; ప్రాప్య = పొంది; న ప్రహృష్యేత్ = హర్షాతిరేకమును పొందరాదు (పొందడు); చ = మరియు; అప్రియం = దుఃఖహేతువగు దానిని; ప్రాప్య = పొంది; న ఉద్విజేత్ = ఉద్వేగమును పొందరాదు (పొందడు).

బ్రహ్మము నందు స్థిరముగా నున్నట్టియు, దృఢమగు జ్ఞానము కలిగినట్టియు, మోహము నుండి విముక్తిని పొందిన బ్రహ్మజ్ఞాని కోరదగిన వస్తువును పొందినపుడు హర్షాతిరేకమును పొందరాదు (పొందడు). దుఃఖహేతువగు దానిని పొంది, ఉద్వేగమును పొందరాదు (పొందడు) (20).

సర్వవికార రహితము, సర్వకాలములో సమమువగు ఆత్మను సాక్షాత్కరించుకున్న వ్యక్తిని గూర్చిన వర్ణన శ్రీకృష్ణుడీ శ్లోకములో కొనసాగించుచున్నాడు. ఇట్టి జ్ఞానులు ఈ సమత్వమును, ఈ ఆత్మను బ్రాహ్మణ, గో, గజ, శునక, శ్వపాకాది సర్వప్రాణుల యందు, సర్వము నందు దర్శించెదరు. అందువలననే, పూర్వశ్లోకములు రెండింటిలో వీరు సమదర్శులు అని నిర్దేశింపబడినారు. వారు అందరితో, అన్నింటితో సమముగా వ్యవహరిస్తారని అర్థము కాదు. వారు సర్వములో వికార రహితమగు ఆత్మను దర్శిస్తారని యర్థము. ఈ తేడాను మనము స్పష్టముగా తెలుసుకోవాలి.

ఇట్టి జ్ఞాని ప్రియములు, అప్రియములు నగు పరిస్థితులలో ఎట్లు స్పందించును? అను విషయమును ఈ శ్లోకము వివరించుచున్నది. ఈ పరిస్థితులకు క్రమముగా విద్యా వినయ సంపన్నుడగు బ్రాహ్మణుడు, శ్వపాకుడు అను దృష్టాంతములు ఇంతకు ముందే ఈయబడినవి. ఈ శ్లోకములో జ్ఞాని స్థిరబుద్ధి అని పిలువబడినాడు. దీనిని మనము తరువాత చర్చిస్తాము.

ఈ శ్లోకములలో విధియున్నదా?

అభిలషణీయమైన వస్తువు లభించినపుడు (ప్రియం ప్రాప్య), స్థిరబుద్ధి ఎగిరి గంతు వేయడు (న ప్రహృష్యేత్). 'ప్రహృష్యేత్' అను క్రియా పదములో విధి (ఆదేశము) ఇమిడియున్నది. 'జ్ఞాని హర్షోద్వేగమును పొందరాదు. తీవ్రహర్షమును పొందుట నిషేధింపబడినది'. కాని, ఇది వాస్తవంగా ఆదేశమేనా? శ్రీకృష్ణుడు జ్ఞానుల నీ శ్లోకములో హెచ్చరించుట లేదు. 'జాగరూకుడవై ఉండుము. నీవు బ్రహ్మజ్ఞానివి. నీవు ఒకప్పుడు క్రుంగిపోయి, మరియొకప్పుడు హర్షములో ఎగిరిపడినచో, నీ జ్ఞానము చెల్లా చెదరగును. కావున, నీవు ఏది ఏమైనా, క్రుంగిపోకు; ఎగిరిపడకు!' అని శ్రీకృష్ణుడు చెప్పుట లేదు. జ్ఞాని క్రుంగిపోయే ప్రసక్తి, ఎగిరి పడే ప్రసక్తి లేనే లేదు. కావున, 'జ్ఞాని ప్రియమును పొంది ఎగిరిపడరాదు; అప్రియమును పొంది, క్రుంగిపోరాదు' అనే ఆదేశములు ఇచట అభిప్రేతములు కావు.

గీతలో ఇటువంటి వాక్యములు వచ్చిన సందర్భములలో, క్రియా పదములో మార్పును చేసుకోవాలి. ఏలయన, ఇచట ప్రవృత్తికి సంబంధించిన ఆదేశముల నిచ్చుట, విధి నిషేధములను నిర్ణయించుట శ్రీకృష్ణుని తాత్పర్యము కాదు. బ్రహ్మ జ్ఞానము ఉదయించిన వ్యక్తి విషయంలో 'తీవ్ర హర్షమును పొందరాదు (న ప్రహృష్యేత్)' అను వాక్యమును 'తీవ్రహర్షమును పొందడు (న ప్రహృష్యతి), అని మార్చుకోవాలి. అటులనే, 'క్రుంగిపోరాదు (న ఉద్విజేత్)' అను వాక్యమును 'క్రుంగిపోడు (న ఉద్విజతి)' అని మార్చుకోవాలి. ఇచట శ్రీకృష్ణుని వివక్ష ఇదియే. కాని, పదములకు ఒక విశిష్టమగు శక్తి గలదు. అవి బ్రహ్మ విత్ కాదలుచుకున్న సాధకునకు ఉపదేశమును ధ్వనింపచేయును. సాధకుడు జ్ఞానప్రాప్తి కొరకై తన మనస్సును సంసిద్ధము చేసుకోవాలి. దాని కొరకై ఆచరించదగిన కర్మయోగము ఈ పదములలో ధ్వనించుచున్నది.

ప్రియమగు పరిస్థితులు సంప్రాప్తమైనప్పుడు జ్ఞాని పొంగిపోడు. అప్రియము సంప్రాప్తమైనప్పుడు (అప్రియం ప్రాప్య చ) జ్ఞాని క్రుంగిపోడు. ఇది శ్రీకృష్ణుని తాత్పర్యము. వివిధ పరిస్థితులలో జ్ఞాని యొక్క ఈ స్పందన సామాన్య మానవుల ప్రవర్తన కంటె చాలా భిన్నంగా

ఉంటుంది. ప్రియము చేకూరినపుడు మనము ఎగిరిపడతాము. అప్రియము వస్తే, మనము నేలగూలి, ఇటునటు దొర్లుతూ, మనకు పట్టిన గతి గురించి రోదిస్తాము. ఈ తీరున, మన స్పందనలు భావావేగము(emotion) యొక్క ఉత్పతన, అధఃపతనములతో కూడి ఉంటాయి. హర్షము తొలగిపోయిన స్థితి హర్షమును వెన్నంటి యుండును. కావున, హర్షంతో ఎగిరిపడే వ్యక్తి శీఘ్రముగనే క్రిందబడుట అనివార్యము.

జ్ఞాని పరిస్థితి దీనికి భిన్నంగా ఉంటుంది. ప్రియముగాని, అప్రియముగాని జ్ఞానికి అందోళనము కలిగించలేవు (న ప్రహృష్యేత్ ప్రియం ప్రాప్య న ఉద్విజేత్ ప్రాప్య చ అప్రియమ్). జ్ఞాని ఎగిరిపడడు; క్రుంగిపోడు. ప్రియము కలిగితే జ్ఞాని సంతోషిస్తాడు. అప్రియము కలిగితే దుఃఖించడు. అప్రియము కలిగితే జ్ఞాని సంతోషిస్తాడని అనుకోరాదు! ఇచటి తాత్పర్యమేమన, అప్రియము కలిగినప్పుడు జ్ఞాని క్రుంగిపోడు; ప్రియము కలిగినప్పుడు ఎగిరెగిరిపడడు. జ్ఞాని దృష్టిలో తన యొక్క పూర్ణత్వము మాత్రమే గలదు. అతని పూర్ణత పరిస్థితులపై ఆధారపడి యుండదు. ఏలయన, అతడు స్థిరబుద్ధి; అతని ఆత్మజ్ఞానము దృఢమైనది.

జ్ఞాని యొక్క జ్ఞానము స్థిరమైనది

ఏకము, సమము (మార్పులు లేనిది), నిర్దోషమునగు ఆత్మను సర్వప్రాణుల యందు దృఢముగా దర్శించువాడే స్థిరబుద్ధి యగునని శ్రీ శంకరులు ఈ శ్లోకభాష్యములో నిర్వచించిరి.* ఇట్టి జ్ఞాని యొక్క బుద్ధి స్థిరముగా, అనగా దృఢముగా, స్పష్టముగా నుండును. అందువలననే, అతడు స్థిరబుద్ధి యనబడును.

ఇచట స్థిర శబ్దమును నిర్వచింపవలసి యున్నది. వృక్షము స్థిరముగా నుండును. దాని వ్రేళ్లు భూమిలో దృఢముగా పాతుకొని యుండును. కాని, దానిని తగినంత గట్టిగా పెకలించినచో, ఊడివచ్చును. అటులనే, స్థిరమగు బుద్ధి కూడా గట్టి క్షోభకు గురిచేసినచో, చ్యుతమగునేమో యను శంక కలుగును. వాస్తవంలో, స్థిరమగు జ్ఞానము చలింపజేయ శక్యము కానిది. అందువలననే, అది స్థిరము. స్థిరబుద్ధి నిర్వచనములో శ్రీ శంకరులు 'నిర్విచికిత్సా' అను పదమును జోడించిరి. విచికిత్సా

---

* सर्वभूतेषु एकः समः निर्दोषः आत्मा इति स्थिरा निर्विचिकित्सा बुद्धिः यस्य।
సర్వ భూతేషు ఏకః సమః నిర్దోషః ఆత్మా ఇతి స్థిరా నిర్విచికిత్సా బుద్ధిః యస్య.

అంటే సంశయము. నిర్విచికిత్సా అంటే సంశయము లేకపోవుట. స్థిరమగు జ్ఞానము శంక, అస్పష్టత లేశమైననూ లేని జ్ఞానము. ఇట్టి శంకారహితమగు (నిర్విచికిత్స), పూర్ణముగా దృఢమైన జ్ఞానము గలవాడు స్థిరబుద్ధి యనబడును. పూర్ణముగా శంకారహితమైన జ్ఞానము గల వ్యక్తిలో మోహము పూర్తిగా మాయమగును. అట్టివానికి ఆత్మ విషయమగు మోహము లేశమైననూ ఉండదు. అతడు ఆత్మను కర్తగా, భోక్తగా భావించడు. ఆత్మ ఒకానొక దేశములో ఇతరము సర్వము కంటె భిన్నముగా నుండుననే భ్రాంతి అతనియందు ఉండదు. ఇట్టి వానిని ఈ శ్లోకము 'అసమ్మూఢః' అని వర్ణించినది.

బ్రహ్మ ఆత్మ కంటె భిన్నము కాదు

బ్రహ్మ జ్ఞానము గల వాడే (బ్రహ్మవిత్) అసంమూఢుడు. ఆత్మను తెలిసిన వాడు ఆత్మ విత్ యనబడును. ఆత్మ విత్, బ్రహ్మవిత్ ఒక్కరే. ఆత్మను తెలిసినవాడు బ్రహ్మ విత్. బ్రహ్మను ఎరింగినవాడు ఆత్మ విత్. ఏలయన, బ్రహ్మ ఆత్మ కంటె వేరుగా లేదు. ఆత్మయే బ్రహ్మ. బ్రహ్మ విత్ అగు వ్యక్తి బ్రహ్మ యందు మాత్రమే స్థిరుడుగా నుండును.

బ్రహ్మ ఆత్మ కంటె వేరు కాదు గనుక, బ్రహ్మజ్ఞానమును పొందిన వ్యక్తి ఆ జ్ఞానమును పోగొట్టుకునే అవకాశము లేదు. కావున, బ్రహ్మజ్ఞాని బ్రహ్మము నందు స్థిరుడై యుండును. బ్రహ్మజ్ఞానము స్మృతికి సంబంధించిన విషయము కాదు. ఒక వస్తువును గురించి మనము గుర్తు తెచ్చుకొనుటను స్మృతి యందురు. ప్రస్తుతంలో, జ్ఞాని ఒకప్పుడు ఆత్మ యాథార్థ్యమును ఎరుంగని వాడే అయినా, ఇప్పుడు అతనిలో అజ్ఞానమునకు తావు లేదు. ఆత్మ సదా ఉండేది గాన, దానిని విస్మరించే ప్రసక్తి లేదు. బ్రహ్మను యెరింగినవాడు బ్రహ్మయే. అతడు బ్రహ్మయందు స్థిరముగా నుండును! ఈ విధంగా శాస్త్ర సారమంతా ''స్థిరబుద్ధిః అసంమూఢః బ్రహ్మవిత్ బ్రహ్మణి స్థితః' అను ఒకే ఒక వాక్యము నందు నిహితమై యున్నది.

తరువాతి శ్లోకములో, శ్రీకృష్ణుడు ఇట్టి జ్ఞానుల ఆనందమును వర్ణించుచున్నాడు:

అధ్యాయము 5, శ్లోకము 21:

बाह्यस्पर्शेष्वसक्तात्मा विन्दत्यात्मनि यत्सुखम् ।
स ब्रह्मयोगयुक्तात्मा सुखमक्षयमश्नुते ॥ २१ ॥

బాహ్యస్పర్శేష్వసక్తాత్మా విన్దత్యాత్మని యత్సుఖమ్
స బ్రహ్మయోగయుక్తాత్మా సుఖమక్షయమశ్నుతే

బాహ్య స్పర్శేషు = జ్ఞానేంద్రియ గోచరములగు బాహ్య విషయముల యందు; అసక్త–ఆత్మా = లగ్నము కాని మనస్సు కల్గిన జ్ఞాని, ఆత్మని = ఆత్మ యందు; యత్ = ఏ; సుఖం = సుఖమును; విందతి = పొందునో; బ్రహ్మయోగ యుక్తాత్మా = బ్రహ్మజ్ఞానముతో కూడిన మనస్సు గల; సః = అతడు; అక్షయం = వినాశము లేని; సుఖం = ఆనందమును; అశ్నుతే = పొందును.

జ్ఞానేంద్రియ గోచరములగు బాహ్య విషయముల యందు లగ్నము కాని మనస్సు గల వ్యక్తి ఆత్మ యందు పూర్ణసుఖమును పొందును. బ్రహ్మజ్ఞానముతో నిండిన మనస్సు గల జ్ఞాని వినాశములేని ఆనందమును పొందును (21).

ఈ శ్లోకమును మనము రెండు విధములుగా వ్యాఖ్యానించవచ్చును. ముందుగా మనము శ్రీ శంకరుల వ్యాఖ్యానమును పరిశీలించి, తరువాత రెండవ వ్యాఖ్యానమును చూతము. జ్ఞానేంద్రియములతో సన్నికర్ష (contact) ను పొందే బాహ్య వస్తువులకు బాహ్య స్పర్శలని పేరు. ఈ సమాసమును శ్రీ శంకరులు 'బాహ్యాశ్చ తే స్పర్శాశ్చ' అని విడదీసిరి. అనగా, అవి బాహ్యములు (బాహ్యాః), మరియు జ్ఞానేంద్రియములతో సన్నికర్షను పొందునవి (స్పర్శాః). స్పర్శ శబ్దమును సాధారణముగా తాకుట అను అర్థములో మాత్రమే వాడతారు. త్వగింద్రియముచే గ్రహింపబడేది స్పర్శ యనబడును. ఈ అర్థమునే ఇతర ఇంద్రియములకు కూడా వర్తింపజేసినపుడు, ఇంద్రియ సన్నికర్షను పొందే వస్తువు లన్నియు స్పర్శలనబడును.

శబ్దము మొదలగు (శబ్దాదయః) ఇంద్రియ గోచరములైన విషయములన్నియు స్పర్శలు మరియు బాహ్యములు. కావున అవి బాహ్యస్పర్శలు. అది శబ్దముచే రూప, రస, స్పర్శ, గంధములు గ్రహింపబడును. జ్ఞాని ఈ బాహ్యవస్తువుల విషయంలో (బాహ్య స్పర్శేషు) అసక్తాత్ముడై యుండును. అనగా అతని మనస్సు (ఆత్మ) వాటి యందు సంబద్ధము కానిదై (అసక్త) ఉండును. అనగా, అతని మనస్సు వాటి యందు తగుల్కొని యుండదు. అనగా, మనస్సు నందలి లలిత కల్పన (fancy) లు అతనిని క్షోభపెట్టవు. కావున, బాహ్యవస్తువుల సంపర్కము వలన మనస్సులో ఉదయించే లలితకల్పనలచే అపహృతము కాని బుద్ధి గల వ్యక్తిని ఈ శ్లోకము 'బాహ్యస్పర్శేషు అసక్తాత్మా' అను రెండు పదములలో వర్ణించినది.

వాంఛల నుండి విముక్తి

'బాహ్య స్పర్శేషు అసక్తాత్మా' యనగా ఇంద్రియ గోచరములగు విషయముల యందు ప్రీతి లేనివాడు (విషయేషు ప్రీతి వర్జితః) అని శ్రీ శంకరులు వివరించిరి. బాహ్యవస్తువులు లేనప్పుడు వాటి కొరకు దుఃఖించని వాడు 'విషయేషు ప్రీతివర్జితః' అనబడును. ఇట్టి వ్యక్తి ఆత్మ యందు నిక్షిప్తమై యున్న ఆనందము (యత్ సుఖమ్)ను పొందును. ఇచట ఆత్మ యనగా సత్-చిత్-ఆనంద-ఆత్మ.

సుఖమును గురించి ఈ విధముగా చెప్పుటకు కారణమేమనగా, వస్తువులు వాటంతట అవి తమకు సుఖము నిచ్చుచున్నవని మానవులు తలపోస్తారు. కాని, బాహ్యవస్తువుల ఉపకరణత్వమేమియూ లేకుండగనే, జ్ఞాని కూడా ఆనందముగనే ఉన్నాడు. జ్ఞాని వస్తువులచే ఆనందమును పొందనిచో, అతనికి ఆనందము ఎట్లు లభించును? ఆనందము అంతా అతని లోననే యున్నది. దాని మూలంగా, అతడు ఆనందముగా నున్నాడు.

సుఖము ఆత్మ యొక్క స్వరూపము. ఆత్మ ఆనందఘనము. కావున, ఇచట సుఖ శబ్దమునకు పూర్ణత్వము అర్థము. ఆత్మ యొక్క స్వరూపము పూర్ణత్వము. ఈ సుఖము, పూర్ణత్వము జ్ఞానికి ఎరుకయే. ఇంద్రియములతో సన్నికర్షను పొందుతూ ఉండే బాహ్య వస్తువులచే ఆత్మ ప్రభావితము కాదని జ్ఞాని యెరుంగును. ఆత్మ లోపల ఉపలభ్యమయ్యే, ఆత్మ యొక్క స్వరూపభూతమైన ఆనందమును జ్ఞాని పొందును.

ఈ ప్రకరణములో చర్చింపబడుచున్నది జ్ఞానియే నని చెప్పుటకు ఆధారమేమి? పూర్వశ్లోకమును బట్టి ప్రకరణము స్పష్టమగుటయే గాక, ఈ శ్లోకములోని ద్వితీయార్థము కూడ ప్రకరణమును నిర్దేశించును. ద్వితీయార్థములో బ్రహ్మయోగ-యుక్త-ఆత్మా అను పదము గలదు. ఆత్మను బ్రహ్మగా ఎరుంగుటయే బ్రహ్మయోగము. ఈ ఎరుకయే యోగము. 'యుక్త' అనగా కూడియున్నవాడు. కావున, బ్రహ్మజ్ఞానముతో కూడియున్న అంతఃకరణము గలవాడు బ్రహ్మ యోగయుక్తాత్మా అనబడును. ఇచట 'ఆత్మా' అనగా అంతఃకరణము. ఇట్టివాడు ఆత్మరూపమగు ఆనందమును పొందును (బ్రహ్మయోగ యుక్తాత్మా ఆత్మని సుఖం విందతే).

ఆపేక్షిక సుఖము, ఆత్యంతిక సుఖము

ఆత్మ యందు ఎంత సుఖము గలదు? అను శంక కలుగవచ్చును. ఐస్‌క్రీము తింటే కొంత ఆనందము లభించును గదా! ఆత్మ యందు బహుశః అటువంటి అల్పమగు ఆనందము ఉండును

గాబోలు! ఇది వచ్చిపోయే ఆనందము. బ్రహ్మయోగ యుక్తాత్ముడగు వ్యక్తికి ఆత్మయందు ఇట్టి ఆనందమే లభించునా యేమి? కాదు అని శ్రీకృష్ణుని సమాధానము. ఆత్మయందలి సుఖము తరిగిపోయేది కాదు (సుఖం అక్షయం అశ్నుతే). మనము ప్రేమను పంచే కొలదీ అది పెరుగుతూ ఉంటుందని బోధించే పాట ఒకటి గలదు. అంటే, ప్రేమ ఖర్చు కాదు; నశించదు. అటులనే, ఇక్కడ కూడా ఆత్మయందలి సుఖము పరిస్థితులపై ఆధారపడేది కాదు (సుఖం అక్షయమ్). అది నీవే; నీ స్వరూపము.

ఈ శ్లోకమును మరో రీతిలో వ్యాఖ్యానించవచ్చును. శ్లోకములోని రెండు సగభాగములు రెండు వేర్వేరు వ్యక్తులను వర్ణించును. బాహ్య విషయములచే అపహృతము కాని మనస్సుగల (బాహ్యస్పర్శేషు అసక్తాత్మా) కర్మయోగిని ప్రథమార్థము వర్ణించగా, బ్రహ్మజ్ఞానముతో విరాజిల్లే వానిని (బ్రహ్మయోగ యుక్తాత్మా) ద్వితీయార్థము వర్ణించును. ఈ వ్యాఖ్యానము ననుసరించే పక్షంలో, సుఖము కూడా ద్వివిధముగా వర్ణింపబడినదని తెలుసుకోవాలి.

ఒక వ్యక్తి తన ఆనందము కొరకై బాహ్యమగు వస్తువులపై, లేదా పరిస్థితులపై ఆధారపడడు అనుకొనుడు. అతడు సన్న్యాస జీవనమును గడుపువాడు కావచ్చును; లేదా, కర్మయోగి కావచ్చును. ఉన్నదానితో సంతృప్తి పడే ఒక విశిష్ట మానసిక ప్రవృత్తి మూలకంగా పొందగలిగే సుఖము, ఇష్టప్రాప్తి- అనిష్టపరిహారములపై పూర్తిగా ఆధారపడి లభించే సుఖము కంటె అధికశ్రేణికి చెంది ఉంటుంది. ఈ రెండవరకం సుఖము, బాహ్య పరిస్థితులపై ఆధారపడని వ్యక్తి యొక్క సుఖంతో పోలిస్తే, చాల తక్కువ కాలము మాత్రమే నిలబడుతుంది. ఉదాహరణకు, నీకు పనసకాయ కూర ఇష్టము అనుకో. కాని వంటవాడు దానిని నీకు నచ్చిన రీతిలో చేయకపోవచ్చును. ఈ విధంగా, మనకు లభించే సుఖాలలో హెచ్చు తగ్గులు ఉంటాయి. ప్రపంచమంతటా ఈ పరిస్థితి సమానమే. సాధారణంగా, మానవులు ఇష్టమగు వస్తువులు లభించాలని, అనిష్టములు దూరంగా ఉండాలని కాంక్షిస్తారు.

పరిణతిలోని సుఖము

దీనికి భిన్నంగా ఒక వ్యక్తి అంతరంగ పరిణతి కలవాడై, తాను చేయగల్గిన కర్మను ఉల్లాసంగా చేస్తూ, ఆనందంగా ఉన్నాడనుకొనుడు. అతనికి కొంత సుఖము లభించుచున్నదనుటలో సందేహము లేదు. అతనిలో భక్తుని లక్షణములు ఉన్న కారణంగా, రాగద్వేషములపై పూర్తిగా ఆధారపడని సుఖము అతనికి లభించును. ఈ సుఖమునకు, రాగద్వేషములు గాక, అతనిలోని సంతుష్టభావన అవలంబనమగును. కర్తవ్యతా భావనతో చేయదగిన కర్మలు కొన్ని గలవనే సత్యమును ఇట్టి వ్యక్తి

గుర్తించి, వాటిని ఈశ్వరార్పణ బుద్ధితో ఆచరించుట యందు ఆనందమును పొందుతాడు. ఆతడు ఈశ్వరుని ఆరాధించే ప్రక్రియలో సహజంగానే విలక్షణమైన ఆనందమును పొందుతాడు. ఈ ఆనందము, ఉల్లాసముల మూలంగా ఆతడు రాగద్వేషములకు వశవర్తి గాకుండును.

రాగద్వేషముల బంధినుండి విముక్తి పెరిగే కొలదీ, మనము చిన్న చిన్న విషయాలలో కూడా ఆనందమును పొందగల్గుతాము. రాగద్వేషముల పరిపూర్తితో సంబంధము లేకుండగా, మనకి ఆనందము నీయగలిగే వస్తువులు జీవితంలో చాలా ఉన్నాయి. కావున, 'బాహ్యస్పర్శేషు అసక్తాత్మా' అగు వ్యక్తి మనస్సులో సుఖమును పొందును. అతడు ఒక వస్తువును త్యజించిననూ, దాని లోపమే అతనిని ఇబ్బంది పెట్టదు. అది లేకపోయినా, అతనికి సుఖము ఉండును. అతని సుఖము సీమితమైనదే. కాని, పూర్తిగా రాగద్వేషముల వశవర్తిగా ఉండే వ్యక్తికి లభించే సుఖము కంటె నిశ్చితంగా అతని సుఖము అధికమైనది.

రాగద్వేషములకు బద్ధుడైన వ్యక్తి యొక్క సుఖము చాల అల్పముగను, క్షణికముగను ఉండును. కాని, రాగద్వేష వశవర్తి కాని వ్యక్తి, కర్మయోగి కావచ్చును; లేదా సన్న్యాసి కావచ్చును. అతనిలో ఒక విలక్షణమగు మనోభావము ఉండును. దాని వలన అతడు తనలోని ఆనందమును చవిచూచును (ఆత్మని సుఖం విందతి). ఇచట 'ఆత్మని' యనగా తనలో, తన మనస్సులో అని యర్థము.

'బాహ్య స్పర్శేషు అసక్తాత్మా' అని వర్ణింపబడిన వ్యక్తియే 'బ్రహ్మయోగ యుక్తాత్మా' కూడా అయినచో, యేమగును? రాగద్వేషముల పట్టు నుండి బయటపడిన వ్యక్తికి కొంత సుఖము లభించుననుటలో సందియము లేదు. కాని, అదే వ్యక్తి యొక్క మనస్సు బ్రహ్మ జ్ఞానముతో ప్రకాశించి, అతడు బ్రహ్మతో ఐక్యమును చెందినచో, అపుడాతనికి లభించు సుఖమెట్టిది? అతనికి హెచ్చు తగ్గులు లేని, ఆత్మ స్వరూపమగు సుఖము లభించును.

ఈ మొత్తం వ్యవహారములో ఒక నియతక్రమము గలదని మనకు స్పష్టమగుచున్నది. బాహ్యవస్తువుల యందు లగ్నము కాని మనస్సు గల వ్యక్తికి, బాహ్యవస్తువుల మూలంగా కాక, అతని మనస్సులోని ఉల్లాసము కారణంగా, కొంత సుఖము లభించును. దీనికి మూలము అంతఃకరణ శుద్ధి. ఇట్టివాడు బ్రహ్మయోగ యుక్తాత్మా అయినచో, అతనికి స్వరూప భూతమైన, అపరిచ్ఛిన్నమైన, శాశ్వత సుఖము లభించును.

ప్రకరణము యొక్క విశిష్టత

ఈ శ్లోకము పై క్రమమును స్పష్టముగా నిరూపించుచున్నది. శ్రీ శంకరులు ఇప్పుడు ఇక్కడ ఉన్నచో, ఈ రెండవ వ్యాఖ్యానము పూర్వాపర సందర్భములకు అనురూపమైనదని వారంగీకరిస్తారని నేను భావిస్తాను. శ్రీ శంకరుల భాష్యానికి భిన్నంగా వ్యాఖ్యానించేటప్పుడు, ఆ వ్యాఖ్యానము ప్రకరణమునకు అనురూపంగా ఉండాలి. అట్లు కానిచో, శాస్త్ర పండితులు ఆ వ్యాఖ్యానము తప్పని తేలికగా నిరూపించగల్గుతారు. అట్లు గాక, ప్రకరణమును సరిగా తెలుసుకుని, అంతకు పూర్వంలో ఉపదేశించబడిన విషయమునకు విరుద్ధము కాని నూతనార్థము భాసించినచో, దానిని ప్రతిపాదించవచ్చును. సంప్రదాయజ్ఞులు ఆ నూతనార్థమును స్వీకరిస్తారు.

శ్రీ శంకరులు కూడా ఒకే శ్లోకమును రెండు, మూడు దృష్టికోణాలలో పరిశీలించేవారు. ఈ పద్ధతి సంప్రదాయ విరుద్ధము కాదు. కాని, మనము చెప్పే వ్యాఖ్యానము వ్యాకరణ రీత్యా, ప్రకరణ రీత్యా మరియు యుక్తి రీత్యా శాస్త్రవిరుద్ధముగా నుండరాదు. శాస్త్రమును సమగ్రముగా విచారించి, ఆ తరువాతనే అర్థమును చెప్పుట సంప్రదాయము. కావున, నూతన అర్థమును చెప్పాలంటే, అత్యధిక జాగరూకత ఉండాలి. పూర్వాపర ప్రకరణములను సంపూర్ణముగా పరిశీలించాలి.

ఈ రెండవ వ్యాఖ్యానమునకు రాబోవు శ్లోకములలో సమర్థన లభించును. మనమీ విషయమును ముందు ముందు చూస్తాము:

అధ్యాయము 5, శ్లోకము 22:

ये हि संस्पर्शजा भोगा दुःखयोनय एव ते ।
आद्यन्तवन्तः कौन्तेय न तेषु रमते बुधः ॥ २२ ॥

యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే
ఆద్యంతవంతః కౌంతేయ న తేషు రమతే బుధః (22)

కౌంతేయ = ఓ కుంతీ పుత్రా!; హి = ఏలయనగా; సంస్పర్శజాః = (జ్ఞానేంద్రియములకు, ప్రియమగు వస్తువులకు మధ్య కలిగిన) సన్నికర్ష వలన పుట్టిన; భోగాః = భోగములు; యే = ఏవి గలవో; తే = అవి, దుఃఖయోనయః ఏవ = దుఃఖమూలములు మాత్రమే; ఆద్యంతవంతః = ఆరంభము, తుది గలవి; బుధః = వివేకవంతుడు; తేషు = వాటి యందు; న రమతే = రమించడు.

ఓ కుంతీపుత్రా! జ్ఞానేంద్రియములకు, ప్రియమగు వస్తువులకు మధ్య సన్నికర్ష వలన పుట్టు భోగములు దుఃఖబీజములు; ఆద్యంతములు గలవి. కావున, వివేకి వాటి యందు రమించడు (22).

బాహ్య స్పర్శేషు అసక్తాత్మా, బ్రహ్మయోగ యుక్తాత్మా అని వర్ణింపబడిన ఇద్దరిని గురించి మరల ఈ శ్లోకము చెప్పుచున్నది. ఇంద్రియములతో సంపర్కమును పొందే వస్తువులు 'సంస్పర్శములు' అనబడును. 'స్పర్శ' యనగా 'సన్నికర్షను పొందుట' అని మనము చూచియున్నాము. ఇంద్రియములకు, కోరబడే వస్తువులకు (ఇష్టవిషయములు) మధ్యలో సంబంధమేర్పడి, ఆ సంబంధము వలన ఉల్లాసకరమగు అనుభవము కలుగును. దానికే సుఖము, లేదా భోగము అని పేరు. ఇష్ట విషయములతో ఇంద్రియముల సంయోగము వలన ఉల్లాసకరమగు అనుభవములు పుట్టును (సంస్పర్శజా భోగాః).

శ్రీకృష్ణుడీ శ్లోకములో ఇంకనూ ఇట్లు చెప్పెను: ఈ భోగములలో దుఃఖబీజములు అంతర్నిహితమై యున్నవి (దుఃఖయోనయః). యోని అనగా జన్మస్థానము. జ్ఞానేంద్రియములకు, ప్రియవస్తువులకు మధ్యలో సంపర్కము వలన జనించే ఈ ఆహ్లాదకరమగు అనుభవములు (భోగములు) దుఃఖమునకు బీజరూపములో నున్న కారణములు. అనగా, దుఃఖములు వాటి నుండియే పుట్టును. ఎందువలన? ఆహ్లాదకరమగు అనుభవము లభించుటకు పూర్వమే దుఃఖము గలదు. ఏలయన, వాటిని పొందుటకై మనము కష్టపడాలి.

ఒక ప్రియమగు వస్తువునకు, లేక పరిస్థితికి జ్ఞానేంద్రియములతో సన్నికర్షను సంపాదించుట తేలిక కాదు. దూరములో నున్న వస్తువును నేను చూడాలనుకుంటే, నేను అచటకు వెళ్లాలి; లేదా, ఆ వస్తువును నా వద్దకు రప్పించుకోవాలి. ఆ వస్తువు పర్వతమైనచో, నేనే అచటకు వెళ్లాలి. ఇతర వస్తువుల విషయంలో నా వద్దకు రప్పించుకునే అవకాశము ఉండును. ఈ రెండు విధములలోను, దానిని చూచే అనుభవమును సంపాదించుటకై నేను కష్టపడాలి. నేను దాని సన్నిధికి చేరాలి; లేదా, అది నా సన్నిధికి రావాలి. ఈ సన్నికర్ష కలగాలంటే, నేను చాలా కృషిచేయాలి. పైగా, ఇది ఆరంభము మాత్రమే.

సన్నికర్ష జరిగిందనుకుందాము. అది సరిగా జరగాలి; అభిలషణీయమై ఉండాలి. రుచ్యమగు ఆహారమును చూడగానే, నాకు ఉల్లాసము కలుగును. కాని, నాలుకపై వేసుకున్నప్పుడు, అది చాలా వేడిగా ఉంటే, ఇబ్బంది కలుగును. దానిని చూచుట ఒక సన్నికర్ష. అది అభిలషణీయము. నాలుకపై వేసుకొనుట రెండవది. ఇది అప్రియము. కావున, సన్నికర్ష సదా యోగ్యముగా, అభిలషణీయముగా నుండుట సరళమైన విషయము కాదు.

ప్రియానుభవములు క్షణికములు

ప్రియానుభవము ఎంతవరకు ఉండును? అనేది మరో సమస్య. ఒక వస్తువును అనుభవిస్తూ ఉంటే, అది ఖర్చయిపోతుంది. అపుడు సన్నికర్ష లుప్తమవుతుంది. లేదా, వ్యక్తి అలసిపోవుటచే, సన్నికర్షను కొనసాగించలేకపోవును. మరియు, దానిని అనుభవించాలనే, మనోభావము తొలగిపోవును. అట్టి స్థితిలోనైనమూ, సన్నికర్ష లుప్తమగును. కావున, మనోభావము మారుట వలనగానీ, ఇంద్రియములు అలిసిపోవుట వలన గానీ, లేక వస్తువులు లుప్తమైపోవుట వలన గానీ, ఇట్టి సుఖము తాత్కాలికము; ఒకప్పుడు క్షణికము కూడా అనే అనుభవము మనకు ఎల్లవేళలా కలుగుతూ ఉంటుంది. ఇట్టి సుఖము లుప్తమైన తరువాత, వ్యక్తి దుఃఖితుడిగా మిగిలియుండును.

కావున, భోగానుభవమునకు పూర్వములో దుఃఖము గలదు. భోగములు లభించిన తరువాత 'ఈ భోగము నా నుండి జారిపోవునేమో' యని దుఃఖిస్తూ మనము కాలమును గడుపుతాము. అంతములో, భోగము జారిపోయిన తరువాత మరింత దుఃఖము కలుగును. మరల, భోగముల కొరకు పనిని ఆరంభించాలి.

భోగము అన్నింటికి ఆరంభము (ఆది), అంతము కలవు. కావున, భోగములన్నీ దుఃఖకారణములే. వాటిని ఈ శ్లోకము 'అద్యంతవంతః' అని వర్ణించినది. భోగమునకు ప్రియసన్నికర్ష ఆది; ప్రియ సన్నికర్ష తొలగిపోవుటయే అంతము. అనగా, భోగములన్నీ అనిత్యములని యర్థము.

భోగములు అనిత్యములు అనే సత్యమును తెలుసుకున్న వ్యక్తిని ఈ శ్లోకము 'బుధః' అని వర్ణించినది. బుధుడు అనగా వివేకి. బుధుడు అంటే జ్ఞాని అని కూడా అర్థమును చెప్పవచ్చును. శ్రీ శంకరులు ఈ శ్లోకభాష్యములో అటులనే చెప్పిరి. ఆత్మయొక్క యాథార్థ్యము నెరింగినవాడు (అవగత పరమార్థ తత్త్వః) 'బుధః' అనబడును.

ఇంద్రియసుఖముల అనిత్యత్వము నెరింగిన వివేకి, వినాశము లేని సుఖమును (అక్షయ సుఖము) పొందే యత్నమును చేయును. అందువలననే, అట్టి వివేకి 'బాహ్య స్పర్శేషు అసక్తాత్మా (బాహ్య వస్తువుల సమ్మోహన శక్తిచే అపహృతము కాని మనస్సు గలవాడు)' అనబడును. అతడు వివేక ప్రభావముచే 'బాహ్య స్పర్శేషు అసక్తాత్మా' అగును.

ఇట్టి కర్మయోగి సహజమగు ఉల్లాసముతో గూడినవాడై, కర్తవ్య కర్మను చేసుకుంటూ ముందుకు సాగుతాడు. కర్మయోగి కూడా కొన్ని భోగాలలోని సుఖమును అనుభవించవచ్చును.

కాని, అతడు వాటిచే బద్ధుడు కాడు. ఇట్టి కర్మయోగికి బ్రహ్మజ్ఞానము యొక్క అనుగ్రహము కలిగినపుడు (బ్రహ్మయోగ యుక్తాత్మా), అతడు అక్షయమగు సుఖమును పొందును.

కామవలంకు వశుడగుట

శ్రద్ధతో ఆత్మవిచారమును చేయాలంటే, విశిష్టమైన మానసిక పరిణతి ఉండాలి. భోగలాలసత్వము ఆత్మ విచారమునకు విరోధి అని శ్రీ శంకరులు తరువాతి శ్లోకభాష్యంలో చెప్తారు. ఆత్మను గురించి, పరబ్రహ్మను గురించి తెలుసుకోవాలనుకునే వ్యక్తి క్లబ్బులకు వెళ్తూ ఉంటే, విచారమునకు అవకాశము ఉండదు. ఆత్మ జ్ఞానానికి ముందు అంతరంగశుద్ధి ఉండాలి. కాని, క్లబ్బుల చుట్టూ తిరిగే వానికి అంతరంగ శోధనమే సంభవము కాదు. అట్టి వ్యక్తి తన రాగద్వేషములను తిన్నగా ఎదుర్కొని నియంత్రించుటకు బదులుగా, వాటికి వశవర్తియై ఉండును. రాగద్వేషముల నెదుర్కొని నియంత్రించే వ్యక్తి మాత్రమే శ్రద్ధతో విచారము చేసే సాధకుడు కాగల్గును.

మనకు వంద సమస్యలు ఉండవచ్చును. కాని, మనము వాటిని ఎదుర్కొనుటకు సంసిద్ధులమైనచో, వాస్తవంలో సమస్యయే లేదు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే వ్యక్తిలో అప్పటికే ఒక విశిష్ట మానసిక పరిణతి ఉండును. అట్టి వ్యక్తికి సమస్యలు తొలగిపోవును. అట్లుగాక, సమస్యలకు లొంగిపోయే వ్యక్తికి వాటిని ఎదుర్కొనే అవకాశము ఎట్లు లభించును? కామనలకు లొంగిపోవుటయే యథార్థమైన సమస్య. శ్రీ శంకరులు చెప్పిన తీరున, ఇట్టి ప్రవృత్తి మోక్షమార్గమునకు విరోధి (కామః శ్రేయోమార్గ ప్రతిపక్షీ). సమస్యలన్నింటిలో ఎదుర్కొనుటకు అత్యంత క్లిష్టమగు సమస్య ఇదియే.

కామనలకు అధీనుడై యుండుట అతిక్లిష్టమగు సమస్యగా పరిగణించబడును. శ్రీ శంకరులు ఇంకనూ ఇట్లు చెప్పిరి. మనము అభిలషించని దుఃఖమునకు, దుఃఖము యొక్క వివిధ రూపములకు కామనయే హేతువు అగును. ఉదాహరణకు, అదుపులేని భోగలాలసత వలన అనారోగ్యము కలిగి, ఆ ప్రక్రియలో ఎంతో ధనము, ఇతరవస్తువులు నష్టమగును. లేదా, ధనము నష్టమై, తన్మూలకంగా ఆరోగ్యము చెడిపోవును. రాగద్వేష రూపములో నుండే ఈ కామనలను తొలగించుట సరళము కాదు (దుర్నివార). వాటి నియంత్రణ కష్టసాధ్యము.

కావున, కామమునకు విరుగుడు చేయుటకై అధిక ప్రయత్నము చేయవలెనని శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములో ఉపదేశించుచున్నాడు:

అధ్యాయము 5, శ్లోకము 23:

शक्नोतीहैव यस्सोढुं प्राक् शरीर विमोक्षणात् ।
कामक्रोधोद्भवं वेगं स युक्तस्स सुखी नरः ॥ २३ ॥

శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్ శరీర విమోక్షణాత్
కామక్రోధోద్భవం వేగం స యుక్తస్స సుఖీ నరః (23)

యః = ఎవడైతే; ప్రాక్–శరీర–విమోక్షణాత్ = దేహత్యాగమునకు పూర్వము; ఇహ ఏవ = ఈ లోకమునందే; కామక్రోధోద్భవం = కామక్రోధముల నుండి పుట్టే; వేగం = వేగమును; సోఢుం = నియంత్రించుటకు; శక్నోతి = సమర్థుడగునో; స = అతడు; యుక్తః = కర్మయోగి; = అ; నరః = మానవుడు; సుఖీ = సుఖము గలవాడు.

ఎవడైతే దేహ త్యాగమునకు పూర్వము ఈ లోకము నందే కామక్రోధముల నుండి పుట్టే వేగమును నియంత్రించుటలో సమర్థుడగునో, అతడే కర్మయోగి; అతడే సుఖము గల మానవుడు (23).

శ్రీకృష్ణుడీ శ్లోకములో కామ క్రోధములను నియంత్రించుమని చెప్పుట లేదు. కామ క్రోధముల నుండి పుట్టిన వేగమును (కామ క్రోధోద్భవం వేగమ్) తగ్గించుమని చెప్పుచున్నాడు. సాధకుడు ముందుగా వేగమును తగ్గించే విధమును తెలియాలి. తరువాత కామక్రోధములను, వాటి వలన కలిగే దుఃఖమును నియంత్రించ గల్గుతాడు. దుఃఖము వెనుక అపేక్ష ఉండును. అపేక్ష పరిపూర్తి కానిచో క్రోధము కలుగును. మనమీ క్రమమును చూచియున్నాము. కామక్రోధములకు ప్రత్యేకమగు తీవ్రత గలదు. వాటి నుండి పుట్టే వేగమును తగ్గించుట ద్వారా వాటి తీవ్రతను తొలగించవచ్చును. కామక్రోధములను ఈ విధముగా వశపరచుకోవాలి.

గీతలోని మనో విజ్ఞానము అంతా మానవుడు తన రాగద్వేషములను నియంత్రించుకొనుట అను అంశముపైననే కేంద్రితమైనది. రాగద్వేషములను సరిగా నిర్వహించుకొనుట ద్వారా, మానవుడు తనకు గల మనో వైజ్ఞానిక సమస్యల నన్నింటిని అధిగమించగల్గును. ఇట్టి సమస్యలు ఉండుట సహజము. కోపము వచ్చుట సాధారణమైన విషయము. కోరికలు ఉండుట కూడ సాధారణమైన విషయమే. సర్వ సాధారణమైన ఈ మనో విజ్ఞానమును గీత రాగద్వేషముల పరిభాషలో నిర్వచిస్తుంది.

కామము అనే పదము రాగద్వేషములను రెండింటినీ నిర్దేశిస్తుంది. మనము ఒక వస్తువును, లేక లక్ష్యమును కాంక్షించే మనోవృత్తి ప్రక్రియకు కామము అని పేరు. కామన ఒక వస్తువును పొందాలని (రాగ) గాని, లేదా ఒక వస్తువును పరిహరించాలని (ద్వేష) గాని ఉంటుంది. పొందిన దానిని నిలబెట్టుకోవాలని గాని, లేదా ఉన్న అనిష్టమును తొలగించుకోవాలని గాని కామన ఉంటుంది. ఈ కామము కొంత వేగమును, కొన్ని లక్షణములను కలిగిస్తుంది. ఈ లక్షణములు కామము యొక్క తీవ్రతను సూచిస్తాయి. ఈ లక్షణములు లేని పక్షంలో, ఆ కామము బంధహేతువు అయినదా, కానిదా తెలిసే అవకాశము లేదు.

ఒక వ్యక్తికి ఒక కామన గలదనుకొనుడు. అది పరిపూర్తి కాని నాడు అతడు దుఃఖితుడు కానిచో, ఆ కామన బంధహేతువు కాదు. మనమిచట బంధహేతువులు కాని కామనల గురించి వర్ణించుటలేదు. మనము వేగమును కలిగించే కామనలను గురించి మాత్రమే చర్చిస్తున్నాము. కామన నుండి పుట్టే వేగము కామన యొక్క తీవ్రతను, కామన పరిపూర్తి కానప్పుడు కలిగే క్రోధము యొక్క తీవ్రతను సూచించును. కావున, కామక్రోధముల నుండి పుట్టే వేగమును నియంత్రించుట మన ప్రధాన లక్ష్యము కావాలి.

ఈ శ్లోకములోని 'ప్రాక్-శరీర-విమోక్షణాత్' అను పదము చాల ప్రముఖమైనది. 'ప్రాక్' అనగా ముందు. విమోక్షణము అనగా విముక్తి. శరీరము స్థూలదేహము. 'స్థూలదేహము నుండి విముక్తికి పూర్వము' అని ఆ పదమునకు అర్థము. అనగా, ఆ వ్యక్తి మరణించుటకు పూర్వము ఈ కామక్రోధముల నుండి పుట్టే వేగమును నియంత్రించగల్గును (శక్నోతి సోఢుమ్). శ్రీకృష్ణుడీ మాటను చెప్పుటలో రెండు కారణములు గలవు. మరణించుటకు పూర్వము ఈ పనిని సాధించగలిగిన వ్యక్తి పరిణతి చెందిన మానవుడు అని చెప్పగలము. ఇది మొదటిది. మరియు, అతడు తన మనస్సును నియంత్రించిన పరిణతుడు గనుక, అతడు ఆనందముగా నుండును (సః సుఖీ).

ప్రౌఢత (Adulthood) యొక్క నిర్వచనము

మానవ జీవితమును రెండు ప్రధాన భాగములుగా విభజించవచ్చునని నాకు అనిపిస్తుంది. బాల్యంలో మానవుడు అన్ని రకముల మూర్ఖతను, మిథ్యను ప్రోగుచేసుకుంటాడు. ఇది మొదటి భాగము. మానవుడు తన జీవితములోని రెండవ భాగములో ఆ మూర్ఖతను, మిథ్యలను నిర్వహించుకుంటూ గడుపుతాడు. ఈ యాత్రలో మధ్యలో ఒకచోట, మానవుడు తాను బాల్యంలో ప్రోగుచేసిన దంతా ప్రస్తుత పరిస్థితిలో అసంగతమనే సత్యమును గ్రహిస్తాడు. ఈ సత్యమును

గ్రహించి, జీవితములో తలయెత్తిన సమస్యలను పరిష్కరించే యత్నమును చేయువాడు మాత్రమే వయుధనబడును. అంతవరకు అతడింకనూ బాలుడే.

కావున, నా అభిప్రాయములో, కామక్రోధముల నుండి పుట్టే వేగమును నియంత్రించగల వ్యక్తి మాత్రమే పెరిగి పెద్దవాడైనట్లు భావించవచ్చును. కామక్రోధముల వేగమును నియంత్రించుటకు విశిష్ట మానసిక పరిణతి కావాలి. కనుక, అట్లు నియంత్రించిన వ్యక్తి సుఖి, మరియు కర్మయోగి అగును.

మానవునకు లభ్యముగా నుండే ఇచ్ఛా స్వాతంత్ర్యము (free will) యొక్క సర్వోత్కృష్ట ప్రకటరూపమే ప్రార్థన. బుద్ధిపూర్వకముగా ఈశ్వరుని భావన చేసి, భక్తిపూర్ణమైన మనస్సుతో ప్రార్థించగల్గుట అనేది పరిణతి చెందిన సంకల్పశక్తి నుండి మాత్రమే ఉద్భవించును. ప్రార్థనకు మూలము సంకల్పమే గాని, నిస్సహాయత కాదు. మానవుడు నిస్సహాయ స్థితిలో తిట్టుకుంటాడు; ఏడుస్తాడు; ఇంకా ఏవేవో చేస్తాడు. కాని, ప్రార్థనకు మూలము నిస్సహాయ స్థితి కాదు. బాధాతప్త హృదయుడగు వ్యక్తి చేయు ప్రార్థన కూడ సంకల్పశక్తి యొక్క సర్వోత్కృష్ట ప్రకటరూపము మాత్రమే.

ప్రార్థనలో, మనము ప్రార్థించే ఈశ్వరుడు మన ముందుగాని, చుట్టు పక్కల గాని ఉండడు. మనము ఎదుర్కొనే ప్రకృతి శక్తులు మాత్రమే మన ఎదురుగా నుండును. కావున, తన జీవితములో ఈశ్వరుని భావనచేసి, ప్రార్థించగల వ్యక్తి కర్మయోగియగును. ఇట్టి ప్రార్థన లేనిదే, కామ క్రోధోద్భవమగు వేగమును నిరోధించుట కష్టమగును. మానవుని హృదయములో ఈ విశిష్టమగు ఆధ్యాత్మిక పరివర్తనము రావాలి. ఈ శ్లోకములోని యుక్తః (అనగా యోగి) అను పదము ఇట్టి పరివర్తనమును నిర్దేశించుచున్నది. ఈ విధముగా కామక్రోధముల నుండి పుట్టు వేగమును నియంత్రించగలిగే కర్మయోగి సుఖియై జీవించును (స సుఖీ నరః).

ముందు కర్మయోగము, తరువాత జ్ఞానము – ఇది క్రమము

మనో విలాసరూపములగు భోగములు పీడాకరములు, దుఃఖబీజములు అని యెరింగిన వ్యక్తి యొక్క మనస్సు వాటిచే అపహృతము కాకుండునని మనము పూర్వ శ్లోకములో చూచియున్నాము. ఇట్టి మనో విలాసములచే అపహృతమైన మనస్సు గల వ్యక్తి కామమునకు, రాగద్వేషములకు అధీనుడై జీవించును. అట్టివాడు యోగికి లభించే ఆనందమును పొందలేడు.

దీనిలో ఒక విశిష్ట క్రమము గలదు. ప్రతి వ్యక్తి ముందుగా కర్మయోగి కావాలి. ఆ తరువాత జ్ఞానము దానంతట అదే ఉదయిస్తుంది. ఇదంతా జరిగేదిఎప్పుడు? ఈ జీవితము లోనే (ఇహైవ) అని మనము 19వ శ్లోకములో చూచియున్నాము. మరణించి, స్థూలదేహమునుండి విముక్తి లభించే లోపులో (శరీర విమోక్షణాత్) ఎప్పుడైననూ జ్ఞానము ఉదయించవచ్చును. ఇంకనూ అజ్ఞాని యగు యోగి మరణించువరకు తన జీవితములో కామక్రోధములను నియంత్రించగలిగే ఈ విశిష్ట సామర్థ్యమును కలిగి ఉండాలి. 'నేను కామక్రోధములను ఎప్పుడో జయించినాను' అని పలికి సాధకుడు దర్జాగా కూర్చుండరాదు. అవి మరల రావని తలపోయరాదు. అవి తప్పక మరలి వస్తాయి. ''ఒక రోజున వాటిని జయించితిని. కావున, అవి వెనుకకు మరలిరావు'' అని చెప్ప వీలు లేదు. ఇది ఒకనాటితో తీరిపోయే సమస్య కాదు. దీనిని మరణించువరకు ప్రతిదినము ఎదుర్కోవాలని శ్రీ శంకరులు ఇచట స్పష్టము చేసిరి.

జ్ఞానము ఉదయించగానే మోక్షము లభించును. ఇది మానవుని జీవితములో వృద్ధాప్యముతో సహా ఎప్పుడైననూ సంభవమేనని మనము చూచియున్నాము.* కావున, 'ప్రాక్ శరీర విమోక్షణాత్' అను పదమునకు మరియొక అర్థమును చెప్పవచ్చును. ఈ ప్రపంచములో, ఈ స్థూలదేహములో నివసించి యుండగనే, పరిణతి చెందిన మానవుడు ఈ జ్ఞానమును పొందగల్గును.

కామక్రోధవేగము మరణము వరకు కొనసాగును

శ్రీ శంకరులు తమ భాష్యములో 'మరణము వరకు' అను అర్థమునకు ప్రాధాన్యము నిచ్చిరి. కామక్రోధ (రాగద్వేష)ముల నుండి పుట్టిన వేగము మానవుని జీవిత కాలమంతయూ, మరణము వరకు, ఆకలిదప్పికల వలె, క్రియాశీలముగ నుండును. ఈ వేగము ఒక రోజు ఉండి, మరుసటి రోజు పోయేది కాదు. మనిషి బ్రతికి ఉన్నంత కాలము ఈ వేగము ఉండి తీరును. దీనికి కారణమేమి? కారణములు అనంతములు (అనంత నిమిత్తవాన్) అని శ్రీ శంకరుల అభిప్రాయము.

మనకు కోపము ఏల వచ్చును? కోపమును కలిగించే పరిస్థితులు అసంఖ్యాకముగా నున్నవి. కావున, కామక్రోధముల నుండి పుట్టే వేగమునకు అంతము లేదు. కొన్ని పరిస్థితులలో వేగము

---

* अन्तकालेऽपि ब्रह्म निर्वाणमृच्छति

అంత కాలేపి బ్రహ్మ నిర్వాణమృచ్ఛతి (2-72).

ఉండదు. కాని, మరికొన్ని పరిస్థితులలో, మనలో కామక్రోధము లున్నప్పుడు, వేగము వివిధ శ్రేణులలో నుండును. ఒకప్పుడు ఈ వేగమునకు మూలమగు కామక్రోధములు తీవ్రముగా నుండవచ్చును!

జాగరూకత ఆవశ్యకము

మనిషికి తాను ఒక వస్తువును చూచువరకు కామము ఉండనే ఉండదు. ఒకసారి చూచిన పిదప కామము బయలుదేరును. అటులనే, ఒక వస్తువును గురించి విన్న తరువాత కామము బయలుదేరును. అంటే, కామము ఎప్పుడైనా ఉద్భవించవచ్చును. ఇందువలననే, శ్రీ శంకరులు వేగమునకు కారణము అనంతములని వ్రాక్రుచ్చినారు. కావున, కామక్రోధోద్భవమగు వేగమును నియంత్రించుటలో మనము సదా జాగరూకులమై ఉండాలి; అజాగ్రత్త పనికిరాదు. అంటే, మనము బిగునుకుపోయి ఉండాలని అభిప్రాయము కాదు. మనము ఉపేక్షాభావముతో ఉండరాదని మాత్రమే దీని అభిప్రాయము. ఇంకనూ జ్ఞానము ఉదయించని యోగి విషయంలో ఈ జాగరూకత మరణించే వరకు ఉండాలి.

కామము రాగద్వేషములను రెండింటిని నిర్దేశిస్తుందని మనము అనుకున్నాము. ఇచట రాగము ప్రత్యేకముగా నొక్కి చెప్పబడుచున్నది. మనము కంటితో ఒక వస్తువును చూస్తాము; లేదా, దాని గురించి వింటాము. ఇంతేగాక, ఒకప్పుడు ప్రియమగు అనుభవము నిచ్చిన వస్తువు ఇప్పుడు స్మరణకు రావచ్చును. మరల ఆ వస్తువు ప్రియమగు అనుభవమును ఈయజాలును. కనుక, దానిని మనము కోరతాము. ఈ కామన దాహము వంటిది. మనకు సుఖము నిచ్చే వస్తువులపై గల దాహమే కామము. కోరిక లన్నీ ఇచట కామము అనబడుట లేదు. బంధహేతువులగు కోరికలు మాత్రమే కామము అనబడును.

మన కామనకు విరుద్ధమైనది కంటబడినా, లేక స్మరణకు వచ్చినా, దుఃఖము కలిగి క్రోధము పుట్టును. కామమునకు, క్రోధమునకు మధ్యలో కొంత దుఃఖము ఉండుట సహజమే. మధ్యలో ఈ దుఃఖము లేనిచో క్రోధము రాదు.

మన అపేక్ష సఫలము కానప్పుడు పీడ కలుగును. మన దారికి అడ్డము వచ్చి, మనకు దుఃఖమును కలిగించిన వస్తువు మన క్రోధమునకు లక్ష్యమగును. ఈ తీరున, కామమే దుఃఖమును, అవిష్టమును, ద్వేషమును కలిగించి, మనలో దాగియుండే క్రోధముగా పరిణమిస్తుంది. ఈ

కామక్రోధముల నుండి పుట్టే వేగమును నియంత్రింపుట అత్యవసరము.

వేగము ఉన్నదని మనకు తెలియుట ఎట్లు? వేగము యొక్క ఉనికిని సూచించే అంశములు కొన్ని గమనించదగినవని శ్రీ శంకరులు నిర్దేశించిరి. మనము అభిలషణీయమైన ఒక వస్తువును చూస్తాము; లేదా, దాని గురించి వింటాము. అప్పుడు యేమగును? వెంట్రుకలు నిక్కబొడుచుకొనును (రోమాంచము); కళ్లు విప్పారును (ప్రహృష్టనేత్రః); నోరు తెరుచుకొనును (ప్రహృష్ట వదనః). ఇవి కామవేగమును సూచించే లక్షణములని శ్రీ శంకరులు చెప్పిరి.

ప్రతి సంస్కృతిలో కామమును ప్రకటించే విలక్షణమైన పద్ధతి ఉంటుంది. ఈ ప్రకటమయ్యే పద్ధతి అనేక రూపాలుగా ఉంటుంది. కనుక, మనము మన కామనలను మన సంస్కృతికి తగ్గ రీతిలో ప్రకటించుట సహజము. మరియు, మనము ప్రకటించిన విధమును బట్టి మన సంస్కారము తేట తెల్లమగును.

శ్రీ శంకరులు కొన్ని క్రోధ లక్షణములను కూడా ప్రస్తావించిరి. శరీరము వణుకుట (గాత్ర ప్రకంపః); చెమట పట్టుట (ప్రస్వేదః); పెదవులను కొరకుట (సందష్ట- ఓష్ఠపుటః); కళ్లు ఎర్రబడుట (రక్తనేత్రః). క్రోధవేగము యొక్క మరికొన్ని లక్షణములేవన, కేకలు వేయుట, అరుచుట, అతిశయించిన శ్వాసక్రియ ఇత్యాది. కామక్రోధవేగము పనిచేస్తున్న సమయంలో వ్యక్తి తన నియంత్రణను కోల్పోతాడు; నియంత్రణ ఆ వేగమునకు అధీనమగును. కావున, ఈ వేగమును శాసించాలి. దీనికి కావలసిన ఉపాయవములను మూడవ అధ్యాయవములో, కర్మయోగ ప్రకరణవములో శ్రీకృష్ణుడు బోధించియున్నాడు. అంతే కాదు. ఈ ఆత్మ నియంత్రణ గీతలో అంతటా కనబడుతుంది.

ఆత్మ నియంత్రణ అనగా నేమి?

మానవుడు అను శాసన బద్ధమగు జీవనమును గడపాలి. అతని జీవనమూల్య సంరచన (value structure) యోగ్యముగా ఉండాలి. అతనిలో ఈశ్వర భక్తి, ప్రసాదబుద్ధి ఉండాలి. ఇట్టి వ్యక్తికి ఆత్మ నియంత్రణ సహజముగా అబ్బును. ఇదంతా మనము తెలుసుకున్నాము. ఉన్నదానిని ఆనందంగా అంగీకరించాలి. ధర్మబద్ధమైన జీవితమును గడపాలి. ఈ జగత్తులో దర్శనమిచ్చే నియతి (order) ని ఈశ్వరరూపంగా దర్శించాలి. అట్టి వ్యక్తిలో ఈ ఆత్మ నియంత్రణ ప్రకాశించును. ఈ విధముగా జీవించు వ్యక్తిలో, కామక్రోధవేగము తన తీవ్రతను గోల్పోవును. అతనికి కోపము వచ్చినా, దానికి వశుడు కాడు. ఆత్మ నియంత్రణ గల యోగి అగు ఉపాయమిదియే.

యోగికి సర్వము వశములో నుండుటచే, అతడు ఉల్లాసముగా సుఖియై ఉండును. అట్లు కానివాడు వేగమునకు వశుడై ఒకప్పుడు మిడిసి పడుతూ, మరియొకప్పుడు క్రుంగిపోతూ ఉంటాడు. వేగ ప్రభావము వలన వ్యక్తి ఆలోచించే శక్తిని కోల్పోయి, ఏ పనిని చేయటానికైనా సంసిద్ధుడగును. కామక్రోధోద్భవమగు వేగమునకు వశమైపోయిన వ్యక్తిలో, ఉన్న కొద్దిపాటి జ్ఞాన సంస్కారములు వ్యర్థములగును. దీనికి భిన్నంగా, ఈ సమస్యను ఎదుర్కొని, ఈ వేగమును తట్టుకొని నిలబడే వ్యక్తి పరిణతి చెందిన మానవుడు (నరుడు) అగును.

సమస్యలను పరిష్కరించే యత్నమును చేయాలి

మానవులు సాధారణంగా ఈ సమస్యను ఎదుర్కొని తొలగించే ప్రయత్నమును చేయరు. జీవితము నంతనూ ఈ కామక్రోధ వేగముతో బాధపడుతూ గడిపేస్తారు. వారి విధంగా వేగమయ జీవితమును గడిపి, మరణిస్తారు. వారికి సమస్యను అర్థం చేసుకునే అవకాశము కూడ లేదు. కాని, ఈనాడు సమాజంలో ఒక నూతన చైతన్యము వెల్లివిరియుచున్నదని తోచును. సమాజంలో అభిలషణీయమగు మార్పు వచ్చుచున్నది. ఉదాహరణకు, నిన్న మొన్నటి వరకు ప్రజలు మద్యపానమునకు బానిసలై కష్టముల ననుభవించిరి. మద్యము వలన కలిగే హాని గురించి వారికి సరియగు అవగాహన లేకుండెను. కాని, మద్యము సేవింపబడే గృహములో నివసించు వ్యక్తులందరూ దాని దుష్ప్రభావమునకు లోనవుతారని ఇప్పుడు ప్రజలు తెలుసుకున్నారు. ఈ అవగాహన నుండి ఒక పెద్ద ఉద్యమము, చైతన్యలహరి బయలుదేరినవి. ఈ సమస్యలను మనము తిన్నగా ఎదుర్కొని, నిర్మూలించుట తప్ప మరో గతి లేదనే సత్యమును సాధారణ ప్రజలు కూడా తెలుసుకుంటున్నారు. ఈ ప్రయత్నము సఫలమగుటకు ఈశ్వరప్రార్థన, ఆధ్యాత్మిక పరివర్తనము ఆవశ్యకము అనే సత్యమును ప్రజలు అంగీకరిస్తున్నారు.

ఇట్టి చైతన్యము వలన సమాజములో యోగ్యమగు అభివృద్ధి కలుగుట సహజమే. ఏలయన, ఇట్టి పరివర్తన చెందిన వ్యక్తులు ఈ విధమగు సామాజిక చైతన్యము వలన కలిగిన మార్పులను తమ అనుభవమునకు తెచ్చుకొని, యథార్థమగు సాధువర్తనులుగా తయారగుదురు. వీరు ఇతరుల సమస్యల విషయంలో సంవేదనశీలురు (sensitive) గా నుందురు. వీరు ఇతరులకు హాని చేయరు. ఇతరుల కష్టముల నెరింగి, పరస్పర సహాయ సహకారముల నందించు కొందురు. వారు కష్టాలను అధిగమించిన వారు గాన, ఇతరుల కష్టములు వారికి తెలుస్తాయి. పీడ ఎట్టిదో వారెరుంగుదురు. ఇతరుల ప్రవర్తనను వారు సానుభూతితో అర్థంచేసుకుంటారు. బహుశః మద్యనిషేధంతో ప్రారంభమై, ఈ సమాజము ఒక నిమార్పు సమాజముగా రూపుదిద్దుకొనును కాబోలు!

ఇచట ప్రధాన తాత్పర్యమేమన, సమస్యలను ఎదుర్కొని పరిష్కరించాలి. సమస్యలు ఉండుట పెద్ద విషయమేమీ కాదు. ఒకచో, మనయందు దోషము లేకపోయినా, సమస్యలు ఉంటాయి. ఈ సమస్యలు దీర్ఘకాలములో నిర్మాణమవుతాయి. 'సమస్యలు కావాలి' అని కోరుకొని, వెతికి వెతికి తెచ్చుకున్నవి కావు గదా! మన అభీష్టమునకు విరుద్ధంగా మనకు సమస్యలు సంప్రాప్తమవుతాయి. కాని, మనము వాటిని ఎదుర్కొని పరిష్కరించాలి. ఇక్కడ ఈ జీవితంలో ఈ స్థూలదేహములో ఉంటూ, మరణించుటకు ముందే (ప్రాక్ శరీర విమోక్షణాత్) పరిష్కరించాలి.

ముందుగా మనము సమస్యలను నిర్మాణం చేసుకుంటాము. తరువాత, వాటిని పరిష్కరిస్తాము. మనిషి వృద్ధిని చెందు మార్గము ఇదియే ననిపిస్తుంది. మనము అవరోధములను నిర్మించి, వాటిపై నుండి దుమికే యత్నమును చేస్తాము. జీవితము అవరోధములతో కూడిన పరుగు పందెము (hurdle race) వంటిది. దానిలో ఎంతో ఉల్లాసము గలదు. అవరోధములతో కూడిన పరుగు పందెములో ప్రమోదము ఇంకనూ అధికముగ నుండును. ఇచ్ఛా స్వాతంత్ర్యము గల మనుజునకు ఈ పరిస్థితి అనివార్యము. ఈ సృష్టియే అట్లు ఉన్నది. సృష్టి ఇప్పటికిప్పుడు మారిపోదు గదా! మనుజులు కూడా ఇచ్ఛా స్వాతంత్ర్యము లేనివారై పూర్వ నిర్ణీత పద్ధతిలో (programmed life) జీవించే పక్షంలో వారు మానవులే కారు. అట్టి స్థితిలో గీతకు గాని, క్రమ వికాసమునకు గాని అవకాశమే లేదు. ఇచ్ఛాస్వాతంత్ర్యము గలవాడే మానవుడు. మనకు ఇచ్ఛా స్వాతంత్ర్యము ఈయబడినది. కావున, దానిని వినియోగించి జ్ఞానమును సముపార్జించే బాధ్యత మనది మాత్రమే.

ప్రతి వ్యక్తి ఆరంభంలో నిష్కపటంగా ఉంటాడు. అట్టి నిష్కపట స్థితిలో వ్యక్తి సమస్యలను ప్రోగుచేసుకుంటాడు. తగినన్ని అనుభవములను, దుఃఖములను పొంది, వ్యక్తి ప్రౌఢుడు (adult) అగును. కావున, అట్టి వ్యక్తి సమస్యలను ఎదుర్కొని, పరిష్కరించి సుఖి యగును. ఇట్టి వాడు మాత్రమే యథార్థమైన మానవుడు. ఈతడే కర్మయోగి. ఇతడు తరువాతి అడుగును వేయుటకు సిద్ధముగా నున్నాడు. అనగా, అతని మనస్సు జ్ఞానోదయమునకు సంసిద్ధమగుచున్నది.

తరువాతి శ్లోకములో శ్రీకృష్ణుడు జ్ఞానిని వర్ణించుచున్నాడు:

అధ్యాయము 5, శ్లోకము 24:

योन्तस्सुखोऽन्तरारामस्तथाऽन्तर्ज्योतिरेव यः ।
स योगी ब्रह्म निर्वाणं ब्रह्मभूतोऽधिगच्छति ॥ २४ ॥

యోంతః సుఖోంతరారామస్తథాంత ర్జ్యోతిరేవ యః
స యోగీ బ్రహ్మ నిర్వాణం బ్రహ్మభూతోధిగచ్ఛతి (24)

యః = ఎవడైతే; అంతస్సుఖః = తన యందు మాత్రమే ఆనందమును పొందునో; అంతరారామః = తన యందు మాత్రమే విశ్రాంతిని పొందునో; తథా = మరియు; యః = ఎవడైతే; అంతర్జ్యోతిః = ఆత్మప్రకాశము కల్గియుండునో; సః = అట్టి; యోగీ ఏవ = యోగి మాత్రమే; బ్రహ్మభూతః = ఆత్మయే బ్రహ్మగా గలవాడై; బ్రహ్మ నిర్వాణం = బ్రహ్మాభిన్నమగు మోక్షమును; అధిగచ్ఛతి = పొందును.

> ఎవడైతే ఆత్మ యందు మాత్రమే ఆనందమును, విశ్రాంతిని, జ్ఞాన ప్రకాశమును పొందునో, అట్టి యోగి మాత్రమే, ఆత్మయే బ్రహ్మగా గలవాడై, బ్రహ్మాభిన్నమగు మోక్షమును పొందును (24).

పూర్వశ్లోకములో శ్రీకృష్ణుడు ప్రసన్నముగా, సుఖియై ఉండే కర్మయోగిని గురించి మాటలాడెను. ఈ శ్లోకములో, ఆత్మ బ్రహ్మాభిన్నము అను జ్ఞానము గల జ్ఞానిని ఉద్దేశించి అంతస్సుఖః, అంతరారామః, అంతర్జ్యోతిః అను మూడు అందమైన విశేషణములు ప్రయోగింపబడినవి. వీటి అర్థమును మనము పరిశీలిద్దాము.

తన ఆత్మలో మాత్రమే పూర్ణత్వమును దర్శించే వ్యక్తి అంతస్సుఖుడు అనబడును. ఆత్మ యెట్టిది? బ్రహ్మాభిన్నమగు సచ్చిదానంద ఆత్మ. సాధారణముగా మానవులు తమ సుఖము కొరకై బాహ్య పరిస్థితులపై ఆధారపడతారు. ఈ కారణంగా వారు సమస్యలను కొని తెచ్చుకుంటారు. ఈ విషయమును మనమిదివరలో చూచియున్నాము. ఒక విశిష్ట మానసిక ప్రవృత్తి కారణంగా కర్మయోగి కూడా ఒకానొక విలక్షణమగు సుఖము ననుభవించునని కూడా మనము చూచియున్నాము. ఆత్మ సాక్షాత్కారము గల జ్ఞాని తనలోనే పూర్ణత్వమును దర్శించునని ఈ శ్లోకము చెప్పుచున్నది.

వాస్తవంలో మనము పూర్ణత్వమును మరియెచ్చోట దర్శించగలము? నేను పూర్ణుడను. కాని, నేను పూర్ణతను వాటిలోనే దర్శించగల్గుతాను. వివాహమగుట, కొడుకు పుట్టుట, ఉద్యోగము లభించుట, కొన్ని వస్తువులను కలిగియుండుట ఇత్యాదుల వలన వ్యక్తి పూర్ణుడగునని మనము చెప్పుతాము. పరిపూర్ణత ఇట్టి విషయములపై ఆధారపడునని భావించే వ్యక్తి తొందరలో గాని, ఆలస్యంగా గాని, కష్టం పొందుట నిశ్చయము. ఆత్మ (నేను) జ్ఞానము వందు కేంద్రితమైన

పూర్ణత్వము గల (ఆత్మయే పూర్ణము అను జ్ఞానము గల) వ్యక్తి మాత్రమే పరిపూర్ణుడు. ఆత్మయే పూర్ణము. ఆత్మయందు లోపము లేశమైననూ లేదు. ఆత్మ సర్వధారణల నుండి, కర్తృత్వము నుండి, సర్వపరిచ్ఛేద భావనల నుండి, దోషముల నుండి విముక్తమైనది. ఉన్నది శుద్ధ చైతన్యము మాత్రమే. అదియే సర్వము. అదియే పూర్ణము. ఇట్టి యథార్థమగు పూర్ణత్వము గల వ్యక్తి ఈ శ్లోకములో అంతస్సుఖః అని వర్ణింపబడినాడు.

వినోదము కొరకు బాహ్య వస్తువులు జ్ఞానికి అవశ్యకము కాదు

జ్ఞాని అంతస్సుఖుడు గాన తనలో తాను ఆనందించును; అనగా, తనలో తాను క్రీడించును. మనకు మనోరంజనము కొరకై పేకలు, సినిమా ప్రదర్శన శాలలు, స్కేటింగ్ చేయు సాధనములు ఇత్యాది అనేక ఆటవస్తువులు అవసరమవుతాయి. నీవు నిన్ను రంజింపచేసుకొనుటకై సదా ఏదో ఒక పనిని చేస్తూ ఉంటావు. కాని, జ్ఞాని తనలో తాను రమించునని శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పుచున్నాడు. జ్ఞానికి మనోరంజనము కొరకై ఇంకో వస్తువుతో పనిలేదు. అతడు ఎల్లవేళల యందు రమించును! కళ్లను తెరచినా, మూసినా, అతనికి ఉల్లాసమే. అతడు తన మనస్సును పరిశీలించిన సందర్భాలలో మరింత రమించును. జ్ఞానికి కూడ స్మృతులు ఉండును. కాని, అతడు వాటి యందు ఇరుకుకొని పీడను పొందడు. అతని మనస్సు వాటి యందు కులాసాగా రమించును.

మనస్సు ఒక వినోదోద్యానము (amusement park) వంటిది. మనకు ఉల్లాసము నిచ్చుటకు మనస్సును మించిన వస్తువు మరియొకటి అక్కరలేదు. మానవునకు కావలసినంత మనోరంజనమును, చింతనములను, హర్షోద్రేకములను కూడ మనస్సు సమకూర్చును. మనస్సు సంగీత విభావరులను, చలన చిత్రములను కూడ ప్రదర్శించగల్గును. జ్ఞాని తనలో తాను రమించును గావ, ఈ శ్లోకములో అంతరారామః అని వర్ణింపబడినాడు.

ఆఖరుగా, జ్ఞాని 'అంతర్జ్యోతిః' అని వర్ణింపబడినాడు. ఈ ప్రకరణములో జ్యోతిః అనగా మనస్సు. జ్యోతిః అంటే దీపము అని సామాన్యార్థము. మనస్సు దీపము వలె పదార్థములను మనకు ప్రకాశింపచేయును. కావున, మనస్సు జ్యోతిః అనబడును. మనస్సు పదార్థములను ప్రకాశింపచేయుటయే గాక, ఈ ద్వైత జగత్తునకు అధిష్ఠానముగా నుండే ఆత్మ విషయములో కూడ జాగృతమై యుండును. స్వప్నములో స్వప్నద్రష్ట, స్వప్నము, స్వప్నదృశ్యములు అను మూడు ఆత్మయే. జాగ్రదవస్థలో కూడా అంతే. జ్ఞాత లేక ద్రష్ట ఆత్మయే. జ్ఞానము లేక దర్శనము కూడ ఆత్మయే. జ్ఞేయ పదార్థములు, లేక దృశ్య పదార్థములు కూడ ఆత్మయే. ఆత్మరూపముగా నున్న చైతన్యము జ్ఞాతృ చైతన్యము ఒక్కటియే.

జ్ఞానము అన్నిటిలో చైతన్యము మిళితమై యుండును. ప్రతి మనోవృత్తియూ చైతన్యమే. మనోవృత్తిలో విషయమైన వస్తువు ఈ చైతన్యము కంటె భిన్నము కాదు. సర్వము యొక్క ఉనికి (సత్) ఈ చైతన్యమే. ఈ జ్ఞాతృ–జ్ఞేయ–జ్ఞాన విభేదము ఆభాస మాత్రమే; కాని, ఇది మంచి ఆభాస. ఆత్మ సాక్షాత్కారము గల వ్యక్తి యొక్క మనస్సు ఆత్మ విషయములో జాగృతమై యుండును. ఇట్టివాడు అంతర్జ్యోతిః అనబడును.

ఈ శ్లోకములో జ్ఞాని 'యోగి' అని వ్యవహరింపబడినాడు. జ్ఞాని పరబ్రహ్మ రూపములో నుండును (బ్రహ్మ భూతః). అనగా, ఆత్మయే బ్రహ్మము. ఆత్మ బ్రహ్మము కంటె వేరు గాదు. ఇట్టి జ్ఞానికి ఏమి లభించును? మోక్షము (బ్రహ్మ నిర్వాణము) లభించును*. బ్రహ్మ నిర్వాణము, బ్రహ్మ నిర్వృతి, బ్రహ్మానందము అనునవి సమానార్థకములు. వాటి అర్థము మోక్షము.

అంతస్సుఖుడు, అంతరారాముడు, మరియు అంతర్జ్యోతి యగు వ్యక్తి బ్రహ్మభూతుడై (అనగా, ఆత్మ బ్రహ్మాభిన్నము అను యెరుక గలవాడై) మోక్షమును (అనగా పరిచ్ఛేద భావన నుండి, సంసార బంధము నుండి విముక్తిని) పొందును. ఆత్మ బ్రహ్మాభిన్నమని యెరింగిన ఇట్టి జ్ఞాని ఆ యెరుకచే బ్రహ్మభూతుడగును.

ఇంతకీ ఈ వ్యక్తి యెవరు?

కర్మలన్నిటినీ జ్ఞాన ప్రభావముచే త్యజించిన (స్థూల దృష్ట్యా త్యజించుట కాదు) సర్వ కర్మ సన్న్యాసియే ముఖ్య సన్న్యాసి యని శ్రీ కృష్ణ భగవానుడు 22వ శ్లోకము నుండి సారరూపముగా చెప్పి ఉపసంహరించెను.

ఇట్టి వ్యక్తినే ఈ శ్లోకము బ్రహ్మభూతుడు (ఆత్మయే బ్రహ్మ అను యెరుక గలవాడు) అని వర్ణించినది. ఇట్టి జ్ఞాని యందు కర్తృత్వ భోక్తృత్వములు ఉండవు. ఇతడు బ్రహ్మ నిర్వాణమును, అనగా మోక్షమును పొందును. 'నిర్వాణము' అని మాత్రమే ప్రయోగిస్తే, 'ఒకరకమగు శూన్యము' అని పొరబడే అవకాశము గలదు. కావుననే, బ్రహ్మ నిర్వాణము అని ప్రయోగింపబడినది. నిర్వాణము అనగా సర్వము నుండి విముక్తి, ఆనందము; అనగా ఆత్మ స్వరూపమగు అనంతత్వము.

---

* శ్రీకృష్ణుడు ద్వితీయాధ్యాయములోని అంతిమ శ్లోకములో ఈ 'బ్రహ్మ నిర్వాణమ్' అను పదమునే ప్రయోగించెను: ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి స్థిత్వాస్యా మంతకాలే ఽపి బ్రహ్మ నిర్వాణ మృచ్ఛతి (2.72). మరణ కాలము నందైననూ ఈ బ్రహ్మము నందు ప్రతిష్ఠితుడైన వ్యక్తి మోహము నుండి విముక్తుడై మోక్షమును పొందును.

శ్రీకృష్ణుడు సర్వ కర్మ సన్న్యాసిని ఈ అధ్యాయములోని అంతిమ శ్లోకములలో వర్ణించి ఉపసంహరించినాడు. అదియే తరువాతి శ్లోకములో కొనసాగుచున్నది:

అధ్యాయము 5, శ్లోకము 25:

लभन्ते ब्रह्मनिर्वाणमृषयः क्षीणकल्मषाः ।
छिन्नद्वैधा यतात्मानः सर्वभूतहिते रताः ॥ २५ ॥

లభంతే బ్రహ్మ నిర్వాణమృషయః క్షీణకల్మషాః
ఛిన్నద్వైధా యతాత్మానః సర్వభూత హితే రతాః (25)

క్షీణ కల్మషాః = నశించిన మాలిన్యములు కలిగినట్టియు; ఛిన్నద్వైధాః = తొలగిన సంశయములు కలిగినట్టియు; యతాత్మానః = దేహేంద్రియములపై నియంత్రణ కలిగినట్టియు; సర్వభూత హితే = సర్వప్రాణుల క్షేమము నందు; రతాః = ఉల్లాసముగా నిమగ్నులైన; ఋషయః = ఋషులు; బ్రహ్మ నిర్వాణం = బ్రహ్మ రూపమోక్షమును; లభంతే = పొందెదరు.

> నశించిన మాలిన్యములు కలిగినట్టియు, తొలగిన సంశయములు కలిగినట్టియు, దేహేంద్రియములపై నియంత్రణ కలిగినట్టియు, సర్వప్రాణుల క్షేమము నందు ఉల్లాసముగా నిమగ్నులైన ఋషులు బ్రహ్మ రూప మోక్షమును పొందెదరు (25).

పూర్వ శ్లోకములో శ్రీకృష్ణుడు జీవన్ముక్తుడగు జ్ఞానిని అంతస్సుఖః, అంతరారామః, అంతర్జ్యోతిః అని వర్ణించి యున్నాడు. ఈ శ్లోకములో కూడ ఇట్టి జ్ఞానులే ప్రస్తుతింపబడుచున్నారు. వారు 'ఋషులు' అనబడుదురు.

ఋషయః అనునది బహువచనము. ఋషి ఏకవచనము. ఋషి అనగానే కొందరికి జడలు కట్టిన జుట్టు, తెల్లని పొడుగైన గడ్డము, పొడుగైన చేతిగోళ్లు కలిగి, తీవ్రమైన తపస్సును చేసే వృద్ధుడు తలంపునకు వస్తాడు. వాస్తవంలో, ఋషి శబ్దానికి రెండు అర్థాలు ఉన్నాయి. ఒకే దేశములో గాని, పరిస్థితిలో గాని, చిక్కుబడకుండా సర్వదా కదలిపోతూ ఉండే (అటవీ) వ్యక్తి ఋషి. జ్ఞానము గలవాడు (జ్ఞాని) ఋషి. ప్రస్తుత సందర్భంలో, ఈ రెండవ అర్థము వర్తిస్తుంది. వేదాంతములో ఆచార్యులు అందరు ఋషులు అని నిర్దేశింపబడతారు. ఇట్టి ఋషులు మోక్షమును పొందుతారు.

మానవుడు ఋషియగుటు యెట్లు?

వారు ఋషులు అయిన విధమెట్టిది? శ్రీకృష్ణుడు మరొక్కసారి ఒకే శ్లోకములో జ్ఞానియొక్క పూర్తివర్ణనను ఇచ్చుచున్నాడు. ముందుగా, జ్ఞానులు క్షీణకల్మషాః. అనగా వారిలో మాలిన్యము (కల్మషమ్) పూర్తిగా తొలగిపోయినది (క్షీణమ్). ఇచట కల్మషమనగా రాగద్వేషములు. కర్మయోగ జీవనము, విచారముల వలన కల్మషములు నశించినవి.

జ్ఞానులీ శ్లోకములో 'సర్వ-భూత-హితే రతాః' అని కూడ వర్ణించబడినారు. అనగా, సర్వప్రాణుల క్షేమము కొరకు ఆనందముతో కృషి సల్పువారు అని యర్థము. జ్ఞానము కోరే వ్యక్తికి ఉండవలసిన లక్షణములలో ఇది ప్రముఖమైనది. జ్ఞానియగు వ్యక్తిలో ఈ లక్షణము అతి సహజముగ నుండును. జ్ఞాని అత్యంత జాగరూకతతో, సూక్ష్మదృష్టితో అహింసను పాటించును. జ్ఞాని ఇతరులను మాటతో గాని, కర్మతో గాని, మానసిక భావనలోనైననూ హింసించడు. వాస్తవంలో, సన్న్యాసాశ్రమమును స్వీకరించే వ్యక్తి ఇతర ప్రాణులకు ఏ విధమైన హింసనూ కల్గించనని అహింసా వ్రతమును స్వీకరించును. ఇందువలననే, సన్న్యాసులు స్పర్ధాయుక్తములగు కార్యకలాపముల నన్నింటినీ త్యజించెదరు. ఏలయనగా, స్పర్ధలన్నింటిలో, పాల్గొని నెగ్గే ప్రక్రియలో ఇతరులకు హానిచేయుట అనివార్యమగును. స్పర్ధ అనగానే ఇతరులకు హాని కల్గించుట అంతర్నిహితమై ఉండును. సన్న్యాసి అహింసా వ్రతమును స్వీకరించి తన వలన ఇతర ప్రాణులకు భయమేదియూ లేదని ప్రకటించును.

సంశయములన్నియూ నిశ్శేషముగా తీరిపోవును

ఈ శ్లోకములో 'యతాత్మానః' అను పదమునకు కర్మేంద్రియములపై, మరియు జ్ఞానేంద్రియములపై పూర్తి నియంత్రణ గలవారు అని యర్థము. ఇట్టివారు 'ఛిన్నద్వైధాః' అని కూడ వర్ణింపబడిరి. ద్వైధము అనగా సంశయము. 'ఛిన్న' అనగా 'తొలగింపబడిన' అని యర్థము. కావున, 'ఛిన్నద్వైధాః' అనగా సంశయములు తొలగినవారు అని యర్థము. ఈ జ్ఞానాన్వేషణలో అనేక సంశయములకు అవకాశము గలదు. ఆత్మ పరిచ్ఛిన్నమా? అపరిచ్ఛిన్నమా? ఆత్మ నిత్యమా? అనిత్యమా? ఆత్మ ఏకమా? అనేకమా? జీవుడు ఈశ్వరుని కంటె భిన్నుడా? జగత్తు సత్యమా? కాదా? జ్ఞానులు ఇట్టి సంశయముల నుండి విముక్తులై ఉందురు. అనగా, వారు విస్తృతముగు విచారమును సల్పినవారు అని భావము. వారు వేదాంతవిషయముల నన్నిటినీ జాగరూకతతో పరిశీలించి యున్నారు. వారి జ్ఞానము అన్నిరకముల సంశయముల నుండి విముక్తమై యుండును.

సాధకుని కొరకు సాధనములు

ఈ శ్లోకములో వర్ణింపబడిన లక్షణములు జ్ఞానికి సహజ లక్షణములుగా నుండును. ఆత్మ జ్ఞానమును గోరు సాధకునకు ఈ లక్షణములు జ్ఞానసాధనములు అగును. ఈ లక్షణములను అలవర్చుకునే సాధకులు ఋషులుగా మారి, తాము కోరే మోక్షమును పొందెదరు.

శ్రీకృష్ణుడింకనూ ఇట్లు చెప్పెను:

అధ్యాయము 5, శ్లోకము 26:

कामक्रोध वियुक्तानां यतीनां यतचेतसाम् ।
अभितो ब्रह्म निर्वाणं वर्तते विदितात्मनाम् ॥ २६ ॥

కామ క్రోధ వియుక్తానాం యతీనాం యతచేతసామ్
అభితో బ్రహ్మ నిర్వాణం వర్తతే విదితాత్మనామ్ (26)

కామక్రోధ వియుక్తానాం = కామక్రోధముల నుండి విముక్తులైనట్టియు; **యతచేతసామ్** = మనస్సును నియంత్రించినట్టియు; **విదితాత్మనామ్** = ఆత్మసాక్షాత్కారము గల; **యతీనాం** = సన్న్యాసులకు; **బ్రహ్మ నిర్వాణం** = బ్రహ్మరూపమగు మోక్షము; **అభితః** = ఇహపరముల యందు; **వర్తతే** = ఉండును.

> కామ క్రోధముల నుండి విముక్తులైనట్టియు, మనస్సును నియంత్రించినట్టియు, ఆత్మ సాక్షాత్కారము గల సన్న్యాసులకు బ్రహ్మరూపమగు మోక్షము ఇహపరముల యందు గలదు (26).

కామక్రోధములు, వాటి నుండి విముక్తి పొందవలసిన ఆవశ్యకత గీతలో తరుచుగా ప్రస్తావింపబడినవి. కామక్రోధముల నుండి తమను తాము విడుదల చేసుకున్న వ్యక్తులు ఈ శ్లోకములో 'కామక్రోధ వియుక్తాః' అని నిర్దేశింపబడినారు.

వ్యక్తికి ఉండే రాగద్వేషముల నుండి కామము, కామము నుండి క్రోధము పుట్టునని మనము చూచియున్నాము. కామక్రోధములు రెండు మానవుని తమ నియంత్రణలో నుంచుకొనును. కాని, వాటి నుండి విముక్తిని పొందినవారు ఈ శ్లోకములో వర్ణింపబడుచున్నారు. జ్ఞానులను వర్ణించే మరికొన్ని విశేషణములు కూడ ఈ శ్లోకములో గలవు.

యత్నము అనగా ఒక లక్ష్యము కొరకు కృషిచేయుట. మోక్షము నందు ఆకాంక్ష గల వ్యక్తి (ముముక్షువు) యతి అనబడును. యోగము అనబడే పవిత్రమగు ప్రయత్నమును చేయువాడు యతి. యతి అనగా సామాన్యార్థములో సన్న్యాసి. కాని, దాని వాస్తవమగు అర్థమును పరిశీలిస్తే, యతి శబ్దము కర్మయోగిని కూడ బోధించును. కావున, యతి సన్న్యాస జీవనములోని వాడు కావచ్చును; లేదా, కర్మయోగి కావచ్చును.

యతులు మనస్సును తమ వశములో నుంచుకొందురు (యతచేతసః). వీరు విదితాత్ములు (ఆత్మ తత్త్వము నెరింగినవారు) అని కూడ ఈ శ్లోకములో చెప్పబడుటచే, 'యతచేతసః' అను సమాసములోని 'యత' పదమునకు సర్వకర్మ సన్న్యాసులు అను యర్థము వచ్చును. అనగా వారు అకర్తృ ఆత్మ జ్ఞానము దృష్ట్యా, కర్మలను వీడిన వారు అని యర్థము. వారు కామక్రోధముల నుండి మాత్రమే గాక, ఆత్మ జ్ఞాన ప్రభావముచే సర్వకర్మల నుండి కూడ విముక్తులై యుందురు.

మనకు అభిలషణీయము ప్రధానముగా ఆత్మజ్ఞానమే గదా! కామక్రోధముల గురించి విచారించనేల? కామక్రోధములను తొలగించుకునే ఈ ప్రయత్నములో సమయము వృథా అగుట లేదా? తిన్నగా ఆత్మజ్ఞానమునే ఏల సాధించబూనరాదు? దీనికి సమాధానమేమనగా, కామక్రోధముల సంగతి తేల్చుకోనిదే, ఆత్మను యెరుంగజాలము. ఇంతకు ముందు చెప్పిన విధముగా, ఒక విశిష్టస్థాయికి చెందిన పరిణతి, జ్ఞానమునకు బద్ధుడై యుండుట అవసరము. వాటి కొరకు కామక్రోధములను విచారించవలసి యుండును.

జ్ఞానము నందు పూర్ణమగు నిష్ఠగల వ్యక్తి జ్ఞానమును పొంది, విదితాత్ముడగును. ఆత్మను యెరుంగుట, మోక్షమును పొందుట అనునవి వేర్వేరు కాదు. ఆత్మజ్ఞానమే మోక్షము. కావున, విదితాత్మునకు చింతించవలసిన స్థితి ఉండబోదు. నిత్యయుక్తమగు ఆత్మను సాక్షాత్కరించుకున్న జ్ఞాని ముక్తుడగును.

ఒకసారి ముక్తుడైతే, సదా ముక్తుడుగ నుండును.

ఈ శ్లోకములోని 'అభితః' అను పదమునకు 'రెండు విధములుగా (ఉభయతః)' అని యర్థము. జ్ఞానులకు ఈ లోకములో జీవించియుండగా మోక్షము కలదు. దేహమును వీడిన తరువాత కూడ మోక్షము కలదు. 'నేను నిత్యముక్తుడను' అని యెరుంగుటయే పరమమోక్షము. అట్టి జ్ఞానము గలవాడు జీవన్ముక్తుడను. ఇది ఒక ముక్తి. మరణానంతరము కలిగే విదేహముక్తి

రెండవది. శాశ్వతమగు మోక్షమును పొందిన జ్ఞానికి పునరావృత్తి (సంసారబంధములోనికి మరలివచ్చుట) ఉండదు.

'నేనింత కష్టపడి జీవన్ముక్తుడనై, మరల సంసారబంధములోనికి వచ్చెదనేమో?' అని కొందరు మరణానంతర గతి విషయంలో చింతాగ్రస్తులగుదురు. కాని, జ్ఞానముచే ముక్తిని పొందిన జ్ఞానికి పునరావృత్తి అను ప్రసక్తియే అసంగతము. పునరావృత్తికి ఏదో ఒకరకమైన కేంద్రకము (nucleus) ఆవశ్యకము. ఇట్టి కేంద్రకము జీవుడే. కాని, జీవత్వము మిథ్య అను సాక్షాత్కారము కలిగిన స్థితిలో తిరిగి వచ్చేది ఎవరు? మోక్షము లభించిన పిదప, తిరిగి వచ్చేవాడు మిగలడు. కావున, రెండు విధములుగా, ఈ లోకములో, మరియు పరలోకములో కూడ ముక్తిని ఆత్మజ్ఞాని పొందునని శ్రీకృష్ణుడు చెప్పెను. ఈ లోకము, పరలోకము అను దృష్టితో ద్వివిధమోక్షము ప్రస్తావింపబడినను, వాస్తవంలో మోక్షము ఒక్కటియే. పునరావృత్తి లేకపోవుట అను దృష్టితో మాత్రమే ద్వివిధ మోక్షము ప్రస్తావింపబడినది.

తాము వెనుకకు రాలేకపోతామని భయపడే వ్యక్తులు కూడా ఉన్నారు. వెనుకకు మరలి వచ్చుట వారి అభీష్టము. 'ఎందులకు?' అని ప్రశ్నిస్తే, 'మరుజన్మలో ఇంతకంటె గొప్ప పనులను నేను సాధిస్తాను' అని వారు సమాధానమిస్తారు. అంటే, ఈ జన్మలో తాము సర్వోత్తమమైన పనులను చేయజాలమని వారు ముందే నిశ్చయించుకున్నట్లు స్పష్టమగుచున్నది. మనము ముందుగా ఇప్పుడు చింతిల్ల పనిలేదు.

ధ్యానమునకు ఉపక్రమము

సాధన ద్వివిధము: బహిరంగ సాధన; అంతరంగసాధన. కర్తవ్య కర్మలను యోగ్యమైన మానసిక ప్రవృత్తితో ఆచరిస్తూ, ఉచితమగు జీవనమూల్యములను పాటిస్తూ, జీవించే కర్మయోగము బహిరంగ సాధనము. ధ్యానము అంతరంగ సాధనము. దీనియందు మనస్సు మాత్రమే పాల్గొనును. ధ్యానమనగా ప్రార్థన గాని, మననము గాని, లేక ఇతర అంతరంగ అనుశాసనము గాని కావచ్చును. అది కేవలము అంతరంగము నందు మాత్రమే ఉండును. దానియందు దేహావయవములు గాని, వాగింద్రియము గాని పాల్గొనదు. మన జీవితములో ఈ బహిరంగ, అంతరంగ సాధనములను రెండింటినీ ఆచరించాలి.

మనము బాహ్య ప్రపంచములో వ్యవహరించునప్పుడు రాగద్వేషములు కలుగును. వాటిని బహిరంగ సాధనతో నియంత్రించుకోగల్గుతాము. మనస్సులో ఏకాగ్రతను, ఆత్మజ్ఞానమును

కావశ్యకమగు ప్రసన్నతను సంపాదించుటకు అంతరంగసాధన అత్యావశ్యకము. శ్రీకృష్ణుడు తరువాతి మూడు శ్లోకములలో ధ్యానయోగమును సంగ్రహముగా ప్రస్తావించి, దానిని తరువాతి అధ్యాయములో విస్తారముగా వ్యాఖ్యానించెను.

అధ్యాయము 5, శ్లోకములు 27, 28

स्पर्शान् कृत्वा बहिर्बाह्यान् चक्षुश्चैवान्तरे भ्रुवोः ।
प्राणापानौ समौ कृत्वा नासाभ्यन्तरचारिणौ ॥ २७ ॥

यतेन्द्रियमनोबुद्धिर्मुनिर्मोक्ष परायणः ।
विगतेच्छा भयक्रोधो यस्सदा मुक्त एव सः ॥ २८ ॥

స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాంశ్చక్షుశ్చైవాంతరే భ్రువోః
ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యంతరచారిణౌ (27)

యతేంద్రియ మనోబుద్ధిర్మునిర్మోక్ష పరాయణః
విగతేచ్ఛా భయక్రోధో యస్సదా ముక్త ఏవ సః (28).

బాహ్యాన్ = బయట ఉండే; స్పర్శాన్ = వస్తువులను; బహిః = బయటనే; కృత్వా = ఉంచి; చ = మరియు; భ్రువోః = కనుబొమల; అంతరే = మధ్యలో; ఏవ = మాత్రమే; చక్షుః = చూపును; కృత్వా = ఉంచి; నాసాభ్యంతర చారిణౌ = ముక్కులోపల సంచరించు; ప్రాణ–అపానౌ = ఉచ్ఛ్వాస నిశ్వాసములను; సమౌ = క్రమబద్ధములుగా; కృత్వా = చేసి; యత–ఇంద్రియ–మనో–బుద్ధిః = కర్మేంద్రియములను, జ్ఞానేంద్రియములను, మనస్సును, బుద్ధిని నియమించినవాడై, మోక్ష పరాయణః = మోక్షమే చరమ లక్ష్యముగా గలవాడై; విగత–ఇచ్ఛా భయక్రోధః = కామన, భయము, క్రోధముల నుండి విముక్తుడైన, యః = ఏ; మునిః = జ్ఞాని గండో; సః = ఆ వ్యక్తి (పురుషుడు/స్త్రీ), సదా = అన్నివేళలా; ముక్త ఏవ = ముక్తుడే.

బయట నుండు వస్తువులను బయట నుంచి, కనుబొమల మధ్య దృష్టిని నిలిపి, ముక్కులోపల సంచరించు ఉచ్ఛ్వాస నిశ్వాసములను క్రమబద్ధము చేసి, కర్మేంద్రియములను, జ్ఞానేంద్రియములను, బుద్ధిని నియమించిన వాడై, మోక్షమే చరమ లక్ష్యముగా గలవాడై, కామక్రోధముల నుండి,

భయము నుండి విముక్తుడైన జ్ఞాని (పురుషుడు/స్త్రీ) సర్వకాలముల యందు ముక్తుడే (27, 28).

శ్రీకృష్ణుడీ శ్లోకములో ధ్యానయోగమున కుపకరించు చిన్న చిన్న సంకేతముల నిచ్చుచున్నాడు. ఇంద్రియ గోచరములగు పదార్థములకు స్పర్శలని పేరు. మనమీ విషయమును చూచియున్నాము. ఈ పదార్థములు దేహమునకు బయట నుండుటచే, అవి బాహ్య స్పర్శలనబడును. ప్రపంచమనగా ఈ విషయ వస్తువులే. ఇంద్రియములకు వీటితో సంపర్కము కలుగును. కంటికి పదార్థముల రూపములతో, రంగులతో, చెవులకు శబ్దములతో, ముక్కునకు గంధములతో, నాలుకకు రుచులతో, త్వగింద్రియమునకు వివిధ వస్తువుల మార్దవ కాఠిన్యములతో సంపర్కము కలుగుచుండును.

విషయ వస్తువులను బయట ఉంచుట యెట్లు?

శబ్దాది విషయములన్నీ శ్రోత్రాది ఇంద్రియములనే ద్వారముల గుండా మనలో ప్రవేశించునని శ్రీ శంకరులు భాష్యములో వ్రాశారు. ఈ బాహ్య వస్తువులనన్నిటినీ ధ్యానములో బయటనే ఉంచాలి. అంటే, ఆ సమయంలో వాటిని గూర్చి ఆలోచించరాదు. అట్లు ఆలోచించకుండుట కొరకై, మనస్సును మరియొక దానిపై ఏకాగ్రము చేయాలి. మన సమక్షము నుండి విషయవస్తువులను తొలగించుట గాని, లేక విషయ వస్తువుల నుండి దూరముగా తొలగుట గాని ఆవశ్యకము కాదు. వాటి స్థానములో వాటిని ఉండనిచ్చి, మన దృష్టిని వాటి నుండి మరలించాలి.

ప్రప్రథమంగా మనము విషయవస్తువులను ధ్యానిస్తాము. అవుడు అవి మనస్సులో ప్రవేశిస్తాయి. కాబట్టి, విషయవస్తువులు మనస్సులో నుండుటకు వాటిని నిందింపబని లేదు. మనము వాటిని ధ్యానించుట మానివేస్తే, అవి అక్కడ ఉండవని శ్రీ శంకరులు అంటారు. విషయవస్తువులు స్వభావతః బాహ్యములై ఉంటాయి. కావున, వాటి గురించి ధ్యానించుట మానివేస్తే, అవి బాహ్యములు గానే మిగిలి ఉంటాయి. విషయవస్తువులను బయట ఉంచు పద్ధతి ఇదియే.

ధ్యానంలో కళ్లను మూసుకుంటారు. కళ్లను తెరచియూ ధ్యానము చేయవచ్చును. కాని, ధ్యేయ వస్తువుపై మనస్సు లగ్నమగుటలో కళ్లుమూసుకొనుట సహకరించును. కళ్లను తెరచి ఉంచినచో, మనస్సు ఎదురుగ నుండే వస్తువులపైకి ప్రసరించును. కావున, కన్ను అనే ఒక జ్ఞానేంద్రియము విషయములను గ్రహించి కలిగించే విక్షేపమును తొలగించుట కొరకై కళ్లను మూసి ఉంచాలి. ఈ శ్లోకములోని 'చక్షుశ్చ భ్రువోః అంతరే కృత్వా' అను భాగమునకు 'చూపును కనుబొమల

మధ్యలో నుంచి అని యర్థము. అనగా, కనుగ్రుడ్లను కనురెప్పల లోపల ఉంచి అని యర్థము. అంటే, కళ్లను మూసుకొని అని యర్థము.

శ్వాసక్రియను గమనించాలి

తరువాత, ప్రాణాపానముల గురించి చెప్పబడినది. ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యంతర చారిణౌ. ఇచట ప్రాణమనగా గాలిని బయటకు విడుచుట. అపానమనగా లోపలికి పీల్చుట. ఈ గాలి పీల్చుటను చేయు విధమెట్టిది? ముక్కు లోపల ప్రసరించే (నాసాభ్యంతర చారిణౌ) ఉచ్ఛ్వాస నిశ్వాసములు లయబద్ధముగా ఉండాలి. ఇట్లు ఉచ్ఛ్వాస నిశ్వాసములను లయబద్ధము చేయుట వలన, మనకు శ్వాసక్రియను గమనించే వీలు కలుగుతుంది. ఇట్లు పరిశీలించుట వలన, శ్వాస సమముగా నుండి, శరీరము విశ్రాంతిని పొందును; మనస్సు నిశ్చలమగును.

ఇట్టి అభ్యాసమువలన జ్ఞానేంద్రియములపై, కర్మేంద్రియములపై, మనస్సుపై మరియు బుద్ధిపై నియంత్రణ సిద్ధిస్తుంది (యతేంద్రియ మనో బుద్ధిః). ఇట్టి వ్యక్తి ముని యనబడును. అనగా, శ్రవణ (వినుట), మననము (విశ్లేషణ) లను దృఢముగా చేసిన వాడని యర్థము. ముని యొక్క చరమ లక్ష్యము మోక్షము (మోక్ష పరాయణః). అతని జ్ఞానములో శంకకు చోటు లేదు. అతడు సమస్యలన్నిటి నుండి విముక్తిని పొందును. అనగా, అతడు నిత్యముక్తుడని యర్థము.

భయము నుండి విముక్తి

ఇట్టి జ్ఞానిని వర్ణించే విశేషణము మరియొకటి గలదు. అతడు 'విగతేచ్ఛా భయక్రోధః. అనగా, కామము నుండి, భయము నుండి, క్రోధము నుండి విముక్తుడు అని యర్థము. ఈ లక్షణములు ఇంతకు ముందు వర్ణింపబడినవే అయినను, మరల వర్ణింపబడుచున్నవి. జ్ఞాని కామక్రోధముల నుండి విముక్తుడై యుండునని శ్రీకృష్ణుడు పూర్వము చెప్పియున్నాడు. ఇచట భయము అను పదమును కూడ ఆయన జోడించినాడు. జ్ఞాని కామ, భయ, క్రోధములకు వశుడు కాడు; అనగా, పరిణతి చెందిన వాడని యర్థము. ఇతడు ఆత్మ జ్ఞాన ప్రభావముచే నిత్య ముక్తుడుగా నుండు సన్న్యాసి.

జ్ఞానమునకు పూర్తిగా అంకితమై, శ్రవణ మననములను దృఢముగా చేసిన వ్యక్తిని శ్రీ శంకరులు తరువాతి శ్లోకము యొక్క భాష్యోపక్రమములో 'సమాహిత చిత్తః' అని నిర్దేశించిరి.

అనగా, స్థిరమైన చిత్తము గలవాడు, ఆత్మావలోకన దక్షుడు, తనలో తాను సంతసించువాడు అని యర్థము.

అధ్యాయము 5, శ్లోకము 29:

भोक्तारं यज्ञतपसां सर्वलोकमहेश्वरम् ।
सुहृदं सर्वभूतानां ज्ञात्वा मां शान्ति मृच्छति ॥ २९॥

భోక్తారం యజ్ఞతపసాం సర్వలోక మహేశ్వరమ్
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతి మృచ్ఛతి (29)

యజ్ఞతపసాం = యజ్ఞ తపస్సుల యొక్క; భోక్తారం = పాలకుడైనట్టియు; సర్వలోక మహేశ్వరం = సర్వ జగన్నాథుడైనట్టియు; సర్వభూతానాం = సర్వప్రాణులకు, సుహృదం = స్నేహితుడైన; మాం = నన్ను; జ్ఞాత్వా = తెలుసుకొని, శాంతిం = శాంతిని, ఋచ్ఛతి = పొందును.

యజ్ఞ తపస్సులకు పాలకుడను, సర్వ జగన్నాథుడను, సర్వ ప్రాణులకు స్నేహితుడను అగు నన్ను తెలుసుకొని జ్ఞాని శాంతిని పొందును (29).

ఈ శ్లోకము జీవేశ్వరుల అభేదమును ప్రతిపాదించును. శ్రీకృష్ణ భగవానుడిచట 'మాం (నన్ను)' అను పదమును ఈశ్వరత్వ దృష్ట్యా ప్రయోగించుచున్నాడు. 'నన్ను ఎరింగిన వ్యక్తి నన్ను పొందును (జ్ఞాత్వా మాం శాంతి మృచ్ఛతి). 'శాంతిం' అనగా నన్ను. మనమీ అర్థమును తరువాత తెలుసుకుంటాము.

మనము ఒక వస్తువును తెలుసుకుంటే ఆ వస్తువుగా మారిపోము. ఒక వస్తువును తెలుసుకుంటే అది తెలుస్తుంది. అది మన కోరికలో విషయము కూడ కావచ్చును. మనము దానిని ప్రశంసించవచ్చును. అంతే. కాని, మనము ఆ వస్తువుగా మారిపోము. కాని, ఇచట ఆయనను తెలుసుకొనుట ద్వారా, మానవుడు స్వరూప భూతమైన ఆత్యంతిక శాంతిని పొందునని శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు.

మానవుడు నన్ను తెలుసుకొనుట ద్వారా తనయందు కేంద్రితమై ఉన్న, స్వరూప భూత శాంతిని పొందును. కాని ఈ 'నన్ను' ఎవరు? దేవకీ నందనుడగు శ్రీకృష్ణుడా? కాదు. యజ్ఞ యాగాది కర్మలను, వ్రతములను పాలించువాడు, ముల్లోకములకు అధిపతి, సర్వప్రాణులకు మిత్రుడు అను మూడు విశేషములు ఈ శ్లోకములో 'నన్ను' అను పదమునకు ఈయబడినవి.

'యజ్ఞ తపసాం' అను సమాసములో యజ్ఞశబ్దము వేద విహిత క్రతువులను మాత్రమే గాక, మనము చేయు కర్మల నన్నిటిని నిర్దేశించును. తపశ్శబ్దము అన్ని రకముల ధ్యానములను, మరియు వివిధ అనుశాసనములను నిర్దేశించును. నడుచుట, పరుగెత్తుట, సైకిలు తొక్కుట మొదలగు వివిధ వ్యాయామములను కూడ అనుశాసనములుగా స్వీకరించవచ్చును. కాని, ఇచట ఒక ప్రముఖమైన తేడా గలదు.

ఉదాహరణకు, యోగాసనములలో వ్యాయామముతో బాటు, ఇంకనూ అధికమైన అంశములు గలవు. అవి ఒకరకమగు ప్రార్థన యని చెప్పవచ్చును. ప్రతి ఆసనమునకు ఒక అధిష్ఠాన దేవత గలదు. పూర్వకాలములో, ప్రతి ఆసనమును తదధిష్ఠాన దేవతకు చేయు ప్రార్థనా రూపముగా అనుష్ఠించే వారు. కావున, ఆసనములను వేయు వ్యక్తిలో ఒక విశిష్టమగు భక్తి అనే మానసిక ప్రవృత్తి (attitude) ఉండును. ఇట్టి ప్రార్థనా యుతములగు అనుశాసనములకు మాత్రమే తపస్సు అని పేరు.

జీవేశ్వరులకు భేదము లేదు

యజ్ఞములను పాలించువాడు, వాటిని అనుభవించువాడు 'భోక్తారం' అను పదముచే చెప్పబడును. యజ్ఞములన్నింటి యొక్క ఫలముల ననుభవించున దెవరు? కర్త, భోక్త యగు జీవుడే అనుభవించును. కాని ఈ శ్లోకము ముల్లోకముల ప్రభువు భోక్త యని చెప్పుచున్నది.

మహేశ్వర శబ్దము ఇచట చాల ప్రముఖమైనది. ఈశ్వర శబ్దమును సాపేక్షికార్థములో కూడ వాడెదరు. ప్రధానుడు లేక ప్రభువు అగు వ్యక్తిని ఈశ్వరుడని యనవచ్చును. రాజులు, దేవతలు తమ తమ క్షేత్రములలో ఈశ్వరులుగనే పరిగణింపబడుదురు. ఈ తీరున, స్వీయక్షేత్రములో ప్రభువైన ప్రతి వ్యక్తి ఈశ్వరుడే. కాని, మహేశ్వర శబ్దమును ప్రయోగించుట వలన, ఇట్టి పరిచ్ఛిన్న ఈశ్వరుని సంభావన తొలగింపబడినది. మహేశ్వరుడనగా సమమైన వాడు గాని, గొప్పవాడు గాని లేని ప్రభువు అని యర్థము. మహత్, ఈశ్వర అనే రెండు పదములు సమానాధికరణములు (ఒకే విభక్తికి చెందినవి). అనగా, సమాసములో వాటికి సమ ప్రాధాన్యము గలదు. అవి రెండు కలిపి ఒకే వస్తువునకు విశేషములై, దానిని గొప్ప చేస్తాయి. ఆ వస్తువు మహాన్ అనగా సాటి లేనిది; ఈశ్వరః అనగా ప్రభువు. కావున, మహేశ్వరః అనగా సమస్త ప్రాణి జాతముతో కూడిన బ్రహ్మాండము అన్నింటికీ ప్రభువు.

సర్వలోకాధిపతి యగు భగవానుడే కర్మలన్నింటిలో కర్త, మరియు భోక్త. ప్రతి యజ్ఞమునందు కర్త తప్పనిసరిగా నుండును. ఆ కర్త ఈశ్వరుడే. మరియు, దేవత కూడ ఉండును. దేవత కూడ

ఈశ్వరుడే. మరియు, కర్మఫల భోక్త కూడ ఈశ్వరుడే. అంటే, జీవుడు లేనే లేడు. కర్తయు, మరియు భోక్తయు కూడ పరమేశ్వరుడే. దీని యర్థమేమనగా, కర్తృత్వ భోక్తృత్వములు మిథ్య.

ప్రతిఫలము వాశించని మైత్రి

ఈ శ్లోకములో 'నన్ను' అను పదమునకు 'సుహృదం సర్వ భూతానామ్' (సర్వప్రాణులకు మిత్రుడు)' అను మరియొక విశేషణము గలదు. మనకు ఉపకారమును చేయు వ్యక్తికి స్నేహితుడని పేరు. ఉపకారమును చేయుటకు కారణము లనేకములుండవచ్చును. నా నుండి ప్రత్యుపకారము వాశించి, ఒకడు నాకు ఉపకారమును చేయవచ్చును. సాధారణముగా ఇటులనే జరుగుచుండును. ఈ ప్రత్యుపకారము అనేక రూపములలో నుండవచ్చును. సరళముగా కృతజ్ఞతను ప్రకటించి ఊరకుండుటయూ గలదు. ఇతరులకు ఉపకారము చేసిన వ్యక్తికి ఆ సమయములో తన మనస్సులో ఒక విలక్షణమగు ఆనందము కల్గును. ఇవి అన్నియూ అహంకారమునకు సంబద్ధమైనవే. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలు పెద్దవారైన తరువాత కూడా అప్పుడప్పుడు తమ నుండి ఉపకారమును పొందుతూ, పిల్లలకు ఉపకారమును చేసితిమన్న సంతృప్తిని తమకు కలుగజేయాలని ఆశిస్తారు. వారి వద్దకు వెళ్లి సాహాయ్యమును కోరినప్పుడు, వారు తమను ఆదరించినట్లు సంతసిస్తారు. ఈ రకంగా వారి సాహాయ్యమును కోరుట వారికి ఒక రకంగా ఉపకారమును చేసి నట్లే యగును.

వ్యక్తి లేశమైననూ ప్రత్యుపకారమును ఆపేక్షించకుండగా చేసే ఉపకారము కూడ గలదు. కొందరు వ్యక్తులు పరిచయము గాని, స్నేహము గాని, అనుబంధము గాని లేకున్ననూ, స్వీయ మానసిక అనుభూతి, దయల కారణంగా ఇతరులకు సాహాయ్యమును చేస్తారు. ఈ విధంగా పరిచయం లేని వ్యక్తులకైననూ, ప్రత్యుపకారమును ఆపేక్షించకుండగా, ఉపకారమును చేయు వ్యక్తికి సుహృత్ అని పేరు. ఇట్టి సుహృత్తునకు, కేవల మిత్రునకు చాల భేదము గలదు.

ఉపకారముచేయు మిత్రుడు మనందరికీ అవసరమవుతాడు. స్నేహభావముతో ఉపకారమును చేయువాడు మిత్రుడు. కాని, పరిచయము లేకపోయిననూ, ప్రత్యుపకారాపేక్ష లేకుండా ఉపకారమును చేయు వ్యక్తి సుహృత్ అనబడును. పరమేశ్వరునకు సుహృత్ అని పేరు. ఆయన సర్వప్రాణులకు (సర్వ భూతానామ్) స్నేహితుడు; మరియు కర్మఫలముల నిచ్చువాడు (కర్మఫలదాత). మనము కర్మలను చేస్తాము. ఆయన నిస్సంగముగా ఉంటూనే, ఫలముల నిస్తాడు. మనము చేసుకున్నదానికి తగినంత ఫలమును ఇచ్చుట ఆయన స్వభావము.

శ్రీకృష్ణార్పణమస్తు

నీవు ఆలోచించాలనుకుంటే, ఆలోచించవచ్చును. నీవు నిద్రపోవాలనుకుంటే, నిద్రపోవచ్చును. నీవు పగటి కలలను కనాలనుకుంటే, అటులనే చేయవచ్చును. ఈశ్వరుడు ఎన్నడూ వద్దనడు! నీ మనస్సు అప్పుడప్పుడు వద్దు అంటుంది. నీవు ఆలోచించాలనుకున్నప్పుడు నీ మనస్సు, 'వద్దు, నిద్రపోదాము' అనవచ్చును. నీవు తినాలనుకుంటే, నీ పొట్ట 'వద్దు, నేనింక తినలేను' అంటుంది. నీవు నడవాలనుకుంటే, నీ కాళ్లు 'వద్దు, నడిచింది చాలు' అనవచ్చును. కొన్ని సమయాలలో ప్రతి వ్యక్తి 'వద్దు' అంటాడు. కాలేయము 'వద్దు' అంటుంది. మూత్రాశయము 'వద్దు' అంటుంది. ఆత్మ తక్క సర్వము 'వద్దు' అనును. 'నేను అజ్ఞానములోనే కొనసాగుతాను' అని నీవు అన్నప్పుడు కూడా, ఆత్మ 'అటులనే కానిమ్ము; సమస్య లేదు' అని, ఆ అజ్ఞానమునే ప్రకాశింపజేస్తుంది.

సమస్త ప్రాణులు అన్వేషించే చరమ లక్ష్యము నారాయణుడు. ఈ శ్లోకములో 'నన్ను (మామ్)' నారాయణుడే. ఆయనను ఎరింగిన వాడు శాంతిని పొందును. ఈ శాంతి మామూలు శాంతి కాదు. సంసారము యొక్క సర్వరూపములు లీనమయ్యే శాంతి ఇది. ఈ శాంతి యందు కర్తృత్వ భోక్తృత్వరూపమగు సంసారము లీనమగును.

ఆత్మ దేనికీ విరోధి కాదు

ఆత్మ దేనికీ విరోధి కాదు. అంటే, ఆత్మ అన్నింటికీ 'మిత్రం' అనేది అనుకోరాదు. 'మిత్రం' అనేవాడు తనకు లాభము ఉన్నచోట, తనకు అనుకూలమైనచోట మాత్రమే 'మిత్రం' అంటాడు. కాని, ఆత్మయొక్క అనుమోదనము పరిపూర్ణమైనది. ఎందువలన?

ఆత్మ లేనిదే కర్మలేమియూ సంభవము కావు; కర్మఫలము ననుభవించుటయూ సంభవము కాదు. కావున, భోక్త పరమేశ్వరుని కంటె వేరు గాదు. కాని, పరమేశ్వరుడు భోక్త కాదు. అటులనే, కర్త పరమేశ్వరుడే అయినా, పరమేశ్వరుడు కర్త కాదు. [illegible] యగును. కాని, [illegible] కాదు.

కర్త, భోక్త యగు జీవుని కొరకు మాత్రమే ఆత్మ జ్ఞానము ఉపదేశింపబడును. జీవుడే పరమేశ్వరుడు. అంటే, జీవేశ్వరుల మధ్య అభేద సమీకరణము (equation) గలదు. ఈ అభేదమును తెలుసుకుని, జీవేశ్వరుల ఐక్యమును సాక్షాత్కరించుకున్న వ్యక్తి శాంతిని పొందును (శాంతి మృచ్ఛతి). ఆ శాంతి యందు సంసారము ఉపశమనమును పొందును. జీవేశ్వరుల అభేదజ్ఞానము వలన కలుగు ఫలమునకే మోక్షమని పేరు. ఈ జ్ఞానము గల వ్యక్తికి మోక్షము, శాంతి లభించును.

అధ్యాయ పరిసమాప్తిని సూచించు పదములు ఈ క్రింది విధముగ నున్నవి:

ॐ तत् सत्।
इति श्रीमद्भगवद्गीतासु उपनिषत्सु ब्रह्मविद्यायां
योगशास्त्रे श्रीकृष्णार्जुनसंवादे सन्न्यासयोगो
नाम पञ्चमोऽध्यायः॥

ఓం తత్సత్.
ఇతి శ్రీమద్భగవద్గీతాసు ఉపనిషత్సు బ్రహ్మ విద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే సన్న్యాస యోగో
నామ పంచమోధ్యాయః.

మన మింతకు ముందు చూచిన విధముగా, ఉపదేశము యొక్క అంతములో 'ఓం తత్ సత్' అను వాక్యము ఉచ్చరింపబడును. 'అది మాత్రమే బ్రహ్మము' అని దాని యర్థము. పరబ్రహ్మ, పరమేశ్వర, భగవానునకు 'ఓమ్' అని పేరు. బ్రహ్మము మాత్రమే సత్యము. కర్మ సత్యము కాదు. కర్మఫలము సత్యము కాదు. కర్మఫల భోక్త సత్యము కాదు. దేవత సత్యము కాదు. జగత్తు సత్యము కాదు. దేహము సత్యము కాదు. మనస్సు సత్యము కాదు. అవి అన్నియూ సత్యమగు బ్రహ్మము మాత్రమే. కాని, బ్రహ్మము అవి ఏవీ కాదు.

సత్యము ఏది? ఓమ్ మాత్రమే సత్యము. జగత్కారణమగు పరమేశ్వర పరబ్రహ్మమే సత్యము. సర్వమునకు కారణమైనదే సత్యమగును. కార్యము మిథ్య. కావున, కారణావస్థ కూడ మిథ్యయే. కాని, కారణము యొక్క స్వరూపము సత్యము. ఉదాహరణకు, ఘటమునకు కారణము మృత్తు. ఘటము మిథ్య గనుక, మృత్తు యొక్క కారణావస్థ కూడ మిథ్యయే. ఏలయన, మృత్తును పరిశీలిస్తే కనబడేది మృత్తు గాని, కారణము కాదు. కావున, కారణ కార్యములు రెండూ మిథ్యయే. కారణము యొక్క స్వరూపము సత్యము. జగత్కారణము, ఓం శబ్ద వాచ్యము వగు పరబ్రహ్మయే సత్యము. మిగిలిన దంతా మిథ్య.

కావున, నిర్ణయము సదా ఈ తీరున ఉండును: ఉపదేశము అయిన తరువాత, సర్వము 'ఓం తత్ సత్'. భగవానుని గీత, అనగా భగవానుడు వర్ణనీయాంశముగా గల గీత (శ్రీమద్భగవద్గీతాసు); దీని యందుపనిషత్తు అనబడే ఉపదేశము గలదు (ఉపనిషత్సు); బ్రహ్మజ్ఞానము దీని విషయ వస్తువు

(బ్రహ్మ విద్యాయామ్); ఇది కర్మయోగ శాస్త్రము కూడా (యోగ శాస్త్రే); ఇది శ్రీకృష్ణార్జునుల మధ్య సంభాషణ రూపములో నున్నది (శ్రీకృష్ణార్జున సంవాదే). దానిలోని ఐదవ అధ్యాయము (పంచమోధ్యాయః) నకు సన్న్యాసము విషయవస్తువు (సన్న్యాసయోగః).

ఆరవ అధ్యాయమునకు ఉపక్రమము

తరువాతి అధ్యాయము ధ్యానయోగము అనే ఆరవ అధ్యాయము. ధ్యానము అనగా గంభీర చింతనా రూపమగు మానసిక క్రియ. ధ్యానము మోక్షమును పొందే ఉపాయము.

సాధనము ద్వివిధమని మనము చూచియున్నాము. కర్మ బహిరంగ సాధనము; ధ్యానము అంతరంగ సాధనము. కర్మ జ్ఞాన రూపమగు మోక్షమును పొందుటకు ఆవశ్యకమగు మానసిక సంసిద్ధత (అంతఃకరణ శుద్ధి)ను ఒన గూర్చి యోగము అయినది. ఈ కర్మయోగము బహిరంగ సాధనము కాగా, ధ్యానము కేవలము అంతరంగ సాధనము మాత్రమే.

ధ్యానము అనగా కేవలము మనస్సులో మాత్రమే పుట్టే క్రియ. వాస్తవంలో కర్మలన్నీ మనస్సులో పుట్టేవే. కాని, మనస్సులో పుట్టిన క్రియ మనస్సులో స్థిరపడునను నియమము లేదు. ఉదాహరణకు, వాక్కు మనస్సులోనే ఉదయించును. పదము లన్నియూ మనస్సులోనే నిర్మాణమై, తరువాత వాగింద్రియము ద్వారా ప్రకటింపబడతాయి. ఈ విధంగా, అన్ని రకముల కర్మలు మనస్సు నుండియే ఉద్భవించిననూ, అవి అక్కడనే ఆగిపోవు. అవి భావప్రకటనకు లభించే వివిధ సాధనముల ద్వారా ప్రకటింపబడతాయి. కాని, ధ్యానములో, కర్మ మనస్సులో పుట్టి, మనస్సులోనే కొనసాగును. కావున, ధ్యానము కేవల మానసిక వ్యాపారము మాత్రమే. ఈ ధ్యానము ఒక సాధనము గనుక, యోగము అయినది.

మనము అప్పుడప్పుడు చింతాగ్రస్తుల మవుతూ ఉంటాము. ఇది కూడా ఒక మానసిక వ్యాపారమే. కాని, అదే పనిగా దుఃఖిస్తూ ఉన్న వ్యక్తి 'నేను ధ్యానమును చేయుచున్నాను' అని చెప్పగలడా? చెప్పలేడు. ధ్యానము అనే మనో వ్యాపారము నందు విషయవస్తువు పూర్వ నిర్ధారితమై యున్నది. ధ్యానము సగుణబ్రహ్మ విషయ మానస వ్యాపారము. అనగా సగుణబ్రహ్మ విషయముగా గల మనో వ్యాపారము. ఇది ధ్యానము యొక్క ఒక నిర్వచనము.

సగుణ బ్రహ్మ యనగా ఆవరిచ్చిన్నము, ఈశ్వరరూపముగా జగత్కారణమునగు సత్య జ్ఞాన అనంత బ్రహ్మ. ధ్యానమనే మనో వ్యాపారములో సగుణబ్రహ్మయే విషయము. నేను ప్రతి ఉదయము

గంటలకు అరనిముషము, మరల 12 గంటలకు అర నిముషము సగుణబ్రహ్మను భావన చేసుకొనుడు. అది ధ్యానమగునా? అది ఒక మనో వ్యాపారమనుటలో సందియము లేదు. నేను క్షణము భగవానుని భావిస్తాను. మరుక్షణము ఆ భావన తొలగిపోతుంది. ఈ విధంగా ఈ భావన మనస్సులో పుట్టి, అచటనే లయమైననూ, ఇది ధ్యానము కాదు. కావున, ధ్యానము అనే మానస వ్యాపారమును ఇంకనూ సరిగా నిర్వచించాలి. మనము ఎన్నుకున్న ధ్యేయవస్తువు కంటె భిన్నమగు భావనలన్నీ తొలగిపోయి (విజాతీయ ప్రత్యయరహిత), ఆ వస్తువునకు మాత్రమే సంబంధించిన భావనలు ఎక్కువ సేపు ప్రవాహము వలె నున్నచో (సజాతీయ ప్రత్యయ ప్రవాహము), అది ధ్యానమనబడును.

ఒకే స్వరూపమునకు చెందిన వస్తువులను 'జాతి' అనే పదము బోధిస్తుంది. ధ్యానము కొరకు ఎన్నుకున్న వస్తువు కంటె భిన్నమైన బాహ్య వస్తువులను 'విజాతీయ' అను పదము బోధించును. ప్రత్యయమనగా భావనాతరంగము (వృత్తి). విజాతీయ ప్రత్యయమనగా ఎన్నుకున్న వస్తువు కంటె భిన్నమగు, అనగా సగుణ బ్రహ్మ కంటె భిన్నమగు వస్తువు యొక్క భావన. 'రహిత' అనగా లేకపోవుట. సగుణ బ్రహ్మ కంటె భిన్నమగు భావనలన్నింటినీ తొలగించివేస్తే, మనము ఎన్నుకున్న భావన(వృత్తి) యొక్క ప్రవాహము(సజాతీయ ప్రత్యయ ప్రవాహము) నిర్మాణమగును.

విజాతీయములను తొలగించి, సజాతీయముల ప్రవాహమును కొంతసేపు నిలుపగల్గినచో, అట్టి ప్రవాహరూపమగు మానసిక వ్యాపారమునకు ధ్యానమని పేరు. కావున, ధ్యానమనగా ఒక మానసిక వ్యాపారము (మానస కర్మ). ధ్యానములోని విషయవస్తువు సగుణబ్రహ్మము (సగుణ బ్రహ్మ విషయ మానస కర్మ). ఇపుడు ధ్యానము యొక్క నిర్వచనమును ఒకే ఒక సమాస పదములో సమగ్రముగా చెప్పుట వలను పడును : విజాతీయవృత్తి రహిత సజాతీయవృత్తి ప్రవాహరూప సగుణబ్రహ్మ విషయ మానస వ్యాపారః.

చంచలమగు మనస్సు ధ్యానమునకు అంగము

ధ్యానమును గురించి మనము తెలియదగిన అంశము మరియొకటి గలదు. మనస్సు ధ్యేయవస్తువు నుండి చెదరిపోవుట అనునది ధ్యానలక్షణములో భాగము. మనస్సు ధ్యానము నుండి చెదరిపోవుచున్నదే యని చింతిల్లుట సరిగాదు. అనేక పర్యాయములు భక్తులు నాతో, 'స్వామీజీ, నేను ధ్యానించినపుడు మనస్సు స్థిరముగా నుండదు!' అని అంటూ ఉంటారు. ఇట్లు, మనస్సు మరలి పోవుట ధ్యానమునకు భంగము కాదు; అది ధ్యానములో అంతర్భాగము. అది ఒక సమస్య యని

చింతిల్లుటయే సమస్య. మనస్సు చెదరిపోయినప్పుడు, మనము మరల దానిని ధ్యేయము వైపునకు మరల్చాలి. ఇట్లు మనస్సును మరల్చుట ధ్యానప్రక్రియలో భాగము. ఇటునటు చెదరిపోవు మనస్సు నిశ్చితముగా ధ్యానాంగము. అది అట్లు చెదరినపుడు, మనము మరల దానిని ధ్యేయము వైపునకు మరల్చుకుంటాము. మనస్సు ఇటునటు ఏ మాత్రమూ చెదరిపోని స్థితికి సమాధి యని పేరు.

ధ్యానమునకు, నిదిధ్యాసనమునకు గల భేదము

విజాతీయ వృత్తులు ఉదయించినప్పుడు, మనము వాటి నుండి మనస్సును మరలించి, దానిని పునః సగుణబ్రహ్మము నందు లగ్నము చేస్తాము. ఇది ధ్యానము యొక్క నిర్వచనము. మరియొక మానస వ్యాపారము కూడ గలదు. దాని యందు ధ్యేయ వస్తువు గుణరహితమగు బ్రహ్మము. సగుణబ్రహ్మస్థానములో నిర్గుణ బ్రహ్మను ఆదేశము చేసినచో నిర్గుణ బ్రహ్మ విషయమానస వ్యాపారము అగును. ఈ మనో వ్యాపారమునకు నిదిధ్యాసనము అని పేరు. ధ్యాన నిదిధ్యాసనములు రెండు మానసవ్యాపారములే. ధ్యానములో సగుణబ్రహ్మము విషయము. నిదిధ్యాసనములో నిర్గుణబ్రహ్మము విషయము. అనగా పరబ్రహ్మ యొక్క యథార్థ స్వరూపము ధ్యానింపబడును. నిదిధ్యాసనము నందు సాధకుడు 'నేను పూర్ణుడను (అహం పూర్ణః); ఉనికి-జ్ఞానము-అపరిచ్ఛిన్నత నా స్వరూపము (అహం సత్యజ్ఞానానంత స్వరూపః)' ఇత్యాది పదములను, వాక్యములను ధ్యానిస్తాడు. ఈ ధ్యానములో పదమును ఉచ్చరించి, దాని అర్థము ధ్యానింపబడును గాన, ఇది భావనా రూపముగనుండును, కావున, నిదిధ్యాసనము ఈ అంశములో సగుణబ్రహ్మ విషయ మానస వ్యాపారమగు ధ్యానము కంటె భిన్నమైనది. కావుననే, దానికి ప్రత్యేకమగు పేరు ఈయబడినది.

నిదిధ్యాసనమును వివరించుటకు ముందుగా మోక్షప్రాప్తికి అంతరంగసాధనమైన వివిధ ధ్యానపద్ధతులను వర్ణించుట సహజము. కావున, సగుణబ్రహ్మ విషయ మానసవ్యాపారము, మరియు నిదిధ్యాసనము అనే రెండింటినీ ధ్యానములో భాగములుగనే పరిగణించవచ్చును. శ్రీకృష్ణుడు ఆరవ అధ్యాయములో సన్న్యాసమును వివరించి, అనంతరము ఈ ధ్యాన పద్ధతులను వివరించెను. వాటిలో ఆయన ప్రముఖముగా నిదిధ్యాసనమును వర్ణించెను. మనమీ విషయమును ఆరవ అధ్యాయములో చూచెదము.

అధ్యాయము 6
ధ్యానము

श्री भगवानुवाच
अनाश्रितः कर्मफलं कार्यं कर्म करोति यः ।
स सन्न्यासी च योगी च न निरग्निर्न चाक्रियः ॥ १ ॥

శ్రీ భగవానువాచ
అనాశ్రితః కర్మఫలం కార్యం కరోతి యః
స సన్న్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్న చాక్రియః (1)

శ్రీ భగవాన్ = శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ = పలికెను; యః = ఎవడైతే; కర్మఫలం = కర్మఫలమును; అనాశ్రితః = ఆశ్రయించనివాడై; కార్యం = కర్తవ్యమైన; కర్మ = కర్మను; కరోతి = చేయునో; సః = వాడు; సన్న్యాసీ = సన్న్యాసి; చ = మరియు; యోగీ = కర్మయోగి; చ = కూడా; నిరగ్నిః = వైదిక కర్మలను చేయనివాడు; న = కాదు; చ = మరియు; అక్రియః = ఇతరమైన లౌకిక కర్మలను చేయనివాడు; న = కాదు.

శ్రీ కృష్ణ భగవానుడిట్లు పలికెను:

ఎవడైతే కర్మఫలముపై ఆధారపడకుండగా, కర్తవ్య కర్మను చేయునో, వాడే సన్న్యాసి, కర్మయోగికూడా. వైదిక, లౌకిక కర్మలను త్యజించినంత మాత్రాన మానవుడు సన్న్యాసి కాడు (1).

సాధ్యము ఏదైనా కావచ్చును. సాధ్యమును బట్టి సాధనములు వివిధ రకములుగా నుండును. జైలుకి వెళ్లాలి అనుకుంటే, చట్టము నతిక్రమించుట సాధనమగును. కాని, సంసారము అనే బంధము నుండి విముక్తి అనునది సాధ్యము అయినచో, దానికి బహిరంగ, అంతరంగములనే ద్వివిధ సాధనములు అవశ్యకమగునని మనము చూచియున్నాము. కర్మలను యోగబుద్ధితో అనుష్ఠించుట (కర్మయోగము) బహిరంగ సాధనము. ఈ బహిరంగ, అంతరంగ సాధనములు రెండింటికి ప్రయోజనము మనస్సును జ్ఞానరూపమగు మోక్షమునకు యోగ్యముగా సంసిద్ధము చేయుటయే.

ధ్యానము వలన మనస్సు నిశ్చలమగును (చిత్త నైశ్చల్యము) అని మనము చెప్పవచ్చును. మనస్సు అన్నివేళలా చంచలముగ నుండును. చలత్వము తొలగినచో నిశ్చలమగును. అంతరంగ సాధనమగు ధ్యానమును అనుష్ఠించుట వలన మనస్సునకు నైశ్చల్యము, మరియు ప్రసన్నత యేర్పడును.

ధ్యానము యొక్క ప్రయోజనము అంతరంగ నిశ్చలత. రాగద్వేషములను తొలగించి అంతఃకరణమును శుద్ధము చేయుట కొరకు కర్మయోగము ఉద్దేశింపబడినది. అనగా, ఈ రెండు మోక్షసాధనములే.

శ్రీ కృష్ణ భగవానుడు గడచిన అధ్యాయములోని ఆఖరి మూడు శ్లోకములలో ధ్యానము అనే విషయ వస్తువును సూత్రరూపముగా చెప్పియున్నాడు. ఆయన ఇపుడు ఆరవ అధ్యాయములో మొదటి రెండు శ్లోకములలో మరల కర్మయోగమును గురించి ప్రస్తావించుచున్నాడు. ఆయన కర్మయోగమును గురించి 2,3,4,5 అధ్యాయములలో చెప్పియున్నాడు. ఇంతేగాక, గీతలో సర్వత్రా దానిని ఆయన మోక్షసాధనముగా ప్రతిపాదిస్తాడు. ఇచట శ్రీకృష్ణుడు బాహ్య సాధనమగు కర్మయోగమును అంతరంగసాధనమగు ధ్యానమునకు ఉపక్రమముగా ప్రస్తావించుచున్నాడు.

తప్పక చేయదగిన కర్మ

ఈ శ్లోకములోని కర్మ శబ్దము తప్పక చేయదగిన కర్మలన్నిటినీ నిర్దేశించును. మనము ప్రస్తుతములో చర్చించే వ్యక్తి కర్మలనే విధముగా ఆచరించును? అతడు కర్తవ్యకర్మను కర్మఫలముపై ఆధారపడకుండగా చేయును. ఇతనికి కర్మను ఆచరించుటలో కర్మఫలము మాత్రమే ప్రముఖమగు ఆధారముగా నుండదు.

కాని, కర్మి విషయంలో, ఆచరించవలసిన కర్మలను నిర్ణయించే అంశములు రాగద్వేషములు మరియు వ్యక్తులు మాత్రమే. అతనికి తన రాగద్వేష పరిపూర్తియే ప్రధానముగా నుండును గాన, కర్మనాచరించుటలో అతడు ఇతర నియమములను పరిగణించడు. ఇట్టివాడు కేవల స్వార్థపరుడై, సర్వదా ఏదో ఒకదానిని సంపాదించుకునే ప్రయత్నములో నుండును. మరియు, ఇతడు తన రాగద్వేష పరిపూర్తిని చేసుకునే ప్రక్రియలో ధర్మాధర్మముల గురించి, మంచిచెడుల గురించి లెక్కచేయడు. అతని దృష్టిలో అవి నిర్ణాయక అంశములు కానే కావు.

కర్మికి కర్మ నాచరించుటలో ప్రధాన ప్రేరకము రాగద్వేష పరిపూర్తి మాత్రమే. అతడు పూర్తిగా కర్మఫలములపై ఆధారపడి ప్రవర్తిల్లును (కర్మ ఫలాశ్రితః). కర్మయోగి విడవాడవలసిన

లక్షణములు, ప్రవణతలు (tendencies) ఇవియే గదా! అట్లు విడని వ్యక్తి కర్మియే గాని, కర్మయోగి కాదు.

కర్మయోగికి కూడ రాగద్వేషములు ఉండును.

కర్మయోగికి రాగద్వేషములుండవని అనుకోరాదు. రాగద్వేషములు ఉన్ననూ, వాటిని అనుసరించకుండగా, త్యజించువాడు కర్మయోగి అగును. 'నేను దీనిని పొంది తీరాలి', లేదా 'అది నాకు రాకూడదు' ఇత్యాది ఆగ్రహమును విడనాడి, కర్మయోగి కర్తవ్య కర్మను ఆచరించుటలో నిమగ్నుడగును. మరోమాటలో చెప్పాలంటే, కర్మయోగి 'నాకు ఇది కావాలి, అది కావాలి' ఇత్యాది కామనలను విడనాడి, రాగద్వేషములకు వశవర్తి కానివాడై, ధర్మాధర్మములకు అనురూపముగా, సంప్రాప్తమైన కర్తవ్యకర్మను ఆచరించును. ఇట్లు చేయుట వలన మానవుడు తన రాగద్వేషములను కొంతవరకు విడనాడగల్గును. మిగిలిన వాటిని అతడు ధర్మమునకు అనురూపముగా నున్నంతవరకు పరిపూర్తి చేసుకొనును.

ధర్మమునకు అనురూపముగా జీవించుట

కోర్కెలను తీర్చుకునే సందర్భాలలో సాధన సాధ్యములను రెండింటినీ ఎన్నుకునే స్వేచ్ఛ వ్యక్తికి గలదు. ఈ ఎన్నిక వ్యక్తి యొక్క రాగద్వేషములచే నిర్ణీతమగును. రాగద్వేషములు అన్నివేళలా మంచిచెడులకు అనురూపముగా ఉండుననే నియమము లేదు. కొన్ని సందర్భాలలో అవి మంచిచెడులకు అనురూపముగా నుండవచ్చును. కాని, ప్రాయశః అవి అనురూపముగా నుండవు. అయినచో, వ్యక్తి ఏమిచేయాలి? ఈ విషయము ఆ వ్యక్తి కర్మయోగియా, కాదా అను విషయముపై ఆధారపడియుండును. ఆ వ్యక్తి కర్మయోగి కానిచో, సాధన సాధ్యముల మంచిచెడుల గురించి లెక్కచేయడు. 'నాకిది కావాలి; కాన, దీనిని పొంది తీరుతాను' అని తేలికగా చెప్పగల్గుతాడు. తాను ఎన్నుకున్న లక్ష్యమును చేరుటకు అతడు అవశ్యకమైన సాధనమును మంచిచెడుల ప్రసక్తి లేకుండగా చేపట్టును. ఇట్టి వ్యక్తి కర్మి యనబడును.

కర్మయోగి అనుసరించు మార్గము దీనికి భిన్నముగా నుండును. అతడు ధర్మాధర్మములకు అనురూపమైన నడవడికి ప్రాముఖ్యము నిచ్చును. ఆ ప్రక్రియలో నాతడు కొన్ని త్యాగములకు కూడ సిద్ధపడును. కర్మయోగి రాగద్వేషములను విడనాడును. అనగా అతడు రాగద్వేషములచే ప్రేరితుడు కానివాడై, కర్తవ్య కర్మను అనుష్ఠించును. "ఇది నా కర్తవ్యము గనుక, నేనీ పనిని చేసెదను" అని

చెప్పు వ్యక్తి రాగద్వేషములను, కర్మఫలములను కొంతవరకు విడనాడినట్లు స్పష్టమే. కావున, అట్టి వ్యక్తి ఒక రకంగా సన్న్యాసియే. కావుననే, అట్టి వ్యక్తి కర్మయోగి మాత్రమే గాక, సన్న్యాసి కూడ యగునని శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పెను. కర్మయోగి ముఖ్యసన్న్యాసి కాడు. కాని, రాగద్వేష పరిత్యాగము అనే అంశము దృష్ట్యా కర్మయోగికి, సన్న్యాసికి సామ్యము గలదు.

జీవనమూల్యముల మహత్త్వము

నేను కోరే వస్తువునకు నా దృష్టిలో విలువ ఎక్కువ ఉండును. మానవుడు 'నేను దుఃఖిని' అనే ధారణ గలవాడై, కొన్ని భోగవిలాసముల వెనుకపడును. ఈ భోగ విలాసముల మహత్త్వమును మానవుడు సరిగా తెలుసుకొనడు. వాటి అల్పత్వమును తెలుసుకొనడు. కావుననే, వాటి విలువను అధికంగా అంచనా వేసుకుంటాడు. అదే సమయంలో, మానవుడు విశ్వజనీన మూల్యముల (universal values) ను గురించి సరియగు అవగాహన లేని కారణంగా వాటిని తక్కువగా అంచనా కడతాడు. వాటికి అతని దృష్టిలో చాల తక్కువ విలువ ఉంటుంది. అంటే, మనకు ఈ జీవనమూల్యముల జ్ఞానము లేదు. అంతేగాక, మనము వాటికి సంబంధించిన చదువును కూడ నేర్చుకొనుట లేదు. మనకు ఈ జీవనమూల్యముల మహత్త్వము తెలియదు. ఈ పరిస్థితి సంఘర్షణకు దారితీయును.

జీవనమూల్య సంరచన (value structure) ను విశ్లేషిస్తే, మనకు వాటి మహత్త్వము తెలియలేదని స్పష్టమగును. కావున, మనదృష్టిలో విశ్వజనీన మూల్యముల విలువ అల్పముగను, మానవులు సాధారణముగా అధిక విలువనిచ్చే ధనమునకు, అధికారమునకు మహత్త్వము అతిశయముగను ఉండును. కాని, ఈ జీవన మూల్యములను స్పష్టముగా అర్థము చేసుకున్న నాడు, మనము వాటిని తప్పుగా అంచనా వేయము. అంతవరకు అవి మనలను శాసిస్తాయి. అధికారము (power) శాసిస్తుంది. ధనము శాసిస్తుంది. పేరు ప్రతిష్ఠలు శాసిస్తాయి. పరపతి శాసిస్తుంది. వాటికి మన హృదయములో అగ్రస్థానము ఈయబడుతుంది.

జీవనమూల్యములను జాగరూకులమై తెలుసుకోవాలి

జీవనమూల్య సంరచనను సరిగా తెలుసుకొనుటకు, మనము విలువ నిచ్చే అంశముల అల్పత్వమును తెలుసుకొనుటకు, మనము జాగరూకులమై కర్మయోగ జీవననిష్ఠను స్వీకరించాలి. కర్మయోగి యందు ఇంకనూ రాగద్వేషములు సజీవముగ నుండును గనుక, అతని దృష్టిలో విలువ గల వస్తువునకు అతనిపై నియంత్రణ ఉండును. అంటే, కర్మయోగి తన రాగద్వేషములను త్యాగము

చేయవలసి యుండును. అంటే, ఒక లక్ష్యమును సాధించుటకు ఉన్న సాధనము లన్నింటిలో మిక్కిలి తేలికైన దానిని ఎన్నుకునే అవకాశము అతనికి ఉండదు. ఏలయన, అతడు ఇప్పుడు మోక్షసాధనమగు కర్మయోగ జీవననిష్ఠకు అంకితమైనాడు.

కర్మయోగికి జిజ్ఞాస గలదు. అనగా, అంతఃకరణశుద్ధి ఆవశ్యకమగును. మిగతా విషయాలు ఎలా ఉన్నా, అతడు మానసిక పరిణతిని పొందాలనే ఆకాంక్షను కలిగియుండును. కాని పరిణతి లభించుటకు మానవుడు కొంత త్యాగము చేయక తప్పదు. ప్రస్తుతంలో, మానసిక సంఘర్షణకు హేతువులగు అంశములను (విక్షేప హేతువులను) తప్పక త్యజించాలి. విక్షేపమును పరిహరించుటకై చెడు పనులను చేయుట మానివేయాలి. చెడు పనులు సంఘర్షణకు బీజములు గదా!

చెడు పనిని మొదలిడక ముందే 'నేనీ పనిని చేయాలా, వద్దా?' అనే సంఘర్షణ బయలుదేరుతుంది. వాస్తవంలో, చేయుటకు ముందు, చేస్తున్నప్పుడు, చేస్తున్న తరువాత కూడా అన్నివేళలా సంఘర్షణ తప్పదు! చేయుటకు ముందు చేయాలా, వద్దా అను సంఘర్షణ ఉండును. చేస్తున్నప్పుడు, రెండువైపులా చూసుకుంటూ ఉండాలి. చౌర్యము ఇత్యాది అకృత్యములలో మరింత జాగరూకత ఉండాలి. చేసిన తరువాత కూడా ''పోలీసులు నా కొరకు వెతుకుతున్నారేమో!'' అనే సంఘర్షణ తప్పదు!

కాని, మనము రాగద్వేషములను విడనాడి ధర్మబద్ధమగు కర్మను చేసినచో, ఆ పరిస్థితి యెట్లుండును? చేయుటకు ముందు అధర్మమును పరిహరిస్తూ సంకల్పము చేయవలసి యుండును. కావున, ఆసమయములో కొంతసంఘర్షణ ఉండును. మనము అన్నివేళలా మంచిపనిని సహజధోరణిలో చేయము. దానికొరకై ప్రత్యేక సంకల్పమును చేయవలసి యుండును. అనగా, కొంత సంఘర్షణ కలుగును. కాని, మంచి పనిని చేసిన తరువాత, ఇక సంఘర్షణకు చోటు లేదు. అనగా, కర్మయోగి సంఘర్షణతో ఆరంభించినా, అంతములో సంఘర్షణ ఉండదు.

ఈ తీరున, సన్న్యాసి వలెనే, కర్మయోగి కూడా రాగద్వేషములచే సమ్మోహితుడు కాడు. కావున, తన ఇష్టానిష్టములపై ఆధారపడకుండగా కర్తవ్య కర్మను చేయు వ్యక్తి సన్న్యాసియే గాక యోగి కూడ అగునని శ్రీకృష్ణుడు చెప్పెను.

ద్వివిధ కర్మలను త్యజించుట

కర్మయోగి ఏది కాడో దానిని శ్రీకృష్ణుడు 'న నిరగ్నిః న చ అ క్రియః' అను పదములలో వివరించెను. సన్న్యాసాశ్రమమును స్వీకరించు వ్యక్తి వేదవిహిత కర్మలను, ఇతర లౌకిక కర్మలను కూడ త్యజించును. ఈ ద్వివిధ కర్మలు 'నిరగ్నిః, అక్రియః' అను పదములచే నిర్దేశింపబడినవి. వైదిక ధర్మములో వ్యక్తి సన్న్యాసాశ్రమమును స్వీకరించుటకు ముందు వేదవిహితములగు కొన్ని నిత్య, నైమిత్తిక కర్మల నాచరించును. వైదిక కర్మ లన్నింటిలో అగ్ని ఉండును. అగ్నిహోత్రాది కర్మలను సన్న్యాసి చేయడు. కావుననే ఈ శ్లోకములో సన్న్యాసి 'నిరగ్నిః' అను పదముచే నిర్దేశింపబడినాడు. అన్ని విధముల పూజలను, కుటుంబ కార్యములను, వ్యాపారము ఇత్యాది ఇతర కర్మలను కూడ సన్న్యాసి త్యజించును. మరో మాటల్లో చెప్పాలంటే, కుమారుడు/ కుమార్తె, తల్లి/ తండ్రి, మిత్రుడు/ మిత్రురాలు, పౌరుడు ఇత్యాది పాత్రలను వేటినీ సన్న్యాసి పోషించడు. అందువలననే ఈ శ్లోకము సర్వకర్మలను వీడిన సన్న్యాసిని 'అక్రియః' అను పదముచే నిర్దేశించినది.

వేద విహిత కర్మలను, మరియు లౌకిక కర్మలను ఒక ప్రత్యేకమగు హోమమును చేసి త్యజించిన వ్యక్తి సన్న్యాసి యనబడును.

స్వామీజీని తరుచుగా ప్రజలు "మీరు ఎందుకు సన్న్యాసి అయినారు?" అను ప్రశ్నను వేస్తారు. ఇది చాల పసందైన ప్రశ్న. ప్రతి సన్న్యాసికి తనదైన ఒక కథ ఉంటుంది. ఆ కథ అహ్లాదకరమైనది కానిచో, ఆ స్వామీజీ సమాధానమును చెప్పు అవకాశము చాల తక్కువ. ఏది ఏమైనా, సన్న్యాసి యగుటలో ఒక విశిష్ట కారణము ఉండి తీరును. ఒకడు వ్యాపారములో దివాలాతీసి, మరో గతిలేక సన్న్యసించి ఉండవచ్చును. ఈ రోజులలో పోస్టు ద్వారా కూడా సన్న్యాసి కావచ్చునని నేను విన్నాను! ఒక వ్యక్తి సన్న్యాస జీవనమును ఎన్నుకుని సన్న్యాసియై యుండవచ్చును. కాని, అతని రాగద్వేషములు తొలగిపోయినవని చెప్పుటకు వీలులేదు. ఇతరములగు కోర్కెలు అతనికి లేకపోవచ్చును. కాని, వేదాంతము ఏమిటో తనకు తెలియకపోయినా, ఇతరులకు ఉపదేశించి, వారిని రక్షించాలనే కోరిక అతనికి ఉండవచ్చును. "నాకు ప్రజలను రక్షించి, వారికి సేవచేయాలనే తపన తీవ్రముగా నున్నది" అని అతడు చెప్పును. అట్టివానిని తప్పకుండా ఒక ప్రశ్న వేయాలి. ఇది ప్రజలను రక్షించాలనే కోరికయా? లేక తనను తాను రక్షించుకునే కోరికయా? ఇతరులను రక్షించుటకు పూర్వము తనను తాను రక్షించుకోవాలి గదా! సేవలన్నిటినీ ఇతరులచే చేయించుకునే వ్యక్తి ఇతరులకు ఏమి సేవ చేయగల్గును? కొందరిలో రాగద్వేషములు ఎంత తీవ్రముగ నుండునో! వారి సరళమగు సత్యమును

కూడ తెలియజాలరు. కావున, సన్న్యాసాశ్రమమును స్వీకరించినంత మాత్రాన, వ్యక్తి యథార్థముగా సన్న్యాసి అయినాడని చెప్పజాలము.

శ్రీకృష్ణుడింకనూ ఇట్లు చెప్పెను:

అధ్యాయము 6, శ్లోకము 2:

यं सन्न्यासमिति प्राहुर्योगं तं विद्धि पाण्डव ।
न ह्यसन्न्यस्त सङ्कल्पो योगी भवति कश्चन ॥ २ ॥

యం సన్న్యసమితి ప్రాహుర్యోగం తం విద్ధి పాండవ
న హ్యసన్న్యస్త సంకల్పో యోగీ భవతి కశ్చన (2)

పాండవ = ఓ అర్జునా; యం = దేనిని; సంన్యాసం = సన్న్యసము; ఇతి = అని; ప్రాహుః = చెప్పెదరో; తం = దానిని, యోగం = కర్మయోగముగా; విద్ధి = తెలుసుకొనుము; హి = ఏలయనగా, అసన్న్యస్త సంకల్పః = (స్వర్గాది పరిచ్ఛిన్న ఫలముల యందలి) కామనలను విడువని; కశ్చన = ఎవడైననూ; యోగీ = కర్మయోగి; న భవతి = కాడు.

ఓ అర్జునా! దేనిని సన్న్యసమని చెప్పెదరో, అదియే కర్మయోగమని తెలుసుకొనుము. ఏలయనగా, స్వర్గాది పరిచ్ఛిన్న ఫలముల యందలి కామనలను విడువని వాడు ఎవడైననూ, కర్మయోగి కాజాలడు (2).

కర్మయోగి సంకల్పముల నన్నిటినీ విడిచిపెట్టును. ధనమును సంపాదించాలి; కుటుంబము యొక్క ప్రతిష్ఠను, స్థితిని వృద్ధి చేయాలి; పుణ్యమును సంపాదించాలి ఇత్యాది కామన లన్నియూ సంకల్పముల నుండియే పుట్టును; సంకల్పములే కామనలకు వేగమును కలిగించును. కర్మయోగి సంకల్పములను త్యజించినవాడే అయిననూ, అంతఃకరణశుద్ధి కొరకై కర్మల నాచరించుచునే యుండును. కర్మలను మాత్రమే వీడి, సంకల్పములను వీడని వ్యక్తి కర్మయోగి కాడు; సన్న్యాసి కాడు.

కర్మయోగి తన సంకల్పముల నన్నింటినీ త్యజించు విధమెట్టిది? కర్మయోగి ధర్మ విరుద్ధములగు రాగద్వేషములను మాత్రమే విడిచిపెట్టును. కాని, ముఖ్య సన్న్యాసి (పరమార్థ సన్న్యాసి) రాగద్వేషములను, కర్మలను సంపూర్ణముగా విడిచిపెట్టును. సన్న్యాసి వీటిని త్యజించు

విధమేది? ఆతడు జ్ఞాన ప్రభావముచే కర్తృత్వధారణను త్యజించి, తద్ద్వారా సర్వకర్మ సన్న్యాసమును చేయును.

జ్ఞానసాధన కొరకై సన్న్యాసాశ్రమమును స్వీకరించిన వ్యక్తిని ఉద్దేశించి, శ్రీకృష్ణుడీ శ్లోకములో సన్న్యాసి శబ్దమును ప్రయోగించెను. కర్మయోగికి, సన్న్యాసికి కూడ సంకల్పములను వీడుట సమానమే. అందువలననే శ్రీకృష్ణుడు వారిద్దరికి సమమగు స్థాయిని ఇచ్చెను. అంటే, సన్న్యాసికి, కర్మయోగికి సంకల్పత్యాగము సమానమే గనుక, కర్మయోగి కూడ ఒక విధమగు సన్న్యాసియే నని అభిప్రాయము.

ఐదవ అధ్యాయము ప్రారంభములో ముఖ్య సన్న్యాసము యొక్క వివరణకు ఉపక్రమిస్తూ, శ్రీకృష్ణుడు కర్మయోగి చేసే గౌణ సన్న్యాసమును కూడ చర్చించినాడు. ఈ అధ్యాయములో విషయవస్తువు ధ్యానము. దానికి కూడ కర్మయోగము అవశ్యకమే. అందుచేతనే, కేవల సన్న్యాసము కంటె కర్మయోగమే శ్రేష్ఠతరమని శ్రీకృష్ణుడు కర్మయోగమును స్తుతించుచున్నాడు.

కర్మయోగము ధ్యానమునకు సాధనము

మనము సంకల్ప బలముచే ధ్యానమునకు కూర్చుండగలము. కాని, మనస్సు ధ్యానమునకు యోగ్యముగా సంసిద్ధము కానిచో, కూర్చుండుట వలన ప్రయోజనము సిద్ధించదు. మనస్సు ఆత్మ యందు గాని, లేక ఇతర ధ్యేయ వస్తువుపై లగ్నమై ఉండగల్గుటయే ధ్యానయోగ మనబడును, మనస్సును సంసిద్ధము చేయు సాధనము కర్మయోగము. కావున, అది ధ్యానయోగమునకు అంగము అగును. ఈ తీరున, కర్మయోగమునకు, ధ్యానయోగమునకు మధ్య సంబంధము గలదు. మరియు, అవి మోక్షమునకు క్రమముగా బహిరంగ, అంతరంగ సాధనము లగుచున్నవి.

కర్మయోగము ధ్యాన యోగమునకు అంగము అయ్యే విధానమును శ్రీకృష్ణుడీ క్రింది శ్లోకములో వివరించుచున్నాడు:

అధ్యాయము 6, శ్లోకము 3:

आरुरुक्षोर्मुनेर्योगं कर्म कारणमुच्यते ।
योगारूढस्य तस्यैव शमः कारणमुच्यते ॥ ३ ॥

ఆరురుక్షోర్మునేర్యోగం కర్మ కారణ ముచ్యతే
యోగారూఢస్య తస్యైవ శమః కారణ ముచ్యతే (3)

యోగం = ధ్యానయోగమును; ఆరురుక్షోః = పొందదలచుకొన్న, మునేః = మునికి; కర్మ = కర్మయోగము; కారణం = సాధనమని, ఉచ్యతే = చెప్పబడును; యోగారూఢస్య = యోగమును పొందియున్న, తస్య = వానికి; శమః = సర్వ కర్మ సన్న్యాసము; ఏవ = మాత్రమే; కారణం = సాధనమని; ఉచ్యతే = చెప్పబడును.

> ధ్యానయోగమును పొందదలచుకున్న మునికి కర్మయోగము సాధనమని చెప్పబడును. యోగమును పొందియున్న వానికి సర్వకర్మ సన్న్యాసము మాత్రమే సాధనమని చెప్పబడును (3).

ఎత్తైనదానిని ఎక్కు కోరిక గలవాడు ఆరురుక్షువు అనబడును. అట్లు ఎక్కుటలో ఒక పద్ధతిని అవలంబించాలి. ఉదాహరణకు, ఒక వ్యక్తి గుర్రమును ఎక్కాలని అనుకున్నాడు. అది తేలిక పని కాదు. కావున, అతడు ఒక విశిష్ట పద్ధతిలో గుర్రమును ఎక్కవలెను.

అదే విధముగా, యోగము అనే గుర్రమును ఎక్కాలనే కోరిక కొందరికి గలదు. ఇచట యోగమనగా ధ్యానయోగము. అట్లు చేయుటకు సాధనము (కరణము) ఏది? కర్మయోగమే ఏకైక సాధనము. ఏలయన, మన మనస్సులో నిర్మాణమై యున్న సమస్యల మూలకారణములను మనము తెలుసుకోవాలి.

మన సమస్యలకు కారణము లేవి? మన రాగద్వేషములే కారణములు. మనము వాటిని నియంత్రించాలి. రాగద్వేష సమ్మోహమునకు వశము కాని మనస్సును పొందగోరే వ్యక్తికి కర్మయోగము ఏకైక సాధనము.

ధ్యానము సంకల్ప శక్తి జన్యము కాదు

ధ్యాన యోగ్యమైన చిత్తవృత్తి, మనన శీలమగు మనస్స్థితి అనునవి సంకల్పశక్తి జన్యములు కావు. ధ్యానములో కూర్చోవాలి అను నిర్ణయము వరకు ఇచ్ఛాశక్తికి అధీనములో నుండును. అంతే. ధ్యానములో మనస్సు లగ్నము అగుటకు, మనస్సు సన్నద్ధమై ఉండాలి; సంసిద్ధమై ఉండాలి. ఈ సంసిద్ధత కాలక్రమంలో దానంతట అది సిద్ధించేది కాదు. కర్మయోగ జీవనశైలి ఇట్టి సంసిద్ధతను ప్రసాదించును.

మోక్షప్రాప్తిలో బాహ్య సాధనమగు కర్మయోగము, అంతరంగ సాధనమగు ధ్యానయోగము పరస్పర సంబద్ధములని మనము చూచియున్నాము. ఈ సంబంధము చాల ఘనిష్ఠమైనది. వాస్తవంలో, ఇవి రెండు కలిసి ఒక పూర్ణప్రక్రియలో భాగము అగును. ధ్యానయోగము అనే గుర్రమును అధిరోహించగోరు (ధ్యానమును చేయు సామర్థ్యమును పొందగోరే) వ్యక్తికి కర్మయోగము సాధనము. కర్మయోగ జీవనము వలన ఇట్టి సామర్థ్యమును పొందిన వ్యక్తి యోగారూఢుడు అనబడును. యోగారూఢుని విషయములో మాత్రమే సర్వకర్మ త్యాగరూప సన్న్యాసము (శమము) సంభవమగును.

కర్మయోగము తనంత తానుగా వ్యక్తిని యోగారూఢుని చేయజాలదు. వ్యక్తి కర్మయోగ జీవనము వలన మననశీలమగు అంతఃకరణమును పొందును. అపుడాతనికి కార్యకలాపము లన్నిటియందు పూర్ణవైరాగ్యము, అసక్తత ఏర్పడి, అతడు యోగారూఢుడు అగును. ఇట్టి పూర్ణ అసక్తత(dispassion), సర్వకర్మ పరిత్యాగము అనునవి, జ్ఞానము ద్వారా మాత్రమే సంప్రాప్తమగును.

పూర్ణ పరిత్యాగము జ్ఞానముచేత మాత్రమే సంభవమగును

ఈ శ్లోకములోని శమ శబ్దమునకు పూర్ణ ఉపసంహారము, అనగా సర్వకర్మలను సంపూర్ణముగా త్యజించుట అని యర్థము. ఇట్టి శమము జ్ఞానము చేత మాత్రమే సంభవమగును. కావున, జ్ఞానము సాధనము అగును. ఇందువలననే, మోక్షప్రాప్తిలో ఉపాయమైన ఈ జ్ఞానము సన్న్యాసము కంటె అభిన్నము అని చెప్పబడినది. కావుననే, ఈ శ్లోకములో జ్ఞాని యోగారూఢుడు అని వర్ణింపబడినాడు.

యోగారూఢుడు జ్ఞాని అయినది కర్మయోగము వలన కాదు; జ్ఞానము వలననే జ్ఞాని అయినాడు. కావున, జ్ఞాని యగుటలో సాక్షాత్సాధనమగు జ్ఞానము ఈ ప్రకరణములో సన్న్యాస శబ్దముచే నిర్దేశింపబడును. ఈ విషయములో ఈ శ్లోకము తరచుగా అపవ్యాఖ్యానములకు గురి అయినది. శ్రీ శంకరులు తమ భాష్యములో జ్ఞానముచేత మాత్రమే సర్వకర్మ సన్న్యాసము సంభవమగుననియు, మరియొక మార్గము లేదనియు సుస్పష్టముగా వ్రాసియున్నారు. కావున, సర్వకర్మ పరిత్యాగము చేసిన సన్న్యాసి (జ్ఞాని) మాత్రమే యోగారూఢుడు అనబడును. సరిగ్గా చెప్పాలంటే, కర్మలను స్థూలదృష్ట్యా విడిచిపెట్టి, నిష్కర్మణ్యతతో కూర్చునియుండుట కర్మసన్న్యాసము కాదు. ఆత్మ అకర్తయను జ్ఞానము కలిగిన జ్ఞాని, కర్మలను చేస్తూనే, సర్వకర్మసన్న్యాసిగా ఉంటాడు. కావున, సర్వకర్మ పరిత్యాగము (శమము) అనగా జ్ఞానమని గ్రహించాలి.

మానవుడు యోగారూఢుడు అయ్యేది ఎప్పుడు? ఈ ప్రశ్నకు శ్రీకృష్ణుని సమాధానము తరువాతి శ్లోకములో గలదు:

అధ్యాయము 6, శ్లోకము 4:

यदा हि नेन्द्रियार्थेषु न कर्मस्वनुषज्जते ।
सर्वसङ्कल्पसन्न्यासी योगारूढस्तदोच्यते ॥ ४ ॥

యదా హి నేంద్రియార్థేషు న కర్మ స్వనుషజ్జతే
సర్వ సంకల్ప సన్న్యాసీ యోగారూఢస్తదోచ్యతే (4)

యదా = ఎపుడైతే; **హి** = నిశ్చయముగా; **ఇంద్రియార్థేషు** = ఇంద్రియగోచరములగు విషయముల యందు; **న అనుషజ్జతే** = ఆసక్తిని కలిగియుండడో; **కర్మసు** = కర్మల యందు; **న అనుషజ్జతే** = ఆసక్తిని కలిగియుండడో; **సర్వ సంకల్ప సన్న్యాసీ** = (కామనలకు హేతువులైన) సంకల్పముల నన్నిటినీ విడనాడునో; **తదా** = అపుడు; **యోగారూఢః** = యోగారూఢుడని; **ఉచ్యతే** = చెప్పబడును.

> ఎపుడైతే వ్యక్తి ఇంద్రియగోచరములగు విషయముల యందు, కర్మల యందు నిశ్చయముగా ఆసక్తిని కలిగియుండడో, కామనలకు హేతువులగు సంకల్పముల నన్నిటినీ విడనాడునో, అపుడాతడు యోగారూఢుడని చెప్పబడును (4).

మనము చర్చిస్తున్న వ్యక్తి యొక్క మనస్సు సర్వావస్థలలో నిర్వికారముగ నుండును. ఈ మనస్సు నందు వైరాగ్యము, సంతోషము ఉండును. ఇది ప్రసన్నమైన మనస్సు. ఇంద్రియ గోచరములగు వస్తువుల యందు (ఇంద్రియార్థేషు) గాని, కర్మల యందు (కర్మసు) గాని ఈతనికి ఆసంగము (attachment) లేశమైననూ ఉండదు.

వైదిక కర్మ, లౌకిక కర్మ అని కర్మ రెండు విధములుగా నుండునని మనము ఇంతకు ముందు చూచియున్నాము. కాని ఈ రెండు రకముల కర్మలలో కూడ ఆత్మ యందు కర్తృత్వమును దర్శించడు. ''నేనీ పనిని చేసి తీరాలి; ఈ పనిని చేయుట వలన నా పరిస్థితి మెరుగుపడును'' ఇత్యాది భావనలు, వాటి వలన కలిగే కర్తవ్యతా బుద్ధి అతనియందు ఉండవు.

కర్త మాత్రమే కర్మలను చేయును

దీనికి భిన్నముగా, కర్మయోగి యందు, ''నేనీ పనిని చేయాలి; కావున, చేస్తాను'' అనే కర్తవ్యతా బుద్ధి ఉండును. ఈ కర్తవ్యబుద్ధికే కర్మయోగమని పేరు. కాని, శ్రీకృష్ణుడిచట యోగారూఢుని గురించి చెప్పుచున్నాడు. కర్తృత్వధారణ యోగారూఢునకు అన్వయించదు. వాస్తవంలో, వేదము ఇట్టి వ్యక్తిని ఉద్దేశించి, కర్మలను వేటినీ విధించదు. వేదము సంబోధించేది కర్తను మాత్రమే. ఇది మనము ఒక వ్యక్తిని ''ఓయీ రామా! ఇటు రమ్ము'' అని పిలుచుట వంటిది. అపుడు రాముడు అనే పేరు గల వ్యక్తి మాత్రమే దగ్గరకు వస్తాడు. అటులనే, వేదము మనలను ఉద్దేశించి, ''ఓ కర్తా! నీవీ కర్మను చేయుము; ఈ ఫలము లభించును'' అని విధించును. ఈ సంబోధనకు స్పందించేది ఎవరు? 'నేను కర్తను' అను ధారణ, కర్తవ్యతా బుద్ధి గల వ్యక్తి మాత్రమే స్పందిస్తాడు.

ఆత్మ కర్తయను ధారణ గల వ్యక్తి మాత్రమే వేద విధులకు స్పందించును. కాని, ఆత్మ కర్త కాదు అను సాక్షాత్కారము గల వ్యక్తి స్పందించు ప్రసక్తియే లేదు. ఈ శ్లోకములో 'కర్మసు న అనుషజ్జతే' అను వాక్యమునకు తాత్పర్యమిదియే. జ్ఞానికి కర్తవ్యతా బుద్ధి లేదు గనుక, ఎట్టి కర్మల యందైననూ (కర్మను) ఆసంగము ఉండదు. కర్తవ్యతా బుద్ధి లేని వ్యక్తికి భోగవస్తువుల యందు, కర్మల యందు మోహము ఉండదు. అవి అతనిని బంధించవు. ఏలయన, వాటి వలన తాను (ఆత్మ) ప్రస్తుతము కంటె మెరుగైన స్థితిని పొందగలనను ధారణను అతని యందు అవి కలిగించజాలవు. ఆత్మ స్వతః పూర్ణము గదా! కావున, అట్టి వ్యక్తికి కర్తవ్యశేషము ఉండదు.

ఈ శ్లోకభాష్యములో శ్రీ శంకరులు 'నిత్యనైమిత్తిక కామ్య ప్రతిషిద్ధా' అను సమాసమును ప్రయోగించి, మానవులు సాధారణముగా ఆచరించు కర్మలలోని రకములను నిర్దేశించిరి. మన మింతకు ముందు చూచిన విధముగా, ప్రతిదినము చేయదగిన వేదోక్త క్రతువులు నిత్యకర్మలనబడును. ప్రత్యేక సందర్భములో చేయవలసిన కర్మలు నైమిత్తిక కర్మలనబడును. సంతాన ప్రాప్తి, ఆరోగ్యము, సంపద, స్వర్గము ఇత్యాది కామనలను తీర్చే కర్మలను కూడ వేదము బోధించినది. వాటికి కామ్య కర్మలని పేరు. వేదముచే నిషేధింపబడిన కర్మలు ప్రతిషిద్ధము లనబడును. ఇచటి తాత్పర్యమేదనగా, జ్ఞానికి వేదవిహిత కర్మల విషయములో గాని, లౌకిక కర్మల విషయములో గాని, 'ఈ కర్మను నేను చేయాలి' అనే కర్తవ్యతా బుద్ధి ఉండదు. ఏలయన, జ్ఞాని పూర్ణుడు. అతడు భోగవస్తువులకు గాని, కర్మఫలములకు గాని ఏ విధముగనూ బద్ధుడై ఉండడు.

సర్వ కామనా బీజము నుండి వినిర్ముక్తి

యోగారూఢుడు సర్వ సంకల్ప సన్న్యాసియై యుండును. 'నేను కర్తను, భోక్తను' అనే ధారణను సంకల్పపదము నిర్దేశించును. ఈ కర్తృత్వ భోక్తృత్వ ధారణ నుండి వినిర్ముక్తుడగు జ్ఞాని 'పనిని చేస్తే, నేను ఈ తీరున మెరుగవుతాను' ఇత్యాదిగా సంకల్పించడు. 'నేను ప్రపంచమును బంధముక్తము చేసి రక్షించెదను' అనేది కల్పనలలో కెల్లా గొప్ప కల్పన. ఆత్మజ్ఞానము లేకపోవుట చేతనే ఇట్టి ఆడంబరముతో కూడిన ధారణలు కలుగుతాయి. సర్వ సంకల్ప సన్న్యాసి వీటన్నిటికి దూరముగా నుండును.

కర్తృత్వధారణ లేని జ్ఞాని మాత్రమే సర్వ సంకల్ప సన్న్యాసి కాగల్గును. కర్తృత్వ ధారణ యున్నచో, కామము కూడ ఉండును. కామము ఉన్నచోట కర్మ ఉండును. ఈ కర్మను యోగముగా తీర్చిదిద్దాలి. కర్తృత్వము ఉన్నంతవరకు కర్మయోగిగా జీవించాలి. కర్తృత్వము తొలగిన తరువాత, కర్మను ఆచరించి, సంపాదించదగినది ఏదియూ ఉండదు. అట్టి జ్ఞాని ప్రారబ్ధాధీనుడై ఏవో కొన్ని కర్మల నాచరించుచున్నట్లు భాసించును. ఇందువలననే, ఇంతకు ముందు శ్రీకృష్ణ భగవానుడు తాను కర్మలను ఇంకనూ ఆచరించుచున్ననూ, తనకు ముల్లోకములలో పొందబడనిది, పొందదగినది ఏదియూ లేదని చెప్పియుండెను.

కర్మ తనంత తానుగా మానవుని బంధించదు. కర్మకు తనంత తానుగా బంధించే శక్తి లేదు. ''నేనీ పనిని చేస్తే, ఇది అవుతాను; ఇది సాధించాలంటే ఈ పనిని చేయాలి'' ఇత్యాది ధారణలు వ్యక్తిని కర్మకు బంధిస్తాయి. 'నేను జీవితంలో గొప్పవాడిని కావాలి; నేను అభివృద్ధికి రావాలి; అప్పుడు జీవితంలో భద్రత ఏర్పడుతుంది' ఇత్యాది ధారణలు అన్నీ మనోవిలాసములు (సంకల్పములు) మాత్రమే. ఇట్టి సంకల్పముల నుండి పూర్ణముగా విముక్తుడైన వ్యక్తి సర్వసంకల్ప సన్న్యాసి యనబడును.

'నేను సర్వ సంకల్ప సన్న్యాసిని కావాలి' అని మీరు నిర్ణయించుకోవద్దని నా మనవి. సర్వసంకల్ప సన్న్యాసము ఒక ఆదర్శము కాదు. అది తెలియదగిన తత్త్వము. అది సర్వ సంకల్పముల నుండి విముక్తి. ఆత్మ యందు కర్తృత్వ భోక్తృత్వములు లేవు అనే ఎరుక వలన ఆ విముక్తి లభించును. ఈ యెరుక గల వ్యక్తియే యోగారూఢుడు, జ్ఞాని.

శ్రీకృష్ణుడు ఈ శ్లోకములో సర్వ కర్మ సన్న్యాసమును గురించియే చెప్పుచున్నాడు. కర్మకు ప్రేరకములగు కామనలను విడిచి పెట్టకుండగా, కర్మలను వీడుట అసంభవము. కావున, సర్వ కర్మ

పరిత్యాగములో సర్వకామనా పరిత్యాగము అంతర్గతమై ఉండును. మరియు, నేను పూర్ణుడను అను జ్ఞానము లేనిదే, కామనలను వీడుట అసంభవము. ఈ జ్ఞానము ఉదయించగనే, కర్తృత్వము తొలగిపోవును. అపుడు మాత్రమే సర్వకామనా పరిత్యాగము సంభవమగును. ఈ విధముగా, కామనలను, భావావేశమును, కర్మలను పరిత్యజించుట యనగా ఆత్మ పూర్ణము అనే సాక్షాత్కారము తప్ప వేరుగాదు.

కావున, మన కర్తవ్యము ఏమి?

అధ్యాయము 6, శ్లోకము 5:

उद्धरे दात्मनात्मानं नात्मानमवसादयेत्।
आत्मैव ह्यात्मनो बन्धुरात्मैव रिपुरात्मनः ॥ ५ ॥

ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మాన మవసాదయేత్
ఆత్మైవ హ్యాత్మనో బంధురాత్మైవ రిపురాత్మనః (5)

ఆత్మనా = తనచేత; ఆత్మానం = తనను; ఉద్ధరేత్ = ఉద్ధరించుకొనవలెను; ఆత్మానం = తనను; న అవసాదయేత్ = వినాశము చేసుకొనరాదు; హి = ఏలయనగా; ఆత్మా ఏవ = తాను మాత్రమే; ఆత్మనః = తనకు; బంధుః = బంధువు; ఆత్మా ఏవ = తాను మాత్రమే; ఆత్మనః = తనకు ; రిపుః = శత్రువు.

తనను తాను ఉద్ధరించుకొనవలెను. తనను తాను వినాశము చేసుకొనరాదు.
ఏలయనగా, తనకు తానే బంధువు. తనకు తానే శత్రువు (5).

నిన్ను నీవు రక్షించుకోవాలంటే, నిన్ను నీవు నాశనము చేసుకోరాదు. ఇతరులను నాశనము చేయనీయరాదు అని ఈ శ్లోకము స్పష్టము చేయుచున్నది. ఎందువలన? మానవునకు తన ఆత్మయే గొప్ప సహాయము; గొప్ప హితకారి. మరోమాటలో చెప్పాలంటే, నీ ఉపకారి నీవే. ఉపకారమును పొందునదెవరు? నీవే. అంటే, ఉపకారమును చేసేది నీవే; పొందేది నీవే. మరియు, నీ శత్రువు నీవే అని కూడ శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు. అనగా, నీకు నీవు గొప్ప ఉపకారివి కావచ్చును; లేదా, శత్రువు కావచ్చును.

నీటిలో పడిన వ్యక్తి ఈది తనను తాను రక్షించుకోవాలి. అదే విధముగా, యోగారూఢుడు, సర్వ సంకల్ప సన్న్యాసి యగు వ్యక్తి తనను తాను సుతరాము అనభిలషణీయమగు సంసారజీవనము నుండి పూర్తిగా రక్షించుకొనును. వాస్తవంలో, మానవుడుచేసే కర్మలన్నీ తనను తాను రక్షించుకొనుట కొరకు మాత్రమే ఉద్దేశింపబడినవి. 'నాకు భద్రత ఉండాలి' అని మానవుడు కోరును. ధననష్టము, అనారోగ్యము, వార్ధక్యము, మరియు మృత్యువు ఇత్యాది సమస్యల నుండి విముక్తిని పొందాలని మానవుడు కాంక్షించును. అనగా, మానవుడు తనను తాను అభద్రతా స్థితి నుండి రక్షించుకోవాలని కాంక్షించును. ఈ విధంగా మానవులందరూ తమ తమ భద్రత కోసం చేసే ప్రయత్నంలో నిమగ్నులై ఉన్నారు. ఈ ప్రయత్నములకు మనము ఆత్మ సురక్షా, ఆత్మ భద్రత, ఆత్మ సంక్షేమము ఇత్యాది అనేక నామముల నీయవచ్చును. ఈ ప్రయత్నములు, అన్వేషణలు అన్నియూ ఆత్మ కొరకు మాత్రమే అను విషయములో సందియము లేదు.

మౌలిక సమస్యను తెలుసుకోవాలి

మనమిచట ఉన్నదానికంటె భిన్నమైన జీవనశైలిని వెతికే ప్రయత్నమును చేయుట లేదు. మనము కొన్ని మౌలిక ప్రశ్నలకు సమాధానములను కనుగొనే ప్రయత్నమును చేస్తున్నాము. ప్రతి వ్యక్తిలో కొన్ని ప్రశ్నలు ఉదయిస్తాయి. అవి చాల అస్పష్టముగనే ఉండవచ్చును. కాని, వ్యక్తి సహజరీతిలో లగ్నమయ్యే నిత్యకృత్యాలకు ఈ ప్రశ్నలు అటంకమును కలిగించే అవకాశము గలదు. ఈ ప్రశ్నలు వ్యక్తి జీవితమునకు ఒక విశిష్ట దిశను నిర్దేశించును. గీతలోని పదాలలో చెప్పాలంటే, తాను రాగద్వేషముల సమ్మోహములో నున్నట్లుగా అతడు కొంత కాలానికి గుర్తిస్తాడు. మానవులందరు 'నాకిది ప్రియమైనది; నాకు ఇది కావాలి; కాన, నేనీ పనిని చేస్తాను' అంటూ సహజముగా వ్యాపృతులు (engaged) అయ్యే స్వాభావిక-ప్రవృత్తికి మూలములో నున్నది ఈ రాగద్వేషములేనని అతడు గుర్తిస్తాడు. మానవుల ప్రతిక్రియలన్నియూ ఈ రాగ ద్వేషముల నుండి జనించినవే.

మరియు, వ్యావహారిక క్షేత్రములో సర్వము న్యాయసమ్మతముగనే భాసించును. క్రోధము, శోకము ఇత్యాదులు న్యాయ సమ్మతములగును. మనము ఈ విషయములోనే భ్రాంతికి లోనగుదుము. క్రోధము న్యాయసమ్మతము గనుక, క్రోధమునుపొందుట కూడ న్యాయసమ్మతమే. కావున, 'నీవు కోపమును పొందరాదు' అని ఎవరైనా చెప్పినప్పుడు, నీకు మరింత కోపము వచ్చును. ఒకవో వ్యక్తి కోపమును పరిహరించినా, సమస్యలు తప్పవు. క్రోధాదులు న్యాయ సమ్మతములు అని అంగీకరించే వ్యక్తి తన సహజ ప్రవృత్తికి భంగము కలుగకుండగా ముందుకు సాగిపోవును. కాని,

మానవుడు తన ప్రవృత్తి యొక్క స్వరూపమును ప్రశ్నించుట ప్రారంభించాలి. అంటే, మానవుడు తాను జీవించే జీవితమును సమూలంగా విశ్లేషించాలి. ఇట్టి యథార్థమగు ప్రశ్నలు ఉదయించినప్పుడు, ఆ వ్యక్తి మౌలిక సమస్యను విశ్లేషించి తెలుసుకుంటాడు.

ఈ సమస్యను పరిష్కరించుటకు పరిణతి చెందిన మార్గము కలదు. పరిణతి చెందని మార్గము కూడ గలదు. ప్రార్థనాయుతమగు జీవనము అనేది ఒకటి కలదని మనము గీతాధ్యయనము వలన కనుగొన గల్గుతాము. ఈ ప్రార్థన గుడ్డి నమ్మకముతో చేసేది కాదు. ఇది జ్ఞానముతో ప్రకాశించుచున్న ప్రార్థన. కర్మయోగమనగా ఇట్టి భక్తి (ప్రార్థన)తో కూడిన మానసిక ప్రవృత్తియే గదా! ఈశ్వరుని గుర్తించుట కూడా కర్మయోగములో భాగమే. అట్లు గుర్తించి, ప్రార్థనాయుతమగు జీవనమును గడుపవలెను. అట్లు చేయుట వలన, విచారమును, మననమును చేయు శక్తి ప్రాప్తమగును. ఇట్టి జీవనము వలన విచారశక్తి సహజరీతిలో అబ్బును. దానివలన, ఆత్మసాక్షాత్కారము దానంతట అదియే కలుగును. అంటే, కర్మయోగము వలన మానవుడు జ్ఞానమును పొందగలడని స్పష్టమగుచున్నది కదా!

నిన్ను నీవు ఉద్ధరించుకో

ఈ శ్లోకములో ఆత్మ యనగా వ్యక్తి; అనగా నీవే. నీవు తొలి నుండియూ సంసారమనే సముద్రములో ఉన్నావు. నీవు ఈ సంసారము లోనికి హఠాత్తుగా జారిపడలేదు. నీవు పుడుతూనే దానిలో, దానితోబాటు పుట్టినావు. దీని నుండి బయటపడే ఉపాయమేది? నీవు నీ సంకల్పశక్తితో నీ జీవనదిశను వెనుకకు త్రిప్పాలి; నిన్ను గురించి, నీ జీవనమూల్యముల గురించి నీవు ప్రశ్నించుకోవాలి. నిన్ను గురించి ప్రశ్నించుకొనుట వలన, నీవు జీవనమూల్య సంరచనను మరల ఒకసారి పరిశీలించి, వాటికి నీవు ఇచ్చుచున్న మహత్త్వమును అంచనావేసి, వాటి యందు నీకు గల భ్రాంతులను తెలుసుకొనగల్గుతావు.

మనకు ఉండే సమస్యలన్నీ ప్రధానంగా మనము పాటించే తప్పు ప్రాథమికతల (priorities) నుండి ఉద్భవిస్తాయి. కావున, మనము జీవనమూల్య సంరచనను పునర్వ్యవస్థీకరించుకోవాలి. ఆ ప్రక్రియలో మన ప్రాథమికతలు సరియగు క్రమములోనికి వస్తాయి. ప్రతి వ్యక్తి తన జీవన మూల్య సంరచన (value structure) ను గూర్చిన విచారమును తానే చేసుకోవాలి (ఆత్మ నా ఏవ). ఇది మంచి చెడులను, కర్తవ్యాకర్తవ్యములను గురించిన విచారము. ఈ విచారము వలన వ్యక్తి యొక్క దృష్టికోణములో ఒక విశిష్టమైన జ్ఞానశీలమగు మార్పు కలుగును. ఇది విచారములో మొదటి మెట్టు.

విచారములోని రెండవ మెట్టును కూడా ఎవరికి వారే అధిరోహించాలి. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో మానవుడు నిస్సహాయుడవుతాడు. ఈ సత్యమును ఎవరికి వారు విచారము చేసుకుని గుర్తించాలి. అట్లు చేయుట వలన వ్యక్తి హృదయములో భక్తి శ్రద్ధలు కలుగుతాయి. ఒక విశిష్టపరిస్థితిలో ప్రతివ్యక్తికి కొన్ని శంకలు కలుగుతాయి. తరువాత ఈశ్వరుని గుర్తించి, ప్రార్థిస్తాడు. అపుడా వ్యక్తి వశియగును. అనగా దేహము, మనస్సు, ఇంద్రియములు వశమందు గలవాడని యర్థము. ఈ ప్రయత్నము నంతనూ ఎవరికి వారే చేసుకోవాలి.

జ్ఞానమును పొందుట కొరకై ఆచార్యుని వద్దకు ఎవరికి వారు కొంత ప్రయత్నము చేసి వెళ్లవలసి యుండును. ఈ విధముగా అనేక అంశములలో వ్యక్తి తనను తానే ఉద్ధరించుకోవాలి. అందువలననే, మానవుడు తనకు తానే ఉద్ధరించుకోవాలనియు, పై వారు ఉద్ధరించరనియు (ఆత్మైవ ఆత్మనః బంధుః) శ్రీకృష్ణుడీ శ్లోకంలో చెప్పుచున్నాడు.

తనకు తానే శత్రువు

నీ మస్తిష్కము సువ్యవస్థితముగా లేనిచో, నీ జీవన మూల్య సంరచన అస్తవ్యస్తముగా నున్నచో, నీ జీవితమే గాక, నీ చుట్టూ ఉన్న వారి జీవితములు కూడా భ్రాంతి పూర్ణములగును. కావున, నీ శత్రువు నీవే అగుదువని కూడా శ్రీకృష్ణుడు చెప్పెను. నీవు నీ మస్తిష్కమును, సంకల్పశక్తిని దురుపయోగము చేస్తే, లేక వాటిని ఏ మాత్రమూ వినియోగించకపోతే, అప్పుడు అవి నీకు శత్రువులగుట అతి సహజమగు పరిణామము. అవి నీకు ఎదురు తిరిగి, నిన్ను నశింపజేస్తాయి. సంసారిగా పుట్టుట తక్కువ దురదృష్టమేమీ కాదు. 'ఇది నన్ను రక్షిస్తుంది, అది నన్ను రక్షిస్తుంది' ఇత్యాది తప్పు ధారణలు అన్నీ ఈ సంసారములోనే ఉద్భవిస్తాయి. ఇట్టి ధారణలు, మోసపోయిన సంకల్పశక్తిని సూచించును. వ్యక్తిని ఇతరులు మోసము చేయుట మాత్రమే కాదు; తనను తాను మోసగించుకొనును. అనగా, అంతతో గత్యా మూర్ఖుడను అయ్యేది నేను మాత్రమే. నేను మూర్ఖుడను గనుకనే, నన్ను ఇతరులు మూర్ఖుని చేయగలుగుతున్నారు! మోసగింపబడుటకు నేను సంసిద్ధుడ నగుచున్నాను. కావున, నా శత్రువు నేనే. ఇతరులను నిందించుట వలన ప్రయోజనమేమున్నది? నా శత్రువు నేనే (ఆత్మైవ ఆత్మనః రిపుః).

నిన్ను నీవు కించపరుచుకోవద్దు

అందువలననే, మానవుడు తనను తాను నాశనము చేసుకోరాదని (ఆత్మానం న అవసాదయేత్) శ్రీకృష్ణుడు చెప్పెను. నీవు సంకల్పశక్తిని వినియోగించి, మారాలి. నీ అంతరంగములో

ఒక రకమైన విప్లవము రానిదే ఈ మార్పు సంభవము కాదు. ఈ అంతరంగ విప్లవము ఒక శాంతి విప్లవము; పరస్పర విరుద్ధములగు అనేకములైన విచారములను కల్పించుట కాదు. వ్యక్తి బాహ్య ప్రపంచమును దర్శించే దృష్టికోణములో ఒక విశిష్ట నిశ్శబ్ద విప్లవము వచ్చును. కావున 'ఆత్మానం న అవసాదయేత్' అను వాక్యమునకు 'నిన్ను నీవు కించపరచుకోవద్దు' అనే రెండవ అర్థమును కూడ చెప్పవచ్చును. వ్యక్తి తనను తాను కించపరచుకొనుట యనగా తనను తాను నాశనము చేసుకొనుటయే.

ఈ ప్రక్రియలో, నీవు నీ లోపల నున్న బాలుని తల్లివలె లాలించి, పాలించే అవసర మేర్పడవచ్చును. బాల్యములో నీవు నిరాదరణకు గురియై ఉన్నచో, నీకు యుక్తవయస్సు వచ్చునాటికి కొన్ని సమస్యలు నిర్మాణమవుతాయి. ఈ పెరిగిన 'బాలుని' లాలించేదెవరు? ఈ బాలునకు మిత్రుడెవరు? నీవు మాత్రమే. పెద్దవాడివైన నీవు నీలోని బాలుని తల్లివలె లాలించాలి. ''నిన్ను నీవే ఉద్ధరించుకోవాలి (ఆత్మానం ఉద్ధరేత్)'' అనుటలో శ్రీకృష్ణుని తాత్పర్యమిదియే.

మానవుడు తనను తాను నశింపజేసుకోరాదు (ఆత్మనా ఆత్మానం న అవసాదయేత్); తనను తాను ఉద్ధరించుకోవాలి (ఆత్మనా ఆత్మానం ఉద్ధరేత్) అను ఈ శ్లోకవాక్యములను సర్వ మానవాళికి అన్వయించే విధంగా వ్యాఖ్యానించవచ్చును. అన్ని స్థాయిలలోనూ మానవుడు తనను తానే ఉద్ధరించుకోవాలి. విశ్లేషణ చేస్తే మానవునకు హితకారి యగు శక్తి తన కంటె భిన్నముగా బాహ్యముగా లేదని తెలును. 'తాను' అనగా తన దేహము, మనస్సు, ఇంద్రియముల సంఘాతము (కార్యకరణ సంఘాతము). ఈ కార్యకరణ సంఘాతము సంకల్పశక్తితో కూడి ఆత్మకు మిత్రుడు, మరియు శత్రువు కూడా అగును. మరో మాటలో చెప్పాలంటే, నీకు ఉపకారి గాని, శత్రువు గాని నీవే అగుదువు.

అనగా, ఈ సంసారబంధము నుండి నీకు విముక్తిని కలిగించగలిగే బంధువు, హితకారి వేరే ఎవ్వరూ లేరు. చేయవలసిన పనిని చేయగలిగేది నీవు మాత్రమే. సంసారములోపల పెరిగి, పరిణతిని చెందుటలో ఇతర వ్యక్తి నీకు సహాయ్యము చేయగల్గును. కాని, సంసారము నుండి బయట పడాలంటే, ఆ పనిని నీకు నీవే చేసుకోవాలి. వాస్తవంలో, నీకు సంసారంలో సహకరించిన వ్యక్తి మోక్ష ప్రసక్తి వచ్చుసరికి నీకు అవరోధము కావచ్చును. బంధువు అనగా, ప్రేమానురాగములు కలవాడు. వ్యక్తి భావుకునిగా పరిణతి చెందుటలో ఈ ప్రేమానురాగములు ఆవశ్యక మగునమటలో సందేహము లేదు. కాని, బంధువు బంధకుడు కూడ కాగల్గును. కావున, అంతతో గల్యా, మోక్షప్రాప్తి విషయంలో నీకు నీవు మాత్రమే మిత్రుడవు. నీకు నీవు మిత్రుడవు కాలేకపోతే, నీకు నీవు శత్రువు అయిపోతావు.

శ్రీకృష్ణుడింకనూ ఇట్లు కొనసాగించుచున్నాడు:

అధ్యాయము 6, శ్లోకము 6:

बन्धुरात्मा त्मनस्तस्य येनात्मैवात्मना जितः।
अनात्मनस्तु शत्रुत्वे वर्तेतात्मैव शत्रुवत् ॥ ६ ॥

బంధురాత్మాత్మనస్తస్య యేనాత్మైవాత్మనా జితః
అనాత్మనస్తు శత్రుత్వే వర్తే తాత్మైవ శత్రువత్ (6)

యేన = ఎవనిచేత; **ఆత్మనా** = తనచేత; **ఏవ** = మాత్రమే; **ఆత్మా** = తాను; **జితః** = జయింపబడినాడో; **తస్య** = అట్టి; **ఆత్మనః** = తనకు; **ఆత్మా** = తాను; **బంధుః** = బంధువు; **తు** = కాని; **అనాత్మనః** = తనపై తనకు నియంత్రణ లేని వానికి; **ఆత్మా ఏవ** = తానే; **శత్రువత్** = శత్రువు వలె; **శత్రుత్వే** = శత్రుత్వము నందు; **వర్తతే** = ఉండును.

తనను తాను నియంత్రించుకున్న వాడు తనకు తాను బంధువు అగును.
కాని తనపై తనకు నియంత్రణ లేనివాడు తనకు తానే శత్రువుగా నుండును.
శత్రువు వలె వ్యవహరించును (6).

'తస్య' అనగా ఆత్మకు. అనగా, పూర్వశ్లోకములో చెప్పబడిన ఆత్మకు. ఆత్మకు స్నేహితుడు ఆత్మయే. ఎప్పుడు? ఆత్మను ఆత్మ జయించినప్పుడు. ఇచట చర్చించే ఈ ఆత్మ యేది? జయింపబడే ఆత్మ యేది? అది సత్-చిత్-ఆనంద-ఆత్మ కాజాలదు. ఏలయన, మనము దృశ్యమగు పదార్థమును మాత్రమే జయించగల్గుతాము. మనకు 'నేను' అనే బుద్ధి (ఆత్మబుద్ధి) గల ఒకే ఒక దృశ్య వస్తువు ఈ దేహేంద్రియ మనస్సుల సమాహారము (కార్యకరణ సంఘాతము). మన అధీనములో నుండేది, మనము జయించవలసినది ఈ సంఘాతమునే. జయించేది ఎవరు? ఆత్మయే (ఆత్మనా). అనగా, మానవుడు స్వీయవిచారము చేత, స్వీయ అనుశాసనము చేత, స్వీయకృషి చేత, స్వీయ సంకల్ప శక్తి చేత జయించవలెను.

మనకు లభ్యమయ్యే మూడు శక్తులు

దేహేంద్రియ మనస్సంఘాతమును తన వశములో నుంచుకొనగల్గిన వ్యక్తి వశీ యనబడును. అట్టి వశీ తనకు తాను మిత్రుడగును. దేహేంద్రియ మనస్సంఘాతము తనకు

ఈశ్వరుడు అనుగ్రహించిన మూడుశక్తులను వీనికి ఇచ్చి సహకరించును. ఆలోచించి, పరిశీలించి, తెలుసుకొని, గుర్తుంచుకొనే శక్తి (జ్ఞానశక్తి); కోరి, సంకల్పించే శక్తి (ఇచ్ఛాశక్తి); చేసే, చేయించే శక్తి (క్రియాశక్తి) అనునవి ఈ శక్తులు. కార్యకరణ సంఘాతమును తన వశమునందు ఉంచుకున్న వశికి ఈ మూడు శక్తులు కూడ వశము నందుండును.

దేహేంద్రియ మనస్సులపై ఆధిపత్యము గల వ్యక్తికి వాటి శక్తులన్నియూ సంక్రమించును. అపుడు అభిలషణీయము లగు వస్తువులను పొందుటలో వ్యక్తికి ఈ కార్యకరణ సంఘాతము సహకరించి ప్రయోజనకారి యగును. అది మానవుని ఎక్కడికైననూ, బ్రహ్మలోకమునకైననూ, మరియు బ్రహ్మము (మోక్షము) వరకైననూ తీసుకుని వెళ్లగలదు. అది బ్రహ్మప్రాప్తిని మించి పైకి తీసుకువెళ్లలేదు. ఏలయన, మానవుడు బ్రహ్మ కంటె గొప్పవాడు కాజాలడు. వాస్తవంలో, మానవుడు సర్వదా పరబ్రహ్మ రూపుడుగనే ఉన్నాడు. ఈ సత్యమును గుర్తించుటకు కావలసిన శక్తులను దేహేంద్రియ మనస్సంఘాతము వశియైన వ్యక్తికి సమకూర్చును.

ధర్మబద్ధముగా జీవించు వానికి పుణ్యము లభించును. కావున, కార్యకరణ సంఘాతము మరల బంధువు అగుచున్నది. అంతేగాక, అది మానవుడు మోక్షమును పొందుటలో కూడ ఉపకారి కాగలదు. ఈ విధముగా, ఒకే కార్యకరణ సంఘాతము ఆది నుండి అంతము వరకు మానవునకు హితకారి కాగలదు. కాని, మానవుడు దానిని జయించి ఉండాలి.

దీనికి భిన్నంగా, మానవుడు దేహేంద్రియ మనస్సంఘాతమును తన వశములో ఉంచుకొనుటకు బదులుగా, తానే ఆ సంఘాతమునకు బందీ అయినచో ఏమగును? అపుడు దేహేంద్రియ మనస్సంఘాతము వ్యక్తికి బంధువు అగుటకు బదులుగా వ్యక్తియే దేహమునకు, మనస్సునకు, ఇంద్రియములకు బంధువు అగును. ఈ తీరున, అదే కార్యకరణ సంఘాతము (ఆత్మ) వ్యక్తికి శత్రువుగా మారి, వ్యక్తి యొక్క ఉన్నతికి ఆటంకములు కల్గించును.

'అనాత్మ' యనగా ఆత్మ (దేహేంద్రియ మనస్సంఘాతము) తన వశములో లేనివాడని యర్థము. ఇట్టి వానికి కార్యకరణ సంఘాతము శత్రువుగా నిలిచి, అపకారము చేయును. కావున, మానవునకు తన కంటె వేరుగా శత్రువు బాహ్యంగా లేడని శ్రీకృష్ణుడు స్పష్టము చేసెను.

మానవుడు సాధారణంగా ఎదుటి వ్యక్తిని చూపుడు వ్రేలితో నిర్దేశించి, 'వీడు నా శత్రువు' అని ప్రకటించును. ప్రతి వ్యక్తి ఈ పనిని కొద్దో, గొప్పో చేసి ఉంటాడు. మన చుట్టు ప్రక్కల సిద్ధంగా

ఎవ్వరూ లేకపోతే, మనము శనిని, లేక మరో గ్రహమును నిందిస్తాము! 'నన్ను ఇతరులు పీడిస్తున్నారు' అనే ధారణ ప్రతివ్యక్తిలో ఉంటుంది. మానవులు ఎల్లవేళలా ఊహాజనితమగు భయముతో సతమతమవుతూ, ఎవరో ఒక వ్యక్తిని తమ శత్రువుగా నిర్దేశిస్తూ ఉంటారు. ఇట్లు చేయుట వలన, ఆ వ్యక్తికి వీరిని క్షోభపెట్టే అవకాశమును ఇచ్చినట్లు అవుతుంది.

ఇతరులకు నిన్ను క్షోభపెట్టే అవకాశమును నీవు ఇచ్చిన సందర్భాలలో మాత్రమే ఇతరులు నిన్ను క్షోభపెట్టగల్గుతారు. కాని, మానవులందరిలో ఈ శత్రుపీడాభయము కొద్దో, గొప్పో ఉంటుంది. దానితో వారు బాధపడుతూ ఉంటారు. వాస్తవంలో మనము చూపుడువ్రేలితో ఒక వ్యక్తిని శత్రువుగా నిర్దేశించినపుడు, మిగిలిన మూడువ్రేళ్లు మన, యథార్థమగు ఏకైక శత్రువు స్థూలదేహము, మనస్సు, ఇంద్రియములు అనే కార్యకరణ సంఘాతమేనని సూచిస్తాయి. కావున, ఈ సంఘాతమే మన శత్రువుయొక్క స్థానములో ఉన్నది. అది కూడా బాహ్య శత్రువుల వలె మనకు హానిని కలిగించును.

మనము ఎచటకు వెళ్లినా, తోడుగా మనస్సు ఉండును

మనకు గల ఫిర్యాదులను విశ్లేషిస్తే, అవి అన్నియూ మనస్సునకు సంబంధించినవి మాత్రమేనని స్పష్టమగును. మనము ముందుగా ప్రపంచముచే ప్రభావితులమై, ఆ పైన ప్రపంచము చెడ్డది అని ప్రకటించి, దానిని త్యజించవలెనని భావిస్తాము. 'చెడ్డది' అను ముద్రను ప్రపంచముపై వేసి, దానిని వీడి, 'మంచిది' అని మనము ఊహించుకున్న ప్రపంచమునకు వెళ్లే ప్రయత్నమును చేస్తాము. ఇది ఒక స్వైరకల్పన (fantasy). కాని, మనము ఆ 'మంచి' ప్రపంచములోనికి వెళ్లగానే, అది కూడా మనము విడిచిపెట్టిన ప్రపంచమంతటి 'చెడ్డది' యని తెలును! ఎందువలన? మన మనస్సు మనతోనే ఉంది. దానిని విడిచిపెట్టలేదు గదా! అదియే మన శత్రువు.

ప్రపంచము చెడ్డది అని మాత్రీకరించిన మనస్సును విడువకుండగనే, మనము 'మంచి' అనిపించిన ప్రపంచములోనికి అడుగుపెడతాము. మనము వెళ్లే స్థానము లన్నింటికీ మనస్సు కూడా మనతోబాటు వస్తుంది. స్వర్గానికి వెళ్లినా, మనస్సు కూడా మనతో బాటు వస్తూ ఉంటుంది గనుక, అక్కడ కూడా సమస్యలు తప్పవు. అదే మనస్సు, సర్వకాలములలో ఫిర్యాదులు చేసే మనస్సు, మనతోనే ఉంటుంది. కావున, స్థానమేదైనా, పరిస్థితులేవైనా, ఫిర్యాదు చేయుటకు తగినంత కారణము ఈ మనస్సునకు నిశ్చయముగా దొరకును. వ్యక్తి తనకు తానే శత్రువు అని శ్రీకృష్ణుడు చెప్పుటలోని తాత్పర్యమిదియే.

మనస్సు పరిస్థితులను తనలోనున్న ధారణలకు అనురూపముగా చిత్రిస్తూ ఉంటుంది. మనము అట్టి మనస్సును మనతో బాటే ఉంచుకుంటే, గొప్ప బంధువు, హితకారి అని వర్ణింపబడే గురువు కూడా చేయగలిగే సాహాయ్యము శూన్యమే యగును. "నా గురువు నా గురించి పట్టించుకోడు. నేను మంచి విద్యార్థినని ఆయన భావించకపోవచ్చును" ఇత్యాదిగా సర్వదా ఆలోచించే వ్యక్తికి ఏ గురువైననూ చేయగలిగేది ఏముంటుంది? ఆ మనస్సు మూలకంగానే వ్యక్తి ఇట్టి నిష్కర్షలను చేసుకుంటాడు. కాన, సారమేమనగా నీకు ఉన్న ఒకే ఒక బంధువు నీవే.

తరువాతి శ్లోకములో శ్రీకృష్ణుడు తనకు తాను మిత్రుడై ఉండే వ్యక్తిని గురించి వర్ణించుచున్నాడు:

అధ్యాయము 6, శ్లోకము 7:

जितात्मनः प्रशान्तस्य परमात्मा समाहितः ।
शीतोष्णसुख दुःखेषु तथा मानापमानयोः ॥ ७ ॥

జితాత్మనః ప్రశాంతస్య పరమాత్మా సమాహితః
శీతోష్ణ సుఖదుఃఖేషు తథా మానాపమానయోః (7).

జితాత్మనః = తనపై తాను నియంత్రణ కలిగినట్టియు; **ప్రశాంతస్య** = ప్రశాంతమైన మనస్సు గల వానికి; **శీత-ఉష్ణ-సుఖ-దుఃఖేషు** = చలి, వేడి, సుఖము, దుఃఖము అను వాటి విషయములో; **తథా** = మరియు; **మాన-అపమానయోః** = సన్మానము, అవమానము అనువాటి విషయములో; **ఆత్మా** = మనస్సు; **పరం** = మిక్కిలి; **సమాహితః** = ప్రసన్నముగా నుండును.

> తనపై తనకు నియంత్రణ కలిగి, ప్రశాంతమైన మనస్సు గలవానికి చలి, వేడి, సుఖము, దుఃఖము, సన్మానము, అవమానము అనువాటి విషయములో మనస్సు మిక్కిలి ప్రసన్నముగా నుండును (7).

ఈ శ్లోకమును రెండు రీతులలో వ్యాఖ్యానించవచ్చును. 'పరమ్' అను పదమును 'ఆత్మా' తో గాని, లేక 'సమాహితః' అను పదములో గాని కలిపి అన్వయించవచ్చును. ముందుగా మనము 'పరం సమాహితః' అనే అన్వయమును, తరువాత 'పరం ఆత్మా' అను అన్వయమును పరిశీలిద్దాము. శ్రీ శంకరులు భాష్యములో ఈ రెండవ అన్వయమును అనుసరించినారు.

దేహమును, ఇంద్రియములను, మనస్సును నియంత్రించగల్గు వ్యక్తి జితాత్ముడనబడునని మనము చూచియున్నాము. మనస్సుపై నియంత్రణ యనగా దాని వివిధ భావదశల (moods)చే ఉత్తేజితుడు కాకుండుట అని యర్థము.

వ్యక్తులు సాధారణంగా మనోదశల (moods)కు వశులై ఉంటారు. ఉదయము ఒకరకం భావదశ ఉంటుంది. సాయంకాలము మరియొకటి ఉంటుంది. మధ్యకాలంలో భావదశలు మరెన్నో! మనస్సు యొక్క భావదశలను సరిగా అర్థం చేసుకున్న వ్యక్తి మనస్సుచే ఉత్తేజితుడు కాడు.

దీని తాత్పర్యము, మనకు భావదశలు ఉండరాదని కాదు. ఇట్టి సలహాను వింటే చాలు, భావదశ చెడిపోవటానికి! కావున, మీకు భావదశలు ఉండరాదని నేను చెప్పుటలేదని మీరు దయచేసి తెలియుడు. మీకు నచ్చిన భావదశలను కలిగియుండుడు. కాని వాటిని అర్థం చేసుకుని, వాటిచే ఉత్తేజితులు కాకుండుడు. అప్పుడు మీరు భావదశలను జయించిన వారు అవుతారు. అవి మీపై ప్రభుత్వమును చేయవు. భావదశలను అధిగమించ గల్గిన వ్యక్తి వాటికి బంధీ కాడు. 'జితాత్మ' అనగా అర్థమిదియే. భావదశలను జయించినవాడు జితాత్ముడు.

ప్రశాంతి యొక్క స్వరూపము

ఇట్టి వ్యక్తి యొక్క మనస్సు సహజముగనే ప్రశాంతముగ నుండును. ఎందువలన? అతడు భావదశలచే ఉత్తేజితుడు కాని జితాత్ముడు గనుక. కావున, ఈ విధముగా జితాత్ముడు ప్రశాంతుడునగు వ్యక్తిని ఏ పరిస్థితి యైననూ క్షోభపెట్ట లేదు. అతని మనస్సు సదా అతని వశములో నుండును. అనగా, అతని మనస్సు సర్వదా ప్రసన్నముగా (పరం సమాహితః) ఉండును. పరిస్థితి ఏదైనా, అది తన ప్రసన్నతను కోల్పోదు.

సర్వము సక్రమముగా నున్నప్పుడు, కోరిన ఆహారము ఎదురుగా ఉపస్థితమైనప్పుడు, సంగీతము బాగుగా నున్నప్పుడు, నీవు మాటలాడగోరే వ్యక్తులు నీ ముందు సిద్ధముగా నిలబడినప్పుడు, మనస్సు ప్రసన్నముగా నుండుటలో కష్టము లేదు. కాని, మనమీ శ్లోకములో అన్ని సమయములలో, అన్ని పరిస్థితులలో ప్రసన్నముగా నుండే (పరం సమాహితః) మనస్సు గల వ్యక్తిని గురించి మాటలాడుచున్నాము. శీత–ఉష్ణ–సుఖ–దుఃఖేషు అను సమాసపదము అన్ని పరిస్థితులను, అన్ని ద్వంద్వములను నిర్దేశించును. 'శీత' అనగా చల్లనిది. ఇది ఆహ్లాదకరమైన చల్లదనము కాదు. భరించలేని చల్లదనము. అటులనే, 'ఉష్ణ' అనగా పీడను కలిగించే వేడి. అంటే, ఇచ్చట చెప్పిన శీతోష్ణములు సామాన్యమైనవి ఏ మాత్రమూ కావు.

మరియు, కొన్ని పరిస్థితులు మానవులకు కొంత సానుకూలతను, సుఖమును ఇస్తాయి. కాగా, మరికొన్ని పరిస్థితులు మానవులకు ప్రాతికూల్యమును, దుఃఖమును కలిగిస్తాయి. ఈ విధముగా నిరంతరము మారే పరిస్థితులలో, మనస్సుపై నియంత్రణ గల వ్యక్తి సర్వదా ప్రసన్నుడుగ నుండును. ఇట్టి వ్యక్తికి దుఃఖము దరిచేరే ప్రసక్తి లేదు. ఏలయన, దుఃఖము దరి చేరాలంటే, ప్రసన్నత ముందుగా తొలగిపోవాలి. ఇచట తాత్పర్యమేమనగా, సాధారణముగా మానవులకు సుఖదుఃఖములనిచ్చే పరిస్థితులన్నియూ, సర్వదా ప్రసన్నమైన మనస్సు గల వ్యక్తి యొక్క మనస్సులో ఎట్టి సంక్షోభమునూ కలుగచేయజాలవు.

ఈ శ్లోకములో పొగడ్త (మాన), అవమానము, లేక ఖండించుట (అవమాన) అనే మరో ద్వంద్వము కూడ చెప్పబడినది. ఈద్వంద్వములను రెండింటినీ నిర్వహించుటలో అధిక క్లేశము కలదు. కావుననే, ఇవి ఈ శ్లోకములో ప్రత్యేకముగా ఉదహరింపబడినవి. కొన్ని సమయములలో పొగడ్తను సహించుట కూడ కష్టమగును. ఏలయన, ఇతర వ్యక్తి మనలను పొగడుచుండగా, అతడేదో కోరబోతున్నాడనే భయము కలుగును. పొగడ్త వినుటకు బాగానే ఉంటుంది. కాని అది మరియొకదానికి ఉపోద్ఘాతమైనచో, మనము ఆ రాబోవుదాని కొరకు ప్రతీక్షిస్తూ, పొగడ్తను వినలేకపోతాము.

అవమానమును భరించుట అన్నికాలములలో దుష్కరమే. 'నేను విమర్శను సహిస్తాను' అని ఒకాయన అంటాడు. 'నీవు విమర్శను సహించలేవు' అని మరొకడు అంటాడు. ఆయన వెనువెంటనే తాను నిందింపబడుతున్నానని భావించుటకు ఈ చిన్నమాట చాలును. మనము పరిస్థితులను వ్యక్తిగతంగా అన్వయించుకుంటూ ఉంటాము. దీనికి మరియొక దృష్టాంతమును గమనించుడు. నీవు ఒక పనిని చేస్తూ ఉంటావు. ఒక వ్యక్తి వచ్చి నీవా పనిని చేయవద్దని, మరియొక పనిని చేయమని అంటాడు. వెనువెంటనే, నీవు దానిని వ్యక్తిగతమగు అవమానముగా భావిస్తావు.

విమర్శను సహించుట యేల దుష్కరము?

మనము విమర్శను వ్యక్తిగతముగా తీసుకుంటాము. అది మన హృదయములో సున్నితమగు స్థానమును స్పృశించి దుఃఖమును కలిగించును. ఇందువలననే, మనము విమర్శను సహింపలేము. ఈ సమస్య మనకు బాల్యము నుండి సంక్రమించును. తల్లిదండ్రులు సదా శిశువును విమర్శిస్తూ ఉంటే, ఆ విమర్శ ఆ శిశువునకు సమస్యగా నిర్మాణమగును. దానివలన ఆ శిశువు హృదయములో సున్నితమైన, తేలికగా స్పృశించగలిగే, అపక్వస్థానము నిర్మాణమగును. ఆ తరువాతి కాలములో

దేహమును, ఇంద్రియములను, మనస్సును నియంత్రించగల్గు వ్యక్తి జితాత్ముడనబడునని మనము చూచియున్నాము. మనస్సుపై నియంత్రణ యనగా దాని వివిధ భావదశల (moods)చే ఉత్తేజితుడు కాకుండుట అని యర్థము.

వ్యక్తులు సాధారణంగా మనోదశల (moods) కు వశులై ఉంటారు. ఉదయము ఒకరకం భావదశ ఉంటుంది. సాయంకాలము మరియొకటి ఉంటుంది. మధ్యకాలంలో భావదశలు మరెన్నో! మనస్సు యొక్క భావదశలను సరిగా అర్థం చేసుకున్న వ్యక్తి మనస్సుచే ఉత్తేజితుడు కాడు.

దీని తాత్పర్యము, మనకు భావదశలు ఉండరాదని కాదు. ఇట్టి సలహాను వింటే చాలు, భావదశ చెడిపోవటానికి! కావున, మీకు భావదశలు ఉండరాదని నేను చెప్పుటలేదని మీరు దయచేసి తెలియుడు. మీకు నచ్చిన భావదశలను కలిగియుండుడు. కాని వాటిని అర్థం చేసుకుని, వాటిచే ఉత్తేజితులు కాకుండుడు. అప్పుడు మీరు భావదశలను జయించిన వారు అవుతారు. అవి మీపై ప్రభుత్వమును చేయవు. భావదశలను అధిగమించ గల్గిన వ్యక్తి వాటికి బందీ కాడు. 'జితాత్మ' అనగా అర్థమిదియే. భావదశలను జయించినవాడు జితాత్ముడు.

ప్రశాంతి యొక్క స్వరూపము

ఇట్టి వ్యక్తి యొక్క మనస్సు సహజముగనే ప్రశాంతముగ నుండును. ఎందువలన? అతడు భావదశలచే ఉత్తేజితుడు కాని జితాత్ముడు గనుక. కావున, ఈ విధముగా జితాత్ముడు ప్రశాంతుడునగు వ్యక్తిని ఏ పరిస్థితి యైననూ క్షోభపెట్టలేదు. అతని మనస్సు సదా అతని వశములో నుండును. అనగా, అతని మనస్సు సర్వదా ప్రసన్నముగా (పరం సమాహితః) ఉండును. పరిస్థితి ఏదైనా, అది తన ప్రసన్నతను కోల్పోదు.

సర్వము సక్రమముగా నున్నప్పుడు, కోరిన ఆహారము ఎదురుగా ఉపస్థితమైనప్పుడు, సంగీతము బాగుగా నున్నప్పుడు, నీవు మాటలాడగోరే వ్యక్తులు నీ ముందు సిద్ధముగా నిలబడినప్పుడు, మనస్సు ప్రసన్నముగా నుండుటలో కష్టము లేదు. కాని, మనమీ శ్లోకములో అన్ని సమయములలో, అన్ని పరిస్థితులలో ప్రసన్నముగా నుండే (పరం సమాహితః) మనస్సు గల వ్యక్తిని గురించి మాటలాడుచున్నాము. శీత–ఉష్ణ–సుఖ–దుఃఖేషు అను సమాసపదము అన్ని పరిస్థితులను, అన్ని ద్వంద్వములను నిర్దేశించును. 'శీత' అనగా చల్లనిది. ఇది ఆహ్లాదకరమైన చల్లదనము కాదు. భరించలేని చల్లదనము. అటులనే, 'ఉష్ణ' అనగా పీడను కలిగించే వేడి. అంటే, ఇచ్చట చెప్పిన శీతోష్ణములు సానుకూలమైనవి ఏ మాత్రమూ కావు.

మరియు, కొన్ని పరిస్థితులు మానవులకు కొంత సానుకూలతను, సుఖమును ఇస్తాయి. కాగా, మరికొన్ని పరిస్థితులు మానవులకు ప్రాతికూల్యమును, దుఃఖమును కలిగిస్తాయి. ఈ విధముగా నిరంతరము మారే పరిస్థితులలో, మనస్సుపై నియంత్రణ గల వ్యక్తి సర్వదా ప్రసన్నుడుగ నుండును. ఇట్టి వ్యక్తికి దుఃఖము దరిచేరే ప్రసక్తి లేదు. ఏలయన, దుఃఖము దరి చేరాలంటే, ప్రసన్నత ముందుగా తొలగిపోవాలి. ఇచట తాత్పర్యమేమనగా, సాధారణముగా మానవులకు సుఖదుఃఖములనిచ్చే పరిస్థితులన్నియూ, సర్వదా ప్రసన్నమైన మనస్సు గల వ్యక్తి యొక్క మనస్సులో ఎట్టి సంక్షోభమునూ కలుగచేయజాలవు.

ఈ శ్లోకములో పొగడ్త (మాన), అవమానము, లేక ఖండించుట (అవమాన) అనే మరో ద్వంద్వము కూడ చెప్పబడినది. ఈద్వంద్వములను రెండింటినీ నిర్వహించుటలో అధిక క్లేశము కలదు. కావుననే, ఇవి ఈ శ్లోకములో ప్రత్యేకముగా ఉదహరింపబడినవి. కొన్ని సమయములలో పొగడ్తను సహించుట కూడ కష్టమగును. ఏలయన, ఇతర వ్యక్తి మనలను పొగడుచుండగా, అతడేదో కోరబోతున్నాడనే భయము కలుగును. పొగడ్త వినుటకు బాగానే ఉంటుంది. కాని అది మరియొకదానికి ఉపోద్ఘాతమైనచో, మనము ఆ రాబోవుదాని కొరకు ప్రతీక్షిస్తూ, పొగడ్తను వినలేకపోతాము.

అవమానమును భరించుట అన్నికాలములలో దుష్కరమే. 'నేను విమర్శను సహిస్తాను' అని ఒకాయన అంటాడు. 'నీవు విమర్శను సహించలేవు' అని మరొకడు అంటాడు. అయన వెనువెంటనే తాను నిందింపబడుతున్నానని భావించుటకు ఈ చిన్నమాట చాలును. మనము పరిస్థితులను వ్యక్తిగతంగా అన్వయించుకుంటూ ఉంటాము. దీనికి మరియొక దృష్టాంతమును గమనించుడు. నీవు ఒక పనిని చేస్తూ ఉంటావు. ఒక వ్యక్తి వచ్చి నీవా పనిని చేయవద్దని, మరియొక పనిని చేయుమని అంటాడు. వెనువెంటనే, నీవు దానిని వ్యక్తిగతముగు అవమానముగా భావిస్తావు.

విమర్శను సహించుట యేల దుష్కరము?

మనము విమర్శను వ్యక్తిగతముగా తీసుకుంటాము. అది మన హృదయములో సున్నితమగు స్థానమును స్పృశించి దుఃఖమును కలిగించును. ఇందువలననే, మనము విమర్శను సహింపలేము. ఈ సమస్య మనకు బాల్యము నుండి సంక్రమించును. తల్లిదండ్రులు సదా శిశువును విమర్శిస్తూ ఉంటే, ఆ విమర్శ ఆ శిశువునకు సమస్యగా నిర్మాణమగును. దానివలన ఆ శిశువు హృదయములో సున్నితమైన, తేలికగా స్పృశించగలిగే, అపకృష్టానము నిర్మాణమగును. ఆ తరువాతి కాలములో

చిన్న విమర్శయైననూ దుఃఖమును కలిగించును. ఈ కారణముగనే, విమర్శను సహించుట మిక్కిలి కష్టమైన విషయము.

సరియగు అవగాహన కలిగి ఈ సమస్యలను పరిష్కరించుకున్న వ్యక్తిని గురించి మనమీ శ్లోకములో వర్ణించుచున్నాము. సరియగు అవగాహన లేనిచో, క్రొత్త క్రొత్త తత్త్వశాస్త్రములు ఉదయించిననూ, అవి పీడ, దుఃఖము ఇత్యాది సమస్యలపై అధ్యారోపములు మాత్రమే యగును. 'నన్ను నేను నిందించుకోరాదు' అని తేలికగా నిర్ణయమును చేసేసుకుంటే, దానివలన ప్రయోజనము శూన్యము. మనము మనస్సుపై నియంత్రణను సంపాదించుటకు కృషిచేయాలి. ఏలయన, శీతోష్ణ, సుఖదుఃఖ, మానావమానములనే ఈ ద్వంద్వములు మానవులకు క్షోభను కలుగజేయును.

ఈ శ్లోకములో శ్రీకృష్ణుడు చెప్పునదేమనగా, ఈ ద్వంద్వములు మానవులను క్షోభకు గురిచేయుట నిశ్చితముగాన, నిన్ను అవి క్షోభపెట్టకుండునట్లు జాగరూకుడవు కమ్ము. 'నేను క్షోభకు గురికారాదు' అని యున్నచో, అది క్షోభను పొందిన వ్యక్తిపై అధ్యారోపము మాత్రమే యగును. వాస్తవంలో, అది కూడా ఒక భ్రమ మాత్రమే. 'నీవు కలవరమును చెందరాదు' అని ఉపదేశించే వ్యక్తుల వలన ఒరిగే ఉపకారము ఏమియూ లేదు. ఏలయన, అంతకు ముందు ఉన్న దుఃఖముపై ఈ ఉపదేశము అధ్యారోపితమగును. 'ఇట్లు చేయాలి, ఇట్లు చేయకూడదు' ఇత్యాది విధి నిషేధములతో కూడిన ఆ ఉపదేశము వ్యక్తిపై అదనపు భారముగా పరిణమించును. హృదయములో నిహితమై యున్న దుఃఖమునకు తోడుగా, ఈ క్రొంగ్రొత్తగా అధ్యారోపితమైన తత్త్వోపదేశము వలన సంక్రాంతి రెట్టింపు అగును. ఈ క్రొత్త ఉపదేశము ఉపకారమును చేయకపోగా, లేని సమస్యను సృష్టించినట్లగును.

కావున, ఈ శ్లోకము యొక్క తాత్పర్యమును మనము సరిగా తెలునుకోవాలి. అన్ని పరిస్థితులలో, అన్నివేళలా జితాత్ముని మనస్సు గొప్ప శాంతిని కలిగి (పరం సమాహితః) యుండును. ఇట్టి శాంతి కొరకై మనము కృషిచేయాలి. కొన్ని ధారణలను క్రొత్తగా మెదడులోనికి ఎక్కించుకొనుట వలన ఈ శాంతి లభించదు.

ఈ శ్లోకమును శ్రీ శంకరులు మరోవిధముగా అన్వయించినారు. కార్యకరణ సంఘాతముపై నియంత్రణను సంపాదించి (జితాత్మనః), ప్రసన్నమైన మనస్సు గల వ్యక్తి (ప్రశాంతస్య) యొక్క ఆత్మ పరబ్రహ్మము (పరమాత్మా) అగును. అనగా, అట్టివాడు జ్ఞానమును పొంది సచ్చిదానంద, అపరిచ్ఛిన్న పరమాత్మ తన ఆత్మయేనని గుర్తించును. ఇట్టి జ్ఞాని పరిస్థితులు మారుచున్ననూ, అన్నివేళలా సమాహిత చిత్తుడై (సమాహితః) ఉండును.

అధ్యాయము 6, శ్లోకము 8:

ज्ञानविज्ञानतृप्तात्मा कूटस्थो विजितेन्द्रियः ।
युक्त इत्युच्यते योगी समलोष्टाश्मकाञ्चनः ॥ ८ ॥

జ్ఞాన విజ్ఞానతృప్తాత్మా కూటస్థో విజితేంద్రియః
యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మకాంచనః (8)

జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మా = ఆత్మజ్ఞాన, ఆత్మ సాక్షాత్కారములచే సంతుష్టి చెందిన అంతఃకరణము గలవాడు; **కూటస్థః** = పరివర్తనను చెందనివాడు; **విజితేంద్రియః** = జ్ఞానేంద్రియ, కర్మేంద్రియములను నియంత్రించుకున్న వాడు; **సమలోష్టాశ్మకాంచనః** = మట్టి బెడ్డ, రాయి, బంగారము సమమైన వాడు; **యుక్తః** = ఉద్వేగము లేనివాడు అగు వ్యక్తి; **యోగీ** = యోగి యని; **ఉచ్యతే** = చెప్పబడును.

> ఆత్మజ్ఞాన, ఆత్మ సాక్షాత్కారములచే సంతుష్టిని చెందిన అంతరంగము గలవాడు, పరివర్తనను చెందనివాడు; జ్ఞానేంద్రియ, కర్మేంద్రియములను నియంత్రించుకున్నవాడు; మట్టిబెడ్డ, రాయి, బంగారము సమమైన వాడు, ఉద్వేగము లేనివాడు అగు వ్యక్తి యోగి యని చెప్పబడును (8).

శ్రీకృష్ణుడు గీతలో సర్వత్రా 'యోగీ' అను శబ్దమును మూడు రీతులలో ప్రయోగించెను. ఆయన కర్మయోగిని వర్ణించెను. మరియు ధ్యానమయ జీవనమునకు అంకితమైన సన్న్యాసిని కూడ యోగి యని నిర్దేశించెను. ఆయన జ్ఞానిని కూడ యోగి అనియే నిర్దేశించెను. ఈ తీరున యోగి యను శబ్దము మూడు ప్రకరణములలో వాడబడినది.

ఈ శ్లోకములో యోగి యనగా జ్ఞాని. ఈ పదమును ఈ తీరున ప్రయోగించుట ద్వారా శ్రీకృష్ణుడు మోక్షరూపమగు జ్ఞానమును పొందుటలో గల ప్రవాహరూపమగు క్రమమును సూచించినాడు. ధ్యానమును గురించి వివరించుటకు ముందుగా శ్రీకృష్ణుడు, మానవుడు తనను తాను ఉద్ధరించుకోవలె ననియు, తన నాశమును తానే కొని తెచ్చుకోరాదనియు చెప్పినాడు*. మరియు, ఆత్మజ్ఞానము గలవాడు+ ద్వంద్వములు సంప్రాప్తమైననూ స్థిరుడుగ నుండుననియు, ఈ

---

* ఉద్ధరే దాత్మనాత్మానం నాత్మాన మవసాదయేత్, 6.5

+ జితాత్మనః ప్రశాంతస్య పరమాత్మా సమాహితః,
శీతోష్ణ సుఖ దుఃఖేషు తథా మానాపమానయోః, 6.7

జ్ఞానమును పొందగోరు మానవుడు కర్మయోగ జీవనమునకు బద్ధుడు కావలెననియూ బోధించెను.*
దీనినంతనూ బోధించిన పిదప, ఇపుడు శ్రీకృష్ణుడు యోగము అనే గుర్రమును అధిష్ఠించిన (యోగారూఢుడు) జ్ఞానిని గురించి వర్ణించుచున్నాడు.

జ్ఞాన నిర్వచనము

ఈ శ్లోకము జ్ఞానిని 'జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మా' అని వర్ణించినది. జ్ఞాన విజ్ఞాన శబ్దములు సమానార్థకములే. కాని, అవి కలిపి ప్రయోగింపబడినప్పుడు విజ్ఞానమనగా విశేషజ్ఞాన మనియు, అది జ్ఞానము కంటె ఉత్కృష్టమైనదనియు గ్రహించవలెను. సమానార్థకములగు ఈ రెండు పదములను కలిపి ప్రయోగించినపుడు వాటి మధ్య ఒక సంబంధము ఉండును. జ్ఞానము విజ్ఞానము కంటె ఒక స్థాయి తక్కువది యని గ్రహించవలెను. శాస్త్రములోని పదములచే బోధింపబడే విశేష జ్ఞానము (పరిజ్ఞానము) విజ్ఞానమనబడునని శ్రీ శంకరులు నిర్వచించిరి.

వ్యక్తికి, అతని జ్ఞానమునకు మధ్యలో కొంత దూరము ఉండును. ఉదాహరణకు, 'ఆత్మయే బ్రహ్మము' అని నేను నీతో అంటాను. ఆ వాక్యము నీకు అవగతమవుతుంది. ఇది ఒక రకమైన జ్ఞానము. కాని, నీవు ఇంకనూ ఆ సత్యమును దర్శించి, గుర్తించవలసి యున్నది. ఈ తీరున, వాక్యముచే బోధింపబడిన సత్యమును సాక్షాత్కరించుకున్నప్పుడు, అది ఆ జ్ఞానము యొక్క ఒక విశిష్ట స్థాయి యగును. అట్లు గాక, సాక్షాత్కారము కలుగక ముందు శ్రద్ధతో వాక్యము యొక్క అర్థమును స్వీకరించుట జ్ఞానము యొక్క మరియొక స్థాయి అగును. శాస్త్రజ్ఞానము జీవుడు బ్రహ్మభిన్నుడని స్పష్టముగా ప్రతిపాదించుచున్నది. కావున, శాస్త్ర తాత్పర్యములో సందియము లేదు. అనగా, శాస్త్రము జీవేశ్వరుల భేదమును బోధించునా? లేక అభేదమునా? అను దానిలో భ్రాంతికి చోటు లేదు.

శాస్త్రబోధితమైన జ్ఞానమును విజ్ఞానముగా మార్చుటలో మనన, నిదిధ్యాసనములు సహకరించును. వ్యక్తి అధికారియై, అతని మనస్సు జ్ఞానమును గ్రహించుటకు సంసిద్ధముగా నున్నచో, ఈ మార్పు అనావశ్యకము. అధికారికి వివేక వైరాగ్యములు ఉండుటచే, జ్ఞానమును పొందిన వెంటనే అతడు సత్యమును గుర్తించగల్గును. అతని మానసిక పరిణతి కారణంగా, సత్య సాక్షాత్కారమునకు అడ్డంకులు ఉండవు. ఇట్టి పరిణతి కలిగిన మనస్సు గడచిన దానిని గురించి చింతిల్లదు. భవిష్యత్తును

* ఆరురుక్షోర్మునేర్యోగం కర్మ కారణ ముచ్యతే, 6.3

గురించి దిగులు చెందదు. ఇట్టి వివేక సంపన్నము, స్పష్టతమమునగు మనస్సును కలిగి యుండే భాగ్యము సన్న్యాసికి గలదు.

పరిణతి చెందిన మనస్సు అత్యంత ప్రసన్నముగా, స్పష్టతమముగా నుండును

మనోవిజ్ఞానవేత్త ఒకాయన ప్రపంచమంతటా విస్తారముగా పర్యటించి, అనేక వ్యక్తులను కలిసి, ఒక పుస్తకమును రచించెను. సన్న్యాసి యొక్క మనస్సు స్పష్టతమముగా నుండునని ఆయన ఆ పుస్తకములో ఉటంకించెను. సన్న్యాసి రేపటి గురించిన చింత నుండి విముక్తుడై ఉండుటయే దీనికి కారణమని నా అభిప్రాయము. సన్న్యాసికి ధనము, నావి అనుకునే వస్తువులు ఉండవు. ఆయన అవి కావాలని కోరడు. కావున, వాటిని నిర్వహించుటకు గాని, రక్షించుటకు గాని ఆయన చింతిల్ల బనిలేదు. వ్యక్తి నిర్ధనుడై, ధనము కోరువాడైతే దరిద్రుడనబడును. ధనము గల వ్యక్తి సంపన్నుడనబడును. కాని, అతడు తన ధనమును రక్షించుకొనుటకు ఆరాటపడును. ఈ తీరున, దరిద్రునకు, సంపన్నునకు కూడ సమస్యలు గలవు. కాని, తన వద్ద ఉండే ధనమును గురించి గాని, ఇతర వస్తువుల గురించి గాని పట్టించుకోని సన్న్యాసికి మనస్సు స్పష్టతమముగా నుండును. సన్న్యాసి ఏకాకియై ఉండును. ఇట్టి సన్న్యాసి శాస్త్రమును విన్నప్పుడు, జ్ఞానము నుండి విజ్ఞానమునకు మార్చుకునే అవసరముండదు. అతనికి సందేహము లేమైన యున్నచో, అవి శ్రవణ మనన ప్రక్రియలో తొలగిపోవును.

జ్ఞానమును విజ్ఞానముగా మార్చుట ఆవశ్యకము

పూర్ణ అధికారి కాని వ్యక్తికి మోక్షమునందాసక్తి (ముముక్షుత్వము), తెలియాలనే కోరిక (జిజ్ఞాస) ఉండవచ్చును. కాని, అతడు మనన నిదిధ్యాసనముల సహకారముతో, ఇతర సాధన సంపత్తిని కూడ పొంది, జ్ఞానమును విజ్ఞానముగా మార్చుకోవలసియుండును. ఈ ప్రక్రియలో అతడు ఆత్మను గురించి తెలుసుకున్న జ్ఞానము ఆత్మసాక్షాత్కార రూపమగు విజ్ఞానముగా మారును.

శాస్త్రము మనకు పరోక్షజ్ఞానము నిచ్చుట లేదు. 'నీవే బ్రహ్మము' అనే సత్యమును శాస్త్రము బోధించుచున్నది. శాస్త్ర దృష్టి సత్యము గనుక, ఈ జ్ఞానము కూడ సత్యజ్ఞానము. ఇచట పరోక్ష జ్ఞానమునకు చోటు లేదు. ఆత్మయే బ్రహ్మ అనే అంతరంగధారణను పరోక్షజ్ఞానము అనవచ్చును. కాని, ఆ జ్ఞానము తెలిపే సత్యము యొక్క సాక్షాత్కారము విజ్ఞానమనబడును.

ఆత్మయే బ్రహ్మము; ఆత్మయే సర్వము అను ఉపదేశము నందలి శ్రద్ధ మనన, నిదిధ్యాసనములలో సహకరించును. వాటి వలన జ్ఞానము విజ్ఞానముగా మారును. ఇట్లు మారిన జ్ఞానమునకు 'స్వానుభవకరణమ్' అని పేరు. అనగా, అపరోక్ష జ్ఞానము, లేక సాక్షాత్కారము అని యర్థము. తత్కాలమందు కలిగే సాక్షాత్కారమునకు అనుభవమని పేరు. ఆత్మను గురించి కలిగిన సాక్షాత్కారమునకు స్వానుభవమని పేరు. ఇట్టి సాక్షాత్కారమును పొందిన జ్ఞాని విషయంలో మహావాక్యము ఒక అంతరంగధారణ గాని, సూక్ష్మదృష్టి గాని కాదు; భవిష్యత్తులో తెలియుటకు అవకాశము గల ఉపదేశముగాని, శ్రద్ధేయమైన ఉపదేశముగాని కాదు. ఆత్మయే బ్రహ్మ అనే సత్యమును అయన తత్కాలము నందు గుర్తించును. జ్ఞానము యొక్క ఈ అవ్యవహిత (immediate) పరిణతికి విజ్ఞానమని పేరు.

వాకిక చాలును (అలం) అనే బుద్ధి గల వ్యక్తి

జ్ఞాన విజ్ఞానముల వలన మానవుడు తృప్తుడగును. 'తృప్త' అను సుందరమగు సంస్కృతపదమును శ్రీ శంకరులు 'సంజాత-అలం-ప్రత్యయః' అని నిర్వచించిరి. అనగా పూర్ణత, సంతోషము తన యందే గలవాడు అని యర్థము. 'అలం' అనగా 'చాలును' అని యర్థము. 'సంజాత-అలంప్రత్యయః' అనగా 'చాలును, నాలో లోటు ఏమియు లేదు' అనే గుర్తింపు గలవాడు అని యర్థము. 'నేను సచ్చిదానంద ఆత్మరూపుడను' అను సత్యదర్శనము గలవానికి మాత్రమే ఇది సంభవమగును.

ఇట్టి వ్యక్తి సదా తుష్టుడుగ నుండును. ఏది ఎట్లా జరిగినా, ప్రసన్నుడై ఉండును. అతడు సంజాత-అలం-ప్రత్యయుడు అయిన విధమెట్టిది? జ్ఞాన విజ్ఞానములచేత. ఈ విజ్ఞానములో ఆత్మయందు అపూర్ణత్వమేమియు ఉండదు. అంతవరకు ఆత్మ గురించి గల భ్రాంత ధారణలన్నియూ తొలగిపోయినవి. ఆత్మ స్వరూపభూతమగు మహిమ యందు పూర్ణమై ప్రకాశించును. ఆత్మ కంటె భిన్నముగా ఏదియూ లేదు. ఇట్టి పూర్ణ-ఆత్మ-సాక్షాత్కారము గల వ్యక్తి సంజాత -అలం-ప్రత్యయుడగును. అట్టి జ్ఞానిని ఈ శ్లోకము తృప్తుడు అని వర్ణించినది.

'జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మా' అను సమాసములో ఆత్మయనగా అంతఃకరణము. సూక్ష్మదృష్టి, శ్రద్ధ కలిసి జ్ఞానము అగును. అది ఆత్మ సాక్షాత్కారరూపమైన అవ్యవహిత జ్ఞానము (immediate knowledge) గా పరిణమించి విజ్ఞానము అగును. ఈ జ్ఞాన విజ్ఞానములు గల వ్యక్తికి మనస్సులో 'చాలును' అను భావము కలుగును. అపుడాతడు తృప్తుడనబడును. జ్ఞానికి ఈయబడిన ఈ 'జ్ఞాన

విజ్ఞాన తృప్తాత్మా' అను నిర్వచనము జ్ఞానస్వరూపమును కూడ బోధించును. సంస్కృతపదములలో, సమాసములలో గల మహిమ ఇదియే. అవి వ్యక్తుల పేర్లు మాత్రమే కాదు. నిర్వచనములు కూడా. పేరు, నిర్వచనము అనే రెండు ప్రయోజనములు ఏకకాలములో సిద్ధించును.

ఆత్మరూపుడగు జ్ఞానిని ఏదియూ చలింపచేయలేదు

ఈ శ్లోకము జ్ఞానిని 'కూటస్థుడు' అని కూడా వర్ణించినది. కమ్మరివాడు ఎర్రగా కాల్చిన ఇనుపముక్కలను ఒక ఇనుపదిమ్మపై నుంచి సుత్తితో కొడుతూ వివిధ ఆకారముల లోనికి మలచును. ఆ ఇనుప దిమ్మకు ఎన్ని దెబ్బలు తగిలినా, దానిలో మార్పు ఏమీ ఉండదు. మార్పు పొందవలసిన ఇనుప ముక్కలలో మార్పు రావాలంటే, ఇనుపదిమ్మలో మార్పు రాకూడదు. అదేవిధముగా, తన చుట్టూ ఎన్ని పరిస్థితులు మారుతున్నా, తాను మారకుండా స్థిరంగా ఉండే వ్యక్తి 'కూటస్థుడు' అనబడును. ఆత్మ కూడా కూటస్థమే. ఆత్మ యందు ఏవిధమైన మార్పులు ఉండవు.

ఈ శ్లోక భాష్యములో శ్రీ శంకరులు 'కూటస్థుడు' అనగా 'అప్రకంప్యుడు' అని నిర్వచించిరి. అనగా, జ్ఞాన విజ్ఞాన తృప్తాత్ముడగు వ్యక్తి, బాహ్య పరిస్థితులు, అంతర పరిస్థితులు ఏవైనా, వాటిచే చలింపచేయబడడు అని యర్థము. ఇట్టివ్యక్తి ఆవశ్యకములగు అనుశాసనముల నన్నింటినీ పాటించి, 'ఆత్మ పూర్ణము' అనే జ్ఞానమును పొందినాడు. ఈ జ్ఞానము లేకపోవుట చేతనే సమస్యలన్నియూ ఉత్పన్నమగును. ఈ జ్ఞానమును పొందిన వ్యక్తికి ఆందోళనను కలిగించేది బాహ్యమందు గాని, అంతరంగము నందు గాని ఏదియూ లేదు. ఇట్టి జ్ఞాని దృఢముగా, కదలించ శక్యము కానివాడు (అప్రకంప్య)గా ఉండును.

దయా స్వరూపము

వ్యక్తి యొక్క సౌందర్యము అతని/ఆమె ముక్కును బట్టి ఉండదు; జుట్టు రంగును బట్టి ఉండదు. వ్యక్తి యొక్క బలములో, మార్దవములో, మరియు దయాగుణములో సౌందర్యము నిహితమై యుండును. వ్యక్తి తన సమయమును, బుద్ధిని, జ్ఞానమును, సంపదను ఇతరులతో కలిసి పంచుకొనుటకు సంసిద్ధముగా నుండే లక్షణమునకు దయ అని పేరు. ఈ పంచుకొనే సంసిద్ధతయే శక్తి. యథార్థముగా సంపన్నుడైన వ్యక్తి మాత్రమే ఈ తీరున పంచుకొనుటకు సంసిద్ధుడగును. కావున, వ్యక్తి యొక్క బలము, సౌందర్యము కూడ అతని దయాగుణములో నిహితమై యున్నవి.

దయ యనగా కరిగిపోవుట కాదు. కొన్ని సందర్భాలలో ఇతరుల దుఃఖమును చూసినపుడు మానవుల హృదయము జాలితో నిండిపోవుటచే, వారు కరిగిపోయి, రోదింతురు. కాని ఇది దయ కాదు. దీని వలన ప్రయోజనము లేదు. ఇతరులు మన నుండి సహాయ్యమును కోరినప్పుడు, మనము దయతో కరిగిపోయిన నేమి లాభము? మనకు ఉపకారము అవసరమైనప్పుడు, ఇతరులు అటులనే కరిగిపోయినచో నేమగును! మనకు బలము అనబడే దయగల గట్టి వ్యక్తులు కావాలి. ఇట్టి దయవలన అంతరంగములో ఒక విశిష్టమైన తృప్తి ఏర్పడును. కావున, ఇట్టి వ్యక్తికి తృప్తుడు అని పేరు.

గుణములు స్వాభావికములు, స్వతః ఉత్పన్నములు (spontaneous) కావాలి

పాటించవలసిన కొన్ని ఆదర్శములను నిర్ణయించుకొనే ప్రయత్నమును మనము చేయుట లేదు. ఒక విశిష్టమగు అవస్థ గలదు. దాని యందు ఇంద్రియములు, మనస్సు, దాని లలితకల్పనలు (fancies) సదా నియంత్రితములై యుండును. మనము అట్టి అవస్థను తెలుసుకునే ప్రయత్నమును చేయుచున్నాము. ఈ అవస్థలో కన్నులు ''ఓయీ! లే, సినిమాకి పోదాము'' అని మనలను శాసించవు. చెవులు ''ఓయీ! ఈ వేదాంతమును విని నాకు విసుగు పుట్టుచున్నది; లే, సంగీతమును వినుటకు బయల్దేరు'' అని శాసించవు. నియంత్రణ లేని మనస్సు తన కల్పనా విలాసములతో, ఇంద్రియములు విషయ వస్తువుల వెనుక పరుగెత్తునట్లు చేయును. మనము వర్ణిస్తున్న వ్యక్తి ఇట్టి కల్పనా విలాసములపై విజయమును పొంది విజితేంద్రియుడగును. అతడు తన సంకల్పశక్తితో అభీష్టమగు కర్మను ఆచరించును; అనభిలషితమగు కర్మ పరిహరింపబడును.

విజితేంద్రియుడగు వ్యక్తిలో ఇట్టి నియంత్రణ ఉన్న కారణంగా, అతడు యుక్తుడని కూడా వర్ణింపబడినాడు. అతడు ముముక్షువుగా ఉన్నప్పుడే సాధనారూపములుగా నున్న లక్షణములు ఇపుడాతనిలో అతి సహజముగా తమంత తాముగా వ్యక్తమగును. ఇట్టి జ్ఞానిని శ్రీకృష్ణుడీ శ్లోకములో యోగి అని నిర్దేశించినాడు.

ఒకే ఒక భద్రత-ఆత్మయందలి భద్రత

మరియు, జ్ఞాని దృష్టిలో మట్టిబెడ్డ (లోష్టము), రాయి (అశ్మ), బంగారము (కాంచనము) సమానమే (సమలోష్టాశ్మ కాంచనః). అనగా, అతడు మూడింటినీ మట్టిబెడ్డగనో, లేక రాయిగనో, లేక బంగారముగనో చూచునని అర్థము కాదు. ప్రత్యేకముగా ఈ మూడు వస్తువులకు మాత్రమే గాక, వస్తువులన్నింటి విషయంలో జ్ఞాని యొక్క ప్రతిస్పందన యందు మాత్రమే సమత్వము

ఉండును. సమలోష్టాశ్మ కాంచనుడగు జ్ఞాని దృష్టిలో ఈ మూడింటిలో ఏ ఒక్కదానియందైననూ భద్రత లేదు. అతని దృష్టిలో మట్టిబెడ్డ యందు గాని, రాతిముక్క యందు గాని ఎంత భద్రత గలదో, అంతకు మించిన భద్రత బంగారము నందు గాని, వజ్రము, రత్నము ఇత్యాదుల యందు గాని లేదు. ఈ మూడింటిలో ప్రతి ఒక్కటి భద్రత దృష్ట్యా మిగిలిన రెండింటితో సమానమైనదియే. బంగారము, దాని విలువ జ్ఞానికి తెలియనివి కావు.బంగారము నందు భద్రత లేదనియు, భద్రత అనేది ఆత్మ యందు మాత్రమే గలదనియు జ్ఞాని యెరుంగును.

'సమలోష్టాశ్మ కాంచనః' అనే జ్ఞాని యొక్క వర్ణన భద్రత అనే దృష్టి కోణమునకు సంబంధించినది మాత్రమే. సర్వము యొక్క సత్యత ఆత్మ ఒక్కటియే. ఆత్మ లేనిదే ఏదీ లేదు అనే జ్ఞానము ఒక్కటియే వాస్తవమగు భద్రత. మరే రకము భద్రత లేదు. ఈ సాక్షాత్కారము గల వ్యక్తికి భద్రత గలదు. అతనికి తన ఆత్మ యందు భద్రత కలదు గనుక, ఇతర భద్రతలేమియూ అతనికి ఆవశ్యకములు కావు. ఇట్టి స్థితిలో, బంగారము మొదలగు వాటి వలన కలిగే భద్రత విషయములో అతని దృష్టి కోణము యెట్లుండును? బంగారము బంగారమే. మట్టి మట్టియే. రాయి రాయియే. జ్ఞానికి ఈ విషయ నిష్ఠ అవగాహన (objective understanding) ఉండును. అవి ప్రకృతిలో లభ్యమయ్యే పరిమాణమును బట్టి వాటి విలువ నిర్ణీతమగును. ఇట్టి విలువ కూడ జ్ఞానికి పరిచితమే. రాయి కంటె బంగారమునకు విలువ ఎక్కువ అనుటలో సందేహము లేదు. బంగారము భూమిలోపల, రాయిపైన ఉండుటయే దీనికి కారణము. పరిస్థితి దీనికి విలోమముగా నుండుచో, రాయి విలువ బంగారము విలువ కంటె అధికముగ నుండెడిది. సర్వత్రా రాతి ఆభరణములు దర్శనమిచ్చెడివి!

రాయి, బంగారము అను వాటి మధ్య కేవల వస్తు నిష్ఠ (objective) భేదము మాత్రమే గలదు. బంగారమునకు ఒక ప్రత్యేక పరమాణు భారము గలదు. అది అరుదైన లోహము. దానిని తీగలుగా సాగదీయవచ్చును. అది వాతావరణములో చెడిపోదు. స్వభావసిద్ధములైన ఈ గుణముల వలన బంగారము ఆర్థిక వ్యవస్థకు మూలముగా స్వీకరింపబడుటకు పూర్వము నందే, చాల విలువ కలిగి ఉండెడిది. పైగా, అదిభూమిలో కొన్నివేల అడుగుల లోతున ఉండుటచే, దాని విలువ ఇంకనూ పెరిగినది. ఒకనికి బంగారము నందు అతిశయించిన లోభము ఉన్నదనుకొనుడు. అతడు బంగారమును తినలేడు గదా!.బంగారపు బిస్కట్లు కూడా లోహమయములే గనుక, తినుటకు పనికిరావు. ఒక వస్తువు యొక్క వస్తు నిష్ఠ విలువ అనగా నిదియే.

విషయి నిష్ఠ మహత్త్వ భావన అభద్రతా భావనకు మూలము

బంగారము భద్రత నిచ్చును అనే విషయి నిష్ఠ మహత్త్వము వ్యక్తిని పిచ్చివానిని చేయును. కాని బంగారము మనకు అన్ని వేళలా భద్రతను ఇచ్చునా? నాకు చెందిన కొన్ని లక్షల రూపాయల ఖరీదు చేసే బంగరు ఆభరణములను నేను లేనప్పుడు రక్షించమని నీకు అప్పచెప్పితి ననుకొనుడు. ముందుగా మీరు అంగీకరించినా, తరువాత మీకు నిద్రపట్టదు! మీరు నిద్రలో నుండి ఉలిక్కిపడి లేచి బంగారము భద్రముగా ఉన్నదా, లేదా యని పరిశీలిస్తూ గడుపుతారు. అట్లు గాక, ఒక పాత డొక్కు కారును భద్రపరచమని నీకు అప్పచెపితే, దాని మూలంగా నీ నిద్ర చెడదు. దాని బరువు బంగారము బరువు కంటె చాలా ఎక్కువ. దానిలోని లోహము బరువు బంగారపు బరువు కంటె కొన్ని రెట్లు ఎక్కువ అయిననూ, దాని వలన సమస్య లేదు. ఏలయన, దానికి బంగారమునకు ఉండే విలువ లేదు. దీనిని బట్టి బంగారము భద్రత నిచ్చునా? లేక, అభద్రత నిచ్చునా?

ఇదే విధముగా, నీవు వీధిలో నడిచివెళ్తున్నప్పుడు నీ జేబులో సొమ్ము లేకపోతే, సమస్య లేదు. కాని, నీ వద్ద ధనమున్ననో, నీవు చాల భయమును పొందుతావు. జేబుదొంగలు ఉన్నారేమోయని ఇటునటు చూస్తావు. వాస్తవంలో, నీ చూపులను బట్టి, నీ సంగతి దొంగలకి తెలిసిపోతుంది. జేబుదొంగలు మూర్ఖులు కారు. మూర్ఖులము మనమే. నీ వద్ద ధనము ఉన్నప్పుడు, ఎవరైనా దొంగిలించబోతున్నారేమో యన్నట్లు ఇటునటు చూడకుండుటయే మంచిది. సారాంశమేమనగా, ధనములో నీవు ఊహించిన భద్రత లేదు. వాస్తవంలో, ధనము భద్రత నిచ్చుటకు బదులు, నీకు రక్షణ లేని, భయమును గొలిపే స్థితిని సృష్టించును.

ధనము నందు వస్తుపరకమగు (objective) విలువ గలదనుటలో సందేహము లేదు. దానికి కొనుగోలు శక్తి గలదు. దాని వలన మనకు కొన్ని సుఖములు లభించును. కాని, ఇంతకంటె ధనమునందు అధికమగు మహత్త్వమును మనము దర్శిస్తే, అపుడు దానికి మనము ఇచ్చే మహత్త్వము కేవలము వ్యక్తి నిష్ఠము (subjective) మాత్రమే అగును.

నేను భద్రత గలవాడను

సర్వము మార్పునకు అధీనమై యున్నది. సర్వము సర్వకాలములలో నిరంతరముగా మార్పు చెందుచున్నది. ఆత్మ ఒక్కటియే మార్పు లేకుండగ నున్నది. అట్టి ఆత్మయే నేను. భద్రత గల వస్తువు నేను మాత్రమే. ఇతరము సర్వము సంతత పరివర్తన శీలము. నా ఆలోచనలు సర్వదా

మారుచున్నవి. ఇట్లు మారే సర్వము కాలాధీనముగ నుండును. దానికి ఒక ఆది, ఒక అంతము ఉండును. ఈ సంతత ప్రవాహములో మార్పునకు లోను కానిది, వికారమును పొందనిది ఒకే ఒకటి గలదు. అదియే నేను (ఆత్మ).

ఈ ఆత్మ దర్శనము స్పష్టముగా నున్నచో, ఆత్మ భద్రత గలది యను సత్యమును గుర్తించినచో, ఆ వ్యక్తి జీవన్ముక్తుడగును. అట్టివాడు జ్ఞాన విజ్ఞాన తృప్తాత్ముడగును. అతనికి విముక్తి కొరకై బాహ్య వస్తువుల అక్కర లేదు. అతడు కన్నులు తెరచి జగత్తును యథాతథముగా చూచును. అప్పుడాతనికి అతి సహజమగు జగత్తు దర్శనమిస్తుంది. ఏలయన, విషయనిష్ఠమగు మూర్ఖత అంతయూ జగత్తు నందు దర్శింపబడదు. జగత్తు యథాతథంగా ఉంటుంది. ఆ వ్యక్తి భద్రతను కల్గి, విముక్తుడై యుండును. ఈ విముక్తిని పొందుటలో ఇంత క్లేశము ఏల గలదు? బహుశః ఇది చాల సరళమగుటయే కారణమై యుండవచ్చును. వాస్తవంలో సర్వము నీవే. మానవులు సాధారణంగా 'ఇది ఏదో గొప్పది' అనే ధారణతో మొదలిడెదరు. కావుననే, ఈ విముక్తి, ఈ భద్రత దుష్ప్రాపములు అన్నట్లు భాసించును.

ఆత్మ అనంతము. కాన, దానికి పుట్టుక లేదు. అది అజము గనుక, యత్న సాధ్యము కాదు. నా ప్రయత్నముచే నిర్మింపదగిన వస్తువు కొరకు నేను వెదుకుచున్నచో, ఆత్మను నేను ఏనాడూ కనుగొనలేను. నేను ఎదుగవలసిన క్షేత్రములలో, ప్రయత్నమునకు నిశ్చితముగా మహత్త్వము గలదు. నేను జాగరూకుడనై ప్రయత్నించి ఎదుగవలసినదే. కాని, మనము ఇచట మౌలికమైన ఆత్మను చర్చిస్తున్నాము.

సమస్య బంగారములో నున్నదా? వ్యక్తిలో నున్నదా?

ఒక గురువు గురించి కొందరు శిష్యులు చెప్పే కథ ఒకటి గలదు. ఒక శిష్యుడు గురువుగారి వైరాగ్యమును పరీక్షింపగోరి, ఆయన తలగడ క్రింద ఒక బంగరు నాణెమును ఉంచెను. ఆ గురువు తన తలను ఆ తలగడపై నుంచి పరుండగా, ఆయనకు నిద్రపట్టలేదు. ఎంత ప్రయత్నించినా, నిద్ర దరికి చేరకపోయెను. ఆయన వైరాగ్యము అంత గొప్పది. శిష్యుడు దీనినంతనూ పరిశీలించి, తన తప్పును తెలుసుకొనెను. అతడు గురువు పాదములపై బడి తాను చేసిన తప్పును అంగీకరించెను. అపుడాతడు ఆ నాణెమును తీసివేసి సుఖముగా నిద్రించెను.

ఈ కథను విన్న తరువాత, ఆ గురువునకు వాస్తవంగా వైరాగ్యము గలదా యను శంక నాకు కలిగినది. బంగారము నందు అతిశయించిన లోభము గల వ్యక్తి యొక్క తలగడ క్రింద బంగరు

నాణెము ఉన్నదనుకొనుడు. ఆ నాణెమును ఎవరైననూ దొంగిలింతురేమో యను భయముతో ఆ లోభి కూడా నిద్రపోజాలడు. ఒకవో అతడు నిద్రించగా ఆ నాణెము అపహరింపబడినచో, మరల దొంగ దొరికి, నాణెము లభించువరకు అతడు నిద్రించలేడు. ఈ తీరున, బంగరునాణెము లేకపోవుటచే నిద్రపట్టనివాడు ఒకడైతే, ఆ నాణెము ఉన్న కారణంగా నిద్రపట్టనివాడు మరియొకడు. వీరిద్దరిలో ఎవరు గొప్ప? మీరే చెప్పండి. ఇద్దరి మనస్సులు బంగారమునకు తగుల్కొని యున్నవి గదా! అట్టిచో, ఒకరు గొప్పయని, మరియొకరు తక్కువ యని ఎట్లు చెప్పవచ్చును?

గురువుగారి గదిలో లోహము లనేకము ఉండియుండును. రాగిపాత్ర, స్టీలు పళ్లెము, మంచమునకు ఇనుపమేకులు, తలుపు గడియలు, తాళములు మొదలగునవన్నియూ లోహనిర్మితములే. రాగి, ఇనుము ఆయనను ఆకర్షించలేదు. కాని, బంగారము ఆయనను ఆకర్షించినది. దీని యర్థమేమి? సమస్య బంగారములో నున్నదా? ఆ వ్యక్తిలో నున్నదా? బంగారము తనంత తాను చేసేది ఏమీ లేదు. ఇతరలోహముల వలనే, అది కూడా ఒక లోహము. దానికి వస్తుపరకమగు ఒక విలువ (objective value) గలదు. అది భగవానుని సృష్టి. రాగి, ఇనుము కూడ భగవానుని సృష్టియే. అట్టిచో, భగవద్భక్తుడగు వ్యక్తి దృష్టిలో బంగారము రాగికంటె, ఇనుము కంటె ఏ విధముగా భిన్నము?

ఈ కథను నేను ఏమని అర్థంచేసుకోవాలి? సమస్య గురువు నందు గలదా? శిష్యుని యందు గలదా? సాధారణముగా సందేహలాభము (benefit of doubt)ను గురువునకు ఇచ్చుటయే ఉచితము. కాన, సమస్య శిష్యునియందు గలదని భావించవచ్చును. ఎందువలన? శిష్యులు గురువును పొగిడే కొన్ని సందర్భములలో, ఆ పొగడ్త, శిష్యుడు సద్భావముతో చేసినదే అయినా, గురువును కించపరిచేదిగా ఉంటుంది. ప్రస్తుత గాథలో, నిద్రపట్టకపోవుట గురువుగారి వైరాగ్యమునకు నిదర్శనమని శిష్యుడు భావించెను. కాని, శిష్యునికి వైరాగ్యమంటే ఏమిటో తెలియలేదని మాత్రమే ఈ గాథ వలన విర్ణీతమైనది. కాన, శిష్యునకు వైరాగ్యమనగా నేమో సరిగా తెలియలేదు గనుక, సందేహలాభమును గురువునకు మాత్రమే ఈయవలెను. కథను చెప్పిన, లేక వ్రాసిన శిష్యునకు ఈయరాదు. అనగా, ఈ దోషము కథకుడిదే గాని, మహాత్మునిది కాదని మనము స్వీకరిస్తాము. ఏలయన, మనకు మహాత్ముని గురించి ఏమియూ తెలియదు. ఆయన మహాత్ముడైనచో, బంగరు నాణెము మూలంగా నిద్రను కోల్పోయి ఉండడు. ఏలయన, మహాత్ముడు సమలోష్టాశ్మ కాంచనుడై యుండును. మట్టిబెడ్డగాని, రాతిముక్కగాని, బంగారము గాని మహాత్ముని దృష్టిలో సమానమే. ఏలయన, భద్రత ఆత్మనిష్ఠమేగాని, బాహ్య వస్తు నిష్ఠము కాదు.

సర్వ అభిలషణీయ వస్తువులకు, సంబంధములకు బంగారము ఉపలక్షకము

ఇది బంగారమునకు మాత్రమే గాక, సర్వవస్తువులకు అన్వయించును. ఇచట కాంచనము ఉపలక్షకము మాత్రమే. అనగా, అదే వర్గమునకు చెందిన వస్తువులన్నింటికీ అది ప్రతీకయై నిలచును. 'భగవానుడు ఉన్నాడు; నిన్ను రక్షిస్తాడు' అనే ధారణకు కూడ బంగారము ప్రతీక. ఉన్నది భగవానుడొక్కడే. కాగా, భగవానుడు నన్ను రక్షించుట అనగా నేమి? ఆయన నన్ను రక్షించుట యనగా తనను తాను రక్షించుకొనుటయే. సమలోష్టాశ్మ కాంచనుడగు వ్యక్తి యొక్క భద్రత ఇతరము దేనిపైననూ ఆధారపడదు. మట్టిబెడ్డ, రాతిముక్క, బంగారము ఇత్యాది సర్వవస్తువులకు అభిముఖముగా జ్ఞానియొక్క స్పందన సమముగా నుండును. అదియే ఉదాసీనత.

రాయి విషయంలో, మట్టిబెడ్డ విషయంలో గాని సర్వుల ప్రతిక్రియ సమముగనే ఉండును గదా! వాటిని ఎవ్వరూ లెక్కచేయరు. వాటిని ఇచట ప్రస్తావించనేల? జ్ఞాని యొక్క స్పందన బంగారము విషయములో, మట్టిబెడ్డ, రాయి విషయములో వలె ఉదాసీనముగా నుండును. ఈ సత్యమును ప్రదర్శించుటకై అవి ఇచట ప్రస్తావింపబడినవి. మట్టి వలన, లేక రాయి వలన వ్యక్తి యొక్క భద్రత పెరగదు. అటులనే బంగారము వలన కూడా. బంగారములో భద్రత గలదనే తప్పు ధారణ సాధారణముగా మనుజులలో నుండును. కాని, వాస్తవంలో భద్రత లేని వ్యక్తికి బంగారము వలన భద్రత లభించదు.

పూర్వకాలంలో, బంగారము యొక్క విలువ, కేవలము ఆభరణములలో దాని వినియోగముపైన మాత్రమే ఆధారపడెడిది. కాని, ఇప్పుడు బంగారము ఎలక్ట్రానిక్స్‌తో సహా అనేకవిధములుగా వినియోగింపబడుచున్నది. బంగారమునకు ఆర్థికవ్యవస్థకు సంబంధించిన విలువ కూడ గలదు. ధరలు పెరిగినప్పుడు రూపాయి కొనుగోలు శక్తి తగ్గుతుంది. కాని బంగారము విలువ తగ్గదు. ఇందువలననే, ప్రజలకు బంగారముపై ప్రేమ అధికము. ప్రజలు ధనమును బంగారముగా మార్చుకొనెదరు.

బంగారమునకు సహజమూల్యముతో బాటు, మానవ నిర్మితమూల్యము కూడ గలదు. కావుననే, అది మానవునకు ఒక విధమైన భద్రతాభావనను కలిగించును. ఈ భద్రతాభావన సరిగాదు. బంగారము మానవునకు భద్రతనీయలేదు. భద్రత లేని వ్యక్తి వద్ద కొన్ని బంగరు కణికెలు ఉన్నంత మాత్రాన భద్రత కలవాడుగా మారిపోడు. భద్రత లేనివాడు సదా భద్రత లేనివాడుగనే యుండును. బంగరు కణికెలను దగ్గర ఉంచుకొనుట వలన, దొంగలు ఆకర్షింపబడుదురు. అట్టి వ్యక్తి యొక్క

ముఖమును చూడనిచ్చగించని వ్యక్తులు కూడ అతని వైపునకు ఆకర్షింపబడుదురు. ఇచటి సారమేమనగా, బంగారము భద్రత నిచ్చుననే భావన సామాన్య జనులలో ఉన్నది. కాని, జ్ఞాని భద్రతను తనలో తాను దర్శించును. వాస్తవంలో, ఈ ప్రపంచములో భద్రత గల వ్యక్తి జ్ఞాని మాత్రమే. ఏలయన, అతడికి భద్రత కొరకై బంగారము గాని, ప్రపంచములోని ఇతర వస్తువులు గాని ఆవశ్యకము కావు.

ప్రపంచములోని సర్వవస్తువుల విషయంలో, జ్ఞానియొక్క మానసిక ప్రవృత్తిని వర్ణించిన తరువాత, శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములో, వివిధ వ్యక్తుల విషయములో జ్ఞాని యొక్క ప్రవృత్తిని వర్ణించుచున్నాడు.

అధ్యాయము 6, శ్లోకము 9:

सुहृन्मित्रार्युदासीनमध्यस्थ द्वेष्यबन्धुषु ।
साधुष्वपि च पापेषु समबुद्धि र्विशिष्यते ॥ ९ ॥

సుహృన్మిత్రార్యుదాసీన మధ్యస్థ ద్వేష్యబంధుషు
సాధుష్వపి చ పాపేషు సమబుద్ధిర్విశిష్యతే (9)

సుహృద్–మిత్ర–అరి–ఉదాసీన–మధ్యస్థ–ద్వేష్య–బంధుషు = హితకారి, స్నేహితుడు, శత్రువు, పరిచితుడు, మధ్యవర్తి, ద్వేషమునకు అర్హమైనవాడు, బంధువు అను వారి విషయములో; **సాధుషు** = మంచివారి విషయములో; **చ** = మరియు; **పాపేషు అపి** = పాపుల విషయములోనైనను; **సమబుద్ధిః** = సమమైన దర్శనము గలవాడు; **విశిష్యతే** = సర్వోత్కృష్టుడు.

> హితకారి, స్నేహితుడు, శత్రువు, పరిచితుడు, మధ్యవర్తి, ద్వేషమునకు అర్హమైన వాడు, బంధువు అను వారి విషయములోను, మంచివారి విషయములోనే గాక పాపుల విషయములో నైనను సమమైన దర్శనము గల వ్యక్తి సర్వోత్కృష్టుడు (9).

ఈ శ్లోకములో ప్రథమార్ధము అంతా ఒకే సమాసపదము. ఇది చాల పొడవుగ నుండుటచే ఒక పదము కాకపోవచ్చుననే శంక కలుగును. కావుననే, శ్రీ శంకరులు భాష్యములో ప్రత్యేకముగా ఇది ఒకే ఒక సమాసపదమని చెప్పినారు. సుహృద్ – మిత్ర – అరి – ఉదాసీన – మధ్యస్థ – ద్వేష్య –

బంధుషు అను ఈ పదము (సమస్త పదమ్) వివిధ రకముల వ్యక్తులను వర్ణించును. మంచివారు, పాపాత్ములు అనే ఇంకో రెండురకముల వ్యక్తులు (సాధుష్వపి చ పాపేషు) కూడ ఈ శ్లోకములో వర్ణింపబడినారు. వీరందరి విషయములో జ్ఞాని యొక్క దర్శనము, మానసిక ప్రవృత్తి సమానముగ (సమబుద్ధిః) ఉండును. ఇట్టి వాడు మానవులందరిలో గొప్పవాడు (విశిష్యతే). శ్రీకృష్ణుడు చెప్పిన వివిధ రకముల వ్యక్తులను, వారికి శ్రీ శంకరులు ఇచ్చిన నిర్వచనములను మనము క్రమముగా పరిశీలిద్దాము.

సుహృత్, మరియు మిత్రుడు

ప్రత్యుపకారమును అపేక్షించకుండగనే ఉపకారమును చేయువాడు సుహృత్ అని శ్రీ శంకరులు నిర్వచించిరి*. సాధారణంగా ఏదో ఒక ప్రత్యుపకారము లభిస్తుందనే ఆకాంక్షతో ఒకరికి మరియొకరు సాహాయ్యమును చేస్తారు. కాని, సుహృత్ ప్రత్యుపకారమును దేనినీ అపేక్షించకుండగనే సహకరిస్తాడు. ఇట్టి వ్యక్తులు చాల అరుదు. రెండవరకము వ్యక్తి మిత్రుడు; అనగా, స్నేహితుడు. అనగా పరస్పర అవగాహనతో కూడిన స్నేహమునకు పాత్రుడైనవాడు.

అరి

అరియనగా శత్రువు; ద్వేషభావము గలవాడు. జ్ఞాని ఎవ్వరినైననూ శత్రువుగా పరిగణించే ప్రసక్తియే లేదు గదా! అను శంక కలుగవచ్చును. అన్ని సందర్భాలలో మనము శత్రువులను నిర్మాణము చేసుకోవలసిన అవసరము లేదు. కొన్ని సందర్భాలలో వారు మనము నిర్మాణము చేసుకోకుండానే తమంత తాముగా ఉంటారు. తనతో తాను సదా ఆనందంగా ఉండే వ్యక్తి విషయంలో ఇట్టి శత్రువులు తమంత తాముగా నిర్మాణమవుతారు. ఒక వ్యక్తిలో సదా ఆనందముగ నుండుట అనే లక్షణము ఇతరులలో శత్రుభావమును నిర్మించుటకు చాలును.

ఇతరులు మనయందు శత్రుత్వమును వహించుటకు కారణము లనేకముగా ఉంటాయి. నీకు పొడుగాటి ముక్కు ఉంటే, మరియొకనికి అట్టి ముక్కు ఉండాలనే కోరిక ఉంటే, అతనికి నీ యందు శత్రుత్వము ఉండుటకు ఈ కారణము చాలును! ఏలయన, అతనికి చప్పిడిముక్కు ఉండగా, అతని దృష్టిలో సుందరమగు ముక్కు నీకు గలదు. కావున, నీవు అతనికి ఏమియూ

---

* ప్రత్యుపకారం అనపేక్ష్య ఏవ ఉపకర్తా

అపకారమును చేయకుండగనే, అతనికి నీ యందు ద్వేషము కలుగును. కావున, సమాజములో జ్ఞానికి కూడా శత్రువులుండుట సహజమే.

కొందరు తమ విశ్వాసాల కారణంగా జ్ఞానియందు శత్రుత్వమును కలిగియుంటారు. ఉదాహరణకు, వేదాంతమును బోధించువాడు సాక్షాత్తు కలియేనని వారు భావించవచ్చును. ఏలయన, అతడు సర్వము బ్రహ్మమేనని బోధించును గదా! శత్రుత్వమునకు ఈ కారణము చాలును. వీరు జ్ఞానియందు తీవ్రమగు ద్వేషమును కలిగియుండవచ్చును. కావున, వీరు ఈ శ్లోకములో శత్రువులుగా వర్ణింపబడినారు.

ఉదాసీనుడు, మధ్యస్థుడు

మనకి దారిలో కనబడినప్పుడు తలను ఊపేటంత మాత్రమే పరిచయము గల వ్యక్తి ఉదాసీనుడనబడును. ఇట్టి వ్యక్తిని మనము బస్సు ఆగే చోట గాని, పెట్రోలు బంకు వద్ద గాని తరచుగా చూస్తాము. లేదా, అప్పుడప్పుడు లిఫ్టులో దర్శనమిస్తాడు. పరస్పరము గుర్తించి, తల ఊపి, ఎవరిదారిన వారు వెళ్తారు. ఈ శ్లోకములో మధ్యస్థుడనే మరో వ్యక్తి గలడు. ఇద్దరు వ్యక్తులు పోట్లాడుకుంటూ ఉంటే, ఉదాసీనుడు తనకేమీ పట్టనట్లు ఉండును. అతడు ఏ ఒక్క పక్షమునూ సమర్థించడు. అతడు వీరి పోట్లాటను చూచి ఊరకుంటాడు. లేదా, పోట్లాటను చూచి ఉత్సాహమును, వేడుకను పొందే భాగ్యము కలిగినందులకు వారిద్దరికి కృతజ్ఞతలను తెలుపును. కాని, మధ్యస్థుడట్లు గాదు. అతడు ఇరువురి హితమును గోరును. అతడు పోట్లాటను ఆపుటకు యత్నించును. అతని మాట వారిద్దరికీ అంగీకారయోగ్య మగును.

'ఇతడు పక్షపాతము లేకుండగా, విషయమును న్యాయబద్ధముగా పరిశీలించగల్గుతాడు' అని రెండు పక్షముల వారి విశ్వాసమును చూరగొన్న వ్యక్తియే మధ్యవర్తిగ అంగీకరింపబడును. ఉదాహరణకు, ప్రపంచ రాజకీయాలలో స్విట్జర్లాండు మధ్యవర్తి భూమికను తరచుగా నిర్వహించుచుండును. రెండు దేశముల మధ్య ఘర్షణ చెలరేగి, రాయబారి కార్యాలయములు మూసివేయబడినప్పుడు, స్విట్జర్లాండు దేశమును మధ్యవర్తిగా వ్యవహరించమని కోరతారు. ఏలయన, ఆ దేశము నూటికి నూరు శాతము తటస్థదేశము. స్విట్జర్లాండు వారు తమ తెలివితేటలతో ఈ తటస్థ హోదాను నిలబెట్టుకొనుట వలన వారికి విశేషమైన ఆర్థిక లాభము కూడ సిద్ధించినది.

ఘర్షణలో పాల్గొనే పక్షములలో వేటిలోనూ చేరని వాడే మధ్యస్థుడు. ఘర్షణ దృష్ట్యా ఒకడు తటస్థముగా (ఉదాసీనః) ఉండవచ్చును. లేదా, ఇరుపక్షముల హితమును కోరువాడు (హితైషి)

కావచ్చును. ఇట్టి వ్యక్తి ఇరుపక్షముల మధ్య అవగాహనను కుదిర్చి, అందరికీ ఆనందమును కలిగించును. ఇట్టి వ్యక్తియే మధ్యస్థుడనబడును. మధ్యస్థుడు అనగా మధ్యలో నుండువాడు అని యర్థము.

వ్యక్తులే సమాజము

ఈ శ్లోకములో చెప్పబడిన వ్యక్తులు అన్ని సమాజములలో ఉంటారు. వాస్తవంలో వ్యక్తులకు భిన్నంగా సమాజమునకు స్వతంత్ర ఉనికి లేదు. ఇట్టి వ్యక్తులందరూ ఈ శ్లోకంలో వర్ణింపబడినారు. ఏ సమాజములో నైనా ఈ వ్యక్తులందరూ ఉంటారు. మిత్రులు, శత్రువులు, కొట్లాడుకునేవారు, వారిని దూరంగా నిలబడి చూచేవారు, వారికి పరస్పర అవగాహనను కుదిర్చే యత్నమును చేయువారు ఇత్యాది వ్యక్తులు సర్వత్రా ఉంటారు.

ద్వేష్యుడు, బంధువు

ఈ పెద్ద సమాసంలో చెప్పబడిన మరోరకం వ్యక్తి ద్వేష్యుడు. అనగా, ఆ వ్యక్తి చేసే పనుల వలన అతడు ద్వేషమునకు అర్హుడగును. ఆ వ్యక్తి చేసిన అపకారము వలన మనమాతనిని ఏ మాత్రమూ ఇష్టపడము. తరువాత చెప్పబడిన వ్యక్తి బంధువు. తండ్రి, తల్లి, సోదరుడు, సోదరి, మామ, అత్త మొదలగు వారు బంధువులు. వారి అభిప్రాయాలకు మనము చాలా విలువనిస్తాము. వారి మెప్పును మనము కోరతాము. కావున, వారు మనలను మానసికంగా, భావాత్మకంగా ప్రభావితము చేయగల్గుతారు.

సాధువు, పాపి

ఆఖరుగా, శ్రీకృష్ణుడు సాధువు, పాపి అనే మరో ఇద్దరు వ్యక్తులను చెప్పినాడు. ఈ ప్రకరణంలో, ధర్మశాస్త్ర నియమములను ఖచ్చితంగా అమలు చేసే వ్యక్తికి సాధువు అని పేరు. అట్లు చేయనివాడు పాపి యనబడును; ప్రతిసమాజములో సాధువులు ఉంటారు. వారు మంచిని చేస్తూ, చెడును పరిహరిస్తూ జీవిస్తారు.

దీనికి విరుద్ధముగ జీవించే వ్యక్తులు కూడా ప్రతిసమాజములో కనబడతారు. వారు శాస్త్రములను సదా ఉల్లంఘిస్తారు. శాస్త్ర ప్రకారముగా, సమాజపరంగా ఏ పనిని చేయకూడదో, దానిని వారు చేస్తారు. ఏ పనిని చేయాలో, దానిని వారు చేయరు. ఇట్టి కర్మలకు పాపములు అని పేరు. వాటిని ఆచరించు వ్యక్తి పాపి యనబడును.

పూర్వకాలములో మాదకద్రవ్యముల సమస్య ఉండెడిది కాదు. కావుననే, శాస్త్రము మాదక ద్రవ్యములను (drugs) వినియోగించరాదని ప్రత్యేకముగా చెప్పలేదు. శాస్త్రము ఒక కర్మను నిషేధించలేదు గాన, దానిని నేను చేస్తాను అను వాదము హేతుబద్ధము కాదు. శాస్త్రము సురాపానమును నిషేధించినది. కావున, నేను సురాపానమును చేయను. కాని, నేను హెరాయిన్ (heroin) అనే విషాద్రవ్యమును సేవిస్తాను. అది శాస్త్ర విరుద్ధము కాదు గదా! అనే వాదము తప్పు. అది శాస్త్రమునకు అనురూపమైన కర్మ కాజాలదు. ఈ కాలములో వలె పూర్వకాలములో విషాద్రవ్యములు సేవింపబడి యున్నచో, శాస్త్రము వాటిని కూడా సురాపానముతో బాటు నిషిద్ధ వస్తువుల జాబితాలో చేర్చి యుండెడిది. శాస్త్రములో సురాపాన నిషేధము ఉపలక్షణము. అనగా, మానవునకు హాని చేసే పదార్థము లన్నింటికీ సుర ఒక ప్రతీక.

మానవులు శాస్త్రమును ఉల్లంఘించుటకు కారణమేమి?

సురాపానము చేయరాదు (సురాం న పిబేత్) ఇత్యాది వచనములకు మానవులు ఆనందంతో ఎదురు తిరుగుతారు. చేయకూడని పనులను చేయుటలో వారికి ఉత్సాహము అమితము. ఈ విప్లవ ధోరణికి కారణము ఒకానొక ఆంతరిక ఒత్తిడి. ఒకప్పుడు మానవులు సాహస కార్యమును చేయాలనే భావనతో శాస్త్రమును ఉల్లంఘిస్తారు. ఈ భావనకు కూడా మూలము ఆంతరిక ఒత్తిడియే. శాస్త్రమును ఉల్లంఘించని వారు మంచివారు అని చూపుట తాత్పర్యము కాదు. కొందరు సోమరితనము వలన గాని, భయము వలన గాని చెడుపనిని చేయజాలకపోవుటచేత మాత్రమే మంచివారుగా మిగిలిపోతారు. ఇట్టి వారికి చెడు పనియందు ఆసక్తి మెండు. అయిననూ, వారు చేయగోరు పనిని చేయకుండా భయము అడ్డు తగులును. ఇట్లు గాక, జ్ఞానము, అవగాహనల మూలంగా శాస్త్రమును ఉల్లంఘించని వారికి జీవితము ఆనందమయము అగును. వారికి అంతరంగములో ఎట్టి ఒత్తిడియు ఉండదు. వారు తమ ఇచ్ఛ చేతనే శాస్త్రమునకు అనురూపముగా జీవించెదరు. కావున, వారికి సమస్యలు ఉండవు. మానవుడు ఆంతరిక ఒత్తిడి మూలంగా శాస్త్రమును ఉల్లంఘిస్తాడు. ఆ ఒత్తిడి తనంత తానుగా అతనికి ఒక సమస్య యగును. ఉల్లంఘించే స్వభావము సమస్య కాదు. ఉల్లంఘించే స్వభావము వెనుక నున్న ఒత్తిడి అసలైన సమస్య.

వాస్తవంలో, మనమందరము ఇట్టి ఉల్లంఘనను చేయువారమే. నేను కూడా ఉల్లంఘించే స్వభావము కలవాడనే. అందువలననే స్వామి అయినాను. నేను పెరిగిన సమాజము యొక్క దృష్టిలో నేను ఉల్లంఘించే స్వభావము కలవాడను కాకపోయినా, మా అమ్మగారి దృష్టిలో నేను నిశ్చితముగా

అట్టివాడనే. తన కొడుకు సన్న్యాసి కావాలని ఏ తల్లి కోరుకొనును? భారతదేశములోని ఏ తల్లియూ అట్లు కోరదు. ప్రక్కింటి వారి కుమారుడు సన్న్యాసి అయితే, పరవాలేదు. తల్లులందరు అతనికి నమస్కరించి భిక్షను, దక్షిణను కూడ ఇస్తారు. కాని సన్న్యాసి ప్రక్కింటి వారి కుమారుడు కావాలి. కావున, నేను సన్న్యాసి నగుటకై, ఉల్లంఘించుట తప్పనిసరి అయెను!

ఈ శాసనోల్లంఘనము అంతరిక ఒత్తిడి వలన కావచ్చును. లేదా ఒకానొక అవగాహన వలన, సాక్షాత్కారము వలన కావచ్చును. తరుచుగా మనుజుడు పెరిగే వయస్సులో నిర్మితమైన ఒకానొక అంతరిక సమస్య మూలంగా ఉల్లంఘించే స్వభావమును అలవరుచుకుంటాడు. ఈ అంతరిక ఒత్తిడి మూలంగా మానవుడు చేయకూడని పనులను చేస్తాడు. ఆ పనులు జేబులు కత్తిరించుట నుండి మొదలిడి, మాఫియా సమూహముల అధినాయకత్వము వరకు ఉంటాయి. చోరులు వివిధ స్థాయిలలో ఉంటారు. కోట్ల ధనమును అపహరించే కంపెనీ అధిపతులు చాల గంభీరమైన వేషముతో సమాజములో సమ్మానితులుగా ఉంటారు. చోరీ చేసే ప్రక్రియలో తమ పేరు ఏ స్థాయిలోనూ రాకుండా వారు జాగ్రత్త వహిస్తారు. ఈ శ్లోకములోని 'పాప' అను శబ్దము ప్రతి సమాజములో నుండే అన్ని రకముల దుష్టులను నిర్దేశిస్తుంది.

మన అనుబంధము వ్యక్తులతోనా? లేక, నిర్వచనములతోనా?

శ్రీకృష్ణుడు జాబితాను సుహృత్‌తో మొదలిడి పాపితో పూర్తి చేసెను. ఈ మధ్యలో ప్రపంచములోని అన్నిరకముల వ్యక్తులు ఇమిడిపోతారు. ఈ వ్యక్తులందరితో వ్యవహరించు విధమెట్టిది? వారందరితో సమముగా ఉదాసీనముగా వ్యవహరించాలని శ్రీకృష్ణుడీ శ్లోకములో స్పష్టముగా చెప్పుచున్నాడు. కాని, మనము అట్లు చేయము. మనము వ్యక్తులను వివిధ రకములుగా విభజించి వ్యవహరిస్తాము. వ్యక్తిని యథాతథముగా చూచే అలవాటు మనకు లేదు. వ్యక్తికి ఏదో ఒక వర్గమును, శ్రేణిని, లేదా నిర్వచనమును అంటగట్టి అతనిని ఆ దృక్కోణంలో చూస్తాము. ఆ దృష్టితోనే అతనితో సంబంధమును ఏర్పరచుకుంటాము. కాని, ఇది సంబంధము కానే కాదు. మనము వ్యక్తులకు మన నిర్వచనము ప్రకారంగా శ్రేణిని, వర్గమును అంటగట్టి వ్యవహరిస్తే మనము సంబంధమును ఏర్పరుచుకునేది ఆ నిర్వచనములతోనే గాని, వ్యక్తులతో గాదు.

ఒక వ్యక్తి మరియొక వ్యక్తితో సంబంధమును ఏర్పరచుకునే సందర్భాలు చాలా అరుదుగా ఉంటాయి. మనము వ్యక్తులను నిర్వచించుకొని, ఆ నిర్వచనములతో మాత్రమే సంబంధమును కలిగి ఉంటాము. మనము ఇచ్చే నిర్వచనములో ఏ వ్యక్తియూ పరిపూర్ణముగ ఇమడజాలడు. ఉదాహరణకు,

శత్రు నిర్వచనములో పూర్తిగా ఇమిడే వ్యక్తి ఎవ్వరూ లేరు. 'అముకవ్యక్తి నా శత్రువు' అనే నిర్వచనమునకు అర్థమేమి? ఆ వ్యక్తి నీలోని ఏ భాగమునకు శత్రువు? నీ దేహములో అనేక అవయవములు గలవు. అతడు నీ ముక్కునకు శత్రువా? నీ కాళ్లకు శత్రువా? అతడు దేనికి శత్రువు? ఈ చర్చను బట్టి, ఏ నిర్వచనములోనైననూ పరిపూర్ణముగా ఇమిడే వ్యక్తి ఎవ్వరూ లేరని మనకు స్పష్టమగుచున్నది. అయిననూ, మనమిచ్చే నిర్వచనములు ఆధారంగా మనము వ్యక్తులతో వ్యవహరిస్తాము.

మనము నిర్వచనము లాధారంగా వ్యక్తులతో వ్యవహరించినప్పుడు, మనము కలుసుకునేది మిత్రుడు, శత్రువు ఇత్యాది నిర్వచనములను మాత్రమే గాని, వ్యక్తిని కాదు. అనగా, నీవు నీ నిర్వచనములలో చిక్కుకున్నావని యర్థము. కావున, నీవు ఒక ఊహా ప్రపంచములో జీవిస్తూ ఉంటావు. మానవుడు తన వాస్తవ వ్యక్తిత్వమును దాచి, ఒక కల్పితాభిమానము (front)ను ముందుంచుకొని, వ్యవహరిస్తాడు. ఇది తొలగిపోయే వరకు పై సమస్య తొలగదు.

మానవునకు కొన్ని దౌర్బల్యములు, దుఃఖము మొదలగునవి ఉంటాయి. అతడు వాటి నుండి తనను తాను రక్షించుకొనుట కొరకై, తన వ్యక్తిత్వమును దాచి, బయటకు మరోరకముగా కనబడును. అనగా, మానవుడు సర్వకాలముల యందు పరదా వెనుక నుండి ప్రపంచమును ఎదుర్కొనును. కాని, మనమిచట చర్చించే జ్ఞాన తృప్తాత్మునకు ఇట్టి సమస్య లేదు. ఇట్టి వ్యక్తి జ్ఞాన ప్రభావము వలన పూర్ణ స్వతంత్రుడై, తనతో తాను పూర్తిగా సంతృప్తుడై యుండును. ఇట్టి వానికి పరదా వెనుక దాచదగిన వ్యక్తిత్వము ఏమియుండును? ఏమియూ ఉండదు. ఆవరణలు అన్నియూ తొలగి, మనస్సు, ఇంద్రియములతో కూడిన సరళమగు వ్యక్తి మిగిలియుండును. ఇందువలననే, జ్ఞాని ఇచట సమబుద్ధి యని వర్ణింపబడినాడు.

జ్ఞాని ఇతరులను ఎన్నడూ నిందించడు

సమబుద్ధి యగు వ్యక్తి సుహృత్తునకు, పాపికి మధ్య గల భేదమును ఎరుంగని మూర్ఖుడు కాడు. అతడు సుహృత్‌ను సుహృత్ గను, పాపిని పాపిగను గుర్తించును. కాని, సమబుద్ధి యగు వ్యక్తి పాపిని పాపి యని నిందించడు. వాస్తవంలో పాపి అనబడే వ్యక్తి ఎవ్వరూ లేరు. పాపకర్మలను ఆచరించిన వ్యక్తి మాత్రమే గలడు. కావున, ఇచటి సారమేమనగా, మనము వ్యక్తులతో యథాతథముగా కలుసుకొని, వారిని యథాతథముగా అంగీకరించి, వారికి స్పందించి, వారితో వ్యవహరించాలి. ఈ దృష్టికోణము, వ్యక్తులను యథాతథముగా స్వీకరించే ఈ శక్తి ఉన్న వ్యక్తి తాను స్వయముగా స్వతంత్రునిగా, విముక్తునిగా ఉండగల్గుట నిశ్చయము. ఈ దృష్టికోణము గల వ్యక్తి ఇతరులతో స్ఫూర్తితో కూడిన, యథార్థమగు సంబంధమును నెలకొల్పుకొనగల్గును.

ఉదాహరణకు ధనవంతుడు పార్టీలకు వెళ్లినప్పుడు తన స్థాయికి దగ్గ వారిని, మరియు తన కంటె పైస్థాయి వారిని వెదికి, వారితో మాత్రమే సంభాషించును. ప్రతి వ్యక్తి ఈ పనిని ఏదో ఒక రకంగా చేస్తూనే ఉంటాడు. ఒకప్పుడు మనకు ఎదురుగా విద్వాంసుడగు వ్యక్తి వస్తూ ఉంటే, మనము పారిపోతాము. విద్వాంసుని సమక్షములో ఇబ్బందిగా నుండుటచే, పారిపోవుటయే మేలనిపిస్తుంది. ఈ విధముగా మనము ఒకప్పుడు ధనగర్వితులైన వారి నుండి పారిపోతాము. మరియొకప్పుడు వారి కొరకు వెతుకుతూ, ఎదురు చూస్తాము.

ఇచటి ఉపదేశమునకు, మనము జాగరూకతతో మిత్రులను ఎన్నుకునే దానికి సంబంధము లేదు. మనము మిత్రులతో స్వతంత్రంగా ఉంటాము; కష్టసుఖాలను పంచుకుంటాము. కావున, మిత్రులను జాగరూకతతో ఎన్నుకొనుట కొంతవరకు న్యాయమే. కాని, మనమిచట వ్యావహారిక జీవనమును గురించి చర్చించుట లేదు. మనము జ్ఞానతృప్తాత్ముడగు జ్ఞాని గురించి మాటలాడుచున్నాము. జ్ఞాని ఈ వివిధరకముల వ్యక్తుల యెదుట యెట్లు స్పందించును? జ్ఞాని వారందరి విషయంలో సమానమైన దృష్టికోణము గలసమబుద్ధియై యుండును. వారి సామాజికస్థాయి, వృత్తి, జన్మకుండలి చిహ్నము ఏవైనా కావచ్చును. ఎదుటి వ్యక్తి గతము గురించి గాని, వర్తమానము గురించి గాని, ఏమి చేసినాడని గాని, ఏమి చేస్తున్నాడని గాని, అతడు శాస్త్రానుయాయి (సాధువు) అగునా, కాదా యని గాని, అతడు శాస్త్రవిరుద్ధమగు ఆచరణ గలవాడా (పాపి) యని గాని జ్ఞాని పట్టించుకోడు. జ్ఞాని వ్యక్తులను యథాతథముగా అంగీకరించును. ఏలయన, జ్ఞాని పూర్ణ స్వతంత్రుడు; అతడు ఇతరుల దోషములపై తీర్పు చెప్పే స్వభావము కలవాడు కాదు (non-judging person).

ఇతరులు ఇచ్చే తీర్పును గురించి భయము

మానవులు సర్వదా తమ గురించి ఇతరులు ఏమి తీర్పునిస్తారో యని భయపడతారు. అట్లు గానిచో, పదిమంది ముందు మాటలాడుటకు చాలమంది సిగ్గుపడుటకు కారణమేమి గలదు? పదిమందిలో మాటలాడే అలవాటు గలవారు కూడా కొద్దిగా సిగ్గుపడతారు. ఎందువలన? ఇతరులు తమ గురించి ఏమి అనుకుంటారో యని భయపడతారు. వాస్తవంలో, మన గురించి ఇతరులు ఏమనుకుంటున్నారో యని ఆలోచిస్తూ, మనము జీవితములో చాల భాగమును గడిపివేస్తాము. నేను ఇప్పుడు ఒక ప్రశ్నను వేస్తాను. నీవు నీ గురించి ఏమనుకుంటున్నావు? నీ గురించి నీవు ఏమనుకుంటే, అదియే నీవు. పైగా, నీవు తప్పుడు ధారణను కలిగియున్నావు. ఈ ధారణను సరిచేయుటకు మాత్రమే ఈ ప్రయత్నము. నీ గురించి ఇతరులకు గల ధారణను సరిదిద్దుట ఈ బోధకు ఉద్దేశ్యము కాదు.

ఇతరులు నీవు జీవుడవని భావిస్తున్నారు. అది నీకు అంగీకారమేనా? ఇతరుల ధారణలను లెక్కచేసేది యెవరు? నిన్ను గురించి నీకు గల తప్పు ధారణలను సరిదిద్దుకోవాలి. ఇతరులు తమకు తోచిన రీతిలో భావించెదరు గాక! అది వారి సమస్య. నీ సమస్య కాదు. ఇతరులు నా గురించి ఏమనుకుంటారో అనే చింత సర్వజనులలో కనబడే సమస్య. అది కేవలము కొద్ది వ్యక్తుల సమస్య కాదు. అది మానవజాతి మొత్తానికి చెందిన సమస్య. నీవు ఇతరులచే నియంత్రింపబడుట లేదు. నీవు నీ ఆలోచనా సరళిచేత, ఇతరులు ఏమనుకుంటారో యను భయము చేత నియంత్రింపబడుచున్నావు. నిన్ను నియంత్రించేది సమాజము కాదు.

ఇతరులందరికీ తమ తమ సమస్యలు ఉన్నాయి. వారికి నీ గురించి ఆలోచించే సమయము లేదు. కాని, వారు నీ గురించి ఆలోచిస్తున్నారని నీ భావన. వాస్తవంలో వారు తమ గురించి మాత్రమే ఆలోచిస్తున్నారు. కాని, ఇతరులు ఏమనుకుంటున్నారో యని నీవు చేసే ఆలోచనల చేతనే నీవు నియంత్రింప బడుచున్నావు. సమాజము నన్ను నియంత్రించుచున్నది యని నీవు భావిస్తావు. వాస్తవంలో, సమాజము ఎవ్వరినీ నియంత్రించదు. సమాజము ఏమనుకుంటుందో యని నీవు చేసే ఆలోచన ఒక్కటియే నిన్ను నియంత్రించుచున్నది.

దీనికి భిన్నంగా, జ్ఞాని దీని విషయంలో వ్యక్తిపరంగా (subjective) సమ్మిళితుడు కాడు. అతడు ఇతరుల గుణదోషములపై తీర్పునిచ్చే పనిని ఏ మాత్రమూ చేయడు. ఒక వ్యక్తి ఇతరులపై తీర్పునిచ్చే స్వభావము కలవాడా, కాదా? అని పరిశీలించమని నేను బోధించుట లేదు. అట్లు పరిశీలించినచో, అది మరల అతనిపై మనము తీర్పును ఇచ్చినట్లగును! ఇతరులపై తీర్పును ఈయకపోవుట(non-judgement) అను యీ లక్షణము వ్యక్తిలో ఆరంభమై, వ్యక్తిలోనే అంతమగును. నేను నా విషయంలో కూడా తీర్పును ఇచ్చుకోకుండా ఉండాలి. అట్లుగానిచో, వ్యక్తి ఇతరుల గురించి సర్వకాలములలో తీర్పును ఇస్తూనే ఉంటాడు. కావున, నీవు నీ గురించి గాని, ఇతరుల గురించి గాని తీర్పును ఈయకుండుటయే శ్రేయము.

ధారణలను సరిదిద్దుకొనుటకు సమయము పట్టును

వ్యవహార దృష్టితో చూస్తే, ఇతరుల గురించి తీర్పును చేయకుండుట ఒక మంచి గుణము. ఈ గుణము జ్ఞానిలో అతి సహజంగా ఉంటుంది. వాస్తవంలో, జ్ఞానము ఉదయించుటకు ముందే ఇతరులను గురించి తీర్పునీయని ఈ గుణము ఉండాలి. అందువలననే, నీవు నీ మానసిక స్థితి ఆధారంగా నిన్ను గురించి నిర్ణయములను చేయవద్దనియు, తీర్పును ఈయవద్దనియు నేను చెప్తాను.

మానవులు తమ అర్హతలపై, నైపుణ్యములపై, స్థూలదేహముపై, దాని వయస్సు, బరువు, రంగు, జాట్టు మొదలగు వాటిపై తమ మానసిక ధారణలు ఆధారంగా నిర్ణయాలను చేస్తారు. మానవుడు ఈ విధముగా తనను తాను అంచనా వేసుకొనుటయే గాక, ఇతరుల గుణదోషములను కూడా వివేచన చేసి తీర్పు చెప్తూ ఉంటాడు. ఇది చాలా భ్రాంతి; నిస్సందేహముగా దోషము. ఈ దృఢమగు భ్రాంతిని సరిదిద్దుటకు చాల సమయము పట్టును.

ప్రతి క్షేత్రములో భ్రాంతి గలదు. మానవులకు తమ గురించి, జగత్తు గురించి గల ధారణలు పూర్తిగా తప్పు. కావున, సంపూర్ణ విప్లవము రావాలి. ముందుగా మనము వ్యావహారిక విషయముల నన్నిటినీ సరియగు క్రమంలో అమర్చుకోవాలి. తరువాత, ఇవి అన్నియూ మన తీర్పులే ననియు, ఆత్మను ఇతరాపేక్షయా అంచనా వేయరాదనియు మనము చెప్తాము. ఆత్మను మనము గుర్తించాలి. ఈ గుర్తింపు జ్ఞానమే గాని, తీర్పు కాదు.

ఆత్మయొక్క స్వరూపమును కేవలము ఉన్నది ఉన్నట్లుగా గుర్తించుటయే ఈ జ్ఞానము. కావున, ఈ వేదాంత దర్శనము పూర్తిగా విపరీత ధారణలను సరియగు దిశలోనికి త్రిప్పే కార్యక్రమము, అని చెప్పవచ్చును. మన గురించి మనము కొన్ని ధారణలను నమ్ముతూ, మనలను మనమే సమ్మోహితము చేసుకున్నాము. ఈ ఆత్మ సంమోహనము (self-hypnosis)ను మోహనివృత్తి (de-hypnosis) చేసి తొలగించుకోవాలి. ఈ మోహనివృత్తి ప్రక్రియలోని చరమాంకములో 'నేను అపరిచ్ఛిన్నుడను, పూర్ణుడను, సచ్చిదానంద స్వరూపుడను' అను సాక్షాత్కారము కలుగును.

యోగులందరిలో జ్ఞాని శ్రేష్ఠుడు

జ్ఞాన విజ్ఞాన తృప్తాత్ముడు, సమబుద్ధి యగు జ్ఞాని ఇతరుల గురించి తీర్పునీయడు గనుక, అతడు యోగులందరిలో శ్రేష్ఠుడు (విశిష్యతే) అనే మాన్యతను పొందినాడు. ఈ ప్రకరణములోని 'విశిష్యతే' అను పదమును సరిగా తెలుసుకోవాలి.

ఇంకనూ జ్ఞానము లభించని వారిలో ఈ సూక్ష్మదృష్టి, అవగాహన వివిధ స్థాయిలలో నుండును. కాని, జ్ఞానము లభించిన వారిలో ఇట్టి భేదమేమియూ లేదు. కావున, వాస్తవంలో మనము ఇచట చర్చిస్తున్న జ్ఞాన విజ్ఞాన తృప్తాత్ముడగు జ్ఞానిని ఇతరులతో పోల్చజాలము. కాని, జ్ఞాన విజ్ఞాన తృప్తాత్ముని నిరూపించే ఒక నమూనాను శ్రీకృష్ణుడు 'సమబుద్ధిః' అను పదములో ప్రదర్శించినాడు. ఈ నమూనా దృష్ట్యా జ్ఞానికి ఇతరులతో ఏదోరకంగా పోలికను చెప్పవచ్చును. ఈ వ్యక్తులందరి

విషయంలో సమమగు ప్రకృతితో కూడిన బుద్ధి గల (సమబుద్ధిః) జ్ఞాని అందరిలో శ్రేష్ఠుడని (విశిష్యతే) ఈ శ్లోకములో చెప్పబడెను.

ఇచట మరియొక రకముగా కూడ వ్యాఖ్యానించవచ్చును. శ్రీ శంకరుల కాలములో గ్రంథములన్నియూ తాటియాకులపై చేతితో వ్రాయబడి ఉండెడివి. శ్రీ శంకరులు తాము చూచిన ప్రతిలో 'విశిష్యతే' అను పదమును 'విముచ్యతే' అని అనుకొని యుండవచ్చును. లేదా, ఆ ప్రతిలో 'విముచ్యతే' అనియే ఉండవచ్చును. 'విముచ్యతే' అను పక్షములో, వివిధ రకముల వ్యక్తుల విషయములో సమానమగు దర్శనము కల వ్యక్తి ముక్తుడగును అను యర్థము వచ్చును. అవుడైననూ, ఇట్టి ముక్తుడు యోగులందరిలో శ్రేష్ఠుడే గనుక, అర్థము సమానమే యగును.

ఈ శ్లోకము, దీని పూర్వ శ్లోకము ఈ జ్ఞానము వలన లభించు ప్రయోజనమును వివరించినవి. ఈ జ్ఞానము గల వ్యక్తి యోగులందరిలో శ్రేష్ఠుడు; మరియు సర్వోత్కృష్టమగు ఉపలబ్ధి (accomplishment) గలవాడు. అతనికి బ్రహ్మనిష్ఠుడని పేరు. అనగా, ఆత్మాభిన్నమగు బ్రహ్మమును యెరింగినవాడు అని యర్థము. ఈ మహాఫలము ఈ అధ్యాయములో ప్రముఖముగా వర్ణింపబడినది.

కర్తవ్యమేమి?

సమబుద్ధి స్థాయిని పొందాలంటే, అభద్రత నుండి విముక్తి (మోక్షము)ని పొందాలంటే, మానవుడు కర్మయోగ, ధ్యానయోగములనే ద్వివిధ సాధనములను అనుష్ఠించాలి. కర్మ విషయములో వ్యక్తి యొక్క మానసిక ప్రవృత్తి కర్మయోగమనబడునని మన మిదివరలో చూచియున్నాము. తరువాతి శ్లోకము ధ్యానయోగమును వివరించుచున్నది:

అధ్యాయము 6, శ్లోకము 10:

योगी युञ्जीत सततमात्मानं रहसि स्थितः ।
एकाकी यतचित्तात्मा निराशीरपरिग्रहः ॥ १० ॥

యోగీ యుంజీత సతత మాత్మానం రహసి స్థితః
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీరపరిగ్రహః (10)

యోగీ = ధ్యానయోగి; **సతతం** = ఎల్లవేళలా, **రహసి** = ప్రశాంతమగు స్థలమునందు; **స్థితః** = ఉన్నవాడై; **ఏకాకీ** = ఒంటరియై; **యతచిత్తాత్మా** = ఉద్వేగరహితములైన దేహము, మనస్సు గలవాడై; **నిరాశీః** = కామనలు లేనివాడై; **అపరిగ్రహః** = వస్తు సంగ్రహము లేనివాడై; **ఆత్మానం** = మనస్సును; **యుంజీత** = (ధ్యేయవస్తువునందు) లగ్నము చేయవలెను.

> ధ్యానయోగి ఎల్లవేళలా ప్రశాంతమగు స్థలము నందున్నవాడై, ఒంటరిగా, ఉద్వేగ – రహితములైన దేహము, మనస్సు గలవాడై, కామనలు లేనివాడై, వస్తు సంగ్రహము లేనివాడై, మనస్సును (ధ్యేయ వస్తువు నందు) లగ్నము చేయవలెను (10).

ఈ శ్లోకములో 'యోగీ' అను పదమునకు అనేక విశేషణములు గలవు. యోగి నిరంతరముగా ఆత్మను ధ్యానించును. యోగీ అనగా ధ్యానము చేయువాడు (ధ్యాయీ). అతడు తన మనస్సును ధ్యేయవస్తువుపై లగ్నము చేసి, దానితో ఏకము చేయాలని భగవానుడు సలహాను ఇచ్చుచున్నాడు. ఈ ధ్యేయవస్తువు తరువాత చెప్పబడును.

యోగి సర్వదా తన మనస్సును ధ్యేయవస్తువుపై నిలిపి ఉంచవలెనని శ్రీకృష్ణుడు సామాన్యాకారముగా సలహాను ఇచ్చుచున్నాడు. 'సతతమ్' అనగా ఎల్లవేళలా అని అర్థము గలదు. శాశ్వత కాలము అనికూడ అర్థము గలదు. కాని, ప్రకరణమునకు అనురూపమైన అర్థమును స్వీకరించవలెను. ఈ శ్లోకములో 'సతతమ్' అనగా, యోగి వీలైనన్ని పర్యాయములు, ప్రతి పర్యాయములో వీలైనంత సమయము ధ్యానమును చేయవలెనని తాత్పర్యము.

ధ్యానమునకు తోడు అవశ్యకము కాదు

ధ్యానమును ఎట్టి స్థలములో చేయవలెను? రహస్యస్థలములో (రహసి) అనగా, ప్రశాంతమగు స్థలములో చేయాలి. శ్రీ శంకరుల కాలములో పర్వత శిఖరము లేక గుహ ప్రశాంత స్థలముగా పరిగణింపబడెడిది. అందువలననే, 'రహసి స్థితః' అను శ్రీకృష్ణుని పదములను 'పర్వతమునందు, లేక గుహయందు ఉన్నవాడై (గిరిగుహాదౌ స్థితః)' అని శ్రీ శంకరులు వ్యాఖ్యానించిరి. మనము ప్రశాంత స్థలమునకు వెళ్లే సందర్భాలలో మరి కొందరిని తోడుగా తీసుకువెళ్లే అవకాశము గలదు. ఇందువలననే, ధ్యానమును చేయు యోగి ఏకాకియై ఉండాలని శ్రీకృష్ణుడు చెప్పెను. ఏకాకి యనగా తోడు లేని వాడు (అసహాయః) అని శ్రీ శంకరులు వివరించిరి. ధ్యానమునకు తోడు అవశ్యకము

కాదు. ధ్యానము ఇతరుల సహాయ సహకారములతో చేసే కర్మ కాదు. ధ్యానమునకు సేవకుడు గాని, సహాయకుడు గాని, నాటకములో వలె ద్వితీయ పాత్రధారి గాని, చిత్తం అనేవాడు గాని అవశ్యకము కాదు.

ధ్యానమును చేయునప్పుడు మిత్రునితో సహా మరెవ్వరూ ప్రక్కన ఉండవని లేదు. ధ్యానమనగా వ్యక్తి తనలో తాను ప్రశాంతముగా చేయు కర్మ. దానిలో వ్యక్తి తనకు తానే మిత్రుడు, తనకు తానే బంధువు. మనమీ విషయమును ఇదే అధ్యాయములో చూచియున్నాము.*

శ్రీ శంకరులు సన్న్యాస, జ్ఞాన శబ్దములను పర్యాయపదములుగా స్వీకరించిరి. 'ఏకాకీ' అను పదము సన్న్యాసిని నిర్దేశించునని వారి అభిప్రాయము. అందువలననే, 'ఏకాకీ' యనగా 'అసహాయః (సహాయము, లేక తోడు లేనివాడు)' అని వ్యాఖ్యానించిరి. సహాయ శబ్దమునకు భార్య అని కూడ అర్థము గలదు. ఇచట యోగి శబ్ద వాచ్యుడగు సన్న్యాసి భార్యను వదలియుండుట సహజమే గదా! 'అసహాయః' మొదలగు విధులు మనకు మార్గమును నిర్దేశించుటకై ఉద్దేశింపబడినవే గాని, జవదాట వీలు లేని కఠోర నియమములు కావు. కావున, మనము వాటి తాత్పర్యమును గ్రహించి, యథావసరముగా మార్పు చేసి స్వీకరించవచ్చును. పైగా, ఇల్లు, భార్య, పిల్లలు–వీరికి దూరంగా ప్రశాంతమైన స్థలము సన్న్యసించనిచో ఎట్లు లభించును?

సన్న్యాసి కాని వ్యక్తి ఇంటివద్దనే ఉండి, తన కర్తవ్యముల నాచరించవలెను. ఇంటిని, ఇంటిలోని వారిని విడువకుండగా ఇంటివద్దనే ఉండే వ్యక్తిని 'గృహస్థుడు' అంటారు. గృహము అనగా ఇల్లు. వివాహితులు అందరూ, ఇంట్లో ఉన్నా, పెద్దకారులో జీవించినా, గృహస్థులే అనబడతారు. ఇతర పదములన్నింటివలె, గృహస్థ పదము కూడా సంప్రదాయము నుండి పుట్టినది. ఉద్యోగము చేయు వ్యక్తి సదా ఇంట్లో ఉండలేడు. అయినా అతడు గృహస్థుడే. ఈ గృహస్థ పదము వ్యక్తి అనుష్ఠించవలసిన కొన్ని విధులను నిర్దేశిస్తుంది. కావున వ్యక్తి ఈ విధులను త్యజించనంత వరకు గృహస్థుడని పిలువబడును. అతడు ఎక్కడ ఉన్నా, ఇంటిలో ఉన్నట్లుగనే పరిగణింపబడును.

గృహస్థాశ్రమమునకు ఆధారము సన్న్యాసము మాత్రమే

మానవ జీవితములోని నాల్గు ఆశ్రమములలో గృహస్థ జీవితము ఒకటి యని మనము చూచియున్నాము. మొదటిది బ్రహ్మచర్యము. రెండవది గృహస్థ జీవితము. ఇది చాల ప్రముఖమైనది.

---

* తనను తానే ఉద్ధరించుకోవాలి ... తనకు తానే మిత్రుడు (ఉద్ధరేదాత్మనాత్మానం .... ఆత్మైవ హ్యాత్మనో బంధుః), 6–5.

ఏలయన, ఈ ఆశ్రమములో మూడవది యగు వానప్రస్థ ఆశ్రమమునకు, నాల్గవది యగు సన్న్యాసమునకు కావలసిన మానసిక సంసిద్ధత నిర్మాణమగును. వ్యక్తి గృహస్థ జీవితమును త్యజించి, సన్న్యాసి యగును. కావున, 'ఇంటిలో నుండు వాడు' అను అర్థము నిచ్చే గృహస్థ పదము సన్న్యాసి దృష్ట్యా మాత్రమే అర్థవంతమగును. వ్యక్తి గృహమును వీడి సన్న్యాసి యగుటలో విడాకులు అనే ప్రసక్తి లేశమైననూ లేదు. ఇంకొక యువతిని వివాహమాడే కోరిక గల వ్యక్తి తన భార్యకు విడాకులిచ్చును. దీనిలో త్యాగము లేశమైననూ లేదు. అది కేవలము భగ్నాశ మాత్రమే. సన్న్యాసమనగా వ్యక్తి యొక్క మస్తిష్కము గృహస్థ జీవనమునకు అతీతముగా పరిణతి చెందుట. అట్టి స్థితిలో వివాహము యొక్క ప్రయోజనము పూర్తి యగును. భార్యా భర్త లిద్దరిలో ఒకరికి మరియొకరి అవసరము ఉండదు. వారిద్దరు సన్న్యాసులే. కావున, అతడు గృహమును వీడి వెళ్లిపోవును. ఆమె ఉన్నచోటనే ఉండును. ఆమెకు రక్షణ ఉండుననుటలో సందేహము లేదు. ఆమె కూడా సాధువు వలెనే జీవించును. ఆమెకు గృహమే ఆశ్రమమగును.

కావున, గృహస్థ పదము సన్న్యాసాపేక్షయా అర్థవంతమగును. గృహస్థుని చరమ లక్ష్యము సన్న్యాసము. సన్న్యాసము ఒకానొక వికల్పము కాదు. అది చరమ లక్ష్యము. ప్రశాంత స్థలములో ఏకాకియై ఉన్న వ్యక్తికి యోగి యొక్క లక్షణములున్నచో, అతడు నిరంతరముగా ధ్యానమగ్నుడై ఉండగల్గును. ఇల్లు, ఇల్లాలు, పిల్లలు గల వ్యక్తి అట్లు చేయలేడు. కావున, ఇచట శ్రీకృష్ణుడు సన్న్యాసిని గురించి వివరించుచున్నాడని శ్రీ శంకరులు వ్యాఖ్యానించిరి. భగవానుడు ముందుగా కర్మయోగిని గురించి మాటలాడి, ఇవుడు సన్న్యాసియై ధ్యానమయ జీవితమును గడిపే ధ్యానయోగిని గురించి వివరించుచున్నాడు.

శ్రీకృష్ణుడు ధ్యానయోగిని 'యతచిత్తాత్మా' అను మరియొక విశేషణముతో వర్ణించినాడు. చిత్తము అనగా స్మృతి. కాని, ఇచట చిత్త శబ్దము అంతఃకరణము అనే సామాన్యార్థములో వాడబడినది. స్మృతి కూడా దానిలో అంతర్భాగమే. సాధారణంగా, ధ్యానమును భగ్నము చేయు వాటిలో ప్రముఖమైనది స్మృతి. ధ్యానములో కూడా మనస్సు పనిచేస్తూనే ఉంటుంది. ఏదేని శబ్దము పుట్టినచో, ధ్యానము చేయుచున్న వానికి అది నిశ్చితముగా వినపడును. కావుననే, ధ్యానములో జ్ఞానేంద్రియములను వీలైనంత వరకు ఉపసంహరించవలెను. ఉదాహరణకు, కళ్లను మూసుకున్నచో, ధ్యేయవస్తువుపై మనస్సు సులభముగా లగ్నమగును. అట్టి స్థితిలో, ధ్యానమునకు భంగమును కలిగించునది యేది గలదు? భూత కాలీన స్మృతులు (చిత్తము) ధ్యానమును చెడగొట్టును. అందువలననే, ఇచట చిత్త శబ్దము ప్రయోగింపబడినది.

యత చిత్తాత్మా అను సమాసములో చిత్త శబ్దము అంతఃకరణమును నిర్దేశించును. కావున, ఆత్మ యనగా స్థూలదేహము అను అర్థమును చెప్పవలెను. కావున, మనస్సును, దేహమును నియంత్రించి, తన అధీనములో ఉంచుకున్న వ్యక్తి యత చిత్తాత్మా అనబడును. అట్టి వాని దేహము పూర్తిగా ఆరామమును పొంది, మనస్సు ధ్యేయము నందు లగ్నమగును. అట్టి వ్యక్తి తనకు గల సమస్యలను పరిష్కరించుకొని యుండును. అది కూడా ధ్యానమునకు అంగమగును. ఈ విధంగా, యత చిత్తాత్మా అను పదము యోగికి నామధేయము, విశేషణము కూడా అగును. ఇట్టి యోగి తన దేహమును పూర్తిగా విశ్రాంతావస్థలో నుంచుకొనును. మనస్సులో ఏదేని విక్షేపము కలిగిననూ, దానిని మరల ధ్యేయము వైపునకు మరల్చును. ఈ విషయమును శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకాలలో వివరిస్తాడు.

కోర్కెల నుండి విముక్తి ధ్యానమునకు అవశ్యకము

మరియు, కోర్కెలనుండి విముక్తి చెందిన వ్యక్తి (నిరాశీః) మాత్రమే ధ్యానములో కూర్చుండగల్గును. ధ్యానములోకూర్చోవాలంటే, అంతరంగములో ఒత్తిడులు ఏమీ ఉండరాదు. ఒత్తిడులు ఉంటే, కూర్చుండుటయే సంభవము కాదు. కోర్కెలు అంతరంగమునందు ఒత్తిడిని సృష్టించును. కోర్కెలన్నియూ తొలగిపోయిన వ్యక్తికి 'నిరాశీః' అని పేరు. మనము కళ్లను మూసుకుంటాము. కాని, మనస్సులో కోర్కెలు ఉంటాయి. అట్టి స్థితిలో ప్రశాంతముగా కూర్చుండుట అటుంచి, కళ్లు మూసుకొనుట కూడా కష్టమే యగును. కొద్ది క్షణాలలోనే అంతరంగములో చికాకు, క్షోభ ఆరంభమగును. కళ్లు మూసుకోగానే, మనస్సులోని కోర్కెలన్నీ ఉప్పొంగుతాయి. ఇంతకంటె కళ్లు తెరుచుటయే మేలు. కళ్లు ఏవో వస్తువులను చూస్తూ ఉంటే, మనస్సు వాటికి కట్టుబడి ఉంటుంది. మనస్సునకు ఒక దిశ లభిస్తుంది. కాని, కళ్లు మూసుకుంటే, ప్రపంచమంతా లోపల సాక్షాత్కరిస్తుంది. కోర్కెలు సృష్టించే సంక్షోభము వలన మనము స్థిరముగా కూర్చుండజాలము.

కాని 'నిరాశీః' యగు యోగి కామనలు లేనివాడై, వీతరాగుడై ఉండును. అతడు తనలో తాను సంతుష్టుడై ఉల్లాసముగా నుండును. కర్మయోగ జీవనమును గడిపే వ్యక్తి మాత్రమే ధ్యానయోగి కాగల్గును. కనుకనే, శ్రీకృష్ణుడు ఈ గుణమును ఇక్కడ ప్రస్తావించెను. శ్రీ శంకరులు తమ భాష్యములో ఈ గుణములు సన్న్యాసికి వర్తించునని వ్యాఖ్యానించిరి.

అపరిగ్రహమనగా నేమి?

శ్రీకృష్ణుడు ఆఖరుగా ధ్యానయోగిని 'అపరిగ్రహీ' అని వర్ణించెను. అనగా, వస్తు సంచయనము లేనివాడు అని యర్థము. పరిగ్రహమనగా వస్తువులను ప్రోగుచేయుట, లేదా గుప్త సంచయనము. ఇది ఒక పెద్ద సమస్య. వాస్తవంలో ఇది ఒక రోగము. ఇది కొద్దో, గొప్పో అందరిలోనూ గలదు. ప్రోగుచేసిన వస్తువులను ఇచ్చివేయుట చాల కష్టము. కాన, మానవులు నిరంతరము ప్రోగుచేస్తూ ఉంటారు. ఒకచో, కొన్ని వస్తువులను ఇచ్చివేసినా, మానవులు సంచయనమును కొనసాగిస్తారు. వస్తువులను ఇచ్చివేసే ఈ శీలమును నిలబెట్టుకొని, మానవుడు వస్తువులపై ఆధిపత్యము కలవాడు కావాలి. ఈ సత్యమును తెలుసుకొని జాగ్రత్తపడే వ్యక్తికి 'అపరిగ్రహీ' అనబడును.

సన్న్యాసి వస్తువులను ప్రోగుచేయడు గదా! కాన, ఈ విశేషణము సన్న్యాసికి ఎట్లు వర్తించును? అను శంకను శ్రీ శంకరులు లేవనెత్తి, సమాధానము నిచ్చిరి. సన్న్యాసికి కూడా ఈ ప్రోగుచేయు లక్షణము ఉండవచ్చును. అందరినీ వీడి ఒంటరిగా ఉండే సన్న్యాసి కూడా వస్తు పరిగ్రహమును కొనసాగించుటకు అవకాశము గలదు. కావున, ఈ ప్రోగుచేసే లక్షణమునకు సాధకుడు దూరంగా ఉండాలి. తన వద్దకు చేరు వస్తువులను నిరంతరముగా ఎవరికో ఒకరికి ఇచ్చుచున్నచో, ఈ పరిగ్రహ దోషము దూరమగును.

'అపరిగ్రహీ' అను పదము చాల గంభీరమైనది. వస్తువులను ప్రోగుచేయకుండుట అని మాత్రమే గాక, వస్తువులను ప్రోగుచేయాలనే కోరిక లేకుండుట అను అర్థము కూడ ఈ పదమునకు గలదు. పరిగ్రహము సంసారికి సామాన్య లక్షణము. సన్న్యాసికి పాత అలవాటు. ఈ లక్షణము సన్న్యాసిలో ఇంకనూ మిగిలి ఉండే అవకాశము గలదు. కావున, సన్న్యాసి ప్రయత్నపూర్వకముగా, నిరంతరముగా ఈ అపరిగ్రహ స్థాయిని నిలబెట్టుకొనవలెను.

అవశ్యకమగు అర్హతలన్నీ గల వ్యక్తి తన మనస్సును ధ్యేయవస్తువుతో ఐక్యము చేయవలెను (ఆత్మానం యుంజీత). అనగా, ధ్యానమును చేయవలెను. శ్రీకృష్ణుని ఈ ఉపదేశము సన్న్యాసిని ఉద్దేశించి చేసినదిగా కనబడును. కాని, మానవులందరూ వాస్తవంలో ఏకాకులే గనుక, ఈ ఉపదేశము మానవులందరికీ వర్తిస్తుంది. ఇల్లు, ఇల్లాలు, పిల్లలు గల వ్యక్తి కూడా, కనీసము కళ్లను మూసుకున్నప్పుడైనా, ఏకాకియే గదా! వ్యక్తి తన బాధ్యతల నుండి, తాను పోషించే భూమికల నుండి కొద్దిసేపు విముక్తిని పొందితే, అతడు ఏకాకి అవుతాడు. అట్లుగాక, తాను పోషించే తండ్రి/ తల్లి, లేదా కుమారుడు/ కుమార్తెల పాత్రను గురించి ఆలోచిస్తూ ఉండే వ్యక్తి ఏకాకి కాడు. ఈ పాత్రలు, ఈ

వ్యక్తులు అన్నీ మానవుని అంతరంగములోనే ఉన్నాయా అనిపిస్తుంది. కావున, వ్యక్తి ధ్యానసమయములో తాను పోషించు భూమికలను, వాటి సమస్యలను త్రోసిపుచ్చి, ఏకాకి కావాలి. వ్యక్తి తన వ్యక్తిత్వంపై కప్పుకున్న భూమికలనన్నిటినీ ఒలిచివేసి తనంత తానుగా ఉండాలి. అట్టి సరళమైన వ్యక్తిత్వము ఎల్లా ఉన్నా పరవాలేదు. అట్టి సరళమైన, ధ్యానము చేయు వ్యక్తి ఏకాకి, ధ్యాయి, యోగి అనబడును.

ధ్యానమునకు ఒక విశిష్ట అనుశాసనము అవశ్యకము

ఈ ధ్యానము నందు సిద్ధిని పొందాలని కాంక్షించే వ్యక్తి పాలించవలసిన నియమములు ఈ అధ్యాయములోని తరువాతి భాగములో, కూర్చుండవలసిన స్థలము, ఆసనములతో మొదలిడి వివరించబడినవి. ఈ భాగములో ధ్యానమును అభ్యసించు వ్యక్తి యొక్క ఆహారపు టలవాట్లను శ్రీకృష్ణుడు వర్ణించెను. ఆహారమును అతి తక్కువగా భుజించు వానికి యోగము సిద్ధించదు. అధికముగా తినువానికి కూడ యోగము దూరమగును. వాస్తవంలో వారిద్దరికి లభించేది రోగమే గాని, యోగము కాదు. యోగాభ్యాసమునకు, ధ్యానమునకు అనురూపమైన ఇతర ప్రవృత్తి (విహారము) నియమములు కూడ ఈ భాగములో శ్రీకృష్ణునిచే చెప్పబడినవి.

ధ్యానము వలన మనస్సులో నిశ్చలత, స్పష్టత పెంపొందును. వాటి వలన జ్ఞానము ఉదయించును. కాని, ధ్యానము సిద్ధించుటకు ఒక విశిష్ట అనుశాసనము అవశ్యకమగును. ఈ అనుశాసనము ధ్యానమునకు సాధనమై, పరంపరయా జ్ఞానములో సహకరించును. ఆరవ అధ్యాయములో ఈ ప్రకరణములో మిగిలిన భాగములో ధ్యానయోగ సాధనమైన అనుశాసనము, దాని ఫలములు వర్ణించబడినవి.

అధ్యాయము 6, శ్లోకములు 11, 12

शुचौ देशे प्रतिष्ठाप्य स्थिरमासनमात्मनः ।
नात्युच्छ्रितं नाति नीचं चैलाजिनकुशोत्तरम् ॥ ११॥

तत्रैकाग्रं मनः कृत्वा यतचित्तेन्द्रियक्रियः ।
उपविश्यासने युंज्याद्योगमात्म विशुद्धये ॥ १२ ॥

శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసనమాత్మనః
నాత్యుచ్ఛ్రితం నాతినీచం చైలాజినకుశోత్తరమ్ (11)

తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియ క్రియః
ఉపవిశ్యాసనే యుంజ్యాద్యోగమాత్మ విశుద్ధయే (12)

శుచౌ = పరిశుభ్రమైన; **దేశే** = స్థానమునందు; **నాత్యుచ్ఛ్రితం** = మిక్కిలి ఎత్తు కానట్టియు; **నాతి నీచం** = మిక్కిలి లోతు కానట్టియు; **చైల – అజిన – కుశ – ఉత్తరమ్** = మెత్తని వస్త్రము, మృగచర్మము, దర్భచాపలను విలోమక్రమములో ఒకదానిపై ఒకటి కలిగియున్న; **స్థిరం** = స్థిరమైన; **ఆసనం** = ఆసనమును; **ఆత్మనః** = తనకు; **ప్రతిష్ఠాప్య** = స్థాపించుకొని.

తత్ర = ఆ; **ఆసనే** = ఆసనము నందు; **ఉపవిశ్య** = కూర్చుండి; **మనః** = మనస్సును; **ఏకాగ్రం** = ధ్యేయ వస్తువునందు లగ్నమగునట్లు; **కృత్వా** = చేసి; **యత–చిత్త–ఇంద్రియ–క్రియః** = మనస్సు యొక్క, ఇంద్రియముల యొక్క వ్యాపారములను నియంత్రించినవాడై; **ఆత్మ విశుద్ధయే** = అంతరంగ పరిశుద్ధి కొరకు; **యోగం** = ధ్యాన యోగమును; **యుంజ్యాత్** = అభ్యసించవలెను.

> పరిశుభ్రమైన స్థానము నందు మిక్కిలి ఎత్తు కానట్టియు, మిక్కిలి లోతు కానట్టియు, మెత్తని వస్త్రము, మృగచర్మము, దర్భచాపలను విలోమ క్రమములో కలిగియున్న స్థిరమైన స్వీయ ఆసనమును స్థాపించుకొని, (11)
>
> ఆ ఆసనము నందు కూర్చుండి మనస్సును ధ్యేయవస్తువు నందు లగ్నమగునట్లుచేసి, మనస్సు యొక్క, ఇంద్రియము యొక్క వ్యాపారములను నియంత్రించిన వాడై, అంతరంగ పరిశుద్ధి కొరకు ధ్యానయోగమును అభ్యసించవలెను (12).

ధ్యానయోగి కూర్చుండు పీఠము ఆసనమనబడును*. కూర్చుండే పద్ధతికి కూడా ఆసనమని పేరు గలదు. దీనిని శ్రీకృష్ణుడు తరువాత చెప్తాడు. 'శుచౌ దేశే' అనగా 'పరిశుద్ధమైన స్థానము నందు' అని యర్థము. గేరేజి వంటి చోటు ధ్యానమునకు యోగ్యము కాదు. ఒకాయన ఇల్లు కొన్నాడు. దానికి గేరేజి ఉంది. కాని, ఆయనకు కారు లేదు. కాన, గేరేజిలో ధ్యానము చేసుకొనవచ్చునని ఆయన భావిస్తే, అది సరిగాదు.

---

* ఆస్యతే అస్మిన్నితి ఆసనమ్. మనము దీనిపై కూర్చుంటాము. కాన, దీనికి ఆసనము అని పేరు.

ధ్యానము చేయు స్థానము శుద్ధముగా నుండాలి. మనము చేయు కర్మలన్నింటికి యోగ్యమగు స్థానము ఉండాలి. ధ్యానము విషయంలో కూడా అంతే. స్థానము స్ఫూర్తిదాయకముగా నుండాలి. స్ఫూర్తి లేకపోయినా, కనీసము శుచిగానైనా ఉండాలి. శ్రీకృష్ణుడు ధ్యానయోగ్యమగు స్థానమును 'శుచౌ దేశే' అని వర్ణించగా, శ్రీ శంకరులు స్థానము ఏకాంతముగా నుండవలెను అని బోధించిరి (వివిక్త).

నదీతీరము, పర్వతము, లేదా అడవి పరిసరములు శుచిగా, వివిక్తంగా ఉంటాయని భావిస్తారు. ఆ స్థానాలలో జనసమ్మర్దము ఉండదు. పరిసరములు స్ఫూర్తిదాయకముగా నుండును. సాధకుని ధ్యానమునకు భంగము కలిగించే పరిస్థితులు లేని స్థలము ధ్యానమునకు అనురూపముగా నుండును. పైన చెప్పిన స్థలములలో సాధకుడు ప్రకృతిని పరిశీలిస్తూ, ఆత్మావలోకనములో సమయమును గడుపగల్గును. సాధకుడు అన్నివేళలా కళ్లుమూసుకుని ధ్యానమును చేయబని లేదు. ప్రకృతిని పరిశీలిస్తూ కూడా ధ్యానించుట సంభవమే.

'నేను ధ్యానము చేయాలి. కాన, నేను పర్వత ప్రదేశమునకు గాని, నదీతీరమునకు గాని వెళ్లాలి' అని సాధకుడు నిర్ణయించుకోవాలని చెప్పుట ఇచటి తాత్పర్యము కాదు. సాధకుడు తాను ఉండే చోటును శుభ్రము చేసుకొని, అచటనే ప్రశాంతముగా కూర్చుండి ధ్యానమును సాగించవచ్చును. అయితే, ఆ స్థలములో ఇతరులు ఉన్నచో, వారిని దూరముగా తరిమివేయాలా? అక్కరలేదు. అట్లు చేయుట సంభవము కాదు గదా! గృహములోని ఇతర వ్యక్తులకు సాధకుని జీవితములో ప్రముఖస్థానము ఉండును. అయితే, ధ్యానము చేయుట ఎట్లు కుదురును?

ఇంట్లో ఒక మూల ఏకాంతములో ధ్యానము సంభవమే

తెల్లవారు జామున ఇంట్లోని ఇతరులు నిద్రించుచుండగా, పరిసరములు ధ్యానమునకు అనుకూలముగా నుండును. అందరు నిద్రిస్తూండగా, సాధకునకు ధ్యానయోగ్యమగు ఏకాంతము సులభమగును. కాన, ఆ సమయము ధ్యానమునకు చాల అనుకూలము. ఇంటిలోని ఇతరులు అదే సమయంలో ధ్యానం చేయాలనుకుంటే సమస్యయే. స్నానాల గది వద్ద రద్దీ పెరుగుతుంది. కావున, సాధకుడు వారందరి కంటె ఇంకా ముందు లేవాలి. అపుడు ఏకాంత వాతావరణము లభించును. ప్రశాంతముగా నుండే మూల ఏదో ఒకటి తప్పక లభిస్తుంది. ఒకచో, ఇంట్లో అన్ని వేళలా గొడవగా ఉంటే, సమీపములో నున్న ఉద్యానమునకు వెళ్లి ధ్యానము చేయవచ్చును.

ఎవరి ఆసనమును వారే అమర్చుకోవాలి అని శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు. అనగా, ఆసనముపై మమకారమును పెంచుకొమ్మని శ్రీకృష్ణుని తాత్పర్యము కాదు. ప్రాధాన్యము ఆసనమునకు కాదు. ఆసనము ధ్యానానురూపముగా ఉండాలి అను అంశమునకు మాత్రమే ప్రాధాన్యము గలదు. ఉదాహరణకు, ఆసనము ఇటునటు ఊగకుండగా స్థిరముగా ఉండాలి. కుర్చీ, పీట మొదలగు స్థిరముగా నుండు ఆసనమును ఉపయోగించవచ్చును. ఆసనము బాగా ఎత్తున ఉండరాదు (న అత్యుచ్ఛ్రితమ్). ఎత్తు ఎక్కువ అయితే, క్రిందపడే అవకాశము ఉండును. గొయ్యి, పల్లము మొదలగు స్థలము (న అతినీచమ్) కూడ ధ్యానమునకు అనుకూలము కాదు. మరియు, నేలపై కూడ కూర్చుండరాదు. పల్లపు స్థలములో గాని, నేలపై గాని క్రిమికీటకములు, తేమ మొదలగునవి ధ్యానమునకు భగ్నకారులగును.

ధ్యానములో శరీరము పూర్తి విశ్రాంతిని పొందును. కాన, నిద్రపట్టే అవకాశము గలదు. ఆసనము బాగా ఎత్తుగా ఉంటే, సాధకునకు క్రిందపడతానేమో అనే భయము ఉండును. ధ్యానమునకు బదులుగా భయము చోటు చేసుకుంటుంది. 'భయపడరాదు' అనే భావన ధ్యానమునకు విఘ్నకారి యగును. అదే విధంగా, నేలపై కూర్చుంటే, ఇటు నటు పాకుతూ ఉండే పురుగులు కుడతాయేమో అను భయము తప్పదు. అడవిలో ఉండే మునులకు ఈ బెడద మరీ ఎక్కువ.

న అత్యుచ్ఛ్రితమ్, న అతినీచమ్ అను వాటిని ఇంకో రకంగా వ్యాఖ్యానించవచ్చును. ధ్యానము చేయాలంటే పర్వత శిఖరములకో భూగర్భములోని గుహలకో పోవాలని కొందరు భావిస్తారు. కాని, ఇచట శ్రీకృష్ణుడు ఈ రెండు వికల్పములను త్రోసిపుచ్చెను. గంగోత్రి మొదలగు స్థానములలో 10,000 అడుగుల యెత్తున ధ్యానము చేయు వ్యక్తికి మనస్సులో విక్షేపములేమియూ ఉండవనియు, అట్టి ఉన్నత స్థానములలో ధ్యానము సిద్ధించుననియు అనిపించును. ఇట్లు అనిపించుటకు కారణమేమనగా, అచట ప్రాణవాయువు (oxygen) తక్కువగా నుండుటచే, మస్తిష్కము పనిచేయదు. సంకల్పశక్తి గల మనస్సుతో ధ్యానమును చేయాలి. శక్తిని గోల్పోయిన మస్తిష్కముతో చేయు ధ్యానము వలన ప్రయోజనము శూన్యము.

మిక్కిలి ఎత్తైన ప్రదేశములకు పోయి, మస్తిష్కమును నిర్వీర్యపరచుట ధ్యానసిద్ధి కాబోదు. వాస్తవంలో, ఆ స్థితిలో చుట్టూ ఏమి జరుగుచున్నదో యను విషయము కూడ తెలియదు. ఇదే కారణముల వలన, బాగా లోతైనచోట ఆసనమును అమర్చుటలో గూడ సమస్యలు గలవు. భూమి లోతులలోని గుహలలో గొడవ ఏమియూ ఉండని మాట వాస్తవమే. కాని, ఇట్టి లోతైన ప్రదేశములలో

ప్రాణవాయు ప్రసారము చాల తక్కువగ నుండుటచే మస్తిష్కమునకు ఆలోచించే శక్తి తగ్గిపోతుంది. ఇందువలననే, ధ్యానము చేసే ఆసనము మిక్కిలి ఎత్తు (న అత్యుచ్ఛ్రితమ్) లో గాని, మిక్కిలి లోతు (న అతినీచమ్) లో గాని ఉండరాదని, అనగా పర్వత శిఖరము, భూగర్భము ధ్యానయోగ్యములు కావని, శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పినాడు.

సంప్రదాయ సిద్ధమైన ఆసనములోని వస్తువుల విశిష్టత

శ్రీకృష్ణుడు ఆసనమునకు 'చైలాజినకుశోత్తరమ్' అనే ఇంకొక అంతిమ విశేషణమును జోడించెను. చైలమనగా మెత్తని వస్త్రము. అజినము అనగా చర్మము. పూర్వకాలములో ఋషులు లేడిచర్మమును, లేక వ్యాఘ్ర చర్మమును వాడేవారు. కుశమనగా దర్భలతో చేసిన చాప. ఈ మూడు వస్తువులను అమర్చవలసిన క్రమమును నిర్దేశించే 'ఉత్తరమ్' అను పదముతో సమాసము పూర్తి అయినది. వస్తువులను చెప్పిన తరువాత, వాటిని అమర్చే క్రమము తెలియుట ఆవశ్యకము. ఏలయన వాటిని పలువిధములుగా అమర్చవచ్చును. ఉదాహరణకు, నేలపై మెత్తని వస్త్రమును, దానిపై చర్మమును, ఆపై దర్భల చాపను ఉంచినచో, అట్టి ఆసనముపై సాధకుడు కూర్చుండజాలడు. ఏలయన, దర్భచాపపై కూర్చుండుటలో చాల క్లేశము గలదని నేను మీకు నొక్కి చెప్పగలను. వరుస దీనికి విలోమముగా ఉండాలని శ్రీ శంకరులు నిరూపించినారు. నేలపై దర్భచాప, దానిపై చర్మము, దానిపై మెత్తని వస్త్రము ఉండాలి. 'చైలాజిన కుశోత్తరమ్' అను పదము ఈ క్రమమును దృఢీకరించును.

ఈ సంగతుల నన్నిటినీ వివరించు ఆవశ్యకత గలదు. తడి నేలపై కూర్చుండి ధ్యానమును చేయరాదు. పూర్వకాలములో గృహములలో మట్టినేల ఉండెడిది. ఆసన వితర్దికలను (seats) కూడ మట్టితో చేసెడివారు. ఈ మూడు వరుసల ఆసనము లేకుండగా, నేలపై కూర్చుని ధ్యానము చేసినచో, మూడు నెలల తరువాత మనస్సునకు సరియగు దిశలో ఏకాగ్రత లభించవచ్చును. కాని, కాళ్ళు వంగుట మానేస్తాయి. తడినేలపై చాలసేపు కూర్చున్నచో, మోకాళ్ళకు కీళ్ళవాతము వస్తుంది. కావుననే, తడినేల నుండి రక్షణ కొరకై దర్భచాప విధింపబడినది. దానిపై లేడి చర్మము వంటి లోమశ చర్మము నుంచుట వలన ఆసనము వెచ్చగా నుండును. ఆఖరుగా, సాధకుని చర్మమునకు దురద కలుగకుండుటకై దానిపై మెత్తని వస్త్రమును అమర్చవలెను.

ధ్యానానికి ఆసనము సమకూరాలంటే, లేడిని వెతికి పట్టుకోవాలి అనుకోరాదు. ఆ రోజుల్లో లేడి చర్మమును వాడేవారు. తరముగా లేడి చర్మమును వాడుటలో కారణము గలదు. లేడి మిక్కిలి పరిశుభ్రమైన జంతువు, ఇంకొక ప్రాణి ఎంగిలి చేసిన వస్తువును లేడి ముట్టదు. భారతీయ

సంస్కృతిలో కూడా ఇది అతి సాధారణమైన నియమము. మనము కొరికిన పదార్థమును మరియొకనికి ఈయము గదా! మరియొకరు ఎంగిలిచేసిన పదార్థమును తినే ప్రత్యేక పరిస్థితులు చాల అరుదు.

ఈశ్వరునకు నివేదించిన ఆహారమును తినవచ్చును. భగవానుడు తన నాలుకతో దానిని వాస్తవంగా స్పృశించడు గదా! కాన, దానిని తినుటలో సమస్య లేదు. ఇదే తీరున, శ్రాద్ధ క్రియలో పితృదేవతలకు బ్రాహ్మణుల రూపములో భావించి, ఆహారమును సమర్పించి, తచ్ఛేషమును భుజిస్తారు. పితృదేవతలను బ్రాహ్మణుల యందు ఆవాహన చేస్తారు. అపుడా బ్రాహ్మణులు పితృదేవతలకు ప్రతీకలై ఆహారమును భుజిస్తారు. ఈ సందర్భంలో కూడా, పితృదేవతలు ఆహారమును వాస్తవంగా స్పృశించరు. మరియు, భర్త భుజించిన పాత్రలో భార్య భుజించును. గురువు భుజించిన తరువాత తచ్ఛేషమును శిష్యుడు భుజించును. ఇతరుల ఎంగిలిని తినరాదనే నియమమునకు ఇవి మాత్రమే అపవాదములు.

ఈ లక్షణమును నేను జింకలో ప్రత్యక్షంగా చూసియున్నాను. ఒకనాడు నేను ఒక జింకల ఉద్యానమునకు వెళ్లినాను. నేను కొన్ని అరటిపళ్ళను జింకలకు ఈయగా, అవి వాటిని భక్షించినవి. అపుడు నేను మరియొక పండును నాలుకతో స్పృశించి, జింకకు దానిని ఈయగా, అది దానిని వాసన చూసి, వెనుకకు మరలిపోయెను. అమెరికాలోని జింకలు ఈ ఆహారనియమమును పాటిస్తాయో, లేదో నేను చెప్పజాలను. ఇది జింకల స్వభావమని నాకు తోచును. ఇట్టి శౌచము మాత్రమే గాక, జింక చర్మము బహుళలోమశమగుట వలన చాల మెత్తగా నుండును.

ఆసనమునకు ఉపయోగించే చర్మము విషయంలో ఇతర నియమములు కూడ గలవు. దానిని ఇతరుల నుండి దానముగా స్వీకరించరాదు. మరియు, జింకను చంపి చర్మమును సంపాదించరాదు. వేటగాళ్లు అడవిలో జింకను చంపి, ఆ చర్మమును సాధువులకు ఇచ్చెదరు. అది పనికిరాదు. అంటే, సాధువు సహజ మరణమును పొందిన జింక యొక్క చర్మమును మాత్రమే ఉపయోగించవలెను.

కూర్చునే ఆసనమును ఏర్పాటు చేసుకున్న తరువాత, సాధకుడు ఏమి చేయాలి? ఈ శ్లోకములోని క్రియాపదము 'యుంజ్యాత్'. అనగా అభ్యాసమును చేయవలెను. దేనిని అభ్యసించవలెను? ధ్యానయోగమును (యోగమ్). ఎందుకొరకు? మనస్సులో నిశ్చలత, శుద్ధి కలుగుట కొరకు(ఆత్మ విశుద్ధయే) మాత్రమే. ఇంకో ప్రయోజనము లేదు. మనస్సులో జ్ఞానోదయము కాకుండా అడ్డుపడుతున్న అవరోధములను తొలగించవలెను(అంతఃకరణ- ప్రతిబంధక-నివృత్తిః).

ఇది ధ్యానము వలన సాధ్యమగును. కావున, అంతఃకరణ విశుద్ధి కొరకై సాధకుడు ధ్యానమును చేయవలెను (యుంజ్యాద్యోగమాత్మ విశుద్ధయే) అని శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పెను.

పైన వర్ణించిన ఆసనముపై కూర్చుండి, సాధకుడు ధ్యేయ వస్తువుపై చిత్తమును లగ్నము చేయవలెను. దీనిని చేయుట ఎట్లు? మనస్సును ధ్యేయముపై ఏకాగ్రము చేయవలెను (ఏకాగ్రం మనః కృత్వా). 'అగ్ర' అనగా ఎదురుగా నున్నది. ఇచట ధ్యేయవస్తువు అగ్రమగును. ఆ ఒక్కదానియందు (ఏక) మాత్రమే మనస్సు లగ్నము కావలెను. అనగా, మనస్సును ధ్యేయవస్తువుపైకి మరల్చి, అచటనే తల్లీనము చేయవలెనని శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు.

ధ్యానమును చేయు వ్యక్తికి 'యతచిత్తేంద్రియ క్రియః' అను మరియొక విశేషణము గలదు. అనగా, మనస్సుపై, ఇంద్రియములపై, వాటి వివిధ వ్యాపారములపై నియంత్రణ కలవాడని యర్థము. మనమీ విశేషణమును అశ్రద్ధ చేయు అవకాశము గలదు. కావుననే, ఇది పదే పదే చెప్పబడినది. అనేక పర్యాయములు చెప్పబడిన ఈ విశేషణమును మనము ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించవలెను. స్వభావతః బాహ్య వస్తువుల యందు ప్రసరించే ఇంద్రియములను, మరియు మనస్సు యొక్క ఇతర వ్యాపారముల నన్నిటినీ ఉపసంహరించవలెను. ఇట్లు చేసిన వ్యక్తి 'యత చిత్తేంద్రియ క్రియః' అనబడును. ఇట్లు చేసి, సాధకుడు ధ్యానమునందు కూర్చుండవలెను (యోగం యుంజ్యాత్).

ధ్యాన ప్రయోజనము

ధ్యానమునకు ప్రయోజనమేమి? అంతఃకరణ శుద్ధి (ఆత్మ విశుద్ధయే). ఈ ప్రకరణములో ఆత్మ యనగా అంతఃకరణమే గాని, సచ్చిదానంద ఆత్మ కాదు. సచ్చిదానంద ఆత్మ నిత్య శుద్ధము గాన, దానికి శుద్ధి యొక్క అపేక్ష లేదు.

విశుద్ధి అనేక విధములుగ నున్నది. రాగద్వేషముల పట్టు నుండి విముక్తిని పొందుట ఒక రకము విశుద్ధి. ధ్యానములో మనస్సు ప్రశాంతముగా నున్నప్పుడు పాత జ్ఞాపకాలు (కషాయములు) అనుకోకుండా పైకి వస్తాయి. నీటి అడుగున ఉన్న జైవపదార్థములు (organic matter) కుళ్ళి, కొన్ని వాయు పదార్థములు పుట్టి, బుడగల రూపంలో నీటి ఉపరితలమునకు వచ్చును. ఈ పాత స్మృతులు అటువంటివి. సరస్సు ఒక క్షణంలో శుచిగా, ప్రసన్నముగా, నిశ్చలముగా నుండును. మనము పరిశీలిస్తూ ఉంటే, మరుక్షణంలో హఠాత్తుగా లోపలి నుండి బుడగలు పైకి తేలును. నీటిపైకి బుడగలు వచ్చుటకు కారణమేమి? నీటి లోపల ఏవో కొన్ని పదార్థములు ఉండుట వలననే బుడగలు వచ్చును.

ఇదే తీరున, ధ్యానములో మనస్సు ప్రశాంతమగును. అది మననాత్మకమగు ధ్యానము కావచ్చును; లేదా, ప్రార్థనా రూపమగు ధ్యానము కావచ్చును. ప్రార్థనా రూపమగు ధ్యానములో ధ్యేయము సగుణ బ్రహ్మ. మననాత్మకమగు ధ్యానము (విది ధ్యాసనము) లో నిర్గుణ బ్రహ్మ ధ్యేయము అగును. ఈ శ్లోకములోని పదములు సగుణ బ్రహ్మ ధ్యానమునకు, నిర్గుణ బ్రహ్మ ధ్యానమునకు కూడ సమానముగా వర్తించును. మనకీ విషయము రాబోవు శ్లోకములలోని ధ్యేయవస్తు ప్రకరణములో స్పష్టమగును. వాస్తవంలో, ఈ రెండు రకముల ధ్యానములు ఒకే ధ్యానములో అంతర్భాగములు. సాధకుడు సగుణ బ్రహ్మ ధ్యానముతో సాధనను ఆరంభించి, క్రమముగా నిర్గుణబ్రహ్మ ధ్యానములో ఉత్తీర్ణుడగును.

ఆలోచనల గురించి చింతిల్ల పని లేదు

మనస్సులో కొంత శాంతి, ప్రసన్నత ఏర్పడగానే, అట్టి ప్రసన్నమగు మనస్సులో అనేక ఆలోచనలు బయలుదేరును. ఈ ఆలోచనలకే కషాయములని పేరు. ప్రశాంతమగు మనస్సులో సందర్భరహితమైన, అసంగతమైన స్మృతులు ఏ క్షణంలోనైనా బయటకు ఉబికి రావచ్చును. ధ్యాన స్వరూపమును సరిగా యెరింగిన వ్యక్తి ఇట్టి ఆలోచనల వలన కంగారుపడడు. అవి మనస్సును కలవర పరుస్తున్నాయని భయపడవలసిన అవసరము లేదు. సాధకుడు ఈ విధంగా వెల్లుబికే ఆలోచనలను ఉదాసీనుడై, సాక్షియై పరిశీలించవలెను.

సాధారణంగా ఈ ఆలోచనలు వచ్చినప్పుడు, మనము వాటితో తాదాత్మ్యమును చెందెదము. కాని, ధ్యానమగ్నుడైన సాధకునిలో ఒక విశిష్టమగు ప్రసన్నత ఉండుటచే, తనకు, ఈ స్మృతుల గాలిబుడగలకు మధ్యలో గల తేడాను సాధకుడు గుర్తించగల్గుతాడు. కావున, సాధకునకు వాటి వలన శాంతికి భంగము కలుగదు. వాటిని పరిహరించి తీరాలి అనే ఆగ్రహము కూడ సాధకునకు ఉండదు. ధ్యానము చేయు సాధకుడు సాక్షిరూపుడుగా నుండి, స్మృతులను యథాతథంగా స్వీకరిస్తాడు. వాటివలన భయమును పొందడు. అవి ప్రశాంతమగు సరస్సులో గాలి బుడగల వలె పైకి వస్తాయి; వెళ్లిపోతాయి. ధ్యానయోగి వాటిని ఉదాసీనముగా పరిశీలిస్తాడు. శ్రీకృష్ణుడీ శ్లోకములో బోధించిన ఆత్మ విశుద్ధి అనగా నిదియే. దీనికొరకై సాధకుడు ధ్యానము నభ్యసించవలెను.

ప్రార్థన మనస్సును శుద్ధి చేయు విధము

ప్రార్థన వలన ఆత్మవిశుద్ధి కలుగును. మనము ఎల్లవేళలా గతముతో, జీవితముతో, గడచిపోయిన సంఘటనలతో సంఘర్షణ చేస్తూ ఉంటాము. దానికి బదులుగా వాటిని ఆనందముగా

అంగీకరించి, స్వీకరించుట అనే ఒక విశిష్టమైన మార్పు సాధకునిలో ప్రార్థన వలన ఏర్పడుతుంది. గతమును ఈ విధముగా ఆనందముగా స్వీకరించగలిగే అంతరంగిక పరివర్తనము ప్రార్థన యొక్క ఫలమే. కావున, సగుణ ధ్యానము సాధకునకు గతము విషయంలో గల రాగద్వేషములను తొలగించివేయును. 'నేను ఈ విధముగా అయి ఉంటే, బాగుండేది; నేను అట్లు చేసి యున్నచో బాగుండెడిది; నాకు ఆ విధముగా జరిగి ఉండవలసినది కాదు' ఇత్యాది ధారణలు తరచుగా వ్యక్తులను పీడిస్తూ ఉంటాయి. ఇవి ప్రార్థన వలన తొలగులాయి. దీనికి కూడ ఆత్మ విశుద్ధి అనియే పేరు. మానవుని మనస్సు లోతులలో కరిగిపోకుండా మిగిలియున్న దుఃఖానుభవములు స్మృతిరూపములో భద్రపరుచబడి, బయటకు వెలువడుతూ కొంత దుఃఖమును కలుగజేయును. వీటికే సంస్కారములు, లేక కషాయములు అని పేరు. వీటిని తొలగించుట కూడ ఆత్మ విశుద్ధియే.

మానవుడు స్థూలదేహముతోను, మరియు ఆలోచనలతోను తాదాత్మ్యమును పొందుచుండును. శరీరమునకు కలిగే సుఖదుఃఖములను తన సుఖ దుఃఖములుగా స్వీకరించును. మోక్షమును గోరు సాధకునకు ఇది పెద్ద అవరోధము (ప్రతిబంధకము), మరియు మహాదోషము (అశుద్ధి). ఈ తాదాత్మ్య భావనను నిర్మూలించాలి. తొలగించవలసినది ఏదైనా అశుద్ధి యనబడును. ఈ అశుద్ధిని నిర్మూలించుటలో ధ్యానము తోడ్పడును. 'ఆత్మ విశుద్ధయే' అనుటలోని తాత్పర్యమిదియే. ధ్యానము యొక్క ఫలము ఆత్మజ్ఞానము కాదు; ఆత్మ విశుద్ధి మాత్రమే.

ధ్యానము విచారమును సరళము చేయును

ఆత్మ జ్ఞానమనగా మనో వృత్తి రూపముగా కలుగు జ్ఞానమే. కావున అది సత్య వస్తు జ్ఞానము చేత మాత్రమే కలుగును. ఆత్మ విషయకమగు అజ్ఞానమును నాశము జేసి, ప్రమాణ విచారము మాత్రమే ఈ వృత్తి జ్ఞానము పుట్టునట్లు చేయును. ఈ వృత్తి జ్ఞానము కలుగకుండగా అనేక ప్రతిబంధకములు అడ్డు తగులుచున్నవి. రాగద్వేషముల వలన, కషాయముల వలన, లేదా విపరీత భావన వలన ఏర్పడే ఈ అవరోధములను తొలగించాలి. ధ్యానము వీటిని తొలగించి వేయును.

ప్రమాణ విచారము వలన జ్ఞానము ఉదయించును అని చెప్పుట చేత ధ్యానమునకు, ప్రార్థనకు తక్కువ స్థానమీయబడినదని తలంచరాదు. వాస్తవంలో తక్కువ స్థానమనేది లేదు. సాధకుని జీవితములో ఆత్మ విశుద్ధి ప్రయోజనముగా గల ధ్యానమునకు ప్రముఖ స్థానము గలదు. మానవుడు ధ్యానమును చేయవలెను (యోగం యుంజ్యాత్) అని శ్రీకృష్ణుడు చెప్పియున్నాడు. మనమీ సత్యమును మరువరాదు. వేదాంతమనగా కేవల సిద్ధాంతమే నవియు, సాక్షాత్కారము ధ్యానగమ్య

మనియు సామాన్యులు తలంచెదరు. ఇది సత్యము కాదు. ధ్యానము వలన లభించేది ఆత్మ విశుద్ధి మాత్రమే, ఆత్మజ్ఞానము కాదు. కాని, ధ్యానము పరంపరయా ఆత్మజ్ఞాన హేతువు అగును. శుద్ధమగు అంతఃకరణములో మాత్రమే జ్ఞానము ఉదయించును గాన, అంతఃకరణ విశుద్ధి హేతువగు ధ్యానము చాల ప్రముఖమైనది. ఇది ఒక విశిష్ట క్రమము గాన, ధ్యానము సాక్షాత్తుగా జ్ఞానసాధనము కాజాలదు.

ఆసనమును వర్ణించి, ధ్యానము వలన కలిగే సిద్ధిని వర్ణించి, శ్రీకృష్ణుడు తరువాత ధ్యానమునకు కూర్చుండవలసిన విధానమును సూచించుచున్నాడు.

అధ్యాయము 6, శ్లోకము 13:

समं कायशिरोग्रीवं धारयन्नचलं स्थिरः ।
संप्रेक्ष्य नासिकाग्रं स्वं दिशश्चानवलोकयन् ॥ १३ ॥

సమం కాయ శిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్ (13)

కాయ శిరోగ్రీవమ్ = శరీరము, శిరస్సు, కంఠములను; సమం = ఒకే సరళరేఖలో; అచలం = కదలిక లేకుండగా; ధారయన్ = ధరించువాడై; స్థిరః = స్థిరముగా నున్నవాడై; స్వం = తన; నాసికాగ్రం = ముక్కు కొనను; సంప్రేక్ష్య = చూచుచున్నాడా యన్నట్లు ఉండి; చ = మరియు; దిశః = దిక్కులను; అనవలోకయన్ = చూడకున్నవాడై.

> శరీరము, శిరస్సు, కంఠములను ఒకే సరళరేఖలో కదలిక లేకుండగా ధరించువాడై, స్థిరముగా నుండి, తన ముక్కు కొనను చూచుచున్నాడా యన్నట్లు ఉండి, దిక్కులను చూడకుండగా ... (13).

నడుము, తల, మెడ ఒకే సరళరేఖలో ఉండాలి. అంటే, వాటిని ఇటునటు వంచకూడదు. ధ్యానమునకు కూర్చునే స్థితి ఆ విధంగా సమముగా ఉండాలి. నడుము, మెడ, తల తిన్నగా ఉన్ననూ, ఒకప్పుడు ఇటునటు ఊగే అవకాశము గలదు. కావుననే, శ్రీకృష్ణుడు 'అచలం' అను పదమును జోడించెను. అనగా, శరీరములో కదలికలు లేకుండా ఉండాలి. మరియు, 'స్థిరః' అనగా సాధకుడు ఆసనములో సుస్థిరుడై ఉండాలి. అనగా, ధ్యానమునకు పూర్వమే కాళ్లను, పాదములను మరల

మార్పు అవసరము లేని విధంగా స్థిరమైన స్థితిలో ఉంచుకోవాలి. ఈ తీరున, ధ్యానములో కూర్చున్న వ్యక్తికి ఆసనములో నిశ్చలత, సుస్థిరత ఉండును.

ముక్కు కొనను ధ్యానించాలా?

ఈ శ్లోకములో వర్ణింపబడిన ఆసనము సాధకునిలో ధ్యానమునకు అనురూపమైన ఒక విశిష్ట మానసిక స్థితిని, విన్యాసమును నిర్మాణము చేయును. 'సంప్రేక్ష్య నాసికాగ్రమ్' అను శ్లోకభాగమును 'ముక్కు కొనను ధ్యానించవలెను' అని తప్పుగా అర్థము చేసుకునే అవకాశము లేకపోలేదు. ఈ విషయంలో రెండు విభిన్న వ్యాఖ్యానములు గలవు. భ్రూమధ్యమును ధ్యానించవలెనని ఒకరు అంటారు. ముక్కు కొనను ధ్యానించాలని మరియొకరు అంటారు. కావుననే, శ్రీ శంకరులు తమ భాష్యములో శ్రీకృష్ణ భగవానుని తాత్పర్యమును విశదీకరించిరి.

శ్రీకృష్ణుడు సాధకుని చూపును వివరిస్తూ, సాధకుడు ముక్కు కొనను చూస్తున్నాడా యన్నట్లు కూర్చుండి ధ్యానమును చేయునని చెప్పెను. సాధకుడు ముక్కుకొనపై చూపును నిలిపి ధ్యానించాలని శ్రీకృష్ణుని అభిప్రాయము కాదు. బాహ్య ప్రపంచమును చూస్తున్న చూపులను ఉపసంహరిస్తే, అవి సహజంగా ఒక బిందువుపై కేంద్రీకరించి, అచటనే స్థిరముగా ఉంటాయి. అంటే, ధ్యానంలో పైకి చూడరాదు; క్రిందకు చూడరాదు. ముక్కుకొనను చూస్తున్నాడా యన్నట్లు ఉండాలి. కావున, 'సంప్రేక్ష్య నాసికాగ్రమ్' అను వాక్యము 'ముక్కు కొనను చూడాలి' అను విధిని బోధించునని భావించరాదు. చూపులు సహజముగా కేంద్రితమయ్యే స్థానమును మాత్రమే ఈ వాక్యము బోధించును. వాస్తవంలో, ధ్యానములో కళ్లను పూర్తిగా మూసుకునే అవసరము లేదు. చూపులు ఒక ప్రత్యేక వస్తువుపై పడని విధంగా ఉంటే చాలు. దాని వలన, మనస్సు ఇటునటు చెదరిపోయే అవకాశము తగ్గును.

ముక్కు కొనను ధ్యానించుటయే కర్తవ్యము (విధి) అని స్వీకరించినచో యేమగును? శ్రీ శంకరులు ఈ ప్రశ్నను లేవనెత్తిరి. సాధకుడు ముక్కు కొనను చూచుచున్నచో అతని మనస్సు ఎక్కడ లగ్నమగును? ముక్కు కొన యందు మాత్రమే గదా! కాని, ఇది అభిలషితము కానే కాదు. ధ్యానములో మనస్సు ఆత్మ యందు లగ్నము కావాలి. అంటే, మనస్సు ఇతర వ్యాపృతమై యుండరాదు. సాధకుని మనస్సు ముక్కుకొనపై లగ్నమై యున్నచో, మనస్సును ఆత్మపై లగ్నము చేసి, ఆత్మను ధ్యానించుట యెట్లు సంభవమగును? కావున, ధ్యేయ వస్తువు ముక్కు కొన కానేరదు. ధ్యేయ వస్తువు యొక్క స్వరూపమును మనము తరువాత చూడబోతాము.

శ్రీ శంకరులు 'దిశః అనవలోకయన్' అను శ్రీకృష్ణుని పదములను కూడ వ్యాఖ్యానించిరి. 'ఇటునటు దిక్కులను చూడకుండగా' అని ఆ పదములకు అర్థము. ధ్యానమునకై కూర్చున్న సాధకుడు కుడియెడమలకు, ముందువెనుకలకు, క్రిందికి, పైకి చూచే అవకాశము గలదు. నడుము, మెడ, తల ఒకే సరళరేఖలో నుండవలెను (సమం కాయ శిరోగ్రీవం ధారయన్) అని చెప్పి, శ్రీకృష్ణుడు క్రిందికి, పైకి చూచే అవకాశమును తొలగించి యున్నాడు. కుడి, ఎడమలకు చూస్తూ ధ్యానము నేల చేయరాదు? అట్లు చేసినచో, మెడ బెణికే అవకాశము గలదు. ఇట్టి ఇబ్బందులను తొలగించుట కొరకు మాత్రమే ధ్యానము కొరకు స్థిరమగు ఆసనము విధించబడినది.

శ్రీకృష్ణుడు ఈ శ్లోకములో ఆరంభించిన వాక్యమును తరువాతి శ్లోకములో పూర్తి చేయుచున్నాడు:

అధ్యాయము 6, శ్లోకము 14:

प्रशान्तात्मा विगतभीर्ब्रह्मचारिव्रते स्थितः।
मनस्संयम्य मच्चित्तो युक्त आसीत मत्परः॥ १४॥

ప్రశాంతాత్మా విగతభీర్బ్రహ్మచారి వ్రతే స్థితః
మనస్సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః (14).

ప్రశాంతాత్మా = ప్రసన్నమగు మనస్సు గలవాడు; విగతభీః = తొలగిన భయము గలవాడు; బ్రహ్మచారి వ్రతే = బ్రహ్మచర్య జీవనమునందు; స్థితః = కట్టుబడియున్నవాడు; మనః = మనస్సును; సంయమ్య = నియంత్రించి; మచ్చిత్తః = నన్ను స్మరించువాడు; మత్పరః = నేను పరమలక్ష్యముగా గలవాడు; యుక్తః = (ధ్యాన) యోగియై; ఆసీత = ఆసీనుడు కావలెను.

> ధ్యానయోగి ప్రసన్నమగు మనస్సు గలవాడై, తొలగిన భయము గలవాడై, బ్రహ్మచర్యజీవనమునకు కట్టుబడి, మనస్సును నియంత్రించి, భగవానుడు పరమ లక్ష్యముగా గలవాడై ఆసీనుడు కావలెను (14).

ధ్యానములో రెండు అంశములు గలవు. ఒకటి బాహ్యమగు ఆసనము. మరియొకటి అంతరమగు ఆసనము. ధ్యానపదమునకు అర్థము ఈ అంతరమగు ఆసనమే. ఈ శ్లోకములోని మచ్చిత్తః, మత్పరః అను పదములు ఈ అంతరమగు ఆసనమును నిర్దేశించును.

ధ్యానయోగ్యమగు స్థానము, పీఠము, కూర్చుండవలసిన ఆసనము అను వాటి గురించి శ్రీకృష్ణుడు వివరించి, ఈ శ్లోకములో ధ్యేయవస్తువును, ధ్యానయోగి స్వరూపమును వివరించుచున్నాడు. వాస్తవంలో, గీతలో ధ్యానము గురించి వర్ణించే శ్లోకములు ఎక్కువగా లేవు. కాని, ధ్యానయోగిని గురించి విస్తారమగు చర్చ గలదు. గీతను పూర్తిగా పరిశీలిస్తే, ధ్యానమును గురించిన వాక్యములు అదనంగా ఒకటి, లేక రెండు మాత్రమే గలవు*.

గీతలో సర్వత్రా సాధకునకు మహత్త్వ మీయబడినది. ధ్యానము ఒక క్రియ మాత్రమే. అది సఫలమగునో, కాదా అను విషయము ధ్యానమును చేయు వ్యక్తిపై ఆధారపడి యుండును. ప్రస్తుత శ్లోకములో కూడా మహత్త్వము సాధకునకే ఈయబడినది. సాధకుడీ శ్లోకములో ప్రశాంతాత్మ అని వర్ణింపబడినాడు. అనగా, ఒక విశిష్టమైన స్థాయికి చెందిన ప్రసన్నతతో నిండిన అంతఃకరణము గలవాడు అని యర్థము.

ధ్యానము వలన, తరువాత జ్ఞానము వలన కలిగే ఆత్యంతిక శాంతిని శ్రీకృష్ణుడు వర్ణించియున్నాడు. కాని, ఈ శ్లోకములో ముముక్షువు చర్చనీయాంశము. కాన, ఈ శాంతి ఆపేక్షికము. సాధకుడు కర్మయోగిగా జీవించుట వలన ఒక విశిష్ట స్థాయికి చెందిన ప్రసన్నత లభించును. అదియే ఇచటి విషయము. మనకీ సంగతి ప్రకరణమును బట్టి అవగతమగుచున్నది. ఏలయన, పూర్వశ్లోకములలో శ్రీకృష్ణుడు ధ్యానము చేయు సాధకుని గురించి, ధ్యానము వలన సాధకునికి లభించే ప్రయోజనముల గురించి వివరించి యున్నాడు. ఈ శ్లోకములోని 'ప్రశాంతాత్మ' అను పదము సాధకునకు ధ్యానము వలన లభించే ప్రయోజనముల సారమును నిర్దేశించును. కర్మయోగ జీవనమును గడిపి, రాగద్వేషములను నియంత్రించుకొని, వాటి ఒత్తిడి నుంచి విముక్తుడైన సాధకుడు 'ప్రశాంతాత్మ' అనబడును.

ఇట్టి సాధకుడు నిర్భయుడుగ నుండును (విగత భీః). భయములో వివిధ రకములు గలవు. ఉదాహరణకు, ధ్యానములో కూర్చున్న సాధకులలో కొందరికి మరణ భయము కలుగునని చెప్పెదరు. ధ్యానములో శరీరము శైథిల్యమును, ఆరామమును (relaxation) పొందును. కాని, ఇతర సమయములలో శరీరమునకు ఆ స్థితి కలుగగానే మనము నిద్రలోనికి జారుకుంటాము. కావున,

---

* మనస్సును ఆత్మ యందు స్థిరముగా లగ్నము చేసి, ఏ విధమైన ఆలోచనలనూ చేయరాదు (ఆత్మ సంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్, 6.25).

భయమునకు అవకాశము లేదు. నిద్రలో భయపడవలసిన వ్యక్తి ఉండడు. కాని, ధ్యానములో శరీరము శైథిల్యమును, విశ్రాంతిని పొందిననూ, సాధకుడు నిద్రలోనికి జారుకొనడు. ధ్యానము చేయు సాధకునకు తాను దేహమును వీడుచున్నట్లు భావన కలుగును. ఆ సమయములో, ధ్యానమును గురించి సరియగు అవగాహన లేని సాధకునకు మరణ భయము కలుగవచ్చును. శరీరావయవములు పూర్తిగా శైథిల్యము (relaxation) ను పొందినప్పుడు సాధకునకు దాను దేహమును వీడుచున్న భావన కలుగును. వెనువెంటనే, శరీరములో ఆంతరిక రక్షణ వ్యవస్థ (internal defense system) ప్రమాద సంకేతము (alarm) ను ప్రసారము చేయుటచే సాధకుడు భయమును పొందును.

అకర్తృత్వమనగా కర్తృత్వలయమే గాని కర్తృవినాశము కాదు

దేహము ఒకనాటికి రాలిపోయేదేనని అందరికీ తెలియును. కాని, వృద్ధులలో కూడా దేహపతనము గురించి భయము గలదు. ధ్యానములో ధ్యానకర్త విలయమును చెందును. ఇది ఆత్మహత్యా సదృశమనిపించును. వ్యక్తిత్వము విలయమును చెందుట ఏ వ్యక్తికీ నచ్చదు. కావుననే, ధ్యానములో వ్యక్తికి భయము కలిగే అవకాశము ఉన్నది. కాని, వాస్తవమేమనగా, వినాశము లేదు. విలయము మాత్రమే గలదు. మిథ్యాభూతమగు అహంకారము విలయమును చెందును. అహంకారము ఆత్మయే. కాని ఆత్మ అహంకారము కాదు. కావున, ధ్యానకర్త యగు అహంకారము ధ్యానములో ఆత్మ యందు విలీనమగుట సహజమే.

భయమునకు మూలము

ధ్యాయి (ధ్యానము చేయువాడు) ఆత్మ. ధ్యేయము ఆత్మ. ఈ ధ్యానము అనే క్రియ సఫలమైనచో, ధ్యానకర్త ఉండడు; ఆత్మలో లీనమవుతాడు. అంటే, సాధ్య సాధనములు ఒక్కటి యగును. ధ్యాయి ధ్యాన ప్రక్రియలో ధ్యేయమునందు లీనమగును. కొందరికి ఈ పరిస్థితి వలన భయము కలుగును. తమ వ్యక్తిత్వము వినష్టమగునేమో యని వారు భయపడెదరు. ఈ తీరున, కొందరు భయము లేని చోట భయమును దర్శిస్తారు. ఏదో ఒకటి తమ నుండి తొలగిపోవునేమో యను భ్రమతో వారు దానిని నిలబెట్టుకునే ప్రయత్నమును చేస్తారు. వాస్తవంలో అహంకార పరిరక్షణ మాత్రమే ఏకైక భయస్థానము. కావున, కొంత భయము ఉండుట సహజమే. ఈ భయము విచారము లేకపోవుట వలన కలుగును. విచారము చేయు వ్యక్తిలో భయము ఉండదు. ఈ శ్లోకము ఇట్టి వ్యక్తిని 'విగత భీః' అని వర్ణించినది.

రేపు గురించి భయము

విగత భీః అనగా రేపు గురించి భయపడనివాడు అని కూడ అర్థమును చెప్పవచ్చును. ఈ భయము సర్వజన సాధారణము. 'నేను ధ్యానము చేస్తూ కూర్చుంటే, నాకు ఏమి యగును? నేను సమాధిలోనికి వెళ్లి, వెనుకకు రానను కొనుడు. అపుడేమగును? నాకు జ్ఞానము ఉదయించినదను కొనుడు. అపుడు నాకు ఏమగును? నా ప్రవర్తన ఎట్లుండును? నా ఉద్యోగము నిలబడునా?' ఇత్యాదిగా జనులు ప్రశ్నిస్తూ ఉంటారు. ఈ శ్లోకము సన్న్యాసిని గురించి వర్ణించుచున్నది. సన్న్యాసి రేపు గురించి భయపడే అవకాశము లేదు. కాని, ధ్యానము చేయు వ్యక్తులందరు సన్న్యాసులు అయి ఉండనక్కరలేదు గదా! కావున, ధ్యానముచేయు సాధకులకు 'నాకు ఏమగును?' ఇత్యాది భయములు ఉండే అవకాశము గలదు.

నేను ఒక గ్రంథములో చదివినాను. ఒక స్త్రీ స్వామి వివేకానంద చేసిన ప్రసంగమును విన్న తరువాత, ఆయన వద్దకు వచ్చి ''అహంకారమును నశింపజేయవలెనని మీరు చెప్పినారా?'' అని ప్రశ్నించెను. 'అవును' అని ఆయన బదులిడెను. ''కాని, అహంకారము నశించిన తరువాత, నా ఇంటిని చక్కబెట్టేది ఎవరు? ఇంట్లో గిన్నెలను తోమేది ఎవరు?'' అని ఆమె అడిగెను. (అహంకార) నాశనము అనే పదమును ప్రయోగించుట వలన ఇట్టి ఆశంక కలుగును. అహంకారనాశము అను దానిని సరిగా తెలుసుకోవాలి. అహంకారము యథార్థముగా నశించిపోదు. దానిని గురించి మాటలాడే జ్ఞత గల వ్యక్తి (జ్ఞాని) లో కూడ అది ఉంటుంది. కాని, అది ప్రబుద్ధమైన అహంకారము. 'అహం' అహంకారముపై ఆధారపడి లేదు. కాని 'అహం' లేకుండా అహంకారము ఉండజాలదు. ఈ తీరున అహంకారము అన్ని కాలముల యందు మిథ్యాభూతమైనదే. అది 'అహం' యొక్క నీడ మాత్రమే. అది 'అహం' కాదు.

శ్రీకృష్ణార్పణమస్తు

అహంకారమును 'అహం'గా భ్రమపడుట యందు మాత్రమే సమస్య గలదు. అట్టి భ్రమలో 'అహం' ఒక క్షణంలో పైకి ఎగురుతూ, మరుక్షణంలో క్రింద పడుతూ ఉంటుంది. ఒక క్షణంలో సుఖి, మరుక్షణంలో దుఃఖి. మానవుడు మనస్సు యొక్క వివిధ అవస్థలతో తాదాత్మ్యమును పొంది సంసారమునకు అధీనుడగును. ఈ తాదాత్మ్యము నుండి విముక్తిని పొందుటను అహంకారనాశనమని తరచుగా వర్ణింతురు. అహంకారనాశనము అను పదమును ఈ విధముగా సరిగా వర్ణించకపోతే, అనేక సమస్యలు, భయములు బయలుదేరును. కాని, ఈ శ్లోకములో వర్ణించిన జ్ఞానికి రేపటి గురించి గాని, ఇతర విషయముల గురించి గాని భయము ఉండదు (విగత భీః).

బ్రహ్మచర్య జీవనము

విగత భయుడగు జ్ఞానికి 'బ్రహ్మచారి వ్రతే స్థితః' అను మరియొక విశేషణము గలదు. అనగా బ్రహ్మచర్యాశ్రమము యొక్క నియమములకు కట్టుబడి ఉండువాడని యర్థము. బ్రహ్మచర్య వ్రతము యొక్క నియమము లేవి? గురువునకు సేవచేయుట, భిక్షాటనములో యదృచ్ఛాప్రాప్తమైన ఆహారముతో సంతోషపడుట (భిక్షాన్న భుక్త్యాది) మొదలగు వ్రతములను శ్రీ శంకరులు నిర్వచించిరి. ఇట్టి వ్రతమయ జీవనుడగు వ్యక్తి రేపటి గురించి భయపడడు. ఇట్టి వ్యక్తికి బ్రహ్మచారీ అని పేరు. శ్రీకృష్ణుడు ధ్యానమును వివరించే ప్రకరణములో 'బ్రహ్మచారి' పదమును ప్రయోగించినాడు. కావున, ఆ పదములో శాస్త్రాధ్యయనము కూడ ఇమిడియున్నది. అనగా, ధ్యానము చేయు వ్యక్తి విస్తృతమగు శ్రవణ మననములను చేసియుండవలెను.

బ్రహ్మచర్య జీవనము యొక్క విధానమును కూడ ఈ శ్లోకము వివరించుచున్నది. సాధకుడు మనస్సులో చెలరేగే వివిధ రకముల ఆలోచనల నుండి మనస్సును ఉపసంహరించవలెను (మనస్సంయమ్య). కాని, మనస్సును ధ్యేయముపై ఏకాగ్రము చేయనిదే వాటి నుండి మరలించుట సంభవము కాదు. కావుననే, 'సాధకుడు కూర్చుండి నన్ను ధ్యానించుగాక (మచ్చిత్తో యుక్త ఆసీత)' అని శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పెను.

జీవేశ్వరుల అభేదము

మచ్చిత్తః అనగా నా యందు లగ్నమైన మనస్సు గలవాడు (మయి పరమేశ్వరే చిత్తం యస్య). ఇచట నేను అనగా పరమేశ్వరుడగు శ్రీకృష్ణభగవానుడు. పరమేశ్వర శబ్దము

శాస్త్రమంతటా తరచుగా వినబడుతుంది. ఈ పదమునకు రెండు అర్థములు గలవు. జగత్కారణమగు దేవుడు అని ఒక అర్థము. చైతన్య ఘనుడగు పరమాత్మ అని రెండవ యర్థము.

'నేను జీవుడను' అను ధారణ మానవునకు దృఢముగా నుండును. కాని అట్టి జీవునకు, పరమేశ్వరునితో సామ్యము చెప్పబడినది. జీవేశ్వరుల మధ్య భేదము ఉన్నట్లు కన్పట్టును. కాని, వాస్తవంలో భేదము లేదు.

ద్వివిధ వాక్యముల ఆవశ్యకత

శ్రీకృష్ణభగవానుని ఉపదేశమునకు, వేదాంత బోధకు పరమోద్దేశ్యము ఈ కనబడే భేదమును నిర్మూలించుటయే. జీవేశ్వరుల అభేద ప్రతిపాదనమే ఉపదేశము. వేదాంత శాస్త్రములో ఈ ఉపదేశమును బోధించు వాక్యములు రెండు విధములుగ నున్నవి. ఒక రకం వాక్యము ఆత్మ స్వరూపమును, పరమేశ్వర స్వరూపమును ప్రదర్శించును. రెండవరకం వాక్యము జీవపరమేశ్వరుల అభేదమును ప్రదర్శించును.

బ్రహ్మము సత్యజ్ఞానానంతము; ఆత్మ సచ్చిదానందము అను రెండు వాక్యములు ఆత్మ స్వరూపమును నిరూపించునవియే. ఈ రెండు వాక్యములలో ప్రదర్శింపబడే సత్యము ఒక్కటియే. ఆత్మ బోధక వాక్యములకు, పరమాత్మ బోధక వాక్యములకు లక్ష్యార్థము సర్వత్రా సమానము. మరియు, జీవేశ్వరుల అభేదమును ప్రతిపాదించే సమీకరణమే ఉపదేశము. ఈ విధముగా ఆత్మ స్వరూపమును బోధించు వాక్యము (వస్తు స్వరూప పర వాక్యము); జీవేశ్వరుల అభేదమును బోధించే 'నీవే బ్రహ్మవు (తత్ త్వం అసి), నేనే బ్రహ్మము (అహం బ్రహ్మాస్మి)' మొదలగు వాక్యములు అనే ద్వివిధ వాక్యములు గలవు.

జీవేశ్వరుల అభేదము ఎట్లు సంభవమగును? జీవుడు, పరమేశ్వరుడు కూడ సచ్చిదానంద స్వరూపులే గనుక, అభేదము సంభవము. ఆత్మ యొక్క స్వరూపము సచ్చిదానందము. కావున, జీవేశ్వరుల అభేదమును బోధించే జీవ-ఈశ్వర-ఐక్య-వాక్యము సత్యము. ఆత్మ స్వరూపము సచ్చిదానందము కానిచో, అభేదము ఏ మాత్రమూ పొసగి యుండెడిది కాదు. కావున, ఈ రెండు రకముల వాక్యములు ప్రముఖమైనవియే. ఆత్మ స్వరూపమును బోధించు వాక్యములు ఉన్నప్పుడు మాత్రమే జీవేశ్వర ఐక్య వాక్యము మనకు అవగతమగును. ఆత్మ స్వరూప బోధక వాక్యములు

లేనిచో, ఐక్య వాక్యము అసంగతముగ నుండి, జీవుడు జీవుడుగను, ఈశ్వరుడు ఈశ్వరుడుగను మిగిలిపోదురు.

'తరంగము సముద్రమే' అని అన్నప్పుడు మనము స్వరూపభూతమైన జలమును దర్శించాలి. అప్పుడు మాత్రమే తరంగ సముద్ర అభేదము అర్థవంతమగును. తరంగమునుద్దేశించి, 'ఓ తరంగమా! సముద్రము నీవే!' అని ఒకరు చెప్పినారనుకొనుడు. జలము మాత్రమే సత్యము అను జ్ఞానము ఆ తరంగమునకున్నచో, అది ఇట్టి అభేద వాక్యమును తెలుసుకొనగల్గును. పైకి కనబడే భేదము (ఉపాధి) మూలకంగా, ఒకటి తరంగమైనది; మరియొకటి సముద్రమైనది. ఈ 'ఒకటి' 'మరియొకటి' యథార్థంగా లేవు. ఉన్నది ఒక్కటియే. అదియే జలము కావున, ఈ ద్వివిధ వాక్యములు కలిసి జ్ఞానమును కలిగించును.

శ్రీకృష్ణుడు భగవానుడు

ఈ శ్లోకములో శ్రీకృష్ణుడు 'నన్ను' అనే ఉత్తమ పురుష ఏకవచనమును పరమేశ్వరుడనగు 'నన్ను' అను భావములో ప్రయోగించెను. చారిత్రిక పురుషుడగు శ్రీకృష్ణుడు భగవానుడా, కాదా అను విచారము మనకు అసంగతము. శ్రీకృష్ణుడు ఈశ్వరుని పరిభాషలో మాటలాడెను. అనగా శ్రీకృష్ణుడు భగవానుడు. శ్రీకృష్ణ పదము పరమేశ్వరుని మాత్రమే నిర్దేశించును. కావున, శ్రీకృష్ణ భగవానుడు 'అహం (నేను)' అను పదమును ప్రయోగించిన సందర్భము లన్నింటిలో ఆ పదమునకు 'పరమేశ్వరుడు' అను అర్థమును గ్రహించవలెను. నాట్యమును చేస్తూ, మురళిపై మధుర సంగీతమును సృష్టించిన శ్రీకృష్ణుడు అనే వ్యక్తి ఉండెనా యనునది ఇచటి చర్చనీయాంశము కాదు. యమునా తీరమున సంచరించిన ఒక చారిత్రక పురుషుని, అవతారముగా అర్థము చేసుకొనుటలో ఈ నాట్యము, మురళి ఇత్యాది గాథలు సహకరించును.

జ్ఞాని ఎవరైనా 'అహం' అను పదమును ఇదే అర్థములో వాడవచ్చును. ఇట్టి వాక్యములు యథార్థముగా గలవు. 'నేనే మనువును (అహం మనుః అభవమ్)', 'నేనే సూర్యుడను; సర్వము నేనే' ఇత్యాది వాక్యములను జ్ఞాని ప్రయోగించవచ్చును. గతములో జరిగినది, ఇపుడు ఇక్కడ ఉన్నది, భవిష్యత్తులో రాబోయేది సర్వము పురుషుడు (ఆత్మ) మాత్రమే. ఈ పురుషుడు కంటె భిన్నముగా ఏదియూ లేదు. ఈ పురుషుడు ఎవరు? 'నేనే ఈ పురుషుడను' అని ఎరింగినవాడే ఈ పురుషుడు. ఇట్టి జ్ఞాని అన్ని విధముల నశ్వరత (mortality) ల నుండి విముక్తుడై, ఆత్మరూపుడుగ నుండును.

ఒకే ఒక పురుషుడున్నాడు. అతడే ఆత్మ. సర్వత్ర పురుషుడు ఉన్నాడు. కాని, హృదయములో మాత్రమే దొరుకుతాడు. 'నా హృదయములో నున్నది ఆత్మ' అను మాటను శ్రీకృష్ణుడు మాత్రమే గాక, ఎవ్వరైననూ చెప్పవచ్చును. ఇచటి తాత్పర్యమేమనగా, శ్రీకృష్ణుడు సర్వత్రా తనను తాను జగత్కారణమగు పరమేశ్వరుని గనో, లేక శుద్ధ పరమాత్మ గనో, పరిచయము చేసెను. ఈ రెండు పరిచయములు సమానమే.

పరమేశ్వరుడనగా సృష్టి స్థితి లయ కారకుడగు సగుణ బ్రహ్మ యని అర్థము. అనగా పరమేశ్వరుడు కర్త. ఏక కాలములో మూడు పనులను ఆయన చేయుచుండును. ఈ క్షణములో ఒక వస్తువు పుట్టినది. అది పుట్టగానే, ఉంటుంది. ఉంటూనే, నశిస్తుంది. వీటిలో ఏది మొదటిది? ఏది రెండవది? ఏది మూడవది? ఉన్నది-పుట్టినది-నశించినది అనియా? నశించినది-ఉన్నది-పుట్టినది అనియా? పుట్టినది-ఉన్నది-నశించినది అనియా? వరుస ఏది అను ప్రశ్న కూడా అసంగతమే. ఏలయన, మూడు కార్యములు ఏకకాలములో సంభవించుచున్నవి.

సృష్టి సర్వము కాలము లోపల గలదు. కాలము మిథ్య కాన, సృష్టి కూడ మిథ్యయే. ప్రస్తుత క్షణము, ఆ క్షణములోని లక్షాంశము, లేక కోట్యంశము ఇత్యాది పుట్టినదా? నశించినదా? పుట్టి, పుడుతూనే నశించినది. క్షణము పోతూనే పుట్టినది. అనగా పుట్టుట అనునది లేదు. కాల స్వరూపము ఇట్లున్నది. సర్వము ఇట్టి మిథ్యాభూతమగు కాలములోన ఉన్నది.

పరమేశ్వరుని ధ్యానించుట

సృష్టి స్థితి లయ కర్త యగు ఈశ్వరుడు గొప్ప ఇంద్రజాలికుడు (మాయావి). ఆయన చేసిన ఇంద్రజాలమే ఈ కాలము. సాధకుడు తన మనస్సును ఈ పరమేశ్వరునిపై ఏకాగ్రము చేసినచో, దానికి సగుణ బ్రహ్మ ధ్యానమని పేరు. ఈ ధ్యానములో సాధకుడు పరమేశ్వరుని గుణములను ధ్యానించును. సాధకుని దృష్టిలో పరమేశ్వరుడు కరుణా సముద్రుడు; ఆనందఘనుడు; జగత్ సృష్టి స్థితి లయ కర్త. పరమేశ్వరుని గుణములలో నొకదానిని పూర్ణరూపముగా స్వీకరించి సాధకుడు ధ్యానించును. లేదా, ధ్యానము, 'ఓ భగవాన్, నీ కిదే నా నమస్కారము (పరమేశ్వరాయ నమః)' అను సరళప్రార్థనా రూపముగ నుండవచ్చును.

'మచ్చిత్తః' లోని 'మత్'నకు కూడ సర్వ జగత్కారణమగు పరమేశ్వర, పరబ్రహ్మయే అర్థము. ఆ సత్య జ్ఞానానంత బ్రహ్మ ఆత్మయే. శుద్ధ చైతన్యస్వరూపమగు ఆత్మ యొక్క

స్వరూపమును ధ్యానించే మనస్సు కలిగియున్న వ్యక్తి 'మచ్చిత్తః' అనబడును. చైతన్య ఆత్మను బోధించే పదములు అనేకములు గలవు. అవి ఆత్మస్వరూపమును ప్రదర్శించును. ఆత్మను ధ్యానింపబూను సాధకుడు ఈ పదముల అర్థమును తెలుసుకొని ఆత్మను ధ్యానించవలెను (... ధ్యాసనము).

ధ్యానము ఒక నైపుణ్యము (technique) కాదు

ఈ శ్లోకము సాధకుని 'మత్పరః' అను మరియొక విశేషణముతో వర్ణించినది. ఈ పదము కూడ ధ్యేయ వస్తువు దృష్ట్యా సాధకుని లక్షణమును చెప్పును. రక్తపోటు తగ్గుటకై ధ్యానము చేయు వ్యక్తి రక్తపోటు పరుడగునే గాని, మత్పరుడు కానే కాడు. జనులు వివిధ ప్రయోజనముల నపేక్షించి ధ్యానము నభ్యసింతురు. కొందరు నూరుశాతము ఆధ్యాత్మిక ప్రయోజనము కొరకు, మరి కొందరు నూరుశాతము భౌతిక ప్రయోజనము కొరకు ధ్యానము నాశ్రయించెదరు. వారి దృష్టిలో ధ్యానమునకు ఆధ్యాత్మిక పవిత్రత ఏదియూ లేదు. వారికి ధ్యానము సరిగా తెలియలేదు. ధ్యానము ఒక నైపుణ్యము (technique) కాదు. అది జీవనము. కావుననే, శ్రీకృష్ణుడు ధ్యానము చేయు సాధకుని 'మత్పరః' అని నిర్దేశించెను. అనగా, అతని దృష్టిలో సర్వము పరమేశ్వరుడే. సర్వము పరమేశ్వరుడే యను దర్శనము గల వ్యక్తికి పరమేశ్వరుని కంటె భిన్నముగా పొందదగిన వస్తువు మరియొకటి లేదు గనుక, ఇతని మనస్సు ధ్యేయముపై స్థిరముగా నుండును. పరమాత్మ మాత్రమే ఏకైక గమ్యముగా గల వ్యక్తి మత్పరుడనబడునని శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు.

శ్రీ శంకరులు మరి కొంత వివరించిరి. ఇట్టి సాధకుడు తాను కాంక్షించే వస్తువుల విషయంలో అత్యంత జాగరూకుడై యుండును. ఉదాహరణకు, ఇట్టి సాధకుడు ఒక స్త్రీని, లేక పురుషుని చరమలక్ష్యము (పరమ్)గా భావించడు. అతని చరమలక్ష్యము మరియొకటి గలదు. అతని మనస్సు పరమ గమ్యమగు ఈశ్వరునకు అంకితమై యుండును. జీవితము యొక్క సర్వశ్రేష్ఠ లక్ష్యమునకు పరమపదమని పేరు. ఈశ్వరుడు, పరమాత్మ, పరమపదము అనునవి పర్యాయములు. ఇది ఒక్కటి మాత్రమే జీవితాన్వేషణగా గల వ్యక్తి 'మత్పరః' అనబడును.

పరమపదము

పరమపదము అనగానేమి? దీనిని సరిగా తెలుసుకోవాలి. లేనిచో, క్రొత్త సమస్య ఉదయించును. 'మనము చిట్ట చివరున పొందే గమ్యము పరమపదము; ఈ లోపులో మనము పొందదగిన ఇతర

గమ్యములు గలవు' అని భావించుట సరిగాదు. పరమపదమనగా తరువాతి కాలములో, 'సేవానివృత్తి (retirement) అయిన తరువాత, పొంద దగిన గమ్యము అని తలంచుట సరిగాదు. పరమపదము యొక్క అర్థము అది కానే కాదు. పరమపదము అనగా సర్వోత్కృష్టమగు లక్ష్యము. అనగా, మరియొక లక్ష్యము లేదు. మిగిలిన లక్ష్యము లన్నియూ దీనికి సహాయకారులగును. సాధకుడు చేసే కర్మ లన్నియూ పరమపదము కొరకు మాత్రమే. సాధకుడు భోజనము చేసేది కూడా దీని కొరకు మాత్రమేనని శ్రీకృష్ణుడు చెప్పబోతాడు.

సంస్కృతభాషను నేర్చుకొనుట కూడా ఈ ప్రయోజనము కొరకు మాత్రమే. సంస్కృతపండితుడగుట లక్ష్యము కాదు. నేను చదివిన శాస్త్రములన్నియూ వేదాంత శాస్త్రములోని ఉపదేశమును అవగాహన చేసుకొనుటలో సహకారులు అగును అనే ఉద్దేశ్యముతో మాత్రమే చదివినాను. ఈశ్వరుడు పరమలక్ష్యము అనుటలో, ఈశ్వరీయ ధర్మమును రక్షించి, దానికి లోకములో సమర్థనను సంపాదించుట కానే కాదు. 'ఈశ్వరీయ ధర్మమును ప్రచారము చేయుటయే మా ఆకాంక్ష' అని చెప్పి కొందరు తమను తాము ధర్మరక్షకులుగా నియమించుకుంటారు. కాని ఈశ్వరునకు ఇట్టి సహాయము అనావశ్యకమనుటలో సందియము లేదు. ఈశ్వరుడనగా తాను కోరినది నెరవేర్చగల సమర్థుడు అని ఈశ్వరశబ్ద నిర్వచనమై యున్నది. కాన, ఈశ్వరునకు సమర్థనను ఈయబనిలేదు. తాను సాధించదలచుకున్నది ఆయన మన సమర్థన లేకుండగనే సాధించగలడు. ఈశ్వరుని స్వరూపమును తెలుసుకొనుటయే మన యెదుట నున్న ఏకైక లక్ష్యము.

ధ్యానయోగి యొక్క ఏకైక లక్ష్యము పరమాత్మ మాత్రమే. శ్రీకృష్ణ భగవానుడు ఈశ్వరుని స్థానములో నిలబడి 'ధ్యానయోగి యొక్క మనస్సు నాలో లీనమగును (మచ్చిత్తః)' అని చెప్పుచున్నాడు. మచ్చిత్తుని మనస్సులో ఉండే ప్రముఖమైన వస్తువు ఈశ్వరుడు. మరియు, ధ్యానయోగి మత్పరుడు అని చెప్పుట ద్వారా, ఈశ్వర సాక్షాత్కారము మానవుని జీవితలక్ష్యము కావాలి అనే సత్యమును శ్రీకృష్ణుడు బోధించుచున్నాడు. ధ్యానయోగికి ఏకైక లక్ష్యము ఈశ్వరసాక్షాత్కారము మాత్రమే. కావున, మచ్చిత్తః, మత్పరః అను విశేషణములను బట్టి, ధ్యానయోగికి తాను చేరవలసిన లక్ష్యమును గురించి, తాను తెలియదగిన వస్తువును గురించి స్పష్టమైన అవగాహన కలదని విశదమగుచున్నది.

శ్రీకృష్ణుడింకనూ ఇట్లు చెప్పెను:

అధ్యాయము 6, శ్లోకము 15:

युञ्जन्नेवं सदात्मानं योगी नियतमानसः ।
शान्तिं निर्वाणपरमां मत्संस्थामधिगच्छति ॥ १५ ॥

యుంజన్నేవం సదాత్మానం యోగీ నియతమానసః
శాంతిం నిర్వాణ పరమాం మత్సంస్థా మధిగచ్ఛతి (15)

ఏవం = ఈ విధముగా; **నియత మానసః** = నియంత్రింపబడిన మనస్సు గల; **యోగీ** = ధ్యానయోగి; **సదా** = ఎల్లప్పుడు; **ఆత్మానం** = మనస్సును; **యుంజన్** = (ఆత్మతో) కలిపినవాడై; **నిర్వాణ పరమాం** = సర్వ దుఃఖరహితము, సర్వోత్కృష్టమునగు; **మత్సంస్థాం** = నా యందు స్థిరుడై ఉండుట అనే; **శాంతిం** = శాంతిని; **అధిగచ్ఛతి** = పొందును.

> ఈ విధముగా నియంత్రింపబడిన మనస్సు గల ధ్యానయోగి ఎల్లప్పుడు మనస్సును ఆత్మతో కలిపి, సర్వదుఃఖరహితము, సర్వోత్కృష్టము, నా యందు స్థిరముగా నుండుట అనే శాంతిని పొందును (15).

ధ్యానయోగము వలన లభించే పరమ ప్రయోజనమును శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పుచున్నాడు.

'అన్నివేళలా (సదా)' అను ఈ శ్లోకములోని ప్రయోగము ఒక శంకకు దారితీయును. ధ్యానయోగి సదా ధ్యానములో ఉండే పక్షములో భోజనము, స్నానము, నిద్ర ఇత్యాదులకు, సమయమెక్కడిది? ఇచట 'సదా' యనగా, ధ్యానయోగి సమయమును వృథా చేయకుండగా, లభించే సమయము నంతనూ ఈ ఒకే ఒక లక్ష్యసాధనకు వినియోగిస్తాడని అర్థము. ఇచట ఆత్మయనగా మనస్సు. మనస్సును ఈ విధముగా సదా లగ్నము చేయాలి (యుంజన్ ఏవం సదా ఆత్మానమ్). అనగా, 'శుచౌ దేశే ... చైలాజినకుశోత్తరమ్ (6.11)' అను శ్లోకముతో మొదలిడి, ఇంతవరకు వర్ణించిన తీరులో మనస్సును లగ్నము చేయవలెను. పరమేశ్వరుడు, పరమాత్మ, పరబ్రహ్మము అని చెప్పబడే ఆత్మ స్వరూపము నందు మనస్సు లగ్నమై, మిళితమై, లయమగును.

మనస్సు ఆత్మ స్వరూపముతో యోగమును పొందుట యెట్లు? మననమునకు సహకరించే [illegible]నముల ద్వారా మనస్సు ఆత్మయందు లయమగును. ఇందువలననే, శబ్దము (పదము)లకు అ[illegible]ను కలిగినది. సాధకుడు ఒక పదము ద్వారా మనస్సును ఆత్మలో లయము చేయుగల్గును. ఈ ప[illegible]యెట్టివి? మనన, నిదిధ్యాసనములలో మనము ఆత్మ స్వరూపమును ప్రదర్శించే పదములను వినియోగించి, మనస్సును ఆత్మతో జతపరుస్తాము. 'యుంజన్' అనగా ధ్యానము చేయుట, లేదా కలుపుట అని యర్థము. అంతఃకరణమును ధ్యేయవస్తువుతో కలుపుట అను మానసిక క్రియయే ధ్యానము అగును.

ఈ శ్లోకములో ధ్యానయోగికి 'నియతమానసః' అను మరియొక విశేషణము గలదు. ప్రసన్నమైన, నియంత్రితమైన మనస్సు గలవాడు అని దీని యర్థము. ఇట్టి నియతమానసుడగు యోగి పొందే ఫలమేమి? నిది ధ్యాసనమును చేయు సాధకుడు గురూపదేశమును చక్కగా తెలుసుకొనగల్గును. ప్రతిబంధకములు తొలగిన ఇట్టి సాధకునకు ఉపదేశము సుస్పష్టముగా తెలియును. కావున, ఉపదేశము సఫలమై, అతడు శాంతిని పొందును (శాంతిం అధిగచ్ఛతి).

శాంతి అనగా నేమి?

ఉద్రేకమును తగ్గించే మందు (tranquiliser), లేదా నూదిమందును తీసుకున్న వ్యక్తి ఒక విధమగు శాంతిని పొందుతాడు. ధ్యానము చేస్తే లభించే శాంతి కూడ అట్టిదియేనా? కాదు. ఈ శాంతి అట్టిది కాదు. ఇది మత్సంస్థము, నిర్వాణపరమము నగు శాంతి. శ్రీ శంకరులు తమ భాష్యములో శాంతిని ఉపరతి యని నిర్వచించిరి. అనగా, సర్వకర్మ సన్న్యాసము. దీని యందు కర్తృత్వభోక్తృత్వములు త్యజింపబడును. ఈ విషయమును ఇంతకు ముందు విస్తారముగా వర్ణించడమైనది. నిర్వాణమనగా మోక్షము. ఈ శాంతికి మూలము మోక్షము. అనగా ఇది మోక్షశాంతి.

మోక్షశాంతి యనగా నేమి? శాంతి మూడు విధములు. ఒకరకం శాంతిలో ఆలోచనా తరంగములేమియూ ఉండవు. ఈ ఆలోచనా తరంగముల ఆవృత్తి (frequency) ని క్రమముగా తగ్గించి, ఇట్టి శాంతిని ఉత్పన్నము చేయవచ్చును.

అనేక ఆలోచనలతో మిక్కిలి వ్యాపృతమై (active) యున్న మనస్సును నియంత్రణ చేయగల్గినప్పుడు, ఇంకొరకం శాంతి కలుగును. ఈ శాంతికి ఉత్సాహభరితమగు మనస్సు ఆవశ్యకమగును. మనస్సు లేనిదే ఆలోచనలు లేవు గదా!

మొదటిరకం శాంతిలో మనోవృత్తుల నుండి విముక్తి లభించును. ఇది తాత్కాలికము మాత్రమే. దీనిని ఉత్పన్నము చేయుటకు చాలా కృషిని చేయాలి. రెండు మనోవృత్తుల మధ్యలో గాని, లేక రెండు సంక్షోభస్థితుల మధ్యలోగాని ఇట్టి శాంతి ఉండును. రెండవరకం శాంతిలో సాక్షిభూతుడగు సాధకునకు, మనస్సునకు మధ్యలో కొంత దూరము వలన శాంతి లభించును. ఇక మూడవది మోక్షశాంతి. దీనియందు మనస్సు ఒక విశేషాధికారము (privilege) గా మలచబడును. మనస్సు యొక్క స్వరూపమేదైననూ, అది నేనే. కాని, నేను మనస్సు కాదు. ఈ జ్ఞానమే పూర్ణ మోక్షము. దీని యందు మనో నియంత్రణ లేదు. మనస్సును ఎప్పటికో గాని పోవుట లేదు. మనస్సు ఎక్కడెక్కడ తిరుగాడినా, జ్ఞానికి ఈ ఎరుక నిత్యముగా నుండును. ఇతడే యథార్థమైన భక్తుడు. ఏలయన, మనస్సు ఎచ్చట ఉన్ననూ, జ్ఞాని యొక్క దర్శనములో అది యీశ్వరుడే గదా!

జ్ఞానము ఆధారముగా గల భక్తి

ఈ జ్ఞానాధార భక్తిని వివరించు గాథ లనేకము గలవు. ఒక గొప్ప శివభక్తుడుండెను. ఒక సాధువు తన పాదములను లింగముపై నుంచి నిద్రించుచుండగా అతని కంటబడెను. ఇట్టి మహాపరాధము నెవ్వరూ చేయరాదు. తత్రాపి సాధువు చేయరాదని వేరే చెప్పవలెనా? ఆ భక్తుడు క్రుద్ధుడై ఆ సాధువుతో, 'లెమ్ము! పాదములను లింగమ్ముపై నుంచుటకు నీవెట్లు సాహసించగల్గితివి?' అని పలికెను. అపుడు సాధువు ఇట్లు బదులిడెను: 'నేను వృద్ధుడను. అలసియున్నాను. నిద్ర వచ్చుచున్నది. నేను చేయగలిగిన దేమున్నది? దయచేసి, నా పాదములను నీవే ప్రక్కకు జరుపుము. నేను పాదముల నెత్తలేకున్నాను'. అపుడా భక్తుడు అతని పాదములను ప్రక్కకు జరుపగా అక్కడ మరియొక లింగము ఆవిర్భవించెను. మరల ఇంకో ప్రక్కకు జరుపగా, అక్కడ ఇంకొక లింగము ఆవిర్భవించెను. అనగా, పాదములు పెట్టుటకు భగవత్స్వరూపము గాని స్థలము లేదని యర్థము.

అదే విధముగా, మనస్సు ఎక్కడ తిరుగాడినమా, భగవత్సన్నిధి యందు మాత్రమే ఉండును. కావున, మనస్సును ఒక దాని నుండి మరల్చి, ఇంకొక దానిలో ఏకాగ్రము చేయుట అను ప్రసక్తి ఈ ప్రకరణములో లేదు. ఈ విషయమును స్పష్టము చేయుటకై బృహదారణ్యకోపనిషత్తులో ఒక సాధకుడు ఇట్లనును: మనస్సు చంచలమా యన్నట్లున్నది. కాన, నేను ధ్యానము చేయుచున్నానా యన్నట్లు ఉన్నాను. చంచలమా యన్నట్లు ఉన్న మనస్సునకు ధ్యానమా యన్నట్లు ఉన్నచో చాలును. ఈ 'చంచలమా యన్నట్లు ఉండుట' స్పష్టమైనచో,

మనస్సు ఇటునటు చెదరిపోదు. అపుడు ధ్యానము ఆవశ్యకము కాదు. ఈ శాంతికి పరమశాంతి, లేక మోక్షము అని పేరు. ఇది ఆత్మ యొక్క స్వరూపభూతమైన శాంతి. దీనిలో వచ్చిపోవుటలు, వృద్ధిహ్రాసములు ఉండవు. దీనిని మరియొక స్థితితో పోల్చుటయూ అసంభవము.

ఆత్మ స్వరూపభూతమైన శాంతి

ఈ శాంతి ఆత్మ కంటె వేరు కాదు గనుకనే, శ్రీకృష్ణుడు దానిని 'మత్సంస్థాం' అని వర్ణించెను. అనగా 'మత్-అధీనాం' పరమాత్మ యందు సదా ఉండునది అని యర్థము. ఏలయన, పరమాత్మ ఏ కాలము నందైననూ కదలిక లేనివాడు (కూటస్థుడు); దేనితోనైననూ సంగము లేనివాడు; దేనికీ వ్యతిరేకి కాడు. వ్యతిరేకి అయినచో, కొంత ఘర్షణ లేక అవరోధము, దానిని బట్టి అశాంతి తప్పవు. శాంతియే పరమాత్మ. పరమాత్మ మనోవృత్తులకు వ్యతిరేకి కాదు; జగత్తునకు వ్యతిరేకి కాదు; జ్ఞానమునకు విరోధి కాదు; అజ్ఞానమునకు విరోధి కాదు; దేనికీ విరోధి కాదు. కాని, అదే సమయంలో, పరమాత్మ సర్వమును ప్రకాశింపచేయును. కావున, ధ్యానము చేయు సాధకుడు అట్టి శాంతిని, విముక్తిని పొందును (మదధీనాం శాంతిం అధిగచ్ఛతి).

నిర్వాణపరమశాంతి మనస్సు యొక్క అవస్థా విశేషముపై ఆధారపడదు. కాని, మనోదశలపై ఆధారపడే శాంతికి ఏ క్షణములోనైనా భంగము కలుగవచ్చును. వాస్తవంలో ఈ శాంతి ఆత్మ యొక్క స్వరూపమును బోధించే ఒక విశిష్ట లక్షణము. ఈ విషయమును స్పష్టముగా తెలియవలెను. ఈ శాంతి, నీలఘటమునకు నీలత్వము వలె, ఆత్మకు అంటిపెట్టుకుని ఉండే ఒక గుణము కాదు.

ఒక వస్తువును అదే జాతికి చెందిన ఇతర వస్తువుల నుండి వేరుచేసి చూపించు గుణమునకు విశేషణము అని పేరు. ఇట్లు వేరుచేయు అవసరము లేనిచో, విశేషణములు అనావశ్యకమగును. ఉదాహరణకు, ఘటములన్నియూ నీలముగా ఉండియున్నచో, 'నీల' అను విశేషణమును ప్రయోగించుట ఆవశ్యకము కాదు. గుణములు, లేక విశేషణములు దృశ్యములై యుండును. ఈ విషయము వాటి నిర్వచనములోనే యున్నది. కాని, ఆత్మ శాంతము అని మనము అన్నప్పుడు, ఆత్మలోని ఈ శాంతి ఇంద్రియగోచరము కాదు. కాని, ఈ శాంతి అను పదము ఆత్మ స్వరూపమును బోధించును. కావున, అది ఆత్మ లక్షణమే గాని, ఆత్మగుణము కాదు.

అధ్యారోప (superimposition), అపవాదములు (negation)

సంక్షోభాది మానసిక అవస్థలు శుద్ధ చైతన్యమగు ఆత్మపై అధ్యారోపము చేయబడు చుండును. ఆత్మ అన్ని అవస్థలలో ఉండును. కాని, ఆ అవస్థలతో సంగము లేకుండగా, వాటిపై ఆధారపడకుండగా ఉండును. 'శాంతః' ఇత్యాది పదములు ఈ అధ్యారోపమును అపవాదము చేసి, ఆత్మ స్వరూపతః అశాంతి లేనిదనియు, 'ఆత్మ అశాంతముగ నున్నది' ఇత్యాది ప్రయోగములు అధ్యారోపమూలకము లనియు నిరూపించును.

కావున, ఈ శాన్తి స్వరూపశాన్తియే గాని, అవస్థాగతమగు శాంతి కాదు. అది అవస్థాగతము కాదు గనుకనే, స్వరూపభూతమని చెప్పబడినది. ఆత్మ లేనిదే వృత్తులు లేవు. కాని, ఆత్మ వృత్తి వినిర్ముక్తమై యుండును. 'ఆత్మరూపుడనగు నేను శాంతుడను' అను యెరుక గల జ్ఞానియొక్క మనస్సులో వృత్తులు బయలుదేరిననూ, అవి శాంతమగు ఆత్మను సంక్షోభపెట్ట జాలవు. నిర్వాణ పరమశాంతి యనగా నిదియే. ఈ శాంతి శుద్ధ జ్ఞానరూపమైనది.

ఆత్మరూపుడగు తాను పరమాత్మ చైతన్యము కంటె వేరు గాదను యెరుక గల జ్ఞాని ఈ శాంతిని పొందును. మానవుడు జ్ఞానమును పొందినాడనగా ఈ శాంతిని పొందినాడని యర్థము. ఈ శ్లోకము ఇట్టి జ్ఞానిని యోగి యని వర్ణించినది. ఈ యోగము ఎనిమిది అంగములు గల (అష్టాంగ) యోగము కాదు. ఇది జ్ఞానరూపము మాత్రమే.

అధ్యాయము 6, శ్లోకము 16:

नात्यश्नतस्तु योगोऽस्ति न चात्यन्तमनश्नतः ।
न चातिस्वप्नशीलस्य जाग्रतो नैव चार्जुन ॥ १६ ॥

నాత్యశ్నతస్తు యోగోఽస్తి న చాత్యంతమనశ్నతః
న చాతి స్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున (16)

అర్జున = ఓ అర్జునా!; **అత్యశ్నతః** = అతిగా భుజించువానికి; **తు** = అయితే; **యోగః** = ధ్యానయోగము; **న అస్తి** = లేదు; **ఏకాంతం అనశ్నతః** = మిక్కిలి స్వల్పముగా భుజించువానికి; **న** = యోగము లేదు; **చ** = మరియు; **అతి స్వప్నశీలస్య** = అత్యధికముగా నిద్రించువానికి; **న** = యోగము లేదు; **జాగ్రతః** = సర్వదా తెలివిగా నుండు వానికి; **న ఏవ** = లేనే లేదు.

అధికముగా భుజించువాడు, అతి స్వల్పముగా భుజించువాడు,
అత్యధికముగా నిద్రించువాడు, మరియు సర్వదా తెలివిగా నుండువారలకు
ధ్యానయోగము సిద్ధించదు (16).

ధ్యానము నభ్యసించు సాధకుడు ఆహారము విషయంలో పాటించ దగిన అనుశాసనమును శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పుచున్నాడు. శ్రీకృష్ణుడు ఎక్కువ వివరముల నీయలేదు. అత్యధిక, అతి స్వల్ప పరిమాణములలో ఆహారమును స్వీకరించుట ధ్యానమునకు అనురూపము కాదని మాత్రమే శ్రీకృష్ణుడు చెప్పినాడు. సాత్త్విక, రాజస, తామసములు అనే మూడు విధముల ఆహారములలో వేటిని తినవలెను, వేటిని తినరాదు అను సర్వజన సాధారణమగు నియమములను శ్రీకృష్ణుడు తరువాత వివరిస్తాడు.

ప్రతి వ్యక్తి కొంత ఆహారమును ఇముడ్చుకోగల్గుతాడు. ధ్యానమును చేయగోరు వ్యక్తి అంతకు మించి భుజించరాదు. అధికముగా తినువానికి, అత్యల్పముగా తినువానికి ధ్యానము గాని, యోగము గాని సిద్ధించదని శ్రీకృష్ణుడిచట చెప్పుచున్నాడు. అధికముగా భుజించువానికి భోగము ఉన్ననూ, అది తాత్కాలికమే. పైగా భోగము అధికమైతే, రోగము దాని వెంటనే ఉండును. అత్యల్పముగా తినువాడు కూడ రోగగ్రస్తుడగును. యోగము భోగమునకు, రోగమునకు కూడ విరోధి. కావున, భోగికి గాని, రోగికి గాని ధ్యాన, నిదిధ్యాసనములతో కూడిన జీవనము అసంభవము (యోగః నాస్తి). ధ్యానమనగా సగుణ బ్రహ్మ ధ్యానము అనియు, నిదిధ్యాసనమనగా నిర్గుణ బ్రహ్మ ధ్యానమనియు మనమిదివరలో చూచియున్నాము.

ఈ శ్లోక భాష్యములో శ్రీ శంకరులు వేదము నుండి ఉదహరించిరి.

यद् ह वा आत्मसम्मितं अन्नं तदवति तन्न हिनस्ति
यद् भूयो हिनस्ति तद् यत्कनीयो न तदवति ।

యదు హ వా ఆత్మసమ్మితం అన్నం తదవతి తన్న హినస్తి,
యద్ భూయో హినస్తి తద్యత్ కనీయో న తదవతి (శతపథ బ్రా. 9.2.1.2).

వ్యక్తి తనకు యోగ్యమైన ఆహారమును ఇముడ్చుకోగలిగినంత
ప్రమాణములో మాత్రమే స్వీకరిస్తే, అట్టి ఆహారము వానిని రక్షించును.

అది వానికి వినాశమును కలిగించదు. అధికమైనచో వినాశమును కలిగించును. అల్పమైనచో రక్షించదు.

అధికముగా తినే అలవాటు గల వ్యక్తి రోగగ్రస్తుడగును. తగు పరిమాణములో భుజించినచో, వ్యక్తి వినాశమునకు దారితీయు ఈ రోగములు దూరముగ నుండును. ఆహారము యొక్క పరిమాణము ఇదమిత్థముగా నిర్దేశింపబడలేదు. ప్రతి వ్యక్తికి తనకు తగిన పరిమాణము తెలుస్తూనే ఉంటుంది.

ఇదే విధముగా, అవసరమైన దాని కంటె తక్కువ భుజించినచో, అది శరీరమునకు పోషణ నీయజాలదు. తక్కువ భోజనము శరీరమును నశింపజేయని మాట వాస్తవమే. కాని, అది పోషణను ఈయజాలదు. కావున, అతిగా తినువాడు (అత్యశ్నత్) గాని, తక్కువ తినువాడు (అనశ్నత్) గాని ధ్యానమునకు అర్హుడు గాడు. అతిగా గాని, మిక్కిలి తక్కువగా గాని తినకుండా సమముగా తినువాడు యోగియని ఇచట చెప్పబడినది. యోగి తన ఉదరమునకు యోగ్యమైనంత పరిమాణములో మాత్రమే తినును.

ఆహారము యొక్క పరిమితిని వివరించే మరియొక వాక్యమును శ్రీ శంకరులు ఉదాహరించినారు.

अर्धमशनस्य सव्यञ्जनस्य तृतीयमुदकस्य तु ।
वायो स्सञ्चरणार्थं तु चतुर्थमवशेषयेत् ॥

అర్ధమశనస్య సవ్యం జనస్య తృతీయ ముదకస్య తు
వాయో స్సంచరణార్థం తు చతుర్థ మవశేషయేత్.

ఉదరమును నాల్గు భాగములుగా భావించినచో, రెండు భాగములను ఘన ఆహార పదార్థములతో నింపవలెను. మూడవభాగమును నీరు, ఇతర ద్రవాహారము కొరకు వినియోగించి, నాల్గవ భాగమును వాయు సంచారము కొరకు విడిచిపెట్టవలెను.

ఆహారము జీర్ణమగునపుడు విస్తారమగు మంథన ప్రక్రియ జరుగును. దాని కొరకై నాల్గవ భాగమును ఖాళీగా ఉంచవలెను. ఈ పరిమితులను దాటి భుజించువారికి యోగము సిద్ధించదు.

కావలసిన ఆహారమును తినని వ్యక్తి నీరసపడి ధ్యానములో కూర్చుండజాలడు. అధికముగ భుజించువానికి నిద్ర వచ్చును. నిద్ర వలన ధ్యానము భగ్నమగును. కావున, సాధకుడు ఆహారమును పరిమితముగా భుజించవలెను. 'స్వామీజీ! ఉదరము సగము నిండినదని తెలియుట యెట్లు?' అని దయచేసి నన్ను ప్రశ్నించవద్దు. 'ఇంకా కొంచెము తింటే బాగుండును!' అని తోచినప్పుడు, తినుటను ఆపివేయాలి.

నిద్ర అనే అనుశాసనము

ధ్యానమునకు ఆహార నియమము యొక్క ఆవశ్యకతను చూచియున్నాము. నిద్రా నియమము కూడ అంతే ప్రాముఖ్యము గలది. కొందరు ఎంతసేపు నిద్రపోతారంటే, వారు తెలివిగా ఉన్నప్పుడు కూడా తూగుతూ ఉంటారు. అతి నిద్ర అతి తిండికి తోడుగా ఉంటుంది. వ్యాయామము చేయకపోవుట వలన నిద్ర అధికమగును. అతిగా నిద్రించువానికి (అతి స్వప్నశీలస్య) ధ్యానము సున్న (యోగః నాస్తి). కొందరు ధ్యానమును చేయాలనే ఉత్కంఠతో నిద్రను చెడగొట్టుకుంటారు. వారికి కూడా యోగము సిద్ధించదు. ధ్యానమునకు తెల్లవారు జామున నాల్గు గంటల సమయము అనుకూలమైనది యని విని, రాత్రి 12 గంటలకు నిద్రించి, నాల్గు గంటలకు నిద్రలేచి, ధ్యానమును మొదలిడినచో, ఆ ధ్యానము శీఘ్రమే నిద్రగా పరిణమించును.

పూర్వకాలంలో విద్యుత్తు లేని రోజులలో జనులు చీకటి పడగానే నిద్రించేవారు. కాన, వారు నాల్గు గంటలకు నిద్రలేచుట సహజము. కాని, ఇప్పుడు పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉంది. చీకటి పడగానే నిద్ర లేచి, ఉద్యోగానికి వెళ్లి, జీవితమును చీకటిలోనే గడిపేవారు ఈనాడు యథార్థంగా ఉన్నారు. అతి తక్కువ నిద్రించిన వ్యక్తి అన్నివేళలా తూగుతూ ఉంటాడు. కనుక, తగినంతగా నిద్రపోకుండా, సర్వకాలముల యందు జాగృతుడై ఉండే వ్యక్తికి యోగము సున్న.

దురదృష్టకరమైన విషయమేమనగా, అధికంగా నిద్రించువారు, చాల తక్కువ నిద్రించువారు అనే ఈ రెండు రకముల వ్యక్తులు కూడా అన్నివేళలా తూగుతూ ఉంటారు. కావున, ఈ రెండు రకముల వ్యక్తులకు యోగము, మనన నిదిధ్యాసనములు దూరము. అట్లైనచో, ఈ యోగము ఎవరికి, ఎట్లు సిద్ధించును? సమాధానము తరువాతి శ్లోకములో ఈయబడుచున్నది:

అధ్యాయము 6, శ్లోకము 17:

युक्ताहार विहारस्य युक्तचेष्टस्य कर्मसु।
युक्त स्वप्नावबोधस्य योगो भवति दुःखहा ॥ १७ ॥.

యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు
యుక్తా స్వప్నావ బోధస్య యోగో భవతి దుఃఖహా (17)

యుక్త-ఆహార-విహారస్య = యోగ్యమగు ఆహారము, విహారములు (ఇతర కార్యములు) కలిగినట్టియు; **కర్మసు** = కర్తవ్య కర్మల యందు; **యుక్త చేష్టస్య** = ఉచితమగు యత్నము కలిగినట్టియు; **యుక్త-స్వప్న-అవబోధస్య** = యోగ్యమగు నిద్ర, తెలివిగా నుండుట కల్గిన సాధకునకు; **దుఃఖహా** = దుఃఖమును నశింపజేయు; **యోగః** = ధ్యానయోగము; **భవతి** = సిద్ధించును.

> యోగ్యమగు ఆహార విహారములు కలిగి, కర్తవ్య కర్మల యందు ఉచితమగు యత్నము కలిగి , యోగ్యమగు నిద్రాకాలము, జాగ్రత్కాలము కల సాధకునకు దుఃఖమును నశింపజేయు యోగము సిద్ధించును (17).

ఈ శ్లోకములో ఒకే సమాన పదములో ధ్యానము చేయు సాధకునకు ఈయదగిన పేరు, మరియు ధ్యానమునకు ఆవశ్యకమగు అర్హతలు వర్ణింపబడినవి. 'యుక్త' అనగా 'యోగ్యమైన'. అనగా, సాధకుడు చేపట్టే కార్యము లన్నింటియందు సంతులన వివేకము (sense of proportion) ఉండవలెనని అభిప్రాయము.

ఈ శ్లోకము సాధకుని 'యుక్తాహార విహారుడు' అనియు, అనగా భోజనము నందు, ఇతర కార్యముల యందు ఔచిత్యము కలవాడనియు; యుక్త చేష్టుడు అనియు, అనగా సముచితమగు కర్మలు కలవాడనియు; మరియు యుక్త స్వప్నావబోధుడు అనియు, అనగా తెలివిగా నుండు కాలమును, నిద్రించు కాలమును సముచితముగా విభజించుకున్న వాడనియు వర్ణించినది. మరో మాటలో చెప్పాలంటే, ఈతడు అనుశాసనబద్ధమగు జీవనమును గడుపును. ఇదియే యోగము. ఈ యోగము సంసార దుఃఖమును నశింపజేయును.

శ్రీ శంకరులీ శ్లోక భాష్యములో 'యుక్తాహార విహారస్య' అను సమాసపదమును వివరించిరి. ఆహ్రియతే ఇత్యాహారః. మనము లోపలికి స్వీకరించు సర్వము ఆహారమనబడును. ప్రస్తుత ప్రకరణములో ఆహారమనగా మనము తినే అన్నము. విహారమనగా ఇటునటు సంచరించుట; అనగా నడుముట, పరుగెత్తుట ఇత్యాది వివిధ కార్యకలాపములు. ఈ ఆహార విహారములు రెండు సముచితముగా నుండవలెను. సముచితముగ నుండుట యనగా సాధకుడు వాటి ఆచరణలో సంతులనమును పాటించును. మరోమాటలో చెప్పాలంటే, సాధకుడు వాటిని ఉన్మాదములుగా వృద్ధి చెందనీయడు. ముఖ్యముగా ఆహారము విషయంలో ఇట్టి పరిస్థితి ఎప్పుడైననూ సంభవమే.

ఆధ్యాత్మిక ఉన్మాదములు

ఒక వ్యక్తి తన సమయమునంతనూ ఆహారము యొక్క యోజనలో గడిపినాడనుకొనుడు. అది ఒకరకమగు ఉన్మాదమని చెప్పుటకు సందేహించనక్కరలేదు. చాలమందికి ఈ ఆహారయోజన ఒక మతముగా మారినది. మరి కొందరికి, శారీరిక వ్యాయామమే వారి మతము. వారు అన్ని రకముల ఆహారమును తిని, దానిని అరిగించుకొనుటకై ప్రతిదినము గంటల తరబడి వ్యాయామమును చేస్తారు. ఈ తీరున, వారికి వ్యాయామమే మతము అవుతుంది. జీవితమంతా వ్యాయామము లోనే గడిచిపోతుంది. దేనికొరకు? వీరు చాలా ఎక్కువ వ్యాయామము చేసి, చాలా అలసిపోతారు. కావున, భోజనమును చేసి నిద్రపోతారు. మరల మరునాడు నిద్రలేచి వ్యాయామమును మొదలిడతారు. ఈ చక్రము కొనసాగుతూ ఉంటుంది. ఒకే పనికొరకై ఈ తీరులో పూర్తి సమయమును వినియోగించుట సరిగాదు. కావున, పని ఏదైనా, యుక్తముగా ఉండాలి. సంతులన వివేకముతో పనులను చేయాలి అని శ్రీకృష్ణుడు ఈ శ్లోకములో బోధించుచున్నాడు. అట్లు చేయనిచో ఆహారము మానవుని పతితుని చేయగలదు; విహారము కూడ పతితుని చేయగలదు.

ఏమి తినాలి, ఎంత తినాలి అనేది కొందరిలో ఒక ఉన్మాదముగా తయారవుతుంది. ఆధ్యాత్మిక సాధకునిలో ఈ ఆహారము ఒక ఆధ్యాత్మిక ఉన్మాదముగా పరిణమించు అవకాశము గలదు! ఇట్టి వ్యక్తి ఆహారమును సరిగా తినుటయే ఆధ్యాత్మిక సాధన యని భావించును. కాని, వాస్తవంలో, ఆహారమును సరిగా తినుట ఆరోగ్యమునకు చెందిన విషయమే గాని, మరియొకటి కాదు. దెయ్యము కూడా సరియగు విధములో ఆహారమును తిని, అనుశాసనయుతముగా తన దెయ్యపు చేష్టలన్నిటినీ నిర్వర్తించగల్గును. దొంగ కూడా సరియగు తీరులో ఆహారమును తీసుకుంటూ, ప్రతినిత్యము వ్యాయామమును చేస్తూ, నేరములను కొనసాగిస్తూ ఉండవచ్చును. కనుక, ఇచట

'యుక్త' అను పదము చాల ప్రముఖమైనది. 'అన్ని కార్యములలో సంతులనను కలిగియుండుట' అని ఆ పదమునకు అర్థము.

కర్మల విషయంలో (కర్మను) యుక్త చేష్టుడగు వ్యక్తి చేయవలసిన పనులు చాలా ఉన్నాయంటూ చికాకు పడుతూ కంగారు పడుతూ సమయమును వృథా చేయడు. యుక్తచేష్టుడు ప్రతి కర్మను తెలివిడితో విచార విమర్శ పూర్వకముగా ఒకదాని తరువాత మరియొక దానిని చేస్తాడు. ఇట్లు చేయుట వలన ప్రతికర్మయు ఉచితక్రమములో దక్షతతో చేయబడును. చేష్టయనగా కదలిక. చేతుల, కాళ్ల కదలికలతో సహా కదలికలన్నీ చేష్టలే. వివిధ కార్యములను చేయుచున్నప్పుడు శరీరములోని అవయవములను వృథాగా కదల్చని వ్యక్తి యుక్తచేష్టుడనబడును.

కర్మలను చేయునప్పుడు సంతులన వివేకము యొక్క ఆవశ్యకత యేమి?

ఏక కాలంలో అనేక కర్మలను చేయబూనినచో ఏమగునో మనకందరికి తెలియును. అట్లు చేయుట వలన ఏ ఒక్క పనియూ పూర్తికాదు. ఒక పనిని చేయబోతూ ఉంటే, హఠాత్తుగా మరియొక పని గుర్తుకువస్తుంది. వెంటనే చేస్తున్న పనిని వీడి, ఆ రెండవ పనిని చేయబోతాము. అపుడు మరల ఇంకోపని గుర్తుకువచ్చి, ఆ రెండవ పనిని కూడ త్యజిస్తాము. కొందరు ఏకకాలములో అనేక కార్యములను గుర్తు తెచ్చుకోకుండా, విశ్రమము లేకుండా, స్నానము కూడ చేయలేరు. ఇట్టి వారు అయుక్త చేష్టులు. తద్భిన్నంగా, యుక్తచేష్టుడు ప్రతి కర్తవ్యకర్మను తెలివిడితో, విచార విమర్శపూర్వకముగా చేయును. అతని చేతి కదలికలు కూడా సంకల్ప పూర్వకముగా నుండును. జపాన్‌లో 'జెన్' అనబడే ధ్యానమునభ్యసించు వారు ఇటులనే యుందురు. శరీరములోని కదలికలన్నింటినీ, చేతుల కాళ్ల కదలికలతో సహా, పరిశీలించి, ఆచి తూచి కదల్చుట వారి ధ్యానములో భాగముగా నుండును.

కాని, సాధకుడు అంత దూరము వెళ్లనక్కరలేదు. ఇచటి తాత్పర్యమేమనగా, సాధకుడు చేయు కర్మలన్నింటి యందు సంతులన వివేకము ఉండవలెను. ఏ ఒక్క కర్మయూ ఆవేశధోరణిగా మారరాదు. ఆవేశ ధోరణి (obsession) తో చేయు కర్మల వలన ప్రయోజనమేమియూ ఉండదు. కాని, చేసే కర్మను తెలివిడితో చేయుట వలన ప్రయోజనము కలుగును. సాధకునిలో జాగరూకతా భావన నిర్మాణమగును. కావున, 'యుక్తః' అనగా కర్తవ్య కర్మను తెలివిడితో చేయువాడు అని యర్థము. ఇట్లు కర్మను చేయుట వలన అంతరంగములో తొందరపాటు లేనిదనము నిర్మాణమై, జ్ఞానోదయమునకు సహకారి యగును.

ఏది యోగ్యమైన కర్మ? ఏది సంతులనము? ఎవరికి వారే నిర్ణయించుకోవాలి

ఈ శ్లోకములో చర్చించబడే యోగికి 'యుక్త స్వప్నావబోధ' అను మరియొక విశేషణము గలదు. అనగా, నిద్రపోయే, తెలివిగా ఉండే వేళలలో సంతులన వివేకము (sense of proportion) కలవాడు అని యర్థము. ఎన్నిగంటలు నిద్రపోవాలి? అని నన్ను ప్రశ్నించవద్దు. ఒక వ్యక్తికి ఉచితమైన నిద్రాకాలము మరియొకనికి అట్లు కాకపోవచ్చును. ఎన్ని గంటల నిద్ర అవసరము అనునది ఆ వ్యక్తి బాల్యములో నిద్రించిన సమయము, అతని శరీర నిర్మాణము ఇత్యాది అనేక అంశములపై ఆధారపడును. సాధకుడు ఎన్ని గంటలు అవసరమో అన్ని గంటలు నిద్రించాలి. నిద్రించే సమయమును బహుశః అరగంట, లేక ముప్పావు గంట వరకు మార్చుకొనవచ్చును. కాని, అంతకు మించి నిద్రా సమయములో మార్పు చేసినచో, దాని ప్రభావము పగటి వ్యవహారములన్నింటిపై పడును. రాత్రి నిద్ర మిక్కిలి తక్కువైన వ్యక్తి పగటి యందు తూలుతూ నడుస్తాడు; ఏ పనినీ చేయలేకపోతాడు. కావున, సాధకుడు తన శరీర నిర్మాణమునకు అనురూపముగా చేయవలెను. శరీరమునకు తనకేమి కావాలో బాగుగా తెలియును. శరీరము మనలకు సూచనలను కూడ ఇచ్చును. దానికి తగినంత నిద్ర లభించనిచో, అది మనకు ఆ విషయమును కూడ తెలుపుడు చేయును. ఉదాహరణకు, పగలంతా తూగుతూ మత్తుగా ఉన్నచో, నిద్ర చాలలేదని స్పష్టమగుచునే యుండును.

ఈ శ్లోకములోని, 'యుక్త' పదమును మనము సావధానులమై తెలుసుకోవాలి. ఏలయన, అందరికీ అన్ని కాలాలలో అన్వయించే స్థిర నియమమేదీ లేదు. ప్రతి వ్యక్తి తనకు తాను నిర్ణయించుకోవాలి. అందరూ ఒక నియమిత కాలము మాత్రమే నిద్రించాలని భావించుట సరిగాదు. కొందరికి ఐదు గంటల నిద్ర చాలుతుంది. మరికొందరికి ఆరు, ఏడు, లేక ఎనిమిది గంటల నిద్ర కావాలి. ఈ విషయము పూర్తిగా ఆయా వ్యక్తుల శరీర నిర్మాణముపై ఆధారపడి యుండును.

దుఃఖమును పోగొట్టే జ్ఞానము

కావున, నిద్రాకాలము, జాగ్రత్కాలముల విషయంలో సంతులన వివేకము గల వ్యక్తికి (యుక్త స్వప్నావ బోధస్య) యోగము సిద్ధించును. (యోగః భవతి). ఈ యోగము ఎట్టిది? జ్ఞానమే. దుఃఖమును నిర్మూలించే జ్ఞానము. శోక సంతప్తుడగు వ్యక్తి యొక్క ఆలోచనా సరళిని పూర్తిగా మార్చివేయుట ద్వారా ఈ జ్ఞానము దుఃఖమును తొలగించివేయును. ఆత్మ స్వరూపములో దుఃఖమునకు చోటు లేదనే ఆత్మ జ్ఞానము వ్యక్తి యొక్క ఆలోచనా సరళిలో మార్పును కలిగించును.

కర్తృత్వమును బాధించుట వలన దుఃఖము తొలగిపోవును. కావున, దుఃఖనాశము అనేది జ్ఞానము చేత మాత్రమే సంభవమగును. ఈ జ్ఞానము ఈ శ్లోకములో యోగము అని పిలువబడినది.

'దుఃఖ' అను పదము సర్వ సంసార దుఃఖములను నిర్దేశించునని శ్రీ శంకరులు ఈ శ్లోక భాష్యములో నొక్కి చెప్పినారు. 'నా జీవితము బాగానే ఉన్నది. కాని, నా చుట్టూ ఉన్న వ్యక్తులు సమస్య' అని ఒకడు అనవచ్చును. అంటే, అతని జీవితము సరిగా లేదని యర్థము. కావున, సాధకుడు దుఃఖనాశకమగు ఈ జ్ఞానమును పొందుటకు తన జీవితమును అంకితము చేయవలెను. జ్ఞానము తక్క ఇతర విషయములకు – అధికముగా తినుట, అల్పముగా తినుట, అధికముగా నిద్రించుట, తక్కువ నిద్ర, అధిక వ్యాయామము, వ్యాయమము చేయకపోవుట – ఇత్యాదులకు జీవితమును అంకితము చేయరాదు.

సర్వము మితముగా నుండవలెను

మన జీవితములో అనుశాసనము ఉండాలి. కాని, యోగ్యమైన సంతులనము కూడా ఉండాలి. ఉదాహరణకు, యోగాసనములు, ప్రాణాయామము చాల హితకరమగు అనుశాసనములు. కాని, దాని యర్థము, సాధకుడు తన జీవితము నంతనూ ఆసన, ప్రాణాయామముల నభ్యసించుటకు ధారపోయాలని కాదు. మరియు, ఈ అనుశాసనములను ఉపేక్షించవలెననియూ తాత్పర్యము కాదు. వాస్తవంలో, ధ్యానమయ జీవితములో ఆసన ప్రాణాయామములు కూడా భాగమై ఉంటాయి. అష్టాంగ యోగము ఆధారముగా గల ఏదో ఒక అనుశాసనమును సాధకులందరు అనుసరిస్తారు. ఇచటి తాత్పర్యమేమనగా, అనుశాసనమేదైనా తగిన సంతులనములో నుండవలెను. అనగా దానియందు ఉపేక్ష పనికిరాదు. మరియు, అత్యుత్సాహము కూడ మంచిది కాదు. సర్వము మితముగా నుండవలెను. సాధారణముగా ఒకదానియందు అత్యభిమానమును పెంచుకొనే లక్షణము మానవులలో కనబడును. అట్లు ఉండరాదు. మనము దేనిని పట్టుకుంటే దానిని ఒక మతోన్మాదముగా మార్చుకొనరాదు. అంతతో గల్యా, చేయవలసిన దానికంటె, తెలియదగినదియే మిగిలియుండును. కావ, ఒకదానియందు ఉన్మాదస్థాయికిచెందిన ప్రేమపనికి రాదని శ్రీకృష్ణుడిచట హెచ్చరించుచున్నాడు.

సోమరితనము లేనివాడు (కర్మసు యుక్తచేష్టస్య), ఆహారమును మితముగా భుజించువాడు, అతి ఎక్కువ గాని తక్కువ గాని నిద్రపోనివాడు, దేహముపై వెర్రిప్రేమను పెంచుకోకుండా దానిని తగు శ్రద్ధతో బలముగా నుంచుకొనువాడు అగు వ్యక్తికి సాధారణముగా శరీరధారణకు అవసరమైన ఆరోగ్యము లభించి, ఆత్మజ్ఞానమునకు సహకారి యగును.

మానవ శరీరము మొట్టమొదటి ధర్మ (మోక్ష) సాధనమని కాళిదాసు చెప్పెను*. కావున, సాధకుడు తన ఆరోగ్యమును సరిగా కాపాడుకొనవలెను. అనగా, ఆహారపు అలవాట్లు, నిద్ర, వ్యాయామము సరిగా ఉండాలి. ఈ మౌలిక ఆవశ్యకతలను మానవుడు ఉపేక్ష చేయరాదు.

జ్ఞానము ఉదయించుటకు ఎంతకాలము పట్టును?

ఈ సందర్భములో రెండు ప్రశ్నలు ఉదయిస్తాయి. ఇంతటి ప్రయత్నము వలన ఫలమేమి? ఆ ఫలము లభించేది ఎప్పుడు? అనుశాసన బద్ధమగు జీవితమును గడుపుతూ, ధ్యానమునకు, మనన నిది ధ్యాసనములకు అంకితమై ఉండే సాధకుడు లక్ష్యమును చేరేది ఎప్పుడు? ఈ 'ఎప్పుడు' అనే ప్రశ్నను సంసారులు సదా అడుగుతూ ఉంటారు. ఈ సుదీర్ఘ దుర్గమ సాధనా మార్గము లక్ష్యమును చేర్చి, పడిన శ్రమకు తగిన ఫలము నిచ్చునా! యను శంక సంసారులకు, సాధనా మార్గమును స్వీకరించుటకు ముందు కలుగుట సహజమే. కాని, ఈ విషయంలో మేము చెప్పునదేమనగా, నీవు పొందవలసినది నిన్ను మాత్రమే. నీవు కొత్తగా పొందేది ఏదీ లేదు. నీ స్వరూపము యథాతథముగా నుండును. నీవు నీ స్వరూపమును ఎరుంగుటయే సర్వశ్రేష్ఠమగు మోక్షము.

ఈ మోక్షమును పొందిన వ్యక్తి తనకు తాను పూర్తిగా స్వీకార్యుడగును. దీని యందు సర్వము ఆత్మరూపమే యను సాక్షాత్కారము కలుగును. బాగున్నది. ఈ సాక్షాత్కారము ఎంతయూ అభిలషణీయముగ నున్నది. కాని, ఇది నాకు కలిగేది ఎప్పుడు? ఇది లభించుటకు ఎంత కాలము పట్టును? నేనీ పనిని తొందరగా పూర్తి చేయగోరుచున్నాను. దీని తరువాత నేను నా జీవితమును, విడిచిపెట్టిన స్థితి నుండి మరల కొనసాగించవలెను. ఈ శంకకు మేమిచ్చే సమాధానమేమనగా, ఇదియే జీవితము. దీనిలో ఎప్పుడు ఇత్యాది ప్రశ్నలకు తావు లేదు. ఉన్నది జీవితము ఒక్కటి మాత్రమే. దీని కంటె భిన్నముగా మరియొక జీవితము లేదు. సర్వము దీనికి సాధనమగును. మానవుడు చేసే పని ఏదైనా, ఈ అన్వేషణ వీడిపోయేది కాదు. ఇది మానవునితో బాటే సదా ఉంటుంది. మానవుడు ఎక్కడ ఉన్నా, ఏమి చేస్తున్నా, ఆత్మరూపుడై ఉండుటకు కావలసిన సామగ్రి అతని వద్ద ఉండనే ఉన్నది. ఈ జ్ఞానము క్రమముగా స్పష్టమగును. దీనికి కొంత సమయము పట్టును. అయినా పరవాలేదు. ఈ మార్గము అంతా ఆనందమే.

---

* शरीरं आद्यं खलु धर्मसाधनम् ।

శరీరం అద్యం ఖలు ధర్మసాధనమ్.

ఏదేని కష్టము వచ్చినప్పుడు మాత్రమే, 'నేని సాధనను ఇంకా ఎంతకాలము చేయాలి?' అను ప్రశ్న ఉదయించును. ఈ ఆత్మ జ్ఞాన సాధన కారాగార శిక్ష వంటిది కాదు. ఇది ఆత్మవిద్య. మానవునకు తనను గురించి తెలిపే విద్య. ఈ జ్ఞానమార్గము ఆది నుండి లక్ష్యము వరకు ఉల్లాసపూర్ణముగ నుండును. ఇట్టి ఉల్లాసమును మతము లేవియూ ఈయజాలవు. 'మానవుడు ఎంత పాపియో! మానవుడు రక్షింపబడవలెను' అని మతములు ప్రాయశః బోధించును. తద్భిన్నంగా, మానవుడు సర్వదా సురక్షితుడను సత్యమును ఈ జ్ఞానము బోధించును. ఈ మార్గములో సమస్యయే లేదు గనుక, 'ఎప్పుడు' అను ప్రశ్న ఇచట ఉదయించదు. ఈ జ్ఞానమును పొందిన వ్యక్తి యొక్క పరిస్థితి ఎట్లుండును? అను విషయమును మనము తెలియవలసి యున్నది. తరువాతి శ్లోకము దానినే బోధించును.

అధ్యాయము 6, శ్లోకము 18:

यदा विनियतं चित्तमात्मन्येवावतिष्ठते ।
निःस्पृहस्सर्वकामेभ्यो युक्त इत्युच्यते तदा ॥ १८ ॥

యదా వినియతం చిత్త మాత్మన్యేవావతిష్ఠతే
నిస్పృహస్సర్వ కామేభ్యో యుక్త ఇత్యుచ్యతే తదా (18)

'వినియతమ్' అను పదమును 'ఏకాగ్రతామాపన్నమ్' అని శ్రీ శంకరులు నిర్వచించిరి. అనగా, మనస్సునకు ఏకాగ్రమై, ధ్యేయ వస్తువునందు మాత్రమే లగ్నము కాగలిగే శక్తి గలదు. అట్లు ఏకాగ్రమైన మనస్సులో ధ్యేయవస్తువు, ధ్యానము చేయు వ్యక్తి వీరి మధ్య భేదము పూర్తిగా తొలగిపోయి, ఒకటిగా అయిపోతారు. మనస్సునకు ఒక విశిష్టమైన నియంత్రణ ఏర్పడి, మననశీలత, ధ్యాన ప్రవణత, తనలో తాను తనతో తాను ప్రసన్నముగా నుండగల్గుట అను లక్షణములను పొందును. ఇట్టి మనఃపరిణతిని పొందుట కొరకై ఆవశ్యకములగు అనుశాసనములను పాటించుటచే ఇట్టి మనస్స్థితి సంభవమగును. ఈ విషయమును మనమిదివరలో చూచియున్నాము. ఇట్టి మనస్సు ఆత్మ యందు మాత్రమే స్థిరముగ నుండును (తస్మిన్ ఆత్మని ఏవ అవతిష్ఠతే). అనగా, మనస్సునకు, ఆత్మకు మధ్యలో అంతరమేమియూ లేదని యర్థము.

కావున, ఈ శ్లోకములో వర్ణింపబడే యోగి దృష్టిలో 'ఆత్మ' అనే ధ్యేయవస్తువు తన కంటె వేరుగా లేదు. ఏలయన, ధ్యేయము, ధ్యాత అనే రెండు కూడ ఆత్మయే. ఈ జ్ఞానము కలుగక

ముందు, ధ్యానము చేయుచున్నాడా యన్నట్లు ఉన్న జ్ఞానికి ఇప్పుడు ఆ ధ్యానము వంటి ధ్యానము యొక్క అవశ్యకత కూడా లేదు. ఏలయన, ఆత్మ ఉండునది ఆత్మ యందు మాత్రమే.

మనస్సు జ్ఞానము వలన ఆత్మయందు ప్రతిష్ఠతమగును

ధ్యానము చేయు వ్యక్తి యొక్క మనస్సు సచ్చిదానంద ఆత్మ యందు స్థిరముగ నుండుట యెట్లు? మనస్సు అచట లగ్నమగు విధమెట్టిది? ఒక వస్తువుపై మరియొక వస్తువు ఉన్న తీరున ఉండునా? కాదు. మనస్సు ఆత్మ యందు శుద్ధ జ్ఞాన రూపమున నుండును. మరో మాటలో చెప్పాలంటే, అహం శబ్దార్థము విషయంలో ఆతనికి భ్రాంతధారణలు గాని, ఊహాజనితమగు కల్పనలు గాని ఉండవు. దానిని మరింత తెలుసుకొనుట కొరకై జ్ఞాని దానిని ధ్యానింమననియూ కాదు. 'ఆత్మని ఏవ అవతిష్ఠతే' అను వాక్యమునకు, మనస్సు ఆత్మ యందు స్థిరముగ నుండగల్గుననియే అర్థము.

జ్ఞాని వివిధ బాహ్య వస్తువుల విషయంలో ఉండే చింతలను, దుఃఖములను విడనాడి, ఆత్మ విషయములో జాగరూకుడై యుండును. అనగా, ఆతని మనస్సు ఆత్మయందు సర్వదా ప్రతిష్ఠితమై యుండును. అంటే, మనస్సు ఆత్మ నుండి ఏనాడూ వేరు కాదు. ఇట్టి సుస్పష్టమైన జ్ఞానమును పొందిన వ్యక్తికి భోగవస్తువులన్నింటి యందలి కామనల నుండి విముక్తి (నిస్స్పృహః సర్వ కామేభ్యః) కలుగును. ఈ విముక్తి ప్రత్యేకముగా పొందబడేది కాదు. ఇది జ్ఞానమును పొందిన వ్యక్తికి సహజముగా కలిగే లక్షణము మాత్రమే.

దుంఖహేతువులగు కామనల నుండి విముక్తి జ్ఞాన ఫలము

కామశబ్దమునకు కోరిక, కోరికలో విషయమగు వస్తువు అను రెండు అర్థములు గలవని మనమిది వరలో చూచియున్నాము. ఒక వస్తువును కోరుటలోని మానసిక ప్రక్రియకు కామము అని పేరు. మనము కోరే వస్తువునకు కూడా కామమని పేరు. కామశబ్దము గీతలో అంతటా ఈ రెండు అర్థములలో ప్రయోగింపబడుటచే, మనము దాని యర్థమును ప్రకరణానుసారముగా గ్రహించవలెను. ప్రస్తుతములో దానికి కోరబడు వస్తువు అని యర్థము.

ఈ కోరబడే వస్తువులు ఏవి? అవి దృష్టములు, అదృష్టములు కూడ కావచ్చును. ఈ లోకములో మానవుడు చూడగలిగేది, సంపాదించగలిగేది దృష్టము అనబడును. మనకు కనబడని

పుణ్యము మొదలగు ఫలము అదృష్టమనబడును. పుణ్యము కాలాంతరములో సుఖము నిచ్చును గాన మనకు అభిలషితమగును. ఒకరకంగా పుణ్యము ధనము వంటిది. దానిని యథాతథముగా భోగించుట కుదరదు. కాని, దానికి కొనుగోలు శక్తి గలదు. అది మనకు భోగ్య వస్తువులను కొనగలదు. కాన, పుణ్యము ఒక మధ్యంతర లక్ష్యము మాత్రమే. పుణ్యమును సంపాదించిన వ్యక్తి భోగములకు అర్హతను పొందును. సానుకూల పరిస్థితులు, సంపద, అధికారము ఇత్యాది వివిధ లక్ష్యములను పుణ్యము అనే సాధనముతో మానవుడు పొందును. ఈ లక్ష్యములు వెనువెంటనే అనుభవమునకు రావు. కాన, వాటికి అదృష్ట ఫలములని పేరు.

కర్మ వలన దృష్టఫలములే గాక అదృష్ట ఫలములు కూడ లభించును. అదృష్టఫలములు పుణ్యప్రాప్యములు. పుణ్యము కూడ అదృష్టమే. ఒకడు ఇహలోకములో ఒక ఫలము నాశించి ఒక వైదిక కర్మను ఆచరించినాడనుకొనుడు. ఆ కర్మ నుండి కోరేది అగ్నిశిఖలు కాదు గదా! జరిగేది ఏమంటే, ఆ కర్మను చేయుట వలన అతనికి ఒక విశిష్ట పుణ్యము యొక్క అనుగ్రహము ప్రాప్తమై, అతడు కోరిన వస్తువును పొందుటకు గల అవరోధముల నన్నిటినీ తొలగించి వేయును. దీని పేరే అదృష్టము. కావున కామన దృష్ట విషయకమైనట్లు, అదృష్ట విషయకము కూడ అగుట సహజమే.

యుక్తుని నిర్వచనము

మనమిచట చర్చించే వ్యక్తి దృష్టా దృష్ట ఫలములు వేటి యందు కామన లేనివాడై యుండును (నిస్స్పృహ స్సర్వ కామేభ్యః). కనబడేవి, కనబడనివి, తెలిసినవి, తెలియనివి ఇత్యాది సర్వ వస్తువుల యందలి కామనకు అతడు దూరముగ నుండును. ఇట్టి వ్యక్తి యుక్తుడు అనబడును (యుక్తః ఇత్యుచ్యతే). అనగా, అతని ధ్యానము, నిదిధ్యాసనము విజయవంతములైనవని యర్థము.

ఒక వ్యక్తి యుక్తుడు అనగా నేమి? ఒక వ్యక్తి తనలో తాను ఉండుటచే కామనలన్నియూ అతనిని వీడిపోవుట యెట్లు సంభవమగును? వ్యక్తికి తన స్వరూపము తెలియకపోవుట చేతనే వస్తువులను కాంక్షించును. కావున, ఈ ఆత్మజ్ఞానము కలుగగానే, మనస్సు ఆత్మ యందు మాత్రమే ప్రతిష్ఠితమై, ఆ వ్యక్తి పూర్ణత్వమును, ఆనందమును పొందును. ఆత్మకు భద్రత విషయంలో గాని, పరిపూర్ణత విషయంలో గాని ఉన్నతిని తీసుకురావలసిన ఆవశ్యకత లేదనే సత్యమును జ్ఞాని యెరుంగును. ఆత్మ యందు లేమి లేదు గాన, జ్ఞానికి లేమి భావన ఉండనే ఉండదు. ఆత్మ స్వరూపతః పూర్ణము, సర్వము కాన, ఆత్మకు మెరుగులు దిద్దే ప్రసక్తి లేదు. కావున, జ్ఞానికి ఏ విధమైన కామనయూ ఉండదు.

లేమి భావన నుండియే కామనలన్నియు ఉదయించును

జ్ఞాని యొక్క మనస్సులో చిన్న చిన్న కోర్కెలు ఉండవచ్చును. అవి సిద్ధిస్తాయి కూడా. వాస్తవంలో జ్ఞానికి కోరే విశేషాధికారము (privilege) గల మనస్సు ఉండును. జ్ఞాని మనస్సులో ఈ గొప్ప ఇచ్ఛా శక్తి ఉండును. కావుననే, అతని కోర్కెలు అతనికి విశేషాధికారములే గాని బంధకములు కావు. జ్ఞాని యొక్క కోర్కెలు లేమి భావన నుండి పుట్టినవి గావు; పూర్ణత నుండి పుట్టినవి. ఏతద్భిన్నంగా, అజ్ఞానిలో ఆత్మ యందు కేంద్రితమై లేమి భావన ఉండును. ఈ లేమి మనస్సులో గాని, మరియొక దాని యందు గాని యథార్థముగా ఉన్నది కాదు. ఉదాహరణకు, 'నా దేహమునకు ఫలానాది లేదు' అని మనము అనుకున్నప్పుడు, ఈ లేమి దేహముతో తాదాత్మ్యమును పొందిన ఆత్మ యందు కేంద్రితమై యుండును. దేహమునకు సహజముగనే కొన్ని పరిమితులు గలవు. ఆ దృష్ట్యా చూస్తే దేహములో లేమి ఉన్న మాట వాస్తవమే. కాని, దేహములో ఉన్న ఈ విధమైన లేమి సమస్య కానే కాదు. ఆత్మ యొక్క స్వరూపమును గుర్తించలేక పోవుటచే కలిగే 'నాకు లేదు' అను భావన సమస్య యగును.

న్యూనతా ధారణ నుండియే కోర్కెలన్నియూ బయలుదేరును. ఈ కోర్కెల పరిపూర్తి ఆధారంగా వ్యక్తికి తనలో ఒక భద్రతా భావన గోచరమగును; తనలో తనకు ఒక తృప్తి కలుగును. కాబట్టి, ఈ కోర్కెలు వ్యక్తిని బంధిస్తాయి. ఈ కారణంగానే, కోరికల పరిపూర్తి వ్యక్తి జీవితములో ప్రధాన లక్ష్యముగా మారుతుంది. కాని, కుందేళ్లు వలె కోర్కెలు కూడా ఒక దాని నుండి మరికొన్ని చొప్పున అసంఖ్యాకంగా పుట్టుకొస్తాయనే సత్యమును వ్యక్తి తొందరగా గాని, ఆలస్యంగా గాని గుర్తించి, వాటి కోసం ప్రయత్నమును వీడి, లోక సంచారిగనో, పిచ్చివాడుగనో తయారవుతాడు. కావున, ఈ న్యూనతా భావము నుండి పుట్టే కోర్కెలు అనంతము లన్నదే ఇచటి ప్రధాన విషయము. ఈ సత్యమును గుర్తించిన వ్యక్తి విచారమును ఆరంభించును. 'నేను ఎవరిని? నేను వాస్తవంగా దేనిని అన్వేషిస్తున్నాను? ఏల ఈ అన్వేషణ? నేను వెతుకుతున్నది నా కంటె వేరుగా యున్నదా? లేక, నన్ను నేనే వెతుక్కొంటున్నానా?' ఇత్యాది ప్రశ్నలు ఉదయించును.

వాస్తవంలో నన్నే నేను వెతుక్కుంటున్నాను. నా యందు నాకు ఒక న్యూనతా భావము కేంద్రితమై యున్నది. ఇదియే సమస్య. నేని న్యూనత నుండి విముక్తిని కాంక్షిస్తున్నాను. నాకు కావలసినది ఇంతియే. నాలో ఈ న్యూనతా భావన స్వభావముగా స్థిరపడినచో, నేను దానిని ఏనాటికీ వదిలించుకోలేను. కాని, అప్పుడప్పుడు నాలో ఈ న్యూనతా భావము లేని స్థితిని కూడా

దర్శించగల్గుతున్నాను. నేను కళ్లుతెరిచి, అతి సుందరమగు వస్తువు నొకదానిని చూచి, నోటిని తెరచి, 'ఆహా' అన్న క్షణములో నేను న్యూనతా భావము నుండి విముక్తుడనైనాను అనే సత్యమును నేను చూడగల్గుతున్నాను. స్వర్గము నా లోపల ఉన్నది. నేను నవ్వినప్పుడు అదంతా స్వర్గమే. ఇట్లు నాకు రెండు అనుభవములు గలవు. న్యూనతా భావము ఒకటి. అది లేకపోవుట రెండవది. కావున, నాలో ఒక న్యాయసమ్మతమగు శంక ఉదయించుచున్నది. బహుశః నన్ను గురించి నేను భ్రాంతి పడుచున్నానేమో! బహుశః నా నిర్ణయములు తప్పు అయి ఉండవచ్చును. ఇట్టి శంక వ్యక్తిని విచారమార్గములోనికి తీసుకొని వెళ్లును. ఇదియే విచారమునకు ఆది.

ఇట్టి విచారమును చేసి, మనస్సును జ్ఞానోదయ యోగ్యముగా సంసిద్ధము చేయుటకై ఆవశ్యకమగు అను శాసనములను పాటించి ఆత్మ జ్ఞానమును పొందిన వ్యక్తిని గూర్చి మనమీ శ్లోకములో చర్చిస్తున్నాము. ఈతని మనస్సులో శంకలకు చోటు ఉండదు. ఈతడు పరిపూర్ణమగు ఆత్మసాక్షాత్కారమును కలిగియుండును. ఈతనికి ఆత్మ విషయములో ఊహాగానములు గాని, అస్పష్టత గాని ఉండవు. ఈతడు సర్వకామనల నుండి, ఆసక్తుల నుండి విముక్తుడై ఉండుట సహజమే. తరువాతి శ్లోకములో శ్రీకృష్ణుడు ఇట్టి యోగికి ఉపమానము నొకదానిని చెప్పుచున్నాడు. ఈ ఉపమానమును పండితులు తరుచుగా ఉదహరిస్తారు.

అధ్యాయము 6, శ్లోకము 19:

यथा दीपो निवातस्थो नेङ्गते सोपमा स्मृता ।
योगिनो यतचित्तस्य युञ्जतो योगमात्मनः ॥ १९ ॥

యథా దీపో నివాతస్థో నేంగతే సోపమా స్మృతా
యోగినో యతచిత్తస్య యుంజతో యోగమాత్మనః (19)

యథా = ఏ తీరున; **నివాతస్థః** = వాయు సంచారము లేని ప్రదేశములో నున్న; **దీపః** = దీపము; **న ఇంగతే** = చలించదో; **యోగం** = ధ్యానయోగమును; **యుంజతః** = అభ్యసించుచున్న; **యోగినః** = యోగి యొక్క; **యతచిత్తస్య** = నియంత్రితమైన మనస్సునకు; **సా** = అది; **ఉపమా** = ఉపమానముగా; **స్మృతా** = స్మరింపబడును.

> ధ్యానయోగమును అభ్యసించుచున్న యోగి యొక్క నియంత్రితమగు మనస్సునకు, వాయు సంచారము లేని ప్రదేశములో చలనము లేకుండగ నున్న దీపము ఉపమానముగా ఈయబడును (19).

ఉపమానము ఉపమేయము యొక్క పూర్ణ పరిచయము నీయజాలదు. కాని ఉపమానము మన అవగాహనను ఉపమేయమునకు కొంత దగ్గరగా తీసుకొని వెళ్లును. గవయ మృగము గవయ మృగము వలె నుండును అన్నచో అది ఉపమానమే కాదు. ఏలయన, మనకు గవయమును గురించి ఉన్న అవగాహన ఈ ఉపమానము వలన లేశమైననూ ప్రభావితము కాలేదు. ఈ వాక్యము వినుటకు ముందు గవయమును గురించి అవగాహన ఎట్లు ఉండెనో, విన్న తరువాత కూడ అటులనే యున్నది. గయవమృగము గోవువలె నుండును అన్నచో, ఆ వాక్యము గవయమృగమును గురించి మనకు కొంత స్పష్టమగు అవగాహనను కలిగించును. అది గోవు వంటి ఆకారమును కలిగిన పెద్ద జంతువు. గవయమృగమును ప్రత్యక్షముగా చూసినపుడు దానికి, గోవునకు గల భేదము స్పష్టమగును. ఇట్టి వాక్యమునకు ఉపమా యని పేరు.

ఆత్మను ధ్యానించి, ఆత్మను యెరింగిన వారు జ్ఞాని యొక్క మనస్సును గాలి వీచకుండా రక్షింపబడే దీపశిఖతో పోల్చిరి. జ్ఞాని యొక్క మనస్సు నిశ్చలముగ నుండునని వారు వర్ణించెదరు. అనగా, మనస్సు స్తబ్ధీభావమును పొందియుండు ననుకోరాదు. మనస్సులో దీపశిఖలో వలె నిరంతర కాంతి ప్రవాహము ఉండునని యర్థము. వాస్తవంలో దీపశిఖ ఒక స్థిరమగు వస్తువు కాదు. శిఖ బయల్వెడలిన చోట వేగమును తగ్గించగలిగినచో, శిఖలోని నిరంతర ఊర్ధ్వ గమనమును చూడగల్గుతాము. ఇట్టి ఊర్ధ్వగమనము కలదియే అయిననూ, శిఖ ఇటునిటు చలించదు. అదే విధముగా యోగి (జ్ఞాని) యొక్క నియంత్రితమగు మనస్సులో వృత్తి ప్రవాహము నిరంతరముగా సాగుచున్నను, మనస్సు ఇటునటు చలించదు. భయము, సంక్షోభము ఇత్యాది వివిధ కారణముల వలన జ్ఞాని యొక్క మనస్సు ఇటునటు చెదరిపోదు. అనగా, జ్ఞాని ఎట్టి విషమ పరిస్థితుల నెదుర్కొనుచున్ననూ, మనస్సు చలించదు. యోగి యొక్క మనస్స్థితిని ఎరిగిన వారు మాత్రమే ఇట్టి ఉపమను ఉదహరించగల్గుదురు (ఉపమా స్మృతా).

ఇచట ఉపమకు ఆవశ్యకత యేమి?

ఉపమానము బోధించువానికి, బోధింపబడువానికి ఇద్దరికీ తెలిసినదై ఉండాలి. మరియు ఉపమానము ఉపమేయమును దగ్గరగా పోలి ఉండాలి. జ్ఞాని యొక్క మనస్సును గురించి తెలిసిన

వారు ఇచట ఒక ఉపమానమును ఇచ్చుటకు కారణమేమి? చిన్నపిల్లలకు పెద్దవాళ్లు ఎదుర్కొనే సమస్యల గురించి అవగాహన ఉండదు. అటులనే, ఇచట శ్రీకృష్ణుడు ఉపదేశించుచున్న సాధకుడు కూడా తాను ఉన్న అజ్ఞానావస్థలో నుండి జ్ఞాని యొక్క మనస్సును గురించి కల్పన చేయజాలడు. 'అయ్యో! షేర్ల విలువ పడిపోయినది' అని తండ్రి అంటూ ఉండగా, కుర్రవాడు వినినాడనుకొనుడు. తండ్రి, తల్లి, చుట్టూ ఉన్న బంధువర్గము అందరూ దుఃఖితులై ఉన్నారని పిల్లవానికి అర్థమవుతుంది. కాని, వారి దుఃఖమునకు కారణము పిల్లవాని అవగాహనకు రాదు. పిల్లవానికి కావలసినది మరియొక బొమ్మ మాత్రమే. కారణమేమనగా, పిల్లవాని మనస్సు వేరు. పెద్దల మనస్సు వేరు. పిల్లవాడు పెరిగి పెద్ద అయిన తరువాత మాత్రమే పెద్దవారి సమస్యలు అర్థమగును.

పిల్లవాని మనస్సులో ప్రౌఢమగు మనస్సు అణిగియుండును. పిల్లవాడు పెరిగి పెద్ద అగునంత వరకు అతనికి పిల్లల సమస్యలు మాత్రమే ఉండును. ఇరవై అయిదు ఏళ్ల వయస్సు గల వ్యక్తి ఇంకనూ బుడగలతో, బొమ్మలతో ఆడుకొనుచున్నాడనుకొనుడు. అతని స్థితి చుట్టూ ఉన్నవారికి పెద్ద సమస్యయే కావచ్చును. కాని అతని మనస్సు పెద్దవాళ్ల సమస్యలకు దూరముగా నుండును. యథార్థమగు సమస్య ఏదనగా, వ్యక్తి పెరిగి పెద్ద అయిననూ, అంతరంగంలో భద్రత కోసం, ఇతరుల ప్రేమాభిమానాల కోసం పరితపించే పిల్లవానిగా ఉంటాడు. ఇట్టి వ్యక్తి పూర్ణప్రౌఢుడగు వ్యక్తితో సరిగా వ్యవహరించలేడు. పరిణతమైన మనస్సు గల వ్యక్తిని మాత్రమే యథార్థముగా ప్రౌఢుడు అనవచ్చును. ఇట్టి పరిణతమైన మనస్సు సమస్యలను సృష్టించదు. అట్టి ప్రౌఢుని దృష్టిలో మనస్సు ఒక అంతరంగ సాధనము మాత్రమే. ఇట్టి పరిణతమగు మనస్సు ఈ శ్లోకములో దీపశిఖతో పోల్చబడినది. ఇట్టి మనస్సును గురించి కల్పన లేనివారి కొరకై ఈ ఉపమానము ఉద్దేశింపబడినది.

మన కంటికి కనబడే దానికి, లేదా మనము ఊహించగల్గిన దానికి ఉపమానముతో పనిలేదు. వస్తువు లభించే పక్షంలో వస్తువును చూపించవచ్చును. ఉదాహరణకు, పుస్తకమును చూపించి 'ఇది ఒక పుస్తకము' అని చెప్పవచ్చును. నేను పుస్తకమును చూపిస్తూ, దానికి ఉపమానమును చెప్పనవసరము లేదు. కాని, మనకు గవయమృగము తెలియదు. గోవు తెలియును. అట్టి స్థితిలో 'గవయము గోవు వలె నుండును' అను వాక్యము సార్థకమగును. గవయమునకు, గోవునకు మధ్య పోలిక గలదు. కావున, ఈ వాక్యమును విన్న వ్యక్తికి గవయము గురించిన జ్ఞానము యథార్థస్థితికి దగ్గరగా వచ్చును. ఇదే విధముగా, జ్ఞాని యొక్క మనస్స్థితిని తెలుసుకొనుటకు దీపశిఖ దృష్టాంతముగా నీయబడినది. జ్ఞాని యొక్క మనస్స్థితి తెలిసిన వారు ఇచ్చిన దృష్టాంతమిది.

'యోగం యుంజతః' అనగా పతంజలి మహర్షి యొక్క అష్టాంగయోగమును అనుసరించు వ్యక్తి కావచ్చును. లేదా, ఆత్మను మననము, ధ్యానము చేయు వ్యక్తి కావచ్చును. యోగము అనగా అభ్యాసము. అనగా, అతడు తన మనస్సును ఆత్మ యందు ఐక్యము చేయుటకు యత్నించుచున్నాడని యర్థము (యుంజతః యోగం ఆత్మనః). 'యుంజతః' అనగా మనస్సును ఆత్మతో ఐక్యము చేసే నిదిధ్యాసనరూపమగు యోగమును అభ్యసించువాడని శ్రీ శంకరులు వివరించిరి. శ్రీకృష్ణుడీ విషయమును ఇంకనూ నాల్గు శ్లోకములలో వివరించుచున్నాడు:

అధ్యాయము 6, శ్లోకము 20:

यत्रोपरमते चित्तं निरुद्धं योगसेवया ।
यत्र चैवात्मनात्मानं पश्यन्नात्मनि तुष्यति ॥ २० ॥

యత్రోపరమతే చిత్తం నిరుద్ధం యోగసేవయా
యత్ర చైవాత్మ నాత్మానం పశ్యన్నాత్మని తుష్యతి (20)

యత్ర = ఏ కాలము నందు; యోగసేవయా = ధ్యానయోగమును అభ్యసించుట చేత; నిరుద్ధం = నియంత్రింపబడిన; చిత్తం = మనస్సు; ఉపరమతే = (ఆత్మయందు) స్థిరముగ నుండునో; చ = మరియు; యత్ర = ఏ కాలమునందు; ఆత్మనా = తనచేత; ఆత్మానం = తనను; పశ్యన్ = చూచుచున్నవాడై; ఆత్మని = ఆత్మయందు; ఏవ = మాత్రమే; తుష్యతి = సంతసించునో.

> ఏ కాలమునందు ధ్యానయోగాభ్యాసముచే నియంత్రితమైన మనస్సు ఆత్మ యందు స్థిరముగ నుండునో, మరియు తనచే తనను తన యందు దర్శించి సంతుష్టుడగునో .... (20)

ఇచట ఆత్మయనగా సచ్చిదానంద ఆత్మ. జ్ఞాని తనను బ్రహ్మరూపునిగా గుర్తించును. జ్ఞాని ఆత్మ బ్రహ్మాభిన్నమని దర్శించుటలో సాధనమేది? మనోవృత్తియే సాధనము (ఆత్మనా). ఆత్మ బ్రహ్మాభిన్నమని గుర్తించిన జ్ఞాని ఆత్మ యందు ఆనందమును పొందును. ఈ శ్లోకములో ఆత్మన్ శబ్దము యొక్క నాల్గు విభక్తులు ప్రయోగింపబడినవి. 'తనను' అనే అర్థములో ద్వితీయావిభక్తి, లేదా కర్మకారకము (ఆత్మానమ్) మొదటిది. 'తనచేత' అనే అర్థములో తృతీయా విభక్తి, కరణకారకము (ఆత్మనా) రెండవది. 'తనయందు' అనే అర్థములో సప్తమీ విభక్తి, ఆధారకారకము (ఆత్మని)

మూడవది. ఆనందమును పొందునదెవరు? ఆత్మరూపుడగు యోగి. ఆత్మా అను ప్రథమావిభక్తి ఆనందమును పొందే కర్తను బోధించే కారకము. ఇది నాల్గవది. ఈ నాలుగు కలిసి, ఆత్మను ఆత్మచే దర్శిస్తూ, ఆత్మ ఆత్మ యందు ఆనందమును పొందును. ఈ శ్లోక తాత్పర్యమును మనము తరువాతి శ్లోకము యొక్క చర్చలో తెలుసుకుంటాము.

ఆనందము ఆత్మ యొక్క స్వరూపము. ఆత్మ యందు లేమి లేశమైననూ లేదు. యోగి అట్టి ఆత్మ యందు ఆనందించును.

శ్రీకృష్ణుడింకనూ ఇట్లు కొనసాగించెను:

అధ్యాయము 6, శ్లోకము 21:

सुखमात्यन्तिकं यत्त द्बुद्धिग्राह्यमतीन्द्रियम् ।
वेत्ति यत्र न चैवायं स्थितश्चलति तत्त्वतः ॥ २१ ॥

సుఖమాత్యంతికం యత్త ద్బుద్ధి గ్రాహ్యమతీంద్రియమ్
వేత్తి యత్ర న చైవాయం స్థితశ్చలతి తత్త్వతః (21)

యత్ర = ఏ కాలము నందు; **అయం** = ఈ యోగి; **యత్** = ఏ; **బుద్ధి గ్రాహ్యం** = బుద్ధిచే గ్రహింపబడే; **అతీంద్రియమ్** = ఇంద్రియములకు అతీతమైన; **ఆత్యంతికం** = ఆత్యంతికమైన; **సుఖం** = సుఖము గలదో; **తత్** = దానిని; **వేత్తి** = ఎరుంగునో; **చ** = మరియు; **స్థితః** = స్థిరముగా నున్నవాడై; **తత్త్వతః** = ఆత్మ యొక్క సత్యస్థితి నుండి; **న ఏవ చలతి** = చలనమును పొందడో.

> ఈ యోగి ఏ కాలము నందు బుద్ధిచే గ్రహింపబడే ఇంద్రియాతీతమగు ఆత్యంతిక (పూర్ణ) ఆనందము నెరింగి, ఆత్మ తత్త్వము నందు స్థిరముగా చలనము లేకుండగా నుండునో .... (21)

మనము ఒక వస్తువును గుర్తించే వృత్తి, వృత్తిలో విషయమగు వస్తువు అభిన్నములు. అంటే, వస్తువును గుర్తించుటకు, వృత్తిలో ఆ వస్తువు విషయమై తీరాలి. నేను ఘటమును గుర్తించుటకై వృత్తి ఘటాకారమును పొంది తీరాలి. అందువలననే, ఆ వృత్తికి ఘటవృత్తి అని పేరు. ఘటవృత్తి చేత మాత్రమే మనము ఘటము అనే వస్తువును గుర్తిస్తాము.

ఆత్మను గుర్తించుటకు కూడా ఒక వృత్తి ఉండాలి. శాస్త్రము ఈ వృత్తిని ఉత్పన్నం చేస్తుంది. నిదిధ్యాసనము చేయు సాధకుడు ఈ వృత్తిని స్మరిస్తాడు. ఇది ఆత్మ విషయకమగు అజ్ఞానమును నశింపజేయును. ఆత్మ స్వరూపమును గుర్తించే ఈ వృత్తి తాను ఆత్మ స్వరూపములో లీనమైపోవును. అనగా ఇతర వస్తువులు వృత్తిలో విషయమయ్యే తీరున, ఆత్మ వృత్తిలో విషయము కాదు. ఘట విషయీకరణము (objectification) లో రెండు ప్రక్రియలు గలవు. వృత్తి ఘటాకారమును పొందుట మొదటిది. నేను వృత్తిని గుర్తించుట, తద్వారా ఘటమును గుర్తించుట రెండవది. ప్రథమంగా వస్తువు వృత్తిలో విషయమగును. తరువాత ఆ వృత్తి గుర్తింపబడును. వస్తువును విషయముగా చేసే వృత్తి మరియొక వృత్తిచే గుర్తింపబడును. ఆ మరియొక వృత్తియే ద్రష్ట. నేను ఘటజ్ఞానమును పొందే ద్రష్టను అగుదును. అంటే, ఈ నేను-భావన (అహం-వృత్తి) జ్ఞాతృ (subject) స్థాయిని ఆరోపించుకొని, వస్తువును వృత్తి ద్వారా గుర్తించి, ఇది ఘటము (అయం ఘటః) అని చెప్పును.

జ్ఞాతయగు ఆత్మకు, జ్ఞాతచే విషయముగా చేయబడే వస్తువునకు మధ్యలో గల ఈ విచిత్రమగు సంబంధము (ఆత్మ-అనాత్మ-సంబంధము) ద్వారా సర్వవస్తుజ్ఞానము కలుగును. ఈ సంబంధము రెండు ప్రక్రియల ద్వారా ఏర్పడును. వృత్తి వస్తువును విషయముగా చేయుట మొదటిది. జ్ఞాత వృత్తిని గుర్తించుట రెండవది. ఇట్లు గుర్తించుట చేతనే, జ్ఞాత 'ఇది ఘటము' అని చెప్పగల్గును. కాని, 'ఇది ఆత్మ' అని చెప్పుటకు వీలుపడదు. అట్లు చెప్పవలసినది ఎవరు? చెప్పవలసినది నేనే. అంటే, ఆత్మకు ఆత్మయే విషయమగును. అప్పుడది నా జ్ఞానములో విషయమయ్యే ఇతర వస్తువుల వలె అనాత్మ యగునే గాని, ఆత్మ కాజాలదు.

ఆత్మ సాక్షాత్కారము ఇతర వస్తు దర్శనము వంటిది కాదు

'ఆత్మ దర్శనము' అను మాటను శ్రీకృష్ణుడు పూర్వశ్లోకములో ప్రయోగించి యున్నాడు. ఈ దర్శనము ఇతర వస్తుదర్శనము వంటిది కాకపోవుట సహజమే. ఈ రెండింటికీ ప్రక్రియల సంఖ్యలో భేదము గలదు. ఆత్మ దర్శనములో ఒకే ఒక ప్రక్రియ గలదు. వస్తు దర్శనములో ఉండే రెండవ ప్రక్రియ ఆత్మ దర్శనములో లేదు. మొదటి ప్రక్రియ మాత్రమే గలదు. ఆత్మను విషయముగా చేయు వృత్తి ఆత్మ రూపమును పొందును. శుద్ధ (కేవల) చైతన్యమే ఆత్మ. మానవుడు ఈ సత్యమును గుర్తించినప్పుడు, ఆ గుర్తింపులో వృత్తి చైతన్యరూపమగును. ఈ గుర్తింపులో ద్వితీయవస్తువు లేదు. ఆ విశిష్టవృత్తి ఆత్మ స్వరూప విషయకమగు అజ్ఞానమును నశింపజేసి, తాను అంతర్ధానమగును. కాబట్టి, ఈ దర్శనములో ఒకే ఒక ప్రక్రియ గలదు. అనగా, ద్వితీయ వస్తు జ్ఞానము ఈ దర్శనములో లేదు గనుక, 'ఇది ఆత్మ' అనే విధముగా జ్ఞాత గుర్తించే రెండవ ప్రక్రియ ఈ దర్శనములో లేదు.

ఆత్మను గురించి మానవునకు భ్రాంతి ఉండుటచే, ఆత్మ విషయక అజ్ఞానము ఉండుటచే ఆత్మ దర్శనము అనే ఈ ప్రక్రియ ఆవశ్యకమగుచున్నది. వృత్తి ఆ అజ్ఞానమును నశింపజేయును. అపుడు వ్యక్తి ఆత్మ సాక్షాత్కారమును పొందును. దీనిని గురించి మరింత వివరమును మనము చూడబోతాము.

జ్ఞాని ఆనందించేది దేని గురించి?

ఆనందించుటకు తగిన కారణము ఉన్నప్పుడు మాత్రమే మానవులు ఆనందిస్తారు. ఆ కారణము ఆత్మసాక్షాత్కారము కాదు. ఆనందించుటకు తగిన పరిస్థితి, లేక ఘటన సంభవించినప్పుడు మాత్రమే ఆనందిస్తారు. కాని, మనమీ శ్లోకములో చర్చిస్తున్న జ్ఞాని దేని విషయంలో ఆనందిస్తున్నాడు? ఆత్మ స్వరూపమైన పూర్ణ ఆనందమును అతడు సాక్షాత్కరించుకున్నాడు. ఈ దర్శనము బుద్ధి కృతము. ఇంద్రియగోచరము కాదు (సుఖం ఆత్యంతికం యత్తద్ బుద్ధి గ్రాహ్యమతీంద్రియమ్).

పూర్ణము, ఆత్మ స్వరూపభూతము నగు సుఖము ఆత్యంతిక సుఖమనబడునని శ్రీ శంకరులు భాష్యములో వివరించిరి. అంటే, ఆ సుఖమునకు బాహ్యాకార వృత్తితో సంబంధము లేదని స్పష్టమగుచున్నది. ఆత్మ జ్ఞానము వృత్తి రూపమనుటలో సందేహము లేదు. కాని, ఈ వృత్తి వ్యక్తిలో బాహ్యముగా నుండే ఒక విశిష్ట పరిస్థితి వలన పుట్టినది కాదు. పూర్వశ్లోకములోని 'ఆత్మానం' అను పదము ఈ శ్లోకములో 'ఆత్యంతిక సుఖం' అని మారినది. ఆత్మను దర్శించుట యనగా, ఆత్మ యొక్క స్వరూపము ఆత్యంతిక సుఖమని గుర్తించుటయే. ఈ గుర్తింపు బుద్ధి యందు మాత్రమే ఉదయించును. ఈ సుఖము ఇంద్రియములకు అతీతమైనదనియు (అతీంద్రియం) తెలియవలెను.

ఆత్యంతిక, ఆపేక్షిక సుఖములకు గల భేదము

ఆత్యంతిక సుఖము, లేక ఆత్మ సుఖము విషయేంద్రియ సన్నికర్ష వలన, లేక కొన్ని ప్రత్యేక పరిస్థితుల వలన కలిగే సుఖము (విషయ సుఖమ్) కంటె పూర్తిగా విలక్షణమైనది. సుఖమేదైనా ఒక మనోదశయే గదా! కావున ఆత్మ సుఖ, విషయ సుఖములు రెండు బుద్ధి గ్రాహ్యములే. బుద్ధి గోచరముగాని నాసికా సుఖము ఇత్యాది సుఖములు లేవు గదా! మనము ఒక మధుర శబ్దమును వింటే కలిగే సుఖము లోపల ఉండునదే గాని, బయట ఉండదు. ఒకప్పుడు వ్యక్తి ఒక సమస్యను, లేక ప్రహేళికను తనంత తానుగా పరిష్కరించగలిగినప్పుడు గొప్ప సుఖమును పొంది 'యురేకా' అని గొంతు వేయును. ఈ సుఖము గుర్తింపు లేక విజ్ఞానము వలన కలిగినది (విద్యా సుఖము). ఆ స్థితిని

గీతా పరిభాషలో చెప్పాలంటే, ఆ వ్యక్తి యొక్క సాత్త్విక చిత్త వృత్తిలో వృద్ధి కలిగినది. సత్త్వము వృద్ధి చెందినపుడు మనస్సు మరింత ప్రసన్నమగును (శాంతం అంతఃకరణమ్). జ్ఞానము, సత్త్వము సదా కలిసి ఉండుటచే, ఈ సుఖము కలిగినది. కాబట్టి అతి సరళమైనది గాని, అతి క్లిష్టమైనది గాని విజ్ఞానము ఏదైనా కొంత సుఖము నిచ్చును. దీనిని మనము విద్యా సుఖము అంటాము.

కాని ఇట్టి విజ్ఞాన జన్యసుఖము కూడా తాత్కాలిక సుఖము మాత్రమే. ఒక చిక్కుముడి విడిపోయి లభించే సుఖము శీఘ్రముగా తొలగిపోవును. ఊలుదారపు బంతిలోని చిక్కుముడులను విప్పుతూ ఉంటే సుఖము కలిగే పక్షంలో, నీవు ఆ దారపు బంతిలోని ముడులను మరల మరల విప్పుతూ మరికొంత సుఖమును పొందుతూ గడుపవచ్చును.

ఒక వస్తువును కోరి, దానిని పొంది, అనుభవించినపుడు ఒక సుఖము కలుగును. ఇదియే విషయసుఖము. కోరిన వస్తువు ఇచ్చే సుఖము వివిధ శ్రేణులకు చెందియుండును. దానిని చూచుట తోడనే కొంత సుఖము కలుగును. దానిని పొంది, అనుభవించినపుడు మరికొంత సుఖము కలుగును. ఈ విధముగా విషయ సుఖములలో శ్రేణులు గలవు. ఈ సుఖమును సర్వప్రాణులు, ఒక కుక్క, ఒక పిల్లి కూడ పొందును. కాని, విద్యాసుఖమును మానవులు మాత్రమే పొందెదరు. మానవుడు ఘనకార్యములు చేసి పొందే సుఖము విద్యాసుఖములో భాగమే. ఒక కోరిక తీరి, పరిస్థితిలో వచ్చే అభిలషణీయమగు మార్పుల వలన విషయసుఖము కలుగును.

యోగజన్యమగు సుఖము మరియొకటి గలదు. ప్రార్థన, ధ్యానము యోగములో భాగమే. వాటి వలన ఒక విశిష్ట సుఖము కలుగును. ప్రాణాయామాదులు కూడా కొంత సుఖము నీయగలవు. ఈ విధముగా విషయసుఖము, విద్యాసుఖము, యోగసుఖము అని సుఖము మూడు విధములుగా నున్నది. విద్యాసుఖ, విషయసుఖములు అందరికీ లభించునవే. కాని, యోగసుఖము కర్మయోగికి, భక్తునకు మాత్రమే లభించును. వానిలో మనఃపరిణతి ఉండుటచే ఒక విశిష్టసుఖము కలుగును. ధ్యానములో కూర్చుండే స్థితి (ఆసనము) లో కూడ ఒక సుఖము గలదు. అనుశాసనము, ఆరోగ్యము ఇత్యాదుల వలన ఒక విశిష్టమగు సుఖము, సంతృప్తి కలుగును. వీటికే యోగసుఖమని పేరు.

ఇవిగాక నాల్గవ సుఖము కూడ గలదు. దానికి తురీయసుఖము అని పేరు. ఒక వస్తువు లభించుట, ఒక విజయము ఇత్యాదులపై తురీయసుఖము ఆధారపడదు. అది ఒక సత్యమును తెలుసుకున్నపుడు కలిగే సుఖము కాదు. ఒక వస్తువు లభిస్తే కలిగే సుఖము కాదు; ఇది ఆత్మను,

స్వస్వరూపమును గుర్తించుట వలన కలిగే సుఖము. శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పిన ఆత్యంతిక సుఖమిదియే. ఇదియే బుద్ధి గ్రాహ్యము, అతీంద్రియమునగు పూర్ణసుఖము.

ఆత్మరూపమగు సుఖము

ఈ సందర్భంలో జనులు భ్రాంతిపడుతూ ఉంటారు. అతీంద్రియ సుఖమనగా ఇంద్రియగోచరము కాని సుఖము. సుఖములనన్నింటినీ గ్రహించేది బుద్ధియే. విషయసుఖ, విద్యాసుఖ, యోగసుఖములు మూడు బుద్ధి గ్రాహ్యములే. కాని, అతీంద్రియములు కావు. తద్భిన్నంగా, ఈ పూర్ణసుఖము బుద్ధిగ్రాహ్యము, అతీంద్రియము కూడా. అనగా, ఇది బాహ్యపరిస్థితుల వలన గాని, అంతరంగ దశల వలన గాని కలిగేది కాదు. యోగసుఖము బాహ్య పరిస్థితుల వలన పుట్టేది కాకపోయినా, అంతరంగ దశనుండి పుట్టును. విషయసుఖము బాహ్య పరిస్థితుల నుండి పుట్టును. కాని, శ్రీకృష్ణుడిచట వర్ణిస్తున్న సుఖము ఈ విధముగా పుట్టునది కాదు. అది స్వరూపభూతమైన సుఖము.

ఈ సుఖము దేని నుండి పుట్టును? దీనిని ఉత్పన్నము చేయు విధమెట్టిది? అను విషయమును జనులు తెలియగోరుట సహజమే. కాని ఈ 'పుట్టుట' అను ధారణ అజ్ఞాన జనితము. ఇది సంసారి యొక్క, అజ్ఞాని యొక్క, అవివేకి యొక్క ఆలోచనా సరళి. కావున, మనమిచట జాగరూకులమై గమనించవలెను. పూర్ణసుఖము బుద్ధి గ్రాహ్యమే అయినా, అతీంద్రియము. అనగా, దానికి ఇంద్రియజ్ఞానముతో పనిలేదు. అది ఆత్మరూపము.

ధ్యానము చేయు సాధకుడు ఆత్మ స్వరూపమును గుర్తించిన కాలములో (యత్ర వేత్తి) ఏమగును? ఆత్మ స్వరూపము ఆత్యంతిక సుఖము అనే సత్యజ్ఞానము నుండి అతడు ప్రచ్యుతుడు కాడు (తత్త్వతః న చలతి). తత్త్వము అనగా వస్తువు యొక్క భావము లేక స్వరూపము. ఇచట తత్త్వము అనగా ఆత్మ స్వరూపము. ఆత్మయొక్క స్వరూపము ఆత్యంతిక సుఖము. ఆత్మ పరిచ్ఛేదము, లేమియు లేని పూర్ణస్వరూపము. ఈ సత్యము నుండి జ్ఞాని ఏనాటికీ జారిపోడు (న ఏవ చలతి).

సాక్షాత్కారమునకు, అనుభవమునకు మధ్య గల భేదము

మనమిచట చర్చించే యోగమునకు, అష్టాంగ యోగమునకు మధ్య గల భేదము ఈ సాక్షాత్కారమే. ఈ భేదమును స్పష్టంగా తెలుసుకోవాలి. ఈ సాక్షాత్కారము అష్టాంగయోగములోని

సమాధి యని భ్రమపడరాదు. జ్ఞానోదయమునకు మనస్సును సంసిద్ధము చేయుటలో అష్టాంగయోగము అనే అనుశాసనమునకు ప్రముఖమైన స్థానము గలదు. కావున, అది వ్యర్థమని గాని, తక్కువది అని గాని తలంచరాదు. అష్టాంగయోగము ఒక గొప్ప అనుశాసనము. కాని, అది ఒక అనుశాసనమని తెలియకపోతే, దానికీ, చరమలక్ష్యముగా సర్వప్రాణులచే కోరబడే ఆత్మజ్ఞానమునకు మధ్యలో భ్రాంతి ఉదయించుట సహజమే.

అష్టాంగయోగములోని సమాధి అనుభవాత్మకమైనది. సంసారి ఈ సంసారములో, అనగా ఈ ప్రపంచములో సాధించగలిగే విషయములన్నింటిలో సర్వశ్రేష్ఠమగు అనుభవాత్మకమైన ఉపలబ్ధియే సమాధి. ఈ అర్థంలో, అష్టాంగయోగములోని సర్వోత్కృష్టమగు అంగము నిర్వికల్పసమాధి. ఈ ఏకాగ్రస్థితి యందు ద్వితీయ వస్తువు ఏదియు ఉండదు. జ్ఞాత, జ్ఞేయము, మరియు జ్ఞానము అనే మూడు సమ్మిళితమై, కొంత సమయము వరకు కొనసాగే సమాధి రూప అనుభవము కలుగును. అది సంసారములో అతి శ్రేష్ఠమగు అనుభవమే అయినా, సంసారమును తొలగింపజాలదు.

నిర్వికల్ప సమాధి గాఢనిద్రకు విపరీతముగ నుండును. గాఢనిద్రలో కూడా నిర్వికల్పము ఉండును. అనగా, జ్ఞాతృ-జ్ఞేయ-జ్ఞాన విభాగము లేదు. కాని, నిర్వికల్ప సమాధిలో మనస్సు జాగృతమై యుండును. గాఢనిద్రలో మనస్సు నిద్రించుచుండును. ఈ అవస్థలు రెండింటిలోనూ అజ్ఞానము గలదు. నిద్రలో మనస్సు నిద్రించుటచే వృత్తి లేదు. నిర్వికల్ప సమాధిలో మనస్సు జాగృతమై యుండును. అనగా, వృత్తి గలదు. తేడా ఇంతే. కావున, మానవుడు జీవితములో సాధించగల సర్వోత్కృష్ట స్థితి నిర్వికల్ప సమాధి. అంతే గాదు. అది గొప్ప ప్రలోభము కూడా. ఈ సంసారములో, ఈ జగత్తులో, ఈ జీవితములో సాధించగలిగే గొప్ప స్థితి అదియే గనుక, అది మనుజులను ప్రలోభానికి గురిచేయగల్గును.

అనుభవము అంతమగుట నిశ్చయము

కాని, నిర్వికల్ప సమాధికి అంతము గలదు. యోగి దాని నుండి బయటకు వచ్చుచుండును. సమాధిలో నున్న వ్యక్తి యెదుట హఠాత్తుగా ఏదేని వస్తువు పడినా, లేదా ప్రక్క ఇంట్లో ఇంటిని శుభ్రము చేసే ధ్వని వచ్చినా, అతని సమాధికి భంగము అగుటకు ఆ ధ్వని చాలును. ఇట్టి శబ్దముల వలన నిర్వికల్ప సమాధికి భంగము కలుగుటయే గాక, క్రోధము కూడ కలుగును. ఎందువలన? నిర్వికల్ప సమాధి శాశ్వతముగా కొనసాగేది కాదు. కొంతసేపటికి యోగి దాని నుండి బయటకు

వచ్చును. బయటకు రాగానే అది గతించిన అనుభవము కలుగును. దాని గురించి ఆ వ్యక్తి 'స్వామీజీ! నిన్న నాకు అద్భుతమైన అనుభవము కలిగినది' అని చెప్పవచ్చును. ఆ అనుభవమును వర్ణించే భాష కూడా విలక్షణముగ నుండును. కాని, ఆలోచనలు ఆరంభమగుట, సమీపములో ఎవరో ఒకరు ధ్వనిని చేయుట, శిశువు ఏడ్చుట ఇత్యాది కారణములచే సమాధికి భంగము కలిగి, సాధకుడు నిర్వికల్ప సమాధి నుండి చ్యుతుడగును.

ఒక పర్యాయము నిర్వికల్ప సమాధిని అనుభవించి, ఆ అనుభవము నుండి బయటకు వచ్చిన తరువాత ప్రపంచము భిన్నముగా నుండునని కొందరు చెప్పెదరు. ఎట్లు? సమాధిలో జ్ఞాతృ-జ్ఞేయ-జ్ఞాన విభాగవము తొలగిపోయినది. జరిగినది అంతే. భేదములన్నియు మటుమాయమైనవి. ఇది అభిలషణీయమగు అనుభవమనుటలో సందేహము లేదు. పైగా, ఇది బుద్ధి గ్రాహ్యము, అతీంద్రియము కూడా. కాని, ఆ అనుభవము వ్యక్తి యొక్క దర్శనమును మార్చినదా? ఒకప్పుడు సమాధి నుండి చ్యుతుడైన వ్యక్తి దుఃఖమును పొందును. సమాధిని ఎరుంగని రోజులలో ధనము పోయినందులకు, లేదా బంధుత్వము తెగిపోయినందులకు మాత్రమే దుఃఖించిన వ్యక్తి, ఇప్పుడు సమాధిలో ఆత్మను దర్శించిన తరువాత, దుఃఖించుటకు మరియొక అంశము జతగూడినది. అదియే ఆత్మ. పూర్వములో నాతడు కొన్నింటిని కోల్పోయినా, ఆత్మను కోల్పోలేదు. కాని, ఇపుడాతడు అంతకంటె అధికముగా కోల్పోయినట్లు, అనగా ఆత్మను కోల్పోయిన అనుభవమునకు గురియగుచున్నాడు.

కావున, సమాధిని అభ్యసించువారిలో ఒకానొక దుఃఖము ఉండును. సమాధి సిద్ధించకపోతే దుఃఖము; సమాధి సిద్ధించినా, కొనసాగదు గనుక దుఃఖము; కొంతసేపు కొనసాగినా, అంతమగును గనుక దుఃఖము కలుగును. సమాధిని అనుభవించిన వాడు 'నేను అరగంటసేపు సనాతునడనైతిని' అని మాత్రమే చెప్పగల్గును. సర్వకాలములలో ఉండే జ్ఞాతృ-జ్ఞేయ-జ్ఞాన భేదము ఆ కొద్ది సమయములో మాత్రమే మాయమగును. కాలభావన కూడా మాయమగును. అరగంట సేపు అతడు కాలాతీతుడు, నిత్యుడు అయినాడు. అరగంట తరవాత ఏమగును? అనిత్యుడు అగును. రెండురోజులు సమాధిలో ఉన్నా, అనిత్యత్వము తప్పదు. రెండురోజులు స్పృహలేకుండా పడియుండి, స్పృహలోనికి వచ్చిన దానికి, దీనికి తేడా లేదు. స్పృహలో లేని వ్యక్తికి కూడా భేదము లేమియూ ఉండవు. తన చుట్టూ ఏమి జరుగుతున్నదో తెలియదు. కాబట్టి, ఒక వ్యక్తి సమాధిలో గడిపిన కాలమునకు సార్థకత ఏమియూ లేదు.

అనుశాసనమునకు కొంత మనోనియంత్రణ ఆవశ్యకము

కాని, అనుశాసన దృష్ట్యా నిర్వికల్ప సమాధి చాల గొప్పది. ఏలయన, ఒక గొప్ప నియంత్రణ గలవానికి మాత్రమే ఇట్టి అనుభవము సంభవమగును. నియంత్రణ లేని వ్యక్తికి నిర్వికల్ప సమాధి యొక్క అనుభవము కల్ల. ఈ నియంత్రణ మూలకంగా, నిర్వికల్ప సమాధి అనుభవాలలో కెల్ల శ్రేష్ఠమైనదిగా పరిగణించబడును. అది ఈ అనుభవమును కోరువారి చరమ లక్ష్యము, సర్వోత్కృష్ట పురస్కారము. ఒక విశిష్ట సాత్త్విక వృత్తి గలవానికి మాత్రమే అది సంభవమగును. ఇంతవరకు బాగానే ఉంది. కాని, నిర్వికల్ప సమాధి నుండి బయటకు వచ్చిన వానికి ప్రపంచము పూర్తి భిన్నముగా భాసించుననను మాట సరిగాదు. ఏలయన, ప్రపంచము కనబడే తీరు చూచువాని సత్యత్వదర్శనముపై మాత్రమే ఆధారపడి యుండును. నిర్వికల్ప సమాధిని అనుభవించిన వ్యక్తి ఆ యనుభవమును నిర్వచింపవలెను. అట్లు నిర్వచించుటకు జ్ఞానసాధనము, అనగా ప్రమాణము ఉండి తీరాలి.

ఒక అనుభవమును దాని గురించి కలిగిన జ్ఞానముతో మాత్రమే నిర్వచించగల్గుతాము. నిర్వచించుటకు మరియొక మార్గము లేదు. అంటే, మరల మనము ప్రమాణము వద్దకు చేరినాము. నిర్వచనము లన్నియూ మనకు గల జ్ఞానముపై పూర్తిగా ఆధారపడును. జ్ఞానము ప్రమాణాధీనమై యున్నది. ప్రత్యక్ష, అనుమాన ఇత్యాది ప్రమాణము లన్నియు ద్వైతమును నిర్వహిస్తూనే పనిచేస్తాయి. కర్త, కర్మ, క్రియ, కరణము ఇత్యాది కారకము లన్నిటి యొక్క ద్వైతమును సురక్షితముగా నిలబెట్టుచున్నవై ఈ ప్రమాణము లన్నియూ పనిచేయును.

ప్రత్యక్ష, అనుమానములు కారకములను కబళించలేవు. ఆగమము (అనగా ఉపదేశము) మాత్రమే వాటిని కబళించివేయును. 'నీవు ప్రమాతవు కాదు; నీవు జ్ఞాతృ, జ్ఞాన, జ్ఞేయముల పారభూతుడవు. ఈ మూడు వేర్వేరు కావు' అని ఆగమము బోధించును. ఈ తీరున ఆగమము భేదమును ఉపమర్దము చేయును. ఈ శ్లోకము బోధించునది ఇదియే. ఆత్మజ్ఞానము కలిగి, ఆత్మ తత్త్వము నుండి చ్యుతుడు గాని జ్ఞాని (తత్త్వతః న చలతి) కి జ్ఞాతృ జ్ఞేయ జ్ఞానభేదము ఉండదు. జ్ఞానికి మనోవృత్తి, వృత్తి విషయము కూడ ఆత్మరూపములే గనుక, తన నుండి తాను దూరముగా తొలగిపోయే ప్రసక్తి జ్ఞానికి ఉదయించనే ఉదయించదు.

మనోవృత్తి నీవే

నీ నుండి నీవు దూరంగా పోలేవు. ఏలయన, వృత్తి ఉన్నప్పుడు నీవు ఉన్నావు. వృత్తి లేనప్పుడు నీవు ఉన్నావు. నీవు ప్రపంచములో ఉన్నా, ప్రపంచమునకు దూరముగా ఉన్నా, సర్వకాలములలో ఉండేది నీవే. ఈ విషయమును మనమింకనూ స్పష్టంగా ముందు చూస్తాము. ప్రస్తుత శ్లోకములోని 'తత్త్వతః న చలతి' అను వాక్యము జ్ఞానపరము గనుక, యోగ శబ్దమునకు సామాన్యార్థమును స్వీకరించరాదు. దానిలో యోగము (కలయిక) కంటె వియోగమే అధికముగ నున్నది. దీనిని తొందరలోనే శ్రీకృష్ణుడు వివరిస్తాడు. జ్ఞానోదయానికి పూర్వము అజ్ఞానము వలన దుఃఖముతో సంయోగము ఉండెడిది. అపుడు దుఃఖము ఆత్మ స్వరూపమనే భ్రమ ఉండెడిది. అదియే ప్రధాన సమస్య. యోగము అనగా కలయిక. వియోగమనగా కలయిక నుండి విడివడుట. జ్ఞానోదయమునకు ముందు వ్యక్తి దేహముతో, మనస్సుతో, ఇంద్రియములతో కలిసి ఉండెడి వాడు. ఈ కలయిక మామూలు కలయిక కాదు. వ్యక్తి దేహేంద్రియ మనస్సంఘాతమే ఆత్మయని భ్రమపడెను. అట్టి స్థితిలో నాతడు జ్ఞానమును పొంది ఈ తాదాత్మ్య భ్రమ నుండి, దుఃఖిత్వ భ్రాంతి నుండి దూరమైనాడు. దీనిలో అష్టాంగయోగమునకు ప్రమేయము లేదు.

ఏ విధమైన శంకకు తావు లేకుండా ఉండుటకై శ్రీకృష్ణుడు ముందుగా 'తత్త్వతః న చలతి' అని చెప్పి, రెండు శ్లోకముల తరువాత యోగశబ్దమును తాను చేయుచున్న ఉపదేశమునకు అనుగుణముగా ఒక వాక్యములో పునః నిర్వచించినాడు.

శ్రీకృష్ణుడింకనూ ఇట్లు కొనసాగించినాడు:

అధ్యాయము 6, శ్లోకము 22:

यं लब्ध्वा चापरं लाभं मन्यते नाधिकं ततः ।
यस्मिन् स्थितो न दुःखेन गुरुणापि विचाल्यते ॥ २२ ॥

యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః
యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే (22)

యం = ఏ ఆత్మను; **లబ్ధ్వా చ** = పొందినవాడై; **అపరం** = మరియొక దానిని; **తతః** = దాని కంటె, **అధికం** = అధికమైన; **లాభం** = లాభముగా; **న మన్యతే** = భావించడో; **యస్మిన్** = దేనియందు; **స్థితః** = ప్రతిష్ఠితుడై; **గురుణా** = గొప్ప; **దుఃఖేన అపి** = దుఃఖము చేతనైననూ, **న విచాల్యతే** = చలింపచేయబడడో.

> ఈ ఆత్మను పొందిన వ్యక్తి మరియొకటి దానికంటె గొప్ప లాభము గలదని భావించడు. దానియందు ప్రతిష్ఠితుడైన వ్యక్తిని గొప్ప దుఃఖమైననూ చలింపచేయలేదు (22).
>
> (దుఃఖము అనగా దుఃఖమును కలిగించు సంఘటన).

మనమిచట వర్ణిస్తున్న వ్యక్తి ఆత్మ తత్త్వము నుండి చ్యుతుడు కాడు. ఆత్మ యనగా వెళ్లి మరలి వచ్చే స్థానము వంటిది కాదు. 'నీవు ఆత్మరూపమగు పరమపదమును పొంది అచట ఆనందించెదవు' అను మాటను వినగానే ఒక స్థానము తలపునకు వచ్చును. ఎంతకాలము? అను ప్రశ్న కూడ ఉదయించును. అన్ని రకముల ఊహాపోహలు కలుగుటకు అవకాశమున్నది. ఆత్మప్రాప్తి యనగా ఒక స్థానమునకు అతిథియై వెళ్లి, అచటకు మనస్సునకు నచ్చినంత కాలము ఉండి భోగముల ననుభవించి వెనుకకు మరలి వచ్చుట కాదోయ్! కాని, ఈ శ్లోకములోని 'తత్త్వతః న చలతి' అను వాక్యము ఈ శంకలను పారద్రోలును. ఆత్మ ప్రాప్తి యనగా ఆత్మ స్వరూపజ్ఞానమును కలిగి, ఆత్మరూపుడుగా నుండుటయే. కావున, ఆత్మకు దూరమగుట అను ప్రసక్తియే ఏనాడూ ఉదయించదు. ఆత్మరూపుడై ఉండుట స్మృతిపైన కూడ ఆధారపడదు.

'స్వామీజీ! నేను ఆత్మను మరచితి ననుకొనుడు. అపుడేమగును?' అని కొందరు ప్రశ్నింతురు. గురువు ఆత్మను బోధించుటకు వాడిన పదములను మరచుటకు అవకాశము గలదు. కాని, వాటి అర్థమును ఒకసారి తెలుసుకుంటే, మరల మరిచిపోయే అవకాశము లేదు. వాటి అర్థము ఆత్మయే. సచ్చిదానంద అను పదములను మరచుట సంభవమే. కాని, సత్, చిత్, ఆనందము అనునవి ఒకసారి తెలిస్తే, వాటిని మరచుట ఎట్లు సంభవమగును? పదములు ఆత్మకు లక్షణములు (బోధకములు) మాత్రమే. అవి ఆత్మ స్వరూపమును నిర్దేశించును. వాటిని మరచుటకు అవకాశము గలదు. కాని వాటి అర్థము నీవే. నిన్ను నీవు మరచుట యెట్లు? తనకు తాను తెలియుట స్మృతిపై ఆధారపడి లేదు. కనుక, నిన్ను నీవు మరువజాలవు. ఏదేని ప్రమాదములో స్మృతిని గోల్పోయిన వ్యక్తియైనను తనను తాను మరచలేడు.

మనోవృత్తి నీవే

నీ నుండి నీవు దూరంగా పోలేవు. ఏలయన, వృత్తి ఉన్నప్పుడు నీవు ఉన్నావు. వృత్తి లేనప్పుడు నీవు ఉన్నావు. నీవు ప్రపంచములో ఉన్నా, ప్రపంచమునకు దూరముగా ఉన్నా, సర్వకాలములలో ఉండేది నీవే. ఈ విషయమును మనమింకనూ స్పష్టంగా ముందు చూస్తాము. ప్రస్తుత శ్లోకములోని 'తత్త్వతః న చలతి' అను వాక్యము జ్ఞానపరము గనుక, యోగ శబ్దమునకు సామాన్యార్థమును స్వీకరించరాదు. దానిలో యోగము (కలయిక) కంటె వియోగమే అధికముగ నున్నది. దీనిని తొందరలోనే శ్రీకృష్ణుడు వివరిస్తాడు. జ్ఞానోదయానికి పూర్వము అజ్ఞానము వలన దుఃఖముతో సంయోగము ఉండెడిది. అపుడు దుఃఖము ఆత్మ స్వరూపమనే భ్రమ ఉండెడిది. అదియే ప్రధాన సమస్య. యోగము అనగా కలయిక. వియోగమనగా కలయిక నుండి విడివడుట. జ్ఞానోదయమునకు ముందు వ్యక్తి దేహముతో, మనస్సుతో, ఇంద్రియములతో కలిసి ఉండెడి వాడు. ఈ కలయిక మామూలు కలయిక కాదు. వ్యక్తి దేహేంద్రియ మనస్సంఘాతమే ఆత్మయని భ్రమపడెను. అట్టి స్థితిలో నాతడు జ్ఞానమును పొంది ఈ తాదాత్మ్య భ్రమ నుండి, దుఃఖిత్వ భ్రాంతి నుండి దూరమైనాడు. దీనిలో అష్టాంగయోగమునకు ప్రమేయము లేదు.

ఏ విధమైన శంకకు తావు లేకుండా ఉండుటకై శ్రీకృష్ణుడు ముందుగా 'తత్త్వతః న చలతి' అని చెప్పి, రెండు శ్లోకముల తరువాత యోగశబ్దమును తాను చేయుచున్న ఉపదేశమునకు అనుగుణముగా ఒక వాక్యములో పునః నిర్వచించినాడు.

శ్రీకృష్ణుడింకనూ ఇట్లు కొనసాగించినాడు:

అధ్యాయము 6, శ్లోకము 22:

यं लब्ध्वा चापरं लाभं मन्यते नाधिकं ततः ।
यस्मिन् स्थितो न दुःखेन गुरुणापि विचाल्यते ॥ २२ ॥

యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః
యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే (22)

యం = ఏ ఆత్మను; లబ్ధ్వా చ = పొందినవాడై; అపరం = మరియొక దానిని; తతః = దాని కంటె, అధికం = అధికమైన; లాభం = లాభముగా; న మన్యతే = భావించడో; యస్మిన్ = దేనియందు; స్థితః = ప్రతిష్ఠితుడై; గురుణా = గొప్ప; దుఃఖేన అపి = దుఃఖము చేతనైననూ, న విచాల్యతే = చలింపచేయబడడో.

ఈ ఆత్మను పొందిన వ్యక్తి మరియొకటి దానికంటె గొప్ప లాభము గలదని భావించడు. దానియందు ప్రతిష్ఠితుడైన వ్యక్తిని గొప్ప దుఃఖమైననూ చలింపచేయలేదు (22).

(దుఃఖము అనగా దుఃఖమును కలిగించు సంఘటన).

మనమిచట వర్ణిస్తున్న వ్యక్తి ఆత్మ తత్త్వము నుండి చ్యుతుడు కాడు. ఆత్మ యనగా వెళ్లి మరలి వచ్చే స్థానము వంటిది కాదు. 'నీవు ఆత్మరూపమగు పరమపదమును పొంది అచట ఆనందించెదవు' అను మాటను వినగానే ఒక స్థానము తలపునకు వచ్చును. ఎంతకాలము? అను ప్రశ్న కూడ ఉదయించును. అన్ని రకముల ఊహాపోహలు కలుగుటకు అవకాశమున్నది. ఆత్మప్రాప్తి యనగా ఒక స్థానమునకు అతిథియై వెళ్లి, అచటకు మనస్సునకు నచ్చినంత కాలము ఉండి భోగముల ననుభవించి వెనుకకు మరలి వచ్చుట కాబోలు! కాని, ఈ శ్లోకములోని 'తత్త్వతః న చలతి' అను వాక్యము ఈ శంకలను పారద్రోలును. ఆత్మ ప్రాప్తి యనగా ఆత్మ స్వరూపజ్ఞానమును కలిగి, ఆత్మరూపుడుగా నుండుటయే. కావున, ఆత్మకు దూరమగుట అను ప్రసక్తియే ఏనాడూ ఉదయించదు. ఆత్మరూపుడై ఉండుట స్మృతిపైన కూడ ఆధారపడదు.

'స్వామీజీ నేను ఆత్మను మరచితి ననుకొనుడు. అపుడేమగును?' అని కొందరు ప్రశ్నింతురు. గురువు ఆత్మను బోధించుటకు వాడిన పదములను మరచుటకు అవకాశము గలదు. కాని, వాటి అర్థమును ఒకసారి తెలుసుకుంటే, మరల మరచిపోయే అవకాశము లేదు. వాటి అర్థము ఆత్మయే. సచ్చిదానంద అను పదములను మరచుట సంభవమే. కాని, సత్, చిత్, ఆనందము అనునవి ఒకసారి తెలిస్తే, వాటిని మరచుట ఎట్లు సంభవమగును? పదములు ఆత్మకు లక్షణములు (బోధకములు) మాత్రమే. అవి ఆత్మ స్వరూపమును నిర్దేశించును. వాటిని మరచుటకు అవకాశము గలదు. కాని వాటి అర్థము నీవే. నిన్ను నీవు మరచుట యెట్లు? తనకు తాను తెలియుట స్మృతిపై ఆధారపడి లేదు. కనుక, నిన్ను నీవు మరువజాలవు. ఏదేని ప్రమాదములో స్మృతిని గోల్పోయిన వ్యక్తియైనను తనను తాను మఱచలేడు.

స్మృతిని గోల్పోయినచో జ్ఞానము తొలగిపోదా?

జనులు తరుచుగా మరియొక ప్రశ్నను అడుగుతారు: 'స్వామీజీ! ఆత్మ సాక్షాత్కారముగల జ్ఞానికి కారు ప్రమాదములో మెదడుకు దెబ్బ తగిలి పనిచేయుట మానివేసినదనుకొనుడు. అయన తలకు బలమైన గాయము తగులుటచే స్మృతిని గోల్పోయి తన పేరును గూడ మరిచినాడనుకొనుడు. అతని ఆత్మజ్ఞానము కూడ తొలగిపోదా?' పోదు. ఆ జ్ఞానము 'అతని' జ్ఞానము గాదు. ఈ ఆత్మ బ్రహ్మయే (అయం ఆత్మా బ్రహ్మ) అను జ్ఞానము మాత్రమే గలదు. ఈ సత్యము నెరింగి అతడు ముక్తుడైనాడు. ఒకే ఒక మోక్షము గలదు. అది అతనికి జీవించియుండగనే లభించినది (జీవన్ముక్తి). మోక్షము ఎరుకకు సంబంధించినది; స్మృతికి సంబంధించినది కాదు. ఈ ఎరుకను ఒకసారి పొందిన వ్యక్తి దానిని మరల కోల్పోడు.

'స్వామీజీ, నేను ఆత్మజ్ఞానమును పొంది, తరువాత ఏమి చేయవలెను?' అని మరికొందరు ప్రశ్నింతురు. జీవితములో అనేక అపూర్వ అనుభవములను చూచిన కొందరు ఆత్మ అనే అపూర్వ అనుభవమును కూడా పొందాలని కాంక్షిస్తారు. అట్టివారు, ఆత్మానుభవమును కూడ పొందిన తరువాత పొందవలసిన మరో కొత్త అనుభవము గురించి కూడా ఇపుడే తెలుసుకోవాలనుకుంటారు. వారు ఊటీ, నైనిటాల్ మొదలగు విహారస్థలములను దర్శించి, పర్వతముల నధిరోహించి, మంచు శిఖరములపై క్రీడించియున్నారు. వారీ అపూర్వ అనుభవముల నన్నిటినీ చవిచూచి, ఇప్పుడు, 'ఆత్మ అనే అపూర్వ అనుభవమును కూడా ఒకసారి చూచి, దాని గురించి తెలుసుకుందాము' అని తలపోయవచ్చును. ఏలయనగా, ఈ ఆత్మను గురించి మాటలాడే వారి సంఖ్య తక్కువేమీ కాదు. ఆ మాటలను విన్న కొందరు ఇతర అనుభవముల నన్నిటినీ చవి చూచిన కారణంగా, ఈ ఆత్మానుభవము వైపునకు తమ దృష్టిని మళ్లిస్తారు.

సర్వమును చవిమూడాలనే ఈ ప్రవృత్తికి ముముక్షువు యొక్క ప్రవృత్తికి సంబంధము లేదని స్పష్టమే. దేని గురించియైనా తమకు తెలిసిన దానికంటె ఇతరులకు అధికముగా తెలియరాదనే వీరి ఆకాంక్షకు ముముక్షుత్వముతో పోలికలేదు. బహుశః వీరు ఏదో ఒక సమావేశములో ఆత్మ గురించి, బ్రహ్మ గురించి వినియుంటారు. ఈ క్షేత్రములో తాము అజ్ఞానులమని ఆరాటపడతారు. అయితే, ఈ ఆత్మను తెలుసుకొనే ప్రయత్నంలో, ఈ అన్వేషణలో తమకు ఆత్మజ్ఞానము దొరికిన తరువాత, ఆత్మ పని అయిపోతుంది గనుక, తదనంతర అన్వేషణ యేమిటో ఇప్పుడే నిర్ణయించుకొనుట మంచిది. వీరి ధోరణి ఈ విధంగా ఉంటుంది.

ఇది అతిశయోక్తి కాదు. కొందరి ఆలోచన ఇల్లాగే ఉంటుంది. 'మేము దీనిని పరిశీలించినాము; దానిని పరీక్షించినాము; వేదాంతమును కూడ చవి చూచినాము!' అని వీరు అంటారు. ఈ శ్లోకము ఇట్టి వారి కొరకు ఉద్దేశింపబడినది. సరిగ్గా ఇట్టి అన్నింటినీ రుచి చూడాలనే ఆకాంక్ష గల వ్యక్తులను దృష్టిలో ఉంచుకొని ఈ శ్లోకములో 'లబ్ధ్వా' అను పదము ప్రయోగింపబడినది. లబ్ధ్వా (పొంది) అనగా జ్ఞాత్వా (తెలుసుకొని) అని యర్థము. ఇచట పొందబడేది జ్ఞానమే. జ్ఞానమే సుఖము. మానవులు కోరుకునే పురుషార్థముల దృష్ట్యా ఈ 'లబ్ధ్వా' అను ప్రయోగము సార్థకమగును. ఆత్మ జ్ఞానమును పొందిన వ్యక్తి ఆత్మ కంటె ఇంకొక (అపరం) గొప్ప (అధికం) ఉపలబ్ధి ఉండునని తలపోయడు (న మన్యతే).

ఆత్మ జ్ఞానము కంటె గొప్ప లబ్ధి గలదా?

దాని కంటె గొప్ప లబ్ధి మరియొకటి లేదని యెట్లు చెప్పగలము? మనకు ఉన్న స్థితిలో అభివృద్ధిని కలిగించుదానిని లబ్ధి అంటారు. ఉన్నదానిని చెడగొట్టేది లబ్ధి అనబడదు. దానికి సమస్య అని పేరు. ఒకప్పుడు జనులు లబ్ధిని పొందేమనుకొని సమస్యలను కొని తెచ్చుకుంటారు. ఒకాయన ఆస్తిని కొన్నాడు. ఆస్తి అనగా లబ్ధియే. కాని, ఆ ఆస్తికి విరుద్ధంగా న్యాయస్థానంలో వ్యాజ్యెము పడినది. అది సమస్య. ఆ సమస్య నుండి బయటపడే ఉపాయము ఆయనకు గోచరించలేదు. అంటే, ఆ ఆస్తి యథార్థమైన లబ్ధి కాదు. ఆయన కొన్నది సమస్యయే గాని, ఆస్తి కాదు.

మనము ఇంతకు ముందు ఉన్న స్థితి కంటె ఇప్పుడు అభివృద్ధి ఉన్నట్లు భావన కలిగితే, దానిని లబ్ధి అనవచ్చును. ఆత్మ యొక్క స్వరూపము ఆత్యంతిక సుఖము; అనగా ఇతరములపై ఆధారపడని సుఖము. ఆత్మ పూర్ణము. అట్టి ఆత్మను పొందగలిగినచో అంతకంటె లబ్ధి ఏమి గలదు? దానిని మించగలిగే లబ్ధి ఎట్లు సంభవము? దానిని ఇంకనూ గొప్పదానినిగా చేయుట ఎట్లు కుదురును? కావున, ఆత్మలాభము కంటె మించిన లాభము మరియొకటి ఉండునను తలంపు యైననూ జ్ఞానికి కలుగదు. 'సరే, నేను ఆత్మను చూచితిని; నేను ఇపుడు ఇంకొదానిని కనుగొనే ప్రయత్నమును చేస్తాను' అని జ్ఞాని అనడు. మరియొకటి ఏదీ లేదు. ఆ మరియొకటి కూడా ఆత్మయే.

అయితే, ఒక శంక ఉదయిస్తుంది. జ్ఞాని ఆత్మను పొంది, ఆ లబ్ధి యందు ప్రతిష్ఠితుడై యుండును. ఆత్మ కంటె భిన్నముగా ఏదియూ లేదు గనుక, అతడు మరియొక లబ్ధి గురించి తలపోయడు. బాగానే ఉంది. కాని, అతనికి ఒక గొప్ప ఆపద వచ్చినచో యేమగును? అతని

ఆనందమునకు భంగము కలుగదా? కలుగదు. ఆత్మజ్ఞానము నందు స్థిరుడై యున్న వానికి గొప్ప విపత్తు సంప్రాప్తమైననూ, అతడు చలించడు (దుఃఖేన గురుణా అపి న విచాల్యతే). గురుశబ్దమునకు అనేకార్థములు గలవు. కాని ఇచట పెద్ద అని యర్థము. లఘు అను పదమునకు ఇది వ్యతిరేక పదము.

కొందరు తీవ్రమగు దుఃఖమునైననూ విచలితులు కాకుండా సహించగలరు. కాని ఘోరమగు విపత్తు వచ్చినచో ఏమగును! అట్టి సందర్భములో జ్ఞాని తాను స్థిరముగా నుండే ఆత్మ నుండి చ్యుతుడై, మరియొక ఆశ్రయమును చేరుకొనడా? అట్లు జరుగదు. జ్ఞాని ఆత్మ యందు స్థిరుడై యుండును. ఆత్మ నుండి చ్యుతుడై మరియొక చోటకు వెళ్లుట సంభవము కాదు. ఏలయన, ఆ మరియొక చోటు కూడ ఆత్మయే. కావున, ఎట్టి, దుఃఖము సంప్రాప్తమైనా, జ్ఞాని ఆత్మనిష్ఠుడై యుండును. జ్ఞాని 'తత్త్వతః న ఏవ చలతి (తత్త్వము నుండి చ్యుతుడు కానే కాడు)' అని శ్రీకృష్ణుడు పూర్వమే చెప్పియున్నాడు.

పరిస్థితులు ఏవైనా, జ్ఞాని ప్రభావితుడు కాడు; విచలితుడు కాడు. పరిస్థితులన్నియు ఆత్మయే అని శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పుచున్నాడు. శ్రీకృష్ణుడు ఉపదేశించిన ఈ యోగములో సంయోగము కంటె వియోగమే అధికముగా నున్నది. ఈ విషయమునే శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములో స్పష్టము చేయుచున్నాడు:

అధ్యాయము 6, శ్లోకము 23:

तं विद्याद्दुःख संयोग वियोगं योग संज्ञितम् ।
स निश्चयेन योक्तव्यो योगोऽनिर्विण्ण चेतसा ॥ २३ ॥

తం విద్యాద్దుఃఖ సంయోగ వియోగం యోగ సంజ్ఞితమ్
స నిశ్చయేన యోక్తవ్యో యోగో ऽ నిర్విణ్ణ చేతసా (23)

తం = ఆ; దుఃఖసంయోగ వియోగం = దుఃఖముతోడి కలయిక నుండి విముక్తిని; యోగ సంజ్ఞితం = యోగమనే పేరు గలదానినిగా; విద్యాత్ = తెలియవలెను; సః = ఆ; యోగః = యోగము; నిశ్చయేన = స్పష్టమగు లక్ష్యముతో; అనిర్విణ్ణ చేతసా = నిరుత్సాహము లేని మనస్సుతో; యోక్తవ్యః = అనుష్ఠింపబడవలెను.

ఇది అతిశయోక్తి కాదు. కొందరి ఆలోచన ఇల్లాగే ఉంటుంది. 'మేము దీనిని పరిశీలించినాము; దానిని పరీక్షించినాము; వేదాంతమును కూడ చవి చూచినాము!' అని వీరు అంటారు. ఈ శ్లోకము ఇట్టి వారి కొరకు ఉద్దేశింపబడినది. సరిగ్గా ఇట్టి అన్నింటినీ రుచి చూడాలనే ఆకాంక్ష గల వ్యక్తులను దృష్టిలో ఉంచుకొని ఈ శ్లోకములో 'లబ్ధ్వా' అను పదము ప్రయోగింపబడినది. లబ్ధ్వా (పొంది) అనగా జ్ఞాత్వా (తెలుసుకొని) అని యర్థము. ఇచట పొందబడేది జ్ఞానమే. జ్ఞానమే సుఖము. మానవులు కోరుకునే పురుషార్థముల దృష్ట్యా ఈ 'లబ్ధ్వా' అను ప్రయోగము సార్థకమగును. ఆత్మ జ్ఞానమును పొందిన వ్యక్తి ఆత్మ కంటె ఇంకొక (అపరం) గొప్ప (అధికం) ఉపలబ్ధి ఉండునని తలపోయడు (న మన్యతే).

ఆత్మ జ్ఞానము కంటె గొప్ప లబ్ధి గలదా?

దాని కంటె గొప్ప లబ్ధి మరియొకటి లేదని యెట్లు చెప్పగలము? మనకు ఉన్న స్థితిలో అభివృద్ధిని కలిగించుదానిని లబ్ధి అంటారు. ఉన్నదానిని చెడగొట్టేది లబ్ధి అనబడదు. దానికి సమస్య అని పేరు. ఒకప్పుడు జనులు లబ్ధిని పొందేమనుకొని సమస్యలను కొని తెచ్చుకుంటారు. ఒకాయన ఆస్తిని కొన్నాడు. ఆస్తి అనగా లబ్ధియే. కాని, ఆ ఆస్తికి విరుద్ధంగా న్యాయస్థానంలో వ్యాజ్యము పడినది. అది సమస్య. ఆ సమస్య నుండి బయటపడే ఉపాయము ఆయనకు గోచరించలేదు. అంటే, ఆ ఆస్తి యథార్థమైన లబ్ధి కాదు. ఆయన కొన్నది సమస్యయే గాని, ఆస్తి కాదు.

మనము ఇంతకు ముందు ఉన్న స్థితి కంటె ఇప్పుడు అభివృద్ధి ఉన్నట్లు భావన కలిగితే, దానిని లబ్ధి అనవచ్చును. ఆత్మ యొక్క స్వరూపము ఆత్యంతిక సుఖము; అనగా ఇతరములపై ఆధారపడని సుఖము. ఆత్మ పూర్ణము. అట్టి ఆత్మను పొందగలిగినచో అంతకంటె లబ్ధి ఏమి గలదు? దానిని మించగలిగే లబ్ధి ఎట్లు సంభవము? దానిని ఇంకనూ గొప్పదానినిగా చేయుట ఎట్లు కుదురును? కావున, ఆత్మలాభము కంటె మించిన లాభము మరియొకటి ఉండునను తలంపు యైననూ జ్ఞానికి కలుగదు. 'సరే, నేను ఆత్మను చూచితిని; నేను ఇపుడు ఇంకొదానిని కనుగొనే ప్రయత్నమును చేస్తాను' అని జ్ఞాని అనడు. మరియొకటి ఏదీ లేదు. ఆ మరియొకటి కూడా ఆత్మయే.

అయితే, ఒక శంక ఉదయిస్తుంది. జ్ఞాని ఆత్మను పొంది, ఆ లబ్ధి యందు ప్రతిష్ఠితుడై యుండును. ఆత్మ కంటె భిన్నముగా ఏదియూ లేదు గనుక, అతడు మరియొక లబ్ధి గురించి తలపోయడు. బాగానే ఉంది. కాని, అతనికి ఒక గొప్ప ఆపద వచ్చినచో యేమగును? అతని

ఆనందమునకు భంగము కలుగదా? కలుగదు. ఆత్మజ్ఞానము నందు స్థిరుడై యున్న వానికి గొప్ప విపత్తు సంప్రాప్తమైననూ, ఆతడు చలించడు (దుఃఖేన గురుణా అపి న విచాల్యతే). గురుశబ్దమునకు అనేకార్థములు గలవు. కాని ఇచట పెద్ద అని యర్థము. లఘు అను పదమునకు ఇది వ్యతిరేక పదము.

కొందరు తీవ్రమగు దుఃఖమునైననూ విచలితులు కాకుండా సహించగలరు. కాని ఘోరమగు విపత్తు వచ్చినచో ఏమగును! అట్టి సందర్భములో జ్ఞాని తాను స్థిరముగా నుండే ఆత్మ నుండి చ్యుతుడై మరియొక ఆశ్రయమును చేరుకొనడా? అట్లు జరుగదు. జ్ఞాని ఆత్మ యందు స్థిరుడై యుండును. ఆత్మ నుండి చ్యుతుడై మరియొక చోటకు వెళ్లుట సంభవము కాదు. ఏలయన, ఆ మరియొక చోటు కూడ ఆత్మయే. కావున, ఎట్టి, దుఃఖము సంప్రాప్తమైనా, జ్ఞాని ఆత్మనిష్ఠుడై యుండును. జ్ఞాని 'తత్త్వతః న ఏవ చలతి (తత్త్వము నుండి చ్యుతుడు కానే కాడు)' అని శ్రీకృష్ణుడు పూర్వమే చెప్పియున్నాడు.

పరిస్థితులు ఏవైనా, జ్ఞాని ప్రభావితుడు కాడు; విచలితుడు కాడు. పరిస్థితులన్నియు ఆత్మయే అని శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పుచున్నాడు. శ్రీకృష్ణుడు ఉపదేశించిన ఈ యోగములో సంయోగము కంటె వియోగమే అధికముగా నున్నది. ఈ విషయమునే శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములో స్పష్టము చేయుచున్నాడు:

అధ్యాయము 6, శ్లోకము 23:

> तं विद्याद् दुःख संयोग वियोगं योग संज्ञितम् ।
> स निश्चयेन योक्तव्यो योगोऽनिर्विण्ण चेतसा ॥ २३ ॥

> తం విద్యాద్దుఃఖ సంయోగ వియోగం యోగ సంజ్ఞితమ్
> స నిశ్చయేన యోక్తవ్యో యోగో ऽ నిర్విణ్ణ చేతసా (23)

తం = ఆ; దుఃఖసంయోగ వియోగం = దుఃఖముతోడి కలయిక నుండి విముక్తిని; యోగ సంజ్ఞితం = యోగమనే పేరు గలదానినిగా; విద్యాత్ = తెలియవలెను; సః = ఆ; యోగః = యోగము; నిశ్చయేన = స్పష్టమగు లక్ష్యముతో; అనిర్విణ్ణ చేతసా = నిరుత్సాహము లేని మనస్సుతో; యోక్తవ్యః = అనుష్ఠింపబడవలెను.

అట్టి దుఃఖముతోడి కలయిక నుండి విముక్తియే యోగమనబడునని తెలియవలెను. ఆ యోగమును స్పష్టమగు లక్ష్యము కలిగి, నిరుత్సాహము లేని మనస్సుతో అనుష్ఠించవలెను (23).

ఇరువది యవ శ్లోకములో యోగ శబ్దము ధ్యానాభ్యాసము అనే అర్థములో వాడబడినది. ఆ ధ్యానములో విషయము ఆత్మ (యత్ర ఉపరమతే చిత్తం నిరుద్ధం యోగ సేవయా). ఆత్మ సాక్షాత్కారము గల వ్యక్తి తనలో తాను ఆనందించును (యత్ర చ ఏవ ఆత్మనా ఆత్మానం పశ్యన్ ఆత్మని తుష్యతి). ఈ యోగములో జ్ఞాన సహకారముతో మనోనేత్రముతో ఆత్మ దర్శింపబడును. కాన దీనికి జ్ఞానయోగమని పేరు. ఇట్టి ఆత్మదర్శనము గల వ్యక్తికి ఆత్మాన్వేషణ సఫలమైనది గనుక, ఆత్మానందము లభించుట సహజమే. అతనికి వివిధ విషయముల అన్వేషణ నుండి విముక్తి లభించినది.

21వ శ్లోకములో, ఆత్మ స్వరూపము ఆనందమనియు, ఆత్మబుద్ధి గ్రాహ్యమనియు, కాని ఇంద్రియగోచరము కాదనియు (సుఖమాత్యంతికం యత్తద్బుద్ధి గ్రాహ్యమతీంద్రియమ్), ఆత్మను యెరింగినవాడు తనలో తాను స్థిరుడై ఉండుననియు, సత్యమగు ఆత్మ స్వరూపము నుండి ఏనాడూ చ్యుతుడు కాడనియు (వేత్తి యత్ర న చైవాయం స్థితశ్చలతి తత్త్వతః) చెప్పబడెను. ఆత్మ స్వరూపము పూర్ణానందము. ఇతర ఆనందములు తద్భిన్నములు. అవి సదా ఒకానొక మానసికస్థితిపై ఆధారపడును. ఒక బాహ్యపరిస్థితికి మన మానసిక స్థితి జతగూడి మనకు సాధారణ భోగములు లభించును. ఒక విశిష్ట పరిస్థితిలో ఒక బాహ్య వస్తువు అభిలషణీయమగు రూపములో లభించవలెను. అప్పుడే ఈ సుఖము అనుభవమునకు వచ్చును.

ఒకప్పుడు బాహ్య పరిస్థితి ఉన్నా, వ్యక్తి మనోదశ (mood) బాగుండక పోవచ్చును. అంటే, మనోదశ బాగుపడే వరకు ఆ బాహ్య పరిస్థితి వేచియుండవలెను. ఒకడు తనకిష్టమైన సంగీతము యొక్క రికార్డును కొన్నాడనుకొనుడు. దానివిని మనోదశ అతనికి కలుగునంతవరకు ఆ సంగీతము వేచియుండవలసినదే. దీనికి కారణమేమనగా, బాహ్య పరిస్థితుల వలన లభించే సుఖము రెండు అంశములపై ఆధారపడును. బాహ్య పరిస్థితి మొదటిది. అనురూపమైన మనోదశ రెండవది. కాని మనము చర్చిస్తున్న స్వరూప సుఖము ఈ రెండింటి పైననూ ఆధారపడేది కాదు. ఆత్మ సర్వపరచ్ఛేద భావనా విముక్తము అనే గుర్తింపు వలన స్వరూపసుఖము లభించును.

ఈ స్వరూప సుఖమును గుర్తెరింగిన జ్ఞాని దాని నుండి ఏనాటికీ చ్యుతుడు కాడు. ఏలయన, దాని కంటె గొప్ప లాభము మరియొకటి లేదని (యం లబ్ధ్వా చ అపరం లాభం మన్యతే న అధికం

తతః) శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు. ఈ ఆత్మ జ్ఞానరూప లాభమునకు యోగమనియూ పేరు గలదు.

ఈ ఆత్మ జ్ఞానము సాహసకార్యము వంటిది కాదు. కొందరు మనుజులు సాహసకార్యములను ఆచరిస్తూ ఉంటారు. ఒక సాహస కార్యమును ఆచరించిన కొద్ది కాలానికి దానిపై అభిరుచి తొలగుటచే, మరియొక సాహసమును చేయుటకు యత్నిస్తారు. మానవునకు తన సమర్థతను, తన ఉనికిని నిరూపించుకోవాలనే ఆకాంక్ష ఉంటుంది. దాని కొరకై ఒకదానిని మించి మరియొకటిగా సాహసములను, విలక్షణ కార్యములను, వినూత్న కార్యములను ఆచరిస్తారు. అట్లు చేసినప్పుడు మానవునకు తన ఉనికిపై, శక్తిపై విశ్వాసము కలుగును. లేనిచో, ఇంట్లో మూలబడియున్న పాతసామానువలె తాము కూడా నిరుపయోగులమనే భావన కలుగుతుంది. వాస్తవంలో ఈ భావనయే మానవులను సాహసాలకు ప్రేరేపిస్తుంది. కొందరి దృష్టిలో సాహసకార్యములకు చాల మహత్త్వము గలదు. వారు తమ సర్వస్వమును వాటి కొరకై ఒడ్డుతారు. సాహసములను చేయనిచో వారిలో వారికి తీవ్ర అసంతృప్తి కలిగి జీవితము దుర్భరమగును. తన వ్యక్తిత్వము నందు పూర్తి ఆదరములేని వ్యక్తి ఏదో ఒక సాహసకార్యమును చేసి తన ఉనికిని, తన ప్రతిభను ఇతరులతో బాటు తాను కూడా గుర్తించుకునే ప్రయత్నమును చేస్తాడు.

సర్వ అన్వేషణలు లీనమగును

ఆత్మను దర్శించిన వ్యక్తి మరల నూతన సాహసములను ఆచరించవలసిన ఆవశ్యకత గలదా? లేదు. ఏలయన, ఆత్మలాభమును పొందిన పిదప దానికంటె గొప్ప లాభము లేదు. ఆత్మ విత్ ఆత్మనుండి చ్యుతుడు కాడు (తత్త్వతః న చలతి). అనగా, సాహసాన్వేషణ అంతమగును. అన్వేషణలు ఆత్మ యందు లీనమై, అంతమగుటయే యథార్థమగు లబ్ధి.

ఆత్మ విషయక భ్రాంతి నుండియే అన్వేషణలన్నియూ బయలుదేరును. కావున, ఆత్మ విషయక భ్రాంతి తొలగుట తోడనే అన్వేషణా ప్రవృత్తి కూడ తొలగిపోవును. ఈ జ్ఞానములో అన్వేషించువాడు, అన్వేషించబడేది ఏకమైపోవును. 'ఆత్మజ్ఞానమును పొందిన జ్ఞాని దానికంటె గొప్ప లాభము మరియొకటి గలదని భావించడు (యం లబ్ధ్వా చాపరం లాభం నాధికం మన్యతే తతః)' అని శ్రీకృష్ణుడు పూర్వ శ్లోకములో చెప్పిన దాని తాత్పర్యమిదియే.

అట్టి జ్ఞానికి గొప్ప ఆపద కలిగినచో నేమగును? శ్రీకృష్ణుడు ఈ శంకను కూడ నివారించినాడు. 'ఆత్మ యందు స్థిరుడై ఉండే జ్ఞాని గొప్ప ఆపద కలిగిననూ చలించడు (యస్మిన్ స్థితః దుఃఖేన గురుణా అపి న విచాల్యతే)'. కావున, ఆత్మ నుండి జ్ఞాని చ్యుతుడు అయ్యే ప్రసక్తి లేదు.

బాహ్య పరిస్థితులు జ్ఞానిని ప్రభావితము చేయజాలవు. జ్ఞాని ఆత్మయందు నిమగ్నుడై బయటపడే ప్రసక్తి కూడ లేదు. ఆత్మచ్యుతి కలుగుట యనునది రెండువిధములుగా సంభవమగును. దాని నుండి ఉపసంహరించుకొనుట మొదటిది. లేదా, మరియొకటి వచ్చుటచే, దాని నుండి విచలితుడగుట రెండవది. కాని, పూర్ణతత్త్వమును ఏ విధముగనైనను అశాంతికి గురిచేయుట సంభవము కాదు. ప్రపంచము గాని, ఇతరము గాని పూర్ణతత్త్వమును విచలితము చేయజాలదు. మానవుని జీవితములో జరిగే సంఘటనల నన్నిటినీ పూర్ణత్వము తనలో ఇముడ్చుకొనగలదు. మరియు, వ్యక్తి ఆత్మరూపమగు పూర్ణత్వమునుండి ఉపసంహరించుకొనుటయూ సంభవము కాదు.

కావున, గడచిన మూడు శ్లోకములలో వర్ణించిన దానిని బట్టి, ఆత్మరూపమగు ఆనందమునుండి చ్యుతి లేదని తేలినది. ఆత్మ లబ్ధి, ఆత్మానందము, ఆత్మయొక్క పూర్ణత, ఆత్మయందలి విముక్తి మొదలగు వాటన్నింటికి యోగమని పేరు. శ్రీకృష్ణుడు 'యోగసంజ్ఞితమ్' అని అంటూ, యోగమును దర్శించే ఒక నూతన దృష్టికోణమును మనకు ఇచ్చినాడు.

యోగమునకు మరో నిర్వచనము

యోగశబ్దము యుజ్ ధాతువు నుండి పుట్టినది. దీనికి రెండు అర్థములు గలవు. ఒకటి యోజనము, రెండవది నిరోధము. రెండు వస్తువులను కలుపుటకు యోజనమని పేరు. కావున, రెండువస్తువులను దగ్గరకు చేర్చుట యోగమనబడును. నిరోధమనగా నియంత్రించుట, ఆపుట, స్వాధీన మొనర్చుకొనుట. పతంజలి యోగశాస్త్రము యొక్క ద్వితీయ సూత్రములో యోగమును అటులనే నిర్వచించినాడు: యోగః చిత్తవృత్తి నిరోధః (యోగమనగా మనోవృత్తులను, అనగా ఆలోచించే ప్రక్రియలను నియంత్రించుట). ఈ నిర్వచనము ననుసరించి, యోగము ఒక స్వతంత్ర అనుశాసనమగును.. గీతలో యోగశబ్దము ఈ రెండు అర్థములలో కూడ వాడబడినది. కాన, యోగశబ్దార్థము యోజనమా, లేక నిరోధమా యనునది ప్రకరణమును బట్టి మనము గ్రహించవలెను.

ధ్యాన ప్రకరణములో యోగశబ్దార్థము కలయిక అని ముందుగా అనిపిస్తుంది. ధ్యానమనగా ఆత్మతో మనస్సు యొక్క కలయిక. మనస్సు ఆత్మను ధ్యానించును. కావున, ఆత్మ ధ్యేయ వస్తువు అగును. ఇట్లు మనస్సును ధ్యేయమగు ఆత్మతో కలుపు ప్రయత్నమునకు యోగమని పేరు. యోగశబ్దమును సామాన్యముగా ఈ అర్థములో వాడెదరు. వివాహమనగా ఇద్దరు వ్యక్తుల కలయిక. అది ఒక యోగము. కలయిక (సంబంధము) యొక్క స్వరూపమేదైనా, రెండింటి కలయికకు యోగమని పేరు.

రెండింటిని కలిపినప్పుడు, అవి విడిపోయే అవకాశము కూడ ఉండును

దగ్గరకు చేర్చబడిన రెండు వస్తువులకు విడిపోయే ప్రవణత (tendency) ఉంటుంది. కావున, వాటిని ప్రయత్నపూర్వకంగా కలిపి ఉంచవలెను. ఇద్దరు వ్యక్తులు కలిసినపుడు, వారిద్దరికి ఒకరి నుండి మరియొకరు విడివడి వ్యతిరేకదిశలలో వెళ్లే ప్రవణత ఉండును. అటులనే, రెండు వస్తుశకలములను కలిపి కట్టినచో, ఆ కట్టు ఉన్నంత వరకు మాత్రమే అవి కలిసి ఉంటాయి. ఆ కట్టు శిథిలము కాగానే, ఆ రెండు శకలములు విడిపోతాయి.

అటులనే, బాహ్యవస్తువు మనస్సును ఆకర్షించగానే, మనస్సు ఆత్మనుండి దూరమగును. మనకు జ్ఞానేంద్రియములు గలవు. అవి విషయములను గ్రహిస్తాయి. విషయములు వృత్తులను కలిగిస్తాయి. ఈ వృత్తులు మనస్సును విచలితము చేస్తాయి. ఒకచో జ్ఞానేంద్రియములను ఉపసంహరించినా, స్మృతి సదా ఉండనే ఉంది. ప్రపంచమును పూర్తిగా మనస్సునకు ముందు ఉంచుటకు స్మృతి చాలును! ఈ స్మృతి మూలకంగా, ఆలోచించుటకు విషయములు లేని పరిస్థితి మనస్సునకు ఎన్నడూ ఏర్పడదు. కావున, మనస్సును, ఆత్మను కలిపేది యోగము అని అర్థము చెప్పినచో, ఆత్మను ధ్యానించే మనస్సు ఆత్మ నుండి దూరముగా వచ్చివేయునని స్పష్టమగుచున్నది. కలయికలో ఈ సమస్య అంతర్నిహితమై యున్నది. కావుననే, శ్రీకృష్ణుడీ శబ్దమును ఇచట కలయికకు విరుద్ధముగా నిర్వచించినాడు. ఈ నిర్వచనమునకు విపరీత లక్షణ యని పేరు. అనగా, ఆ పదము ఒక పరిచ్ఛిన్నమగు అర్థములో వాడబడుచుండగా, ఆ పరిచ్ఛేదముల నన్నిటినీ నిషేధించి, ఆ పదమునకు నూతన నిర్వచన మీయబడును. ఉపదేశములో సర్వత్రా ఈ ప్రక్రియ అవలంబించబడును. పదములు లేనిదే ఉపదేశము సంభవము కాదు గదా! ముందుగా ఒక పదమును వాడి, తరువాత దాని యందలి పరిచ్ఛేదముల నన్నింటిని తిరస్కరించవలెను. అపుడా పదము పూర్ణమగు అర్థమును, అనగా ఆత్మను ప్రదర్శించును.

యోగము: సంయోగము నుండి వియోగము

ఇంతవరకు శ్రీకృష్ణుడు యోగశబ్దమును సీమితమగు అర్థములో వాడెను. ఇచట ఆయన ఆ సీమలను నిషేధించుచున్నాడు. వాస్తవంలో, ఆయన యోగపదములను 'సంయోగ-వియోగము' అని నిర్వచించి, ఆ పదమునే త్రోసిపుచ్చినాడని చెప్పవచ్చును. సంయోగము, యోగము సమానార్థకములు. వాటి యర్థము కలయిక. 'సం' అను ఉపసర్గ 'కలయిక బాగున్నది' అను

అర్థమునిచ్చును. 'సం' ఉపసర్గ స్థానములో 'వి' ఉపసర్గ ఆదేశము చేసినచో ఏర్పడే 'వియోగ' అను పదము విడిపోవుట అను వ్యతిరేకార్థమును ఇచ్చును. సంయోగమనగా కలయిక. కలయిక ఉన్నచోట విడిపోవుట ఉండును. వియోగమనగా నిదియే. ఈ రెండు పదములకు యోగ పదము సమానము. ఉపసర్గను మార్చుట వలన వ్యతిరేకార్థము లభించినది.

ఇందువలననే, సంస్కృతములో ఉపసర్గలకు అధికమహత్త్వము గలదు. యోగ శబ్దమునకు 'వి' అనే ఉపసర్గను చేర్చగానే, యోగము యొక్క అభావము గాని, వ్యతిరేకము గాని అర్థము వచ్చును. ఈ విధముగా, మనమిచట చర్చించే యోగములో కలయిక కంటె విడివడుటయే అధికముగా నున్నదని శ్రీకృష్ణుని తాత్పర్యము.

ఇంతకు ముందు యోగము అనే శీర్షికలో ఎట్లు జీవించాలి ఇత్యాది వివిధ అనుశాసనములు చెప్పబడినవి గదా! అవి ఏ యోగము కొరకు? ఈ మూడు శ్లోకములలో చెప్పబడిన యోగమును ఉద్దేశించియే అవి అన్నియూ బోధింపబడినవని తెలియవలెను (తం విద్యాత్). ఆ యోగమును ఏమని తెలియవలెను? దుఃఖసంయోగ వియోగము (దుఃఖముతోడి కలయిక నుండి విడివడుట) యోగమని తెలియవలెను. శ్రీకృష్ణుడు దీనినే ఇచట యోగమని నిర్వచించెను (యోగసంజ్ఞితమ్). తెలియదగిన యోగము ఇదియే.

మనకు అభిలషణీయము కానిది ఏదైనా దుఃఖమే. దుఃఖముతో కలయిక దుఃఖసంయోగమనబడును. ఈ దుఃఖముతోడి కలయిక సామాన్యమైన కలయిక కాదు. ఇది చాలలోతుగ పాతుకొని పోయిన కలయిక. ఈ దుఃఖముతోడి కలయిక సామాన్యమైనది కాదు. కనుకనే, శ్రీకృష్ణుడిచట సంయోగము అను పదమును వాడెను. దుఃఖము కావాలని ఎవ్వరూ కోరుకొనరు. కాని, దానితోటి కలయిక అతిశయించి దృఢముగా నుండుటచే, దాని నుండి బయటపడాలనే కోరిక ఉన్ననూ, మనము బయట పడలేక పోవుచున్నాము. దుఃఖమును కోరువారెవ్వరూ లేరు. కాని, సర్వులు దుఃఖభాజనులగుచున్నారు. మనము దుఃఖమును కోరుట లేదు గదా! కాని, దుఃఖితులగుటకు కారణమేమి? దుఃఖస్థితిని పొందాలని ఏ ఒక్కరూ కోరుకొనకపోయిననూ దుఃఖముతో యోగము తప్పుట లేదు. ఆ యోగము కూడ సంయోగమై, విడదీయుటకు కష్టమైన కలయిక అగుచున్నది. వాస్తవంలో, దానిని విడదీయ శక్యము కాదు. విడదీయు ఉపాయము లేదు.

దుఃఖము ఇంత దృఢముగా పాతుకొనుటకు కారణమేమి?

దుఃఖసంయోగమును ఛేదించుటకు మనుజులు ప్రయత్నించియూ, విఫలులగుచున్నారు. ఎందువలన? కారణమేమనగా, దుఃఖి యగు వ్యక్తి దుఃఖము నుండి బయటపడగోరుచున్నాడు. దుఃఖము నుండి బయటపడగోరు వ్యక్తి తాను పరిచ్ఛిన్నుడ నను ధారణతో తన యందు స్వయముగా దుఃఖిత్వమును సృజించుకొనును. ఇందువలననే దుఃఖముతో సంయోగము ఏర్పడినది. దుఃఖముతో ఇట్టి సంయోగమును నిర్మాణము చేసుకున్న వ్యక్తి దుఃఖమునుండి బయటబడుట యెట్లు?

'నేను మానవుడను, నేను మరణధర్ముడను, నేను పురుషుడను, నేను బ్రాహ్మణుడను, క్షత్రియుడను, నేను యువకుడను, నేను వృద్ధుడను, నేను అల్పుడను' ఇత్యాదిగా పరిచ్ఛిన్నమైన, అల్పమైన 'నేను' ధారణ గల వ్యక్తి దుఃఖసంయోగమును పొంది, దుఃఖియై, దుఃఖమునకు, పీడకు అధీనమై ఉండే సాంసారిక జీవనమును గడుపును. ఈ 'నేను' తనకు గల ధారణ చేత దుఃఖమును పొందుట తప్పనిసరి యగును. ఈ 'నేను' యొక్క ఆధారము దుఃఖమై యున్నది. పరిచ్ఛిన్నతా భ్రాంతియే దాని మూలము. వాస్తవంలో, దుఃఖమనగా పరిచ్ఛిన్నతా భావన తక్క మరియొకటి గాదు. కావున, మానవుడు తనను తాను ('అహం' ను) గుర్తుచేసుకొన్న వెంటనే దుఃఖి యగును. దుఃఖమునకు వేరే కారణము అక్కరలేదు.

మానవునకు తన అల్పత్వము స్మరణకు వచ్చిన వెంటనే దుఃఖము కలుగును. అప్పుడప్పుడు మానవుని దృష్టి ప్రపంచములోని అనేక మనోహరములగు వస్తువులచే ఆకర్షింపబడును. ఆ సమయములో వ్యక్తి తనను తాను మరచి, ఆనందపు క్షణముల ననుభవిస్తూ, కులాసాగా నవ్వులాడు. కాని, ఇంతలో అతనికి తన గురించి గుర్తుకు వస్తుంది. అంతే. ఆనందము మాయమై, దాని స్థానములో దుఃఖము చోటు చేసుకుంటుంది!

వ్యక్తి తనను తాను మరచి ఆనందంగా ఉంటాడు. తనను తాను స్మరించి దుఃఖితుడవుతాడు. దీనికి కారణము వ్యక్తికి 'అహం'పై గల తప్పుడు ధారణయే. వ్యక్తి పరిచ్ఛిన్నమగు దేహేంద్రియ మనస్సంఘాతముతో తాదాత్మ్యమును పొంది, అవియే తాను అను భ్రాంతికి గురియగును. ఈ దేహమే తాను అయినచో, మిగిలేది దుఃఖమే. కాని, అదృష్టవశమున, దేహము ఆత్మ కాదు.

'ఈ దేహము నేను' అను ధారణ ఉన్నప్పుడు, నా నుండి నేను విముక్తిని కోరుతాను. కాని, నా నుండి నేను విముక్తిని పొందుట యెట్లు? నేను ఎచటకు వెళ్లినను, నా నుండి తప్పించుకోలేను.

ఇందువలననే, మానవుడు ఎచటకు వెళ్లిననూ తనతో బాటు దుఃఖమును కూడ మోసుకువెళ్లును. క్రొత్త స్థానమును చేరుసరికి, అచట పరిస్థితులు ప్రతికూలముగా లేకపోయినా, దుఃఖము సిద్ధముగా నుండును. మరియు, వ్యక్తి నవ్వుచున్న పదిమందిలోకి వెళ్లి వారందరికి దుఃఖమును పంచిపెట్టును. వ్యక్తి తనతో బాటు దుఃఖమును గొనిపోయి, ఒక మూల కూర్చుండి దుఃఖిస్తూ, ఆ స్థలమును దుఃఖమయము చేయును. సంసారి లక్షణము ఇట్లుండును. ఇది ఏదో ఒక వ్యక్తికి మాత్రమే సీమితమైన విషయము కాదు. సంసారులందరూ తాము వెళ్లిన ప్రతి స్థలములో దుఃఖమును కలిగిస్తారు. కారణమేమన, వారు స్వభావతః దుఃఖము కలవారై ఉండుటయే. ఆత్మ-అనాత్మ సంయోగమనగా నిదియే.

దుఃఖి అనుపదము 'నేను' అనుధారణ గల వ్యక్తిని నిర్దేశించును. ఆ వ్యక్తి దుఃఖము యొక్క హేతువు కంటె భిన్నుడుగా నుండును. మనము ఆ వ్యక్తిని ఆత్మ అనియు, అతనికి దుఃఖమును కలిగించు దానిని అనాత్మ అనియు అంటాము. ఈ ఆత్మకు, ఆ అనాత్మకు మధ్యలో సంయోగము గలదు. వ్యక్తికి ఈ సంయోగము ఎట్లు కలిగినది? ఆత్మ శుద్ధ చైతన్యమని మనము చూచియున్నాము. ఆత్మయందు విశేషణములు (గుణములు) ఏమియూ లేవు. ఆత్మకు ఏదేని ఒక గుణము ఉన్న పక్షంలో, ఆత్మ అదే గుణమునకు సంలగ్నమై యుండును. అపుడు మనకు క్రొత్త విషయము ఏదియూ తెలిసే అవకాశమే ఉండదు. కావున, చైతన్యస్వరూపమగు ఆత్మ యందు ఒక విశేషగుణము ఉండుటకు అవకాశము లేదు. ఇట్టి పరిస్థితిలో ఈ చైతన్యమునకు సంయోగమెట్లు కలిగినది? ఆత్మకు, అనాత్మకు మధ్యలో సంయోగము ఎట్లు సంభవమైనది?

అజ్ఞానము అసంభవమును సంభవము చేయును?

చైతన్యమునకు యథార్థమగు సంయోగము లేదు. అవిద్య వలన మాత్రమే సంయోగము సంభవమగును. అజ్ఞానమునకు అసంభవమును సంభవము చేయు శక్తి గలదని దాని నిర్వచనమును బట్టియే స్పష్టమగుచున్నది. అవిద్య ఎంతకైననూ తగును. అది రజ్జువును పాము చేయగలదు. ఎడారిలో ఎండమావులను సృజించగలదు. జ్ఞానము లేకపోవుటచే అజ్ఞానము ఇటువంటి పనులన్నిటిని చేయగలదు. అనగా, ఆత్మ-అనాత్మ- సంబంధము అవివేకము చేత మాత్రమే నిర్మితమైనది. కావున, దుఃఖసంయోగము కలదని నిరూపితమైనది. నాకు దుఃఖముతో సంయోగము ఏర్పడియున్నది. నేను దుఃఖమునకు దూరము కావాలి. కాని, సంయోగము అవిద్యా జనితము గనుక, యథార్థమగు ఉపసంహారము సంభవము కాదు. వివేక జ్ఞానము లేకపోవుటచే దుఃఖముతో సంయోగము కలిగినది.

కావున, ఈ సంయోగము నుండి వియోగము జ్ఞానముచేత మాత్రమే సిద్ధించును. ఆత్మ విషయములో గల అజ్ఞానము వలన, భ్రాంతి వలన ఈ ఆత్మ-అనాత్మ తాదాత్మ్యరూపమగు సంయోగము ఏర్పడినది. దీనిని విజ్ఞానముచే తొలగించవలెను. మరో మాటలో చెప్పాలంటే, నేను ఆత్మను ఆత్మగా, అనాత్మను అనాత్మగా తెలుసుకోవాలి. అనాత్మ యందలి ఆత్మ భ్రాంతి తొలగిపోవాలి. ఆత్మ కంటె భిన్నముగా ఏదీ లేదని తెలియాలి.

ఆత్మ, అనాత్మలు సమాన సత్యత్వ శ్రేణికి చెందిన రెండు వేర్వేరు తత్త్వములైన పక్షములో మోక్షమనేది ఉండదు. అట్టి స్థితిలో విచారమును చేసినచో, మరియొక తత్వము రంగములోనికి వచ్చి, భేదభావనను ప్రోది చేయును. ఆత్మ ఒక మూల కూర్చుని ఉండే తత్త్వము కాగా, అనేక అనాత్మలు సర్వత్రా ఉంటాయి. సర్వత్ర భేదము ఉండును. అప్పుడు కూడ సమస్య అటులనే యుండును. పైగా, విచారము వలన ఆత్మ అనే ఇంకొక తత్త్వము సమస్యకు, తోడగును.

ఆత్మ మాత్రమే గలదు

మంచియో, చెడో గాని, అనాత్మ ఏ కాలమునందైననూ ఆత్మ కంటె భిన్నముగా లేదు. చైతన్యఘనమగు ఆత్మ కంటె భిన్నముగా అనాత్మ రూపములగు మనోవృత్తులకు ఉనికి లేదు. అనాత్మ యొక్క ఉనికి ఆత్మాశ్రితము. కాని, ఆత్మ యొక్క ఉనికి అనాత్మాశ్రితము కాదు. ఆత్మ అనాత్మ కంటె భిన్నము. ఇదియే వియోగము. కాబట్టి, మన ఎదుట నున్న పరిస్థితి యేదనగా, మనోవృత్తులు ఇత్యాది అనాత్మల యందు ఆత్మను ఆరోపిస్తే తప్ప, దుఃఖసంయోగమనేది ఏదీ లేదు. అనాత్మకు ఆత్మ కంటె భిన్నమగు ఉనికి లేదు గదా! కాబట్టి దుఃఖసంయోగ వియోగరూపమైన యోగములో సంయోగము కంటె వియోగమే ఎక్కువ. బంధమును కలిగించు అజ్ఞానము తొలగిపోవును. కాని, ఈ వియోగములో ఆత్మ నుండి వేరుగా మనస్సు విడివడే ప్రసక్తియే లేదు.

మనము దేనియందు లగ్నము అవుతామో, అది నిశ్చితముగా తొలగిపోవును. ఉదాహరణకు, దేశ కాలపరిస్థితులపై ఆధారపడి మనకు ఒక ఆనందము కలిగినదనుకొనుడు. ఆ పరిస్థితులు మారగానే, ఆ ఆనందము కూడ తొలగిపోవును. కావున, అనుభవములన్నియూ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. అవి కొద్ది కాలములో దూరమవుతాయి. కాని, అనుభవ రూపము కాని, భ్రాంతి జనిత సంయోగము నుండి విడిపోవుట అను యోగము తొలగిపోయేది కాదు. ఈ వియోగము జ్ఞానజనిత వియోగము (జ్ఞానేన వియోగః). అది స్థూల దృష్ట్యా వియోగము (ఒకదాని నుండి మరియొక దానిని విడదీయుట) కాదు. అనాత్మ కూడ ఆత్మయే. కాన, ఆత్మను అనాత్మ

నుండి వెనుకకు లాగుకొనుట సంభవము కాదు. అట్లు చేయవలసిన ఆవశ్యకతయూ లేదు. ఏలయన, ఆత్మకు ఏవిధముగ నైననూ అనాత్మతో సంగము లేదు. ఈ యెరుక (జ్ఞానము)లో సంయోగము కంటె వియోగమే అధికము. దీనికి శ్రీకృష్ణుడు యోగమని పేరు పెట్టెను (యోగసంజ్ఞితమ్). దుఃఖముతో గల కలయిక నుండి విడిపోవుటయే యోగమని తెలియవలెను (తం విద్యాద్దుఃఖ సంయోగ వియోగం యోగసంజ్ఞితమ్) అని ఆయన చెప్పెను.

బంధహేతువు అజ్ఞానము

ఒక వ్యక్తితో గాని, వస్తువుతో గాని సంబంధము న్యాయసమ్మతమైనచో, దాని నుండి న్యాయబద్ధముగా విడిపోవుటకు అవకాశము కూడ ఉండును. స్థూల వస్తువుల మధ్య సంబంధమైనచో, వియోగముకూడ తద్రూపముగనే ఉండును. రెండు స్థూలపదార్థములకు మధ్య సంయోగము ఏర్పడినదనుకొనుడు. ముందుగా విడివడి ఉన్న ఆ రెండింటిని కలిపిన సంయోజకాంశమును తొలగిస్తే, అవి విడిపోతాయి. ప్రస్తుతంలో, ఆత్మానాత్మల మధ్య సంయోజకము అవిద్య. అవిద్య సంయోజకము గనుక, విద్య (జ్ఞానము) వియోజకమగును.

ఈ దుఃఖ సంయోగ వియోగమే యోగము. ఇట్టి యోగముమండి చ్యుతుడయ్యే ప్రసక్తి లేదు. దాని కంటె గొప్ప లాభము లేదు. అదియే చరమ లక్ష్యమగు ఆత్మ. అది సంయోగము కాదు. దుఃఖము నుండి ఉపసంహారమే ఈ యోగము. కావున, ఇది సరళమైనది. వస్తువును పైకి ఎత్తుట కంటె జారవిడుచుట తేలిక గదా! కాని, ఇచట ఒకే ఒక సమస్య గలదు. వ్యక్తి అజ్ఞానమును, ఆత్మను గురించి తనకు గల సర్వభ్రాంత ధారణలను జారువిడువ వలెను. ఇది తేలిక కాదు. వాటినన్నిటినీ పరమేశ్వరుని ముందు అర్పించవలెనని కొందరు బోధిస్తారు. కాని అది సరిగాదు.

తప్పు ధారణలను సమర్పింపలేము

కలియుగములో భక్తి మిక్కిలి సరళోపాయమని చెప్తారు. మానవుడు పరమేశ్వరుని ముందు సర్వమును సమర్పించిన చాలును. ఆయనయే అన్నింటినీ చక్కబెట్ట గలడు. బాగానే ఉంది. కాని సమర్పించవలసినది యేది? సమర్పించేది ఎవరికి? సర్వము భగవానునిదే. దేనినైననూ సమర్పించుటకు నీవెవరు? నీ వాక్కాను నేను లాగుకొని, మరల నీకు సమర్పిస్తాను. ఇది అట్లే ఉన్నది. ఇచట సమర్పణ ఏమియూ లేదు. నీవు దేనిని సమర్పిస్తావు? నీవు సమర్పించినది ఎచటకు పోవును? సమర్పింపబడేది ఎక్కడికీ వెళ్లదు. అది ఉన్న చోటనే ఉండును.

నీవు భగవానునకు ఏదో ఒకదానిని సమర్పించినపుడు, దానిని ఆయన స్వీకరించి మాయమైతే, అపుడు నీవు సమర్పించినట్లవుతుంది. కాని, ఆయన దేనినీ స్వీకరించడు. అంటే, నీవు దేనినీ సమర్పించుట లేదు. ఇంతకీ సమర్పించేది ఎవరు? 'నేనే' అని నీవు అనవచ్చును. కాని, నీవు నిన్ను సమర్పించుట యెట్లు? బహుశః నీకు అహంకారము పెరిగినట్లు అనిపించి, దాని పెరుగుదలను అరికట్టుటకై ఈ సమర్పణా కార్యక్రమమును నీవు చేపట్టినావు కాబోలు! కాని ఈ సమర్పణ కాదగిన నేను ఎవరు? నన్ను నేను సమర్పించజాలను. ఈ 'నేను' ను సమర్పించుటకు మరో 'నేను' కావాలి.

సమర్పించగోరే 'నేను' అహంకారమే. అది మిథ్యాతత్త్వము. అది ఆత్మ కాదు. అహంకారము ఒక ధారణ మాత్రమే. నీవు దానిని అయథార్థమని తెలియనంతవరకు అది తొలగిపోదు. ఈ అహంకార మిథ్యాత్వ నిశ్చయమునకే జ్ఞానమని పేరు. శరణాగతి కూడ అదియే. ఇక్కడ చర్చించే యోగము కూడ అదియే (స యోగః). మానవుడు నిశ్చయముగా అభ్యసించదగిన యోగము (యోక్తవ్యః) ఇదియే.

మానవుడు ఆత్మను గురించి అజ్ఞానముచే ఏర్పరుచుకున్న ధారణలను విడిచిపెట్టుట కష్టసాధ్యము. అయినప్పటికీ, అది ఒక విధంగా తేలిక కూడా. ఏలయనగా, మనము చేయవలసినది అజ్ఞానమును నశింపజేయుట మాత్రమే. మనస్సు సంసిద్ధము కాని పక్షములో మాత్రమే అజ్ఞాన నాశము కష్టమగును. రెండేళ్ల పిల్లవానికి 'ఒకటికి ఒకటి కలిపితే రెండు' అనే కూడికను బోధించుట చాలా కష్టము. ఏలయన, ఆ శిశువు మనస్సు ఇంకనూ సంసిద్ధము కాలేదు. కాని, అదే శిశువు కొంత పెరిగిన తరువాత, మనస్సు సంసిద్ధమగును. అపుడా కూడికను చాల తేలికగా బోధించగలము.

ప్రాజ్ఞతతో జీవించువాని మనస్సు సంసిద్ధమగును

ఉల్లాసమైన మనస్సు గలవానికి ఆత్మ బ్రహ్మయే ననియు, సర్వము ఆత్మయే ననియు ఎరుంగుట తేలిక యగును. మానవుడు ప్రాజ్ఞతతో జీవించువాడైనచో, సంసారము అతనిని చాలవరకు ఉల్లాసవంతునిగా చేసి, అతని మనస్సును సంసిద్ధము చేయగల్గును. కాని, సంసారము దుఃఖమును కూడ ఇచ్చును. ఈ దుఃఖమును పోగొట్టుకొనుటకై వేదాంతము నాశ్రయించిన వ్యక్తికి ఆ వేదాంతము తలపోటుగా మారును. మానవుడు తన ఆనందస్వరూపమును తెలుసుకోగల్గుటకు చాలవరకు ఉల్లాసశీలుడై ఉండాలి. కావున, వేదాంతము ఇట్టి ప్రసన్న మనస్కునకు, చిరునగవు మోము వానికి ఉద్దేశింపబడినది. అంటే, సంసారములో సాధారణముగా ఉండే దుఃఖములకు వేదాంతము సమాధానము కాదు. వాటి కొరకు కర్మయోగము గలదు. అష్టాంగయోగము, ఇతర అనుశాసనములు కర్మయోగములో అంతర్భాగమగును.

సమస్యకు ఆత్మజ్ఞానము ఏకైక పరిష్కారము

వివేక వైరాగ్యములు, శమదమాదులు, ముముక్షుత్వము పూర్ణ పరిమాణములో నున్న వారికి మాత్రమే వేదాంతము అని భావించుట సరిగాదు. ఇట్టి వ్యక్తులు ఊహలలో మాత్రమే గలరు. ధర్మనిరపేక్షముగా కాకుండా, ధర్మబద్ధమైన, ప్రార్థనాయుతమైన కర్మయోగ జీవనమును గడిపినచో, అట్టి వ్యక్తి మనస్సు వేదాంతమనబడే జ్ఞానము ఉదయించుటకు సంసిద్ధమగును. ఈ జ్ఞానము ఉదయించగానే, వ్యక్తికి తనపై గల ధారణలన్నియూ తొలగిపోవును. కావున, ఇది తేలిక, కష్టము కూడా. దీనిని చేసి తీరాలి (యోక్తవ్యః). ఇది కష్టమనిపించినా, దీనిని సాధించాలి. ఏలయన, దీనికంటె ఎక్కువ ఆహ్లాదకరము, ఉత్సాహవర్ధకము మరియొకటి లేదు. కష్టమనిపించకపోతే, సమస్య యేమున్నది? దీనికంటె ఎక్కువ ఆకర్షకము, ఎక్కువ హితకారి మరియొకటి లేదు. ఏలయన, ఈ అన్వేషణ అంతా నా కొరకు మాత్రమే. ఇదియే సమస్యలను సమూలముగా పరిష్కరించగల ఏకైక ఉపాయము.

ఈ జ్ఞానమును అన్వేషించు విధమెట్టిది? నిశ్చయేన. అనగా, ఏది సత్యము, ఏది అసత్యము అను విషయమును యెరింగి, ఈ నిష్పక్షబుద్ధిని వివేకముతో నేను పొందాలి అని యెరుంగుట అని యర్థము. శ్రీకృష్ణుడింకొక పదమును వాడెను – అనిర్విణ్ణ చేతసా. అనగా, విషణ్ణము కాని, నిరాశ నెరుంగని (అనిర్విణ్ణ) మనస్సుతో (చేతసా) అని యర్థము. మనస్సులో ఉదాసీనత, దుఃఖము, నిరుత్సాహము ఉండరాదు. ఈ వేదాంతమును వింటే నిరుత్సాహము కలుగదా? కలుగదు. ఇది దుఃఖ వియోగము గదా! కావున, ఏ విధముగ నైననూ దీనిలో నిరుత్సాహము కలుగు అవకాశము లేదు. దీనికంటె గొప్ప జ్ఞానము లేదు. కావున, నిరుత్సాహమునకు చోటు ఎక్కడిది? ఒకవేళ నిరుత్సాహమే కలిగినదనుకొనుడు. ఇంతకంటె గొప్ప ఉపాయము లేదు. మరింక చేయునదేమున్నది? కావున, నిరుత్సాహమును పొందకుండగా (అనిర్విణ్ణచేతసా), ఏకైక లక్ష్యముగా కలిగి (నిశ్చయేన) ఈ యోగమును మానవుడు అభ్యసించవలెను (యోగః యోక్తవ్యః).

మనమీ దుఃఖ సంయోగమును జారవిడిచి, దుఃఖమును పోగొట్టుకునే ప్రయత్నమును సర్వదా చేస్తూనే ఉన్నాము. మనము అన్నివేళలా దుఃఖ సంయోగ వియోగమును అన్వేషిస్తూనే ఉన్నాము. దుఃఖమును తొలగించే యోగమిదియే. భగవానుడు యోగపదమును వియోగార్థములో వాడెను. దీని గురించి రాబోవు శ్లోకములో మరికొంత ముచ్చటించెను:

అధ్యాయము 6, శ్లోకము 24:

सङ्कल्पप्रभवान् कामां स्त्यक्त्वा सर्वानशेषतः ।
मनसैवेन्द्रियग्रामं विनियम्य समन्ततः ॥ २४ ॥

సంకల్ప ప్రభవాన్ కామాంస్త్యక్త్వా సర్వానశేషతః
మనసైవేంద్రియం గ్రామం వినియమ్య సమంతతః (24)

సంకల్ప ప్రభవాన్ = ఆలోచనల నుండి పుట్టే; **సర్వాన్** = అన్ని; **కామాన్** = కామనలను; **అశేషతః** = పూర్ణముగా; **త్యక్త్వా** = విడిచిపెట్టి; **మనసా** = మనస్సుచే; **ఇంద్రియగ్రామం** = జ్ఞానేంద్రియ కర్మేంద్రియ సముదాయమును; **సమంతతః** = పూర్ణముగా; **వినియమ్య ఏవ** = నిశ్చితముగా ఉపసంహరించి

> ఆలోచనల నుండి పుట్టే కామనలనన్నిటినీ పూర్తిగా విడిచిపెట్టి, జ్ఞానేంద్రియ కర్మేంద్రియ సముదాయమును మనస్సుచే పూర్ణముగా ఉపసంహరించి (24)

యోగమనగా కలయిక. కాని, దుఃఖముతోడి సంయోగము నుండి వియోగమే యోగము అనే నిర్వచనమును మనము పూర్వశ్లోకములో చూచినాము. అంటే, ఈ ప్రకరణములో యోగము అనగా సంయోగము కంటె వియోగమే అనుట పాడియగును. దుఃఖ వియోగమే యోగము. అనగా, వ్యక్తికి దేహేంద్రియ మనస్సంఘాతము (కార్యకరణ సంఘాతము)తో గల తాదాత్మ్యము నుండి విముక్తియే యోగము. జ్ఞానము వలన మాత్రమే సంభవమయ్యే ఈ తాదాత్మ్య వియోగమునకు యోగమని పేరు (యోగ సంజ్ఞితమ్). మానవుడు తప్పక సాధించదగిన యోగము (యోగః యోక్తవ్యః) ఇదియేనని శ్రీకృష్ణుడు చెప్పెను.

ఈ యోగములో సంయోగము కంటె వియోగమే అధికము గనుక, వ్యక్తి తన మనస్సులో నిరాశను, నిరుత్సాహమును, ఖేదమును పొందకుండగా (అనిర్విణ్ణ చేతసా), దీనిని సాధించుటకు అవకాశము గలదని శ్రీకృష్ణుడు చెప్పెను: జ్ఞానసాధన ఎవరెస్టు శిఖరము నెక్కుట వంటిది కాదు; చేతిలోని బండను జారవిడుచుట వంటిది. పైకి ఎక్కుట కంటె, బరువును జారవిడుచుట సరళము గదా! కావున, జ్ఞానసాధన మనము అనుకునేటంత కష్టము కాదు. మానవుడు తన గురించి

ఏర్పరుచుకున్న పరిచ్ఛిన్న తాదాత్మ్యము నుండి వియోగమును పొందగల్గితే చాలును. కావున, నిరాశను చెంద బనిలేదు.

శ్రీకృష్ణుడు ఈ శ్లోకములో యోగమును సూత్రరూపముగా ప్రదర్శించి, అదే విషయవస్తువుపై చర్చను కొనసాగించుచున్నాడు. ఈ యోగమును మానవుడు అభ్యసిస్తూ ఉంటే, కొన్ని సమస్యలు తలయెత్తే అవకాశము గలదు. కావుననే, శ్రీకృష్ణుడు కొన్ని అంశములను మరల మరల నొక్కి చెప్పుచున్నాడు. ప్రకృత శ్లోకములో, శ్రీకృష్ణుడు అదే విషయమును మరల ఉద్ఘాటించుచున్నాడు. ఇంతకు ముందు అనేక పర్యాయములు చెప్పబడిన రెండు విషయములను శ్రీకృష్ణుడు మరల ఈ శ్లోకములో చెప్పుచున్నాడు.

కామనలన్నింటికి మూలము

ముందుగా కామన లన్నింటికి మూలమైన దానిని పూర్తిగా త్యజించాలి (సంకల్ప ప్రభవాన్ సర్వాన్ కామాన్ అశేషతః త్యక్త్వా). కామము అనగా కోర్కె; లేదా కోర్కెలో విషయమైన వస్తువు అని మనము చూచియున్నాము. ఇచ్చట, కామము అనగా వస్తువుల యందలి కోర్కె. దానికి మూలము సంకల్పము. సంకల్పమునుండి మాత్రమే కోర్కె పుట్టును. 'ఇది నాకు ఉండాలి; ఇది నాకు రావాలి' మొదలగు ఆలోచనలు సంకల్పమనబడును. ఈ ఆలోచన వెనువెంటనే కోరికగా మార్పునొందును. కామన లన్నింటికీ మూలమగు ఈ సంకల్పమును పూర్తిగా (అశేషతః) విడిచిపెట్టాలి. అంటే, మనము కోర్కెలను గాక, వాటి మూలము నందుండు సంకల్పమును విడువదగును.

సంకల్పమనగా ఒక చిన్న ఆలోచన మాత్రమే. కాని ఆ ఆలోచనకు కామనగా రూపుదిద్దుకునే సామర్థ్యము గలదు. ఇందువలననే, సంకల్పము కామనలన్నింటికీ మూలమని చెప్పబడినది. కామన మస్తిష్కమును గిర గిర త్రిప్పివేయును. సంకల్పము ఉదయించి మాయమగును. కాని, అదియే కామనగా మారినచో, దానిని నెరవేర్చవలసినదే. కావున, దానిని సంకల్పముగా నున్నప్పుడే నియంత్రించవలెను.

సంకల్పమును నియంత్రించు విధానమేదనగా, ఆలోచనను విశ్లేషించాలి. ఉదాహరణకు 'నాకు ఇది కావాలి' అను ఆలోచనను విశ్లేషిద్దాము. 'నాకు ఇది కావాలి' అంటే అర్థము ఏమి? ఇట్టి విచారము వలన సంకల్పము నియంత్రించబడును.

సంకల్పమును నియంత్రించినచో, కామనల గురించి పట్టించుకోనక్కర లేదు. సంకల్పమే ప్రధాన సమస్య కావున, దానిని నియంత్రించిన చాలును. 'నాకు ఇది కావాలి, అది కావాలి' ఇత్యాది సంకల్పమును నియంత్రించగల్గినచో, కామనలు గురించి సమస్యయే ఉండదు. సంకల్పము యొక్క బలము లేని కామనలు కేవల మనోవిలాసములుగా మిగిలిపోతాయి. 'నాకిది ఉంటే బాగుండును' అనే సంకల్పము మెల్లగా 'నాకు ఇది ఉండి తీరాలి' అనే కామముగా వృద్ధి చెందును. కావున, కామనలకు వెనుక నున్న సమర్థన సంకల్పములదే. సంకల్పము కామనగా మారిందంటే, ఆ వ్యక్తి పని అయినట్లే! కావున, సంకల్పమును విశ్లేషించాలి.

ఇంద్రియోపసంహారము

వివేకముతో నిండిన మనస్సుచేత మాత్రమే (మనసా ఏవ) ఇంద్రియ సమూహమును పూర్తిగా ఉపసంహరించవలె నని శ్రీకృష్ణుడీ శ్లోకములో మరల చెప్పినాడు. గ్రామ శబ్దమునకు సామాన్యార్థము పల్లె. కాని, ఇచట ఆ అర్థము కుదరదు. కావున, దానికి గల మరియొక అర్థమును మనము స్వీకరించాలి. గ్రామము అనగా సముదాయము.

ఇంద్రియ గ్రామం వినియమ్య అంటే జ్ఞానేంద్రియ కర్మేంద్రియముల సముదాయమును వాటి స్థానములో నియమించి, అనగా వాటిని వాటి ప్రవృత్తి క్షేత్రముల నుండి ఉపసంహరించి అని యర్థము. ధ్యానములో కూర్చుండు సాధకుడు పాటించదగిన మనో నియమమును శ్రీకృష్ణుడు సూచిస్తున్నాడు. ధ్యానములో కూర్చున్న వ్యక్తి తన మనస్సును ధ్యేయవస్తువు వైపునకు మరల్చవలెను. శ్రీకృష్ణుడీ విషయమును తరువాత ఇంకనూ వివరిస్తాడు.

జ్ఞానేంద్రియముల నుపసంహరించుట యనగా వాటిని వాటి స్థానములలో నియంత్రించుట. అనగా సంకల్పములను నియంత్రించుట ద్వారా ఇంద్రియములు తమ తమ విషయ వస్తువుల వైపునకు ప్రసరించవని యర్థము. ఇంద్రియములు ధ్యానములో సర్వ ప్రవృత్తుల నుండియూ ఉపసంహరింపబడుటచే, ఈ ఉపసంహారము సంపూర్ణమైనది (సమం తతః) అని వర్ణింపబడినది.

ధ్యానములో కూర్చుండు విధానము – ఆసనము, దృష్టి ఇత్యాదులు – ఇంతకు ముందు చెప్పబడినవి. ధ్యానస్వరూపము ఈ శ్లోకములో వివరింపబడి, తరువాతి శ్లోకములో కొనసాగుచున్నది:

అధ్యాయము 6, శ్లోకము 25:

शनैश्शनैरुपरमे द्बुद्ध्या धृतिगृहीतया ।
आत्मसंस्थं मनः कृत्वा न किञ्चिदपि चिन्तयेत् ॥ २५ ॥

శనైశ్శనైరుపరమే ద్బుద్ధ్యా ధృతి గృహీతయా
ఆత్మ సంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్ (25)

మనః = మనస్సును; **ఆత్మసంస్థం** = ఆత్మ యందు స్థిరముగ నుండునదిగా; **కృత్వా** = చేసి; **శనైః శనైః** = మెల్ల మెల్లగా; **ఉపరమేత్** = లీనము చేయవలెను; **కించిత్ అపి** = ఇతరమును దేనినీ; **న చింతయేత్** = ఆలోచించరాదు.

> వివేకపూర్ణమైన బుద్ధితో మనస్సును ఆత్మ యందు స్థిరముగ నుండునట్లు చేసి మెల్లమెల్లగా లీనము చేయవలెను. ఇతరమును దేనినీ ఆలోచించరాదు (25).

ధృతి యనగా స్థిరత, మరియు ధైర్యము. వివేకము కూడ ధృతిలో అంతర్భాగమే. ధృతి గృహీతయా అనగా బుద్ధియందు ధైర్యము, స్థిరత, వివేకజ్ఞానము గలవని యర్థము. ఇట్టి బుద్ధి, మనస్సు ఆత్మ యందు స్థిరముగా నుండునట్లు చేయును (ఆత్మ సంస్థం మనః కృత్వా). దీనిని మనము మరల పరిశీలిద్దాము.

ఈ శ్లోకములోని 'శనైః' పదము యొక్క ఆవృత్తి (శనైః శనైః) సంస్కృతభాషలోని ప్రయోగశైలికి చెందినది. శనైః శనైః అనగా మెల్లమెల్లగా అని యర్థము. మెల్ల మెల్లగా చేయదగినది యేది? సాధకుడు తన మనస్సును, అనగా తనను ఈ విశిష్ట పద్ధతిలో లీనము చేయాలి. మనస్సు ఆత్మయందు లీనమగునట్లు చేయాలి. ఇతర విషయములను గూర్చి మననము చేయరాదు (ఆత్మ సంస్థం మనఃకృత్వా న కించిత్ అపి చింతయేత్). ఆత్మను మాత్రమే ధ్యానించవలెను.

ఈ శ్లోకములో రెండు విషయములను గ్రహించవలెను. ఈ ధైర్య వివేకముల స్వరూపమెట్టిది? మనస్సును ధ్యేయవిషయమగు ఆత్మ యందు స్థిరముగా నుంచుట యనగా నేమి? ఈ స్థిరముగా నుంచుట యెట్టిది? పండును బుట్టలో దాచినట్లుగా మనస్సును ఆత్మయందు దాచుకొనవలెనా? బహుశః మనస్సును ఆత్మకు పైభాగము నందు ఉంచవలెను గాబోలు! 'ఆత్మ సంస్థం మనఃకృత్వా'

అను వాక్యమును సరిగా తెలుసుకోని పక్షంలో, మనస్సును ఆత్మయందు స్థిరముగా నుంచుట యనునది పెద్ద సమస్య యగును. కాని, 'ఆత్మ సంస్థం మనః కృత్వా' అను వాక్యము సరిగా తెలిస్తే, సమస్య ఉండదు. ధృతి యనునది కూడ స్పష్టముగా తెలియగలదు.

ఆత్మయొక్క నిర్వచనము

ఆత్మ సంస్థం మనః అను వాక్యములో ఆత్మ యనగా నేమి? దేని యందు మరియొకటి వినబడదో అది ఆత్మ యని బృహదారణ్యక శ్రుతి నిర్వచించినది (యత్ర అన్యత్ న శృణోతి). దేని యందైతే మరియొకటి చూడబడదో (యత్ర అన్యత్ న పశ్యతి), దేని యందైతే మరియొకటి తెలియబడదో (యత్ర అన్యత్ న విజానాతి), అది ఆత్మ. ఆత్మయందు విశేషణములు (గుణములు) ఏమియూ లేవనియు (నిర్విశేషః), ఆత్మ శుద్ధ చైతన్య ఘనమనియు (చిన్మాత్ర స్వరూప ఏవ), శ్రుతి నిరూపించుచున్నది.

మరియు ఆత్మ ద్రష్టయే గాని దృశ్యము కాదు (ద్రష్టా న తు దృశ్యమ్). శ్రోతయే గాని శ్రుతము కాదు (శ్రోతా న తు శ్రుతమ్). జ్ఞాతయే గాని జ్ఞేయము కాదు (విజ్ఞాతా న తు విజ్ఞేయమ్). మననము చేయునదియే గాని మననము చేయబడేది కాదు (మంతా న తు మంతవ్యమ్). శాస్త్రము ఆత్మ స్వరూపమును నిర్వచించు విధమిట్టిది.

ఈ విధముగా నిర్వచింపబడిన ఆత్మ యందు మనస్సును ఉంచుట యెట్లు? ఆత్మను గురించి ఆలోచించాలి అంటే, ఆత్మ ఆలోచనలో విషయమగును. కాని శ్రుతి వాక్యమునకు విరోధము. కావ, నేను ఆత్మను గురించి ఆలోచించుట సంభవము కాదు. ఇందువలననే, సర్వ వాక్కులు, మనస్సుతో సహా ఆత్మను పొందజాలక వెనుకకు మరలినవని (యతో వాచో నివర్తంతే, అప్రాప్య మనసా సహ) తైత్తిరీయోపనిషత్తు ఉద్ఘాటించుచున్నది. ఆత్మను పట్టుకుందామని వాక్కు మనస్సుతో జతగట్టినదా? అవి ఆ కఠిన కార్యమును సాధించుటలో విఫలమై వెనుకకు మరలినవా యేమి? దురదృష్టకరమైన విషయమేమనగా, కొందరు ఆత్మను అట్లే వర్ణిస్తారు.

ధ్యానములో ఆత్మ విషయవస్తువు ఎట్లు కాగలదు?

మనస్సును ఆత్మపై లగ్నము చేయుట యెట్లు? ధ్యానములో ఆత్మ విషయ వస్తువు ఎట్లు కాగలుగును? మనస్సు ఆత్మయే. కావ, మనస్సును ఆత్మ యందు ఉంచుట కుదరదు. సాధకుడు

మనస్సును ఆత్మ వద్దకు గొనిపోగా, మనస్సు ఆత్మపై కొంతసేపు కూర్చుండగా, కొంత కాలానికి మనస్సు యొక్క ఒత్తిడి వలన ఆత్మ లొంగిపోతుంది అనే గాథ సరిగాదు. కొన్ని వ్యాఖ్యానములు ఇట్టి తప్పుడు ధారణలను కలిగించే అవకాశము గలదు.

'ఆత్మా ఏవ ఇదం సర్వమ్' అను వాక్యములో ఆత్మ 'ఈ సర్వము ఆత్మయే' అని నిర్వచింపబడినది. జ్ఞాత, జ్ఞానము మరియు జ్ఞేయము 'ఇదం సర్వమ్' లోనివే. సర్వశబ్దము ఈ మూడింటిని కూడా నిర్దేశించుటచే, ఇక ఏమీ మిగులలేదు. ద్రష్ట, దృశ్యము, దర్శనము, శ్రోత, శ్రుతము, శ్రవణము ఇత్యాదులన్నీ సర్వములో అంతర్భాగములే. ఈ ఇంద్రియ వ్యాపారములన్నియు జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయములలో అంతర్భాగము గదా!

సర్వ వస్తువులు జ్ఞేయములగును. మనకు తెలియని వస్తువు కూడా, తెలియబడుతుంది గనుక, జ్ఞేయములో అంతర్గతమగును. కావున, మనము ఈ జ్ఞాతృ, జ్ఞాన, జ్ఞేయములనే మూడింటిని మాత్రమే పరిశీలిద్దాము. జ్ఞాత ఆత్మ కంటె భిన్నము కాదు. జ్ఞాత ఆత్మయే అను విషయము మనకు స్పష్టముగనే యుండును. కాని, జ్ఞానము ఆత్మకు సంబంధించినది అని మనము భావిస్తాము. 'ఈ జ్ఞానము నాకు చెందినది; ఈ జ్ఞానము నాది' అని మనము భావిస్తాము. చెట్టు అనే ఒక వస్తువు యొక్క జ్ఞానము నాకు గలదు. జ్ఞానములో చెట్టు విషయవస్తువు. ఈ వృత్తిరూపమగు జ్ఞానము నాకు చెందినది. కావున, నేను వేరు. చెట్టు విషయవస్తువుగా గల జ్ఞానము వేరు.

జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయములు ఒక్కటియే

ఈ ధారణను పూర్తిగా విలక్షణమైన మూసలో పోసి పరిశీలించినచో, ఆ భేదము నిషేధింపబడును. ఈ మూస యేది? జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయములు మూడు కలసి ఒకే ఒక తత్త్వము అగును. అదియే ఆత్మ. సర్వము నేనే (ఆత్మా ఏవ ఇదం సర్వమ్). జ్ఞాత ఆత్మ. జ్ఞానము ఆత్మ. జ్ఞేయము కూడ ఆత్మయే.

ఈ సందర్భములో సర్వత్రా ప్రస్తావింపబడే దృష్టాంతము స్వప్నము. స్వప్నములో, స్వప్నమును తెలుసుకొనే జ్ఞాత గలదు. తెలియబడే స్వప్న ప్రపంచము గలదు. మరియు స్వప్నజ్ఞానము కూడ గలదు. ఈ మూడు ఒకే జ్యోతి, ఒకే చైతన్యము తక్క వేరుగాదు. స్వప్నములో చైతన్యమే జ్ఞాత, జ్ఞానము మరియు జ్ఞేయము. ఈ మూడు ఒకే ఒక చైతన్య-ఆత్మ తక్క వేరు గాదు.

స్వప్నములోని ఈ ఏకత మనకు స్పష్టముగ తెలియుచునే ఉండును. నిద్రలేచిన వెంటనే, స్వప్న జ్ఞాత, స్వప్న జ్ఞానము మరియు స్వప్నజ్ఞేయము వ్యక్తిలో లయమగును. కావున, చైతన్యము కంటె వేరుగా జ్ఞాత లేడు; జ్ఞానము లేదు. మరియు, జ్ఞేయము కూడ చైతన్యము కంటె వేరుగాదు.

ఈ నిర్వచనము వలన మనకు ఒక సంగతి స్పష్టమగును. చైతన్యము, 'జ్ఞాత' అను అవస్థ చేత సీమితమైనది. చైతన్యము జ్ఞాతృత్వ విశిష్టమైనది (జ్ఞాతృ-అవచ్ఛిన్న-చైతన్యమ్). దీనిని మనము జ్ఞాతృ చైతన్యము, జ్ఞాన చైతన్యము మరియు జ్ఞేయ చైతన్యము అనవచ్చును. జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయములు చైతన్యము కంటె వేరుగా లేవు గదా! తెలియబడే వస్తువు ఏ కాలము నందైననూ చైతన్యము కంటె వేరుగా నుండగల్గునా? ఉండలేదు. తెలియబడే వస్తువు ఉన్న కాలములో చైతన్యము గలదు. తెలియబడే వస్తువు లేని కాలములో కూడ చైతన్యము గలదు. వస్తువును మనము నశింపచేయగలము. కాని మనము ఉనికిని నశింపజేయలేము.

ఉనికికి భిన్నముగా ఏదీ లేదు

ఉనికి యొక్క స్వరూపమును గురించి చేసే చర్చ ద్వివిధముగ నుండును. ఒకటి ఉనికి గురించి; రెండవది జ్ఞానము గురించి. ఉనికి గురించి చెప్పాలంటే, వస్తువు ఉన్నదానికంటె వేరు గాదు. ఉదాహరణకు 'బల్ల ఉన్నది, కుర్చీ ఉన్నది' అని మనము అంటాము. వీటిలో 'ఉన్నది' అను దానికి బల్ల, కుర్చీ అను నామరూపములు విశేషణములు. మరియు, కుర్చీ అనగా నేమి అని విశ్లేషిస్తే, కుర్చీకి స్వతంత్రమైన ఉనికి లేదని స్పష్టమగును. కుర్చీ తయారగుటలో ఉపయోగించిన చెక్కయే ఉనికి గలది. ఆ చెక్కను విశ్లేషిస్తే, దానికి కూడా స్వతంత్రమగు ఉనికి లేదని తెలును. చెక్క తయారగుటలో ఉపయోగపడిన వృక్షమజ్జ (pulp) కు మాత్రమే ఉనికి గలదు. అదే విధముగా, మజ్జకు ఉనికి లేదు. మజ్జలోని కణములకు మాత్రమే ఉనికి గలదు. మనమీ తీరున విశ్లేషిస్తే, సర్వదా ఉనికి మాత్రమే మిగిలియుండునని తెలును.

స్వతంత్రమగు ఉనికి గలది మాత్రమే ఉనికి యనదగును. అదియే సత్యము. అది చైతన్యము కంటె వేరుగాదు. చైతన్యము మాత్రమే స్వయంసిద్ధము. ఇతరము సర్వము ఆత్మ ప్రకాశ్యము. మనము తెలుసుకొనేది, ప్రశ్నించేది సర్వము జ్ఞాత కొరకు మాత్రమే. జ్ఞాత వివిధ జ్ఞాన సాధనముల (ప్రమాణము)ను ఉపయోగించి, ఒక వస్తువు యొక్క, లేక ఒక వాక్యము యొక్క సత్యాసత్యత్వములను నిర్ధారించుకొనును. కాని, జ్ఞాత యొక్క ఉనికికి నిరూపణము (proof) ఆవశ్యకము గాదు. జ్ఞాత స్వయంసిద్ధుడై ఉండాలి. కాని, జ్ఞాత ఎవరు?

జ్ఞాత యొక్క ఒక అంశము నాకు తెలియును. నేను ఘట ద్రష్టనని నాకు తెలియును. అంటే, చైతన్యరూపుడనగు నాకు ఒక మనోవృత్తి రూపమగు విశేషణము తగులుకొన్నది. మనోవృత్తి ఒక విశేషణము. విశేష్యము చైతన్యఘనమగు ఆత్మ తక్క మరియొకటి గాదు. కావున, జ్ఞాత చైతన్యము నందు గలదు. జ్ఞానము నందు చైతన్యము నిహితమై యున్నది. జ్ఞేయము కూడ చైతన్యమునందు గలదు. చైతన్యము స్వయంసిద్ధము. జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయములు మూడు చైతన్య సత్త కంటె భిన్నముగా లేవు. ఈ సత్యమును ఎరుంగుటయే ఈ శ్లోకములో 'ఆత్మ సంస్థం మనః కృత్వా' అని నిర్దేశింపబడినది.

మనస్సును వృత్తుల మూలములోనికి మరల్చాలి

ఈ సత్యము నెరింగిన వ్యక్తి మనస్సును దర్శించగల్గును. ఇది తెలియక ముందు మనస్సు అసంఖ్యాకములగు విషయములను గురించి ఆలోచిస్తూ గడిపేది. ఇప్పుడు కూడ మనస్సు అనేక విషయములను గురించి ఆలోచిస్తూనే ఉంటుంది. కాని నా ధ్యానము నేను చూచే దానిపైన లేదు. నేను నా ధ్యానమును మనోవృత్తుల నుండి మరల్చి, మనోవృత్తుల మూలములోనికి ఏకాగ్రము చేసెదను. దీనికే ధ్యానమని పేరు. అంటే, మనస్సును వృత్తి విషయముల నుండి వృత్తి మూలమునకు మరల్చుటయే ధ్యానమగును.

మనోవృత్తికి మూలము చైతన్యము. మనోవృత్తిలో విషయము ఏదైననూ కావచ్చును. ఉదాహరణకు, వృత్తిలో వృక్షము విషయము కావచ్చును. వృక్షాకార వృత్తిలో విషయము వృక్షమే. కాని, దాని మూలము చైతన్యము. కావున, వృక్షాకార వృత్తి చైతన్యము కంటె వేరుగాదు. వృక్షము చైతన్యము కంటె వేరుగాదు. ఈ మూడున్నూ చైతన్యము తక్క మరియొకటి గాదు. చైతన్యమే ఆత్మ.

ఈ అవగాహన కూడా ఒక వృత్తియే. ఈ వృత్తి చేయునదేమి? ఈ మూడు వేర్వేరు అనే అజ్ఞానమును ఈ వృత్తి నశింపజేసి, తాను కూడ లీనమగును. ఈ వృత్తి ఈ మూడింటి యొక్క ఏకత్వమును తక్క, ఇతరమును భావన చేయనిదై, తాను లయమగును. కావుననే, 'ఇతరమును దేనినీ చింతింపవలదు (న కించి దపి చింతయేత్)' అని శ్రీకృష్ణుడీ సందర్భములో చెప్పెను. వాస్తవంలో, సర్వము ఆత్మయే గనుక, ఇతరము లేనే లేదు.

'ఆత్మయే సర్వము; ఆత్మ ఇతర వస్తువు లన్నింటికంటె వేరుగాదు' అను ఆత్మ జ్ఞానము నుండి ద్రష్టకు మరల్చుట యందు ఇచటి తాత్పర్యము కాదు. ఏలయన, ఇతరమును గురించి

ఆలోచించగానే, ఈ జ్ఞానము తొలగిపోవును గదా! ఒక వస్తువును చూచి, అది వృక్షమని ఒక వ్యక్తి గుర్తించినాడు. అతడు తన యందు 'వృక్షద్రష్టను నేను' అను భావనను పొందును. ఈ భావన వాస్తవమే. కాని, వృక్షము, వృక్షాకార వృత్తి, మరియు వృక్షజ్ఞాత యగు ఆత్మ అనునవి ఒకటియే. ఈ మూడింటి మూలమునకు దృష్టిని మళ్లించుటయే ధ్యానము, మరియు జ్ఞానము అగునని ఈ శ్లోకము బోధించుచున్నది.

ఇతరమును గురించి ఆలోచించకుండ గలందులకు సాధకునిలో ధృతి (వివేకము) ఉండాలి. శాస్త్రోపదేశమును శ్రవణము చేయుట వలన ఈ ధృతి లభించును. సూక్ష్మదృష్టిని అలవరచుకున్న వ్యక్తి మాత్రమే జ్ఞాన సహాయముతో ఇట్టి ధ్యానమును చేయగల్గును. ధృతి యనగా ధైర్యము అని కూడ అర్థమును చెప్పవచ్చును. ధ్యానము చేయుటకు ఒక విశిష్టమగు స్థైర్యము, పట్టుదల, అంకితభావము ఉండవలెను. జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయములు పరస్పర భిన్నములని మనము సాధారణముగా భావిస్తాము. ఈ లక్షణములు గల వ్యక్తి మాత్రమే వీటి ఐక్యమును తెలియగల్గును.

సత్య దర్శనము వలన ఆటంకములు తొలగిపోవును

ఈ మూడు తత్త్వములో ఒకటియే అను సత్యము మన అనుభవమునకు విరుద్ధముగ నుండుటచే, ఈ సత్యము మన అవగాహనకు వచ్చుటలో కొంత ఆటంకముండుట సహజమే. ఈ సత్యము అవగాహనకు రానంతవరకు, అవరోధమున్నదనియే మనము భావించవచ్చును. ఆ సత్య దర్శనము కలుగగానే అవరోధము తొలగిపోవును. కావున, అవరోధముల గురించి చింతిల్లబని లేదు. మనము జ్ఞాన మార్గములో ముందుకు సాగాలి. దానికి ధైర్యము, స్థైర్యము, మరియు అంకిత భావము అవశ్యకమగును.

ఈ విషయమును నొక్కి చెప్పుటకై శ్రీ శంకరులు మెల్లమెల్లగా (శనైశ్శనైః) అను పదమును 'న సహసా (తొందరలో కాదు)' అని నిర్వచించిరి. 'ఆత్మ సంస్థం మనః కృత్వా' అంటే మనస్సును వెనువెంటనే ఆత్మ అనబడే వస్తువువైపునకు మరల్చాలి అని తాత్పర్యము కాదు. మనస్సును దానివైపునకు మరల్చగలిగే వస్తువు వంటిది ఆత్మ కాదు. మనస్సు ఆత్మయే. ఇచట చేయవలసిన పని ఏమియూ లేదు. ఇది కేవలము తెలియదగిన విషయము. కావున, దీనికి ఒక ప్రత్యేకమగు అంతరంగిక శ్రద్ధ కావాలి. అట్టి శ్రద్ధ వలన ధ్యానయోగ్యమగు వాయుమండలము నిర్మాణమగును. అట్టి వాయు మండలములో, సత్యము సాక్షాత్కరించును. దీనియందు సంకల్పశక్తి యొక్క ప్రమేయము లేశమైననూ లేదు. మెల్లమెల్లగా ధ్యానమును కొనసాగిస్తూ, ఆ ధ్యాన సమయములో ఆత్మరూపుడవై నుండుము.

ధ్యానములో సంకల్పశక్తి అవశ్యకము కాదు

ధ్యానమునకు సంబంధించినంత వరకు, ధ్యానమునకు అవశ్యకమగు ఏర్పాట్లను చేసుకొని, కూర్చుండు నంతవరకు మాత్రమే సంకల్పశక్తికి పాత్ర గలదు. అటుపిమ్మట సంకల్పశక్తితో చేయగలిగేది ఏమీ ఉండదు. వాస్తవంలో, సంకల్ప శక్తియే సమస్య. కావున, దానిని ధ్యానమునకు సమర్పించివేయాలి. మరోలా చెప్పాలంటే, ధ్యానము సంకల్పశక్తిని తన వశము చేసుకొనును. మస్తిష్కము అవిష్టమైనదా యన్నట్లుండును. ధ్యానము చేయు వ్యక్తి ఆ ధ్యానము చేతనే అవిష్టుడగును. కావున, ధ్యానములో సంకల్పశక్తి అవశ్యకము కాదు.

సుందరమగు దృశ్యమును గాంచి ఆనందించుటకు ఎట్టి సంకల్పశక్తి కావలెను? అక్కరలేదు. ప్రేరణనిచ్చు సుందరదృశ్యమును చూచినపుడు కలిగే అనుభూతిలో సంకల్పశక్తి లయమైపోవును. ఒక వస్తువును ప్రేమించే సమయంలో సంకల్పశక్తి ఎక్కడ ఉన్నది? ఉన్న సంకల్పశక్తి ప్రేమలో లీనమగును.

అదే విధముగా, ధ్యానములో సంకల్పశక్తి యొక్క బలముచే ఆత్మ పొందబడదు. పళ్లు పటపట లాడించి, చొక్కా చేతులను పైకి మడత బెట్టి, ధ్యానములో కూర్చుండి, 'నేనీనాడు ఆత్మను పొందవలసినదే' అని సంకల్పించుట వలన ఉపయోగము ఉండదు. ధ్యానము ఇట్లు ఉండదు. ధ్యానము ప్రపంచములోని ఇతర వస్తువులను పొందుట వంటిది కాదు; ఇతర కార్యములను చేయుట వంటిది కాదు. ఉదాహరణకు, మనమొక పనిని చేయగోరి సంకల్పశక్తి యొక్క బలముతో దానిని సాధిస్తాము. కాని, ఆసనములో కూర్చుండి, కళ్లను గట్టిగా మూసుకొని, నేను ఆత్మను పొంది తీరెదను అని సంకల్పించుట వలన ఆత్మ లభించదు. తలపోటు మాత్రమే వచ్చును! కావున, సంకల్పశక్తి యొక్క బలముతో ఆత్మను పొందనిచ్ఛగించు వ్యక్తి ఆత్మను పొందజాలడు. ఏలయన, ఆత్మ అతడే.

కావున, సాధకుడు ముందుగా ఉపదేశమును శ్రవణము జేసి ధ్యానయోగ్యమగు మనస్సును నిర్మాణము చేసుకొనవలెను. సాధకునకు లక్ష్యము బాగుగా తెలిసి యుండవలెను. ఈ శ్లోకములోని 'ఆత్మ సంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్' అను వాక్యము లక్ష్యమును నిర్దేశించును. ఆత్మజ్ఞానము మనస్సులో ఉదయించుటకు రెండు ఉపాయములు గలవు. జ్ఞాతృ- జ్ఞాన- జ్ఞేయముల అభేదమును ధ్యానించవలెను. లేదా, 'సత్య స్వరూపోऽహమ్ (సర్వము యొక్క సత్యత్వము నేనే)' ఇత్యాది వాక్యము నొకదానిని గ్రహించి, దానిని ధ్యానించవలెను. శాస్త్రోపదేశము ఇట్టి ధ్యానమునకు మిక్కిలి అనుకూలించును.

ఈ ధ్యానములో క్రొంగ్రొత్త జ్ఞానము సృష్టింపబడదు. ఇంతకుపూర్వము అనేక పర్యాయములు తెలియబడిన తత్త్వము వైపునకు మనస్సు కేంద్రీకృతము చేయబడును. 'ఆత్మ సంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్' అను శ్లోకార్థమునకు తాత్పర్యమిదియే. శ్రీకృష్ణుడీ వివరణను మరికొంత కొనసాగించుచున్నాడు:

అధ్యాయము 6, శ్లోకము 26:

यतो यतो निश्चरति मनश्चञ्चल मस्थिरम् ।
ततस्ततो नियम्यैतदात्मन्येव वशं नयेत् ॥ २६ ॥

యతో యతో నిశ్చరతి మనశ్చంచల మస్థిరమ్
తతస్తతో నియమ్యైత దాత్మన్యేవ వశం నయేత్ (26)

చంచలమ్ = మిక్కిలి చలన స్వభావము కల్గినట్టియు; **అస్థిరం** = స్థిరముగా నుండజాలని; **మనః** = మనస్సు; **యతో యతః** = ఏయే కారణములచే; **నిశ్చరతి** = వెళ్లిపోవునో; **తతః తతః** = అయా కారణముల నుండి; **ఏతత్** = ఈ మనస్సును; **నియమ్య** = వెనుకకు మరల్చి; **ఆత్మని ఏవ** = తన యందు మాత్రమే; **వశం** = వశమగునట్లు; **నయేత్** = నడిపించవలెను.

> మిక్కిలి చలన స్వభావము కలిగి స్థిరముగా నుండజాలని మనస్సు ఏయే కారణములచే ఇటునటు పరుగెత్తునో, అయా కారణముల నుండి దానిని వెనుకకు మరల్చి తన యందు మాత్రమే వశమగు నట్లు నడిపించవలెను (26).

మనమిచట మనస్సును విశ్లేషిస్తున్నాము. ఈ మనస్సును ఆత్మయందు ఉంచవలెను. మనస్సు ఆత్మను ధ్యానించవలెను. కాని ఈ మనస్సు ఇటునటు పారిపోవుచున్నది (నిశ్చరతి). శ్రీకృష్ణుడు ఈ మనస్సును చంచలం, అస్థిరం అను రెండు పదములతో వర్ణించెను.

చంచలం అనగా మనస్సు సర్వదా ఇటునటు పరుగెత్తుచుండును. వాస్తవంలో, మనస్సు యొక్క స్వరూపమిదియే. మనస్సు అటులనే సృష్టింపబడినది. మనస్సు అట్లు నిర్మింపబడుటయూ బాగుగనే యున్నది. అట్లు గానిచో, వ్యక్తి ఒకే ఆలోచనకు అతుకుకొని యుండెడివాడు. మనస్సు చంచలము మాత్రమే గాక, అస్థిరము కూడా. అనగా, అది లేశమైననూ స్థిరముగా నుండదు. సంతత

పరివర్తన శీలమగు మనస్సు ఒక క్షణమైననూ స్థిరముగా నుండదు. ఈ విధముగా, ఈ రెండు పదములు ఒకదానికి మరియొకటి పోషణములగుచున్నవి. మనస్సు సంతతచలన శీలమగుటచే అస్థిరముగ నున్నది (చంచలత్వాత్ అస్థిరమ్). మనస్సు అస్థిరమగుటచే సంతత పరివర్తన శీలముగ నున్నది (అస్థిరత్వాత్ చంచలమ్).

మనస్సు దానంతట అది సమస్య కాదు

శ్రీకృష్ణుడు మనస్సును మరియొక పదముతో కూడ వర్ణించెను. అది బయటకు పారిపోవుచుండును (నిశ్చరతి). బయటకు అది పారిపోవుట సమస్య కాదు. అది దాని స్వభావము. కాని మనస్సు చంచలము, అస్థిరము అగుటచే, మనము ఎన్నుకున్న ధ్యేయ వస్తువు నుండి పారిపోవుచుండును. దీనికి కారణము ఏదైననూ (యతః యతః) కావచ్చును. సాధకుడు పక్షి శబ్దమును, లేక ఇతర శబ్దమును వినును. మనస్సు దాని వెనుక పోవును. లేదా, ఎవరో ఏదో మాటలాడగనే, మనస్సు దాని వెంట పోవును. మనస్సు పారిపోవుటకు బాహ్య ప్రపంచము కూడ అవశ్యకము కాదు. ప్రపంచమంతయూ మన మనస్సులోపలనే యున్నది! మనము జీవితకాలపు అనుభవాలను ప్రోదిచేసుకున్నాము. ఒకచోట కూర్చుండి వాటిని నెమరువేయుటకే కాబోలును! అంటే, పక్షుల ధ్వనులన్నియూ మనస్సులోననే ఉద్భవించును. మనకు పరిచితులైన వారందరు మనస్సులోనే ఉండి ఆయా పనులను చేయుచుందురు. కావున, మనస్సు అట్లు ప్రవర్తించుటకు తగినంత బలమగు కారణములు గలవు.

కారణమేదైనా, మనస్సు ధ్యేయవస్తువు నుండి మరలి పోయినప్పుడు, ఆ కారణము నుండి, ఆ పరిస్థితి నుండి మనస్సును నియమించి వెనుకకు మరల్చవలెను. ఈ పనిని చేయుట ఎట్లు? అను విషయములో శ్రీ శంకరులు ఈ శ్లోక భాష్యములో ఒక చక్కని సలహాను ఇచ్చినారు. నీవు దానిని వెనుకకు లాగే ప్రయత్నమును చేయవద్దు. మనస్సు ఏవస్తువు మీదికి మరలినదో, అదే వస్తువును నీవు పరిశీలించుము. ఆ కొద్ది సమయములో నీవు అదే వస్తువును నీ ధ్యేయవస్తువుగా చేసుకొనుము. అపుడు యేమగును? ఆ వస్తువు చైతన్యమనమగు ఆత్మ కంటె భిన్నముగా స్వతంత్రముగా నున్నదా? నీవీ విధముగా ప్రశ్నించుటను ఆరంభించిన తరువాత ఆ వస్తువు ఇంకనూ ఉనికిని కలిగియున్నదా? లేదు. అది మిథ్యయని నీవు గ్రహించి, సత్యము వైపునకు, అనగా నీ స్వరూపము వైపునకు మెనుదిరుగుతావు.

వేదములో ఆఖరి అధ్యాయము వరకు కర్త, కర్మ, క్రియ, కరణములు ఇత్యాదుల గురించి విస్తారమగు చర్చ ఉండును. ఆఖరి అధ్యాయములో, అంతవరకు చర్చించినదంతా మిథ్య అనియు, సత్యము కాదనియు వేదము బోధించును. నీవు ధ్యానములో కూర్చున్నప్పుడు, నీ ధ్యానమునకు భంగము కలిగించిన ఆలోచన, ధ్యేయవస్తువు నుండి నీ మనస్సును మరల్చిన వస్తువు, అనగా ఆలోచన దాని యందు విషయమగు వస్తువుతో సహా సత్యాత్మ దర్శనముచే మిథ్య అయిపోవును. కావున, సాధకుడు మనస్సును తన వశములోనికి తెచ్చుకొనవలెనని (వశం న యేత్) శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు. మనస్సు ధ్యేయము నుండి మరలినప్పుడు, దానిని మరల నీవు ధ్యేయము వైపునకు త్రిప్పవలెను. అనగా, సాధకుడు మరల ఆత్మధ్యానములోనికి మరలి రావలెను.

ఇచట బల ప్రయోగము ఏమియూ లేదు. నీ మనస్సును ప్రక్కకు మరల్చిన వస్తువును నీవు పరిశీలించుము. తద్ద్వారా చిత్త విక్షేపహేతువగు వస్తువే ధ్యేయవస్తువుగా మారిపోవును. అంటే, నీ ధ్యానము విక్షేపము నుండి యథార్థ తత్త్వమగు చైతన్యము లోనికి మరలును. కావున, నీకు సమస్య ఉండదు. నీకు ఏ వస్తువు చిత్త విక్షేపమును కలిగించగలదు? ఈ ధ్యానయోగమును అభ్యసించుటచేత కలుగు శక్తి వలన మనస్సు ఆత్మలో లీనమగును. అట్టి వ్యక్తికి చిత్త విక్షేపము, భ్రాంతి జన్యమగు తాదాత్మ్యధ్యాస అను వాటి ప్రసక్తియే ఉండదు. మనస్సు మనస్సుగా మాత్రమే మిగిలిపోవును. అట్టి మనస్సు వలన సమస్యలు ఉండవు.

తరువాతి శ్లోకములో శ్రీకృష్ణుడు ఇట్టి ధ్యానము యొక్క ప్రయోజనమును వర్ణించుచున్నాడు:

అధ్యాయము 6, శ్లోకము 27:

प्रशान्तमनसं ह्येनं योगिनं सुखमुत्तमम् ।
उपैति शान्तरजसं ब्रह्मभूतमकल्मषम् ॥ २७ ॥

ప్రశాంత మనసం హ్యేనం యోగినం సుఖముత్తమమ్
ఉపైతి శాంతరజసం బ్రహ్మ భూతమకల్మషమ్ (27)

ప్రశాంత మనసమ్ = ప్రసన్నమైన మనస్సు కలిగినట్టియు; శాంతరజసమ్ = తొలగిన దోషములు కలిగినట్టియు; అకల్మషమ్ = జీవితములో మాలిన్యములు లేనట్టియు; బ్రహ్మభూతం = బ్రహ్మస్వరూపుడైన; ఏనం = ఈ; యోగినం = యోగిని; హి = నిశ్చయముగా; ఉత్తమం = సర్వ శ్రేష్ఠమైన; సుఖం = ఆనందము; ఉపైతి = చేరును.

ప్రసన్నమైన మనస్సు కలిగినట్టియు, తొలగిన దోషములు కలిగినట్టియు, జీవితములో మాలిన్యములు లేనట్టియు, బ్రహ్మ స్వరూపుడైన ఈ యోగి నిశ్చయముగా సర్వ శ్రేష్ఠమైన ఆనందమును పొందును (27).

ధ్యానము వలన మానవునకు ఉత్తమ సుఖము లభించునని శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పుచున్నాడు. ఈ సుఖమును మనకు తెలిసిన ఇతర సుఖములతో సరిపోల్చుట కుదరదు. ఇది ఆత్మ యొక్క స్వరూపభూతమైన పూర్ణత్వము.

ఆనందము కలిగిన ఏ క్షణములోనైనా, జిజ్ఞాసు – జిజ్ఞాస్య భేదము లయమగును. ఆనందము కలుగుటకు ఒక పరిస్థితి, లేక ఒక వస్తువు కారణము కావచ్చును. కాని ఆ క్షణములో ఆత్మ తక్క మరియొకటి ఉండదు. ఉదాహరణకు, సంగీతమును పరిశీలించుడు. సంగీతము గలదు. సంగీతము నాస్వాదించు వ్యక్తి గలడు. వృత్తిరూపముగా సంగీతాస్వాదనము కూడ గలదు. కాని, సంగీత సుఖములో ఈ మూడింటి భేదము లీనమగును. ఈ సంగీత సుఖానుభవములో, ఈ పూర్ణసుఖములో జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయములు సంలీనమగును. ఈ అనుభవము పూర్ణము ఎట్లైనది? స్వరూపతః ఏకము, చైతన్యము అగు ఆత్మ వలన ఆ సుఖము పూర్ణమైనది.

సుఖము అను పదము మనకు విదితమే. కనుక, ఆ పదమును ఉపయోగించి మనము ఆత్మ స్వరూపమును నిర్వచించవచ్చును. ఆత్మ పూర్ణము. అపరిచ్ఛిన్నము. వస్తువునకు వ్యక్తికి మధ్యలో అఖండముగ నుండునది ఆత్మ. ఈ శ్లోకములోని సుఖపదము అఖండము, పూర్ణమునగు ఆత్మను నిర్దేశించును. కావున, ఇది మనము ఉల్లాస క్షణములలో అనుభవించే సాధారణ సుఖము కాజాలదు. దీనిని మనకు తెలిసిన సుఖముతో సరిపోల్చలేము. ఇది ఆత్యంతిక సుఖము, పూర్ణ సుఖము, ఉత్తమ సుఖము. ఇది ఆత్మయొక్క స్వరూప భూతమైన సుఖము.

పూర్ణ సుఖమునకు అధికారి ఎవరు?

ఈ ఉత్తమ సుఖమును పొందునది యెవరు? ప్రశాంత మనస్కుడు, శాంతరజసుడు, బ్రహ్మభూతుడు మరియు అకల్మషుడు అయి ఆత్మను ధ్యానించు వ్యక్తి ఉత్తమ సుఖమును పొందునని ఈ శ్లోకము వర్ణించుచున్నది. మనమింతకు ముందు చూచిన తీరున, ఈ పదములు జ్ఞానిని వర్ణించుటయే గాక, ధ్యానయోగమును అభ్యసించుట వలన లభించు ఫలములను, మరియు జ్ఞానమును పొందుటకై సాధకునకు ఉండవలసిన అర్హతలను కూడా వర్ణించును.

యోగి ప్రశాంతమగు మనస్సును కలిగియుండును. అతనికి మనస్సు సమస్యలను సృష్టించదు. కావున, ఈ ఉత్తమ సుఖము అతనిని పొందును. మరియు అతడు శాంతరజసుడు. అనగా సకల మాలిన్యములు (రజస్) తొలగిపోయినవాడు. రాగద్వేషమూలకముగా మిథ్యాభూతములగు వస్తువుల యందు కలిగే ఆసక్తి (మోహాదిక్లేశము) యే మాలిన్యమని శ్రీ శంకరులు నిర్వచించిరి. ఈ శ్లోకములో వర్ణింపబడే యోగి రాగద్వేషములకు అధీనుడై ఉండడు. అందువలననే, అతడు అకల్మషుడైనాడు.

కల్మషమనగా అధర్మము, లేక పాపము. జీవితములో అధర్మాచరణము లేని వ్యక్తి అకల్మషు డనబడును. ఈ సర్వము బ్రహ్మమే (ఇదం సర్వం బ్రహ్మైవ) అనే నిశ్చయ జ్ఞానము అకల్మషుడగు వ్యక్తి యందు ఉదయించి, అతడు బ్రహ్మభూతుడు కాగల్గును. సర్వము బ్రహ్మమే గనుక, ఆ బ్రహ్మ నేనే (తత్ బ్రహ్మ అహం అస్మి). సర్వము బ్రహ్మమే గనుక, సర్వము నేనే (అహం ఇదం సర్వమ్) అను జ్ఞానమాతనికి కలుగును. ఈ జ్ఞానము కలిగి అతడు బ్రహ్మభూతుడగును. అకల్మషుడు, శాంత రజసుడు, ప్రశాంత మనస్కుడు, బ్రహ్మ భూతుడు అగు యోగి ఆత్మ స్వరూపభూతమైన ఉత్తమ సుఖము (ఆనందము) ను పొందును. ఆత్మ జ్ఞానము కలుగగానే, ఈ సుఖము ఆ జ్ఞానిని చేరుకున్నదా యనిపించును.

సుఖము జ్ఞానిని పొందునా? లేక, జ్ఞాని సుఖమును పొందునా?

ఈ శ్లోకములోని వాక్యమునకు ఉత్తమ సుఖము కర్త. అది చేరుకొనే వ్యక్తి కర్మ. ఉత్తమ సుఖము (ఆనందము) ను వ్యక్తి చేరుకుంటాడు అని మనము సాధారణంగా అనుకుంటాము. కాని, అదియే జ్ఞానిని చేరునని ఈ శ్లోకము చెప్పుచున్నది. ఇది ఒక విలక్షణమైన కథనము. పొందుట అనే క్రియలో యోగి కర్మ, ఆనందము కర్త అగును. ఆనందము నన్ను చేరుకొనునా? లేక నేను ఆనందమును చేరవలెనా? అను ప్రశ్న తలయెత్తును. ఈ రెండు విధములు సరియైనవే. మనమీ విషయమును తరువాతి శ్లోకములో చూస్తాము.

అధ్యాయము 6, శ్లోకము 28:

युञ्जन्नेवं सदात्मानं योगी विगतकल्मषः ।
सुखेन ब्रह्मसंस्पर्श मत्यन्तं सुखमश्नुते ॥ २८॥

యుంజన్నేవం సదాత్మానం యోగీ విగత కల్మషః
సుఖేన బ్రహ్మ సంస్పర్శ మత్యంతం సుఖమశ్నుతే (28)

ఏవం = ఈ విధముగా; సదా = అన్నివేళలా; ఆత్మానం = మనస్సును; యుంజన్ = లగ్నము చేయుచూ; విగత కల్మషః = అధర్మజనితములగు సంఘర్షణల నుండి విముక్తుడైన; యోగీ = యోగి; సుఖేన = తేలికగా; బ్రహ్మ సంస్పర్శం = బ్రహ్మ సాక్షాత్కారము వలన జనించే; అత్యంతం = పూర్ణమగు; సుఖం = ఆనందమును; అశ్నుతే = పొందును.

> ఈ విధముగా అన్నివేళలా మనస్సును ఏకాగ్రము చేయుచూ, అధర్మ జనితములగు సంఘర్షణల నుండి విముక్తుడైన యోగి, తేలికగా, బ్రహ్మ సాక్షాత్కారము వలన జనించే పూర్ణానందమును పొందును (28).

పూర్వ శ్లోకములో ఉత్తమ సుఖము కర్త. ఆ సుఖము పొందే ధ్యానయోగి కర్మ. కాని, ఈ శ్లోకములో యోగియే కర్త. పొందబడిన సుఖము అత్యంత సుఖము. అత్యంతము, ఉత్తమము సమానార్థకములు. ఛందస్సును పాటించుట కొరకై పదము మారినది. సుఖము యోగిని చేరునని పూర్వశ్లోకములో చెప్పిన శ్రీకృష్ణుడు ఈ శ్లోకములో యోగి సుఖమును చేరునని యేల చెప్పుచున్నాడు? కర్త యెవరు, కర్మయేది అను విషయములో ఆయన భ్రాంతి పడినాడా యేమి? లేదు. వాస్తవంలో మనకు ఉండే భ్రాంతులను తొలగించుట కొరకై ఆయన ధ్యానఫలమును రెండు విభిన్న రీతులలో వర్ణించినాడు.

'ఉత్తమ సుఖము యోగిని పొందును' అన్నప్పుడు యోగి కర్మయగును. అంటే, ఆనందము వచ్చి యోగిని కప్పివేసి, అభిభూతుని చేయుననియా? అట్లైనచో సమస్యయే. అనగా ధ్యానమును చేయు యోగి ఆనందములో మునిగిపోవును. అంటే, ఆనందము అతనిని కబళించి వేసినది! ఈ దృష్టితో చూచినచో, యోగి కర్మ అయినట్లు అనిపించును. కాని, అది యథార్థము కాదు. ఈ జగత్తులో ఉన్న ఏకైక కర్త అతడే. కావున, అతడు కర్మ కాజాలడు. ఈ విషయమును స్పష్టము చేయుట కొరకై శ్రీకృష్ణుడు వాక్యమును మార్చినాడు. యోగి ఉత్తమ సుఖము (ఆనందము)ను పొందును. అనగా, కర్త–కర్మ భేదము లేదని తాత్పర్యము.

కర్త–కర్మ భేదమును తొలగించుట

నది సముద్రంలో కలిసే సంగమ స్థానంలో నదికి, సముద్రానికి భేదము ఉండదు. అటులనే కర్త–కర్మ భేదము లేదు. నది సముద్రమును చేరునా? లేక, సముద్రము నదిని స్వీకరించునా? మనము చెప్పలేము. నదీ సాగర సంగమములో కొన్ని మైళ్ళు వెనుక వరకు నదిలో నీళ్ళు ఉప్పుగా

ఉంటాయి. అంటే, సముద్రము నదిలో ప్రవేశిస్తోందా అనిపిస్తుంది. అప్పుడు కర్త ఎవరు? కర్మ ఎవరు? మనకు తెలియదు. నది సముద్రమునుచేరునని కొన్నిసార్లు, సముద్రము నదిలోకి వచ్చునని మరికొన్నిసార్లు మనము అంటాము.

ఇదే విధంగా, ఇక్కడ కూడా, ఆనందమును పొందే కర్త ఆనందమును తన స్వరూపము కంటె భిన్నముగా దర్శించడు. కావున, కర్త-కర్మలు ఒక్కటియే (కర్తా ఏవ కర్మ). ఇది ఇతర వస్తు ప్రాప్తి వంటిది కాదు. ఇది తన గురించిన (ఆత్మ) జ్ఞానము. కావున, ఈ రెండు శ్లోకములను కలిపి అర్థం చేసుకోవాలి.

ప్రస్తుత శ్లోకంలో 'ఆత్మానం యుంజన్' అనగా మనస్సును కలుపుట, లేక ఏకము చేయుట అని యర్థము. 'ఏవం' అనగా ఈ విధముగా ఈ సర్వము ఆత్మయే (అహం ఇదం సర్వం ఏవ) అను జ్ఞానముతో మనస్సు కలుపబడునని యర్థము. ఈ తీరున, మనస్సును ధ్యేయవస్తువుతో కలిపిన ధ్యానయోగి అత్యంత సుఖము (ఉత్తమ సుఖము)ను పొందును.

ఇట్టి వ్యక్తిని ఈ శ్లోకము యోగి అని నిర్దేశించినది. అనగా, అతని ధ్యానము సఫలమైనదని సూచితమగును. ఇట్టి యోగికి ఆటంకము లేమియూ ఉండవు. ఈతడు అధర్మము నుండి, పాపపుణ్యము లన్నింటి నుండి విముక్తుడై యుండును (విగత కల్మషః) అని కూడ వర్ణింపబడినది. ఏలయన, ధ్యానము సఫలమగుటలో వ్యక్తి తన జీవితమును గడిపే తీరు చాల ప్రముఖమైనది. అధర్మ విరహితమగు నిత్యజీవితమును గడిపే వ్యక్తి మాత్రమే సఫల ధ్యానయోగి కాగల్గును. నైతిక విలువల కనురూపముగా జీవించే వ్యక్తికి సంఘర్షణా రూపములగు ఆటంకములన్నియు తొలగిపోవును. అధర్మము వలన ఉత్పన్నమయ్యే సంఘర్షణల నుండి విముక్తమైన జీవితమును గడిపే వ్యక్తి విగత కల్మషు డనబడును. ఇట్టి విగత కల్మషుడగు యోగి అత్యంత సుఖమును పొందును.

అత్యంత సుఖము అనుభవరూపము కాదు

ఇంతకు ముందే చెప్పిన విధముగా, మనము సంపాదించుకునే వివిధ శ్రేణుల సుఖముతో అత్యంత సుఖమును పోల్చరాదు. ఈ విషయములోనే కొందరు తప్పుగా గ్రహించి, శాశ్వత ఆనందము మొదలగు మాటలను పలికెదరు. ఈ సుఖము చరమ సుఖము (bliss) కాదు. ఇది వ్యక్తి యొక్క స్వరూపము.

స్వరూప సుఖమును చరమ సుఖము (bliss) అని భావించినచో, అది అనుభవరూపమని స్వీకరించినట్లగును. అపుడు, ఈ చరమ సుఖము ఎట్టిది? అది నాకు ఎట్లు లభించును? అను ప్రశ్నలు ఉదయించును. అది వ్యక్తి పొందేది, కొంతకాలము మాత్రమే ఉండేది అయినచో, దానిని శాశ్వత చరమ సుఖము అనుట యెట్లు పొసగును? అది అనుభవరూపమైనచో, దానియందు జ్ఞానము లేదు. ఈ అత్యంత సుఖము ఎట్టిది? ఈ శ్లోకము ఈ సుఖమును బ్రహ్మ సంస్పర్శ–అత్యంత సుఖమని వర్ణించినది. అనగా, బ్రహ్మను స్పృశించుట, అనగా గుర్తించుట వలన కలిగే సుఖము అని యర్థము.

మనము ఏదేని ఆహ్లాదకరమగు వస్తువును స్పృశించుట వలన కలిగే సుఖమునకు స్పర్శసుఖము అని పేరు. అనగా, బ్రహ్మను స్పృశించి, కౌగిలించుకొనుట వలన అత్యంత సుఖము లభించునా? కాదు. బ్రహ్మ కౌగిలించుకొనుటకు వలన పడే వస్తువు కాదు. ఆత్మయే సర్వము అని బోధించుటకై శాస్త్రము బ్రహ్మ పదమును వాడును. ఆత్మయే బ్రహ్మ అను సాక్షాత్కారము వలన జనించు సుఖము బ్రహ్మను స్పృశించుటచే కలిగే సుఖము అని వర్ణింపబడినది. ఈ సుఖము బ్రహ్మకు చెందును. వాస్తవంలో ఇది బ్రహ్మ యొక్క స్వరూపమే కావున, దీనికి స్వరూప సుఖమని పేరు.

స్వరూపసుఖమనగా అనుభవాత్మకమగు సుఖము కాదు. సర్వ విధముల సుఖముల స్వరూపమును గుర్తించుటయే స్వరూపసుఖము. మనకు లభించే సుఖము లన్నిటి యందు, బ్రహ్మ యొక్క స్వరూపభూతమైన అఖండ స్వరూపసుఖమే లభించుచున్నది. ఆత్మయే బ్రహ్మము అను సాక్షాత్కారము గల ధ్యానయోగి ఈ స్వరూప సుఖమును పొందునని చెప్పబడినది.

చరమ సుఖము సదా సొంతముగ నుండును

అత్యంత సుఖమునకు అంతము లేదని శ్రీ శంకరులీ శ్లోక భాష్యములో వివరించిరి. ఇది కూడ చరమ సుఖము (bliss) అయినచో, ఏదో ఒక క్షణములో అంతమై పోయెడిది. అనుభవము లన్నింటికీ పరిధి ఉండును గదా! కావున, ఈ చరమ సుఖము పరిమితము. కాని, అత్యంత సుఖము కాలపరిచ్ఛేదము, శ్రేణి పరిచ్ఛేదము ఇత్యాది పరిచ్ఛేదము లన్నింటికి అతీతమై యుండును. వ్యక్తి యొక్క స్వరూపసుఖము ఎన్నటికీ అనుభవాత్మకము కాజాలదు. కావున, స్వరూప సుఖములో పరిమితులేమియూ ఉండవు.

ఒక విశిష్ట మనస్స్థితి ఉన్నప్పుడు మాత్రమే అనుభవాత్మక సుఖము లభించును. కాలము యొక్క పరిధిలో ఉండే ఈ మనస్స్థితిలో మార్పు కలుగుట నిశ్చయము. కావున, ఇట్టి

కాలపరిచ్ఛిన్నమగు అనుభవాత్మక సుఖము అశాశ్వతముగ నుండును. కాని, సుఖము అన్నిటియందు స్వరూపము, సత్యము ఉండును. ఆ సత్యము ఆత్మయొక్క స్వరూపము. దాని యందు పరిచ్ఛేదము లేమియూ లేవు. ఇట్టి స్వరూప సుఖము అనంతము, పూర్ణము. దీనియందు జ్ఞాతృ జ్ఞేయముల అభేదము దర్శింపబడును (సర్వం అహం అస్మి). ఈ స్వరూప సుఖము ఈ రెండు శ్లోకములలో ఉత్తమ సుఖమనియు, అత్యంత సుఖమనియు నిర్దేశింపబడినది. ఇది ఆత్మ యొక్క స్వరూపమే గనుక, దీనికి అంతము ఉండదు. ఆత్మ కాలాతీతము, శాశ్వతము.

స్వరూపసుఖమును పొందుటకు ప్రత్యేక ప్రయత్నము అక్కరలేదు

ఈ సుఖమును పొందే విధమెట్టిది? మనమీ ప్రశ్నను అడుగుటలో ఒక కారణము గలదు. సాధారణంగా లోకంలో మనము ఎక్కువ శ్రమిస్తే, ఫలము కూడ అధికముగ నుండును. ఒక కార్యముపై ఎక్కువ శ్రద్ధను వహిస్తే, దాని నుండి కలిగే లాభము కూడ అధికముగ నుండును. ఇది మనకు బాగా అనుభవములో నున్న నియమము. కావున, ఈ అనంతసుఖమును పొందుటకు వ్యక్తి ఎంత శ్రమను చేయాలి? అనంతకర్మను చేయాలా? అక్కరలేదు. ఈ పరిమిత ప్రపంచములో పరిమిత పరిస్థితులకు అన్వయించే యుక్తులు అనంత సుఖమునకు వర్తించవు. వాస్తవంలో, కర్మలు అనంతమైనవో, మనము కనురెప్పను వాల్చజాలము. ఏలయన, అది కూడ ఇతరకర్మల వలె పరిమితము, సాంతము. కావున, అనంతకర్మను చేయగలగాలంటే, ఏ కర్మనూ చేయరాదు!

వాస్తవంలో అనంత సుఖమును పొందుటకు కర్మతో పనిలేదు. శ్రీకృష్ణుడీ విషయమును సుఖేన అను పద ప్రయోగముతో సూచించెను. 'సుఖేన' అనగా తేలికగా అని యర్థము. దీనిలో చెమటోడ్చ వలసిన పనిలేదు. కన్నీరు గార్చనక్కరలేదు. ఏలయన, ఈ సుఖము జీవుని ఆత్మరూపమే. ఆత్మయే బ్రహ్మ. ఈ సత్యమును దర్శించుట వలన అత్యంత సుఖము కలుగును. కావున, దీని ప్రాప్తి తేలిక (సుఖేన) యగుట సహజమే.

సాధారణంగా, సుఖమునుపొందుటకు మనము కొంత ప్రయత్నించవలెను. ఆ ప్రయత్నంలో కొంత దుఃఖము ఉండితీరును. ఉదాహరణకు, ఒకడు పెట్టె సర్దుకుంటున్నాడు. ఎక్కడికి? అని అడుగగా ఊటీ అని చెప్పినాడు. ఎందులకు? అని అడుగగా, కొన్నిదినములు సుఖముగా నుండుట కొరకు అని చెప్పినాడు. రైలు స్టేషన్‌కు వెళ్లేదారిలో అతడు వాహనాల రద్దీ (traffic jam)లో ఇరుకుకొని చాల క్లేశమును అనుభవించినాడు. రైలుస్టేషన్‌కు చేరిన తరువాత కూడ మరింత

దుఃఖము ననుభవించినాడు. అతని సంచీని ఎవరో దొంగిలించగా, ఇంకా దుఃఖము కలిగినది. ఊటీలోని హోటల్‌కు అతడు వెళ్ళనరికి గది రిజర్వేషన్ కాలేదు. ఇది ఇంకో దుఃఖము. ఇట్లు ఆది నుండి అంతము వరకు దుఃఖమే. ఈ దుఃఖము అంతా దేని కొరకు? కొద్ది సుఖమును, కొద్ది చల్లదనమును పొందుట కొరకు. పైగా, అతడు ఊటీలో ఉన్న నాలుగు రోజులలో ఎండలు విపరీతముగా నుండెను. కొంచెము ఎండ తగ్గునాటికి, అతడు వాపసు రావలసిన తేదీ రానే వచ్చినది. అతని విహారము పూర్తి అయినది.

ఇందువలననే దీనిని మనము అల్పసుఖమని అంటాము. ఎంతో శ్రమ, ఎంతో ఖర్చు, ఎంతో దుఃఖము! లభించేది కొద్ది సుఖము. కాని, ప్రస్తుతంలో, అత్యంత సుఖమును పొందుటకు ఎంత శ్రమను పడాలి? ఎంత దుఃఖమును సహించాలి? ఇది ఆది నుండి అంతము వరకు ఉల్లాసమే. సాధకుడు దీనిని సుఖముగా సాక్షాత్కరించుకొనును. దీనికి ఆరంభములో నుండే విచారము కూడ ఆహ్లాదకరముగ నుండును. ఏలయన, నీవు పూర్ణుడవని శాస్త్రము బోధించుచున్నది. నీవు మూర్ఖుడవని గాని, పాపివని గాని శాస్త్రము చెప్పుట లేదు. నీవే సర్వమనియు, ఈ సత్యమును దర్శించలేకపోవుటయే మూర్ఖత్వమనియు శాస్త్రము చెప్పుచున్నది. కావున, శాస్త్రమును శ్రవణము చేయుట మిక్కిలి ఆహ్లాదకరముగా నుండును. వేదాంతములో తక్క 'నీవే సర్వము, నీవు పూర్ణుడవు' అను మాట మరెక్కడమూ వినరాదు. శాస్త్రము మాత్రమే నిన్ను పూర్ణముగా స్వీకరిస్తుంది. దేవదూతలు, గొప్ప గురువులు నిన్ను అంగీకరించరు. వారికి ఉండే లక్ష్యములు వారికి ఉన్నవి. పిల్లలు ఎల్లా ఉన్నా, ఉన్నట్లు గాక మరోలా ఉండాలని తల్లిదండ్రులు ఆకాంక్షిస్తారు. కావున, శాస్త్రము తక్క మరెవ్వరూ నిన్ను పూర్ణముగా స్వీకరించరు.

శాస్త్ర దృష్టి

ధర్మ శాస్త్రములు, మతములు కూడ నిన్ను స్వీకరించవు. మతములన్నియూ ముందుగా నిన్ను దోషి వని నిందించి, ఆ పైన నిన్ను రక్షించుటకు పూనుకుంటాయి. వీరందరూ నిన్ను రక్షించుటకు పూనుకున్నవారే యనిపిస్తుంది. ప్రతివాడు ఇతరులను రక్షించుటకు సంసిద్ధుడవుతాడు. ధర్మశాస్త్రములు, మతములు అన్నీ దీనికొరకు మాత్రమే ఉద్దేశించబడినవి. ఏలయన, వాటి దృష్టిలో నీవు దోషివి. కాని, శాస్త్రము తద్భిన్నముగా 'తత్ త్వం అసి (అది నీవే)' అని చెప్పును. 'తత్ త్వం భవిష్యసి (అది నీవు అవుతావు)' అని శాస్త్రము చెప్పుట లేదు. తత్త్వమసి అనే ఉపదేశము పూర్ణము. ఇది కేవలం స్వీకారము మాత్రమే కాదు. ఇది 'నీవే సర్వము' అనే ఉపదేశము. శాస్త్ర దృష్టి ఇట్లున్నది గాన, ఒకవేళ అట్లు చేయాలనుకున్నా, శాస్త్రము నిన్ను దోషియని నిర్ధారించజాలదు!

ఈ సృష్టిలో ఉన్న ఒకే ఒక సత్యము నీవే. ఇంకేదీ లేదు. మిగిలినదంతా ఆత్మ మీద మాత్రమే ఆధారపడే అనాత్మ. స్వయంసిద్ధమగు ఏకైక సత్యము నీవే. మిగిలిన సర్వము స్వయం సిద్ధ సత్తారూపుడవగు నీపై ఆధారపడియున్నది. కావున, ఆది యందు, అంతమునందు గూడ నీవు శాస్త్రమునకు పూర్ణముగా స్వీకార్యుడవై ఉన్నావు. మోక్షమనగా ఆత్మజ్ఞానము మాత్రమేననియు, అది నీ స్వరూపమే ననియు శాస్త్రము ప్రారంభములోనే బోధించును. అంటే, శాస్త్రోపదేశము యొక్క ఆరంభ బిందువు వద్దనే నీవు ముక్తుడవై యున్నావు. కాని, ఆ సత్యమును నీవు యెరుంగవు. కావున, శాస్త్రము యొక్క విషయ వస్తువు సిద్ధమే గాని సాధ్యము గాదు. అనగా, జ్ఞాని సదా లభ్యముగా ఉన్నదానినే జ్ఞాన ప్రభావముచే పొందును (ప్రాప్తస్య ప్రాప్తిః). ఇది ఇంతకు ముందు పొందబడని దానిని పొందుట గాదు(న తు అప్రాప్తస్య ప్రాప్తిః). ఈ విధమైన ఆరంభము నిశ్చయముగా ఆహ్లాదకరమైనది. పైగా, ఈ ప్రయాణము తుది వరకు ఆహ్లాదకరమైనది. ఇతర సుఖములను పొందుటకు యత్నమును చేయాలి. ఈ యత్నము సదా ఆహ్లాదకారిగా నుండకపోవచ్చును. స్వర్గమును పొందుటకై శాస్త్రవిహిత కర్మను ఆచరించుటలో చాల ప్రయాస గలదు. యజ్ఞమును యథావిధిగా చేయుటకు చాల సమయము పట్టును. మరియు, చాల కన్నీరు కార్చవలసి యుండును. ఏలయన, హోమమును చేయుటకై అగ్నిహోత్రము యెదుట చాలసేపు కూర్చుండవలెను. ఇంత కష్టపడిన తరువాత స్వర్గ సుఖము లభించును. ఈ సుఖము ఎంతకాలము నిలబడును? స్వర్గ సుఖము కూడ సాపేక్షసుఖమే. స్వర్గము కూడ ఒక ప్రదేశము మాత్రమే. అచ్చటనైననూ శాశ్వతముగా నుండుటకు వీలు కాదు. స్వర్గమును పొందిన వ్యక్తి స్వర్గమును వీడవలసిన సమయము వచ్చును. కావున, స్వర్గసుఖము కూడ అనిత్యసుఖమే. దానిని పొందుటకై చాల శ్రమపడవలసియుండును.

కోర్కెలన్నియూ ఆత్మ కొరకు మాత్రమే

కాని, దీనిలో ప్రయాస లేదు. ఉన్నది అంతా సుఖమే. ఇది అసంగతముగను, అతిశయోక్తిగను భాసించవచ్చును. కాని ఇదియే సత్యము. నూట యెనుబది డిగ్రీలు వెనుకకు తిరిగినప్పుడు యుక్తులు కూడ తారుమారగును. సాధారణముగా మనము అనాత్మ వస్తువులను మాత్రమే కోరుచుందుము (అనాత్మ – ఇచ్ఛా). ఆత్మను కోరము. స్వర్గము కూడ అనాత్మయేగాని, ఆత్మ కాదు. నేను ఒక స్థానమును పొందెదను, నేను ఒక వస్తువును పొందెదను అని చెప్పే సందర్భాలన్నింటిలో పొందబడే స్వర్గము, ధనము ఇత్యాదులన్నీ అనాత్మలే.

అనాత్మలన్నియూ ఆత్మ కొరకు మాత్రమే. సుఖప్రాప్తి ఆత్మ కొరకే. నా సుఖము కొరకు, నా ఆనందము కొరకు, నా సంక్షేమము కొరకు, నా అనుభవము కొరకు, నాకు ఇది కావాలి, అది కావాలి. నేను ఇచటకు వెళ్లాలి, అచటకు వెళ్లాలి. ఈ విధంగా ఈ అనాత్మ లన్నియూ ఆత్మకొరకు మాత్రమే ఉన్నవి. ఈ విధముగా సర్వకాలములలో ఈ ఆత్మానాత్మ సంయోగము గలదు. ఈ సంయోగము అనుకూలముగా నున్న సందర్భాలలో కొంత సుఖము లభించును. కాని అది సర్వదా అనిత్యముగ నుండును.

సాధకుడు ఈ అనాత్మ యందలి ఇచ్ఛను విడనాడి దాని స్థానంలో ఆత్మయందలి ఇచ్ఛను ఎన్నుకోవాలి. అనాత్మ ఇచ్ఛ మరియు ఆత్మ ఇచ్ఛ అనునవి పరస్పర విరుద్ధములు. కావున, వాటికి అన్యోన్య సంబంధము లేదు. ఆత్మ సాక్షాత్కారము నందలి ఇచ్ఛ, అనాత్మ–ఇచ్ఛకు వ్యతిరేక ధ్రువము వంటిది. కావున, అనాత్మ ఇచ్ఛకు వర్తించే యుక్తి, వ్యతిరేక ధ్రువము వంటి ఆత్మ–ఇచ్ఛకు వర్తించదు. పైగా ఆత్మ నిత్యసిద్ధము. ఆత్మ సదా ఉన్నది. దానిని కొత్తగా సృజించబని లేదు.

ఆత్మ సనాతనము, నిత్య సిద్ధము

ఆత్మను సంస్కరించవలసిన పని కూడా లేదు. ఆత్మ మురికిచే ఆవృతమై యున్నది గాన, దానిని శుద్ధి చేసినచో, అది సహజమగు రంగుతో ప్రకాశించునేమో యని తలంపరాదు. ఆత్మకు ఏనాడూ రంగు పట్టదు. ఆత్మ సదా తనంత తానుగా ప్రకాశించును (నిత్య ప్రసిద్ధః). ఆత్మ సనాతనము గనుక, అది దేనిచేతనూ ఆవృతము కాదు. ఆవరణ అనే పదమును ఆత్మ విషయములో ప్రయోగించుట సంభవమైనచో, అజ్ఞానావరణము మాత్రమే సంభవము. అజ్ఞానము మురికి వలె ఘర్షణ వలన తొలగిపోయేది కాదు. జ్ఞానోదయము చేత మాత్రమే అజ్ఞానము తొలగును. ఇందువలననే, ధ్యానసాధకుడు ప్రయాస లేకుండా స్వరూపసుఖమును పొందగల్గునని శ్రీకృష్ణుడు చెప్పినాడు.

అనాత్మతో సంసర్గము వలన పుట్టే సుఖము అనిత్యము. కాని, బ్రహ్మజ్ఞానము వలన కలిగే సుఖము నిత్యము. ఆత్మకు బ్రహ్మతో సంస్పర్శము అనగా తాను బ్రహ్మమేనని యెరుంగుట. ఈ సంసర్గము ఇతర సంసర్గముల వంటిది కాదని సూచించుటకై సంస్పర్శ శబ్దము ప్రయోగింపబడినది. ఈ ప్రకరణములో సంస్పర్శ శబ్దమునకు తాత్పర్యమేమనగా, మానవునకు ఆత్మ బ్రహ్మాభిన్నమను జ్ఞానము కలుగుటతోడనే, ప్రయాస లేకుండగా నిత్య సుఖము లభించును.

ఈ విధముగా ఈ శ్లోకము ననుసరించి, జీవుడు బ్రహ్మను గుర్తించి, సుఖమును పొందును. పూర్వశ్లోకము ననుసరించి, సుఖము జీవుని పొందును. జీవుడు సుఖ స్వరూపుడు గనుకనే, శ్రీకృష్ణుడీ తీరున వర్ణించెను. ఉన్నది ఆత్మ ఒక్కటియే. కర్త లేదు, కర్మలేదు, కర్తా-కర్మ అను విభాగము లేదు. దీనిలో యథార్థమగు పొందుట కూడా లేదు. అజ్ఞానమును, భ్రాంతిని విడిచిపెట్టేస్తే, చాలును. కాబట్టి సుఖము వ్యక్తిని చేరినదని గాని, వ్యక్తి సుఖమును పొందినాడని గాని చెప్పవచ్చును. యోగి ఆనందమును పొందుట, లేదా ఆనందము యోగిని పొందుట అనునవి ఒక్కటియే.

హరిః ఓం తత్సత్

ఒకే ఒక మార్గము గలదు: అదియే జ్ఞానము

ఈ ప్రకరణములో యోగము జ్ఞాన నిరపేక్షము కాదని మనము స్పష్టముగా గ్రహించాలి. ఈ సుఖమును ఇచ్చే యోగమార్గము ఇంకొకటి లేదు. కర్మమార్గము, భక్తి మార్గము ఇత్యాదిగా మోక్షము నీయగలిగే ఇతర మార్గము లేమియూ లేవు. జ్ఞాన మార్గము ఒక్కటియే గలదు. ధ్యానయోగము కూడ జ్ఞాన మార్గమే. జ్ఞానసాధనలో భాగముగా అష్టాంగయోగము, కర్మయోగము ఇత్యాది యోగముల నన్నిటినీ అనుసరించవచ్చును. సాధకుడు విగత కల్మషుడు కావాలి గనుక, ఈ అనుశాసనములు నిశ్చితముగా ఉపకరించును. మరియు భక్తి, ప్రార్థన మొదలగు లక్షణములతో గూడిన మానసిక ప్రవృత్తి గూడ జ్ఞానమును పొందుటలో సహకరించును.

ఈ సాధనలో సాధకుడు అవశ్యకములగు సాధనముల నన్నిటినీ స్వీకరించును. కాని మార్గము ఒక్కటి మాత్రమే గలదు. రెండవ మార్గము లేదు. వస్తు స్థితి ఇట్లున్నది. మనము చేయగలిగిన దేమున్నది? ఆత్మయే బ్రహ్మ. ఈ జ్ఞానము లేకపోవుటయే సమస్య. కావున, మనకు జ్ఞానము అను ఒకే ఒక మార్గము తెరిచియున్నది. ధ్యానాభ్యాసమునకు బ్రహ్మైకత్వ సాక్షాత్కారము చరమ లక్ష్యమైయున్నది. కావున, ఇతర మార్గముల విషయములో భ్రాంతులు ఉండరాదు. గీతలో వర్ణించిన యోగమునకు ఫలము జ్ఞానము మాత్రమే. ఈ యోగము జ్ఞానముతో ఆరంభమై జ్ఞానముతో అంతమగును.

నిదిధ్యాసనమునకు పూర్వములో ఆత్మ బ్రహ్మైక్యమును బోధించే శాస్త్ర దర్శనమును గురించి శ్రవణము చేయవలెను. అటు పిమ్మట, ఈ సాక్షాత్కారమునకు గల అవరోధములను నిదిధ్యాసనము తొలగించును.

శ్రీకృష్ణుడింకనూ ఇట్లు చెప్పెను:

అధ్యాయము 6, శ్లోకము 29:

सर्व भूतस्थमात्मानं सर्वभूतानि चात्मनि ।
ईक्षते योगयुक्तात्मा सर्वत्र समदर्शनः ॥ २९ ॥

సర్వ భూతస్థమాత్మానం సర్వ భూతాని చాత్మని
ఈక్షతే యోగ యుక్తాత్మా సర్వత్ర సమదర్శనః (29)

యోగ యుక్తాత్మా = ఈ నిదిధ్యాసనముచే లీనము చేయబడిన మనస్సు కలిగినట్టియు; **సర్వత్ర** = అంతటా; **సమదర్శనః** = సమత్వమును దర్శించే యోగి; **ఆత్మానం** = ఆత్మను; **సర్వభూతస్థం** = సర్వ ప్రాణులలో నున్నదిగను; **చ** = మరియు; **సర్వ భూతాని** = సర్వప్రాణులను; **ఆత్మని** = తన యందు; **ఈక్షతే** = చూచును.

> ఈ నిదిధ్యాసనముచే లీనము చేయబడిన మనస్సు కలిగి అంతటా సమమగు బ్రహ్మను దర్శించు యోగి ఆత్మను సర్వప్రాణులలో నున్నది గను, మరియు సర్వప్రాణులను ఆత్మయందు చూచును (29).

యోగి ఆత్మను చూచును (ఆత్మానం ఈక్షతే) అని శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పుచున్నాడు. అనగా, యోగికి ఆత్మజ్ఞానము గలదు. యోగి దర్శించే ఈ ఆత్మ ఎట్టిది? ప్రతివానికి తాను ఒక జీవిత చరిత్ర, కొన్ని అనుభవములు కలిగి స్థూలదేహముతో తాదాత్మ్యమును పొంది యున్న వ్యక్తిగా పరిచితమే గదా।

ఈ దేహమునకు ఇతర దేహములతో సంబంధము గలదు. కావున, ఈ దేహము కొందరికి సోదరుడు/సోదరి; మరియొకనికి కుమారుడు/కుమార్తె. ఈ విధముగా ఆత్మయనగా ఒక స్థూలదేహమునకు సంబద్ధమై ఆ దేహములో నివసించే జీవుడు అని సాధారణ జనాభిప్రాయము.

దీనికి భిన్నంగా, సర్వప్రాణులలో నుండు ఆత్మ తానే అను గుర్తింపు (సర్వభూతస్థం ఆత్మానం పశ్యతి) గల యోగిని ఈ శ్లోకము వర్ణించుచున్నది. అంత మాత్రమే గాదు. సర్వభూతముల ఉనికి ఆత్మరూపుడగు యోగి యందు మాత్రమే గలదు (సర్వభూతాని చ ఆత్మని). ఇట్లు ఆత్మ అన్నిటియందు అనుస్యూతముగా నుండుటయే గాక, ఆత్మయందు సర్వము గలదు. ఈ సాక్షాత్కారము గల వ్యక్తి యెవ్వరు? యోగ-యుక్త-ఆత్మా. అనగా, ధ్యానము నందు సిద్ధిని గాంచి, ధ్యానము నందు లీనమైన మనస్సు గలవాడు అని యర్థము.

సర్వము నందు గల సమత్వము

ఇట్టి యోగి సర్వత్ర సమదర్శనః అని కూడ వర్ణింపబడినాడు. అనగా సర్వము నందు సమమైన ఆత్మను దర్శించువాడు అని యర్థము. అనగా, సర్వ వస్తువులలో సర్వకాలముల యందు సమముగా నుండు దానిని గుర్తించి దర్శించగల్గును అని యర్థము. సర్వవస్తువులలో ప్రత్యేక విశేషము

లేమియూ లేని ఒక తత్త్వము, మరియు వస్తువు గత విశేషము గలవు. ఈ నిర్విశేష, విశేషములు మనకు గొలుసు, గాజులు, ఉంగరము ఇత్యాది బంగరు ఆభరణములలో కనబడతాయి. వాటన్నింటిలో నిర్విశేషమగు తత్త్వము ఒకటి గలదు. అదియే బంగారము.

బంగారము అనేది కూడా విశేషణమే. అయిననూ, ఈ దృష్టాంతము ఇచటి తాత్పర్యమును వివరించుటకు ఉపకరించును. ఈ గొలుసులు, గాజులు, ఉంగరములు మొదలగు వాటన్నింటిలో ఒక సాధారణ నిర్విశేష తత్త్వము గలదు. వాటన్నింటి సత్యము అదియే. అదియే బంగారము. ఈ దృష్టాంతములోని విశేషమేది? గొలుసు, గాజు, ఉంగరము ఇత్యాది వివిధ నామములు, రూపములు అన్నియూ విశేషములే. ఈవిశేషము లన్నింటి యొక్క ఉనికి సత్యతత్త్వమగు బంగారము నందు గలదు.

ఇదే విధముగా, నామరూపము లన్నింటి మూలము, ఉనికి, సత్యములు బ్రహ్మ భిన్నమగు ఆత్మ (నేను) యందు ఉన్నవి. సర్వ విశేష రహితము, సర్వము యొక్క సత్యము (సర్వత్ర), సర్వనామ రూపములకు తన ఉనికిని అనుగ్రహించునది యగు నిర్విశేషమును ఎరింగిన వ్యక్తి 'సర్వత్ర సమదర్శనః' అనబడును. ఇట్టి వ్యక్తి ఎటు చూచినా, పరబ్రహ్మమే కన్పట్టును.

ఇచటి తాత్పర్యమును గ్రహించుటయే నిదిధ్యాసనమగును

ఇచట వాస్తవముగా చూడవలెనని అభిప్రాయము కాదు. ఇచటి అభిప్రాయమేమన, ఇట్టి యోగికి ఆత్మ విషయంలో అజ్ఞానము ఉండదు. అతడు ఆత్మను సర్వప్రాణుల యందు, సర్వప్రాణులను ఆత్మయందు దర్శించును. ఈ దర్శనమే వేదాంత దర్శనము. ఇది ఈ శ్లోకములోను, తరువాతి రెండు శ్లోకములలోను పూర్ణముగా వివరింపబడినది. దీనినే జ్ఞానము అని అంటారు. వాస్తవంలో, ఈ మూడు శ్లోకములు నిదిధ్యాసనమునకు మూలమైన తత్త్వమును వర్ణించును. ఈ శ్లోకముల తాత్పర్యమును సమాలోచన చేయుటయే ప్రధానముగా నిదిధ్యాసనమగును.

ఆత్మ (నేను) అను పదమునకు అర్థము మనకు సరిగా తెలియదు. ఈ దేహేంద్రియ మనస్సంఘాతము ఆత్మ కాదు. 'ఇది నా దేహము, నా మనస్సు, నా ఇంద్రియములు' అని మనము అంటాము. అంటే, జీవుడు ఈ దేహేంద్రియ మనస్సంఘాతము నందు నివసించువాడని స్పష్టమగుచున్నది. ఈ సంగతి తెలియుటకు ప్రత్యేక జ్ఞానముతో పనిలేదు. ఈ అనుభవము మానవు లందరికీ సమానము. మానవుడు తనను దేహేంద్రియ మనస్సంఘాతములో నివసించే జీవునిగా

స్వీకరించుట మాత్రమే గాక, దేహేంద్రియ మనస్సుల యందు 'ఇది నా దేహము, నా మనస్సు, నా ఇంద్రియములు' అను మమత్వ బుద్ధిని కూడ కలిగియుండును.

అటులనే, 'నేను లావుగా ఉన్నాను' అని పలికిన వ్యక్తి విషయంలో దేహమే 'నేను' అయినది. 'నేను క్షుబ్దుడను' అన్నప్పుడు మనస్సు 'నేను' అవుతుంది. నేను అలిసియున్నాను అన్నప్పుడు ప్రాణము 'నేను' అగును. కావున, ఈ ద్వివిధ ధారణలు మనకు కన్పట్టును. ఒకదానిలో స్థూలదేహమే ఆత్మయగును. రెండవదానిలో ఆత్మ దేహమునందు నివసించును. ఈ రెండు ఇచట నిషేధింపబడుచున్నవి. ఇచట మనము చర్చించే ఆత్మ ఒక్క ప్రాణిలో, ఒక్క దేహములో గాక, సర్వప్రాణులలో నివసించును.

ఆత్మ దృశ్యము కానే కాదు; దానిని గుర్తించుట యెట్లు?

ఈ సర్వభూతస్థ ఆత్మను మననము చేయుట యెట్లు? వేర్వేరు పూసల గుండా ప్రసరిస్తూ వాటిని కలిపి ఉంచే దారమును వలె, ఆత్మను వివిధ ప్రాణులలో దర్శించగలమా? అట్లు కుదరదు. ఏలయన, ఆత్మ ఏనాడూ దృశ్యము కాదు. పూసలు, దారము ఈ రెండు కనబడుతూ ఉంటాయి. కావున, పూసలు భూతములైతే, దారము సర్వభూతస్థము అగును. దారము ఏదో ఒక పూసకు సంబంధించి ఉండదు. అది పూసలన్నింటిలో అనుస్యూతమగును. కాని, పూసలు, దారము అనే రెండూ దృశ్యవస్తువులు, అనాత్మలు.

సర్వభూతస్థ ఆత్మను నిరూపించుటకై ఈ దృష్టాంతమీయబడినది. దృష్టాంతము ఏదో లోపములో కూడియుండును. ప్రస్తుత దృష్టాంతములోని లోపమేదనగా, పూసలు, దారము అను రెండూ అనాత్మలే. దారము మనకు కనబడుతుంది. కాన, అది అనాత్మ. పూసలు కూడా అంతే. పూసలను బాగా దగ్గరగా గుచ్చినట్లైతే, సూత్రము కనబడదు. కాని, దాని ఉనికిని మనము ఊహించగల్గుదుము. అనగా, సూత్రము మనచే అనుమితి (inference) చేయబడిన వస్తువు. వస్తువును ప్రత్యక్షముగా చూచుట, లేక ఊహించుట అనే రెండు పక్షములలో ఆ వస్తువు తెలియబడుచున్నది గనుక, అది అనాత్మయే.

కాని, ప్రస్తుతంలో, ఆత్మను సర్వప్రాణులలో దర్శించే (ఈక్షతే) జ్ఞాని, దానిని గుర్తించు విధమెట్టిది? మనము వివిధ ప్రాణులను గుర్తిస్తూ ఉంటాము. కాని, ప్రాణులన్నిటిలో ఆత్మ గుర్తింపబడే పక్షంలో, ఆత్మ ఈ తెలివిడిలో విషయమగును. ఆత్మ ఏనాడూ ఒక వస్తువుగా దర్శింపబడదు గదా! అట్లైనో, సర్వభూతస్థ మాత్మానం ఈక్షతే అను వాక్యము ఎట్లు పొసగును?

ఆత్మ ఒక్కటియే. అదియే నేను. మరియొక ఆత్మ లేదు. మిగిలినది సర్వము అనాత్మయే. ఉత్తమ పురుష ఏక వచనము 'నేను' ఆత్మ అని మనము నిర్వచించినచో, ఈ ఆత్మచే దర్శింపబడే సర్వము అనాత్మయే యగును. అంతవరకు బాగానే ఉంది. కాని, ఈ అనాత్మ లన్నింటిలో ఆత్మను గుర్తించుట యెట్లు సంభవమగును?

ఈ సమస్య తలయెత్తుటకు కారణము గలదు. నేను 'నేను'గా గుర్తించే ఈ ఆత్మ నా స్థూలదేహములో మాత్రమే లేదు. అది ఏదో ఒక స్థూలదేహములో మాత్రమే లేదు. దానిని ఒక దేహముతో సంబద్ధముగా మనము భావిస్తే, అది అహంకారము (నేను అనే ధారణ) అగును. అనగా అది జీవుడు, లేక వ్యక్తి అగును. ఇపుడు మనము మరియొక అడుగు ముందుకు వేసి, ఈ జీవుడు శుద్ధచైతన్యము మాత్రమే అని గుర్తించవలెను. అపుడు ఈ ప్రపంచములోని సర్వప్రాణులు, సర్వమనస్సులు ఇత్యాది సర్వము యొక్క ఉనికి ఆ చైతన్యము నందు గలదు. దానికి ఒక స్థిరమగు ప్రదేశము లేదు.

చైతన్య ఘనమగు ఆత్మ ఒక ప్రదేశమునకు సీమితము కాదు

చైతన్యము ఒక స్థానమునకు సీమితమైనచో, అది ప్రాణులలో మాత్రమే ఉండి యుండెడిది. అంటే, చైతన్యము ఇక్కడ ఒక ప్రాణిలో, అక్కడ మరియొక ప్రాణిలో ఉండెడిది. అట్టి స్థితిలో, సర్వప్రాణులకు తెలివిడిని ఇచ్చే ఈ చైతన్యమును మనము గుర్తించుట యెట్లు? రెండుపూసల మధ్య త్రాడు మనకు కనపడుతుంది. లేదా, దాని ఉనికిని ఊహిస్తాము. త్రాడునకు దేశము నందు గల ఉనికిని మనము తెలుసుకొనే విధమిదియే గదా! కాని, చైతన్యము ఒక స్థానమునకు సీమితమైనచో, దానిని మనము తెలియుట యెట్లు? ఈ చైతన్య ఘనమగు ఆత్మ ఒక స్థానమునకు సీమితము గాదు అని తెలియుట తక్క, ఈ చైతన్యమును తెలియు మార్గము మరియొకటి లేదు.

స్థానము అనునది దేశము నందు మాత్రమే సంభవమగును. దేశము అనే పరిధిలో నుండే వివిధ రూపములను మనము గ్రహించి, స్థానము అనుధారణను ఏర్పరుచుకుంటాము. 'క' అనెడి స్థానములో మనము వస్తువు నొకదానిని చూచితి మనుకొనుడు. 'గ' అను మరియొక స్థానములో ఇంకొక వస్తువును చూచితిమి. వీటి మధ్య దేశము గలదు. కావుననే, ఈ వస్తువు ఇచట, ఆ వస్తువు అచట గలవు అని మనము అంటాము. రెండు వస్తువుల స్థానములు సమానము కాదు గనుకనే, 'ఆ వస్తువులు ఎక్కడ నున్నవి? ఈ వ్యక్తి ఎచ్చట నుండి వచ్చుచున్నాడు?' ఇత్యాది ప్రశ్నలను మనము వేస్తాము.

స్థూలదేహమునకు ఒకస్థానము ఉన్నదనుటలో సందేహములేదు. పైగా దానికి స్థాన నిర్దేశము అవసరము కూడా. వివిధ ధారణలకు కూడా వాటి వాటి స్థానములు గలవు. మనము వీటన్నింటి స్థానములను విశ్లేషించినచో, అవి అన్నీ కాలము-దేశము అను ధారణల పరిధిలో ఉన్నట్లు స్పష్టమవుతుంది. వస్తువులు కాల-దేశముల చట్రము (frame work)నకు లోబడిన ఉనికిని కలిగియున్నవి. ఈ సమస్త ధారణలు, దేశ కాలభావనలు, మరియు వాటికి లోబడియున్న వస్తువులు ఎక్కడ ఉన్నవి? వీటన్నింటికి అధిష్ఠానమైన ఆత్మచైతన్యము సర్వ భూతస్థ ఆత్మా (సర్వప్రాణుల ఆత్మ, లేక సత్యము) అనబడును.

దేశకాలముల ఉనికి కూడ ఆత్మయందే గలదు

ఎందువలన? ఏలయనగా, ఆత్మ ఒక విశిష్ట దేశమునకు సీమితము కాదు. ఈ సంగతి తెలిస్తే ఆత్మ స్వరూపమైన నిర్విశేష చైతన్యము గురించి తెలిసినట్లే. నిర్విశేష చైతన్యము దేశకాలములకు పరిమితమై లేదు. ఏలయన, దేశకాలములు ఆత్మతో సమాంతరమగు ఉనికి గలిగిన స్వతంత్ర తత్త్వములు (absolutes) కావు. దేశకాలముల ఉనికి సత్తారూపమగు చైతన్యము నందు గలదు. చైతన్యమే (చిత్) ఉనికి (సత్). సత్‌యే చిత్. చిత్‌యే సత్. ఈ సచ్చిదాత్మ యందే సర్వప్రాణుల ఉనికి నిహితమై యున్నది.

ప్రాణులలో చైతన్యము ఉండే ప్రత్యేక స్థానమేదియూ లేదు. ఏలయన, మనస్సు ఉన్నచోట చైతన్యము ప్రకటమగును. మనస్సు లేని చోట చైతన్యము ప్రకటము కాదు. ఇంతకంటె దానిలో నిగూఢమైన విషయమేమీ లేదు. కావున, ప్రకటమైన చైతన్యమును మనము చేతన ప్రాణి రూపములో దర్శిస్తాము. వ్యక్తిలో ఒక మనోవృత్తి ప్రకటమగును. వ్యక్తి ఒక ప్రతి క్రియను చూపును. దీనిని బట్టి అతడు చేతనుడని మనము నిర్ణయిస్తాము. యథార్థంగా చూడదగిన పద్ధతి ఇది కాదు. మన ఇట్టి అనుమితి (influence)లోని విషయము అనాత్మయే. అనుమితి గోచరమయ్యేది ఏదైనా అనాత్మయే.

చైతన్యమునకు ప్రత్యేక స్థానమేదీ ఉండదు. సర్వము చైతన్యము నందు ఉండును. ఈ విషయము సరిగ్గా తెలిస్తే, అపుడు, ప్రాణి దేశములో ఎక్కడ ఉన్ననూ, దాని ఉనికి ఆత్మ యందు మాత్రమే గలదని స్పష్టమగును. సర్వప్రాణులకు ఆత్మయే అధిష్ఠానము. కావున, మనము ఊహించగలిగే ప్రాణులన్నిటి యందు ఆత్మ అనుస్యూతముగా నుండి, ఆ ప్రాణులను అనుప్రాణితము చేసి, భరించి,

వృష్టము చేయును. ఈ విధముగా సర్వభూతములకు ఆత్మయే అధిష్ఠానము, ఆధారము అయి ఉన్నది. ఆత్మ అనంతము గనుక దేశకాలములు ఆత్మను పరిచ్ఛేదము చేయజాలవు. సర్వప్రాణుల ఉనికి ఈ అనంత చైతన్యము నందు మాత్రమే గలదు. ప్రాణులన్నింటి యొక్క అధిష్ఠానము, ఆశ్రయము ఆత్మయందు, అనగా నా యందు గలదు. అహం అనునది ఏదో ఒక ప్రాణి యొక్క ఆత్మ మాత్రమే కాదు. సర్వప్రాణుల యందుండు ఆత్మ అదియే.

జ్ఞానముచే సర్వప్రాణులు ఆత్మయందు లీనమగును

ఈ శ్లోకములోని 'సర్వభూతాని చ ఆత్మని ఈక్షతే' అనే రెండవ వాక్యము కూడ ప్రముఖమైనది. ధ్యానయోగి సర్వప్రాణులను ఆత్మయందు చూచునని దాని యర్థము. ఎట్లు? లీనమగుట అనగా నిదియే. దీనిని తెలియుటకై మనము వివిధ రకముల లయ ప్రలయములను పరిశీలించెదము.

మనము ప్రతిదినము నిద్రించగనే జరిగే లయమునకు నిత్యలయమని పేరు. వ్యక్తి జగత్తునందు ఆరోపించే మానసిక కల్పనలు (projections), అనుభవములు, జగత్తు, దానిలోని ప్రాణులు ఇత్యాది సర్వము నిద్రలో ఆత్మయందు లీనమగును. దీనికి నిత్యలయమని పేరు.

రెండవది మహాప్రలయము. దీని యందు జగత్తు లయమగును. మనము సృష్టి స్థితి ప్రలయములు అంటూ ఉంటాము. ఈ ప్రలయము కూడ గాఢనిద్ర వంటిదే. కాని, ఇది ఒక వ్యక్తికి మాత్రమే గాక, బ్రహ్మాండమున కంతకూ సంబంధించినది. ఈ రెండు రకముల లయములో వాస్తవంగా ఏదీ నశించదు. ఏలయన, సర్వము అవ్యక్త రూపములో నుండును. కొంత కాలమునకు అది వ్యక్తమై, తత్పూర్వము ఎట్లుండెనో, అటులనే యుండును. మనము నిద్రనుండి లేచినపుడు, తత్పూర్వము ఎట్లు ఉంటిమో, అటులనే ఉంటాము. ఇతరము సర్వము కూడ మనకు సమానరూపములో ప్రత్యక్షమగును. ఇదే విధముగా, మహాప్రలయానంతరము కూడ సృష్టి సరిగా తత్పూర్వము నందున్న విధముగనే బయలుదేరును. కావున, మహాప్రలయము గాఢనిద్ర యొక్క విస్తృతి (extension) మాత్రమే యని భావించవచ్చును. ఈ వ్యక్త, అవ్యక్త స్థితులు చక్రాకారముగా తిరుగుచుండును గాన, ఏదియూ నశించినదని చెప్ప వీలులేదు.

వ్యక్త స్థితి నుండి అవ్యక్త స్థితిని పొందుట ప్రలయ మనబడును. అవ్యక్త స్థితి నుండి వ్యక్తస్థితిని పొందుట సృష్టి యనబడును. వ్యక్తరూపము సంతతము పరివర్తన చెందుటకు స్థితియని పేరు.

స్థితిలో ఒకే వ్యక్తరూపము కొనసాగుచున్నట్లు కాన్పట్టును. కాని, దానిలో కొన్ని మార్పులు వచ్చుచుండును. స్థితి యనగా మార్పులేమియూ లేని అచలావస్థ కాదు. స్థితి కాలాధీనమై యుండును. కావున, స్థితియందు సంతత పరివర్తనము ఉండును. సర్వము సర్వదా పరివర్తన శీలమై యున్నది. కాని, వస్తువులు అభిజ్ఞ (recognition) లో విషయము లగుచుండును.

సంతత పరివర్తన శీలములే అయినా, పర్వతములు, సూర్యుడు, చంద్రుడు అన్ని కాలములలో ఏకరూపముగా కన్పట్టును. మనము పాతమిత్రులను పదిసంవత్సరముల తరువాత కలిసినప్పుడు, మనలో, వారిలో ఎన్నో మార్పులు వచ్చియున్ననూ, వారిని గుర్తించగల్గుతాము. వస్తువులు ప్రతిక్షణము నందు గుర్తుపట్టలేనంత తీవ్రముగా మారిపోయే పక్షంలో, అవిచ్ఛిన్న ప్రలయము కొనసాగెడిది. స్థితి అనేది ఉండెడిది కాదు. అవిచ్ఛిన్న సృష్టి, అవిచ్ఛిన్న ప్రలయము అను మాటలకు అర్థము లేదు. కావున, మార్పులు జరుగుతూ ఉన్నా, మనము గుర్తించగలిగే స్థితి గలదు.

సూర్యునిలో సర్వకాలముల యందు అంతఃస్ఫోటనము (implosion) జరుగుచున్నది. మనమీ క్షణములో చూచే సూర్యుడు, ఒక నిముషము ముందు ఉన్న సూర్యుడు సమానము కాదు. అదే విధముగా, ఇతర వస్తువులు కూడా సమానముగా కొనసాగవు. సర్వము సర్వదా మారుతూనే ఉంటుంది. సృష్టి గలదు. దానిలో నిరంతర పరివర్తన (స్థితి) గలదు. ప్రలయము గలదు. ఈ సృష్టిస్థితి ప్రలయచక్రము చైతన్య ఘనమగు ఆత్మయొక్క అభివ్యక్తి, అనభివ్యక్తి తక్క వేరు గావు.

మోక్షము కూడ లయమే

అత్యంత ప్రలయము అనే మూడవరకము ప్రలయము కలదు. దీనినే మనము మోక్షము అంటాము. అత్యంత ప్రలయము, లేదా మోక్షములో అంతర్ధానమయ్యేది ఏదీ ఉండదు. జ్ఞాని, అజ్ఞాని ఇద్దరూ ఒకే వస్తువును చూస్తారు. కాని, జ్ఞాని ఆ వస్తువు యొక్క సత్య అధిష్ఠాన (సత్య వస్తువు) కారణమును దర్శిస్తాడు. అంటే, ఆ వస్తువు తన కారణములో లీనమగును. ఉదాహరణకు, మనము వేయి కుండలను చూస్తున్నామనుకొనుడు. ప్రతి కుండ యొక్క సత్యము మట్టియే అని దర్శిస్తే, ఆ కుండలు అన్నీ మట్టిలో లీనమవుతాయి. ఇది గాక, మరియొక ప్రలయము గలదు. దాని పేరు మహా- అత్యంత- ప్రలయము.

సమస్తనామములు, రూపములు, వాటి వాటి ప్రత్యేక లక్షణములతో సహా అవ్యక్త స్థితిని పొందుట లయము, లేక ప్రలయము అనబడును. అంటే, అది నిత్య లయము గాని, మహా ప్రలయము

గాని కావచ్చును. దీనికి భిన్నంగా, మోక్షములో వస్తువుల యందు ఏ విధమైన మార్పులు ఉండవు. వస్తువులు యథాతథంగా ఉంటాయి. కాని, అదే సమయంలో జ్ఞాని వస్తువుల యందు వాటి మూలకారణమైన బ్రహ్మ-ఆత్మను దర్శించును. అవి బ్రహ్మ కంటె వేరుగాదు అనే సాక్షాత్కారమును ఈ శ్లోకము 'సర్వభూతాని ఆత్మని ఈక్షతే' అను వాక్యములో నిరూపించును.

వేదాంత దర్శనరీత్యా సర్వ పదార్థముల విషయంలో కారణము సత్యము. కార్యము మిథ్య. ఈ విశ్లేషణకు ఇందువలననే కారణ కార్య విద్య యని పేరు. వాస్తవంలో కారణ కార్యములు యథార్థంగా లేవు. ఏలయన, కార్యము మిథ్య గనుక, కారణము యొక్క కారణత్వమునకు కూడ అదే స్థితి కలుగును. కావున, ఈ బ్రహ్మాండములోని సర్వము సత్య బ్రహ్మము మాత్రమే. ఈ సత్యము నెరింగిన వ్యక్తి అదే ప్రపంచమును మరియొక బుద్ధితో దర్శించును. అతడు దాని యందు కారణమగు ఆత్మను దర్శించును. కావున, స్థూల సూక్ష్మ శరీరముల దృష్ట్యా మాత్రమే సృష్టి అనేది గలదు. ఇవి మాత్రమే సృష్టింపబడును. తద్భిన్నంగా, అనంత ఆత్మకు పుట్టుక లేదు. సర్వజగత్తు యొక్క సత్యము అనంత ఆత్మయే. సృష్టి ఏది గలదో, దానికి అధిష్ఠానము ఆత్మయే. ఈ శ్లోకములో సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చ ఆత్మని ఈక్షతే అను వాక్యములలో ఉపదేశింపబడిన దర్శనమునకు మూలము ఆత్మయే.

ఇచట ఒక సమస్య ఉదయించును. అధిష్ఠానము ఉన్న స్థలములలో ఆశ్రయమునకు, ఆశ్రితమునకు మధ్య భ్రాంతి కలిగే అవకాశము ఉన్నది. ఉదాహరణకు, త్రాడుపై పాము గలదు, బంగారముపై హారము గలదు అని నేను అంటాను. త్రాడుపై యథార్థమగు పాము గలదని, బంగారముపై యథార్థముగా హారము కూర్చున్నదని మీరు భావించే అవకాశము గలదు. అనగా, త్రాడు, పాము, లేక బంగారము, హారము అనునవి రెండు విభిన్న వస్తువు లనిపించును. కాని, వాస్తవంలో అవి అట్లు కాదు. ఇది ఒక వాక్యమత్కృతి మాత్రమే. ఉన్నది ఒకే వస్తువు అయినా, రెండు వస్తువులున్నట్లు వాక్యము ప్రయోగింపబడును. మనము త్రాటిపై పామును గురించి, లేదా బంగారముపై హారమును గురించి మాట్లాడే సందర్భంలో, ఒక వస్తువు అధిష్ఠానము కాగా, రెండవది ఆశ్రితమగును.

ఆత్మకు, జగత్తునకు మధ్యలో ఆధారాధేయ సంబంధము లేదు

సాధారణంగా ఆధారాధేయ సంబంధములో రెండు విభిన్న వస్తువులు ఉండుటను మనము చూస్తాము. ప్రస్తుతంలో కూడా జగత్తు, సర్వప్రాణులు ఆత్మను ఆశ్రయించి ఉంటాయి. అందువలననే, సర్వభూతస్థ ఆత్మ (సర్వప్రాణులకు అధిష్ఠానమైన ఆత్మ) అని చెప్పబడినది. కాని, ఇది ఆధారాధేయ

సంబంధము కాదు. అట్టి భేదము ఇచట లేదు. ఏలయన, భూతములన్నియు ఆత్మ కంటె వేరుగాదు. అందువలననే, సర్వభూతాని ఆత్మని ఈక్షతే అని కూడా శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పినాడు. సర్వత్ర సమదర్శియగు వ్యక్తి, కుండలను మట్టి కంటె, హారములను బంగారము కంటె అభిన్నముగ గుర్తించిన తీరుననే, సర్వప్రాణులను పరమాత్మ కంటె అభిన్నముగ గుర్తింపగల్గును.

సర్వ ప్రాణులను, దేశకాలములను, సర్వమును ఆత్మయందు దర్శించుట అత్యంత ప్రలయమనబడును. దీనియందు కారణ కార్యముల మధ్య గల భేదము లయమగును. జగత్తు యొక్క సంహారము అత్యంత ప్రలయము కాదు. జగత్తునకు, దాని కారణమునకు మధ్యలో కేవలము అజ్ఞానముచే కలిగిన భేదమును లయము చేయుట అత్యంత ప్రలయమనబడును. ఈ జగత్తులోని సర్వము బ్రహ్మాభిన్నమగు ఆత్మ కంటె వేరుగాదు అను సాక్షాత్కారములో సర్వద్వైత భేదములు లయమగును.

అధ్యాయము 6, శ్లోకము 30:

यो मां पश्यति सर्वत्र सर्वं च मयि पश्यति ।
तस्याहं न प्रणश्यामि स च मे न प्रणश्यति ॥ ३० ॥

యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి (30)

యః = ఎవడైతే; సర్వత్ర = అంతటా (అన్ని ప్రాణులలో); మాం = నన్ను; పశ్యతి = చూచునో; చ = మరియు; సర్వం = సర్వమును (అన్ని ప్రాణులను); మయి = నా యందు; పశ్యతి = చూచునో; అహం = నేను; తస్య = వానికి; న ప్రణశ్యామి = దూరము కాను; చ = మరియు; సః = అతడు; మే = నాకు; న ప్రణశ్యతి = దూరము కాడు.

ఎవడైతే అంతటా (అన్ని ప్రాణులలో) నన్ను చూచునో, సర్వమును (అన్ని ప్రాణులను) నా యందు చూచునో, వానికి నేను దూరము కాను. అతడు నాకు దూరము కాడు (30).

పూర్వ శ్లోకములో చూపబడిన ఆత్మ సాక్షాత్కారము ఈ శ్లోకములోని ప్రథమార్థములో ఇంకో పదములలో మరల చెప్పబడుచున్నది. 'సర్వభూతస్థ మాత్మానమ్' అను పూర్వశ్లోక భాగము

ఈ శ్లోకములో ఉత్తమ పురుషలోనికి మార్చబడినది. ఈ శ్లోకములో 'సర్వ ప్రాణుల యందు నన్ను గుర్తించువాడు (యః మాం పశ్యతి సర్వత్ర)' అని గలదు.

మాం (నన్ను) అనగా అర్జునుని రథములో సారథి స్థానములో కూర్చున్న శ్రీకృష్ణుడు అనే వ్యక్తి కాదు. రథములో కూర్చుని యున్న శ్రీకృష్ణుడు అనే వ్యక్తి ఒక దేశమునకు సీమితమై యున్నాడు. కాని అర్జునునకు ఉపదేశించునప్పుడు, తాను సర్వత్రా ఉన్నానని (సర్వ భూతస్థ ఆత్మా) ఆయన చెప్పినాడు. ప్రాణులు అన్నీ ఎక్కడ ఉన్నా, నా యందు మాత్రమే ఉన్నవి. ఈ 'నేను' ఆత్మ.

శ్రీకృష్ణుడీ విధముగా 'సర్వభూతస్థ మాత్మానమ్' అను పదముల స్థానములో 'మాం' (అనగా ఈశ్వరుడు) అను పదమును ప్రయోగించి, జీవేశ్వరుల అభేదమును సూచనగా నిరూపించెను. నన్ను (ఈశ్వరుని) సర్వప్రాణులలో, అనగా సర్వప్రాణుల అధిష్ఠానముగా దర్శించే వ్యక్తి తాను (ఆత్మ) పరమాత్మ కంటె భిన్నము కాదని యెరుంగును.

సర్వము నా యందు మాత్రమే గలదు (సర్వం చ మయి ఏవ) అని కూడ శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పినాడు. సర్వమునకు కారణము నేనే. సర్వమునకు అధిష్ఠానము నేనే. ఈ విధముగా, జ్ఞాని తనను సర్వ ప్రాణుల యందు, సర్వప్రాణులను తన (ఆత్మ) యందు దర్శించును. ఈ శ్లోకమునకు, పూర్వశ్లోకమునకు ఒకే ఒక తేడా గలదు. పూర్వ శ్లోకములోని ఆత్మ స్థానములో, ఈ శ్లోకములో ఉత్తమ పురుష(మామ్) ప్రయోగింపబడినది. ఈ శ్లోకములోని 'నేను' పూర్వశ్లోకములోని ఆత్మ ఒక్కటియే. సర్వమునందు ఆత్మను, మరియు సర్వమును ఆత్మ యందు దర్శించువాడు ఈశ్వరుడనగు నన్ను యెరుంగును. ఈశ్వరుడనగు నన్ను సర్వమునందు, సర్వమును నా యందు దర్శించును. సర్వ ప్రాణులకు ఆధారము నేనే. సర్వ ప్రాణుల ఉనికి నా యందు మాత్రమే గలదు.

ఈశ్వర తత్త్వము భిన్నమా?

ఈశ్వరుడగు శ్రీకృష్ణునకు, జీవునకు మధ్యలో భేదమేమియూ లేదు. మరియొక ఈశ్వరుడు గలడా యేమి? ఈశ్వరుడే సర్వము గదా! ఆయన చైతన్యరూపమగు ఆత్మ కంటె భిన్నముగ ఎట్లు ఉండును? చైతన్య ఆత్మయే అనంత బ్రహ్మమైనచో, ఈశ్వరుడనే మరియొకడు ఎక్కడనో వేరుగా నిలబడి యుండుట సంభవమే గాదు. అదే సత్యమైనచో, ఈశ్వరుడు మరియొక ప్రాణిమాత్రుడగును! అట్టి స్థితిలో, జీవేశ్వరుల మధ్య భేదము ఉండును. అది ఎన్నటికీ లయము కాదు.

జీవేశ్వరుల విషయములో అనేక వాదములు గలవు. వాటిలోని సత్యాసత్యములను నిర్ణయించుటకై వాటిని విశ్లేషించాలి. భగవానుడు సర్వవ్యాపి. జీవుడు భగవానుని యొక్క ఒక అంశము అని కొందరు అంటారు. అంటే, ఈ అంశములన్నీ కలిసి భగవానుడు అగునా? అట్లు గానిచో, ఈ వాదమునకు అర్థమేమి? ఈ అంశము ఎట్టిది అని ప్రశ్నించవలసి యున్నది. ఈ అంశము జీవుని స్థూలదేహమా? మనస్సా? లేక ఆత్మచైతన్యము అంశమా? ఈ స్థితిలో ఏది దేనిపై ఆధారపడి యున్నది? ఏది దేని యొక్క సత్యము?

ఈ స్థూలదేహము, మనస్సు మొదలగు వాటి సత్యతత్త్వము ఏది? వాటి నన్నిటినీ విశ్లేషిస్తే, మనకు ఒకే ఒక ఉనికి, సత్యము గోచరించును. ఈ సత్యము యొక్క స్వరూపము చైతన్య–ఆత్మ కంటె వేరు కాని పరం బ్రహ్మ తక్క మరియొకటి కాదు. కావున, జీవుడు, ఈశ్వరుడు అనుభేదములు ఒకానొక దృష్టికోణములో మాత్రమే కుదురును. ఉన్నది పరమేశ్వరుడొక్కడే. ఉపాధి (శరీరము) అనే దృష్టికోణములో మాత్రమే జీవుడు, ఈశ్వరుడు గలరు; జీవేశ్వర భేదము గలదు. సత్య వస్తువు అగు పరమాత్మను సాక్షాత్కరించుకున్నప్పుడు జీవేశ్వర భేదము లయమగును.

ఈశ్వరుడు 'నేను ఈశ్వరుడను (అహం ఈశ్వరః)' అన్నప్పుడు, జీవుడు 'నేను జీవుడను (అహం జీవః)' అన్నప్పుడు, రెండింటిలో 'అహం' సమానము. భేదము మిథ్య. సత్యవస్తువుపై పూర్తిగా ఆధారపడి మాత్రమే మనగలిగేది మిథ్య యగును. భేదము సమస్యలను కలిగించును. ఏలయన, సత్యముపై ఆధారపడి యుండే మిథ్యారూపమగు భేదమునకు స్వతంత్ర ఉనికి లేదు. ఈ జగత్తు అంతా సత్య వస్తువుపై ఆధారపడి ఉనికిని పొందే మిథ్య. ప్రతి మానవుడు నేను (అహం) అని నిర్దేశించే తత్త్వము సత్య వస్తువు. కావున, దోమతో సహా 'నేను' అను ధారణ గల సర్వప్రాణులు పరబ్రహ్మ కంటె వేరుగాదు. జీవుని యందు 'నేను', పరబ్రహ్మ అను రెండు తత్త్వములు లేవు. జీవుడు పరబ్రహ్మ మాత్రమే.

ఈ సత్యము నెరుంగని వాడు కూడా పరబ్రహ్మయే. తత్త్వమసి యనగా నీవీ క్షణములో పరబ్రహ్మవై యున్నావు. జీవుడు భవిష్యత్తులో పరబ్రహ్మ యగుననుట సరిగాదు. 'నీవు పరబ్రహ్మవు కాగలవు' అని శ్రుతి చెప్పుట లేదు. 'అది నీవు అయి ఉన్నావు (తత్ త్వం అసి)' అని మాత్రమే శ్రుతి చెప్పుచున్నది. ఆత్మ సర్వదా బ్రహ్మము అయి ఉన్నప్పుడు మాత్రమే ఈ వాక్యము పొసగును. ఈ దర్శనము పూర్వశ్లోకములో చెప్పబడినది. ఈ శ్లోకములోని ప్రథమార్థములో, 'సర్వప్రాణుల యందు నన్ను, సర్వ ప్రాణులను నా యందు దర్శించువాడు (యః మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి)' అను వాక్యము అదే దర్శనమును పునరుద్ఘాటించును.

ఆత్మైకత్వ దర్శనము గలవాడే జ్ఞాని. సర్వప్రాణులలో ఆత్మను, సర్వప్రాణులను ఆత్మ యందు చూచుటయే వేదాంత దర్శనము.

ఈ సాక్షాత్కారమునకు ఫలము

ఈ సాక్షాత్కారమునకు ఫలమేమి? ఈ శ్లోకములో శ్రీకృష్ణుడు ప్రయోగించిన ప్రథమ పురుష ఏకవచనము (అహం అనగా నేను) నకు ఈశ్వరుడని యర్థము. ఈ సాక్షాత్కారము గల వ్యక్తికి నేను దూరము కాను (తస్య అహం న ప్రణశ్యామి). అనగా, నేను అతనికి పరోక్షముగా మాత్రమే తెలిసిన వాడుగా ఉండబోనని యర్థము. ఎందువలన? ఈశ్వరుడే ఆత్మ యగుట వలన పరోక్షముగా ఎక్కడనో సుదూరములో నుండి పూజింపబడే వాడను మాత్రమే కానని యర్థము. ఈశ్వరుడే ఆత్మ గనుక, అట్టి వ్యక్తికి దూరము కాడు.

ఇంత మాత్రమే గాదు. అట్టి జ్ఞానియూ నాకు దూరముగా పోడు (స చ మే న ప్రణశ్యతి). అతనికి నేను దూరము కాను. అతడు నాకు దూరము కాడు. ఇది సార్వకాలిక సత్యమే అయినా, పూర్వము అతనికి ఆ సత్యము ఎరుక లేకుండెను. ఇప్పుడాతనికి తెలిసెను. భగవానుడు హస్తక్షేపము చేయుట వలన హఠాత్తుగా ఉత్పన్నమైన పరిస్థితి కాదిది. జ్ఞానోదయమునకు పూర్వము, జ్ఞానోదయము కలిగిన తరువాత ఈ పరిస్థితి సమానమే. పూర్వము ఇతనికి ఆ సత్యము తెలియలేదు. ఇప్పుడు తెలిసినది. తేడా ఇంత మాత్రమే. ఇపుడాతడు తనను (ఆత్మను) సర్వప్రాణుల యందు, సర్వప్రాణులను తన యందు దర్శించును. ఇట్టి సాక్షాత్కారము గల వ్యక్తి ఎన్నటికీ నాకు దూరము కాడు. అనగా, నాకు అతనికి మధ్యలో దూరము లేదు. అతడు నాకు దూరము కాకుండుట మాత్రమే కాదు. నేను అతనికి దూరము కాను.

దీని యర్థమేమనగా, పూర్వములో కొంత దూరము ఉండెడిది. సాధకుడు పరమాత్మను అన్వేషించును గదా! మనము ఈశ్వరుని కృప కొరకై ప్రార్థిస్తాము గదా! ఇపుడు సాధకుని ప్రార్థనలు, పూజలు ఫలించినవి. జీవేశ్వరులకు భేదము లేదనే సాక్షాత్కారమే ఈ ఫలము. సర్వభేదములు ఉపమర్దితమైనవి. ఇచట 'తస్యాహం న ప్రణశ్యామి' అనగా నిదియే. నేను అతనికి దూరముగా లేను. అతడు నాకు దూరము కాడు.

ముస్లిం యువతి బురఖా వెనుక నుండి మనలను చూడగల్గును. కాని, మనము ఆమెను చూడజాలము. భగవంతుని విషయంలో కూడా, పరిస్థితి అటులనే ఉండునని మనకు బోధిస్తారు.

భగవానుడు సర్వకాలములలో మన వ్యక్తిగత విషయములలోనికి తొంగిచూస్తూ ఉంటాడు. కాని, మనము ఆయనను చూడజాలము. కాని ఈ శ్లోకములో శ్రీకృష్ణుడు, భగవానుని కప్పే పరదా లేదనియు, ఆయనను చూడకుండా అడ్డుపడేది ఏదీ లేదనియు చెప్పుచున్నాడు. అజ్ఞానము అనే ఒకే ఒక పరదా గలదు. ఆ పరదా జ్ఞాని విషయంలో తొలగిపోయినది. కావున, అవరోధమేమియూ లేదు. సర్వము పరమాత్మ అనే ఏకైక దర్శనము గలదు. సర్వము ఈ ఆత్మ యందు మాత్రమే లీనమగును.

సర్వము నేనే

మరో సందర్భంలో శ్రీ శంకరులు ఇల్లా అన్నారు: కోట్లాది పదములు గల గ్రంథములచే చెప్పబడిన విషయమును నేను అర్థ శ్లోకములో చెప్తాను (ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథకోటిభిః). ఈ మాటను చెప్పుసరికి శ్లోకములోని ఒక సగము పూర్తి అయినది. బ్రహ్మసత్యము, జగత్తు మిథ్య (బ్రహ్మ సత్యం జగన్మిథ్యా) అని వారు శ్లోకమును పూర్తిచేసిరి. అంటే, దేహము, మనస్సు, మరియు ఇంద్రియములు కూడా మిథ్యయే. స్థూలదేహము, మనస్సు, ఇంద్రియముల కంటె భిన్నముగా నుండు ఆత్మరూపుడగు జీవుడు బ్రహ్మము కంటె వేరుగాదు (జీవో బ్రహ్మైవ నాపరః). అనగా, సర్వము నేనే (ఇదం సర్వం అహమస్మి) అని యర్థము.

ఈ దర్శనములో జీవేశ్వర భేదము లయమగును. కావుననే, జ్ఞానికి ఈశ్వరుడు దూరము కాడు. జ్ఞాని ఈశ్వరునకు దూరము కాడు. అజ్ఞాన కల్పితమగు భేదము మటుమాయమైనది. అజ్ఞానము తొలగగానే, అద్వితీయ చైతన్య జ్యోతి ప్రకాశించును. సర్వము దాని యందు ఉనికిని కలిగియుండును. విచారము చేయబడినది, చేయబడనిది, జ్ఞాతము, అజ్ఞాతము సర్వము ఆత్మయందు మాత్రమే ఉండును. ఈశ్వరుని ఆత్మ, జీవుని ఆత్మ ఒక్కటియే. ఆత్మ యొక్క స్వరూపము చైతన్యము. ఈ చైతన్యఘనమగు ఆత్మ మాత్రమే స్వయంసిద్ధము, పూర్ణము. ఈశ్వరుడు అదియే. జీవుడు అదియే.

శ్రీకృష్ణుడింకనూ ఇట్లు చెప్పెను:

అధ్యాయము 6, శ్లోకము 31:

सर्वभूतस्थितं यो मां भजत्येकत्व मास्थितः ।
सर्वथा वर्तमानोऽपि स योगी मयि वर्तते ॥ ३१ ॥

సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వ మాస్థితః
సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే (31)

యః = ఎవడైతే; **సర్వభూతస్థితం** = సర్వప్రాణుల యందు ఉన్న; **మాం** = నన్ను; **ఏకత్వం** = ఏకత్వభావనను; **ఆస్థితః** = పొందినవాడై; **భజతి** = సేవించునో; **సః** = అట్టి; **యోగీ** = యోగి; **సర్వథా** = ఏ విధముగా నైననూ; **వర్తమానః అపి** = ఉన్నప్పటికీ; **మయి** = నా యందు; **వర్తతే** = ఉండును.

> ఎవడైతే ఏకతా భావనను పొంది సర్వప్రాణుల యందు ఉన్న నన్ను సేవించునో (దర్శించునో), అట్టి యోగి ఏ విధముగ నున్ననూ నా యందు ఉన్నవాడే అగును (31).

సర్వప్రాణులలో ఒకే ఆత్మను దర్శించు జ్ఞాని యొక్క వర్ణన ఈ శ్లోకములో కొనసాగుచున్నది. ఆత్మ ఈశ్వరభిన్నము కాదనే ఎరుక గల జ్ఞాని యథార్థముగా ఈశ్వరుడే. ఈ విషయము ఇచట మరల చెప్పబడుచున్నది.

మాం సర్వభూతస్థితం యో భజతి – అనగా, సర్వప్రాణులలో ఆత్మరూపముగా ప్రకాశించు నన్ను దర్శించువాడు అని యర్థము. కావున, ఆత్మ పరమేశ్వరుని కంటె భిన్నము కాదు. ఆత్మ ఏకము, అభిన్నము, పూర్ణము అను ఎరుక యోగికి కలుగును. ఇట్టి అభిన్న రూపములో (ఏకత్వం ఆస్థితః) నన్ను గుర్తించి, దర్శించు యోగి, ఏ విధముగా జీవించిననూ, నా యందు మాత్రమే ఉండును (సర్వథా వర్తమానః అపి సః యోగీ మయి వర్తతే).

ఒకసారి లభించిన జ్ఞానమును కోల్పోయే అవకాశము గలదా? యను ప్రశ్నకు ఈ శ్లోకము ఉత్తరము నిచ్చును. 'స్వామీజీ, ఒక వ్యక్తికి ఈ జ్ఞానము కలిగినదనుకొనుడు. అతడీ ద్వైత ప్రపంచములో ప్రతిదినము వ్యవహరిస్తూ ఉంటే, ఆ జ్ఞానమును కోల్పోడా?' అని నన్ను జనులు తరుచుగా ప్రశ్నిస్తారు. కోల్పోడని శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పుచున్నాడు. అతడు ఏమి చేస్తున్నా, చూస్తున్నా, వింటున్నా, మాటలాడుతున్నా, నడుస్తున్నా, అతనికి ఏమి జరిగినా, అతడు ఏ విధముగా జీవించినా, బ్రహ్మచారియైనా, గృహస్థుడైనా, సన్న్యాసియైనా, పురుషుడైనా, స్త్రీయైనా, యువకుడైనా, వృద్ధుడైనా, ఈ జ్ఞానము మిగిలియే యుండును (సర్వథా వర్తమానః అపి). మానవుడు ఉండే ఆశ్రమము గాని, ఆచరించే వృత్తి గాని పూర్తిగా అతని ప్రారబ్ధముపై ఆధారపడును. జ్ఞాని విషయంలో ఒకటి మంచియని, మరియొకటి చెడు అని విభాగము చేసే ప్రసక్తియే లేదు.

జ్ఞానము గల వ్యక్తి విషయంలో శాస్త్రము వర్తించదు

ధర్మాధర్మముల గురించి శాస్త్రము ఇచ్చే ఆదేశములు ధర్మాధర్మములకు అతీతుడగు జ్ఞానికి వర్తించవు. ఈ విషయమును మనము స్పష్టముగా తెలుసుకోవాలి. జ్ఞాని స్వతంత్రుడు. కావున, ఆయన ముక్తుడనబడును. ఆయన సదా స్వతంత్రుడు. అనగా, నిత్యముక్తుడు. ఇట్టి ముక్తుడు నా (భగవానుని) నుండి దూరము కాడు. ఎవరైననూ తన నుండి తాను దూరము కాడు గదా! కావున జ్ఞానికి భగవానుడు దూరము కాడు.

ఈ క్షణములోనైననూ నేను నా సత్యస్వరూపమగు సచ్చిదానంద ఆత్మకు దూరముగా లేను. అజ్ఞానము మాత్రమే మనలను ఆత్మకు దూరముగా నుంచగల్గుచున్నది. కాని, మనము చర్చిస్తున్న వ్యక్తికి అజ్ఞానము తొలగినది. కావున, అతడు ఎక్కడ ఉన్ననూ, ఏమి చేయుచున్ననూ (సర్వథా వర్తమానః అపి) నా యందు మాత్రమే ఉండును (మయి వర్తతే). జీవన్ముక్తుడు ఆత్మకు దూరమయ్యే ప్రసక్తి లేదు. ఇట్టి మోక్షము ఆత్మజ్ఞానమునకు ఫలము.

విశ్వసింపబడే ఈశ్వరుడు సుదూరము

ఇచటి నిర్ణయమేమనగా, ఈశ్వరుడు జీవునకు దూరములో లేడు (ఈశ్వరః న పరోక్షః). ఊహించబడేది, విశ్వసింపబడేది పరోక్షమనబడును. ఈశ్వరుడు ఒకడు గలడని మనము భావిస్తాము. కాని, ఈశ్వరుని ఉనికిని నిదర్శనములతో నిరూపించలేము. కావున, అది విశ్వాసముతో సమానమగును. ఈశ్వరుడు గలడు అనేది విశ్వాసముగా మాత్రమే ఉన్నంత వరకు, అట్టి ఈశ్వరుడు దూరస్థుడు, పరోక్షుడు మాత్రమే అగును.

ఉదాహరణకు, వృక్షము గలదు అని నేను అంటాను. ఆ వృక్షమును నేను సాక్షాత్తుగా చూడలేదు. అది పరోక్షము. పొగను చూచి, నిప్పును ప్రత్యక్షముగా చూడకపోయినా, నిప్పు ఉన్నదని మనము ఊహిస్తాము. ఈ విధముగా, ఊహ (అనుమితి, inference)చే తెలియబడే వస్తువు కూడ పరోక్షము అనబడును.

దీనికి భిన్నంగా మనము జ్ఞానేంద్రియములతో గ్రహించేది, అనగా మనము చూచేది, వినేది, ఆఘ్రాణించేది, రుచి చూసేది, మరియు స్పృశించేది ప్రత్యక్షమనబడును. నేనొక స్ఫటికమును చేతిలో పట్టుకొన్నాననుకొనుడు. అది స్ఫటికమని నాకు తెలియును. అది నాకు ప్రత్యక్షము. కాని,

అది స్ఫటికమా, లేక గాజు మాత్రమేనా అను సంగతి నీకు తెలియదు. కాన, అది నీకు పరోక్షము. చేతితో దానిని పట్టుకొని, దాని బరువును తెలుసుకొనే వరకు, అది స్ఫటికమై ఉండునని నీవు ఊహించవచ్చును. దీని సారమేమనగా, సాక్షాత్తుగా తెలియబడేది ప్రత్యక్షమగును. అట్లు గాక, ఊహించి తెలుసుకొనేది పరోక్షమనబడును.

ఈశ్వరుడు ప్రత్యక్షము కాదు. ఈశ్వరుని సాక్షాత్తుగా చూడగలిగే పక్షంలో, నా కంటె భిన్నముగా ఉండే అనాత్మ అయిపోతాడు. మన దృష్టికి ఈశ్వరుడు దృశ్యముగా ఎన్నటికీ కాజాలడు. కావున, ఈశ్వరుడు అనాత్మ కాజాలడు. అనాత్మ పూర్ణముగా ఆత్మ చైతన్యముపై ఆధారపడును. ఈశ్వరుడు అనాత్మ అయినచో, మిథ్య యగును. ఆత్మయగు నేను సత్యము అగుదును! ఈశ్వరుడు అనాత్మ కాజాలడు గనుక, ఆయన మన ఇంద్రియములకు ఏనాడూ ప్రత్యక్షము కాజాలడు. ఆయన అనుమితి (inference) లో కూడ విషయము కాజాలడు. అనుమానము ప్రత్యక్షముపై ఆధారపడును గదా! అయినా, మనము ఈశ్వరుని ఉనికిని విశ్వసిస్తాము. అంటే, ఈశ్వరుడు పరోక్షమని తేలినది.

ఈశ్వరుని ఉనికిని విశ్వసించువాడు ఆస్తికుడనబడును. ఆస్తికుడు శాస్త్ర ప్రమాణము ఆధారంగా ఈశ్వరుని గురించి తెలుసుకొని, ఈశ్వరుని విశ్వసించును. ఈశ్వరుని విశ్వసించువాడు, శాస్త్ర వచనములను నిదర్శనములతో నిరూపించలేకపోయినా, శాస్త్రము జ్ఞానసాధనమని స్వీకరించును. దీనిని సమర్థించే యుక్తులు కూడా కొన్ని గలవు. వీటి ఆధారంగా, ఈశ్వరుడు గలడని మనము విశ్వసిస్తాము. ఈ విశ్వాసమునకు, ఈ స్వీకృతికి పరోక్షజ్ఞానమని పేరు.

ఆత్మ జ్ఞానము తత్క్షణ అపరోక్ష జ్ఞానము

కాని, ఈ శ్లోకంలో చర్చించే జ్ఞానము పరోక్షజ్ఞానము కాదు. ఆత్మజ్ఞానమును పొందుట యనగా తనను గురించి తాను తెలుసుకొనుటయే. ఇట్టి జ్ఞాని 'సర్వము నేనే, నా కంటె భిన్నముగా ఏదీ లేదు' అను నిష్కర్షకు వచ్చును. నేను అనగా శుద్ధచైతన్యము. అదియే పరబ్రహ్మ; సత్యజ్ఞానానంత బ్రహ్మ. మిగిలిన సర్వము దానిపై ఆధారపడి యున్నది. ఈ సత్యజ్ఞానానంత బ్రహ్మయే జీవుని ఆత్మ. ఈశ్వరుడు, బ్రహ్మ మరియు నేను ఒక్కటియే. కావున, ఏనాడైననూ, నాకు ఈశ్వరుడు పరోక్షము కాదు. ఈశ్వరునకు నేను పరోక్షము కాదు. దీనికే అద్వైతమని పేరు. అనగా ఈశ్వరుడ నగు నాకు, జీవునకు మధ్యలో భేదము లేదని యర్థము. ఈ జీవేశ్వరుల మధ్య గల అభేదము (జీవేశ్వర ఐక్యము) పూర్వ శ్లోకములో కూడ నిరూపింపబడినది.

ఈ శ్లోక భాష్యములో శ్రీ శంకరులు ఆత్మ ఏనాడూ పరోక్షము కాదని వివరించిరి. ఆత్మ సదా స్వతంత్రము (నిత్యముక్తము). ఆత్మ కంటె భిన్నముగా ఏదీ లేదు గనుక, ఆత్మకు బంధము లేదు. కావుననే జ్ఞాని నా యందు మాత్రమే ఉండును అని (మయి ఏవ వర్తతే) శ్రీకృష్ణుడు చెప్పినాడు. అనగా, అజ్ఞానము తొలగగానే, జ్ఞానము కలిగి, ఆ జ్ఞానము మరల తొలగిపోయే ప్రసక్తి లేదని స్పష్టమగుచున్నది.

ఆత్మ జ్ఞానము స్మృతిపై ఆధారపడేది కాదు. స్మృతిపై ఆధారపడే జ్ఞానమును విస్మరించే అవకాశము గలదు. మన దగ్గర ఉన్న వస్తువులను మనము పోగొట్టుకొనే అవకాశము గలదు. స్మృతి నా (ఆత్మ) కొరకు ఉన్నది. నాకు స్మృతి కలదు గాన, నేను దానిని పోగొట్టుకునే అవకాశము కూడ గలదు. కాని, ఇచట తెలియబడేది ఆత్మ మాత్రమే. జ్ఞానోదయము కలుగగానే, తనపై తనకు గల అజ్ఞానము తొలగిపోయి, ఆత్మయే బ్రహ్మయను సాక్షాత్కారము కలుగును. ఒకసారి ఉదయించిన ఈ జ్ఞానము మరల ఎన్నటికీ తొలగిపోదు.

ఆత్మ పరోక్షమైనప్పుడు మాత్రమే, జ్ఞాని భగవానుని నుండి దూరమగుట సంభవమగును. కాని, నిత్య-అపరోక్షమగు ఆత్మ, వ్యక్తికి సర్వదా తెలుస్తూనే ఉంటుంది గనుక, ఆత్మ పరోక్షము అయ్యే ప్రసక్తి లేదు. వ్యక్తి భ్రాంతుడు కావచ్చును. లేదా, జ్ఞాని కావచ్చును. కాని ఆత్మ ఎన్నడూ పరోక్షము కాదు. మానవులకు సంసారము ప్రత్యక్షానుభవము. దానిలో ఊహించవలసినది ఏదీ లేదు. కావున, సంసారానుభవము అపరోక్షము. సంసారియగు వ్యక్తికి 'నేను ఉన్నాను' అనేది అపరోక్షము. వివేకికి 'నేను ఉన్నాను' అనేది అపరోక్షము. అజ్ఞానికి కూడా 'నేను ఉన్నాను' అనేది అపరోక్షము. కావున, ఆత్మ నిత్య-అపరోక్షము, సర్వదా స్వయంసిద్ధము.

ఆత్మ నిత్య-అపరోక్షమే గాక, నిత్యముక్తము కూడా. తాను నిత్యముక్తుడనను సత్యమును మానవుడు జ్ఞాన ప్రభావము వలన గుర్తించును. ఇందువలననే, జ్ఞాని జీవన్ముక్తుడనబడును. అనగా జీవించి యుండగనే అతడు మోక్షరూపమగు జ్ఞానమును పొందును. ఈ జ్ఞానమును పొందిన వ్యక్తి ఏమి చేసిననూ చేయవచ్చును. వైదిక కర్మలను చేయవచ్చును; లేదా మానవచ్చును. బోధించవచ్చును; లేదా, బోధించకపోవచ్చును. అతడు ఏ ఆశ్రమమునకు చెందినవాడైననూ కావచ్చును. ఏ పనినైననూ చేయవచ్చును. అతడు ఎట్లు చేసిననూ, ఆత్మరూపుడుగనే యుండును. మాటవరుసకు అనుకుందాము. ఒకవేళ ఇట్టి జ్ఞాని హత్య గావించిననూ, భగవానునకు దూరము కాడు. ఏలయన, జ్ఞాని యందు కర్తృత్వము ఉండదు.

జ్ఞాని ఇట్టి పనులను చేయవచ్చునా? అను శంక కలుగుట సహజమే. జ్ఞాని తప్పు పనులను చేయుట సంభవము కాదని శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములో చెప్పుచున్నాడు:

అధ్యాయము 6, శ్లోకము 32:

आत्मौ पम्येन सर्वत्र समं पश्यति योऽर्जुन ।
सुखं वा यदि वा दुःखं स योगी परमो मतः ॥ ३२ ॥

ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోర్జున
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః (32)

అర్జున = ఓ అర్జునా!; **యః** = ఎవడైతే; **సర్వత్ర** = అంతటా; **సుఖం వా** = సుఖమును గాని; **దుఃఖం యది వా** = దుఃఖమును గాని; **ఆత్మ-ఔపమ్యేన** = తన ఉపమానము చేత; **సమం** = సమముగా; **పశ్యతి** = చూచునో; **సః** = అతడు; **పరమః** = గొప్ప; **యోగీ** = యోగి యని; **మతః** = పరిగణింపబడును.

జ్ఞాని అధర్మ కార్యమును చేయవచ్చునా? అను సమస్యను శ్రీకృష్ణుడీ శ్లోకములో పరిహరించినాడు. జ్ఞాని అధర్మముగా నాచరించే అవకాశము లేనే లేదని శ్రీకృష్ణుడిచట ప్రతిపాదించుచున్నాడు. జ్ఞానికి తానే (ఆత్మ) దృష్టాంతము (ఉపమ). తనకు తాను దృష్టాంతము అగును (ఆత్మ-ఔపమ్యమ్).

తనకు తాను దృష్టాంతముగా గల వ్యక్తి సర్వప్రాణులలో సమానముగా నుండు (సర్వత్ర సమమ్) ఆత్మ తత్త్వమును దర్శించును. అనగా, అతడు ఇతరులను ఆత్మ దృష్ట్యా తక్క, మరియొక భావనతో చూడడు. సర్వప్రాణుల యందు అతని దృష్టి సమముగ నుండును. ఇది ఒక అర్థము. మరియొక అర్థము కూడ గలదు. దానిని మనము తరువాత చూచెదము.

సర్వ ప్రాణుల సుఖదుఃఖముల విషయములో (సుఖం వా యది వా దుఃఖమ్) జ్ఞానికి గల ఈ సమబుద్ధిని శ్లోకములోని ద్వితీయార్థము వివరించుచున్నది. నా సుఖము, నా క్షేమము నాకు చాల ప్రముఖమైనవి. నేను వాటిని సంపాదించుటకు యత్నిస్తాను. ఈ విషయము అందరికీ సమానమే. సర్వప్రాణులు తమ సుఖమును కాంక్షిస్తాయి. కావున, నేను ఇతర ప్రాణులతో చేయు వ్యవహారమును నిర్ణయించదగిన ఆధారభూమిక నేనే. మరియు దుఃఖము నాకు అభిలషణీయము కాదు. ఇతర ప్రాణులకు కూడ అంతే.

ధర్మమునకు ఆధారము

ధర్మము పుట్టిన విధము మనకీ శ్లోకములో కన్పట్టును. విశ్వజనీనము, పరస్పరము అయిన అపేక్ష (expectation) ధర్మమునకు మూలాధారమై యున్నది. ఇతరుల నుండి నేను దేనిని అపేక్షిస్తానో, దానినే ఇతరులు నా నుండి అపేక్షిస్తారు. నాకు అభిలషణీయమగు సుఖము ఇతరులకు కూడ అభిలషణీయమగును. నాకు అభిలషణీయము కాని దుఃఖము ఇతరులకు కూడ అభిలషణీయము కాదు. కావున, ఈ సామాన్య సూత్రము మానవసంబంధములకు ఆధారమగును. ధర్మమనగా ఇదియే.

సర్వ ప్రాణుల యందు సమభావము గల వ్యక్తిని మన మిచట చర్చిస్తున్నాము. ఇట్టి వ్యక్తి తనకు అభీష్టము కాని దానిని ఇతరుల యందు ఆచరించడు. జ్ఞాని ఏమి చేసినా నా యందే ఉండును (సర్వథా వర్తమానః అపి మయి వర్తతే) అని శ్రీకృష్ణుడు పూర్వశ్లోకములో చెప్పియున్నాడు. అట్లైనచో, జ్ఞాని అధర్మ కార్యముల నాచరించునా? అను శంకకు సమాధానముగా, ఈ శ్లోకము జ్ఞాని ఆచరించే కర్మలను నియంత్రించు మూలసూత్రమును ప్రతిపాదించుచున్నది. జ్ఞాని అధర్మము నాచరించుట సంభవము కాదని శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు. ఏలయన, అతనికి ఏది మంచియో, అది ఇతరులకు కూడా మంచిది యగును. అతడు హింసింపబడుటను ఇష్టపడడు. కావున, అతడు ఇతరుల నెవ్వరినీ హింసించడు. ఈ విధముగా, జ్ఞానికి అహింస సహజ లక్షణమగును.

జ్ఞాని మాత్రమే గాక, సరళమగు వివేకము గల వ్యక్తులు కూడా అహింసా ధర్మము నాచరించుట మనకు సర్వత్రా కనబడును. ధార్మిక జీవనమును గడిపి, ప్రయత్న పూర్వకముగా జ్ఞానసాధన చేసి, జ్ఞానమును సంపాదించిన వ్యక్తి విషయములో ధర్మము స్వతః ఉత్పన్నమయ్యే (spontaneous) అతి సహజ ప్రవృత్తి యగును.

ఇతరులకు హానిని చేయుట ఇత్యాది నేర ప్రవృత్తి వెనుక, అధర్మాచరణము వెనుక అల్పమగు అహంకారము ఉండును. వాస్తవములో అహంకారమేదైనా అల్పమే. పెద్దది అనిపించే అహంకారము కూడా అల్పమైనదే. అహంకారము గాలిబుడగ వంటిది. బుడగ చిన్నది అయినా, పెద్దది అయినా, దానిలో గాలి తప్ప మరేమీ లేదు. ఈ అహంకార వ్యవహారము కూడా అట్టిదియే. ఇది నిస్సారమైనది. అహంకారము మిథ్యాతత్త్వము. చిన్న, పెద్ద అన్ని నేరముల వెనుక ఈ మిథ్యాతత్త్వమే గలదు.

అహంకార స్వరూపము

ఈ అహంకారము యొక్క స్వరూపమెట్టిది? భద్రతా భావము లేని వ్యక్తిలో భయముతో, తృష్ణతో కూడిన, భద్రతా భావ విహీనమగు అహంకారము ఉండును. అహంకారములో భయము, తృష్ణ ఉండుటచే భద్రత లుప్తమగును. భద్రత లేకపోవుటచే అది భయభీతమగును. భయపడిన వాడు, తృష్ణ గలవాడు చేయు కర్మలు ధర్మమునకు అనురూపముగా నుండవు. వాస్తవంలో తప్పు పనులన్నీ భద్రతా భావన లేని అహంకారము నుండియే పుట్టును. అహంకారములో భద్రత లేదు. అహంకారము స్వభావతః వేర్పాటు ధోరణిని కలిగియుండును. కావున, అహంకారములో ద్వైతము అనివార్యము.

ద్వైతము ఉన్నచోట భయము ఉండునని (ద్వైతాత్ హి భయం భవతి) బృహదారణ్యకోపనిషత్తు చెప్పుచున్నది. ఇదే అర్థము గల వాక్యము (ఉదరం అంతరం కురుతే, అథ తస్య భయం భవతి) తైత్తిరీయోపనిషత్‌లో గలదు. జీవునకు, ఈశ్వరునకు గల భేదము ద్వైతమునకు మూలము. నేను వేరు; ఈశ్వరుడు వేరు (జీవేశ్వర ద్వైతము). ఈ ద్వైతము వ్యక్తిని అల్పుని చేయును. నేను తప్ప సర్వము ఈశ్వరుడైనచో, నేను అల్పుడ నగుట సహజమే గదా! నా కంటె భిన్నమైనది సర్వము పెద్దదిగా నున్నది. నేను అల్పుడను. ఈ ద్వైతమును మూల లక్షణముగా స్వీకరించు మానవుడు, ఒక వ్యక్తికి మరియొక వ్యక్తికి మధ్య గల భేదము (జీవ-జీవ-ద్వైతము) ను, మరియు జీవునకు జగత్తునకు మధ్య గల భేదము (జీవ-జగత్-ద్వైతము) ను కూడ స్వీకరించును.

ఒక జీవునకు, మరియొక జీవునకు మధ్య గల ద్వైతము, జీవునకు జగత్తునకు మధ్య గల ద్వైతము సత్యమైనచో, జీవునకు ఈశ్వరునకు మధ్య గల ద్వైతము కూడ సత్యమే యగును. ఎందువలన? ఏలయన, జీవ-జీవ-ద్వైతము, జీవ-జగత్-ద్వైతములు సత్యమైనచో, ఈ జగత్తు కంటె భిన్నంగా ఈశ్వరుడొకడు ఉండాలి. అపుడా ఈశ్వరుడు ఇతర జీవుల వలెనే మరియొక వ్యక్తి యగును. అట్టి ఈశ్వరునకు, ఇతర వ్యక్తులకు, నాకు మధ్యలో భేదము ఉండును. ఈ విధముగా జీవులు, జగత్తు, ఈశ్వరుడు అనే మూడింటి మధ్యలో భేదముండుటచే, సర్వత్ర ద్వైతము ఉండును. ఈ మూడు తత్త్వముల మధ్య భేదము ఉన్నచో, జీవుని వేర్పాటు (isolation) స్థిరమగును. మరణశీలము స్థిరమగును. అపూర్ణత, అయోగ్యత స్థిరమగును. వీటి వెనుక భయము, తృష్ణ, పీడ, దుఃఖము ఇత్యాదులు అనుసరించును.

అహంకారమునకు మూలము అజ్ఞానము

అహంకారము ఉన్నచోట నేను వేరు అను ధోరణి ఉండును. కావున, వైరము అన్నింటి వెనుక అహంకారము గలదు. ఈ అహంకారము అనే బుడగను ఛేదించిన యోగిని గూర్చి శ్రీకృష్ణుడు వివరించుచున్నాడు. అతని యందు ఈ అహంకారపు బుడగ ఇపుడు లేదు. ఉన్నది ఒకే ఒక సముద్రము. అహంకారమునకు ఆత్మను గురించిన అజ్ఞానమే మూలము. ఆత్మను గురించిన అజ్ఞానము తొలగగానే, మిగిలేది ఆత్మ ఒక్కటియే. అదియే పరబ్రహ్మము. అపుడు అహంకారము అనేది ఉండదు. అహంకారము లేని వ్యక్తి అధర్మ కార్యమును చేయు ప్రసక్తి ఎక్కడిది? జ్ఞాని భగవానుని యందు మాత్రమే ఉండును (మయి ఏవ వర్తతే). జ్ఞాని ఎట్టి కర్మనైనను చేయవచ్చును (సర్వథా వర్తమానః అపి) అని మనము వాదము కొరకు అనవచ్చును. జ్ఞాని ఎన్నో కర్మలను చేయుచుండవచ్చును. ఈ కర్మలు ఏవైనా, ఎట్లు చేయబడినా, జ్ఞాని భగవానుని యందు మాత్రమే ఉండునని శాస్త్రము బోధించుచున్నది.

భగవానుని యందు మాత్రమే ఉండుట యనగా జ్ఞాని భగవానుని కంటె ఏనాడూ భిన్నముగా నుండడు. అనగా, జ్ఞాని, భగవానుడు ఒక్కటియే. సర్వము నందు సమదర్శనము గల జ్ఞానికి అధర్మ కార్యములను చేయదగిన ఆవశ్యకత ఉండదు. తనకు ఏది సుఖమో, అదియే ఇతరులకు కూడ సుఖమనియు, తనకు ఏది దుఃఖమో అదియే ఇతరులకు కూడ దుఃఖమనియు జ్ఞాని దర్శించగల్గును.

కాని, ఇట్టి సమదర్శనము గల జ్ఞాని ఏదో విధముగా రాజీపడి అధర్మము నాచరించే అవకాశము లేదా? తమకు ఆనందము నిచ్చునది ఇతరులకు కూడ ఆనందము నిచ్చుననియు, తమకు దుఃఖమును కలిగించునది ఇతరులకు కూడ అట్లే ననియు చాల మందికి తెలియును. కాని వారు సర్వదా ధర్మానురూపముగా ప్రవర్తించుట లేదు. అటులనే, ఒక ప్రత్యేక పరిస్థితిలో, జ్ఞాని తన సమదర్శనమును కొద్దిసేపు పక్కకు పెట్టుట సంభవము కాదా? కాదు. వాస్తవంలో ఈ సమస్యయే ఉదయించదు. ఏలయన, సమదర్శనము గల జ్ఞాని యందు 'నేను పరిచ్ఛిన్నుడను' అను ధారణ ఉండదు. సర్వ ప్రాణులలో ఒకే ఆత్మ గలదనియు, సర్వప్రాణులు ఆత్మ యందు మాత్రమే గలవనియు అతడు యెరుంగును. అట్టి వాని అహంకారము బాధితమై (negated) యుండును. దాని యందు యథార్థ బుద్ధి ఉండదు.

కావున, ఇట్టి జ్ఞానికి అహింస సహజ గుణము అగును. వాస్తవంలో సన్న్యాసము యొక్క స్ఫూర్తి అహింసయే. ఆత్మను గురించి ఇట్టి నిస్పష్ట దర్శనము గల వ్యక్తి (సమ్యగ్దర్శన నిష్ఠః)

సహజముగా అహింసా వ్రతమును పాలించును. అతడు అహింసను ప్రయత్నపూర్వకముగా పాటించ బనిలేదు. అది ఆతని స్వభావమై స్వతః ప్రవర్తితమగును. ఇట్టి జ్ఞాని యోగులలో కెల్లా శ్రేష్ఠుడని ఈ శ్లోకములో వర్ణింపబడినది.

ఈ శ్లోకమునకు మరియొక అర్థము

ఈ శ్లోకములోని 'వా (లేదా)' అను పదమును ఆధారంగా చేసుకొని, మనమీ శ్లోకమును ఇంకో రకంగా వ్యాఖ్యానించవచ్చును. ఈ 'వా'ను సుఖ దుఃఖములతో కలిపి అన్వయించవలెను. సుఖమును కలిగించునవి, దుఃఖమును కలిగించునవి అని పరిస్థితులు ద్వివిధముగా విభజింపబడినవి. జ్ఞాని ఈ రెండింటినీ సమముగా చూచును (సమం పశ్యతి యః) అని శ్రీకృష్ణుడు అర్జునునితో చెప్పెను. అనగా, జ్ఞానికి సుఖదుఃఖములు సమానము. ఎందువలన? అతడు ఆ రెండింటినీ ఆత్మ దృష్టాంతముతో పరిశీలించును. ఆత్మయే దృష్టాంతము, అనగా కొలబద్ద. అనగా, పరిస్థితిని అంచనా వేయుటలో ఆత్మ ఆధారమగును. కావున, జ్ఞాని సుఖదుఃఖములు రెండింటి యందు సమానముగా నుండు దానిని దర్శించును.

ఇది యెట్లు సంభవమగును? జ్ఞాని ఆత్మ యొక్క స్వరూపభూతమైన పూర్ణత్వమును యెరుంగును. అతడు ఆ యెరుకతో సుఖ దుఃఖములను దర్శించును. ఇవి రెండు ఆత్మ యొక్క పూర్ణత్వము నందు మాత్రమే గలవు. జ్ఞానికి సుఖదుఃఖ పరిస్థితులు ఎదురు కావని దీని యర్థము కాదు. ఇచటి తాత్పర్య మేమనగా, జ్ఞాని పరిస్థితుల నన్నిటినీ ఆత్మ దృష్టితో మాత్రమే చూచును. మరణ దుఃఖమును కూడ అతడట్లే చూచును. ఆత్మ పూర్ణమను జ్ఞానము గల జ్ఞానికి ఎదురయ్యే పరిస్థితి ఎట్టిది అయిననూ, అతనిలో లేశమైననూ చలనము ఉండదు. మరో మాటల్లో చెప్పాలంటే, సుఖము కలిగినప్పుడు జ్ఞాని యొక్క పూర్ణత్వము వృద్ధిని పొందదు; దుఃఖము కలిగినపుడు పూర్ణత్వము నందు హ్రాసము కలుగదు. అనగా, జ్ఞాని సర్వదా భగవంతుని యందు ఉండును (మయి ఏవ వర్తతే). ఎట్టి పరిస్థితులైననూ జ్ఞానిని భగవంతుని నుండి దూరము చేయలేవు.

పూర్వ శ్లోకమునకు ఈ శ్లోకముతో గల సంబంధమిదియే. పూర్వ శ్లోకములో 'అతడు ఏమి చేసిననూ, ఎట్లు ఉన్ననూ (సర్వథా వర్తమానోऽపి)' అని చెప్పబడిన జ్ఞాని, సుఖమును లేక దుఃఖమును కలిగించే పరిస్థితుల మూలముగా భగవానునకు దూరమగుట గాని, భగవానుని విస్మరించుట గాని సంభవించదు. ఎందువలన? ఆత్మ (అహం, నేను) దృష్టాంతముగా (ఉపమా), ఆధారముగా స్వీకరింపబడినది గనుక.

ఆత్మయే పరమేశ్వరుడు (పరమాత్మ) అని ఇంతకు ముందు చెప్పబడినది. కావున, ఆత్మ స్వరూపమగు పూర్ణత్వముతో పరిస్థితులనన్నిటిని ఎదుర్కొనే స్వభావము గల వ్యక్తికి పరమాత్మ ఉపమ యగును. ఈ ఉపమానము, గీత రెండవ అధ్యాయములోని నదీ సముద్ర దృష్టాంతమునకు అనురూపముగా నున్నది.

ఆ పూర్య మాణ మచల ప్రతిష్ఠం
సముద్ర మాపః ప్రవి శంతి యద్వత్
తద్వత్కామా యం ప్రవి శంతి సర్వే
స శాంతి మాప్నోతి న కామ కామీ.

ఆ పూర్యమాణమ్ అనగా సముద్రము వలె అన్నివైపుల నుండి పూర్తిగా నిండునట్లు చేయబడుచున్నది. అనగా పూర్ణత్వమని యర్థము. అచలమ్ అనగా సముద్రము చలనము లేనిదై స్వీయ మహిమ యందు ప్రతిష్ఠితమై యుండునని అర్థము. ప్రతిష్ఠమ్ అనగా సముద్రము తన మహిమలో దృఢమగు మూలము కలిగి యుండునని అర్థము.

మరియు, ఈ సముద్రములోనికి వివిధ దిశల నుండి జలములు ప్రవేశించును (ఆపః ప్రవిశంతి). దీని వలన సముద్రము లేశమైననూ ప్రభావిత మగుచున్నదా? సముద్రత్వము వృద్ధి చెందునా? అట్లు కాదు. వర్షాభావము ఇత్యాది కారణముల వలన కొంత కాలము జలములు ప్రవేశించనిచో, సముద్రత్వమునకు హ్రాసము లేదు. సముద్రము ఎండిపోదు. సముద్రము పొంగి పొరలదు. ఇట్టి పరిస్థితులు ఉదయించనే ఉదయించవు.

పూర్ణత్వము ఇతరములపై ఆధారపడదు

ఆత్మ స్వరూపమగు పూర్ణత్వమునకు ఇది చక్కని దృష్టాంతము. నీరు ప్రవేశించినా, ప్రవేశించకపోయినా సముద్రము ఏకరూపముగా నుండును. సముద్రము యొక్క సముద్రత్వము ఇతర జలాశయములపై ఆధారపడదు గావున, అది సదా సముద్రమే. ఇదే విధముగా, ప్రస్తుతంలో జ్ఞానియగు యోగి పూర్ణత్వము కొరకు ఇతరములపై ఆధారపడడు. ఏది ఎట్లు జరిగినా, సుఖము కలిగినా, దుఃఖము కలిగినా, అతడు వాటిని ఏకరూపముగా దర్శించి, శాంతముగా నుండగల్గును (స శాంతిం ఆప్నోతి). జ్ఞానేంద్రియములనే అయిదు ద్వారముల ద్వారా ఏయే వస్తువులు (కామాః) ఏయే దిశ నుండి ప్రవేశించినా, అవి అతనిని లేశమైననూ చలింపచేయజాలవు. నీరు ప్రవేశించిననూ సముద్రము నిశ్చలముగనే యుండును గదా!

దీనికి భిన్నంగా వివిధ వస్తువులను కామించు వ్యక్తి (కామ కామీ) తన ఆనందము కొరకై బాహ్య వస్తువుల లబ్ధి, లేక అభావముపై ఆధారపడును. గీత ఇట్టి వానిని నీటి పడియతో పోల్చినది. పెద్ద వర్షము, లేక వరద వస్తే, నీటి పడియ అదృశ్యమగును. వర్షములు లేనిచో, అది పూర్తిగా ఎండిపోవును. కామకామి కూడా, ఇట్టి వాడే. ఇతడు క్రింద పడి, పైకి ఎగిరి, మరల క్రింద పడుతూ ఉండే బంతి వంటి వాడు. అభిలషణీయమగు పరిస్థితి సంప్రాప్తమైనప్పుడు అతడు పైకి ఎగురును. అభిలషణీయము కాని పరిస్థితి ఎదురైనప్పుడు అతడు క్రింద పడును. కాని మనమిచట చర్చించే యోగి ఆ బంతి వంటి వాడు కాదు. అతడు సర్వదా భగవానుని యందు ప్రతిష్ఠితుడై యుండును. సర్వవిధముల ఆపత్తులలో అతడు సమానముగ నుండును. ఘోర విపత్తు అని ప్రామాణికులు నిర్వచించే పరిస్థితిలో కూడా అతడు చలించడు. పూర్వశ్లోకములోని యోగి యొక్క వర్ణనను శ్రీకృష్ణుడీ శ్లోకములో ఈ తీరున కొనసాగించినాడు.

ఈ శ్లోకమును రెండు విధములుగా వ్యాఖ్యానించవచ్చును. సుఖము గాని, దుఃఖము గాని పరిస్థితి ఏదైనా యోగి ఏకరూపముగ నుండును. యోగి తనను తాను చూచు విధముగనే ఇతరులను కూడ చూచును. ఇట్టి దర్శనము గల యోగి తప్పు పనిని చేయడు. వాస్తవంలో, నీవు నీతో ఎట్లు వ్యవహరించవలెనో, ఇతరులతో అట్లే వ్యవహరించవలె నను నియమము సర్వులకు వర్తించును. సర్వ మానవులు ఇటులనే జీవించవలెనని అపేక్షింపబడుతుంది. ఇక యోగి మాట చెప్పునదేమున్నది?

ఇతరులకు హాని చేయువాడు ఆ ప్రక్రియలో తాను హానిని పొందును

తనకు తాను హాని చేసుకోకుండగా, మానవుడు ఇతరులకు హానిని చేయలేడు. కాని, ఆ సమయములో అట్లు కన్పట్టదు. మనమీ సత్యమును టెన్నిస్ ఆటలో చూడవచ్చును. ఆట ప్రేమతో ఆరంభమగును. కాని, విజయము కొరకు సంఘర్షణ కొనసాగును. నెగ్గినవాడు ఆనందముతో ఎగిరిపడును. అతడు ప్రత్యర్థితో చేతులు కలుపుటకై నెట్ వద్దకు నడుచును. అతడు ఎగిరి గంతులు వేయును. చేతిలోని రాకెట్‌ను గాలిలోనికి విసిరివేయును. అతని ఆనందమునకు హద్దు లేదు. ఇంతలో పరాజయ పీడితుడగు ప్రత్యర్థిని చూచును! అపుడా ఆనందమంతయు మాయమగును. ఎందువలన మాయమైనదో తెలియునా? దుఃఖ సంతప్తునికి సానుభూతిని చూపలేని మానవహృదయము ఈ సృష్టిలోలేదు.

ఆటలో ఓడిపోవుట యనగా నెట్టిదో విజేతకు తెలియును. అతడు కూడ అనేక పర్యాయములు ఓటమిని చవిచూచినవాడే. కావున, ప్రత్యర్థి యొక్క దుఃఖము వెనువెంటనే విజేతకు కూడ సంక్రమించును. ఎందువలన? ఏలయనగా, మానవుడు తనకు తాను హానిచేసుకోకుండగా ఇతరులకు హానిని చేయలేడు. అట్లు చేయుట సంభవము కాదు. ఇతరులకు నిష్కారణముగా హానిని చేయు నేరస్థులు గలరని మనము అనుకుంటాము. కాని, ఇది సత్యదూరము. పరపీడనారతులగు మానసిక రోగుల యందు కూడ అప్పుడప్పుడు సానుభూతి కన్పట్టును. మానవ హృదయము సృష్టింపబడిన విధమట్టిది.

అభద్రతా భావనయే యథార్థమైన సమస్య

మానవుడు తనకు తాను హాని చేసుకోకుండగా ఇతరులకు హాని చేయజాలడు అనేది సత్యము. దీని విషయంలో ఒక సరళమగు నియమము గలదు. మానవులందరు ధర్మనియతిని పాటించాలి. ఇది సర్వమానవులకు సమానముగా వర్తించే ఆధారభూమిక. కాని మానవులలో మౌలికముగా నుండే అభద్రతా భావన వలన వారు దానిని సాధారణంగా ఉల్లంఘిస్తారు. ఈ మౌలిక అభద్రతయే మానవుల సమస్య. భద్రతా భావము లేని (insecure) వ్యక్తి యొక్క ప్రాథమికతలు రాగద్వేషములపై ఆధారపడి నిర్ణయింపబడును. అట్టి వ్యక్తి అధర్మము నాచరించుటకు వెనుకాడడు. ఈ ప్రాథమికతలు ఏవైనా, జీవనమూల్యముల విషయములో భ్రాంతి ఉండును. నేను అల్పుడను అను ధారణ నుండి వ్యక్తి విముక్తుడగు వరకు ఈ భ్రాంతి అతనిని వెంటాడును. ఈ ధారణనుండి బయట పడగల్గిన వ్యక్తి సర్వ ప్రాణులలో సర్వదా సమత్వమును దర్శించును (సర్వత్ర సమం పశ్యతి). తనకు ఏది మంచిదియో, అదియే ఇతరులకు కూడ మంచిది యను దర్శనము అతనికి స్పష్టముగా నుండును. ఇట్టి యోగిని శ్రీకృష్ణుడిచట స్తుతించుచున్నాడు.

ధర్మమును పాలించే పరిణతుడగు వ్యక్తియైనమూ ఏదో ఒక అనుకోని ప్రాథమికత (priority) కారణంగా అప్పుడప్పుడు ధర్మమును ఉల్లంఘించును. కావున, న్యాయబద్ధమగు విమర్శ, న్యాయబద్ధమగు హాని సంభవమే. అనేక పర్యాయములు హానిని పొందిన వ్యక్తి విసుగు చెంది, ఇతరునకు హానిని చేయవచ్చును. మానవ సంబంధములలో ఇట్టి హాని న్యాయబద్ధముగా పరిగణింపబడును. జ్ఞాని మాత్రమే సుఖదుఃఖములను ఏకరూపముగా చూడగల్గును. కావున, జ్ఞాని మాత్రమే విముక్తుడగును. ఇందువలననే, జ్ఞాని మానవులందరిలో శ్రేష్ఠుడని (స యోగీ పరమో మతః) అని వర్ణింపబడినాడు.

ఈ విధముగా ఈ శ్లోకమును శాస్త్ర తాత్పర్యానుసారముగా రెండు విధములుగా వ్యాఖ్యానించవచ్చును. ఒక వ్యాఖ్యానములో జ్ఞాని యొక్క దర్శనము, రెండవ వ్యాఖ్యానములో జ్ఞాని యొక్క ప్రవృత్తి వర్ణింపబడినవి.

ధ్యానమును గూర్చి ఇచ్చిన ఈ వివరణలతో ధ్యాన యోగ ప్రకరణము సమాప్తమైనది. శ్రీకృష్ణుడు వాస్తవంలో ఈ ప్రకరణమును రెండు విభిన్న రీతులలో వివరించియున్నాడు. తాను చక్కని ఉపదేశమును చేసితిని అనే తృప్తితో శ్రీకృష్ణుడు కొద్దిగా వెనుకకు వాలి విశ్రమించెను. శ్రీకృష్ణుడు ఉపదేశమును ఆపివేయుటను అర్జునుడు గమనించి, అదియే ప్రశ్నించుటకు అదను అని భావించెను. అర్జునుని ప్రశ్న రాబోవు రెండు శ్లోకములలో వర్ణింపబడినది. ఈ శ్లోకములు అర్జునుని సమస్యను సుస్పష్టముగా నిరూపించును.

అధ్యాయము 6, శ్లోకము 33:

अर्जुन उवाच
योऽयं योगस्त्वया प्रोक्तस्साम्येन मधुसूदन ।
एतस्याहं न पश्यामि चञ्चलत्वात् स्थितिं स्थिराम् ॥ ३३ ॥

అర్జున ఉవాచ
యోఽయం యోగస్త్వయా ప్రోక్త స్సామ్యేన మధుసూదన
ఏతస్యాహం న పశ్యామి చంచలత్వాత్ స్థితిం స్థిరామ్ (33)

అర్జునః = అర్జునుడు; **ఉవాచ** = పలికెను. **మధుసూదన** = మధువు అను రాక్షసుని సంహరించిన ఓ శ్రీకృష్ణా!; **త్వయా** = నీచేత; **ప్రోక్తః** = చెప్పబడిన; **సామ్యేన** = సమత్వరూపమైన; **యః** = ఏ; **అయం** = ఈ; **యోగః** = యోగము గలదో; **ఏతస్య** = ఈ యోగమునకు; **స్థిరాం** = స్థిరమైన; **స్థితిం** = దర్శనము (స్థితి)ని; **చంచలత్వాత్** = చాంచల్యము వలన; **అహం** = నేను; **న పశ్యామి** = చూడజాలకున్నాను.

అర్జునుడిట్లు పలికెను –

> మధువు అనే రాక్షసుని సంహరించిన ఓ శ్రీకృష్ణా! నీవు చెప్పిన సమత్వరూపమగు ఈ యోగమునకు స్థిరమగు దర్శనమును నేను మనశ్చాంచల్యము వలన చూడజాలకున్నాను (33).

శ్రీకృష్ణుడు ఉపదేశించిన ఈ సమదర్శనము కనబడేటంత తేలిక కాదు. అర్జునునకు తన మనస్స్థితి బాగుగా తెలియును. అతడు తన ఈ సమస్యను ఈ శ్లోకములో ప్రకటించుచున్నాడు. తన మనస్సు చంచలమని అతడు వర్ణించినాడు. పైగా, చంచలత్వమే మనస్సు అని అతడు చెప్పినాడు. ఈ చంచలమైన మనస్సులో సమదర్శనము అసంభవమని అతని విశ్వాసము. ఒకవేళ సంభవమైనా, తన మనస్సును అట్టి దర్శనమునకు యోగ్యముగా తీర్చిదిద్దుట చాల కష్టమని అతని భావన.

అర్జునుడు సర్వజన సామాన్యమైన సమస్యను లేవనెత్తెను. మనస్సు గల వారందరికీ ఈ సమస్య గలదు. ఇంతవరకు శ్రీకృష్ణుడు చేసిన ఉపదేశము అర్జునునకు తెలిసినట్లే అనిపిస్తుంది. కాని అతనికి ఒక మిక్కిలి న్యాయసమ్మతమగు సంశయము గలదు. ఇంతవరకు శ్రీకృష్ణుడు చేసిన ఉపదేశములోని సారమును నిష్కర్ష చేయగా రెండు అంశములు పైకి వచ్చును. ప్రసన్నము, స్థిరము అగు మనస్సు ఈ జ్ఞానమును పొందుటకు యోగ్యమైనది. ఈ జ్ఞానము సుస్పష్టముగ నుండవలెను. మనస్సు ప్రసన్నముగా, స్థిరముగా నున్నచో, యోగ్యమగు విచారాదులచే ఈ స్పష్టతను తేలికగా పొందుట కవకాశము గలదు. కావున, ఈ మనస్సును స్థిరము చేయు సాధనములను గురించి అర్జునుడు ప్రశ్నించుచున్నాడు.

మనస్సు అల్లకల్లోలముగ నుండుట అర్జునుని అనుభవము. మనస్సునకు దృఢమైన మూలము గలదనియూ అతడు చెప్పినాడు. ఆధునిక మనోవిజ్ఞాన శాస్త్ర సూత్రములు గీతలో కూడ కన్పట్టునని దీనిని బట్టి నిరూపితమగుచున్నది. మనస్సు యుక్తి యుక్తమగు పద్ధతిలో పనిచేయలేదని మనకు స్పష్టమే. మనస్సు ఎంత మూర్ఖమైనదో యని మనము చాల స్పష్టమగు ప్రతిపాదనను చేయగల్గుతాము. కాని మనస్సునకు కొన్ని మూలభూతమైన సంస్కారములు గలవు. దానికి విభిన్న అవస్థలు (moods) గలవు. మనస్సులో వైరాగ్యము కూడ ఉండును. దానికి విభిన్నమైన ఆలోచించే తీరుతెన్నులు గలవు. ఇట్టి మనస్సును స్థిరము చేసి, జ్ఞానయోగ్యము చేయగల ఉపాయమేదైనా గలదా యని అర్జునుడు ప్రశ్నించుచున్నాడు.

ఆత్మ సాక్షాత్కార యోగ్యమగు మనస్సును పొందుట యెట్లు?

శ్రీ శంకరులు అర్జునుని ప్రశ్నను వివరించిరి. సర్వము నందు సమత్వమును దర్శించుట అనే యోగమును (యథోక్తస్య సమ్యగ్దర్శన లక్షణస్య యోగస్య) శ్రీకృష్ణుడింతవరకు వివరించెను. ఈ యోగమును పొందుట చాల కష్టము (దుఃఖ సంపాద్యతా). సర్వ వస్తువుల యందు బ్రహ్మ భిన్నమగు ఆత్మ సమముగ నున్నది. సర్వము యొక్క సత్యము అదియే. దానిని దర్శించగల్గుట సమ్యగ్దర్శనము,

లేక ఆత్మ దర్శనమనబడును. ఈ దర్శనమును మనస్సులో పొందవలెను. ఇట్టి జ్ఞానమును పొందుటకు యోగ్యమగు విశిష్ట మనస్స్థితిని నిర్మాణము చేయు విధమును అర్జునుడు తెలియగోరెను.

అర్జునుడు శ్రీకృష్ణుని మధుసూదన అని సంబోధించెను. అనగా, మధువును నశింపజేసిన వాడా అని యర్థము. శ్రీకృష్ణుడు మధు అను రాక్షసుని సంహరించి యుండెను. మధు అనగా తేనె యని కూడ అర్థము గలదు. సంస్కృతభాషలో అహంకారమునకు మరియొక పేరు మధువు. ప్రతి వ్యక్తి తన అహంకారమును ప్రేమించి, దానిని పెంచుకునే ప్రయత్నమును చేయుచున్నట్లు కన్పట్టును. గురవగు శ్రీకృష్ణుడు సత్యజ్ఞానముతో ఈ మిథ్యాహంకారమును నశింపజేయ సమర్థుడు. ఇందువలననే, అర్జునుడు ఆయనను మధుసూదన అని సంబోధించినాడు.

స్థిరమైన సమ్యగ్దర్శనము తనకు కలుగుననే నమ్మకము అర్జునునకు లేదు. ఈ విషయమునే అతడు శ్రీకృష్ణునకు తెలిపెను. అప్పుడప్పుడు సూక్ష్మదృష్టి కలుగవచ్చును. కాని, తన మనస్సు చాలసేపు స్థిరముగా నుండజాలదని అతనికి తెలియును.

ఈ దర్శనము స్థిరముగా నుండు ఉపాయమేదియో అతనికి గోచరించలేదు. పైగా, ఈ అస్థిరతకు కారణము కూడ అతనికి విదితమే. అతని మనస్సు సర్వదా కల్లోలితమై యుండెను (చంచలత్వాత్). సర్వదా కల్లోలితముగ నుండే ఇట్టి మనస్సులో ఈ దర్శనము చిరస్థాయిగా నుండుట శక్యము కాదని అతడు భావించెను. మనస్సునకు తనవైన యుక్తులు, తనవైన సంస్కారములు, తనవైన మూలములు గలవా యనిపించును. ఒకచో కొంత జ్ఞానము కలిగిననూ, ఆ జ్ఞానము మస్తిష్కములోని ఒక మూల మనస్సుతో సంబంధము లేనిదై ఉండిపోవచ్చును. ఈ పరిస్థితిలో కర్తవ్యమేమియో అర్జునుడు తెలియగోరుట సహజమే.

అర్జును డింకనూ ఇట్లు చెప్పెను:

అధ్యాయము 6, శ్లోకము 34:

चञ्चलं हि मनः कृष्ण प्रमाथि बलवद्दृढम् ।
तस्याहं निग्रहं मन्ये वायोरिव सुदुष्करम् ॥ ३४ ॥

చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢమ్
తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్ (34)

కృష్ణ = ఓ కృష్ణా!; మనః = మనస్సు; హి = నిశ్చయముగా; చంచలం = చంచలమైనది; ప్రమాథి = ఘోరనియంత; బలవత్ = బలము గలది; దృఢం = లోతైన మూలము గలది; తస్య = దాని; విగ్రహం = నియంత్రణము; వాయోః ఇవ = వాయువు యొక్క నియంత్రణము వలె; సుదుష్కరమ్ = మిక్కిలి దుస్సాధ్యమని; అహం = నేను; మన్యే = తలంచెదను.

ఓ శ్రీకృష్ణా! మనస్సు నిశ్చయముగా చంచలమైనది; అది ఘోరనియంత, బలము గలది, లోతైన మూలము గలది. దానిని నియంత్రించుట వాయువును నియంత్రించుట వలె మిక్కిలి దుస్సాధ్యమని నేను తలంచెదను (34).

శ్రీ శంకరులీ శ్లోక భాష్యములో శ్రీకృష్ణుని 'భక్త జన పాపాది దోషాకర్షణః' అను పెద్ద సమాసముతో వర్ణించెను. అనగా, భక్తులగు మానవుల పాపాది దోషములను తొలగించువాడు అని యర్థము. ఈ కారణముచేతనే గీత యందు భగవానునకు కృష్ణుడు అను సార్థక నామము కలిగెను.

అర్జునుడు మనస్సును ప్రమాథి, బలవత్, దృఢమ్ అను మూడు విశేషణములతో వర్ణించెను. మనస్సు చంచలము మాత్రమే గాక, అత్యాచారి (ప్రమాథి) కూడా. మనస్సు కల్లోలముగ నుండును అన్నంత మాత్రాన చాలదు. వాస్తవంలో మనస్సే కల్లోలము.

దేహమును, ఇంద్రియములను, వివేకమును, సర్వమును తన వశము నందుంచుకొనే శక్తి మనస్సునకు గలదు. మానవుని వివేకమునకు అతని మనస్సుపై అధికారము లేనట్లు కన్పట్టును. ఉదాహరణకు, దుఃఖితుడు కావాలని ఎవ్వరూ కోరుకొనరు. కాని, మానవుడు దుఃఖితుడగును. క్రుద్ధుడను కావాలని ఎవ్వరూ కోరుకొనరు. కాని మానవుడు క్రుద్ధుడగుచుండును. దుఃఖము, క్రోధము మొదలగు భావావేగములు అన్నియూ మానసిక అవస్థలే. వీటికి వ్యక్తిపై అధికారము గలదా యనిపించును. వ్యక్తికి కోపము వచ్చినప్పుడు సంస్కృతి, స్థాయి, జ్ఞానము, మరియు పెరిగిన వాతావరణము అనువాటికి అతనిపై అధికార మేమియూ లేదని తోచును.

కోపము వచ్చిన వ్యక్తి తన సంస్కారమును పూర్తిగా విస్మరించును. అతని నోటి నుండి విమార్జనగు భాష వెలువడును. ఈ భాష ఏ నిఘంటువులలోనైనను కానరాదు! ఈ భాష అందరికీ తెలిసినదే. అందరూ ఎప్పుడో ఒకప్పుడు వాడినదే. కాని దీనిని మానవులు సాధారణంగా వినియోగించరు. భాష కూడా సంస్కృతిలోని భాగమే. కాని, కోపము వచ్చిన వ్యక్తి మనము ఊహించలేని అనుచిత భాషను ప్రయోగిస్తాడు. కోపము సంస్కారమును నశింపజేయును. వ్యక్తి

గొప్ప శిష్టుడు, సంస్కారవంతుడు కావచ్చును; సూటు, బూటు ధరించిన పెద్దమనిషి కావచ్చును. కాని ఆ వ్యక్తి పెంపొందించుకున్న సంస్కారమంతా కోపము వచ్చిన క్షణములో మటుమాయమగును.

వ్యక్తి యొక్క జ్ఞానము కూడా ఇట్టి సమయాలలో వినియోగానికి రాదు. దుఃఖము వలన కోరదగిన ప్రయోజన మేమియూ సిద్ధించదని అందరికీ బాగుగా తెలియును. దుఃఖము పెరిగే కొలదీ సమస్యలు కూడా పెరుగును. ఎవ్వరూ ఎన్నడూ ఏ సమస్యనైననూ దుఃఖించుట వలన పరిష్కరించ లేదు. ఈ విషయము సుస్పష్టము, యుక్తి యుక్తము. శ్రీకృష్ణుడు అర్జునునితో సంవాదమును ఆరంభించగనే ఈ మాటను చెప్పియున్నాడు: "దుఃఖింపదగని వారిని గూర్చి నీవు దుఃఖించుచున్నావు. కాని ప్రాజ్ఞులు పలుకదగిన మాటలను పలుకుచున్నావు (అశోచ్యానన్వ శోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే, 2-11)".

ఇది అందరికీ తెలిసిన విషయమే. దీనిని ఒకరు మరియొకరికి ఉపదేశిస్తారు కూడా. కాని, దుఃఖము వచ్చేముందు మన అనుమతిని కోరదు. అది అట్లు కోరినచో, మనము ఎన్నటికీ అనుమతిని ఈయము. దుఃఖము కావాలని కోరువారెవ్వరు? అనుమతిని కోరినప్పుడు మాత్రమే అనుమతిని ఇవ్వాలా, వద్దా అను ప్రసక్తి ఉదయించును.

దుఃఖములో ఒక ప్రత్యేక ఆలోచనా సరళి సమ్మిళితమై యుండును

వ్యక్తి దుఃఖిస్తున్నాడు అంటే అతనిలో ఒక ప్రత్యేక ఆలోచనా సరళి కొనసాగుచున్నదని యర్థము. ఆలోచన లేనిదే, దుఃఖము లేదు. దుఃఖము ఆకలి, దప్పిక, నిద్రల వంటిది కాదు. ఆలోచించకుండగానే మనకు ఆకలి వేస్తుంది. మనము ఆలోచించకుండగానే నిద్రలోనికి జారుకుంటాము. ముఖ్యంగా విందు భోజనము తరువాత ఈ నిద్ర తరుముకు వస్తుంది. మరునాడు ఉదయము తోడేలుకు ఉన్నంత ఆకలితో నిద్రలేస్తాము. వీటిలో ఆలోచనకు తావు లేదు. కావున, ఆకలి కలుగుటకు ఆలోచనలతో సంబంధము లేదు. కాని దుఃఖము అట్టిది కాదు. ఆలోచనలు ఉన్నప్పుడు మాత్రమే దుఃఖము కలుగును. దుఃఖము, కోపము, ద్వేషము, క్షోభ, నిరాశ మరియు వైఫల్యభావన ఉదయించుటకు అధికమగు ఆలోచన అవశ్యకమగును.

మనస్సు వ్యక్తి యొక్క అనుమతిని ఏనాడూ కోరదు. ఉన్నది ఒక వ్యక్తి కాదు, ఇద్దరు వ్యక్తులు కలరా అనిపిస్తుంది. ఒక వ్యక్తి సంస్కారవంతుడు, పెద్ద చదువులు చదివినవాడు, పరిష్కృతమగు వేషము గలవాడు, మరియు విచారశీలుడు. అతని భాష, వ్యవహారము, శైలి, మర్యాద శ్లాఘనీయముగ

నుండును. కాని, అదే వ్యక్తికి కోపం వస్తే, దీనికి పూర్తిగా భిన్నమైన కొత్త వ్యక్తి మనకు కనబడును. ఈ కొత్త వ్యక్తి అదే దేహమును, అదే మనస్సును ఆక్రమించి సమాంతర జీవనమును గడుపుచున్నాడా యనిపించును. ఈతని మూలసంస్కారములు విలక్షణమైనవి. ఈతడు దేహేంద్రియాదులను స్వవశము చేసుకొనుననుటలో సందేహము లేదు. ఈ వ్యక్తి పరిస్థితిని తన అదుపులోనికి తీసుకున్న సమయములో సర్వము నష్టమగును. ఈ వ్యక్తిని ఈ శ్లోకము ప్రమాథిన్, అనగా దేహేంద్రియ మనస్సులను తన స్వాధీన మొనర్చుకొని కల్లోలమును సృజించు చండశాసనుడని వర్ణించినది.

క్రోధము ఈ తీరున సర్వమును తన వశము చేసుకున్నది గదా! దాని కంటె బలమైన శక్తిని వినియోగించి, దానిని ఏల లొంగదీయరాదు? ఇతరులు మనలు నియంత్రించగోరినప్పుడు, మనము ఇతరులను కూడ నియంత్రించగల్గుతాము. కావున, మనము క్రోధమును జయించుటకు కావలసిన బలమును, ఆయుధములను సమకూర్చుకున్నచో చాలును గదా! అనే శంక కలుగవచ్చును. కాని, ఈ బలసమీకరణము క్రోధము విషయములో పనికిరాదు. మనము ఎంత శక్తిని సమీకరించినా, ఈ ప్రమాథిని లొంగదీయుటకు సరిపడదు. మన శక్తి కంటె మనస్సు యొక్క శక్తియే సదా అధికముగా నుండును. బలవంతమగు ఈ మనస్సు మానవుని నియంత్రించగల్గును. దాని బలము చాల గొప్పది. వ్యక్తి దాని పట్టు నుండి విడిపించుకొనజాలడు. దానిని కళ్ళు గప్పి బయటపడుటయూ సంభవము కాదు.

అర్జునుడీ శ్లోకములో మనస్సును దృఢమ్ అని వర్ణించెను. అనగా, అది వ్యక్తిని, సిల్కు పురుగును చుట్టు వారి యున్న సిల్కు వలె, గట్టిగా పట్టుకొని తన అధీనములో నుంచుకొనును. సిల్కు పురుగు తగినంత పెరిగిన తరువాత మాత్రమే ఆ బంధము నుండి బయటపడగల్గును. దృఢమ్ అనగా గట్టిగా పాతుకుపోయినది అని కూడా వ్యాఖ్యానించవచ్చును. మనస్సునకు గల మూలములు చాల లోతుగా పాతుకుని యుండుటచే, దానిని ఊడబెరుకుటకు కావలసిన శక్తి ఎవ్వరికీ లేదు. సాధారణంగా తుఫాను చెట్లను వ్రేళ్లతో సహా ఊడబెరుకును. కాని ఈ మనస్సును తుఫానులు ఏమీ ఊడబెరుక జాలవు. మస్తిష్కములోని విక్షోభములు గాని, అంతఃప్రేరణలు గాని ఈ మనస్సు యొక్క మూలములను పెకలించజాలవు.

మనస్సు యొక్క మూలములు బాల్యము వరకు వ్యాపించి యుండును

మనస్సు యొక్క మూలములు బాల్యము నందు గలవు. మనస్సు బాల్యము నుండియూ అన్నిరకముల సమస్యలను ప్రోగుచేసుకొనును. బాల్యములో వ్యక్తికి పరిమితమగు ధారణలు,

అభిప్రాయములు ఉండును. వయస్సు పెరిగే కొలదీ కొత్త ధారణలు జతగూడును. ఈ విధంగా, మూలవ్యక్తిత్వము ఒకటి గలదు. దానికి అనేక అలంకారములు జతగూడును. ఇవన్నీ కలిసి మానవుని వ్యక్తిత్వము నిర్మాణమగును. దీనినే మనము మనస్సు అంటాము. అర్జునుడు ఇట్టి భావావేశయుతమగు మనస్సును గురించి ఈ శ్లోకములో చర్చించుచున్నాడు. ఈ మనస్సు దృఢమగు మూలములు కలిగియున్నదై, సర్వమును శాసించును. ఇట్టి మనస్సును నియంత్రించుట చాల క్లిష్టమైన పనియని (తస్య అహం నిగ్రహం మన్యే సుదుష్కరమ్) అర్జునుడు చెప్పుచున్నాడు.

దుష్కరము అనగా కఠినమైనది. సుదుష్కరము అనగా మిక్కిలి కఠినమైనది. మనస్సును నియంత్రించే యత్నము చేతితో గాలిని పట్టుకొనుట వంటిదని (వాయోరివ సుదుష్కరమ్) అర్జునుడు దృష్టాంతము నిచ్చెను. గాలిని పట్టుకొనుట సంభవము కాదు. కాన, గాలిని నియంత్రించజాలము. ఒకచో గాలిని బంధించు విధముగా, మనస్సును బంధించే ప్రయత్నమును చేయుట వ్యర్థము. ఏలయన, మనస్సు అట్లు బంధింపబడదు. మనము మనస్సును బంధించదలచిన స్థలమునకు బయటనే మనస్సు సర్వదా సంచరించును. మనస్సు మానవులను చాల దుఃఖమునకు గురిచేయును.

సాధారణంగా జరిగేదేమంటే – మనము మనస్సునకు మంత్రజపము వంటి పనిని ఒకదానిని అప్పజెప్తామనుకొనుడు. ఓ చంచలమగు మనసా! ఓంకారమును జపింపుము అని ఆదేశిస్తాము. మనస్సు అటులనే చేయుచున్నదని మనము అనుకుంటాము. కాని, కొద్దిసేపట్లోనే మనస్సు జపమును మాని ఎక్కడనో తిరుగాడుచున్నదని గ్రహిస్తాము. మనస్సు మనలను సుదూరము తీసుకొని పోవుటచే తత్పూర్వము చేయుచున్న పనిని కూడ మనము మరచెదము. మరియు, కాలమును కూడ మరచెదము. ధ్యానమును ఆరంభించిన కొద్దిసేపట్లోనే మనస్సు మనలను మోసగించి, ఎక్కడికో పారిపోతుంది. మనస్సు మిక్కిలి దుర్గ్రాహ్యమైనది. దానిని బంధింపగలిగే పంజరము లేదు. ఇందువలననే, మనస్సును కోతితో పోలుస్తారు.

మానసిక ఒత్తిడి మానసిక చంచలత్వములో భాగము కాదు

ఇట్టి కోతి వంటి మనస్సుతో ఏ పనిని చేయాలన్నా, కష్టమేనని అర్జునుడు చెప్పెను. అర్జునుడు జీవించిన కాలములో, మానసిక ఒత్తిడి ఈ కాలములో వలె చింతా జనకమగు సమస్యగా నుండెడిది కాదు. ఆ కాలములోని సమాజములో సామాజిక రుగ్మతలు ఇంచుమించు ఉండెడివి కావు. సమాజము ఇంచుమించు ప్రశాంతముగ నుండెడిది. అర్జునుడు హడావుడి లేని జీవితమును

గడిపెడి వాడు. ఈ కాలములో మనము విశ్రాంతి లేని యాంత్రిక జీవితమును గడుపుచున్నాము. కాని, ఆనాటి పరిస్థితి అది కాదు. అయినా, అతనికి ఒక మనస్సు గలదు. ఆ మనస్సు సంస్కారవంతమైనదే కావచ్చును. కాని, చంచలమైనది. అర్జునుని మనస్సు చంచలము అన్నచో, దుర్యోధనుని మనస్సు ఎట్లు ఉండెడిదో మనము ఊహించవచ్చును. అర్జునుడు సర్వదా శుద్ధజీవనమును, శంకకు చోటు లేని పవిత్ర జీవనమును గడిపెను. అతడు జీవితమును అధర్మమార్గములో గడుపలేదు. కావున, అతని మనస్సులో సంఘర్షణ లేదు. అతనికి అంతరంగములో తప్పు చేసితి నన్న భావన లేదు. కాన, అతడు సుఖముగా నిద్రించెడివాడు. కాని, దీనికి భిన్నంగా, దుర్యోధనుడు తల నుండి అరికాలి వరకు అధర్మముతో నిండియుండెను. కావున, అతనికి అధర్మమయమగు జీవనము వలన సంప్రాప్తమయ్యే సంఘర్షణలు తప్పవు.

ధర్మము, సచ్ఛీలము, ఉచిత జీవన మూల్యములు, మరియు గొప్ప విజయములతో కూడిన జీవనమును అర్జునుడు గడిపెను. కావున అతనికి దుఃఖించుటకు గాని, ఇతరులను ద్వేషించుటకు గాని కారణము లేదు. అతడు చేపట్టిన కార్యముల నన్నిటినీ విజయవంతముగా పూర్తిచేసెను. సమాజము అతనిని బిరుదములతో ముంచెత్తినది. మరో మాటలో చెప్పాలంటే, అతడు తన కాలములో వీరాధివీరుడు. అతడు తన జీవితమును గురించి, విజయముల గురించి గర్వించదగ్గ వ్యక్తి. మహాభారత సంగ్రామమునకు ముందు కూడా అతడు సమాజములో లబ్ధ ప్రతిష్ఠుడైన వ్యక్తి గా నుండెను. అతడు అనేక కళాకోవిదుడు. సంగీతము, నాట్యము, ధనుర్విద్య మరియు ఇతర శాస్త్రములలో అతడు సమర్థుడు. అతడు వీరాధివీరుడైన రాచబిడ్డ. ఇన్ని అర్హతలు ఉన్నా, అర్జునుని మనస్సు చంచలమే.

అర్జునుని సమస్య విశ్వజనీనము

అర్జునుని మనస్సులో కల్లోలము తక్క మరియొకటి లేకుండెను. ఆధునిక కాలములో మానసిక ఒత్తిడి అనే ఒక నూతన రుగ్మత ఆరంభమైన స్థితిలో, ఆధునిక మానవుని మనస్సును గురించి చెప్పునదేమున్నది? ఇరాన్ దేశములో ఏదో జరిగింది. మనము ఉదయమే ఆ వార్తను చదివి, స్నానానికు ముందుగనే మనస్సులో అశాంతిని నింపుకుంటాము. ఈనాటి కల్లోలిత ప్రపంచములో జీవించే వ్యక్తి ఎవరైననూ అర్జునుని సమస్యను తన సమస్యగా భావించి ఇదే ప్రశ్నను అడుగవచ్చును. ఇది లోక ప్రసిద్ధమైన సమస్య. శ్రీ శంకరులు కూడ అటులనే వాక్రుచ్చిరి. ఈ ప్రశ్న అర్జునుని కాలములో సుసంగతమైన ప్రశ్న. అటులనే శ్రీ శంకరుల కాలములో, మరియు నేటి కాలములో కూడ సుసంగతమైన ప్రశ్నయే. భవిష్యత్తులో కూడ ఇది సుసంగతముగనే ఉండగలదు. కాలము

లేపైనా, మనస్సు యొక్క చంచల స్వభావములో మార్పు లేదు. కావున, మానవుడు మనస్సు యొక్క చంచల రీతులను శ్రద్ధతో పరిశీలించి, దానిపై కొంత నియంత్రణము సంపాదించవలెను.

మనస్సును నియమించుట యెట్లు? అను అర్జునుని ప్రశ్నకు శ్రీకృష్ణభగవానుడు తరువాతి శ్లోకములో ప్రత్యుత్తరమిచ్చినాడు:

అధ్యాయము 6, శ్లోకము 35:

श्री भगवानुवाच
असंशयं महाबाहो मनो दुर्निग्रहं चलम् ।
अभ्यासेन तु कौन्तेय वैराग्येण च गृह्यते ॥ ३५ ॥

శ్రీ భగవానువాచ
అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్
అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే (35)

శ్రీ భగవాన్ = శ్రీ కృష్ణభగవానుడు; **ఉవాచ** = పలికెను; **మహాబాహో** = గొప్ప బాహువులు గలవాడా!; **మనః** = మనస్సు; **దుర్నిగ్రహం** = నియంత్రించుటకు మిక్కిలి కష్టమైనది; **చలం** = చంచలమైనది; **అసంశయం** = సందేహము లేదు; **తు** = కాని; **కౌంతేయ** = ఓ కుంతీపుత్రా! (అర్జునా!); **అభ్యాసేన** = అభ్యాసము చేత; **చ** = మరియు; **వైరాగ్యేణ** = వైరాగ్యము చేత; **గృహ్యతే** = నియంత్రింపబడును.

శ్రీ కృష్ణభగవానుడిట్లు పలికెను –

> గొప్ప బాహువులు గల ఓ అర్జునా! మనస్సు నియంత్రించుటకు మిక్కిలి కష్టమైనది, చంచలమైనది. సందేహము లేదు. కాని, ఓ కుంతీపుత్రా! అభ్యాసముచేత, మరియు వైరాగ్యము చేత నియంత్రింపబడును (35).

శ్రీకృష్ణుడీ శ్లోకములో అర్జునుని గొప్ప బాహువులు గలవాడా (మహాబాహో) అని సంబోధించెను. అర్జునుడు గొప్ప యోద్ధ, మహాబలశాలి. కాని అతడు శరీరబలముతో బాటు మనో నియంత్రణము కూడ పొందవలసి యున్నది. ఇతరులను తన్నుటకు శరీరబలము అక్కరకు వచ్చును.

కాని, ఈ బలము చంచలమగు మనస్సును అదుపులో పెట్టుకు పనికిరాదు. మనస్సు చంచలమనుటలో సందేహము లేదని (అసంశయమ్) యు, దానిని నియంత్రించుట కష్టమనియు శ్రీకృష్ణుడీ శ్లోకములో ధ్రువీకరించుచున్నాడు.

మనస్సు చంచలము కాదని ఎవరు అనగలరు? మనస్సు చంచలము అని గుర్తించినచో, యుద్ధములో సగము నెగ్గినట్లే. ఒక వ్యక్తి నాతో మనస్సు ఉత్తేజితముగా యున్నదని చెప్పినాడనుకొనుడు. 'ఉత్తేజితుడగుట మంచిది కానే కాదు. దానివలన ఏదీ పరిష్కారము కాదు. కావున, ఉత్తేజితుడవు కావద్దు' అని నేను చెప్పితిననుకొనుడు. అవుడాతడు మరింత ఉత్తేజితడుగును! అంతకంటె వేరు ప్రయోజనమేమియు ఉండదు. ఇట్టి సలహా వలన లాభమేమి? ఉత్తేజితుడు కావాలనే సరదా ఎవ్వరికీ ఉండదు. కాన, ఇట్టి సలహాలు వ్యర్థము. నీవు ఉత్తేజితుడవు కావద్దు అనే సలహా వలన ఒరిగేది ఏమీ లేదు. దీనికి భిన్నంగా, ఉత్తేజితమగుట మనస్సునకు స్వభావమని గుర్తించినచో, యుద్ధమును సగము నెగ్గినట్లే యగును.

అంగీకరించుట మొదటి ముందడుగు

మద్యపాన వ్యసనమును మానుటకు సహకరించే సంస్థ ఒకటి (Alcoholics Anonymous) గలదు. వారు ఒక కార్య ప్రణాళికను అమలు చేస్తారు. నాకు మద్యముపై నియంత్రణ లేదు అని వ్యక్తి అంగీకరించుట ఈ ప్రణాళికలోని మొదటి అంశము. ఇట్లు అంగీకరించని వ్యక్తి ఆ దురలవాటు నుండి బయటపడజాలడు. ఇది మద్యమునకు మాత్రమే గాక, సర్వ విషయములకు సమానముగా వర్తించును. మనకు క్రోధముపై అధికారము లేదు. చంచలమగు మనస్సుపై అధికారము లేదు. ఈ సత్యమును వ్యక్తి అంగీకరించినచో, సగము యుద్ధమును నెగ్గినట్లు అగును.

'మనస్సు యొక్క స్వరూపము కల్లోలము, చంచలత' అనే గొప్ప మనోవైజ్ఞానిక సత్యమును శ్రీకృష్ణ భగవానుడు స్వీకరించినాడు. చంచలతను నివారించుటకు యత్నించుట వ్యర్థము. మనస్సు యొక్క స్వభావము చంచలత అని అంగీకరించిన చాలును. ఈ కల్లోల స్వభావమును గురించి కల్లోలపడవలదు. దీనిని పరిష్కరించగలమని భావించుటచే కల్లోలము మరింత పెరుగును. మరియు, నా మనస్సు చాల విచిత్రమైనది అని ప్రతివ్యక్తి అనుకుంటాడు. అది సరిగాదు. సర్వ మానవుల మనస్సులు చంచలములే. మనస్సు సంతత పరివర్తన శీలము. కావ, చంచలత మనస్సు యొక్క సహజగుణము. ఒకే ఒక ఆలోచన గల మనస్సు ఉన్నదనుకొనుడు. ఒకే ఒక ఆలోచన గలదు. అనగా మనస్సు ఇతరమును దేనినీ దర్శించలేదు. మనస్సు ఒక చెట్టును చూచిన దనుకొనుడు. గంట

తరువాత కూడ అదే చెట్టు మనస్సులో నున్నచో, వ్యక్తులు, వాహనములు ఇత్యాది ఇతరము సర్వము ఆ మనస్సునకు గోచరించదు. అట్టి మనస్సుతో జీవించుట సంభవము కాదు.

మనస్సు తప్పనిసరిగా మారుతూ ఉండాలి. సినిమాలో రీలు ఒక నిర్దిష్ట వేగంలో సదా తిరుగుతూ ఉన్నప్పుడు మాత్రమే మనము వస్తువులను, వాటి కదలికలను చూడగల్గుతాము. అటులనే, మనము జగత్తును చూడగలగాలంటే, మనస్సు సదా పరివర్తన చెందుతూ ఉండాలి. ఇందువలననే మనస్సు క్షణికము అని చెప్పబడినది. ప్రతి ఆలోచనయూ క్షణికమే. అనగా, అది ఒక సెకను కాలము కూడ నిలబడదు. ఒక సెకనులో అనేక భాగములు గలవు. ఆ కాలములో అనేక మార్పులు వచ్చును. క్షణికమనగా నిదియే. మనోవృత్తుల స్వభావమిట్లుండును. ఈ సత్యమును గ్రహించుటకైననూ, మనస్సు పరివర్తనశీలమై ఉండాలి.

మనస్సు యొక్క స్వభావము క్షణికత కావున, అది పరివర్తన చెందుట సహజమే. 'అర్జునా! సందేహమేమియూ లేదు; మనస్సు చలము, చంచలము' అని శ్రీకృష్ణుడు చెప్పుటకు కారణమిదియే. చలం అనగా కల్లోలితము అని యర్థము. అది చలము గనుకనే దానిని నియంత్రించుట కష్టము (మనః దుర్నిగ్రహం చలమ్) అని కూడ ఆయన చెప్పెను. అనగా, వాయువును బంధించుట ఎట్లో మనస్సును నియంత్రించుట కూడ అటులనే దుస్సాధ్యమని అర్జునుడు మనస్సును గురించి చేసిన వర్ణనతో శ్రీకృష్ణుడు అంగీకరించినట్లే. అర్జునుడు చెప్పినదానిని శ్రీకృష్ణుడు పునరుద్ఘాటించి, మనస్సు యొక్క చంచల స్వభావమును యథాతథముగా అంగీకరించవలయు నని సూచించెను. మనస్సు చంచలము. దానికి స్వీయమూలములు గలవు. అట్లు ఉండుట యుక్తి యుక్తమే. కావున, మనస్సునకు చంచలత అసంగతము కాదని మనము అంగీకరించవలెను.

మనస్సు పరిస్థితి అసంగతమైనదని మనము సర్వదా అనుకుంటాము. కాని, అది సరిగాదు. మనస్సు కూడ దాని పరిధిలో సుసంగతమైనదియే. మనకు మనస్సులో హఠాత్తుగా ఒక వస్తువు తలపునకు వచ్చినదనుకొనుడు. ఈ తలపు హఠాత్తుగా శూన్యము నుండి ఊడిపడినదని మనము అనుకుంటాము. కాని అది శూన్యము నుండి రాలేదు. దానికి ఒక మూలము గలదు. అనగా అది యుక్తి సంగతమే గదా! కాని ప్రత్యేక ఘటనలేమియూ జరుగకుండగనే, సర్వము ప్రశాంతముగ నున్నప్పుడు, ఈ ఆలోచన హఠాత్తుగా వచ్చుటకు కారణమేమి? దీనిని బట్టి, ఒక ఆలోచన వచ్చుటకు బాహ్యపరిస్థితుల ప్రమేయము లేదని తేలినది. ఇట్టి ఆలోచనలు హఠాత్తుగా వచ్చుటకు లోపల జరిగే ప్రక్రియ చాలును! ధ్యానము చేయుచుండగా హఠాత్తుగా మామిడిపళ్లు గుర్తుకు వచ్చినవనుకొనుడు.

అట్లు గుర్తుకు వచ్చుటకు కారణమేమి? నేనిప్పుడు మీతో మాటలాడుచుండగా, నాకు ఈ మామిడిపళ్లు ఏల గుర్తుకు రావలెను? దానికి ఒక హేతువు ఉండి తీరును. కాబట్టి, హఠాత్తుగా వచ్చే ఈ ఆలోచన లన్నింటికీ హేతువులు ఉండును.

ఈ జగత్తులో అసంగతమేదియూ లేదు. సర్వము నందు ఏదో ఒక హేతువు ఉన్నది. ఈ సంసారమునకు మూలములో యుక్తి లేని మాట వాస్తవమే. కాని, ఆ తరువాత సర్వము యుక్తి సంగతమే. మూలములో యుక్తి రహితమగు సంసారము లోపల మరల సంగతి (సంబద్ధత) గలదు. అనగా, ఒక ఘటన జరిగితే, దానికి హేతువు ఉండును. కావున, మనస్సు కూడ యుక్తి యుక్తమేననియు, చంచలత్వము దాని స్వభావమనియు తెలుసుకొనవలెను.

దీని యర్థమేమి? మనము మనస్సును యథాతథముగా వదిలివేయవలెనా? అవును. చంచలత్వము మనస్సు యొక్క స్వభావము. దానిని మనము విస్మరించవలెను. మనస్సు యొక్క స్వభావమగు చంచలత్వమును ఆత్మ యందు ఆరోపించుటయే యథార్థమైన సమస్య. కావున, మనస్సునకు, ఆత్మ (నేను)కు మధ్య గల దూరమును మనము దర్శించుటను నేర్చుకొనవలెను. దీనిలో ఉన్న ఇంద్రజాలము ఇంత మాత్రమే. ఇందువలననే, మనస్సును అభ్యాసము చేత, వైరాగ్యము (యథార్థ దర్శిత్వము) చేత నియంత్రించవలెనని శ్రీకృష్ణుడు అర్జునునితో చెప్పుచున్నాడు.

అంతరంగములోని బాలుని లాలించుట

శ్రీకృష్ణుడు అర్జునుని కుంతీపుత్రా! (కౌంతేయ) అని సంబోధించుట ద్వారా, అర్జునునిలో ఇంకను బాలుడు ఉన్నాడని సూచించెను. మనస్సు యొక్క మూలములు ఆ బాలుని యందు గలవు. మానవుడు తనలో నున్న శిశువును సంరక్షించవలెను. అంటే, రెండు రకముల శిశు సంరక్షణ ఆవశ్యకమగుచున్నది. వ్యక్తి శిశువుగా నున్నప్పుడు మరియొకరు సంరక్షించినారు. కాని, ఇప్పుడు వ్యక్తి తన అంతరంగములోని శిశువును తానే సంరక్షించుకోవాలి. మొదటి శిశు సంరక్షణము తల్లిదండ్రులు, లేదా ఇతర పెద్దలు చేసియున్నారు. కాని, ఈ వ్యక్తి తనంత తానుగా ఈ శిశు సంరక్షణను నిర్వహించుకోవాలి. ప్రతి వ్యక్తి అంతరంగములో శిశువు గలడు. ఆ శిశువును సంరక్షించవలసిన ఆవశ్యకత గలదు. దీనికి అపవాదము ఎవ్వరూ లేరు.

ప్రతి వ్యక్తికీ అంతరంగములో నిరాశోపహతుడగు శిశువు ఉండును. 'నా తల్లికి నా యందు ప్రేమ లేదు; నా తండ్రి నన్ను ద్వేషించును' ఇత్యాది ధారణలు ఆ శిశువునకు ఉండును. బాల్యంలో

తల్లిదండ్రులు మొదలగు వారి ప్రవర్తన కారణంగా ఏర్పడిన ఈ ధారణలలో కొంత సత్యము గలదు. ఇందువలననే, వ్యక్తి అంతరంగములో శిశువు నెలకొని యుండును. అంతరంగములోని ఈ శిశువు రోదించుచుండును. వ్యక్తికి 35 సంవత్సరముల వయస్సు దాటిన తరువాత వ్యక్తిలోని ఈ శిశువు కారణంగా అతని మనస్సు హఠాత్తుగా ఉత్తేజితమగును. ఈ వయస్సులో అంతరంగ శిశువునకు గల నిరాశా ధారణలన్నియూ ఒకదాని తరువాత మరియొకటి బయటకు వచ్చును. దీనికి తోడు వేదాంతమును పఠించనారంభించినచో, ఈ ధారణలు సర్వము బహిర్గతమగును।

వేదాంతములో సాధకుడు తనను తాను దర్శించే అవకాశమును పొందును. వేదాంతమును అధ్యయనము చేయనంత వరకు మానవుడు కేవలము ఇతరమును మాత్రమే చూచును. కాని వేదాంతాధ్యయనములో సాధకుడు ప్రప్రథమంగా తనను తాను దర్శించును. అపుడు అంతరంగములోని శిశువు బయటపడును. ఈ శిశువును సంరక్షించుటకు ఇంతకంటె ఉత్తమ కాలము ఏది ఉండును? ఈ శిశువును సంరక్షించాలి. అట్లు చేయనిచో, డెబ్బది ఐదు సంవత్సరముల వయస్సు వచ్చినా, వ్యక్తి ఇంకనూ శిశువుగనే ఉండును. అర్జునుని కౌంతేయ అని సంబోధించుటలో శ్రీకృష్ణుని తాత్పర్యమిదియే. శ్రీకృష్ణుడు అర్జునుని 'మహాబాహో' అని ప్రౌఢయోగ్యముగా సంబోధించి, తరువాత అతనిని 'కౌంతేయ' అని సంబోధించుట ద్వారా, అంతరంగమునందలి శిశువును సంరక్షించవలసిన ఆవశ్యకతను సూచించెను.

శ్రీకృష్ణుడు అర్జునునకు మనస్సును నియంత్రించు ఉపాయమును బోధించెను. అభ్యాస వైరాగ్యములచే మనస్సును నియంత్రించవచ్చును (అభ్యాసేన వైరాగ్యేణ చ గృహ్యతే). అభ్యాసమనగా నేమి? శ్రీకృష్ణుడు ఇంతకు ముందు చర్చించిన ధ్యానయోగమే ఈ అభ్యాసము. దీనివలన సాధకుడు తనకు, తన మనస్సునకు మధ్య కొంత దూరమును పొందగల్గును. ఇట్టి దూరము ఉండుట వలన సాధకుడు తనను తాను సకారాత్మకముగా, యథాతథముగా దర్శించగల్గును. సాధకుడు ఆత్మ (నేను) యొక్క స్వరూపమును దర్శించగల్గును. మనోవృత్తులన్నియూ నిశ్చితముగా ఆత్మయేననియు, కాని ఆత్మ మనోవృత్తుల నుండి విముక్తమనియు సాధకుడు దర్శించగల్గును. ఈ సత్యమును తన అంతరంగములో సుస్పష్టముగా అధికాధికముగా దర్శించుటయే అభ్యాసము. మనోవృత్తులు నేనే. కాని నేను మనోవృత్తులు కాదు అను విశిష్ట దర్శనమునకు నిదిధ్యాసనమని పేరు. ఒకే పనిని పునః పునః చేయుట అభ్యాసమనబడును. అభ్యాసము వలన మనస్సుపై నియంత్రణ ఏర్పడును (అభ్యాసేన గృహ్యతే).

జపమును అభ్యసించుట

ఇచట జపము యొక్క అభ్యాసమును కూడ స్వీకరించవచ్చును. మనస్సు యొక్క స్వభావము మనకు ముందుగా తెలిసే అవకాశము లేదు గనుక, రాబోవు క్షణములో మనస్సు ఎటులైననూ ఉండవచ్చును. మరుక్షణములోని మనోవృత్తి ఏదైననూ కావచ్చును. రాబోవు క్షణములోని మనస్సు మన ఊహకు అందనిది గనుక, మనము తెలియగలిగే పరిస్థితిని సృష్టించవలెను. అనగా మనస్సుపైన, దాని ఆలోచనా ధోరణి పైన, దాని చలనముపైన ఒక విశిష్టమగు నియంత్రణను సంపాదించుట ద్వారా మనము రాబోవు మనోవృత్తులను ఊహించగల్గుతాము. ఇందువలననే, సన్న్యాసి కూడా జపమును వీడకుండా చేసి తీరాలి. జపములో ఒక నామము, ఒక పదము, లేదా ఒక వాక్యము మానసికముగా పునః పునః అభ్యాసము చేయబడును.

మంత్రము యొక్క ప్రయోజనము

బ్రహ్మచారికి ఒక మంత్రము ఉండును. గృహస్థునకు ఒక మంత్రము ఉండును. వానప్రస్థునకు ఒక మంత్రము ఉండును. సన్న్యాసికి కూడ ఒక మంత్రము ఉండును. ప్రతి వ్యక్తికీ అర్థవంతమగు ఒకానొక పదము (మంత్రము) ఉండును. ఇట్టి పదము లేనివాడు ఉండడు. ఈ పదము గురువు ఇచ్చినది కావచ్చును. లేదా, స్వయముగా ఎన్నుకున్నది కావచ్చును. ఇట్టి మంత్రమునకు వ్యక్తి జీవితములో ప్రాముఖ్యము గలదు. మనస్సుపై కొంత నియంత్రణను సంపాదించుటలో ఇట్టి పదములు ఉపకరించును. ఇందువలననే, అన్ని సంప్రదాయముల వారు ఏదో ఒక జపమును చేయుదురు. మరుక్షణములో మనస్సులో జరుగబోవు దానిని ఖచ్చితంగా తెలుసుకునే శక్తిని మానవుడు జపము వలన పొందును. మనస్సులో మరుక్షణంలో రాబోవు స్థితులను ఊహింపగలిగే ఏకైక పరిస్థితి జపము మాత్రమే.

మనము ఒక వస్తువును గురించి ఆలోచించే సందర్భములో నైననూ, మనస్సులో మరుక్షణములో ఉదయించబోయే ఆలోచన ఏదియో మనకు తెలియదు. మనము ఒక విషయమును ఏకాగ్రముగా విచారించవలెననే నిర్ణయమును తీసుకొనగలము. కాని, ఆ విచారము ఏ దిశలో కొనసాగునో అను విషయము మనకు స్పష్టముగా తెలియదు. దీనికి భిన్నంగా, మంత్రమును పునః పునః ఉచ్చరించే జపములో మనస్సునకు ఒక స్థిరమైన పని ఉంటుంది. దీని ద్వారా మనకు మనస్సుపై నియంత్రణ లభిస్తుంది. మనస్సు మరో విషయము పైకి మరలగానే, మనకు ఆ సంగతి అవగతమై, మనము దానిని పునః పునః ధ్యేయవస్తువు వైపు మరల్చెదము.

మనస్సును ఆత్మయందు స్థిరముగా నుండునట్లు (ఆత్మ సంస్థమ్) చేయుటకై, ఆత్మ ఇచ్చట ధ్యేయవస్తువా యన్నట్లు ప్రదర్శింపబడినది. ఇట్టి ఉపదేశానురూపమగు ధ్యానము అభ్యాసమని ఇచట చెప్పబడినది.

సంస్కృత వ్యాకరణములో ఒకే పదమును మరల ఉచ్చరించుట అభ్యాసమనబడును. అభ్యాసము వలన మనస్సు యొక్క తీరు తెన్నులు మనకు అవగతమగును. మనస్సును గురించి మనకు సూక్ష్మదృష్టి అలవడును. ప్రస్తుత అభ్యాసములో, మనో విక్షేపములో విషయమగు వస్తువు కూడ ధ్యేయ వస్తువు అగు విధమును మనము చర్చింపయున్నాము. మనస్సు దేనిపై ప్రసరిస్తే, అదియే నాకు ధ్యేయవస్తువు అగును (యత్ర యత్ర మనోయాతి తత్ర తత్ర సమాధయః). వస్తువు యొక్క మూలాధిష్ఠానమైన ఆత్మ తత్త్వమును దర్శించు వ్యక్తికి ఒక వస్తువు నుండి మరొక వస్తువునకు మనస్సు గెంతుతూ ఉండే ఇట్టి విక్షేపము కూడా ధ్యానమే యగును. కావున, అట్టి వానికి యథార్థమగు విక్షేపము (distraction) ఉండనే ఉండదు.

నిదిధ్యాసనమనగా వస్తుయాథార్థ్య వివేకమే

ఈ విధముగా, మనోవృత్తి (thought)కి, ఆత్మకు గల దూరము సుస్పష్టమగును. ఇది మనోవృత్తి అని వివిక్తముగా భాసించును. కాని, మనోవృత్తియే సర్వము కాదు. మనోవృత్తి యందు ఆత్మ సమ్మిళితమై దానిని చైతన్యవంతము చేయును అని స్పష్టమగును. సాధకుడు తన ఏకాగ్రతను ఆత్మ వైపునకు మరల్చినపుడు అది నిదిధ్యాసనమగును. సాధకుడు ఆత్మను మనోవృత్తి కంటె విలక్షణముగా గుర్తించవలెను. ఈ గుర్తింపు పెరిగే కొలంది, సాధకునికి మనోవృత్తి కేవలము ఒక భూమిక (role) మాత్రమే అగును. మనోవృత్తులే సర్వము అనే భ్రాంతి దూరమగును. సాధకుడు ఆత్మకు, మనోవృత్తికి మధ్యగల ఈ దూరమును గుర్తించవలెను. ఈ దూరము స్థూలదృష్ట్యా ఉండే దూరము గాని, ఒక విశిష్ట మానసిక అవస్థ గాని కాదు. ఈ దూరము ఒక అంతర సాక్షాత్కారము. ఈ సాక్షాత్కారమే సత్యము. ఇట్టి అభ్యాసము సాధకునకు మనస్సును నియంత్రించే సామర్థ్యమునిచ్చు నని శ్రీకృష్ణుడు చెప్పెను.

మనస్సు చంచలముగా నుండుటకు కారణమేమి?

మనస్సు తనలో తాను స్థిరముగా నుండునట్లు చేయుటకు శ్రీకృష్ణుడీ శ్లోకములో వైరాగ్యమనే రెండవ సాధనమును ఉపదేశించెను. కాని, మనస్సునకు ఇటునటు తిరుగాడే

చంచలత్వమేల కలిగినది? ఈ విషయమును మనము ముందుగా పరిశీలించాలి. మనస్సు అభిరుచి లేని వస్తువును విడనాడి, మరియొక చోటికి పారిపోవును; అధికమైన అభిరుచి కలిగి ఉత్తేజము నిచ్చే వస్తువుపైకి మరలిపోవుట మనస్సు యొక్క స్వభావము. ఈ స్వభావము వలన మనస్సు మన ప్రయత్నము లేకుండగనే దానికి అభిరుచి గల పదార్థముల పైకి మరలిపోవుచుండును. అందువలన, అది ఒక వస్తువుపై స్థిరముగా లగ్నము కాకుండును.

మనస్సు ప్రియమైన వస్తువుల మీద మాత్రమే గాక; దుఃఖమును కలిగించు వస్తువులపై కూడ ప్రసరించును. పీడను కలిగించు వస్తువుపై, లేదా పరిస్థితిపై ధ్యానము లగ్నమగుట సహజమే గదా! ఈ రెండు అంశములపై మనస్సు మన ప్రయత్నము లేకుండగనే లగ్నమగును. ఎందువలన? మనస్సునకు మొదటి దానిపై మక్కువ. రెండవది మనస్సు యొక్క ధ్యానమును అపేక్షిస్తుంది. ప్రేమకు అస్పదమైన వస్తువు లభించినపుడు ఒక విలక్షణమగు ఉల్లాసము కలుగును. కావున, మనస్సు సహజముగా అట్టి వస్తువునందు లగ్నమగును. అంతేగాక, మనకు పీడను కలిగించిన, కలిగిస్తున్న వస్తువులపై కూడా మనస్సు అతి సహజముగా లగ్నమగును. మొదటిది సకారాత్మక ప్రక్రియ కాగా, రెండవది నకారాత్మక ప్రతిక్రియ.

పీడాకరములగు వస్తువులపై మనస్సు ప్రసరించకుండగా అభ్యాసము అవును. ప్రేమాస్పదములగు వస్తువులపై మనస్సు ప్రసరించకుండగా వైరాగ్యము అవును. అభ్యాసము వలన వ్యక్తిలో పీడకు, తనకు మధ్య కొంత దూరము నిర్మాణమగును. దీనికి కొంత సమయము పట్టును. అన్ని విధముల సుఖ కామనలు, రక్షణ కామనలు శోభనాధ్యాస నుండి పుట్టును. దీనిని తొలగించుటకై ఇచట వైరాగ్యము ప్రత్యేకముగా వర్ణించబడినది. మనము ప్రపంచములో వివిధ వస్తువులకు కొన్ని విశేష గుణములను ఆరోపించి, ఆ వస్తువులు మనకు సుఖమును, రక్షణను ఇచ్చునని భావిస్తాము. దీనికే శోభనాధ్యాస యని పేరు. ఒక వస్తువు నాకు భద్రతను అధికము చేయును అను ధారణ మనము వస్తువులపై ఆరోపించు గుణమునకు దృష్టాంతము. 'దీనిని సాధించుట వలన నేను గొప్పవాడి నగుదును; నా పరిస్థితి మెరుగుపడును' అను ధారణ కూడ ఇట్టిదియే. 'దీని వలన నేను ముందుగా ఇతరులకు, తరువాత నాకు అంగీకార యోగ్యుడవగుదును' అను ధారణ కూడ శోభనాధ్యాసయే.

మనము ఇతరుల మెప్పును కోరుటకు కారణమేమి?

మానవుడు తన మెప్పును తాను కోరును. కాని, దానిని ఇతరుల ద్వారా కోరును. అనగా తన మెప్పును తాను పొందుటకై ఇతరుల మెప్పును కోరును. ఇతరులు నిన్ను ఏల

మెచ్చుకొనవలెను? నిన్ను నీవు మెచ్చుకొనగలందులకై, ఇతరుల మెప్పు నీకు అవశ్యకమగుచున్నది. కావున, నీవు ఇతరుల మెప్పుకొరకు యత్నించెదవు. అది లభించని నాడు, నీవు నీకు అంగీకార యోగ్యుడవు కావు. ఈ సమస్యకు వాస్తవమగు పరిష్కారమేమనగా, ఆత్మ అంగీకార యోగ్యమా? కాదా? అను విషయమును కనుగొనే ప్రయత్నమును నీవు చేయవలెను.

తనకు తాను మెప్పును పొందే ఈ ప్రయత్నంలో వ్యక్తి కొన్ని వస్తువులపై కొన్ని గుణములను ఆరోపిస్తాడు. ఒక వస్తువు వాస్తవంగా ఈయగలిగిన దాని కంటె అధికంగా ఇస్తుందని భ్రమిస్తాడు. వస్తువునందు ఈ విధంగా ఆరోపింపబడే గుణము ఆరోపించే వ్యక్తి దృష్టిలో అభిలషణీయమైన గుణమైనచో, దానికి శోభనా ధ్యాస యని పేరు. శోభనమనగా ఉల్లాసకరమైనది అని యర్థము. ఉల్లాసకరమగు వస్తువు నందు మానవునకు సమ్మోహనము, అంధప్రేమ ఉండును. ఈ అంధప్రేమ, సమ్మోహములు శోభనాధ్యాస తక్క మరియొకటి గాదు.

వైరాగ్యమనగా వాస్తవికత

వైరాగ్యమనగా ఇట్టి శోభనాధ్యాస లేకుండుట. ఒక వస్తువునకు గల వాస్తవిక గుణములను, దానిపై ఆరోపింపబడిన విషయినిష్ఠ (subjective) గుణముల నుండి వేరుచేసే శక్తి వైరాగ్యము వలన లభించును. వస్తువులపై ఆరోపింపబడిన గుణములను ఆరోపితములుగా తెలుసుకున్న నాడు, వస్తువునకు వ్యక్తి ఇచ్చిన అతిశయించిన స్థాయి దాని వాస్తవిక స్థాయికి తగ్గును.

ఉదాహరణకు, ధనము లేనిచో వ్యక్తి దేనికీ పనికిరాడు. అని మనము అనుకుంటాము. వాస్తవంలో, ధనము లేనిచో వ్యక్తి నిర్ధనుడు మాత్రమే అగును. ఇది యథార్థము. ధనము లేని వ్యక్తి వస్తువులను కొనలేడు. ఇది మరియొక వాస్తవము. దీని ననుసరించి మరికొన్ని వాస్తవములు గలవు. వస్తువులను ధనమిచ్చి కొనలేకపోవుటయే గాదు. నిర్ధనుడు అప్పును తీర్చలేడు గనుక, అట్టి వానికి అప్పు కూడ పుట్టదు. అరువుపై ఒకసారి వస్తువులను కొని, ఆ ధనమును చెల్లించనిచో, మరల రెండవసారి అరువు దొరకదు. ధనమును చెల్లించలేని వానికి అరువును ఎవరిస్తారు? కాగా, ఇట్టి వాస్తవములు అనంతములుగా గలవు.

కాని, నేను దేనికీ పనికిరాను అనేది వాస్తవము గాదు. అది ఆరోపము మాత్రమే. సమాజములో మానవులు ధనమును భయభక్తులతో గౌరవిస్తారు. అట్టి సమాజములో పెరిగిన వ్యక్తి మనస్సులో ఆ భావనలు దృఢముగా నెలకొనును. అట్టి వ్యక్తి యొక్క దృష్టి కోణములో సఫలతను గురించి

రూఢిబద్ధమగు(stereotype) ధారణలు ఉండును. కనుక, అట్టి వ్యక్తిలో తనవైఫల్యమును గురించి ప్రగాఢమగు భావనలు నెలకొనియుండును.

ఇట్టి సమాజములో వ్యక్తి యొక్క సఫలతకు ధనము కొలబద్దగా నుండును. వాస్తవంలో, ధనమునకు ఇంతటి విలువ నిచ్చుట పొరపాటు. బందిపోటు దొంగల వద్ద, ధనము కొరకు హత్యలను చేయువారి వద్ద కూడా చాల ధనము ఉండును. వ్యక్తి ధనము కలిగియున్న కారణంగా సఫలత కలవాడని నిర్ణయించుట సరిగాదు. కాని, ప్రపంచములోని కొన్ని సమాజములలో పరిస్థితులు ఇటులనే యుండును.

దీనికి భిన్నంగా, ధనము లేకుండుట అద్భుతమైన విషయమునే మరియొక ధారణ గలదు. ఈ దృష్టికోణం ప్రకారంగా, వ్యక్తి ధనము లేకుండగా జీవించగలగాలి. కావున, ఇట్టి ధారణ గలవాడు ధనము లేకుండా జీవించు వ్యక్తిని, వీధులలో తిరుగాడే బిచ్చగాండ్రను గొప్పవారని స్తుతిస్తారు. ఈ ధారణ కూడా హాస్యాస్పదమైనదే. ఈ రెండు రకముల ధారణలలో ధనముపై ఒక విశిష్ట విలువ ఆరోపింపబడినది. ఇది ఒక సమస్య. ధనము తనంత తానుగా సమస్య కాదు. ధనము ధనము మాత్రమే. అది సమస్యా కాదు; పరిష్కారమూ కాదు. ధనము కూడ ఇతర వస్తువుల వలె కొన్ని సమస్యలను పరిష్కరించగలదు. పళ్లు కుట్టుకునే పుల్ల కూడా కొన్ని సమస్యలను పరిష్కరించగలదు.

గుణారోపణము బుద్ధి పూర్వకము కాదు

కావున, సమస్య అన్నిటికీ ధనము మూలమని తలంచుట సరిగాదు. ధనమునందు వాస్తవముగా లేని గుణములను వ్యక్తి బుద్ధిపూర్వకముగా ఆరోపించుట లేదు. ఈ ఆరోపణము (superimposition) వ్యక్తి యొక్క అంతరంగము నందు నాటుకొని యున్నది. అతడు పెరిగిన సామాజికపరిస్థితుల ప్రభావము అతని మనస్సుపై దృఢముగా నుండుటచే ఈ ధారణలు నిర్మాణమైనవి. ధనమును ధనముగా చూడాలి. అంతకంటె అధికముగా చూడరాదు. అట్లు చేయుట వలన ఈ శోధనా ధ్యాన ప్రభావహీనము అగును. ధనమునకు విలువ లేదు అను మాట కూడ అధ్యాసయే. అట్లన్నచో, అది యథార్థ దర్శనము కాజాలదు. అటులనే, ధనమునకు లేని లక్షణమును దాని యందారోపించుట కూడా అధ్యాసయే. వస్తువులకు వాటికి వాస్తవముగా గల స్థాయిని, విలువను ఇచ్చినచో చాలును. అట్లు చేసిన వ్యక్తి యందు ఒక విశిష్టమగు అనాసక్తత నిర్మాణమగును. అదియే వైరాగ్యము.

తాను చేసే నిర్ణయాలలో వాస్తవికత (objectivity) గల వ్యక్తి అనాసక్తుడనబడును. ఈ వాస్తవికత అనే దృష్టి కోణంలో వైరాగ్యమును అర్థం చేసుకోవాలి. వైరాగ్య శబ్దార్థమును సరిగా తెలుసుకోని పక్షంలో సమస్యలు మరింత జటిలమగును. వైరాగ్యమనగా కోర్కెలు లేకుండుట గాదు. అట్లు భావించినచో, ప్రతి కోరిక కొత్త సమస్యలకు నాందియగును. మనమిచట కొన్ని ఆదర్శములను నిర్మించు యత్నమును చేయుట లేదు. అట్లు చేయుట వలన, మనకు మనమే దూరమగుదుము. కావున, ఇచట మనకు గల భ్రాంతులు మరింత జటిలము కానట్లు శ్రద్ధ వహించవలెను. వైరాగ్యమనగా శోభనాధ్యాసతో సమ్మిళితమైన కామనలు లేకుండుట. శోభనాధ్యాసను ప్రభావహీనము చేసి, పరిస్థితులను సరిగా అంచనా వేసినచో, వైరాగ్యము సిద్ధించును.

అధ్యాస (superimposition)ను ప్రభావహీనము చేయువలెను

మనకు ఒక వస్తువు నందు గల ప్రీతి శీఘ్రమే సమ్మోహముగా పరిణమించి, సమస్యలను తెచ్చి యిచ్చును. అతిగా ప్రేమించే వ్యక్తుల గురించి పుస్తకములు వ్రాయబడినవి. అట్టివారు దేనినీ ప్రేమించజాలరు. వారు తమకు ప్రియమైన వస్తువులపై వాస్తవిక దృష్టిని అవలంబింప జాలరు. అది వారికి ఒక సమస్యగా తయారగును. వ్యక్తికి తాను ప్రేమించే వస్తువుపై సమ్మోహము ఏర్పడి, అది ఆ వ్యక్తిని నియంత్రించి, ఆతడు ధనము, అధికారము మొదలగు వాటి వెనుక పడునట్లు చేయును.

శోభనాధ్యాసను ప్రభావహీనము చేయాలంటే, వస్తువు యొక్క వాస్తవిక విలువకు, ఆ వస్తువుపై మనము ఆరోపించిన కాల్పనిక విలుకు మధ్య గల తేడాను గుర్తించగలగాలి. ఈ తేడాను గుర్తించుట యెట్లు? ఈ లోకములోని (దృష్ట) భోగ వస్తువుల యందు, మరియు పరలోకములోని (అదృష్ట) భోగవస్తువుల యందు గల దోషమును పునః పునః దర్శించగలిగే సామర్థ్యము వైరాగ్యమనబడునని (వైరాగ్యం నామ దృష్టా దృష్ట భోగేషు దోష దర్శనాభ్యాసాత్ వైతృష్ణ్యమ్) శ్రీ శంకరులు నిర్వచించిరి.

ఒక వస్తువు దేనిని ఈయగలదు? దేనిని ఈయలేదు? అను విషయములను దోషశబ్దము నిర్దేశించును. ప్రతి వస్తువునకు కొన్ని గుణములు, కొన్ని దోషములు ఉండును. కావున, మనమీ దోషములను స్పష్టముగా చూడవలెను. ఉదాహరణకు, ధనమునకు కొనుగోలు శక్తి గలదు. కాని, దానికి ఆనందము నిచ్చే శక్తి లేదు. ఈ సత్యమును ఎరుంగుటయే వైరాగ్యము. వైరాగ్యము గల వ్యక్తికి ధనముతో సముచితమగు వాస్తవిక (objective) సంబంధము ఉండును. ఇదియే ఇచటి చర్చనీయాంశము.

వస్తువులను యథాతథముగా దర్శించుట

వస్తువులను యథాతథముగా దర్శించుటయే వాస్తవికత యనబడును. వస్తువులను స్వంత తీర్పును చెప్పే యత్నమును చేయకుండగా, వాటిని కేవలము యథాతథముగా తెలుసుకొనుటయే చేయదగినది. ఇట్టి వాస్తవికత చాల ప్రముఖమైనది. ఏలయన, వస్తువుల వాస్తవిక విలువను మనము తెలుసుకోకుండా, వాటికి అధికమగు కాల్పనిక విలువను ఆరోపించుట మనకు అలవాటు. మనమిచట వస్తువుల స్థూలరచనను చర్చించుట లేదు. మనము వాటిపై ఆరోపించే విలువను మాత్రమే మనము పరిశీలిస్తున్నాము.

ఒక వస్తువును పరిశీలిస్తే, దానిపై అనేకములగు బహిః ప్రసారితములైన (projected) విషయనిష్ఠ (కాల్పనిక) మూల్యములు (subjective values) గలవని స్పష్టమగును. కావున, మనమీ కాల్పనిక విలువలను యథాతథముగా దర్శించి, వాటిని తొలగించివేయాలి. అట్లు చేయుట వలన, ఆ వస్తువు మన జీవితములో తీసుకురాగలిగే ఉన్నతిని మనము మరింత వాస్తవికముగా దర్శించగల్గుతాము. దీనిని పదే పదే చేసినచో, అదియే అభ్యాసమగును. వస్తువుల యందలి దోషములను దర్శించుటయే వైరాగ్యము. ఈ కాల్పనిక విలువలు ఒక్కసారిగా తొలగిపోవు. కావున, పునరావృత్తి చాల ప్రముఖమైనది. వ్యక్తి వస్తువుపై ఆరోపించే కాల్పనిక విలువలు బుద్ధిపూర్వకముగా ఆరోపించినవి కావు.

వాస్తవము - కల్పన

నీవు ఒక ఇత్తడి బొమ్మను పురాతన కళాఖండము అనే భావనతో కొన్నావనుకో. వాస్తవంలో అది పురావస్తువు కానే కాదు. ఇత్తడి బొమ్మను ఆక్సీకరణము చేయుట వలన అది పురావస్తువు వలె భాసించినది. అనేక సార్లు క్రిందబడిన వస్తువు అనే భావన కలుగుట కొరకై దాని ముక్కును వంకరవేసి, దానిపై కొన్ని గీతలను గీసినారు. దాని విలువను పెంచుట కొరకై ఇదంతా బుద్ధిపూర్వకముగా చేయబడినది. అది పురాతన వస్తువు అని భ్రమపడి నీవు దానిని కొన్నావు. ఇత్తడికి కొంత వాస్తవిక విలువ గలదు. కాని పురాతన వస్తువు నందు ఆ విలువ కూడా లేదు. కాని అది పురాతన వస్తువు అని భ్రమపడిన నీవు దాని యందు ఒక కాల్పనిక విలువను ఆరోపిస్తావు. ఈ విలువకు దాని వాస్తవిక విలువతో సంబంధమేమియూ లేదు. ఒక ఇత్తడి ముక్క యందు మిక్కిలి విలువైన వస్తువు అను ధారణ కల్పన తక్క మరియొకటి కాదు.

ఈ నాటి యువకులు నీలం రంగు గల జీన్సు పంట్లాములను ధరిస్తారు. అవి కొంత కాలము వాడినవి వలె పాతబడి ఉంటే అక్కడక్కడ చినిగి ఉంటే, దానికి వారు అధికమూల్యమును చెల్లిస్తారు. కావుననే, వర్తకులు కొత్తవాటిని కూడా పాతవి వలె కనబడునట్లు చేస్తారు. ఇది కూడా కేవలము కాల్పనిక విలువయే గాని, మరియొకటి గాదు. ఈ రెండు దృష్టాంతములను బట్టి, ఒక వస్తువునకు గల వాస్తవిక విలువ (objective value), మరియు కాల్పనిక విలువ (subjective value) ల మధ్య గల భేదమును మనము తెలుసుకొనగల్గుతాము.

ఇత్తడిబొమ్మను చూచి పురావస్తువని నీవు ముందుగా భ్రమపడితివి. కాని అది పురాతనము కాదని నీకిప్పుడు తెలిసినది. ఇపుడు దానిని నీవు వాస్తవిక దృష్టితో చూడగల్గుతావు. నీవు కొన్నప్పుడు ఆ వస్తువు ఎట్లున్నదో, ఇప్పుడు కూడ అటులనే యున్నది. అప్పుడు దాని చెవి విరిగియుండెను. ఇప్పుడు కూడ విరిగియే యున్నది. కాని దానిని నీవు చూచే దృష్టిలో మార్పు వచ్చినది. బహుశః అది పురాతన వస్తువు అయి ఉండవచ్చును. అది పురాతన వస్తువు కాదని నీకు చెప్పిన వ్యక్తి మోసగాడు కావచ్చును. అతడు దానిని నీ నుండి సంగ్రహించి, ఎక్కువ మూల్యమునకు అమ్ముకొనే యోజన చేసి యుండవచ్చును. ఇది వాస్తవమే అయినచో, అతడు నిన్ను వెర్రివానిని చేసి మోసగించినట్లగును. ఈ కాల్పనిక విలువల క్షేత్రములో ఏదైననూ సంభవమే.

ఇచటి అభిప్రాయమేమనగా, ఆ బొమ్మ యందు పురావస్తు ధారణ తొలగగానే, మనకు దాని యందు వైరాగ్య భావన కలుగును. అది వాస్తవంగా పురావస్తువే అయినచో, అటులనే గానిమ్ము. సమస్య లేదు. దానిని మనము ఆ విధముగనే దర్శించెదము. సమాజము దానిపై కాల్పనిక విలువ నారోపించి, దాని ధరను పెంచివేసినది. మనకు దానితో సంబంధము లేదు. కాని, నీవు పురాతన వస్తు సంచాయకుడవు (antique collector) అయినచో, నీకు సంబంధించిన సర్వము పురాతన వస్తువులే!

కొందరు కొన్ని ప్రత్యేక వస్తువులను ప్రోగుచేసి, భద్రపరుస్తారు. ఇది వారిలో ఒక వ్యసనముగా తయారగును. ఈ ప్రోగుచేయుటకు వారు పెట్టుబడి అని పేరు పెడతారు. కాని, వారు ఆ వస్తువులను పరిత్యజించుటకు అంగీకరించరు. ఒక వస్తువును మనము అమ్మివేయుటకు సంసిద్ధముగా నున్నచో, దానిని సంపాదించుటకు అయిన ఖర్చును పెట్టుబడి అనవచ్చును. కాని వారు ఆ వస్తువులపై ఆసక్తిని పెంచుకొనుటచే, వాటిని విక్రయించలేరు. కావున, ఇది పెట్టుబడి కాజాలదు. ఈ విధముగా ఒక కొత్తరకం సమస్య నిర్మాణమగును. ఆ వస్తువుల యందు పురాతన భావము తొలగించుకొని, వాటిని వాస్తవిక దృష్టితో చూడగలిగితే, వాటి యందు వైరాగ్య మేర్పడును.

వస్తువును యథాతథముగా దర్శించుటయే వైరాగ్యము

ఒక వస్తువుపై ఆరోపింపబడిన కాల్పనిక విలువను తొలగిస్తే, వస్తువు వస్తువుగా మిగులును. ఇది వస్తువు లన్నింటికీ వర్తించును. స్వాభావికమైన శోభనాధ్యాస గలదనియు, వస్తువు నందు వాస్తవముగా లేని గుణము దానియందు అధికముగా ఆపాదింపబడిన దనియు మనము గుర్తించాలి. మనమీ విధముగా పునః పునః వస్తువును యథాతథముగా చూడాలి. ఇట్టి జ్ఞానము కలుగగానే, ఆరోపిత గుణములన్నియూ మటుమాయమగును.

'ఇది పురాతన వస్తువు కాదు, ఇది పురాతన వస్తువు కాదు' అని నిరంతరముగా మనకి మనము గుర్తు చేసుకుంటూ ఉండాలని చెప్పుట ఇచటి తాత్పర్యము కాదు. ఇట్టి జపమును చేయనవసరము లేదు. కాని, ధనము, అధికారము, మరియు ఇతరుల మెప్పు అను వాటి విషయములో అభ్యాస వైరాగ్యము లావశ్యకము. వస్తువులలోని, మరియు పరిస్థితులలోని దోషములను పునః పునః దర్శించుట మనో నియంత్రణకు పరమావశ్యకము. అభ్యాసము (పునరావృత్తి) చాల ప్రముఖమైనది. ఏలయన, అధ్యారోపము బుద్ధిపూర్వకముగా చేసేది కాదు. ఒక వస్తువు యొక్క విలువను వాస్తవము కంటె అధికముగా అంచనా వేసే తప్పును మనము చేస్తూ ఉంటాము. కాని, ఈ అధ్యారోపము అట్టి తప్పు కాదు. అట్టి తప్పే అయినచో, ఒకేసారి దిద్దుకుంటే సరిపడును. అపుడు అధ్యారోపము తొలగి వాస్తవిక దృష్టి ఏర్పడి యుండెడిది. కాని అధ్యారోపము అట్టి సరళమగు తప్పు కాదు. వ్యక్తి యొక్క కల్పిత వ్యక్తిత్వము, మానసిక ధారణాత్మక మగు వ్యక్తిత్వము ఈ అధ్యారోపమునకు మూలమై యున్నది. జీవితములో సఫలత అను విషయముపై గల అసత్య ధారణల యందు ఈ అధ్యారోపము దృఢముగా నాటుకొని యున్నది.

సఫలతా ధారణలు, మరియు వైరాగ్య భావనలు సర్వము మనో విజ్ఞానాంతర్గతములుగనే యున్నవి. వైరాగ్యమనగా మానవుని మానసిక భావ సంవేగములో వచ్చిన ఉన్నతి తక్క మరియొకటి కాదు. ఈసందర్భములో ఉన్నతి యనగా, అధ్యారోపములు తొలగిపోవు నంత వరకు దోషములను పునః పునః దర్శించగల్గుటయే. అట్టి దర్శనము గల వ్యక్తిని ఈ సంసారము బంధింపజాలదు. ఇట్టి ఉన్నతి లేని వ్యక్తి యొక్క మనస్సు స్వాభావికముగనే, సమాజముచే ప్రముఖముగా పరిగణింపబడే వస్తువులపైకి పరువులెత్తును.

గతంలో పొందలేక పోయిన వస్తువులు, మరియు గతంలో పోగొట్టుకున్న వస్తువులు వ్యక్తి యొక్క మనస్సులో దుఃఖమును కలుగజేసి, సమస్యలను సృష్టించగలవు. కాని, వైరాగ్యమున్నచో,

వ్యక్తికి దుఃఖమును కలుగజేసే ఈ గతకాలీన వైఫల్యములు తొలగిపోవును. ఇట్టి వ్యక్తిని నూతన వస్తువులు కూడ బంధింపజాలవు. పునః పునః దోష దర్శనమనగా నిదియే. ఇట్టి దర్శనము వలన మనలో సుస్పష్టమగు మార్పులు కలుగును. మనస్సు చాల వరకు దుఃఖ విముక్తమగును.

మనస్సు అన్ని వేళలా గోలపెడుతూ ఉంటుంది. సర్వదా తప్పులు పడుతూ ఉంటుంది. సర్వదా మనస్సు సంక్షోభాత్మకముగా నుండును. ఏలయన, అది ధ్యేయవస్తువు అగు ఆత్మపై లగ్నము కాకుండును. ఈ చంచలమగు మనస్సును నిగ్రహించుట దుష్కరము. అయిననూ, దానిని నిగ్రహించుట సంభవమే. కాని, ఒకచోట తూష్ణింగా కూర్చుండి, మనస్సు దానంతట అదియే నిగ్రహింపబడునని భావించుట సరిగాదు. మనము ప్రయత్నపూర్వకముగా దానిని నిగ్రహింపవలసి యున్నది అని శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పుచున్నాడు.

అధ్యాయము 6, శ్లోకము 36:

असंयतात्मना योगो दुष्प्राप इति मे मतिः ।
वश्यात्मना तु यतता शक्योऽवाप्तु मुपायतः ॥ ३६ ॥

అసంయతాత్మనా యోగో దుష్ప్రాప ఇతి మే మతిః
వశ్యాత్మనా తు యతతా శక్యోఽవాప్తు ముపాయతః (36).

అసంయతాత్మనా = మనో నియంత్రణ లేని వానిచే; **యోగః** = యోగము; **దుష్ప్రాపః** = పొందుటకు కష్టము; **ఇతి** = అని; **మే** = నా; **మతిః** = అభిప్రాయము; **తు** = తద్భిన్నముగా; **వశ్యాత్మనా** = మనస్సును వశము చేసుకున్న వానిచే; **ఉపాయతః** = అభ్యాస వైరాగ్యములనే ఉపాయముల వలన; **యతతా** = ప్రయత్నించు వానిచే; **అవాప్తుం** = పొందుటకు; **శక్యః** = శక్యమైనది.

> మనో నియంత్రణ లేనివాడు యోగమును పొందుట కష్టమని నా అభిప్రాయము. కాని మనస్సును వశముచేసుకొని, అభ్యాసవైరాగ్యములతో ప్రయత్నించువాడు యోగమును పొందగల్గును (36).

ఈ శ్లోకములో అసంయతాత్మ యనగా ధ్యానమును అభ్యసించనివాడు, వాస్తవిక దృష్టి (వైరాగ్యము) లేనివాడు, అందువలననే మనో నియంత్రణ లేనివాడు అని యర్థము. మనస్సును

నియంత్రించుట సంభవమేనా? సంభవమే. కాని, కష్టమైన పని (దుష్ప్రాపః) అని శ్రీకృష్ణుడు చెప్పినాడు. మరియు, మనో నియంత్రణ ఉంటేనే గాని, మన మిచట చర్చించే యోగము సిద్ధించదు. సర్వప్రాణుల యందు ఉన్నట్టియు, సర్వప్రాణుల ఉనికికి ఆశ్రయమైన సమబ్రహ్మను దర్శించగల్గుటయే ఈ యోగము. శ్రీకృష్ణుడిచట ప్రకటించినది దర్శనమే గాని అభిప్రాయము కాదు. ఏలయన, దీని విషయంలో వాద వివాదములకు గాని, తిరస్కారమునకు గాని స్థానములేదు.

అభ్యాస వైరాగ్యములను పాటించు వ్యక్తికి మనస్సు వశమగును. ఇందువలననే అట్టి వ్యక్తిని ఈ శ్లోకము వశ్యాత్మా అని కూడ వర్ణించినది. ఇట్టివాడు సదా సావధానుడై యుండును. సావధానత అనేది ఏదో కొద్దిరోజులు మాత్రమే అభ్యసించేది కాదు. అది మనతో సర్వకాలముల యందు ఉండవలెను. నేను గాలి పీల్చుటను ఆరు సంవత్సరములు అభ్యసించితిని అని మనము చెప్పలేము గదా! అటులనే, నేను సావధానతను ఆరు సంవత్సరములు అభ్యసించితిని అని కూడా మనము చెప్పలేము. మనము గాలి పీల్చుటను ఆరు సంవత్సరములు అభ్యసించి విడిచిపెట్టలేము గదా! గాలి పీల్చుటయే జీవనము. సావధానత కూడ అట్టిదియే. ఇట్లు జీవితమంతా సావధానముగా నుండు వ్యక్తికి మాత్రమే ఈ సమదర్శనము సిద్ధించును (యోగః అవాప్తుం శక్యః).

ఇది క్రియా సాధ్యము గాదు

ఈ యోగము విశిష్టోపాయ సాధ్యము (ఉపాయతః) అని శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పెను. ఆ ఉపాయమేది? ఈ సమదర్శనమునకు అభ్యాస వైరాగ్యములు సాధనములని శ్రీకృష్ణుడు ఇదివరకే చెప్పియున్నాడు. అభ్యాస వైరాగ్యములు సాధనములు అనే విషయవస్తువును శ్రీకృష్ణుడు ఇదివరకే వివరించి యున్నాడు గావున, ఇపుడు ఆ యోగప్రాప్తి అర్జునుని చేతిలో నున్నది. శ్రీకృష్ణుని చేతిలో లేదు. కావున, ఇపుడు యెదుట ఒక కర్తవ్యమున్నది. అర్జునునకు ఆకాంక్ష యున్నచో దానిని ఆచరించవచ్చును. అతడు తన మనస్సును నియంత్రించే విషయంలో శ్రద్ధ తీసుకొనవలెను. శ్రీకృష్ణుడు తాను చెప్పవలసినది అంతా చెప్పినాడు. ఇంతకు మించి బోధించవలసినది ఏమియూ లేదు. కాని, చేయవలసినది గలదు. జ్ఞాన మార్గములో ఎదురయ్యే అవరోధములను అభ్యాస వైరాగ్యములు తొలగించివేయును. కావుననే, శ్రీకృష్ణుడు జ్ఞానమును సంపాదించే ప్రయత్నమును అధికముగా వర్ణించలేదు.

బ్రహ్మ-ఆత్మ విచారము చేయదగిన వస్తువు. కావుననే, శ్రీకృష్ణభగవానుడు దానిని గురించియే విస్తారముగా మాటలాడినాడు. ఇందువలననే, గీతలో పదునెనిమిది అధ్యాయములు ఏర్పడినవి.

కాని, జ్ఞాన ప్రాప్తికొరకై అర్జునుడు కొంత సాధనను చేయవలసి యుండును. కావుననే, శ్రీకృష్ణుడా ప్రసంగమును అంతటితో వదిలిపెట్టెను. శ్రీకృష్ణుడు ఆత్మ గురించి, జ్ఞాని గురించి, దర్శనము గురించి విస్తారముగ మాటలాడిన విధము మనకు కనబడుచునే యున్నది. కాని ధ్యానము గురించి కొద్ది శ్లోకములు మాత్రమే గలవు. ఏలయన, అది ఆచరణీయమైన క్రియ. కాన, కొద్ది వివరణ సరిపడును.

ఆచరణీయములగు కర్మలను శ్రీకృష్ణుడు సంగ్రహముగా, మరియు పర్యాప్తముగా వివరించి ముందుకు సాగును. కాని, దర్శింపదగిన తత్త్వమును శ్రీకృష్ణుడు పునః పునః విస్తారముగా వర్ణించును. ఏలయన, అది కర్తవ్య కర్మ కాదు. అది తెలియదగిన తత్త్వము. కాన అధిక వివరణ ఆవశ్యకమగును గదా!

తరువాతి శ్లోకములో అర్జునుడు తన ఊహలలో జనించిన మరియొక సమస్యను ప్రస్తావించుచున్నాడు:

అధ్యాయము 6, శ్లోకము 37:

अर्जुन उवाच ।
अयति श्श्रद्धयोपेतो योगाच्चलित मानस : ।
अप्राप्य योगसंसिद्धिं कां गतिं कृष्ण गच्छति ॥ ३७ ॥

అర్జున ఉవాచ
అయతి శ్రద్ధ యోపేతో యోగాచ్చలిత మానసః
అప్రాప్య యోగ సంసిద్ధిం కాం గతిం కృష్ణ గచ్ఛతి (37).

అర్జునః = అర్జునుడు; ఉవాచ = పలికెను; కృష్ణ = హే కృష్ణా!; శ్రద్ధయా = శ్రద్ధతో; ఉపేతః = కూడినవాడు; అయతిః = తగినంత యత్నమును చేయలేకపోయినవాడు; యోగాత్ = యోగమునుండి; చలితమానసః = చలించిన మనస్సు గలవాడు; యోగ సంసిద్ధిం = యోగమునందు సంసిద్ధిని; అప్రాప్య = పొందలేక; కాం = ఏ; గతిం = గతిని; గచ్ఛతి = పొందును?

అర్జునుడు ఇట్లు పలికెను -

హే కృష్ణా! శాస్త్రమునందు శ్రద్ధ ఉన్ననూ తగినంత యత్నమును చేయలేకపోయిన వ్యక్తి యోగము నుండి చలించిన మనస్సు గలవాడై, యోగము నందు సంసిద్ధిని పొందలేక ఏ గతిని పొందును? (37).

అర్జునుని ప్రశ్నను పరిశీలించుడు. కర్మలనన్నిటినీ, అనగా లౌకిక కర్మలను, వైదిక కర్మలను వీడి సన్న్యసించిన వ్యక్తిని పరిశీలించుడు. అతడు ధార్మిక, సామాజిక, మరియు కుటుంబ బాధ్యతల నన్నిటినీ వీడినాడు. అట్లు వీడుటకు శాస్త్రము అనుజ్ఞను ఇచ్చియున్నది. అతడు వీటినన్నిటినీ వీడుటకు కారణమేమి? దేనిని ఆశించి వీడినాడు? సర్వప్రాణులలో ఆత్మను, ఆత్మయందు సర్వప్రాణులను దర్శించగలిగే (సమదర్శనమ్) ఈ యోగమును పొందగోరి అతడు సర్వమును త్యజించినాడు. ఈ విశిష్ట దర్శనమును జీవిత లక్ష్యముగా పెట్టుకొని అతడు సన్న్యాసి అయినాడు. అతని గురించి అర్జునుడు ఒక ప్రశ్నను వేయుచున్నాడు.

సమాజములో కలిసియుండి జీవిస్తే ఎన్నో సుఖాలు లభిస్తాయి. వాటిని అతడు వదులుకొని భిక్షాటన చేసి జీవించవలసిన భిక్షువు అయినాడు. అతని వద్ద ధనము లేదు. తనకు ఆ పూట భోజనము ఎచట లభించునో అతనికి తెలియదు. అనగా, అతడు ఏది లభిస్తే దానిని తిని జీవించును. సంసార జీవితములో లభించే సుఖముల నన్నిటినీ అతడు వీడినాడు. మోక్షరూపమగు ఈ గొప్ప దర్శనము అతనికి సిద్ధించినచో, అతనికి త్యాగమునకు తగ్గ ఫలము లభించినదని చెప్పవచ్చును. అతడు మోక్షము కొరకు మాత్రమే ధర్మార్థ కాములనే మిగిలిన మూడు పురుషార్థములను త్యజించినాడు.

ప్రత్యేక ప్రయత్నము కూడ అవశ్యకమగును

ఈతనికి వేదాంత దర్శనము నందు గొప్ప శ్రద్ధ గలదు. ఈతనికి బ్రహ్మాత్మ సాక్షాత్కారము కలిగే అవకాశమెంత యేని గలదు. తాను వెతుకుతున్న మోక్షము ఈ జ్ఞానమేనని అతనికి తెలియును. ఈ జ్ఞానము లభించునను యాశతో ఈతడు సన్న్యాస జీవనమును స్వీకరించి, సన్న్యాసిగా కొనసాగుచున్నాడు. కాని, కాలక్రమంలో జ్ఞానము లభించనందువలన ఈతడు నిరాశోపహతుడు అయ్యే అవకాశము గలదు. ఈతడు యౌవనములో ఈ సాధనము మొదలిడినాడు. ఇప్పుడు వృద్ధుడైనాడు. జ్ఞానోదయము కాకుండా ఏదో ఒక అవరోధము అతనికి గలదు. ఉపదేశము

యోగ్యమైనది కాకుండవచ్చును. లేదా అతనిలో తగినంత స్ఫూర్తి లేకుండవచ్చును. అతని గత జీవితమునుండి సంక్రమించిన ఒకానొక విఘ్నము జ్ఞానోదయము కాకుండా అడ్డుపడుచుండవచ్చును. అతడు ఇట్టి స్థితికి చేరినాడు. అతనిలో ఇంకనూ శ్రద్ధ గలదు. కాని, అతడిప్పుడు అయతి. అనగా, అతని ప్రయత్నము పర్యాప్తము కాలేదు.

యోగ్యమగు ప్రయత్నమును చేయు వ్యక్తి యతి అగును. ఇందువలననే సన్న్యాసిని యతి అందురు. సన్న్యాసికి ఒక జీవిత లక్ష్యము గలదు. అతడు ఆత్మజ్ఞానార్థియై త్యాగమయ జీవనమును గడుపును. కాని, అర్జునుడు చర్చిస్తున్న సన్న్యాసిని యతి అనలేము. అతడు చాలినంత యత్నమును చేయలేదు. ఆ యత్నమును గురించి అతనికి సరియగు అవగాహన కూడ లేదు. కావున, అతడు అయతి అయినాడు.

ప్రయత్నము సరిపడలేదని స్పష్టమగుచున్నది. ఎందువలన? సమస్య ఇంకనూ మిగిలియున్నది గనుక. అతనికింకనూ స్పష్టమగు దర్శనము లేదు గనుక, అయతి అయినాడు. అతడు చాల చదివియుండవచ్చును. ధ్యానమును అధికముగా చేసియుండవచ్చును. కాని అతనికి పెద్ద వయస్సు, శ్రమ, నిరాశ మాత్రమే మిగిలినవి (చలిత మానసః). అలసి సొలసి, నిరాశోపహతుడైన ఈ సన్న్యాసికి పట్టబోవు గతియేమి? అర్జునుడీ విషయమును తెలియగోరెను. అతనికి శ్రద్ధగలదు. కావుననే, అతనికి ఈ జ్ఞానము నందు కోరిక కూడ గలదు. కాని, అతనికి వివిధ విషయముల యందు స్పష్టమగు అవగాహన లేదు. ఈ జ్ఞానము లభించుటకు పూర్వమే అతడు మరణించినచో యేమగును? దీని గురించియే అర్జునుడు ప్రశ్నించుచున్నాడు. హే శ్రీకృష్ణ భగవన్! అతడు పొందు గతి యేమి? (కాం గతిం కృష్ణ గచ్ఛతి). మరణానంతరము అతని గతి యేమి?

ఈ జీవితములో అతని పరిస్థితి మనకు తెలిసినదే. అతనికి సంసార సుఖము దక్కలేదు; మోక్ష సుఖము అందలేదు. అతడు సంసారములోని అల్పసుఖములనే గాక, స్వర్గ సుఖములను కూడ గోల్పోయినాడు. అతడు జ్ఞానమును పొందగలననే యాశతో స్వర్గసుఖముల నొసగే కర్మలను పరిత్యజించినాడు గదా! కాని అతనికి జ్ఞానము లభించలేదు. ఇవుడాతని పరిస్థితి యేమి? అతడు త్రిశంకు స్వర్గములో వ్రేలాడుచున్నాడా యేమి?

కర్మలను వేటినీ చేయని వ్యక్తికి కర్మఫలమేమియూ లభించదు గదా! కావున, అతనికి కర్మ ఫలమేమియూ లభించదు. అతడు కర్మలను చేయుటకు బదులుగా, కాలము నంతనూ కూర్చుని కళ్లను మూసుకొని గడిపివేసెను. కాని, అంతరంగములో మార్పు రాలేదు. అప్పుడప్పుడు నిద్ర

మాత్రమే వచ్చియుండును. కాని, నిద్ర వలన సిద్ధించే ఫలమేదియూ లేదు గదా! కలలు గాని పగటి కలలు గాని వ్యక్తికి కొంత ఉల్లాసమును ఈయగలవు. కాని, నిద్రవలన ఏమి లాభము? ఏమీ లేదు. కావున, ఆయతి సంసారములోని అల్పసుఖములనైననూ అనుభవించలేకపోయినాడు. పైగా మరుజన్మలో ఉపకరించే పుణ్యమును చేసుకొనలేదు. మోక్షరూపమగు జ్ఞానమును కూడ పొందలేకపోయినాడు.

సాధన వ్యర్థమై, అతడు వినష్టుడగునా?

మేఘ సముదాయము నుండి విడివడిన మేఘశకలము వలె అతడు నష్టుడై వ్యర్థుడై పోడా? ఈ రాజ్యము మాత్రమే గాక, లభించునని ఆశపడిన రాజ్యము కూడ జారిపోవునా? పర్యాప్తము కాని సాధనము చేసిన సన్న్యాసి మరణించినచో, మోక్షము, సంసారము కూడ నష్టమగును. సంపాదించుకున్న పుణ్యము ఏమియూ లేకుండును. ఇట్లు ఉభయ భ్రష్టుడైన అతడు ఏమగును? అతని గతి యేమి?

ఈ స్థితి అర్జునుని ఊహలో మాత్రమే గలదనుటలో సందియము లేదు. అర్జునుడు సన్న్యాసి కాదు. బహుశః అతడు సన్న్యాసి అయ్యే యోజన చేసి యుండవచ్చును. ఈ ఆలోచన అతని మనస్సునందు గలదని మనము గీతారంభములో చూచియున్నాము. ఏది ఏమైనా, ఈ సాక్షాత్కారమును పొందలేకపోయిన సన్న్యాసి గతి యేది? అను విషయమును అర్జునుడు తెలియగోరెను. ఇది అర్జునుని తత్కాల వ్యక్తిగత సమస్య కాదు. అయిననూ, అతని ప్రశ్న సుసంగతమే. సన్న్యాస, కర్మయోగముల గురించి శాస్త్రము యొక్క ఉపదేశము తెలియుటకు ఈ ప్రశ్న ఆవశ్యకము. శ్రీకృష్ణుడు సర్వజ్ఞుడగు పరమాత్మయే ననియు అర్జునుడు యెరుంగును. ఇతరులెవ్వరూ శ్రీకృష్ణ భగవానునితో సాటి కారు. ఈ ప్రశ్న సరళమైనది కాదు. మనకు తెలిసినంత వరకు వ్యక్తి జీవితము అంతమైన పిదప జరుగబోవు దానిని గురించిన ఈ ప్రశ్నకు ఆయన మాత్రమే సమాధానమును చెప్పగల్గును.

అందువలననే, అర్జునుడు 'హే భగవన్, శ్రీకృష్ణా! దయ చేసి చెప్పుము. యోగసిద్ధిని, అనగా జ్ఞాన ప్రాప్తిని పొందలేకపోయిన (అప్రాప్య యోగ సంసిద్ధిమ్) వ్యక్తికి గతి యేమి?' అని ప్రశ్నించెను. జ్ఞానమును పొందుట యనగా మోక్షమును పొందుటయే. కావున, జ్ఞానము సాధనమని చెప్పబడును. జ్ఞాన మోక్షములకు సాధన సాధ్య సంబంధము కలదు. అనగా, జ్ఞానము ఉన్నచో మోక్షము సిద్ధించును.

ఒకనికి బ్రహ్మాత్మ దర్శనము నందు శ్రద్ధ గలదు. అతడు సర్వమును వీడి, యోగ జీవనమును గడిపినాడు. కాని జ్ఞానరూపమగు మోక్షమును పొందలేకపోయినాడు (యోగ సంసిద్ధిం అప్రాప్య). అతని గతి యేమి? అర్జునుడీ విషయమును తెలియగోరెను. అతడు సంసారిక సుఖములను మాత్రమే గాక, పరలోక సుఖములను కూడ పరిత్యజించి, ఈ ధ్యానయోగమును చిరకాలమనుష్ఠించి, ఇపుడు మరణించుటకు సిద్ధముగా నున్నాడు. ఈ జీవితములో ఇంకేదో సాధించే ఆశ అతనికి లేదు. ఇంతవరకు లభించని జ్ఞానము జీవితములోని ఈ అంతిమ ఘడియలలో లభించే అవకాశము సుతరాము లేదు. అతని గతి యేమి? అతడు సర్వనాశమును పొందడా?

అర్జునుడు శ్రీకృష్ణ భగవానుని వేసిన ఈ ప్రశ్న తరువాతి శ్లోకములో ప్రదర్శింప బడుచున్నది:

అధ్యాయము 6, శ్లోకము 38:

कच्चिन्नोभयविभ्रष्टश्छिन्नाभ्रमिव नश्यति ।
अप्रतिष्ठो महाबाहो विमूढो ब्रह्मणः पथि ॥ ३८ ॥

కచ్చిన్నో భయ విభ్రష్టశ్ఛిన్నాభ్రమివ నశ్యతి
అప్రతిష్ఠో మహాబాహో విమూఢో బ్రహ్మణః పథి (38)

మహాబాహో = గొప్ప బాహువులు గల ఓ శ్రీకృష్ణా!; **బ్రహ్మణః** = పరబ్రహ్మము యొక్క; **పథి** = మార్గము (జ్ఞానము) నందు; **విమూఢః** = వ్యామోహమును పొంది; **అప్రతిష్ఠః** = ఆధారము లేనివాడై; **ఉభయవిభ్రష్టః** = రెండింటికి చెడ్డవాడై; **ఛిన్నాభ్రం ఇవ** = పీలికలైపోయిన మేఘపు తునక వలె; **కచ్చిత్ న నశ్యతి** = నశించిపోడా?

> గొప్ప బాహువులు గల ఓ శ్రీకృష్ణా! పరబ్రహ్మము యొక్క మార్గము (జ్ఞానము) నందు వ్యామోహితుడై, ఆధారమును గోల్పోయి, రెండింటికీ చెడి, పీలికలై పోయిన మేఘపుతునక వలె నశించిపోడా? (38).

ప్రయత్నము చాలకపోవుటచే జ్ఞానరూపమోక్షమును పొందలేకపోయిన అయతిని గూర్చి అర్జునుడు పూర్వశ్లోకములో ప్రశ్నించినాడు. ఆ సన్న్యాసిని గూర్చియే మరల ఈ శ్లోకములో చర్చించుచున్నాడు. ఉభయ విభ్రష్టుడనగా కర్మయోగ, సన్న్యాసములు రెండింటికీ చెడ్డవాడని

యర్థము. కర్మమార్గము (కర్మయోగము) అనే జీవనశైలిలో మానవుడు కర్మల నాచరిస్తూనే, జ్ఞానసాధనను కూడ కొనసాగించును. కాని, ఈతడు కర్మయోగమును విడిచిపెట్టి, దాని నుండి చ్యుతుడైనాడు (భ్రష్టః). ఈతడు కర్మమార్గమును వీడి త్యాగమయ జీవనరూపమైన యోగమార్గము (బ్రహ్మణః పథి)ను సాధింపబూనినాడు. కాని అతని ఈ ప్రయత్నము విఫలమైనది. అతడిట్లు ఉభయ విభ్రష్టుడైనాడు.

ఉభయవిభ్రష్టుడైన ఈతడు ఎచటకు పోవును? ఈతడు వృద్ధుడైనాడు గనుక, పనులను వేటినీ చేయజాలడు. కావున, మరల కర్మమార్గములోనికి మరలుట సంభవము గాదు. పైగా, సన్న్యసము నుండి కర్మమార్గములోనికి పోవుట శాస్త్రసమ్మతము కాదు. కర్మలు, కర్మఫలములు అనిత్యములని యెరింగిన ఈతనికి మరల కర్మమార్గములోనికి పోవు ఉత్సాహము కూడ ఉండదు. అతడు అవివేకియై ఉన్నప్పుడు సంసార జీవనము నందు ఎంతో కొంత ఉత్సాహము కలిగి యుండెడివాడు. కాని, ఇపుడాతనిలో ఆ ఉత్సాహము లేదు. జ్ఞానిని కాగల్గినాను అనే తృప్తి అతనికి కలుగలేదు. ఈ తీరున అతడు ఉభయ విభ్రష్టుడై, పోవుటకు దారిలేక, మధ్యలో వ్రేలాడుచున్నాడు. అతడు సామాన్యమానవులలో ఒకడు కాడు. జ్ఞానులగు సన్న్యాసులలో ఒకడు కాలేకపోయినాడు.

అతనికిపుడు స్థానము లేదు. కర్మిష్ఠులలో గాని, జ్ఞానులలో గాని ఒకడుగా కాలేకపోయినాడు. ఇంతేగాక, అతడు భ్రాంతుడు కూడా (విమూఢః). నేను తప్పుచేసితి నన్న భావనలో అతడు ఉండును. నేను జీవుడనా? లేక పరబ్రహ్మమునా? అను విషయములో అతడు అయోమయములో నుండును. బ్రహ్మజ్ఞాన సాధనకొరకై అతడు యోగమార్గమును స్వీకరించినను, ఈ సందేహము మిగిలియే యున్నది గాన, అతడా మార్గములో సాధించినది శూన్యమని తేలినది.

బ్రహ్మమునకు మార్గము లేదు

ఈ శ్లోక భాష్యములో శ్రీ శంకరులు 'పథి (మార్గము నందు)' అను పదమును వివరించిరి. సన్న్యాస జీవన రీతియే ఇచటి మార్గము. పరబ్రహ్మమునకు యథార్థముగా మార్గము లేదు. ఏలయన, పరబ్రహ్మము నేనే. ఈ బ్రహ్మజ్ఞానమును పొందుటకు ఒక సాధన గలదు. అదియే జ్ఞానసాధన. ఈ సాధనలో విమోహితుడైన సన్న్యాసిని గూర్చి మనము చర్చిస్తున్నాము. కావున, బ్రహ్మమార్గములో విమూఢుడు అనగా ఆ జ్ఞాన సాధనలో ఈతడింకనూ భ్రాంతుడై, అయోమయములో నున్నాడని యర్థము.

ఇట్టి వ్యక్తి నశించిపోడా (నశ్యతి కిం న)? ఈ ప్రశ్నను అడుగుతూ అర్జునుడు ఒక దృష్టాంతమును చెప్పెను. మేఘసమూహము నుండి విడివడిన మేఘ శకలము (ఛిన్నాభ్రం ఇవ) నశించును. ఈ మేఘపు తునక హిమాలయములను తొందరగా చేరి పర్వత శిఖరముపై ఏకాంతములో కూర్చుండగోరినది కాబోలు! మేఘ సముదాయము నుండి హడావుడిగా విడిపోయినది. పెద్ద మేఘముల కొరకు ప్రతీక్షించుట దానికి సమ్మతము కాదు. కాని, భారత భూభాగములో సగము దూరము పయనించిన తరువాత ఆ శకలమును తుఫాను గాలులు చెదరగొట్టినవి. ఆ శకలము ఛిన్నాభిన్నమై నశించినది.

అదే విధముగా ఈతడు మోక్షమును పొందాలనే తొందరలో పరంపరాగత సమాజమును విడిచిపెట్టినాడు. ఈతడు బహుశః హిమాలయ శిఖరములలో గాలి తక్కువగా ఉండే ఎత్తులకు వెళ్ళినాడు కాబోలు! ఈతడు యథార్థమగు సన్న్యాసి యగుటకు బదులుగా, ఆ మేఘశకలము వలె, భ్రష్టుడైనాడు. ఆ మేఘశకలము వలె ఈతడు కూడ నశించిపోడా?

మేఘ సముదాయముతో కలిసి ఉన్న మేఘశకలము కులాసాగా పయనిస్తూ సుందర దృశ్యములను చూచి ఆనందించును. అటులనే, సమాజరూపమగు మానవుల సమూహముతో కలిసి జీవించే వ్యక్తికి ఆ జీవితములో లభించే సుఖములు తేలికగా లభించును. మేఘసమూహముతో సమానముగా మెల్లగా పయనించుటకు సిద్ధపడే మేఘశకలము తన క్రింద భూమిపై పర్వతములను, పైన ఆకాశములోని నక్షత్రములను దర్శించును. తుఫాను గాలుల నుండి రక్షణ పొందును. అట్లుగాక, విడిపోయినచో నశించును.

వ్యవస్థను వీడిన వ్యక్తి ఏమైనా కావచ్చును

ఇదే విధముగా వ్యవస్థను విడనాడి తొందరగా ముందుకు పోయే సాధకుడు ఈ ప్రక్రియలో పూర్తిగా నశించే అవకాశము గలదు. సన్న్యాసములో వ్యవస్థ ఏమియూ ఉండదు. నీవు ఏదైనా కావచ్చును. వ్యవస్థ గాని, నియమిత జీవన విధానము గాని, ఒక కర్మను చేయవలెననే ఒత్తిడి గాని లేని స్థితిలో, సాధకుడు సోమరిపోతు కూడ కావచ్చును.

సన్న్యాసి సోమరి యగుటకు అవకాశము మెండు. ఆకలి వేసినప్పుడు భిక్షకు వెళ్లి, తరువాత నిద్రించవచ్చును. సన్న్యాస జీవనము ఇట్టి స్వేచ్ఛను కలిగించును. ప్రశ్నించే వారెవ్వరూ ఉండరు. పై అధికారి సమస్య లేదు. తల్లిదండ్రులు తమ సంతానమును సరియగు మార్గములో నడుచునట్లు

శాసిస్తారు. సన్న్యాసికి వారి ఇబ్బంది కూడ ఉండదు. మానవుడు భార్యాబిడ్డలను వీడి సన్న్యాసి యగును. కావున, సామాజిక బాధ్యతలు ఏవీ సన్న్యాసికి వర్తించవు. వేద విహిత కర్మలను అనుష్ఠించవలసిన బాధ్యత సన్న్యాసికి తొలగిపోయినది. కావున, సమస్య లేదు. సన్న్యాసి ఏదైనా కావచ్చును; హిప్పీగా తయారు కావచ్చును!

కావున, ఇట్టి వ్యక్తి వినాశమును పొందునని భావించి, అర్జునుడు సందేహ నివృత్తి కొరకు శ్రీకృష్ణ భగవానుని ఇట్లు ప్రశ్నించుచున్నాడు:

అధ్యాయము 6, శ్లోకము 39:

एतन्मे संशयं कृष्ण छेत्तुमर्हस्यशेषतः ।
त्वदन्यः संशयस्यास्य छेत्ता न ह्युपपद्यते ॥ ३९ ॥

ఏతన్మే సంశయం కృష్ణ ఛేత్తు మ్మర్హస్య శేషతః
త్వదన్య స్సంశయస్యాస్య ఛేత్తా న హ్యుపపద్యతే (39)

కృష్ణ = ఓ శ్రీకృష్ణా!; మే = నా యొక్క; ఏతత్ = ఈ; సంశయం = సంశయమును; అశేషతః = పూర్తిగా; ఛేత్తుం = తొలగించుటకు; అర్హసి = తగుదువు; అస్య = ఈ; సంశయస్య = సంశయమును; ఛేత్తా = పోగొట్టువాడు; త్వదన్యః = నీవు కాక మరియొకడు; నహి ఉపపద్యతే = సమర్థుడు కాడు సుమా!

ఓ శ్రీకృష్ణా! నా ఈ సంశయమును పూర్తిగా తొలగించుటకు నీవు తగుదువు.
ఈ సంశయమును నీవు తక్క మరియొకరు తొలగించజాలరు (39).

తన ప్రశ్నకు సమాధానము చెప్పగలవాడు మరియొకడు లేడని అర్జునునకు తెలియును. సర్వజ్ఞుడగు శ్రీకృష్ణ భగవానుడు మాత్రమే ఉత్తరమీయగలడు. జ్ఞానమును పొందని సన్న్యాసి ఈ దేహమును వీడి మరణించిన పిదప పొందే గతి ఈశ్వరునికి మాత్రమే తెలియును గదా!

ఛేత్తా అనగా పోగొట్టువాడు. అనగా సందేహమును నివారించువాడు అని యర్థము. శ్రీకృష్ణ భగవానుడు సంశయచ్ఛేత్త. ఆయన ఒక్కడు మాత్రమే సంశయములను కోసివేయగలడు. అర్జునుని సంశయములను ఆయన ఒక్కడే పూర్ణముగ తొలగించినాడు. ఇతరులు 'శాస్త్రము ఇట్లు చెప్పినది'

అని మాత్రమే చెప్పగలరు. కాని శ్రీకృష్ణుడు తానే శాస్త్రమును లోకములో ప్రవర్తిల్ల జేసినాడు. 'ఈ సనాతన జ్ఞానమును నేను వివస్వానున కీయగా, అతడు మనువునకు, మనువు ఇక్ష్వాకునకు ఇచ్చినారు (ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్, వివస్వాన్మ నవే ప్రాహ మనురిక్ష్వాకవే బ్రవీత్. 4-1)' అని శ్రీకృష్ణుడు నాల్గవ అధ్యాయారంభములో చెప్పియున్నాడు. కావున, శ్రీకృష్ణ భగవానునకు ఈ జ్ఞానమంతయూ కరతలమాలకము. 'నాకు అనేక జన్మలు గడిచినవి. నీకు కూడ నట్లే. కాని వాటినన్నిటినీ నేను ఎరుంగుదును. నీవు ఎరుంగవు (బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున, తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరంతప. 4-5) అని కూడ శ్రీకృష్ణుడు అర్జునునితో చెప్పియున్నాడు.

మరణానంతరము జీవుని గతియేమి? అను విషయమును శ్రీకృష్ణుడు యెరుంగుననియు, దీనిని వివరించుటకు ఆయనయే తగినవాడనియు, ఈ వచనములను బట్టి అర్జునుడు నిర్ణయించుకొనెను. అర్జునుడు తన గురువగు శ్రీకృష్ణుని ఈ శ్లోకములో స్తుతించుచున్నాడు. శ్రీకృష్ణభగవానునితో సమమైనవాడు లేడనియు, తన సందేహములను ఇతరులెవ్వరూ పూర్తిగా తొలగించలేరనియు అర్జునుడు చెప్పెను. మరో మాటలో చెప్పాలంటే, ఈ ప్రశ్నకు ఉత్తరము నిచ్చే అర్హత మరెవ్వరికీ లేదు.

అర్జునుడు ఈ ప్రశ్నను అడిగి ఉండకపోతే, గీత మూడు శ్లోకముల వెనుక పూర్తి అయి ఉండెడిది. అర్జునుడు ప్రశ్నించినాడు గనుక, శ్రీకృష్ణభగవానుడు మరల ఉపదేశించ నారంభించెను:

అధ్యాయము 6, శ్లోకము 40:

श्री भगवानुवाच
पार्थ नैवेह नामुत्र विनाशस्तस्य विद्यते ।
न हि कल्याणकृत्कश्चिद्दुर्गतिं तात गच्छति ॥ ४० ॥

శ్రీ భగవానువాచ
పార్థ నైవేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే
న హి కల్యాణ కృత్కశ్చి ద్దుర్గతిం తాత గచ్ఛతి (40)

శ్రీ భగవాన్ = శ్రీ కృష్ణ భగవానుడు; ఉవాచ = పలికెను; పార్థ = అర్జునా!; తస్య = వానికి; ఇహ = ఈ లోకము నందు; వినాశః = వినాశము; న ఏవ = లేనే లేదు; అముత్ర =

పరలోకమునందు; వినాశః = వినాశము; న విద్యతే = లేదు; తాత = కుమారా! (అర్జునా!); కల్యాణకృత్ = మంచి పనులను చేయువాడు; కశ్చిత్ = ఎవ్వడైననూ; దుర్గతిం = దుర్గతిని; న గచ్ఛతి = పొందడు; హి = నిశ్చయము.

శ్రీ కృష్ణ భగవానుడిట్లు పలికెను –

> అర్జునా! వానికి ఈ లోకము నందు గాని, పరలోకము నందు గాని వినాశము లేనే లేదు. వత్సా! మంచి పనిని చేయువాడెవ్వడైననూ దుర్గతిని పొందడు. ఇది నిశ్చయము (40).

ఇంతకు ముందు మనము కర్మమార్గ యోగ మార్గముల నుండి జారిన ఉభయ విభ్రష్టుడగు సన్న్యాసి (యోగి)ని గురించి చర్చించి యున్నాము. అట్టి భ్రంశమునకు కారణములను కూడ చూచినాము. ఈ శ్లోకము ఆ సన్న్యాసిని గురించియే మరల చర్చించుచున్నది. ఆ యోగి యథార్థంగా ఉభయ విభ్రష్టుడు కాదనియు, అతడు పతితుడు కానే కాదనియు శ్రీకృష్ణుడీ శ్లోకములో చెప్పుచున్నాడు.

లక్ష్యసాధనను సరిగా పూర్తి చేయలేకపోయిన సన్న్యాసి ఈ లోకములో గాని (ఇహ), పరలోకములో గాని (అముత్ర), వినాశమును పొందడు (వినాశః న విద్యతే). ఎందువలన? ఈతడు అయతియే అయినా శాస్త్రము నందు శ్రద్ధ గలవాడు గనుక. శ్రద్ధ గల ఈ సన్న్యాసికి ఈ జీవితములో నష్టము లేదు. కావున, అతని సన్న్యాసి జీవనము నష్టదాయకమైన పెట్టుబడి వంటిది గాదు. అతడు అంతా తెలిసియే సన్న్యసించినాడు. శ్రద్ధావంతుడగు అతడు ఈ లోకములో దుఃఖిగాని, నిరాశోపహతుడు గాని అయ్యే ప్రసక్తియే లేదు. అతడు జ్ఞానము ఉదయించు వరకు జ్ఞానసాధనను ఉల్లాసముగా, ఆనందముగా కొనసాగిస్తాడు. ఒకవేళ అతనికి శ్రద్ధ లేనిచో, తాను పొరపాటు చేసినానని అతడు భావించుట సహజమే. అట్టి భావనతో అతడు మరల వెనుకకు మళ్ళుట నిశ్చయము. ఈ రెండు పక్షములలోనూ అతడు తాను చేసిన పనికి దుఃఖి అయ్యే సమస్య లేదు.

తరువాతనైననూ, అనగా మరణానంతరము కూడా (అముత్ర) అతనికి సమస్య ఉండబోదని శ్రీకృష్ణభగవానుడు చెప్పుచున్నాడు. అతడు జ్ఞానసాధనను కొనసాగించుటకు అనురూపమైన పరిస్థితులను కల్పించుకొనును. తరువాత జ్ఞానమును, మోక్షమును పొందును. ఈ తీరున అతడు వినాశమును పొందడనియు, ఇది నిశ్చయమనియు (వినాశః తస్య న విద్యతే) శ్రీకృష్ణ భగవానుడు హామీని ఇచ్చుచున్నాడు.

సన్న్యాసి దురవస్థను పొందు ప్రసక్తియే లేదు

ఈ సందర్భములో వినాశమనగా, ఇప్పుడు ఉన్న జన్మ కంటె నీచమైన జన్మను పొందుట. కాని, అట్లు జరగదని శ్రీకృష్ణభగవానుడు చెప్పుచున్నాడు. పైగా, ఇతడు ప్రకృత జన్మలో పవిత్రజీవనమును గడిపినాడు (కల్యాణ కృత్) గాన, ఇంతకంటె ఉత్తమమైన జన్మను పొందును. కల్యాణమనగా మోక్షము. ఇతడు సన్న్యాస జీవనమును గడుపుట ద్వారా మోక్షమార్గములో ముందడుగు వేసియున్నాడు. ఇతడు కల్యాణకృత్; పతితుడు కాడు, హిప్పీ కాడు. ఈతడు ఈశ్వర సాక్షాత్కారమును, మోక్షమును పొందుటకై సర్వమును త్యజించినాడు. ఇట్టి కల్యాణకృత్ అగు వ్యక్తి దుర్గతిని పొందడు.

మంచి కర్మను, దానధర్మములను చేసిన వ్యక్తి ఎవరైనా దుర్గతిని పొందడు (దుర్గతిం న గచ్ఛతి). నూతన దేహారంభకములగు కర్మల సముదాయముపై ఆధారపడి, ఆతడు వరుసగా ఒక జన్మ నుండి మరియొక జన్మను పొందే అవకాశము గలదు. ఇంతకు మించిన దుర్గతి అతనికి ఉండదు. కాని, మోక్షమార్గములో వ్యక్తి ముందడుగు వేయగల్గినచో, ఆతడు చేసిన పుణ్యకర్మలన్నింటి యొక్క ఫలము లభించినట్లే. ఒకసారి సంసారము నుండి దృష్టిని ఆత్మవైపునకు మళ్లించగల్గిన వ్యక్తి మరల సంసారములో పతితుడయ్యే అవకాశము లేదు.

అనాత్మ నియంత్రణము ఆత్మ కొరకు మాత్రమే

సాధారణంగా మానవులు అనాత్మ వెనుకపడతారు. ఆత్మను గురించి పట్టించుకోరు. ఉదాహరణకు, స్థూలదేహము అనాత్మ కాన, దాని సంరక్షణము కూడా అనాత్మయే. మనో నియంత్రణ కూడా అనాత్మయే. ధన సంరక్షణము, అధికారమును కాపాడుకొనుట, కుటుంబ సంరక్షణము ఇత్యాదులన్నియూ అనాత్మ విషయములే. ఈ విధంగా, మానవులందరు అనాత్మ సంరక్షణము నందు మాత్రమే అభిరుచి గలవారై, నిరంతరము సంఘర్షణను చేస్తూ ఉంటారు.

వాస్తవంలో ఈ అనాత్మ సంరక్షణమంతయూ ఆత్మ సంరక్షణమే. ఈ సంరక్షణము అనాత్మ కొరకు గాదు. మనము దేహమును సంరక్షించుకొనేది దేహము కొరకు గాదు; మన కొరకు, ఆత్మ కొరకు. కావున, మనము ఆత్మ కొరకై అనాత్మను సంరక్షిస్తాము. ఈ ప్రయత్నంలో ఆత్మను పూర్తిగా ఉపేక్షిస్తాము. ఇది చాల విచిత్రమైన విషయము. దీనినే మాయ అంటారు.

నేను చేస్తున్న పని మంచిదియేనా? అని వ్యక్తి ప్రశ్నించుట ఆరంభించిన క్షణము నుండి ఆత్మ సంరక్షణము ఆరంభమగును. మానవులందరిలో ఇట్టి ప్రశ్న ఉత్పన్నము కాదు. అనాత్మ సంరక్షణము నందు ఇంత గాఢముగా వ్యాపృతమై యున్న ఈ ఆత్మ ఎట్టిది? అను ఆత్మ విషయకమైన ప్రశ్నను మానవుడు ఆత్మ కొరకు, అనగా తన కొరకు మాత్రమే వేసుకుంటాడు. ఈ తీరున ఆత్మను గురించి ధ్యానము చేయనారంభించిన వ్యక్తిలో ఆ ధ్యానము వెనువెంటనే సఫలము కాకపోయినా, అతడు అనాత్మ నుండి ఆత్మ వైపునకు తిరుగుప్రయాణము నారంభించినాడని స్పష్టమగుచున్నది. సర్వ సామాన్యముగా భాసించే దానిని ప్రశ్నించే వ్యక్తి, ఆ సామాన్యము అసామాన్యమనే సత్యమును కనుగొనును. ఇట్టి వ్యక్తి మోక్షమార్గములో ముందడుగు వేసినాడు. కావుననే, ఈతడు కల్యాణ కృత్ అగును.

కల్యాణమనగా చరమము. కావున, మోక్షము కల్యాణము అగును. బ్రహ్మచర్యాశ్రమ జీవనము వివాహములో అంతమగును. కావున వివాహమునకు కల్యాణము అని పేరు. వివాహమనగా బ్రహ్మచర్యాశ్రమ పరిసమాప్తి. అనగా, బ్రహ్మచర్య జీవనమును గడుపుట ద్వారా ఆ ఆశ్రమము పరిపూర్ణము చేయబడినది. వివాహము తరువాత కల్యాణము గలదు. అది మోక్షము. మోక్షము కల్యాణము కాగా, వివాహము సాధనయగును. వివాహము ద్వారా మానవుడు సర్వోత్తమ కల్యాణమగు మోక్షమును పొందును.

కర్మ దిశను మార్చివేయుట

కర్మయోగి గాని, లేక సన్న్యాసి గాని అయిన వ్యక్తి మోక్షమార్గములో ముందడుగు వేసినాడు గాన, అతడు కల్యాణ కృత్ అనబడును. వీరిద్దరు మోక్షము కొరకై ఏదో కొంత యత్నమును చేసిన వారే గనుక, వీరిద్దరిని కూడ కల్యాణకృత్ అని వర్ణించవచ్చును. ముందడుగు వేసిన తరువాత ప్రగతి నిశ్చితము. ఇట్టి వ్యక్తికి కప్ప, దేవత ఇత్యాది దేహములను ఆరంభించే కర్మ ఉన్ననూ, ఆ కర్మ పరాభూతమై దేహము నారంభించదు. అట్టి కర్మలు ప్రకటము కావు. వ్యక్తి కల్యాణకృత్ కాగానే కర్మ నియతి, మరియు కర్మ ప్రవాహ దిశ పూర్తిగా మారిపోవును. అట్లు గాక, కర్మ ప్రవాహములో కొట్టుకొనిపోవుచున్న వ్యక్తి విషయంలో, ఫలరూపముగా ప్రకటమయ్యే అవకాశము విభిన్న కర్మలకు సమానముగ నుండును. కాని, ఈ విభిన్న కర్మలలో ఏ విశిష్ట కర్మయొక్క ఒత్తిడి, పరిపక్వత అధికముగ నుండునో, అదియే ముందుగా ప్రకటమగును.

కర్మ ప్రవాహము యొక్క దిశ మారిన వెంటనే, క్రమము కూడా మారి తీరవలెను. కావున, శ్రద్ధ గల సాధకుని విషయంలో మిగిలిన కర్మలన్నియు సంచితరూపమున నుండి, జ్ఞానసాధనకు అనుకూలమగు దేహారంభక కర్మ ప్రకటమగును. మిగిలిన కర్మలన్నియూ వేచియుండును. ఎంతకాలము వేచియుండును? అతనికి కల్యాణము, అనగా మోక్షము లభించునంత వరకు. మోక్షము లభించగానే, కర్మలన్నియూ నశించును. అనగా, అవి మరల ప్రకటమయ్యే ప్రసక్తియే లేకుండగా, నిశ్శేషముగా వినాశమును పొందును. కావున, నేను వాస్తవముగా కర్తనా? యను ప్రశ్న సామాన్యమగు ప్రశ్న కాదు. ఆత్మ కర్తయైనచో, ఆత్మకు మంచి చెడు కర్మల సంబంధము ఉండును. కాని, ఇచట 'నేను కర్తను అగుదునా?' అని ఆత్మయొక్క కర్తృత్వమే ప్రశ్నించబడుచున్నది. ఈ ప్రశ్నను వేసుకున్నవాడు కల్యాణకృత్. ఒకసారి ఇట్టి ప్రశ్నను వేసుకున్న సాధకుడు మరల దుర్గతిని పొందే ప్రసక్తి లేదు.

శ్రీకృష్ణ భగవానుడీ శ్లోకములో అర్జునుని 'తాత' యని సంబోధించెను. తండ్రిని లేక కుమారుని ప్రేమపూర్వకముగా సంబోధించుటకు ఈ పదమును ప్రయోగిస్తారు. ఇద్దరు వ్యక్తుల మధ్య గల నికట సంబంధమును ఈ పదము నిర్దేశిస్తుంది. తండ్రికి, కుమారునకు భేదము లేదు. తండ్రి కుమారుని రూపములో తన ఉనికిని పరిరక్షించుకొనును. కుమారుడు ఆనందంగా ఉంటే, తండ్రి ఆనందిస్తాడు. కుమారుడు చక్కగా పెరుగుతున్నప్పుడు, తండ్రి తానే పెరుగుతున్నట్లు సంతసిస్తాడు. కుమారుడు విజయి అయితే, తండ్రి తానే విజయమును పొందినట్లు భావిస్తాడు. ఈ విధముగా కుమారునికి ఏది జరిగినా, అది తండ్రికి జరిగినట్లే. కుమారుని సుఖదుఃఖములచే తండ్రి మిక్కిలి ప్రభావితుడగును. అంటే, తండ్రికి, కుమారునకు మధ్య దూరమేమియూ లేదు. ఇందువలననే, 'తాత' అను పదము వారినిద్దరినీ నిర్దేశించును.

ప్రస్తుతంలో, అర్జునుడు శ్రీకృష్ణుని కుమారుడు కాదు. కాని, పితృభావన గలదు. సృష్టించు వ్యక్తి తండ్రి (జనకః) అనబడును. దేహము నిచ్చినవాడు ఒక తండ్రి (దేహజనకః). జ్ఞానము నిచ్చినవాడు మరియొక తండ్రి (విద్యాజనకః). జ్ఞాని ఆచార్యుడై బోధించి, శిష్యునకు జ్ఞానరూపమైన విూత్న పునర్జన్మను ఇచ్చును. కాన ఆచార్యుడు తండ్రి యనబడును. కాన, దేహదాత ఒక తండ్రి, జ్ఞానదాత మరియొక తండ్రి.

మరియు, తాత శబ్దము కుమారుని మాత్రమే గాక, శిష్యుని కూడ నిర్దేశించును. అర్జునుడు శ్రీకృష్ణుని కుమారుడు కాదు; కాని శిష్యుడు. శిష్యుడు కుమారుని వంటివాడే. కావున, శ్రీకృష్ణ

భగవానుడు అర్జునుని ప్రేమతో 'తాత' అని సంబోధించి, శ్రద్ధగల సన్న్యాసి జ్ఞానమును పొందలేకపోయిననూ, దుర్గతిని పొందడని చెప్పెను. ఇట్టి వ్యక్తికి లభించునది యేమి? అను విషయమును శ్రీకృష్ణ భగవానుడు తరువాతి శ్లోకములో వివరించుచున్నాడు.

అధ్యాయము 6, శ్లోకము 41:

प्राप्य पुण्यकृतां लोकान् उषित्वा शाश्वतीस्समाः ।
शुचीनां श्रीमतां गेहे योगभ्रष्टोऽभिजायते ॥ ४१ ॥

ప్రాప్య పుణ్యకృతాం లోకానుషిత్వా శాశ్వతీస్సమాః
శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోభి జాయతే (41)

యోగభ్రష్టః = యోగములో విజయమును పొందలేక దాని నుండి జారినవాడు; పుణ్యకృతాం = పుణ్యాత్ముల; లోకాన్ = లోకములను; ప్రాప్య = పొంది; శాశ్వతీః = లెక్కలేనన్ని; సమాః = సంవత్సరములు; ఉషిత్వా = అచ్చట నివసించి; శుచీనాం = ధర్మమునకు బద్ధులైన; శ్రీమతాం = సంస్కారవంతుల; గేహే = గృహమునందు; అభిజాయతే = జన్మించును.

> యోగములో విజయమునుపొందలేక దాని నుండి జారినవాడు, పుణ్యాత్ముల లోకములను పొంది, లెక్కలేనన్ని సంవత్సరము లచ్చట నివసించి, ధర్మమునకు బద్ధులైన సంస్కారవంతుల గృహము నందు జన్మించును (41).

ఇహలోక పరలోకములు రెండు ఈ శ్లోకములో వ్యాఖ్యానించబడినవి. ధర్మ జీవనమును గడిపి, పుణ్యకర్మలను ఆచరించిన వారు 'పుణ్యకృతః' అనబడుదురు. వారు పొందు లోకములు 'పుణ్యకృతాం లోకాన్' అని నిర్దేశింపబడినవి. యోగభ్రష్టుడు పుణ్యాత్ములు పొందే లోకములను పొందును. అచట ఎంతకాలము అతడు నివసించును? అసంఖ్యాకములగు సంవత్సరములు (శాశ్వతీః సమాః), అనగా చిరకాలము నివసించును.

మనము పూర్వ శ్లోకములో యోగభ్రష్టుని చూచియున్నాము. మోక్షరూపమగు జ్ఞానమును పొందే సాధన (యోగము) ను చేసి కృతకృత్యుడు కాలేకపోయిన సాధకుడు ఉభయలోక భ్రష్టుడగునని అర్జునుడు భావించెను. అట్టి యోగ భ్రష్టుని గురించియే మనమిచట చర్చించుచున్నామని మరువరాదు.

వాస్తవంలో ఈతడు భ్రష్టుడు కానే కాదు. ఇతనికి పతనము లేదని ఇంతకు ముందే చెప్పబడినది. ఈతడు పతితుడైనాడనే భావనను అనువదిస్తూ శ్రీకృష్ణుడు 'యోగభ్రష్టః' అను పదమును ప్రయోగించెను. ఇట్టి వ్యక్తి ఏ విధముగనూ పతితుడు కానే కాడని శ్రీకృష్ణభగవానుడు అర్జునునకు స్పష్టము చేయగోరెను. యోగభ్రష్టుడని అర్జునునిచే భావింపబడిన వ్యక్తి జ్ఞానసాధనకు అనుకూలముగ నుండే వాతావరణములో జన్మించునని (అభిజాయతే) ఆయన చెప్పెను.

శ్రీకృష్ణుడు ఈ అనుకూల వాతావరణమును 'శుచీనాం శ్రీమతాం గేహే' అను పదములతో వర్ణించెను. అనగా ధర్మమునకు బద్ధులైన (శుచి) మరియు సంస్కారవంతులైన (శ్రీమతాం) వారి గృహములో (గేహే) జన్మించునని యర్థము. 'శ్రీమతాం' అను పదము సంపదను, సుఖసమృద్ధిని సూచించును. 'శుచీనాం' అను పదము సంస్కారమును నొక్కిచెప్పును. ఏలయన, కొన్ని గృహములలో సంపద సమృద్ధిగా నుండవచ్చును. ఉదాహరణకు, మాఫియా అధిపతి గృహములో సంపద సమృద్ధిగా నుండును. కాని, ఇట్టి గృహము జ్ఞానసాధనకు అనురూపమైనది కాదు. ఇంటి చుట్టూ ఎత్తైన ప్రహరీ గోడలతో, చుట్టూ పహరాదారుల కావలాతో ఇట్టి గృహము కారాగారమును పోలియుండును. ఇట్టి పరిస్థితులలో, సంపద వ్యక్తిని కారాగార బద్ధుని వలె జేయును. మనము ఇట్టి సంపదను ఇచట చర్చించుటలేదు. సంపదతో బాటు శుచిత్వమునకు ఇచట అధిక ప్రాధాన్యమీయబడును.

చుట్టు ప్రక్కల వాతావరణము అనురూపముగా నుండవలెను

జీవనమూల్యములకు, ధర్మబద్ధ జీవనమునకు విలువనిచ్చే కుటుంబమును 'శుచీనాం' అను పదము సూచించును. యోగభ్రష్టుడు ఇట్టి కుటుంబములో జన్మించునని శ్రీకృష్ణ భగవానుడు చెప్పెను. ఇట్టి అనుకూల వాతావరణములో పెరిగే వ్యక్తి కొన్ని విశిష్ట జీవనమూల్యములను అలవరచుకొనును. ఇట్టి కుటుంబములో జన్మించుట సరళము కాదు. సాధకుడు అనేక చిక్కులు గల వాతావరణములో జన్మించినవాడై యుండవచ్చును. కాని, ఇట్టి కుటుంబములో జన్మించుటలో గొప్ప లాభము గలదు. తల్లిగాని, తండ్రిగాని మద్యపానరతులైనచో, అది శిశువు యొక్క వికాసమునకు ప్రతిబంధకమగును గదా! ఇట్టి వాతావరణములో జన్మించిన శిశువు సర్వథా చెడిపోవునని చెప్పజాలము. ఇట్టి స్థితిలో జన్మించిన వ్యక్తులు కూడ ఉన్నతిని సాధించుట సంభవమే. వ్యక్తి లక్ష్యమును చేరగల్గినచో, సర్వము సుసంపన్నమే గదా!

కాని, మనము ఒక విషయమును గమనించాలి. ప్రతికూల పరిస్థితులలో జన్మించిన వ్యక్తి ప్రతికూల ప్రభావము నుండి బయటపడుటలో చాల క్లేశము గలదు. దీనికి భిన్నంగా, జన్మకాలము

నుండియు సానుకూల పరిస్థితులున్న వ్యక్తి మోక్షమార్గములో తేలికగా ముందుకు సాగును. ఇట్టి వ్యక్తి చాల చిన్నవయస్సులోనే సన్న్యాసి లక్షణములను ప్రదర్శించును. ఏలయన, అతడు ఆరంభించిన కార్యమును పూర్తిచేయవలెను గదా! అతడు ప్రార్థనా పూర్ణమైన జీవనమును గడుపుతూ, నిరంతరము ఈశ్వరధ్యానము చేయుటకు చుట్టుప్రక్కల పరిస్థితులు అనురూపముగా నుండును. ఇట్టి వ్యక్తి సదా ఈశ్వరుని ధ్యానిస్తూ, ఈశ్వరుని స్వరూపమును గురించి, సర్వము యొక్క సత్యత్వమును గురించి విచారమును, విమర్శను చేయును. ఇది అంతా ఈశ్వరస్మరణయే గదా!

ఈ చర్చను బట్టి మనకొక సంగతి విశదమైనది. యోగ భ్రష్టునకు ఈ జన్మలోగాని, మరు జన్మలో గాని పతనమను మాటయే లేదు. అతడు మరల మానవుడై జన్మించి, సాధనను పూర్వజన్మలో విడిన చోట యారంభించి కొనసాగించును. అతడు గొప్ప వంశములో జన్మించును గాన, యీ జన్మ అతని జ్ఞానసాధనకు అనుకూలముగ నుండును. అతడీ జన్మలో జ్ఞానమును పొందే అవకాశము మెండు.

జ్ఞానసాధన చేసియూ అదే జన్మలో జ్ఞానమును పొందలేకపోయిన యోగికి లభించే మరుజన్మ విషయములో ఇంకొక వికల్పము గలదు. శ్రీకృష్ణ భగవానుడు దానిని వివరించుచున్నాడు.

అధ్యాయము 6, శ్లోకము 42:

अथवा योगिनामेव कुले भवति धीमताम् ।
एतद्धि दुर्लभतरं लोके जन्म यदीदृशम् ॥ ४२ ॥

అథవా యోగినా మేవ కులే భవతి ధీమతామ్
ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్ (42)

అథవా = లేదా; ధీమతామ్ = వివేకజ్ఞానము గల; యోగినాం = యోగుల; కులే ఏవ = కులము నందే; భవతి = జన్మించును; లోకే = ఈ లోకము నందు; ఈదృశం = ఇటువంటి; యత్ = ఏ; జన్మ = జన్మ గలదో; ఏతత్ = ఇది; హి = నిశ్చయముగా; దుర్లభతరం = మిక్కిలి దుర్లభమైనది.

లేదా, అతడు వివేకజ్ఞానము గల యోగుల వంశము నందే జన్మించును. ఈ లోకములో ఇటువంటి జన్మ మిక్కిలి దుర్లభము గదా! (42)

ఆత్మజ్ఞానమును పొందగోరు యోగి (సన్న్యాసి) కి దుర్గతి కలుగుట అను ప్రసక్తియే లేదని మనము చూచియున్నాము. ఆత్మజ్ఞాన ప్రాప్తి దిశలో ఒక అడుగు ముందుకు వేసిన వ్యక్తి ఎవరైనా సంసారబంధ విముక్తి ప్రక్రియను ఆరంభించిన వాడగును. ఆత్మ కర్త యగునా? అను ప్రశ్నను ఏనాడూ వేసుకోని మానవుడు తనను తాను సంసారములో కర్మయను బంధనములతో బంధించుకొనును. అట్టి మానవుడు సంసారాంతర్గతుడై, ఆత్మ యందు కేంద్రితమై యున్న కర్తృత్వధారణ గలవాడై, వివిధ లక్ష్యములను సాధించు యత్నమును చేయును. ఆత్మ భిన్నమైన వస్తువుల యందలి కామనలే ఆధారంగా ఈ లక్ష్యములను మానవుడు సాధించుకొనుచుండును. ఈ విషయమును మనమిదివరలో చూచియున్నాము.

కాని, మనమిచట ఆత్మ యొక్క మూలస్వరూపమును ప్రశ్నించుచున్నాము. ఆత్మ కర్త యగునా, కాదా యను విషయమును మనమెరుంగము. కాని మనము కనీసము దానిని ప్రశ్నించి, విచారమును చేయుచున్నాము. ఏయే దేహాదుల యందు మనకు ఆత్మధారణ గలదో, అవియే ఆత్మ యని మనము స్వీకరించుట లేదు. ఆత్మ యనగా నేమి? అని మనము ప్రశ్నించుచున్నాము. మానవులు సాధారణంగా, కర్తగా తమ అనుభవానికి వచ్చే న్యూనతల నుండి, బంధము నుండి పుట్టే దుఃఖమును పరిహరించుకొనుటకు మాత్రమే యత్నింతురు. కాని, కర్తృత్వమును ఏనాడూ ప్రశ్నించరు. కావున, మానవుని సర్వవిధముల కర్మణ్యత అభిలషిత వస్తు ప్రాప్తి కొరకు మాత్రమే ఉద్దేశింపబడి కొనసాగును. ఇట్టి జీవనమునకే సంసారమని పేరు.

సంసారము ఒక రోగము; కాని చికిత్సను చేయించుకొనువారు లేరు

కాని, మానవుడు కర్తృత్వమును సావధానముగా పరిశీలించి, ఈ కర్త ఎవరు? ఈ నేను ఎవరు? అనే ప్రశ్నను వేసుకున్న నాడు, అతని మదిలో ఒక మంగళ కరమగు కోరిక (శుభ-ఇచ్ఛా), ఆత్మను తెలుసుకోవాలనే కోరిక (ఆత్మ-ఇచ్ఛా) బయలుదేరును. అది మోక్షము నిచ్చును. కావున, సాధకుడు దుర్గతిని పొందే ప్రసక్తి లేదని శ్రీకృష్ణ భగవానుడు హామీని ఇచ్చుచున్నాడు. మరియు, ఆయన అర్జునునకు ఒక చిన్న రహస్యమును కూడ చెప్పుచున్నాడు. అర్జునా! నీవు యోగభ్రష్టుడని వర్ణించిన వ్యక్తి మరుజన్మలో మరల సాధనామాత్రమును చేతబట్టి, జ్ఞానసాధనను కొనసాగించును సుమా! సాధకుడు జీవితమును ఈశ్వరప్రార్థనతో గడుపును గదా! దాని వలన కొంత పుణ్యము లభించును. ఈ పుణ్య ప్రభావము వలన అతడు దేహత్యాగానంతరము పుణ్యలోకములలో భోగముల ననుభవించి, జ్ఞానసాధనకు అనుకూలమగు వాతావరణములో జన్మించును.

ఇచటి తాత్పర్యమేమనగా, మరణానంతరము కూడా జీవుని యాత్ర కొనసాగును. ఈ లోకముతో బాటు పరలోకము కూడ గలదు. సాధకునికి పరలోకయాత్ర ఆనందదాయకముగా నుండగలదు. కావున, ఇట్టి సాధకుడు దేహత్యాగానంతరము దుర్గతిని పొందే ప్రసక్తి ఉదయించదు. అతని అనుభవము లన్నియూ ఆనందానుభవములుగనే యుండును. అతడీ జీవితములో ఆరాధనా పూర్ణమగు జీవితమును గడిపి, ఆ పుణ్యము వలన లభించిన పుణ్యలోకముల ననుభవించి, మరల ఈ లోకములో జ్ఞానమునుపొందే అర్హతగల అధికారిశరీరముతో, అనగా మానవశరీరముతో జన్మించును. అతడు నీచయోనుల యందు జన్మించడు. అతడు జ్ఞానసాధనకు అనురూపమైన వాతావరణములో మానవ దేహముతో జన్మించుట నిశ్చయము. కావున, ఏ కాలమునందైననూ అతనికి దుర్గతి యను ప్రసక్తి లేదు.

యోని యనగా స్థూలదేహము. యోనులు మూడు రకములు. దేవయోని, మనుష్య యోని మరియు అధోయోని. మనుష్యయోని యనగా ఇచ్ఛాస్వాతంత్ర్యము యొక్క అనుభవము గల స్థూలదేహము అని యర్థము. అది భూలోకములోని మనుష్య దేహము గానీ, లేక ఇతర లోకములలోని తత్సదృశ దేహముగానీ కావచ్చును. జీవుడు ఈ లోకములోనే జన్మించి తీరవలెననే నియమము లేదు. ఏదో ఒక లోకములో జన్మించవచ్చును.

మనము చర్చిస్తున్న వ్యక్తి గొప్ప సంస్కారవంతులు (శ్రీమతాం), మరియు ధర్మాత్ములు (శుచీనాం) అయినవారి గృహములో జన్మించునని శ్రీకృష్ణ భగవానుడు చెప్పుచున్నాడు. అనగా, యోగి జన్మించబోవు వాతావరణమును ఆయన వర్ణించినాడు. యోగి జన్మించబోవు గృహములో సంపద, దానితో బాటు సంస్కృతి కూడ విలసిల్లును. ఒకచో సంపద లేకపోయినా సంస్కృతి ఉండును. ఆ కుటుంబములోని వారు ఎంతయూ నీతిబద్ధులై, జీవనమూల్యములకు కట్టుబడి జీవించెదరు. ఈ విధముగా, యోగి ప్రతికూల వాతావరణములో జీవితమును ఆరంభించవలసిన పని ఉండదు. అతని జన్మ జ్ఞానసాధనకు ఆటంకము కాబోదు. కావు, అతడు జ్ఞానసాధనను అతి సరళముగా ఆరంభించి కొనసాగించగల్గును.

యోగుల వంశములో జన్మించుట మరింత మంచిది

లేదా, అతడు ముముక్షువు అగు కర్మయోగి కుటుంబములో జన్మించునని శ్రీకృష్ణ భగవానుడు చెప్పుచున్నాడు. కుటుంబములో తండ్రి సంస్కారవంతుడు, ఆస్తికుడు కావచ్చును. మరియు సంపన్నుడు కూడ కావచ్చును. కాని, కర్మయోగి కాకపోవచ్చును. ఇట్టి గృహములో పుట్టిన

వ్యక్తి యైననూ మోక్షరూపమగు జ్ఞానమును పొందే అవకాశము అధికమే. కాని, అదే వ్యక్తి కర్మయోగి గృహములో జన్మించినచో, అతడు జ్ఞాని అయ్యే అవకాశము మరింత మెండుగా నుండును.

సన్న్యాసులకు గృహములు ఉండవు గాన, ఈ శ్లోకములో యోగి శబ్దమునకు కర్మయోగి యని అర్థము. ఈ కర్మయోగులు బుద్ధిమంతులు కూడా (ధీమతామ్). ధీమతామ్ అను పదమును బట ఆ గృహ యజమాని జ్ఞాని గాని, ముముక్షువు గాని అయి ఉండునని స్పష్టమగుచున్నది. అతడు కనీసము ముముక్షువు అయి ఉండాలి. ఈ రెండు పరిస్థితులలోనూ, ఆ ఇంటిలో జన్మించిన బాలకుడు బాల్యము నుండియూ కొన్ని జీవనమూల్యములను నేర్చుకొనగల్గును. అట్టి బాలుడు పూర్వజన్మలో అసంపూర్ణముగా మిగిలిపోయిన జ్ఞాన సాధనను మరల మొదలిడి కొనసాగించుటలో ఆటంకము లేమియూ ఉండవు. అనగా అతడు తన గతము నుండి సంక్రమించిన సమస్యలతో వేగవలసిన అవసరముండదు. ఏలయన, అట్టి సమస్యలే ఉండవు గనుక.

'యోగినాం కులే' యనగా యోగి, మరియు దరిద్రుడు అయిన యజమాని గృహములో అట్టి సన్న్యాసి పుట్టునని యర్థము. శ్రీ శంకరులు తమ భాష్యములో 'దరిద్రాణామ్' అను పదమును జోడించిరి. దరిద్రుడు అంటే బిచ్చగాడు కూడ కావచ్చును. అట్టి గృహములో జన్మించినచో అన్నీ సమస్యలే యగును. కాని గృహయజమాని దరిద్రుడే అయినా, కర్మయోగి, విద్వాంసుడు, బ్రాహ్మణుడు. ధనియగు బ్రాహ్మణుడు ఉండజాలడు. ఏలయన, యథార్థమగు బ్రాహ్మణుడు సంపన్నుడు కారాదు. కావున, శ్రీ శంకరులు ఇచట వాస్తవముగా దారిద్ర్యమును స్తుతించినారు.

జీవుడు పుణ్యపాప మిశ్రమఫలముగా మానవుడై జన్మించును. దరిద్రుడగు యోగి విషయములో దారిద్ర్యము పాపములను నిశ్శేషము చేయగా, పుణ్యము యోగమునకు సహకరించును. కావ, ఇట్టి వ్యక్తి ఆటంకము లేమియూ లేనివాడై, యోగ (జ్ఞాన) మార్గములో ముందుకు సాగును. కావున, సుసంస్కృతులగు ధనవంతుల గృహములో జన్మించుట కంటె, ధనవంతులు కాని కర్మయోగుల గృహములో జన్మించుట వలన మరింత మేలు ఒనగూరునని శ్రీ శంకరులు చెప్పినారు.

సంపదలు మానవుని తలకెక్కి, కొన్ని మనో గ్రంథులను నిర్మించి, సమస్యలను సృష్టించుటలో సమర్థములగును. దారిద్ర్యము కూడ మనోగ్రంథులను సృష్టించుట వాస్తవమే. హీనభావన, శ్రేష్ఠభావనలు (inferiority and superiority complexes) రెండు సమస్యలే. వీటిని పరిష్కరించుకోవలసిన ఆవశ్యకత గలదు. కాని, తల్లిదండ్రులు సంపన్నులు కాకపోయినా, యోగులైనచో, ఆ కుటుంబములో జన్మించిన వానికి సమస్య లేదు. వారు యోగులు గావ, వారి జీవనమూల్య సంరచన నిర్దోషముగ

మండును. 'నేను దరిద్రుడను' అను మనోగ్రంథి వారి కుటుంబములో జన్మించిన వ్యక్తికి నిర్మాణము కాదు. ధనము లేకపోయినా, అతడు తాను దరిద్రుడనే భావన చేయడు. పైగా, తాను అదృష్టవంతుడనని అతడు భావించును. తమ వద్ద ధనము లేకపోయినా, తాము అదృష్టవంతులమని భావించే తల్లిదండ్రుల కడుపున పుట్టుట మహాభాగ్యము. ఇచటి తాత్పర్యమేమనగా, తల్లిదండ్రులు యోగ్యులైన సందర్భములో, ధనమున్నచో మంచిది; ధనము లేనిచో మరింత మంచిది.

రెండు విభిన్న కుటుంబములను ప్రస్తావించుటకు కారణమేమి?

ఈ రెండు శ్లోకములలో శ్రీకృష్ణుడు రెండు విభిన్న పరివారములను ప్రస్తావించుటకు కారణమేమి? యోగభ్రష్టులందరు ఒకే రకం పరివారములో జన్మించరాదా? అట్లుకాదు. యోగి ఏ రకం పరివారములో జన్మిస్తాడనేది అతని కర్మపై, అతడు సంపాదించుకున్న పుణ్యపాపములపై ఆధారపడును. ఒకని పుణ్యపాపములు మరియొకని పుణ్యపాపములతో సమానము కావు. జీవుడు ఎక్కడ జన్మిస్తాడు, తల్లిదండ్రులు ఎవరు, ధనము ఉండునా, ఉండదా ఇత్యాది సర్వమును ఈ పుణ్యపాపములు నిర్ణయించును. యోగి ఎక్కడ జన్మించినా, పూర్వజన్మార్జితములగు యోగసంస్కారములను, ప్రవణతలను (tendencies) నిలబెట్టుకొనును. అంటే, అతడు ఈ పూర్వసంస్కారములతో కూడి జన్మించును. ఈ సంస్కారములు అంతర్నిహితములై, జీవితము యొక్క ఆరంభదశలోనే ప్రకటము కావచ్చును. సర్వదా ఏడిచే బాలుడు సంగీత విద్వాంసుడు కావచ్చును. కనబడిన సర్వమును పాడుచేయు బాలుడు సివిల్ ఇంజనీరు కావచ్చును. మనము వేచి చూడవలెను!

ఈ ప్రవణతలకు సంస్కారములని పేరు. మనము వాటిని పెంపొందించుకునే పని లేదు. వాటంతట అవియే వ్యక్తమగును. ఇందువలననే, ఒకే తల్లిదండ్రులకు పుట్టిన ఇద్దరు వ్యక్తుల మధ్య ఎంతో వ్యత్యాసము ఉండును. ఒక వ్యక్తి ప్రవణతలు ఒకరకంగా ఉంటే, ఇంకో వ్యక్తి సంస్కారములు భిన్నంగా ఉంటాయి. ఒకడు సంగీతమును ఇష్టపడితే, మరియొకడు కళలను అభిమానించును. దీనికి మూలములో వారి వారి సంస్కారములు గలవు. ఈ సంస్కారములకే ప్రారబ్ధకర్మ అనియూ పేరు. జీవుడు ఒక విశేషపరిస్థితిలో ఒక విశేషదేహములో జన్మించుటకు ఈ కర్మయే కారణము. వ్యక్తి పొందే విశేష అనుభవములకు కూడా ప్రారబ్ధ కర్మయే కారణము. సంస్కారములు ప్రకటము అయితీరాలి. అవి మనము చేపట్టే వృత్తులుమొదలగు వాటి ద్వారా ప్రకటమగును. యోగసంస్కారములు కూడా అంతే. ధర్మమునకు అంకితమైన, సంస్కారవంతమైన వంశములో గాని, లేదా కర్మయోగి

యొక్క కుటుంబములో గాని జన్మించిన శిశువు యొక్క అంతరంగములో ఈ యోగ సంస్కారములు సుప్తావస్థలో నుండును.

ఒక విశిష్ట కుటుంబములో జన్మించుట ప్రముఖ విషయము కాదు. అట్టి ఆవశ్యకత లేదు కూడా. ఏ కుటుంబములో జన్మించినాడు? అనేది ప్రసక్తము కానే కాదు. యోగ సంస్కారములతో జన్మించిన వాడు ఎక్కడ జన్మించినా మంచియే జరుగును. కాని, ఆతనిలో ప్రకటమయ్యే యోగ సంస్కారము అధర్మ సంస్కారములచే అభిభూతము కాకుండా ఉండాలంటే, కొన్ని విశిష్ట పరిస్థితులు ఆవశ్యకమగును. అట్లు అభిభూతమగుట సంభవమే గదా! శిశువుగా ఉన్నప్పుడు నేర్చుకున్న తప్పుడు సంస్కారములు పూర్వజన్మ నుండి సంక్రమించిన యోగ సంస్కారములను పరాజితము చేయ సమర్థములగును. యోగసంస్కారములు సహజరీతిలో ప్రకటము కావాలంటే, అనగా పూర్వజన్మలో యోగియగు వ్యక్తి ఈ జన్మలో ఆ సంస్కారముల బలముతో దృఢమగు జ్ఞానసాధనను చేయగలగాలంటే, పునర్జన్మను పొందిన అట్టి యోగి అధర్మజీవనము, తప్పుడు జీవన విలువలు మొదలగు వాటిచే పరాజితుడు కారాదు. కావున, ఇట్టి యోగి యోగ్యమగు వాతావరణములో జన్మించినచో, పూర్వజన్మ యందలి సాధనను కొనసాగించగల్గును. ఇందువలననే, సాధకుడు జన్మించే వంశమునకు ప్రాధాన్యమీయబడినది.

సాధకుడు ఎక్కడైననూ జన్మించవచ్చును

యోగసాధనను స్వీకరించిన ప్రతి వ్యక్తి, సంపన్నము సంస్కారవంతము నగు కుటుంబములో గాని, లేదా కర్మయోగి యొక్క కుటుంబములో గాని జన్మించి తీరునని చెప్పుట ఈ రెండు శ్లోకముల తాత్పర్యము కాదు. వివక్ష అది కాదు. ఆత్మజ్ఞానమును కోరు వ్యక్తులు సర్వత్రా జన్మిస్తారు. కాని, మనమిచట సాధకులందరి గురించి చర్చించుటలేదు. ఈ జన్మలో సన్న్యాసులై లక్ష్యమును చేరుకోలేక మరణించిన సాధకుల గురించి మాత్రమే మనము ప్రత్యేకముగా చర్చిస్తున్నాము. ఇట్టి వారు ఉభయభ్రష్టు లగుదురని అర్జునుడు భావించెను. ఏలయన, కర్మానుష్ఠానముచే లభించే సంసారాంతర్గతములగు ఇహపరములను వారు నష్టపోయిరి. వారికి సమదర్శన లక్షణమగు యోగము సిద్ధించలేదు. ఈ తీరున వారు రెండింటికీ చెడినారని అర్జునుడు తలపోసెను. అర్జునుని ఈ చింతకు శ్రీకృష్ణ భగవానుడు సమాధానము నిస్తూ, అట్టి సాధకులు జ్ఞానసాధనకు ఆటంకములు లేని వాతావరణములో జన్మిస్తారని చెప్పెను.

యోగ సంస్కారములు స్థిరముగా నుండును. మానవుడు తన జీవితములో ఒకసారి సావధానచిత్తుడై యోగము నభ్యసించినచో, ఆ యోగ సంస్కారము లేనాడూ నశించవు. కాని, అవి అధర్మముచే కప్పివేయబడినప్పుడు, ఆ సత్యమును సాధకుడు గుర్తించగల్గితే, అతడు ప్రార్థనాయుతమగు జీవనమును గడుపగల్గితే, ఆ అధర్మము క్షయమై, అతడు శుద్ధుడు కాగల్గును. ఈ విధముగా అధర్మ సంస్కారములు నిశ్శేషముగా శాశ్వతముగా క్షయమును పొందును. అప్పుడు యోగ సంస్కారములు పునరుత్థానము చెందుటచే, సాధకుడు తన సాధనను కొనసాగించగల్గును.

పూర్వజన్మార్జితములైన యోగ సంస్కారములను ఆటంకము లేమియూ లేకుండగా సహజరీతిలో కొనసాగించ గలగాలంటే, సాధకుడు ఒక విశిష్ట వాతావరణంలో జన్మించవలెను. ఉదాహరణకు, తండ్రి శ్రద్ధతో వేదాంత శాస్త్రమును అధ్యయనము చేస్తూ ఉంటే, తల్లి సదా వేదాంతమును గురించి మాటలాడుతూ ఉంటే, సాధకుడు సాధనను మొదలిడుటకు అది అద్భుతమగు వాతావరణము అగును. నా బాల్యములో నాకు అట్టి ప్రసంగములు తరుమగా వినపడుతూ ఉండేవి. ఉదాహరణకు, నిద్రపోయే ముందు నేను అమ్మగారిని ఒక వస్తువును ఇమ్మని కోరితే, 'నేను నీకా వస్తువును రేపు ఇస్తాను' అని ఎన్నడూ అనేవారు కాదు. 'రేపు నీవు నిద్ర లేస్తే, నీకు అప్పుడు ఇస్తాను' అని మాత్రమే అనేవారు. 'రేపు నీవు నిద్రలేస్తే' అనే ఈ భావన అద్భుతమైనది. అనగా, 'నీవు జీవించి ఉంటే' అని యర్థము. ఇట్లు మాటలాడేది మా అమ్మగారు ఒక్కరు మాత్రమే గాదు. తల్లులందరు అటులనే చెప్పేవారు. ఆ సంస్కృతి అట్టిది. వాగ్దానమునకు అవకాశము లేదు. జీవించి ఉంటే, చూద్దాము. దీని యర్థమేమనగా, మనకు పరిస్థితులపై పూర్తి నియంత్రణ లేదనే సత్యమును బాల్యము నుండియూ అంగీకరించుట అలవాటైనది.

అంగీకరించే ప్రవృత్తి చాల ప్రముఖమైనది

నియంత్రించుట ఒక సమస్య. నియంత్రించాలి అనుకోగానే సమస్యలన్నీ ఆరంభమగును. దీనికి భిన్నంగా, విస్తట్లో వడ్డించిన అన్నము కూడా చేజారిపోవచ్చుననే సత్యమును మనము అంగీకరించవలెను. కొన్ని విషయాలపై మనకు నియంత్రణ లేదని మనము తెలుసుకొనవలెను. ఇట్టి గుర్తింపు గల వ్యక్తిలో జీవితమును గురించిన మానసిక ప్రవృత్తి చాల ఆరోగ్యకంగా ఉంటుంది. మనము చేయగల్గినది చేసి, ఏది లభిస్తే దానిని స్వీకరించుటకు సంసిద్ధులమై ఉండాలి. బాల్యము నుండియూ ఇట్టి ప్రవృత్తిని కలిగియున్నచో, అది సాధనకు చక్కని ఆరంభము అగును. ఇతర సమస్యలు ఎన్ని ఉన్నా, ఇది మంచి ఆరంభము. మిగిలిన వాతావరణము కూడ అనుకూలముగ

మున్నచో, అనగా విద్య, జీవనమూల్యముల అవగాహన, మరియు మనసు విప్పి మాటలాడుకునే వాయుమండలము కూడ ఉన్నచో, అది సాధకుని సాధనకు అత్యద్భుతమగు ఆరంభము అగును.

ఇట్టి ఆరంభమునే శ్రీకృష్ణుడీ రెండు శ్లోకములలో చెప్పుచున్నాడు. చక్కని సంస్కారములు కలిగి, నీతిబద్ధముగా జీవించే సంపన్నుల గృహములో జన్మించుట సాధకునకు చాల మంచిది యని శ్రీకృష్ణుడు మొదటి శ్లోకములో చెప్పినాడు. తరువాతి శ్లోకములో దీనికంటె గొప్పది, అరుదైనది యగు జన్మను చెప్పినాడు. పండితులైన కర్మయోగుల గృహములో జన్మించుట చాల దుస్సాధ్యమైన పుణ్యఫలము.

ధీమతాం యోగినాం (బుద్ధిమంతులగు యోగులు) అనగా తాము యోగులమనే వివేకము గల ముముక్షువులని యర్థము. మోక్షము కొరకై జ్ఞానము ఆవశ్యకమనియు, తాము జిజ్ఞాసువుల మనియు వారెరుంగుదురు. ఈ లోకములో ఇట్టి తల్లిదండ్రుల కడుపున పుట్టుట (యత్ ఈదృశమ్) చాల దుస్సాధ్యమైన జన్మ (ఏతత్ హి దుర్లభతరం లోకే). సంపన్నుల ఇంటిలో జన్మించుట దుర్లభము. కాని దానికంటె ఈ జన్మ నిశ్చితముగా మరింత దుర్లభమని శ్రీకృష్ణభగవానుడీ శ్లోకములో చెప్పుచున్నాడు. ఇట్టి గృహములో జన్మించిన యోగికి జ్ఞానసాధనకు వాతావరణము, పూర్వశ్లోకములో చెప్పిన దాని కంటె మరింత మంచిదిగా, మరింత అనురూపముగా నుండును. కాన, అతడు తన సాధనను ముందుకు తీసుకుపోవుటలో ఆటంకమేమియూ ఉండనే ఉండదు.

ధనమున్న చోట కొంత అహంకారము ఉండును

సూది బెజ్జము గుండా ఒంటె ఎంత తేలికగా పోగలదో, అంత తేలికగా ధనవంతుడు స్వర్గద్వారము గుండా పోగల్గును అని ఒక సామెత గలదు. ఈ సామెతలోని తాత్పర్యము సంపత్తిని నిందించుట కాదు. కాని, సంపదతో బాటు వ్యక్తిలో కొంత అహంకారము ఉండును. కావున, వినయము ఉండదు. తాను దేనినైనా కొనగలనని, సాధించగలనని ధనవంతుడు తలపోయును. ఇది ప్రధాన సమస్య. సంపద స్వతః సమస్య గాదు.

శ్రీకృష్ణ భగవానుడింకనూ ఇట్లు చెప్పెను:

అధ్యాయము 6, శ్లోకము 43:

तत्र तं बुद्धिसंयोगं लभते पौर्वदेहिकम् ।
यतते च ततो भूयस्संसिद्धौ कुरुनन्दन ॥ ४३ ॥

తత్ర తం బుద్ధిసంయోగం లభతే పౌర్వదేహికమ్ ।
యతతే చ తతో భూయః సంసిద్ధౌ కురునందన ॥ (43)

తత్ర = అక్కడ; పౌర్వదేహికమ్ = పూర్వజన్మలోని దేహమునందుండిన; తం = ఆ; బుద్ధి సంయోగం = బుద్ధితో సంబంధమును; లభతే = పొందును; కురునందన = కురువంశమునకు ఆనందము కలిగించువాడా; తతః = దానికంటె; భూయః = ఎక్కువ; సంసిద్ధౌ = యోగములో విజయము కొరకు; యతతే = యత్నించును.

అచట పూర్వజన్మలోని దేహము నందుండిన ఆ బుద్ధితో సంబంధమును పొందును. కురువంశమును ఆనందింపజేసే అర్జునా! దానికంటె ముందునకు యోగములో విజయము కొరకు ప్రయత్నించును (43).

పూర్వశ్లోకములు రెండింటిలో చెప్పిన రెండు వంశములను తత్ర అను సర్వనామము నిర్దేశించెను. ధర్మమునకు కట్టుబడే, సంస్కారవంతమగు సిరివంత కుటుంబము ఒకటి. యోగుల కుటుంబము రెండవది. వాటిలో జన్మించిన సాధకుడు పూర్వజన్మలో తాను సన్న్యాసియై చేసిన జ్ఞానసాధనను మరల కొనసాగించును.

అతడు పూర్వజన్మలో [illegible] జ్ఞానసాధనను నిర్వర్తించెను. కాని, ఆ దేహము ఉండగా జ్ఞానమును పొందలేకపోయెను. ఇప్పుడు ఈ దేహములో నున్న అతని బుద్ధి పూర్వజన్మ సంస్కారములతో మిళితమై యుండును (తం బుద్ధి సంయోగం లభతే పౌర్వదేహికమ్). [illegible] పూర్వజన్మలో సాధనను [illegible] సాధనను కొనసాగించును.

ఇది ఎప్పుడు సంపన్నమగును? ఈతడు మరల సన్న్యాసి (యతి) అగును. పూర్వజన్మ సంస్కారముల ప్రభావముచే, పూర్వజన్మలో పొందిన దాని కంటె అధికమును పొందుటకై మరింత యత్నమును చేయును (తతః భూయః). దేని కొరకు? యోగసాధనలో విజయమును పొంది (సంసిద్ధౌ), మోక్షరూపమగు జ్ఞానమును పొందుట కొరకు.

శ్రీకృష్ణుడీ శ్లోకములో అర్జునుడు ఉపయోగించిన పదములనే ప్రయోగించెను. 'హే కృష్ణా! యోగములో విజయమును పొందలేకపోయిన ఈ సాధకుడు ఏ గతిని పొందును?' (అప్రాప్య

యోగ సంసిద్ధిం కాం గతిం కృష్ణ గచ్ఛతి)' అని అర్జునుడు ప్రశ్నించెను. శ్రీకృష్ణుడు తన ఉత్తరములో సంసిద్ధిం అను పదమునే వాడెను. సంసిద్ధి యనగా ఆత్మ జ్ఞానరూపమగు యోగఫలము. ఈ సాధకుడు పూర్వజన్మ సంస్కారములతో బుద్ధి సంయోగమును పొంది యున్నాడు గాన, సంసిద్ధిని పొందుటకు మరింత ప్రయత్నమును చేయగల్గును.

పూర్వ జన్మ సంస్కారములతో బుద్ధి సంయోగము

ఇందువలననే శాస్త్రాధ్యయనమును చేసే వ్యక్తి యొక్క సంతానములో కనీసం ఒక్కరైనా బాల్యములో శాస్త్రమునందు అభిరుచిని చూపును. ఈ బాలుడు తండ్రి వద్దకు పోయి కూర్చుండును. సాధారణంగా పిల్లలకు అభిరుచి ఉండే విషయములలో ఈ బాలునకు అభిరుచి ఉండదు. ఎందువలన? అతడు బుద్ధిలో పూర్వజన్మ సంస్కారములతో సంయోగమును పొందినాడు గనుక.

శ్రీకృష్ణుడు అర్జునుని ఈ శ్లోకములో కురునందన యని సంబోధించెను. అర్జునుడు జన్మించిన వంశమునకు కురువంశమని పేరు. కురు నందనుడనగా కురువంశమునకు ఆనందమును కలిగించువాడు. అర్జునుడు ప్రస్తుత జన్మలో పొందిన అనుకూలస్థితిని అతనికి గుర్తుచేయుటకై శ్రీకృష్ణుడీ విధముగా సంబోధించి యుండవచ్చును. శ్రీకృష్ణుడింకనూ ఇట్లు చెప్పెను:

అధ్యాయము 6, శ్లోకము 44:

पूर्वाभ्यासेन तेनैव ह्रियते ह्यवशोऽपि सः ।
जिज्ञासुरपि योगस्य शब्दब्रह्मातिवर्तते ॥ ४४ ॥

పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోఽపి సః
జిజ్ఞాసురపి యోగస్య శబ్ద బ్రహ్మాతి వర్తతే (44).

అపి = మరియు; **సః** = అతడు; **తేన** = ఆ; **పూర్వాభ్యాసేన ఏవ** = పూర్వజన్మ యందలి అభ్యాసము చేతనే; **అవశః** = స్వీయ నియంత్రణ లేనివాడై; **హ్రియతే** = ముందుకు కొనిపోబడును; **యోగస్య** = యోగమును; **జిజ్ఞాసురపి** = తెలియగోరువాడు కూడ; **శబ్దబ్రహ్మ** = వేదమును; **అతివర్తతే** = అతిక్రమించును.

మరియు అతడు ఆ పూర్వ జన్మయందలి అభ్యాసము చేతనే
స్వీయనిర్ణయముతో సంబంధము లేకుండగా ముందుకు కొనిపోబడును.
యోగమును తెలియగోరువాడైననూ వేదము నతిక్రమించును (44).

ఈ సాధకుడు జ్ఞానసాధనము ప్రారంభించిన పిదప జ్ఞానమును పొందునా? యను శంకను శ్రీకృష్ణుడీ శ్లోకములో నివారించుచున్నాడు. అతనికి జ్ఞానము ఉదయించదనుకొనుడు. అపుడాతనికి యేమగును? అను ప్రశ్నకు శ్రీకృష్ణుడీ శ్లోకములో ఉత్తరము నిచ్చుచున్నాడు. ఆ సాధకుడు బాల్యము నందు స్టార్ టి.వి. మొదలగు వాటిచే అధికముగా ప్రభావితుడై భోగలాలసుడై నాడనుకొనుడు. మానవుడు పతనమయ్యే మార్గములు ఈ జీవితములో లెక్కలేనన్ని గలవు. ఈ సాధకుడు అట్టి ఒక మార్గములో పడి దారి తప్పినాడనుకొనుడు. అపుడాతని పూర్వజన్మలోని యోగ సంస్కారముల గతి యేమి?

ఇచట అట్లు అనుకొనే ప్రసక్తి లేదని శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు. ఆతనికి యోగము నందు అభిరుచి లేకపోయినా, అతడు దానిని పరిహరించగోరినా, పూర్వజన్మ సంస్కారబలముండుటచే యోగసాధన అతనిని విడనాడదు. అతడు దానిని ఎంత పరిహరింపగోరినా, అది అతనిని తన వశము చేసుకొనును. అతడు చేయగలిగినది లేదు (అవశః అపి హ్రియతే). ఎందువలన? పూర్వజన్మ యందు అతడు యోగసాధనను స్వీకరించి అభ్యసించుట వలన (పూర్వాభ్యాసేన తేన ఏవ). ఈ జన్మలో సాధకుడగుటకై అతడు క్రొత్తగా ప్రయత్నింప బని లేదు. అతనిని జ్ఞాన మార్గములో ముందుకు గొనిపోవుటకు పూర్వజన్మాభ్యాసము చాలును.

ఈ విషయము అతని అధీనములో లేదని 'అవశః' అను పదము సూచించును. యోగము పూర్వాభ్యాస బలముచే, అతనికి అభిరుచి లేకున్ననూ, తన వైపునకు లాగుకొని, తన వశము చేసుకొని, తనలో లీనము చేసుకొనును.

కాన, అతనికి దాని యందు అభిరుచి ఉండును. వాస్తవంలో అతనికి అది తక్క మరియొక దానియందు అభిరుచి ఉండదు. అతడు దానిని సమగ్రముగా తెలియగోరును. ఒకవో అతనికి దాని యందు అధికముగు అభిరుచి లేకున్ననూ, అతనికి గల అభిరుచి అత్యల్పమే అయిననూ, ఈ యోగము అతనిని వెంటాడి యుండును. ఆత్మ జ్ఞానమనగా నేమి? ఈ జ్ఞానమును గురించి చేయబడ్డ విస్తారముగు వర్ణల అర్థమేమి? ఇత్యాది ప్రశ్నలకు అతడు సమాధానమును తెలియగోరును.

యోగము నందు సరళమైన ఉత్కంఠారూపమగు ఇచ్ఛ అతనికి చాలునని శ్రీకృష్ణుడిచట చెప్పుచున్నాడు. అట్టి ఇచ్ఛను ఆధారముగా చేసుకొని అతడు శబ్దబ్రహ్మకు, అనగా వేదములోని కర్మకాండ భాగమునకు అతీతుడగును. ఆ ఇచ్ఛచే అతడు కర్మల నన్నిటినీ వీడి, మరల సన్న్యాసియై, జ్ఞానసాధనను కొనసాగించును.

అతనికి వేదాంతము అనే విషయ వస్తువును వీడి, ఇతరము నందు అభిరుచి ఉండదు. వేదములో వివరింపబడిన సాధన సాధ్యముల యందు అతనికి లేశమైననూ అభిరుచి ఉండదు. అనగా, అతడు చిరకాలములోనే తన సహజ లక్షణమగు వైరాగ్యమును సాక్షాత్కరించుకొనును.

ఒకసారి ఆత్మ విచారమును ఆరంభించిన పిదప వెనుకకు మరలే ప్రసక్తి లేదు

అర్జునుని ప్రశ్నకు శ్రీకృష్ణ భగవానుడు ఇట్లు ఉత్తరము నిచ్చినాడు. ఆత్మ విచారమును ఆరంభించిన సాధకుడు వెనుకకు మరలే ప్రసక్తి లేదు. అతడు దుర్గతిని పొందే ప్రసక్తియూ లేదు. అతడు తన చరమ లక్ష్యమగు ఆత్మజ్ఞానమును పొందే వరకు నిరంతర సాధన కొనసాగును. అంతవరకు సాధన ఆగేది కాదు. ఇతర పరిస్థితులు అతని సాధనను ఏ మాత్రమూ ప్రభావితము చేయలేవు. ఇది ఒక హామీ. శ్రీకృష్ణ భగవానుని వచనమే ఈ విషయములో ప్రముఖ ప్రమాణమై యున్నది. దీనికి పోషకములగు యుక్తులు కొన్ని గలవు. ఈ విషయము సత్యమా, కాదా యను దానిని నిరూపించే మార్గాంతరము లేదు గాన, భగవానుని వచనములే ప్రమాణము.

శ్రీకృష్ణ భగవానుడు తరువాతి శ్లోకములో ఈ సాధన యొక్క అంతిమ ఫలమును వివరించుచున్నాడు:

అధ్యాయము 6, శ్లోకము 45:

प्रयत्नाद्यतमानस्तु योगी संशुद्धकिल्बिषः ।
अनेक जन्मसंसिद्धस्ततो याति परां गतिम् ॥ ४५ ॥

ప్రయత్నాద్యత మానస్తు యోగీ సంశుద్ధ కిల్బిషః
అనేక జన్మ సంసిద్ధస్తతో యాతి పరాం గతిమ్ (45).

తు = కానైతే; **ప్రయత్నాత్** = సంకల్పము వలన; **యతమానః** = శ్రమను చేయు; **యోగీ** = యోగి; **సంశుద్ధకిల్బిషః** = మాలిన్యములు తొలగినవాడై; **అనేక జన్మ సంసిద్ధః** = అనేక జన్మలలో సిద్ధి (విజయము) ని పొందిన వాడై; **తతః** = అప్పుడు; **పరాం** = సర్వశ్రేష్ఠమగు; **గతిం** = లక్ష్యమును; **యాతి** = పొందును.

> దీనికి భిన్నముగా, సంకల్పముతో శ్రమను చేయు యోగి మాలిన్యములు తొలగినవాడై, అనేక జన్మల కృషి ఫలించగా, అపుడు సర్వోత్కృష్టమగు లక్ష్యమును చేరుకొనును (45).

అర్జునుడు ప్రశ్నించుటకు ముందు శ్రీకృష్ణ భగవానుడు యోగమును గురించి, యోగిని గురించి ప్రసంగించుచుండెను. ఆయన అదే ప్రకరణమును మరల ఈ శ్లోకములో మొదలిడి కొనసాగించుచున్నాడు. సర్వప్రాణులలో సమబ్రహ్మను దర్శించుట యోగమని ఆయన నిర్వచించియున్నాడు. ఇపుడు ఆయన ఆ దర్శనము గల యోగిని గురించి మాటలాడుచున్నాడు. అతడు యతమానుడు, అనగా ప్రయత్నశీలి. ప్రయత్నాత్ యతమానః అను రెండు పదములకు అర్థము సమానమే. ఈ రెండు పదముల సార్థకతను శ్రీ శంకరులు స్పష్టము చేసిరి. ప్రయత్నమనగా ఇచట సాధకుని సంకల్పశక్తి. ఇచట పొందదగిన గమ్యము చాల క్లిష్టమైనది. కాన, సాధకునికి దృఢమగు సంకల్పశక్తి ఉండవలెను. సాధకుడు అనేక విఘ్నములను అధిగమించవలెను. కావున, ప్రయత్నాత్ యతమానః అనగా తన సంకల్పశక్తితో యత్నమును చేయుచున్నవాడు అని యర్థము.

హరిః ఓం తత్సత్

మాలిన్యములన్నియూ తొలగిపోయిన (సంశుద్ధకిల్బిషః) యోగిని గురించి మనమిచట చర్చిస్తున్నాము. కిల్బిషము లనగా రాగద్వేషములు, పాపములు, వాటి వలన మనస్సులో నిర్మాణమయ్యే అపరాధి భావన ఇత్యాదులు. ఇట్టి కిల్బిషముల నన్నింటినీ, కర్మయోగ జీవనమును గడిపిన యోగి దాని ప్రభావముచే తొలగించుకొని శుద్ధుడైనాడు (సంశుద్ధకిల్బిషః). ఈ శుద్ధి ఒక జన్మలో కలిగినది కాదనియు, ఈ కిల్బిషములను తొలగించుటకు అనేక జన్మలు పట్టినవనియు శ్రీకృష్ణ భగవానుడు చెప్పెను.

జిజ్ఞాసువు అగుట సామాన్యమగు ఉపలబ్ధి కాదు

ముముక్షువు యొక్క ఉపాధి (దేహము) యందు జన్మించుట, మోక్షమునందు ఇచ్ఛ కలుగుట అనునవి సామాన్యమగు ఉపలబ్ధులు కావు. ఈ జిజ్ఞాస కలుగుటకు కొన్ని జన్మల సాధన అవశ్యకమగును. అనేక పూర్వజన్మలలో చేసిన సాధనల వలన ప్రస్తుత జన్మలో వ్యక్తి గీతను అధ్యయనము చేయుచున్నాడు. వ్యక్తికి విచారము నందు, జ్ఞానము నందు అకాంక్ష కలుగుట అనేక జన్మల పుణ్యఫలమని ఈ శ్లోకములో చెప్పబడినది (అనేక జన్మ సంసిద్ధః).

మోక్షము నందు ఇచ్ఛ కలుగుట అనేక జన్మల పుణ్యఫలము. ఈ జ్ఞానము లభించుటకు యోగ్యమగు అంతఃకరణము మరియు యోగ్యమగు దేహము (ఉపాధి) అవశ్యకమగును. అనేక జన్మల తరువాత ఈ అర్హతల నన్నిటినీ సంపాదించిన యోగిని గూర్చి మనము చర్చిస్తున్నాము. అతడు ప్రతి జన్మలో జ్ఞానసాధనకు అనురూపమగు యోగ సంస్కారములను కొద్దికొద్దిగా ప్రోగుచేసుకొనెను.

కొందరు కొద్ది కొద్దిగా ధనమును ప్రోగుచేసి లక్షాధికారులు అగుదురు. యోగ సంస్కారములను అనేక జన్మలలో ప్రోగుచేసుకొని యోగి యగుట అట్టిదియే. ఇది ఒక విలక్షణమైన సంపద. యోగ సంస్కారములను అధికముగా ప్రోగుచేసుకున్న వ్యక్తిని గూర్చి మనమిచట పరిశీలిస్తున్నాము. పరమలోభి ధనమును ప్రోగుచేసిన రీతిలో, అతడు యోగ సంస్కారములను ప్రోగుచేసుకున్నాడు. అతడు దాచుకున్న పుణ్యము అతనిని ఈనాడు అనేక జన్మ సంసిద్ధుని చేసినది. కావున (తతః), ఈ విధముగా సజ్జితుడైన ఆ వ్యక్తి జ్ఞానార్హతను పొందినాడు.

ఇచట సంసిద్ధః అనగా స్పష్టమగు జ్ఞానము గలవాడు అని కూడ అర్థమును చెప్పవచ్చును. ఏలయన, ఈ యోగి సంశుద్ధ కిల్బిషుడు. అనగా, పరిశుద్ధమైన అంతఃకరణము గలవాడై, సమదర్శనము అనే సంసిద్ధిని పొందినవాడు. అనేక జన్మలలో ప్రోగుచేసుకున్న యోగ సంస్కారముల

ఫలమే ఈ సుస్పష్టమగు జ్ఞానము. కావున, సుస్పష్టమగు జ్ఞానము గల యోగి అనేక జన్మ సంసిద్ధః అని వర్ణింపబడినాడు.

అంతము లేని అంతము

జ్ఞానమే మోక్షము గనుక, ఈతడు మోక్షమనే పరమోత్కృష్టమగు గతి (పరాగతి)ని పొందినాడని చెప్పవచ్చును. అంతము లన్నింటికీ అంతము గలదు. కాని, మోక్షము అంతము లేని అంతము. దాని నుండి పునరావృత్తి లేదు. వాస్తవంలో, అంతము అయ్యే అంతము ఏదైనా అంతము కానే కాదు. అది ఒక తాత్కాలిక విశ్రామస్థానము మాత్రమే. పైగా, ఈ విశ్రామ స్థానములలో చక్రభ్రమణములు గలవు. అంటే, మనము సంసార చక్రములో గిరగిర తిరుగుతూనే ఉంటాము గాని, బయటపడలేము. మనము గిరగిర తిరిగి మరల అదే ఆరంభ బిందువు వద్దకు చేరుకుంటాము. మోక్షము ఇట్టి లక్ష్యము కాదు. దాని నుండి పునరావృత్తి లేదు. ఈ తేడాను చూపుటకై గతి శబ్దమునకు పరా అను విశేషణము ప్రయోగింపబడినది. పరా యనగా సర్వోత్కృష్టము. ఆత్మజ్ఞానము కొరకు యత్నించువానికి ఇది లభించును.

అందువలన, నీవు యోగివి కమ్మని శ్రీ కృష్ణ భగవానుడు అర్జునునకు తరువాతి శ్లోకములో చెప్పుచున్నాడు:

అధ్యాయము 6, శ్లోకము 46

तपस्विभ्योऽधिको योगी ज्ञानिभ्योऽपि मतोऽधिकः ।
कर्मिभ्यश्चाधिको योगी तस्माद्योगी भवार्जुन ॥ ४६ ॥

తపస్విభ్యోధికో యోగీ జ్ఞానిభ్యోపి మతోధికః
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున (46)

యోగీ = యోగి; **తపస్విభ్యః** = తపోనిష్ఠుల కంటె; **అధికః** = గొప్పవాడు; **జ్ఞానిభ్యః** = జ్ఞానుల కంటె; **అపి** = కూడా; **అధికః** = గొప్పవాడుగా; **మతః** = పరిగణింపబడినాడు; **చ** = మరియు; **కర్మిభ్యః** = కర్మిష్ఠుల కంటె; **యోగీ** = యోగి; **అధికః** = గొప్పవాడు; **అర్జున** = ఓ అర్జునా!; **తస్మాత్** = అందువలన; **యోగీ** = యోగివి; **భవ** = కమ్ము.

యోగి తపోనిష్ఠుల కంటె, జ్ఞానుల కంటె, మరియు కర్మిష్ఠుల కంటె కూడ గొప్పవాడుగా పరిగణింపబడినాడు. ఓ అర్జునా! అందువలన నీవు యోగివి కమ్ము (46).

ఇచట అధికుడు అనగా ఉత్కృష్టుడు, సర్వశ్రేష్ఠుడు. వ్యక్తి ఇట్టి అధికుడు కావాలి. సర్వశ్రేష్ఠుడగు వ్యక్తి యోగి యనబడునని శ్రీకృష్ణుడు ఇంతకు ముందు నిర్వచించి యున్నాడు. ఆయన మరల ఈ నిర్వచనమును రాబోవు శ్లోకములో ఆవృత్తి చేస్తాడు. ప్రస్తుత శ్లోకంలో, ఈ యోగి వివిధరకముల ధ్యానము ననుష్ఠించే తపశ్శాలుల కంటె ఉత్కృష్టుడనియు, వేదోక్త కర్మల నాచరించే కర్మిష్ఠుల కంటె ఉన్నతుడనియు వర్ణింపబడినాడు.

తపస్వులు, కర్మిష్ఠులు అను వారిద్దరు ముముక్షువులే. వారిని కించపరుచుట ఇచటి అభిప్రాయము కాదు. వాస్తవంలో, వారు యోగి అగుట అనే ఏకైక ప్రయోజనము నుద్దేశించి మాత్రమే తమ తమ కార్యక్షేత్రములలో వ్యాపృతులై యున్నారు. యోగి వారందరిలో ఉత్కృష్టుడు. అతడు బ్రహ్మాభిన్నమగు ఆత్మను ధ్యానించుట అనే ధ్యానయోగము ననుష్ఠించుచుండును. లేదా, అతడు ధ్యానయోగ గమ్యమగు ఆత్మజ్ఞానమును పొందినవాడైననూ కావచ్చును. ఇట్టి యోగి వారిద్దరి కంటె నిశ్చితముగా ఉన్నతుడని ఈ శ్లోకములో చెప్పబడినది.

పాండిత్యము చేత మాత్రమే సాక్షాత్కారము సిద్ధించదు

ఇచట తపస్వి యనగా ఒక విశిష్ట లక్ష్యమును పొందగోరు వాడు కాదు. ఈ తపస్వి యొక్క తపస్సు ప్రస్తుతింపబడుచున్న యోగిలో మాత్రమే లీనమగును. కావున, యోగి తపస్వి కంటె శ్రేష్ఠుడని చెప్పవచ్చును (తపస్విభ్యః అధికః యోగీ). అదే విధముగా, యోగి పండితుల కంటె గొప్పవాడు (జ్ఞానిభ్యః అధికః యోగీ). జ్ఞానులు అనగా వేదము నెరింగినవారు. వారు వేదమును పఠించెదరు. వారికి ఆ పదముల అర్థము కూడ తెలిసియుండవచ్చును. కాని, పాండిత్య మాత్రము చేత మానవుడు వేదముల దర్శనరూపమైన జ్ఞానమును పొందజాలడు. సర్వప్రాణులలో సమమైన బ్రహ్మను దర్శించుట అను స్థితికి దరిదాపులకు రావాలన్నా, వ్యక్తి ఈ జ్ఞానమునకు అంకితుడై, దానిని సాధన చేయవలెను.

ఈ శ్లోకము ఆత్మ సాక్షాత్కారము గల యోగిని వర్ణించుచున్నది. కావున, ఇచట చెప్పిన పాండిత్యములో వేదాంతము అంతర్గతము కాజాలదు. కావున, ఈ ప్రకరణములో, జ్ఞాని యనగా

మన చర్చలో విషయమైన యోగి కంటె భిన్నమగు వ్యక్తి యగును. శ్రీ శంకరులీ విషయమును తమ భాష్యములో స్పష్టము చేసిరి. ఇచట జ్ఞానులు అనగా వేదము యొక్క పూర్వకాండయగు పూర్వ మీమాంసా శాస్త్రములో పండితులై వేదార్థము (శాస్త్రార్థము) తెలిసిన వారని యర్థము. ఈ పాండిత్యములో వేదాంత శాస్త్రమును కూడా కలుపుకొనవచ్చును. ఏలయన, పండితులకు పదముల అర్థము తెలిసినమా, ఆ అర్థము తామే అను ఎరుక లేకపోవచ్చును. కాని, ఈ పాండిత్యములో వేదాంత శాస్త్రమును అంతర్గతము చేయకపోవుటయే మేలు. ఏలయన, ఈ శ్లోకము కూడ వేదాంత శాస్త్రమే గదా! కావున, ఈ జ్ఞానులకు వేదాంత శాస్త్రము తక్క ఇతర శాస్త్రముల యందు పాండిత్యము గలదు. వారి ఆ పాండిత్యమునకు ఫలము ఈ యోగము. సర్వమునకు సత్యాధిష్ఠానమగు ఆత్మవస్తువు యొక్క యాథార్థ్య దర్శనము ఈ యోగము యొక్క విశిష్ట లక్షణము. ఈ దర్శనము గల యోగి పండితుల కంటె ఉత్తముడని చెప్పబడును (జ్ఞానిభ్యః అధికః యోగీ).

కావున యోగివి కమ్ము

పండితుల కంటె, తపశ్శాలుల కంటె ఉత్కృష్టుడగు ఈ యోగి వైదిక కర్మల నాచరించు వారి కంటె కూడా ఉత్కృష్టుడని తెలియవలెను (కర్మిభ్యశ్చ అధికః యోగీ). కావున, అర్జునుడు ఏమి కావాలి? శ్రీకృష్ణుని ఆదేశమేమి? ఓ అర్జునా! యోగివి కమ్ము (తస్మాత్ యోగీ భవ అర్జున) అని శ్రీకృష్ణుడు చెప్పెను. ఈ సలహాను పొంది అర్జునుడేమి చేయాలి? శ్రీకృష్ణుడింతవరకు చెప్పిన దానిని బట్టి, ఈ యోగి (సన్న్యాసి) సర్వమును విడిచి ధ్యానము నందు కూర్చుండును. అంటే, అర్జునుడు కూడా అటులనే చేయవలెనని అర్థము కాదా?

అర్జునుని విషయంలో సన్న్యాసము కంటె కర్మయే శ్రేష్ఠతరమని వివరించి, లేచి నిలబడి యుద్ధమును చేయుమని అర్జునునకు ముందుగా శ్రీకృష్ణుడు ఉపదేశించెను. కాని, ఇప్పుడు ఆయన అర్జునుని సన్న్యాసివి అగుమని బోధించుచున్నట్లున్నదే? శ్రీకృష్ణుని తాత్పర్యము ఏమి? అర్జునుడు మరల అయోమయంలో పడినాడు.

ముందుగా కర్మయోగి, తరువాతనే యోగి

శ్రీకృష్ణుని తాత్పర్యమేమనగా సాధకుడు ముందుగా కర్మయోగ జీవనమును గడిపి, మనస్సును జ్ఞానమునకు సజ్జితముగా చేసుకొనవలెను. అపుడా సాధకుడు యోగి, లేక సన్న్యాసి

కావచ్చును. అంటే, సాధకుడు ముందుగా కర్మయోగియై, తరువాత యోగి కావాలి. 'అర్జునా! యోగివి కమ్ము (యోగీ భవ అర్జున)' అనుటలో శ్రీకృష్ణుని తాత్పర్యమిదియే.

ఈ ప్రకరణములో యోగి యనగా సమ్యగ్దర్శన నిష్ఠుడగు సన్న్యాసి. 'ఓ అర్జునా! అట్టి సన్న్యాసివి కమ్ము. నీవు కర్మను గాని, ఇతరమును గాని వీడ బని లేదు. పలాయనము వలన ప్రయోజనమేమియూ సిద్ధించదు. సమ్యగ్దర్శనము గల యోగి యొక్క స్థాయిని చేరుకొనుటకై యత్నమును చేసి, అట్టి యోగివి కమ్ము' అని శ్రీకృష్ణుడు చెప్పుచుండెను.

శ్రీ కృష్ణుడీ శ్లోకములో ఈ యోగిని ఇతర యోగులతో పోల్చుటకు కారణమేమి? యోగి అను మాట వినబడగానే, మనస్సులో అనేక భావనలు ఉద్బుద్ధమగును. నేను ఏ యోగిని కావాలి? అనే ప్రశ్న ఉదయించును. ప్రతి వ్యక్తి తాను సర్వశ్రేష్ఠ పురుషుడు కావాలని కోరుట సహజము. కావుననే, శ్రీకృష్ణుడు ఈ యోగిని తపశ్శాలులతో, పండితులతో, మరియు కర్మిష్ఠులతో పోల్చి చూపెను. ఈ యోగి వీరందరి కంటె ఉత్తముడు గనుక, అట్టి సర్వశ్రేష్ఠుడగు యోగి కావాలని ఆయన అర్జునుని హెచ్చరించెను.

శ్రీకృష్ణుడు గీతలోని ఈ ఆరవ అధ్యాయములో దుఃఖముతోడి సంయోగము నుండి విముక్తియే (దుఃఖ సంయోగ వియోగః) యోగమని నిర్వచించెను. ప్రస్తుత శ్లోకమును ఆ నిర్వచనము దృష్ట్యా అర్థము చేసుకొనవలెను. సర్వప్రాణుల యందు ఆత్మను, ఆత్మ యందు సర్వప్రాణులను దర్శించుట అనే సమదర్శనము శ్రీకృష్ణుని ఉపదేశములో ప్రముఖ భాగము.

మనమిచట ఇట్టి సమదర్శనము గల యోగిని గురించి చర్చిస్తున్నామని శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములో సుస్పష్టము చేయుచున్నాడు.

అధ్యాయము 6, శ్లోకము 47:

योगिनामपि सर्वेषां मद्गते नान्तरात्मना ।
श्रद्धावान् भजते यो मां स मे युक्ततमो मतः ॥ ४७ ॥

యోగినామపి సర్వేషాం మద్గతేనాంతరాత్మనా
శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః (47)

యః = ఎవడైతే; **మద్గతేన** = నా యందు లీనమైన; **అంతరాత్మనా** = మనస్సుతో; **శ్రద్ధావాన్** = శ్రద్ధ గలవాడై; **మాం** = నన్ను; **భజతే** = ధ్యానించునో; **సః** = అతడు; **సర్వేషాం** = అందరు; **యోగినాం అపి** = యోగులలో కూడ; **యుక్తతమః** = ఉత్కృష్టతముడని; **మే** = నా; **మతః** = అభిప్రాయము.

> శ్రద్ధ కలిగి ఎవడైతే నా యందు లీనమైన మనస్సుతో నన్ను ధ్యానించునో,
> అతడు యోగులందరిలో కూడా ఉత్కృష్టతముడని నా అభిప్రాయము
> (47).

యోగులలో అనేక రకములు గలరని శ్రీకృష్ణునకు తెలియును. కాని, ఆయన ఇచట వారెవ్వరి గురించియూ మాటలాడుట లేదు. విభిన్న దేవతలను ధ్యానించే యోగులు, తాము ధ్యానించు దైవమును తమ కంటె భిన్నముగా దర్శించు ద్వైతులు. కావున, వారిలో కర్తృత్వభావన స్థిరముగ నుండును. వారు ఆ భావనతో విభిన్నరకముల యోగము ననుష్ఠించెదరు. ఈ ధ్యానయోగులందరు శ్లాఘనీయులే. కాని, శ్రీకృష్ణుడిచట యోగులలో కెల్లా శ్రేష్ఠుడు (యోగినాం అపి సర్వేషాం యుక్తతమః) అని నిర్దేశించిన వ్యక్తి వారిలోని వాడు కాదు.

ఒకానొక విశిష్టదైవమును గాక, శ్రీకృష్ణ భగవానుని ధ్యానించే యోగిని గూర్చి మనమిచట వర్ణిస్తున్నాము. ఈ సర్వము తానే అయిన, జగత్కారణమైన పరమేశ్వరుని అతడు జీవాత్మ కంటె అభిన్నముగా ధ్యానించును. ఈ యోగి యొక్క మనస్సు పరమేశ్వరుని యందు, 'నేనే ఆయన, ఆయనయే నేను' అను విధముగా పూర్ణముగా లగ్నమైనది (మద్గతే నాంతరాత్మనా). ఈతని దర్శనములో జీవేశ్వరుల మధ్య భేదము లేదు. ఇందువలననే, ఈతడు యోగులలో కెల్లా శ్రేష్ఠుడని పరిగణింపబడినాడు.

ఇచ్చట విభిన్న యోగులు ఇద్దరు లేరు

పూర్వ శ్లోకములోని యోగిని శ్రీకృష్ణుడు ప్రస్తుత శ్లోకములోని యోగితో పోల్చుచున్నాడని భావింపరాదు. ఆయన ఆ యోగినే మరల వర్ణించుచున్నాడు. ఈ అంశమును విస్మరించే అవకాశము లేకపోలేదు. అట్లు విస్మరిస్తే, మన అవగాహనలో సమస్యలు తలయెత్తును. ఈ యోగి తపశ్శాలుల కంటె, వేదపండితులకంటె మరియు కర్మిష్ఠుల కంటె శ్రేష్ఠుడు. శ్రేష్ఠుడగుటకు కారణమేమి? పరమేశ్వరుని (పరమాత్మను) మాత్రమే ధ్యానించుటచే ఆతని మనస్సు సమగ్రముగా లీనమైనది. ఇట్టి అభేదమును పొందిన ఈ వ్యక్తి యోగ సంసిద్ధుడని చెప్పబడెను.

ధ్యానము అనే విషయవస్తువును వివరించే ఈ అధ్యాయము వాస్తవంలో పూర్వశ్లోకములోనే అంతమైనది. కాని, శ్రీకృష్ణుడు యోగస్వరూపమును మరొక్కసారి క్లుప్తముగా చెప్పదలచెను. పరమేశ్వరునకు, జీవునకు మధ్య అభేదమే యోగము. ఈ యోగమును ఎవరు పొందెదరు? శ్రద్ధగలవాడు (శ్రద్ధావాన్) పొందును. జ్ఞానరూపమగు మోక్షమును పొందుటకు శాస్త్రము సాధనము (ప్రమాణము) అనే గుర్తింపునుండి పుట్టే మానసిక ప్రవృత్తి (attitude) కి శ్రద్ధయని పేరు. ఇట్టి శ్రద్ధావంతుడు శాస్త్రప్రతిపాదితమగు జీవేశ్వరాభేదము స్పష్టముగా గోచరించు వరకు పరమేశ్వరుని ధ్యానించి, జ్ఞానమును పొందును. జ్ఞానమును పొంది ఈ వ్యక్తి యోగి అయినాడు. ఈతడు మానవులలో ఉత్తముడు. ఈ యోగి కంటె గొప్పవారు ఎవ్వరూ లేరు.

ఈ శ్లోకముతో ఆరవ అధ్యాయము ముగిసినది.

इति श्रीमद्भगवद्गीतासूपनिषत्सु ब्रह्मविद्यायां
योगशास्त्रे श्रीकृष्णार्जुन संवादे ध्यानयोगो
नाम षष्ठोऽध्याय: ॥ ६ ॥

ఇతి శ్రీ మద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మ విద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే ధ్యానయోగో
నామ షష్ఠోఽధ్యాయః.

ఉపనిషత్తుల సారభూతమైనది, బ్రహ్మజ్ఞానము, యోగము అనే రెండు విషయవస్తువులు గలది అగు భగవద్గీతలో, శ్రీకృష్ణార్జునుల మధ్య జరిగిన సంవాదములో, ధ్యానయోగము అను పేరుగల ఆరవ అధ్యాయము ముగిసినది.

ఆరవ అధ్యాయము ముగిసినది. దీనితో గీతలోని మూడు షట్కములలో మొదటి షట్కము ముగిసినది. పద్దెనిమిది అధ్యాయములలో తత్ త్వం అసి అనే ఏకైక విషయవస్తువు అనుస్యూతముగా నుండుట వాస్తవమే అయినా, మూడు షట్కములలో పరస్పరము స్పష్టమగు భేదము గలదు. మనకు ఈ భేదము ఏడవ అధ్యాయమును చదివినప్పుడు స్పష్టము కాగలదు. తత్ త్వం అసి అనే సమీకరణము ఈ మూడు షట్కములలో ఒక క్రమములో ప్రతిపాదింపబడును. మొదటి షట్కములో త్వం పదార్థము విశ్లేషింపబడినది. రెండవ షట్కములో తత్పదార్థము విశ్లేషింపబడును. ఈ తత్, త్వంలను సమీకరణము చేసే అసి పదార్థము మూడవ షట్కములో విశ్లేషింపబడును. ఈ విధముగా ఈ మూడు

షట్కములు త్వం పదార్థమును, తత్పదార్థమును, మరియు అసి పదార్థమును యథాక్రమముగా నిరూపించును.

మొదటి ఆరు అధ్యాయముల సారాంశము

మీరు ఇంతవరకు చూచిన ఆరు అధ్యాయములలో ధర్మాధర్మ సంఘర్షణ గల, త్వం పదవాచ్యుడగు జీవుడు ప్రతిపాదింపబడినాడు. అర్జునుని క్లిష్టసమస్య వర్ణింపబడినది. ఆతని ప్రేమానురాగములకు, ఆతని కర్తవ్య కర్మానుష్ఠానమునకు మధ్య సంఘర్షణ యేర్పడెను. మానవుని విధి ఒకవైపు ఉంటే, ప్రేమానురాగములు మరోవైపు ఉంటాయి. అర్జునునకు విధి నిర్వహణ కంటె ప్రేమానురాగములే బలీయముగా నుండెనని స్పష్టమైనది.

విధికి ప్రేమానురాగములతో ఘర్షణ రానంతవరకు, దానిని నిర్వర్తించుట సరళమే. మరియు, వ్యక్తికి విధి నిర్వహణ యందు గల నిష్ఠ, ప్రేమానురాగములచే పరాజితము కాని విధముగా దృఢముగా నున్నచో ఆతడు విధియొక్క పిలుపు నందుకొని, తన కర్తవ్యమును పూర్తిచేయును. అనగా ఆతని ప్రేమానురాగములు విధి నిర్వహణముందు అణగి మణగియున్నవని స్పష్టమగుచున్నది. కాని, అప్పుడప్పుడు ప్రేమానురాగములు విధి నిర్వహణపై విజయమును సాధించును. అపుడు సంఘర్షణ ఏర్పడును. వ్యక్తి విధిని తేలికగా త్రోసిపుచ్చలేడు గదా! అది కర్తవ్యమనే జ్ఞానము వ్యక్తికి గలదు. ప్రేమానురాగములను త్రోసిపుచ్చుటయూ మిక్కిలి కష్టము. మానవుడు కొన్ని సందర్భములలోనైనా వాటిని అనుసరించుటను బట్టి, అవి బలీయములని తేలుచున్నది. అవి కొన్ని సందర్భములలో వ్యక్తిని పూర్తిగా పరాభూతుని చేయ సమర్థములు. అర్జునుని విషయములో అట్లే జరిగినది.

అర్జునునకు సంప్రాప్తమైన సంకట పరిస్థితి

ఈ యుద్ధములో రక్తపాతము అధికముగా నుండగలదు. కావున, ఇట్టి క్లిష్టపరిస్థితి నుండి బయటపడాలని కోరుటలో అర్జునుని వాదము న్యాయసమ్మతమైనదియే. యుద్ధమనే కర్మలో మానవసంహారము ప్రముఖ భాగము గనుక, అర్జునుని సమస్యకు న్యాయసమ్మతమైన ఆధారము గలదు. ప్రథమాధ్యాయములో అర్జునుడు తాను చిక్కుకున్న ధర్మ సంకటమును విస్తారముగా నిరూపించినాడు. ఆతడీ ప్రతిపాదనను ముగించి, రథములో వెనుకకు కూలబడి, యుద్ధమును విడుటకు సంసిద్ధుడైనాడు.

అతడు యుద్ధమును చేయుటకు సంసిద్ధుడై యుద్ధరంగమునకు వచ్చినాడు. తాను ఎవరితో యుద్ధమును చేయబోవుచున్నాడో, వారినందరినీ చూడగలిగే స్థానములో రథమును నిలబెట్టుమని కూడ అతడు శ్రీకృష్ణుని కోరియున్నాడు. కాని, ఆ వ్యక్తులను చూచినంతనే, పరిస్థితి మారిపోయినది. ఆ క్షణంలో హఠాత్తుగా ఒక సమస్య ఉత్పన్నమైనది. ఒక పరిస్థితిని ఎదుర్కొనిన క్షణంలో మాత్రమే, దానిలోని మంచిచెడ్డలు అవగాహనకు వస్తాయి. అర్జునునకు ఆ విశిష్ట పరిస్థితి యొక్క భవిష్యత్పరిణామములు వెనువెంటనే అవగతమయ్యెను. భీష్మద్రోణులకు విరుద్ధముగా యుద్ధమును చేయవలసి యుండునని అతడు గ్రహించెను. అట్లు చేయుట ధర్మము కాదని అతడు శ్రీకృష్ణునకు వివరింప యత్నించెను.

అర్జునుని ధర్మసంకటము యొక్క స్వరూపమిట్టిది. ఇది అర్జునునకు మాత్రమే గాక, జీవులందరికీ సమానము. జీవులు భావావేగములకు, ధర్మాధర్మములకు, శోకమునకు వశవర్తులై యుందురు. జీవనసంఘర్షణలో చిక్కుకొని, శోకావస్థలో విలవిలలాడే మానవులందరికీ అర్జునుడు ప్రతీక. అర్జునుడీ శోకము నుండి విముక్తిని గోరి, శ్రీకృష్ణునితో సంభాషించెను. ఈ సంభాషణ వలన అతడు శోక విముక్తుడగుట మాత్రమే కాదు. ఈ సంభాషణలో అతని కొక నూత్న ఆవిష్కారము కలిగినది. తన యెదుట నిలబడి యున్న తత్కాలీన సమస్య కంటె, మానవుని సంసారరూపమగు దీర్ఘకాలిక సమస్య యొక్క పరిష్కారమును అతడు ఈ సంవాదములో కనుగొనబోతున్నాడు.

ఈ యుద్ధములో పాల్గొనుట అర్జునుని ముందున్న తత్క్షణసమస్య. కాని, 'నేను శోకాధీనుడను' అనే సర్వమానవ సాధారణమగు త్వం పదార్థ సంబంధి సమస్య దీర్ఘకాలిక సమస్య. ఈ విధముగా సమస్యను విశ్లేషించి, మానవుడు శోకము అనే మౌలిక సమస్య నుండి విముక్తిని పొందవలెననే ఆకాంక్షను తన హృదయములో ఆవిష్కరించుకొనవలెను. మానవునకు మోక్షము నిచ్చే జ్ఞానము శ్రీకృష్ణుని వద్ద గలదు. అర్జునునకు ఈ సత్యము తెలియును. కాని, అతనికి దాని యందు తత్పూర్వములో అభిరుచి లేకపోవుటచే, దానిని పొందే యత్నమును చేయలేదు.

అర్జునుని జీవితములో మొదటి కొన్ని సంవత్సరములు పరాక్రమమును సంపాదించుట. వివాహము ఇత్యాదులలో గడిచిపోయెను. తరువాత అరణ్యవాసములో ఉండే కష్టముల నన్నిటినీ అనుభవించెను. అతడు అడవిలో కేవలము రెండు పనులను మాత్రమే చేస్తూ గడిపెను. ఒకటి బ్రతుకును ఈడ్చుట. రెండవది దుర్యోధనునిపై కక్షను తీర్చుకొను ఉపాయములను గురించి ఆలోచించుట. అర్జునుడు అడవిలో నడుస్తూ ఉంటే, కాలిలో దిగే ప్రతి ముల్లు దుర్యోధనుడు చేసిన

అపకారమును గుర్తుచేసెడిది. అతడి తీరున అడవిలో కష్టముల పాలగుటకు దుర్యోధనుని కుట్రయే మూలకారణము. కావున, అడవిలో అర్జునునకు కాలిలో దిగిన ముల్లులు అన్నిటి కంటె దుర్యోధనుడు చాల పెద్దముల్లు అయినాడు.

అర్జునుడు చక్రవర్తి వంశములో పుట్టినా, అతనికి వనవాసము, రాజ్యచ్యుతి తప్పలేదు. అడవిలో వారి మధ్యలో ద్రౌపది కూడ ఉండెడిది. ఆమె దుర్యోధనునిపై ప్రతీకారము తీరేవరకు తన జుట్టును ముడివేయనని వ్రతము పట్టినది. ఆమె శిరోజములు వారు చేసిన ప్రతిజ్ఞలను సంతతము గుర్తు చేయుచుండెడివి. ఇట్టి స్థితిలో ఆత్మ, బ్రహ్మ ఇత్యాదులను గురించి ఆలోచించే సమయము గాని, అవకాశము గాని అర్జునునకు లేకుండుట సహజమే.

సర్వ మానవుల భాగధేయము అర్జునుని భాగధేయము వంటిదియే

ప్రతి వ్యక్తి జీవితములో కొన్ని ప్రత్యేక పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు, అతని మనస్సు శోకమోహ గ్రస్తమైనప్పుడు, అతని అవస్థ అర్జునుని అవస్థ వంటిదే. జీవుడనగా నిదియే. త్వం పదమునకు మనకు తెలిసిన అర్థమిదియే. నాకు హాని కలిగినది; నేను శోకమునకు అధీనుడను; నేను కొన్ని విశిష్ట పరిస్థితులలో జన్మించినాను గనుక నేను కొన్ని ప్రత్యేక విధులను నిర్వర్తించాలని అపేక్షింపబడుదును. ఇత్యాది భావనలన్నియూ త్వం పదార్థములో అంతర్గతములగును. నేను నా విధులను నిర్వర్తించలేకున్నాను అను భావన కూడ త్వం పదార్థమే. నేను నా విధులను నిర్వర్తించ లేకపోవుటకు కారణమేమి? నా రాగద్వేషములకు, విధులకు పొత్తు కుదరకపోవుటయే. ఇది కూడ త్వం లోనిదే. కావున సమస్య లన్నియు త్వం (నీవు)నకు సంబంధించినవి మాత్రమే.

రాబోవు యుద్ధమును, దాని దుష్ట పరిణామములను అంచనావేసి, అర్జునుడు యుద్ధరంగములో ఈ సమస్యను గుర్తించినాడు. ఈ యుద్ధములో విజేతలు ఉండరనియు, రెండు పక్షముల వారు పరాజితులగుదురనియు అతనికి తెలియును. ఈ గుర్తింపు అర్జునునిలో గలదని అతని పలుకులను బట్టియే తెలియుచున్నది. 'నాకు రాజ్యము మరల లభించవచ్చును. వివిధ రాజ్య సుఖములు, భోగములు నా అధీనములో నుండవచ్చును. కాని అవి భీష్మ ద్రోణాది మహాత్ముల రక్తముతో తడిసిన భోగములగును (రుధిర ప్రదిగ్ధాన్ భోగాన్, 2.5)'. ఈ సుఖమును పొందుటకై వీరందరిని సంహరించవలసి యున్నచో, అది ఎంత అధిక మూల్యమో! కావున, ఈ దృష్టి కోణము నుండి చూచినా, ఈ యుద్ధము హితకారి కాదని అర్జునుని అభిప్రాయము. ఇది అతని మాటలలో స్పష్టమైనది.

యుద్ధము హితకారి కాదనే నిర్ణయమునకు రాగానే, అర్జునుని మనస్సులో ఉదయించిన తరువాతి ప్రశ్న యేదనగా, 'అట్లైనచో, హితకారి యేది?'. హితకారి ఏదీ కానరాని వ్యక్తి నిరాశానిస్పృహలకు లోనగును. మానవులందరూ సాధారణంగా చేసే అన్వేషణలలో ప్రయోజనము శూన్యము అనే గుర్తింపు నుండి నిరాశ పుట్టి, వ్యక్తిని కర్మణ్యతా హీనునిగా చేయును. ఈ సామాన్య అన్వేషణలలో రుచి లేక, రుచికలిగే అన్వేషణ లభించకపోతే, అట్టి వ్యక్తి నిరాశతో సర్వమును వీడి గిటారు చేతబట్టుకొని, సంచార సంగీతజ్ఞుని వలె, సంచార తెగల వంటి జీవితమును గడుపును. దీనికంతకు మూలము నిరాశ.

అర్జునుని నిరాశకు మూలము మనోవైజ్ఞానిక (psychological) సమస్య కాదు. అర్జునుడు పరాక్రమి, ధైర్యసాహసములు గలవాడు, సంస్కారవంతుడు, విద్యావంతుడు, సర్వులచే పూజింపబడిన వాడు. అతడు గొప్పవాడని లోకవిదితము. అతడు తన గొప్పదనమును కొత్తగా యుద్ధరంగములో గాని, అన్యత్ర గాని నిరూపింప బని లేదు. అతడు దుష్ట వంశములో జన్మించినవాడు గాదు. కాన, అతనికి మనో విజ్ఞాన సంబంధి సమస్య లేమీ సంక్రమించలేదు. అతడు కర్మణ్యతతో నిండిన సాధారణ జీవితమునే గడిపెను. పైగా, అతడు సత్పురుషుడైన రాజకుమారుడు గనుక, అతని అభివృద్ధి సామాన్యపౌరుని అభివృద్ధి కంటె విశిష్టమైనది. కాని, అర్జునుడు ఒక వ్యక్తి మాత్రమే. మనమీ విషయమును విస్మరించే అవకాశము లేదు.

రాజ్యమును తిరిగి పొందుట ఇకపై ప్రముఖ విషయము కాదు

అర్జునుడు ప్రేమానురాగములు గల మనుష్యుడు. ఈ ప్రేమానురాగముల మూలంగా, అతనికి యుద్ధములో ప్రయోజనమేమియూ కన్పట్ట లేదు. కావున, ప్రయోజనము గలది యేది? అను ప్రశ్న అతనికి ఉదయించుట సహజమే. అర్జునుడు ఆత్మజ్ఞానమునకు విలువ నిచ్చే సంస్కృతిలో జన్మించినాడు గాన, ఈ ప్రశ్నకు సమాధానము అతనికి విదితమే. వాస్తవంలో, అతని తండ్రి ఆత్మజ్ఞానమును పొందగోరి, రాజ్యమును వీడి అడవికి వెళ్లెను. ఈ జ్ఞాన సాధనలో నిమగ్నులైన ఎందరో మహానుభావులు అర్జునునకు తెలియును. ఇట్టి జ్ఞానము గలదని అతనికి తెలిసినా, ఇంతకు పూర్వము అతడు దానివైపునకు ఆకర్షితుడు కాలేదు. దీనికి గల కారణములను మనము చూచియున్నాము. కాని, ఇపుడాతడు యుద్ధమునకు తగినంత కారణము లేదని భావించెను. రాజ్యమును తిరిగి పొంది, భోగముల ననుభవించుట వలన తన మౌలిక సమస్యకు పరిష్కారము దొరకదని అతడు గ్రహించెను.

అర్జునునకు ఈ జ్ఞానము గురించి తెలిసి ఉండకపోతే, అతనికి చేరుకోదగ్గ లక్ష్యము గాని, సాధించదగిన ప్రయోజనము కాని ఉండెడిది కాదు. కాని, ఒక లక్ష్యము, ఒక దారి గలవని అతనికి తెలియును. శ్రేయస్సు(మోక్షము) ను పొందితే, సమస్య పరిష్కరింపబడునియు, దాని పరిష్కారానికి మరియొక మార్గము లేదనియు అతనికి తెలియును. ఈ జ్ఞానమును పొందుటకు తాను శిష్యుడు కావాలని కూడా అతనికి తెలియును. అంటే, ఒక గురువు ఉండవలెను. శ్రీకృష్ణునితో అతనికి గల అనుబంధము చాల గొప్పది. శ్రీకృష్ణుని కంటె గొప్ప గురువు ఎప్పుడైననూ ఉండబోడని అతడు గ్రహించెను. అందువలననే, అతడు శ్రీకృష్ణునితో దాపరికము లేకుండగా నిట్లు చెప్పెను. 'నేను నీ శిష్యుడను. నాకు శ్రేయస్సు కలుగుటకై అవశ్యకమగు ఉపదేశము నంతనూ నాకు బోధింపుము (యచ్ఛ్రేయస్స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్య స్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్, 2–7)'.

అర్జునుని సమస్యను త్వం పదార్థములో అంతర్గతమైనదిగా తెలుసుకోవాలి. ఏలయన, సంఘర్షణ 'త్వమ్ (నీవు)' లో మాత్రమే అంతర్గతమై యుండును. బ్రహ్మకు గాని, ఈశ్వరునకు గాని సమస్య లేవియూ ఉండవు. ఈ విషయమును మనము తత్పదార్థ నిరూపణము చేసే గీతలోని ద్వితీయ షట్కములో చూడబోతాము. ఈశ్వరునకు సమస్య లేదు. వ్యక్తి (జీవుడు)కి సమస్య గలదు. వ్యక్తికి తెలుసుకోవాలనే కోరిక (జిజ్ఞాస) గలదు.

అర్జునుడింత వరకు సార్థకమగు జీవితమును గడిపెను. అతని ఉద్దేశ్యము నెరవేరుటకు యుద్ధరంగము అవశ్యకమయ్యెను. ఇట్టి కర్మణ్యత అతనికి సహాయకారి ఆయెను. ఇప్పుడు ఇచ్చట యుద్ధరంగములో అతనికి జ్ఞానము నందు కోరిక కలిగెను. ఆ యుద్ధరంగములో ఇట్టి కోరిక మరెవ్వరికీ కలుగలేదని తోచును. దుర్యోధనునకు ఇట్టి జిజ్ఞాస లేదని చెప్పబనిలేదు. శ్రీకృష్ణుడు కూడ యుద్ధరంగములో ఉపస్థితుడై యుండుట అర్జునుని భాగ్యము. అతనికి తన గోడు వెళ్లబుచ్చుకొనుటకు వ్యక్తి లభించినాడు. మరియు, అతని మనస్సు ఈ జ్ఞానమునకు సంసిద్ధమై యుండుటచే, అతడు శ్రీకృష్ణుని గురువుగా గుర్తించగల్గినాడు. శ్రీకృష్ణుడు ఆచార్యుడని మనకు ఆధారమేమున్నది? ఆయన అర్జునునకు ఉపదేశించినాడు గదా! అర్జునునకు 'నోరుమూసుకుని యుద్ధమును చేయుము!' అని చెప్పి, మిన్నకుండలేదు గదా! అర్జునుని స్వధర్మోన్ముఖుని చేయుటకై శ్రీకృష్ణుడు ఇట్టి మాటలను కొన్నిటిని పలికినాడు. అంతే గాదు. ఆయన అతనికి జ్ఞానము నుపదేశించినాడు. ఆయన ఉపదేశించి యుండనిచో, గీత ఉండెడిది గాదు. అర్జునుని మనస్సులో ఉత్సాహమును నింపే మాటలను శ్రీకృష్ణుడు పలికి ఊరకుండవచ్చును. అట్టి స్థితిలో కూడా నాకు బోధింపుమని అర్జునుడు చేసిన ప్రార్థనను మన్నించినట్లే యగును. కాని, శ్రీకృష్ణుడు అట్లు చేయలేదు. ఆయన చాల శ్రద్ధతో ఉపదేశించ నారంభించెను.

శ్రీకృష్ణుడు ముందుగా అర్జునునితో దుఃఖమునకు హేతువు లేదని (అశోచ్యాన్ అన్వశోచస్త్వమ్, 2-11) చెప్పి, అదే విషయమును గీతలోని ఇతర అధ్యాయములలో నిరూపించెను. 'జ్ఞానులు శోకాధీనులు గారు; నీవు ప్రజ్ఞావాక్యములను పలికినావు; కాని, శోకాధీనుడవైనావు' అని శ్రీకృష్ణుడు అర్జునునితో చెప్పెను. అర్జునుని పలుకులను వింటే, అతడు మహాజ్ఞాని అనిపించినా, అతడు యథార్థముగా జ్ఞాని కాదని శ్రీకృష్ణుడు తన అభిప్రాయమును చెప్పినాడు. అర్జునుడు తన ఉపదేశమును శ్రద్ధగా వినాలని మాత్రమే ఆయన అట్లు చెప్పెను. ఆయన రెండవ అధ్యాయములో మొదలిడి త్వం పదార్థమును, తరువాత తత్పదార్థమును, వాటి మధ్య గల సంబంధమును నిరూపించెను.

తత్ త్వం అసి అనునది వేదాంత సారము

త్వం అనగా నీవు; అనగా 'నేను' గా భాసించే జీవుడు. తత్త్వమసి అనే మహావాక్యములోని త్వం పదమునకు 'నేను' యొక్క స్వరూపము అర్థము. జీవబ్రహ్మల ఐక్యమును ప్రతిపాదించే తత్త్వమసి అనే వాక్యమే వేదాంతము. శ్రీకృష్ణుడు గీతలోని మొదటి ఆరు అధ్యాయములలో ఈ త్వం (నీవు) పదమును, అనగా 'నేను' అనుదానిని, తత్సంబంధిత సర్వమును విశ్లేషించెను. ఆయన మొదలిడిన విధానమెట్టిది? ఆత్మ కర్త కాదు, కర్మ కాదు అని ఆయన మొదలిడెను.

జీవుడు శోకాధీనుడు కావాలంటే, కర్త అయి ఉండాలి; లేదా కర్మ అయి ఉండాలి. కాని, ఆత్మ ఇంద్రియగోచరమగు దృశ్యము కాదు. కాన, దానికి ఏనాడూ వినాశము లేదు. ఆత్మను ఎవ్వరూ కంటితో చూడజాలరు. అట్టి తరి దానికి హానిని చేయుట ఎట్లు సంభవమగును? కాలము కూడ ఆత్మను సమీపించలేదు. ఇతర వినాశోపాయము లేవియూ ఆత్మను తమ వినాశ కార్యములో విషయముగా చేయజాలవు. కావున, ఆత్మ నిశ్చితముగా కర్మ కాదు.

ఆత్మ కర్మ కాకపోవచ్చును. కాని, కర్త కావచ్చును గదా! అను శంక కలుగును; ఆత్మ కర్త కాదని శ్రీకృష్ణుడు చెప్పెను. ఆత్మ ప్రత్యక్షముగా గాని, పరోక్షముగా గాని ఏ క్రియనూ ఆచరించదు. కాన, ఆత్మ కర్తృత్వ వినిర్ముక్తము. దాని యందు కర్తృత్వమే గాక, భోక్తృత్వము కూడ లేదు. మరియు, ఆత్మ ఇతరములచే ఆచరింపబడే క్రియలకు విషయము కాదు. ఉన్నది అంతా ఆత్మయే. సర్వ వినిర్ముక్తమైన ఆత్మ మాత్రమే గలదని శ్రీకృష్ణుడు చెప్పెను. అంటే, ఆత్మ శోక వినిర్ముక్తమని స్పష్టమే.

అర్జునుడు జ్ఞానిని వర్ణించుమని కోరగా, ప్రత్యేక కారణమేమియూ లేకుండగనే ఆనందముగ నుండువాడు జ్ఞాని యని శ్రీకృష్ణుడాతనికి చెప్పెను. ఆత్మ స్వరూపము నెరింగిన జ్ఞాని బ్రహ్మాభిన్నుడై, అనగా ఈశ్వరాభిన్నుడై సర్వపరిచ్ఛేద (దోష) వినిర్ముక్తుడై యుండును. అది త్వం పదార్థ ప్రకరణము గనుక, శ్రీకృష్ణుడు 'త్వం' నకు తత్త్వమసి మహావాక్యములోని 'తత్' నకు గల అభేదమును మాత్రమే ప్రస్తావించి, తత్పద విచారమును విస్తారముగా చేయలేదు. ఆయన ఆ విచారమును ఈశ్వరుని నిరూపించే ఈ ద్వితీయ షట్కము నందు చేసినాడు. త్వం పదార్థమునకు తత్పదముతో అభేదము బోధింపబడుచున్నది. కావున, తత్పదార్థమునకు సరియగు అర్థమును విచారించి తెలియవలెను. అప్పుడు మాత్రమే తత్త్వమసి అనే సమీకరణమును సమగ్రముగా ప్రతిపాదించుట సంభవమగును.

వ్యక్తి నిశ్చయముగా బ్రహ్మమే అయినచో, ఈ జ్ఞానము తప్పక పొందదగినది. తన కర్తవ్యమేమి? అను సందేహము అర్జునునకు కలిగెను. తాను కర్మలను చేస్తూ గడుపవలెనా? లేక సన్న్యాసమును స్వీకరించవలెనా? మోక్షము జ్ఞానైక గమ్యము గనుక, తాను జ్ఞానసాధనను చేయాలని అర్జునుడు భావించుట సహజమే. కాని, శ్రీకృష్ణుని తోడి సంవాదములో, నీవు కర్తవ్యము ననుష్ఠింపుమని ఆయన బోధించెను. శ్రీకృష్ణుడు తన ఉపదేశమును వివిధ యుక్తులతో సమర్థించెను. అధికారము, దుఃఖము, విధి ఇత్యాది ఏ దృష్టికోణములో చూచినా, అర్జునుడు ఇప్పుడు ఇక్కడ చేయదగిన కర్తవ్య కర్మను చేసి తీరాలి. ద్వితీయాధ్యాయములోని ప్రముఖ భాగములో ఈ విషయమంతయూ వర్ణించబడెను. తరువాత, అర్జునునకు ఒక సహజమైన శంక కలుగగా, శ్రీకృష్ణుడు తృతీయాధ్యాయములో మరల త్వం పదార్థమును మాత్రమే నిరూపించెను.

మోక్షసాధనము జ్ఞానమైనచో, కర్మలను చేయుటేల?

మోక్షము నిచ్చేది జ్ఞానము గదా! కాబట్టి జ్ఞాన సాధనను నేనేల చేయరాదు? అనగా నేనేల సన్న్యసించరాదు? అని అర్జునుడు తృతీయాధ్యాయములో ప్రశ్నించెను. అతని దృష్టిలో జ్ఞానసాధన యనగా సన్న్యాసమును స్వీకరించుటయే. జ్ఞాన భిన్నమైన ఆకాంక్ష ఉన్నచో, వ్యక్తి నిశ్చితముగా కర్మను చేయవలసినదే. కాని అతనికి ఇతర అభిరుచులు లేవు. కావున, తాను సన్న్యసించి జ్ఞాన సాధనను చేపట్టవలెనని అర్జునుడు తలపోసెను.

తాను నిర్వర్తించవలసిన విధులను తప్పించుకునే ఒకే ఒక ఉపాయము సన్న్యాస స్వీకారమని అర్జునునకు తెలియును. సర్వ విధుల నుండి, కర్మల నుండి విముక్తిని సన్న్యాసము కలిగించును. అనగా, సన్న్యాస స్వీకారము అనే వైదిక కర్మ వ్యక్తి ఆచరించే అంతిమ కర్మ యగును. ఈ కర్మ

పూర్తికాగానే, వ్యక్తి పోషించవలసిన భూమికలు అంతమగును. అతడు జ్ఞానసాధనను మాత్రమే కొనసాగించవచ్చును. అర్జునునకు ఇదియే శ్రేష్ఠతమమగు మార్గమని తోచినది. ఏలయన, అతనికి రాజ్యము నందలి ఇచ్ఛ తొలగిపోయినది. అతనికి మోక్షము నందు మాత్రమే అభిరుచి గలదు. తన ఎదుట నున్న ఏకైక మార్గము సన్న్యాసమనియు, కాన అదియే సరియైన మార్గమనియు అతడు తలపోసెను.

అర్జునుడు తన కర్తవ్యమును తప్పక నిర్వర్తించవలెనని శ్రీకృష్ణుడు చెప్పెను. మరియు, జ్ఞానము మాత్రమే మోక్షసాధనమనియు, జ్ఞాని మాత్రమే ముక్తుడగుననియు, అయన అర్జునునకు స్పష్టముగా తెలియునట్లు చెప్పెను. కావున, ఈ విషయమును సమగ్రముగా తెలియవలెనని అర్జునుడు ఆకాంక్షించెను. అర్జునుని ప్రశ్నను బట్టి అతనికి కొంత సూక్ష్మదర్శిత్వము గలదని స్పష్టమయ్యెను. కాని, కర్మ, సన్న్యాసము అను వాటి విషయములో అతని అవగాహన ఏ మాత్రమూ స్పష్టముగా లేకుండెను. కర్మ, జ్ఞానసాధన అను రెండింటిలో ఏది తనకు మంచిదియో చెప్పుమని అర్జునుడు శ్రీకృష్ణుని పదే పదే కోరుటకు కారణమిదియే.

శ్రీకృష్ణుడు ఒకవైపు జ్ఞానమే మోక్షసాధనమని జ్ఞానమును పొగడెను. ఇంకోవైపు, అర్జునుని యుద్ధమును చేయుమని బోధించెను. ఇది పరస్పర విరుద్ధముగా నున్నట్లు అర్జునునకు కన్పట్టెను. అర్జునునకు ఇదంతా అయోమయముగ నుండుటచే, అతడు తనకు ఏది శ్రేష్ఠమో నిర్ణయించుమని శ్రీకృష్ణుని కోరెను. మోక్షము నిచ్చునది కర్మయా? జ్ఞానమా?

ద్వివిధ జీవన నిష్ఠ

అర్జునుని ఈ సంభ్రాంత స్థితిని తొలగించుటకై శ్రీకృష్ణుడు మరల ఉపదేశమును మొదలిడి, తానే సృష్ట్యాదియందు ఈ ద్వివిధ జీవన నిష్ఠను ప్రవర్తిల్లజేసితినని (లోకే అస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ) చెప్పెను. మొదటిది జ్ఞాన యోగము, లేదా నివృత్తి మార్గము అనియు, రెండవది కర్మయోగము లేదా ప్రవృత్తి మార్గము అనియు చెప్పబడును. జ్ఞాన యోగములో సాధకుడు సర్వ వ్యాపారముల నుండి విరమించుకొని (నివృత్తి) జ్ఞానసాధనను కొనసాగించును. కర్మయోగములో సాధకుడు యోగ్యమగు మానసిక ప్రవృత్తితో కర్మల నాచరిస్తూ, జ్ఞానసాధనను కూడ చేయుచుండును. ఈశావాస్యోపనిషత్తులోని మొదటి రెండు శ్లోకములలో ఈ రెండు జీవన నిష్ఠలే ప్రతిపాదింపబడినవి.

దీని నంతనూ వర్ణించిన తరువాత భగవానుడు ద్వితీయాధ్యాయములో ఉపదేశించిన కర్మయోగమును మరల వర్ణించెను. కర్మయోగము మోక్షమునకు పరంపరా సాధనమనియు, అది మోక్షమునకు గాని, సన్న్యసమునకు గాని విరోధము గాదనియు అయన అర్జునునకు చెప్పెను. పైగా, సన్న్యస జీవనమునకు సంసిద్ధులు కానివారికి ఉపలభ్యమయ్యే పరంపరా సాధనము (మోక్షమునకు) కర్మయోగమని అయన చెప్పెను.

సన్న్యసమని పిలువబడే జీవనవిధానము సరళమైనది కాదు. ఎందువలన? సన్న్యసికి తన స్వభావమును ప్రకటించుటకు ఆవశ్యకమగు క్షేత్రము లభ్యము కాదు. కాని, తన భావములను ప్రకటించుట ద్వారా వ్యక్తి పరిణతుడు కాగల్గును. కావున, సంసారము అనే క్షేత్రములో నుండి, దానిలోపల విభిన్న సంబంధములతో కూడుకుని ఉండే జీవితమును గడుపుటయే మేలు. సంబంధములనగా ఈ ప్రపంచములో వివిధ పాత్రలను పోషించుట. దానివలన వ్యక్తి రాగద్వేషములను వీడగల్గును. ఇందువలననే, శ్రీకృష్ణుడు మూడవ అధ్యాయములో కర్మయోగమును గూర్చి ప్రముఖముగా మాటలాడెను. ఈ కర్మయోగము ఎవరికొరకు ఉద్దేశింపబడినది? ఈశ్వరుని కొరకు గాదు. త్వం శబ్దార్థమగు జీవుని కొరకు ఉద్దేశింపబడినది.

ఈశ్వరుని స్థానములో శ్రీకృష్ణుడు

తాను చేసిన ఉపదేశము తరతరముల నుండి సంక్రమించిన జ్ఞానమేనని శ్రీకృష్ణ భగవానుడు అర్జునునితో చెప్పెను. భగవానుడు ఈ దర్శనమును మహర్షుల ద్వారా లోకమునకు అందజేసెను. శ్రీకృష్ణుడు అట్టి మహర్షుల కొందరి పేర్లను నాల్గవ అధ్యాయము ఆరంభములో ఉదహరించినాడు. చాలమంది రాజులకు, మరియు ఋషులందరికీ ఈ జ్ఞానము తెలిసినదే. అయినా, అది అంత తేలికగా లభించేది కాదు. అందువలననే, లోకము దుర్బోధనలతో నిండియున్నది. ఈ మాటను విన్న అర్జునునకు ఒక సమస్య తల యెత్తెను.

సృష్ట్యాది యందు వివస్వాన్ మొదలగు వారికి తాను ఉపదేశించినానని శ్రీకృష్ణుడు చెప్పెను. ఇది ఎట్లు సంభవము? శ్రీకృష్ణుడు అర్జునుని సమకాలీనుడు. శ్రీకృష్ణుడు ఏమి మాటలాడుచున్నాడు? ఈ శ్రీకృష్ణుని యథార్థ స్వరూపమేమియో అర్జునుడు తెలియగోరెను. శ్రీకృష్ణుడీ శంకకు ప్రత్యుత్తరమిచ్చెను. 'మన ఇద్దరికీ కూడ అనేక జన్మలు గడచినవి. అవి అన్నియూ నాకు తెలియును. కాని నీకు తెలియవు (బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున, తాన్యహం వేద సర్వాణి న త్వం

వేత్థ పరంతప, 4–5). మరో మాటలో చెప్పాలంటే, అర్జునునకు కూడ తెలిసియున్నచో, శ్రీకృష్ణుని వలెనే జీవన్ముక్తుడై యుండెడివాడు.

అపుడు శ్రీకృష్ణుడు అర్జునునితో తాను ప్రాకృత జీవుడను కాదనియు, తాను ఈశ్వరుని అవతారమనియు చెప్పెను. ఆయన వ్యావహారిక సత్తకు సంబంధించిన నియమములకు వశుడు కాడు. అనగా, అతని జన్మ స్వీయకర్మ ఫలరూపము కాదు. ప్రజల ప్రార్థనలను మన్నించి ఆయన జన్మించినాడు. వాస్తవంలో, ఆయన ఏనాడూ జన్మించనే లేదు; ఆయన కేవలము దేహమును ధరించినాడు. అంతే.

కర్తృత్వ త్యాగము

ఈ సత్యము శ్రీకృష్ణునకు మాత్రమే గాక, అర్జునునకు కూడ సమానముగా వర్తించునని ఆయన అర్జునునకు చెప్పెను. జీవుడు దేహమును స్వీకరిస్తాడనియు, రూపము మాత్రమే జన్మించుననియు, జీవునకు జన్మ లేదనియు అర్జునుడు ఎరింగినచో, అతడు కూడ శ్రీకృష్ణునితో సముడగును. 'ఆత్మరూపుడనగు నాకు జన్మ ఏనాడూ లేదు' అని జీవుడు ఎరుంగవలెను. జ్ఞానము ద్వారా కర్మను వీడుట (జ్ఞాన కర్మ సన్న్యాసము) అనగా నిదియే. శ్రీకృష్ణుడు తరువాత జ్ఞాన కర్మ సన్న్యాసమనగా కర్తృత్వమును వీడుట అని కూడ నిర్వచించెను. కర్తృత్వమును వీడుట ఒక క్రియ కాదు. అది ఒక సత్యము. ఆత్మ సర్వదా కర్తృత్వవిముక్తము గనుక, కర్తృత్వమును కొత్తగా వీడ బనిలేదు. ఆత్మ కర్తృత్వ విరహితము అని ఎరుంగుటయే జ్ఞాన కర్మ సన్న్యాసము. కాని, కర్మ సన్న్యాసము నందు కర్మను వీడినా, కర్మను విడిచి పెట్టే కర్త మిగిలియుండును.

నేను కర్మల నన్నిటినీ త్యజించిన సన్న్యాసిని అని నీవు చెప్పవచ్చును. కాని ఈ మాటను చెప్పేది కర్త. కర్తృత్వమును పరీక్షించి, పరిశోధించాలి. సన్న్యాసియైననూ ఈ కర్తృత్వమును శోధించాలి. నేను అంతిమ కర్మను చేసి సన్న్యసించినాను అని పలికే వ్యక్తి కర్త. ఆ కర్తృత్వమును కూడా త్యజించవలసియున్నది. కావున, శ్రీకృష్ణుడు అర్జునునితో త్యజించవలసినది కర్తృత్వమని చెప్పినాడు.

సర్వ కర్మల నడుమ ఉండియూ అకర్మను చూడగలిగే వ్యక్తి మాత్రమే (కర్మణి అకర్మ యః పశ్యేత్) సన్న్యాసి అను శబ్దమునకు ముఖ్యార్థము అగును. ఇట్టి వ్యక్తి ఆత్మ కర్త కాదని యెరింగి, ఆ ఎరుక వలన సర్వకర్మలను వీడిన జ్ఞాన కర్మ సన్న్యాసి. ఈ విషయమును ఇంకనూ సుస్పష్టము చేయుట కొరకై, జ్ఞానాగ్ని సర్వ కర్మలను దహించునని శ్రీకృష్ణుడు చెప్పినాడు.

అర్జునుడు శ్రీకృష్ణుని నుండి ఉపదేశమును పొందుచుండెను. అయినను, శ్రీకృష్ణుడు ఉపదేశములో భాగముగా, జ్ఞానియగు గురువు నుండి ఉపదేశమును పొందుమని అర్జునునకు బోధించెను. అట్టి గురువుల వద్దకు వెళ్లినచో, వారు నీకు ఉపదేశించగలరని శ్రీకృష్ణుడు చెప్పెను. ఈ విషయము నంతను ఉపదేశించి ఆయన మరల అర్జునునితో లేచి నిలబడుమనియు, కర్మయోగము సమష్ఠింపుమనియు (యోగం ఆతిష్ఠ ఉత్తిష్ఠ, 4-42) చెప్పెను. ఎందువలన? ఏలయనగా, జ్ఞానరూపముగా మాత్రమే కర్మలను విడుట అనేది సంభవమగును. కర్మయోగము వ్యక్తిని అట్టి జ్ఞానమునకు సన్నిహితము చేయును. కావున, కర్మ సన్న్యాసము అభిలషణీయము గాదు. జ్ఞాన కర్మ సన్న్యాసము అభిలషణీయము. ఈ రెండింటి మధ్య గల భేదమును స్పష్టముగా తెలియవలెను.

యోగము సమష్ఠింపుమని శ్రీకృష్ణుడు మరల ఉపదేశించగా, అర్జునుడు మరల అదే ప్రశ్నను పదములను మార్చి అడిగెను: నీవు సన్న్యాసమును, యోగమును కూడ ప్రశంసించుచున్నావు. ఓ శ్రీకృష్ణా! ఈ రెండింటిలో ఏది శ్రేష్ఠతరము అను విషయమును దయచేసి ఖచ్చితముగా చెప్పుము (సన్న్యాసం కర్మణాం కృష్ణ పునర్యోగం చ శంససి, యచ్ఛ్రేయ ఏతయోరేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్; 5-1). శ్రీకృష్ణుడు సన్న్యాసమును, కర్మను రెండింటిని సమానమహత్త్వము కలవిగా స్తుతించి యుండకపోవచ్చు నని స్వీకరించుటకు అర్జునునకు అభ్యంతరము లేదు. కాని, అర్జునుని సమస్య ఇంకను తీరలేదు. ఆ రెండింటిలో తనకు ఏది శ్రేయస్కరము? అని విషయ మింకను అతనికి తెలియలేదు.

అర్జునునకు గల ప్రముఖమైన సందేహము ఇంకను తీరలేదనియు, అతడు దానిని మాత్రమే పునః పునః ప్రశ్నించు చున్నాడనియు మనకు స్పష్టమగుచున్నది. కావుననే, శ్రీకృష్ణుడు మరల అతనికి వివరించెను. ఈ ద్వివిధ జీవన విధులు మోక్షము నిచ్చును. కాని, సన్న్యాసముగా కర్మల నన్నిటిని విడుచున్నను గనుక, అది సరళమని భావించరాదు. సన్న్యాసమునకు సంసిద్ధుడు కాని వ్యక్తికి అది ఏమాత్రము ఉపకరించదు. మనము సంకల్పశక్తినే ధ్యానశీలమును, మనన శీలమును అలవర్చుకొనజాలము. వాస్తవంలో ఈ శీలమునందు సంకల్పశక్తికి లేశమైనను ప్రమేయము లేదు.

ఐచ్ఛికము (ఎన్నుకొనే అవకాశము) యథార్థముగా గలదా?

నీకు కోరిక యున్నచో సన్న్యసించవచ్చును. నిన్ను ఎవరూ ఆపలేరు అని శ్రీకృష్ణుడు అర్జునునితో చెప్పుచుండెను. కాని అతడు అభ్యంతర ప్రవృత్తి దృష్ట్యా, మనోభావముల దృష్ట్యా సన్న్యాసి కాగలడా? ఆయనది ఊహాత్మక గమ్యము. కాని, కర్మయోగము నాచరించినచో, అతడు

జ్ఞానము నుండి వంచితుడు కాబోడు. అతడు కాలక్రమములో పరమాత్మను పొందగలడు (యోగయుక్తో మునిర్బ్రహ్మ న చిరే ణాధి గచ్ఛతి, 5-6).

శ్రీకృష్ణుడింకనూ ఇట్లు కొనసాగించెను: యోగ సంపన్నుడగు సాధకుని అంతరంగము శుద్ధమగును. అతనికి జ్ఞానేంద్రియములపై నియంత్రణ ఉండును. సాధకునకు సుస్పష్టమగు జ్ఞానము ఉదయించుట కొరకై ఈ మానసిక తయారీ ఆవశ్యకము. అట్టి సాధకుడు మాత్రమే సర్వప్రాణుల ఆత్మ తన ఆత్మయేననియు, సర్వప్రాణులు ఆత్మయందు గలవనియు తెలియగలడు. ఈ సత్యము నెరింగిన జ్ఞాని కర్మల నాచరించినా, అతడా కర్మలచే ప్రభావితుడు గాడు. జ్ఞానముచే కర్మత్యాగమనగా నిదియే.

సాధకుడు సత్యము నెరింగి తత్త్వవిత్ అగుట లక్ష్యముగా పెట్టుకొనును. తత్త్వవిత్ అగుటకై ఎన్నుకునే జీవనశైలిలో వికల్పము గలదు. కాని, ఒకరకంగా వికల్పము లేదనియూ చెప్పవచ్చును. ఏలయనగా, కర్మయోగ జీవనము కంటె సన్న్యాసజీవనము సుకరమనే భావనతో దానిని స్వీకరించుట కంటె కర్మయోగిగా నుండుటయే మేలని శ్రీకృష్ణుడు చెప్పెను. 'నాకిక సన్న్యాసములో పనిలేదు' అని ఎవనికి అనిపించునో, అతడు సన్న్యాసి కావచ్చును. మానసిక సంసిద్ధత గల వ్యక్తికి సన్న్యాసము అతుకుకొని యుండును. కాని, వ్యక్తి సంసిద్ధుడు గానిచో, సన్న్యాసాశ్రమమును స్వీకరించినంత మాత్రాన, జ్ఞాన కర్మ సన్న్యాసి కాజాలడు. సన్న్యాస స్వరూపమట్టిది. ఈ సత్యమును మనము గుర్తించవలెను. అందువలననే, శ్రీకృష్ణుడీ విషయమును అర్జునునకు పదే పదే చెప్పినాడు. లేనిచో, 'నీవు సన్న్యాసమునకు అనర్హుడవు' అని ఒకే మాటలో చెప్పి యుండెడి వాడు.

ముందు కర్మయోగము, తరువాత సన్న్యాసము – ఇదీ క్రమము

సన్న్యాసము అనేది లేదని చెప్పుట శ్రీకృష్ణుని అభిప్రాయము కాదు. సన్న్యాసము గలదనియే ఆయన చెప్పెను. అందువలననే, అర్జునుడు చాల అయోమయములో పడెను. కాని శ్రీకృష్ణుడు అర్జునుని అయోమయములో పడవేయుట లేదు. ఆయన అతనికి తెలియజెప్పుచున్నాడు. అర్జునుని అయోమయమునకు మూలము అతనికి కర్మ సన్న్యాసమునకు జ్ఞాన కర్మ సన్న్యాసమునకు గల భేదము తెలియకపోవుటయే. ఈ తికమక నుండియే అతని ప్రశ్న ఉదయించినది. అతనికి కర్మయోగ సన్న్యాసములు చీకటి వెలుతురుల వలె పరస్పర విరుద్ధముగా కన్పట్టినవి. కాని వాస్తవంలో వాటి మధ్య పరస్పర విరోధము గాని, స్పష్టముగా జ్ఞాతము కాని అంశము గాని లేదు. కర్మయోగ,

సన్న్యాసములు రెండు సమాన సామర్థ్యము గలవియే. కాని సన్న్యాస జీవనమునకు విశిష్టమగు సంసిద్ధత ఆవశ్యకము. తేడా ఇంతియే. సన్న్యాసి యగుటకు ముందు కర్మయోగ జీవనమును గడుపుట ద్వారా ఇట్టి సంసిద్ధత సంభవమగును.

మానసిక తయారీ పూర్తి కాకుండగనే సన్న్యసించిన వ్యక్తి సన్న్యాసిగా ఉంటూ ఇట్టి అంతరంగశుద్ధిని పెంపొందించుకోవాలి. ఇది చాల క్లేశముతో గూడిన పని. ఇది, ఆచార్యపదవిని ముందుగా పొంది తరువాత దానికి సంబంధించిన శాస్త్రములో అర్హతను సంపాదించుట వంటిది. ఇది అంత తేలిక కాదు. పైగా, అట్టి ఆచార్యుని వద్ద అభ్యసించే శిష్యుల మాట చెప్పవలెనా? అదే తీరున, మానసిక తయారీ లేకుండగా సన్న్యసించిన వ్యక్తి నామమాత్ర సన్న్యాసి. అతడు యోగ్యుడగు సన్న్యాసిగా పరిణతి చెందుట అసంభవము కాదు. కాని, అది మిక్కిలి క్లేశముతో గూడిన పని.

అకర్తృత్వ జ్ఞానముతో మాత్రమే కర్మలను వీడుట యథార్థమగు సన్న్యాసమగును. ఈ సత్యమును అర్జునుడు గ్రహించాలని శ్రీకృష్ణుని ఆకాంక్ష. ఇచట వాస్తవికమగు పరిత్యాగమేమియూ లేదు. నేను కర్తను గాను అని యెరింగిన జ్ఞాని కర్తృత్వమును వీడి ముక్తుడగును. అంతవరకు సాధకుడు తన కర్తవ్యమును నిర్వర్తించవలెను. కాని, కర్తవ్య నిర్వహణలో ఉద్రేకము, వ్యగ్రత పనికిరావు. చేయని పనుల గురించియైననూ కంగారుపడుట తగదు. ఇట్లు జీవించు సాధకుడు కాలక్రమములో ఈ సన్న్యాసమును పొందును. సన్న్యాసము ఎవరికి? ఈశ్వరునకా? కాదు. సన్న్యాసము జీవుని కొరకు మాత్రమే.

ధ్యానము

శ్రీకృష్ణుడు పంచమాధ్యాయాంతములో ధ్యానము అనే విషయ వస్తువును ప్రవేశపెట్టెను. అదియే ఆరవ అధ్యాయములోని ప్రముఖ విషయము అయెను. ఈ ధ్యానము ఈశ్వరుని కృపను ప్రార్థించే సగుణ ధ్యానము గాని, లేదా బ్రహ్మాభిన్నమగు ఆత్మను మననము చేయుట అనే నిర్గుణ బ్రహ్మధ్యానము గాని కావచ్చును. ఈ రెండు విధములుగా వ్యాఖ్యానించవచ్చును. ఏలయన, రెండు రకముల ధ్యానము జ్ఞానము కొరకు మాత్రమే.

ఈశ్వరుని కృప కొరకు మాత్రమే గాక, జ్ఞానము కొరకు గూడ ధ్యానించవచ్చును. ఆ కృప వలన సాధకునకు గురువు లభించి, మోక్షరూపమగు జ్ఞానము లభించును. గురువు లభించిన సాధకుడు శ్రవణ మననములను చేసి అంతర్ముఖత్వము, ధ్యానము, మరియు ఆత్మ విచారములతో

కూడిన జీవితమును గడుపగల్గును. ఈ అధ్యాయములో ధ్యానములో కూర్చుండు విధానము కూడ నిర్దేశింపబడెను. ధ్యానము, దానికి ఆవశ్యకమగు సాధన సంపత్తి అనే ఈ సర్వము జీవుని కొరకు మాత్రమే ఉద్దేశింపబడినవి.

ఈ తీరున, మొదటి ఆరు అధ్యాయములలో త్వంపదార్థమగు జీవుడు, జీవునకు సంబంధించిన సర్వ విషయములు ప్రస్తావింపబడినవి. కర్మయోగియైన వ్యక్తి ఏమి చేయాలి? అను విషయము చెప్పబడినది. కర్మయోగము మనస్సును జ్ఞానోదయమునకు సజ్జితము చేయు సాధనమనియు, అట్టి జ్ఞానము గలదనియు, సన్న్యాసము కూడ గలదనియు వివరింపబడెను. ఇది అంతా 'త్వం' నకు సంబంధించినదియే. ఈ 'త్వం' యొక్క స్వరూపమగు ఆత్మ కర్త గాని, కర్మ గాని కాదనియు, అది ఈశ్వరాభిన్నమనియు (తత్ అసి) ప్రదర్శింపబడినది.

సమీకరణములో తత్ నకు త్వంతో అభేదము చెప్పబడినది. కావున, త్వం విచారణ అనంతరము తత్ (ఈశ్వరుడు) ను కూడా విశ్లేషించవలెను. ఈ ఈశ్వరుడెవ్వరు? నేను ఈశ్వరుడను ఎట్లు కాగల్గుదును? ఈ సమీకరణము వాస్తవమేనా యను శంక గలదు. కావుననే, తరువాతి ఆరు అధ్యాయములలో ఈశ్వరుని విశ్లేషణ గలదు. ఈ సమీకరణము గీతలోని ప్రతి అధ్యాయములో వచ్చును. కాని, తరువాత ఆరు అధ్యాయములో ప్రముఖమగు విషయవస్తువు ఈశ్వరుడు.

అర్జునుని భయమునకు మూలము

ఉదాహరణకు, పదకొండవ అధ్యాయములో, అర్జునుడు శ్రీకృష్ణుని కృపవలన విశ్వరూపమును దర్శించును. కాని, ఈ దర్శనములో అతడు తాను అంతర్భాగము కాలేదు గనుక, ఇది సమగ్ర దర్శనము కాదు. అతడు సర్వమునకు, తనకు మధ్య భేదమును దర్శించినాడు. కావున, అతనికి భయము కలిగినది.

ఈశ్వరుని విశ్వరూపమును చూచిన అర్జునుడు చాల భయమును పొంది, విశ్వరూపమును వీడి మానవరూపమును పొందుమని ప్రాధేయపడెను. శ్రీకృష్ణుడు చేతిలో బెత్తమును ధరించిన సారథి రూపమే అతనికి సుఖముగ నుండెను. విశ్వరూపములో శ్రీకృష్ణుడు జగత్తు నంతనూ కబళించివేయుచుండెను. మనము ఊహించగలిగే ప్రాణులన్నీ ఈశ్వరుని దంతముల మధ్య నుండెను. అచట ఈశ్వరుని దంతముల మధ్య, అనగా కాలపురుషుని కోరల మధ్య, వ్రేలాడుచున్న జీవులు దంతములచే చూర్ణము చేయబడుచుండిరి. ఈ దృశ్యమును గాంచిన అర్జునుడు భయభీతుడగుట

సహజమే. ఎందువలన? అతడు తనను విశ్వరూపములో భాగముగా దర్శించలేదు. అనగా, అతడు తనను సర్వము కంటె భిన్నముగా దర్శించినాడు!

ఈశ్వరషట్కమనబడే ఈ ద్వితీయ షట్కములో అంతిమమగు పన్నెండవ అధ్యాయములో శ్రీకృష్ణుడు ఈశ్వర భక్తిని వివరించెను. మిగిలిన ఆరు అధ్యాయముల తృతీయ షట్కము జీవేశ్వరుల ఐక్యమును శ్రీకృష్ణుడు అర్జునునకు వర్ణించుటతో ఆరంభమగును. ఈ ఐక్యమును తత్త్వమసి మహావాక్యములోని అసి శబ్దము బోధించును. ఈ ఐక్యము యొక్క స్వరూపమేమి? దాని ఫలమేమి? ఇత్యాది విషయములు ఈ ఆరు అధ్యాయములలో విశ్లేషించబడినవి. ఇంతేగాక, శ్రీకృష్ణుడు సాధనములు, జీవన మూల్యములు ఇత్యాది విభిన్న విషయ వస్తువులను కూడ వివరించెను. ఏలయన, జీవేశ్వరుల మధ్య ఉన్నది ఐక్యమే అయినా, దానిని గుర్తించువారు అరుదు. కావున, జ్ఞాన ప్రభావముచే ఈ ఐక్యమును గుర్తించే విధము పదమూడవ అధ్యాయములో ఆరంభించి వర్ణించబడినది.

ఈ విధముగా తత్, త్వం, అసి అను మూడు పదములు విశ్లేషించబడినవి. త్వం పదార్థమును వివరించే మొదటి ఆరు అధ్యాయములను మనము అధ్యయనము చేసినాము. ఇపుడు ఏడవ అధ్యాయములోని మొదటి శ్లోకముతో నారంభించి ద్వితీయ షట్కములో తత్ (ఈశ్వర) అను విషయ వస్తువును తెలుసుకుంటాము.

ఏడవ అధ్యాయము

ఉపోద్ఘాతము

గీతలో కొన్ని అధ్యాయములలో అంతిమ శ్లోకము ప్రకరణ సంగతము కాదా అన్నట్లు కన్పట్టును. ఆ శ్లోకము ప్రక్షిప్తమేమో యను భావన కలుగును. కాని, ఆ శ్లోకము తరువాతి అధ్యాయములో రాబోవు విషయవస్తువునకు పునాదిగా నుండును. ఉదాహరణకు, అయిదవ అధ్యాయాంతములో ధ్యానమును పరిచయము చేయు రెండు శ్లోకములు గలవు. ఆ ధ్యానమే ఆరవ అధ్యాయమునకు విషయవస్తువు అయెను. శ్రీకృష్ణ భగవానుడు ఆరవ అధ్యాయములో ఆఖరి శ్లోకమునకు ముందున్న శ్లోకములో 'తస్మాత్ యోగీ భవ – కావున యోగివి కమ్ము' అని చెప్పెను. ఈ వాక్యము ధ్యానయోగమునకు సారభూతమైనది. దీని తరువాతి శ్లోకముతో అధ్యాయము ముగిసెను. ఆ శ్లోకములో తరువాతి అధ్యాయమునకు పునాది వేయబడెను. శ్లోకములో ప్రశ్న బీజము కూడ గలదు. కాని, ప్రశ్న వ్యక్తరూపముగా లేదు. మనమా శ్లోకమును చూచెదము:

योगिनामपि सर्वेषां मद्गतेनान्तरात्मना ।
श्रद्धावान् भजते यो मां स मे युक्ततमो मतः ॥ ४७ ॥

యోగినామపి సర్వేషాం మద్గతేనాంతరాత్మనా
శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః (47).

ఈ శ్లోకములో శ్రీకృష్ణుడు 'మద్గతే నాంతరాత్మనా' అనెను. అనగా, భగవానుడనగు నా యందు లగ్నమైన మనస్సుతో అని యర్థము. ఈ మాటలో రెండు ప్రశ్నలు ఉదయించే స్పష్టమైన బీజము గలదు.

1. యోగి యొక్క మనస్సు ఈశ్వరుని యందు తల్లీనమగు ఉపాయమేది?
2. శ్రీకృష్ణ భగవానుని స్వరూపమేమి?

ఈ విషయము లింతవరకు విస్తారముగా వివరింపబడలేదు గాన, ఈ సంశయములు కలుగుటకు అవకాశము గలదు.

ఈ ప్రశ్నలను భగవానుడు గుర్తించి, అనంత రాధ్యాయములలో ఉత్తరముల నిచ్చుచున్నాడు: ఈ దృశం మదీయం తత్త్వమ్. నా స్వరూపమిట్టిది. నాలో తల్లీనమగు ఉపాయమిది అని చెప్పదొడగుచున్నాడు.

తత్పద నిరూపణము ఆరంభమగుచున్నది

తత్త్వమసి అను మహావాక్యములోని త్వం పదము యొక్క అర్థము (నీవు, జీవుడు) గీతలోని మొదటి ఆరు అధ్యాయములలో విస్తారముగా నిరూపింపబడినది. ఇపుడు తరువాతి ఆరు అధ్యాయములలో సర్వ జగత్కారణము, తత్పద వాచ్యమునగు భగవానుడు ప్రముఖముగా వర్ణింపబడును. ఈ తత్పదమును నిరూపించగోరి శ్రీ భగవానుడిట్లు పలుకుచున్నాడు:

అధ్యాయము 7, శ్లోకము 1:

श्री भगवानुवाच ।
मय्यासक्तमनाः पार्थ योगं युञ्जन्मदाश्रयः ।
असंशयं समग्रं मां यथा ज्ञास्यसि तच्छृणु ॥ १ ॥

శ్రీ భగవానువాచ
మయ్యాసక్తమనాః పార్థ యోగం యుంజన్మదాశ్రయః
అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు (1)

శ్రీ భగవాన్ = శ్రీకృష్ణ భగవానుడు; ఉవాచ = పలికెను; మయి = నా యందు; ఆసక్త మనాః = లగ్నమైన మనస్సు గలవాడవై; పార్థ = ఓ అర్జునా!; యోగం = కర్మయోగమును; యుంజన్ = అనుష్ఠించువాడవై; మదాశ్రయః = నన్ను శరణు జొచ్చినవాడవై; యథా = ఏ తీరున; మాం = నన్ను; సమగ్రం = పూర్ణముగా; అసంశయం = సందేహములు లేకుండగా; జ్ఞాస్యసి = తెలియగలవో; తత్ = ఆ ఉపాయమును; శృణు = వినుము.

> ఓ అర్జునా! నా యందు లగ్నమైన మనస్సు గలవాడవై, కర్మయోగమును అనుష్ఠించువాడవై, నన్ను శరణుజొచ్చి, ఏ తీరున నన్ను సమగ్రముగా సందేహములు లేకుండగా తెలియగలవో, ఆ ఉపాయమును వినుము (1).

మయి అను పదము ద్వారా భగవానుడు ఈ శ్లోకములో, ఈ అధ్యాయములో, మరియు రాబోవు అధ్యాయములలో విషయ వస్తువు తానే అని ఉపక్రమించుచున్నాడు. మయ్యాసక్తమనాః. మయి= నా యందు; ఆసక్తమనాః= అంకితమైన మనస్సు గలవాడు. మదాశ్రయః= పరమేశ్వరుడనగు నేను మాత్రమే ఆధారముగా గలవాడు. వానికి పరమేశ్వరుడు తక్క మరియొక ఆశ్రయము లేదు.

శ్రీ శంకరులు భాష్యములో 'మదాశ్రయః' అను పదమును ఇట్లు వివరించినారు. మానవునకు కోరికలు ఉండును. తాను కోరిన లక్ష్యమును పొందుటకై మానవుడు ఉచితమగు ఉపాయమును స్వీకరించును. అట్టి ఉపాయమునకు ఆశ్రయమని పేరు. స్వర్గము నిచ్చే పుణ్యమును పొందుటకై అగ్నిహోత్రము అనే నిత్య కర్మ ఆశ్రయమగును. అట్టి వ్యక్తిని అగ్నిహోత్రాశ్రయుడు అనవచ్చును.

మోక్షమును పొందుటకు మానవుడు దేనిని ఆశ్రయించవలెను? మానవుడు మదాశ్రయుడు అనగా ఈశ్వరుడు ఆశ్రయముగా గలవాడు కావాలని భగవానుడు చెప్పుచున్నాడు. సాధారణంగా మానవులు మోక్షము కొరకు గాక, ఇతర కామనలతో ఈశ్వరుని ఆశ్రయిస్తారు. కాని ఇచట, ఈశ్వరునకు అంకితమైన వ్యక్తిని భగవానుడు మయ్యాసక్త మనాః అని నిర్దేశించినాడు. ఈశ్వరాశ్రయుడు ఈశ్వరుని ఆశ్రయిస్తాడు. అట్టివాడు జీవత్వము నుండి విముక్తిని కోరును. అదియే మోక్షమనబడును.

పరమేశ్వరుడు చరమలక్ష్యము. సాధనము కూడ పరమేశ్వరుడే. పరమేశ్వరుని పొందుట కొరకై ఇతర సాధనములను విడనాడి, పరమేశ్వరుని మాత్రమే ఆశ్రయముగా స్వీకరించు వ్యక్తి మయి ఆసక్త మనాః అగునని శ్రీ శంకరులు వివరించిరి. అట్టి వ్యక్తికి సాధనము కూడ పరమేశ్వరుడే గనుక, ఆతని మనస్సు నాకు మాత్రమే అంకితమగును. ఈశ్వరుడే సాధనము; ఈశ్వరుడే సాధ్యము. ఈ పదములు అధ్యాయములో ఇంకనూ వివరింపబడును.

పరమేశ్వరాన్వేషణలో సాధన సాధ్యములు ఒక్కటి యగును

సాధకుడు సర్వము యొక్క జ్ఞానమును తెలియగోరుచున్నాడు. ఈ అన్వేషణ చాల చిత్రమైనది. ఏలయన, సర్వము కాని సాధనముతో సర్వమును పొందజాలము. సర్వము సదా సర్వమే కనుక, నేను సర్వము అను యెరుక తక్క సర్వమును పొందు మరియొక ఉపాయము లేదు. మరియొక మార్గము లేదు. కావున, అంతిమ విశ్లేషణలో సాధన సాధ్యములు ఒక్కటి యగును.

సాధన సాధ్యములు వేరుగా ఉండే సందర్భాలలో సాధ్యము సాధనమునకు అనురూపముగా పరిచ్ఛిన్నమై ఉండును. కాని, సాధ్యము పూర్ణము అయినప్పుడు, సాధనము కూడ పూర్ణము అగును.

సాధనము అంతకు తక్కువ కాజాలదు. కావుననే ఇచట సాధ్యసాధన భేదము లేదు. అందువలననే, జ్ఞాని నడచిన దారిలో కాలిగుర్తులు ఉండవు అంటారు. ఒక మార్గము గుండా పయనించి జ్ఞానము అనే సాధ్యమును చేరుకున్న జ్ఞాని యొక్క మార్గమును అనుసరించాలని మనము అనుకుంటాము. కాని, జ్ఞాని యొక్క మార్గమును అనుసరించుట, ఆకాశములో పక్షి కాలి గురుతులను అనుసరించుట వంటిది. పక్షి ఎగిరే దారిలో ఏమి కాలిగురుతులు కనబడును? జ్ఞాని యొక్క కాలి గురుతుల పరిస్థితి కూడా అంతే. ఇచటి తాత్పర్యమేమనగా, సాధనసాధ్యములు రెండు ఒక్కటియే. కాలమునకు, కాలాతీతమగు తత్త్వమునకు మధ్యలో దారి లేదు. పరిచ్ఛిన్నమునకు, అనంతమునకు మధ్యలో దారి లేదు. అంశమునకు, పూర్ణమునకు మధ్యలో దారి లేదు. జీవునకు, ఈశ్వరునకు మధ్యలో దారి లేదు.

పరమేశ్వర ప్రాప్తికి పూర్ణముగా అంకితమైన సాధకుని నిర్వచించి, శ్రీకృష్ణ భగవానుడింకనూ ఇట్లు కొనసాగించెను. అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు. యథా = ఏ తీరున; మాం = ఈశ్వరుడనగు నన్ను; సమగ్రం = పూర్ణముగా; అసంశయం = సంశయమేమియూ లేకుండగా, పూర్ణముగా, సర్వాత్మునిగా, శక్తి అధికార ఈశ్వరత్వాది విభూతులతో విరాజిల్లు వానిగా; జ్ఞాస్యసి = తెలియగలవో; తత్ = నన్ను తెలియగలిగే అట్టి ఉపాయమును గురించి; శృణు = వినుము. ఏ ఉపాయమును, ఏ ఆలోచనా సరళిని పాటించినచో, నీవు నన్ను పూర్ణముగా గుర్తించగల్గెదవో, దానిని వినుము.

ఈ శ్లోకము ఈ అధ్యాయమునకు మాత్రమే గాక, రాబోవు అధ్యాయములకు కూడా విషయవస్తువు అగు పరమేశ్వరుని నిరూపణమును ఉపక్రమించినది. ఈ ఆరు అధ్యాయములలో పరమేశ్వర తత్త్వము ప్రముఖముగా ప్రదర్శింపబడును. తరువాతి శ్లోకము కూడా మొదటి శ్లోకము వలెనే ఉపక్రమరూపమైనది.

అధ్యాయము 7, శ్లోకము 2:

ज्ञानं तेऽहं सविज्ञानमिदं वक्ष्याम्यशेषतः ।
यज्ज्ञात्वा नेह भूयोऽन्यत् ज्ञातव्यमवशिष्यते ॥ २ ॥

జ్ఞానం తేఽహం సవిజ్ఞాన మిదం వక్ష్యామ్యశేషతః
యద్ జ్ఞాత్వా నేహ భూయోన్యత్ జ్ఞాతవ్యమవశిష్యతే (2)

స విజ్ఞానం = తత్కాలీన సాక్షాత్కారముతో గూడిన; ఇదం = ఈ; జ్ఞానం = జ్ఞానమును; **అహం** = నేను; **అశేషతః** = పూర్ణముగా; **తే** = నీ కొరకు; **వక్ష్యామి** = చెప్పగలను; **యత్** = దేనిని; **జ్ఞాత్వా** = తెలుసుకొని; **ఇహ** = ఈ లోకములో; **భూయః** = మరల; **జ్ఞాతవ్యం** = తెలియదగినది; **అన్యత్** = మరియొకటి; **న అవశిష్యతే** = మిగిలియుండదో.

> తత్కాలీన సాక్షాత్కారముతో గూడిన ఈ జ్ఞానమును నేను పూర్ణముగా నీకు చెప్పెదను. దీనిని తెలుసుకున్న పిమ్మట ఈ లోకములో మరల తెలియదగినది మరియొకటి మిగిలియుండదు (2).

జ్ఞానమునకు, విజ్ఞానమునకు గల భేదము

ఇదం స విజ్ఞానం జ్ఞానం = ఈ ప్రత్యక్ష జ్ఞానమును. దీనిలో విషయవస్తువు పరమేశ్వరుడు, సర్వ జగత్కారణము, సర్వాత్ముడు అగు నేనే; తే = నీ కొరకు; వక్ష్యామి = నేను చెప్పగలను; అశేషతః = దేనినీ విడిచిపెట్టకుండగా.

ఈ జ్ఞానము ఎట్టిది? జ్ఞాన విజ్ఞానములు కలిసి ప్రయోగింపబడిన సందర్భాలలో, విజ్ఞానమునకు జ్ఞానమునకు అర్థములో కొద్ది తేడా ఉండును. జ్ఞానము అనగా ప్రత్యక్షజ్ఞానము కావచ్చును. కాని, విజ్ఞానముతో కలిసి ప్రయోగింపబడుటచే, జ్ఞానము యొక్క స్థాయి విజ్ఞానము కంటె కొద్ది తక్కువ అగును. వి అను ఉపసర్గకు విశిష్టమైన అని యర్థము. కావున, విజ్ఞానమనగా ప్రత్యక్ష జ్ఞానము. జ్ఞానమనగా పరోక్ష జ్ఞానము.

నేనీ జ్ఞానమును విజ్ఞానముతో సహా నీకిచ్చెదనని శ్రీ కృష్ణ భగవానుడు చెప్పెను. ఈ జ్ఞానము నాకు యథార్థము. నేను చూచిన దానినే నీకు ఉపదేశించుచున్నాను. నేను కేవలము విన్న దానిని నీకు బోధించుట లేదు. నా కిది ప్రత్యక్షము. అందువలన, ఈ ఉపదేశ వచనములు ప్రమాణము. అనగా వాటికి నీ యందు గూడ సమానమైన జ్ఞానమును, సమానమగు దర్శనమును కలిగించే సామర్థ్యము గలదు. నీవు కూడా దర్శించిన వెంటనే అది విజ్ఞానమగును. అపుడు నీలో అస్పష్టత గాని, సంశయములు గాని ఉండవు. ఇది ఒక అర్థము.

ఈ వాక్యమునకు మరియొక అర్థము గలదు: ఈ జ్ఞానము నీకు పరోక్షముగా గాక, వెను వెంటనే ప్రత్యక్షమగునట్లుగా నేను ఉపదేశించెదను. మరియు, ఈ జ్ఞానమును మనము ప్రత్యక్ష

జ్ఞానముగానే పొందవలెననియు, పరోక్షముగా కాదనియు మనకు తెలియును. సాధారణంగా పరమేశ్వరుని యెరుక పరోక్షమని భావింపబడును. పరమేశ్వరుడు అజ్ఞాతుడు అని మనము ప్రాయశః భావిస్తాము. యాదృశోసి మహాదేవ తాదృశాయ నమో నమః. ఓ మహాదేవా! నీవు ఎట్టివాడవో, అట్టి నీ కొరకు నమస్కారములు అని ఒక భక్తుడు పలికెనట! హే భగవాన్! నీవు ఏ రూపములో ఉంటే, ఆ రూపమునకే పునః పునః నమస్కారములు. భగవానుడు ఉన్నాడు అను భావన ఈ భక్తునకు గలదు. కాని అతడు ఎట్లుండును? అతని స్వరూపమేమి? అను విషయములో అతడు ఒక నిర్ణయమునకు రాగోరుట లేదు. ఈ ప్రార్థనలో కొంత శ్రద్ధ ఉన్న మాట వాస్తవమే. కాని, దాని యందు కొంత అస్పష్టత, సంశయము కూడ గలవు. బహుశః అదియే సరియగు ప్రార్థన కావచ్చును. మనము ఈశ్వరుని గురించి నిర్ణయము చేసే యత్నములో నుండగా, ఆ భక్తుడు అట్టి బాధ్యతను తీసుకోదలచలేదు. 'హే భగవాన్! నిన్ను నిర్వచించుటకు అవశ్యకమగు గుణముల నన్నింటిని నీవే ఖాళీలను పూర్తిచేసుకొనుము' అని ఆ భక్తుడు కోరుతున్నాడు కాబోలు! కొన్ని ఉత్తరాలపైన 'ఎవరికి సంబంధిస్తే వారికి (To whom it may concern)' అని వ్రాస్తారు. ఇది అట్లున్నది. ఆ ఉత్తరము ఎవరికి చేరితే వారు 'ఇది నాకు సంబంధించినది' అని భావించవలెను.

కాని ఇచటి స్థితి దీనికి పూర్తిగా భిన్నమైనది. ఈశ్వరజ్ఞానము పరోక్షముగా నుండ బని లేదని శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు. ఈశ్వరజ్ఞానము అపరోక్షముగ నుండగలదు. ఈశ్వరుని అపరోక్ష జ్ఞానమునకే మోక్షమని పేరు. ప్రార్థన ఇత్యాదులలో పరోక్ష జ్ఞానము ఉపకరించును. కాని ప్రార్థన యొక్క చరమ లక్ష్యము పరమేశ్వరుని ప్రత్యక్ష జ్ఞానము. పరమేశ్వరుని ఇతర పరోక్ష జ్ఞానములలో సాధకుడు తాను అంతర్భాగము కాడు. అట్టి జ్ఞానములలో పరమేశ్వరుని పూర్ణ స్వరూపము విషయము కాజాలదు. ఆ జ్ఞానములలో పరమేశ్వరుని యందు మార్పులు చేర్పులు ఉండును. సాధకుడు అంతర్భాగము కాని పరమేశ్వరుడు మరియొక అనాత్మ మాత్రమే యగును. కాని ఆత్మ కాజాలడు. పరమేశ్వరుడు సాధకుని కంటె భిన్నుడైనచో, ఆయన ఒక స్థానమునకు సీమితుడై ఉండవలెను. అనగా, జీవుడనబడు వాడు ఒకడు హృదయములో నుండగా, ఈశ్వరుడనబడే మరో వ్యక్తి ఈ అనంతాకాశములో ఎక్కడో పైన ఉండును. ఇదియే ద్వైతము. నా కంటె భిన్నమైనది సర్వము అనాత్మయే. ఆత్మ చైతన్య స్వరూపము. కావున, అనాత్మ జడము అగును. అనాత్మ చేతనుడగు నాకు తనను తాను ప్రదర్శించ జాలదు. ఈశ్వరుడు నా కంటె భిన్నమైనచో, జడము కావాలి. అట్టి ఈశ్వరుని గురించి మనము సర్వజ్ఞుడని చెప్పుట యెట్లు? ఇది కేవలము పెదవుల నుండి వచ్చే మాట మాత్రమే. శ్రీకృష్ణుడీ శ్లోకములో ప్రత్యక్ష జ్ఞానమును విశేషముగా ఉపదేశింపగలనని చెప్పుచున్నాడు.

జ్ఞానస్తుతి – ఈ ఒక్క వస్తువు తెలిస్తే, సర్వము తెలిసినట్లే

శ్రీకృష్ణుడు మనలను సావధానులను చేయుటకు, మరియు ఆరంభించిన భావనను పూర్తి చేయుటకు, ఈ జ్ఞానమును స్తుతించుచున్నాడు. యత్ జ్ఞాత్వా = దేనిని యెరింగినచో; ఇహ = ఈ లోకము నందు లేదా ఈ శాస్త్రములో; భూయః అన్యత్ = దీని కంటె గొప్పది మరియొకటి; జ్ఞాతవ్యం = తెలియదగినది; న అవశిష్యతే = లేనే లేదు.

మనము ఒక వస్తువును తెలుసుకున్నప్పుడు, తెలియనిది మరియొకటి సర్వదా ఉండును. వాస్తవంలో ఆ ఒక వస్తువులో నైననూ తెలియని అంశాలు ఎన్నో ఉంటాయి. కాని ఇచట ఒక వస్తువును తెలుసుకున్నచో, సర్వము తెలిసినట్లు అగునని శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు. పైగా, ఆ ఒక వస్తువు తానేనని చెప్పుచున్నాడు. నన్ను తెలుసుకో. సర్వము నేనే గనుక, నీకు సర్వము తెలిసినట్లే యగును.

'నేను సర్వమును ఎట్లు తెలియగలను? నాకు ఏవో కొన్ని వస్తువులను మాత్రమే తెలుసుకునే శక్తి గలదు' అని మనము ప్రశ్నించవచ్చును. కాని, అట్లు కాదని శ్రీకృష్ణ భగవానుడు చెప్పుచున్నాడు. జ్ఞాతవ్యం అనగా తప్పక తెలియదగినది. దీనిని తెలుసుకున్న పిదప, తెలియదగినది ఏదీ మిగలదు. ఈ విశ్వములో ఒకే ఒక సత్యము గలదు. ఆ సత్యము తెలియగానే, మిథ్య సహజముగనే స్పష్టముగా భాసించును. మిథ్య సత్య వస్తువే గాని, సత్యము మిథ్య కాదు. మనమీ విషయమును నా సతో విద్యతే భావః (2–16) అను శ్లోకము వద్ద విస్తృతముగా చర్చించినాము.

దేనిని తెలుసుకున్నచో జీవితములో మార్పు వచ్చునో అట్టి తత్త్వమును తెలియాలని ఈ శ్లోకము చెప్పుచున్నది. ఈశ్వరుని స్వరూపము తెలిస్తే సర్వము తెలిసినట్లే. ఒకే ఒక సత్యము గలదు. అదియే ఈశ్వర స్వరూపము. అదియే నీవు. కావున ఈ సత్యము విషయములో నీకు గల అజ్ఞానమును తొలగించుకొనుట సంభవమే. నీవు స్వయం సిద్ధుడవు. నీ స్వరూపము సత్యము. సత్యమగు ఆత్మ తెలిస్తే సర్వము తెలిసినట్లే. ఆత్మను తెలియుట యనగా, నేను సర్వ నిరపేక్షుడనే అయినా, సర్వము నేనే యని యెరుంగుట.

ఆత్మను సర్వము కంటె భిన్నముగా దర్శించినపుడు, ఆ సర్వమునకు నీతో సంఘట్టనము తప్పదు. అప్పుడు ప్రపంచము ఏదో విధంగా అధిగమించదగిన అవరోధముగా భాసిస్తుంది. సాధారణంగా మానవులు ప్రపంచమును దర్శించు తీరు ఇదియే. ప్రపంచమునకు విరోధియగు ఈ అహం సర్వప్రాణుల ఆత్మ అనియు, అదియే పరమేశ్వరుడనియు తెలుసుకోవాలి. సర్వము నేనే అనియు, అహం

పరమాత్మయే ననియు శ్రీకృష్ణ భగవానుడు నిరూపించబోవుచున్నాడు. సర్వ సృష్టికి కారణము, తత్పదార్థము నగు బ్రహ్మను నేనే; ఆ బ్రహ్మవు నీవే అని ఆయన చెప్పబోవుచున్నాడు. నన్ను ఆత్మరూపునిగా యెరుంగువాడు నా కంటె వేరుగాడు; వాడే సర్వజ్ఞుడు అని కూడ ఆయన చెప్పగలడు.

శ్రీ శంకరులు ఈ శ్లోకభాష్యములో నిట్లు వివరించిరి. ఇది తెలిసిన తరువాత, తెలుసుకొని సాధించదగినది మరియేదీ మిగలదు. మానవ జీవితము యొక్క చరమ లక్ష్యము సిద్ధించినది గాన, సాధించదగినది ఏదీ మిగలదు. ఈశ్వర యాథార్థ్యము తెలిసినవాడు సర్వజ్ఞుడు అగును. సర్వజ్ఞత అను మాన్యతను ఈయగల జ్ఞానము ఇది తక్క మరియొకటి లేదు. ఇతర జ్ఞానము లన్నియు విశిష్ట వస్తువులకు మాత్రమే చెందియుండును గాన, అది మిథ్యా జ్ఞానమగును. కాని ఈ జ్ఞానము సర్వము తానే అయిన వస్తువు యొక్క జ్ఞానము. కావున, ఆ ఒక్క వస్తువును తెలిసిన చాలును. ఈ జ్ఞానము యొక్క రహస్యమిదియే.

భగవాన్ విఘ్నేశ్వరుడు ఈ రహస్యమును ఎరుంగును. భగవాన్ శివునకు గణేశునిపై కొంత పక్షపాత ముండెడిది. శివుని రెండవ కుమారుడగు సుబ్రహ్మణ్యుడు 'నీకు గణేశునిపై అంత ప్రీతి యేల?' ఇత్యాదిగా సర్వదా ఫిర్యాదులు చేయుచుండెడివాడు. అపుడు శివుడు వారిద్దరికీ ఒక పరీక్షను పెట్టెను. ఆయన వారి నిద్దరినీ జగత్తును పూర్ణముగా చుట్టి మరలి రమ్మని చెప్పెను. 'నా సామర్థ్యమును నిరూపించుటకు ఇది అద్భుతమగు అవకాశము' అని సుబ్రహ్మణ్యుడు తలంచెను. అతని వద్ద ఒక చక్కని నెమలి ఉండెను. దానిని బట్టి అతనికి తాను పరీక్షలో నెగ్గగలననే నమ్మకముండెను. గణేశునకు పెద్ద పొట్ట గలదనియు, వేగముగా నడువజాలడనియు అతనికి తెలియును. పైగా అతని వాహనము ఎలుక. ఇట్టి వాహనముపై బయలుదేరి గణపతి ఎప్పటికి తిరిగి రాగల్గును! గణపతి ఎక్కినచో పాపం ఆ చిట్టి ఎలుక కలదలేదు! తానీ పరీక్షలో నెగ్గుట నిశ్చయమని సుబ్రహ్మణ్యమునకు విశ్వాసము కలిగెను. అతడు నెమలి నధిరోహించి బయలుదేరెను. కాని, ఆయన జగత్తును చుట్టి వచ్చునరికి, చేతిలో బహుమానము (prize)తో గణేశుడు దర్శనమిచ్చెను. అతడు చకితుడై, 'నీవు ఎలుక నెక్కి నా కంటె ముందుగా జగత్తు యొక్క పరిభ్రమణమును ఎట్లు పూర్తి చేయగల్గితివి? నీవు ఎచటకు వెళ్లితివి?' అని ప్రశ్నించెను. 'అతడేమిచేసెనో, నీకు తెలియునా? నాకు, పార్వతికి ప్రదక్షిణము చేసినాడు' అని భగవాన్ శివుడు చెప్పెను. సుబ్రహ్మణ్యము జగత్తు నంతను చుట్టు బెట్టగా, విఘ్నేశ్వరుడు శివపార్వతులకు మాత్రమే ప్రదక్షిణము చేసినాడు. గణేశుడు శివునకు ప్రదక్షిణము చేయుచుండగా 'ఏమిచేయుచున్నావు?' అని శివుడు ప్రశ్నించెను. 'నీవు జగత్తు నంతనూ ప్రదక్షిణము చేయవలెనని చెప్పితివి. నీవే సర్వము కావ నేను నీకు ప్రదక్షిణము చేయుచుంటిని' అని గణేశుడు

బదులిడెను. ఇపటి పరిస్థితి కూడ సరిగా అటులనే యున్నది. దీనిని తెలిసినచో, తెలియదగినది ఏదియూ మిగలదు.

ఈ చిన్న కథలో మనకు ఒక సందేశము గలదు. సర్వము భగావానుడే. అయన ఆత్మరూపుడు. జగత్తు అంతా ఆయనపై ఆధారపడును. ఆయనయే జగత్తు నంతనూ ధరించి యున్నాడు. ఆయనను తెలుసుకుంటే, సర్వము తెలిసినట్లే.

అధ్యాయము 7, శ్లోకము 3:

मनुष्याणां सहस्रेषु कश्चिद्यतति सिद्धये ।
यततामपि सिद्धानां कश्चिन्मां वेत्ति तत्त्वतः ॥ ३ ॥

మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః (3)

మనుష్యాణాం = మానవులలో; **సహస్రేషు** = వేలాది మందిలో; **కశ్చిత్** = ఒకానొకడు; **సిద్ధయే** = మోక్షము కొరకు; **యతతి** = ప్రయత్నమును చేయును; **యతతాం** = ప్రయత్నమును చేయు; **సిద్ధానాం అపి** = సాధకులలో నైననూ; **కశ్చిత్** = ఒకానొకడు; **మాం** = నన్ను; **తత్త్వతః** = యథార్థముగా; **వేత్తి** = ఎరుంగును.

మానవులలో వేలాదిమందిలో ఒకడు మోక్షము కొరకు ప్రయత్నించును. ప్రయత్నమును చేయు సాధకులలో నైననూ ఒకానొకడు నన్ను యథార్థముగా ఎరుంగును (3).

శ్రీకృష్ణుడు తప్పక తెలియదగిన ఈ పరమాత్మ జ్ఞానమును స్తుతించి, ఇపుడు ఆ జ్ఞానము అరుదు అని చెప్పుచున్నాడు.

మహా ఫలము నిచ్చే ఈ జ్ఞానము అరుదు

మోక్షము అనే అసాధారణమగు ఫలమును ఈ జ్ఞానము ఇచ్చును. కావున, దీనిని పొందుట సరళము కాదు. ఈ జ్ఞానము సర్వజ్ఞాన విలక్షణమగుటయే ఇది దుష్కరమగుటలో హేతువు. ఇది చాల అరుదుగ కనబట్టుటకు ఇదియే కారణము అని శ్రీ శంకరులు వివరించిరి.

సాధారణముగా జ్ఞానము గమ్యముగా నుండదు. అది పొందదగిన గమ్యమునకు ఉపాయముగ నుండును. కాని ఇచట ఈ జ్ఞానమును పొందిన తరువాత తెలియదగినది గాని, పొందదగినది గాని ఏదీ ఉండదు. అంటే, అట్టి జ్ఞానికి పురుషార్థము ఉండదు. మోక్షములో ధర్మార్థ కామములనే మిగిలిన మూడు పురుషార్థములు అంతర్గతమగును. కావున మోక్షమును సాధింపబూను వ్యక్తి సర్వమును సాధించినట్లే యగును. ధర్మార్థ కామముల వలన సాధింపగలిగే సర్వము మోక్షములో అంతర్గతమగును. కావున మోక్షమనగా ధర్మార్థ కామముల అన్వేషణ నుండి విముక్తి. కాని మోక్షము వాటిలో ఏ ఒక్క దానిలోనూ అంతర్గతము కాదు. మూడింటిని కలిపినా మోక్షము అంతర్గతము కాదు. ఈ మోక్షము అనే ప్రయోజనమునకు జ్ఞానముతో భేదము లేదు. కావున జ్ఞానమే లక్ష్యము. ఈ ఫలము ఈ తీరున మిక్కిలి విలక్షణమైనది గనుకనే, ఈ జ్ఞానము మిక్కిలి దుర్లభమైనది.

ఈ జ్ఞానము దుస్సాధ్యము, కావుననే దుర్లభము

ఈ జ్ఞానము దుస్సాధ్యము. ఇది దుర్లభమగుటలో ఇది కూడా మరియొక కారణము. వ్యక్తి సంసిద్ధుడు కానిచో, జ్ఞానము ఏదైనా కష్టమే. వ్యక్తి సంసిద్ధుడైనచో, సర్వజ్ఞానములు సులభములే. జ్ఞాన స్వభావమే అట్టిది. జ్ఞానము కష్టమైనది కావచ్చును. లేదా, సరళమైనది కావచ్చును. సరళము అనుటయూ సరిగాదు. మనము కళ్లను తెరచి పుష్పమును చూచినాము. ఇది సరళము కాదు; కష్టము కాదు. కంటికి చూపు ఉండాలి. ఉంటే జ్ఞానము వెనువెంటనే కలుగుతుంది. కావున సంసిద్ధుడైన వ్యక్తికి జ్ఞానము సరళము. సంసిద్ధుడు కాని వానికి సరళము కానే కాదు. ఈ జ్ఞానమునకు ఆవశ్యకమగు తయారీలో క్లేశము గలదు. కావుననే, ఈ జ్ఞానము దుర్లభతరము అని వర్ణింపబడినది.

ఇది ఎంత దుర్లభమో శ్రీకృష్ణుడు వివరింపుచున్నాడు. మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే. సహస్రేషు మనుష్యాణాం కశ్చిత్ అనునది సంస్కృత భాషలోని విలక్షణ ప్రయోగములకు ఒక మచ్చుతునక. తెలుగులో కోటికి ఒక్కడు అను ప్రయోగము గలదు. సహస్రేషు అనగా వేలాది మనుష్యులలో. జ్ఞానము ఏదైనా, దానిని పొందవలసిన వ్యక్తికి అర్హత ఉండవలెను (అధికారీ). ఈ జ్ఞానమును పొందుటకు ఆవశ్యకమగు అర్హత గల అధికారులు మనుష్యులే. మనుష్యత్వము సామాన్యమగు అర్హత. కాని, ఈ జ్ఞానము నందధికారము గల వేలాది మనుష్యులలో (మనుష్యాణాం) ఒక్కడు మాత్రమే (కశ్చిత్) ప్రయత్నించును (యతతి). అతడు మోక్షము (సిద్ధి) కొరకు యత్నించును. సిద్ధి యనగా విజయము అని సామాన్యార్థము. కాని, మానవ జీవనమునకు విజయము మోక్షమే గనుక, సిద్ధయే అనగా మోక్షము కొరకు అని యర్థము.

వేలాది మనుష్యులలో ఒక్కడు ఆత్మను తెలియగోరును

మానవులందరూ కర్మణ్యులుగనే ఉండగా, ఒక వ్యక్తి మాత్రమే ప్రయత్నించును (కశ్చిత్ యతతి) అని శ్రీకృష్ణుడు చెప్పుటకు కారణమేమి? ప్రతి వ్యక్తి తన కంటె భిన్నముగా నుండే అనాత్మ కొరకు ప్రయత్నించును. తనలో తాను ఆనందముగా లేని వ్యక్తి, కొంత ఉల్లాసమును పొందుట కొరకై ఏవో కొన్ని అభిలషణీయములగు వస్తువులను అన్వేషించవలసి యుండును.

కాని, ఇచటి పరిస్థితి వేరు. మానవుడు తనతో తాను ఆనందముగా లేకపోవుటకు కారణమేమి? అనే మౌలిక ప్రశ్న ఇచట విశ్లేషింపబడును. నేను స్వభావతః దుఃఖినా? లేక, నేను దుఃఖిని అనే ధారణను కలిగియుండుట మాత్రమేనా? ఈ ప్రశ్నకు సమాధానమును తెలియగోరుటయే ఆత్మేచ్ఛ (తనను తాను తెలుసుకోవాలనే కోరిక) యనబడును. ఆత్మను తెలియాలని కోరే వ్యక్తి ఆత్మ కొరకై ఇతరమును కోరుట లేదు. ఆతడు ఆత్మను ఆత్మ కొరకు మాత్రమే తెలియగోరుచున్నాడు. తన కొరకు తనను తెలియగోరుచున్నాడు. ఇదియే భేదము.

ఆత్మ జ్ఞానమును పొందిన వ్యక్తి విముక్తుడగును. ఈ విషయమును మానవుడు గుర్తించవలెను. కాని, సాధారణంగా మానవులకు మోక్షము ఈ విధముగా లభించునని తెలియదు. అందువలననే, కశ్చిద్యతతి సిద్ధయే అని శ్రీకృష్ణ భగవానుడు చెప్పుచున్నాడు. పెక్కు మానవులలో, మోక్షము కొరకు యత్నించు వ్యక్తి ఒక్కడు ఉండును.

సాధకులలో ఒక్కడు మాత్రమే తత్త్వము నెరుంగును

మరియు, ప్రయత్నము చేయువారిలో (యతతామపి సిద్ధానామ్) ఒకానొకడు (కశ్చిత్) యథార్థముగా (తత్త్వతః) నన్ను యెరుంగును(మాం వేత్తి).

యథార్థ సాధకునకు విజయము తథ్యము

సిద్ధులు అనగా విజయమును పొందిన వ్యక్తులు అని యర్థము. ఇట్టి విజేతలగు వ్యక్తులు అనేకులలో ఒకడు నన్ను యెరుంగును అని శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు. అట్లైనచో, సిద్ధులుగా వర్ణింపబడిన ఇతర విజేతల మాట యేమి? వారు నిన్ను తెలియజాలరా? నిన్ను తెలియజాలని వారిని సిద్ధులు అనుట యెట్లు పొసగును? కావున, ఈ ప్రకరణములో సిద్ధుడు అనగా సాధకుడు అని యర్థము. యతతాం అను పదమునకు విశేషణమైన సిద్ధానాం అను పదమునకు సిద్ధి కొరకై ప్రయత్నించు

మానవులు అని యర్థము. సిద్ధి కొరకు ప్రయత్నించుట కూడ సిద్ధియే. ఎందువలన? ఇట్టి ప్రయత్నమును చేయు వ్యక్తి లక్ష్యమును చేరును గనుక. మోక్షము కొరకై యత్నించు వ్యక్తి దుర్గతిని పొందడని శ్రీకృష్ణుడిది వరలో చెప్పియున్నాడు. నహి కల్యాణ కృత్కశ్చిత్ దుర్గతిం తాత గచ్ఛతి. కావున, వారి ప్రయత్నములకు లభించబోయే మోక్షరూప ఫలమును మనను నందిడుకొని శ్రీకృష్ణుడు సాధకులను సిద్ధులు అని వర్ణించినాడు.

పదములను ఈ విధముగా ప్రయోగించుట మనకు కొత్త కాదు. ఉదాహరణకు, వైద్య విద్యార్థులు తమ పేరునకు MBBS అను డిగ్రీని జత చేసి వ్రాస్తారు. రెండు సంవత్సరముల కోర్సును మాత్రమే పూర్తిచేసిన విద్యార్థులు కూడా తమ పేరు ప్రక్కన (MBBS) అని వ్రాసుకుంటారు. భవిష్యత్తులో ఆ డిగ్రీని పొందబోయే విద్యార్థి ముందుగా అట్లు వ్రాసుకొనుటకు అభ్యంతరము లేదు.

కావున, మోక్షము కొరకు ప్రయత్నించు మానవులు భవిష్యత్తులో, ఈ జన్మలో గాని, మరుజన్మలో గాని, సిద్ధులు కాబోతారు గనుక, వారిని సిద్ధులు అని భావించవచ్చునని శ్రీ శంకరులు వ్యాఖ్యానించిరి. అట్టి వారిలో ఒకడు ఇప్పుడు నన్ను యెరుంగును (కశ్చిత్ మాం వేత్తి) అని శ్రీకృష్ణుడు వర్తమానకాలమును ప్రయోగించుచున్నాడు. ఒకడు నన్ను యెరుంగును; ఇతరులు నన్ను తెలుసుకొనే ప్రయత్నములో నున్నారు.

ఆధ్యాత్మ సాధకులలో అనేక రకముల వారు గలరు. వారందరు సిద్ధులు అని చెప్పజాలము. పరమేశ్వరుని స్వరూపజ్ఞానమును పొందే యత్నమును చేయువారు మాత్రమే సిద్ధులు అగుదురు. అట్టి వారు చాల అరుదు. దీనికి కారణమేమి? అధికారిత్వము మిక్కిలి అవశ్యకము. ఇది సామూహిక పరుగు పందెము వంటిది. చాల మంది పరుగును ఆరంభిస్తారు. కాని, అంతములో ఒక్కడు మాత్రమే లక్ష్యమును చేరును.

శ్రీకృష్ణుడీ విషయము నంతనూ అర్జునుని భయపెట్టుట కొరకు గాక, అతని ఉత్సాహమును పెంపొందించుటకై చెప్పుచున్నాడు. వేలాది మందిలో ఒక్క వ్యక్తి తెలియగోరును. అట్టి జిజ్ఞాసువులలో ఒక్కడు యెరుంగును. ఈ మాటను వినగానే 'నాకు అవకాశము లేదు' అని మనకు అనిపిస్తుంది. కాని అర్జునుని మనస్సులో అభిరుచిని కలిగించుట శ్రీకృష్ణుని తాత్పర్యమని శ్రీ శంకరుల అభిప్రాయము. ఎందువలన? శ్రీకృష్ణుడు బోధించబోవు జ్ఞానము చాల ప్రముఖమైనది. కావున ఈ శ్లోకము అర్జునుని సావధానుని చేయుట కొరకై ఉద్దేశింపబడినదే గాని, నిరుత్సాహపరచుటకు కాదు.

విషయ వస్తువును ఉల్లేఖించుటను మాత్రమే చేసే ఈ మూడు ఉపక్రమ శ్లోకముల ద్వారా అర్జునుని సావధానుని చేసి, భగవానుడు ఇప్పుడు ఈశ్వర స్వరూప నిరూపణమును ఆరంభించుచున్నాడు. మనము శ్లోకములను తరువాత చూచెదము. ముందుగా వాటి తాత్పర్యమును గమనించెదము.

సృష్టికి ద్వివిధ కారణము నేనే - శ్రీకృష్ణ భగవానుని ప్రతిపాదన

రెండు రకముల ప్రకృతులు గలవు. ప్రకృతి యనగా సృష్టిలో ఉపయోగించే మౌలిక సామర్థ్యము గలది అని యర్థము. ప్రకృతి యనగా కారణము అని కూడ అర్థము గలదు. నాకు రెండు ప్రకృతులు గలవని భగవానుడు చెప్పుచున్నాడు. ఒకటి స్వరూప ప్రకృతి. రెండు స్వభావ ప్రకృతి.

సర్వ జగత్కారణము, సర్వము యొక్క సత్యము అగు స్వరూప ప్రకృతి మొదటిది. ఇది లేనిదే ఏదీ లేదు. దీనికి పరాప్రకృతి అని కూడా పేరు. ఒక వస్తువు ఆ వస్తువుగా అగుటకు మూల భూతమగు తత్త్వము స్వరూపమగునని మనము చూచియున్నాము. ఉదాహరణకు, మంచుగడ్డ చల్లగా నుండును. చల్లదనము దాని స్వరూపము. చల్లదనము లేని మంచుగడ్డ ఉండదు. అదే విధముగా, జ్ఞానము ఆత్మ స్వరూపము. అది లేనిదే ఆత్మ లేదు. అది ఆత్మకు గుణము కాదు. జ్ఞానము గుణము, ఆత్మ గుణి అను విభాగము ఆత్మ యందు లేదు. వాస్తవంలో ఆత్మ (నేను)యే జ్ఞానాత్మకమగు ఉనికియై ఉన్నది. కావున, జ్ఞానము ఆత్మ స్వరూపమే గాని, ఆత్మ గుణము కాదు.

జ్ఞానము (చైతన్యము) ఆత్మ స్వరూపము గనుక, చైతన్యమును గురించి మనము తెలియదగిన మరికొన్ని వాస్తవములు గలవు. చైతన్యము సత్యము, మరియు అనంతము. ప్రపంచమును గురించి మనకు గల విభిన్న రకముల పరిచ్ఛిన్న జ్ఞానముల దృష్ట్యా, ఈ జ్ఞానము సత్యమని మనము చెప్తాము. అనగా, మిగిలినది సర్వము సత్యము కాదు. ఈ చైతన్యము మాత్రమే సత్యము. మనము మరియొక సత్యమును గుర్తించుటకు నిరాకరించుచున్నాము అని అనుకోరాదు. ఉన్నది ఒకే ఒక సత్యము. అదియే ఆత్మ. ఉనికి గలది సత్యము అని మనము సాధారణంగా అనుకుంటాము. ఇచట మనము ఆ ఉనికిని చైతన్యములో అంతర్భాగము చేస్తాము. మరియు అది సత్యము గనుక అంతము లేనిది (అనంతము). సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మయే ఆత్మ. ఇదియే సర్వమునకు ప్రకృతి. ఈ సందర్భములో ప్రకృతి యనగా సర్వమునకు కారణము (సర్వస్య కారణమ్). అందువలననే, దానికి స్వరూప ప్రకృతి యని పేరు.

స్వభావ ప్రకృతి

ఇక, రెండవ రకం ప్రకృతికి స్వభావ ప్రకృతి, లేక ప్రకృతి అని పేరు. పంచ మహాభూతములు, పంచ తన్మాత్రలు దీని యందుండును. ఇది కారణము, కార్యము అను విభాగమును పొందియుండును. కార్యము కారణము కంటె వేరు గాదు. కావున, దీనికి కూడ ప్రకృతి యని పేరు వచ్చినది. మరియు, దీనిని కార్యప్రకృతి అని కూడా అంటారు. పాంచ భౌతికములైన స్థూల పదార్థములు, జ్ఞానేంద్రియములు, మనస్సు మరియు ప్రాణము కూడ కార్యప్రకృతిలో భాగములే. అంటే, కొన్ని తత్త్వములను దగ్గరకు చేర్చి సృష్టింపబడే సర్వము కార్య ప్రకృతియే. కార్యము అనగా కొన్నింటిని ఒకచో చేర్చి నిర్మించబడిన వస్తువు. ఈ ప్రకృతికే మాయా, అవ్యక్తము, మూల ప్రకృతి అని పేర్లు. సర్వ సృష్టికి మూలము నందున్న ఉపాధి ఈ ప్రకృతియే. ఆ ఉపాధి గలవాడే పరమాత్మ. కావున, సచ్చిదానంద ఆత్మ సర్వజగత్కారణము. మాయ స్వభావము.

ఈ మాయకు మూలమెక్కడ నున్నది? కార్యము నందా? లేక, బ్రహ్మయందా? బ్రహ్మ యందు గలదు. కార్యము మిథ్య. కాన మాయ కార్యము నందుండ జాలదు. కావున, మాయకు ఆశ్రయము బ్రహ్మ (బ్రహ్మాశ్రయా హి మాయా). బ్రహ్మ సత్యము, జ్ఞాన ఘనము, అనంతము, ప్రత్యగభిన్నము. అట్టి బ్రహ్మ మాయకు, మాయా కార్యములకు ఆశ్రయము.

ఈ అధ్యాయములో శ్రీకృష్ణ భగవానుడు ముందుగా కార్యము (అపరా ప్రకృతి)ను వర్ణించును. మరియొక ప్రకృతి గలదనియు, అది పరాప్రకృతి అనియు, అదియే వాస్తవమగు కారణమనియు, అది లేనిదే సృష్టి ఏదియూ ఉండజాలదనియు తరువాత చెప్పును. ఉనికిని ఇచ్చునదియే వాస్తవమగు కారణమగును. పరాప్రకృతి లేనిదే సృష్టి అసంభవము. సర్వ సృష్టికి వాస్తవకారణమగు సత్యత్వము నా స్వరూపము. అది నీ స్వరూపము కూడా. అదియే పరాప్రకృతి. ఈ పరాప్రకృతి వస్తుతః ఈశ్వరాభిన్నము అని నీవు తెలుసుకొనవలెను. నీవు ఈ ద్వివిధ ప్రకృతులను తెలుసుకోవాలి. పైగా స్వరూపప్రకృతి (పరాప్రకృతి) నీవే అని కూడా తెలుసుకోవాలి. పరాప్రకృతి లేనిదే సృష్టి లేదు. నేనే నీవు. సర్వ జగత్కారణము నేనే. నేనే నీవు. అనగా సర్వమునకు కారణము నీవే. సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ నీవే.

మీకు వెంటనే ఒక ప్రశ్న ఉదయిస్తుంది. 'నేను కారణము ఎట్లు అగుదును? నేను ఈశ్వరుడను ఎట్లు కాగల్గుదును?' నా ఉత్తరమేమనగా, నీవు కాదంటే కావు. నీ యందు జీవ భావన ఉన్నంత వరకు నీవు జీవుడవే. నీవు ఎన్నటికీ కాలేవు. వ్యక్తి వ్యక్తియే. వ్యక్తి ఈశ్వరుడు కాలేడు.

అట్లు గాక, 'నేను ఈశ్వరుడను' అని నీవన్నచో, అపుడు ఈ 'నేను' ఎక్కడ ఉన్నది? అనే సమస్య ఉదయించును. దానిని తెలుసుకోవాలి. ఈశ్వరుడే సర్వము; ఆయన స్వరూపము నీవే అని నిరూపించుట కొరకై శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములలో ద్వివిధ ప్రకృతిని ప్రదర్శించుచున్నాడు.

అధ్యాయము 7, శ్లోకము 4:

भूमिरापोऽनलो वायुः खं मनो बुद्धिरेव च।
अहङ्कार इतीयं मे भिन्ना प्रकृतिरष्टधा ॥ ४ ॥

భూమి రాపోనలో వాయుః ఖం మనో బుద్ధి రేవ చ
అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతి రష్టధా (4)

భూమిః = భూమి; **ఆపః** = నీరు; **అనలః** = అగ్ని; **వాయుః** = వాయువు; **ఖం** = ఆకాశము; **మనః** = మనస్సు; **బుద్ధిః** = బుద్ధి; **ఏవ** = నిశ్చయముగా; **చ** = మరియు; **అహంకారః** = నేను అనే ధారణ (కర్తృత్వము); **ఇతి** = అనే; **ఇయం** = ఈ జగత్తు అంతా; **మే** = నా యొక్క; **అష్టధా** = ఎనిమిది విధములుగా; **భిన్నా** = విభాగమును పొందిన; **ప్రకృతిః** = ప్రకృతి.

> భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి మరియు 'నేను' అనే ధారణ (కర్తృత్వము) అనే ఈ సర్వజగత్తు ఎనిమిది విధములుగా విభాగమును పొందిన నా ప్రకృతియే (4).

ఈ అధ్యాయ ఉపక్రమములో చెప్పిన ద్వివిధ ప్రకృతి జగత్తు నకంతకూ కారణమై యున్నది. ఈ ప్రకృతులకు ఈ అధ్యాయములో అపరా మరియు పరా ప్రకృతులు అని పేరు. పరా ప్రకృతి చరమ కారణము. అది లేనిదే కార్యసృష్టి సంభవము కాదు. జగత్తునకు ఉపాదానము అపరా ప్రకృతి. అదియే మాయ. మాయ నుండి ఉదయించిన మహత్తు ఇత్యాదుల నుండి జగత్తు నిర్మాణమైనది. స్థూలభూతములు సూక్ష్మభూతముల నుండి పుట్టినవి. కావుననే ఈ శ్లోకములో సూక్ష్మ భూతములు అపరా ప్రకృతి యని వర్ణింపబడినవి.

ఈ సమస్త జగత్తు (ఇయం) నా ప్రకృతి (మే ప్రకృతిః). ఇది ఎనిమిది విధములుగా విభక్తమై యున్నది (అష్టధా భిన్నా). అష్ట అనగా ఎనిమిది. అష్టధా అనగా ఎనిమిది విధములు. శ్రీకృష్ణుడీ శ్లోకములో పృథివీ తన్మాత్ర (సూక్ష్మభూతము)తో మొదలిడి ఆ ఎనిమిది సూక్ష్మాంశములను

బోధించుచున్నాడు. ప్రతి భూతము మిగిలిన నాలుగు భూతములతో కలిసి స్థూల భూతమగును. కాని సూక్ష్మ భూతములలో ఇట్టి కలయిక లేకపోవుటచే వాటికి తన్మాత్రలని పేరు వచ్చినది. ప్రతి భూతమునకు స్వీయగుణము గలదు. మనము ఆ గుణమును ఒక జ్ఞానేంద్రియముతో అనుభవించెదము. ఉదాహరణకు, పృథివికి స్వీయగుణము గంధము. కావున, ఇచట భూమి అను పదము గంధతన్మాత్రను నిర్దేశించును. అదే విధముగా, అపః (నీరు) అనగా రసతన్మాత్ర. వాయువు అనగా స్పర్శ తన్మాత్ర. ఖం (ఆకాశము) అనగా శబ్ద తన్మాత్ర.

ప్రక్రియా – బోధించే నమూనా

సృష్టి యొక్క స్వరూపమును బోధించుటకు ఉపయుక్తమయ్యే ఇట్టి నమూనాను సృష్టి ప్రక్రియ అందురు. ఒక దర్శనము (vision)ను కలిగించుటకై చేయబడే ఒక విశిష్టమగు చర్చకు ప్రక్రియ అని పేరు. ప్రక్రియ ఏదైనా, పరబ్రహ్మ కంటె భిన్నముగా ఏదీ లేదని నిర్దేశించుటయే దాని తాత్పర్యము. అనగా సృష్టిని నిరూపించే ప్రక్రియకు సృష్టిని ప్రతిపాదించుట యందు తాత్పర్యము లేదు.

ఈ సృష్టి ప్రక్రియ వలెనే మరికొన్ని ప్రక్రియలు కూడ గలవు. అవస్థాత్రయ ప్రక్రియ (మన అనుభవములో ఉన్న మూడు అవస్థలను విశ్లేషించుట); పంచకోశ ప్రక్రియ (వ్యక్తికి తన గురించి తనకు గల అనుభవములోని అయిదు స్థాయిలను విశ్లేషించుట); దృక్ దృశ్య ప్రక్రియ (ద్రష్టను దృశ్యమును విశ్లేషించి, ఆత్మను అనాత్మ నుండి వేరుచేసి, ఆ పిమ్మట అనాత్మ మిథ్య అనియు, కాన ఆత్మ కంటె వేరు కాదనియు నిరూపించుట). ఈ జగత్తును పంచభూతముల సమాహారముగా నిరూపించే నమూనా సృష్టి ప్రక్రియలోని భాగమే. దీనికే కారణ కార్య ప్రక్రియ అని కూడా పేరు. ఈ సృష్టి ప్రక్రియ చాలా ఉపనిషత్తులలో వర్ణించబడినది.

సృష్టి ప్రక్రియా – ఛాందోగ్యోపనిషత్తులో సృష్టి విశ్లేషణ

ఛాందోగ్యోపనిషత్తులోని ఆరవ అధ్యాయములో ఉద్దాలక మహర్షి తన కుమారుడగు శ్వేతకేతువుతో, ఈ జగత్తు సృష్టింపబడుటకు పూర్వము ఒకే ఒక వస్తువు గలదని చెప్పెను. అదియే సత్ (ఉనికి), అద్వితీయము (ఒకే ఒకటి). అది తక్క మరియొకటి లేదు. దానిని పోలిన మరియొక సద్వస్తువు లేదు. దానిని పోలని మరియొక వస్తువైననూ లేదు. దాని యందు అవయవములు లేవు.

కావున అది ఒకే ఒక అద్వితీయము. దానిలో దానికి భేదము లేదు. దానిని విడదీసే అంశమేదియూ లేదు. అది విభాగము లేని పూర్ణతత్త్వము.

ఉద్దాలకుడు ఉపక్రమములో ఈ సద్వస్తువును ప్రస్తావించి, ఈ సద్వస్తువు నుండి పాంచభౌతిక జగత్తు యొక్క సృష్టిని వివరించెను. ఆయన రూపము కలిగిన (మూర్త) భూతములను (అగ్ని, అపః, పృథివీ) మూడింటిని మాత్రమే ప్రస్తావించెను. రూపము లేని రెండు భూతములను (ఆకాశము, వాయువు) ఆయన చెప్పలేదు. సద్వస్తువు నుండి పుట్టిన ఈ భూతములకు ఆ సద్వస్తువు కంటె భిన్నమైన ఉనికి లేదని నిరూపించుట యందు మాత్రమే ఆయనకు తాత్పర్యము గలదు. ఘటము మృత్తు కంటె వేరుగా లేదు. అదే విధముగా, సృష్టి తత్కారణము కంటె భిన్నముగా లేదనేది సత్యము.

'హే శ్వేతకేతూ! ఆ సద్వస్తువే ఆత్మ' అని ఆయన అంతము నందు చెప్పెను. అది తప్ప మిగలినవన్నీ సృష్టింపబడినవియే. దేహము సృష్టింపబడినది. మనస్సు సృష్టింపబడినది. ఇంద్రియములు సృష్టింపబడినవి. కాని ఆత్మ సృష్టింపబడలేదు. కావున, సృష్టికి పూర్వము నందు కూడ ఉన్న ఆత్మ సద్వస్తువు. పుట్టుక లేని ఆత్మ ఇప్పుడు కూడా సద్వస్తువే. కావున, అది నీవే (తత్ త్వం అసి). వస్తువు సదా ఏకరూపము అను సత్యమును ఆయన తొమ్మిది దృష్టికోణముల నుండి నిరూపించెను. సృష్టికి పూర్వము నందు, తరువాత కూడా అది ఏకరూపము. ఆ ఆత్మ వస్తువు నందు మార్పు లేమియూ లేవు. అది జగత్తునకు ఉపాదాన కారణము అయిననూ, మాయ ద్వారా మాత్రమే అది ఉపాదాన కారణమగును. సద్వస్తువు తాను ఏ మార్పులకు లోను కాకుండగనే మాయాశక్తి చేత ఈ జగత్తుగా అయినది. కేవల నామరూపాత్మకమగు ఈ సృష్టి మిథ్య. ఈ సృష్టిలోని సత్యము ఆ సద్వస్తువే. అదియే ఆత్మ; అనగా నీవు. ఆ సద్వస్తువు నీవే. జగత్తు సద్వస్తువు కంటె భిన్నము కాదు అనే దర్శనమును మనకు కలిగించుట కొరకై సృష్టి ప్రక్రియ వివరింపబడినది.

అవస్థాత్రయ ప్రక్రియా – మాండూక్యోపనిషత్తులో త్రివిధ అనుభవావస్థల విశ్లేషణము

ఇదే విధముగా మాండూక్యోపనిషత్తులో మనకు అవస్థాత్రయ ప్రక్రియ కనబడుతుంది. ఇప్పుడు ఉన్నది, భూత కాలములో ఉండినది, మరియు భవిష్యత్తులో ఉండబోయేది అగు సర్వము ఓంకారము కంటె వేరు గాదు. ఓంకారములోని మూడు వర్ణములు ఒక్కొక్క అవస్థకు ప్రతీకలు. జాగ్రదవస్థను, తదభిమానిని, జాగ్రత్ప్రపంచమును అకారము సూచించును. స్వప్నాభిమానిని,

స్వప్న ప్రపంచమును ఉకారము సూచించును. మకారము సుషుప్తిని, సుషుప్త్యనుభవమును సూచించును. ఈ మూడు ఆత్మ కంటె భిన్నముగా లేవు. కాని ఆత్మ జాగ్రచ్చైతన్యము గాని, స్వప్న చైతన్యము గాని, సుషుప్తిచైతన్యము గాని కాదు. ఆత్మ చైతన్యాభావము కూడా కాదు. కావున, వీటి నన్నిటినీ నిషేధించిన తరువాత మిగిలేది శుద్ధ చైతన్యము మాత్రమే. మిగిలిన వన్నియూ ఆ చైతన్యమున కీయబడిన విశేషణములు. ఆ చైతన్యము నీ స్వరూపము. దానికి చతుర్థము అని పేరు. అది జాగ్రదభిమాని గాని, స్వప్నాభిమాని గాని, సుషుప్త్యభిమాని గాని కాదు. అంటే, నాల్గవదిగా పరిగణింపబడే శుద్ధ చైతన్యమే యథార్థమగు ఆత్మ. పై మూడు అదియే కాని అదిపై మూడింటికీ అతీతమైనది. దాని యందు మార్పు లేమియూ ఉండవు. మూడు అవస్థలలోని ఆత్మ అదియే. ఈ సత్యమును తెలియవలెను. మాండూక్యోపనిషత్తులోని అవస్థాత్రయ ప్రక్రియ ఇదియే. ఇది ఇతర ఉపనిషత్తులలో కూడ చర్చించబడినది.

పంచకోశ ప్రక్రియా – తైత్తిరీయోపనిషత్తులో మానవానుభవములోని అయిదు స్థాయిల విశ్లేషణ

తైత్తిరీయోపనిషత్తులో పంచకోశ ప్రక్రియ గలదు. అది అన్నమయమగు స్థూలదేహముతో ఆరంభమగును. సర్వులు స్థూలదేహమును ఆత్మ యని భ్రమించెదరు. కానీ, అది ఒక కోశము (cover) వంటిది. మనము తినే అన్నము యొక్క సారము (అన్నరసము) నుండి అది ఉద్భవించినది. మనము జీర్ణించుకుని వంటబట్టించుకున్న ఆహారభాగము అన్నరసమయ మనబడును. మయట్ ప్రత్యయమునకు వికారము (రూపాంతరణ) అని యర్థము. కావున, అన్నరసమయ మనగా అన్నసారము యొక్క వికారమని యర్థము. దేహమే ఆత్మ యని మనము సాధారణంగా నిష్కర్ష చేసుకుంటాము. అందువలననే, దాని కంటె మరింత అంతరమైన (సూక్ష్మమైన) మరియొక ఆత్మను శ్రుతి నిర్దేశించుచున్నది. అదియే ప్రాణము. ఇట్లు చెప్పి శ్రుతి శరీర క్రియాత్మకమగు ప్రాణమయ కోశమును వివరించును. ఇదియే ఆత్మ యని మనకు తోచును. శ్రుతి మనలను మనోమయ ఆత్మ వద్దకు గొనిపోవును. మనో మయము నుండి కర్తృస్వరూపమగు విజ్ఞానమయ ఆత్మ వద్దకు గొనిపోవును. విజ్ఞానమయము నుండి ఆనందమయము వద్దకు గొనిపోవును.

వృత్తులలో ఉండే సూక్ష్మభేదమును బట్టి సుఖానుభవములో కూడా తారతమ్యములుండును. కావున, ఆనందమయ కోశములో ప్రియము అనునది మొదటి అవస్థ. మనకు అభిలషణీయమైన వస్తువు కంటబడినప్పుడు కలిగే ఉల్లాసమునకు ప్రియము అని పేరు. మనము కోరిన వస్తువును

పొందినప్పుడు కలిగే ఆనందము మోదము అనబడును. ఆ వస్తువును అనుభవించినప్పుడు కలిగే ఆనందమునకు ప్రమోదము అని పేరు. ఇది మూడవ అవస్థ. ఇవి ఆనందములోని వివిధ శ్రేణులు. ఇవి అన్నీ వృత్తి విశేషములు. కాని ప్రియ మోద ప్రమోదములనే మూడింటిలో ఉన్నది ఆనందమే. అట్టి ఆనందము నా స్వరూపము. అదియే పరబ్రహ్మ.

తన్మాత్ర ప్రక్రియా – సృష్టి ప్రక్రియలో ఒకరకము

ఇచట శ్రీకృష్ణ భగవానుడు తన్మాత్ర ప్రక్రియను ఉపయోగించినాడు. తన్మాత్రలనగా అయిదు సూక్ష్మ భూతములని మనము చూచియున్నాము. ఈ అయిదు సూక్ష్మ భూతములు స్థూల భూతములుగా పరిణమించే ప్రక్రియ గలదు. ఈ ప్రక్రియలో ప్రతి ఒక్క భూతము ఒక అర్ధ భాగముగను, మిగిలిన నాల్గు భూతములు రెండవ అర్ధభాగముగను కలియును. అనగా, ప్రతి స్థూలభూతము అయిదింటి కలయిక. దాని యందు ఇతర భూతములు నాల్గు 1/8వ భాగము చొప్పున కలిసియుండును. ఉదాహరణకు, స్థూలాకాశములో అర్ధభాగము సూక్ష్మాకాశము, 1/8వ భాగము సూక్ష్మ వాయువు, 1/8వ భాగము సూక్ష్మ అగ్ని, 1/8వ వంతు సూక్ష్మ అపః, 1/8వ భాగము సూక్ష్మ పృథివి ఉండును. ఈ విధముగా స్థూల భూతము లన్నియూ అయిదింటి సమాహారమై యున్నవి. ఈ జగత్తునకు ప్రపంచమని పేరు. సంస్కృతములో ప్రపంచమనగా అయిదింటి కలయిక. ఈ ప్రపంచమునకు పంచతన్మాత్రలు కారణము. తన్మాత్ర యనగా 'అది మాత్రమే గలదు' అని యర్థము. అంటే, ఆకాశములో ఆకాశమొక్కటియే ఉండెడిది. వాయువులో వాయువు మాత్రమే ఉండెడిది. అగ్నిలో అగ్ని మాత్రమే ఉండెడిది. అపఃలో అపః మాత్రమే ఉండెడిది. పృథివిలో పృథివి మాత్రమే ఉండెడిది. సూక్ష్మావస్థలోని భూతములు అయిదింటి కలయికగా ఉండెడివి గావు. కావున, వాటికి తన్మాత్రలని పేరు వచ్చినది.

ఈ శ్లోకములో ఆకాశ, వాయు, అగ్ని, అపః, పృథివీ తన్మాత్రలు విలోమక్రమములో వీయబడినవి. ఆకాశవాయు అగ్ని జల పృథివీ అను వరుస అవి సృష్టింపబడిన క్రమమును చెప్పును. కాని ఇప్పుడు అర్జునుడు ఎప్పుడో సృష్టింపబడిన జగత్తును చూచుచున్నాడు గదా! కావున, భూమితో మొదలిడి భూతములు పరిగణింపబడినవి. ఈ అయిదు భూతములను చెప్పే పదములు అనేకములు గలవు. పృథివి, భూమి సమానార్థకములు. అగ్నికే అనలము* అని పేరు. ఆకాశమునకు ఖమ్ అని పేరు. ఈ అయిదు భూతములు ఇచట జగత్కారణముగా ప్రస్తావింపబడినవి గాన ఇవి సూక్ష్మ భూతములని తెలియదగును.

---

* అలం న విద్యతే యస్య. చాలు అను మాట (ఇంధనము విషయములో) లేని వాడు.

ఈ భూతములకు తోడుగా మనస్సు, బుద్ధి, అహంకారము కూడా జోడింపబడినవి. ఈ భూతములన్నియూ వికారములే గనుక, వాటికి కారణమైన తత్త్వములను కూడా జోడించవలసి యున్నది. అయిదు భూతములకు తోడుగా ఈ మూడు కలిసి, సర్వ జగత్తునకు అష్టవిధ కారణములైనవి.

మనస్సునకు కారణము అహంకారము. కావున, మనస్సు అహంకారమునకు ప్రతీక. బుద్ధి యనగా మహత్తత్త్వము. ఈ శ్లోకములో అహంకార శబ్దము అవ్యక్తమును బోధించును. కారణముల నన్నిటినీ ప్రస్తావించుట శ్రీకృష్ణ భగవానుని అభీష్టము.

అయన వాటిని కూర్చిన వరుస ఇతర శాస్త్ర గ్రంథములలోని వరుసతో సరిపోలియున్నది. ఈ వరుసలో అహంకారము ఆఖరుది. ఏలయన, తద్వాచ్యమగు అవ్యక్తము సృష్టికి మూలకారణమై యున్నది.

అది జగత్తునకు ఉపాదాన కారణము. బ్రహ్మలో మార్పులేమీ ఉండవు. కాని ఉపాదాన కారణము మార్పుల నన్నిటినీ పొందును. అందువలననే అది పరిణామి యనబడును.

ఇచట ఒక క్రొత్త సమస్య ఉత్పన్నమగును. పరబ్రహ్మ కారణము అన్నచో, సృష్టి రూపముగా అగుటకై పరబ్రహ్మలో కొన్ని మార్పులు అవశ్యకమగును. పరిణామి కారణములో పరిణామము తప్పదు. ఈ పరిణామములు మాయోపాధి యందు మాత్రమే సంభవించును. మాయా దృష్ట్యా మాత్రమే బ్రహ్మ పరిణామి కారణముగా భాసించును. స్వరూపతః బ్రహ్మ వివర్త ఉపాదాన కారణము గనుక దాని యందు మార్పు లేమియూ ఉండవు. మార్పులను చెందు కారణము, మార్పులను చెందని కారణము అని ఉపాదాన కారణము ద్వివిధముగ నున్నది. సత్య జ్ఞానానంత బ్రహ్మలో మార్పులు అసంభవము. అవ్యక్తము (మాయా) లో మాత్రమే మార్పులు వచ్చును.

ఈ మాయాశక్తియే అష్ట విధములుగా పరిణమించి సర్వసృష్టికి కారణమైనదని శ్రీకృష్ణ భగవానుడు చెప్పుచున్నాడు. అష్టవిధములుగా సర్వమునకు కారణమగు ఈ మాయాశక్తి నా కంటె వేరు గాదు. మాయకు స్వతంత్రమగు ఉనికి లేదు. అది భగవానుని స్వీయశక్తి. ఆ శక్తి సృష్టికి కారణమగు అష్టవిధ ప్రకృతి అయినది. దీనికి అపరా ప్రకృతి యని పేరు. రెండవ ప్రకృతి పరా ప్రకృతి. అది ఆత్మ యొక్క స్వరూపము.

అధ్యాయము 7, శ్లోకము 5:

अपरेयमितस्त्वन्यां प्रकृतिं विद्धि मे पराम् ।
जीवभूतां महाबाहो ययेदं धार्यते जगत् ॥ ५ ॥

అపరేయ మితస్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్
జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్ (5)

ఇయం = ఇది; అపరా = అపరా ప్రకృతి; తు = కానైతే; ఇతః = దీని కంటె; అన్యాం = భిన్నమైన; మే = నా యొక్క; పరాం ప్రకృతిం = పరాప్రకృతి (నా మూల స్వరూపము)ను; విద్ధి = తెలుసుకొనుము; మహాబాహో = గొప్ప బాహువులు గల ఓ అర్జునా!; జీవభూతాం = అది జీవుని పారతత్త్వమై యున్నది; యయా = దేనిచేత; ఇదం = ఈ; జగత్ = జగత్తు; ధార్యతే = ధరింపబడియున్నదో!

గొప్ప బాహువులు గల ఓ అర్జునా! ఇది (జగత్తు) అపరా ప్రకృతి. దీని కంటె భిన్నమైన నా పరాప్రకృతిని తెలుసుకొనుము. అదియే జీవుని పారతత్త్వమై యుండి, జగత్తును ధరించి యున్నది (5).

ఇంతవరకు వర్ణించబడినది అపరా ప్రకృతి (స్వభావము)

ఈ (ఇయం) అపరాప్రకృతియే సమస్త సృష్టికి మూల కారణమైన ప్రకృతి. దీనిని 'నేను' అని భ్రమపడరాదు. ఇది అపరాప్రకృతి, అనగా తక్కువ ప్రకృతి. ఇది నిశ్చయముగా హానిని కలిగించును (అనర్థ కరీ) అని శ్రీ శంకరులు వాక్రుచ్చిరి. అన్ని సమస్యలను సృష్టించునది ఈ ప్రకృతియే. ఇది మానవులకు జీవ శరీరము నిచ్చి, ఇంకనూ అనేక విధములుగా దుఃఖమునకు హేతువు అగును. ఈ ప్రకృతి నుండియే మన దేహము, మనస్సు, ఇంద్రియములు నిర్మింపబడినవి. ఈ ఇంద్రియముల సామర్థ్యము సీమితముగ నుండుట వలన, జీవునకు కలిగే దుఃఖము లన్నింటికీ కారణము ఈ ప్రకృతియే. ఈ సమస్య లన్నిటికీ హేతువు ఈ అపరాప్రకృతియే. సంసార బంధమే దాని స్వరూపము. ఇందువలననే ఇది నికృష్ట ప్రకృతి అయినది.

నా యథార్థ స్వరూపము – పరాప్రకృతి

అట్లైనచో, ఉత్కృష్ట ప్రకృతి యేది? తు = దీనికి భిన్నంగా; ఇతః అన్యాం = ఈ నికృష్ట ప్రకృతి కంటె ఇతరమైన; మే = నాయొక్క; పరాం ప్రకృతిం = ఉత్కృష్ట ప్రకృతిని; విద్ధి = తెలుసుకొనుము. దీని కంటె ఇతరమైన నా స్వరూప భూతమైన ప్రకృతిని తెలుసుకొనుము. ఈ పరాప్రకృతి విశుద్ధము, నిర్దోషము అని శ్రీ శంకరులు వ్రాశ్రుచ్చిరి. పరా యనగా సర్వోత్కృష్టము అని యర్థము. ఇది అపరాప్రకృతి దృష్ట్యా ఉత్కృష్టమైనది. ఏలయన, దీనిని యెరింగిన వ్యక్తి ముక్తుడగును. అపరాప్రకృతి జీవుని బంధించును.

నా యథార్థ స్వరూపము నీవే

ఇచట ఈశ్వరుని హోదాలో మాటలాడుచున్న శ్రీ కృష్ణ భగవాను డిట్లనుచున్నాడు: నా యథార్థ స్వరూపము జీవభూతము అనగా నీవేనని తెలుసుకో. ఈ ప్రకృతిలో ఆత్మ సదా ఏకరసముగ నుండును. ఈ సచ్చిదాత్మయే క్షేత్రమును పూర్ణముగా తెలుసుకునే క్షేత్రజ్ఞుడు. క్షేత్రమనగా మనస్సు, బుద్ధి, కర్తృత్వము, స్మృతి, దేహము, ఇంద్రియములు, ఇంద్రియ గోచరమగు ప్రపంచము ఇత్యాదులు. వీటినన్నిటినీ ప్రకాశింప జేయు ఆత్మ క్షేత్రజ్ఞుడనబడును. జీవుడనగా వాస్తవముగు అర్థము ఇదియే. సర్వక్షేత్రములలో ఉన్నది జీవుడే. దేహేంద్రియ సంఘాతము లన్నింటిలో (సర్వ క్షేత్రేషు) ఉండే క్షేత్రజ్ఞుడే ఆత్మ యని శ్రీకృష్ణుడు 8వ అధ్యాయము, 2వ శ్లోకములో చెప్పుచోవుచున్నాడు. ఈ క్షేత్రజ్ఞుడు అపరా ప్రకృతిలోని వాడు కాదు.

నా యథార్థ స్వరూపముగు పరా ప్రకృతియే సర్వమునకు ఆధారము

అపరాప్రకృతిలో పంచ భూతములు, అహంకారము, బుద్ధి, మరియు మనస్సు మాత్రమే గలవు. ఆత్మ దానిలోనిది కాదు. ఈ జగత్తున కంతకూ ఆధారభూతమైనది పరాప్రకృతి. యయా = ఏ పరాప్రకృతిచే మాత్రమే; ఇదం జగత్ = ఈ జగత్తు అంతా; ధార్యతే = ధరింపబడి యున్నదో.

కావున, ఆ పరాప్రకృతిని తెలియుము. ఈ రెండు ప్రకృతులు తెలియదగినవే. కాని, ఇదియే యథార్థమగు ప్రకృతి యని శ్రీకృష్ణుడు చెప్పుచోవుచున్నాడు. ఇది నా యథార్థ స్వరూపము. సర్వమునకు కారణమిదియే. కావుననే, ఇది ప్రకృతి యనబడును. సర్వము ఈ ప్రకృతి నుండియే వచ్చినది. కాని, అది సదా ఏకరూపముగ నుండును. ఇదియే జీవాత్మ. కావున, అది ఉత్కృష్టమగు

ప్రకృతి (పరా) అని తెలియుము. పంచభూతములు మొదలగు వాటిలో కూడియున్న మరియొక ప్రకృతి అపరా ప్రకృతి. ఈ రెండింటినీ వర్ణించిన తరువాత భగవానుడు తరువాతి శ్లోకములో ఇంతకు మించి ఏదీ లేదని నిరూపించుచున్నాడు:

అధ్యాయము 7, శ్లోకము 6:

> एतद्योनीनि भूतानि सर्वाणीत्यु पधारय ।
> अहं कृत्स्नस्य जगतः प्रभवः प्रलयस्तथा ॥ ६ ॥

> ఏతద్యోనీని భూతాని సర్వాణీత్యు పధారయ
> అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రలయస్తథా (6)

సర్వాణి = అన్ని; **భూతాని** = ప్రాణులు; **ఏతద్యోనీని** = ఈ పరావర ప్రకృతులే కారణముగా గలవి; **ఇతి** = అని; **ఉపధారయ** = తెలుసుకొనుము; **అహం** = నేను; **కృత్స్నస్య** = సమస్తమైన; **జగతః** = జగత్తునకు; **ప్రభవః** = పుట్టుక స్థానము; **తథా** = మరియు; **ప్రలయః** = లయమగు స్థానము.

> సర్వభూతములకు ఈ పరావర ప్రకృతులే కారణమని యెరుంగుము. ఈ సర్వ జగత్తు నా నుండి పుట్టి, నాలోన లీనమగుచున్నది (6).

సర్వము యొక్క ఉనికి ఈ ద్వివిధ ప్రకృతి యందు గలదు

ఏతద్ అనగా ఈ ద్వివిధ ప్రకృతి. బ్రహ్మగారి నుండి కీటకము వరకు గల ప్రాణులన్నియు దానిలో అంతర్భాగము అగును. బ్రహ్మాది స్తంబ పర్యంత సమస్త ప్రాణులు మాత్రమే గాక, ఆకాశము నుండి భూమి వరకు గల సమస్త జడ పదార్థములు కూడ దానిలోనివే. దానిని మించి ఏదీ లేదు. తెలిసినది, తెలియనిది, బ్రహ్మాండములోని సర్వము, ఆ సర్వమును ధరించే సర్వశక్తులు, సర్వ నియమములు, సర్వ ఘటనలు, అతలాది విభిన్నలోకములు, ఆ లోకములలో సర్వ ప్రాణులు, సర్వ ఊర్ధ్వలోకములు, వానిలోని దివ్య ప్రాణులు, యక్షులు, గంధర్వులు, ఇంద్రుడు మొదలుకొని బ్రహ్మ గారి వరకు గల దేవతలు ఇత్యాది అందరు దానిలోని వారే. ఇక్కడితో సర్వమును పూర్తిగా వ్యాఖ్యానించినాము. ఏడు ఊర్ధ్వలోకములు, ఏడు అధోలోకములు వెరసి పదునాల్గు లోకములకు

బ్రహ్మాండమని పేరు. అది, దానిలో సర్వము కలిసి 'సర్వాణి భూతాని' యనబడును. ఇది అంతా ద్వివిధ ప్రకృతి. ఒకటి ఈశ్వరుని పరాప్రకృతి యగు సచ్చిదానంద ఆత్మ; క్షేత్రజ్ఞ స్వరూప ఆత్మ. రెండవది అపరాప్రకృతి (మాయా ఉపాధి). పంచభూతములు ఇత్యాది సర్వము తదంతర్గతము. నీవీ సత్యమును అంతనూ యెరుంగుము (ఉపధారయ).

కావున, ఏతద్యోనీని అనగా అపరాప్రకృతి మరియు పరా ప్రకృతి. సర్వ దృశ్య జగత్తు అపరా ప్రకృతి. యథార్థ కారణమగు సత్య జ్ఞానానంత బ్రహ్మయే పరాప్రకృతి. అదియే సర్వమునకు ఏకైక కారణము. ఆ ప్రకృతిని యెరుంగుము. అది జీవభూతము. అనగా జీవ (ఆత్మ, ప్రత్యగాత్మ) రూపములో నున్నది. అదియే యథార్థ స్వరూపము; సర్వమునకు యథార్థ కారణము. ఆకాశ వాయ్వాది పంచభూతముల ఉనికి ఈ పరాత్మ యందు మాత్రమే గలదు. సర్వప్రాణులకు ఈ సచ్చిదాత్మయే ఆశ్రయము. కావున, సర్వభూతములకు ఈ పరాపర ప్రకృతులే కారణమని నిశ్చయముగా నెరుంగుము.

సృష్టి బహిః ప్రకటమగుటకు, అంతర్లీనమగుటకు కారణము నేనే

అహం కృత్స్నస్య జగతః ప్రభవః. ఈ సర్వ జగత్తు బహిః ప్రకటమగుటకు కారణము నేనే. ఎట్టి నేను? ఈ నేను; ద్వివిధ ప్రకృతులు గల నేను. సర్వదృశ్యము ఒక ప్రకృతి. నా యథార్థ స్వరూపము రెండవ ప్రకృతి. కావున, సర్వసృష్టికి నేనే ఏకైక కారణము. అంత మాత్రమే కాదు. ప్రలయస్తథా. తథా = మరియు; కృత్స్నస్య జగతః ప్రలయః = సర్వము లీనమయ్యే అధిష్ఠానము నేనే. నా నుండియే సర్వము బహిర్గతమగును. సర్వము నాలోనికి పునర్లీనమగును. కావున, నా కంటె భిన్నముగా ఏదీ లేదు. సృష్టి ఉన్నప్పుడు, అది నేనే. ఏలయన, అది నా నుండియే వచ్చినది. ఈ అపరాప్రకృతి నేనే యని నీకు చెప్పియుంటిని.

పంచభూతములు ఇత్యాదులన్నీ నేనే. కాని, క్షేత్రజ్ఞుడను, సచ్చిదాత్మను అగు నేను ఈ జగత్తు అగుటకై మార్పులను చెందలేదు అని భగవానుడు ఇంతకు ముందు చెప్పియున్నాడు. జీవ–క్షేత్రజ్ఞుడను నేనే; సర్వజగత్తు ఈ క్షేత్రజ్ఞుని నుండియే పుట్టి, క్షేత్రజ్ఞుని యందే లీనమగును అని ఈ శ్లోకములో చెప్పినాడు. అనగా, నాకు వలెనే నీవు కూడా ఈ సర్వజగత్తునకు కారణమని భగవానుడు చెప్పుచున్నాడు. అనగా పరమాత్మ దృష్టికోణములో సర్వజగత్తునకు కారణముగు పరాప్రకృతివి నీవే.

అట్లైనచో, ఈశ్వరుడెవరు? వ్యక్తి వ్యక్తిగా జగత్తును చూసినప్పుడు, అతనికి ఒక స్థూలదేహము, మనస్సు, ఇంద్రియములు గలవు. అతనికి భిన్నముగా జగత్తు గలదు. ఈ జగత్తునకు ఒక కారణము ఉండి ఉండాలి. అదియే మాయోపాధి. సత్య జ్ఞానానంత బ్రహ్మతో మాయగూడి జగత్తు అయినది. ఆ ఉపాధియే పరమేశ్వరుడు.

పరా ప్రకృతి యొక్క దృష్టికోణంలో ఉన్నది అంతా ఒక్కటియే. అది లేనిదే జగత్తు లేనే లేదు. సృష్టిలోని సర్వ వస్తువులకు ఉనికిని ఇచ్చే సత్త అదియే. సృష్టిలోని వివిధ వస్తువులను తెలియుటకు అవశ్యకమగు స్ఫూర్తి దాని వలననే కలిగినది. ఈ జగత్తున కంతకూ ఆధారము, ఆశ్రయము అగు సత్త (సత్), మరియు స్ఫూర్తి ఆత్మయే. అదియే పరాప్రకృతి.

కారణ నిర్వచనము – కర్త మరియు ఉపాదానము

'సర్వ సృష్టికి కారణము నేనే. సర్వ సృష్టి నా యందే లయమగును' అని శ్రీకృష్ణ భగవానుడు పూర్వ శ్లోకములో చెప్పియున్నాడు. నేనే కారణము అనుటలో భగవానుని తాత్పర్యమేమి? చేతన ఘనుడగు భగవానుడు నిమిత్త కారణుడగుటయే గాక, ఈ సృష్టికి అయన మూడు విధములుగా కారణమగుచున్నాడు. సృష్టి చేయువాడు, లయమును చేయువాడు మరియు రక్షించువాడు.

దేని నుండి (యతః) సర్వ ప్రాణులు ఉద్భవించినవో, దేని చేత (యేన) రక్షింపబడుచున్నవో, మరియు దేని యందు (యత్ = యస్మిన్) లయమగుచున్నవో, అది కారణము అని తైత్తిరీయోపనిషత్ కూడా వివరించినది. యతః పంచమీ విభక్తి. దేని నుండి ఒక వస్తువు పుట్టినదో, ఆ జన్మ హేతువును పంచమీ విభక్తి నిర్దేశించును. అనగా పంచమీ విభక్తి ఉపాదాన కారణమును నిర్దేశించును. తరువాత, దేనిచే (యేన) రక్షింపబడుచున్నవో, మరియు దేని యందు (యత్ యస్మిన్) లయమగుచున్నవో అను రెండు వాక్యములు జోడింపబడినవి. యత్ అను సర్వనామము తక్క, కారణమును నిర్దేశించు పదము మరియొకటి ప్రయోగింపబడలేదు. దీనిని బట్టి కారణము నిమిత్త కారణమే గాక, ఉపాదాన కారణము కూడా అని మనకు స్పష్టమగుచున్నది.

తైత్తిరీయములో దీనికి ముందు 'భగవానుడు సంకల్పించెను (సోకామయత)' అని చెప్పబడెను. దీనిని బట్టి భగవానుడు నిమిత్త కారణమని స్పష్టమగుచున్నది. తరువాతి మంత్రములో సర్వము దేని నుండి వచ్చినదో అని యత్ శబ్దముచే నిర్దేశింపబడిన భగవానుడే, తాను అనేకముగా అయి సర్వమును సృజింప సంకల్పించె నని తత్పూర్వములో చెప్పబడెను. కావున, ఈ జగత్తునకు నిమిత్త ఉపాదాన కారణములు రెండు పరమేశ్వరుడే యని శ్రుతి యొక్క తాత్పర్యమని దీనిని బట్టి స్పష్టమగుచున్నది.

కారణ స్వరూపము నిర్వచింపబడినది

శాస్త్రము కారణమును విశ్లేషించి, ఆ కారణము యొక్క మూలస్వరూపమును ప్రదర్శించును. ఆ మూల కారణమును శ్రుతి ప్రత్యేకముగా నిర్వచించినది: సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ. ఈ పదములు పరబ్రహ్మకు లక్షణములే అయినా, విశిష్టగుణములను బోధించునవి కావని మనము తెలుసుకుంటాము. వాస్తవంలో ఈ పదములు సర్వ గుణములను నిషేధిస్తాయి. కావున, జగత్కారణమగు బ్రహ్మ నిర్విశేషుడు, అనగా గుణరహితుడు అని, మనకు తెలిసిన గుణముల నన్నిటినీ నిషేధించే ఈ గుణములు బోధిస్తాయి. కావున జగత్కారణము సర్వద్వైత వినిర్ముక్తమైన నిర్వికల్పమని శ్రుతి ప్రదర్శించినది.

బ్రహ్మ సత్యము అనునది దాని నిర్వచనము. కాని అది అనంత సత్యము. కావున దాని ఉనికి మనము మామూలుగా అనుకునే కాలాధీనమైన ఉనికి కాదు. అదే తీరున, జ్ఞానం అనగా ఒక వస్తువు యొక్క జ్ఞానము వంటిది కాదు. అది అనంత జ్ఞానము; సీమలు లేని చైతన్యము. సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ అను ఈ నిర్వచనము స్వరూప లక్షణము.

ద్వివిధ లక్షణము

స్వరూప లక్షణము

లక్షణము ద్వివిధము: స్వరూప లక్షణము, తటస్థ లక్షణము. స్వరూప లక్షణము వస్తువు యొక్క సారభూతమగు స్వరూపమును ప్రదర్శించును. ఉదాహరణకు, నీరు అనగా H_2O అన్నచో అది నీటి స్వరూప వర్ణనము అగును. ప్రస్తుతంలో, సత్యం జ్ఞానం అనంతం అను వాక్యము వస్తు స్వరూపమును బోధించును. ఈ లక్షణము సర్వ విశేషములను నిషేధించి, బ్రహ్మ అనే వస్తువు ఉన్న వస్తువులన్నింటి యొక్క ఉనికి అనియు, సర్వ జ్ఞానముల సారమనియు సూచించును.

తటస్థ లక్షణము

మనము ఒక గృహమును నిర్దేశించ వలసినప్పుడు, ఆ గృహముపై ఒక కాకి వాలి యుండుటను గాంచి, కాకి వాలియున్న గృహము అని చెప్పితి మనుకొనుడు. దానికి తటస్థ లక్షణమని పేరు. కాకి గృహమునకు అవయవము కాదు. కాని, అది గృహమును గుర్తించుటలో తోడ్పడును. ఇంకోసారి ఆ

ఇంటిని గుర్తించుటకు మరల కాకి వచ్చి వ్రాలవలసిన అవశ్యకత లేదు. ఒకసారి ఇంటిని గుర్తించిన తరువాత, ఆ ఇంటియొక్క జ్ఞానములో కాకి భాగము కాదు. దీనిని తటస్థ లక్షణము అందురు.

శాస్త్రములో సృష్టి ప్రసంగము వచ్చిన స్థలము లన్నింటి యందు, బ్రహ్మ నుండి ఈ జగత్తు అంతయూ ఉద్భవించినదనియు, సర్వము బ్రహ్మ చేత ధరింపబడి ఉన్నదనియు, సర్వము బ్రహ్మలో లీనమగుననియు చెప్పబడును. అంటే, సర్వము బ్రహ్మమే. ఇది తటస్థ లక్షణము.

ఈ జగద్రూపముగా అగుట కొరకై పరబ్రహ్మలో మార్పులేమియూ ఉండవనే సత్యమును గ్రహించుట చాల ముఖ్యము. ఏలయనగా, ఈ జగత్తు మిథ్య. మనము ఏ వస్తువును విశ్లేషించినా, అది నామరూపములు మాత్రమే ననియు, దానికి మూలములో మరియొక వస్తువు గలదనియు తెలును. ఆ మరియొక వస్తువును కూడ పరిశీలిస్తే నామరూపములే అనియు, దాని మూలము ఇంకో వస్తువు వందు గలదనియు స్పష్టమగును.

మిథ్య తెలియాలంటే, సత్యం తెలియాలి

ఇల్లా విశ్లేషించుకుంటూ పోతే, ఆఖరుకు మిగిలేది శూన్యమేనని బౌద్ధులు వాదిస్తారు. జగత్తునకు మూలము శూన్యము నందు గలదని వారు నిష్కర్ష చేస్తారు. ఆ శూన్యము నేనే యను సాక్షాత్కారమే నిర్వాణమని వారు చెప్తారు. నిర్వాణ మనగా సర్వము యొక్క ఉచ్ఛేదము. ఇది బౌద్ధుల సిద్ధాంతము.

కాని వేదాంతములో పరిస్థితి దీనికి పూర్తి విరుద్ధంగా ఉంటుంది. 'ఒకే ఒక సత్యము నేనే' అనునది ఇచటి సాక్షాత్కారము. బౌద్ధుల మిథ్యా విశ్లేషణము, వేదాంతుల విశ్లేషణము ఒక్కటిగా కనపట్టును. కాని, ఒక్కటి కాదు. ఏలయన, సత్యమును తెలుసుకున్న నాడే మిథ్య మిథ్య యగును. అట్లు గానిచో, మిథ్య సత్యమే యగును. స్వతంత్ర సత్త లేనిది మిథ్య అని నిర్వచనము గదా! కావున, ఈ నిర్వచనములోనే ఒక సంగతి స్పష్టమగుచున్నది. సత్యము లేనిదే మిథ్య లేనే లేదు. 'ప్రపంచము మిథ్య' అని పలుకవచ్చును. కాని సత్యమును యెరుంగనిదే, ప్రపంచము యొక్క మిథ్యాత్వము అవగాహనకు రాదు. ఘటము యొక్క సత్యము మృత్తు అని యెరింగిన వ్యక్తి మాత్రమే ఘటము మిథ్య అని యెరుంగును. కావున సత్య జ్ఞానము గల వ్యక్తికి మాత్రమే మిథ్య స్పష్టముగా తెలియును.

ఉపాదానము ద్వివిధము: పరిణామి, వివర్తము

సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ అనునది ఆత్మ స్వరూపమే గాక, సర్వ జగత్కారణము కూడా. ఇప్పుడు ఒక ప్రశ్న ఉదయిస్తుంది. సర్వ జగత్కారణమగు బ్రహ్మ జగత్తుగా అగుటలో ఏవేవి కొన్ని రకముల మార్పులకు లోనగునా? బ్రహ్మ జగత్తును తన కంటె భిన్నమైన ఒకానొక పదార్థముతో సృష్టించునా? బ్రహ్మమే సత్యమనియు, జగత్తు మిథ్య అనియు శాస్త్రము సుస్పష్టము చేయును. కావున, జగత్తు బ్రహ్మ కంటె భిన్నము కాదు. కావున, బ్రహ్మమే ఉపాదాన కారణము. ఇచట ఒక సమస్య ఉదయించును. ఈశ్వరుడు (బ్రహ్మన్) సృష్టికి ఉపాదాన కారణము మరియు నిమిత్త కారణము కూడా. ఈశ్వరుడు సర్వజ్ఞుడు. సర్వ శక్తిమంతుడు. కాన, ఆయన నిమిత్త కారణమని తెలియుటలో ఇబ్బంది లేదు. కాని, ఆయన ఉపాదాన కారణమెట్లు కాగల్గును? ఉపాదాన కారణములో మార్పులు వచ్చును గదా! పరమేశ్వరుడే ఉపాదాన కారణమైనచో, ఆయన ఆకాశము, వాయువు ఇత్యాదిగా అగుటకు నిశ్చితముగా మార్పులను పొందవలసి యుండును.

వివర్త ఉపాదాన కారణము

ఇచట మనము ఒక విషయమును ప్రత్యేక శ్రద్ధతో గమనించవలెను. ఉపాదాన కారణమనగా వివర్త ఉపాదాన కారణమని అభిప్రాయము. ఇది ఒక విశిష్టమగు పదము. దీనిని నేను ఇంతవరకు వివరించలేదు. సామాన్యముగా మనకు తెలిసిన ఉపాదాన కారణము కంటె వివర్త ఉపాదా న కారణము భిన్నమైనది. ఉపాదానము ఒక పదార్థము. అది కారణమైనప్పుడు వివర్తము కావచ్చును. లేదా, పరిణామి కావచ్చును. మనకు సామాన్యముగా అనుభవములో ఉండే ఉపాదాన కారణము పరిణామి. అది మార్పులకు లోనగును. సాధారణముగా దీనికి పాలు పెరుగు అగుట దృష్టాంతముగా నీయబడును. పాలు తియ్యగా ఉండే ద్రవపదార్థము. కాని, పెరుగు పుల్లగా ఉండే ఘనపదార్థము. అనగా పాలలో మార్పు వచ్చినది. పెరుగునకు పాలు ఉపాదాన కారణమనుటలో సందేహము లేదు. కాని, పెరుగు పాల రూపములో లేదనుటయూ నిస్సందేహమే. భగవానుడు పరిణామి ఉపాదాన కారణమన్నచో, ఆయన ఉపాదానము గాన, జగత్తుగా అగుటకై మార్పులకు లోనయి తీరును. ఆయనలో మార్పులు వచ్చిన వన్నచో, ఆయన మూల స్వరూపము తొలగిపోయినదని యర్థము. అంటే, ఇప్పుడు ఇక్కడ జగత్తు మాత్రమే గలదు. భగవానుడేడి? లేడు. అతి గహనమగు విషయమును అజ్ఞానముచే చులకన చేసినచో ఇటులనే యుండును. కావున, ఇది సరిగాదు. భగవానుడు ఉపాదాన కారణమనుటలో సందేహము లేదు. కాని, ఆయన వివర్త ఉపాదాన కారణము.

స్వస్వరూప అపరిత్యాగేన రూపాంతరాపత్తిః, అనగా తన స్వరూపమును వీడకుండగా మరియొక రూపమును పొందుట అనునది వివర్త నిర్వచనము. మనము దర్శించే స్వప్న ప్రపంచము దీనికి దృష్టాంతము. స్వప్నమునకు నిమిత్త కారణము నీవే. ఉపాదాన కారణము నీవే. ఆత్మ తనలో మార్పులకు వేటికీ లోను కాకుండా, తన స్వరూపమును వీడకుండా, స్వప్నములోని ప్రపంచము అయినది. స్వప్నములో కర్త గలదు, కర్మ గలదు, క్రియ గలదు. కారకములన్నియు మిళితమై యున్నవి. (క్రియకు సంబద్ధమైనది ఏదైనా కారకమనబడును). ఇది నా ఇల్లు, వీడు నా కుమారుడు ఇత్యాది సంబంధములు కూడా గలవు. ఆత్మలో తాత్త్వికమైన మార్పులు ఏమియూ లేకుండగనే, ఈ స్వప్న ప్రపంచమంతయూ నిర్మాణమగును. శుద్ధ చైతన్య స్వరూపమైన ఆత్మయే స్వప్న రూపముగా ఆవిష్కృతమగును. స్వప్నములో ఎటులనో, జాగ్రత్తులో కూడా అటులనే.

భగవానుడు జగత్తునకు ఉపాదాన కారణము. అంటే, వివర్త ఉపాదాన కారణము అని అభిప్రాయము. దీనికి రజ్జు సర్పము దృష్టాంతము. త్రాడు మార్పులకు వేటికీ లోను కాకుండగనే, మనకు భాసించే సర్పమునకు అధిష్ఠానమగును. రజ్జువు వివర్త ఉపాదాన కారణము.

మాయా – పరిణామి ఉపాదాన కారణము

బ్రహ్మములో మార్పులు వచ్చే అవకాశము లేదు. కాన, బ్రహ్మము ఈ సృష్టికి కారణము కావాలంటే, బ్రహ్మమునకు ఒక ఉపాధి ఉండాలి. ఆ ఉపాధికి సృష్టితో సమమైన సత్యత్వము ఉండును. సృష్టి మిథ్య అయినచో, అదే శ్రేణికి చెందిన (మిథ్యాభూతమైన) ఉపాధి ఉండాలి. ఆ ఉపాధిని మనము 'మాయా' అంటాము. ఈ ఉపాధితో కూడిన పరబ్రహ్మ ఈశ్వరుడై సృష్టిని చేస్తాడు. ఈ దృష్టికోణంలో చూస్తే, ఈశ్వరుడు మార్పులకు లోనగునని మనము చెప్పవచ్చును. మాయా – ఉపాధి దృష్ట్యా ఈశ్వరుడు పరిణామి ఉపాదాన కారణము అని మనము అంటాము.

సర్పమునకు ఈశ్వరుడు కారణము అన్న సందర్భాలలో, అది వివర్త ఉపాదాన కారణము. ఆ ఈశ్వరుడు నీవే. నీవే ఈశ్వరుడవు అని నేను అన్నప్పుడు, వివర్త ఉపాదాన కారణమగు ఈశ్వరుడవు నీవు అని నా అభిప్రాయము. ఈశ్వరుడే ఆకాశము, వాయువు మొదలగు భూతములై జగత్తు కంటె అభిన్నముగ నున్నాడు. మనము ఈశ్వరుని మాయోపాధి దృష్టి కోణములో నైనమా భావన చేయవచ్చును. మార్పులన్నియూ మాయోపాధి యందు సంభవించును. కాని, బ్రహ్మము నిమిత్త కారణమే గాక ఉపాదాన కారణము కూడా అని చెప్పిన సందర్భములో, అది వివర్త ఉపాదాన కారణము. ఈ వివర్తము వలననే, ఆత్మ సచ్చిదానంద బ్రహ్మ అను సత్యమును గ్రహించుట సంభవమగును.

పరమేశ్వరుడు జగత్తుగా అయినాడని శ్రీ శంకరుల సిద్ధాంతము అని ఉన్నత పాఠశాలోపాధ్యాయుడొకరు నాకు ఒకసారి చెప్పినారు. ఆరంభములో భగవానుడు ఉండెను. ఆయన తన నుండి జగత్తును సృష్టించెను. అనగా భగవానుడే జగత్తు అయెను. కాన, ఇప్పుడు భగవానుడు లేడు. ఇది బియ్యము రవ్వతో ఇడ్లీలను చేయుట వంటిది. బియ్యము రవ్వ ఖర్చు అయిపోయి, ఇడ్లీలు మిగులును. ఆ ఉపాధ్యాయుడు ఇంకో సందర్భములో ఈ మాటను శ్రీ శంకరుల సిద్ధాంతమని మరియొకనికి చెప్పగా ఆయన విరగబడి నవ్వెను. ఆయన నవ్వును చూస్తే, ఈ ఉపాధ్యాయుడు చెప్పిన దానిలో దోషము గలదని స్పష్టమయ్యెను. ఆ దోషము ఏమిటో నాకు అప్పుడు తెలియలేదు. ఆ నవ్విన వ్యక్తి దీనిలోని దోషమును నాకు వివరించలేదు.

దోషము స్పష్టముగనే యున్నది. భగవానుడు మార్పులకు లోనయ్యే పరిణామి ఉపాదాన కారణమని స్వీకరించుటయే దీనిలోని దోషము. ఈ కారణత్వము తెలియాలంటే, మనము 'వివర్త' అను పారిభాషిక పదమును ముందుగా తెలియాలి. బ్రహ్మ వివర్త ఉపాదాన కారణము అన్నచో, అట్టి బ్రహ్మలో మార్పులు ఉండవు. అట్టి సిద్ధాంతము మాత్రమే నిలబడగల్గును. సత్యజ్ఞానానంత బ్రహ్మ సదా ఏకరూపముగా నుండును. దాని స్వరూపము నిర్వికారము. కాన, దానిలో మార్పులు వచ్చే ప్రసక్తి లేదు.

బ్రహ్మ అద్వితీయ మనియు, బ్రహ్మ కంటె భిన్నముగా ఏదీ లేదనియు, ఈ సృష్టి బ్రహ్మ కంటె వేరు గాదనియు తెలియుటకు ఈ కారణ కార్య వాదము ఒక ప్రక్రియగా సహకరించును.

అధ్యాయము 7, శ్లోకము 7:

मत्तः परतरं नान्यत्किञ्चिदस्ति धनञ्जय ।
मयि सर्वमिदं प्रोतं सूत्रे मणिगणा इव ॥ ७ ॥

మత్తః పరతరం నాన్యత్కించిదస్తి ధనంజయ
మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ (7)

ధనంజయ = ఓ అర్జునా!; మత్తః = నా కంటె; పరతరం = శ్రేష్ఠమైనది; అన్యత్ = మరియొకటి; కించిత్ = ఏదియూ; న అస్తి = లేదు; ఇదం = ఈ; సర్వం = సర్వము; మయి = నా యందు; మణిగణాః = మణిపూసల గుత్తులు; సూత్రే ఇవ = దారము నందు వలె; ప్రోతం = గుచ్చబడియున్నది (ఓత ప్రోతభావముతో నున్నది).

ఓ అర్జునా! నా కంటె శ్రేష్ఠమైనది మరియొకటి ఏదియూ లేదు. ఈ సర్వము నా యందు, మణిపూసల గుత్తులు దారము నందు వలె, గుచ్చబడి యున్నది (7).

'ఓ ధనంజయా! అర్జునా! నా కంటె ఉత్కృష్టమైనది ఇతరము (కారణము) లేదు సుమా!' అని శ్రీకృష్ణ భగవానుడీ శ్లోకములో చెప్పుచున్నాడు. 'ఈ జగత్తు నంతనూ సృష్టించినది నేనే; ఈ జగత్తు నా యందే లీనమగును' అని పూర్వము అయన చెప్పి యున్నాడు. అనగా, అయన తాను వివర్త ఉపాదాన కారణమని చెప్పినట్లు నిశ్చితమగుచున్నది. సర్వము నా నుండియే ఆవిర్భవించి, నా యందు మాత్రమే లయమగుచున్నది.

'ఈ ఘటము నా నుండియే వచ్చినది' అని కులాలుడు కూడా చెప్పవచ్చును. ఏలయన, అతని పరిశ్రమ వలననే ఘటము పుట్టినది. కాని ఆ ఘటము భగ్నమైనచో, అది కులాలునిలో లీనము కాదు. ఒక కార్యము తన కారణములో లీనమైనదియన్నచో, ఆ కారణము ఉపాదాన కారణము అని మనకు స్పష్టమగును. ఘటము మట్టి నుండి పుట్టి, మట్టిలో లీనమగును. కావున, కార్యము కారణములో లీనమైనది యన్నచో, ఆ కారణము నిశ్చితముగా ఉపాదానమని మనము స్పష్టముగా యెరుంగవలెను.

భగవానుని నుండియే సృష్టి వచ్చినది; సృష్టి మరల అయనలోనే లీనమగును. అంటే, భగవానుడే నిమిత్త కారణము మరియు ఉపాదాన కారణము. అంటే, భగవానుడు వివర్త ఉపాదాన కారణమని యర్థము.

'ఈ జగత్తులో నా కంటె భిన్నమగు కారణము మరియొకటి లేదు' అని భగవానుడీ శ్లోకములో చెప్పుచున్నాడు. లేదా, 'నా కంటె ఉత్కృష్టమైన కారణము మరియొకటి లేదు' అని కూడా చెప్పవచ్చును. 'కించిత్ నాస్తి' అని గాని, లేదా 'అన్యత్ కించిత్ పరతరం నాస్తి' అని గాని అన్వయించవచ్చును.

సర్వమునకు కారణమైనది, మరియొక కారణము నుండి పుట్టనిది అగు తత్త్వమును ఈ శ్లోకము ప్రతిపాదించుచున్నది. ఈ కారణమునకు మరియొక కారణమున్నచో, దానికి ఇంకొక కారణము ఉండవలయును. ఇది అవ్యవస్థకు దారితీయును. మనమిచట వర్ణించే జగత్కారణము సత్యము జ్ఞానము మరియు అనంతమునగు బ్రహ్మ. ఆ బ్రహ్మము నందు సర్వ జగత్తు లీనమగును. దాని యందు దృశ్య ద్రష్టలు రెండు లీనమగును. అదియే సర్వ జగత్కారణమని ఇచట చెప్పబడినది.

మయి సర్వ మిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ (పూసలు దారము నందు వలె ఈ సర్వము నా యందు మాత్రమే పడుగుపేక వలె అధిష్ఠించి యున్నది) అని శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు. వస్త్రము దారము చేతను వలె, ఈ జగత్తు అంతా పరమేశ్వరునిచే వ్యాప్తమై యున్నదని శ్రీ శంకరులు చెప్పిరి. చిత్రయవనిక (tapestry) తనను వ్యాపించియున్న దారము కంటె వేరుగా లేదు. సూత్రే మణి గణా ఇవ – ఒకే దారము నందు ఎన్నో పూసలు గుచ్చబడి యున్నట్లు అను దృష్టాంతమును శ్రీకృష్ణుడిచ్చెను. పూసలు దారము నందు గుచ్చుట అను దృష్టాంతము జగత్తులోని వైచిత్రికి అనురూపముగా నున్నది. వేర్వేరు ఆకారములు, పరిమాణములు, రంగులు మరియు విలువలు గల పూసలన్నియూ ఒకే దారము నందు కలిపి గుచ్చబడినవి. అదే తీరున, పరమేశ్వరుడ నగు నా యందే బహు ముఖమగు ఈ జగత్తు అంతా గుచ్చబడి యున్నది. సర్వము నందు ప్రత్యగాత్మ రూపమున నుండి సర్వమునకు ఉనికిని ఇచ్చునది నేనే.

ఈ దృష్టాంతములో ఒక లోపము గలదు. పూసలు దారము రెండు విభిన్న పదార్థములు. అనగా, ఇది ద్వైతము. పూసల గుండా అనుస్యూతముగా నుండు దారము పూసల కంటె విలక్షణమైనది. 'సర్వప్రాణులలో నుండే దారము నేనే. నేను సర్వప్రాణుల కంటె విలక్షణుడను. సర్వ ప్రాణులకు ఆధారము నేనే. కాని నేను అసంగుడను' అని శ్రీకృష్ణుడు చెప్పవచ్చును గదా! కాని, ఇచటి తాత్పర్యము ద్వైతము కాజాలదు. జీవుని అనుభవమునకు వచ్చే సర్వము ఆత్మ కంటె భిన్నము కాదు. సర్వమునకు ఆత్మయే ఆధారము. కావున, వివిధ (జాగ్రత్, స్వప్న, సుషుప్తి) ప్రపంచములను అనుభవించుచుండే జీవులందరికీ ప్రత్యగాత్మను నేనే. ఈ శ్లోకమునకు ఇది ఒక అర్థము.

'ప్రోత' అను పదము 'ఓతః ప్రోతః (పడుగు పేక)' అను పదమును సూచించును. ఈ జగద్వస్త్రమునకు పడుగు నేనే. పేక నేనే. ఈ రంగు రంగుల జగత్తు అనే చిత్రయవనిక సచ్చిదానంద ఆత్మ యందు మాత్రమే నేయబడి యున్నది. ఉనికియే చైతన్యము. అదియే సచ్చిదాత్మ. అదియే పరబ్రహ్మము. మాయా వికారము లన్నింటికి ఈ పరబ్రహ్మమే అధిష్ఠానము. మాయ ఉన్న ప్రతిచోట నేను ఉన్నాను. ఏలయన, బ్రహ్మ కంటె భిన్నముగా మాయకు ఉనికి లేదు. మిథ్యారూపమగు ఈ సర్వజగత్తు నా కంటె భిన్నముగా లేదు.

జగత్తు ఈశ్వరసృష్టి యనగా నేమో మనకు ఇప్పుడు బాగా తెలుస్తుంది. ఈశ్వరుని నుండియే జగత్తు వచ్చినది (మత్తః పరతరం నాన్యత్). 'ఈ సృష్టి ఉదయించుటకు కారణము నేనే. ఈ సృష్టి నా యందే లీనమగును' అని భగవానుడు పూర్వశ్లోకములో చెప్పియున్నాడు. ఈ సృష్టిని

ధరించి పోషించునది నేనే అని శ్రీకృష్ణుడీ శ్లోకములో బయటచేసినాడు. సృష్టి నా నుండి పుట్టి, నాలో లీనమగుటయే గాక, నా యందే ఉన్నది. సర్వత్రా సర్వము యొక్క సారము నేనే. విభిన్న శ్రేణుల పదార్థముల సత్యత్వము నేనే. సూక్ష్మభూతముల రూపములో నేనే ఉన్నాను. స్థూలభూతములను ధరించువాడను నేనే. పదార్థమును దాని మూలమగు శక్తి యందు లీనము చేయవచ్చును. అటులనే స్థూల భూతములు వాటికి కారణమగు సూక్ష్మభూతముల యందు లీనమగును. మరియు పదార్థములను ధరించునది శక్తియేనని చెప్పవచ్చును. గీతను ఈనాడు బోధించే పక్షంలో భగవానుడు ఇట్లు చెప్పును: 'పదార్థ రూపములో శక్తి నేనే. కాన శక్తి రూపుడనగు నేను సర్వవిధముల పదార్థములను ధరించియున్నాను'. ఈ శక్తి యనగా నేమి? ఈ శక్తిని మాయలో లీనము చేయవచ్చును. మాయకు పరబ్రహ్మ కంటె భిన్నమైన స్వతంత్ర ఉనికి లేదు. సత్యజ్ఞానానంతమగు ఆ బ్రహ్మయే ఆత్మ.

సర్వపదార్థముల సారము తానే ననియు, సర్వ పదార్థములు తన కంటె భిన్నముగా లేవనియు భగవానుడు నిరూపించబోవుచున్నాడు. జగత్తు నా చేతనే ధరింపబడి యున్నది అని నిరూపించుటకై భగవానుడు పదార్థముల సారము తానే యని నిర్దేశించుచున్నాడు. 'సర్వ పదార్థములకు ధారకమగు సారము యేది? సర్వమును నీవు ఏ రూపములో ఏ గుణములతో ధరించుచున్నావు?' అని మనము భగవానుని ప్రశ్నించవచ్చును. ఈ విషయమును కొన్ని శ్లోకములు వివరించును:

అధ్యాయము 7, శ్లోకము 8:

रसोऽहमप्सु कौन्तेय प्रभाऽस्मि शशिसूर्ययोः ।
प्रणवस्सर्ववेदेषु शब्दः खे पौरुषं नृषु ॥ ८ ॥

రసోహమప్సు కౌంతేయ ప్రభాస్మి శశిసూర్యయోః
ప్రణవస్సర్వ వేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు (8)

కౌంతేయ = హే కుంతీపుత్రా! అర్జునా!; **అహం** = నేను; **అప్సు** = నీటియందు; **రసః** = రసము; **శశిసూర్యయోః** = చంద్రసూర్యుల; **ప్రభా** = కాంతి; **అస్మి** = అయి ఉన్నాను; **సర్వ వేదేషు** = వేదములన్నిటి యందు; **ప్రణవః** = ఓంకారము; **ఖే** = ఆకాశము నందు; **శబ్దః** = శబ్దము; **నృషు** = మానవుల యందు; **పౌరుషమ్** = బలము.

హే కుంతీపుత్రా! నీటియందలి రసము నేనే. చంద్రుని కాంతి నేనే. సూర్యుని ప్రకాశము నేనే. వేదములన్నింటిలో నేను ఓంకార రూపుడనై యున్నాను. ఆకాశము నందలి శబ్దము నేనే. మానవుల యందలి బలము నేనే (8).

హే కౌంతేయా! అర్జునా! రసోహమప్సు. జలము నందలి రుచి నేనే. ప్రాణులు రుచిరూపములో ఆస్వాదించే జలముల ప్రధానసారము నేనే. ప్రాణుల అనుభవమునకు వచ్చే స్థూల భూతములలో గల సూక్ష్మాంశము నేనే. అనగా, జలముల సారము నేనే. జలముల రసము వాటి విలక్షణ గుణము. సారమనగా నదియే. ఏ సారము వలన జలము జలమైనదో, అది నిశ్చయముగా నేనే. జలము యొక్క సత్యత్వము నేనే. జలమును ఇతర భూతముల నుండి వేరు చేసే రుచి యను ప్రత్యేక లక్షణము నేనే.

ప్రభాస్మి శశి సూర్యయోః. లోక ప్రసిద్ధములైన సూర్య చంద్రులనే జ్యోతిర్మండలముల యందలి ప్రకాశము నేనే. కాంతి కంటె వేరుగా సూర్యుడు లేడు. సూర్య కాంతి లేనిచో చంద్రుడు కానరాడు. సూర్యుని యందలి కాంతి నేనే. చంద్రుని యందలి ప్రకాశము నేనే. చంద్రకాంతి సూర్య కాంతి యొక్క పరావర్తనమే గాని స్వతంత్రము కాదు. కావున, సూర్యకాంతి నేను అనగా చంద్రకాంతి కూడ నేనే యగుదును. ఏ కాంతిచే సూర్యుడు సూర్యుడైనాడో, ఆ సూర్యుని సారభూతమగు కాంతి నేనే. ఏ పరావర్తిత కాంతిచే చంద్రుడు చంద్రుడైనాడో, ఆ కాంతియూ నేనే. ప్రభా = సర్వమును ప్రకాశింప జేయు కాంతి, అహం అస్మి = నేనై యున్నాను.

ప్రణవస్సర్వ వేదేషు. వేదము లన్నిటియందు ప్రణవము నేనే. వేదములలో విభిన్న విషయములు చర్చించబడినవి. అవి అన్నీ ఒకే ఒక్క ఓంకారము అనే కారణము నందు లయమగును. 'దేనిని కోరి మానవులు బ్రహ్మచర్యమునకు, స్వాధ్యాయమునకు అంకితమైన జీవితమును గడుపుచున్నారో, ఏది వేదములన్నిటి యందు వివరింపబడినదో, ఆ పదమును నేను నీకు సంగ్రహముగా చెప్పెదను. ఓం ఇత్యేతత్. అదియే ఓంకారము' అని కఠోపనిషత్తు (1-2-15) చెప్పుచున్నది. ప్రణవము (ఓమ్) పరబ్రహ్మకు సుప్రసిద్ధమగు ప్రతీక. వేదమంతయూ ఆ ఓంకార రూప కారణము నందు అంతర్లీనమగును. అట్టి ఓంకారము నేనే. అట్టి ఓంకారము నేనే.

శబ్దః ఖే. ఆకాశము నందలి శబ్దము నేనే. శబ్దమును శ్రోత్రేంద్రియము తక్క, ఇతర ఇంద్రియములు గ్రహించజాలవు. చెవి వరకు చేరుటలో శబ్దము ఆకాశము గుండా పయనించి, ఆకాశము నందు వ్యక్తమగును. మరియు, శబ్దము ఆకాశము యొక్క భూత సూక్ష్మమును కూడ నిర్దేశించును. స్థూలాకాశమునకు కారణమై దానిని ధరించునది సూక్ష్మాకాశమే గదా!

పౌరుషం నృషు. నృషు = మానవుల యందలి; పౌరుషం = శక్తి నేనే. స్త్రీలు గాని, పురుషులు గాని మానవుల స్థూలదేహము నందు ఒక విశిష్టమైన శక్తి గలదు. ఆ శక్తి నేనే. పనిని చేయుటకు, నడచుటకు మాత్రమే గాక, శరీరములో సంతానోత్పత్తిని చేయుటకు కూడ శక్తి గలదు. అది అంతయూ పౌరుషమనబడును. ఇట్టి శక్తి నేనే.

ఇంతవరకు నీరు, ఆకాశము అనే రెండు భూతములు గతించినవి. తరువాతి శ్లోకములో భూమి, వేడిని ఇచ్చే అగ్ని వివరింపబడుచున్నవి. ఈ ప్రకరణములో నాలుగు భూతములు మాత్రమే చెప్పబడినవి. వాయువు అనే అయిదవ భూతమును మనము జోడించుకోవాలి. ఉన్న వస్తువుల నన్నింటినీ లెక్కించుట ఇచటి తాత్పర్యము కాదు. ఈ జగత్తులోని సర్వము నేనే అని చెప్పుటకై ఏవో కొన్ని వస్తువులను నిర్దేశించుట శ్రీకృష్ణుని తాత్పర్యము. ఒక రూపము, ఒక విశిష్ట గుణము గల సర్వ పదార్థములు నేనే. పదార్థములకు ఆయా విశిష్ట గుణములు నా నుండియే కలుగుచున్నవి. ఇది నా కంటె వేరుగా లేని నా సృష్టి. ప్రతి పదార్థములో దానిని ఇతర పదార్థముల నుండి వేరుచేసి చూపించే వ్యావర్తక గుణము ఒకటి ఉండును. అది నేనే. అనగా సర్వము నేనే.

అధ్యాయము 7, శ్లోకము 9:

पुण्यो गन्धः पृथिव्यां च तेजश्चास्मि विभावसौ ।
जीवनं सर्वभूतेषु तपश्चास्मि तपस्विषु ।। ९ ।।

పుణ్యో గంధః పృథివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ
జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు (9)

చ = మరియు; పృథివ్యాం = భూమి యందలి; పుణ్యః = పవిత్రమైన; గంధః = గంధము; అస్మి = నేనే అగుచున్నాను; చ = మరియు; విభావసౌ = అగ్ని యందలి; తేజః = తేజస్సు; సర్వభూతేషు = సర్వప్రాణుల యందు; జీవనం = జీవనము; చ = మరియు; తపస్విషు = తపోధనుల యందు; తపః = తపస్సు, దాని ఫలము; అస్మి = నేనే అగుచున్నాను.

పృథివి యందలి పవిత్రమైన సుగంధము నేనే. అగ్ని యందలి తేజస్సు నేనే.
సర్వ ప్రాణులలోని జీవనము నేనే. తపోధనుల యందలి తపస్సు మరియు
తత్ఫలము నేనే (9).

పదార్థము లన్నింటి సారము నేనే అను ప్రతిపాదనను శ్రీకృష్ణుడింకనూ కొనసాగించు చున్నాడు. సర్వము నా నుండియే ఉద్భవించినది. కాన, ఈ సర్వము నా కంటె వేరు గాదు. పృథివ్యాం = భూమి యందలి; పుణ్యో గంధః = తియ్యని పరిమళము నేనే. గంధము పృథివికి అసాధారణ గుణము. గంధము లన్నియూ పృథివీ జన్యములే. శ్రీకృష్ణ భగవానుడు పుణ్య గంధమును ప్రస్తావించుటకు హేతువు గలదు. పుష్పములోని పరిమళము ఇత్యాది పుణ్యగంధములు మానవుల నాకర్షించును. ఈ పరిమళము అనేక రకములుగా వ్యక్తమగుచుండును. కాని, పరిమళము లన్నింటికి ఉద్గమస్థానము పృథివి మాత్రమే. నేను పృథివి యందు పుణ్యగంధరూపములో నున్నాను. అదియే పృథివి యొక్క సూక్ష్మాంశము.

తేజః చ అస్మి విభావసౌ. విభావసౌ = అగ్నియందలి; తేజః చ = దీప్తి కూడా; అస్మి = నేనే అయి ఉన్నాను. తేజః అనగా వేడి అని కూడ అర్థము గలదు. అగ్నిలోని వేడి మరియు కాంతి నేనే.

జీవనం సర్వభూతేషు. సర్వభూతేషు = ప్రాణులన్నిటి యందు; జీవనం = ప్రాణము నేనే. ప్రాణి జీవించి యుండుట దేనివలన సంభవమగునో అదియే జీవనము. ఆహారము స్థూల శరీరమును పోషించి భరించును. అట్టి అన్నము (జీవనము) నేనే. లేదా, జీవనమనగా ప్రాణమని చెప్పవచ్చును. అనగా, సర్వప్రాణులలోని ప్రాణము నేనే. ప్రాణము వలన, అన్నము వలన ప్రాణులు జీవించ గల్గుచున్నవి. కాన జీవన శబ్దమునకు ఈ రెండు అర్థములు గలవు.

తపః చ అస్మి తపస్విషు. ఇంతవరకు భగవానుడు పదార్థముల సారమును గురించి మాటలాడినాడు. ఇపుడు ఆయన కొన్ని గుణములను ప్రస్తావించుచున్నాడు. తపశ్చాస్మి తపస్విషు. జీవితమును ప్రార్థనాయుతమగు అనుశాసనములతో గడుపు సన్న్యాసి 'తపస్విన్' అనబడును. తపస్విషు = అనుశాసన, ప్రార్థనా, ధ్యానములతో కూడిన జీవితమును గడిపే ఈ సన్న్యాసుల, మరియు వానప్రస్థుల యందలి; తపః = తపస్సు; అస్మి = నేనే అగుదును. వారు తపస్వులు అగుటలో మూలమైన గుణము నేనే. అనగా, మానవుడు చేయు తపస్సు గాని, సాధించే గొప్పదనము గాని ఈశ్వరుని కంటె వేరు గాదు. ధ్యానశక్తి, ఆత్మదర్శన శక్తి, శుద్ధాంతఃకరణ శక్తి ఇత్యాదిగా మానవుడు సాధించగలిగే శక్తులన్నియు తపస్సు అనబడును. మనము లేనిదానిని సృష్టించలేము. ఉన్నదానిని ఆవిష్కరింపజేయగలము. కావున, అవ్యక్త స్థితిలో ఉన్న శక్తి మాత్రమే ప్రకటితమగును. తపస్వి యొక్క శక్తి ఇట్టిదియే. అనగా తపశ్శాలులు ఈశ్వరుని స్వరూపభూతమైన శక్తిలోని ఒక అంశమును ఆవిష్కరిస్తారు. ఈ నిగూఢశక్తితో సంయోగము కలుగగానే, అది ఆవిష్కృతమగును. అనుశాసనము

జీవుని ఇచ్ఛాస్వాతంత్ర్యముపై ఆధారపడియుండును. కాని, దాని ప్రభావముచే తపస్వి కలిగియుండే శక్తి ఈశ్వరుడే. ఈ శక్తి లేనిచో, మానవుడు తపము నాచరించడు. మానవుడు తపస్సును కూడ, ఇతర కర్మలను వలె, ఫలము నపేక్షించి చేయును. ఫలమునకు సాధనము తపస్సు. ఈ ఫలము జీవుని యందు సూక్ష్మరూపములో నిగూఢముగ నున్నది. అది తపఃప్రభావముచే ఆవిష్కరింపబడును. అట్టి తపః ఫలము నా స్వరూపమే.

ఒక వ్యక్తి ఏ శక్తిచే తపస్వి యగునో, ఆ శక్తి నేనే. సాధనము లేనిదే, సాధ్యము చేతికి అందదు గదా! ఈ జగత్తులోని సాధన సాధ్యములన్నియూ ఈశ్వరీయ నియమానుసారములు గనే యున్నవి. తపస్వి యగుటకు కావలసిన సాధనములు కూడ ఈశ్వరీయ నియమముల ననుసరించి యుండును. ఆ నియమములు నా స్వరూపమే. కావున, ఏ తపస్సుచే వ్యక్తి తపస్వి యగునో, అట్టి తపశ్శాలురందరిలో ఉండే తపస్సు నేనే. కావున, నేను పరమేశ్వరుడను అని చెప్పగల్గినవాడే 'నేను తపస్విని' అని చెప్పగల్గును. అట్లు గానిచో, తపస్సు ఈశ్వరీయమగును. దానిని వ్యక్తి అరువు తెచ్చుకొనును. అట్టి వ్యక్తి 'నేను తపస్విని' అని చెప్పజాలడు.

తపోరూపుడనగు నా యందు తపస్వులందరూ ఓతప్రోతముగా నున్నారు అని శ్రీ శంకరులు వ్యాఖ్యానించిరి. దీనిని మనమింకనూ పొడిగించవచ్చును. సంగీతజ్ఞుని లోని సంగీతము నేనే. సంగీతసాధనము లన్నింటిలో శబ్దము నేనే. వయొలిన్ వయొలిన్‌గా, గిటారు గిటారుగా, వీణ వీణగా అగుటకు కావలసిన గుణము నేనే. ఈ సృష్టిలోని ప్రతివస్తువు ఆ వస్తువుగా నుండుటకు మూలభూతమగు గుణము నేనే. దేనివలన ఇవి అన్నియు తమ తమ అసాధారణ గుణములతో మనగల్గుచున్నవో, అట్టి అఖండసత్త నేనే.

అధ్యాయము 7, శ్లోకము 10:

बीजं मां सर्वभूतानां विद्धि पार्थ सनातनम् ।
बुद्धि र्बुद्धिमतामस्मि तेजस्तेजस्विनामहम् ॥ १० ॥

బీజం మాం సర్వభూతానాం విద్ధి పార్థ సనాతనమ్
బుద్ధిర్బుద్ధి మతామస్మి తేజస్తేజస్వినామహమ్ (10)

పార్థ = ఓ పృథాకుమారా! అర్జునా!; మాం = నన్ను; సర్వభూతానాం = ప్రాణులన్నిటికీ; సనాతనం = అనాదియగు; బీజమ్ = బీజముగా; విద్ధి = యెరుంగుము; అహం = నేను;

బుద్ధిమతాం = వివేకవంతుల; బుద్ధిః = వివేకబుద్ధి; తేజస్వినామ్ = తేజశ్శాలుర యొక్క; తేజః = తేజస్సు; అస్మి = అగుచున్నాను.

హే పార్థా! సర్వప్రాణులకు అనాది బీజము నేనే యని తెలుసుకో. వివేక వంతుల వివేక బుద్ధి నేనే. తేజశ్శాలుర తేజస్సు నేనే (10).

మాం = పరమేశ్వరుడనగు నన్ను; సర్వ భూతానాం = సర్వప్రాణుల; బీజం = బీజముగా; విద్ధి = తెలుసుకొనుము. భగవానుడు పూర్వశ్లోకములో 'ఏ తద్యోనీని భూతాని సర్వాణి (ఈ ద్వివిధప్రకృతి సర్వమునకు కారణము)' అని చెప్పియున్నాడు. ఈ యోని శబ్దమునకు, ప్రస్తుత శ్లోకములోని బీజశబ్దమునకు అర్థము ఒకటి కాదు. ఇచట బీజము అనగా సర్వప్రాణుల అసాధారణ సూక్ష్మ కారణావస్థ. ప్రతి వృక్షమునకు స్వీయ విత్తనము గలదు. ఆ విత్తనము నుండి ఆ వృక్షమే పుట్టును గాని, మరియొక వృక్షము పుట్టదు. అదే విధముగా ప్రతి పశువు, ప్రతి మానవుడు కలిగియున్న స్వరూపములకు ఆయా విలక్షణ బీజములే కారణము. అట్టి ప్రాణుల ఉద్గమస్థానమగు విత్తనము నేనే. మరియు ఇది అంతయూ కొన్ని నియమముల వలన మాత్రమే సంభవమగుచున్నది. ఆ నియమములు ఈశ్వర స్వరూపమే. విత్తనమును పాతినప్పుడు నిర్దిష్టకాలమునకు అది మొలకెత్తును. విత్తనము అట్లు మొలకెత్తుటకు కారణమైన జీవసంబంధి నియమము నేనే. శ్రీకృష్ణ భగవానుడిచట సృష్టి యొక్క సామాన్య కారణమును చెప్పుట లేదని మనము చూచియున్నాము. సృష్టిలోపల జరిగే సృష్టికి మరియొక అవాంతర కారణము గలదు. అట్టి అంతిమ అవాంతర కారణము కూడా నేనే.

శ్రీకృష్ణుడు సనాతనము అను మరియొక పదమును ప్రయోగించెను. ఈ పదమును 'మాం' అను పదముతో జతచేసినచో, 'శాశ్వతుడు, సర్వప్రాణులకు బీజభూతుడు అగు నన్ను' అను యర్థము వచ్చును. ఈ పదమును బీజ శబ్దమునకు విశేషణము చేసినచో, అది సర్వ జగత్కారణమగు ప్రకృతి యగును. కాని, ఇచటి ప్రకరణమది కాదు. అట్టి అర్థము అసంభవము కాకపోవచ్చును. కాని ఇచటి ప్రకరణమునకు అనురూపము కాదు. కావున, శాశ్వతుడు పరమేశ్వరుడు అగు నన్ను సర్వప్రాణుల బీజముగా తెలుసుకొనుము అను అర్థము మాత్రమే ఉపదేశ ప్రవాహములో కలిసిపోవును.

బుద్ధిర్బుద్ధి మతామస్మి. ఈ వాక్యము మనలోని అహంకారము నంతనూ పెకలించి వేయును. వివేక జ్ఞానము గలవారు బుద్ధిమంతులనబడుదురు. ఇట్టి వివేకము ప్రాణులన్నింటిలో లేదు. కావున, బుద్ధి మతాం అనగా మానవులని అర్థమును చెప్పవలెను. ప్రతిమానవునకు బుద్ధి

గలడు. కావున, మానవులందరూ బుద్ధిమంతులే. అట్టి బుద్ధి, లేక ఆలోచనాశక్తి, లేక ఇచ్ఛా స్వాతంత్ర్యము భగవానుని స్వరూపమే. కావున, యోగ్యమగు రీతిలో ఆలోచించగలిగే వ్యక్తిలో కనబడే బౌద్ధిక అనుశాసనము అనే మహత్త్వము నా స్వరూపమే. ఆ బుద్ధి నేనే. ఆ సామర్థ్యము నేనే. కావున, నేను బుద్ధిమంతుడను అని మానవులు విర్రవీగనక్కర లేదు. ఏలయన, అట్టి నేను పరమేశ్వరుడు మాత్రమే కాగలడు.

తేజస్తేజస్వి నామహమ్. తేజస్సు అనగా కాంతి. ఆరోగ్యవంతులలో ఉండే కాంతి తేజస్సు అనబడును. తేజశ్శాలులలోని తేజస్సు నేనే. ఆలోచనా శక్తి గల మానవులలోని బుద్ధి శక్తి నేనే అని భగవానుడు ఇంతకు ముందే చెప్పియున్నాడు. అట్లైనచో, కొందరు మాత్రమే దీప్తిని కలిగియుండుటకు కారణమేమి? మానవులందరు బుద్ధిమంతులే అయినా, సాధన చేయు వ్యక్తి మాత్రమే విద్యావంతుడై దీప్తిమంతుడగును. అట్టి వ్యక్తి తన హృదయములో నున్న దీప్తిని కొంతవరకైననూ పొందగల్గును. ఆ దీప్తి నేనే.

అధ్యాయము 7, శ్లోకము 11:

> बलं बलवतामस्मि कामरागविवर्जितम् ।
> धर्माविरुद्धो भूतेषु कामोऽस्मि भरतर्षभ ॥ ११ ॥

> బలం బలవతామస్మి కామరాగ వివర్జితమ్
> ధర్మావిరుద్ధో భూతేషు కామోస్మి భరతర్షభ (11)

భరతర్షభ = భరత వంశములో శ్రేష్ఠుడవైన ఓ అర్జునా!; బలవతాం = బలవంతుల యొక్క; కామ రాగ వివర్జితమ్ = కామనల నుండి, ఆసక్తుల నుండి విముక్తమైన; బలం = బలము; అస్మి = నేనే అగుదును; భూతేషు = ప్రాణుల యందలి; ధర్మావిరుద్ధః = ధర్మవిరోధి కాని; కామః = కామన; అస్మి = నేనే అగుదును.

> భరత వంశములో శ్రేష్ఠుడవైన ఓ అర్జునా! బలవంతుల యొక్క, కామనల నుండి ఆసక్తుల నుండి విముక్తమైన బలము నేనే. ప్రాణుల యందలి ధర్మవిరోధి కాని కామన నేనే (11).

బలం బలవతాం అస్మి. బలవంతుల బలము నేనే. శరీరములో శక్తి నిగూఢముగా నుండును. దీక్షతో అభ్యసించినచో అది ప్రకటమగునట్లు చేయవచ్చును. ఆ నిగూఢశక్తి ఈశ్వరుడే. అనగా శరీరములో పెంపొందించుకున్న బలము భగవానుడే. మానవులు పుట్టుకతో కండలు తిరిగి ఉండరు. వ్యాయామము చేసి కండలను పెంచవచ్చును. దీనిని సాధించుటకు ఆవశ్యకమగు ఇచ్ఛాశక్తి కూడ భగవానుడే. కావున, మానవులలో నిగూఢముగా నున్న శక్తి నేనే. మరియు, బలవంతులు బలవంతులుగా అగుటకు ఆధారమైన బలము నేనే. కావున, బలవంతుడు 'నేను బలవంతుడను' అని చెప్పుటకు వీలు లేదు. ఆ నేను ఈశ్వరుడైతే తప్ప!

కామరాగ వివర్జితమ్. సాధారణంగా రాగద్వేషములు కామములో అంతర్గతమగును. కాని ఇచట కామ, రాగ శబ్దములు వేర్వేరుగా ప్రయోగింపబడినవి గాన వాటి యర్థములో గల సూక్ష్మభేదమును మనము పరిశీలించవలెను. మనకు లేని దానిని సంపాదించాలనే ఆకాంక్ష కామమనబడును. ఉన్నదానిపై గల ఆసక్తికి రాగమని పేరు. ఈ శ్లోక భాష్యములో శ్రీ శంకరులిట్లు వివరించిరి. మనవద్ద లేనివి, మనకు దూరముగా నున్నవి, ఆ కారణంగా మనము సంపాదించవలసినవి అగు వస్తువులపై మనకు గల ఆకాంక్ష కామమనబడును. మనము ఇప్పటికే సంపాదించియున్న వస్తువులపై మనకు గల ఆసక్తి రాగమనబడును.

కామరాగములు లేని బలవంతుల బలము నేనే యని భగవానుడిచట చెప్పుచున్నాడు. బలము విషయములో ఈ విశేషణము ఆవశ్యకము. బుద్ధిమంతుల బుద్ధి నేనే. తేజశ్శాలుల తేజస్సు నేనే. తపశ్శాలుల తపస్సు నేనే అని భగవానుడు మిగిలిన స్థలములలో నిర్విశేషముగా చెప్పినాడు. కాని బలము విషయములో ఒక షరతును ఉంచినాడు. ఏలయనగా, బలము ఉన్నచోట బలదుర్వినియోగము ఉండే అవకాశము మెండు. కామరాగములు అహంకారమునకు సంకేతములు. కావున, ఇది అహంకార వర్జితమైన బలము.

మిగతా స్థలములలో ఈ విశేషణములను చెప్పకపోయినా, దీనిని వాటికి కూడా అన్వయించవచ్చును. ఒకనికి దీప్తి గలదు. ఆ దీప్తియూ కామరాగ వివర్జితమై యుండవలెను. కామరాగములకు కేంద్రబిందువు అహంకారము. కావున, అహంకార దుర్వినియోగము లేని దీప్తి ఇత్యాదులు సహజముగనే భగవత్స్వరూపము అగును. అహంకారము సర్వమును దూషితము చేయును. భగవద్భావన లేని వ్యక్తి యొక్క బలము భయకారణమగును. బలమునకు తోడుగా కామరాగములు కూడ గల వ్యక్తి గూండా యగునే గాని ఈశ్వరుడు కాజాలడు. కామరాగములు లేని బలవంతుడు యథార్థముగా నున్నచో, మనకు అతని యందు ఈశ్వరుడు దర్శనమిచ్చును.

సంగీతము విషయములో కూడా వాస్తవమిదియే. సంగీతము నందు దైవదత్తమగు ప్రావీణ్యమును కలిగియున్న సంగీతజ్ఞుడు 'నేను సంగీత విద్వాంసుడను' అనే అహంకారము గలవాడైనచో, అతని సంగీతము నందు మనకు రసానుభూతి కలుగదు. అహంకారము సౌందర్యమును కలుషితము చేయును. అతనికి ఏ స్థాయి వరకు అహంకారము లేదో, ఆ స్థాయి వరకు మాత్రమే అతని సంగీతమును మనము ఆస్వాదించగల్గుతాము.

బలవంతులై అహంకారము లేనివారిలో సారభూతమైన బలముగా నేనే ఉన్నానని తెలుసుకొనుమని భగవానుడీ శ్లోకములో చెప్పుచున్నాడు. అహంకారము గలవారిలో ఉన్న బలము కూడా నేనే. కాని ఆ నేను కానరాను. బలవంతుని ఆసరా చాల ప్రయోజనకారి యగును. బలవంతుని రక్షణ ఉన్నచో మనకు భయము ఉండదు. కాని, ఆ బలవంతుడు కామరాగములు గలవాడైనచో, అతడే మనకు భయకారణమగును. కావున, అహంకారముతో గూడిన బలము హానికారకమగును. ఈ కారణముగనే, శ్రీకృష్ణుడు ఒక ప్రత్యేక విశేషణమును జోడించినాడు. వాస్తవంలో మన అహంకారమును తొలగించుటయే ఈ ప్రకరణము యొక్క తాత్పర్యము.

ధర్మావిరుద్ధో భూతేషు కామోస్మి భరతర్షభ. ఇది మరియొక అందమైన వాక్యము. కోర్కెలను పెకలించి వేయాలి అనే ఉపదేశములు మనకు తరచుగా వినబడతాయి. అవి అర్థరహితములు. భరతర్షభ = భరతుని వంశములో పుట్టిన అర్జునా! వినుము. అహం కామః అస్మి = కోరిక నేనే. కామము ఒక శక్తి గదా! కాన, అది నా స్వరూపమే. కామన లేనిదే సృష్టి లేదు. ఈ కామము ఎట్టిదిగా నుండవలెను? ధర్మావిరుద్ధః = ధర్మముతో విరోధము లేనిది. అట్టి కామనలో ఈశ్వరుని దర్శించవచ్చును. వివిధ నైపుణ్యములు, జ్ఞానము కలిగి అహంకారము లేని వ్యక్తి ఒకడు ఉన్నాడనుకొనుడు. అతని యందు ఏ కర్మను చేయుటకైననూ కామనలు ఉండవు. అపుడాతని జ్ఞానమంతా అతనిలోననే మిగిలిపోవును. అతనికి మాటలాడవలెనని గాని, వ్రాయవలెనని గాని, జ్ఞానమును నలుగురికీ పంచవలెనని గాని కోరిక లేదనుకొనుడు. అతనికి కోర్కెలతో పనియేమి? అట్టి స్థితిలో, తూష్ణీంగా ఉండు వారిలోని తూష్ణీంభావము నేనే అని భగవానుడు చెప్పవలసి వచ్చెడిది.

కాని, జ్ఞానికి కూడా కామనలు ఉండవచ్చును. ఏలయన, కామనలు స్వతహాగా బంధించవు. ఇందువలననే భగవానుడు ధర్మావిరుద్ధః కామః అనినాడు. విశ్వజనీన నీతి నియమములకు, శాస్త్రమునకు అనురూపముగా జీవించుటయే ధర్మము. ధర్మానుకూలమగు కామన భగవాను

సౌందర్యము. దాని యందు భగవానుడు ప్రకటమగును. ఇట్టి కామన నుండి సుందరమగు వస్తువులు జనించును. దీనినే మనము ఇచ్ఛాశక్తి అని పిలుస్తాము. ఇది మాయాశక్తిలో అంతర్భాగము. కావున, సర్వప్రాణులలో ధర్మమునకు విరుద్ధము కాని కామన నేనే.

బుద్ధిమంతులలోని బుద్ధి నేనే. తేజశ్శాలులలోని తేజస్సు నేనే అని చెప్పి భగవానుడు జ్ఞానశక్తి తానేనని నిర్దేశించెను. బలం బలవతామ్ అని క్రియాశక్తి తానేనని చెప్పినాడు. ఈ శ్లోకములో ఇచ్ఛాశక్తి నేనే అని చెప్పుచున్నాడు.

ధర్మమునకు విరుద్ధము గాని కామన నా స్వరూపమే అని భగవానుడు చెప్పినాడు గనుక, ధర్మవిరుద్ధమగు కామన జీవునకు చెందినది అగును. జీవుడు ఈశ్వరుని కంటె భిన్నుడు కాదనుట యథార్థమే. కాని, ప్రస్తుతంలో జీవుడు ఇచ్ఛాశక్తి సంపన్నుడై యున్నాడు గనుక, ధర్మ విరుద్ధములగు కామనలు, ఆ కామనల ప్రేరణచే చేయు కర్మలు జీవునకు చెందినవి మాత్రమే యగును. వాటికి ఈశ్వరునితో సంబంధము లేదు.

'చ' అను సంయోజక అవ్యయమును ప్రయోగించి, శ్రీకృష్ణ భగవానుడీ ప్రకరణమును ఉపసంహరించుచున్నాడు:

అధ్యాయము 7, శ్లోకము 12:

ये चैव सात्त्विका भावा राजसास्तामसाश्च ये ।
मत्त एवेति तान्विद्धि न त्वहं तेषु ते मयि ॥ १२ ॥

యే చైవ సాత్త్వికా భావా రాజసాస్తామసాశ్చ యే
మత్త ఏవేతి తాన్విద్ధి న త్వహం తేషు తే మయి (12)

చ = మరియు; యే = ఏ; సాత్త్వికాః = సత్త్వగుణ జనితములు; రాజసాః = రజోగుణ జనితములు అగు; భావాః = ప్రాణులు, పదార్థములు గలవో; చ = మరియు; యే = ఏ; తామసాః = తమోగుణ జనితములగు భావములు గలవో; తాన్ = వాటిని; సర్వాన్ = అన్నింటిని; ఏవ = నిశ్చయముగా; మత్త ఏవ = నా నుండి మాత్రమే; ఇతి = అని; విద్ధి = తెలుసుకొనుము; తు = కాని; అహం = నేను; తేషు = వాటి యందు; న = లేను; తే = అవి; మయి = నా యందు గలవు.

> మరియు ఏ సత్త్వరజస్తమో గుణముల నుండి పుట్టిన ప్రాణులు మరియు పదార్థములు గలవో, అవి అన్నియూ నిశ్చితముగా నా నుండి మాత్రమే పుట్టినవని తెలుసుకొనుము. అవి నా యందు గలవు. కాని నేను వాటి యందు లేను (12).

యే చైవ సాత్త్వికా భావాః= శుద్ధ సత్త్వము నుండి పుట్టినవి. తెలుసుకోవాలనే కోరిక ఇత్యాది కామనలు సత్త్వగుణము నుండి పుట్టును. అంతఃకరణములో సత్త్వము, రజస్సు మరియు తమస్సు అనే మూడు గుణములు ఉండును. ధర్మమునకు అనురూపమైన, భవ్యములైన, ఉదారములైన మనోవృత్తులు సత్త్వము నుండి ఉదయించును. ఇంతే గాక, సుఖము, శాంతి ఇత్యాది అనుభూతులు కూడ సత్త్వము నుండి పుట్టును. యోగ్యమగు మానసిక అభివృత్తులు (attitudes), భక్తి శ్రద్ధలు, ప్రార్థన ఇత్యాదులన్ని సాత్త్విక భావము లనబడును.

మహత్త్వాకాంక్ష, ద్వేషము, క్రోధము ఇత్యాది లక్షణములు రజోగుణము నుండి పుట్టును. వాటికి రాజసములని పేరు. మరియు తమోగుణము నుండి పుట్టిన (తామస) లక్షణములు కూడా కొన్ని గలవు.

ఈ శ్లోకమును ఇంకో విధముగా కూడ వ్యాఖ్యానించ వచ్చును. సాత్త్వికా భావాః అనగా సత్త్వగుణ ప్రధానులగు దేవతలు. రజోగుణ ప్రధానులగు రాక్షసాదులు రాజసులు. తమోగుణ ప్రధానములగు పశువులు తామస భావము లనబడును. సత్త్వ రజస్తమో గుణముల కలయిక వలన జన్మించిన వారు మానవులు. ఈ విధముగా సర్వప్రాణులు లెక్క లోనికి వచ్చినవి.

లేదా, యే భావాః అను దానికి సత్త్వప్రధానులు, రజః ప్రధానులు, మరియు తమః ప్రధానులగు మానవులు అని అర్థమును చెప్పవచ్చును. ఈ మానవులు, మరియు ఈ సర్వప్రాణులు తమ తమ కర్మలకు అధీనులై జన్మించిరి. అనగా, వారందరు నా నుండియే జన్మించినారని యర్థము. ఏలయన, ఈ కర్మ నియతి నా స్వరూపమే. మరియు, సర్వమునకు కారణము నేనే. కావున, నా కంటె భిన్నముగా ఏదీ లేదు. ఒక ప్రాణి జన్మించుటకు ఒక స్థూలదేహము ఉండవలెను. స్థూలదేహము పంచభూతముల కలయికతో నిర్మాణమగును. ఈ భూతము లన్నియూ నా స్వరూపమే. మరియు, సూక్ష్మభూతముల అవశ్యకత కూడ గలదు. ఏలయన, సూక్ష్మభూతములు లేనిదే సూక్ష్మదేహము లేదు; స్థూలభూతములు లేవు. ఇట్టి సూక్ష్మభూతములు కూడ ఈశ్వరుని నుండియే పుట్టినవి.

కావున, నా కంటె భిన్నముగా ఏదీ లేదు. ఒక స్థూలదేహముతో జన్మించుటకు ఈ తత్త్వములన్నియూ ఆవశ్యకమగును. ఇవి అన్నియూ నేనే. వీటన్నింటికి ఉపాదాన కారణము నేనే. కావున, ప్రాణి తన కర్మానుసారముగా ఏ దేహముతో జన్మించినా, ఆ దేహము తామసమైనా, సాత్త్వికమైనా, నా కంటె భిన్నముగా లేదు.

ఈ ప్రాణులన్నియు నా నుండియే పుట్టినవనూ, నేను వాటి యందు లేను (న తు అహం తేషు). అనగా నేను వాటి నియంత్రణలో లేను. నేను వాటిపై ఆధారపడి లేను. అవి కార్యములు, నేను కారణము గనుక నేను వాటి ఉనికిపై ఆధారపడను. మట్టి తన ఉనికి కొరకు కుండపై ఆధారపడదు. కాని ఈ ప్రాణులన్నియూ (సాత్త్వికరాజస తామస భావములు) పూర్తిగా నాపై, నా సృష్టి నియమములపై ఆధారపడి యున్నవి. ఈ ప్రాణులు నా నియమముల కనురూపముగా పుట్టినవి. ఈ నియమములు నా స్వరూపమే. సర్వము నేనే గనుక, ఈ ప్రాణులు తమ ఉనికి కొరకు పూర్ణముగా నాపై ఆధారపడును. ప్రాణులు జీవించుటకు గాలి కావలెను. ఆ గాలి నేనే. ప్రాణులకు నీరు కావలెను. అది నేనే. వాటికి తేజస్సు కావలెను. అది నేనే. వాటికి నేల, ఆహారము కావలెను. అవి నేనే. అవి అన్నియూ పూర్ణముగా నాపై ఆధారపడి యున్నవి. కాని నేను వాటి వశములో లేను.

శ్రీ శంకరులు తరువాతి శ్లోకమునకు అవతారికలో ఇట్లు చెప్పినారు: జలములలోని రసము నేనే. బలవంతులలోని బలము నేనే. కామన నేనే. నా నుండియే సాత్త్విక రాజసతామస భావములన్నియూ ఉద్భవించినవి. నా కంటె భిన్నముగా ఏదీ లేదు. ఇది యథార్థ స్థితి. కాని మానవులు పరమేశ్వరుడ నగు నన్ను గుర్తించకున్నారు. అట్టి ఆ పరమేశ్వరుడెవ్వరు? ఆయన పరముడు మరియు ఈశ్వరుడని శ్రీ శంకరులు చెప్పినారు. పరమశబ్దము ఈశ్వరుని స్వరూపమును నిర్దేశించెను. కావున, పరమేశ్వర శబ్దము భగవానుని స్వరూపమును మాత్రమే గాక, భగవానుడు సర్వకారణము అనే అధీశ్వరత్వమును కూడ నిర్దేశించును.

సర్వకారణము అనుటకు కారణమేమి? మనము ప్రపంచములో వివిధ పదార్థములను విభాగము చేసి, వాటికి గల విభిన్న కారణములను నిరూపిస్తాము. భౌతిక పదార్థము లన్నియూ పంచభూతముల నుండి పుట్టినవి. కాన భౌతిక పదార్థములకు స్థూలపంచ భూతములు కారణము. మరియు ఈ పంచస్థూల భూతములు సూక్ష్మభూతముల నుండి పుట్టినవి. కావున, సూక్ష్మ భూతములు కారణమగును. ఈ తీరున మనము కారణాన్వేషణను కొనసాగించవచ్చును. ఒక కార్యమును పరిశీలించి దాని కారణమును తెలుసుకుంటాము. కాని, ఆ కారణము కూడా కార్యమే

కావున, దానికి మరియొక కారణము గలదు. ఈ విధముగా ఈ జగత్తులో అనేక కారణములు గలవు. కావున, సర్వమునకు కారణమైన ఈశ్వరుని మనము సర్వకారణుడు అని పిలుస్తాము.

ఈశ్వరుని స్వరూపము: సనాతనము, నిత్యశుద్ధము, నిత్యబుద్ధము, నిత్యముక్తము

సర్వోత్కృష్టుడగు ఈశ్వరుని స్వరూపమెట్టిది? దానిని మాత్రమే మనమిచట తెలునుకొనవలసి యున్నది. అందువలననే, శ్రీ శంకరులు ఇచట ఈశ్వరస్వరూపమును నిత్యశుద్ధ బుద్ధముక్త స్వభావము అని వర్ణించిరి. శ్రీ శంకరులు ఆత్మ స్వరూపమును బోధించుటకు తరచుగా ఈ సమాసమును ప్రయోగించినారు. ఆత్మ 'పరము' అనబడును. పరశబ్దము సదా ఆత్మను గాని, బ్రహ్మను గాని బోధించును.

'నిత్య' అనునది ప్రముఖమైన పదము. దీనిని సరిగ్గా తెలుసుకోవాలి. సర్వదా ఉండేది నిత్యము అనబడును. సర్వదా ఉండే వస్తువు కాలమునకు అతీతముగా నుండును. శాశ్వతమనగా నిదియే. ఆత్మ నిత్యము, శాశ్వతము. నిత్య శబ్దమొక్కటియే ఆత్మ స్వరూపమును బోధించును. మరియు నిత్యశబ్దము ఇతర విశేషణ ములన్నింటికీ ముందు ఉండును. శుద్ధము అనే పదమునకు 'నిత్య' అను విశేషణము గలదు. ఆత్మ యొక్క స్వరూపమైన శుద్ధి నిత్యము. కావున ఈ శుద్ధి ఆపాదింపబడినది కాదు. మరియు, ఈ శుద్ధి తొలగి మాలిన్యము చేరే ప్రసక్తి లేదు. అందువలననే ఆత్మ నిత్యశుద్ధమని శ్రీ శంకరులు వాక్రుచ్చిరి. ఇచట శుద్ధము అనగా బంధవిముక్తి, సంసార విమోచనము, పుణ్య పాపకర్మ లన్నింటి నుండి విముక్తి.

మరియు ఆత్మ నిత్యబుద్ధమని వారు చెప్పిరి. నిత్యబుద్ధ మనగా ఏనాడూ బద్ధము కానిది అని వాస్తవార్థము. బుద్ధము అనగా జ్ఞాన ప్రకాశము గలది. ఒక వ్యక్తిని ఉద్దేశించి 'ఈతడు జ్ఞాని' అన్నచో, అతడు ఒకప్పుడు జ్ఞాని కాదని తెలుస్తుంది. అతడు ఒకనాడు జ్ఞాని అయినాడు. అనగా, అతడు జ్ఞాని యగుట అనే ఘటన కాలాంతర్గతమైనది. కాని ఆత్మ నిత్యబుద్ధము. కావున, నేను జ్ఞాని అయినాను అని ఎవరైనా చెప్పినచో, ఆ వాక్యమునకు నేను సదా జ్ఞానిని అనే సత్యమును గుర్తించినాను అని యర్థము. ఆత్మ సర్వదా జ్ఞాన ప్రకాశము గలది యను సత్యమును నిత్యబుద్ధము అను పదము ప్రకటించును. బంధహేతువు అజ్ఞానము గనుక, నిత్యబుద్ధమగు ఆత్మ సహజముగా నిత్యముక్తము అగును.

ఇవి గుణములా?

నిత్యత్వ శుద్ధత్వ ముక్తత్వములు గుణములు అనే పక్షంలో జ్ఞానికి ఈ గుణములు ఉండునని భావించవచ్చును. ప్రతి వస్తువునకు స్వీయగుణములు ఉండును. ఆ గుణములను బట్టి మనము ఆ వస్తువునకు ఒక పేరును ఇస్తాము. నిత్యత్వ శుద్ధత్వ ముక్తత్వములనే గుణములు ఆత్మకు తక్క ఇతర వస్తువులకు లేవు. ఇవి గుణములు అనే పక్షంలో, ఆత్మ నిత్యత్వ శుద్ధత్వ ముక్తత్వములనే గుణములు గల ఒకానొక పదార్థము అగును. అనగా ఆత్మ స్వీయగుణములకు ఆశ్రయముగా నుండే ద్రవ్యము అగును. కాని ఇది వాస్తవము కాదు. ఆత్మ గుణాశ్రయమగు పదార్థము కాదు. తియ్యని పండు, ఎర్రని పండు అని మనము ఒక వస్తువును గుర్తించినప్పుడు, మనము పండు అని పిలిచే ఆ వస్తువులో ఆయా గుణములను గుర్తిస్తాము. పచ్చని పత్రము అన్నప్పుడు పత్రమును ముందుగా చూచి, దాని యందు దానికి విశేషణముగా నుండే పచ్చదనము గుర్తింపబడినది. పత్రములో పచ్చదనమును చూచిన తీరున, ముందుగా ఆత్మను సాక్షాత్కరించుకొని, ఆ పై దాని యందు ఈ నిత్యత్వాది గుణములు దర్శింపబడునా? అట్లు గాదు. ఈ గుణములు కనబడవు. 'నిత్య' అనునది గుణము కాదు; లక్షణ.

లక్షణ–తన అర్థములో కొంత మిగుల్చుకుని నిషేధించే పదము

ఆత్మ స్వరూపము కాల పరిచ్ఛిన్నము (అనిత్యము) కాదు అని నిరూపించుటకై నిత్యపదము ప్రయోగింపబడినది. మనకు తెలిసేది సర్వము అనిత్యము. కావున, నిత్యపదము ఆత్మ స్వరూపమును బోధించే లక్షణమగును. ఆత్మ స్వయంసిద్ధము, స్వప్రకాశము. కావున, మనము ఆత్మ యందు అజ్ఞానముచే ఆరోపింపబడిన అనిత్యత్వాది గుణములను నిషేధించిన చాలును. ఈ పనిని నిత్య ఇత్యాది పదములు చేయును. అది లక్షణ యగును. పదము యొక్క అర్థము స్వీకరింపబడును. కాని నిత్యపదము కాల పరిచ్ఛిన్నమగు సర్వగుణములను ఆత్మ యందు నిషేధించును.

ఇదే విధముగా, శుద్ధ పదము రాగద్వేషములు, పుణ్య పాప కర్మలు ఇత్యాది మాలిన్యముల నన్నిటిని నిషేధించును. బుద్ధ పదము అజ్ఞానమును, జడత్వమును నిషేధించును. ఆత్మ జడము కాదు. ఆత్మ చైతన్యఘనము. ముక్త పదము బంధమును నిషేధించును.

ప్రతి పదము తన అర్థములో ఒక భాగమును మిగుల్చుకొనును; మరియు నిషేధించును. ఈ పదము మూలార్థమును విడువకుండగనే తమ యందు గుణత్వమును నిషేధించును. దీనికే లక్షణ

యని పేరు. ఆత్మ సర్వ విశేష రహితము అనే ఆత్మ స్వరూపమును బోధించే ప్రకరణములో ఈ పదములు ప్రయోగింపబడినవి. ఆత్మ మన స్వరూపము మాత్రమే గాక, సర్వప్రాణుల స్వరూపము కూడా (సర్వ భూతాత్మ).

సంసారమునకు బీజము అజ్ఞానము తక్క మరియొకటి కాదని శ్రీ శంకరులు చెప్పిరి. కావున, నిత్య శుద్ధ బుద్ధముక్త స్వభావమగు ఆత్మను సాక్షాత్కరించు కొనుటచే సంసారమంతయూ భస్మమగును. వస్తుజ్ఞానము ఏదైనా వస్తు స్వరూపము కంటె భిన్నముగా నుండదు. కావున, ప్రస్తుతంలో ఆత్మజ్ఞానము ఆత్మ స్వరూపము కంటె భిన్నము కాదు. కావున, ఆత్మ జ్ఞాన మాత్రముచే సంసారనాశము సంభవమగును.

సర్వ సంసార దోషమునకు మూలమైన అజ్ఞానబీజమును నేను నశింపజేసెదను. అట్టి నన్ను (పరమేశ్వరుని) జనులు ఎరుంగరు అని శ్రీ శంకరులు వివరించుచున్నారు. వారు నన్ను వివిధ రూపములలో భావన చేస్తారు. వారు నన్ను యథార్థముగా నెరుంగరు. జగత్తునకు కారణము గలదు ఇత్యాదిగా మానవులలో ఏదో కొంత సత్యజ్ఞానము గలదు. నేను వారి స్వరూపమే అయి వారిలో మున్నాను. కాని వారు నన్ను ఎరుంగరు.

తరువాతి శ్లోకములో భగవానుడు సంసారములోని అజ్ఞానమునకు కారణమును నిరూపించుచున్నాడు:

అధ్యాయము 7, శ్లోకము 13:

त्रिभिर्गुणमयैर्भावैरेभिस्सर्वमिदं जगत् ।
मोहितं नाभिजानाति मामेभ्यः परमव्ययम् ॥ १३ ॥

త్రిభిర్గుణమయైర్భావై రేభి స్సర్వమిదం జగత్
మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్ (13)

ఏభిః = ఈ; త్రిభిః = మూడు; గుణమయైః = గుణవికారములైన; భావైః = పదార్థములచే; మోహితం = మోహింపజేయబడిన; ఇదం = ఈ; సర్వం = సమస్తమైన; జగత్ = జగత్తు; ఏభ్యః = వీటికంటె; పరం = అతీతమైన; అవ్యయం = వినాశము లేని; మాం = నన్ను; న అభిజానాతి = గుర్తించకున్నది.

ఈ మూడు విధముల గుణవికారములైన పదార్థములచే మోహింపజేయబడిన ఈ సర్వజగత్తు వీటి కంటె అతీతమైన వినాశము లేని నన్ను గుర్తించకున్నది (13).

మయట్ అను ప్రత్యయమునకు రెండు అర్థములు గలవు. వికారము, మరియు ప్రాచుర్యము (అధికముగా నుండుట). ఇచట వికారార్థములో మయట్ ప్రయోగింపబడినది. మూడు గుణములు పరిణామమును పొంది (గుణమయైః) జగత్తు నిర్మాణమైనది. ఏభిః త్రిభిః గుణమయైః = ఈ సత్త్వరజస్తమస్సులనే గుణముల వికారముల చేత. ఈ గుణముల పరిణామము వలన ఇష్టానిష్టములు, మోహము ఇత్యాదులు కలుగునని శ్రీ శంకరులు వివరించిరి.

మూడు గుణముల వికారములు

సత్త్వరజస్సులు రెండింటి నుండి రాగము పుట్టును. సత్త్వము నుండి పుట్టిన కామన సాత్త్వికరాగమనబడును. రజోగుణము నుండి పుట్టిన కోరిక రాజసిక రాగమనబడును. గీతను పఠించవలెననే కోరిక సాత్త్విక రాగము. జ్ఞానము నందలి కోరిక ఏదైనా సాత్త్వికమే. మహత్త్వాకాంక్ష ఇత్యాది కామనలు రాజసిక రాగములు. పేరు ప్రతిష్ఠలు, అధికారము మొదలగు వాటిపై గల కోరిక లన్నియూ రాజసిక రాగములు అగును.

ద్వేషము రజో గుణము నుండియు, మోహము తమోగుణము నుండియు పుట్టును. అజ్ఞానమే తమస్సు. దాని కార్యము మోహము. మనము జీవితములో స్వీకరించే తప్పుడు విలువలకు హేతువు మోహమే. కావున, తప్పుడు ధారణలకు, తప్పుడు విలువలకు మూలములో అజ్ఞానము గలదు.

తరువాత పదునాల్గవ అధ్యాయములో ఈ సత్త్వరజ స్తమో గుణముల గురించి వివరంగా తెలుసుకుంటాము.

ఈ త్రిగుణ వికారములు మానవులను మోహింపజేయును

సర్వం ఇదం జగత్ = ఈ జగత్తు అంతా; మోహితం = త్రిగుణముల వికారములచే మోహింపబడుచున్నది. 'జగత్తు అంతా' అంటే ఈ జగత్తులోని వివిధ పదార్థములు అని అర్థము కాదు. పదార్థములకు ఈ సమస్యలు ఏమియూ లేవు. జగత్ అనగా ప్రపంచము అను అర్థము

గలదనుట వాస్తవమే. కాని శ్రీ శంకరులు ఈ పదము యొక్క అర్థమును ప్రాణి సమూహమునకు సంకోచించిరి.

మోహితుడగుట యనగా వివేకశక్తిని కోల్పోవుట. నిత్యానిత్య వస్తు వివేకము లేని వ్యక్తికి జీవితములో తాను సాధించవలసినది (పురుషార్థము) యేది అను విషయములో సరియగు అవగాహన ఉండదు. ఇట్టి వ్యక్తికి ఆత్మానాత్మ వివేకము కూడా లోపించును. కావున, ఇట్టి వానికి సర్వత్రా వివేకమునకు సంబంధించిన సమస్యలు ఉండును.

మోహితులైన మానవులు ఆత్మ రూపుడగు ఈశ్వరుని గుర్తించలేరు

మాం న అభిజానాతి = మానవుడు నన్ను గుర్తించజాలడు అని శ్రీకృష్ణ భగవానుడీ శ్లోకములో చెప్పుచున్నాడు. మానవులు ఈ సంసారము నందు వ్యామోహితులై, వారి కంటె అభిన్నముగా నున్నప్పటికీ నన్ను గుర్తించజాలరు. ఆ నా స్వరూపమెట్టిది? పరం అవ్యయమ్ అని శ్రీకృష్ణుడు వర్ణించినాడు. ఎవనియందు గుణము లన్నియూ ఉనికిని పొందుచున్నవో, ఎవడు గుణములన్నింటికీ అతీతుడో, అట్టి భగవానుడు 'పర' అనబడును. గుణములు గుణములగుటకు హేతువు భగవానుడే. ఈ మూడు గుణముల నుండి విముక్తుడై యున్న నన్ను మానవులు గుర్తించుట లేదు.

మరణమును పొందనిది అవ్యయమనబడును. పుట్టుక లేనిది కూడ అవ్యయమే. కావున, జన్మతో మొదలిడి మరణముతో అంతమయ్యే ఆరు భావ వికారముల★ నుండి విముక్తమైనది అవ్యయమనబడునని శ్రీ శంకరులు ఈ శ్లోకభాష్యములో వివరించిరి. మరణించని దానికి పుట్టుక కూడ లేదని స్పష్టమే. మరియు, అది వర్తమానములో ఉనికిని కలిగియున్న ఒకానొక వస్తువు కూడ కాజాలదు. మరియు, దానికి పెరుగుదల, రూపాంతరణము (metamorphosis) మరియు మృత్యువు అను క్రమపరిణామము లేదు. కావున, అవ్యయపదము మరణమును మాత్రమే గాక, జన్మ మరణములకు మధ్యలో సంభవించే జుట్టు తెల్లబడుట, వయస్సు మీదబడుట, శరీరము ముడుతలు బడుట ఇత్యాది లక్షణములను కూడ నిషేధించును.

★ షడ్భావ వికారములనగా జాయతే (పుట్టుక), అస్తి (ఉనికి), వర్ధతే (పెరుగుదల), విపరిణమతే (మార్పు చెందుట), అపక్షీయతే (క్షీయతే (క్షీణించుట), వినశ్యతి (మరణించుట).

ఈ మూడు విధముల గుణవికారములైన పదార్థములచే మోహింపజేయబడిన ఈ సర్వజగత్తు వీటి కంటె అతీతమైన వినాశము లేని నన్ను గుర్తించకున్నది (13).

మయట్ అను ప్రత్యయమునకు రెండు అర్థములు గలవు. వికారము, మరియు ప్రాచుర్యము (అధికముగా నుండుట). ఇచట వికారార్థములో మయట్ ప్రయోగింపబడినది. మూడు గుణములు పరిణామమును పొంది (గుణమయైః) జగత్తు నిర్మాణమైనది. ఏభిః త్రిభిః గుణమయైః = ఈ సత్త్వరజస్తమస్సులచే గుణముల వికారముల చేత. ఈ గుణముల పరిణామము వలన ఇష్టానిష్టములు, మోహము ఇత్యాదులు కలుగునని శ్రీ శంకరులు వివరించిరి.

మూడు గుణముల వికారములు

సత్త్వరజస్సులు రెండింటి నుండి రాగము పుట్టును. సత్త్వము నుండి పుట్టిన కామన సాత్త్విక రాగమనబడును. రజోగుణము నుండి పుట్టిన కోరిక రాజసిక రాగమనబడును. గీతను పఠించవలెననే కోరిక సాత్త్విక రాగము. జ్ఞానము నందలి కోరిక ఏదైనా సాత్త్వికమే. మహత్త్వాకాంక్ష ఇత్యాది కామనలు రాజసిక రాగములు. పేరు ప్రతిష్ఠలు, అధికారము మొదలగు వాటిపై గల కోరిక లన్నియూ రాజసిక రాగములు అగును.

ద్వేషము రజో గుణము నుండియు, మోహము తమోగుణము నుండియు పుట్టును. అజ్ఞానమే తమస్సు. దాని కార్యము మోహము. మనము జీవితములో స్వీకరించే తప్పుడు విలువలకు హేతువు మోహమే. కావున, తప్పుడు ధారణలకు, తప్పుడు విలువలకు మూలములో అజ్ఞానము గలదు.

తరువాత పదునాల్గవ అధ్యాయములో ఈ సత్త్వరజ స్తమో గుణముల గురించి వివరంగా తెలుసుకుంటాము.

ఈ త్రిగుణ వికారములు మానవులను మోహింపజేయును

సర్వం ఇదం జగత్ = ఈ జగత్తు అంతా; మోహితం = త్రిగుణముల వికారములచే మోహింపబడుచున్నది. 'జగత్తు అంతా' అంటే ఈ జగత్తులోని వివిధ పదార్థములు అని అర్థము కాదు. పదార్థములకు ఈ సమస్యలు ఏమియూ లేవు. జగత్ అనగా ప్రపంచము అను అర్థము

గలదనుట వాస్తవమే. కాని శ్రీ శంకరులు ఈ పదము యొక్క అర్థమును ప్రాణి సమూహమునకు సంకోచించిరి.

మోహితుడగుట యనగా వివేకశక్తిని కోల్పోవుట. నిత్యానిత్య వస్తు వివేకము లేని వ్యక్తికి జీవితములో తాను సాధించదలచినది (పురుషార్థము) యేది అను విషయములో సరియగు అవగాహన ఉండదు. ఇట్టి వ్యక్తికి ఆత్మానాత్మ వివేకము కూడా లోపించును. కావున, ఇట్టి వానికి సర్వత్రా వివేకమునకు సంబంధించిన సమస్యలు ఉండును.

మోహితులైన మానవులు ఆత్మ రూపుడగు ఈశ్వరుని గుర్తించలేరు

మాం న అభిజానాతి = మానవుడు నన్ను గుర్తించజాలడు అని శ్రీకృష్ణ భగవానుడీ శ్లోకములో చెప్పుచున్నాడు. మానవులు ఈ సంసారము నందు వ్యామోహితులై, వారి కంటె అభిన్నముగా నున్నప్పటికీ నన్ను గుర్తించజాలరు. ఆ నా స్వరూపమెట్టిది? పరం అవ్యయమ్ అని శ్రీకృష్ణుడు వర్ణించినాడు. ఎవనియందు గుణము లన్నియూ ఉనికిని పొందుచున్నవో, ఎవడు గుణములన్నింటికీ అతీతుడో, అట్టి భగవానుడు 'పర' అనబడును. గుణములు గుణములగుటకు హేతువు భగవానుడే. ఈ మూడు గుణముల నుండి విముక్తుడై యున్న నన్ను మానవులు గుర్తించుట లేదు.

మరణమును పొందనిది అవ్యయమనబడును. పుట్టుక లేనిది కూడ అవ్యయమే. కావున, జన్మతో మొదలిడి మరణముతో అంతమయ్యే ఆరు భావ వికారముల* నుండి విముక్తమైనది అవ్యయమనబడునని శ్రీ శంకరులు ఈ శ్లోకభాష్యములో వివరించిరి. మరణించని దానికి పుట్టుక కూడ లేదని స్పష్టమే. మరియు, అది వర్తమానములో ఉనికిని కలిగియున్న ఒకానొక వస్తువు కూడ కాజాలదు. మరియు, దానికి పెరుగుదల, రూపాంతరణము (metamorphosis) మరియు మృత్యువు అను క్రమపరిణామము లేదు. కావున, అవ్యయపదము మరణమును మాత్రమే గాక, జన్మ మరణములకు మధ్యలో సంభవించే జుట్టు తెల్లబడుట, వయస్సు మీదబడుట, శరీరము ముడుతలు బడుట ఇత్యాది లక్షణములను కూడ నిషేధించును.

---

* షడ్భావ వికారములనగా జాయతే (పుట్టుక), అస్తి (ఉనికి), వర్ధతే (పెరుగుదల), విపరిణమతే (మార్పు చెందుట), అపక్షీయతే (క్షీయతే (క్షీణించుట), వినశ్యతి (మరణించుట).

ఈ త్రిగుణముల కార్యములచే మోహితులై మానవులు సర్వ వికార రహితమగు నా స్వరూపమును గుర్తింపజాలరు. వారి మోహములో తగుల్కొని తమ కామనలను పరిపూర్తి చేసుకొనుటలో వ్యగ్రులై యుందురు. సిద్ధించిన కామనలతో సంతృప్తి పడలేక 'చాలదు, ఇంకా కావాలి' అంటూ సర్వదా ఫిర్యాదులను చేస్తూ ఉంటారు. వాస్తవంలో వారి దృష్టిలో భగవానుడు ఫిర్యాదుల కొరకు మాత్రమే ఉన్నాడు. 'నీవు నాకు ఇది ఇవ్వలేదు. అది ఈయలేదు. అట్లు చేయుటకు కారణమేమి? ఇట్లు చేయకపోవుటకు కారణమేమి?' ఈ తీరున, భగవానుడు ఫిర్యాదుల నందజేసే వేదిక యగును. భగవానుడు ఆఖరుగా అప్పీలు చేసుకునే సర్వోన్నత న్యాయస్థానము వంటివాడు అగును. కాన, మానవులు అయన యథార్థ స్వరూపమును గుర్తించుట లేదు.

దీనికి గల కారణమును కూడ భగవానుడు నిర్దేశించినాడు. ఈ త్రిగుణాత్మకమగు మాయను ఎవరు తరించగలరు? అను విషయమును అయన తరువాతి శ్లోకములో వివరించును.

త్రిగుణ వికార మోహితమైన ఈ జగత్తు నన్ను ఎరుంగజాలదని శ్రీకృష్ణ భగవానుడు పూర్వశ్లోకములో చెప్పియున్నాడు. మనస్సులో ఏ వృత్తి ఉదయిస్తే దానితో పూర్ణముగా తాదాత్మ్యమును పొందే ఈ మానవుడు నన్ను గుర్తించజాలడు. నేను త్రిగుణములకు, వాటి కార్యములకు అతీతుడను. నేను సర్వప్రాణులలో ఆత్మరూపముగా నున్ననూ, వారు నన్ను గుర్తింపజాలరు.

మానవుడీ మోహము నుండి విముక్తిని పొంది, భగవానుని గుర్తించుట యెట్లు? మానవులీ విష్ణుభగవానుని మాయను తరించుట సంభవమేనా? అట్లైనచో, దీనిని తరించు ఉపాయమెద్ది? ఈ ప్రశ్నలకు సమాధానము తరువాతి శ్లోకములో లభించును:

అధ్యాయము 7, శ్లోకము 14:

दैवी ह्येषा गुणमयी मम माया दुरत्यया ।
मामेव ये प्रपद्यन्ते मायामेतां तरन्ति ते ॥ १४ ॥

దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా
మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే (14).

ఏషా = ఈ; దైవీ = భగవానునికి చెందిన; గుణమయీ = గుణాత్మకమగు; మమ = నా; మాయా = మాయ; దురత్యయా = దుస్తరమైనది; హి = నిశ్చయము; యే = ఎవరైతే; మాం ఏవ = నన్ను మాత్రమే; ప్రపద్యంతే = శరణు జొచ్చెదరో; తే = వారు; ఏతాం = ఈ; మాయాం = మాయను; తరంతి = తరించెదరు.

> భగవానుడనగు నాకు చెందిన ఈ త్రిగుణాత్మకమగు మాయ నిశ్చయముగా దుస్తరమైనది. ఎవరైతే నన్ను మాత్రమే శరణు జొచ్చెదరో వారు ఈ మాయను తరించెదరు (14).

మాయను తరించుట కష్టము

హి మమ మాయా దురత్యయా. ఈ నా మాయను తరించుట ఎంతయూ కష్టమని శ్రీకృష్ణ భగవానుడు మున్ముందుగా చెప్పుచున్నాడు. మనో వికారములచే మోహితులమగు మనము మనకు ఈశ్వరునితో గల అభేదమును గుర్తించలేకున్నాము.

దైవీ హి ఏషా గుణమయీ. కాని ఈ మనస్స్థితులన్నియూ మాయా గుణములగు సత్త్వ రజస్తమస్సుల కార్యములని మనము చూచియున్నాము. ఈ మాయ గుణమయి అనగా ఈ మూడు గుణములతో అలరారునది. ఈ మాయయే మనో వికారములుగా పరిణమించి, ఈశ్వర సాక్షాత్కారమునకు అడ్డుపడుచున్నట్లు కన్పట్టును. ఈ మాయను అతిక్రమించాలి. దాని యథార్థ స్వరూపమును దర్శించాలి.

ఈ మాయ దైవీ మాయ. అనగా ఈశ్వరునకు చెందినది. మాయకు ఆశ్రయము పరమేశ్వరుడు. కావున, ఆయన దానిచే ప్రభావితుడు కాడు. మాయ ఈశ్వరునకు శక్తి యగును. సర్వవ్యాపకుడగు పరమేశ్వరుడు విష్ణువు అనబడును. ఈ మాయ ఆయన యొక్క స్వభావము. ఆయన యొక్క స్వరూపము వేరే. దీనిని మనము చూచియున్నాము. కాని ఆయన స్వభావము సర్వజ్ఞము, సర్వశక్తి మత్ ఇత్యాదిగా నున్నది. ఈ గుణములన్నియూ మాయ వలన ఆయనకు కలిగినవి. మనమీ మాయ యొక్క కార్యమును తేలికగా అతిక్రమించలేకున్నాము.

ఈ మాయను తరించుట అసంభవము కాకపోయినా, కష్టసాధ్యమని శ్రీకృష్ణుడీ శ్లోకములో అంగీకరించుచున్నాడు. దీనిలోని క్లేశమేమనగా, మనము గుణముల సమ్మోహములో

నుండి, వాటిచే పరాభూతులుగా నున్నంతవరకు, మనము వాటిని అతిక్రమించుట అసంభవమగును. వ్యక్తి తనను తాను గుణముల కంటె విలక్షణమైన వానినిగా దర్శించనంతవరకు, మనో వికారము లన్నింటికీ అవియే కారణమనే సత్యమును గుర్తించజాలడు. ఇచటి క్లేశమేమనగా, గుణముల సమ్మోహము నుండి బయటపడిన వ్యక్తికి మాత్రమే ఈ సత్యము కనపట్టును. అంటే, ఈ సమ్మోహము నుండి బయటపడాలంటే, ఈ సమ్మోహము నుండి బయటపడి ఉండాలి. ఇది ఒక సమస్య. సమ్మోహము నుండి బయటపడనిదే, సమ్మోహము నుండి వ్యక్తి బయటపడలేడు. సమ్మోహములో ఉన్నంత వరకు వ్యక్తి సమ్మోహము నుండి బయటపడలేడు. కాని సమ్మోహము నుండి బయటపడాలనే కోరిక మనకు గలదు. ఇది చాల క్లిష్టపరిస్థితి.

మాయను తరించుట కష్టమే అయినా సంభవము

యే మాం ఏవ ప్రపద్యంతే ఏతాం మాయాం తరంతి తే. శ్రీకృష్ణ భగవానుడు ఇది ఎంత కష్టమో వివరించి, అంతటితో విడిచిపెట్టలేదు. దీని నుండి బయట పడే మార్గము గలదని ఆయన చెప్పుచున్నాడు. నన్ను మాత్రమే శరణు జొచ్చువారు ఈ మాయను తరించెదరు. యే మాం ఏవ ప్రపద్యంతే = ఎవరైతే నన్ను మాత్రమే శరణు జొచ్చెదరో; తే = వారు; ఏతాం మాయాం = ఈ మాయను; తరంతి = తరించెదరు. మాయ యొక్క సమ్మోహమునందు తగుల్కొన్న మానవుడు ఆ మాయ లోపల దానిని తరించే మార్గమును వెదుకుతున్నామంటూ, వారు ఆ మాయా సమ్మోహములో మాత్రమే మిగిలియుందురు. వారు నన్ను మాత్రమే అన్వేషించవలెను.

సర్వ ధర్మములను (మరియు అధర్మమును) పూర్తిగా పరిత్యజించి, నీవు నన్ను మాత్రమే శరణు జొచ్చుము (సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ, 18-66) అని శ్రీకృష్ణ భగవానుడు తరువాత చెప్పబోతాడు. ఆ సత్యమును మనసులో నిడుకొని శ్రీకృష్ణుడిచట 'మాం ఏవ యే ప్రపద్యంతే (ఎవరైతే నన్ను మాత్రమే శరణుజొచ్చెదరో)' అని చెప్పుచున్నాడు. శ్రీ శంకరులు వెనువెంటనే 'స్వాత్మభూతం (తన స్వరూపభూతుడైన), సర్వాత్మనా (సర్వుల ఆత్మ రూపముగా)' అను పదములను జతచేసిరి. మానవుడు తన ఆత్మ యగు నన్ను సర్వప్రాణుల ఆత్మగా గుర్తించుము. ఈ మాయకు ఆశ్రయమైన ఈశ్వరుడు సాధకుని ఆత్మ కంటె వేరుగా లేడు. మరియు ఈ ఆత్మ మాయ నుండి, దాని కార్యముల నుండి, గుణ వికారముల నుండి పూర్తిగా విముక్తమై యున్నది. ఈ ఆత్మను శరణు జొచ్చినవారు మాత్రమే మాయను తరించెదరు.

శ్రీ శంకరులు ప్రయోగించిన 'సర్వాత్మనా' అను పదమునకు 'పరమాత్మను తమ సర్వస్వమును ఒడ్డి అంకిత హృదయముతో అన్వేషించువారు' అని కూడ అర్థమును చెప్పవచ్చును. వీరికి విచారము నందు, మరియు వస్తువు (బ్రహ్మన్) నందు ప్రేమ గలదు. వీరు ఈ జ్ఞానమునకు పూర్ణముగా అంకితమగుదురు. కావున 'సర్వాత్మనా' యను పదము ఈ అన్వేషణ యందు భావాత్మక బద్ధత గల వ్యక్తిని నిర్దేశించును. ఇట్టి వ్యక్తులు మాత్రమే ఈ మాయను తరించెదరు. శ్రీ శంకరులు ఈ మాయను 'మోహినీ' అని వర్ణించిరి.

మాయా – మోహినీ

మోహిని యనగా మనలను ఆకర్షించి, మోహింపజేసి, మన లక్ష్యము నుండి దూరముగా తీసుకువెళ్లిపోయేది అని అర్థము. ఒకప్పుడు విష్ణుభగవానుడు అందమైన అమ్మాయి రూపము (మోహినీ) తో ప్రత్యక్షమయ్యెను. ఒక అసురుడు శివభగవానుని కొరకు తపస్సు చేసెను. ముందు వెనుకల చూడకుండా వరముల నిచ్చుట శివునకు అలవాటు. అయనను సంతోషపెట్టుట చాల తేలిక. కావుననే అయనకు అశుతోష (అశు = శీఘ్రముగా; తోష = సంతసించువాడు) అని పేరు. అసురుని తపస్సునకు మెచ్చి శివుడు ప్రత్యక్షమై వరమును కోరుకొమ్మనెను. మనకు ఇష్టముగా నుండే కోర్కెల యందు అసురులకు రుచి ఉండదు గదా! నేను ఎవరిని స్పృశిస్తే వారు భస్మము కావాలని అతడు వరమును కోరెను. శివుడు తథాస్తు అనెను. ఆ వరమును పొంది అతడు భస్మాసురుడాయెను. శివుడు అశుతోషి, భక్తవత్సలుడు గదా! భక్తుడు ఏది కావాలంటే, దానిని ఇస్తాడు. తథాస్తు అనగా 'నీవు కోరినది నీకు లభించును. నీవు ఎవరిని స్పృశిస్తే, వారు భస్మమైపోతారు' అని యర్థము. ఈ వరమును పరీక్షించవలెనని భస్మాసురునకు కోరిక పుట్టెను. 'ఓ శివా! నీవు నన్ను మోసగిస్తున్నావేమో! నేనీ వరమును నీపై ప్రయోగించి, పరీక్షిస్తాను. నా చేతిని నీ తలపై పెడతాను' అని అతడు పలికెను. శివుడు ప్రాణభయముతో పరుగిడెను. అయన పరుగెత్తి పరుగెత్తి విష్ణుభగవానుని వద్దకు చేరెను. విష్ణువు జగద్రక్షకుడు. అయన మోహినీ (దివ్యసుందరి) రూపముతో అసురుని ముందు ప్రత్యక్షమయ్యెను. మోహిని తన హావభావముల నన్నిటినీ ప్రదర్శించెను. విష్ణుభగవానుడు తన మాయా ప్రభావముచే ఈ మోహినీ రూపమును ధరించి మూర్తీభవించిన శృంగారమా యన్నట్లుండెను. అసురుడు ఆమెను చూచినవెంటనే తాను వెదుకుతున్న శివుని గురించి విస్మరించెను. అతని మస్తిష్కములో శివుడు మాయమై మోహిని ప్రవేశించెను. అతడు మోహిని వెంట పోదొడంగెను.

'నీవు అసురుడవు. నేను దివ్యసుందరిని. కాన, నీవు గాయత్రిని జపించనిదే, నన్ను స్పృశించ లేవు' అని మోహిని చెప్పెను. నేను గాయత్రిని జపించి, నిన్ను స్పృశించెదనని అతడు

పలికెను. కాని, గాయత్రిని జపించుటకు ముందు భక్తుడు తన తలపై చేతిని ఉంచుకొని, 'ప్రణవస్య' అని పలుకవలెను. ఆ అసురుడు అట్లు చేయగానే, భస్మీభూతుడాయెను. భస్మాసురుడు అను అతని నామము సార్థకమాయెను.

విష్ణు భగవానుడు ఇట్టి అనేక సందర్భములలో మోహినీ రూపమును ధరించెను. కావున, ఈ మాయ సర్వభూతమోహిని (సర్వప్రాణులను మోహింపచేయునది). దీనికి ఎవ్వరూ అపవాదము కాదు. మాయ వ్యక్తిని ఆకర్షించి సమ్మోహితుని చేయుటచే, అతడు సర్వమును విస్మరించును. ఈ మోహిని అధికారము, ధనము ఇత్యాది అనేక రూపములలో మనలను ఆకట్టుకొనును. ఈ మాయ సర్వులను తనవైపునకు ఆకర్షించుకొని, వారు దానిని తరించునంతవరకు వారిని తన సమ్మోహనములో కట్టివేయును.

మానవుడు మాయను తరించు ఉపాయమేది? శ్రీకృష్ణ భగవానుడిట్లు చెప్పుచున్నాడు. 'నేను మాయకు అతీతుడను. వాస్తవంలో నేను నిత్యముక్తుడను. నన్ను మాత్రమే శరణు జొచ్చినచో, మాయను తరించవచ్చును. నన్ను శరణు జొచ్చు వారికి క్లేశము ఏమియూ లేదు. ఏలయన, నేను సర్వప్రాణులలో ఆత్మ రూపుడుగ ప్రతిష్ఠితుడనై యున్నాను'. మాం ఏవ యే ప్రపద్యంతే మాయాం ఏతాం తరంతి తే.

భక్తులు ఈ శ్లోకములన్నిటినీ పరమోత్సాహముతో పఠిస్తారు. భక్తిలో సమస్య లేదు. కాని ఆ భక్తి నుండి తత్త్వ శాస్త్రమును నిర్మింపజూస్తే, అపుడు సమస్య ఉత్పన్నమగును. ఈ శ్లోకమును వ్యాఖ్యానించిన కొందరు భక్తులు 'మాం ఏవ = శ్రీకృష్ణుని మాత్రమే' అని వ్రాసిరి. కలి సంతరణోపనిషత్ అనే ఒక చిన్ని ఉపనిషత్తులో హరే రామ హరే కృష్ణ మంత్రము ప్రస్తావింపబడినది. ఈ కలియుగములో పాపములను పోగొట్టుటకు హరినామము చాలని చెప్పే ఒక ప్రసిద్ధమైన శ్లోకము గలదు★. ఈ ఉపనిషత్తు వేదము లోనిదా, లేక అర్వాచీనమా అను సంగతి మనకు తెలియదు. కాని, ఇది 108 ఉపనిషత్తులలో పరిగణింపబడును. దీని యందు ఒక మంత్రము గలదు.

హరే రామ హరే రామ రామ రామ హరే హరే
హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే

★ కలి కల్మష చిత్తానాం పాపద్రవ్యోప జీవినామ్
విధి క్రియా విహీనానాం హరినామైవ కేవలమ్.

దీని యందు ముందుగా శ్రీరాముడు తరువాత శ్రీకృష్ణుడు పిలువబడినాడు. హరే కృష్ణ సంప్రదాయమునకు చెందిన భక్తుడు ముందుగా శ్రీరాముని పిలువడు. అతడు ముందుగా హరే కృష్ణ యని, ఆపై హరే రామ యనును. అతని దృష్టిలో రాముని కంటె కృష్ణుడు గొప్పవాడు. శ్రీకృష్ణ భగవానుడు 'మాం ఏవ = శ్రీకృష్ణం ఏవ' అని చెప్పినాడు గనుక, మనము శ్రీకృష్ణుని మాత్రమే పూజించాలి అని అతని విశ్వాసము. శ్రీకృష్ణుని మాత్రమే పూజించినచో, అయన నిన్ను మాయకు దూరముగా తన వైకుంఠ ధామమునకు గొనిపోవును. కాని, సమస్య ఏమంటే, వైకుంఠము కూడా మాయాంతర్గతమే.

ప్రపత్తి

విష్ణువును పూర్ణముగా శరణు జొచ్చుటయే మాయను తరించే ఏకైక ఉపాయమని భగవానుడీ శ్లోకములో ఉపదేశించుచున్నాడని మరియొక భక్తి సంప్రదాయమునకు చెందిన వారు చెప్పెదరు. దీనికి వారు ధార్మిక అనుష్ఠాన రూపమును కల్పించి, ప్రపత్తి అని పేరిడినారు. ఈ అనుష్ఠానములో భాగముగా వారు ఒక చేతిపై కాల్చిన శంఖముతో, మరియొక చేతిపై కాల్చిన చక్రముతో ముద్రలను వేసుకుంటారు. ఒక చేతిలో శంఖమును, మరియొక చేతిలో చక్రమును ధరించే విష్ణువును శరణు జొచ్చుటకు ఈ ముద్రలు ప్రతీక యని వారు భావిస్తారు. ఈ విధమగు ప్రతీకల వలన సమస్య లేదు. శంఖము సందేశమునకు చిహ్నము. చక్రము అజ్ఞాన నాశనమునకు ప్రతీక. బహుశః ఈ ప్రతీకలు 'నీవు నా వేదరూపమగు ఆజ్ఞను పాలించినచో, నా చక్రము నీ దుఃఖమును, అజ్ఞానమును పోగొట్టి సంసారము నుండి విముక్తుని చేయును' అను భగవానుని ఉపదేశమును సూచించవచ్చును.

కాని వైదిక సంప్రదాయములో వ్యక్తి తన దేహమును గాని, ఇతరుల దేహమును గాని హింసించుట దోషము. కాల్చుట విశేషించి పాపకార్యమని భావింపబడినది. కాని కొందరు భక్తులు 'హే భగవన్! నేను నిన్ను మాత్రమే శరణు జొచ్చితిని. నేను నా దేహమును, నా మనస్సును, ఇంద్రియములను, సర్వమును నీకు సమర్పించుచున్నాను' అనే భావనతో ఈ కార్యమును అనుష్ఠిస్తారు. ఇది చాల మధురమగు భావన. కాని ఒక సమస్య గలదు. భగవానునకు ఆత్మ సమర్పణను ఎట్లు చేయవలెను? దేహము, ఇంద్రియములు, మనస్సు భగవత్స్వరూపములై యుండగా, వాటిని భగవానునకు సమర్పించుట ఎట్లు పొసగును? మరియు మానవుని స్థూలదేహము, మనస్సు, మరియు ఇతర సర్వ కార్యములు మాయ నుండి పుట్టినవి. సమర్పణ చేసే ఆత్మ కూడా కార్యమే

అయినచో, ఇట్టి ఆత్మ సమర్పణ వలన మాయను తరించుట ఎట్లు సంభవమగును? ఈ పద్ధతిలో వ్యక్తి మాయకు అధీనుడుగనే ఉండును.

ప్రపత్తి ధర్మములో ఆత్మ సమర్పణ మాత్రమే మాయాతరణములో ఉపాయమని భావింపబడును. 'మాం ఏవ ప్రపద్యంతే' అని భగవానుడు ఈ ధర్మమును ఉపదేశించినాడని వారు భావింతురు. మాం అనగా విష్ణువు. శ్రీకృష్ణుడు విష్ణువే. విష్ణువును మాత్రమే పూజించవలె ననియు, శివాది ఇతర దేవతల నారాధించరాదనియు ఏవ పదము నిర్దేశించును. మరియు, భక్తి ద్యోతకములగు పూజాది సరళకార్యముల వలన పనికాదు. పూర్ణ ఆత్మ సమర్పణను చేయాలి. యే ప్రపద్యంతే అనగా ఇట్టి ప్రపత్తి (ఆత్మ సమర్పణ)ని చేయువారని యర్థము.

ఈ ప్రపత్తిలో మరియొక సమస్య గలదు. శ్రీకృష్ణ భగవానుడు యే మాం ప్రపద్యంతే అని చెప్పినాడు. మాం ఈశ్వరుని, యే జీవులను నిర్దేశించును. భక్తులు విష్ణుభగవానుని ఉద్దేశించి ఈ ప్రపత్తి కర్మను అనుష్ఠించవలెను. కావున, దీనిలో కర్తృ కర్మ భేదము, మరియు జీవేశ్వర భేదము అనే ద్వైతము గలదు. జీవేశ్వర భేదమును అంగీకరించినచో, మోక్షమును త్రోసిపుచ్చినట్లే యగును. ఏలయన, ద్వైతము సత్యమైనచో మోక్ష ప్రసక్తియే సంభవము కాదు.

హరిః ఓం తత్సత్

ప్రపత్తిని గాని, లేక ఇతర ఆరాధనా పద్ధతులను గాని తక్కువ చేయుట నా అభిప్రాయము కాదు. అనంతముగా ఉన్న ఇట్టి విరూపిత (distorted) వ్యాఖ్యానములలో కొన్నిటిని చూపి, మోక్షమును గురించి సరియగు అవగాహన యొక్క ప్రాముఖ్యమును నిరూపించుట మాత్రమే నా అభిమతము.

భాసించే ద్వైతము లీనమగును

'యే మాం ప్రపద్యంతే' అనే భగవానుని వచనములో ద్వైతము కన్పట్టుచున్నది. కాని మనము ప్రకరణమును పరిశీలించి భగవానుని తాత్పర్యమును తెలియాలి. నేను నీకు యథార్థమగు జ్ఞానమును, మరియు ఆ జ్ఞానము వెంటనే సాక్షాత్కరించు విధమును నిశ్శేషముగా బోధించెదను (జ్ఞానం తే అహం స విజ్ఞానం ఇదం వక్ష్యామి అశేషతః) అని భగవానుడు అధ్యాయారంభములో చెప్పియున్నాడు.

నా భక్తులు ఎందరో గలరు. ఆర్తులు నన్ను ఎలుగెత్తి ప్రార్థిస్తారు. సంపదలను కోరువారు కూడ నన్ను ప్రార్థిస్తారు. మరియు, నన్ను తెలియగోరువారు నన్ను భక్తితో పూజించుట సహజమే గదా! నన్ను యెరింగిన జ్ఞానులు కూడా నా భక్తులే. వీరందరూ నా భక్తులే. కాని జ్ఞాని నా కంటె ఎంత మాత్రమూ వేరు గాదని తెలియుము. జ్ఞాని నా స్వరూపమే. 'జ్ఞానీ తు ఆత్మైవ మే మతమ్' అని భగవానుడు తరువాత (18వ శ్లోకములో) చెప్పబోవుచున్నాడు. కావున, భగవానుడు ఉపదేశిస్తానని వాగ్దానము చేసిన యీ జ్ఞానము జీవేశ్వర భేదమును ఉపమర్దము చేయును.

నేను సర్వప్రాణులలో ఆత్మరూపుడనై ప్రవేశించినాను. కాన, సర్వ ప్రాణుల ఆత్మను నేనే (సర్వస్య చాహం హృది సన్నివిష్టః, 15-15) అని కూడా భగవానుడు స్పష్టము చేయబోవుచున్నాడు. కుండ పుట్టుచుండగా దానిలోనికి ఆకాశము ప్రవేశించినట్లు భాసించును. అటులనే సర్వమును సృష్టించిన ఆత్మ సర్వములోనికి ప్రవేశించినట్లు కన్పట్టును. కాని, ఆత్మ అజము, నిర్వికారము, సర్వాధిష్ఠానము. శాస్త్రములో ఎక్కడనూ జీవుడు సృష్టించబడినాడని చెప్పబడలేదు. ఇది తెలియదగిన ప్రముఖమైన విషయము. స్థూలదేహము, మనస్సు, ఇంద్రియములు ఇత్యాది సర్వము పంచభూతముల సమావేశముచే సృష్టింపబడినవి. కాని జీవుడు ఏనాడూ సృష్టింపబడలేదు. జీవుని స్వరూపము ఆత్మ. నిష్క్రియమగు ఆత్మయే సర్వప్రాణుల ఆత్మయై ఉన్నది. సృష్టి అయిన తరువాత ఆత్మ సర్వప్రాణులలో అహంరూపములో ఏకరూపముగ నుండును. ఈ అహం (ఆత్మ) త్రిగుణములకు అతీతమైనది.

మనమీ మూడు గుణములకు అతీతము కావాలి. ఎట్లు? విష్ణుభగవానుడు గుణాతీతుడు. ఆయన వశములో గుణము లుండును. కావుననే, సర్వ స్వరూపుడనగు నన్ను మాత్రమే శరణు జొచ్చువారు (మామేవ యే ప్రపద్యంతే) విముక్తిని పొందెదరని శ్రీకృష్ణ భగవానుడిచట చెప్పుచున్నాడు.

అట్లైనచో, మానవులందరూ నిన్నే ఏల పొందుట లేదు? అని శ్రీ శంకరులు తరువాతి శ్లోకమును ఉపక్రమించిరి. శ్రీకృష్ణ భగవానుడు తరువాతి శ్లోకములో ఉత్తరము నిచ్చుచున్నాడు:

అధ్యాయము 7, శ్లోకము 15:

न मां दुष्कृतिनो मूढाः प्रपद्यन्ते नराधमाः ।
माययापहृतज्ञाना आसुरं भावमाश्रिताः ॥ १५ ॥

న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యంతే నరాధమాః
మాయయాప హృత జ్ఞానా ఆసురం భావమాశ్రితాః (15)

దుష్కృతినః = పాపకార్యములనుచేయునట్టియు; మూఢాః = వ్యామోహితులైనట్టియు; మాయయా = మాయచే; అపహృత జ్ఞానాః = అపహరింపబడిన వివేకము కలిగినట్టియు; ఆసురం = ఇంద్రియ భోగలాలసతో గూడిన; భావం = స్థితిని; ఆశ్రితాః = ఆశ్రయించి ఉన్న; నరాధమాః = నీచమానవులు; మాం = నన్ను; న ప్రపద్యంతే = పొందగోరరు.

పాపకార్యములను చేయువారు, వ్యామోహితులు, మాయచే అపహరింపబడిన వివేకము కలిగిన వారు, ఇంద్రియ భోగలాలసతతో నిండిన జీవితమును గడుపువారు అగు మానవాధములు నన్ను శరణు పొందరు (15).

ఈశ్వరుని ఏ మాత్రమూ భజించని వ్యక్తులు ఎవ్వరు?

నన్ను భజించినవారు మాయను తరించ గల్గుదురు. కాని వీరు నన్ను శరణు జొచ్చరు (మాం న ప్రపద్యంతే). ఎందువలన? ఏల యనగా, వారు మూఢాః, దుష్కృతినః, నరాధమాః మరియు మాయయా అపహృత జ్ఞానాః. ఇంతకు మించి చెప్పుట సాధ్యము కాదు. శ్రీకృష్ణ భగవానుడు ఈ గుణముల నన్నిటిని ఒక్కచోటకు చేర్చినాడు. ఒక్కమాటలో చెప్పాలంటే, వారు

తమకు హితము కాని కర్మలలో ఆసక్తిని కలిగియున్నారు(ఆసురం భావమాశ్రితాః). ఈ పదములను మనము విడివిడిగా పరిశీలిద్దాము.

ఈ జన్మలో గాని, పూర్వ జన్మలలో గాని పాపకర్మలను చేసినవారు దుష్కృతినః అనబడుదురు. దుష్కృతినః అనగా వారింకనూ పాపములను చేస్తూనే ఉన్నారు అనే అర్థము కూడ వచ్చును.

మూఢాః. వారు ఇట్లు చేయుటకు కారణమేమి? వారు మోహితులు (మూఢాః) గనుక. సరళంగా చెప్పాలంటే, వారు ప్రాధమికతల (priorities) విషయంలో సంభ్రాంతులై ఉన్నారు. ఏది ఖచ్చితంగా ముఖ్యమైనది, ఏది కాదు అనే విషయము వారికి స్పష్టముగా తెలియదు. దీని ఫలితంగా, వారి దృష్టిలో సాధ్యము యొక్క ప్రాముఖ్యము అధికముగా పెరిగి, వారు సాధనముల యోగ్యతను గురించి పరిగణించరు. ఆధ్యాత్మిక దురాగ్రహపరులు (religious fanatics) కూడా సాధ్యము మిక్కిలి ప్రముఖమని భావించి సాధనముల విషయంలో రాజీపడెదరు. ఇది చాల దురదృష్టకరమైన విషయము. ఇట్టివారు కూడా మూఢులనబడెదరు. దేనిని చేయాలి (కార్యం), దేనిని చేయకూడదు (అకార్యం) అను విషయములో వారు మోహితులై యుందురు. ఈ కారణంగా, వారు పూర్వము పాపములను చేయుటయే గాక, ఇప్పుడు కూడా మాయాసమ్మోహితులై పాపకార్యములను కొనసాగించెదరు. వీరు దుష్కృతినః అనబడుదురు.

నరాధమాః. మానవులలో ఉత్తములు (ఉత్కృష్టాః), అధములు, వారి మధ్యలో మధ్యములు అను మూడు రకములు గలవని శ్రీ శంకరులు చెప్పిరి. మానవుని ఆలోచనలో దోషముండుటచే నీచ ప్రవృత్తికి పాల్పడును. తత్త్వతః ఎవ్వరూ పాపులు గారు. కాని, అజ్ఞానము చేత, అవివేకము చేత మానవులు తప్పుగా ప్రవర్తిస్తారు. కనీసం ఈ జీవితములోనైనా మంచి కర్మలను చేసినచో, వారు మంచి వివేకబుద్ధిని పొందగల్గుదురు. కాని, ఆలోచనలలో మార్పు రానిచో, ఇది సంభవము కాదు. అంటే, ఈశ్వరుని అనుగ్రహము కలగాలి. అంటే, ఈశ్వరుని పూజించవలెను.

వారు ఇట్లు అగుటకు కారణమేమి?

మాయయా పహృత జ్ఞానాః. మాయ వారి వివేకమును హరించివేసినది. మాయయా= ఏ మాయను వారు దాటవలసి యున్నదో ఆ మాయచేత, అపహృత జ్ఞానాః = వివేకమును గోల్పోయినవారు. అజ్ఞానము, దాని నుండి పుట్టిన రాగద్వేషాదులు మాయ అనబడునని మనము

చూచియున్నాము. మాయ మనలను ప్రలోభపెట్టి వలలో వేసుకొనును. ఈ మాయ మానవుని జ్ఞాననిధిని కొల్లగొట్టును. ఇచట జ్ఞానమనగా వివేకము. హేతుబద్ధమైన వివేకశక్తి మనకు గల నిధి. ఈ నిధి మానవులకు మాత్రమే ఈయబడినది. ఈ నిధిని మాయ కొల్లగొట్టినచో, వ్యక్తి ఆసురస్థితికి పూర్తిగా వశుడగును (ఆసురం భావమాశ్రితాః).

ఆసురుడనగా ఎవరు?

ఆ సురం భావమాశ్రితాః. సురుడు అనగా ఆత్మ యందు, లేక ధర్మప్రాప్తములగు విషయముల యందు రమించువాడని యర్థము. దీనికి వ్యతిరేకము అసురుడు. అసుషు రమతే ఇతి అసురః. మద్యము, మగువ, గుర్రపు పందెములు, క్లబ్బులలో నాట్యములు ఇత్యాది ఇంద్రియభోగముల యందు మాత్రమే రమించువాడు అసురుడు. శ్రీ శంకరులు 'హింసానృతాది లక్షణం ఆసురం భావమ్' అని వ్యాఖ్యానించిరి. ధనము, భోగము ఇత్యాదుల కొరకు ఇతరులకు హానిచేయుట హింస యనబడును. అనృతమనగా అసత్యము. చౌర్యము ఇత్యాది ఇతర అధర్మ కార్యములు, తప్పుడు విలువలు (false values) అది శబ్దముచే గ్రహింపబడును. అసురుని మానసిక లక్షణములు, జీవనశైలి వీటితో నిండియుండును (ఆసురం భావమ్). ఇట్టి విధముగా జీవించువారికి నాతో అక్కర లేకపోవుట సహజమే. భోగముల చేత, అధర్మ విలువలచేత కొల్లగొట్టబడిన వివేకము గల మానవులు అసురజీవనమును ఆశ్రయించెదరు (ఆసురం భావం ఆశ్రితాః). వారు నా దరిదాపులకు రారు. వారు నన్ను కలలోనైనా స్మరించరు. వారి జీవితములో భగవానునకు ప్రవేశము లేదు.

బాగుపడే ఆశ లేదనిపించే ఈ పరిస్థితి నుండి బయటపడుటకు మానవుడు అద్వైతాత్మ సాక్షాత్కారము వరకు పోవలసిలేదు. ఈశ్వరుడు ఉన్నాడని గుర్తించిన చాలునని శ్రీకృష్ణుడు తరువాతి శ్లోకములో చెప్పనున్నాడు. వ్యక్తిలో భక్తి, ఒక విశిష్ట మానసిక ప్రవృత్తి నిర్మాణము కాగానే, అతని జీవితములో మార్పులు చిన్నగా ఆరంభమగును. భక్తిభావన, ఏదో ఒక రూపములో ఈశ్వరుని ఉపాసించుట అను లక్షణములు ఉన్నప్పుడు మాత్రమే ఈ మార్పులు వచ్చును. దీని వలన హృదయములో యథార్థమగు పరివర్తనము వచ్చుటకు దారి సుగమమగును.

కావున, బాగుపడే ఆశ లేదనుకోరాదు. ఆశ గలదు. శ్రీకృష్ణుడీ విషయమును తరువాతి శ్లోకములో వివరించును. మంచి కర్మలనుచేస్తూ శుద్ధ భావనలు కలిగి జీవించే సుకృతుల గురించి అయన ఈ శ్లోకముతో మొదలిడి అధ్యాయాంతము వరకు వర్ణించగలడు. కష్టములలో మాత్రమే

భగవంతుని ప్రార్థించువారికి కూడ ఆశ గలదు. కష్టము వచ్చు వరకు వారు నా గురించి కలలోనైనా స్మరించకపోవచ్చును. కాని, వారు కనీసము కష్టములలోనైనా నన్ను తలపోయుదురు. కష్టములలో నైననూ నన్ను స్మరించని వారెందరో గలరు. నన్ను కష్టములలో మాత్రమే స్మరించువారి యందైననూ ఒక మార్పు, పరివర్తన కలుగును. జీవితములోనికి ఒకసారి ఈశ్వరుడు ప్రవేశిస్తే, ఆపైన మార్పులు ఆరంభమగును.

అధ్యాయము 7, శ్లోకము 16:

चतुर्विधा भजन्ते मां जनास्सुकृतिनोऽर्जुन ।
आर्तो जिज्ञासुरर्थार्थी ज्ञानी च भरतर्षभ ॥ १६ ॥

చతుర్విధా భజంతే మాం జనా స్సుకృతినోర్జున
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ (16)

అర్జున = ఓ అర్జునా!; చతుర్విధాః = నాల్గు విధముల; సుకృతి నః = పుణ్యాత్ములగు; జనాః = జనులు; మాం = నన్ను; భజంతే = సేవించుచున్నారు; భరతర్షభ = భరత వంశములో శ్రేష్ఠమైనవాడా!; ఆర్తః = ఆపన్నుడు; జిజ్ఞాసుః = జ్ఞానము నందిచ్ఛ గలవాడు; అర్థార్థీ = భద్రతను సుఖమును కోరువాడు; చ = మరియు; జ్ఞానీ = జ్ఞాని.

భరతవంశములో శ్రేష్ఠుడవగు ఓ అర్జునా! ఆపన్నుడు, జ్ఞానము నందిచ్ఛ గలవాడు, భద్రతను సుఖమును కోరువాడు మరియు జ్ఞాని అనే నాల్గువిధముల పుణ్యాత్ములగు జనులు నన్ను సేవించెదరు (16).

సుకృతినః జనాః. నన్ను ఆరాధించని వ్యక్తులకు (దుష్కృతినః) భిన్నముగా పూర్వజన్మలలో, మరియు ఈ జన్మలో మంచి పనులను చేయువారిని గురించి శ్రీకృష్ణ భగవానుడీ శ్లోకములో చెప్పుచున్నాడు. వారు నన్ను భజించెదరు (భజంతే మామ్). వారుచేసిన మంచి కర్మల వలన కలిగిన పుణ్య ప్రభావముచే వారు నన్ను ఆరాధించుచున్నారు.

పుణ్యము ద్వివిధము

పుణ్యము రెండు రకములుగా నున్నది. ఒక పుణ్యము వలన సంపద, భోగములు, సుఖము, పద్వంశము ఇత్యాదులు లభించును. వీటికి వ్యక్తి యొక్క సంస్కారముతో గాని, అంతరంగ

పరిణతితో గాని సంబంధము లేదు. మరియొక పుణ్యము గలదు. అది పూర్తిగా ఆధ్యాత్మికతకు చెందినది. మనిషి పుట్టిన వంశము ఏదైనా, ఈ పుణ్యము తన ఫలమును ఇచ్చును. ఇట్టి పుణ్యము గల వ్యక్తి పుట్టి పెరిగిన వాతావరణము అనుకూలము కాకపోయినా, అతడు నిరుత్సాహమును చెందకుండగా ఈశ్వరభజనను కొనసాగించును. ఇట్టి పుణ్యము గల సుకృతులు (సుకృతినః) నన్ను ఆరాధించెదరు (మాం భజన్తే). వారు నన్ను గుర్తించెదరు.

భక్తులు నాల్గు రకములు

చతుర్విధా భజంతే మామ్. ఈశ్వరుని గుర్తించి ఆరాధించే సుకృతులలో నాల్గు రకములు (చతుర్విధాః) గలరు. 'విధా' అనగా రకము అని యర్థము. వీరందరు ఈశ్వరుని కొంత వరకు గుర్తెరిగి భక్తులైన వారే. అయిననూ, వారిలో తారతమ్యము గలదు. వారు ఏ స్థాయి వరకు ఈశ్వరుని గుర్తింపగల్గినారు? వారి మానసిక ప్రవృత్తి, జీవనరీతి ఎట్టివి? వారి ప్రార్థనలు ఎట్టివి? ఇత్యాది అంశములు ఈ నాల్గు విధములను నిర్ణయించును. 'ఆర్తః జిజ్ఞాసుః అర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ' అని భగవానుడు నాల్గు విధముల వారిని నిర్దేశించెను.

ఆర్తః

ఆర్తి యనగా దుఃఖము, విపత్తి, కష్టము, మానసిక వ్యథ ఇత్యాదులు. చోరుడు, వ్యాఘ్రము, రోగము ఇత్యాదుల వలన కలిగే విపత్తునకు గురియైన వ్యక్తి ఆర్తుడనబడును. పూర్వకాలంలో భారతదేశమంతటా అడవులు ఉండెడివి. కావుననే, శ్రీ శంకరులు తరుచుగా వ్యాఘ్ర దృష్టాంతమును ఇచ్చిరి. మానవునకు విపత్తు వచ్చినప్పుడు, ఆఖరుగా ఎవరిని శరణు పొందుతాడు? అతడు కొంత పుణ్యమును చేసుకున్నవాడైతే, అతని జీవితములో ఈశ్వరునకు స్థానము ఉండును. కనుక, అతడు ఈశ్వరుని శరణుజొచ్చును. అతడు అంతవరకు భగవానుని స్మరించడు. కాని, కనీసం విపత్తు వచ్చినప్పుడైనా అతడు భగవంతుని స్మరించును. తనకు సహాయము చేయువారు మరెవ్వరూ అతనికి కానరాలేదు. ఇట్లు విపత్తు వచ్చినప్పుడు ఈశ్వరుని శరణు పొందే భక్తునకు ఆర్తభక్తుడని పేరు.

అర్థార్థీ

మనచే కోరబడే వస్తువు అర్థమనబడును. ప్రస్తుత సందర్భములో సంపద, అధికారము, సంతానము ఇత్యాదులు అర్థమనబడును. మానవుడు వీటినన్నిటినీ కోరును. అర్థార్థి వీటిని

పొందుటకై భగవానుని అనుగ్రహమును ప్రార్థించును. ఇవి లేనిదే తన జీవితము సుఖమయము కావాలదనే ధారణ ఉండుటచే, మానవుడు వాటిని పొందుటకు వివిధోపాయముల నవలంబించును. అతడు తన పరువు ప్రతిష్ఠలు, ధనము ఇత్యాదులకు తోడుగా భగవానుని కూడ ఆశ్రయించును. ఏలయనగా, తన అధీనములో లేని ఒక అంశము సర్వత్ర గలదని అతడు గుర్తించును. భక్తుడగు అతనికి అదృష్టము (దైవము) అనే అంశమును గుర్తించగలిగే పరిణతి గలదు. ఈ అదృష్టాంశమే దైవమని యాతడు గుర్తించును. ఈశ్వరుని అనుగ్రహము తక్క ఈ అదృష్టాంశమును నియంత్రించగలిగే ఉపాయము మరియొకటి లేదు. కావున భక్తుడు ఏదేని కార్యమును తలపెట్టినప్పుడు, అతని నియంత్రణలో లేనివి, మరియు అతనికి తెలియనివి అగు అంశములను అనుకూలముగా మలచుకొనుటకై ఈశ్వరుని కృపకొరకు ప్రార్థించును. తాను కోరే వస్తువులను పొందుటలో ఈశ్వరుని కృప సహకరించుననే భావనతో భక్తుడు కొన్ని పూజలను చేయును. సంసారాంతర్గతముగా నుండే ఒక లక్ష్యమును పొందాలనే కోరికతో భక్తుడు చేసే పూజాది కర్మకు కామ్యకర్మ యని పేరు. కామ్య కర్మలను చేయు భక్తుడు అర్థార్థి యగును. మరియు అతడు ఆర్త భక్తుడు కూడా. అతడు విపత్తు వచ్చినప్పుడు భగవంతుని ప్రార్థించుట సహజమే. కాని విపత్తులో మాత్రమే భగవానుని స్మరించే ఆర్తుడు అర్థార్థి కాడు.

జిజ్ఞాసుః

మూడవ వాడు జిజ్ఞాసువు. శ్లోకములోని ఆర్తః, జిజ్ఞాసుః, అర్థార్థీ అను వరుస ఛందస్సు కొరకు మాత్రమే. వాటి తాత్పర్యము దృష్ట్యా ఆర్తః, అర్థార్థీ ఒక వర్గము. జిజ్ఞాసుః, జ్ఞానీ రెండవ వర్గము. జిజ్ఞాసువు అనగా తెలియగోరువాడు. అతడు తెలియగోరునది యేది? ఇది చాల ప్రముఖమైన విషయము. ఏలయన పాపకర్మలను చేయువారు (దుష్కృతినః) కూడా అనేక విషయములను తెలియగోరెదరు. కాని ఇచటి విషయవస్తువు ఈశ్వరుడు, ఈశ్వరతత్త్వము. జిజ్ఞాసువు ఈశ్వరుని కృపను ప్రార్థించేది చిన్న చిన్న లౌకిక ప్రయోజనముల కొరకు కాదు. సర్వ కారణ కారణమైన ఈశ్వరతత్త్వము నాతడు తెలియగోరును. జిజ్ఞాసువు గొప్ప భక్తుడు. అతడు భగవానుని తన చిన్న చిన్న కోరికలను తీర్చుకునే ఆసరాగా వాడుకొనడు. అతడు ఈశ్వరుని స్వరూపమును తెలియగోరును. భక్తుడగు నాతడు దీనికొరకై ఈశ్వరుని కృపను అర్థించును. అతడు ప్రార్థనలను చేయును. నిత్యనైమిత్తిక కర్మల ననుష్ఠించును. వీటిని అనుష్ఠించుటలో అతనికి స్పష్టమగు ఉద్దేశ్యము గలదు. అది యేదనగా, అంతఃకరణ శుద్ధిని పొంది, ఈశ్వర సాక్షాత్కారమును పొందుట.

ఈశ్వరజ్ఞానము ఆత్మ జ్ఞానము కంటె భిన్నము కాదు. సర్వ జగత్కారణుడగు ఈశ్వరుడు జీవతత్త్వము కంటె వేరు గాదు. ఈశ్వరుడు ఆత్మ కంటె భిన్నమైనచో, అనాత్మ యగును. అనాత్మ యనగా జడమని యర్థము. ఒకే ఒక చైతన్య ఘనమగు తత్త్వము గలదు. అదియే ఆత్మ. ఈశ్వరుడు ఆత్మ కంటె వేరు గాదు.

జీవేశ్వరుల మధ్య భాసించే ఈ భేదమునకు హేతువు ఉపాధి యని మనము చూచియున్నాము. ఒకే ఒక సత్యము గలదు. జిజ్ఞాసువు ఆ సత్యమును ఎరుంగగోరును. అతడు ఈశ్వరుని సాహాయ్యమును గోరే భక్తుడు గనుక, అట్టి సాహాయ్యమును సంపాదించుటకై ఈశ్వరుని ప్రార్థించి ఆరాధించును. సంసారాంతర్గతములైన పరిచ్ఛిన్న ఫలముల నాశించి అతడు కర్మల (కామ్యకర్మల) నాచరించడు. ఆర్తుడు కామి. అర్థార్థి కూడ కామి. కాన, వారి కర్మలు కామ్యకర్మలు. కాని, జిజ్ఞాసువు కర్మయోగి. కావున, పుణ్యాత్ముడగుటచే వివేకవంతుడై, దాని కారణంగా జిజ్ఞాసువు అయినాడు.

జ్ఞాని

నాల్గవ రకమునకు చెందిన మరియొక భక్తుడు గలడు. ఈ నల్గురు నన్ను గుర్తించిన వారే. వారు నన్ను ఏ స్థాయి వరకు గుర్తించగల్గినారో, ఆ స్థాయి వరకు నాలో ఐక్యమగుదురు. నాల్గవ భక్తుని గుర్తింపు పూర్ణమైనది గనుక, అతడు నాతో పూర్ణముగా ఐక్యమగును. జిజ్ఞాసువు అగు భక్తుడు నిశ్చితముగా జ్ఞానియై విష్ణు భగవానుని (పరమేశ్వరుని) ఆత్మరూపముగా దర్శించును. అతడే యథార్థమైన భక్తుడు.

జ్ఞాని భక్తికి, ఇతరుల భక్తికి గల తేడా

జ్ఞాని భక్తికి సాధ్య భక్తి యని పేరు. భక్తి ద్వివిధము. ఒకటి సాధనారూపముగా ఈశ్వరుని ఆరాధించుట (సాధనాభక్తి). జిజ్ఞాసు భక్తి ఈ కోవకు చెందినదే. కాని ఈశ్వరుని ఆత్మరూపముగా గుర్తెరింగిన జ్ఞాని యొక్క భక్తి సాధ్య భక్తి. ఇది చరితార్థమైన, పరమప్రేమ స్వరూపమగు భక్తి.

ఈ పరమప్రేమ ఎట్టిది? దీనిలో ప్రేమ యందు విషయమగు వస్తువునకు, ప్రేమించే వ్యక్తికి మధ్యలో భేదమేమియూ ఉండదు. భేదములన్నియూ ప్రేమలో అంతర్ధానమగును. పరమప్రేమ యనగా నిదియే. ఇది జ్ఞానరూపముగా మాత్రమే నుండగలదు. ఈశ్వరుడే ఆత్మ గనుక,

అభేదమును కొత్తగా సాధింపబని లేదు. అభేదము నిత్యసిద్ధము. ఈ సత్యమును దర్శించుట తక్క మరియొక మార్గము లేదు.

అనన్య భక్తి యనగా నిత్య సిద్ధమగు అభేదమును దర్శించుట. 'అనన్య' అనగా మరియొకటి లేదని యర్థము. భక్తిలో విషయమగు భగవానుడు, మరియు భక్తుడు ఒక్కటియే. ఆ భక్తి కాలాధీనము కాదు. సత్యరూపమగు ఆ భక్తికి ఇతర భక్తి విశేషములతో పోలిక లేదు. జ్ఞాని భక్తి ఇట్టిది కాదు. జ్ఞాని భక్తి పూర్ణసఫలమైన, చరితార్థమైన భక్తి. అట్లైనచో, జ్ఞానిని భక్తుడనుట యెట్లు పొసగును? భక్తుడనగా ఈశ్వరునితో సంయోగమును పొందువాడు అని యర్థము గదా! కావున, జ్ఞాని కూడ భక్తుడే. మిగిలిన ముగ్గురు కూడా ఈశ్వర సంయోగము గలవారే. కాని వారి దృష్టిలో ఈశ్వరుడు వారి కంటె భిన్నుడు, దూరముగా నుండే పరోక్షుడు. కాని, జ్ఞానికి ఈశ్వరుడు అపరోక్షుడు. భేదమింత మాత్రమే. ఇది చాల పెద్ద భేదము. ఆ ముగ్గురిలో కూడ భేదము గలదు. ఆర్తునకు, అర్థార్థికి ఈశ్వరుడు నిత్య పరోక్షుడు. కాని జిజ్ఞాసువునకు ఈశ్వరుడు తాత్కాలికముగా మాత్రమే పరోక్షుడు.

ఈశ్వరుడు సర్వజ్ఞుడు, సర్వ శక్తివంతుడు ఇత్యాది వినికిడి జ్ఞానము పరోక్షజ్ఞానమనబడును. ఇక్కడ ఒక సమస్య గలదు. మనకు గల అల్పజ్ఞానముతో సర్వజ్ఞతను తెలియుట యెట్లు? మనకు గల అల్పశక్తితో సర్వశక్తి మత్త్వమును అర్థము చేసుకొనుట యెట్లు? ఇవి ఊహకు ఏ మాత్రమూ అందని విషయములు. ఆర్తునకు, అర్థార్థికి ఈశ్వరుడు నిత్యపరోక్షుడు.

జిజ్ఞాసువునకు ఈశ్వరుడు అపరోక్షుడు అయ్యే అవకాశము మెండుగా గలదు. సర్వకారణుడగు ఈశ్వరుడు ఆత్మ కంటె వేరు కాదు గనుక, జ్ఞానికి ఈశ్వరుడు అపరోక్షుడు. సర్వప్రాణులకు ఆత్మ ఈశ్వరుడే. కాని, జ్ఞాని మాత్రమే ఈ సత్యము నెరుంగును. సర్వప్రాణుల ఆత్మ ఈశ్వరుడే అను సూక్ష్మజ్ఞానమును దర్శించగల బుద్ధి జ్ఞానికి మాత్రమే గలదు. ఈ శ్లోకము జ్ఞానిని ఇతరుల కంటె విలక్షణమైన పూర్ణభక్తునిగా గుర్తించినది. జిజ్ఞాసువు భవిష్యత్తులో పూర్ణభక్తుడు కాగలడు. అతని భక్తి, మరియు ఇతరుల భక్తి కాలక్రమములో చరితార్థము కాగలదు. కాలక్రమములో వారు భగవానుని పొందెదరు. ఆర్తుడు భక్తిప్రభావముచే అర్థార్థియై, తరువాత జిజ్ఞాసువు అగును. ఈశ్వరుని గుర్తించుట వలన అతని ఉన్నతి సుగమమగును.

జీవేశ్వరుల మధ్య ఏర్పడే ఎటువంటి సంయోగమైనా భక్తి యనబడును. భక్తుడు ఒక పుణ్యకర్మ, లేక పుణ్యభావన ద్వారా ఈశ్వరునితో సంయోగమును ఏర్పరుచుకొనును. కాని

జీవునకు, ఈశ్వరునకు మధ్య సేతువు (సంబంధము)ను ఏర్పరుచుకునే యత్నమును జ్ఞాని చేయడు. జ్ఞానమును పొందియున్న జ్ఞానికి తాను ఈశ్వరునితో నిత్య సంబద్ధుడనని తెలియును. జ్ఞాని దృష్టిలో ఉనికి గల తత్త్వము ఒక్కటియే. అదియే ఈశ్వరుడు. అదియే ఆత్మ. ద్వితీయవస్తువు లేదు గనుక, ఒక దానిని మరియొక దానితో కలుప బనిలేదు. అనగా జ్ఞాని నిత్యయుక్తుడు. ఈ విషయమును తరువాతి శ్లోకము వివరించుచున్నది.

అధ్యాయము 7, శ్లోకము 17:

तेषां ज्ञानी नित्ययुक्त एकभक्तिर्विशिष्यते ।
प्रियो हि ज्ञानिनोऽत्यर्थ महं स च मम प्रियः ॥ १७ ॥

తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే
ప్రియో హి జ్ఞానినో౽త్యర్థ మహం స చ మమ ప్రియః (17).

తేషాం = వారిలో; **నిత్యయుక్తః** = సర్వదా ఈశ్వరునితో సంబద్ధుడై ఉండునట్టియు; **ఏకభక్తిః** = ఏకత్వమునందు లీనమైన భక్తి గలవాడు; **జ్ఞానీ** = జ్ఞాని; **విశిష్యతే** = సర్వశ్రేష్ఠుడై ఉన్నాడు; **హి** = ఏలయనగా; **అహం** = నేను; **జ్ఞానినః** = జ్ఞానికి; **అత్యర్థం** = పూర్ణముగా; **ప్రియః** = ప్రియుడను; **చ** = మరియు; **సః** = అతడు; **మమ** = నాకు; **ప్రియః** = ప్రియుడు.

సర్వదా ఈశ్వరునితో సంబద్ధుడై ఉండువాడు, ఏకత్వమునందు లీనమైన భక్తి గలవాడు నగు జ్ఞాని వారిలో సర్వశ్రేష్ఠుడు. ఏలయనగా, నేను జ్ఞానికి పూర్ణప్రియుడను. మరియు, అతడు నాకు ప్రియుడు (17).

జ్ఞాని ఈశ్వరునితో నిత్యయుక్తుడై ఉండును

తేషాం జ్ఞానీ నిత్యయుక్తః వారి నలుగురిలో జ్ఞాని ఈశ్వరునితో నిత్య సంబంధము గలవాడు. ఈశ్వరతత్త్వమును గురించి అపరోక్ష జ్ఞానము గలవాడే జ్ఞాని. అతడు సత్యము నెరింగినవాడు (తత్త్వవిత్). ఈ జ్ఞాన ప్రభావముచే నాతడు ఈశ్వరునితో నిత్యసంయోగమును కలిగియుండును. ఈ శ్లోకములో నిత్యయుక్తః అనునది ప్రముఖమైన పదము.

ఈశ్వరుడు పరోక్షుడుగా నున్నంతవరకు భక్తుడు ఆయనతో సేతువును నిర్మించుకొనవలసి యుండును. ఈశ్వరుని అస్తిత్వమును గుర్తించిన భక్తుడు ఒక ప్రార్థన ద్వారా, భావన ద్వారా,

మంత్రము ద్వారా, ధ్యానము ద్వారా, లేదా వైదిక కర్మ ద్వారా ఈశ్వరునితో సంబంధము నేర్పరుచుకొనును. ఇది నిత్య సంబంధము గాదు. ఒక కాలములో ఆ సంబంధమేర్పడినది. తరువాత అది కొనసాగదు. అర్థార్థి విషయములో కూడా అంతే. అతడు ముఖ్యమగు కార్యమును మొదలిడినపుడు ఈశ్వరుని స్మరించి ఆ కాలములో సంయోగమును పొందును. కాని జిజ్ఞాసువు ఇంచుమించు సర్వకాలముల యందు సంబద్ధుడై యుండును. ఏలయన, సత్యము నెరుంగవలెననే కోరికతో అతని మనస్సు నిండియుండును. ఆ సత్యము ఈశ్వరుడే. కాన, అతనికి సంబంధము లేని కాలము అరుదుగా నుండును. అతడు ముముక్షువు, కర్మయోగి. కాన అతనికి ప్రసాదబుద్ధి గలదు. 'నేను చేయు కర్మలన్నియు నీకు సమర్పితములు (యద్యత్కర్మ కరోమి తత్తత్ తవారాధనమ్)' అను మనోధారణతో అతడు ప్రవర్తిల్లును. అతడు ధర్మమును ఈశ్వర స్వరూపముగా గుర్తించి తదనుగుణముగా జీవించును. కావున, అతడు ఇంచుమించుగా నిత్యయుక్తుడని చెప్పవచ్చును. అతడు ఇంకనూ ఈశ్వర సాక్షాత్కారమును పొందలేదు గనుక, 'ఇంచుమించుగా' అని చెప్పడమైనది. మోక్షమును కోరే వివిదిషా సన్న్యాసికి కూడా ఇది వర్తించును.

కాని, జ్ఞాని నిత్యయుక్తుడై ఉండును. జీవేశ్వరుల అభేదమును అతడు ఆవిష్కరించుకొనెను. అతడు జిజ్ఞాసువై శాస్త్రమును శ్రవణ మననములు చేయగా ఈ సత్యము గోచరించినది. అతడు తీవ్ర జిజ్ఞాసతో తత్త్వమసీత్యాది మహావాక్యముల తాత్పర్యమును విచారము చేసియున్నాడు. ఈ మహావాక్యములు అభేదమును ప్రదర్శించును. ఆ దైవీజ్ఞానమును సాక్షాత్కరించుకున్న వ్యక్తి తత్త్వవిత్ (సత్యము నెరింగిన వాడు) అనబడును. అతడు సర్వదా ఈశ్వరుని సంయోగమును కలిగియుండే నిత్యయుక్తుడు.

మరియు అతడు ఏకభక్తుడు కూడా. అతని దర్శనములో సర్వము ఆత్మయే. ఒకప్పుడు అతడు భక్తుడుగా నుండెను. కాని, ఇపుడాతని భక్తి అంతయూ అద్వితీయాత్మ యందు లీనమైనది. జీవేశ్వర భేదము ఉపమర్దితమైనది. అతని భక్తి జీవేశ్వరా భేద సాక్షాత్కారము నందు లయమును చెందినది. అతని భక్తియే గాక, విచారము ఇత్యాదులు కూడా దాని యందు లీనమైనవి. ఇందువలననే, అతడు ఏకభక్తుడైనాడు. ఈ వల్లరిలో అతడు సర్వశ్రేష్ఠుడు (విశిష్యతే).

జ్ఞాని చాల విశిష్టమైనవాడు

వారందరు భక్తులే. కాని వారిలో జ్ఞానికి ఒక ప్రత్యేకత గలదు. జ్ఞానిని ఒక అసాధారణ వ్యక్తిగా చూపుట ఇచటి తాత్పర్యము కాదు. మన భక్తి ఏ స్థాయి వరకు పరిణతి చెందవలెనన్నది

ప్రదర్శించుట ఇచటి తాత్పర్యము. భక్తి పక్వమై జ్ఞానముగా పరిణతి చెందినచో, అట్టి వ్యక్తి ఈశ్వరునితో నిత్య సంబంధమును కలిగియుండును (నిత్యయుక్తః). భక్తి ఆ జ్ఞానములో పూర్ణముగా లీనము కావాలి. కావున ఇట్టి జ్ఞాని విశిష్టుడనబడును (జ్ఞానీ విశిష్యతే).

నేను నీకు విజ్ఞాన సహితమగు జ్ఞానమును చెప్పెదనని (జ్ఞానం స విజ్ఞానం వక్ష్యామి) చెప్పి భగవానుడీ అధ్యాయమును అరంభించెను. నాల్గు రకముల భక్తులలో జ్ఞాని సర్వోత్కృష్టుడని భగవానుడిచట చెప్పుచున్నాడు.

జ్ఞాని విశిష్టుడగుటకు కారణమేమి?

విపత్తులో నున్న వ్యక్తి భగవంతుని శరణు జొచ్చును. ఆ సమయములో అతడు భగవంతునితో ఏకమగును. అతడా సమయములో భగవంతుని ఏకైక శరణముగా స్వీకరించును. కాని ఇదంతా విపత్తు ఉన్నప్పుడు మాత్రమే. కావున అతని అభిరుచి యథార్థముగా ఎచటనున్నది? అతనికి భగవంతుని యందు అభిరుచి గలదా? లేక, విపత్తు నుండి గట్టెక్కుట యందు మాత్రమే గలదా?

అతనికి వాస్తవముగా ఈశ్వరుని యందు అభిరుచి లేదు. అతడు ఈశ్వరుని కూడా ఇతర వస్తువుల వలెనే వాడుకొనగోరుచున్నాడు. అతనిని గట్టెక్కించే ఆశ్రయము మరియొకటి లేకుండుటచే, అతడు ఈశ్వరుని ఆశ్రయించినాడు. అతని దృష్టిలో ఈశ్వరుడు తనను గట్టెక్కించగలిగే అనేక వికల్పములలో ఒకడు మాత్రమే. అతడు సంసారి గనుక ఒకదాని తరువాత మరియొకటిగా కష్టములు వస్తూనే ఉంటాయి. కావున తనకు సాహాయ్యము ఎక్కడ లభిస్తే అక్కడ సాహాయ్యమును స్వీకరించాలి. ఆ సాహాయ్యము స్థానికంగా లభించేది కావచ్చును. లేదా, సుదూర స్థానము నుండి లభించవచ్చును. పరోక్షముగా నుండి సాహాయ్యము నందించువాడే ఈశ్వరుడు.

కావున, అతని దృష్టిలో ఈశ్వరునకు పూర్ణమహత్త్వము గలదని చెప్పజాలము. అతని దృష్టిలో విపత్తు నుండి బయటపడుటకు మహత్త్వము గలదు. ఆ ప్రయత్నములో ఈశ్వరుడు సహకరించగల్గును. భగవానుడు ధనము వలె అందరికీ ఉపయోగపడే వస్తువు. ఏ భక్తులకు భగవానుడు పరోక్షుడో, వారికి వాస్తవమగు ప్రేమ భగవానునిపై కాదు. జిజ్ఞాసువు కూడా భగవానుని పూర్తిగా అర్థము చేసుకొనలేదు గనుక, అతని విషయంలో నైననూ పూర్ణప్రేమ భగవానుని యందు లేదు. అతనికి ప్రియమైనది మోక్షము. అతడు సంసారబంధము నుండి విముక్తిని గోరి పరమేశ్వరుని ప్రార్థించును.

ప్రియః హి జ్ఞానినః అత్యర్థమ్. మానవుని పూర్ణప్రేమకు విషయము ఆత్మ యగును. జ్ఞాని ఈశ్వరుని ఆత్మరూపముగా నెరుంగును. కావున, జ్ఞానికి మాత్రమే ఈశ్వరుడు పరమ ప్రేమాస్పదుడగును. ఆత్మ ఆనందఘనము. ఈ పూర్ణసృష్టిలో మహత్త్వము గలది ఆత్మ ఒక్కటియే. కావున, ఆత్మ పూర్ణప్రేమకు ఆస్పదమగును. ఈ శ్లోకములో శ్రీకృష్ణ భగవానుడు అత్యర్థం (పూర్ణముగా) అను పదమును ప్రయోగించెను. జ్ఞానికి భగవానుడు పూర్ణప్రేమాస్పదుడు. జ్ఞాని యెరింగిన ఆత్మ సచ్చిదానంద ఆత్మ. ప్రేమ సర్వము దాని యందు అంతర్భూతమగును. పూర్ణస్వరూపము, ఆనందఘనమునగు ఆత్మ ఇతరేతర సంబంధము గల సందర్భములో ప్రేమరూపమగును. జ్ఞానితో సంబంధము గల వ్యక్తి విపత్తులో సహకారము నపేక్షించే సందర్భములో ఈ ప్రేమ సేవారూపమును, దయారూపమును దాల్చును. ఈ తీరున ఒకే ప్రేమ వివిధ రూపములను దాల్చును. ఆత్మ ఆనందఘనము. జ్ఞాని ఈశ్వరుని ఆత్మరూపముగా నెరుంగును. కావున ఈశ్వరుడు జ్ఞానికి పరమప్రేమాస్పదుడగును.

అత్యర్థం స చ మమ ప్రియః. అట్టి జ్ఞాని నాకు కూడ మిక్కిలి ప్రియుడు. అత్యర్థం అను విశేషణము జ్ఞానికి, ఈశ్వరునకు కూడ వర్తిస్తుంది. అతడు నాకు మిక్కిలి ప్రియుడు. ఏలయన, నేనే అతడు గనుక. శ్రీకృష్ణుడీ మాటను తరువాతి శ్లోకములో చెప్పబోవుచున్నాడు (జ్ఞానీ తు ఆత్మైవ మే మతమ్). సచ్చిదానంద ఆత్మ రూపుడగు అతడు నేనే గనుక, నాకు మిక్కిలి ప్రియుడు. ప్రియః అనగా ఆత్మ – ఎందువలన? ఆత్మ మిక్కిలి ప్రీతిపాత్రమైనది గనుక. సః = అతడు; మమ = నాకు (భగవానునకు); ప్రియః = ఆత్మ.

భగవానుని నాల్గురకముల భక్తులు ఆరాధించెదరని భగవానుడీ రెండు శ్లోకములలో (16, 17) వివరించుచున్నాడు. విపత్తులో ఆరాధించే భక్తుడు (ఆర్తుడు), విపత్తులో మాత్రమే గాక ఒక వస్తువును సంపాదించగోరినప్పుడు కూడా భగవంతుని ఆరాధించువాడు (అర్థార్థీ), భగవత్స్వరూపమును తెలియగోరు భక్తుడు (జిజ్ఞాసువు), జ్ఞాని అని భక్తులు నాల్గు తెరంగులుగా నున్నారు. ఈ నల్గురిలో జ్ఞాని చాల గొప్పవాడు. వీరందరు భక్తులే. కాని జ్ఞానికి ఒక విశిష్టత గలదు. భక్తి వలన ఏది లభించగలదో, దానిని అతడు సాధించినాడు. మిగిలిన ముగ్గురు ప్రార్థనా సమయములో మాత్రమే నాతో సంబంధమును కలిగియుందురు. కాని, జ్ఞాని ఆత్మా భిన్నముగా ఈశ్వరుని యెరింగిన తత్త్వవేత్త గనుక, జ్ఞానికి భగవానుడు, భగవానునకు జ్ఞాని పరమప్రీతి పాత్రులగుదురు.

అట్లైనచో, మిగిలిన ముగ్గురు భక్తుల మాట యేమిటి? వారు భగవానునకు ప్రీతిపాత్రులు గారా?

అధ్యాయము 7, శ్లోకము 18:

उदारास्सर्व एवैते ज्ञानी त्वात्मैव मे मतम् ।
आस्थितस्स हि युक्तात्मा मामेवानुत्तमां गतिम् ॥ १८ ॥

ఉదారాస్సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్
ఆస్థితస్స హి యుక్తాత్మా మామే వానుత్తమాం గతిమ్ (18).

ఏతే = వీరు; **సర్వే ఏవ** = అందరు కూడ; **ఉదారాః** = గొప్పవారే; **తు** = కాని; **జ్ఞానీ** = నన్ను ఎరింగినవాడు; **ఆత్మా ఏవ** = నా స్వరూపుడేనని; **మే** = నా యొక్క; **మతం** = దర్శనము; **హి** = ఏల యనగా; **సః** = అతడు; **యుక్తాత్మా** = నా యందు లగ్నమైన మనస్సు గలవాడై; **మామేవ** = నన్ను మాత్రమే; **అనుత్తమాం** = సర్వోత్తమమైన; **గతిం** = లక్ష్యముగా; **ఆస్థితః** = స్థిరనిష్ఠ కలిగియున్నవాడు.

వీరందరు కూడా గొప్పవారే. కాని, నన్ను ఎరింగిన జ్ఞాని నా స్వరూపుడే నని నా దర్శనము. ఏలయనగా, అతడు నా యందు లగ్నమైన మనస్సు గలవాడై, నన్ను మాత్రమే సర్వోత్తమ లక్ష్యముగా స్థిరనిష్ఠ కలిగి యున్నాడు (18).

భక్తులందరు మహానుభావులే

సర్వే ఏతే ఉదారాః. ఈ భక్తులందరు గొప్పవారే. వీరందరు నన్ను గుర్తించిన వారే. నన్ను ఏ మాత్రమూ గుర్తించని మానవులతో పోలిస్తే వీరు గొప్పవారే. వీరు పరిణతి గల వ్యక్తులు. సర్వే ఏతే అనగా జ్ఞాని తక్క మిగిలిన ముగ్గురు భక్తులు అని శ్రీ శంకరులు వ్యాఖ్యానించిరి. ఏలయన, జ్ఞాని నాకు అత్యంత ప్రీతిపాత్రుడు అని భగవానుడు జ్ఞానిని ప్రత్యేకముగా నిర్దేశించియున్నాడు గదా!

జ్ఞాని నేనే

జ్ఞాని తు ఆత్మా ఏవ మే మతమ్. వారందరూ గొప్పవారే. కాని జ్ఞాని మిక్కిలి ప్రియతముడని వారించి చెప్పుటకు కారణమేమి? భగవానునకు ప్రియుడు కాని భక్తుడు లేడని

శ్రీ శంకరులు వివరించిరి. సర్వులకు భగవానుని కృప లభించును. కాని జ్ఞాని భగవానుని స్వరూపుడే గనుక, భగవానుని కంటె వేరు కాదు గనుక, జ్ఞాని భగవానునకు అత్యంత ప్రియతముడు. కావున జ్ఞాని అందరిలో విశిష్టుడనుటలో సందేహము లేదు. ఇతరులు కూడా భగవత్స్వరూపులే. కాని, వారా సత్యమును గుర్తించలేదు. భగవానునకు పక్షపాతబుద్ధి లేదు. ఏలయన, సర్వము భగవానుడే. జ్ఞాని యొక్క ఆత్మ మాత్రమే భగవానుడనుకోరాదు. ఇది సర్వప్రాణుల ఆత్మకు వర్తించే సత్యము. కాని, ఆత్మ పరమేశ్వరుడే అను గుర్తింపు జ్ఞానికి ఉండుటచే, జ్ఞానియే ఈశ్వరుడు, ఈశ్వరుడే జ్ఞాని. మే మతం అనగా నా దర్శనము. ఇచట మతం అనగా అభిప్రాయ మాత్రము కాదు. ఇది భగవానుని స్పష్టమగు దర్శనము. జ్ఞాని యొక్క ఆత్మ భగవానుడే యగుటచే జ్ఞాని భగవానునకు ప్రియతముడగును.

జ్ఞాని భగవానుడే యనుటకు కారణమేమి?

ఆస్థితస్స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్. దీనికి కారణమేమి? ఈ ప్రశ్నకు సమాధానముగా భగవానుడు జ్ఞానిని నిర్వచించుచున్నాడు. భగవానుని యందు లగ్నమైన మనస్సు గల (స హి యుక్తాత్మా) జ్ఞానికి సర్వశ్రేష్ఠమగు లక్ష్యము భగవానుడే (మాం ఏవ అనుత్తమాం గతిమ్). దేని కంటె ఎక్కువ గొప్పది మరియొకటి లేదో, అది అనుత్తమా గతిః యనబడును. అనగా, మరియొక గతి లేదని యర్థము. ఆ గతిని పొందినవాడు, అనగా భగవానుని చేరుకున్న జ్ఞాని భగవత్స్వరూపుడే గనుక నిస్సంశయముగా అందరిలో కెల్లా విశిష్టుడు. అనుత్తమాం గతిం ఆస్థితః యనగా లక్ష్యములలో కెల్లా శ్రేష్ఠమైన ఈ జ్ఞానమును పొంది దాని యందు స్థిరముగా నెలకొన్న జ్ఞాననిష్ఠుడు. ఇట్టి జ్ఞాని నా స్వరూపుడే గనుక నిశ్చయముగా సర్వశ్రేష్ఠుడు.

భక్తి యొక్క లక్ష్యము ఈ జ్ఞానము మాత్రమేనని సూచించుటకై ఈ శ్లోకములో జ్ఞాని స్తుతింపబడినాడు. జ్ఞానము యొక్క ప్రయోజనము భక్తి యని కొందరి వాదము. వారి అభిప్రాయములో, ఈశ్వరుని ముందుగా తెలియాలి; ఆ తరువాతనే భక్తి కుదురును. కాని, ఈశ్వరుడు ఆత్మరూపుడని యెరింగిన జ్ఞాని యొక్క భక్తి జ్ఞానములో లయమగును. ఆ జ్ఞానము ఉదయించు వరకు అది భక్తి. భక్తికి పరాకాష్ఠ జ్ఞానము. అనగా జ్ఞానము ముందు, భక్తి తరువాత కాదనియు, భక్తి ముందు తరువాతనే జ్ఞానమనియు స్పష్టమగుచున్నది. భక్తికి లక్ష్యము జ్ఞానము. జ్ఞానమే భక్తి.

భక్తికి నిర్వచనము పరమప్రేమ స్వరూపమని మనము చూచియున్నాము. ప్రేమింపబడే వస్తువునకు, ప్రేమించువానికి లేశమైననూ భేదము లేని పూర్ణప్రేమ పరమప్రేమ స్వరూపమనబడును. ఇతరము లేని (అనన్య) భక్తిలో భక్తుడు, భజనీయమగు దైవము ఒక్కటి యగును. అట్టి భక్తి జ్ఞానము కంటె వేరుగాదు. దీనినే మరియొక విధముగా సాధ్య భక్తి అంటారు. జ్ఞానికి గం చరితార్థమైన భక్తి సాధ్యభక్తి అగును.

తరువాతి శ్లోకము కూడ జ్ఞానిని స్తుతించుచున్నది:

అధ్యాయము 7, శ్లోకము 19:

बहूनां जन्मनामन्ते ज्ञानवान्मां प्रपद्यते ।
वासुदेवस्सर्वमिति स महात्मा सुदुर्लभः ॥ १९ ॥

బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్మాం ప్రపద్యతే
వాసుదేవస్సర్వమితి స మహాత్మా సుదుర్లభః (19).

బహూనాం = అనేక; జన్మనాం = జన్మల; అంతే = అంతము నందు; సర్వం = సర్వము; వాసుదేవః = వాసుదేవుడు; ఇతి = అని; జ్ఞానవాన్ = జ్ఞానము గలవాడు; మాం = నన్ను; ప్రపద్యతే = పొందును; సః = అట్టి; మహాత్మా = మహాత్ముడు; సుదుర్లభః = మిక్కిలి దుర్లభము.

అనేక జన్మల అంతము నందు సర్వము వాసుదేవుడే అను జ్ఞానము గలవాడు నన్ను పొందును. అట్టి మహాత్ముడు మిక్కిలి దుర్లభుడు (19).

అనేక జన్మల తరువాత జ్ఞానవంతుడు నన్ను పొందును. దీని అర్థమేమి? ఈ జన్మలో జ్ఞానసాధనము మొదలిడిన వ్యక్తి అనేక జన్మల తరువాత మాత్రమే జ్ఞాని అగుననియా? కాదు. బహూనాం అనగా సాధకుడు అనేక జన్మలలో జ్ఞానానురూపమగు పుణ్యమును ప్రోగుచేసుకున్నాడని యర్థము. వ్యక్తి మౌలిక సమస్యను గుర్తించి, పరిష్కరమును కనుగొనుటకు ఆరంభించే లోపులో ఎన్నో జన్మలు గడిచి ఉంటాయి.

జ్ఞానవాన్ అనగా రెండు అర్థములను చెప్పవచ్చును. అనేక జన్మల సాధన తరువాత జ్ఞానోదయమునకు చాలినంత మానసిక పరిణతిని పొందిన వ్యక్తి అని ఒక అర్థము. ఇట్టి వ్యక్తి

పరిణతుడు గనుక, భగవానుని పొందును (మాం ప్రపద్యతే). ఇట్టి వాడు మాత్రమే జ్ఞాని యగును. జ్ఞానవాన్ అనగా జ్ఞానము కలవాడు అని కూడ అర్థమును చెప్పవచ్చును. అట్టి జ్ఞాని భగవానుని పొందును.

సర్వము వాసుదేవుడే

అతడు భగవానుని పొందు విధమెట్టిది? అతడు జ్ఞానప్రభావముచే, తనతో సహా సర్వము వాసుదేవుడు మాత్రమే నని (వాసుదేవస్సర్వమ్) గుర్తించును. వాసుదేవుడు ఆత్మ కంటె వేరుగాదు. జీవుని 'నేను' ఈశ్వరుని 'నేను' అభిన్నములని గుర్తించుటయే ఇచటి ప్రాప్తి. ఈ జగత్తులోని సర్వము వాసుదేవుడనే సాక్షాత్కారము జ్ఞానికి కలుగును. కార్యము కారణము కంటె అనన్యము. ఈ కార్యరూప జగత్తు మిథ్య. దానికి కారణము కంటె వేరుగా ఉనికి లేదు. ఈ కారణమే సత్యమని జ్ఞాని గుర్తించును. ఒకే ఒక సత్యము ఆత్మ అనియు, ఆత్మయే బ్రహ్మమనియు అతడు స్పష్టముగా దర్శించును. కావున, సర్వము వాసుదేవుడేనని అతడు గుర్తించును. ఈ జ్ఞానములో అతడు భగవానుని పొందును.

దీనిని బట్టి జ్ఞానానంతరమందు ఉండే భక్తి ఇచట చెప్పబడినదని స్పష్టమగుచున్నది. సర్వము వాసుదేవుడే గనుక, ఆయన నా కంటె వేరుగా లేడు. నేను తక్క మిగిలినది వాసుదేవుడైనచో, ఆయన సర్వము కాడు. పైగా, ఆయన ఆత్మ కాడు. అనగా జడుడు అగునని మనము చూచియున్నాము. ఈశ్వరుడు జడుడైనచో, ఇతర జడపదార్థము వలె ద్రష్ట యొక్క దర్శనముపై ఆధారపడే ఉనికి కలవాడగును. కాని, ఇది యథార్థము కాదు. సర్వము ఆత్మపై ఆధారపడును. ఆత్మ ఒక్కటియే సత్యవస్తువు. మరియు, ఆత్మయే ఈశ్వరుడు. కావున, 'ఈ సర్వము నేనే (అహమిదం సర్వమ్)' అని మనము చెప్పవచ్చును.

శాస్త్రము సర్వత్రా ఇదే విషయమును వివిధ రకములుగా ప్రస్తావించును. ఈ సర్వము బ్రహ్మమే. ఈ జగత్తులో నానాత్వము లేనే లేదు (సర్వం ఖల్విదం బ్రహ్మ నేహ నానాస్తి కించన). మరియు, ఈ ఆత్మ జగత్తు లేనప్పుడు పూర్ణము. జగత్తు ఉన్నప్పుడు పూర్ణము (పూర్ణమదః పూర్ణమిదమ్). పూర్ణత్వమునకు మెరుగులను దిద్దుట సంభవము కాదు. కావున మిథ్యా జగత్తు బ్రహ్మమునకు తోడుగా జతగూడేది కాదు. బ్రహ్మముపై ఆధారపడే జగత్తు బ్రహ్మము కంటె వేరుగాదు. జగత్తుగా అగుటకై బ్రహ్మములో లేశమైనమా మార్పులు రావు. బ్రహ్మము లేనిదే జగత్తు లేనే లేదు. సత్యము లేనిదే మిథ్య లేదు.

శాస్త్రము అభేదము నెట్లు ప్రదర్శించును?

బాధాయాం సామానాధి కరణ్యమ్

ఈ సత్యమును ప్రదర్శించుటకు శాస్త్రము 'బాధాయాం సామానాధి కరణ్యమ్' అనే భాషా విజ్ఞాన ప్రక్రియ నొకదానిని వినియోగించును. సమానాధికరణ మనగా ఒకే ఆశ్రయము. సమానాధికరణము ద్వివిధము. నీలఘటములో నీలవర్ణము, మరియు ఘటము సమానమగు అధికరణము నందున్నవి. అటులనే, 'రాముడు సంగీతజ్ఞుడు' అన్నప్పుడు రాముడు, సంగీతజ్ఞత అనే గుణము ఒకే అధికరణము నందున్నవి. రాముడే సంగీతజ్ఞుడు. సంగీతజ్ఞుడే రాముడు. 'క'యే 'గ'. 'గ'యే 'క'.

కాని 'జగత్తు బ్రహ్మము' అన్నప్పుడు పరిస్థితి వేరు. జగత్తు బ్రహ్మమే. కాని బ్రహ్మము జగత్తు కాదు. 'క' 'గ' యే. కాని, 'గ' 'క' కాదు. దీనికి 'బాధాయాం సామానాధికరణ్యమ్' అని పేరు. మనము ఒక దృష్టాంతమును చూద్దాము. ఒకడు దుంగను చూచి మనిషి అని భ్రమపడినాడు. కాని, సత్యము నెరింగిన వ్యక్తి భ్రాంతునికి వాస్తవమును బోధిస్తూ 'ఈ మనిషి ఒక దుంగ మాత్రమే' అన్నాడు. సంస్కృతభాషలో ఈ వాక్యములో మనిషి, దుంగ అనే పదములు సమాన విభక్తిని కలిగియున్నవి (స్థాణుః అయం పురుషః). అనగా, వాటి అధికరణము ఒకటియేనని స్పష్టమగుచున్నది. కాని, ఇచట రెండు వస్తువులు గలవా? లేవు. పురుషుడు అని భ్రమపడిన వస్తువే స్థాణువు. ముందుగా భాసించిన పురుషుడు తరువాత దుంగ యందు లీనమైనాడు. నీలత్వము ఘటమునకు వలె, పురుషుడు దుంగకు విశేషణము కాడు. పురుషుడు దుంగలో లీనమగును.

ఈ శ్లోకములో 'వాసుదేవః సర్వమ్' అని చెప్పబడినది. సర్వము దేని యందు ఉనికిని కలిగియున్నదో, ఏది చైతన్యరూపముగ నున్నదో అట్టి తత్త్వమును వాసుదేవ పదము నిర్దేశించునని మనము చూచియున్నాము. సర్వము దేని యందు ఉన్నదో, సర్వము దేనిచే ధరింపబడియున్నదో అది 'వాసు' అనబడును. తన యందున్న సర్వమునకు అదియే కారణము. సర్వమగు ఉనికికి అదియే ఆశ్రయము. జగత్తు దృష్ట్యా అది సర్వకారణము (వాసు); స్వీయదృష్ట్యా చైతన్యము.

అదియే వ్యక్తి యందు 'నేను' రూపముగా భాసించు ప్రత్యగాత్మ. జ్ఞాని దృష్ట్యా సర్వము నేనే (అహం ఇదం సర్వమ్). లేదా వాసుదేవుడే సర్వము (వాసుదేవస్సర్వమ్). జ్ఞాని నన్ను పొందు తీరు ఇదియే.

ఈ జ్ఞానము గల వ్యక్తి చాల అరుదు

స మహాత్మా సుదుర్లభః. ఇట్టి జ్ఞాని చాల దుర్లభుడు. అతడు భగవానుని సర్వప్రాణుల ఆత్మరూపముగా దర్శించును గనుక, అతని ఆత్మ పరిచ్ఛేదరహితము (మహాన్). ఈ జ్ఞానము గల వ్యక్తి మహాత్ముడనబడును. సాధుసంతుల నందరినీ మహాత్మా అను పదముతో నిర్దేశిస్తారు. ఆ సందర్భములో ఆత్మా యనగా అంతఃకరణము. విశాలమగు మనస్సు, లేక హృదయము గల వ్యక్తి మహాత్మా అనబడును. కాని ప్రస్తుత ప్రకరణములో, ఆత్మ బ్రహ్మాభిన్నము అను సాక్షాత్కారము గల వ్యక్తి మహాత్మా అనబడును. పూర్ణత్వము కంటె, సర్వాత్మ భావము కంటె మెరుగైనది ఉండజాలదు గనుక, అట్టి మహాత్మునితో సమానమైనవాడు లేడు. అట్టి మహాత్ముడు దొరుకుట దుర్లభము. ఇందువలననే, భక్తులందరూ ప్రీతిపాత్రులే అయినా జ్ఞాని విశిష్టుడైనాడు.

సర్వము వాసుదేవుడు అనే సాక్షాత్కారము గల మహాత్ముడు దొరుకుట చాల కష్టమని శ్రీకృష్ణ భగవానుడీ శ్లోకములో చెప్పినాడు. ఈ శ్లోకము భక్తులను వర్ణించినదే అయినా, వాసుదేవుడు ఆత్మరూపుడనే సాక్షాత్కారము భక్తులందరికీ లేదు. భగవానుడే సర్వము అను గుర్తింపు ఇంత కఠినము అగుటకు కారణమేమి? తరువాతి శ్లోకము కారణమును వివరించుచున్నది:

అధ్యాయము 7, శ్లోకము 20:

कामैस्तैस्तैर्हृतज्ञानाः प्रपद्यन्तेऽन्यदेवताः ।
तं तं नियममास्थाय प्रकृत्या नियताः स्वया ॥ २० ॥

కామైస్తైస్తైర్హృత జ్ఞానాః ప్రపద్యంతేఽన్యదేవతాః
తం తం నియమ మాస్థాయ ప్రకృత్యా నియతాస్స్వయా (20).

తైస్తైః = అయా; **కామైః** = కామనలచే; **హృతజ్ఞానాః** = అపహరింపబడిన వివేకము గలవారై; **స్వయా** = తమ; **ప్రకృత్యా** = స్వభావముచే; **నియతాః** = ప్రేరితులై; **తం తం** = అయా; **నియమం** = నియమమును; **ఆస్థాయ** = అనుసరించి; **అన్యదేవతాః** = ఇతరదేవతలను; **ప్రపద్యంతే** = శరణు వేడెదరు.

అయా కామనలచే అపహరింపబడిన వివేకము గలవారై, తమ స్వభావముచే ప్రేరితులై, అయా నియమముల ననుసరించి, ఇతర దేవతలను శరణు వేడెదరు (20).

కోరికలు మానవుని వివేకము నపహరించును

హృతజ్ఞానాః అనగా అపహరింపబడిన వివేకము గలవారు. 'హృత' అనగా అపహరింపబడినది. ఏది? జ్ఞానము, వివేకము. ఆత్మానాత్మ వివేకము లేని వారలకు తమకు ఏది అభీష్టము అను విషయంలో స్పష్టమైన కల్పన ఉండదు. వారి వివేకము ఎట్లు అపహరింపబడినది?

కామైస్తైస్తైః. ఆయా కోరికల చేత. ఒక మనిషి నుండి మరియొక మనిషికి కామనలు మారుచుండును. ప్రతి మనిషికి విలక్షణమైన కోర్కెలు ఉండును. అవి అతని వివేకము నపహరించును. వస్తువు సమ్మిళితము గాని కోర్కె ఉండదు. కావున శ్రీ శంకరులు కొన్ని వస్తువులను ఉదహరించిరి. పుత్ర పశు స్వర్గాది విషయాః. పుత్రుడు, పశువులు, స్వర్గము మొదలగు వస్తువులు. ధనము గలవానికి వారసుని యందు కోరిక ఉండును. నిర్ధనుడు ఈయగలిగేది ఏదీ లేకపోయినా సంతానము కావాలని కోరుకొనును. బహుశః అతడు తన దుస్స్థితిని సంతానము మెరుగుపరుచునని ఆశించును కాబోలు! మరియు, వంశప్రతిష్ఠను కొనసాగించుటకై మానవులు సంతానమును కోరెదరు. ప్రతి స్త్రీ అంతరంగములో తల్లిని కావాలనే ఆకాంక్ష ఉండును. స్త్రీ యొక్క జీవితమునకు తల్లియగుట ప్రకృతి సిద్ధమైన పరిపూర్ణత యగును. తల్లిని కారాదు అని స్త్రీ ఎవరైనా భావిస్తే దానికి ఇతర సమస్యలు కారణమగును. భారతీయ సమాజములో కుమారుని కనాలనే ఆకాంక్షకు ధార్మికమైన హేతువు కూడ గలదు. తల్లిదండ్రుల అంత్యక్రియలను కుమారుడు మాత్రమే నిర్వర్తించును. పుత్రశబ్దము అన్నిరకముల కామనలకు, సుఖములకు ఉపలక్షకమగును. సంతానాకాంక్ష మానవుల కోర్కెలన్నింటిలో అత్యంత తీవ్రమైనది. అందువలననే, అది ప్రత్యేకముగా ప్రస్తావించబడినది. పశుశబ్దము సంపదలన్నింటికీ ఉపలక్షకము. కృషి (agriculture) ప్రధానమైన సమాజములో ఒక వ్యక్తికి గల పశువుల సంఖ్య ఆతనికి గల భూమి వైశాల్యమును సూచించును. అది శబ్దమునే అధికారము, పేరు ప్రతిష్ఠలు మొదలగు వాటిని గ్రహించవలెను.

కామనలకు ఆలంబమైన ఈ వస్తువులన్నియూ మానవుల వివేకమును అపహరించును. ఇట్టి వ్యక్తులలో కామన అధికముగా నుండుటచే, ఆత్మా నాత్మ వివేకము, నిత్యా నిత్య వివేకము ఉదయించవు. వారి కాలమంతయూ కామనాపూర్తిలోనే గడచిపోవును.

వారు ఇతర దేవతలను ప్రార్థించెదరు

అన్యదేవతాః ప్రపద్యంతే. కామనా పరిపూర్తిలో అనేక విఘ్నములు కలుగుచుండును. ఈ విఘ్నములను పరిహరించి, తమ కృషికి అధికమగు ఫలము లభించుట కొరకై వారు విభిన్న దేవతల

రూపములో నున్న (అన్యదేవతాః) ఈశ్వరుని ప్రార్థించెదరు. ఒక విశిష్ట కామన సఫలమగుటకై ఒక విశిష్ట దేవతను ప్రార్థించవలెను. అట్టి ప్రార్థనలు గలవు. కొన్ని కామనలు సిద్ధించుటకై ఉద్దేశింపబడిన విహిత కర్మలు కూడ గలవు. కావున వారు తమ కోర్కెలను దీర్చుకొనుటకై వివిధ దేవతలను ప్రార్థించెదరు.

వారు దేవతల నందరినీ వాసుదేవ స్వరూపమగు ఆత్మ కంటె భిన్నముగా దర్శిస్తారు. వారు వాసుదేవ స్వరూపమగు ఆత్మను గురించి ఆలోచించరు. వారు ఈ జ్ఞానమును పొందవలసి యున్నది. ఈ జ్ఞానమును పొందాలనే కోరిక (జిజ్ఞాసా) వారికి ఇంకనూ ఉదయించలేదు.

ప్రతి వ్యక్తి స్వీయ ప్రకృతిచే ప్రేరితుడగును

ప్రకృత్యా నియతాస్స్వయా. వారు తమ స్వభావములచే ప్రేరితులై తమ కోర్కెలను పొందుట కొరకు ఇతర దేవతల నాశ్రయిస్తారు. లేదా, తాము చేసుకున్న పుణ్యమునకు ఫలముగా దేవలోకమును పొంది, దేవతారూపమును పొందెదరు. తమ కోర్కెలను తీర్చే దేవతలు అనేకులు ఉండగా, ఒక దైవమును మాత్రమే పూజింపబని యేమి? ఈ విషయము వ్యక్తి యొక్క సంస్కారముపై నాధారపడును. బహుశః ఒక వ్యక్తి ఒకానొక దేవతను ఈ జన్మలో గాని, పూర్వజన్మలో గాని ఆరాధించి యుండవచ్చును. పూర్వజన్మ సంస్కారమును బట్టి మానవుడు కొన్నింటివైపు ఆకర్షితుడగును; మరి కొన్నింటివైపు ఆకర్షితుడు గాడు. మనకు ఇతర దేవతలపై వ్యతిరేకత ఉండకపోవచ్చును. కాని, ఒక దేవత యందు ఆకర్షణ ఉండును. కావున, వ్యక్తి తన విలక్షణమైన కామనా సమూహములను పరిపూర్తి చేసుకొనుట కొరకై తాను నమ్మిన ఒక విశిష్ట దేవత నారాధించును.

నియమానుసారముగా ఆరాధించవలెను

తం తం నియమ మాస్థాయ. వారు ఆరాధించు విధమెట్టిది? వారు ఆయా విశిష్ట నియమములను పాటిస్తూ, ఆయా దేవతల నారాధిస్తారు. ఒక్కొక్క కోరికకు ఒక్కొక్క ఆరాధనా విధానము ఉండును. 'తం తం' అనే ఆవృత్తిని బట్టి ఈ విషయము అవగతమగుచున్నది. కొడుకును కోరు వ్యక్తి వర్షము నిచ్చే క్రతువును చేయరాదు. అతడు కొడుకును ఇచ్చే పుత్రకామేష్టి క్రతువును చేయవలెను. ఈ క్రతువును చేసే విశిష్ట నియమములు గలవు. దేవతలు ఎవరు? హవిస్సులు ఏవి? మంత్రములు ఏవి? దక్షిణలు ఏవి? అను అంశములలో విశిష్ట నియమములు గలవు. ఆస్థాయ అనగా ఆ నియమములను పాటించుట అని యర్థము.

మానవులు తమ స్వభావముచే ప్రేరితులై ఒక విశిష్ట నియమావళిని పాటిస్తూ, వాసుదేవ స్వరూపమగు ఆత్మ కంటె భిన్నమైన ఇతర దేవతల నారాధిస్తారు. దీనిలో తప్పేమీ లేదు. వారికి ధర్మార్థ కామముల యందు మాత్రమే అభిరుచి ఉండుటయే ఏకైక సమస్య. ఇట్టి స్థితిలో సర్వము వాసుదేవుడే యను దర్శనము మిక్కిలి కష్టము అగును. వారు తమ కోర్కెలలోని దోషమును దర్శించి, ఆత్మ స్వరూపమును తెలుసుకొనే ప్రయత్నమును చేస్తే, ఈ దర్శనమును పొందగల్గుదురు. అంటే, వారికి ముందుగా నిత్యానిత్య వస్తు వివేకము కలగాలి. మోక్షము నందు ఇచ్ఛ కలగాలి. అంతవరకు వారి మనస్సులు ధర్మార్థ కామములచే వ్యాపృతములై యుండును.

అర్జునుడు కూడా ఈ క్షణం వరకు ధర్మార్థ కామముల యందు మాత్రమే అభిరుచిని కలిగియుండెను. ఒకటి రెండు అధ్యాయములకు ముందు, అనగా కొద్ది గంటల క్రితం మాత్రమే అతనికి బహుశః మోక్షము నందభిరుచి కలిగియుండును. శ్రీకృష్ణ భగవానుడు అతనికి ఉపదేశము నారంభించి ఇప్పటికి ఒకటి రెండు గంటలు మాత్రమే గడచినవి. అంతకు ముందు అర్జునునకు యుద్ధము నందు, అన్యాయమునకు ప్రతీకారము నందు మాత్రమే అభిరుచి ఉండెను.

కావున, మానవులు తమ విశిష్ట స్వభావముచే ప్రేరితులై, వివిధ కామనలచే అపహరింపబడిన వివేకము గలవారై, ఆయా నియమములను పాటిస్తూ వివిధ దేవతలను ఆరాధిస్తారు. ఇందువలన వారు వాసుదేవుని ఆరాధించరు. ఆత్మ భిన్నమగు ఈశ్వరుని ఆరాధించే మతము లన్నిటికీ ఈ సూత్రము వర్తించును. నన్ను ఏ రూపములో ఆరాధిస్తే, అదే రూపములో నేను ఆశీర్వదిస్తానని భగవానుడు తరువాతి శ్లోకములో చెప్పుచున్నాడు.

అధ్యాయము 7, శ్లోకము 21:

यो यो यां यां तनुं भक्तः श्रद्धयार्चितुमिच्छति ।
तस्य तस्याचलां श्रद्धां तामेव विदधाम्यहम् ॥ २१ ॥

యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితు మిచ్ఛతి
తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్ (21).

యః యః = ఎవడెవడైతే; భక్తః = భక్తుడు; యాం యాం = ఏయే; తనుం = విశిష్టరూపమును; శ్రద్ధయా = శ్రద్ధతో; అర్చితుం = ఆరాధించుటకు; ఇచ్ఛతి = ఇచ్ఛగించునో;

తస్య తస్య = ఆయా భక్తునకు; తామేవ = అదియే; అచలాం = చలింప శక్యము కాని; శ్రద్ధాం = శ్రద్ధను; అహం = నేను; విదధామి = నిర్మించెదను.

ఏయే భక్తుడు ఏయే విశిష్టరూపమును శ్రద్ధతో ఆరాధించ నిచ్ఛగించునో, ఆ యా భక్తునకు నేను చలింప శక్యము కాని అదే శ్రద్ధను నిర్మించెదను (21).

యో యో యాం యాం తనుం భక్తః. భక్తుడు విపత్తులో నున్న ఆర్తుడు కావచ్చును. లేదా, తాను కోరిన లక్ష్యములను పొందగోరు అర్థార్థి కావచ్చును. యాం యాం తనుం = ఏయే విశిష్ట రూపమును; అర్చితుం ఇచ్ఛతి = అర్చించగోరునో; శ్రద్ధయా = శ్రద్ధతో. ఇచట భక్తుని ప్రధాన లక్ష్యము తన వాంఛితమును నెరవేర్చుకొనుటయే. కాని, ఆతనికి శ్రద్ధ ఉండుటచే, ఆతడు కామి గాక, భక్తుడైనాడు. అనగా ఇచట భక్తుడు ఆర్తుడు గాని, అర్థార్థి గాని అగును. భక్త శబ్దమును ఆ విధముగా సంకోచము చేయవలెను. ఆతడు తన శ్రద్ధకు అనురూపమైన ఒక విశిష్టరూపములో భగవంతుని ప్రార్థించును. ఏలయన, సర్వము వాసుదేవుడే యను దర్శనము ఆతనికి లేదు. ఆతడు భగవానుని ఒక విశిష్టరూపమును ఆరాధించును. ఆ రూపము గల దేవతను ఆహ్వానించి వేదోక్త కర్మను ఆతడు అనుష్ఠించును.

శ్రద్ధయా అర్చితుం ఇచ్ఛతి. ఆతడు దేవత యొక్క విశిష్టరూపమును శ్రద్ధతో అర్చించి, స్తుతించగోరును. ఆతని అవగాహనను బట్టి అది మాత్రమే భగవానుని ఆరాధించే ఏకైక విధానమని ఆతడు భావించవచ్చును. లేదా, ఆతడు ఇతర పూజా పద్ధతులను అంగీకరించువాడైననూ కావచ్చును.

భగవానుడే స్వయముగా భక్తునకు దృఢమగు శ్రద్ధను కలిగించును

తస్య అచలాం శ్రద్ధాం విదధామి అహమ్. ఇచట ప్రముఖమైన విషయము శ్రద్ధ. శ్రద్ధ గలవాడు జీవేశ్వరాభేదమనే జ్ఞానమును పొందును (శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్, 4-39) అని శ్రీకృష్ణ భగవానుడు నాల్గవ అధ్యాయములో చెప్పి యున్నాడు. అట్టి సాధకునకు ప్రస్తుతములో ఉన్న శ్రద్ధను నేను దృఢము చేసెదను (తస్య అచలాం శ్రద్ధాం విదధామి అహమ్) అని భగవానుడీ శ్లోకములో చెప్పుచున్నాడు. ఒక ఫలమును గోరే ఒక భక్తునకు ఒక దేవత యందు శ్రద్ధ కలిగినది. నేను ఆ శ్రద్ధనే దృఢము చేసెదను. ఎట్లు? ఫలముల నిచ్చుట ద్వారా. ఒకడు ఒక వైదిక కర్మను ఆచరించియూ, వాగ్దానము చేయబడిన ఫలమును పొందలేదనుకొనుడు. ఆతని శ్రద్ధ శీఘ్రముగా

అంతరించును. కాని, నేను ఫలముల నిచ్చి అట్లు జరుగకుండా కాపాడెదను. వారాచరించు కర్మలకు ఫలముల నీయవలెను. ఆ ఫలములను నేనే ఇచ్చెదను. వారు నాలోని ఒక అంశమును మాత్రమే ఉపాసించెదరు. నా పూర్ణ స్వరూపమును వారు ఉపాసించుట లేదు. అయిననూ, వారికి ఏ విధమగు శ్రద్ధ గలదో, ఆ శ్రద్ధనే నేను దృఢము చేసెదను. వారు ఏ రూపములో నన్ను ఆరాధిస్తే ఆ రూపములో వారికి నేను లభించెదను. ఏ దేవతయూ నా కంటె భిన్నముగా లేదు. కాని నేను ఈ దేవతలకు అతీతుడను. ఈ భక్తులు తాము ఉపాసించే దేవతయే ఈశ్వరుడని భావించెదరు. ఇది సమస్య. కాని నేను వారి శ్రద్ధను చెదరగొట్టను. నేను వారి శ్రద్ధకు అనురూపముగా మాత్రమే ఫలముల నిచ్చెదను. నేను మధ్యలో హస్తక్షేపము చేసి వారితో 'నీవే నేను' అని చెప్పిననూ ప్రయోజనముండదు. ఏలయన, వారింకనూ ఈ ఉపదేశమునకు సజ్జితులు కాలేదు. ఈ విధమగు భక్తుల యెదుట సాక్షాత్తుగా భగవానుడు ప్రత్యక్షమైననూ, వారు పదోన్నతి (promotion)ని గోరెదరు. వారికి కొంతవరకు దృఢమగు శ్రద్ధ గలదు. నేను ఫలముల నిచ్చి ఆ శ్రద్ధను ఇంకనూ దృఢముగ చేసెదను. భగవానుడీ విషయమును తరువాతి శ్లోకములో వివరించుచున్నాడు:

అధ్యాయము 7, శ్లోకము 22:

स तया श्रद्धया युक्तस्तस्या राधनमीहते ।
लभते च ततः कामान्मयैव विहितान् हि तान् ॥ २२ ॥

స తయా శ్రద్ధయా యుక్తస్తస్యా రాధనమీహతే
లభతే చ తతః కామాన్మయైవ విహితాన్ హి తాన్ (22).

సః = అతడు; **తయా** = అట్టి; **శ్రద్ధయా** = శ్రద్ధతో; **యుక్తః** = కూడుకున్నవాడై; **తస్యాః** = ఆ దేవతామూర్తి యొక్క; **రాధనం** = ఆరాధనను; **ఈహతే** = అనుష్ఠించును; **చ** = మరియు; **తతః** = ఆ దేవత నుండి; **మయైవ** = నా చేతనే; **విహితాన్** = నిర్ణయించి ఈయబడిన; **తాన్** = ఆ; **కామాన్** = కోర్కెలను; **లభతే హి** = నిశ్చయముగా పొందును.

ఈ శ్లోకములోని రెండవ భాగములో రెండు విధముల పదచ్ఛేదమును చేయవచ్చును. అది యెట్లన:

1. मया एव विहितान् हि तान् कामान् लभते ।
   మయా ఏవ విహితాన్ హి తాన్ కామాన్ లభతే.

2. मया एव विहितान् हितान् कामान् लभते।

మయా ఏవ విహితాన్ హితాన్ కామాన్ లభతే.

రెండవ పదచ్ఛేదములో 'హితాన్ కామాన్' అనగా 'అభిలషితములైన ఫలములను' అని యర్థము.

> అతడు అట్టి శ్రద్ధతో కూడియున్నవాడై ఆ దేవతామూర్తిని ఆరాధించును. మరియు అతడు నాచేతనే నిర్ణయించి ఈయబడిన ఆ కోర్కెలను ఆ దేవత నుండి నిశ్చయముగా పొందును (22).

శ్రద్ధతో ఆరాధించే భక్తుడు

సః యుక్తః తయా శ్రద్ధయా. ఒక విశిష్టక్రతువును విధించి, దానికి ఒక విశిష్ట ఫలము లభించునని వాగ్దానము చేయు వేదవచనము నందాతనికి శ్రద్ధ గలదు. ఒక విశిష్ట సాధనమునకు ఒక విశిష్టసాధ్యమును ఉత్పన్నము చేసే సామర్థ్యము ఉండును. వాటి మధ్య నిత్య సంబంధము ఉండును. ఇది విధి. ఇది కర్మనియతి. ఇదియే ఈశ్వరుడు. ఈ వివిధ సాధనములకు, సాధ్యములకు సంబంధము గలదని మనకెట్లు తెలియును? మనము ఒక క్రతువును ఆచరిస్తే, దానికి పుత్రుడు, వర్షము ఇత్యాదులతో గల సంబంధమెట్టిది? ఈ సంబంధమును ఈశ్వరదత్తమైన శాస్త్రము నిరూపించును. ఆ సంబంధమును అంగీకరించుటయే శ్రద్ధ యనబడును. 'దీనిని అనుష్ఠిస్తే, ఈ ఫలము లభించును గాన, నేను దీనిని అనుష్ఠిస్తాను'. భక్తుని ఈ ప్రవృత్తియే శ్రద్ధయని ఈ శ్లోకములో చెప్పబడినది. తస్యా రాధన మీహతే. భక్తుడు ఇట్టి శ్రద్ధతో ఆ దేవతా రూపమును ఆరాధించును.

భక్తునకు ఈశ్వరుని నుండియే ఫలములు లభించును

లభతే చ తతః కామాన్. అతడు తాను కోరిన వస్తువులను ఆ దేవత నుండి పొందును. కామశబ్దమునకు కోరబడే వస్తువులు అని అర్థము. తతః అనగా దాని నుండి. అనగా అతడు ఆరాధించిన దేవత నుండి అని యర్థము. మరియు ఆ దేవత తన కంటె వేరుగా లేదని శ్రీకృష్ణ భగవానుడు చెప్పుచున్నాడు.

మయా ఏవ విహితాన్ హి తాన్. వారి ఆరాధనకు ఫలములను నేనే అనుగ్రహించెదను. మానవులు క్రతువుల నను ష్ఠించి, శ్రద్ధతో ప్రార్థనలను చేసి, ఫలములను పొందెదరు. ఈ ఫలములను

నిర్ణయించేది ఈశ్వరుడనగు నేనే. కాని, దేవత నుండి లభించిన వని వారు తలపోసెదరు. వారు ఈశ్వరుని గుర్తించరు. అయినా పరవాలేదు. ప్రార్థన ఫలము నిచ్చినది గావున, వారిలోని శ్రద్ధ మరింత దృఢమగును. తరువాత వారు మరింత గొప్ప ఫలమును పొందుటకై మరింత శ్రద్ధతో ప్రార్థించెదరు. కొంత కాలమునకు వారి అవగాహన పరిణతి చెందును.

'తాన్ విహితాన్ కామాన్ లభతే హి' అని మొదటి అన్వయము. నేను అనుగ్రహిస్తాను గనుక, వారు ఫలములను పొందెదరని దాని యర్థము. దీనిలో 'హి' యనగా 'ఎందువలననగా' అని యర్థము. పరమేశ్వరుడు సర్వజ్ఞుడు కావున, 'ఈ కర్మ ఈ ఫలము నిచ్చును' అను విషయమును అయన స్వయముగా ఎరుంగును. కావున, అయన కర్మఫలములను ఇచ్చే ఏర్పాటును చేయును. మానవుడు చేయు కర్మల నన్నింటినీ భగవానుడు లెక్కలోనికి తీసుకొనును. ఒకప్పుడు ఒకే విధంగా కనబడే రెండు కర్మలకు వేర్వేరు ఫలములు లభించును. ఇద్దరు వ్యక్తులు పుత్ర సంతానమును గోరి పుత్రకామేష్టిని చేసినారనుకొనుడు. ఒకడు అందమైన, తెలివితేటలు గల ఆరోగ్యవంతుడైన కుమారుని పొందెను. రెండవవానికి దృష్టి దోషము గల కుమారుడు జన్మించెను. అతడు చేసిన కర్మలో ఏదో దోషముండుటయే దీనికి కారణము. అతనికి పుత్రుడైతే కలిగినాడు. కాని అతడు చేసిన కర్మలో కొన్ని తేడాపాడాలు ఉన్నవి. మనము చేయు కర్మల కనురూపముగా మాత్రమే భగవానుడు ఫలముల నిచ్చును. వారిద్దరు ఒకే కర్మను చేసిరి. కాని ఒకడు రెండవవాని కంటె బాగుగా ఆ కర్మను చేసి మంచి ఫలమును పొందినాడు. దీనినంతయూ నిర్ణయించునదెవరు? సర్వజ్ఞుడగు భగవానుడని శ్రీ శంకరులు వాక్రుచ్చిరి.

'హి' అనగా 'నిశ్చయముగా' అని కూడ అర్థము గలదు. ఒక విశిష్టసాధనము ఒక విశిష్టఫలము నిచ్చును. కాని ఫలములో తార తమ్యములుండును. ఏలయనగా, ఒక క్రతువును నిర్వర్తించిన తీరులో భేదములుండును. మరియు, కర్తకు తాను చేయు క్రతువును గురించిన జ్ఞానములో కూడ భేదములుండును. క్రతువును చేయుచున్నప్పుడు యజమానికి దాని స్వరూపము ఎంతవరకు తెలిసినది అను దానిపై కూడా ఫలము ఆధారపడును. ఈ పరిస్థితు లన్నింటితో బాటు, యజమాని దక్షిణల నిచ్చుటలో కనబరచే ప్రవృత్తి కూడ ఫలమును ప్రభావితము చేయును. తన సంపద నష్టమగుచున్నదే యను భావనతో దక్షిణల నిచ్చినచో, ఫలము తగ్గిపోవును. ఏలయనగా, యజమాని పూర్ణ హృదయముతో, ఇంతకంటె అధికముగ నీయలేకపోతినే యను భావనతో దక్షిణ నీయవలెను. వ్యక్తుల శ్రద్ధలో, జ్ఞానములో, క్రతువులను చేయు తీరుతెన్నులలో తారతమ్యములుండును. ఫలమును ఇవి నిర్ణయించును. కావున, ప్రతివ్యక్తి తనకు అర్హమైన

ఫలమును మాత్రమే పొందును. ఇచట 'హి' యనగా 'నిశ్చితముగా, అనివార్యముగా' అని యర్థము. 'విహితాన్ హి తాన్' అను మూడు పదములుగా భేదమును చేసినప్పుడు ఈ అర్థములు వచ్చును.

'మయా ఏవ విహితాన్ హితాన్' అని రెండవ పదచ్ఛేదము. మానవునకు ఈ ఫలములు అభీష్టములు (హితాన్ కామాన్). శ్రీ శంకరులిచట ఒక హెచ్చరికను చేసిరి. కామము ఎన్నటికీ యథార్థమగు హితము కాజాలదు. కామనలు, ఆత్మ కంటె భిన్నమైన కామింపబడే వస్తువులు మానవునకు క్షేమమును కలిగించవు. అవి పరిపూర్తి కానిచో దుఃఖమును కలిగించును. పరిపూర్తి అయిన సందర్భాలలో నైననూ, అవి ఏదో ఒకనాటికి అంతమై దుఃఖమును కలిగించును. అవి దోషయుక్తములు గనుక హితములు (క్షేమకరములు) కావు. ఈ విషయమును శ్రీకృష్ణ భగవానుడు తరువాతి శ్లోకములో వివరించుచున్నాడు:

అధ్యాయము 7, శ్లోకము 23:

अन्तवत्तु फलं तेषां तद्भवत्यल्पमेधसाम् ।
देवान् देवयजो यान्ति मद्भक्ता यान्ति मामपि ॥ २३ ॥

అంతవత్తు ఫలం తేషాం తద్భవత్యల్ప మేధసామ్
దేవాన్దేవయజో యాంతి మద్భక్తా యాంతి మామపి (23)

తు = కాని; అల్పమేధసాం = అల్పమైన వివేకము గల; తేషాం = వారి యొక్క; తత్ = ఆ; ఫలం = ఫలము; అంతవత్ = నశించునదిగా; భవతి = ఉండును; దేవయజః = దేవతలను ఆరాధించువారు; దేవాన్ = దేవతలను ; యాంతి = పొందెదరు; మద్భక్తాః = నా భక్తులు; మాం = నన్ను; అపి = నిశ్చయముగా; యాంతి = పొందెదరు.

కాని అల్పమైన వివేకము గల వారి ఆ ఫలము నశించునదిగా ఉండును. దేవతల నారాధించువారు దేవతలను పొందెదరు. నా భక్తులు నన్ను నిశ్చయముగా పొందెదరు (23).

అల్ప వివేకము గలవారికి ఫలము అల్పము

తేషాం అల్పమేధసామ్. ఇట్టి పరిచ్ఛిన్నమైన లక్ష్యముల వెనుక పరుగెత్తెదరు గనుక, వారు 'అల్పమేధసః' అనబడుదురు. 'అల్ప' అనగా తక్కువ. 'మేధా' యనగా ఆలోచనా శక్తి. కావున

'అల్పమేధసః' అనగా తక్కువ ఆలోచనా/విచారణ శక్తి గలవారు. ఈ శ్లోకములో 'అల్పమేధసః యనగా తక్కువ వివేకము గలవారు అను అర్థము ప్రకరణమును బట్టి వచ్చును. వారు భక్తులే గనుక కొంత వివేకమును కలిగియుందురు. వారికి ధర్మాధర్మ వివేకము ఉండును. వారు ఏదో ఒక రూపములో ఈశ్వరుని గుర్తిస్తారు. కాని వారి వివేకము అల్పము. వారికి లభించే ఫలము కూడ అల్పము.

తత్ ఫలం అంతవద్భవతి. వారు చేయు కర్మలన్నిటి ఫలము అంతమును పొందునదిగా నుండును (అంతవత్). కాలదృష్ట్యా అది అంతవత్ అగును. అది కార్యము గనుక నశించుట నిశ్చయము. దేశదృష్ట్యా అది పరిచ్ఛిన్నము. ఒక స్థానమునకు గొంపోవు ఫలమేదైనా పరిచ్ఛిన్నమే. ఏలయన, ఒక స్థానమునకు వెళ్లిన జీవుడు మరియొక స్థానమును గోల్పోవును. స్వర్గమును పొందిన వ్యక్తి బ్రహ్మలోకాదులను పొందలేకపోవును. స్వర్గములో నైననూ అతడు ఒకానొక స్థాయిలో నుండి, ఆ స్థాయికి చెందిన లాభములను మాత్రమే భోగించును. కావున అతని భోగమునకు కూడ హద్దులు గలవు. అతడు కొన్నింటిని భోగింపగల్గినా, మరి కొన్నింటిని భోగింపజాలడు. మరియు అతడు పొందే దేహమునకు కొన్ని పరిమితులుండుటచే, అతడు అనుభవించగలిగే సుఖము యొక్క స్థాయికి కూడ మరల హద్దులు ఉండును. పైగా అతడు పొందే సుఖము ఏదైనా కొంతకాలము వరకు మాత్రమే ఉండును. కాబట్టి ఈ ఫలము ఏ దృష్టితో చూచినా అంతవత్ అగును. కావున, అల్పమగు వివేకము గలవారికి లభించే పూజాఫలము గూడ అంతవత్‌గా నుండును.

దేవాన్ దేవయజః యాంతి. వివిధ దేవతల నారాధించువారు, వివిధ దేవతల నుద్దేశించి క్రతువులను చేయువారు దేవయజః అనబడుదురు. ఇట్టి ఆరాధనల వలన వారు ఆ యా దేవతలను పొందెదరు (దేవాన్ యాంతి). వారు ఆ దేవతలు నివసించే లోకములను పొందెదరు. స్వర్గాదులలో నివసించే దేవతలు అగుదురు. ఇంద్రుని ఆరాధించు వ్యక్తి ఇంద్రలోకమును పొంది, అక్కడి దేవత యగును. కాని దేవతలు కూడా జీవులే.

ఈ సర్వము నిశ్చితముగా పరిచ్ఛిన్న లక్ష్యము మాత్రమే. కర్మ వలన లభించు అత్యధిక ఫలము ఇదియే. అచట వీరు దేవతల ప్రాసాదములలో నౌకర్లు కావచ్చును. దేవతలు ఇంద్రుని ఆరాధించగా, ఇంద్రుడు తన గురువైన బృహస్పతిని ఆరాధించును. ఇవి అన్నీ స్థానములు, పదవులు మరియు ఉపాధులు మాత్రమే. వీటిని అనుభవించువారు కేవల జీవులు మాత్రమే. వారికి అధికమగు శక్తులు, ఇంద్రియ సామర్థ్యములు గలవు. వారికి భోగించే శక్తి అధికము. కాని ఇదంతా ఒక నిర్దిష్ట కాలము వరకు మాత్రమే. వారిని అచటకు చేర్చిన పుణ్యము ఖర్చు అయిపోగానే, వారా లోకమును

వీడి మరియొక లోకమును పొందెదరు (క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి) అని శ్రీకృష్ణ భగవానుడు చెప్పగలడు.

సాక్షాత్తుగా ఈశ్వరుని కోరువారు ఈశ్వరుని పొందెదరు

మద్భక్తాః మాం అపి యాన్తి. దీనికి భిన్నంగా, సాక్షాత్తుగా నన్ను అన్వేషించువారు నన్ను పొందెదరు; వారు నాలో ఐక్యము కాగలరు. పరమేశ్వర తత్త్వమును, ఆత్మతత్త్వమును తెలియగోరు భక్తులు, పరమేశ్వరుడే ఆత్మ గనుక, నాలో ఐక్యమగుదురు. ఇంతకు ముందు చెప్పిన విషయమునీ శ్లోకము సమర్థించును. వారు 'ఈ సర్వము వాసుదేవుడే (వాసుదేవస్సర్వమ్)' అను జ్ఞానమును పొంది మహాత్ములగుదురు. ఒకే ఆత్మ గలదు. అదియే ఈశ్వరుడు. ఈ భక్తులు ఈశ్వరుని ఆత్మరూపముగా దర్శించెదరు. ఈ తీరున వారు నన్నే పొందెదరు.

ఈ రెండు రకముల భక్తులకు ప్రయాస సమానమే, కాని ఫలములో చాల భేదము గలదు

ప్రయాస సమానమే అయినా, ఫలములో చాల అంతరము గలదని శ్రీ శంకరులు వర్ణించిరి. దేవతల నారాధించువారు శ్రమపడెదరు. కాని వారు అనంత ఫలము కొరకు నన్ను ఆశ్రయించరు. వైదికకర్మలు చాల ప్రయాసతో కూడి యుండును. వాటి యందు శారీరిక క్రియ (కాయకర్మ), వాచిక క్రియ (వాక్కర్మ), మరియు మానసిక క్రియ (మానసకర్మ) ఉండును. యజమాని సంభారములను ప్రోగుచేసుకొని, ప్రత్యేక శ్రద్ధతో క్రతువును యథావిధిగా అనుష్ఠించవలెను. ఆ పై నాతడు దక్షిణల నీయవలెను. సరియగు మంత్రములను సరియగు రీతిలో పఠించవలెను. దేవతను ధ్యానించవలెనని విధి గలదు. ఇదియూ సరళము గాదు.

పరమేశ్వరాన్వేషణలో కూడ ప్రయాస గలదు. సాధకుడు ఈ జ్ఞానసాధనకు అంకితము కావాలి. లౌకికులు అనుభవించే కొన్ని సుఖములను సాధకుడు పరిత్యజించవలెను. తరువాత భాషను నేర్చి, తర్కమును అధ్యయనము చేయవలెను. ఈ రోజులలో సాధకులు ప్రాథమిక విద్యను చదివే ఉంటారు గనుక, వారికి ఎంతో కొంత తర్కము తెలిసి ఉండునని భావించవచ్చును. ఒక విశిష్ట బౌద్ధిక అనుశాసనము లేనిదే వేదాంతము అవగాహనకు రాదు. పూర్వకాలంలో తర్క వ్యాకరణములను చదువుట వలన ఈ అనుశాసనము అబ్బేడిది. వాస్తవంలో సంస్కృత వ్యాకరణమును చదివినంత మాత్రాన, సరియగు దిశలో ఆలోచించే సామర్థ్యము అలవడును. దీనికి చాలా కష్టపడాలి. తర్కమును చదువుటలో మరింత క్లేశము గలదు. చాల శ్రమ పడనిదే తర్కము లొంగదు. దాని

పడికట్టు భాషను లొంగదీసుకోవాలి. దాని భాషకు ఇతర సంస్కృతముతో పోలికలేదు. 'కుండ నీటితో నిండి యున్నది' అను వాక్యమును తార్కికులు 'కుండ అను పదము ఈశ్వర సంకేతముచే బోధించు వస్తువు, నీరు అనే పదము ఈశ్వర సంకేతముచే బోధించు వస్తువుతో నిండియున్నది' అని చెప్పెదరు. నిండియుండుట అనగా ఎక్కువ కాదు, తక్కువ కాదు. తార్కికులు ఈ వాక్యమును రెండు పేరాలలో చెప్తారు. భారతీయ తర్కము ఈ విధముగా చాల సమగ్రముగా నుండును.

వైదిక కర్మలో చాల ప్రయాస గలదు. వేదాంత విచారములో కూడ చాల ప్రయాస గలదు. కాని ముందు దానికి ఫలము అల్పము. తరువాతి దానికి ఫలము అనంతము. దాని యందు అన్వేషణ చేసే కర్త లీనమగును. ఇది ఎట్టి బేరము? దీనిలో బేరమేమీ లేదు. వివేకికి ఇచట వికల్పము కూడా లేదు. అవివేకికి మాత్రమే రెండు వికల్పములున్నట్లు భాసించును.

ప్రయాసలో కూడ అంతరము గలదు

వాస్తవంగా ప్రయాస సమానము కాదు. పరమాత్మ సాధకుని ఆత్మ కంటె వేరుగాదు. కాన, అభేదము నిత్య సిద్ధము. కాని, వివేకము లేని మానవుడు దానిని పరిత్యజించి, ఇతరముల వెంట పడును. మానవుని చేతిలో అమృతమున్నది. కాని దానిని అతడు పారవేసి, గంజి కొరకై చేతిని చాచును. ఏ ప్రయాసయూ లేకుండగనే ఆత్మ నిత్యలభ్యమై యున్నది. అతడు దానిని స్వంతము చేసుకున్న చాలును. దీనికి ఒకే ఒక ప్రయాస ఆవశ్యకమగును. అదియే జ్ఞానము. కాని, మానవుడు వివేకముచే ఈ సత్యమును గుర్తించనిచో, చాల ప్రయాసలు పడవలసియుండును.

ఏ కర్మ వలన ఏ ఫలము లభించును? అను విషయములో స్పష్టత, మరియు వైరాగ్యము గల వ్యక్తి జ్ఞానమును ప్రేమించును. అతడు విచారమును చేసిన చాలును. దానిలో ప్రయాస ఏమి గలదు? కాని, అతడు ఈ జ్ఞానసాధనను ఆరంభించగానే, సమాజమంతయూ అతనిపై సానుభూతిని చూపును. అతడు గొప్ప త్యాగమును చేయుచున్నాడని సమాజము తలపోయును. అతనికి ఏమైనది చెప్పుమా! అని లోకులు విస్తుపోయెదరు. కాని, తాను ఏదో త్యాగమును చేసితినను భావన అతనికి కలుగదు. అతడు జ్ఞానసాధనకు అంకితమైనవాడు గనుక, వాస్తవమగు త్యాగము గాని, ప్రయాస గాని లేవు.

ఇట్టి అంకితభావము గల వ్యక్తికి ఈ త్యాగము అనే ధారణ నిస్సారమనిపించును. కాయ పక్వానికి రాగానే చెట్టు నుండి క్రిందపడును. అది త్యాగమును చేయుట లేదు. అది చెట్టు నుండి

విడిపోనిచో, వ్రేలాడి కుళ్లిపోవును. అది క్రిందపడితే దాని నుండి మరియొక చెట్టు ఉదయించును. కొన్ని మానసిక సమస్యలు గల వ్యక్తి దృష్టిలో మాత్రమే త్యాగము గలదు. పరిణతి చెందిన వ్యక్తి దృష్టిలో త్యాగము లేదు. అతని దృష్టిలో సంసారమునకు అతీతుడగుట మాత్రమే గలదు.

అతడు దుస్సాహసమును చేసినాడని ఇతరులు భావిస్తారు. అతడు వివేకి యైనచో వారి భావనను అర్థం చేసుకొనగల్గుతాడు. వారి జీవనమూల్య సంరచన భిన్నమైనది. తరువాతి పూట భోజనము, నీకు ఎక్కడ లభించును? అని వారు అతనిని ప్రశ్నించినచో, 'ఆకలివేసినప్పుడు నేను దాని గురించి ఆలోచిస్తాను' అని అతడు ప్రత్యుత్తరము నిచ్చును. అతడు భవిష్యత్తును గూర్చి చింతిల్లడు. ఇట్టి వ్యక్తికి జ్ఞానసాధనలో ప్రయాస ఏమియూ ఉండదు.

ఈ సాధన అంతయూ విచారరూపమున నుండును గాన, అతనికి కావలసిన సాధనము బుద్ధి మాత్రమే. వైదిక క్రతువుల ననుష్ఠించుటకు అనేక సంభారములు కావలసియుండును. కాని జ్ఞానమునకు బుద్ధి ఒక్కటియే చాలును. మరియు విచారములో 'ప్రయాస పడుతున్నాను' అను భావన కలుగదు. ఏలయన, విచారములో కొత్త కొత్త విషయములు ఆవిష్కృతమగుచుండును. సాధకుడు కోరేది కూడా అదియే. విచారము అంతము నందు మాత్రమే గాక, సాధన జరుగుతున్న కాలములో కూడ హితకారి యగును. ఈ సాధన నిరంతర ఆనందపూర్ణ ప్రక్రియ. అది నుండి తనంత తాను ఒక లక్ష్యమై వెలుగొందును. కావున, ఇది ఇతర అన్వేషణల కంటె పూర్తిగా విలక్షణమైనది.

కావున, వాస్తవంలో 'ప్రయాసము సమానమే' అనిచెప్ప వీలు లేదు. ఫలముల విషయానికొస్తే, అవి నిశ్చితముగా విభిన్నములు. ఒకటి సంసారమైతే, మరియొకటి మోక్షము. ఇవి పరస్పర విరుద్ధములు. కాని, మానవులు సాక్షాత్తుగా భగవానుని ఆశ్రయించరు. కావున, శ్రీకృష్ణుడీ శ్లోకములో ఆక్రోశమును వెలిబుచ్చుచున్నాడు.

సాక్షాత్తుగా నన్ను అన్వేషించువారు నన్ను పొందెదరు. కాని, అర్థ కామములను అన్వేషించువారు వివిధ దేవతల నారాధించి, తాము కోరే అల్పఫలములను మాత్రమే పొందెదరు. మామ్ (నన్ను) అను పదమును శ్రీకృష్ణ భగవానుడిది వరలో వ్యాఖ్యానించి యున్నాడు. ఇచట మామ్ అనగా 'సర్వప్రాణుల ఆత్మ, జ్ఞానికి స్వస్వరూపముగా తెలియబడే ఆత్మ' అని యర్థము. 'జ్ఞాని నా సారభూతమగు తత్త్వము నెరుంగును గాన, అతడు నా కంటె వేరుగాడు'. ఇచటి నిరూపణ మంతయూ పరమాత్మ దృష్టి కోణము నుండి చేయబడినది. వ్యాసుడిచట శ్రీకృష్ణుని

ఈశ్వరునిగా పరిచయము చేయుచున్నాడు. లేదా, శ్రీకృష్ణుడు తనను తాను ఈశ్వరునిగా పరిచయము చేసుకొనుచున్నాడు. శ్రీకృష్ణుడు చారిత్రక వ్యక్తియా, లేక అవతారమా అనునది ప్రముఖమైన విషయము కాదు. తరువాతి శ్లోకము శ్రీకృష్ణుని మరింత స్పష్టముగా పరిచయము చేయుచున్నది.

అధ్యాయము 7, శ్లోకము 24:

अव्यक्तं व्यक्तिमापन्नं मन्यन्ते मामबुद्धयः ।
परं भावम जानन्तो ममाव्ययमनुत्तमम् ॥ २४ ॥

అవ్యక్తం వ్యక్తి మాపన్నం మన్యంతే మామబుద్ధయః
పరం భావమజానంతో మమావ్యయమనుత్తమమ్ (24).

మమ = నా యొక్క; అవ్యయం = మార్పులేని; అనుత్తమమ్ = సర్వశ్రేష్ఠమైన; పరం = అనంతమైన; భావం = స్వరూపమును; అజానం తః = ఎరుంగని; అబుద్ధయః = వివేకహీనులు; అవ్యక్తం = (ప్రమాణములువేటికి) గోచరము కాని; మాం = నన్ను; వ్యక్తిం = ఒక విశిష్టరూపమును; ఆపన్నం = పొందినవానినిగా; మన్యంతే = తలంచెదరు.

నా యొక్క మార్పులేని, సర్వశ్రేష్ఠమైన, అనంతమైన స్వరూపమును ఎరుంగని వివేకహీనులు ప్రమాణ గోచరము కాని నన్ను ఒక విశిష్టరూపమును పొందిన వానినిగా తలంచెదరు (24).

వివేకము లేనివాడు ఈశ్వరుని గుర్తించలేడు

అబుద్ధయః అనగా చాలినంత వివేకము లేనివారని యర్థము. 'అ' అనే నిషేధార్థక నిపాతకు ఈ ప్రకరణంలో అపర్యాప్తము (చాలినంత లేకపోవుట) అని యర్థము. ఉదాహరణకు, అధనుడు అనగా చాలినంత ధనము లేనివాడని యర్థము. మానవులందరికీ బుద్ధి గలదు. కాని, అల్పముగు వివేకము మాత్రమే గలవారు అబుద్ధయః అనబడుదురు. ఈ ప్రకరణంలోని అబుద్ధులు కూడా భక్తులే. కాని, వారికి వివేకము తక్కువ అగుటచే, వారు నన్ను శ్రీకృష్ణ రూపమును దాల్చిన విష్ణువుగా భావింతురు.

అవ్యక్తం వ్యక్తి మాపన్నం మన్యంతే మామ్. వారు నన్ను చూచి అవ్యక్తుడు వ్యక్తమైనాడని భావింతురు. అవ్యక్త శబ్దమునకు రెండు అర్థములు గలవు. అప్రకాశము, అనగా వస్తురూపముగా తెలియబడనిది అని శ్రీ శంకరులు వ్యాఖ్యానించిరి. మనకు లభ్యమయ్యే జ్ఞానసాధనము (ప్రమాణము)లలో వేటికీ అందనిది, మనచే ప్రత్యక్షముగా తెలియబడనిది అగు తత్త్వము అవ్యక్తమనబడును.

అవ్యక్తమనగా ప్రకటము కానిది అని రెండవ యర్థము గలదు. భగవానుడు ఇప్పుడు ఒక విశిష్టరూపములో ప్రకటమైనాడు అని వివేకహీనులు తలంచెదరు. వైకుంఠము నందుండే విష్ణుభగవానుడు ఇప్పుడు ఇచ్చట శ్రీకృష్ణ రూపములో అవతరించినాడని వారు భావింతురు.

వారికి ఈశ్వరుని యథార్థ స్వరూపము తెలియదు

మమ పరం భావం అజానంతః. ఈ పరిస్థితిలో వారు నా అనంత స్వరూపము (పరమాత్మ స్వరూపము)ను తెలియజాలరు. కావున, అవ్యక్త తత్త్వము వ్యక్తమైనట్లుగా భాసించును.

వ్యక్త పదమును మరోవిధంగా వ్యాఖ్యానించవచ్చును. పరమాత్మ స్వరూపము నిత్యవ్యక్తము.
అది ఎల్లవేళలా ఉపలభ్యముగనే యున్నది (నిత్య అపరోక్ష). దీనికి కారణములు ఇట్లున్నవి.
సర్వానుభవములు ఆత్మసారముతో నిండియున్నవి. ప్రతి అనుభవములో తెలివిడి గలదు. అది
ఆత్మస్వరూపమే. పూర్వములో మనకు దూరముగా నుండి, ఇపుడు మన అనుభవ క్షేత్రములోనికి
వచ్చిన వస్తువు ఒక అనుభవమును కలిగించును. కొద్దికాలం క్రితంలో ఈ అనుభవము లేదు. కాన,
ఈ అనుభవము ఏకరూపముగా భవిష్యత్తులో, మరుక్షణములో నైననూ, ఉండజాలదు. ఒకప్పుడు
ఈ వస్తువు బాహ్య పదార్థరూపములో గాక, కేవల మనోవృత్తి రూపముగా నుండవచ్చును. వస్తువు
ఏదైనా, వివిధ వస్తువుల అనుభవములలో మార్పు చెందనిది ఒకటి గలదు. అదియే అనుభవము.
వస్తువు అనుభవమునకు తగిలించబడే ఒక విశేషణము మాత్రమే. ఒక విశిష్ట వస్తువుతో సంబంధము
లేని అనుభవము శుద్ధమైనది. హారములలోని పూసలన్నియూ ఒకే సూత్రముచే కట్టబడియున్న
తీరున, అనుభవములన్నింటి యందు తెలివిడి గలదు. అదియే ఆత్మ స్వరూపము. అది నీకు
పరోక్షముగ నున్నదా? అది నీకు వస్తురూపములో ప్రత్యక్షమగుచున్నదా? అట్లు ప్రత్యక్షమయ్యే
పక్షంలో, అది పూర్వంలో నీకు కనబడలేదు గనుక, కొంతకాలం తరువాత మరల అదృశ్యము
కాగలదు. కాని ఆత్మ విషయంలో మనకు గల అనుభవమునకు ఇది విరుద్ధము. ఆత్మ
ఇంద్రియగోచరమగు వస్తువు కాదు. అనుమాన గోచరము కాదని చెప్పనేల? ఆత్మ ఉన్నది గనుకనే

అనుమానము సంభవమగుచున్నది. కాన, ఆత్మ మనకు దూరముగా నుండి అనుమితి చేయబడే వస్తువు (పరోక్షము) కాదు. అందువలననే, అది అపరోక్షమనబడును. అది సాక్షాత్తుగా తెలియబడునదే అయినా, ప్రత్యక్ష ప్రమాణ గమ్యము కాదు. అనుమాన ప్రమాణ జన్యము కాదు.

జ్ఞానోదయానంతరము కూడా అభిముఖ్యము (orientation) కొనసాగును

ఈ సత్యము నెరింగిన సాధకుడు నిరంతరము పరమేశ్వరుని తన మదిలో స్మరించుచూ జ్ఞానమును మననము చేయును; తత్త్వమును నిదిధ్యాసనము చేయును. శాస్త్రమును శ్రవణము చేసిన తరువాతనే దానిని స్మరించుట సంభవమగును. ఒక అనుభవమును పొందకుండగనే దానిని స్మరించుట సంభవము కాదు గదా!

మనము శాస్త్రము ద్వారా పరమేశ్వరుని తెలియగలము. కాని, శాస్త్రమును అధ్యయనము చేసి, దానిని విశ్లేషణ చేసిన వ్యక్తికి కూడా తాను దేహము అనే అభిముఖ్యము (దేహాత్మబుద్ధి) కొనసాగును.

అభిముఖ్యము (అలవాటు)నకు, భ్రాంతికి మధ్య భేదము గలదు. సరళమైన భ్రాంతి ఒక్కసారి వివరిస్తే తొలగిపోవును. నీవు తలుపు యొక్క తాళమును తెరుచుటకు దానికి సంబంధించని తాళం చెవిని ఉపయోగించితి వనుకొనుము. నీవు భ్రాంతిపడినట్లు నీకు వెంటనే తెలియును. తలుపు తెరువబడదు గదా! అపుడు నీవు సరైన తాళం చెవిని వినియోగిస్తావు. భ్రాంతి తొలగిపోవును. సమస్య పరిష్కృతమైనది. కాని, తలుపును తీసివేసి, దాని స్థానంలో, గోడను కట్టినారనుకొనుము. అచట తలుపులేదని నీకు తెలియును. కాని అలవాటు ప్రకారం నీవు కొంతసేపు తలుపును తెరిచే ప్రయత్నమును చేయబూనెదవు. అపుడు నీకు గుర్తు వచ్చును. అభిముఖ్యమనగా ఇదియే.

మరియొక దృష్టాంతమును చూచెదము. భారతదేశములో కారును నడిపే డ్రైవరు కుడివైపున కూర్చుండి నడుపును. అనగా, కారులో కూర్చుండే వ్యక్తి ఎడమ తలుపు తీసి లోపల కూర్చుండవలెను. కాని, అమెరికాలో డ్రైవరు ఎడమవైపు కూర్చుండును గనుక, కారులో కూర్చుండే వ్యక్తి కుడివైపున తలుపును తీసి లోపల కూర్చుండవలెను. కొంతకాలము అమెరికాలో నుండి భారతదేశమునకు వచ్చిన వ్యక్తి అలవాటు ప్రకారం కుడితలుపు వద్దకు వెళ్లును. ఎందువలన? భ్రాంతి వలన కాదు. అతనికి కుడి ఎడమలు తెలుస్తూనే ఉంటాయి. అమెరికాలో డ్రైవరు

ఎడమవైపున, భారతదేశములో కుడివైపున కూర్చుండుననియూ తెలియును. కాని ఒక అభిముఖ్యము (అలవాటు) ఏర్పడియున్నది.

ఇటువంటి అలవాటు గల వ్యక్తి గుర్తు పెట్టుకునే ప్రయత్నమును చేయాలి. భ్రాంతి తొలగిపోయినా, ఈ అలవాటు తొలగిపోదు. మరియు, సత్యమును ఒకసారి గుర్తుచేసుకున్నా, ఈ అలవాటు తొలగిపోదు. దేహమే ఆత్మ, ఆత్మయే దేహము అను ధారణకు దేహాత్మ బుద్ధి యని పేరు. ఈ భ్రాంతిని శాస్త్రము నిర్మూలించును. ఒకసారి ఈ ధారణ నిర్మూలింపబడితే, ఆ తరువాత సమస్యలు ఉండరాదు. కాని సమస్య కొనసాగుటయే మన అనుభవమై యున్నది. అనగా, శాస్త్రము సరిగా తెలిసి ఉండకపోవచ్చును. లేదా, అలవాటు వలన సమస్య కొనసాగును. ప్రస్తుత జన్మను మాత్రమే పరిగణించినా, ఈ ధారణలో అనేక సంవత్సరములు గడిచిపోయినవి. ఎవరో 'తత్త్వమసి' అని ఉపదేశించినంత మాత్రాన ఈ ధారణను తీసిపారవేయుట ఎట్లు సంభవమగును? అలవాటు తొలగుటకు సమయము పట్టును.

అలవాటును సరిదిద్దుట యెట్లు?

ఈ అభిముఖ్యము తొలగుటకు మనము ఉపదేశము అనే ప్రకాశములో మనస్సును కప్పిన ఆవరణలను తొలగించుకోవాలి. ఈ ఉపదేశము ప్రత్యక్షముగ నుండవచ్చును. లేదా, పరోక్షమైననూ కావచ్చును. ఈ విషయంలో బ్రహ్మాభ్యాసము అనే ఒక ప్రక్రియ గలదు. బ్రహ్మాభ్యాసమనగా బ్రహ్మను సంతతము మననము చేయుట (తచ్చింతనమ్), దాని గురించి మాటలాడుట (తత్కథనమ్), మరియు సాధకులు పరస్పరము చర్చించుకొనుట (అన్యోన్యం తత్ప్రబోధనమ్). నిదిధ్యాసనము కూడ దీనిలో భాగమే. ఈ విధముగా జ్ఞానాభ్యాసముతో కొంతకాలము జీవించుటకు స్మరణమని పేరు. ఇది అత్యావశ్యకము.

ఎంతవరకు అవశ్యకమో, అంతవరకు ఈ అభ్యాసమును కొనసాగించవలెను. శ్రీ శంకరులు మరో సందర్భంలో 'సతతం స్మరతి నిత్యశః' అన్నారు. నిత్యశః, సతతం అను రెండు పదములకు 'ఎల్లవేళలా' అనియే అర్థము. ఒకే అర్థము గల రెండు పదములు ఏల ప్రయోగింపబడినవి? 'సతతం' అనగా భగవానుని నిరంతరముగా, మధ్య మధ్యలో విడువకుండగా, స్మరించుట అను అర్థము వచ్చును. ఇచట స్మరించుట యనగా శాస్త్రములోని పదములచే ప్రతిపాదింపబడే ఈశ్వర యాథార్థ్యమును ధ్యానము చేస్తూ కాలమును గడుపుట అని యర్థము. నిత్యశః అను పదమునకు కూడ 'ఎల్లవేళలా' అనియే అర్థము. కాని ఈ పదము దీర్ఘకాల భావనను కలిగించును. భగవానుని

మనము ఒక రోజుగాని, రెండు రోజులు గాని, ఒక వారము గాని, లేదా ఒక సంవత్సరము గాని ధ్యానింపవచ్చును. అట్లైనచో, ఈ ధ్యానమును నిరంతరముగా ఎంతకాలము చేయవలెను? నిత్యశః. అనగా చిరకాలము ధ్యానమును చేయవలెను. నిత్యశబ్దముపై గల 'శః' అను ప్రత్యయమునకు బాహుల్యము అర్థము. 'నిత్య' అనగా ఎల్లవేళలా. 'శః'ను జోడించుటచే ఈ కాలము సుదీర్ఘము అని సూచింపబడినది. ఇది ఒకటి రెండు రోజుల వ్యవహారము కాదు. రెండు మూడు సంవత్సరముల వ్యవహారము కాదు. వ్యక్తి జీవించి యున్నంతకాలము ఈ సాధన కొనసాగును.

కాని ఇది క్లిష్టమగు ప్రక్రియ కాదు. ఇది చాల ఉల్లాసకరమైన ప్రక్రియ. 'నేనే పరమేశ్వరుడను' అను సత్యమును నీవు ప్రేమించెదవు. ఇది సర్వోత్కృష్టమైన ఆనందము. ఏలయన, నీవు అంతకంటె గొప్పవాడవు కాజాలవు. ఇది ఆత్మ సమ్మోహనము (self hypnotism) కానే కాదు. ఇది శాస్త్రజన్యమగు జ్ఞానము. మనము పునః పునః ఆ జ్ఞానమును స్మరిస్తాము. మనస్సు ఏదో విధంగా 'నేను పరమేశ్వరుడ నగుట యెట్లు సంభవము?' అను ప్రశ్నను లేవనెత్తుతుంది. మనస్సు వాదిస్తుంది. నీకు నడుము నొప్పి ఉన్నది. అట్టి నీవు పరమేశ్వరుడ వగుట ఎట్లు సంభవము? ఇవుడు నీకు నిదిధ్యాసనము చేయుటకు ఒక క్రొత్త విషయ వస్తువు సంప్రాప్తమైనది. కాని, వేదాంత దర్శనమునకు విరుద్ధమైన భావనల నన్నిటినీ ఎదుర్కొనవలెను. ఈ ప్రక్రియ ఎంతకాలము కొనసాగవలెను? వ్యక్తి జీవించి యున్నంత వరకు అని శ్రీ శంకరులు వ్రాక్రుచ్చిరి. ఆరంభములో సాధకుడు దీనిని సంకల్ప పూర్వకముగా చేయవలసి యుండును. క్రమముగా ఈ సాధన సహజ రీతిలో కొనసాగును. వాస్తవంలో, ఆలోచించటానికి బ్రహ్మ కంటె భిన్నమైన వస్తువు లేనే లేదు.

అహం పరమేశ్వరః అను సుస్పష్టమైన దర్శనము గల వ్యక్తికి సమస్య లేదు. అట్టి వానికి మనస్సు ఆక్షేపములను వేటినీ లేవనెత్తదు. మానసిక స్థితి గాని, స్థూలదేహ పరిస్థితి గాని ఆత్మ స్వరూపము కాదని అతడు యెరుంగును. వస్తువులను అతడు యథాతథముగా దర్శించగల్గును. అట్టి జ్ఞానికి చేయదగిన అభ్యాసమేమియూ లేదు.

కాని ఇట్టి స్మరణ ఆవశ్యకమైన సాధకుడు దీనిని ఎంతకాలము చేయాలి? ఎంతవరకు చేయనవసరమో, అంతవరకు చేయాలి. శ్రవణమును చేయుట, ఆక్షేపములకు సమాధానము నిచ్చుట, నిదిధ్యాసనము, మరియు సత్సంగముల ద్వారా నన్ను నిరంతరము జీవించి యున్నంత కాలము స్మరించు సాధకునకు నేను తేలికగా లభించెదను (సులభః) అని భగవానుడు చెప్పుచున్నాడు.

ఈశ్వర సాక్షాత్కారము సులభమా? ఎట్లు?

భగవానుడు సులభుడుగా నుండుటకు అనేక కారణములు గలవు. ఏ పనిని సాధించాలన్నా, కొంత శ్రమ తప్పదు. బట్టలను ధరించుటకైననూ కొంత శ్రమపడాలి. అంగి బిగుతుగా నుండి, నీవు తొందరలో నున్నచో, దానిని వీడుటయే మేలు. ఏలయన, దానిని ధరించుటకు అరనిముషం సమయము అదనంగా పడుతుంది. తొందరలో నున్న వ్యక్తి ఈ అదనపు శ్రమను, కాలయాపనను ఓర్వలేడు.

నీకు కొంత ధనము కావాలి యన్నచో, నీవు కొంత శ్రమపడవలయును. అధికారము కావలెనన్నచో, శ్రమపడాలి. నీకు సుఖము కావలెనన్నచో, శ్రమపడవలెను. అనేక విషయములను నేర్పుతో సరిదిద్దనిదే, ఒక సుఖకరమగు పరిస్థితి నిర్మాణము కాదు. దానిని నిర్మించుకున్న తరువాత, నీవు విశ్రమించి ఆనందించవచ్చును. నీవు స్వర్గమును పొందగోరినచో, మరింత శ్రమను చేయవలెను. అనేక నియమములను పాటించవలెను. అనేక విషయములను పరిహరించవలెను.

కాని బ్రహ్మప్రాప్తి సులభమని భగవానుడు చెప్పుచున్నాడు. బ్రహ్మలోకమును పొందుటకు అత్యధికమగు ప్రయాస అవశ్యకమగును. కాని బ్రహ్మను పొందుటకు ప్రయాస ఏమియూ అక్కరలేదు. బ్రహ్మను స్మరించుచుండుట ప్రయాస కాదా? కాదు. మనము ప్రేమించే వస్తువును సంస్మరించుటలో ప్రయాస లేదు. మనందరికీ అద్దము ముందు నిలబడుట ఇష్టమే. నేత్రవ్యాధిచే సరిగా చూడలేని ముదుసలియైననూ అద్దము ముందు నిలబడి తన ప్రతిబింబమును చూచుకునే యత్నమును చేయును. ఎందువలన? ఆత్మయందలి ప్రేమ వలన. ఇది ఒక ప్రయాస కాదు గదా! ప్రేమలో ప్రయాస లేదు. ప్రేమ సహజసిద్ధమైనది. ముముక్షువు పరమేశ్వరుని స్మరించుట ప్రేమతో నిండిన కార్యము గనుక, అది అతిసహజముగ నుండును. ఆత్మ స్వరూపము పూర్ణప్రేమ.

మానవుడు ఏ వస్తువును ప్రేమించినా, అది అంతతో గర్వా తన కొరకు మాత్రమే. వ్యక్తికి ఒక వస్తువు ప్రీతిని కలిగించును. కావుననే అది అతని ప్రీతికి పాత్రమగును. మానవుడు వాస్తవంలో ప్రేమించేది తన ప్రియమగు ఆత్మను మాత్రమే. ఆత్మయే పరమేశ్వరుడు. ఆత్మ ఆనందఘనము. కావున, ఆత్మ కంటె ఎక్కువ ప్రియమైనది, ఎక్కువ అభిలషణీయమైనది మరియొకటి ఉండబోదు. ఆత్మ పూర్ణము గనుక, పూర్ణ ప్రేమలో విషయమగును. కావున దానిని స్మరించుటలో క్లేశమేమియూ లేదు. ఇది ఒక ప్రేమ వ్యవహారము. ఆత్మ పరమ ప్రేమాస్పదము.

పరమేశ్వరా భిన్నమగు ఆత్మ నిత్యసిద్ధము గాన కొత్తగా సృష్టించేది ఏదీ లేదు. ఈ ఫలము ప్రయాస జన్యము కాదు. ఇది కేవలము జ్ఞానము వలన కలిగే ఫలము. దీనిలో ప్రయాసకు స్థానము లేదు. కొత్తగా జోడించేది ఏదీ లేదు. ఇంతకు ముందు ఉన్నదానిని తొలగించుటయూ కాదు. త్రికాలములలో సిద్ధించియే ఉన్న సత్యమును సాధకుడు గుర్తించిన చాలును. అదియే లబ్ధి. కావున, ఇది సులభము.

అజ్ఞానమును తొలగించుటకూడ ప్రయాసయేనని కొందరు వాదించవచ్చును. వాస్తవంలో సాధకుడు సత్యవస్తువును గుర్తిస్తాడు. ఆ గుర్తింపులో అజ్ఞానము తొలగిపోవును. సాధకుడు చేసే పని ఏమియూ లేదు. ఇది కేవలము ప్రమాణము చేసే పని మాత్రమే. కాన, ఇది సులభము.

నన్ను నిరంతరముగా స్మరించువాని మనస్సు ప్రశాంతముగా, సంతుష్టముగా నుండును. మరియు మనస్సు నియంత్రణలో నుండును. అనగా పరమేశ్వరుని మననము చేయునప్పుడు మనస్సు యొక్క చంచలత అడ్డు రాదు.

మనస్సు ఎప్పుడు ఖాళీగా ఉంటే అప్పుడు భగవానునివైపు పరుగెత్తును; ప్రియుడు ప్రియురాలి వద్దకు పరుగెత్తినట్లు పరుగెత్తును. ప్రేమ ఎక్కడ ఉంటే, మనస్సు అక్కడికి సహజంగా ప్రసరిస్తుంది. దానికి పూర్వ నిర్ణీతకాలము (appointment)తో పనిలేదు. అటులనే, ముముక్షువగు జిజ్ఞాసువు యొక్క మనస్సు సహజముగా పరమాత్మ వస్తువు పైకి ప్రసరించును. భగవంతుడు తెలిసిన పిమ్మట, మనస్సు మరియెక్కడికి పోగలదు?

ఆ పరిస్థితి వచ్చు వరకు సాధకుడు శ్రవణము జేయును. ఆరంభములో సాధకుడు సంకల్ప బలముచే సాధనను చేయును. క్రమముగా విషయవస్తువు సామ్రాజ్యమేలును. ఆ తరువాత సాధకునకు సంకల్ప బలముతో పనిలేదు. ఇది కుంభమేళాకు వెళ్ళుట వంటిది. దానికి దారిని చూపే పటము (road-map)తో పని లేదు. కుంభమేళాకు వెళ్ళే జనసమూహమునకు ముందు నిలబడితే, ఆ మహాజన ప్రవాహములో ముందుకు కదలుటయే గాని, వెనుకకు మరలుట సంభవము కాదు. కదలిపోయే వేదికపై ఎక్కినట్లుండును. వెనుక నుండి జనం తోస్తూ ఉంటే, మనము ముందుకు పోతూ ఉంటాము. ఈ జనప్రవాహములో చిక్కుకున్న వ్యక్తి పోయి పోయి గంగానది ముంగిట ఆగుతాడు.

ఇక్కడ కూడా జరిగేది ఇంతే. ఈ జ్ఞానమును గూర్చిన స్మృతి ప్రవాహములోనికి ప్రవేశించుటకు ఒక విశిష్టమగు సంకల్పశక్తి ఉండవలసినదే. కాని ఒకసారి ఈ జ్ఞానమును గురించిన అవగాహన కలిగితే, ఆ పైన ప్రయాస ఏమీ ఉండదు.

వివేకము లేని వ్యక్తులు నా యథార్థ స్వరూపమును తెలియలేక, నన్ను ఆకారము గలవానినిగా భావిస్తారని శ్రీకృష్ణ భగవానుడు పూర్వశ్లోకములో చెప్పియున్నాడు. 'ఈతడు నా కంటె వేరుగా నున్న, ఎక్కడినుండియో ఇక్కడకు వచ్చిన, శరీరమును ధరించిన భగవానుడు' అని వారు భగవంతుని గూర్చి తలంచెదరు.

వాస్తవంలో జగత్తు అంతయూ భగవానుడే. సర్వప్రాణుల ఆత్మ భగవానుడే. ఇదియే భగవానుని స్వరూపము. భగవానుడు నిర్వికారుడు. భగవానుని కంటె గొప్పది మరేదీ లేదు. ఈ సత్యము నెరుంగని మానవులు, భగవానుడు శరీరమును ధరించిన సాకారుడని తలంతురు.

శ్రీ శంకరులిచట కొన్ని ప్రశ్నలను ప్రస్తావించిరి. ఈ అజ్ఞానమునకు కారణమేమి? మానవులు చిల్లర ఫలములను గోరి ఇతర దేవతల నాశ్రయించుటకు కారణమేమి? మానవులు సాక్షాత్తుగా భగవానుని మాత్రమే ఏల శరణు జొచ్చుట లేదు? ఈ ప్రశ్నలకు శ్రీకృష్ణ భగవానుడు తరువాతి శ్లోకములో సమాధానము నిచ్చుచున్నాడు:

అధ్యాయము 7, శ్లోకము 25:

नाहं प्रकाशस्सर्वस्य योग मायासमावृतः ।
मूढोऽयं नाभिजानाति लोको मामजमव्ययम् ॥ २५ ॥

నాహం ప్రకాశస్సర్వస్య యోగ మాయాస మావృతః
మూఢోఽయం నాభిజానాతి లోకో మామజమవ్యయమ్ (25).

యోగమాయా సమావృతః = యోగమాయచే పూర్తిగా కప్పివేయబడిన; అహం = నేను; సర్వస్య = అందరికీ; న ప్రకాశః = తెలియబడను; మూఢః = మోహితమైన; అయం = ఈ; లోకః = లోకము/ వ్యక్తి; అజం = పుట్టుకలేని; అవ్యయం = నాశము లేని; మాం = నన్ను; న అభిజానాతి = గుర్తించుట లేదు.

యోగమాయచే పూర్తిగా కప్పివేయబడిన నేను అందరికీ తెలియబడను. మోహితమై యున్న ఈ లోకము/వ్యక్తి పుట్టుక నాశము లేని నన్ను గుర్తించుట లేదు (25).

ఈ శ్లోకమునకు మరియొక అన్వయము గలదు: అందరు నన్ను తెలియజాలరు. యోగమాయచే పూర్తిగా కప్పివేయబడిన ఈ మూఢలోకము పుట్టుక మరియు నాశములేని నన్ను గుర్తించజాలదు (25).

మాయచే జ్ఞానము కప్పివేయబడుటచే, అందరు భగవానుని గుర్తించరు

న అహం ప్రకాశస్సర్వస్య. మానవులందరు నన్నెరుంగరు. న అహం ప్రకాశః. అనగా నేను స్పష్టముగా తెలియబడను అని యర్థము. నన్ను ఇప్పుడు చూస్తున్న వారు కూడా నేను బృందావనము నుండి వచ్చిన బాలుడనియే తలపోస్తారు. వారు నా వాస్తవ స్వరూపమును ఏ మాత్రమూ గుర్తించరు. అందరు నన్ను తెలియజాలరు. కొందరు భక్తులు మాత్రమే నన్ను గుర్తిస్తారని శ్రీ శంకరులు అదనంగా జోడించినారు. అనగా నన్ను కోరి, నన్ను గుర్తించే అర్హత గలవారికి మాత్రమే నేను దర్శనమిస్తాను. అందరికీ కాదు. ఎందువలన?

లోకః యోగమాయా సమావృతః. మానవులు మాయచే కప్పబడియున్నారు. 'యోగ' అనగా మూడు గుణముల కలయిక యని శ్రీ శంకరులు వ్యాఖ్యానించిరి. అదియే మాయ. మూడు గుణముల సమాహారమైన ఆ మాయచే వారు కప్పివేయబడినారు.

మానవులు మూడు గుణములచే మోహితులగుదురని ఇదివరలో చెప్పబడినది (త్రిభిర్గుణమయైరేభి స్సర్వమిదం జగత్ మోహితమ్, 7-13). త్రిగుణ కార్యమగు జగత్తు మనలను మోహింపజేయుచున్నది యని మనము చూచియున్నాము. సత్త్వము సుఖమునకు, రజస్సు దుఃఖమునకు, తమస్సు జడత్వమునకు హేతువు అగును. మానవులు వీటిచే కప్పివేయబడుదురు. ఆవృతః అనగా కప్పివేయబడుట. సం-ఆవృతః అనగా పూర్తిగా కప్పివేయబడుట. మానవులు త్రిగుణాత్మకమగు యోగమాయచే, తత్కార్యములచే పూర్తిగా కప్పివేయబడి ఉన్నారు.

కప్పివేయబడినది ఏది?

ఏది కప్పివేయబడినది? అనేది ప్రముఖమైన ప్రశ్న. ఆత్మ చైతన్యమే కప్పివేయబడిన దనుకొనుడు. అప్పుడు మనము దేనిని తెలియజాలము. అంటే జగత్తు ఉండదు (జగదాంధ్య

ప్రసంగః). ఈ పదమును మనము తెలుసుకోవాలి. నేను తరుచుగా ఈ పదమును ఉపయోగిస్తాను. జగత్తు లేకపోవుట ఎట్లు సంభవము? కన్నులకు అవరోధమున్నచో, మనము చూడలేము. ఇతరేంద్రియములకు అవరోధమున్నచో, అవి తమ కార్యములను నిర్వర్తింపజాలవు. అదే విధముగా, ఈ యోగమాయ వాస్తవంగా చైతన్యమును అవరోధించినచో, అపుడు మనము దేనినీ యెరుంగజాలము. మనస్సు జగత్తును అవలోకింపజాలదు (జగదాంధ్య ప్రసంగః). జగదాంధ్యము అనగా జగత్తు విషయంలో గ్రుడ్డివాడగుట. ఇది మన అనుభవమునకు విరుద్ధము.

మనము జగత్తును అవలోకిస్తూనే ఉన్నాము. కావున, చైతన్యము దేనిచేతనూ కప్పివేయ బడలేదు. అందువలన చూచుట, వినుట, ఆలోచించుట ఇత్యాదులను చేయగల్గుతున్నాము. నేను సంసారిని; అందువలననే, ముముక్షువును అని చెప్పగల్గుతున్నాను. చైతన్యము ఏనాడూ కప్పివేయబడలేదు గనుకనే ఇదంతయూ సంపన్నమగుచున్నది.

అట్లైనచో, కప్పివేయబడునది యేది? లోకము అని ఈ శ్లోకము చెప్పుచున్నది. లోక్యతే అనేన ఇతి లోకః. దీనిచే సర్వము తెలియబడి అనుభవింపబడుచున్నది అను అర్థములో లోకః అని ప్రయోగము. ఇది నిర్విశేష ఆత్మ చైతన్యమా? లేక జ్ఞాతృత్వ విశిష్టమగు ప్రమాతృ చైతన్యమా? చైతన్యమునకేనాడూ ఆవరణ లేదు. ఈ విషయమును మనము చూచియున్నాము. కావున, ఇచట లోకః అనగా వస్తువును గుర్తించువాడు, తెలియువాడు అని యర్థము. ఇట్టి ప్రమాత దృష్ట్యా మాత్రమే ఆవరణ గలదు.

ప్రమాతకు ఆత్మ స్వరూపము ఆవృతమై యున్నది. అతనికి అది తెలియలేదు. తెలివిడి అంతయూ తెలియువాని కొరకు మాత్రమే గదా! కాని తెలియువాని అపేక్షయా ఆత్మస్వరూపము అజ్ఞానము (మాయ)చే ఆచ్ఛాదితమైనదని మనము చెప్పెదము. ఆత్మయే కర్త, భోక్త యను భ్రాంతి కలిగినది. కావున, జనన మరణాది సంసారమునకు వశుడైన కర్త సంపన్నుడైనాడు. ఇది అంతయూ తత్త్వతః చైతన్యమనుడైన జ్ఞాతకు గల భ్రాంతి మాత్రమే. జ్ఞాతృరూపములో ఉపలభ్యమయ్యే చైతన్య ఘన స్వరూపము అజ్ఞానముచే ఆవృతమైనది.

భ్రాంతుడగు వ్యక్తి నన్ను గుర్తించజాలడు

మూఢః న అభిజానాతి మామ్. మనస్సు మాయచే పూర్తిగా ఆవృతమైనప్పుడు, వ్యక్తి భ్రాంతుడై నన్ను గుర్తించలేకపోవుట సహజమే. బాహ్య ప్రపంచము, స్థూలదేహము ఇత్యాదులకు భ్రాంతి లేదు. ఆత్మ చైతన్యమునకు కూడ భ్రాంతి లేదు. ఈ సృష్టిలో భ్రాంతికి వశమయ్యేది ఒకే

ఒకటి గలదు. అదియే అంతఃకరణము. భ్రాంతులన్నియూ దాని యందు నివాసముండును. లోకః అనగా మనస్సుచే పరిచ్ఛిన్నమైన చైతన్యము. అదియే జ్ఞాత. ఈ జ్ఞాత నన్ను తెలియకున్నాడు. ఈ జ్ఞాత మాత్రమే భ్రాంతుడైనాడు. ఇతరము లేవీ కావు. కావున, ఈ జ్ఞాతకు నేను తెలియుట లేదు (మాం న అభిజానాతి).

అభిజానాతి అనునది చాల చక్కని పదము. జానాతి యనగా తెలియుచున్నాడు. అభిజానాతి యనగా యథార్థముగా తెలియుచున్నాడు. న అభిజానాతి యనగా యథార్థముగా తెలియకున్నాడు అని యర్థము. భక్తులందరు ఈశ్వరుని తమ కంటె భిన్నముగా ఏదో ఒక రూపములో తెలుసుకుంటారు. వారి దృష్టిలో ఈశ్వరుడు పరోక్షుడు. అనగా జగత్తులో ఎక్కడనో ఉన్న మరియొక వ్యక్తి. 'ఈ జగత్తు అంతా నేనే. కాని భక్తుడు జగత్తును నా కంటె భిన్నముగా దర్శిస్తాడు. అతని ఆత్మను నేనే అయినా, అతడా సత్యమును గుర్తించడు. దీనికి భిన్నంగా, నా గురించి అతడు ఏ ధారణలను ఏర్పరుచుకుంటాడో, అవి నేను కాను'. ఉన్నది ఒకే ఒకటి. అదియే బ్రహ్మము. చరిత్ర లేదు. జీవిత చరిత్ర లేదు. సమస్యలు లేవు. సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ. పూర్వములో బ్రహ్మ అటులనే యుండెను. ఇప్పుడు అటులనే యున్నది. భవిష్యత్తులో సదా అటులనే ఉండగలదు. కాని అతడా సత్యము నెరుంగడు. 'నన్ను ఎరుంగని మానవుడు తనను తాను కూడ యెరుంగడు. తాను ఏది కాదో అది తాను అని అతడు భావిస్తాడు. మానవుడు 'నేను' అంటూనే విస్తారమగు చరిత్రను ఏకరువు పెడతాడు. దానికి మనో విజ్ఞాన శాస్త్రము స్వప్నావస్థను, సుషుప్తి అవస్థను జోడించును. అనగా అతనికి వివిధ రకముల చరిత్రలు గలవు. అవి అన్నియూ ప్రమాణసిద్ధములే. ఏలయున, అతడు నన్ను యెరుంగడు (మాం నాభిజానాతి)'.

'అతడు నన్ను యెరుంగును. కాని, అతనికి నన్ను గురించి తెలిసినది నా విషయములో భ్రాంతి పడుటకు మాత్రమే సరిపడును'. ఒక వస్తువును గురించి ఎంతో కొంత జ్ఞానము ఉన్నప్పుడు మాత్రమే, దాని విషయంలో భ్రాంతి సంభవమగును. త్రాడు కనబడినప్పుడు మాత్రమే దాని యందు సర్పభ్రాంతి కలుగును. అటులనే, ఆత్మను గురించి ముందుగా ఎంతో కొంత తెలిస్తే, ఆ తరువాత దాని గురించి భ్రాంతి పడుట సంభవమగును. సైగా, ఆత్మ అందరికీ తెలిసినదే. ఆత్మ స్వయం సిద్ధము, నిత్య అపరోక్షము. మన బుద్ధి ఆత్మ విషయములో సంతతముగా భ్రాంతి పడుటకు, మనకు ఆత్మ గురించి తెలిసినది చాలును.

మనమీ భ్రాంతిని మరింత పెంచుకుంటూ ఉంటాము. మన అనుభవములు ఈ భ్రాంతిని మరింత జటిలము చేయును. దీనినే మనము జీవితము అని పిలుస్తాము. ఒక మౌలికమైన భ్రాంతి

గలదు. అనేక ఇతర భ్రాంతులు దాని ననుసరించి యుండును. ఇవి మౌలిక భ్రాంతిని దృఢము చేయును. మనమీ భ్రాంతులను సరిదిద్దుకునే ప్రయత్నంలో నిమగ్నమై యుండగా, ఆ మౌలిక భ్రాంతి వీటన్నింటి క్రింద దాగియుండును. అది పైకి కనబడకపోవచ్చును. కాని సర్వదా ఉండును.

కావున ఈ అప్రధాన భ్రాంతులను ఎంత సరిదిద్దినా, మనకు సరియగు పరిష్కారము లభించదు. ఇది అంకగణితములో లెక్కను చేయుట వంటిది. విద్యార్థి ముందు కూడికలో, తరువాత గుణకారములో, ఆ పై భాగహారములో తప్పును చేసినాడనుకొనుడు. అతడు తరువాత భాగహార గుణకారములలోని తప్పును సరిదిద్దుకున్నాడనుకొనుడు. కూడిక చాల సరళమైనది గనుక, దానిలో తప్పు చేయనని అతడు భావించెను. కావున, లెక్క యొక్క జవాబు తప్పు అగును. సంసారి విషయములో కూడ మౌలిక భ్రాంతి అటులనే మిగిలియుండును. మనము సాధనను ఆరంభించుటకు ముందు, 'ఆత్మ రూపుడనగు నేను సాధకుడనగుదునా?' అను విషయమును తెలుసుకొనుట మొదటి యడుగు అగును. 'నేను సాధనను చేయవలెనా?' ఈ మొదటి పదములోని భ్రాంతిని సరిచేసుకొనని వ్యక్తి దానిని అనుసరించి వచ్చే ఇతర భ్రాంతులను అనవరతముగా సరిదిద్దుకొనుచుండును. ఇది నిరర్థకము.

ఆత్మ యొక్క అజ్ఞానము చాల విలక్షణమైనది

ఈ ఆత్మ యొక్క అజ్ఞానము ఘటాది వస్తువుల అజ్ఞానము కంటె విలక్షణమైనది. ఈ జగత్తులో మనకు తెలియని ఘటాది వస్తువులు లెక్కలేనన్ని ఉన్నాయి. అనగా, అవి మన అజ్ఞానమునకు గాని, అజ్ఞానములో విషయము లగును. కాని ఆత్మ ఘటము వలె మన అజ్ఞానమునకు గాని, జ్ఞానమునకు గాని విషయము కాదు. ఘటమునకు ఆధారము యోగమాయ. కాన ఘటము యోగమాయలో విషయము కాగల్గును. కాని ఆత్మకు యోగమాయ ఆశ్రయము కాదు. ఆత్మ స్వయంసిద్ధము. జ్ఞానాజ్ఞానములు రెండింటికీ ఆశ్రయము ఆత్మయే.

యోగమాయచే కప్పబడుట యనగా తాత్పర్యమిది. బుద్ధిలో ఉదయించవలసిన జ్ఞానము ఇప్పుడు త్రిగుణకార్యములచే కప్పబడి, అవరుద్ధమైనది. అవరోధము ఆత్మకు కాదు. జ్ఞానము ఉదయించవలసిన మనస్సులో అవరోధము గలదు. అనగా, అది శాశ్వతముగా దూరమగు వరకు అచటనే యుండును!

ఆత్మ జ్ఞాన వైలక్షణ్యము

జ్ఞానము యోగమాయచే అవరుద్ధమైనది అని మనము చెప్తాము. ఈ జ్ఞానము అను మాటకు అర్థమేమి? రెండు అర్థములు గలవు. శుద్ధ చైతన్యము (జ్ఞప్తి స్వరూపం జ్ఞానమ్) ఒక అర్థము. 'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ' అను వాక్యములో జ్ఞానమనగా ఒక వస్తువు దేనిచేత తెలియబడునో అది. దీనినే వృత్తి జ్ఞానము అందురు.

శుద్ధ చైతన్యము యోగమాయచే అవరుద్ధము కాదు. అట్లు అవరుద్ధమైనచో జగదాంధ్య ప్రసంగము ఏర్పడునని మనము చూచియున్నాము. కావున, పరిశేష న్యాయముచే, దేని చేత పదార్థములు తెలియబడునో అట్టి వృత్తి జ్ఞానము మాయచే అవరుద్ధమగును. అజ్ఞానమును భ్రాంతిని తొలగించగల ఈ వృత్తి జ్ఞానము బుద్ధిలో వృత్తి రూపముగా ఉదయించును. ఇది ఉదయించగల స్థానము మరియొకటి లేదు. ఆత్మను మనస్సుచే మాత్రమే తెలియనగును (మనసా ఏవ అను ద్రష్టవ్యః).

యతో వాచో నివర్తంతే, అప్రాప్య మనసా సహ (తైత్తిరీయోపనిషత్తు) మొదలగు వాక్యములను శాస్త్ర పరిజ్ఞానము లేనివారు 'నీవు మనస్సును అతిక్రమించవలెను' ఇత్యాదిగా వ్యాఖ్యానించెదరు. శబ్దములు మనస్సుతో గూడి ఆత్మను దర్శించ జాలక, అనగా ఆత్మను విషయభూతముగా (objectify) చేయజాలక, వెనుకకు మరలినవి అని ఆ వాక్యమునకు అర్థము. వృత్తి తనలో విషయముగా చేసుకొనుటకు ఆత్మ లభ్యము కాదు. మనము ఘటము, వృక్షము ఇత్యాది పదార్థములతో సంబద్ధమైన (relate) తీరున, ఆత్మతో సంబంధమును ఏర్పరుచుకొనజాలము.

వృత్తిలో విషయమైన వస్తువుతో 'ఇది ఫలానా వస్తువు; నేను ఈ వస్తువు యొక్క జ్ఞాతను' అను విధముగా మనము సంబంధమును కలిగి ఉంటాము. ఆత్మ 'విషయము'గా గల వృత్తితో మనమీ విధముగా సంబద్ధులము కాగలమా? 'ఇది ఆత్మ' అని మనము ఇదమిత్థముగా చెప్పగలమా? అట్లు చెప్ప గలిగినచో, నీవెవరివి? జ్ఞేయవస్తువునకు, జ్ఞాతకు మధ్యలో ఈ జ్ఞాతృ-జ్ఞేయ భేదము సర్వదా ఉండును. కాని, ఈ భేదము జ్ఞాతృ స్వరూప విషయములో ఉండజాలదు. కావ, ఈ ఆత్మను గుర్తించుట సంభవమేనా? గుర్తించు విధమెయ్యది?

అసాధారణ ప్రమాణము, అసాధారణ వృత్తి, అఖండాకార వృత్తి

జ్ఞాన సాధనమగు ప్రమాణము మాత్రమే జ్ఞానోదయ హేతువగు వృత్తిని కలిగించగలదు. కాని ఆత్మ-అజ్ఞానమును తొలగించు వృత్తిని మనకు ఉపలభ్యమయ్యే ప్రత్యక్ష అనుమాన ప్రమాణములు కలిగించలేవు. అవి మనకు దృశ్యములను మాత్రమే తెలుపగలవు. కాని, ఆత్మ ద్రష్ట. ఆత్మ-అజ్ఞానమును పారద్రోలే వృత్తిని శబ్ద ప్రమాణము మాత్రమే కలిగించగలదు. ఆత్మ ప్రమాణ గోచరము కాజాలదు. ఆత్మ మూలకముగనే ఈ ప్రమాణము లన్నియూ పనిచేసి, వృత్తులను జనింపజేయుచున్నవి. కాని ఈ వినూత్నమగు వృత్తి జ్ఞానమును, ద్రష్టృస్వరూపమును బోధించే ఒక వాక్యము ద్వారా జనింపజేయగలిగినది శాస్త్ర ప్రమాణము మాత్రమే. ఇట్టి మహా వాక్యము ఆత్మ స్వరూపము యొక్క అజ్ఞానమును పారద్రోలే వృత్తిని కలిగించును. అట్టి వృత్తియే అఖండాకార వృత్తి.

అఖండాకార వృత్తి యనగా జ్ఞేయ వస్తువునకు, జ్ఞాతకు మధ్యలో భేదము లేదు. జీవేశ్వరులకు గల సమానధర్మము పరిచ్ఛేద రాహిత్యము (అఖండత). భేదములను నిషేధించిన తరువాత శాస్త్రము 'నీవే ఈశ్వరుడవు (తత్ త్వం అసి)' అని బోధించును. 'నీవు' అనే పదార్థము, 'ఈశ్వరుడు' అనే పదార్థము ఒకటియే అను బోధను కలిగించే వృత్తిని ఈ వాక్యము ఉత్పన్నము చేయును. జీవేశ్వరులతో సహా సర్వమునకు ఆశ్రయముగా నుండునది ఒకే ఒక చైతన్యము. ఆత్మ అఖండము అనే సత్యమును గురించిన అజ్ఞానమును నశింపజేసి ఈ వృత్తి మనస్సులో ఈ విశిష్ట సాక్షాత్కారమును కలిగించును.

దానికి ముందు జ్ఞాత, యోగమాయచే ఆవృతుడై యుండుటచే, తన అనంతత్వమును గుర్తించడు. మనస్సు గుణముల యొక్క, తత్కార్యముల యొక్క సమ్మోహనము నందుండగా, 'నేను బ్రహ్మను' అనే ఈ వృత్తి జ్ఞానము ఉదయించే అవకాశము లేదు. యోగమాయచే ఆవృతులైన మానవులు సహజముగనే మూఢులై, భ్రాంతులై నన్ను గుర్తించరు (మూఢః అయం మాం న అభిజానాతి).

తెలియబడవిది ఏది?

'నన్ను యథార్థముగా ఎరుంగని వాడు' అని భగవానుడు చెప్పుచున్నాడు గదా! ఈ 'నేను' ఎవరు?

'అజమ్' అనగా పుట్టుక లేని ఆత్మ. కొన్ని తత్త్వములకు పుట్టుక ఉండదు. కాని నశిస్తాయి. అజ్ఞానము దీనికి ఒక దృష్టాంతము. అజ్ఞానమునకు ఆది లేదు. అజ్ఞానమునకు ఆది యున్నచో, తత్పూర్వము నందు దానికి విరుద్ధమైన తత్త్వము ఉండి ఉండాలి. అజ్ఞాన విరోధి జ్ఞానమే. చీకటి లేదంటే వెలుతురు ఉండి తీరాలి. కాని, జ్ఞానము ఉన్నప్పుడు అజ్ఞానము ఎట్లు రాగల్గును? కావున, అజ్ఞానమునకు ఆది లేదని స్పష్టమగుచున్నది. అజ్ఞానమునకు అంతము లేదని కూడా మనము చెప్పగలమా? చెప్పలేము. ఆత్మ విషయక అజ్ఞానమునకు గాని, ఇతర అజ్ఞానములకు గాని ఆది లేదు. కాని అది తెలియగానే, దాని అజ్ఞానము అంతమగును.

ఆత్మ కూడా అనాదియే. ఆత్మకు ఆది గలదు అన్నచో ఆ ఆది లక్షణమును ఎవరో ఒకరు చూచి ఉండాలి. అట్లు గానిచో, అది పుట్టినదని తెలియుట యెట్లు? ఆత్మ పుట్టుకను చూచిన వాడు ఉండి యున్నచో, అతడు చేతన వ్యక్తి అయి ఉండాలి? కాని చైతన్యమే ఆత్మ. కావున, ఒకే ఆత్మ ఏక కాలము నందు తాను ఉన్నదై, తన అభావము ముగియుటను సాక్షిగా చూడజాలదు. ఆత్మ ఉన్నది గాన, దానికి అభావము, ఆపై అది పుట్టుట అనేవి అసంభవము.

అవ్యయము

ఆత్మకు ఆది లేదు. మరియు, అజ్ఞానమునకు ఉన్నట్లు దానికి అంతము లేదు. అది అవ్యయము. అది మార్పులకు గురికాదు. న వ్యేతి ఇతి అవ్యయమ్. దాని యందు అపక్షయము లేదు. వినాశము లేదు. నాకు పుట్టుక లేదనియు, నేను ఎన్నడునూ నశించననియు, నేను సనాతనుడనియూ వారెరుంగరని శ్రీ కృష్ణ భగవానుడు చెప్పుచున్నాడు.

భగవానునకు కూడా యోగమాయచే ఆవరణ గలదా?

శ్రీ శంకరులు ఇచట ఒక ప్రశ్నను లేవనెత్తిరి. భగవానుడు యోగమాయచే ఆవరింపబడి యుండుటచే ప్రాణులన్నియు అయనను యథార్థముగా తెలియజాలవు. అట్లైనచో, యోగమాయ అయన స్వరూపమును అయనకే తెలియకుండగా కప్పివేయదా? ఈ యోగమాయ ఆయన మాయయే గదా! అది లేనిదే, ఆయన దేనినీ చేయలేడు. కాని, అది అయనను కప్పివేసినచో ఆయన తనను తాను ఎరుంగజాలడు. ఈ వాదము సరిగాదని శ్రీ శంకరులు చెప్పినారు. మాయను వశము చేసుకొన్న మాయావికి ఈ యోగమాయ ఒక ఉపాధి. జీవునకు, ఈశ్వరునకు మధ్య గల భేదము

ఇదియే. యోగమాయ యొక్క మూడు గుణములు ఆయన యొక్క విభూతులు మాత్రమే. అవి ఆయనను ఏ తీరుగనూ బంధించవు; అవరోధమును కలిగించవు.

ప్రాచీనకాలంలో భారతదేశంలో ఇంద్రజాలికులు ఉండేవారు. వారికి మాయావులు అని పేరు. శ్రీ శంకరులు ఇట్టి మాయావిని తమ భాష్యములో వర్ణించినారు. ఇంద్రజాలికుడు సభాసదుల యెదుట మాయను సృష్టించును. అతని ఇంద్రజాలము సరళమగు హస్తలాఘవము కాదు. అతడు కొన్ని దృశ్యములను సృష్టించి ప్రేక్షకులచే దర్శింపజేసి, వాటిని మరల అదృశ్యము చేయును. ప్రేక్షకులందరు అతని ఇంద్రజాలముచే సమ్మోహితులగుదురు. కాని అతడు తాను స్వయముగా సమ్మోహితుడు కాడు. అతడు కూడ సమ్మోహితుడగునో, ఇంద్రజాలమే లేదు.

మాయావి యగు ఈశ్వరుడు ఇంద్రజాలికులలో అగ్రగణ్యుడు. ఆయన ఈ నామ రూపముల నన్నిటినీ సృష్టించినాడు. విశ్లేషిస్తే, వాటికి ఉనికి లేనే లేదు. ఉన్నది ఒకే ఒక చైతన్యము. కాని నామరూపములు భాసిస్తాయి. అదియే ఇంద్రజాలము.

కావున ఈశ్వరుడు ఇంద్రజాలికుడే. కాని, తన ఇంద్రజాలములో తాను సమ్మోహితుడు గాడు. కాని జీవులందరు ఆ మాయలో మునిగియున్నారు. ఈ మాయను తొలగించుటకు ఏమి చేయాలి? మాయావి వద్దకు వెళ్లి ఆ మాయలోని రహస్యమును అడిగి తెలుసుకోవాలి. మాయావి యగు పరమేశ్వరుని వెదికి, ఆ మాయ యొక్క తత్త్వమును, మాయావి స్వరూపమును తెలుసుకొనవలెను. శాస్త్రము చేసే పని ఇదియే. శాస్త్రము ఈ మాయావి యొక్క స్వరూపమును, మాయ యొక్క తత్త్వమును మనకు బోధించును. ఇంద్రజాల గ్రంథము ఇంద్రజాలములోని మర్మమును మనకు తెలుపుడు చేయును. శాస్త్రము కూడ చేయుపని అదియే. ఇంద్రజాలము చాల అద్భుతమైనది, అతి జటిలమైనది అనిపించును. కాని, దాని మర్మము తెలిసిన తరువాత సరళమనిపించును. అరే! మనమెంత మూర్ఖులమైతిమి! అనిపించునట్లు చేయును. ఇచట పరిస్థితి కూడా అంతే. తెలిసిన తరువాత, దాని కొరకు చేసిన అన్వేషణ అంతయూ అవివేకమనిపించును. మానవుడు ఈశ్వరుని కొరకు అన్వేషించుటలో మాధ్యము హేతువు. ఈ సత్యము నెరుంగుటకై మానవుడు మాయావి వద్దకు వెళ్లి మాయలోని మర్మమును దెలుపుమని గోరును. భగవానుడు ఆ మర్మమునే గీతలో వర్ణించినాడు.

మాయావి యగు ఈశ్వరుడు మాయచే ప్రభావితుడు గాడు. జీవునకు, ఈశ్వరునకు గల భేదము ఇదియే. భగవానుడీ విషయమును తరువాతి శ్లోకములో వివరించుచున్నాడు.

అధ్యాయము 7, శ్లోకము 26:

वेदाहं समतीतानि वर्तमानानि चार्जुन ।
भविष्याणि च भूतानि मां तु वेद न कश्चन ॥ २६ ॥

వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున
భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన (26)

అర్జున = ఓ అర్జునా!; **సమతీతాని** = భూతకాలము నందు ఉన్న; **వర్తమానాని** = వర్తమానకాలము నందున్న; **చ** = మరియు; **భవిష్యాణి** = భవిష్యత్కాలము నందు ఉండబోయే; **భూతాని** = వస్తువులను/ ప్రాణులను; **అహం** = నేను; **వేద** = ఎరుంగుదును; **తు** = కాని; **కశ్చన** = ఏ ఒక్కడూ; **మాం** = నన్ను; **న వేద** = ఎరుంగడు.

ఓ అర్జునా! భూత వర్తమాన భవిష్యత్కాలముల యందలి వస్తువులను/ ప్రాణులను నేను ఎరుంగుదును. కాని ఏ ఒక్కడూ నన్ను ఎరుంగడు (26).

'నన్ను నేను ఎరుంగుదును (ఈ వాక్యమును అధ్యాహారము చేయవలెను). ఇంతే గాక, గడచిపోయిన దానిని కూడ నేను ఎరుంగుదును' అని భగవానుడు చెప్పుచున్నాడు. అతీతాని అనగా గడచినవి. 'సం' అను ఉపసర్గను చేర్చినప్పుడు గడచిన సర్వము అను అర్థము వచ్చును. భూతాని అనగా సర్వప్రాణులు. వర్తమానాని చ అర్జున = ఓ అర్జునా! ఇప్పుడు ఉన్న సర్వప్రాణులను, పదార్థములను. భవిష్యాణి చ భూతాని = భవిష్యత్తులో పుట్టబోయే సర్వప్రాణులను. మాం తు వేద న కశ్చన = కాని నన్ను ఎరింగిన వాడెవ్వరూ లేడు. భగవంతుని శరణు జొచ్చిన వాడు తక్క, భగవంతుని ప్రత్యగాత్మ రూపముగా దర్శించువాడు తక్క అని శ్రీ శంకరులు బోధించిరి. భగవంతుని ఎరింగినవాడు కనీసము ఒక్కడైనా ఉండాలి. లేనిచో శాస్త్రము వ్యర్థమయ్యేడిది.

ఎప్పుడు ఈశ్వరుడు తెలియబడడు?

మత గ్రంథములన్నియు ఈశ్వరుడు సర్వజగత్తునకు నిమిత్త కారణమని అంగీకరిస్తాయి. ఈ గ్రంథముల దృష్ట్యా ఈ సృష్టి యథార్థము. ఇది ప్రధాన సమస్య. ఈశ్వరుడు ఈ వాస్తవ సృష్టిని శూన్యము నుండి నిర్మించినాడని వాదించే మతవాదులు కొందరు దీనిని మరింత జటిలము చేయుచున్నారు. శూన్యము నుండి వస్తువు పుట్టుట యెట్లు? ఇది చాల అసంగతము. దీనిచే

ఇంకొరకముగా చెప్పువారు గలరు. ఈశ్వరుడు ఈ జగత్తును తన శక్తి నుండి సృష్టించినాడని వీరు చెప్పెదరు.

భగవానుడు ఈ జగత్తును మాత్రమే గాక, సర్వప్రాణులను, వ్యక్తులను, దేహములను, మనస్సులను కూడ సృష్టించెను. ఈ వాదము ననుసరించి మతవాదులలో కొందరు మానవులకు మాత్రమే ఆత్మ గలదని భావిస్తారు. పశువులకు, ఇతర ప్రాణులకు ఆత్మ ఉండదని వీరి అభిప్రాయము. ఇందువలననే వారిలో చాల దృఢమగు మతానుయాయి కూడా పశువులను సంహరించి మాంసమును భక్షించుటకు వెనుకాడడు. వాటికి ఆత్మ లేదనియు, అవి ఆహారము కొరకు మాత్రమే ఉద్దేశింపబడినవనియు వారి మతము వారికి బోధించును.

మానవులందరికీ ఆత్మ గలదు. జీవులందరినీ భగవానుడు ప్రేమించును గాన, జీవులందరూ ఈశ్వరుని ఆరాధించవలెను. భగవానుడు ముందుగా నన్ను సృష్టించి, అనేక దోష భూయిష్ఠమగు ఈ దేహములో బందీని చేసి, నాకు అనేక విపత్తులను కలిగించి, ఆపై ఆయన నన్ను ప్రేమించుచున్నాడట! అయన నన్ను ప్రేమించువాడైనచో, నాకు ఇన్ని క్షోభలను కలిగించనేల? వీటిలో కొన్ని నాకు కనబడుట లేదు కూడా! నేను వాటిని చూడగల్గినచో, వాటిని కనీసము ఎదుర్కొనే అవకాశము ఉండును. కాని అట్లు లేదు. నేను అమాయకంగా గాలిని పీలుస్తాను. నా దేహ నిర్మాణము అట్లున్నది గదా! ఆ గాలితో బాటు వివిధ సూక్ష్మక్రిములను గూడ పీలుస్తాను. తరువాత నేను గాలిని విడుస్తాను. కాని, సూక్ష్మజీవులు లోపలనే ఉండిపోవును. పైగా భగవానుడు నన్ను ప్రేమిస్తున్నాడని వీరు చెప్పెదరు!

ఈ పరిస్థితిలో ప్రతి వ్యక్తి ఈశ్వరుని కృపను అర్థించాలి. ప్రతి వ్యక్తి పాపాత్ముడు గనుక, ఒక మధ్యవర్తి ద్వారా ఈశ్వరుని అర్థించాలి. ఇది వారి నిర్ణయము. ఈ నిర్ణయములో ఉన్నంతవరకు ఈశ్వరుని తెలిసే మార్గము లేదు. వీరి సిద్ధాంతము ప్రకారంగా, ఈశ్వరుడు నిత్య-పరోక్షుడు.

ఈశ్వరుడు నా కంటె భిన్నముగా నున్నచో, ఈ సృష్టిలో అయనకు ఒక స్థానమును నేను నిర్దేశించవలసి యుండును. ఆయన స్వర్గములో ఉండుననుకొనుడు. నేను అచటకు వెళ్లి, అయనకు బాగా దగ్గరగా నున్నాననుకొనుడు. ఆయనకు ఒక స్వీయదేహము, ఒక స్వీయ ఆత్మ, మనస్సు, ఇంద్రియములు మొదలైనవి ఉండును గదా! నేను అయనకు ఎంత దగ్గరగా నున్ననూ, ఆయన దేహమును మాత్రమే చూడగల్గుదును. ఆయన నా ఎదుటనే ఉన్ననూ, ఇంకా పరోక్షుడు మాత్రమే. నేను ఈశ్వరుని ఎదుట నిలబడి నాకు ఈశ్వరుని యథార్థ స్వరూపము అవిదితముగనే ఉండును.

ఆయన సర్వజ్ఞుడు ఇత్యాది వచనములను పలుకుచుండవచ్చును. కాని, నాకు గల అల్పజ్ఞానముతో ఆయన సర్వజ్ఞత నాకు ఎట్లు తెలియును? నేను నా చిన్న తెలివిడి పరిధిలో మాత్రమే తెలియగల్గుతాను. సర్వజ్ఞత నాకెట్లు తెలియును? అల్పజ్ఞుడు సర్వజ్ఞతను ఎన్నటికీ తెలియయజాలడు. సర్వజ్ఞుడు మాత్రమే సర్వజ్ఞతను ఎరుంగగలడు.

ఇటువంటి వాదముల నన్నిటినీ భగవానుడు 'అవ్యక్తం వ్యక్తిమాపన్నమ్ (వారు అవ్యక్తుడనగు నన్ను ఒక విశిష్ట రూపమును స్వీకరించిన వానిగా భావింతురు, 7-24)' అనే చిన్న వాక్యములో వ్యాఖ్యానించినాడు. వీరికి భగవానుడు తెలియలేదు. ఈశ్వరుని యథార్థ స్వరూపము తెలియకపోవుటచే, ఈ విశ్వాసములన్నియూ తలయెత్తినవని శ్రీ శంకరులు ఈ శ్లోక భాష్యములో వ్రాక్రుచ్చిరి.

ఈశ్వరుని యథార్థ స్వరూపము

వాస్తవమేమనగా, చైతన్య ఘనమగు పరబ్రహ్మ మాయచే అవచ్ఛిన్నమై (మాయను ఉపాధిగా కలిగి) ఈశ్వరుడగును. బ్రహ్మకు మాయ ఉపాధి. కావున, మాయోపాధ్యవచ్ఛిన్నమైన బ్రహ్మ (ఈశ్వరుడు)కు, శుద్ధ బ్రహ్మకు తేడా ఏమి గలదు? బ్రహ్మ కంటె వేరుగా మాయకు ఉనికి లేదు. మాయ పూర్తిగా బ్రహ్మపై ఆధారపడును. మాయ మిథ్య. కాన దాని సత్యత్వము బ్రహ్మయే. కావున, మాయ కూడా ఈశ్వరుడే. కావున, ఈశ్వరుడు బ్రహ్మ కంటె భిన్నుడు కాడు.

మనమీ జగత్తును చూచినపుడు కనబడే వస్తువులన్నియూ నామరూపములు తక్క వేరుగాదని వేదము బోధించుచున్నది. మన అనుభవము దీనిని స్థిరపరచుచున్నది. ఒక వస్తువును విశ్లేషిస్తే, అది తన కారణములో లీనమగును. ఆ కారణము మరల స్వీయకారణములో లీనమగును. 'ఇది స్వతంత్రమైన ఉనికి గలది' అని మనము ఖచ్చితముగా చెప్పగలిగే వస్తువు లేదు. సర్వము తన ఉపాదాన కారణము యొక్క సత్తలో లీనమగును. మేజాబల్ల యొక్క తాత్త్విక సత్యము చెక్క కంటె వేరుగాదు. చెక్క పరమాణువుల కంటె భిన్నముగా లేదు. ఈ విశ్లేషణను ఇటులనే బ్రహ్మము వరకు కొనసాగించవచ్చును. సర్వము స్వీయకారణము నందు లయమగును. కావున, మనము దర్శించే ఈ జగత్తు మిథ్య. జగత్తునకు ఉనికి గలదు. కాని అది స్వతంత్రమైన ఉనికి కాదు.

ఈ మిథ్యా జగత్తును సృష్టించుటకు ఈశ్వరునకు మిథ్యా-ఉపాదానము కావలసి యుండును. అదియే మాయ. ఒకే అనంత చైతన్యము సర్వజ్ఞము, సర్వశక్తిమాన్, సర్వసృష్టి కర్త

ఇత్యాదిగా భాసించుటకు కారణము ఈ మాయయే. మాయా శబలిత (Controlled by Maya) బ్రహ్మ యందు మాత్రమే సృష్టి కర్తృత్వాదికము ఉండును. చైతన్యఘనము, ఆత్మా భిన్నము నగు బ్రహ్మము మాయచే అవచ్ఛిన్నమై సృష్టికి కర్తయగును.

భగవానుడు సర్వజ్ఞుడు గాన, ఆయన యందు కర్తృత్వము ఉండదు. ఆయన తన స్వరూపము నెరుంగును. మాయోపాధి దృష్ట్యా సర్వజ్ఞత్వాదులు ఆయన యందు గలవు. స్వరూపదృష్ట్యా ఆయన సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ; శుద్ధ చైతన్యము. ఆయనకు ఈ సత్యము తెలియకపోలేదు.

ఏ ఉపాదానముచే బ్రహ్మ ఈశ్వరుడైనాడో, అదే ఉపాదానము (మాయోపాధి) జగత్తున కంతకూ ఉపాదాన కారణమగును. ఉపాదాన కారణమగు మాయలో అనేక మార్పులు వస్తే గాని, ఈ చిత్రమైన జగత్తు తయారు కాలేదు. కావున మాయ పరిణామి ఉపాదాన కారణము అని మనము చూచియున్నాము. మాయ పరిణామమును చెంది ఆకాశ, వాయు, అగ్ని, జల, పృథివి, వృక్ష, ఆహార, స్థూల దేహాదులుగా అగును. ఈ జగత్తు అంతా మాయ. మాయ ఈశ్వరుడే కావున, ఈ జగత్తు కూడా ఈశ్వరుడే . ఈశ్వరుడు వాస్తవంలో చైతన్యఘనమగు బ్రహ్మ కంటె వేరుగాదు. కాని బ్రహ్మలో మార్పు లేమియూ లేవు. బ్రహ్మ తాను మార్పులు చెందకుండగనే మార్పుల నన్నింటినీ సంపన్నము చేయుచున్నది. కావున, బ్రహ్మ వివర్త ఉపాదాన కారణమగునని మనము చూచియున్నాము. చైతన్యము యొక్క దృష్టి కోణంతో పరిశీలిస్తే, బ్రహ్మ వివర్త ఉపాదాన కారణము. మాయ పరిణామి ఉపాదాన కారణము. ఈశ్వరుడు బ్రహ్మము కంటె భిన్నుడు కాదు గనుక, సర్వజగత్తునకు బ్రహ్మమే అభిన్న నిమిత్తోపాదాన కారణమగుచున్నది.

ఈశ్వరుడు అపరోక్షుడెట్లగును?

మనము 'సర్వజగత్తు' అన్నప్పుడు, సాధారణంగా మన దేహమును పరిగణనలోనికి తీసుకోము. ఇదియే ప్రముఖ సమస్య. స్థూలశరీరము, ప్రాణము, ఇంద్రియములు, మనస్సు, సర్వసూక్ష్మ ప్రపంచము, మరియు సమస్త స్థూల ప్రపంచము ఇత్యాది సృష్టింపబడిన సర్వము జగత్తులో అంతర్భాగమగును. ఇది అంతయూ ఈశ్వరుడే నని మనమిప్పుడు చెప్పగలము. ఆ ఈశ్వరుడు బ్రహ్మము కంటె వేరుగాదు.

ఈశ్వరునకు, జగత్తునకు భేదమేమి? భేదము లేశమైననూ లేదు. ఈశ్వరునకు, బ్రహ్మమునకు మధ్య భేదము లేదు. కావున, ఈ సర్వము బ్రహ్మము కంటె భిన్నముగా లేదు. బ్రహ్మము కంటె అన్యము మరియొకటి లేదు (సర్వం ఖల్విదం బ్రహ్మ నేహ నానాస్తి కించన).

ఈ క్షణంలో నేను ఒక వ్యక్తిగా నుండి, ఈశ్వరుని గురించి ఈ చర్చనంతనూ చేయుచున్నాను. ఈ వ్యక్తి యొక్క స్థూలదేహము, మరియు నీ స్థూలదేహము కూడ ఈశ్వరోపాధిలో అంతర్భాగములే గదా! ప్రాణము, జ్ఞానేంద్రియములు, మనస్సు, బుద్ధి, స్మృతులు ఇత్యాది సర్వము దానిలో అంతర్భూతములగును. చైతన్య ఘనమగు ఆత్మ ఒక్కటియే మిగిలినది. ఇప్పుడు ఈశ్వరుడు అపరోక్షుడెట్లగునో స్పష్టము అగును. ఇప్పుడు సద్రూపుడనగు నేను చైతన్యఘనమగు బ్రహ్మమే. మరియొక నేను లేదు. చైతన్యమే బ్రహ్మము. బ్రహ్మమే ఈశ్వరుడు. దేహము, మనస్సు, ఇంద్రియములు ఇత్యాదులతో సహా సర్వజగత్తు ఈశ్వరుడే. కావున, ఈ సర్వము నీవే.

ఇప్పుడు ఈశ్వరుడు ఏడి? చైతన్యరూపుడవగు నీవే ఈశ్వరుడవు. మరియొక ఈశ్వరుడు లేడు. సర్వము ఈశ్వరుడే కావున, సర్వము నీవే. దీనికే జీవేశ్వరాభేదము (జీవునకు ఈశ్వరునకు భేదము లేకుండుట) అని పేరు. ఈశ్వరుడు చైతన్యరూపుడగు బ్రహ్మము కంటె వేరుగాడు. ఆ చైతన్యము నీవే. ఇదియే అపరోక్షము.

ఈశ్వరుడు పరోక్షుడునుట అభ్యుపగమము (తాత్కాలిక అంగీకారము) మాత్రమే

వాస్తవంలో ఈశ్వరుడు పరోక్షుడు కాడు. ఈ జ్ఞానము లేనివాడు మాత్రమే ఈశ్వరుడు పరోక్షుడని భావిస్తాడు. అతని అభిరుచి పరోక్ష ఈశ్వరుని యందు మాత్రమే గలదు. అట్టివానిని సంస్కృతములో దేవానాం ప్రియః (దేవతలకు ఇష్టమైనవాడు) అంటారు. అతడు మూర్ఖుడని అతి సున్నితముగా చెప్పే విధానమిది. ఏలయన, పరోక్ష ఈశ్వరుడనే వాడు ఎవ్వడూ లేడు.

కాని, మానవులు నన్ను పరోక్ష ఈశ్వరునిగా ఆరాధిస్తే, నేను వారికి వారి కర్మల కనురూపమగు ఫలముల నిచ్చి, వారి శ్రద్ధను పదిలపరుస్తానని భగవానుడు చెప్పినాడు (7–21, 22). వారు కూడా తమ పుణ్యకర్మల కారణంగా ఒకనాడు భగవానుని తెలుసుకుంటారని ఆశించగలము. భక్తుడు, ఏ మతమునకు చెందినవాడైనా, దుర్గతిని ఎన్నటికీ పొందడు. పుణ్యకర్మల ఫలరూపంగా అతడు ఒకనాడు సత్యమును దర్శించును.

మానవులు ఇతర దేవతల నారాధించుటకు కారణమేమి? వారు సాక్షాత్తుగా ఈశ్వరుని ఏల ఆరాధించరు? ఏలయనగా, వారికి సత్యము చూచాయగా నైననూ తెలియదు. వాస్తవంలో, వారు సత్యమునకు విరుద్ధమైన ఒక మతవాదమును రూఢిచేసుకుని కూర్చుందురు. వారు ఆ

మతవాదముపై భావావేశముతో కూడిన అంకితభావమును ఏర్పరుచుకొనెదరు. వారు దానిని వాస్తవిక దృష్టితో విశ్లేషించకుండా అది అడ్డుపడును. భగవంతుని తెలియవచ్చును అను సంభావన యైననూ వారికి అంగీకారము కాదు. 'సర్వము ఆత్మయే' అను జ్ఞానము వారికి ఎట్లు కలుగును? అపరోక్ష ఈశ్వరుని వారెట్లు గుర్తించగల్గుదురు?

మానవులు యోగమాయచే అవరుద్ధమైన వివేకము గలవారై, భగవానుని సత్యస్వరూపమును తెలియకుందురు. వారు భగవానుని గుర్తించజాలరు. ఈ అవరోధము లెయ్యవి? యోగమాయ అను పదము వాటిని సామాన్యంగా నిర్దేశిస్తుంది. తరువాతి శ్లోకము వాటిని కొంత వివరిస్తుంది:

అధ్యాయము 7, శ్లోకము 27:

इच्छाद्वेषसमुत्थेन द्वन्द्वमोहेन भारत ।
सर्वभूतानि सम्मोहं सर्गे यान्ति परन्तप ॥ २७ ॥

ఇచ్ఛాద్వేష సముత్థేన ద్వంద్వమోహేన భారత
సర్వభూతాని సమ్మోహం సర్గే యాంతి పరంతప (27).

భారత = ఓ అర్జునా!; పరంతప = శత్రువులను తపింప చేయువాడా!; ఇచ్ఛా ద్వేష సముత్థేన = కోరిక, ద్వేషము అను వాటి నుండి పుట్టిన; ద్వంద్వమోహేన = ద్వంద్వముల మోహముచే; సర్గే = లోకము నందు; సర్వభూతాని = ప్రాణులన్నియూ; సమ్మోహం = పూర్తి భ్రాంతిని; యాంతి = పొందుచున్నవి.

శత్రువులను తపింపజేయు ఓ అర్జునా! కోరిక నుండి, ద్వేషము నుండి పుట్టిన ద్వంద్వముల మోహముచే లోకము నందలి ప్రాణులన్నియూ పూర్తి భ్రాంతిని పొందుచున్నవి (27).

సర్వ భూతాని సమ్మోహం సర్గే యాంతి. సృష్ట్యాది నుండి ఇంతవరకు గల ప్రాణులన్నియూ మహా మోహమును పొందియున్నవి. ఈ ప్రాణులు పుట్టినప్పుడు ఈ మోహమును కలిగియే పుట్టుచున్నారు. ఈ మోహము ఎట్టిది? దీనికి కారణమేమి?

ద్వంద్వ మోహేన. అది ద్వంద్వముల నుండి పుట్టిన మోహము. ద్వంద్వములనగా పరస్పర విరుద్ధ తత్త్వములు. అవి యేవి? ఎక్కడ నుండి వచ్చినవి?

ఇచ్ఛాద్వేష సముత్థేన. రాగద్వేషముల నుండి మోహము పుట్టినది. ఇష్టానిష్టముల నుండి ద్వంద్వములు పుట్టి బంధింపను. ఈ ద్వంద్వముల నుండి మోహము పుట్టును.

ద్వంద్వములతో సమస్య

ద్వంద్వములు తమంత తాముగా సమస్య కాదు. వేడి సమస్య కాదు. చల్లదనము సమస్య కాదు. అటులనే, విజయము గాని, వైఫల్యము గాని సమస్యలు కావు. వాస్తవంలో, ఒక ఘటనకు విజయము అని పేరు పెట్టుటలోనే సమస్య గలదని స్పష్టమగును. ఒక వ్యక్తి ఒక ఘటనను విజయము అని వర్ణించుటకు హేతువు ఏది? అది కేవలము అతని దృష్టికోణముపై మాత్రమే ఆధారపడి యుండును.

వంట చేయువాడు తాను చేసిన వంటకములో రుచి లేదనియు, అది విఫలమైనదనియు తలపోసినాడు. కాని యజమాని దానిని అద్భుతమని వర్ణించినాడు. అది మాడిపోవుటచే బాగుండలేదని వంటవాడు తలంచెను. కాని అట్లు మాడిన వంటకముల యందు యజమానికి ప్రీతి అధికము. ఆ వంటకము విజయమా? విఫలమా? విజయము, వైఫల్యము అనునవి వాస్తవంగా లేవు. వాటిని మనము కల్పించుకున్నాము. మనము కొన్ని నిరాధారమగు లక్ష్యములను నిర్ణయించుకొని, వాటి ఆధారంగా స్వీయ జయాపజయాలను నిర్ధారించుకుంటాము. జయము అను మాటలోనే కాల్పనికమైన నిర్ణయము కొంత వరకు సమ్మిళితమై యున్నది. అపజయములో కూడా అంతే.

మన ఇచ్ఛా ద్వేషములచే ఈ ద్వంద్వము లన్నియు సృష్టింపబడును. మనము అభిలషించేది ఇచ్ఛ. పరిహరించేది ద్వేషము. శీతోష్ణములు, రాత్రింబగళ్లు ఇత్యాది ద్వంద్వములను కొన్నింటిని ఈశ్వరుడు సృజించినాడు. మనము కోరేది, పరిహరించేది అను వాటిని మనము సృష్టించుకున్నాము. పగలు అధికముగను, రాత్రి తక్కువగను ఉండాలని నీవు కోరినావనుకొనుము. ఈ ద్వంద్వము నీచే సృష్టింపబడినది. ఈశ్వరుడు రాత్రింబవళ్ళను మాత్రమే సృజించినాడు. నీ ఇచ్ఛాద్వేషములు వాటిని నీకు ఒక ద్వంద్వముగా నిర్మాణము చేసిపెట్టినవి. వాటిలో ఒకటి నీకు అభీష్టము; రెండవది కాదు. ద్వంద్వములనే కొమ్ముల మధ్యలో తగుల్కొనుట అనగా నిదియే. తీవ్రమగు రాగద్వేషములు గల వ్యక్తి మాత్రమే ఇట్లు తగుల్కొనును. అట్టి వ్యక్తికి జయాపజయములు, లాభా లాభములు ఇత్యాదుల విషయములో మోహము ఉండును. ఇవి అతని సావధానతను అపేక్షించి, అతనిని కార్యవ్యాపృతునిగా జేయును. అతడు అంతకు ముందు సంప్రాప్తమైన విఫలతను గూర్చి, లేదా సమీప భవిష్యత్తులో కలుగబోవు విఫలతను గూర్చి చింతిల్లుచుండును.

మనము సర్వమును నియంత్రించ బూనుకుంటాము గాన, మనకీ సమస్య లన్నియూ తలయెత్తును. మనకు రెండు చేతులు, రెండు కాళ్లు, ఐదు ఇంద్రియములు గలవు. వీటిలో కొన్ని లేశమైననూ సక్రమముగా పనిచేయవు. మన మస్తిష్కములో గల సమాచారము అత్యల్పము. మనము ప్రపంచమును నియంత్రించ గోర్తాము. మనము క్రిమి కీటకాదులను కూడ నియంత్రించలేము. ప్రపంచము నంతనూ మనమెట్లు నియంత్రించగలము? నియంత్రించే ఈ ప్రయత్నములో మనము సమ్మోహమునకు వశులమై వివేకమును కోల్పోయెదము.

ఇచ్ఛా ద్వేషములు శీతోష్ణముల వలె పరస్పర విరుద్ధములగు ఒక ద్వంద్వము అని శ్రీ శంకరులు వివరించిరి. ఒకటి సుఖమునకు, మరియొకటి దుఃఖమునకు హేతువులు. మనకు సుఖము నీయగలిగేది, అభిలషణీయమైనది అగు వస్తువు మన ఇచ్ఛలో విషయమగును. మనకు దుఃఖము నీయగలిగేది, మనకు అభీష్టము కానిది అగు వస్తువు ద్వేషములో విషయమగును. మనకు ఇప్పుడు కొన్ని రాగద్వేషములు గలవు. కొంతకాలము తరువాత వీటిలో మార్పులు కలిగి మరికొన్ని రాగద్వేషములు ఏర్పడును. అవి వ్యక్తిని అంటిపెట్టుకొని యుండును. అవి మనస్సులో ఉదయించి, మోహమును కలిగించును.

తీవ్రరాగ ద్వేషములు వివేకశక్తి నపహరించి బహుముఖ మగు సమ్మోహమును కలిగించును. దీనివలన జీవేశ్వర యాథార్థ్య జ్ఞానము ఉదయించుటకు అవరోధమేర్పడును. గీతలో మనో విజ్ఞాన శాస్త్రమంతయూ ఇచ్ఛా ద్వేషముల దృష్టికోణములో ప్రతిపాదింపబడినది. ఇది సమగ్రము, పర్యాప్తము అగు ప్రతిపాదనము. తన రాగ ద్వేషములను నియంత్రించుకొనగలిగే వ్యక్తి జ్ఞానమునకు యోగ్యమగు అంతఃకరణమును కలిగియుండును. కాని, ద్వంద్వముల నుండి జనించు ఈ మోహము మానవులను పూర్తిగా సమ్మోహితులను జేయును.

మోహమనగా నేమి?

మోహము జ్ఞానమును మాత్రమే గాక, జ్ఞానము నందలి ఇచ్ఛను కూడ అడ్డగించును. రాగద్వేషా విష్టమైన మనస్సులో బాహ్య వస్తువుల వాస్తవిక జ్ఞానము కూడ సంభవము కాదు. ఉదాహరణకు, నేను ఒక పరమలోభిని ఎరుంగుదును. అతడు ధనమును ఆదా చేయుటకై సర్వదా చవకబారు వస్తువులను కొనెడివాడు. ఒకనాడాతడు పదిరూపాయలు విలువచేసే కాఫీ పొట్లమును మూడు రూపాయలకు మాత్రమే కొనెను. ఇంటికి వెళ్లి చూసుకుంటే, ఆ పొట్లములో పై వరుసలో మాత్రమే కాఫీపొడి ఉండెను. మిగిలినది అంతా రంపపు పొడి. అతడు ధనము నందలి లోభముచే గ్రుడ్డివాడై వస్తువును సరిగా పరికించలేకపోయినాడు.

అసూయ, భయము కూడ ఇచ్ఛా ద్వేషములలో అంతర్గతము లగును. ఇచ్ఛ అసూయను, ద్వేషము భయమును కలిగించును. భయ స్వభావుడు ప్రతి త్రాడు నందు పామును, ప్రతి స్తంభము నందు చోరుని దర్శించును. ఈ రాగద్వేషములు బలీయమైనప్పుడు, విభిన్న మానసిక ఆందోళనలను సృష్టించి, అంతరంగమును జడీభూతముగా చేయును. అట్టి అంతరంగము వస్తువులను యథార్థ దృష్టితో చూడనీయదు. అదియే మోహము. అది బుద్ధిని పాక్షికముగా అంధము చేసే తెర వంటిది. తెరవలన మానవుడు వస్తువులను యథాతథముగా చూడలేకపోవును. ఏమియు విలువలేనిది గొప్ప విలువ కలదిగా భాసించును.

బాహ్య వస్తు జ్ఞానము నందైననూ స్పష్టత లేని వ్యక్తి ధర్మాధర్మముల నెట్లు వివేచన చేయగల్గును? చేయజాలడు. అతనికి పురుషార్థ కల్పన స్పష్టముగా నుండదు. ఇది నిశ్చయము. అతని ప్రాథమికతలు (priorities) అల్లకల్లోలమగును. అతనిలో ఆత్మజ్ఞానము ఉదయించే ప్రసక్తి యేది?

18, 19 శ్లోకములలో భగవానుడు తనను సాక్షాత్కరించుకున్న జ్ఞానిని గూర్చి వర్ణించెను. భగవానుని ప్రత్యక్షముగా చూడగలిగే ఈ మహాత్ములెవ్వరు?.

అధ్యాయము 7, శ్లోకము 28:

येषां त्वन्तगतं पापं जनानां पुण्यकर्मणाम् ।
ते द्वन्द्वमोह निर्मुक्ता भजन्ते मां दृढव्रताः ॥ २८ ॥

యేషాం త్వంత గతం పాపం జనానాం పుణ్య కర్మణామ్ ।
తే ద్వంద్వ మోహ నిర్ముక్తా భజంతే మాం దృఢవ్రతాః (28).

తు = కాని; పుణ్య కర్మణాం = పుణ్య కర్మలను చేయు; యేషాం = ఏ; జనానాం = మానవుల; పాపం = పాపము; అంతగతమ్ = అంతమైనదో; తే = వారు; ద్వంద్వమోహ నిర్ముక్తాః = ద్వంద్వముల భ్రాంతి నుండి విముక్తులై; దృఢవ్రతాః = దృఢమగు అంకితభావము గలవారై; మాం = నన్ను; భజన్తే = సేవించెదరు.

కాని పుణ్య కర్మలను చేయు ఏ మానవుల పాపము అంతమగునో, వారు ద్వంద్వములు సృష్టించే భ్రాంతి నుండి విముక్తులై, దృఢమగు అంకితభావము గలవారై నన్ను సేవించెదరు (28).

ఈ వ్యక్తులకు, పూర్వ శ్లోకములలో వర్ణింపబడిన వ్యక్తులకు మధ్య గల తేడాను నిర్దేశించుటకు 'తు' అను అవ్యయము ప్రయోగింపబడినది.

యేషాం జనానాం పుణ్యకర్మణామ్. అనగా మంచి కర్మలను చేసుకున్న వారికి అని యర్థము. వీరు రాగ ద్వేష సమ్మోహనమును తిరస్కరించి, తమ ఇచ్ఛా స్వాతంత్ర్యమును వినియోగించి, పాపకర్మలను పరిహరించి, పుణ్యకర్మలను చేసియున్నారు. వారి పుణ్యకర్మలను చేసి అదృష్టమును సృష్టించి పూర్వకృత పాపమును కడిగివేసుకొనినారు. మరియు, వారు నిత్యప్రార్థనలను చేయుచూ, ధర్మబద్ధముగ జీవిస్తూ, పాపములను దరిదాపులకు రానీయరు. పుణ్యకర్మాణః (పుణ్యప్రదమగు కర్మలు గలవారు) అనగా వీరే. వీరు కర్మలను ఉచితమగు మానసిక ప్రవృత్తితో చేస్తారు. మనస్సును శుద్ధి చేయు కర్మ పుణ్యకర్మ యని శ్రీ శంకరులు నిర్వచించిరి.

పాపం అంతగతమ్. పాపకర్మల విషయానికొస్తే, అవి ముగిసినవి. అనగా వారి యందు పాపమును ఆచరించే ప్రవణత (tendency) ఏ మాత్రమూ లేదని యర్థము. వారు సంకల్పశక్తిని వినియోగించి పాపకర్మలను పరిహరింపబని లేదు. వారు పరిణతిని జెందిన వ్యక్తులు. వారికి పాపమును చేసే ప్రవణత కూడ లేని కారణంగా, వారు పాపకర్మల నుండి విముక్తులైనారు.

పాపకర్మల నుండి మానవుడు విముక్తుడగుట యెట్లు?

సాధకుడు ఆరంభములో పాపకర్మకు విరుద్ధముగా తన సంకల్పశక్తిని ప్రయోగించును. కాని క్రమముగా అది ఆవశ్యకము కాదు. ఉదాహరణకు, మానవ సమాజము లన్నింటిలో తిట్టు పదములు ఉండును. ఒక వ్యక్తి ఈ పదములను తరచుగా వాడే వాతావరణములో పెరిగినాడనుకొనుడు. అతడు ఒకనాడు ఈ పదములను వాడరాదని నిశ్చయించుకున్నాడు. ఆరంభములో, ముఖ్యముగా కోపము వచ్చినప్పుడు, ఈ పదములు అతని నాలుక చివరివరకు వచ్చును. కాని, అతడు తన సంకల్పబలముచే వాటిని అచటనే నిలిపివేయును. అతడు జాగరూకతతో ఏరి కోరిన పదములను ప్రయోగించును. ఆ పదములు వాస్తవమునకు దగ్గరగా నుండును. అతడిట్లు కొంత కాలము యత్నించవలెను. తరువాత ఆ పదములు అతని స్ఫురణకైననూ రావు. అవి అతని భాష నుండి అదృశ్యమగును. ఇప్పుడు సంకల్పశక్తితో పని లేదు. అవి అతని జీవితము నుండి నిష్క్రమించినవి.

మార్పు చెందు విధానమిదియే. పుణ్యకర్మలను చేస్తూ ఉన్న వ్యక్తిలో పాపకర్మలను చేయాలనే ప్రవణత మిగిలియుండజాలదు. దీనికి కారణము గలదు. మనము చేయు కర్మలన్నియు

సంస్కారమును కలిగించును. ఒక కర్మను అధికంగా చేసే కొలదీ, అటువంటి కర్మను పునః పునః చేయాలనే ప్రవణత (సంస్కారము) వర్థిల్లును. కొండ నుండి క్రిందికి ప్రవహించే నీరు సంతతము ఒకే దారిలో ప్రవహిస్తే, ఆ దారి అంతకంతకు లోతుగా తయారగును. సంస్కారముల విషయములో కూడా నింతే. కర్మ ఒక సంస్కారమును కలిగించును. ఆ సంస్కారము వలన మనము అదే కర్మను మరల చేసే ప్రవణతను కలిగి ఉంటాము. ఇందువలననే, నేరగాళ్లు అలవాటు కొలదీ నేరాలను చేస్తారు. వారిలో ప్రతి ఒక్కడూ ఒకరకమైన నేరమును మాత్రమే చేయును. కొందరు ఇంటికి కన్నం వేసి చోరీ చేస్తారు. వారిలో కొందరు సర్వదా కిటికీ గుండా మాత్రమే ఇంటిలోనికి చొరబడుదురు. మరి కొందరు తలుపు గుండా మాత్రమే చొరబడుదురు. కొండపై నుండి క్రిందకు జారే నీరు తాను ప్రవహించే దారిని క్రమంగా లోతు చేయు తీరున, నేరగాళ్ల ప్రవృత్తి కూడా వారి యందు స్థిరపడును. నీరు ఆ దారిని వీడి ప్రక్కకు పోజాలదు. అటులనే, ఈ నేరగాళ్లలో కూడ సంస్కారములు చిన్న చిన్న కొండకాలువల వంటి లోతైన అలవాట్లను నిర్మించును. ఒకే పనిని పునః పునః చేసే ప్రవణత వారిలో తయారగును. దానివలన వారు అదే పనిని చేస్తూ ఉంటారు. అపుడా ప్రవణత మరింత గహనమగుచుండును.

ఈ ప్రవణతల నుండి బయట పడుటకై మానవులు తమ సంకల్పశక్తిని వినియోగించాలి. వ్యక్తి జ్ఞానశీలుడై తన జీవితములో మార్పును ఆహ్వానించినప్పుడు మాత్రమే ఇది సంభవమగును. వ్యక్తి తన జీవితమును మారిన దృష్టికోణములో పరిశీలించాలి. కొంత కృప, కొంత ఆసరా ఉన్నప్పుడు మాత్రమే అది సంభవమగును. అది లభించిన వెంటనే, వ్యక్తి యొక్క జీవనయాత్రలో మార్పు వచ్చి, అతని పూర్వ ప్రవణతలు క్రమముగా జారిపోవును.

పుణ్యకర్మలను చేయువారికి పాప సంస్కారములు నిర్మూలముగా తొలగిపోవును. తత్పూర్వ మందలి పాపములు చాలవరకు క్షాళితమై యుండును. ఇట్టి వారి జీవితములో పాపకర్మల అధ్యాయము ఇంచుమించు ముగిసినది. పూర్తిగా ముగిసినది అని చెప్పజాలము. ఏలయన, పాపపుణ్యములు రెండు జ్ఞానము వలన మాత్రమే పూర్ణముగా తొలగిపోవును. వీరి హృదయములు ఇంచుమించుగా పాపకర్మలచే ప్రభావితము గావు. వీరి మనస్సులు శుద్ధములై, స్థిరముగా నుండును.

మోహము నుండి విముక్తుడైనవాడు ఈశ్వర సాక్షాత్కారమును గోరును

తే ద్వంద్వమోహ నిర్ముక్తాః వారు రాగద్వేషాత్మకమగు ద్వంద్వముల మోహము నుండి పూర్ణముగా విముక్తులైనారు. 'ముక్త' అనగా విడుదలను పొందినవాడు. 'నిర్ముక్త' యనగా పూర్ణముగా విముక్తిని పొందినవాడు.

రాగద్వేషములు తీవ్రముగా గల వ్యక్తి తాను కోరే వాటి గురించి మాత్రమే ఆలోచించును. ఆతడు మంచిచెడులను గురించి ఆలోచించడు. కావున, ఆతడు పాపకర్మలను చేయుట సహజమగును. కాని, ఈ రాగద్వేషములను నియంత్రించినచో, ఏది ధర్మము, ఏది కాదు అను వివేకము అట్టి వ్యక్తి మనస్సులో ఉదయించును. అపుడాతడు అంతరంగ జాడ్యము నుండి, ద్వంద్వముల మోహము నుండి విముక్తుడగును.

మాం భజన్తే. ఇట్టి వారు జీవితము యొక్క యథార్థ లక్ష్యమును గుర్తించెదరు. అపుడు వారు శాస్త్రములోని పదములన్నింటి అర్థమును దర్శించెదరు. పూర్వములో వారికి రాగద్వేషముల వలన శాస్త్రము వైపు చూచుటకు సమయము లేకుండెడిది. ఇపుడు ఆ పదము లన్నియూ సజీవములు అగును. వారు పరమేశ్వరుని (పరమాత్మను) పొందగోరెదరు. వారెవరు?

ఈ అన్వేషణకు అంకితభావము (సన్న్యాసము) అవశ్యకము

దృఢవ్రతాః. వ్రతము అనగా దీక్ష; ఒక నియమమునకు కట్టుబడియుండుట. దృఢము అనగా చలనము లేకుండుట. వీరు వ్రతమును చాల పట్టుదలతో పాటించు స్వభావము గలవారు. వీరి అంకితభావము అసాధారణమైనది. పరమార్థ తత్త్వము పొందే విధానము ఇది ఒక్కటి మాత్రమేనని శ్రీ శంకరులు అభిప్రాయపడిరి. దృఢమగు దీక్ష లేనిదే ఇది సంభవముకాదు. ఈ దీక్షను పాటించుట కొరకై వారు ఇతర అన్వేషణల నన్నింటినీ త్యజించెదరు. వారు రాగద్వేషముల సమ్మోహనములో ఉండరు. వారు మోక్షపురుషార్థమునకు అనురూపమైన కోర్కెలను మాత్రమే సాధింపబూనెదరు. వారి ప్రవృత్తి సన్న్యాసుల ప్రవృత్తిని బోలియుండును. లేదా, వారు సన్న్యాసమును స్వీకరించెదరు.

వాస్తవమగు సన్న్యాసి యొక్క మనస్సు పూర్ణముగా పరిణతిని చెందియుండును. ఏలయన, రేపటి గురించిన చింతకు ఆ మనస్సులో స్థానము లేదు. దేనినీ పట్టించుకోని, బాధ్యతా రహితుడగు వ్యక్తి యొక్క మనస్సు కూడ ఇటులనే యుండును. పరిణతమగు మనస్సు కూడ ఇటులనే యుండును. దుస్సాహసి, హతభాగ్యుడు అగు వ్యక్తి కూడ రేపటి గురించి ఆలోచించడు. ఆతడు ఉన్నదంతా ఈ రోజు తగులబెట్టి, రేపు ముష్టికి తయారగును. ఆతనికి కోర్కెలు అనేకము ఉన్నవి. కాని, ఆతడు రేపటి కొరకు యోజన చేయడు. ఇది మూర్ఖత. రేపటి రోజు దానంతట అదే ఏదో ఒక వ్యవస్థను చేయగలదని యెరింగిన సన్న్యాసి కూడా, రేపటి గురించి చింత చేయని వారిలో ఒకడుగ నుండును. పైగా, సన్న్యాసి ఉన్నదానితో సంతుష్టుడగును. ఆతని మనస్సు స్వస్థతమముగ

నుండును. మీరు ఆలోచించండి. ఆతని మనస్సు కంటె అధికస్పష్టత గల మనస్సు ఉండదు. ఈ స్పష్టత బాధ్యతా రహితత్వము నుండి వచ్చినది కాదు. ఈ స్పష్టత ఒక విశిష్టమైన సంతుష్టి నుండి, తన యందు ఈశ్వరుని యందు గల విశ్వాసము నుండి ఉద్భవించును.

మనిషి జీవించటానికి ఒక రోజులో కావలసిన సంభారములు అల్పమైననియు, అవి తనకు లభించుననియు ఆతడెరుంగును. అదియే సన్న్యాసము.

ఇట్టి దృఢవ్రతులు నన్ను కోరెదరు. నన్ను పొందెదరు. భజ ధాతువునకు ఈ రెండు అర్థములు గలవు. తరువాతి శ్లోకమును దృష్టిలో నిడుకొని పరిశీలిస్తే, భజ ధాతువునకు 'కోరి సేవించుట' అను అర్థము సముచితముగ నుండును. ఇట్టి వారు ద్వంద్వ మోహము నుండి సంపూర్ణముగ విముక్తులై, నన్ను కోరి సేవించెదరు. వీరు పరమాత్మ సాక్షాత్కారము కొరకై ఇతరమును సర్వమును పరిత్యజించెదరు.

వారు భగవానుని ఆరాధించుటకు కారణమేమి? వారు పొందే ప్రయోజనమేమి?

అధ్యాయము 7, శ్లోకము 29:

जरामरणमोक्षाय मामाश्रित्य यतन्ति ये ।
ते ब्रह्म तद्विदुः कृत्स्नमध्यात्मं कर्म चाखिलम् ॥ २९ ॥

జరా మరణ మోక్షాయ మామాశ్రిత్య యతన్తి యే
తే బ్రహ్మ తద్విదుః కృత్స్నమధ్యాత్మం కర్మ చాఖిలమ్ (29).

యే = ఎవ్వరైతే; **జరామరణ మోక్షాయ** = ముసలితనము నుండి, మరణము నుండి విడుదలను పొందుట కొరకై; **మాం** = నన్ను; **ఆశ్రిత్య** = శరణు పొంది; **యతంతి** = ప్రయత్నించెదరో; **తే** = వారు; **తత్** = ఆ; **బ్రహ్మ** = (జగత్కారణమగు) బ్రహ్మను; **కృత్స్నం** = సమస్తమైన; **అధ్యాత్మం** = దేహ సంబంధి విషయమును; **చ** = మరియు; **అఖిలం** = సమస్తమగు; **కర్మ** = కర్మను; **విదుః** = ఎరుంగుదురు.

ఎవ్వరైతే ముసలితనము నుండి, మరణము నుండి విడుదలను పొందుట కొరకై నన్ను శరణు పొంది ప్రయత్నించెదరో, వారు ఆ (జగత్కారణమగు) బ్రహ్మను, సమస్త దేహ సంబంధి విషయమును, మరియు సమస్త కర్మను ఎరుంగుదురు (29).

జరా మరణ మోక్షాయ. మోక్షాయ అనగా విడుదల కొరకు. మానవులు అనభిలషితములగు వాటి నుండి మాత్రమే విముక్తిని కోరెదరు; అభిలషితముల నుండి కాదు. వృద్ధాప్యము అనిష్టము. వృద్ధాప్యము మృత్యువు సమీపములో నున్నదని సూచించును. వృద్ధుడను కావాలని ఎవ్వరూ కోరుకొనరు. ప్రతి మానవునకు అయుర్దాయము నిశ్చితమై యుండును. ఒక ఏడాది గడచినచో, అయుర్దాయములో ఒక ఏడాది తగ్గి, మృత్యువు ఒక ఏడాది దగ్గర అయినది. వృద్ధాప్యములోని సమస్యలలో ఇది ఒకటి. మరియు, ఇంద్రియ సామర్థ్యములు ఒక దాని తరువాత మరియొకటి తొలగిపోతూ ఉంటాయి. ఇది రెండవ సమస్య. ఇంద్రియాధిష్ఠాన దేవతలు మానవునితో 'ఇక చాలును. నేను నిన్ను ఎన్నో సంవత్సరములు అనుగ్రహించితిని; నీవేమి సాధించితివి? సెలవు' అని సెలవును తీసుకుంటారా అనిపిస్తుంది. కళ్ల చూచునట్లు చేయు అధిష్ఠాన దేవత, చెవులు వినునట్లు చేయు దేవత, మరియు ఇతర దేవతలు సెలవు తీసుకున్న తరువాత గోళకములు మాత్రమే మిగిలియుండును. ఒకప్పుడు వాటిలో చూపు, వినికిడి ఇత్యాదులు ఉండెడివి. కాని, ఇప్పుడు లేవు. ఈ దేవతలు ఒకరి తరువాత మరియొకరు సెలవు తీసుకుంటూ ఉంటే, ఇంద్రియములకు ఒకప్పుడు గల సామర్థ్యము తొలగిపోవును. సర్వము ఒక పెద్ద చీకాకును కలిగించును. ఇది ఎవ్వరికీ అభీష్టము కాదు.

దేహములోని ఇతరావయవములు కూడ శిథిలమగుట ఆరంభమగును. కీళ్లనొప్పులు మొదలై, ఇటునటు తిరుగుటయూ క్లిష్టమగును. పైకి లేచుట ఒక పెద్ద పనియగును. పరుండుట ఒక పని. పరుండి మరల పైకి లేచుట మరియొక పని. ఒక్కొక్కప్పుడు ప్రేగులలో తరంగాకారముగా వచ్చే కదలిక ఆగిపోవును. అప్పుడు ఆహారమును తినుట కూడ ఒక దుష్కరమగు పనియగును. ఏ సంగతియూ గుర్తు ఉండదు. వృద్ధాప్యము (జరా) ఇట్లుండును. దీనిని కోరువారు ఎవరు ఉందురు? దీని నుండి అందరు విముక్తిని కోరెదరు. మరియు, మరణమును ఎవ్వరూ కోరుకొనరు. జీవించుట యందు, వృద్ధాప్యము నుండి మృత్యువునుండి విముక్తిని పొంది జీవించుట యందు సర్వులకు సర్వదా ప్రీతి యుండును.

పుట్టుక, పెరుగుదల, రూపపరివర్తనము, అపక్షయము అనే, స్థూలదేహములో వచ్చే మార్పులన్నింటికీ, కర్తృత్వ భోక్తృత్వములు, సుఖ దుఃఖములు ఇత్యాది సర్వమానసిక పరివర్తనములకు జరామరణములు ఉపలక్షకములు. మనకు మనపై గల ధారణ లన్నింటికీ ఇవియే మూలము. మనము వీటి నుండి విముక్తిని పొందాలని కోరుకుంటాము.

ఈ విముక్తి కొరకై మనకు గల తీవ్ర ఆకాంక్ష 'నేను ముసలితనమునకు అధీనుడను, నేను మర్త్యుడను' అనే నిష్కర్ష నుండి పుట్టును. ఇట్టి నిష్కర్ష ఉన్నంతవరకు, విముక్తి కొరకై ఈ ఆకాంక్ష ఉండును. కాని, ఈ కోరిక తీరుట అసంభవమని మనకు తెలియును. ఇంకొక రోజు బ్రతకాలనే కోరిక సర్వదా ఉండును. ఈ కోరిక అన్నివేళలా తీరబోదని మనకు తెలియును. మనమీ విషయములో నిస్సహాయులము. కావున, భయము ఉండుట సహజమే. మనము రాబోవు విపత్తులను తప్పించుకోగలిగే శక్తి ఉన్నవారము అయినచో, భయము ఉండదు. కాని, మనము వృద్ధాప్యము రాకుండా ఆపలేము. మరణమును గురించి చెప్పునదేమున్నది?

సమస్యను వివేచించుట

రాగద్వేష సమ్మోహితుడు గాని వ్యక్తికి దీనిని వివేచించగల మనస్సు ఉండును. అతడు వాస్తవమగు పరిష్కారమును కనుగొనగల్గును. ఈ జీవితములో విలువైనది ఏదియో అతనికి తెలియును. వృద్ధాప్యము, మృత్యువు వచ్చుటకు ముందే, ఇప్పుడే అతడు పరమాత్మను ఆరాధించును. అతడు కోరేది ముదుసలి దేహము నుండి విముక్తిని మాత్రమే గాదు. అతడీ సమస్యకు పరిష్కారమును కనుగొని, దీని నుండి సంపూర్ణముగా బయటపడుటకు యత్నించును. 'నేను జరామరణములకు అధీనుడను' అనే ధారణ నుండి అతడు బయట పడగోరును.

'నేను వృద్ధాప్యమునకు భయపడుతున్నాను' అనేది దేహము కాదు. రాయి మొదలగు జడపదార్థముల వలె దేహము కూడా కొన్ని సంవత్సరములు మనగల్గును. వృద్ధాప్యము మీద పడుచున్నది యను ధారణ దానికి ఉండదు. తాను జరామరణములకు అధీనుడై యున్నానని గుర్తించేది జీవుడు మాత్రమే. కావున, స్థూలదేహములో సంక్రమించే వృద్ధాప్యము నుండి గాని, మరణము నుండి గాని మోక్షము ఇచట ప్రసక్తము కాదు. నేను జరామరణములకు అధీనుడననే ధారణ నుండి మాత్రమే మోక్షము కోరబడుచున్నది. ఈ ధారణ నుండి మాత్రమే విముక్తి సంభవమగును. ఇంకోరకం విముక్తి సంభవము కాదు.

మనకు కావలసినది కూడా ఈ విముక్తి మాత్రమే. ఏలయున, నేను (అహం) అనునదియే సమస్య. సమస్యలన్నియు ఈ 'నేను' పై కేంద్రితమై యున్నవి. ఈ వ్యక్తిత్వ తాదాత్మ్యము అనే సమస్య నుండి భయము పుట్టును. దాని నుండి విముక్తిని గోరి మానవుడు పరమాత్మను శరణుబొచ్చును.

మానవుడు మరణము నుండి విముక్తిని అన్వేషించే విధానము

మామాశ్రిత్య యతంతి యే. వారు ఈశ్వరుడనగు నన్ను శరణుజొచ్చి ప్రయత్నించెదరు. వారు స్వీయ రాగద్వేషములపై ఆధారపడిన అన్వేషణలను పరిత్యజించినారు. ఇపుడు వారు ఈశ్వరుని సేవించుచున్నారు. వారు తమ అనుభవములను విశ్లేషించుకొనినారు. తాము యథార్థముగా అన్వేషించేది రాగద్వేష పరిపూర్తి కాదని వారికి స్పష్టమైనది. నేను రాగద్వేష వశవర్తిని అను ధారణయే ప్రధానసమస్య. ఈ సత్యమును స్పష్టముగా యెరింగిన వ్యక్తి జిజ్ఞాసువుగా మారి, ఈశ్వరుని శరణు జొచ్చును.

ఇకపైన ఇట్టి వ్యక్తి రాగద్వేష సమ్మోహనము నందుండడు. అనుచిత కార్యప్రవణత అతని నుండి దూరమైనది. అతనిలో వివేకముదయించినది. అతనికి గల ఒకే ఒక కోరిక పరమేశ్వరుని స్వరూపమెరుంగుట. ఆ జ్ఞానము కొరకై అతడు ఈశ్వరుని కృపను కాంక్షించును. ఈశ్వరుని ఎరుంగుట యనగా ఆత్మను ఎరుంగుటయే. ఆత్మ కంటె భిన్నముగా మరియొక ఈశ్వరుడు లేడు. ఈశ్వరుడు నీకు గాని, జగత్తునకు గాని భిన్నముగా లేడు. ఈ భేదభావన పూర్తిగా అజ్ఞాన జనితము. కావున, వారు భగవానుని శరణుజొచ్చి, భగవానుని కృప కొరకై ప్రార్థించి, భగవానుని స్వరూపమును తెలియగోరెదరు. దీనికొరకై వారు ప్రయత్నమును చేసెదరు (యతంతి).

ఎట్లు? మనస్సును లగ్నముచేసి, శ్రవణ మనన నిదిధ్యాసనముల ద్వారా వారు యత్నింతురు. ఈ మూడింటి ద్వారా మనస్సు ఈశ్వరుని యందు లగ్నమగును. పూర్వంలో వారి మనస్సు రాగద్వేషములకు ఆస్పదమైన వస్తువులపై లగ్నమై యుండెడిది. కాని వారు ఇపుడా మనస్సును శాస్త్ర విచారము ద్వారా పరమేశ్వరుని వైపునకు మరల్చినారు.

ఈ అన్వేషణకు, ఇతర అన్వేషణ లన్నింటికి మధ్య గల భేదమును పరికించుటకై మీరొక పనిని చేయుడు. ఆకర్షణీయముగా ముద్రింపబడిన కేటలాగు నొకదానిని తీసుకొని పుటలను త్రిప్పుతూ మనస్సును పరిశీలించుడు. దాగియున్న రాగద్వేషములు, ఎన్నడూ వినని రాగద్వేషములతో సహా, ఉద్బుద్ధమగును. ఏనాడూ ఊహించని వస్తువు ఒకటి కంటబడుతుంది. హఠాత్తుగా అది ఒక కామన అవుతుంది. ఇది ఒక రకం మనస్సు.

ఇపుడు ఉపనిషత్తు లేదా గీత పుస్తకములోని పేజీలను చదువుడు. మనస్స్థితి పూర్తిగా మారిపోవును. శాస్త్రపదములు పూర్ణమైన, సర్వకామనా విరహితమైన మనస్సును నిర్మాణము

చేయును. కామనల వెనుక పరుగెత్తే మనస్సుకు ఇది విరుద్ధమైనది. ఇందువలననే శాస్త్రమును అనేక పర్యాయములు వినవలెనని (పౌనః పున్యేన శ్రవణం కుర్యాత్) పెద్దలు చెప్పెదరు. అట్లు చేయుట వలన దాని యందు అభిముఖ్యము ఏర్పడును. మనము తెలియదగిన వస్తుతత్త్వము ఒకే ఒకటి గలదు. అదియే తత్త్వమసి. కాని మనస్సును చిరకాలము యథార్థ తత్త్వ విచారమునందు ఉద్బాసితము చేయుటకై విస్తారమగు శాస్త్రాధ్యయనము విధింపబడినది. శ్రవణమును చేస్తూ ఉంటే, మననము సహజరీతిలో కొనసాగును. సందేహములు తలయెత్తును. మనము వాటిని తొలగించుకుంటాము. ఈ సాధన వలన ఒక విశిష్టమగు అంతర్ముఖత్వము ఏర్పడును. ఒక విశిష్ట వస్తుజ్ఞానము వారికి కలుగును. వారు ఆ జ్ఞానమును అంతర్ముఖులై భావన చేస్తూ ఉంటే, అది మరింత స్పష్టమగుచుండును. నిదిధ్యాసనమనగా నిదియే.

పరమేశ్వరుని చింతన చేయుట యనగా శ్రవణమనన నిదిధ్యాసనములు మూడింటితో కాలమును గడుపుటయే. 'తచ్చింతనం తత్కథనం అన్యోన్యం తత్ప్రబోధనమ్' అని వర్ణింపబడిన బ్రహ్మాభ్యాసమనగా నిదియే నని మనమిది వరకు చూచియున్నాము. ఈ విషయ వస్తువుపై చింతన చేయుట, దాని గురించి ఇతరులతో సంభాషించుట, ఇతర విద్యార్థులతో చర్చించి అర్థము చేసుకునే ప్రయత్నమును చేయుట, పరస్పర సహకారము ఇత్యాదులన్నీ బ్రహ్మాభ్యాసములో భాగములే. పరమేశ్వరుని శరణుజొచ్చుట అనగా నిదియే.

ఈశ్వర శరణాగతి ఇత్యాది ప్రయోగముల అర్థమును సరిగా తెలియుట అత్యావశ్యకము. బలహీనుడు బలవంతుని వద్దకు పోయిన తీరున, మనము రక్షణ కొరకై ఈశ్వరుని శరణు వేడుటయే ఈశ్వర శరణాగతి అని వర్ణించిన ఒక వ్యాఖ్యానమును నేను చిరకాలము క్రితం చదివియుంటిని. ఇట్లు ఈశ్వరుని ప్రార్థించుట వలన ఈశ్వరానుగ్రహము నిశ్చితముగా లభించును. మంచి పని ఏదైనా మంచి ఫలము లభించును గదా! కాని ఈశ్వరుడు నన్ను రక్షించే మరియొక వ్యక్తి అనే ధారణ అతిగహనమైన ఈశ్వర స్వరూపమును అల్పముగా భావించుటయే అగును. 'పరమేశ్వరుని ఆశ్రయించుట' అను దానిని అర్థం చేసుకోవాలి. అది సరళమైన విషయము కాదు. అది ఒక తల్లీన స్థితి; దాని యందు మనస్సు ఒకే విషయ వస్తువునకు అంకితమై దానినే ధ్యానించును. ఇది శ్రవణమనన నిదిధ్యాసనములచే సాధించదగినది. ఇదియే పరమేశ్వరాశ్రయము.

ఈశ్వరుని ప్రత్యక్షముగా దర్శించుట వలన కలిగే ఫలము

తే బ్రహ్మ తద్విదుః. తే = పరమేశ్వరుని ఆశ్రయించిన సాధకులు; తత్ = ఆ; బ్రహ్మ = బ్రహ్మము; విదుః = తెలియుదురు. మనకు ఒక విషయము స్పష్టమగుచున్నది. ఆశ్రయించుట విచార

రూపమైనది. పరమేశ్వరుని ప్రత్యగ భిన్నముగా ఎరుంగుటయే దాని ఫలము. తత్ అనగా జగత్కారణము, సత్యజ్ఞానానంతము వగు పరబ్రహ్మ. సర్వజగత్కారణమగు పరమేశ్వరుని శరణు జొచ్చి, పరమేశ్వరుని తెలునుకున్నవాడు సహజముగా సర్వమును ఎరుంగును.

మామాశ్రిత్య యతంతి = నన్ను ఆశ్రయించి ప్రయత్నించెదరు అను వాక్యమును పరిశీలింపుడు. వారు పొందు ఫలమేమి? తే విదుః తత్ బ్రహ్మ = వారు ఆ బ్రహ్మను ఎరుంగుదురు. పరమాత్మ ప్రత్యగాత్మ కంటె వేరుగాదు. కాన, 'యతంతి' అనగా జ్ఞానము కొరకై ప్రయత్నించుచున్నారని స్పష్టమగుచున్నది.

జరా మరణ మోక్షాయ. వృద్ధాప్యము నుండి, మృత్యువు నుండి విముక్తి ఆ జ్ఞానమునకు ఫలము. దీనిని బట్టి విముక్తిని పొందుటకు కావలసినది జ్ఞానము మాత్రమేనని స్పష్టమైనది. కాని తెలుసుకొనుట ద్వారా మనకు జరామరణముల నుండి విముక్తి ఎట్లు లభించును? జ్ఞానులందరు మరణించి అదృశ్యమైనారు. అనగా జ్ఞానుల దేహములు అదృశ్యమైనవి. జ్ఞాని యనగా పరబ్రహ్మయే. పరబ్రహ్మ కంటె వేరుగా జ్ఞాని లేడు (జ్ఞానీ తు ఆత్మా ఏవ తు మే మతమ్, 7-18). కావున, జ్ఞాని నిత్యుడై యుండును.

వారిది ప్రత్యక్ష జ్ఞానము

వారు బ్రహ్మను పరోక్ష జగత్కారణముగా మాత్రమే గాక, ఆత్మాభిన్నమైన అపరోక్షముగా కూడ యెరుంగుదురని మనకు దీనిని బట్టి స్పష్టమగుచున్నది. వారి దర్శనము 11వ అధ్యాయములో అర్జునుని దర్శనము వంటిది కాదు. శ్రీకృష్ణ భగవానుడు తన విశ్వరూపమును దర్శించగలిగే సామర్థ్యమును అర్జునున కొసంగెను. అర్జునుడు విశ్వము నంతనూ శ్రీకృష్ణ భగవానునిలో చూచెను. సర్వ నక్షత్రములు, గోళములు, భూమి, సర్వమానవులు, పాండవులు, దుర్యోధనుడు, మరియు అతని సైన్యము శ్రీకృష్ణుని లోపలనే యుండెను. అతడు యుద్ధరంగములోని సర్వులను కాలుని నోటిలో, మృత్యుదేవతల కోరల మధ్య చిక్కుకొని యుండగా చూచెను. కాలము వారిని కబళించి వేయుచుండెను. మరణించిన తరువాత కాదు; మరణించుచుండగా అతడు వారినందరినీ చూచెను. అతడు భయవిహ్వలుడాయెను. అతడు, సర్వజగత్కారణమగు పరమాత్మను ఒక విశిష్టరూపములో చూచెను. ఆ రూపములో కారణ కార్యము లన్నియు లీనమయ్యెను గాన, వాటి మధ్య గల భేదమును గుర్తించుట అసంభవము. దీని నంతనూ చూచిన అర్జునునకు అచట తాను గానరాకుండుటచే భయము కలిగెను. భయము కలుగుటకు అది చాలును. మానవుడు ఎక్కడైతే

ఇసుమంత భేదము నైననూ దర్శించునో, అచట భయము తప్పదు (ఉదరం అంతరం కురుతే, అథ తస్య భయం భవతి – తైత్తిరీయోపనిషత్). కావుననే, అర్జునుడు శ్రీకృష్ణ భగవానుని పూర్వ రూపమును పొందుమని కోరెను. మామూలు శ్రీకృష్ణుని చూచినంతనే ఆతనికి గొప్ప ఊరట కలిగెను. అర్జునుడు ఆ దృశ్యములో తాను భాగము కాకపోవుటచే ఆతనికి ముందుగా భయము, ఆపైన ఊరట కలిగినవి. కావున, బ్రహ్మ జగత్కారణము అని మాత్రమే గాక, బ్రహ్మ ప్రత్యగభిన్నము అని కూడ యెరుంగవలెను.

కృత్స్నం అధ్యాత్మమ్. కృత్స్నం = సమస్తమైన; అధ్యాత్మం = ఆత్మకు, అనగా నీకు సంబంధించిన. పరబ్రహ్మకు నీకు (ప్రత్యగాత్మ) పూర్ణ అభేదమును నీవు దర్శించవలెను. ఈ సత్యము నెరింగిన జ్ఞాని ఆత్మకు సంబంధించిన సర్వము (కృత్స్నం అధ్యాత్మమ్) బ్రహ్మభిన్నమని యెరుంగును.

వారు కర్మను కూడ యెరుంగుదురు

కర్మ చ అఖిలమ్. ఆ జ్ఞానము వలన, అతడు ఇపుడు కర్మను గురించి కూడా చక్కగా తెలుసుకొనును. 'నేను కర్మలను వేటినీ చేయుట లేదు; చేయించుట లేదు' అని ఆతడు ఎరుంగును. కాని, అదే సమయంలో కర్మలు జరుగుచుండును. ఆతడు కర్మ యొక్క యథార్థతను ఎరుంగును. 'అఖిలం' అనగా ఆతడు సంపూర్ణముగా నెరుంగును. క్రియ యొక్క యథార్థత ఏమనగా, కర్త, కర్మ, క్రియా సాధనము, క్రియ యొక్క ప్రయోజనము, క్రియ యొక్క ఉద్గమస్థానము, క్రియకు సంబంధించిన సర్వము, క్రియ సంభవించే కేంద్రము అనునవి అన్నియూ బ్రహ్మమే. మనమీ విషయమును నాల్గవ అధ్యాయములో చూచియున్నాము. యజ్ఞములో హవిస్సును అర్పించే స్రుక్కు, హవిస్సు, హవిస్సు అర్పించబడే అగ్నిహోత్రము, మరియు హవిస్సును అర్పించే ఋత్విక్కు అనునవి అన్నియూ బ్రహ్మమే (4-24). ఇది కర్మ యాథార్థ్యము. దీనిని ఆతడు ఎరుంగును. ఆతని గ)నములో కర్మ బ్రహ్మ విరోధి కాదు. మరియు కర్మకు ఫలము బ్రహ్మ కాదు. ఈ సత్యము నెరి. ిన జ్ఞాని సర్వత్రా బ్రహ్మమును గనును.

జ్ఞానులు పూర్ణస్వరూపముగా సాక్షాత్కరించుకునే ఈ బ్రహ్మము ఎట్టిది?

అధ్యాయము 7, శ్లోకము 30:

साधिभूताधिदैवं मां साधियज्ञं च ये विदुः ।
प्रयाणकालेऽपि च मां ते विदुर्युक्तचेतसः ॥ ३० ॥

సాధి భూతాధి దైవం మాం సాధియజ్ఞం చ యే విదుః
ప్రయాణ కాలేऽపి చ మాం తే విదుర్యుక్త చేతసః (30).

మాం = నన్ను; సాధిభూతాధి దైవం = భౌతిక ప్రపంచము నందు, దేవతల యందు కేంద్రితమై ఉన్నవానినిగా; చ = మరియు; సాధియజ్ఞం = యజ్ఞము నందు కేంద్రితమై ఉన్నవానినిగా; యే = ఎవ్వరైతే; విదుః = ఎరుంగుదురో; తే చ = వారు; ప్రయాణ కాలేऽపి = మరణసమయము నందైననూ; యుక్త చేతసః = నా యందు లగ్నమైన మనస్సు గలవారై; మాం = నన్ను; విదుః = ఎరుంగుదురు.

నన్ను భౌతిక ప్రపంచమునందు, దేవతల యందు కేంద్రితమై ఉన్నవానినిగా, మరియు యజ్ఞము నందు కేంద్రితమై ఉన్నవానినిగా, ఎవ్వరైతే ఎరుంగుదురో, వారు మరణ సమయము నందైననూ నా యందు లగ్నమైన మనస్సు గలవారై నన్ను ఎరుంగుదురు (30).

సాధి భూతాధి దైవం మాం సాధి యజ్ఞం చ యే విదుః. ఈ వాక్యము, మరియు అధిభూతమ్, అధిదైవమ్, అధ్యాత్మమ్ అను ప్రయోగములు శాస్త్రములో తరుచు కనబడును. ఈ ప్రయోగముల అర్థము తెలియుట అత్యావశ్యకము. భగవానుడు వీటిని తరువాతి అధ్యాయములో వివరించగలడు.

పంచ భూతాత్మకమగు ప్రపంచముపై కేంద్రితమై యున్న సర్వము అధిభూతమనబడును. అదే విధముగా దేవతలపై కేంద్రితమైనది అధిదైవమనియు, వ్యక్తిపై కేంద్రితమైనది అధ్యాత్మమనియు అనబడును. పూర్వశ్లోకములో భగవానుడు అధ్యాత్మమును గురించి మాత్రమే మాటలాడినాడు. జ్ఞానులు బ్రహ్మమును అధ్యాత్మముగా, అనగా ప్రత్యగాత్మ కంటె అభిన్నముగా ఎరుంగుదురని ఆయన చెప్పినాడు. ఆయన ఈ శ్లోకములో మరల సర్వమును ఈశ్వరుని యందు లయము చేసి, ఈశ్వరునిగా మార్చివేయును.

ఈశ్వరుడు అభిన్న నిమిత్తోపాదాన కారణము అనే జ్ఞానము

జ్ఞానులు 'సాధి భూతాధి దైవతమ్' అగు ఈశ్వరుని ఎరుంగుదురు. స = సహ = కూడి అని అర్థము. మాం = నన్ను. అనగా సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు ఇత్యాది దేవతలందరి

రూపములో నున్న నన్ను. సూర్యాది గోళమును ఈశ్వరునిగా దర్శించే సందర్భములో ఈశ్వరుడు ఉపాదాన కారణముగా దర్శించబడును. ఇది ఈశ్వరుని అధిభూతముగా దర్శించుట. ఈశ్వరుడు సూర్యాదులకు నిమిత్త కారణము అని దర్శించే సందర్భములో ఈశ్వరుడు అధిదైవము అగును. ఇవి రెండు స్థాయిలు. నిమిత్త కారణ రూపములో ఈశ్వరుడు అధిదైవము. ఉపాదాన కారణరూపములో ఈశ్వరుడు అధిభూతము.

ఈశ్వరుడు జగద్రూపముగా మన ముందున్నాడు (అధిభూతమ్). ఈశ్వరుని కంటె భిన్నముగా ఏదీ లేదు. దేవతలందరి రూపములో ఉన్నది ఈశ్వరుడే (అధిదైవమ్). ఏ దేవతయూ ఈశ్వరుని కంటె భిన్నముగా లేదు. ఈ సత్యమును జ్ఞానులు గుర్తించెదరు.

వారు ఈశ్వరుని అధియజ్ఞ రూపములో కూడ దర్శించెదరు. వేద విహిత కర్మకు యజ్ఞమని పేరు. కర్మ, కర్మఫలము, మరియు ప్రార్థింపబడే దేవత అను సర్వము ఈశ్వరుడేనని వారు దర్శించెదరు. కర్మ యొక్క యథార్థ స్వరూపము భగవానుడే నని వారు గుర్తింతురు.

అధ్యాత్మమ్ అను విశేషణము పూర్వశ్లోకములో వివరింపబడినది. అధ్యాత్మము కూడా బ్రహ్మమే. ఇక మిగిలినది ఏది? జగత్తు భగవానుడే; దేవతలందరు భగవానుడే; అధ్యాత్మ మనబడే నీ స్థూల దేహము, మనస్సు, ఇంద్రియములు, మరియు ప్రత్యగాత్మ అను సర్వము బ్రహ్మమే. సర్వము భగవానుడు అని చెప్పే ప్రక్రియలలో ఇది ఒకటి. తద్భిన్నముగా ఏదీ లేదు.

నన్ను ఈ రూపములో దర్శించే జ్ఞానులు నా కంటె భిన్నము కాదు. జ్ఞాని ముందుగా భగవానుని పరోక్షునిగా గుర్తించును. తరువాత ఈ సర్వము భగవానుడని గుర్తించును. ఆ తరువాత, ఈ ధారణ అంతర్ముఖము చేయబడును. అనగా, దేహము, మనస్సు, ఇంద్రియములు అను సర్వము భగవానుడని గుర్తింపబడును. వీటన్నిటి వెనుక గల ప్రత్యగాత్మయే భగవానుని యథార్థ స్వరూపము.

మరణ కాలములో నైనమా జ్ఞానము కలిగినచో విముక్తి నిశ్చితము

ప్రయణ కాలే అపి మాం విదుః తే యుక్త చేతసః. అనగా నన్ను మరణకాలము నందైనమా గుర్తించి, ఆ సమయములో జ్ఞానమును పొందినవారు నన్ను ఎరుంగుదురు. లేదా, ఈ జ్ఞానమును ఈ జీవితములో పొందినవారు సున్నస్థమైన దర్శనము గల వారగుటచే మరణించే సమయములో కూడా దాని నుండి చ్యుతులు గారు. కావున, నన్ను వారు యెరుంగుదురు అని యర్థము. వారి

మనస్సులు మరణ సమయములో భగవానుని కేవలము స్మరించుట మాత్రమే గాక, భగవానుని యెరింగి భగవానునిలో ఐక్యమగును. వారికి పునరావృత్తి లేదు.

వారు బ్రహ్మరూపులు. సర్వము బ్రహ్మమే. సర్వత్రా బ్రహ్మమే. కాగా, పునరావృత్తి ఎవరికి? ఎక్కడ నుండి? నేను ఇంతకు ముందు లేని స్థానమునకు వెళ్లి తిరిగి రావచ్చును. నేను ఇక్కడనే ఉన్నాను గనుక, స్వర్గమునకు వెళ్లి తిరిగి రావచ్చును. కాని, స్వర్గము కూడ నేనే. స్వర్గములోని పదార్థము లన్నియూ నేనే. దేవతలందరు నేనే. అప్సరసలు అందరూ నేనే. దివ్య పురుషులందరూ నేనే. ఈ భూలోకము, సూర్య చంద్రులు, నక్షత్రములు నేనే. స్థూలదేహము, మనస్సు, ఇంద్రియములు నేనే. ఏలయన, బ్రహ్మము నేనే. ఇప్పుడు నీవు చెప్పుము. వెళ్లేది ఎవరు? ఎచ్చటికి?

తత్ త్వం అసి

వేదాంత సార సర్వస్వము తత్త్వమసి. త్వం అనగా జీవుడు, వ్యక్తి. తత్ అనగా ఈశ్వరుడు, భగవానుడు. ఈ రెండింటి మధ్య గల అభేదమును అసి పదము నిరూపించును. ఇట్టి సమీకరణము (equation) భవిష్యత్తులో సంపన్నము కాబోవు దానిని నిరూపించుట కాదు. ఈ సమీకరణము ఈ క్షణములో సంపన్నమై యున్న సత్యమును బోధించును. నీవు అది కాబోతున్నావు (తత్ త్వం భవిష్యసి) అని శాస్త్రము బోధించుట లేదు. నీవు అది అయి ఉన్నావు అని శాస్త్రము చెప్పుచున్నది. ఇది గమనించదగిన ప్రముఖ విషయము.

'అసి' అనగానే 'త్వం' పదము తనంత తానుగా ఉపస్థితమగును. కాని 'త్వం అసి (నీవు అయి ఉన్నావు)' అనగానే, ఒక అకాంక్ష ఉత్పన్నమగును. నేను ఏమి అయినాను? ఆ మాటను చెప్పిన వక్త మరికొంత సమాచారమును ఈయవలసి యున్నది. మరికొంత సమాచారము అకాంక్షింపబడును. 'త్వం అసి'చే ఉత్పన్నమైన అకాంక్షను 'తత్' పూరించును. తత్ అనునది సర్వనామము. శాస్త్రములో అంతకు ముందు చెప్పబడిన దానిని అది పరామర్శించును. తత్ పదార్థము ఉనికి గల సత్యవస్తువును మనముందు ఉంచును. మనము ఈశ్వరుడని పిలిచే జగత్కారణ మదియే.

తత్ పదము ఈశ్వరుని నిర్దేశించును. గనుక, ఈ సమీకరణము తెలియాలంటే, త్వం పదమును సరిగా తెలుసుకోవాలి. ఒక సమీకరణములో రెండింటి అభేదము ప్రతిపాదింపబడును. సమీకరణములో కానవచ్చే రెండు తత్త్వములు భిన్నములా యున్నట్లు భాసించుటచే సమీకరణము

ఆవశ్యకమైనది. ఆ రెండింటికీ భేదము యథార్థమైనచో, సమీకరణమే లేదు. అవి రెండు ఒకటియే అయి ఉండి, భేదము కల్పితమైనప్పుడు మాత్రమే సమీకరణము సంభవమగును.

మనము ఒక కుర్చీతో 'నీవు కట్టెతో చేసిన వస్తువు లన్నిటికీ ఉపాదానమగు కట్టెవు' అని చెప్పినామనుకొనుడు. కుర్చీ ఆ సత్యమును తెలుసుకోవాలి. 'నేను కుర్చీని' అనే ధారణ నుండి అది బయటపడవలసి యుండును గదా! తాను కుర్చీ ఆకారములో నున్న కట్టెననియు, తాను బల్ల ఆకారములో కూడ ఉండుట సంభవమేననియూ అది గుర్తించవలెను. కుర్చీ అట్లు గుర్తించుట కొరకై ఈ అభేదము సమీకరణ రూపములో ప్రతిపాదింపబడును. ప్రతిష్ఠితమైన ఒక సత్యము ఉన్నప్పుడు మాత్రమే సమీకరణము సంభవమగును.

ప్రకృతంలో పరిస్థితి అదే. జీవుడు ఈశ్వరుడై ఉన్నాడు. ఈ సత్యము నెరుంగుటకు త్వం పదమును తెలియాలి. ఈశ్వరుని గురించి తెలియాలి. ఇందువలననే సమీకరణము ఆవశ్యకమైనది. తత్పద స్వరూపమును, త్వం పద స్వరూపమును తెలియగానే సమీకరణము ఆవిష్కృతమగును. 'అదియే నేను' అనే సాక్షాత్కారము కలుగుటయే ఈ విచారమునకు ఫలము.

త్వం పద విచారము – మొదటి ఆరు అధ్యాయముల సారము

గీతలోని మొదటి ఆరు అధ్యాయములలో ఆత్మ (జీవుడు) ప్రముఖమగు చర్చా విషయము. అర్జునునకు భ్రాంతి కలిగెను. భ్రాంతికి అధీనుడై ఉన్నవాడే జీవుడు. త్వం పదమునకు అర్థమిదియే. గీతలోని ఈ భాగము త్వం పద విచారమును ప్రస్తుతించినది.

మొదటి అధ్యాయము

మొదటి అధ్యాయములో అర్జునుని మోహము ప్రతిపాదించబడినది. దీనిని బట్టి జీవుడు మోహవశుడని స్పష్టమగుచున్నది. అర్జునుడు సామాన్యజీవుడు కాడు. అతడు ఇంద్రుని అనుగ్రహముచే జన్మించిన రాచబిడ్డ. అతడు గొప్ప పరాక్రమము, సచ్ఛీలము గల వీరుడు. అతడు విజృంభించిన రోజున అజేయుడే. భీష్ముడు అర్జునుని పరాక్రమమును కనులారా గనుటకు వేచియుండెను. అర్జునుడు యుద్ధమును చేయుచుండగా గాంచవలెనని అతని ఆచార్యుడగు ద్రోణుడు ఉత్కంఠభరితుడై యుండెను. అర్జునుడు సంగీత నాట్యములలో కూడా కుశలుడు. అంతటి అర్జునుడు నిరాశోపహతుడాయెను. దాని యర్థమేమి? జీవుడు (వ్యక్తి) ఎంతటి

మహానుభావుడైనా శోకమునకు వశుడై యుండును. మొట్ట మొదటి అధ్యాయము ఈ సత్యమును ప్రస్తుతించినది.

రెండవ అధ్యాయము

ఆ తరువాత అర్జునుడు తన జీవిత లక్ష్యమును నిశ్చయించుకునే (పురుషార్థ నిశ్చయమ్) ప్రయత్నమును చేయును. తానున్న పరిస్థితిలో విజయమునకు అవకాశము లేదని అతడు గమనించెను. ఇట్టి పరిస్థితిలో మాత్రమే మానవుడు తాను యథార్థముగా కోరుచున్నది ఏది అను సత్యమును ఆవిష్కరించుకొనగల్గును. యుద్ధములో జయిస్తే, ప్రియబాంధవులు మరణిస్తారు. యుద్ధములో ఓడిపోతే, అంతా నష్టమగును. ఇట్టి అవాంఛనీయమగు పరిస్థితిలో నున్న అర్జునునకు శోకమనే సమస్యకు, మరల తల ఎత్తని విధముగా శాశ్వత పరిష్కారమును కనుగొనవలెననే కోరిక కలిగినది. అర్జునుడు పరిష్కరింప బూనుకున్న సమస్య సర్వ మానవుల సమస్య. అతడు తన తాత్కాలిక సమస్యను మాత్రమే గాక, సర్వ మానవ హృదయములను వేధించే మౌలిక సమస్యపై తన ధ్యానమును నిలిపెను. తానున్న పరిస్థితిలో ఈ సమస్యను పరిష్కరించుటకై అతనికి ఆసరా కావాలి. శ్రీకృష్ణుని కంటె గొప్ప ఆసరా సంభవము కాదు గదా! ఇట్టి మౌలిక సమస్యలను మానవుడు తనంత తానుగా పరిష్కరింపజాలడు. తోడు అవసరమగును. ఈ విషయ వస్తువు అతి గహనమైనది. కాన దీనికి ఎవరో ఒకరు తోడుగా నుండిన చాలదు. ఆచార్యుడు కావాలి. అర్జునుడు శ్రీకృష్ణుని యందు ఆచార్యుని దర్శించెను.

ఈ మానవ సమస్య యొక్క ఆవిష్కారమే త్వం పదార్థము (నీవు అనే పదము యొక్క అర్థము) నకు విషయవస్తువు అగును. జీవుడు (త్వం) ఆచార్యుని కనుగొని, ఈ జ్ఞానము కొరకు ప్రార్థించి, పరిష్కారమును కనుగొనే ప్రయత్నమును చేయవలెను (శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్, 2-7). శ్రీకృష్ణుడు అర్జునుని శిష్యునిగా స్వీకరించి, ఉపదేశించెను. ఆయన ఈ అవకాశము కొరకు ఎదురు చూస్తున్నాడా యన్నట్లు ఉపదేశించెను. అశోచ్యా నన్వశోచస్త్వమ్ (శోకమునకు అర్హము కాని వారిని గురించి శోకిస్తున్నావు, 2-11) అని మొదలిడి ఉపదేశించెను. ఆయన ఆత్మ స్వరూపమును బోధించి, ఆత్మకు మరణము లేనే లేదని నిరూపించెను. ఆత్మను గురించిన నీ నిర్ణయములు యథార్థములు కావు. ఆత్మకు చావు పుట్టుకలు లేవు. ఆత్మ లేని కాలము లేనే లేదు. ఆత్మ లేని కాలము ఉండబోదు. ఆత్మ అజము, శాశ్వతము ఇత్యాది (న జాయతే మ్రియతే వా కదాచి న్నాయం భూత్వా భవితా వా న భూయః, అజో నిత్యః -- 2-20) ఉపదేశించెను. ఆయన

రెండవ అధ్యాయము లోననే ఆత్మను గురించి పూర్ణముగా ఉపదేశించెను. ఇది త్వం పదము. తరువాత ఆయన తత్పదమును చేపట్టెను. ఇది సమగ్రమగు బోధనా ప్రక్రియ. ద్వితీయాధ్యాయములో అక్కడక్కడ తత్పదార్థ ప్రస్తావన వచ్చిననూ, త్వం పదార్థమే ప్రముఖ వర్ణ్యాంశము. మరియు, అర్జునుడు యుద్ధమును చేయుటకు శ్రీకృష్ణుడు అనేక హేతువులను ప్రతిపాదించెను. సముచితమగు మానసిక భావనతో చేసిన కర్మ జ్ఞాన విరోధి కాదనియు శ్రీకృష్ణుడు నిరూపించెను.

మూడవ అధ్యాయము

మూడవ అధ్యాయములో అర్జునుడు ఆత్మ జ్ఞానసాధనను కొనసాగించ వలెనా, అక్కర లేదా అను విషయమును తెలియగోరెను. ద్వితీయాధ్యాయాంతములో అర్జునుని ప్రశ్నకు బదులిడుచున్న వాడై, శ్రీకృష్ణ భగవానుడు జ్ఞానిని వర్ణించెను. తాను ఉన్న స్థితిలో ఉన్నట్లుగా, కూడికలు తీసివేతలు లేకుండగా, ఆనందించగల్గు వాడే జ్ఞాని. తాను ఈ జ్ఞాన సాధనను చేయాలని అప్పుడు అర్జునుడు తలపోసెను. ఈ సాధన కొరకు మాత్రమే ప్రత్యేకముగా ఉద్దేశింపబడిన సన్న్యాసమనే జీవనశైలి ఒకటి కలదు గాన, అర్జునుడు దానిని స్వీకరించగోరెను. కాని శ్రీకృష్ణుడాతనిని యుద్ధమును చేయుమని ప్రోత్సహించుచుండెను. అందువలననే 'కర్మ జీవనము శ్రేయస్కరమా? లేక ఆత్మ జ్ఞానమునకు అంకితమైన సన్న్యాస జీవనము శ్రేయస్కరమా?' అని అతడు శ్రీకృష్ణ భగవానుని ప్రశ్నించెను. నీవు ఈ రెండింటినీ కూడ స్తుతించినట్లు నాకు తోచినది. కావున, వాటిని విడివిడిగా మరల నాకు ఉపదేశింపుము. వాటిలో ఒకటి కర్మణ్యత కాగా, మరియొకటి నిష్కర్మణ్యత గావున, వాటి ఫలములు భిన్నములై యుండును. కర్మ నుండి ఫలము పుట్టును. ఆ ఫలము నన్ను నిశ్చితముగా బంధించును. అనగా నేను సంసారములోనే కొనసాగెదను. కాని, సన్న్యాసము నన్ను సంసారము నుండి విముక్తుని చేయునని ఆశించవచ్చును. కాన, ఈ రెండు ఒక్కటియే ఎట్లగును? మోక్షసాధనమేది? కర్మయోగ జీవనమా? లేక సన్న్యాస జీవనమా? అర్జునుడీ విషయమును సుస్పష్టముగా తెలియగోరెను. ఈ కర్మయోగ, సన్న్యాస జీవనములు ఎవరికి ఉద్దేశింపబడినవి? ఈశ్వరునకా? లేక, త్వం పదార్థమగు జీవునకా?.

మూడవ అధ్యాయములో ఈశ్వరుని గురించి చాల విచారము గలదు. కాని, అది అంతయూ కర్మయోగ ప్రకరణములో జీవుని కొరకు ఉద్దేశించినది మాత్రమే. జీవుడు ప్రముఖ విషయ వస్తువు. తరువాత, నాల్గవ అధ్యాయములో భగవానుడు మరల జ్ఞానము గురించి

ప్రస్తావించెను. బంధించునది కర్మ కాదనియు, సరియగు మానసిక ప్రవృత్తి, మరియు జ్ఞానము లేకపోవుటయే జీవుని బంధించుననియు నిర్దేశించి, ఆ తరువాత ఆయన ముఖ్య సన్న్యాసమును గూర్చి వివరించెను.

నాల్గవ అధ్యాయము

ఆశ్రమ రూప సన్న్యాసము ముఖ్య సన్న్యాసము కంటె భిన్నమైనది. శ్రీకృష్ణ భగవానుడు నాల్గవ అధ్యాయములో సర్వకర్మ సన్న్యాసమును ప్రతిపాదించినాడు. ఇది జ్ఞానము ద్వారా మాత్రమే సంభవమగును. ఇది ఎవరి కొరకు! జీవుని కొరకు. నేను సర్వదా కర్మల నన్నింటినీ చేస్తూనే ఉన్నా, నేను ఏ కర్మనూ చేయుట లేదు (చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణ కర్మ విభాగశః, తస్య కర్తార మపి మాం విద్ధ్య కర్తారమవ్యయమ్, 4-13) అని భగవానుడు చెప్పెను. 'నేను కర్తను, మరియు కర్మ నుండి విముక్తుడను'. భగవానుడు కర్మణ్యత గలవాడే అయినా, జ్ఞాన ప్రభావముచే ఆయన కర్మలచే బంధింపబడడు. కావున, జ్ఞానము అవశ్యకము. ఎవరికి? ఈశ్వరునకు గాదు. జీవునకు.

విస్తృతమగు కర్మణ్యతలో ఆత్మ స్వరూపమగు నైష్కర్మ్యమును, అకర్మలో కర్మను ఎవడు దర్శించునో, వాడే చూచువాడు (కర్మణ్య కర్మ యః పశ్యేద కర్మణి చ కర్మయః, స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్న కర్మ కృత్, 4-18). జీవుడు తాను కర్తనని భావిస్తూ కర్మలను చేయును. కర్మను చేయ నిరాకరించిన సందర్భములో కూడా తాను కర్తననియే భావించును. కర్మ లన్నింటికి మూలములో ఈ కర్తృత్వము గలదు. కావున, వివిధ కర్మల మధ్యలో నుండి కర్తృత్వాభావమును దర్శించగల వ్యక్తియే యథార్థమగు సన్న్యాసి.

ఐదవ అధ్యాయము

జ్ఞానము ద్వారా కర్మలను వీడుట (జ్ఞానకర్మ సన్న్యాసము)ను గురించి మాటలాడిన తరువాత, శ్రీకృష్ణుడు మరల సన్న్యాసమును వివరించెను. ద్వేషము గాని, కామన గాని లేనివాడు నిత్య సన్న్యాసి యనబడును (జ్ఞేయస్స నిత్య సన్న్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి, 5-3). జ్ఞాన, కర్మయోగములను సమముగా ఎవడు దర్శించునో, వాడే చూచుచున్నాడు (ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి, 5-5). కర్మయోగము లేనిదే సన్న్యాసమును పొందుట చాల కష్టము. కాని వివేకశక్తి కలిగి, కర్మయోగ జీవనమునకు అంకితమైన వ్యక్తి బ్రహ్మమును శీఘ్రముగా

పొందును (సన్న్యాసస్తు మహాబాహో దుఃఖమాప్తు మయోగతః, యోగ యుక్తో ము నిర్బ్రహ్మ న చిరేణాధి గచ్ఛతి, 5-6). ఈ వాక్యముల ద్వారా భగవానుడు ఐదవ అధ్యాయమలో జ్ఞాన స్వరూపమును నిరూపించినాడు. ఈ జ్ఞానమును పొందిన వ్యక్తి, (ముఖ్య) సన్న్యాసి యగును. ఈ జ్ఞానమును పొందుటకై వ్యక్తి సన్న్యాసాశ్రమమును స్వీకరించును. జ్ఞాన స్వరూపము మరల సన్న్యాస శబ్దముచే నిర్దేశింపబడెను. కావున ఈ అధ్యాయము సన్న్యాస యోగమని పిలువబడినది. ఈ జ్ఞానము ఎవరి కొరకు? మరల జీవుని కొరుకు మాత్రమే. ఈ అధ్యాయములో నిరూపింపబడిన ఆత్మ స్వరూపము (త్వం పదార్థము) జీవుని కొరకు మాత్రమే ఉద్దేశింపబడినది. ఎవరి బుద్ధి బ్రహ్మమునందు జాగృతమై యుండునో, ఎవరికి ఆత్మ బ్రహ్మాభిన్నమో, ఎవరు బ్రహ్మము నకు మాత్రమే అంకితమగుదురో, ఎవరి చరమ లక్ష్యము బ్రహ్మమో, ఎవరి మాలిన్యములు జ్ఞానముచే నశింపజేయబడినవో, వారు పునరావృత్తి లేని మోక్షమును పొందెదరు (తద్బుద్ధయ స్తదాత్మా న స్తన్నిష్ఠాస్తత్పరాయణాః, గచ్ఛంత్య పునరావృత్తిం జ్ఞాన నిర్ధూత కల్మషాః, 5-17). ఇవి అన్నియూ ప్రత్యగాత్మ స్వరూపములోనివే.

హరిః ఓం తత్సత్

भगव

यदा यदा हि धर्मस्य [redacted] भारत ।
अभ्युत्थानमधर्मस्य तदाऽऽत[redacted]जाम्यहम



वद्गीता

